ఓం　రామవరపు కృష్ణమూర్తి శాస్త్రి
గ్రంథకర్త

కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహిత

వేదార్థదీపికాసహితము

ప్రథమ కాండము

ప్రథమ సంపుటము

వ్యాఖ్యాన కర్తలు:

శిరోమణి, భాషాప్రవీణ,

తర్కవ్యాకరణ పూర్వోత్తర మీమాంసావిశారద

శ్రీ రామవరపు కృష్ణమూర్తి శాస్త్రి

కళాప్రపూర్ణ

డా॥ శ్రీ దివాకర్ల వేంకటావధాని, M.A., Ph.D.,

ప్రచురణ:

శ్రీ ఎన్. లక్ష్మీనారాయణ, I. A. S.,

కార్యనిర్వహణాధికారి,

తి. తి. దేవస్థానములు,

తిరుపతి.

1985

Kṛṣṇa Yajurvedīya Taittirīya Saṁhita
With Telugu Commentary Vedārthadīpika

Edited, Translated and Commented by
Siromani Ramavarapu Krishnamurti Sastry

T.T.D. Religious Publications Series No. 287

First Edition: 1985

Copies:

Price: Rs.

Published by
Sri S. LAKSHMINARAYANA, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

Printed at:
Tirumala Tirupati Devasthanams Press, Tirupati.

ముందు మాట

పరమకారుణికుడైన పరమేశ్వరుడు లోకహితైషియై త్రివర్గాలైన ధర్మార్థకామాలనూ సర్వోత్తమమైన మోక్షాన్నీ ప్రతిపాదించే ఋగ్యజుస్సామాథర్వ వేదాలను నాల్గింటినీ బ్రహ్మ కుపదేశించాడు. "యస్య నిశ్వసితం వేదాః యో వేదేభ్యోఽఖిలం జగత్ నిర్మమే" – వేదాలు పరబ్రహ్మనిశ్వాసాలనీ, ఆ వేదాలను ఆధారం చేసుకొని సర్వప్రపంచాన్నీ సృష్టించాడనీ విద్యారణ్యులు వ్యాఖ్యానించారు. ఈ వేదాలను మహర్షులు తమ జ్ఞానదృష్టితో బ్రహ్మనుంచి గ్రహించి అవ్యాజమైన కృపతో మనకు అనుగ్రహించారు. కనుకనే మహర్షులు మంత్రద్రష్టలనీ, వేదాలు శ్రుతులనీ ప్రసిద్ధి ఏర్పడింది. వేదాలు అపౌరుషేయాలు, అనాదులు కనుకనే నిత్యాలు.

వేదాల కాలమిది అని నేటి చరిత్రగ్రంథాలలో వ్రాయబడుతున్నంతమాత్రాన ఆధునిక పరిశోధకులు వేదకాలాన్ని కనుగొన్నారనీ, అనాదివాదం నిలువజాలదనీ, ఎవ్వరూ భావించనక్కరలేదేమో. లోకమాన్య తిలక్ ఏడువేల సంవత్సరాల క్రితం ఋగ్వేదం రచించబడిందని చెబుతూనే అనాదివాదానికి అవకాశమిచ్చారు.

ఏది ఏమైనా వేదాలు ఇప్పటి మానవ సూత్రపరిమితులకు లోబడేటంతటి అర్వాచీనాలు కావని మాత్రం నిర్భయంగా చెప్పవచ్చు. ప్రపంచంలోని గ్రంథాలన్నిటిలోకి వేదమే ప్రాచీనతమ మని పాశ్చాత్యులు కూడ ఏకాభిప్రాయం వ్యక్తపరచారు. మానవ పుస్తక భాండాగారంలో ఋగ్వేదమే మొదటి గ్రంథమని మాక్సుముల్లరు మహాశయుని వాక్కు. వేదాల మహిమ వేదాలలోనే అనేక చోట్ల చెప్పబడింది. వేదవిదునిలో సమస్తదేవతలు నివసిస్తారని శ్రుతి చెబుతున్నది.

భారతదేశంలో వెలువడ్డ సాంప్రదాయిక విజ్ఞానమంతా వేదాలనుంచే వచ్చిందనడంలో అతిశయోక్తి లేదు. మన్వాది ధర్మశాస్త్రాలు వేదంలోని ధర్మాలను వివరించడానికే అవతరించాయి. కనుకనే అవి వేదమూలకంగానే తమకు ప్రామాణ్యం చెప్పుకున్నాయి. రామాయణం ఆదరణీయం కావడానికి కారణం అది వేదోక్తాలైన "సత్యం వద, ధర్మం చర, మాతృదేవో భవ, పితృదేవో భవ" లాంటి ధర్మాలను నూటికి నూరుపాళ్లూ స్వీయాచరణంలో చూపిన దివ్యపురుషుని వర్ణించడం వల్లనే అని చెప్పాలి. శ్రీమహావిష్ణువు రామరూపంగా అవతరించిన విధంగానే వేదం రామాయణరూపం ధరించింది. ఈ రెండూ కూడ మానవోద్ధరణానికే ఒకేసారి వచ్చాయి. "వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే। వేదః ప్రాచేతసా దాసీత్సాక్షాద్రామాయణాత్మనా."

వేదాలను రక్షించుకోవలసిన ఆవశ్యకతను నొక్కి వక్కాణించ నవసరం లేదు. అర్థం తెలియకుండ వేదాధ్యయనం చేసినవారిని కూడా వేదరక్షకులుగ మన్వాదులు అంగీకరించారు. పఠనమాత్రం చేతనే పాపాన్ని ఖండించ గల శక్తి వేదానికి వున్నది. ఋగ్వేదం మానసిక పాపాలను, యజుర్వేదం కాయిక పాపాలను, సామవేదం వాచికపాపాలను పఠనం వల్లనే పోగొట్టగలవని శాస్త్రకారులు చెప్పారు. వేదాధ్యయనం మాత్రం చేసిన వానికంటె వేదార్థవిదుడు శ్రేష్ఠుడనీ, వానికంటె వేద ధర్మానుష్ఠాత శ్రేష్ఠుడనీ మనుస్మృతి చాటుతున్నది. అలాంటి జాతీయ మహాసంపద రక్షణకే తిరుమల తిరుపతి దేవస్థానం ఒక ప్రక్క ఆంధ్రదేశంలోని వివిధ ప్రాంతాలకూ చెందిన వేదపండితులకు పారితోషికాలు ఇచ్చి వారిచేత నిత్యం వేదపారాయణం చేయించడమే కాకుండా వేదపాఠశాలలు నెలకొల్పి వేదాన్ని అధ్యయనాధ్యాపనాల మూలంగా కూడా యథాశక్తి కాపాడుతూ వస్తున్నది.

సంస్కృతంలో వున్న వేదభాష్యాలను అధ్యయనం చేసి వేదార్థాన్ని అవగతం చేసుకోవడం అందరికీ సాధ్యమయ్యే విషయం కాదు. ఇక ఆంగ్లంలో మాక్సుముల్లరు మొదలైనవారు రచించిన గ్రంథాలు అర్థం కావడం ఆంగ్లంలో పట్టభద్రులైన వారికి మాత్రమే సాధ్యం. ఆంగ్ల గ్రంథాలద్వారా అయినా సాంప్రదాయికమైన పద్ధతిలో తెలుసుకోవడం సాధ్యం కాదు. ఈ పరిస్థితిని గమనించి వేదార్థాలను తెలుగులోకి తీసుకురావడానికి, బళ్ళారి ప్రాంతంలోని కొందరు విద్వాంసులు "వేదార్థ ప్రకాశిక" అనే పేరుతో ఋగ్వేదంలో కొంతభాగానికి అర్థ తాత్పర్యాలు మాత్రం వ్రాసి ప్రచురించారు. అయితే తరువాత ఆ పని ఆగిపోయింది. అనంతరం 1940 వ సంవత్సరంలో గుంటూరు మండలంలోని వినయాశ్రమంవారు "ఆంధ్ర వేదములు" అనే పేరుతో ఋగ్యజుస్సామవేదాలను సంగ్రహంగా అనువాదం చేయించారు. అదీ కొనసాగలేదు.

ఈ పరిస్థితిలో తిరుమల తిరుపతి దేవస్థానంవారు, కీ॥ శే॥ నేమాని వేంకట నరసింహశాస్త్రిగారు తెలుగులో పద్య రూపంలో అనువదించిన 'ఋగ్వేదమును' సమూలంగా ప్రచురించి ఆంధ్రులకు అందజేస్తున్నారు. ఇక వేద విభాగంలో ద్వితీయ స్థానంలో ఉన్న యజుర్వేదాన్ని తెలుగులో వెలుగులోకి తీసుకరావాలనే సంకల్పంతో దేవస్థానం ఇపుడు ప్రముఖ విద్వాంసులు శిరోమణి శ్రీ రామవరపు కృష్ణమూర్తిశాస్త్రిగారు, కళాప్రపూర్ణ డాక్టరు దివాకర్ల వెంకటావధానిగార్ల సమష్టి బాధ్యతతో తెలుగులో ప్రతిపదార్థ తాత్పర్య మంత్ర వినియోగ విశేషాంశాలతో విపులంగా వ్రాస్తున్న వేదార్థదీపికా వ్యాఖ్యానంతో కూడా యజుర్వేదాన్ని స్వరసహితంగ వెలువరిస్తున్నది. ఈ ప్రయత్నంలో ఇది ప్రథమ కాండాత్మకమైన మొదటి సంపుటం మాత్రమే. మొత్తం 7, 8 సంపుటాలుగ అనతికాలంలో ఆంధ్ర పాఠక మహాశయులకు అందజేయడానికి అవిరళ కృషి చేస్తున్నాము.

వేదవాఙ్మయం ఒక అగాధ క్షీరసాగరం. నిర్విరామ మథనంతో అనర్ఘ రత్నాలను వెలికిదీసి అందించవలసిన పవిత్ర కర్తవ్యం అందరిమీదా వున్నది. ఈ విషయంలో ప్రతి ఒక్కరి సహకారం లభించగలదన్న ఆకాంక్షతో దేవస్థానం ముందుకు సాగుతున్నది. ఆదరణ మీది. అనుగ్రహం శ్రీనివాసునిది.

ఎస్. లక్ష్మీనారాయణ
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి,
ఆగష్టు 8, 1985.

ఆముఖము

భారతదేశము ఆర్షధర్మమున కాలవాలమైనది. ఆ యార్షధర్మమునకు మూలము వేదము. 'వేద్యన్తే ఈశ్వరేణ జ్ఞాప్యన్తే ధర్మార్థకామమోక్షాః ఇతి వేదః.' ధర్మార్థకామమోక్షము లనెడి పురుషార్థములు ఈశ్వరునిచే తెలియచేయబడుచున్నవి, అని వేద శబ్దార్థము. ఈ వ్యుత్పత్తిని బట్టి వేద మపౌరుషేయ మని స్పష్టమగుచున్నది. ఇష్టప్రాప్తికి అనిష్ట పరిహారమునకు అలౌకికమైన ఉపాయమును తెలియచేయు గ్రంథము వేదము. వేదయతీతి వేదః. అనగా అప్రత్యక్షములు అనూహ్యములు, కాలాంతర – దేశాంతర – లోకాంతరములకు సంబంధించినవియు, లోకులు గ్రహింపవలసినవియు నైన విషయ విశేషములను యథాతథముగ వెల్లడింపగల ఆప్తుని వాక్యము వేదము. ఆ యాప్తుడు భగవంతుడు. వివిధ ప్రపంచమును సృష్టించి పాలించునట్టి ఆ భగవంతుడు లోకులకు కర్తవ్యాకర్తవ్యముల నుపదేశింపవలసినవా డగుటచేతను, దుర్జ్ఞేయములైన తన స్వరూప స్వభావాదులను లోకులకు తానే వెల్లడింపవలసినవా డగుటచేతను, సర్వార్థ ప్రకాశకమైన వేదమును లోకమున కనుగ్రహించియుండెను. మొదట బ్రహ్మ కనుగ్రహింపబడినది. బ్రహ్మనుండి మహర్షులకు, వారినుండి ఇతరులకు అధ్యయనాధ్యాపన క్రమమున గురుశిష్య పారంపర్యముగా లోకవ్యాప్తిని పొందినది. కనుకనే వేదమునకు 'ఆమ్నాయము' అను పేరు సార్థక మగుచున్నది. 'ఆమ్నాయతే పారంపర్యేణేతి ఆమ్నాయః.' 'ఆఙ్' పూర్వక ''మ్నా–అభ్యాసే'' అను ధాతువు నుండి ఆమ్నాయ పదము పుట్టినది. పారంపర్యముచేత అభ్యసింపబడునది.

జ్ఞాననిధులు, తపస్సంపన్నులు, వేదోక్తాచరణ పరినిష్ఠితులు అగు మహర్షులు దురవగాహమైన వేదార్థమును, వేద స్వరూపమును ప్రతిపాదించునట్టి పురాణ – న్యాయ – మీమాంసా – ధర్మశాస్త్రములను, శిక్షా – వ్యాకరణాది షడంగములను రచించినారు. ఇహ పరలోకములకు సంబంధించిన వ్యవహార మంతయు వేదాధారముననే నడచుచున్నది. ధర్మాధర్మములు, న్యాయాన్యాయములు, పుణ్యపాపములు, మంచిచెడ్డలు అని లోకములో వాడుకొను మాట లన్నియు వేదనిర్ణయమునకు సంబంధించినవియే. వేదోక్త తపశ్చర్యవలననే మార్కండేయాది మహర్షులకు అనేక కల్ప జీవిత్వము, అణిమాదిసిద్ధులు, దివ్య దృష్టి, శాపానుగ్రహ సామర్థ్యము మున్నగు నసాధారణ దివ్యశక్తులు ప్రాప్తించినవి.

'గావః పశ్యన్తి గన్ధేన వేదైః పశ్యన్తి పణ్డితాః।
చారైః పశ్యన్తి రాజానః చక్షుర్భ్యా మితరే జనాః'॥

గోవులు ఘ్రాణేంద్రియమును బట్టియు, రాజులు చారులను బట్టియు, విషయములను గ్రహించునట్లు, పండితులు వేదములను బట్టి విషయములను గ్రహింతు రనియు, ఇతరులు కన్నులచేతనే గ్రహించుచుందు రనియు చెప్పబడినది. కనుకనే ''పితృ దేవ మనుష్యాణాం వేద శ్చక్షు స్సనాతనమ్'' మనుష్యులకు గాని, దేవతలకు గాని సనాతనమైన చక్షుస్సు వేదమే యని మనువు బోధించియున్నాడు. ''శ్రుతిస్మృతీ మమైవాజ్ఞే'' శ్రుతిస్మృతులు నా యాజ్ఞ లని కృష్ణభగవానుడు చెప్పియున్నాడు. 'ప్రత్యక్షేణానుమిత్యా వా యస్తూపాయో న బుధ్యతే। ఏనం విదన్తి వేదేన తస్మా ద్వేదస్య వేదతా'– ప్రత్యక్ష ప్రమాణముచే గాని, అనుమాన ప్రమాణముచే గాని తెలియబడని అలౌకికోపాయమును తెలియచేయునది వేదము కనుక, వేదమునకు వేదశబ్ద వాచ్యత్వము సిద్ధించిన దని స్మృతి చెప్పుచున్నది.

వేదము – అపౌరుషేయము

వేదస్వరూప పరిశీలనము చేసినయెడల 'వేదము పౌరుషేయము' అను భ్రాంతి తొలగిపోవును. వేదమంతయు నక్కర లేదు. మొదటి మంత్రములను పరీక్షించినను అది పౌరుషేయము కాదని స్పష్టమగును. లోకప్రసిద్ధములయిన విషయములలో మనుష్యులు లోకానుగతములైన పదములతో వాక్యములతో కావ్యములను రచించుచున్నారు. లోకములో అశ్రుతప్రాయములు, నియతస్వరములు అగు పదములతో 64 ప్రపాఠకముల ఋగ్వేదమును ఏ మానవుడు రచింపగలడు? ఋగ్వేదమునందలి ''అగ్ని మీళే పురోహితమ్'' అనునది మొదటి ఋక్కు. ఇది మనుష్యవాక్యమే అయిన యెడల అట్టి దానిని లోకములో ఎక్కడ చూచి ఏ అభిప్రాయముతో, ఏ ప్రయోజనము నపేక్షించి రచించెను? అగ్నికి పురోహితత్వము ఎక్కడ దృష్ట మైనది? 'ఈళే' అను శబ్దము స్తుతిపరముగా ఎక్కడ దృష్టమైనది? అగ్నికి యజ్ఞ దేవత్వము ఎక్కడ దృష్టమైనది? అగ్ని దేవతల నాహ్వానించువాడు (హోతారమ్) అని ఎట్లు తెలిసినది? అజ్ఞాత గుణములతో అగ్నిని స్తుతించుట యెట్లు? దీని నంతటిని స్వతంత్రమైన వేద మొక్కటే చెప్పగలుగును.

యజుర్వేదమునకు మొదటిదైన ''ఇషే త్వోర్జే త్వా'' అను మంత్రమును పరిశీలించుదము. ఇది మనుష్యకృత మెట్లగును? ఇందు ''ఇషే త్వా'' అను దానిని 'శాఖా మాచ్ఛినత్తి' అని శాఖా చ్ఛేదనమునందు వినియోగింపవలయును, అని చెప్పు బ్రాహ్మణ వాక్యమును ఊహించిన వాడెవడు? ఆ విధముగనే ఆ పై మంత్రములకును ఆ యా కర్మవిశేషము లందు వినియోగమును చెప్పునట్టి ఆ యా బ్రాహ్మణ వాక్యములను రచించి విధించిన బుద్ధిమంతు డెవడు?

సామవేదమునకు మొదటిదైన "అగ్న ఆయాహి వీతయే" అను ఋక్కులోని 'అగ్నే' అను సార్థక పదములోని అకారమునకు బదులు ప్లుతమైన ఓకారము నుంచి 'ఓగాఈ' అని లోకములో ఎక్కడను చూడనట్టి ప్రయోగమును ఎవ్వడు చేయగలుగును? కనుక వేదస్వరూపమును బట్టియే వేదము స్వతంత్రమని స్పష్టమగుచున్నది. ఇట్లు వేదములోని పదముల యొక్క, వాక్యములయొక్క, పదార్థములయొక్క స్వరూపమును పరిశీలించినవారికి వేదాపౌరుషేయత్వము సత్యమని విదిత మగును.

వేదాపౌరుషేయత్వము పరాశరమాధవీయములో అసందిగ్ధముగ ప్రతిపాదింపబడినది. "న కశ్చి ద్వేదకర్తా చ..." (పరాశరమాధవీయము.)

వ్యా-స్మృతి నిర్దేత్ర్యాణామపి వేదకర్తృత్వ మాశంక్య నిరాచష్టే- న కశ్చిదితి।

న తావ ద్వ్యాసో వేదకర్తా, తస్య విభాగమాత్ర కారిత్వాత్, నాపి చతుర్ముఖః, ఈశ్వరేణ చతుర్ముఖాయ వేద ప్రదానాత్, నాపి జగదీశ్వరః, తస్య వేదాభివ్యంజకత్వాత్। స్మృతికర్త లున్నారు కాని, వేదకర్త యెవ్వడును లేడు. వ్యాసమహర్షి వేదవిభాగమును మాత్రమే చేసెను కనుక అతడు వేదకర్త కాడు. ఈశ్వరునిచేత చతుర్ముఖునకు వేద మను గ్రహింపబడినది కనుక ఆ చతుర్ముఖుడును వేదకర్త కాడు. జగదీశ్వరుడు వేదము నభివ్యక్తము చేసినవాడు కనుక ఆ జగ దీశ్వరుడును వేదకర్త కాడు.

'సర్వజ్ఞుడయిన పరమేశ్వరుడు కల్పాదియందు వేదమున కభివ్యంజకుడే కాని, కర్త కాడు. నిస్సంశయము. ఆ పరమేశ్వరుడు బ్రహ్మను సృష్టించి తనయందు సుస్థితములై యున్న వేదములను బ్రహ్మ కనుగ్రహించెను. బ్రహ్మచే ప్రార్థించ బడిన శ్రీహరి వ్యాసావతారము ధరించి లోకహితమునకై వేదవిభాగము చేసెను. అని మత్స్యపురాణములో చెప్పబడినది.

ఋషులు మంత్రకృత్తులుగా అభివర్ణించబడినారు కదా! మంత్రకృత్తులనగా మంత్రకర్త లనియు, మంత్రము లనగా వేదము లనియు కదా! దీనికి సమాధాన మేమి? అని యడుగవచ్చును. దీనికి శ్రుతప్రకాశికలో ఈ విధముగ సమాధానము చెప్పబడియున్నది.

'మన్త్రకృత్త్వం నామ అనధీత్యైవ వేదానా మస్ఖలిత క్రమ స్వర వర్ణతయా దర్శనమ్. తచ్చ తత్త న్మన్త్ర స్మృతి పూర్వకం ప్రజాపతినా యథాపూర్వం సృష్టై స్తత్తన్నామరూపభాగ్భిః ప్రవాహ పరంపరయాఽఽగతైః వసిష్ఠాదిభిః క్రియత ఇతి వేదనిత్యత్వ మన్త్రకృత్త్వా ఽవిరోధః.... ఉక్తం చ భగవతా వ్యాసేన

"యుగాన్తే ఽన్తర్హితా న్వేదాన్ సేతిహాసా న్మహర్షయః।
లేభిరే తపసా పూర్వ మనుజ్ఞాతా స్స్వయంభువా॥"

వేదాధ్యయనము చేయకయే వేద మంత్రములయొక్క క్రమ స్వర వర్ణములను స్ఖాలిత్యము లేకుండ యథాతథ ముగ తపః ప్రభావమున దర్శించుటే ఋషులయందలి మంత్రకృత్త్వము కనుక, వేద నిత్యత్వమునకు మంత్రకృత్త్వమునకు విరోధము లేదు. "ఋషీ-గతౌ" అను ధాతువునకు "సర్వధాతుభ్యః ఇన్" అను సూత్రముచే 'ఇన్' ప్రత్యయమును చేయగా 'ఋషిః' అను పద మేర్పడినది "వేద ప్రాప్త్యర్థం తపోఽనుష్ఠితః పురుషాన్ స్వయంభూ ర్వేదపురుషః ప్రాపోన్నేత్" "అజాన్ హ వై ప్రశ్నన్ తపస్యమానాన్ బ్రహ్మ స్వయంభ్వభ్యావర్ష త్తదృషయో ఽభవన్" (తై. ఆరణ్యకమ్.)

మంత్రద్రష్టలే ఋషులని, వేదప్రాప్తికై తపశ్చర్యలలో నున్న మహాపురుషులను స్వయంభువయిన వేదము పొందిన దని, అతీంద్రియమైన వేదమును పరమేశ్వరానుగ్రహమున ప్రథమముగా దర్శించుటవలన ఋషిత్వ మని, వేదములలో నే భాగము నెవ్వరు దర్శించిరో వారు ఆ భాగమునకు సంబంధించి సూక్తఋషులు కాండఋషులు ఇత్యాది వ్యవహారమునకు పాత్రులయినారని స్పష్టీకరించబడినది. ఈ నిర్ణయము ననుసరించియే "అప్యగ్రణీ ర్మన్త్రకృతా మృషీణామ్" అను కాళి దాస శ్లోక వ్యాఖ్యానములో 'మన్త్రకృతామ్-మన్త్రద్రష్టృణామ్' అని మల్లినాథసూరి వ్యాఖ్యానించియుండెను. యథార్థ స్థితి ఈ విధముగ నుండగా ఏమియు పరిశీలింపక ఋషులు వేదములను వ్రాసిపెట్టినారని నిరాధారముగా కల్పించు వారి మాటలు విశ్వసనీయములు కావని స్పష్ట మగుచున్నది. కావున మనువ్యాసాదులు చెప్పిన రీతిగా వేదము అపౌరుషేయము అనియు, అనాద్యంతము అనియు పాశ్చాత్యులు తదనుయాయులును నమ్మకున్నను మనము నమ్మినచో ఘోరప్రమాదము కాజాలదు. అట్లు నమ్మకపోవుట గొప్ప లోపమే.

“అపౌరుషేయత్వ స్తు ఇదం మయా కర్తవ్య మితి బుద్ధిపూర్వకం యత్నే నాఽకరణాత్ ” అనుపూర్వీ నియమము లేక స్వేచ్ఛాకృతానుపూర్వీ భేదముతో చెప్పబడిన గ్రంథము పౌరుషేయ మనబడును. అనుపూర్వీ భేద మెన్నడును లేక ఎప్పుడును ఏకవిధానుపూర్వితోడనే చెప్పబడు గ్రంథము అపౌరుషేయ మనబడును. ఇట్టిది వేదమే, అని మంజూషలో స్పష్టీకరింపబడినది. సాంఖ్యతత్త్వకౌముదిలో కూడ ఈ విషయమే ఈ విధముగ వివరింపబడినది.

“న చాఽఽనుపూర్వీ విశేషస్య పురుషాధీనతయా పౌరుషేయత్వాపత్తి రితి వాచ్యమ్। సజాతీయోచ్చారణానపేక్షోచ్చారణ విషయత్వరూప పౌరుషేయత్వాభావాత్। సర్గాద్యకాలే ఈశ్వరః పూర్వసిద్ధానుపూర్వీకం వేదం జ్ఞాత్వా తథైవాఽఽచఖ్యౌ: న తు విజాతీయానుపూర్వీకం, తాదృశ వేదాధ్యయనస్యైవ అభ్యుదయ నిశ్శ్రేయస హేతుత్వాత్, అన్యథా తస్య వాగ్వజ్రతయాఽనర్థ హేతుత్వాపత్తే రితి। మహాభారతాదౌ చ సజాతీయోచ్చారణానపేక్షోచ్చారణ విషయత్వా న్నాఽపౌరుషేయత్వాపత్తి రితి।”

ఈశ్వరుడు సృష్ట్యాదియందు పూర్వసృష్టిలో వేదము ఎటువంటి ఆనుపూర్వి కలిగి యున్నదో ఆ వర్ణానుపూర్విగనే వేదము నుపదేశించియుండెను. మార్పు లేని అటువంటి వేదముయొక్క అధ్యయనమే శ్రేయోదాయకము. వర్ణవ్యత్యాసము కాని, స్వరవ్యత్యాసము గాని వచ్చినయెడల ప్రమాదకరమని, ‘స వాగ్వజ్రో యజమానం హినస్తి’ అను వేదవాక్యమే బోధించుచున్నది. కనుక వర్ణానుపూర్వీభేదము లేకుండ ఏకవిధముగనే ప్రతిసృష్ట్యాదిని వేదము ఈశ్వరునిచే ప్రతిపాదింపబడుచున్నందున వేదము అపౌరుషేయము. ఇతరగ్రంథములు పౌరుషేయములని తాత్పర్యము.

ప్రమాణాంతర గోచరములయిన విషయములను తెలియజేయుటకై రచింపబడిన గ్రంథము పౌరుషేయము. ప్రమాణాంతరాగోచరములగు విషయములను అనగా అలౌకికోపాయములను తెలియజేయు గ్రంథము అపౌరుషేయము. అది వేదమే. పారసంప్రదాయము అవిచ్ఛిన్నమైయుండి కర్త స్మరింపబడనపుడు దానికి కారణము కర్తలేకుండుటే అని చెప్పక తప్పదు. కనుక వేదమునకు అపౌరుషేయత్వము సిద్ధించినది.

“తస్య హ వా ఏతస్య మహతో భూతస్య నిశ్వసిత మేతత్ – యదృగ్వేదో యజుర్వేద స్సామవేదః” – నిశ్వసిత న్యాయమున పరమాత్మనుండి వేదము ఆవిర్భవించినదని యీ శ్రుతి చెప్పుచున్నది. ఈ శ్రుత్యర్థమునే “యస్య నిశ్వసితం వేదాః” అని భాష్యకారులు ప్రవచించినారు. లోకములో నిశ్వాసము (నిట్టూర్పు) అనాయాసముగా (అప్రయత్నముగా) అబుద్ధిపూర్వకముగా కలుగుచుండుట అనుభవ సిద్ధము.

వేదము, దృష్ట – అదృష్ట – స్థూల – సూక్ష్మ – చేతన – అచేతనాది సర్వ పదార్థ ప్రకాశకము. అట్టి వేదమును అచింత్య శక్తులు కలవాడగుటచే పరమేశ్వరుడు రచించుటలో ప్రయత్నాభావమును చెప్పిన చెప్పవచ్చును గాని, అబుద్ధిపూర్వకత్వమును మాత్రము చెప్పుటకు వీలులేదు. స్వతంత్రముగా వాక్యరచన చేయునపుడు బుద్ధిపూర్వకత్వము తప్పదు కదా! ఈ విధముగా నిశ్వసిత న్యాయముచే తేలిన అబుద్ధిపూర్వకత్వము ఉపపన్న మగుటకై వేదము ఈశ్వరకృతము కాదు; ఈశ్వర ప్రకాశితమే అని యంగీకరింపవలసియున్నది. నిద్రావస్థలో గూడ కలుగుచుండు నిశ్వసితము అబుద్ధిపూర్వకముగను, అనాయాసముగను కలుగుచుండుట అనుభవసిద్ధ మగుటచేత శ్రుతిలోని నిశ్వసిత న్యాయమునకు అబుద్ధిపూర్వకత్వమందును తాత్పర్యమే అని చెప్పి అది సిద్ధించుటకై వేదము ఈశ్వరప్రకాశిత మనుచు అపౌరుషేయత్వమును, స్వతఃప్రామాణ్యమును వేదమునకు ఉత్తరమీమాంసకులు అభివర్ణించియున్నారు.

“శ్రుతి స్సనాతనీ సాధ్వీ సర్వమానోత్తమోత్తమా।
అతీన్ద్రియార్థవిజ్ఞానే మానం న శ్శ్రుతి రేవ హి॥
శ్రుత్యేకగమ్యే సూక్ష్మార్థే న తర్కః కిం కరిష్యతి।
మానానుగ్రాహక స్తర్కో న స్వతన్త్రః కదాచన॥

“శ్రుతి స్సనాతనీ శంభో రభివ్యక్తా న సంశయః।” (సూతసంహిత.) వేదము సనాతనము. సర్వ ప్రమాణములలో ఉత్తమప్రమాణము. అతీంద్రియ పదార్థములను తెలిసికొనుటకు వేదమే మనకు ప్రమాణము. వేదవేద్యమైన సూక్ష్మ విషయములో తర్కమేమి గ్రహింపజేయును? ప్రమాణమునకు బలకరము తర్క మగును. వేదము పరమేశ్వరుని నుండి అభివ్యక్త మైనదియే. కావున వేదోపదిష్టమైన దంతయు యథార్థము.

ఈ వేదమునకు కాలనిర్ణయము చేయుటకై అనేకులైన ఆధునిక పరిశోధకులు, ప్రొఫెసర్ మాక్సుముల్లరు మున్నగు ఆంగ్ల పండితులు, లోకమాన్య తిలక్, శంకరబాలకృష్ణపండితుడు, దీనానాథశాస్త్రి మొదలగు భారతీయ పండితులును గావించిన పరిశోధన లన్నియు నిర్దుష్టమైన సిద్ధాంతమును నిరూపించజాలక, హేతువాదమునకే నిలువలేక వీగిపోయిన వను విషయము విద్వల్లోకమునకు విదితపూర్వమే కదా! ఈ విధముగ భగవదాజ్ఞా రూపమును, మహాపురుష సేవితమును, యోగక్షేమ దాయకమును లోకానుగతము నగు వేదము పరమ ప్రమాణ మని నిరూపితమైనది.

'అనన్తా వై వేదాః' వేదము లనంతము లని శ్రుతి చెప్పుచున్నది. కాని నేడు మన కుపలభ్యమానమైన వేదము పరిమితము. 'శేషే బ్రాహ్మణ సంజ్ఞా' అని కల్పసూత్రము చెప్పుచున్నది. అనగా వేదములకు ద్వివిధ విభాగము కలదు. అందొకటి ఋగ్యజుస్సామాథర్వ విభాగము. ఇంకొకటి మంత్రబ్రాహ్మణారణ్యకోపనిషద్విభాగము. మొదటి విభాగములోని "యజుస్సు", రెండవ విభాగములోని "బ్రాహ్మణము" పరిశేషన్యాయమున అన్వయించుకొనవలసినవి. అనగా; ఋక్సామాథర్వలక్షణము క్రిందకు రాని దంతయు యజుర్వేదము. అట్లే ఇతర నిర్వచనము క్రిందకు రాని దంతయు బ్రాహ్మణము. ఇదియే పైని ఉదాహరింపబడిన సూత్రమున కర్థము. "స్త్రియా మృక్సామయజుషీ, ఇతి వేదాస్త్రయ స్త్రయీ" అని అమరనిఘంటు వచనము. 'ఇమే వేదా స్త్రయః త్రయీత్యుచ్యతే.' ఈ వేదములు మూఁడును త్రయి యనంబడును. అని తద్వ్యాఖ్యానము. దీనిని బట్టి వేదములు మూడే కదా, నాలుగు వేదములని పైని చెప్పబడిన వేదవిభాగము సరియైనది కాదని తోచవచ్చును. ఈ మూఁడు వేదములకు 'త్రయి' అని వ్యవహార మని అమరసింహుడు చెప్పెనే కాని మొత్తము వేదములు మూఁడు అని చెప్పలేదు కదా! వేదము ఋగ్యజుస్సామభేదముచే త్రివిధ మనియు, అథర్వ వేదముతో కూడ చతుర్విధ మనియు వేద సంప్రదాయవిదులు చేసిన నిర్ణయమిది. అనగా వేదము ప్రయోగత్రయముచే యజ్ఞనిర్వాహార్థము ఋగ్యజుస్సామభేదముచే భిన్నమై 'త్రయి' అను సంజ్ఞతో నొప్పుచున్నది. ప్రయోగత్రయ మనగా, ఋగ్వేదముచే హౌతృప్రయోగము, యజుర్వేదముచే ఆధ్వర్య్వప్రయోగము, సామవేదముచే ఔద్గాత్రప్రయోగ మనియు అర్థము. బ్రాహ్మణ యాజమాన ప్రయోగములు ఇందులోనే అంతర్భూతములు. అథర్వవేదము యజ్ఞానుపయుక్త మగుటచే పైని పేర్కొనబడిన త్రయీ విభాగములో చేర్చబడలేదు. అయినను శాంతిక పౌష్టికాభిచారికాది కర్మ ప్రతిపాదక మగుటచే అత్యంత విలక్షణమైనది కనుక వేదత్రయమునుండి దీనిని పృథక్కరించుట సమంజసమే.

నియత వర్ణ పదములు కలది ఋక్కు. ఋగ్బాహుళ్యము కలది ఋగ్వేదము. అనియత వర్ణ పదములు కలది యజుస్సు. తద్బాహుళ్యము కలది యజుర్వేదము. ఋక్కు యజస్సు అను వివక్ష లేకుండ గాన ప్రాధాన్యము కలది సామవేదము. ఋగ్యజుస్సుల వివక్ష లేకుండ శాంతిక పౌష్టికాభిచారికాది కర్మ ప్రాధాన్యము కలది అథర్వవేదము. యజుర్వేదము శుక్ల కృష్ణ భేదముచే ప్రత్యేకముగ రెండు విధములుగ నొప్పారుచున్నది. దర్శపూర్ణమాసాది సర్వ యాజ్ఞికమంత్రములు బ్రాహ్మణములతో మిశ్రితములు కాకుండ యుండునది శుక్ల యజుర్వేదము. యాజ్ఞిక మంత్రములు క్రమపాఠ రహితములై బ్రాహ్మణములతో మిశ్రితములై యుండుటచే రెండవదానిని కృష్ణయజుర్వేద మని విపశ్చిత్తులు వ్యవహరించినారు. ఇట్లే అథర్వవేదమునందు కూడ భైషజ్యభాగము, మంత్రభాగము అని రెండు విభాగము లున్నవి. మఱియు సర్వ వేదములందును సంహిత, బ్రాహ్మణము, ఆరణ్యకము, ఉపనిషత్తులు అనెడి అవాంతర భేదములు కలవు. ప్రవచన భేదము ననుసరించి ప్రతివేదమునందును భిన్నములైన శాఖ లనేకములు కలవు. కనుకనే కృష్ణయజుర్వేదము తైత్తిరీయ శాఖకు చెందగా, శుక్లయజుర్వేదము వాజసనేయ శాఖకు చెందియున్నది. ఈ విధముగ కర్మకాండమునందు వ్యాపారభేద మున్నను, సర్వవేద శాఖలయొక్క ఐక్యరూపమే బ్రహ్మకాండ మనియు, చతుర్వేదములకు ప్రయోజనభేదముచే భేద మేర్పడిన దనియు నిగమపారావార పారీణులైన మహర్షులు నిర్ణయించిరి.

బ్రాహ్మణము — వేదమే

ధర్మ – బ్రహ్మ – ప్రతిపాదక మైనది వేదము. ఇది మంత్ర బ్రాహ్మణాత్మకమై యున్నది. ద్రవ్య – దేవతా ప్రకాశమై యున్నది మంత్రభాగము. విధి – అర్థవాదాది రూపమై యున్నది బ్రాహ్మణభాగము. 'మంత్ర బ్రాహ్మణయోః వేద నామధేయమ్' మంత్ర బ్రాహ్మణములు రెండింటికి వేదనామధేయ మున్నదని ఆపస్తంబమహర్షియు, 'మంత్ర బ్రాహ్మణమిత్యాహుః' మంత్రబ్రాహ్మణములు రెండును వేదమునుగా తదభిజ్ఞులును చెప్పుచున్నారని బోధాయన మహర్షియు వేదస్వరూపమును నిర్ణయించినారు. ఈ విధముగ బహు మహర్షి సమ్మతమగుటచే మంత్రబ్రాహ్మణములు రెండును వేద మని నిర్ధారితమైనది.

బ్రాహ్మణభాగము వేదమునకు వ్యాఖ్యానమై యుండుటచే అది వేదము కాదనియు, బ్రాహ్మణము పురాణ గ్రంథ మనియు, బ్రాహ్మణ మనుదాని నామాంతరమే అది వేదము కాదని తెలుపుచున్నదనియు కొందఱు సంప్రదాయానుగత సిద్ధాంతమునకు విరుద్ధముగ మాట్లాడు చున్నారు. (i)బ్రాహ్మణము నామాంతరమయినంత మాత్రముచే వేదము కాదా? ఒక సంజ్ఞను మరియొక సంజ్ఞను త్రోసివేయదు కనుక వేద మను నామమునకు బ్రాహ్మణ మను నామాంతరము బాధకము కాదు. కావున బ్రాహ్మణము వేదమే. (ii)బ్రాహ్మణము మంత్రభాగమునకు వ్యాఖ్యాన మగుటవలన అది వేదము కాదనుట సరి కాదు. వ్యాకరణ సూత్రములకు వ్యాఖ్యానమైయున్న పతంజలిభాష్యము వ్యాకరణము కాదనుట యెట్లు విరుద్ధమో, న్యాయసూత్ర వ్యాఖ్యానమైయున్న వాత్స్యాయన భాష్యము న్యాయశాస్త్రము కాదనుట యెట్లు విరుద్ధమో, అట్లే వేదభాష్యమైన బ్రాహ్మణము వేదము కాదనుట విరుద్ధము. (iii)బ్రాహ్మణమును పురాణ మనుట సరి కాదు, "అథ స్వాధ్యాయ మధీయీత ఋచో యజూగ్ంషి సామాని అథర్వాఙ్గిరసో బ్రాహ్మణాని..............ఇతిహాస పురాణాని" అను ఆశ్వలాయన సూత్రము బ్రాహ్మణ మును పురాణమును వేరుగా చెప్పుటచే బ్రాహ్మణము పురాణము కాదని స్పష్ట మగుచున్నది.

"యజ్ఞో మంత్రబ్రాహ్మణస్య లోకవృత్త మితిహాసస్య" మంత్ర బ్రాహ్మణములలోని విషయము యజ్ఞ మనియు, ఇతిహాస పురాణములలోని విషయము లోకవృత్త మనియు న్యాయదర్శనము వివరించినది. కావున బ్రాహ్మణము పురాణము కాదని స్పష్ట మైనది. ఇంతియ కాక బ్రాహ్మణము వేదమే అను విషయము స్పష్టముగ నిరూపింపబడినది. న్యాయదర్శన ములో వేద ప్రామాణ్యమును నిరూపించునపుడు 'వేదము — అనృతముగను, పరస్పర విరుద్ధముగను పునరుక్తిగను చెప్పుచుండుటచే అప్రమాణము' అను నొక పూర్వపక్షమును 'తద ప్రామాణ్య మనృత వ్యాఘాత పునరుక్త దోషేభ్యః' అను సూత్రముతో చేసి, ఆ యనృతదోష ప్రదర్శన మీ విధముగ చేయబడినది.

'పుత్రకామః పుత్రేష్ట్యా యజేతేతి నేష్టౌ సంస్థితాయాం పుత్రజన్మ దృశ్యతే దృష్టార్థస్య వాక్యస్యాఽనృతత్వా దదృష్టార్థమపి వాక్యమ్ 'అగ్నిహోత్రం జుహుయా త్స్వర్గకామః' ఇత్యాద్యనృత మితి జ్ఞాయతే!'

పుత్రేష్టిని చేసిన పుత్రుడు కలుగునని దృష్టఫలము చెప్పబడినది. పుత్రేష్టి చేసినను పుత్రుడు కలుగకుండుట ప్రత్యక్షముగ కనబడుచున్నది. దృష్టఫల మనృత మైనప్పుడు అదృష్టఫలమును చెప్పు వాక్యములు కూడ అనృతములే యని తెలియు చున్నది. ఈ విధముగ పూర్వపక్షమును, తద్వివరణమును చూపి యీ విధముగ ఆ పూర్వపక్షము ఖండింపబడినది. – ఇచట అనృతమున కుదాహరణములుగా చూపబడిన రెండువాక్యములును బ్రాహ్మణములోనివే. బ్రాహ్మణము వేదము కాని యెడల బ్రాహ్మణవాక్యములతో వేదమున కప్రామాణ్య మెట్లు ఆపాదింపబడును? కనుక బ్రాహ్మణము వేదమే అను సిద్ధాంతము నిరాక్షేపణీయమే. (ఈ పుత్రేష్టిని గూర్చిన పూర్వపక్షముపై న్యాయదర్శనములో చెప్పబడిన సిద్ధాంతము వేద ప్రామాణ్య నిరూపణ సందర్భమున చెప్పబడును.)

శ్రీదయానందసరస్వతిగారు మంత్రభాగమే వేదము, బ్రాహ్మణము వేద మనబడదు, అనుచు అందుకు ప్రమాణము లుగా ఈ క్రింది వానిని చూపినారు. (i)వ్యాకరణ భాష్యకారుడు వేదమున కుదాహరణముల నిచ్చునపుడు "అగ్ని మీళే పురోహితమ్", "ఇషే త్వోర్జే త్వా", "అగ్న ఆయాహి వీతయే", "శన్నో దేవీ రభిష్టయే", అని మంత్రభాగముల మొదళ్లే ఉదాహరించినారు కాని, బ్రాహ్మణముల మొదళ్ల నుదాహరించలేదు. బ్రాహ్మణములు కూడ వేద మయినచో బ్రాహ్మణముల నుదాహరించి యుందురు. కనుక బ్రాహ్మణములు వేదములు కావు. (ii)వ్యాకరణ సూత్రకారుడు పాణిని– "చతుర్థ్యర్థే బహుళం ఛన్దసి" (అ.౨ పా ౩.సూ.౬౨) సూత్రములోనికి "ద్వితీయా బ్రాహ్మణే" (అ.౨.పా.౩.సూ.౬౦) సూత్రమునుండి 'బ్రాహ్మణే' అను పదము అనువర్తించుచుండగా, మఱల తర్వాతి సూత్రములో 'ఛన్దసి' అను పద మేల ప్రయోగింపవలెను? కనుక ఆతని మతమున బ్రాహ్మణము ఛందస్సు కాదని దయానందసరస్వతిగారి విమర్శము.

(i) "అగ్ని మీళే పురోహితమ్", "ఇషే త్వోర్జే త్వా" "అగ్న ఆయాహి వీతయే", "శన్నో దేవీ రభిష్టయే", అను నాలుగు ఉదాహరణములు వరుసగా నాలుగు వేదములలోని ప్రారంభ వాక్యములు కనుక వానినే భాష్యకారుడు ఉదాహ రించి యుండెను. బ్రాహ్మణము వేదము కాదను భావముతో కాదు. కనుక ఈ ప్రమాణము బ్రాహ్మణము వేదము కాదను వాదమును సమర్థింపజాలదు. (ii)పాణినీయమున ఛన్దశ్శబ్దము వేదపరముగ తరచుగ ప్రయుక్తమైనను "ఛన్దో బ్రాహ్మ ణాని చ తద్విషయాణి" (అ.౪.పా.౨.సూ.౬౬) ఇత్యాది సూత్రములలోని ఛందః పదములు, గాయత్ర్యాది ఛందోయుత మంత్రపరముగ వ్యాఖ్యాతములై యుండుటచే ఛందః పదము అనువర్తింపజేయబడినది. కావున ఈ ప్రమాణము కూడ బ్రాహ్మణము వేదము కాదనువాదమును సమర్థింపజాలదు.

ఒకప్పుడు దయానంద సరస్వతికిని, రాజా శివప్రసాదునకును వేదమును గూర్చి వాదప్రతివాదము జరిగినది. అందు బ్రాహ్మణము వేదము కాదని దయానంద సరస్వతియు, వేదమే యని శివప్రసాదును శాస్త్రార్థము జరిపి దాని పరిష్కారము నకు యూరపుదేశీయుడు, సంస్కృతవిద్వాంసుడు, కాశిక రాజకీయ పాఠశాలాధ్యక్షుడు నగు డాక్టరు 'టీబో' ను వారు కోరగా నాతడు వారి పత్రికా వాదముపై తీర్పు వ్రాసి అంగ్లములో ప్రకటించి యుండెను. ఆ తీర్పులో దయానంద సరస్వతి చూపిన ఉపపత్తులు తమ వాదమును బలపఱచునవిగా లేవని నిర్ధారణచేసినారు. శ్రీ కాలూ రామశాస్త్రిగారు హిందీలో రచించిన 'పురాణవర్మ' అను గ్రంథములో ఈ విషయము విపులముగ వ్రాయబడినది. దీనిని బట్టి 'కేవలము సంహితయే వేదము, బ్రాహ్మణములు, ఆరణ్యకములు, ఉపనిషత్తులు వేదము కావు' అనువారి వాదము పరాస్తమైనది.

బ్రాహ్మణములలో పశువధ చెప్పబడినది కదా! హింసా బహుళమైన కర్మ పవిత్ర వేదముచే ప్రతిపాదింపబడుట హేయము. కనుక బ్రాహ్మణములు వేదము అనరాదని కొందఱు వాదించుచున్నారు. పశువధ ఉన్నది. బ్రాహ్మణములలోనే కాదు, మంత్రములలో కూడ ఆ సూచన లున్నవి. కనుక మంత్రములు కూడ హింసా బహుళము లగుటవలన అవియు వేదము కాదనవచ్చునా?

'మా హింస్యా త్సర్వా భూతాని' అని వేదము ఏ ప్రాణిని కూడ హింసింపరాదని హింసను నిషేధించుచున్నది. యాగములో హింస హింసగా పరిగణింపబడదని ప్రాచీన సంప్రదాయజ్ఞుల సిద్ధాంతము. అదియుగాక, "అధ్వరము" అని ఒక పదమును యాగమునకు తఱచుగా వేదమునందు ప్రయోగించుట కలదు. అధ్వరము=హింస లేనిది, అని భాష్యకర్తలు అధ్వర పదార్థమును వివరించినారు. కావున ఒకపుడు విషము అమృత మయినట్లు హింసయు నుపకారము కావచ్చును. ఒక వ్యక్తికి బాధ కలిగినను సంఘమునకు దానివలన క్షేమము కలుగునపుడు ఆ హింస హింసగా పరిగణింపబడదు. ఈ పశు హింసవలన లోకమున కేమి క్షేమము కలదో? లోకసామాన్యమునకు తెలియని లోకక్షేమోపాయమును వేదము చెప్పునని వేద లక్షణము కదా!

కొందఱు పాశ్చాత్యులు, ప్రాచ్యవిమర్శకులు కూడ పూర్వము ఉత్తర ధ్రువమున హిమ ప్రళయము కలిగినపుడు ఋషులు బ్రాహ్మణములను రచించినారనుచు, అపుడు చెట్లు, చేమలు, సస్యములు లేకపోవుటచే మాంసాహారమే యలవడి యిట్లు కర్మలను విధించి దేవతాప్రీతి యని కల్పించినారని యందురు. ఉత్తర ధ్రువమునందు ప్రళయము కలుగవచ్చును. ఆ బ్రాహ్మణములలోనే యాగవస్తువులలో సర్వ ధాన్యములు పురోడాశమునకు చెప్పబడినవి. యజుర్వేద ప్రథమ సంపుటము నందే యీ విషయము పలు తావులందు కనబడును. ధాన్యపు పిండితోనే పురోడాశమును చేయుదురు. పశువును బంధించు టకు పలు రకముల యూప స్తంభములు చెప్పబడినవి. సస్యములు లేనపుడు పురోడాశ మెట్లు లభించినది? చెట్లు లేనపుడు యూప స్తంభము లెట్లు ప్రాప్తించినవి? కావున ఇట్టి హేతు రహితములు, నిరాధారములునైన విమర్శలను బట్టి బ్రాహ్మణ ములు వేదము కాదనరాదు. కనుక బ్రాహ్మణములు వేదమే. ఆ వేదము అపౌరుషేయమే. అది అనాదియే. అనాది కావున అనంతమే. అది అందఱకు ప్రమాణ మూర్ధన్యమే.

వేదము — ప్రమాణము

వేదములో ఐహికఫల మీయగలిగిన విధానములు, ఆముష్మికఫల మీయదగిన విధానములు చెప్పబడినవి కదా! అందు 'పుత్రకాముడు పుత్రేష్టిని చేయవలెను' అని చెప్పబడినది. పుత్రేష్టి చేసినపుడు పుత్రుడు కలుగకుండుట కనబడుచున్నది. ఐహికఫలములో వేదవాక్య మసత్య మగుట వలన ఆముష్మికఫలములో గూడ ఆ విధముగనే కావచ్చును కనుక వేదము ప్రమా ణము కాదని కొందఱివాదము. పుత్రేష్టి విషయమై వేదమున కన్నృతదోష మాపాదింపరాదు. పుత్రోత్పత్తి కార్యములో పుత్రేష్టి ఒక సాధనముగా చెప్పబడినది. సాధనముతో బాటు కర్త క్రియ కార్యసిద్ధికై యవసరము. 'యావత్కారణ సామగ్రీ సమవధానే కార్యసిద్ధిః'=కారణ సామగ్రి యంతయు ఉన్నపుడే కార్యము సిద్ధించునని కదా! సిద్ధాంతము. ఇచట మాతా పితరులు కర్తలు. వారి సమావేశము క్రియ. పుత్రేష్టి సాధనము. ఈ మూడును యథావిధిగా నున్నపుడు పుత్రోత్పత్తి కలుగును. వీనిలో ఏ యొకటి లోపించినను కార్యసిద్ధి కలుగనేరదు. పుత్రేష్టిని జేయు యజమానుడు యోగ్యత లేనివాడై నను, పుత్రేష్టిలో హవిస్సునకు ప్రోక్షణాది సంస్కారమున వైపరీత్య మేర్పడినను, మంత్రములు న్యూనాధికములు స్వర వర్ణ హీనములైనను, దక్షిణ హీనము (తక్కువ) దురాగత మయినను పుత్రేష్టి విఫల మగును. పుత్రోత్పత్తికి కారకు లయిన స్త్రీ పురుషుల శుక్రశోణితములలో దోషము లున్నపుడు కర్తృ వైకల్యము కలుగును. సమావేశన క్రియలో కూడ వైకల్య మూహ్యము. ఇట్టి వైకల్యము లేవియు లేకుండి కర్తృ క్రియా సాధన సంపత్తి యథావిధిగా నున్నపుడు పుత్రజన్మ కలిగితీరును.

లోకములో 'అరణిని మథించుటవలన అగ్ని యుద్భవించును' అను వాక్యమున్నది. ఇచట మథించు కర్త, మథనక్రియ, అరణి యథావిధిగ నున్నపుడు అగ్ని ఉద్భవించును. వానిలో దేనియందైనను వైకల్య మేర్పడినపుడు మాత్ర ముద్భవింపకుండును. అంతమాత్రమున ఆ లౌకికవాక్య మప్రమాణ మయిపోవునా? పుత్రేష్టివాక్యము కూడ అట్టిదియే. (న్యాయదర్శనము-అ2. ఆ. 1. సూ. 58) వేదభాగమైయున్న ఆయుర్వేద ముపదేశించినట్లు కర్తవ్యములను చేసి, అకర్తవ్యములను వర్జించినపుడు అర్థసిద్ధి యగుచున్నది. ఇవి ప్రమాణము లగుటవలన వేదమునకు ప్రామాణ్యము సిద్ధించినది. తెలియనివారు తెలిసికొనుటకు ఆప్తోపదేశముకంటె గత్యంతరము లేదు. ఆప్తుడు భగవంతుడు. ఆప్తోపదేశము వేదము కనుక ప్రమాణము అని న్యాయదర్శనము (అ2. అ1. సూ. 68) వివరించినది.

"దృష్టానాం దృష్టప్రయోజనానాం, దృష్టాభావే ప్రయోగో ఽభ్యుదయాయ" దృష్టఫలార్థము చేయబడిన వేదోక్త కర్మ దృష్టఫలమును కలుగజేయకపోయినను అభ్యుదయకారి యగును. కనుక వేదప్రామాణ్యమున కభ్యంతరము లేదు. అని వైశేషిక దర్శనము చెప్పుచున్నది.

వేదోక్త ధర్మాధర్మములయొక్క ఫలము, ఆ ఫలములో తారతమ్యము లోకములో ప్రత్యక్షముగా కనబడుచున్నది. ఒకనికి సుఖజీవనము, ఒకనికి దుఃఖజీవనము, కొందఱికి లోకపాలకత్వము, కొందఱికి పశుపాలకత్వము ఈ విధముగా బుద్ధులలో విద్యలలో, ఆరోగ్యములలో, ఆయుర్దాయములలో, అన్నోదకములలో ఎన్నియో భేదము లనివార్యములై కనబడుచున్నవి. దీనిని బట్టి కూడ వేదప్రామాణ్యము ధ్రువ మగుచున్నది. ఇట్లు అనుభవములచేతను, ప్రమాణ బలముచేతను, యుక్తి బలముచేతను వేదము ప్రమాణ మని స్పష్టమగుచున్నది.

వేదము కర్మకాండము, జ్ఞానకాండము, అని రెండు కాండములుగ నున్నది. సంహిత, బ్రాహ్మణము, ఆరణ్యకము అను మూడు భాగములు కర్మ ప్రతిపాదకము లనియు, ఉపనిషత్తులు బ్రహ్మప్రతిపాదకములు (జ్ఞానబోధకములు) అనియు సంప్రదాయజ్ఞుల సిద్ధాంతము. కాని మచిలీపట్టణములో బ్రాహ్మణసభవారు 1900 సంవత్సరప్రాంతమున "తైత్తిరీయ సంహితా-మంత్రభాగార్థః" అను శీర్షికతో సంహితలోని మంత్రములకు కూడ జ్ఞానపరముగను, కర్మపరముగను అర్థమును వ్రాసి ఒక పుస్తకమును ముద్రింపజేసిరి. 'వేదమునకు కర్మార్థమే కాని జ్ఞానార్థము లేదనియు, శబ్దములకు విపరీతార్థములు చెప్పి జ్ఞానార్థమును సంపాదించుచున్నారనియు' వ్రాసియున్న కొన్ని క్రైస్తవ గ్రంథములలోని వ్రాతలను ఖండించుటకై వేద మంతయు కూడ బ్రహ్మప్రతిపాదక మని నిరూపించుటకై తాము ఈ విధముగ వ్రాయుట కుద్యమించినామని గ్రంథ వివరణములో చెప్పియున్నారు.

కొన్ని ఉదాహరణములు:- "ఇషే త్వా". ఈ మంత్రభాగము కృష్ణయజుర్వేదీయ సంహితలో మొదటిది. ఓ మోదుగుకొమ్మా!, ఇషే=దేవతలకు దధి రూపమైన అన్నముకొఱకు, త్వా=నిన్ను, (ఆచ్ఛినద్మి=కోయుచున్నాను.) ఇది కర్మ పరమైన యర్థము. ఓ పరబ్రహ్మ!, ఇషే=జ్ఞానముకొఱకు, త్వా=నిన్ను, (ధ్యాయామి=ధ్యానించుచున్నాను. 'ఇషే' అను పదము చతుర్థీ విభక్త్యంతముగను 'త్వా' అను పదము ద్వితీయా విభక్త్యంతముగను ఉన్నవి. కర్తృ పదము, క్రియా పదము అధ్యాహార్యములు. ఓ పరబ్రహ్మ! నేను నిన్ను జ్ఞానముకొఱకు ధ్యానించుచున్నాను. అని వాక్యార్థ మేర్పడినది. 'ఇషే' అను పదమునకు దధి రూపమైన అన్న మని కర్మార్థమందు వ్రాయబడినది.

వేదములోని పదములకు వేద నిఘంటువును బట్టి అర్థము తెలిసికొనవలెను. వేద నిఘంటువు యాస్కుని నిరుక్తము కంటె మిగుల ప్రాచీన మనియు, యాస్కముని 2500 సంవత్సరములకు ముందున్న వా డనియు అనేకు లంగీకరించియున్నారు. ఆ వేద నిఘంటువునందు 'ఇషే' అను పదమునకు 'సూనృతా' అని అర్థము చెప్పబడినది. 'సూనృత' అను పదమునకు 'ప్రియం చ సత్యం చ' అని, 'మర్త్యర్థియో అకారః' అని ఆ నిఘంటువునందు (౧-౮-౧౪) వ్రాయబడియున్నది. 'సూనృతా' అనగ ప్రియము సత్యము కలది. అనగా జ్ఞానము. ఈ రెండింటిని కలిగియున్నది జ్ఞానమే కాని యితరము కాదు. ఇంతియే గాక 'ఇషే' అను పదము "ఇష=గతౌ" అను ధాతువువలన నిష్పన్నమైనది. 'యే గత్యర్థాస్తే జ్ఞానార్థాః' అని మహీధర యజుర్వేద భాష్యమున (౧౬. అధ్యాయము. ౧ మంత్రము) వ్రాయబడియున్నది. కావున 'ఇషే' అను పదమునకు జ్ఞానము, అన్నము అను రెండర్థములు కలవని స్పష్ట మగుచున్నది.

సర్వనామములు ప్రత్యేక విశేష్యములతో సంబంధింపనపుడు పరబ్రహ్మ వాచకములుగా చెప్పవలయును. ఇచట 'త్వా' అను సర్వనామము మరియొక విశేష్యముతో సంబంధింపకపోవుటచే పరబ్రహ్మనే సూచించుచున్నది. కావున కర్మార్థ మందు చెప్పబడిన 'పర్ణము' అనగ పలాశమునకు బ్రహ్మ అర్థ మని ఈ యనువాకమునకు సంబంధించిన బ్రాహ్మణమునందు "బ్రహ్మ వై పర్ణః" అని యుండుటచే బ్రహ్మను ధ్యానించుచున్నానని యర్థము చెప్పనగును.

2. "ఊర్జే త్వా" ఓ మోదుగుకొమ్మా!, త్వా=నిన్ను, ఊర్జే=బలసాధనమైన రసముకొఱకు, (సన్నమయామి=చక్కబఱచుచున్నాను.) ఇది కర్మపరమైన అర్థము. ఓ పరబ్రహ్మా!, త్వా=నిన్ను, ఊర్జే=బలముకొఱకు, (ధ్యానించుచున్నాను.) శరీరముయొక్కయు, ఆత్మయొక్కయు బలముకొఱకు పరబ్రహ్మమును ధ్యానము చేయుచున్నాను. అని జ్ఞానపరమైన అర్థము. 'ఊర్జే' అను పదము "ఊర్జ=బలప్రాణనయోః" అను ధాతువునుండి పుట్టినది. ఊర్జ మనగా ధ్యానమున కనుకూలమైన శరీరబలముకొఱకు, ఆత్మ బలముకొఱకు భక్తుడు భగవంతుని ప్రార్థించుచున్నాడని భావము. "ఇషే త్వోర్జే త్వేత్యాహ, ఇష మేవోర్జం యజమానే దధాతి" అను బ్రాహ్మణవాక్యమునకు భగవంతుడు భక్తునకు జ్ఞానము నిచ్చుచున్నాడని యర్థము.

3. ''వాయవః స్థ ఉపాయవః స్థ'' హే వాయవః!=(ఓ దూడలారా! మీరు మీ తల్లులనుండి వెడలి మేతనిమిత్తము అరణ్యమునకు) వెళ్లువారు, స్థ=కండు. ఉపాయవః=(యజమాన గృహసమీపమునకు సాయంకాలమునందు) తిరిగి వచ్చువారు కండు. ఇది కర్మపరమైన యర్థము. వాయవః=(ఓ ప్రజలారా! మీరు మీ మీ ధర్మముల నాచరించుటకు) వెళ్లువారు, స్థ=కండు. ఉపాయవః=భగవద్ధ్యానము గూర్చి తిరిగి వచ్చినవారు, స్థ=కండు. ఓ జనులారా! మీరు మీకు విధియైన ధర్మము నాచరించుచు భగవద్ధ్యానపరులై యుండుడు. ఇది జ్ఞానపరమైన యర్థము, 'వాయవః' అను పదమునకు 'గన్తారః' అనియు, 'ఉపాయవః' అను పదమునకు 'ఉపగన్తారః' అనియు భట్టభాస్కర భాష్యమున వ్రాయబడినది. భగవద్గీతయం దీ సిద్ధాంతమే తెలియ జేయబడినది. మనుజులు ఇహలోక సంబంధము అయిన ధర్మముల నాచరించుచు భగవద్ధ్యాన పరులై యుండవలయునని హిందూ సిద్ధాంతము. మనుష్యులను పశువులనుగా ఆరోపించుట సకల సిద్ధాంతములందు అంగీకరింపబడినది. కావుననే విష్ణువు గోపాలు డనియు, ఈశ్వరుని పశుపతి యనియు అనేక గ్రంథములందు వ్యవహరింపబడినది. కనుకనే ఇచట కర్మార్థమున పశువు లనియు, జ్ఞానార్థమున మనుష్య లనియు చెప్పఁబడినది. ''ప్రజా వై పశవః'', "పశవః పురుషః'' అను తైత్తిరీయ బ్రాహ్మణము ఇందుకు ప్రమాణము.

ఈ విధముగ సంహితయందలి మంత్రములకు కూడ కర్మార్థముతో బాటు జ్ఞానార్థము గూడ ఆ గ్రంథమునందు వ్రాయబడినది. మఱియు జ్ఞానార్థమునే ఈ మంత్రములు ప్రధానముగ చెప్పుచున్నవనియు కర్మార్థమును సాదృశ్యముతో గౌణముగ చెప్పుచున్నవనియు, కావున కర్మల ద్వారా జ్ఞానమును సంపాదించవలెననియు వ్రాసియుండిరి. వీరు ఈ విధముగ ఈ మంత్రములను జ్ఞానార్థకములుగ కూడ వ్రాయుటలో వేదనిఘంటువును, యాస్కనిరుక్తమునకు గల దుర్గాచార్యభాష్యమును, మహీధర భట్టభాస్కర భాష్యములను, తైత్తిరీయ బ్రాహ్మణమును గూడ ప్రమాణములుగ గైకొనిరి. అగ్ని పదమునకు బ్రహ్మ ముఖ్యార్థ మని, లోకమునందు ప్రసిద్ధమైన అగ్ని గౌణార్థ మనియు పలుతావులందు నిరూపించినారు. ఇటువంటి విశేషార్థములను మేము గూడ మా వేదార్థ దీపికా వ్యాఖ్యానమున తెలియపరచినాము. ఉపనిషత్తులే గాక సంహితా బ్రాహ్మణారణ్యక భాగములు కూడ గౌణముగ గాని ముఖ్యముగ గాని జ్ఞానార్థమును తెలియజేయుచున్న వను విషయమును తెలియజేయుటకే నే నీ యుదాహరణములను జూపినాను.

బ్రాహ్మణములతో మిశ్రితములైన యజస్సుల బాహుళ్యము గల వేదము కృష్ణయజుర్వేదము. తిత్తిరి మహర్షిచే ప్రచాలితమైన కృష్ణయజుర్వేదీయ సంహిత కనుక కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహిత యనబడుచున్నది. ''తిత్తిరి వరతన్తు ఖణ్డికోఖాచ్ఛణ్'' అను పాణినీయ సూత్రముచే, 'తిత్తిరి' శబ్దమునకు 'ఛణ్' ప్రత్యయము చేయగా 'తైత్తిరీయ' పదము సిద్ధించినది. 'తిత్తిరిణా ప్రోక్త మధీయతే తైత్తిరీయాః' అని భట్టోజీ దీక్షిత వివరణము. వేదార్థ రచనావశ్యకతను గుఱించి భాష్యకారులే భాష్యకారోపోద్ఘాతమునందు విపులీకరించినారు.

వేదములు నాలుగును మన భారతీయ భాషలయిన హిందీ, తమిళములలో సంపూర్ణముగా తర్జుమా చేయబడినవి. తమిళములో 'వనస్పతినాథన్' అను పండితుడు అర్థము వ్రాసినాడు. మళయాళములో సంపూర్ణముగ అనువదింపబడలేదు. తెలుగులో 1914 సంవత్సరమున ఋగ్వేదమునకు 'వేదార్థచంద్రిక' అను పేరుతో ఒక అనువాదగ్రంథము వెలువడినది. అందు ప్రతిపదార్థ తాత్పర్యములు మాత్రము వ్రాయబడినవి. దాదాపు 700 పుటల (రాయల్ సైజు)తో ఉన్న ఆ గ్రంథము ఋగ్వేదమునకు సంపూర్ణానువాదము కాదు. 1939–40 సంవత్సరములలో కీ.శే. గొల్లపూడి సీతారామశాస్త్రిగారు గుంటూరు మండలములోని వినయాశ్రమము తరఫున నాలుగు వేదములను 'ఆంధ్రవేదములు' అను పేరుతో అనువదింపజేయ సంకల్పించి కొంతవఱకు కృషి చేసినారు. తత్కృషి ఫలితముగ ఋగ్యజుస్సామ వేదములలో ఒక్కొక్క సంపుటము (రాయల్ సైజులో 500పుటలతో) వెలువడినది. వానిలో ఋక్సామ వేదములకు కీ.శే. బంకుమల్లి మల్లయ్యశాస్త్రిగారు కృష్ణయజుర్వేదము

నకు నేనును వ్రాసియుంటిమి. ఆ యనువాదము కేవలము 'దండాన్వయము' రూపముగనే చేయబడినది. ఇప్పుడు వెలువడిన 'వేదార్థదీపిక' మాదిరి, వ్యాఖ్యాన రూపమున విపులముగ లేదు. అప్పటి రాజకీయోద్యమము కారణముగ గొల్లపూడి సీతారామశాస్త్రిగారు కారాగారవాసమునకు వెళ్లియుండుటచేతను, ఆ కార్యభారమును వహించగల దక్షులు మఱియొకరు లేనందునను ఆ కృషి అంతటితో ఆగినది. అప్పటికి మల్లయ్యశాస్త్రిగారి వయస్సు 64 సంవత్సరములు. నా వయస్సు 24 సంవత్సరములు. అథర్వవేదమున కనువాదము మల్లయ్యశాస్త్రిగారిచేతను, శుక్లయజుర్వేదమున కనువాదము నాచేతను చేయింపదలచిరి గాని పైని పేర్కొనబడిన కారణములచే ఆ సంకల్పము కార్యరూపమును ధరించలేదు.

1932 సంవత్సరమున నేను వ్యాకరణ మహాభాష్యమును చదువుచున్న రోజులలోనే వేదములను తెలుగులో అనువాదము చేయవలెనని నాకు సంకల్పము కలిగినది. ఆ సంకల్ప బలమువలన 1938లో నేను శాస్త్రాధ్యయనమును ముగించుకొని స్వగృహమునకు రాగానే గుంటూరు మండలములోని వినయాశ్రమమువారి ఆహ్వానమును పురస్కరించుకొని కృష్ణయజుర్వేదమునకు తెలుగులో అనువాదము చేయుటకై వారిచే అనుజ్ఞాతుడనై రెండు సంవత్సరములలో కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితకు దండాన్వయ రూపమున అనువాదము చేసి వారి కిచ్చినాను. అందు ఒక సంపుటము మాత్రము ముద్రితమైనది. అప్పటి వినయాశ్రమమువారి ఆర్థిక కారణములవలన దండాన్వయముగానే వ్రాయు మని వారు చెప్పుటచే ఆ విధముగనే వ్రాయవలసివచ్చినది. నేను గృహస్థాశ్రమములో అడుగు పెట్టిన రోజులవి. అప్పుడే శాస్త్రాభ్యాసము ముగించుకొని వచ్చిన రోజులవి. అందువలన దండాన్వయ రూపమైన అనువాదముతో తృప్తి కలుగలేదు.

1976 జూలైలో నేను నెల్లూరు మండలములోని విద్యానగర్ ప్రాచ్యకళాశాలలో చేయుచున్న ఉపన్యాసక (Lecturer) పదవినుండి విరమించుకొని 1977లో మఱల వెనుకటి వేదార్థవ్యాసంగములో నిమగ్నుడనై అన్ని వేదములకు తెలుగులో విపులముగా వ్యాఖ్యానము చేయ సంకల్పించి 'వేదార్థదీపిక' అను పేరుతో వ్యాఖ్యాన రచన కుపక్రమించినాను. ఈ వేదార్థదీపికా వ్యాఖ్యానము ప్రతిపదార్థ తాత్పర్య మంత్రవినియోగ విశేషాంశములతో కొంతవఱకు వ్రాయగానే శ్రీ తిరుమల శ్రీనివాసుని కృపా కటాక్షమువలన 1981 ఏప్రిల్ మాసములో శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానమువారు దయతో నా యీ వేదార్థమును స్వీకరించి ముద్రింపించుట కంగీకరించినారు. "శ్రేయాంసి బహువిఘ్నాని" అన్నట్లు కొన్ని అవాంతరములయిన ఆటంకముల వలన వెంటనే ముద్రణపు పని ప్రారంభము కాలేదు. 1982 ఫిబ్రవరిలో నా యనువాదమును కొనసాగించవలసినదిగా ఆదేశమును (Order)పంపి మదరాసులో ఈ వేదార్థ ముద్రణము జరిపించుటకు సంకల్పించినారు కాని అదియు అప్పుడు కొనసాగలేదు. శ్రీ వేంకటేశ్వరుని యనుగ్రహమువలన 1984 ఫిబ్రవరి మాసములో తిరుమల తిరుపతి దేవస్థానపు ముద్రణాలయమున ముద్రణము ప్రారంభమై యిప్పటికి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితయందు ప్రథమ కాండము ముద్రితమై ప్రథమ సంపుటముగ వెలువడినది.

యజుర్వేద ప్రాజెక్టును నెలకొల్పి బృహత్తర కార్యమైన ఈ యజుర్వేదార్థ ముద్రణాది బాధ్యతను శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానము నిర్వహించుటకు ఆమోదింపజేసిన, ఆస్తిక శిరోమణులు, ఆర్షవాఙ్మయమునందు అత్యంతాదరాభిమానులు, అప్పటి టి. టి. డి. కార్యనిర్వహణాధికారులును అయిన శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్, ఐ.ఏ.ఎస్. గారికిని, ఈ వేదార్థ ముద్రణమును ప్రారంభింపజేసిన అప్పటి టి. టి. డి. కార్యనిర్వహణాధికారులు శ్రీ జి. కుమారస్వామిరెడ్డి, ఐ.ఏ.ఎస్. గారికిని, ఈ వేదార్థ ముద్రణాది కార్యక్రమమును నిరాటంకముగ కొనసాగించుచు అనతికాలములోనే ఈ యజుర్వేదార్థ ప్రథమ సంపుటము నావిర్భవింపజేసిన శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణాధికారులు శ్రీ యస్. లక్ష్మీనారాయణ, ఐ.ఏ.ఎస్. గారికిని నా నమోవాక శతంబులు.

నన్ను దేవస్థానమువారికి పరిచితుని చేసి తాము కూడ ఈ వేదార్థ రచనా వ్యాసంగమున భాగస్వామ్యమును వహించి ఈ కార్యక్రమము అవిచ్ఛిన్నముగ కొనసాగుటకు కారణభూతులైన కళాప్రపూర్ణ డాక్టర్ శ్రీ దివాకర్ల వెంకటావధాని గారికి కృతజ్ఞతాపూర్వక వందన శతంబులు. ఈ కార్యక్రమము ఆచరణసాధ్య మగుటలో అనవరతము నిర్విరామముగ కృషి చేసి నాకు

అనేక విధముల ప్రోత్సాహము ఇచ్చి ఈ వేదార్థము వెలుగులోనికి వచ్చుటకు కారణభూతులైన డాక్టర్ శ్రీ అర్. సూర్యనారాయణమూర్తి, M.A.,B.Ed., టి.టి.డి. ప్రజాసంబంధ శాఖాధికారి గారికిని, టి. టి. డి., సప్తగిరి సంపాదకులు శ్రీ కె. సుబ్బారావు, యం.ఏ. గారికిని కృతజ్ఞతాపూర్వక నమస్సులు. ముద్రణములోని లోపములను సరిచేయుటలోను, ఇతరములైన ముద్రణపు కార్యములలోను నాకు బహుముఖముగ సలహాల నొసంగుచు నా కార్యభారమును కూడ తాము కొంత వహించుచు సహాయపడిన శ్రీ ములుకుట్ల రామకృష్ణశాస్త్రి, యం.ఏ. గారికిని, విద్వాన్ శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులు గారికిని నా హార్దములైన యభివందనములు.

ఈ యజుర్వేదార్థ ముద్రణమునకు ఒక ప్రత్యేకతను కల్పించి త్వరితగతిని సర్వాంగ సుందరముగ ఈ యజుర్వేదార్థ ప్రథమ సంపుటమును రూపొందింప జేసిన శ్రీ యమ్. విజయకుమారరెడ్డి, టి. టి. డి. ప్రెస్ మేనేజరు గారికి కృతజ్ఞతాపూర్వక సాధువాదములు. వారి సిబ్బందికి ఆశీఃపూర్వకములైన నా శుభాకాంక్షలు.

శిరోమణి, భాషాప్రవీణ,
తర్క, వ్యాకరణ పూర్వోత్తర మీమాంసా విశారద
రామవరపు కృష్ణమూర్తి శాస్త్రి.

శ్రీ

భూమిక

గోభి ర్విప్రైశ్చ వేదైశ్చ సతీభి స్సత్యవాదిభిః,
అలుబ్ధై ర్దానశీలైశ్చ సప్తభి ర్ధార్యతే మహీ.

గోవులు, విప్రులు, వేదములు, పతివ్రతలు, సత్యవాగ్వ్రతులు, అలుబ్ధులు, దానశీలురు అను నేడుగురిచే ధాత్రి ధరింపఁబడుచున్నది. భూమిని, లోకస్థితిని, అవిహతముగ రక్షించువారిలో వేదములు ప్రమాణము లయినవి. అవి భారతీయ సంస్కృతి వల్లరికి మూలకందములు. వేదశబ్దము జ్ఞానార్థకమైన "విద్" ధాతువునుండి వ్యుత్పన్నమయినది. దేనివలన లోకము ధర్మాధర్మములను తెలిసికొనుచున్నదో అది వేదము. దానికి శ్రుతి, ఆమ్నాయము, ఛందస్సు, స్వాధ్యాయము అను నామాంతరములు కలవు. ధర్మాధర్మములు దానివలన వినఁబడుచున్నవి గావున అది శ్రుతి అనఁబడినది. పారంపర్యముగా అభ్యసింపఁబడునది ఆమ్నాయము. అధ్యయనము లేక అధ్యాయము-స్వకీయ శాఖాధ్యాయము. "మంత్ర బ్రాహ్మణాత్మకో హి వేదః" అని అపస్తంబ పరిభాషాదులలో వేదలక్షణము చెప్పఁబడినది. దానిని బట్టి మంత్రరూపమైన సంహితకును, దానికి వ్యాఖ్యాన రూపమైన బ్రాహ్మణమునకును రెండింటికిని కలిపియే వేద సంజ్ఞ ఉచితమని చెప్పవచ్చును. ఇతర వేదములలో మంత్ర బ్రాహ్మణములు వేర్వేరుగా నుండును. యజుర్వేదమున అట్లు కాక మంత్ర బ్రాహ్మణములు రెండును పరస్పర మిశ్రితములై ఉండుటచే పై లక్షణము యజుర్వేదము ననుసరించియే పుట్టినదని పలువురి అభిప్రాయము. వేరుగా నున్న బ్రాహ్మణారణ్యకములందు కూడ మంత్రములతో బ్రాహ్మణము కలసియున్నది. మంత్ర బ్రాహ్మణాత్మకమైన ఈ వేదము మొదట ఒక్కటిగానే ఉన్నట్లు "యజుస్తస్మాదజాయత యద్వై యజ్ఞస్య సామ్నా యజుషా యజుర్వేదో వాయోః తస్య యజురేవ శిరః ఋగ్ దక్షిణః పక్షః ఋచస్సామాని యజూంషి" మొదలగు ఋగాది వాక్యములు చెప్పుచున్నవి.

"తస్మాద్యజ్ఞా త్సర్వహుతః ఋచ స్సామాని జజ్ఞిరే
ఛందాగ్ంసి జజ్ఞిరే తస్మా ద్యజు స్తస్మా దజాయత."

అను ఋగ్వేద వచనమును బట్టి పరమేశ్వరుని వలన ఋక్కు లుద్భవించెననియు, పిమ్మట సామములును, తరువాత ఛందస్సులును, అనంతరము యజుర్వేదమును క్రమముగ నుద్భవించెననియు స్పష్ట మగుచున్నది. మహీదాస పండితుడు "యజుర్వేదో యజ్ఞోపయోగిత్వ సూపయోగా త్సర్వోపి వేదో యజుర్వేద ఇత్యుచ్యతే" అని వ్రాసి "ఏక ఏవ యజుర్వేదః తం చతుర్ధా వ్యకల్పయత్" అను విష్ణుపురాణోక్తిచే తన అభిప్రాయమును సమర్థించియుండెను.

సకల జగత్కారణమైన బ్రహ్మమును ప్రతిపాదించున దగుటచే వేదము బ్రహ్మ శబ్దవాచ్యము కూడ అయినది. "ఇష్ట ప్రాప్త్యనిష్ట పరిహారయో రలౌకిక ముపాయం యో గ్రంథో వేదయతి స వేదః" అనగా ఇష్ట ప్రాప్తిని అనిష్ట పరిహారమును కల్గించునట్టి అలౌకికోపాయమును బోధించు గ్రంథము వేదమని అర్థము.

ప్రత్యక్షే ణానుమిత్యా వా య స్తూపాయో న లభ్యతే,
ఏతం విదన్తి వేదేన తస్మా ద్వేదస్య వేదతా.

ప్రత్యక్షానుమాన ప్రమాణములచే లభ్యము కాని ఉపాయము వేదవాక్యములచే లభించుచుండుటచే వేదమునకు వేదత్వము కల్గినదని పై శ్లోకముయొక్క తాత్పర్యము. అనన్యబోధ్యమైన ఉపాయమును బోధించుటయే వేదముయొక్క ప్రయోజనము. ఆ ఉపాయము గ్రహించు కోరిక గలవాడు అధికారి. వేదముతో అధికారికిఁగల ఉపకార్యోపకారక భావము సంబంధము. వేదైక బోధ్యమైన ఉపాయమే వేదమునకు విషయము. ఈ నాల్గింటికిని అనుబంధ చతుష్టయ మని పేరు. "నా కిష్ట మగుఁగాక అనిష్టము కాకుండుఁగాక", అను కోరిక సర్వజనీన మైనది. అయినను ఉపనీతునికి మాత్రమే వేదాధ్యయనమునం దధికారము నియమిత మైనది. అనుపనీతులకు ఉపాయబోధ గ్రంథాంతరముల వలన కలుగునని భాగవతమున చెప్పఁబడినది. పై శ్లోకమునందలి అలౌకిక శబ్దముచే ప్రత్యక్షానుమానములు రెండును నిరస్తము లయినవి. మాలాగంధ

పనితాద్యుప భోగరూపమైన ఇష్టప్రాప్త్యుపాయమును, ఔషధసేవాది జనితరోగ నివృత్తిరూపమైన అనిష్టపరిహారోపాయ మును లౌకికములై ప్రత్యక్షసిద్ధము లగుచున్నవి. భవిష్యజ్జన్మానుభూయమాన సుఖాదిరూపమైన విశేష మలౌకికము. అది లౌకికము లయిన అనుమానాదులకు గమ్యము కాదు. జ్యోతిష్టోమాదికము ఇష్టప్రాప్తి హేతువనియు, కలంజభక్షణ నిషేధాది కము అనిష్టపరిహార హేతువనియు కేవల వేదవాక్యవలన తెలిసికొనవలసినదే కాని తదన్యమైన అనుమాన ప్రమాణ సహస్రము చేతనైనను ఎంత మహాపండితుడైనను తెలిసికొనఁజాలడు. అందుచే వేద మలౌకికోపాయ బోధ మను లక్షణమునందు అతి వ్యాప్త్యాది దోషములు కానరావు.

ఋగ్వేదము యజుర్వేదము సామవేదము అథర్వవేదము అని వేదములు నాలుగు. వానిలో మొదటి మూడింటికిని "త్రయి" అని నామము. మొట్టమొదట ఈ మూడింటికే యాగక్రియా సంబంధ ముండెను. అది కనిపెట్టి ఆథర్వణ శాఖవారు ఆ వేదమునకు కూడ యజ్ఞోపయోగిత్వము కల్గించుటకై అందు కడపటిదైన ఇరువదవ కాండమును చేర్చిరని చెప్పుదురు. అప్పటినుండియు దానికి కూడ యజ్ఞోపయోగార్హత కలిగినది. ఆనుపూర్వికముగ కర్మస్వరూపము తెలుపునది యజుర్వేద మగుటచే కర్మకాండ విషయమున దాని కధికమైన ప్రాధాన్య మేర్పడినది. అందుచేతనే దానిని భిత్తిస్థానీయముగను, ఋక్సా మాదులను చిత్రస్థానీయములుగను చెప్పుదురు. యజుర్వేదమునకు అధ్వరవేదమనియు, ఆధ్వర్యవమనియు, అధ్వర్యు వేదమనియు పేరులు గలవు "అధ్వరం యునక్తి ఇతి అధ్వరయుః" అకారము లోపించుటచే అధ్వర్యుః అయినది. ఈ శబ్దమునకు యజ్ఞమునకు నేత అని అర్థము. సాయణాచార్యుడు అధ్వర్యువేదము ఋక్సామవేదముల కుపజీవ్యమని వ్రాసి యుండెను. వేదగణనము చేయునపుడు ఋగ్వేదమునే ప్రథమముగా గణింతురు. ఇందుకు వృద్ధానువాదమును, వేదవచన మును ప్రమాణములు. యజ్ఞాంగములలో ఋక్సాధ్యములు దృఢతరములై యుండుటచే ఆ వేదమునకు ప్రాథమ్యము యుక్తమే. తైత్తిరీయమున

"యద్వై యజ్ఞస్య సామ్నా యజుషా క్రియతే
శిథిలం తత్, యదృచా తద్దృఢమ్."

అని చెప్పఁబడినది. వేదాంతర్గతములయిన బ్రాహ్మణము లన్నియు తమ వాక్కులందు పాఠకులకు దృఢమైన విశ్వా సము కల్గించుటకై "తదేతదృచా అభ్యుక్తమ్" అని తెల్పుచున్నవి. యజుర్వేదాంతర్గత మంత్రములలో కూడ అచ్చ టచ్చట అధ్వర్యుడు, పలుకఁదగిన ఋక్కులు పెక్కులు కలవు. సామము లన్నియు ఋగ్వేదమునే ఆశ్రయించి యుండుట జగద్విదితము. ఆథర్వణికులు కూడ తమ సంహితయందు ఋక్కులనే ఎక్కువగా వాడుచున్నారు. నారదుడు సనత్కుమారునితో "ఋగ్వేదం భగవోఽధ్యేమి యజుర్వేదం సామవేద మాథర్వణం చ" అనియు, ముండకోపనిషత్తు "ఋగ్వేదో యజుర్వేదః సామవేదో అథర్వవేదః" అనియు, నృసింహతాపనీయోపనిషత్తు "ఋగ్యజుస్సామాథర్వాణా శ్చత్వారో వేదాః సాంగాః సశా ఖా శ్చత్వారః పాదా భవన్తి" అనియు చెప్పుటచే ఋగ్వేద ప్రాథమ్యము నిర్వివాద మగుచున్నది. కాని వేదార్థజ్ఞానమునకు యజ్ఞానుష్ఠానమే ప్రయోజన మగుటచేతను, యజ్ఞమునందు యజుర్వేదము ప్రధానస్థానము నాక్రమించుటచేతను యజుర్వేద మునకే మొదట వ్యాఖ్యానము వ్రాయవలసి వచ్చినది. 'ఋచాం త్వః పోష మాస్తే' అను ఋగ్వేదము నందలి మంత్రము కూడ యజుర్వేదమునకు గల ప్రాధాన్యమును వక్కాణించుచున్నది. యాస్కుడు "మంత్రా మననాత్, ఛన్దాంసి ఛాదనాత్, స్తోమః స్తవనాత్, యజు ర్యజతేః" అని నిరుక్తమున యజుర్వేదమునకు యాగనిష్పాదకత్వ ద్యోతకమైన నిర్వచనము గావించినాడు. యాగస్వరూపమును నిరూపించునది యజుర్వేదమే. అన్యములయిన ఋక్సామములు తదుపజీవకములయి యాగాంగములయిన శస్త్ర స్తోత్రములను పూరించును.

యజుస్ అను శబ్దము దేవపూజార్థకమైన 'యజ్' అను ధాతువునుండి ఏర్పడినది. అందుచేతనే యజ్ఞ యాగాది కర్మ కలాపము వివరించు వేదమునకు యజుర్వేద మను సార్థక నామము కల్గినది. పూజాసమయమున దేవతలకు హవిస్సును సమర్పించునపుడు వినియోగించు మంత్రమును యజు స్సందురు. పాద బద్ధము లయిన మంత్రములు ఋక్కులు. గాన సహితము లయినవి సామములు. వృత్త గీతివర్జితములై ప్రశ్లిష్టపఠితము లగునవి యజుస్సులు. శబరస్వామి "యా న గీతి ర్న చ పాదబద్ధం తత్ప్రశ్లిష్ట పఠితం యజుః" అనియు, మాధవాచార్యులు "వృత్తగీతి వర్జితత్వేన ప్రశ్లిష్టమంత్రా పఠితా యజూంషి" అనియు యజుర్మంత్రములను నిర్వచించి యుండిరి. ప్రశ్లిష్ట మనగా యుక్తి యుక్తములు, సమ్యగ్రథితము లనని అర్థము. "యాజ్ఞికానాం సమాఖ్యానం లక్షణ దోషవర్జిత మ్మను మఱియొక నిర్వచన మున్నది. యాజ్ఞికు" లే మంత్ర

ములను ఋక్కులనియు, వేనిని యజుర్మంత్రము లనియు, వేనిని సామ మంత్రము లనియు వ్యవహరింతురో అవి ఋగాది మంత్రములని ఈ నిర్వచనముయొక్క అభిప్రాయము. ఈ నిర్వచనము శిష్టాచారమున కెక్కువ ప్రాధాన్య మొసగుచున్నది. ఋక్సామ యజుస్సుల కన్నిటికిని మొత్తముగా మంత్ర మనెడి సంజ్ఞ మొదట వాడుకలో నుండెనని తైత్తిరీయ బ్రాహ్మణము చెప్పుచున్నది.

వేదము లనంతము లను సంప్రదాయ మున్నది. విష్ణుపురాణము "ఆద్యో వేద శ్చతుష్పాదః శతసాహస్ర సమ్మితః" అని చెప్పుచున్నది. మొదట వేద మంతయు నేకరాశిగా నుండెననియు, దానిని వ్యాసుఁడు ఋగ్యజుస్సామాథర్వణము లను నాలుగు వేదములుగా విభజించెననియు సర్వవిదితమే. అవి చతుష్పాదములనియు శత సహస్ర సంఖ్యాకములైన అవాంతర భేదములతో కూడి యుండెననియు పై శ్లోకము వలననే తెలియుచున్నది. సామశాఖలు వేయి యనియు, యజుశ్శాఖలు నూటొక్కటి యనియు, బహ్వృచము లిరువదియొకటనియు మఱియొక వచనము నుడువుచున్నది. అనంతశబ్దమున కనేక మను నర్థము చెప్పుకొన్నచో వైరుధ్య మేదియు నుండదు. అనేకములైన శాఖ లల్ప సామర్థ్యముగల ద్వాపర కలియుగము లందలి జను లవగతము చేసికొనుట క్లేశకరమని వ్యాసుడు పరిమితములైన వేదశాఖలనే విభజించెను. ఈ శాఖలలో గూడ నైదారు శాఖలు మాత్రమే లభ్య మగుచున్నవి. వేదములను గ్రంథరూపమున ముద్రించినంత మాత్రమున నవి సజీవములై యుండఁజాలవు. "బ్రహ్మాయుష్మ త్తద్బ్రాహ్మణై రాయుష్మ" త్తను వేదవాక్యము బ్రాహ్మణుల నిత్యాధ్యయనము చేతనే అది సజీవ మగునని తెల్పుచున్నది. యుగాంతమున నంతర్హితములైన వేదములను బ్రహ్మానుజ్ఞాతులైన మహర్షులు తపో మహిమచే మరల పొందిరి.

> యుగాంతేఽన్తర్హితాన్ వేదాన్ సేతిహాసాన్ మహర్షయః,
> తపసా లేభిరే పూర్వ మనుజ్ఞాతా స్స్వయంభువా.

(భారతము) బ్రహ్మముఖ నిస్సృతములైన వానిని సమాధి నిష్ఠులైన ఋషులు వినుటచే నవి శ్రుతులైనవి. క్రాంతదృష్టియు మహామహిమ సంపన్నుఁడునగు మహనీయుడు ఋషి యనఁబడును. అనగా సాధారణ మానవుని కగోచరములగు మంత్రమయ వాక్కులను ఋషి దర్శింపఁగలఁడు. అందుచేతనే వేదవాక్కులను దర్శించిన ఋషులను మంత్ర ద్రష్ట లందురు.

ఆస్తిక నాస్తిక శబ్దార్థ విచారమున వ్యవహారమునకును స్మృతి కర్తల అభిప్రాయమునకును కించి ద్భేదము కానవచ్చు చున్నది. ఈశ్వరుని అస్తిత్వము నంగీకరించువా రాస్తికు లనియు అంగీకరింపనివారు నాస్తికు లనియు చెప్పుట వ్యవహార ప్రసిద్ధము. కాని ఈశ్వరు నంగీకరించు జైన బౌద్ధాదులు నాస్తికులుగను, అంగీకరింపనివా రైనను సాంఖ్యమీమాంసకు లాస్తికులుగను పరిగణింపఁ బడుచుండుట కలదు. అందుచే మన్వాదులు "నాస్తికో వేదనిందకః" అని వేదప్రామాణ్యము నంగీకరించువా రాస్తికు లనియు, నంగీకరింపనివారు నాస్తికు లనియు చెప్పియుండిరి. దీనిని బట్టి వేదములకున్న ప్రాధాన్యము తెల్ల మగుచున్నది.

ఆస్తిక మతములన్నియు వేద మనాది యనియు, అపౌరుషేయ మనియు అంగీకరించుచున్నవి. కాని నిత్యత్వ విషయమున వానిలో అభిప్రాయ భేదములు కలవు. పూర్వమీమాంసా మతమున వేదము అకర్తృకము; అత్యంత నిత్యము; అపౌరుషేయము. ఉత్తర మీమాంసా మతమున వేద మపౌరుషేయ మైనను వ్యవహారనిత్యము; పరమేశ్వర కర్తృకము. వేదమునకు కర్త లేదని జైమిని మతము. బాదరాయణుని మతము ననుసరించి వేదమున కీశ్వరుఁడు కర్త. దీనినిబట్టి వేద మీశ్వరకార్యమని ఉత్తర మీమాంసా మతము భావించుచున్నట్లు అంగీకరింప వచ్చును. బాదరాయణుడు "శాస్త్రయోనిత్వాత్" అను సూత్రములో వేదములకు బ్రహ్మకారణత్వమును వ్యక్తము చేసి యున్నాడు. బ్రహ్మకార్యమైయున్న వేదము కాళిదాసాదుల వాక్యములవలె, పౌరుషేయములు కావలెను కదా అను శంక కలుగుచుండ "వాచా విరూపనిత్యయా" అని శ్రుతియు, "అనాదినిధనా నిత్యా వాగుత్సృష్టా స్వయంభువా" అని స్మృతియు ఆ శంకను పరిహరించుచున్నవి. "నిత్యా, అనాది నిధనా" అను విశేషణములు వేద మపౌరుషేయ మనియు నిత్యమనియు తెల్పుచున్నవి. బాదరాయణుఁడు దేవతాధికరణములో "అత ఏవ చ నిత్యత్వ" మ్మని వేదనిత్యత్వమును ప్రకటించియుండెను. దేవాదిరూపముతో నియతాకృతి గల జగత్తు వేద శబ్దమునుండి పుట్టినది కావున వేదమునకు నిత్యత్వము సిద్ధమని దీని అర్థము. సృష్టికి తరువాతను లయమునకు పూర్వమును దాని కుత్పత్తి లయములు లేకపోవుటచేతను, కాలాకాశాదులవలె వేదము కూడ బ్రహ్మజన్యమని వేదము చెప్పుటచేతను

అది వ్యవహార నిత్యమైనదే కాని వ్యాసకాళిదాసాదుల వాక్యమువలె రుషేయము కాదు. పౌరుషేయ వాక్యము సైత మువాయ బోధకమే యైనను పురుషబుద్ధి భ్రాంతినిమ్నము కావచ్చును, కావున నది ప్రమాణాంతరము నపేక్షించును. బ్రహ్మ భ్రాంతి దూషితుఁడు కాఁడు. అందుచే తజ్జన్యమైన వేదము ప్రమాణాంతరము నపేక్షింపదు. "భరద్వాజో హ త్రిభిః....అనంతా వై వేదాః" అను నుపాఖ్యానము చెప్పిన విధమున భగవత్తత్త్వమును బోధించుటచేతను, ఆప్తోచ్చరితత్వాది ప్రామాణ్య కారణము నపేక్షింపకపోవుటచేతను వేదములు స్వతః ప్రమాణము లనియు నపౌరుషేయము లనియు శాస్త్రకారులు నిర్ణయించిరి. రామాయణ భారతాదులకు వ్యాసవాల్మీక్యాదులు కర్తలుగా చెప్పఁబడు చున్నట్లే కాఠక తైత్తిరీయాది శాఖలకు కఠ తిత్తిర్యాది పురుషులు కర్తలుగా చెప్పఁబడుచున్నారనియు, జనన మరణాదులకు వశులగుటచే ననిత్యులగు బబరాది పురుషులు వేదము నందు పేర్కొనఁబడి యుండుటచే వారికి పూర్వము వేదము లేదనియు నందుచే వేదము పౌరుషేయమును అనిత్యమును అని కొందఱు వాదింతురు. వేదకర్తలే వేదద్రష్టలుగా భావింపఁబడుచున్నారనియు ఋషులే వేదములను నిర్మించిరనియు పాశ్చాత్యుల అభిప్రాయము. వేదరూప శబ్దము కఠ తిత్తిర్యాది పురుషుల కంటె ప్రాచీనతర మనియు, అది నిత్య మనియు, బబరాది పురుష వాచక శబ్దములు శబ్దానుకరణములు కాని అనిత్య మనుష్య వాచకములు కావనియు, కఠ తిత్తిర్యాదు లా యా శాఖలను లోకమున ప్రవర్తింపఁజేసినవారు కాని తత్తత్కర్తలు కారనియు జైమిన్యాదుల సిద్ధాంతము. పరమేశ్వర నిర్మిత మని చెప్పఁబడినను మానవ రచితము కాదు కావున వేదము అపౌరుషేయమే యనఁదగును. పౌరుషేయత్వమునకు "సజాతీయో చ్చారణానపేక్షోచ్చారణ విషయత్వ" మని నిర్వచనము. అట్టి పౌరుషేయత్వము భారతాదులకు కలదు కాని వేదమునకు లేదు. "సర్గాద్యకాలే పరమేశ్వరః పూర్వసర్గసిద్ధ వేదానుపూర్వీ సమానానుపూర్వికం వేదం విరచితవాన్ న తు తద్విజాతీయమితి" ధర్మ రాజాధ్వరీంద్రుఁడు తెల్పుచున్నాఁడు. దీనిని బట్టి ఈశ్వర కర్తృకమైన వేదము నపౌరుషేయమే యని చెప్పవచ్చును. "యస్య నిశ్శ్వసితం వేదాః" అను వాక్యము కూడ దీనిని సమర్థించుచున్నది.

వేదముల పౌరుషేయా పౌరుషే య త్వములను గూర్చి శాస్త్రచర్చ లనేకములు కలవు. సాయణాచార్యుల తైత్తిరీ యారణ్యకభాష్యమున "వేదములకు కర్తలు లేరు. అయినను కల్పాదియం దీశ్వరానుగ్రహమున వేదములను బొందినవారు మంత్రకృత్తు లనియు, వారే సంప్రదాయ ప్రవృత్తిచే మంత్రములను పాలించి మంత్రపతులని చెప్పఁబడుచున్నారనియు" తమ అభిప్రాయము ప్రకటించియున్నారు. దీనిని బట్టి ఋషులు మంత్ర ద్రష్టలనియు, వేదము లపౌరుషేయము లనియు వారి నిర్ణయము స్పష్టపడుచున్నది. అయినను నాస్తికులైన చార్వాకాదులు వేదము పురుష ప్రణీత మనియే వాదించుచున్నారు. కాని వేదములకంటె ప్రాచీనతరమైన సారస్వతము మఱేభాషయందును కానవచ్చుట లేదు. వానికి కర్తయెవ్వరో తెలియదు. అవి అనాది సిద్ధములై శ్రుతుల రూపమున వెలయుచున్నవి. ఎప్పుడైన భగవంతుఁడు తన దివ్యజ్ఞాన సంపదను మానవునకు ప్రసాదించెనని విశ్వసించినచో దానిని వేదర్షుల భావవీథిని ప్రకటించె ననుటలో ననత్యము లేదు. వైదికవిజ్ఞాన మనంతమును బహుముఖము నైనది. అది లోకమున నెవ్వ డెట్లు ప్రవర్తింపఁజేయబడినదో తెలియదు. అది అనాది యనియు ఛందోరూపము నొందిన దాని ప్రవృత్తి కీశ్వరప్రేరణమే కారణ మనియు చెప్పనగును. పరమ తపోనిష్ఠాగరిష్ఠులగు మహర్షులు వేదమంత్రము లను దర్శించిరి. అవి అపౌరుషేయము లను విశ్వాసము భారతదేశమున చిరప్రరూఢమై యున్నది. ఇంతకంటె నేమియు నీ విషయమున నిశ్చితముగా చెప్పఁజాలము. వేదములు సర్వవిజ్ఞానమునకును ఆకరములు. ధర్మాధర్మ నిరూపణమే దానికి ప్రధాన ప్రమేయమైనను, ప్రాసంగికముగా షడంగములకును, షడ్దర్శనములకును వివిధ కళలకును సంబంధించిన విషయము లందు వివరింపఁబడినవి. కావుననే జగద్గురు శంకరాచార్యులు బ్రహ్మసూత్ర భాష్యమున శాస్త్రయోనిత్వాధికరణములో ఋగ్యజుస్సామాథర్వ రూపమగు వేదరాశి అనేక విద్యాస్థానోపబృంహిత మనియు, దేవ తిర్యఙ్మనుష్య వర్ణాశ్రమాది ప్రవిభాగ హేతు వనియు, సర్వార్థావద్యోతక మనియు, సర్వజ్ఞ కల్పమనియు ప్రశంసించి యున్నారు.

> చాతుర్వర్ణ్యం త్రయో లోకాః
> చత్వార శ్చాశ్రమాః పృథక్,
> భూతం భవత్ భవిష్యచ్చ
> సర్వ వేదా త్ప్రసిధ్యతి."

అను మనుస్మృతి యందలి శ్లోకము నాలుగు వర్ణములకును, నాలుగు ఆశ్రమములకును, త్రిభువనములకును, త్రికాలములకును, సంబంధించిన సమస్త విషయములను వేదముద్వారా గ్రహింపవచ్చునని తెల్పుచున్నది. ఈ విధముగ

సకలాభ్యుదయ నిఃశ్రేయస సాధనమై యుండుటచేతనే "స్వాధ్యాయో నిషేవితవ్యో ఒధ్యేతవ్యః" అను వచనము వేదాధ్యయనమవశ్య కర్తవ్య మని విధించుచున్నది. వేదాధ్యయన మింతటి ఆవశ్యకతను కల్గియుండుటచేతనే తత్పఠనమునకు ధర్మశాస్త్రము ద్వాదశ సంవత్సర పరిమితమైన బ్రహ్మచర్యాశ్రమమును విధించుచున్నది. ఉపనయన సంస్కారమునకు కూడ ప్రధానోద్దేశమదియే. యుక్తవయస్సు వచ్చిన బాలురను, వేద వేదాంగాది విద్య లభ్యసించుటకై గురుకులమునకు పంపుటయే ఉపనయన శబ్దమున కర్థము.

వేదముల కాలము విషయమున వాదోపవాదము లనేకము లున్నవి. పాశ్చాత్యులు వాని నెంత ముందుకు తే యత్నించిరో ప్రాచ్యపండితులు వానినంత వెనుకకు నెట్ట ప్రయత్నించిరి. మాక్సుముల్లరు పండితుడు బహుకాలము ఋగ్వేదమును గూర్చి పరిశోధన సల్పి వేదకాలము క్రీ.పూ. 1200లకు దాటదను నభిప్రాయమును వెల్లడించెను. మేగ్డొనెలు వేదకాలము క్రీ.పూ. 1500 అయి యుండుననియు, విట్నీ క్రీ.పూ. 2000 కావచ్చుననియు తెల్పియుండిరి. జాకోబీ పండితు డది క్రీ.పూ. 4000కు పూర్వమైయుండునని భావించెను. వీబరు వేదకాలము నిర్ణయించుటకు యత్నించి అది కష్టసాధ్యమని విడిచివైచెను. ఇంక ప్రాచ్యపండితులలో దాసుగారు భూగర్భశాస్త్ర పరిశోధనలను బట్టి ఆర్యావర్తమున కొకప్పుడు చతుస్సముద్రములు సరిహద్దులుగా నున్నట్లు తెలియచున్నది, కావున ఆ చతుస్సముద్రము అంతరింపక పూర్వము ఋగ్వేదము పుట్టియుండునని భావించిరి. వారి అభిప్రాయము ప్రకార మది లక్షయేండ్లకు పూర్వమై యుండవచ్చును. బాలగంగాధర తిలకు గారు జ్యోతిర్గణితమును బట్టియు, గ్రీకు పారశీకాది గాథల ననుసరించియు ఖగోళజ్ఞానమును బోధించు వాక్యముల నుదాహరించుచు పాశ్చాత్యుల వాదములను ఖండించి వేదకాలము క్రీ.పూ. 6000 ప్రాంతమై యుండునని నిర్ణయించిరి. దాని నింకను పూర్వమునకుఁ గొనిపోవుటకుఁ దగిన సూచనలున్నవి. మొత్తముమీద వేదకాల మిదమిత్థ మని నిర్ణయించుట దుష్కర మగుటచే పూర్వులు వేదము లనాదులని తెల్పిరి. అనాదు లనగా నతిప్రాచీనము అని యర్థము. ఒకటి మాత్రము సత్యము. వేదములకంటె ప్రాచీనతరమైన వాఙ్మయము ప్రపంచమునందు మఱెచ్చటను కానరాదు.

పాశ్చాత్యులు కొందఱు యజుర్వేదము క్రీ.పూ. వేయి సంవత్సరముల నాటిదని తెల్పియుండిరి. అది సత్యమని నిర్ణయించుట కాధారములు లేవు. యజ్ఞములకు సంబంధించిన అర్థమును వివరించుటయందు యజుర్వేదమునకు అధిక ప్రాధాన్య ముండుటచే యజ్ఞాచరణ మారంభ మైనప్పుడే యజ్ఞార్థములైన మంత్రములతో కూడిన యజుస్సులు కూడ వెలసినవని నిశ్చయింపవచ్చును. యజుర్మంత్రములు లేకుండ యజ్ఞాచరణ మసాధ్య మగుటయే యందుకు కారణము. యజుర్వేదము భారతదేశమునం దితర వేదములకంటె నెన్నోరెట్లధికముగా పఠన పాఠనము లందున్నది. ఇదియే వేదవిహితములైన సర్వ కర్మకలాపములకు నాధారమై యున్నది. మంత్ర బ్రాహ్మణాత్మకమైన యీ వేదము తొలుత నొక్కటిగానే యున్నను ఉపనిషత్పురాణేతిహాసాదులను బట్టి యిది కృష్ణ శుక్ల భేదమున ద్వివిధమైనట్లు తెలియుచున్నది. యజుర్వేదమునకు బ్రహ్మ సంప్రదాయము, ఆదిత్య సంప్రదాయము అని రెండు సంప్రదాయము లున్నవి. అందు మొదటిది కృష్ణ యజుర్వేద మనియు, రెండవది శుక్ల యజుర్వేద మనియు శతపథ బ్రాహ్మణము తెల్పుచున్నది. ఇందుకు వైశంపాయన యాజ్ఞవల్క్యులకు సంబంధించిన యొకగాథ కూడ వినవచ్చుచున్నది. వేదవ్యాసు డేకరాశిగానున్న వేదమును నాలుగుగా విభజించి బహ్వృచ సంహితను పైలుడను శిష్యునికిని, యజుస్సంహితను వైశంపాయనునకును సామసంహితను జైమినికిని, అథర్వసంహితను సుమంతునికిని పంచియిచ్చి వానిని ప్రచారము చేయుమని యానతిచ్చెను. వారిలో వైశంపాయనునియొద్ద యజుర్వేద మభ్యసించుచుండిన చరకాదులలో వాజసని (దేవరాతుని) పుత్త్రుఁడైన యాజ్ఞవల్క్యుఁడొకడు. అత డొకనాడు గురువు మాటకెదురు చెప్పగా వైశంపాయనుఁ డాగ్రహమున నతఁడు తనయొద్ద నభ్యసించిన విద్యను విడిచివేయవలెనని యాజ్ఞాపించెను. అప్పుడు యాజ్ఞవల్క్యు డతని యొద్ద నేర్చిన విద్యనంతను కక్కివేసెను. దాని నచ్చట నున్న మునులు తిత్తిరిపక్షుల రూపమున వచ్చి భక్షించిరి. అందుచే దానికి తైత్తిరీయ మను నామ మేర్పడెను. అప్పుడు యాజ్ఞవల్క్యుఁడు సూర్యునారాధించి వైశంపాయనునికి తెలియని వేదమును తనకు బోధింపుమని ప్రార్థించెను. సూర్యు డతని భక్తిస్తుతులకు మెచ్చి వాజిరూపమున నాతనికి కొన్ని యజుస్సులను బోధించెను. అది వాజసనేయీ సంహిత యను పేర ప్రసిద్ధి నొందెను. "వాజిరూపేణ సూర్యేణ వాజేభ్యః కేసరేభ్యః సన్యస్తాః పరిత్యక్తాః (మంత్రాః). సా శాఖా వాజసనేయీ సంజ్ఞా. వాజసనః సూర్యః తత ఆగతా శాఖా" అని వాజసనేయ పరిశిష్ట భాష్యము తెల్పుచున్నది. ఈ కథ భాగవత ద్వాదశ స్కంధమున కొంచెము భిన్నముగా కనవచ్చుచున్నది. తైత్తిరీయ వాజసనేయ సంహితలలోని మంత్రభాగములు చాలవరకు సమానములుగా నుండుటచే సూర్యుడు యాజ్ఞవల్క్యునికి బోధించిన నూతన మంత్రములు లేవనియు తిత్తిరిపక్షులకు సంబంధించిన కథ అంత విశ్వసనీయము కాదనియు కొందఱి అభిప్రాయము.

మంత్ర బ్రాహ్మణాత్మకమైన యజుర్వేద పాఠము నున్నదాని నున్నట్లుగా ప్రవర్తింపఁజేసినవాడు తిత్తిరిమహర్షి. అట్లుగాక సంహితా బ్రాహ్మణములను విడఁదీసి కేవల మంత్ర బ్రాహ్మణములను ప్రవర్తింపఁజేసినవాడు వాజసనేయ మహర్షి. ఈ విధముగా యజుర్వేదమునుండి మొట్టమొదట విడిపోయిన శాఖ వాజసనేయ మగుటచే దానికి వాజసనేయ ప్రథమ శాఖ యనియు దాని నవలంబించువారు ప్రథమ శాఖీయు లనియు ప్రసిద్ధిపొందుట సంభవించినది. మంత్రబ్రాహ్మణ సంకీర్ణమై యున్న తైత్తిరీయమే ప్రాచీన పాఠమనియు, వాజసనేయము దానినుండి వేఱుపడిన తరువాతి పాఠ మనియు చరిత్రకారుల అభిప్రాయము. మఱి ప్రథమ శాఖ యని దానికి ప్రశస్తి కల్గుటకు మూల యజుర్వేదమునుండి ప్రథమమున విడివడిన శాఖ యగుటయే కారణమై యుండును. ఏలయన సంకీర్ణమై యున్నదానిని వేఱుచేయుట సహజము కాని వేఱుపడియున్న దానిని సంకీర్ణ మొనరించుట సహజము కాదు.

వాజసనేయ తైత్తిరీయ సంహితలకు శుక్ల కృష్ణ నామములు కల్గుటకు పలువురు పలువిధములైన కారణములు చెప్పు చున్నారు. మధ్యాహ్నకాలమున శుక్ల వర్ణుఁడైన సూర్యునిచే నొసంగఁబడిన దగుటచే నది శుక్ల యజుస్సైనదని కొందఱి అభిప్రాయము. వేదోపక్రమణమున చతుర్దశీ ప్రయుక్త పౌర్ణమాసిని గ్రహించునది శుక్లయజుస్సనియు, ప్రతిపత్ప్రియుక్త పౌర్ణమాసిని గ్రహించునది కృష్ణయజుస్సనియు మఱికొందఱి యభిప్రాయము. కాని యీ రెండింటికంటె శుక్లయజుర్వేద పరిశిష్ట భాష్యకారుడు తెల్పినట్లు "బుద్ధిమాలిన్య హేతుత్వాత్తద్యజుః కృష్ణ మీర్యతే, వ్యవస్థిత ప్రకరణం తద్యజుశ్శుక్ల మీర్యతే" (ప్రకరణ సంకీర్ణత్వాదులచే బుద్ధి మాలిన్యకారణమైనది కృష్ణయజుస్సనియు, ప్రకరణముల వేర్పాటుచే విశద మైనది శుక్ల యజుస్సనియు చెప్పఁబడుచున్నవి) అని భావించుట యుక్తతరముగా నుండును. శుక్లకృష్ణ యజుర్వేదములను "The White Yajurveda and the Black Yajurveda" అని కొంద ఱనువదించుచు శుక్లకృష్ణములకు తెలుపు నలుపులని అర్థము చెప్పుట సమంజసము కాదని కీ. శే. మల్లాది సూర్యనారాయణ శాస్త్రిలవారి భావము.

యజుర్వేద శాఖలనుగూర్చియు, తదుత్పత్తిని గూర్చియు నిశ్చితముగ, తెల్పుగ్రంథ మేదియును లేదు. చరణ వ్యూహ మున్నది గాని అది శాఖాచరిత్రను సమగ్రముగ తెల్పుట లేదు. దాని పరిశిష్ట మొకటి భాష్య సహితముగ ముద్రితమై యున్నది గాని అదియు నిర్దుష్టము కాదు. ఇంక యజుశ్శాఖల నెఱుంగుటకు పై గ్రంథముతోపాటు ఇతరానుక్రమణికాదుల లోని వాక్యములను కూడ ఆధారముగా గ్రహింపవలెను. మొట్టమొదట 12 కృష్ణయజుశ్శాఖలును, 15 శుక్లయజుశ్శాఖలను కలసి యజుర్వేదమునకు మొత్త మిరువదియేడు శాఖ లేర్పడినవి. ఉపశాఖలతోకూడి కృష్ణయజుశ్శాఖలు 86 అయినవి. అవి యును శుక్లయజుశ్శాఖలు 15 ను కలసి మొత్తము 101 అగుచున్నవి. పతంజలి "ఏకశత మధ్వర్యుశాఖాః" అని చెప్పి యుండెను. "యజుర్వేదతరో రాసన్ శాఖా ఏకోత్తరం శతమ్" అను నర్వాచీన వచనములు కూడ దానిని సమర్థించుచున్నవి. సంహితాపాఠ భేదమును బట్టి ఏర్పడిన రెండు శాఖలును తప్ప మిగిలిన వన్నియు ప్రవర్తకుల నామముల బట్టి ఏర్పడినట్లే కొన్ని బ్రాహ్మణారణ్యక సూత్ర కల్పాదుల భేదములను బట్టియు, నాచారభేదములను బట్టియు కల్గినని. అందుచే నతిప్రసిద్ధు లయిన ప్రవర్తకుల నామములు మాత్రమే గ్రంథములందు కానవచ్చుచున్నవి. 86 కృష్ణయజుశ్శాఖలలో పంద్రెండింటిని చరక శాఖలందురు. కాశికావృత్తిలో "చరక ఇతి వైశంపాయనస్యాఖ్యా" అని ఉండుటచే కృష్ణయజుర్వేదము ప్రచారము చేసిన వైశంపాయనునికే చరకుడను పేరున్నట్లు తెలియుచున్నది. చరక శాఖలు పంద్రెండింటిలో నొకటి యయిన మైత్రాయణీయ శాఖను ప్రాచీనులు కాలాపశాఖగా వ్యవహరించిరి. ఇందు మరల సప్త భేదము లున్నవి. తైత్తిరీయశాఖలో ఔఖేయ, కాండికేయ భేదములు రెండు కలవు. కాండికేయశాఖలో మరల 5 భేదము లున్నవి. ఇవి అన్నియు ఇపుడు లభింపవు. కృష్ణయజుశ్శాఖను ప్రవర్తింపఁజేసినవారిలో ముఖ్యుడయిన తిత్తిరి ముని పేరనే అది తైత్తిరీయ మైనది. శుక్లయజుర్వేద ప్రవర్తకులలో ముఖ్యుడు వాజసని పుత్రుడు యాజ్ఞవల్క్యుడు. వాజసనేయశాఖ యను పేరు అతనిని బట్టి వచ్చినది. దానిని తరువాత ప్రచారము చేసిన వారిలో ప్రధానుడు కాణ్వు డగుటచే దానికి కాణ్వశాఖ అనియు పేరు కలిగినది.

యజుర్వేదమునందు ఋగ్వేదమునందలి ఋక్కులు కొన్ని కన్పడుచుండుటచే అది ఋగ్వేదము కంటె అర్వాచీన మగుట నిస్సందేహము. భారతీయ విద్వాంసులు అది క్రీ. పూ. 1500 ప్రాంత మనియే భావింతురు. యజుర్వేదము సరస్వతీ, దృషద్వతీ, శతద్రూ నదీతీరములందు వెలసి తరువాత క్రమముగ ఉత్తర భారతమం దంతటను, దక్షిణ భారతమందును వ్యాపించినది. శుక్లయజుర్వేద ముత్తరమునను, కృష్ణయజుర్వేదము దక్షిణమునను ఎక్కువగా ప్రచారము పొందినవి. పతంజలి మహాభాష్యమున కఠ కాలాపశాఖలు రెండును భారతదేశము నందంతటను వ్యాప్తి పొందినట్లు చెప్పఁబడినది. కాలక్రమమున కొన్ని శాఖ లంతరించినవి. ప్రస్తుత మాంధ్రదేశమున యజుర్వేదము అధిక ప్రచారము పొందియున్నది.

తైత్తిరీయ సంహిత, తైత్తిరీయ బ్రాహ్మణము తైత్తిరీయారణ్యకము అను భాగములు మూడింటికిని తైత్తిరీయ విశేషణము వేర్వేరుగ వ్యవహరింపఁబడుచున్నను మొత్తమున కంతకును కృష్ణయజుర్వేదమను పేరే వ్యవహృత మగుచున్నది. కాని తైత్తిరీయవేద మను వ్యవహార మెచ్చటను కనఁబడకపోవుటచే బ్రాహ్మణము పుట్టక మున్నే యజుస్సంహిత తిత్తిరి మహర్షి ప్రవర్తగ తైత్తిరీయ సంజ్ఞ పొందినట్లు తెలియుచున్నది. పాణిని యాజుష ప్రవర్తకుల పేరులను పేర్కొనుచు మొట్ట మొదట తిత్తిరి మహర్షిని, తరువాత వరతంతుని పిమ్మట ఉఖ కాండికేయులను పేర్కొనియున్నాడు. ఈ క్రమము వైదిక సంప్రదాయ సిద్ధ మనుటకు చరణవ్యూహ కాండానుక్రమణిక లిచ్చిన అర్షానుక్రమము నిదర్శన మగుచున్నది. కఠముని ప్రోక్తము లని చెప్పఁబడు 8 చిన్న భాగములు కఠసంహిత అను ప్రత్యేక నామమును పొందినవి. తైత్తిరీయమునకు కఠశాఖ అనుబంధ మగుటచేతనే ఆ 8 భాగములును 5 ప్రపాఠకములుగ బ్రాహ్మణారణ్యకములందు ప్రవేశించినవి. కఠశాఖ తైత్తిరీయమునకు లోఁబడినది కానిచో ఆ భాగము లిందు చేరుటకు తైత్తిరీయులు కాని, కఠులు కాని అంగీకరించి ఉండెడివారు కారు. కృష్ణ యజుర్వేదమునకు సంబంధించిన కఠాది శాఖలన్నియు తైత్తిరీయమునకు రూపాంతరములే కాని భిన్నములు కావు. అట్లే కాణ్వమాధ్యందినాది శాఖ లన్నియు వాజసనేయమునకు రూపాంతరములే కాని అన్యములు కావు.

తైత్తిరీయ సంహిత కాండములు లేక అష్టకములు అను ప్రధాన భాగములుగ విభజింపఁబడినది. మరల ఒక్కొక్క అష్టకము ప్రపాఠకములుగను, ఒక్కొక్క ప్రపాఠకము అనువాకములుగను, ఒక్కొక్క అనువాకము పంచాశత్తులుగను విభజింపబడినవి. ప్రపాఠకమునకు ప్రశ్నమనియు, పంచాశత్తులకు కండిక లనియు నామాంతరములు. పంచాశత్తు నుండియే 'పణ్ణాసా' అను ప్రాకృతరూపమును, పనస అను తెనుగు రూపమును ఏర్పడినవి. పంచాశత్ అనగా ఏబది పదముల భాగము. తైత్తిరీయ సంహితయందు ఏడు అష్టకములు 'నలువదినాలుగు ప్రశ్నలు, ఆఱువందల ఏబదిఒక్క అనువాకములు, రెండువేల ఒకవంద తొంబదిఎనిమిది పంచాశత్తులు, పందొమ్మిదివేల రెండువందల పదములు' రెండులక్షల ఏబదిమూడు వేల ఎనిమిదివందల అఱువది ఎనిమిది అక్షరములును కలవు. శాఖా వాక్యముల సంఖ్య పందొమ్మిది వేల నాలుగువందల ఎనిమిది. తైత్తిరీయ బ్రాహ్మణమున 3 అష్టకములు 28 ప్రశ్నలు 338 అనువాకములు ఉన్నవి. ఆరణ్యకమున 10 ప్రశ్నలు 218 అనువాకములు ఉన్నవి. కృష్ణయజుర్వేదమునందలి మొత్తము ప్రశ్నలలో పైని పేర్కొనబడిన 44 ప్రశ్నలు సంహితానామమున వ్యవహృతము లగుచున్నను, అవి యన్నియు మంత్రములు కావు. వానిలో మంత్రమునకు వ్యాఖ్యాన రూపమున బ్రాహ్మణము కూడ కలిసియున్నది. అట్లే బ్రాహ్మణమని చెప్పఁబడు 3 కాండములందును కేవలము బ్రాహ్మణమే కాక మంత్రభాగము కూడ కలదు. ఆ విధముగనే ఆరణ్యకమునందు సహితము కొంత మంత్రము కొంత బ్రాహ్మణము కలసి ఉన్నవి. ఈ సంహితా బ్రాహ్మణారణ్యకములు ఆ యా క్రతు విశేషములందును, వ్రతాదులయందును వినియోగింపఁబడుచున్నను, వినియోగానుగుణ ముగ మంత్రక్రమము కనవచ్చుటలేదు. ఈ మూడింటిలోను గల మంత్రబ్రాహ్మణములు 52 కాండములుగా విభజింపఁబడినవి. (కాండానుక్రమణిక) అందుచే ఈ కాండములు ఆ యా ఋషులు దర్శించిన వేదభాగముల సమూహములని ఎఱుగవలెను. ఈ కాండములలో ప్రాజాపత్యకాండములు తొమ్మిది. సౌమ్యకాండములు తొమ్మిది, ఆగ్నేయములు ఏడు, వైశ్వదేవ కాండములు పదునాఱు, ఉపనిషత్కాండములు మూడు, కాఠకము లెనిమిది. ఈ 52 కాండములు కాక 2 ప్రశ్నలును, కొన్ని వైశ్వదేవ మంత్రములును ఏకాగ్ని కాండమని పిలువఁబడుచున్నవి.

కృష్ణయజుర్వేదమునందు యాగము ప్రధాన విషయము. అది ఏకాహము, అహీనము, సత్రము, అని 3 విధములు. ఏకాహములు ఒక్క దినములోనే సమాప్తము లగును. అందు జ్యోతిష్టోమ భేదము లయిన అగ్నిష్టోమము, అత్యగ్ని, ఉక్థ్యము, షోడశి, అతిరాత్రము, వాజపేయము, అప్తోర్యామము, మొదలగునవి ప్రకృతి యాగములు. 2 మొదలుకొని 12 రోజులవరకు జరుగు సుత్యలు వికృతి యాగములు. పౌండరీకము, 12 సుత్యలతో కూడియుండును. అది సత్రయాగమునకు ప్రకృతి. సత్రయాగము 12 రోజులు మొదలు కొన్ని సంవత్సరముల వఱకు జరుగును. భారతాది గ్రంథములలో సత్రయాగము సంగతి మనము వినుచుందుము. కర్మ జ్ఞాన భేదమున కాండద్వయాత్మకముగానున్న కృష్ణయజుర్వేదమునం దీ భాగము కర్మకాండ మనఁబడును. ఇందు నిత్య కర్మలు, నైమిత్తిక కర్మలు, కామ్యకర్మలు, నిషిద్ధకర్మలు ప్రతిపాదింపఁబడును. నిరపేక్షము లయిన దర్శపూర్ణమాసేష్టులు మొదటి వగుటచేతను ఋక్సామములందు చెప్పఁబడక యజుర్వేదమునందు మాత్రమే చెప్పఁబడుటచేతను కర్మవిషయమున యజుర్వేదము భిత్తిస్థానీయ మగుచున్నది. దీనియందు కొన్ని ఋక్కులు, సామములు కూడ నున్నను యజుస్సులే అధికముగా నుండుటచే దీనికి యజుర్వేద మను పేరు వచ్చినది. ఇందలి దర్శపూర్ణమాసేష్టి మంత్రములు మూడు విధములు — ఆధ్వర్యములు, యాజమానములు, హౌత్రములు. యజ్ఞమందు అధ్వర్యుఁడు పఠించువానికి ఆధ్వర్యము లనియు, యజమానుడు ప్రకటించువానికి యాజమానము లనియు, హోత యనెడి ఋత్విక్కు పఠించువానికి హౌత్రము లనియు పేర్లు.

కృష్ణయజుర్వేదము విధి, అర్థవాదము, మంత్రము, అని 3 విధములు. విధులు చోదనా రూపములు. అర్థవాదములు స్తుతి రూపములు. మంత్రములు అనుష్ఠేయార్థ ప్రకాశకములు. ఇట్లు మూడు విధములై యున్న యిందలి యజుస్సులు కొన్ని ఋక్సామములందు కనఁబడుచున్నట్లే అందలి ఋక్సామములు కొన్ని యజుర్వేదమునందును కానఁబడుచున్నవి. ఇట్లు ఋక్కులతో యజుస్సామములు సంకీర్ణములై యున్నను, ఋక్కులు ఋగ్వేదమునుండియు, సామములు సామవేదమునుండియు, వచ్చి యిందు ప్రవేశించినవని సంప్రదాయజ్ఞు లంగీకరింపరు. అందుచేతనే వృత్తబద్ధములయిన ఋక్కులు మంత్రము లనియు, గీతిసహితములు సామము లనియు, వృత్తగీతి వర్జితములు యజుస్సు లనియు ఇందలి మంత్రములకు లక్షణ మేర్పడినది. అట్టివానికి సాయణాచార్యులు ఉదాహరణములు కూడ చూపియుండెను. ఋగ్వేద సూక్తములు కొన్ని యాజ్ఞికులచే యజ్ఞములందు వినియోగింపబడుచున్నను, వివిధ దేవతా స్తుతిరూపములుగా నున్న వానికి పూర్వోత్తర సంబంధము కనఁబడదు. యజుర్వేదమునందలి మంత్రము లట్లు కాక ఒక్కొక్క ప్రధాన విషయమున సమన్వయైక్యమును, పూర్వోత్తర సంబంధమును, కలిగి అఖండమైన ఏకాకారముతో కనఁబడును. వైదిక ప్రపంచమున ఇతర వేదములకు లేని మహత్త్వము యజుర్వేదమున కుండుట కిదియే కారణము. యజుర్వేదమునకు ధనుర్వేద ముపవేద మని చెప్పుదురు. అందు ముక్తకములు, అముక్తకములు, ముక్తకాముక్తకములు, యంత్రముక్తములు, అను 4 విధములయిన ఆయుధములు వర్ణింపఁబడినవి. బ్రహ్మాస్త్రము, పాశుపతాస్త్రము మొదలయిన అస్త్రముల ప్రయోగోపసంహారములు కూడ అందు వివరింపఁబడినవని చెప్పుదురు. అధ్యయనము కాని అభ్యాసము కాని లేని కారణమున ధనుర్వేదము నామమాత్రావశిష్టమై పోయినది.

కృష్ణయజుర్వేద మంత్రములను దర్శించిన మహనీయులు పలువు రున్నారు. యాస్కుడు నిరుక్తమున "ఋషిర్దర్శనా" త్తని ఋషిత్వమునకు నిర్వచనము చెప్పియుండెను. యజుర్వేద మంత్రద్రష్టలలో ప్రజాపతి (220), గోతముడు (80), దీర్ఘతముడు (67), పరమేష్ఠి (60), ఆత్రేయుఁడు (57), వామదేవుడు (55), వశిష్ఠుడు (53), మేధాతిథి (47), మధుచ్ఛందుడు (47), నారాయణుడు (45), కుత్సుడు (45), విశ్వామిత్రుడు (35), వరుణుడు (30), అంగిరసుడు మున్నగువారు కలరు. కృష్ణయజుర్వేదమున నూఱు మందికి పైగా, దేవతల స్వరూప స్వభావ సామర్థ్యములు వివరింపఁబడినవి. వానిలో అగ్ని ఇంద్రుడు, సవిత, ప్రజాపతి, విశ్వేదేవులు, విద్వాంసులు, సూర్యుడు, సోముడు, వాయువు, రుద్రుడు, విష్ణువు, పితరులు మున్నగువారు ప్రధానులు.

యజుర్వేద స్థితములగు ఋక్కులకు ఋగ్వేదమునందలి వానివలె గాయత్రి, త్రిష్టుప్పు, అనుష్టుప్పు, మున్నగు ఛందస్సులు కలవు. కాని యజుస్సులకు మాత్రము ఛందస్సులు లేవు. అక్షర మాత్రా సంఖ్య ననుసరించి యజుస్సులకు కూడ ఛందస్సు కల్పించుటకు యత్నింపరాదా? అన్నచో బ్రాహ్మణ మట్టి విషయమును నిషేధించియున్నది. భాష్యకర్తలు కూడ యజుస్సులకు ఛందఃకల్పనము అశక్యమని తెలిపియున్నారు. వర్ణానుపూర్వియు, స్వరమును దానికి జీవాతువులు. యజుర్మంత్రములందలి స్వరకల్పనము రసవత్తరమై వీనుల విందుకొల్పుచుండును. వేద మింతకాలము చెక్కు చెదరకుండ నిల్చి ఉండుటకు స్వర వర్ణానుపూర్వులే హేతువులు.

మంత్రో హీనః స్వరతో వర్ణతో వా
మిథ్యాప్రయుక్తో న తదర్థ మాహ,
స వాగ్వజ్రో యజమానం హినస్తి
యథేంద్రశత్రుః స్వరతోఽపరాధాత్.

అను శ్లోకము మంత్రోచ్చారణమున స్వర వర్ణ విపర్యాస ముండకూడ దని నిషేధించుచున్నది. అట్టి విపర్యాసమువలన హాని కల్గుననుటకు ఇంద్ర త్వష్టల కథ నిదర్శనము అందుచేతనే వేదమును పుస్తకములను చూచి కాక, గురుముఖతః నేర్చుకొనవలెనను నియమ మేర్పడినది. వైదిక చ్ఛందస్సులు కేవలాక్షర గణానుసారులనియు, పాదాక్షరగణానుసారు లనియు రెండు రకములు. యజస్సులు కేవలాక్షరగణానుసారి చ్ఛందస్సుతో కూడినవనియు, పాదాక్షరములచే నేర్పడు ఛందములు (ఓమిత్యాదులందు) యజుర్వేదమునందు కూడ కొన్ని కలవనియు కొందరి అభిప్రాయము.

వేదోక్తమైన ధర్మము ప్రవృత్తి లక్షణము, నివృత్తి లక్షణము అని రెండు విధములు. వానినే, కర్మ జ్ఞాన భాగము అని కాని ధర్మ బ్రహ్మభాగము అని కాని చెప్పుదురు. కర్మభాగమునందు, కామ్యకర్మానుష్ఠానమును, తద్ద్వారా నిష్కామ కర్మానుష్ఠానమును చెప్పఁబడినవి. మానవ జన్మమునకు మోక్షము పరమ గమ్యము. సాత్త్విక కర్మలు చేయుచు, భగవంతునియందు

మనస్సు లగ్నము చేసి మానవుడు జీవ బ్రహ్మైక్య జ్ఞానమును సంపాదించి తురీయ పురుషార్థమును పొందజాలును. జ్ఞాన సాధనమునకు భక్తియు, చిత్తశుద్ధియు అత్యావశ్యకములు. అవి నిష్కామ కర్మానుష్ఠానము వలననే కల్గును కాని, కామ్య కర్మానుష్ఠానమువలన కలుగవు.

సామాన్య మానవులకు నిష్కామ కర్మానుష్ఠానము, సులభ సాధ్యము కాదు. ముందు మానవుడు కామ్య కర్మానుష్ఠానమునే చేసినను యాదృచ్ఛికముగానైన, నిష్కామకర్మానుష్ఠానము యొక్క వైశిష్ట్యమును గుర్తించును. అప్పుడు సంధ్యావందనాగ్నిహోత్రాది నిష్కామ కర్మానుష్ఠానముచే చిత్తశుద్ధిని సంపాదించును. కావున కామ్యకర్మ భోగమును ప్రరోచనముగ అనగా, ధ్యేయమైన నిష్కామ కర్మానుష్ఠానమునందు అభిరుచిని కల్పించు సాధనముగ వేదము కామ్యకర్మానుష్ఠానమును ఉపదేశించినదని కొందఱు చెప్పుదురు. నిష్కామ కర్మానుష్ఠానము ద్వారా చిత్తశుద్ధిని సంపాదించి, ఉపాసనా నిమగ్నులై జ్ఞానమును సాధించుటకు కావలసిన విషయము లన్నియు వేదాంతము లనఁబడు ఉపనిషత్తులందు అనగా జ్ఞానకాండమునందు ఉపదేశింపఁబడినవి. వేదముయొక్క ప్రాశస్త్యము తెల్పు వాక్యములు వేదములందే కొన్నిచోట్ల చెప్పఁబడినవి. "నా వేదవిన్ మనుతే తం బృహన్తం, యం యం క్రతు మధీతే తేన తేన శ్రేష్ఠం భవతి–" యస్తత్యాజ సఖి విదగ్ం సఖాయం న తస్య వాచ్యపి భాగో అస్తి. యదాగ్ం శృణోత్యలకగ్ం శృణోతి, నహి ప్రవేద సుకృతస్య పన్థామితి స్వాధ్యాయేన అపహతపాప్మా స్వాధ్యాయో దేవపవిత్రమ్– స్వాధ్యాయ మధీతే తప ఏవ తత్తప్యతే" మున్నగున విందుకు నిదర్శనము. అందుచేతనే తైత్తిరీయోపనిషత్తులందలి శిక్షావల్లి "స్వాధ్యాయాన్మా ప్రమదః" అని చెప్పుచున్నది. యజుర్వేదము యజ్ఞాచరణ ప్రధానమైనది. భగవద్గీతలో తృతీయాధ్యాయమున, "సహ యజ్ఞాః ప్రజాః సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః అనేన ప్రసవిష్యధ్వ మేష వోఽస్త్విష్టకామధుక్" అని చెప్పఁబడినది. ప్రజాపతి యజ్ఞములతో కూడ ప్రజలను సృష్టించి, ఇవి మీ కభీష్ట ప్రదాయకము లగునని చెప్పెననియు, యజ్ఞములచే తృప్తి నందిన దేవతలు ప్రజల కోరికలను తీర్తురనియు, పై శ్లోకము నందలి భావము. కృష్ణయజుర్వేదమునందు పెక్కిష్టుల వివరములు కలవు. దర్శపూర్ణమాసేష్టి అన్ని ఇష్టులకు ప్రకృతి. కర్మలద్వారా చిత్తశుద్ధిని జ్ఞానమును గడించి మానవుడు మోక్షమును పొందవచ్చును. చతుర్విధ పురుషార్థములలో మోక్షము శ్రేష్ఠ మైనది. తత్సాధనమునకు ధర్మ మత్యావశ్యకము. ధర్మహీనమైన కార్యమేదైనను నిష్ఫల మగును. వ్యాసుడు భారతమున "ధర్మాదర్థశ్చ కామశ్చ మోక్షశ్చ పురుషర్షభ" అని చెప్పి యుండెను. జైమిని 'చోదనాలక్షణార్థో ధర్మః' అని ధర్మమును నిర్వచించెను. వేద స్మృతి పురాణములచే ప్రతిపాదింపఁబడునదే ధర్మము. అదే జగత్సౌధమునకు మూల స్తంభము. "ధర్మో విశ్వస్య జగతః ప్రతిష్ఠాం" అని స్మృతి. ధర్మము కర్మరూపము. వేదబోధితమైన కర్మకలాపము ననుష్ఠించు నర్హత కలవా రా కర్మమును యథావిధిగా నాచరించినచో జగత్తన్నపానాది సమృద్ధమై సుభిక్ష మగును. నిష్కామముగా కర్మ నాచరించువాడు పాప విముక్తుడై చిత్తశుద్ధితో శోభిల్లుచు వేదాంత విజ్ఞానమును సంపాదించి, తదనుగుణముగ వర్తించి, మోక్ష పురుషార్థమును పొందఁజాలును. వ్యాసుడు చెప్పినట్లు ధర్మమువలననే లౌకికము లయిన అర్థకామములను, పారలౌకికమైన మోక్షమును మానవులు పొందుట కవకాశము కలదు. వేదధర్మమునకుఁగల ప్రాముఖ్య మింతింతని చెప్ప నలవి కాదు.

యజుర్వేదమునందలి చతుర్థ కాండములోని పంచమ ప్రపాఠకమునకు రుద్రాధ్యాయ మనిపేరు. ఈ ప్రశ్న అంతయు నమశ్శబ్దములతో కూడి యుండుటచే దానికి నమక మను పేరు రూఢ మైనది. కర్మకాండమున పఠించుచుండుటచే దానికి కర్మాంగత్వము సిద్ధమైనను స్వరోపనిషత్తులు ఇది జ్ఞానకారణ మనియే చెప్పుచున్నవి. నమక చమకములను రుద్రోపనిషత్తు అని కూడ పేర్కొనుచుందురు. అందు కవి పరబ్రహ్మమును వర్ణించుటయే కారణము. వాని కధిష్ఠాన దైవతములు శతరుద్రులు. అందుచే ఈ రెండింటికినీ కలిపి శతరుద్రాధ్యాయ మను పేరేర్పడినది. రుద్రాధ్యాయమునకు సంబంధించిన హోమమును, మేక పాలతోడను, అర్క పత్రములతోడను చేయవలెను. భట్టభాస్కరుడు ఏ హోమమునెట్లు చేయవలెనో, ఏ మంత్రముల నెపుడు పఠింప వలయునో స్పష్టముగా చెప్పియున్నాఁడు.

యజుర్వేద సంహితకు నాభిస్థానమైన ఈ ప్రపాఠకము దానికి శిరోభూషణ మని చెప్పఁబడుచున్నది. యాజ్ఞికులు దానిని యజ్ఞోపయోగి కాండముగను, ఉపాసకులు ఉపాసనా కాండముగను, తత్త్వ జిజ్ఞాసువులు జ్ఞాన కాండముగను భావించుటను బట్టి ఇందలి విషయ మెంత అమూల్యమో, గ్రహింపవచ్చును. సర్వజన తారకమును దివ్యమునునైన పంచాక్షరీ మంత్రమున కిది ఆకర మగుటయే దీని ప్రశస్తి కంతకును కారణము. శ్రీ శ్రీ కామకోటిపీఠాధీశ్వరు లొకప్పుడు, త్రయిలో యజుర్వేదము మధ్యమ మనియు, అందు నాల్గవ కాండము మధ్యమ మనియు, అందు నమశ్శివాయ మంత్రము కలదనియు చెప్పి

యుండిరి. సర్వస్మృతులును పురాణాగమములును బ్రాహ్మణములును ఉపనిషత్తులును దాని ననేక విధముల ప్రశంసించి యున్నవి. రుద్రాధ్యాయమునకు యజ్ఞపరముగానే కాక శివ విష్ణు విజ్ఞానశాస్త్రాద్వైతపరముగా కూడ మహాపండితు లర్థము చెప్పియున్నారు. రుద్రకల్పమందు రుద్రాధ్యాయ ప్రశంస సవిస్తరముగా కలదని సాయణాచార్యులు తెలిపియున్నారు. శతరుద్రీయ జపముచే అమృతత్వము సిద్ధించునని, జాబాల మహర్షి భావించి యుండెను. ఒకప్పుడు బ్రహ్మచారులు యాజ్ఞవల్క్య మహర్షిని "దేనిని పఠించుటచే అమృతత్వము లభించు" నని అడుగగా అతడు శతరుద్రాధ్యాయ పఠనముచే నని సమాధానము చెప్పియుండెను. కైవల్యోపనిషత్తు "ఏతైర్వా అమృతో భవతి" అని రుద్రాధ్యాయమునందలి నామములను పఠించుటచే, అమృతత్వము లభించునని చెప్పుచున్నది. నమక చమకములను, చిత్తిపన్నమును, పురుషసూక్తమును పఠించుటచే, గృహస్థుడు తన యింటిలో ప్రవేశించునట్లు మానవుడు శివునియందు ప్రవేశించునట! నమక చమకములను పఠించుటవలన కలుగు లాభములు బహుగ్రంథములలో వివరింపఁబడినవి. దృశ్యమానమైన ప్రపంచ మంతయు రుద్ర స్వరూపమే. రుద్రునికి పంచ భూతములును, సూర్య చంద్రులును, యజమానుడును అష్టమూర్తులు.

సృష్టికాలమునందలి మహాదేవుని శరీరము ఘోర మనియు, కార్యరూపమున నది శివత్వమును బొందుననియు చెప్పుదురు. భక్తులు శతరుద్రాధ్యాయమును పఠించుచు ఘోరాఘోర నామములు గల శివుని సాంత్వన పఱచుచుందురు. ఈ అధ్యాయమునందు పదునొకండు అనువాకములు కలవు. రెండు మొదలు తొమ్మిది వఱకును గల అనువాకములలో భక్తులు మహాదేవుని విశ్వరూపమును ప్రశంసింతురు. అపుడు శివుడు సంతృప్తుడై శాంతు డగును. దశమైకాదశానువాకములలో భక్తులు తమ కభయ మిమ్మని శివుని ప్రార్థింతురు. శివుడు కావించిన అద్భుత కృత్యము లెన్నియో కలవు. రుద్రాధ్యాయము నందలి శివరూప వర్ణనములే శైవపురాణము లందలి శివకథలుగా పరిణమించెను. "రుద్రాధ్యాయమున వర్ణింపఁబడిన శివుని విశ్వరూపత్వము, విశ్వ వ్యాపకత్వము, విశ్వకారణత్వము, మున్నగునవి ఏకేశ్వరత్వ విజ్ఞానమును, క్రమముగ జీవేశ్వరైక్య జ్ఞానమును కల్గించునవియై అద్వైతభావమున కాలవాల మగుచున్నవి."

యజుర్వేద సంహితను బట్టి ఆ కాలపు పరిస్థితులను తెలిసికొనవచ్చును. అప్పటి ఆర్యులు వ్యవసాయము చేసి బహు విధములయిన పంటలు పండించిరి. మళ్ళకు నీళ్ళు పెట్టుటకై నూతులను త్రవ్వుటయే కాక, ఏతములను ఘటీయంత్రములను ఉపయోగించిరి. సంహిత యందలి వర్ణనములు కొన్ని యిట్లున్నవి. ఈ నాగలి పెద్ద బెడ్డలు పెళ్ళగొట్టినట్లు దున్నుగాక! ఇది వజ్రము వలె వాఁడియైనది. కర్షకు లనాయాసముగా మెట్టపల్లములు లేకుండ దానిచే నేలను ఛేదింపఁజాలుదురు. దీనివలన భూమి ఫలించినచో యజమానునికి మంచి ఆవులు, ఆవుపెయ్యలు, గొఱ్ఱెలు, గుఱ్ఱములు లభించును. సంహితయందలి పదు నాల్గు మంత్రములు దున్నిన పొలమందు బహువిధములయిన ఓషధుల విత్తనములను చల్లుటను, వర్ణించుచున్నవి. ఆ ఓషధులు, క్షుత్పిపాసాదులను పోఁగొట్టును. అవి సోమయాగము చేయుటకై ధాన్య సమృద్ధిని, బలవృద్ధిని, ధాతుపుష్టిని కలిగించును. కొన్ని చోట్ల పండుట కెక్కువ కాలము పట్టు పెద్ద ధాన్య జాతులు, తక్కువ కాలములో ఫలించు మఱికొన్ని ధాన్యములు వర్ణింపఁబడినవి. ఏఁడు విధములయిన పెద్ద ధాన్యజాతులు అందు పేర్కొనఁబడినవి. వానిలో కొన్ని ఇప్పుడంత రించి యుండవచ్చును. చమక ప్రపాఠకమునందలి పదార్థముల పట్టిక అప్పటి ఆర్యావర్తమునందలి వివిధ ధాన్యములనే కాక లోహాదులను కూడ పేర్కొనుచున్నవి. ఆర్యులు వాడని లోహము లేదు. చూడని చెట్టు లేదు. మెట్టని మెట్ట లేదు. ముట్టని ముత్యము లేదు. పట్టని ఫలము లేదు. కాంచని కాననము లేదు. క్రుంకని నది లేదు. కోరని కోరిక లేదు. వేడని వేల్పు లేదు. చేయని యజ్ఞము లేదు. ఎఱుగని తిర్యగ్జాతులు లేవు. చమకమును పఠించినచో, ఆర్యుల ప్రపంచ జ్ఞానము అనంతమని తెలియును. గో విడాదేవిరూపము. ఆ నాటివారికి గోవులందు గల భక్తి శ్రద్ధలును, వాని సంరక్షణమందలి ఆదరమును, వాని పవిత్రభావమునందలి విశ్వాసమును యజుర్వేద సంహిత తెలుపుచున్నది. ఇది సకల ధర్మములకును, ఉత్తమ సాంఘికాచారములకును స్థానము. వైదిక వాఙ్మయము నందలి వివిధ గృహ్యసూత్రములకును, సామయాచారిక సూత్రములకును, ధర్మశాస్త్రములకును పునాది. ఈ నాటికి కూడ వేదము నంతను పఠింపకపోయినను, రుద్రాధ్యాయమునైన పఠించువారు పలువురు గోచరింతురు.

వేదాధ్యయన విధి పాఠమాత్ర పర్యవసాయి కాదు. వేదమంత్రముల అర్థములను కూడ తెలిసికొనవలెను. ఈ విషయమే, ఈ క్రింది శ్లోకములో చెప్పఁబడినది.

"యదధీత మవిజ్ఞాతం నిగదేనైవ శబ్ద్యతే,
అనగ్నావివ శుష్కైధో న తజ్జ్వలతి కర్హిచిత్."

స్థాణురయం భారహారః కిలాభూత్
అధీత్య వేదం న విజానాతి యోఽర్థమ్,
యోఽర్థజ్ఞ ఇత్సకలం భద్ర మశ్నుతే
నాకమేతి జ్ఞాన విధూత పాప్మా.
"బ్రాహ్మణేన నిష్కారణో ధర్మో షడఙ్గో వేదోఽ ధ్యేయో జ్ఞేయశ్చ."

బ్రాహ్మణులు, ఫలాపేక్షా రహితముగా వేదపాఠము చేసి తదర్థము నెఱుంగవలెను. అర్థజ్ఞానము లేని వేదపాఠకుడు స్థాణుసదృశుడు. అర్థము తెలిసి వేదముల పఠించువాడు సర్వశుభములను పొంది సమస్తపాప వినిర్ముక్తు డగును. అర్థజ్ఞానము లేని అధ్యయనము అనగ్నియం దుంచిన సమిధవలె ప్రజ్వరింపఁజాలదు, అని పైశ్లోకముల భావము. "వేదవిద్యా విహీనస్య విద్యాజాలం నిరర్థకం, మాంగల్యతంతుహీనాయాః కాంతాయాః కనకం యథా" అను శ్లోకము వేదవిద్యావిహీను డెన్ని విద్యలు పఠించినను నిరర్థక మనియు, వాని జీవితము వివిధ స్వర్ణాభరణ భూషిత యయ్యు మాంగల్యమును గోల్పోయిన మగువ జీవితమువలె శోభిల్లఁజాలదనియు చెప్పుచున్నది.

వైదిక సంస్కృతమునకును, లౌకిక సంస్కృతమునకును జాల భేద మున్నది. లౌకిక సంస్కృతభాషయందు మహాపండితుడైనవాడు కూడ వేదమంత్రముల యర్థ మెఱుంగఁజాలడు. అందుచేతనే వేదమంత్రములకు పెక్కు భాష్యములు వెలసినవి. కొన్ని సంపూర్ణములు. కొన్ని యసంపూర్ణములు. సాయణాచార్యులవారు నాలుగు వేదముల అర్థము పండితునకు బోధపడునట్లు వానికి భాష్యములు రచించియున్నారు. ఆ సందర్భమున వా రితర పండితుల తోడ్పాటును కూడ పొంది యుండ వచ్చునని కొంద ఱందురు. లభ్యము అగుచున్న భాష్యములలో సాయణభాష్యమే బహుళ ప్రచారము పొందియున్నది. దాని ననుసరించియే పాశ్చాత్యులు కూడ వేదానువాదము కావించియుండిరి. శ్రీమత్తిరుమల తిరుపతి దేవస్థానమువారు బహుగ్రంథములను ప్రచురించుచు విస్మృత ప్రాయమైన భారతీయ సంస్కృతిని పునరుజ్జీవింపఁజేయ యత్నించుచున్నారు. వారు ఋగ్వేదమునకు పద్యానువాదమును ప్రకటించి యుండిరి. యజుర్వేదమునకు కూడ సాయణభాష్యానుసారముగ ప్రతి పదార్థ తాత్పర్యములు వ్రాయుదు మని మేము కోరగా వారు దయతో నంగీకరించి సార్థతాత్పర్యమైన యజుర్వేదము నిప్పుడు ప్రకటించుచున్నారు. ఈ అవకాశము మాకు లభించుట పూర్వజన్మ సుకృత మని భావించుచున్నాము. మేము వ్రాసిన అర్థ తాత్పర్యములలో అజ్ఞాన వశమున పెక్కు దొసగులు దొర్లియుండవచ్చును. విజ్ఞులు వానిని మన్నించి తెల్పినచో తరువాతి ముద్రణమునందు సవరించుకొందుము. ఈ అదృష్టమును మాకు కల్పించిన సర్వజగన్నాథుడగు శ్రీ వేంకటేశ్వరస్వామివారికిని దేవస్థానాధికారి వర్గమువారికిని మా కృతజ్ఞతాపూర్వక వందనములు.

స్వామినో వేఙ్కటేశస్య కృపయాస్మత్ప్రకల్పితమ్,
యజుషః సార్థ తాత్పర్యం ప్రాప్నుయా త్పండితాదృతిమ్.

డాక్టరు దివాకర్ల వేంకటావధాని

ఆధారగ్రంథములు:

1. కీ. శే. మల్లాది సూర్యనారాయణశాస్త్రి, వైదికవాఙ్మయచరిత్ర.
2. సాయణాచార్యులు, చతుర్వేద భాష్యభూమికలు.
3. శ్రీ చిప్పలూరి గణపతిశాస్త్రి, సంగ్రహాంధ్రవిజ్ఞానకోశమందలి వ్యాసము.
4. వివిధ పండితుల ఆంధ్రాంగ్లవ్యాసములు.

శ్రీ

— పారిభాషిక పదార్థ సంగ్రహము —

అగ్నిః : అఙ్గతి– 'సకల వేదాన్త ప్రతిపాద్యత్వం గచ్ఛతి' అను వ్యుత్పత్తిచే అగ్నిశబ్దము పరమాత్మ వాచక మని కృష్ణపండిత విరచిత సంధ్యావందన భాష్యమునఁ గలదు. అఙ్గతీతి అగ్నిః. అఙ్గతి యనఁగా పొందుచున్నదని యర్థము. సకల వేదాంతములచే ప్రతిపాదింపఁబడుటను పొందు చున్నది. అనఁగా సకల వేదాంతములచే చెప్పఁబడుచున్న పరమాత్మ యని భట్టభాస్కర భాష్యము.

అగ్నిహోత్రహవణి : హోమ సాధనములైన స్రుక్-స్రువములలో స్రుక్కునకు 'అగ్నిహవణి' అని వివక్ష చేయఁ బడినది.

అఙ్గిరః : అఙ్గానాం రసః అఙ్గిరః=అంగముల సార మని అఙ్గిరశ్శబ్దార్థము. సోమాహుతుల కాధార మగుటచే ఈ యగ్ని గార్హపత్యాద్యగ్నులలో సార మైన వాఁడని భావము. ఉత్తరవేదికి సంబంధించిన నభోనామకుఁడైన అగ్ని.

అతిపన్నము : సకాలమున చేయక నిలిపివేయఁబడినది.

అధరారణి : మథించి అగ్నిని పుట్టించు కొయ్యలలో క్రింద నున్న కొయ్య. (దీని వివరణమునకు 127 వ పుటలో చూడుఁడు.)

అధ్వర్యుప్రైష : కామ్యేష్టి జరుపుటకు ముందుగా దేవతాహ్వానమునకై అధ్వర్యుఁడు "ఇన్ద్రాగ్నిభ్యా మను బ్రూహి" అని పలుకవలెను. దీనిని 'అధ్వర్యుప్రైష' యందురు.

అనుమతి : ఒక కళ తక్కువగాఁ గల పూర్ణిమ అనుమతి అనఁబడును. చతుర్దశీ యుక్తమైన పూర్ణిమ అని భావము.

అన్వారభము : యజ్ఞ పశువును వధించుటయందు ఈ పద ముపయోగించఁబడును. వధించుట.

అన్వాహార్యము : పితృయజ్ఞమునకు వెనుక చేయఁదగిన కర్మయందు దక్షిణాగ్నియందు పక్వమైన అన్నము.

అభ్రి : భూమిని త్రవ్వుటకు సాధనమైనదియు, అగ్రభాగము పదనుగాఁ గలదియు, మోదుగు కఱ్ఱతో చేయఁబడినదియు నగు త్రవ్వుకోలవంటి ఒక వస్తువు.

అవదానము : హోమము చేయు పదార్థమును జుహ్వాది హోమ సాధనములలోనికి తీసికొనుట.

అవభృథము : యజ్ఞము సమాప్తమైన పిమ్మట తుది దినమున చేయు కార్యకలాపము. అవభృథమునాఁడు యజ్ఞకర్త యజ్ఞదీక్షను విడిచిపెట్టును.

అవటము : పితృదేవత లుండు లోకవిశేషము.

అవేష్టులు : మంత్ర సాధ్యములైన ఆహుతులు అవేష్టు లనఁబడును. (అవయజతే=నాశయతి మృత్యు మితి అవేష్టిః. మృత్యునాశము.)

అవ్రత్యము : యజ్ఞ విరుద్ధమైన అనృతాదికము అవ్రత్యము.

ఆకూతి : యజ్ఞము చేయుదు నను సంకల్పము ఆకూతి.

ఆఖాత్కరము : కన్నమునుండి ఎలుక త్రవ్వి తీసిన పొంతరాశి ఆఖాత్కర మనఁబడును.

ఆఘారము : నైరృతి దిక్కున ప్రారంభించి యీశాన్య దిక్కున సమాప్త మగునట్లుగా చేయు హోమము ఆఘారము.

ఆజి : ఏఁడు ప్రవ్యాధముల ప్రదేశము ఆజి యనఁబడును. (ధనువునుండి బలముగ విడువఁబడిన బాణము ఎంత దూరము పోవునో అంత దూరము గల ప్రదేశము ప్రవ్యాధము.)

ఆతిథ్యము : అతిథికి చేయఁబడునట్టి కర్మ విశేషమునకు ఆతిథ్య మని పేరు. (అతతి=సతతం గచ్ఛతీతి అతిథిః=ఎల్లపుడు సంచరించువాఁడు కావున 'అతిథి' యనఁబడును.)

ఆధిపత్యము : నియమన సామర్థ్యము ఆధిపత్య మనఁబడును.

అవతి : ప్రాణము. నిశ్వాస రూపమున బహిర్గతమైన వాయువు. ఉచ్ఛ్వాస రూపమున అభిముఖముగ లోపల పడుచున్నది కావున ప్రాణము అవతి యనఁబడును.

ఆప్యాయత : ఆజ్యాదులచే ధ్రువాది హోమ సాధనములను నిండించుట ఆప్యాయత యనఁబడును.

ఆమము : ద్రవ్యము. 'ఆమ' శబ్దము మాంస వాచకముగ ప్రసిద్ధమై యున్నను, 'ద్రవ్యము' అని విద్యారణ్యులు వ్రాసియున్నారు.

ఆసందిని : పేముతో చేసిన చెక్కడము. (పెండ్లిపీటవంటిది.)

ఇంద్రతురీయము : ఇంద్రుఁడు తురీయుఁడుగా (నాల్గవ రూపముగా) నున్న కర్మ విశేషము. (దీని వివరణమునకై 420 పుటలో చూడుఁడు.)

ఇధ్మము : ఎండిన మోదుగు పుల్ల. (సమిధ.) లేక ఎండిన రావి పుల్ల. ('ఇన్ధీ=దీప్తౌ' అను ధాతువు నుండి 'ఇధ్మ' శబ్ద ముత్పన్న మైనది. దీనిచే అగ్ని ప్రకాశించును.)

ఇష్టము : యజ్ఞమునందలి హోమ దానాది క్రియ 'ఇష్ట' మనఁబడును.

ఉక్థము : ఏకాక్షర ఛందస్సు గల సామ విశేషము ఉక్థము.

ఉగ్రవాక్కు : ఐహికమైన వాక్కు ఉగ్రవాక్కు. (అనఁగా లౌకిక విషయములను గూర్చి పలుకు వాక్కు అని యర్థము.)

ఉత్కరము : యజ్ఞ భూమియందు ధూళి మొదలగునవి యుంచు స్థానమునకు 'ఉత్కరము' అని వైదిక వ్యవహారము.

ఉత్తరారణి : మథించి అగ్నిని పుట్టించు కొయ్యలలో పైని ఉన్నది ఉత్తరారణి.

ఉత్పవనము : దర్భ పవిత్రమును నీటిలో ముంచి ముందు వెనుకలకు కదలించుటచే శుద్ధి చేయుట.

ఉదానము : ప్రాణాపాన వ్యానోదాన సమానము లనెడి పంచ ప్రాణములలో ఇది యొకటి. ఒకే వాయువు శరీరమునందలి వివిధ స్థానములందు సంచరించుటచే స్థాన భేదమును బట్టి ప్రాణాపానాది వ్యవహార మేర్పడినది. భుజించిన అన్నాది రసమును ఉద్గారించునది (వెళ్లఁగ్రక్కునది) ఉదానము.

ఉపల : సన్నికంటిపై నుంచి బియ్యమును పిండిగా నూఱునట్టి ఱాతికి ఉపలయని వైదిక వ్యవహారము.

ఉపరవములు : ఉపరవములు=గుంటలు. (వివరణమునకు 111 వ పుటను చూడుఁడు.)

ఉపవేషము : మోదుగు కొమ్మ మొదటిని ప్రాదేశమాత్ర పరిమితముగ పట్టకారు మాదిరి ఛేదించిన భాగము ఉపవేష మనఁబడును.

ఉపస్తరణము : అచ్ఛిద్ర కాండమునందలి "ఉభా వగ్నీ ఉపస్తృణుతే" ఇత్యాది మంత్రమును యజమానుఁడు జపించుట ఉపస్తరణ మనఁబడును.

ఉపాకరణము : మంత్ర పూర్వకముగ చేయు సంస్కార విశేషము ఉపాకరణము.

ఉలూఖలము : ఉలూఖలము=ఱోలు. (కొయ్యతో చేసిన ఱోటిని యజ్ఞమునందు ఉపయోగింతురు.)

ఊర్ణాస్తుక : గొఱ్ఱెబొచ్చుతో చేయఁబడిన దారము ఊర్ణాస్తుక.

ఏకవింశ స్తోమము : ఇరువదియొక్క మారు లావృత్తి చేయఁబడిన స్తుతిమంత్ర సమూహము ఏకవింశ స్తోమము.

ఓజిష్ఠము : శక్తిమత్పదార్థముల అష్టమ ధాతువుయొక్క సారము ఓజిష్ఠము.

ఓషధి : దోషమును పోఁగొట్టునది ఓషధి. ఓషం =దోషం ధయన్తీతి ఓషధయః.

కరంభము : పెరుగుతో కలిపిన పేలపిండి కరంభము. (ఇట్టి పిండిని పాత్రాకారముగఁజేసి హోమము చేయుదురు.)

కుహూః : చంద్రకళ కానరాని అమావాస్య కుహువు అనఁబడును.

గంధర్వుడు : గీతిరూపములు గాని, స్తుతిరూపములు గాని అయిన వాక్కులను ధరించువాఁడు. 'విశ్వావసువు' అను గంధర్వుఁడు.

చతుష్పథము : నాలుగు మార్గములు కలయు ప్రదేశము చతుష్పథము.

చన్ద్రమాః : చంద్రుఁడు. (చారు=శోభనం, ద్రవతి=గచ్ఛతీతి, చన్ద్రమాః. సుందరముగ పోవువాఁడు. అని వేదనిఘంటువునందు కలదు.)

చిత్ : వృద్ధి నొందిన రూపము కలది. "ఉపచిత రూపోఽసి" అని విద్యారణ్యభాష్యము. ఈ యర్థము యజ్ఞమునందు కపాల విశేషణముగ చెప్పఁబడినది. జ్ఞానము అని ప్రసిద్ధార్థము.

చిత్తము : దేహాది సంఘాతమునకు అచేతనత్వమును నివర్తింపఁజేయుచు బాహ్యవస్తువులయందు నిర్వికల్పత్వ రూప సామాన్య ప్రజ్ఞానమును కలుగఁజేయు వృత్తి చిత్త మనఁబడును. (చిత్తము, మనస్సు, బుద్ధి, అనునవి అంతఃకరణ ప్రవృత్తులు.)

ఛందస్సు : మంత్రము. (దేవతలు మృత్యుదేవతవలన భయపడి త్రయీ విద్య (వేదము) ను పొంది ఆ మంత్రములచే నాచ్ఛాదనము చేసికొనిరి కావున, మంత్రములకు 'ఛందస్సు' అను పేరు వచ్చినట్లు ఛాందోగ్యోపనిషత్తునందు చెప్పఁబడినది.) 'ఛందస్సు' అను పదము గాయత్ర్యాది ఛందస్సులకు సామాన్య వాచకము. "ఛది=ఆహ్లాదనే" ఆహ్లాదమును కలుగఁజేయునది.

ఛషాలము : యూపముయొక్క చివర నాలుగంగుళముల పరిమాణము గల భాగమును ఛేదించి దాని మధ్యమునందు రంధ్రము నేర్పఱచుదురు. ఆ రంధ్రముతో కూడిన భాగమునకు 'ఛషాలము' అని పేరు.

జానరాజ్యము : సార్వభౌమత్వము.

జిహ్వా : జిహీతే=విజానాతి రసమ్ అనయేతి, 'జిహ్వా' అని వ్యుత్పత్తి. నాలుక.

జీరదానుః : 'జీరా జీవనశీలా దానవః హవిషాం దాతారో యజమానాః యస్యాం పృథివ్యాం సా జీరదానుః' అని విద్యారణ్యభాష్యమున సమాసార్థము చెప్పఁబడినది. అనఁగా హవిస్సు నిచ్చునట్టి యజమానులు కలది పృథివి, అని యర్థము. వృద్ధుఁడు హవిర్దాతయునగు యజ్ఞకర్త, అనియు నర్థము. జీవనము నిచ్చునది, అని సామాన్యార్థము.

తపస్సు : ఆహారాది నియమము తపస్సు.

తనూనప్త : శరీరమును నశింపకుండ నుంచునది జఠరాగ్ని. (తనూం న పాతయతి=న వినాశయతీతి తనూనప్తా.)

తానూనప్త్రము : యజ్ఞమునం దుపయోగించునట్టి ఆజ్యవిశేషము. (వివరణమునకు 88వ పుటలోని చివరి పేరాను చూడుఁడు.)

త్వైషవాక్కు : ఆముష్మికమైన వాక్కు త్వైషవాక్కు. (ఆముష్మిక విషయమును పలుకు వాక్కు అని అర్థము.)

దర్వి : హోమము చేయు సాధన విశేషము. పాముపడగవలె కొయ్యతో నిర్మిత మైనది.

దాన్తుఁడు : బహిరింద్రియ నిగ్రహము కలవాఁడు. లేక, తపమువలని కష్టము నోర్చువాఁడు. లేక, ఆచార్యులవలన శిక్షణ నొందినవాఁడు.

దీక్ష : వపనాది సంస్కారము దీక్ష యనఁబడును.

దురిష్టము : యజ్ఞమునందు మంత్ర క్రియా వైకల్యము కల హోమ దానాది క్రియ దురిష్టము.

దృషత్ : నూఱుటకు తగిన ఱాయి 'దృషత్' అని వైదిక వ్యవహారము. దీనిని సన్నెకల్లు అందురు. ఇది యొక పాషాణ విశేషము.

ధాత : సంవత్సరాత్మక దేవత ధాత యనఁబడును. (సంవత్సర కాల-స్వామి.)

ధానములు : ధానములు—వేఁపుడు బియ్యము. (ఈ ధానములను యజ్ఞమునందు హోమము చేయుదురు.)

ధిషణ : ధారయతి అర్థ మితి —ధీః=కర్మబుద్ధిః. లేదా, ధారయతి కర్తారం ఫలం ప్రదానేనేతి —ధీః=కర్మబుద్ధిః. తాం సనోతి=సంభజతే ఇతి, ధిషణా. అర్ష మగుటచే 'ధీ' లోని దీర్ఘము హ్రస్వమైనది. అనఁగా విషయమును మనస్సునందు ధరింపఁజేయునది ధీ యని యర్థము. లేదా కర్మఫలము నిచ్చుటచే కర్తను ధరింపఁజేయునది ధీ యని యర్థము. దానిని భజించునది 'ధిషణ' యనఁబడును.

ధీః : ధీః=కర్మ. ధీయతే=అనుష్ఠీయతే ఇతి, ధీః=కర్మ. అను వ్యుత్పత్తి ననుసరించి 'ధీ' శబ్దము వేదమునందు కర్మవాచకముగా అభిహిత మైనది.

ధూమ్రము : మలినమైన తెల్లని వర్ణము ధూమ్రము.

దేవసూ దేవతలు : యజమానుని 'రాజా' అను సంజ్ఞచే గుర్తించునట్టి అగ్న్యాది దేవతలు దేవసూ లనఁబడుదురు.

నాకః : నాక శబ్దమునకు అగ్ని, పరమాత్మ, అని అర్థములు వివక్ష చేయఁబడినవి. కమ్=సుఖము. అది లేనిది అకమ్=దుఃఖము. ఆ అకము లేనిది నాకము=స్వర్గము. ఆ నాకమందు నివసించుటచే అగ్నికి నాక మను పేరు వచ్చినది. అకము (దుఃఖము) లేనివాఁడు పరమాత్మ అనియు స్పష్ట మగుచున్నది.

నిమితము : భూమియందు స్థాపితమైన కాష్ఠముయొక్క అగ్రభాగమునందు స్థాపింపఁబడినది.

పంచదశ స్తోమము : అయిదు మారు లావృత్తి చేయఁబడిన స్తుతి మంత్ర సమూహము పంచదశ స్తోమము అనఁబడును.

పరిధి : యజ్ఞార్థమైన మేడి చెట్టునకు సంబంధించిన పుల్ల. పరితః దధాతి=పుష్ణాతీతి, పరిధిః. హోమాగ్నికి రక్షణముగా నాల్గువైపులందు పఱచఁబడి యుండును.

పరిపతి : అనేక విషయములందు ప్రవర్తించునది మనస్సు. (పరితః నానావిషయేషు పతతీతి-పరిపతిః.)

పరిప్లావితము	:	నీటిచే బాగుగ తడుపఁబడినది.
పష్ఠౌహి	:	బాల్యమునందే తొలి చూలు గల పెయ్య పష్ఠౌహి అనఁబడును.
పరి స్తరణము	:	దర్భలను పఱచుట పరి స్తరణము.
పాఙ్క్తము	:	పంక్తి చ్ఛందస్సు పంచాక్షరములు కలది. కనుక పంచత్వ సంఖ్య కలది పాంక్త మనఁబడును హస్త ద్వయ పాద ద్వయ శిరస్సులచే పంచత్వ సంఖ్య కలవాఁడు పాంక్తుఁడు అనఁబడును. పశువులు పాంక్తము లగును. (పంక్తి చ్ఛందస్క మంత్రములచే సాధ్యము అని వ్యుత్పత్తి.)
పాథేయము	:	మార్గమధ్యమున ఆఁకలి తీర్చుకొనుటకై ఉపయోగించు నాహార విశేషము పాథేయము.
పునరాధేయము	:	రెండవ మారు ఆధానము చేయఁబడిన అగ్నికి సమర్పింపఁబడు హవిర్విశేషము పునరాధేయ మనఁబడును.
పురోడాశము	:	హోమము నిమిత్తము నీటితో తడిపి ముద్దగా చేయఁబడిన పిండి పురోడాశ మనఁబడును.
పురోనువాక్య	:	పురస్తాత్ లక్ష్మ పురోనువాక్యా. అప్పటికి పుట్టియున్న శత్రువులను సంహరించునది పురోను వాక్య. పురోనువాక్య మంత్రములందు పూర్వార్థమున దేవతా వాచక పద ముండును. మంత్రవిశేషము. (పురస్తా దామ్నాతాః పురోనువాక్యాః, పశ్చా దామ్నాతాః యాజ్యాః, అని విద్యారణ్యము.)
పృశ్ని	:	పృశ్నిః-ఆదిత్యుఁడు.
పోషణము	:	ఇష్టమును కలుగఁజేయుట పోషణ మనఁబడును.
ప్రణీతములు	:	చమస పాత్రమునందలి ఉదకములు ప్రణీతములు. నీళ్లు పోసి వండఁబడిన పదార్థములు కూడ ప్రణీతము అనఁబడును.
ప్రతినిర్వాపము	:	ఒక పర్యాయము హవిస్సును నిర్వాపము చేసిన యనంతరము మఱల చేయు హవి ర్నిర్వాపము ప్రతినిర్వాప మనఁబడును.
ప్రథమశకలము	:	యూపమును ఛేదించినపుడు తెగిపడిన మొదటి ముక్కకు ప్రథమ శకలము, అని పేరు.
ప్రవ్యాధము	:	ధనువునుండి బలముగ విడువఁబడిన ఒక బాణము ఎంత దూరము పోవునో, అంత దూరము గల ప్రదేశము ప్రవ్యాధము.
ప్రస్తరము	:	దర్భల కట్టకు ప్రస్తర మని వైదిక వ్యవహారము.
ప్రాణము	:	ఒకే వాయువు శరీరమునందలి వివిధ స్థానములందు సంచరించుటచే స్థాన భేదమును బట్టి ప్రాణాపానాది వ్యవహార మేర్పడినది. హృదయమునందు సంచరించు వాయువిశేషము ప్రాణము. (ఉచ్ఛ్వాస నిశ్వాసములు ప్రాణవ్యాపారము.)
ప్రాయణీయ హవిస్సు	:	సోమయాగారంభమున చేయఁబడునట్టి అదితి దేవతాకమైన యిష్టి ప్రాయణీయేష్టి. ఆ యిష్టి యందు హోమము చేయఁబడు హవిస్సు ప్రాయణీయ హవిస్సు.
ప్రోక్షణము	:	పవిత్రతకై లేదా పరిశుద్ధికై ఆ యా పదార్థములపైని ఉదకమును చల్లుట ప్రోక్షణ మనఁబడును.
ఫలీకరణము	:	ఇంటిలో బియ్యము బాగుచేయునపుడు తీసివేయఁబడిన మాలిన్యాంశము ఫలీకరణ మనఁబడును.

బస్తాజినము : మేంకపోతు తోలు బస్తాజిన మనంబడును. (దీనిని వాజపేయ యాగమునందు ఉపయోగింతురు.)

బుద్ధి : నిశ్చయాత్మకమైన అంతఃకరణ ప్రవృత్తి బుద్ధి.

భువనమ్ : భవన్తి అస్మాత్ భూతానీతి భువనమ్-సర్వపదార్థములకు కారణము. (ఈ పదము అగ్ని విశేషణముగా ప్రయుక్తమైనది. అగ్ని సర్వ పదార్థములకు కారణముగా వర్ణించఁబడినాఁడు.)

బృహత్సామము : బృహత్సామము ఒకానొక సామవిశేషమునకు పేరు.

భ్రాతృవ్యః : ఇంద్రియ వృత్తికి బాహ్యమైన విరుద్ధ జాతి. 'బాహ్యశత్రువు' అని యర్థము.

మదన్తి : తప్తోదకమునకు 'మదన్తి' అని వైదిక వ్యవహారము.

మధుమతి : మధుర రసము గల 'ఓషధి' అని బ్రాహ్మణమున చెప్పఁబడినది.

మనస్సు : ఈ పదార్థ మీ విధముగ ఉండునాః-లేదాః-అనెడి అంతఃకరణ ప్రవృత్తి మనస్సు.

మన్థము : పాలలో వేసి మిశ్రీకృతమైన యవల (బియ్యపు) పిండి మన్థము.

మూతము : కర్షకులు వరి మొదలగు ధాన్యములను నిలవ చేసికొనుటకు గంప మొదలగు వస్తువులలో దాఁచుకొందురు. అట్టి వస్తువిశేషము మూతము. (ఇందు ధాన్యము గడ్డి మొదలగునవి ఉండును.)

మేధ : తాను వినిన ఫలసాధనములను బుద్ధియందు ధారణ చేయుట మేధ యనఁబడును.

యాజ్య : యాజ్యానువాక్య మంత్రము 'యాజ్య' అనఁబడును. ఇజ్యతే అనయా ఇతి, 'యాజ్యా'. అని వ్యుత్పత్తి. (ఈ మంత్రము నుచ్చరించగానే 'యజ' అని పలుకవలెను.)

యాజ్యానువాక్య : పుట్టఁబోవు శత్రువులను సంహరించు మంత్ర విశేషము యాజ్యానువాక్య యనఁబడును. ఈ యాజ్యానువాక్య మంత్రములందు ఉత్తరార్ధమున దేవతా వాచక పద ముండును. ("ఉపరిష్టాత్ లక్ష్మా -యాజ్యా." (పురస్తా దామ్నాతాః పురోనువాక్యాః. పశ్చా దామ్నాతాః యాజ్యాః, అని విద్యారణ్యమున చెప్పఁబడినది.)

యోక్త్రము : ఎద్దు మెడయందు తగిలించెడి త్రాడు. (ప్రథమమున శకటము దక్షిణభాగమున ఎద్దును ఉంచి కాడి రంధ్రమునందు చిడుతను దూర్చి యెద్దు మెడకు త్రాడు కట్టుదురు. ఆ త్రాడు యోక్త్రి మనఁబడును.)

రత్నిహవిస్సులు : రాజసూయ యాగమునందు రాజే స్వయముగా బ్రహ్మ మున్నగువారి గృహములందు పదునొకండు ఇష్టులకు సంబంధించిన హవిస్సులను నిర్వాపము చేయవలెను. ఈ హవిస్సులకు రత్ని హవిస్సు లని పేరు. బ్రాహ్మణ రాజన్య మహిష్యాదులు రత్నులు. వారి అభిమాని దేవతలకు ఈ హవిస్సులు ప్రియములైనవి.

రక్షణము : అనిష్ట నివారణము 'రక్షణము' అనఁబడును.

రాక : చంద్రుఁడు పూర్ణుఁడై యున్న పూర్ణిమ 'రాక' యనఁబడును.

రేవతి : రేవతి యనఁగ ధనము కలది యని భట్టభాస్కర భాష్యమునఁ గలదు. 'ఉదక' మని బ్రాహ్మణమునందు కలదు.

వత్సతరములు : తల్లి పాలు త్రాగుటను మానిన 'దూడ' వత్సతర మనఁబడును.

వనస్పతి : పుష్పములు లేకుండ ఫలములతో ప్రకాశించు వృక్షము.

వపా శ్రవణులు	:	వపను పక్వము చేయుటకు సాధనములైన రెండు శూలములు.
వరుణపాశము	:	సూక్ష్మ తంత్వాకారముతో జల మధ్యమం దుండునట్టి బంధన హేతువైన జీవవిశేషము వరుణ పాశ మనఁబడును.
వలగములు	:	విరోధి మారణమునకై జీర్ణ కట పటాదుల ఖండములందు కట్టఁబడిన ఎముకలు, రోమములు, పాదధూళి మొదలగునవి భూమియందు పాతిపెట్టఁబడినవి వలగము లనఁబడును.
విధృతులు	:	వేదియందు వణచెడి రెండు దర్భలకు విధృతులని పేరు.
విభాన్	:	(విశేషేణ కర్మభూమిత్వేన భాతీతి విభాన్ అయం భూలోకః.) భూలోకము విశేషముగ కర్మభూమిగ భాసించుచున్నది కావున విభాన్నామక లోకము భూలోకము.
విశసనము	:	విశసనము=వధ. (ఇది యాజ్ఞిక వ్యవహారము.)
వీతి	:	వీతి=భక్షణము. (ఖాదనము) "వీ=గతి, వ్యాప్తి ప్రజనన కాంత్యసన, ఖాదనేషు" అను ధాతువునుండి 'వీతి' శబ్దము పుట్టినది.
వృత్రతూర్యము	:	వృత్రతూర్య మనఁగా సంగ్రామము. ('వృత్రము' పదమునకు 20వ పుటను చూడుఁడు.)
వేది పరిగ్రహణము	:	ఆహవనీయ గార్హపత్యాగ్నుల మధ్య ప్రదేశమునందు వేదిని నిర్మించుటకు వేది పరిమాణ మును తెలిసికొనుటకై దక్షిణ పశ్చిమోత్తర దిక్కులందు అధ్వర్యుఁడు స్ఫ్యముచేత మూఁడు రేఖలను గీయును. దీనిని వేది పరిగ్రహణ మందురు.
వేనః	:	వేనః=అభీష్టుఁడు. "విన=కాన్తౌ" అను ధాతువునుండి వేన శబ్ద ముత్పన్నమైనది. కాంతుఁడు= అభీష్టుఁడు, అని యర్థము.
వేషము	:	వేషము=యజ్ఞము. 'వేషః, వ్రతమ్, క్రతుః,' ఇత్యాది పదములు కర్మవాచకములుగా వేద నిఘంటువునందు-చెప్పఁబడినవి. "విష్ఌ=వ్యాప్తౌ", అను ధాతువునుండి వేష శబ్ద ముత్పన్న మైనది.
వైరాజ సామము	:	'వైరాజము' అనెడి సామవిశేషము. "పిబా సోమ మిన్ద్ర మన్దతు త్వా" అను ఋక్కునం దుత్పన్నమైనది.
వైరూప సామము	:	"యద్యావ ఇన్ద్ర" అను ఋక్కునం దుత్పన్నమైన సామము వైరూప సామ మనఁబడును.
వ్యానము	:	ప్రాణాపాన వ్యానోదాన సమాన వాయువులలో వ్యానము ఒకటి. శరీరనాడు లన్నిటియందు వ్యాపించి ప్రాణాపాన వ్యాపార సంధి సమయమున శరీరమునకు బలము నిచ్చుట వ్యాన వ్యాపారము.
శమిత	:	యజ్ఞ పశువుయొక్క హృదయాది స్థానీయమైన వపను పక్వము చేయు వ్యక్తికి శమిత యని వ్యవహారము.
శమ్య	:	చంద్ర కఱ్ఱతో చేయఁబడినదియు, సన్నెకల్లు నుంచుటకు తగినదియు, గదాకారము కలదియు నగు ఒకానొక సాధనము శమ్య.
శాక్వరము	:	శక్వరః=శక్తిమంతుఁడైన పురుషుఁడు. శక్తిమంతుని సంబంధి శాక్వరము. శక్తి స్వరూప మని యర్థము.
శాఖాపవిత్రము	:	మూఁడు దర్భల నొకచోట కూర్చి ముడి వేయని పవిత్రమునకు శాఖాపవిత్ర మని పేరు.
శుష్కదృతి	:	ధనువు నుంచుట కుపయోగించునట్టి యెండిన తోలుతిత్తి శుష్కదృతి.

శూర్పము : ఇది యొక యజ్ఞసాధనము. వ్రీహ్యాది ధాన్యముయొక్క పొట్టును చెరుగుటకై వెదురుతో నిర్మింపఁబడిన చేఁటకు 'శూర్పము' అని పేరు.

సంజ్ఞపనము : సంజ్ఞపనము=సంహరణము.

సంస్రవులు : హవిర్విశేషములకు 'సంస్రవు' అని పేరు. (పూర్వము పది విధములగ వీర్యమును పోఁగొట్టుకొనిన వరుణుఁడు అగ్న్యాదులచే మరల పొందుటచే అగ్న్యాది దేవతలు సంస్రవు లగుదురు. ఆ అగ్న్యాదుల కియ్యఁబడిన హవిస్సులకు కూడ 'సంస్రవులు' అని పేరు వచ్చినది.

సంస్రావాజ్యము : జుహూపభృత్తులచే హోమము చేయఁబడిన ఆజ్యశేషము 'సంస్రావాజ్యము' అనఁబడును.

సపత్న : సపత్న శబ్దము విరుద్ధ మగు ఇంద్రియ వృత్తి పరముగా వేదమునందు ప్రయుక్తమైనది. ఇదియే అభ్యంతర శత్రువు.

సప్తదశస్తోమము : ఏఁడు మారులు ఆవృత్తి చేయఁబడిన స్తుతి మంత్ర సమూహము సప్తదశ స్తోమ మనఁబడును.

సమానము : సమానము ప్రాణాది వాయువులలో నొకటి. భుజించిన అన్నాది రసమును శరీరమునం దంతటను సమానముగ ప్రసరింపఁజేయుట సమాన వాయు వ్యాపారము.

సాన్నాయ్యము : హోమమున కర్హమైన క్షీరము లేక దధి రూపమైన హవిస్సు.

సినీవాలి : చంద్రకళతో కూడిన అమావాస్య సినీవాలి యనఁబడును. (సినీ=చన్ద్రకళా. సా బాలా అస్యా మితి, సినీవాలీ. వబల కభేదము. దీనియందు చంద్రకళ శ్వేతమై యుండును.)

సోమము : సోమ శబ్దము వేదమునందు ప్రధానముగా 'సోమరసము' అను నర్థమునందు ప్రయుక్తమైనది. "షు-ప్రసవైశ్వర్యయోః" అను ధాతువునకు 'మన్' ప్రత్యయము చేయఁగా సోమ శబ్ద ముత్పన్న మైనది. ఈ శబ్దమునకు అమృతము, భగవంతుఁడు, అను నర్థములు కూడ కలవు.

స్ఫ్యము : చతురంగుళ పరిమితమును, బదరి కాష్ఠ నిర్మితమును అగు ఖడ్గమువంటి ఆకారము గల వస్తువు 'స్ఫ్య' మనఁబడును.

స్వయంమథితము : చూత ఫల పుష్ప రసముచే పూయఁబడిన తోలుతిత్తియందు తెల్లని దూడ గల తెల్లావునుండి పిండిన పాలు బదర్యాది ఫల సంయోగముచే అంతటను స్రవించునదిగా నుండును. దానికి స్వయంమథిత మని పేరు.

స్వయంమూర్తము : చూత ఫల పుష్ప రసముచే పూయఁబడిన తోలుతిత్తియందు తెల్లని దూడ గల తెల్లావునుండి పిండిన పాలు మజ్జిగతోడు లేకుండగనే గడ్డ కట్టిన పెరుఁగు అగును. ఆ పెరుఁగు స్వయంమూర్త మనఁబడును.

స్వరువు : యూపమును ఛేదించినపుడు తెగి పడిన రెండవ ముక్కకు 'స్వరువు' అని పేరు.

స్వాయువు : రోగాదులు లేని ఆయువు 'స్వాయువు' అనఁబడును. (జీవనము ఆయువు.)

స్వాహా : స్వాహా శబ్దమునకు హుతమగుట, అర్పింపఁబడినది, ప్రోక్షణము మున్నగు నానార్థములు కలవు.

స్వాహాకృతము : దేవత నుద్దేశించి త్యాగమును దెలుపు స్వాహా శబ్దము నుచ్చరించుచు అగ్నియందు హవిస్సు నుంచుట స్వాహాకృత మనఁబడును.

స్తోకములు : హోమము చేయునపుడు క్రింద పడిన ఆజ్య బిందువులు స్తోకము లనఁబడును.

స్తోమము : ఋగ్వేదమువలన, ఆవృత్తి భేదమువలన నిష్పన్నమైన సామసంఘము 'స్తోమము' అనఁబడును.

హవిర్ధానము : హవిర్ధానము=హవిస్సును వహించునది. (యజ్ఞమునందు హవిస్సును వహించు శకటము హవిర్ధానముగా వర్ణింపఁబడినది. హవిశ్శబ్దము ఉపపదముగాఁ గల ధారణ పోషణార్థకమైన 'ధా' ధాతువునకు ల్యుట్ ప్రత్యయము చేయఁగా అనాదేశము వచ్చి 'హవిర్ధానమ్' అయినది.)

హుతము : అగ్నియందు హవిస్సు నుంచుట 'హుతము' అనఁబడును.

క్షేమము : ఉన్నదానిని నష్టము కాకుండునట్లు కాపాడుకొనుట క్షేమము.

ప్రథమ కాండము

విషయసూచిక

ప్రథమ ప్రపాఠకము

	విషయము	పుట
	భాష్యకారోపోద్ఘాతము	 1
1.	వత్సాపకరణార్థ మంత్రములు	 4
2.	బర్హిరాహరణ మంత్రములు	 6
3.	దోహన మంత్రములు	 10
4.	హవిర్నిర్వాపార్థ మంత్రములు	 13
5.	వ్రీహ్యవఘాతార్థ మంత్రములు	 18
6.	తండులపేషణార్థ మంత్రములు	 23
7.	కపాలోపధానార్థ మంత్రములు	 26
8.	పురోడాశ నిష్పాదనార్థ మంత్రములు	 29
9.	వేదికరణార్థ మంత్రములు	 32
10.	హవిర్గ్రహణ ప్రకరణము	 37
11.	ఇధ్మసంనహనాది ప్రకరణము	 42
12.	అఘారహోమ ప్రకరణము	 46
13.	స్రుగ్వ్యూహనాది మంత్రములు	 49
14.	యాజ్యాపురోనువాక్య మంత్రములు	 55

ద్వితీయ ప్రపాఠకము

	విషయము	పుట
1.	ప్రాగ్వంశ ప్రవేశ ప్రకరణము	 60
2.	దీక్షా ప్రకరణము	 64
3.	దేవయజన స్వీకార ప్రకరణము	 68
4.	సోమక్రయణీ విషయ హోమాదికము	 72
5.	సోమక్రయణీ పద సంగ్రహాభిధానము	 72
6.	సోమోన్మాన ప్రకరణము	 78
7.	సోమక్రయ ప్రకరణము	 80
8.	సోమమునకు శకటారోహణము	 82
9.	యాగశాలకు శకటగమనము	 85
10.	ఆతిథ్యేష్టి	 87
11.	ఉపసద్వర్ణనము	 91
12.	ఉత్తరవేద్యభిధానము	 94
13.	హవిర్ధానాభిధానము	 97
14.	కామ్య సామిధేనీ యాజ్యాపురోనువాక్యలు	 101

తృతీయ ప్రపాఠకము

	విషయము	పుట
1.	సదో నిర్మాణాదికము	 108
2.	ఉపరవాభిధానము	 111
3.	ధిష్ణియాభిధానము	 114
4.	వైసర్జనీయ హోమాభిధానము	 116
5.	యూప చ్ఛేదనాభిధానము	 120
6.	యూప స్థాపనము	 122
7.	పశూపాకరణము	 126
8.	పశు విశసనము	 129
9.	పశు వపోత్ఖేదనము	 132
10.	వసా హోమము	 135
11.	ఉపషట్సంజ్ఞక హోమము	 137
12.	వసతీ వరీ జలోపాదానము	 139
13.	సోమోపావరోహము	 141
14.	యాజ్యా పురోనువాక్యలు	 145

చతుర్థ ప్రపాఠకము

	విషయము	పుట
1.	సోమాభిషవము	 154
2.	ఉపాంశు గ్రహాభిధానము	 157
3.	అంతర్యామ గ్రహాభిధానము	 159
4.	ఐంద్ర వాయవ గ్రహాభిధానము	 161
5.	మైత్రావరుణ గ్రహాభిధానము	 163
6, 7.	ఆశ్విన గ్రహాభిధానము	 164
8.	శుక్ర గ్రహాభిధానము	 166
9.	మన్థి గ్రహాభిధానము	 167
10, 11.	ఆగ్రయణ గ్రహాభిధానము	168, 169
12.	ఉక్థ్య గ్రహాభిధానము	 170
13.	ధ్రువ గ్రహాభిధానము	 171
14.	ఋతు గ్రహాభిధానము	 172
15.	ఐంద్రాగ్న గ్రహాభిధానము	 173
16.	వైశ్వ గ్రహాభిధానము	 174
17.	మరుత్వతీయ గ్రహాభిధానము	 175

విషయము	పుట
18. మరుత్వతీయ మాహేంద్ర గ్రహాభిధానము	 176
19. మరుత్వతీయేష్టి గ్రహాభిధానము	 177
20. మాహేంద్ర గ్రహాభిధానము	 178
21. ,, ,,	 179
22. ఆదిత్య గ్రహాభిధానము	 180
23, 24, 25. సావిత్ర గ్రహాభిధానము	 182
26. వైశ్వదేవ గ్రహాభిధానము	 185
27. పాత్నీవత గ్రహాభిధానము	... 186
28. హారియోజన గ్రహాభిధానము	 187
29. అతిగ్రాహ్య గ్రహాభిధానము	 188
30, 31, 32, 33, 34, 35, 36 ,, ,,	189-195
37, 38, 39, 40, 41, 42. షోడశి గ్రహాభిధానము	196-201
43. దక్షిణా వర్ణనము	 202
44. సమిష్ట యజుర్హోమము	 207
45. అవభృథాభిధానము	 211
46. కామ్య యాజ్యా పురోనువాక్యలు	 215

పంచమ ప్రపాఠకము

1. పునరాధానము	 221
2. ,,	
3. పునరాధాన మంత్రములు	
4. ,,	
5. అగ్న్యుపస్థానము	 239
6. ,,	 245
7. పంచమానువాక మంత్ర వ్యాఖ్యానము	 249
8. షష్ఠానువాకోక్త మంత్ర వ్యాఖ్యానము	 255
9. అగ్న్యుపస్థానము	 260
10. దర్శపూర్ణమాసాంగ మంత్రములు	 267
11. కామ్య యాజ్యా పురోనువాక్యలు	 273

షష్ఠప్రపాఠకము

1. ఆజ్య గ్రహణానుమంత్రణము	 279
2. హవిర్హోమానుమంత్రణము	 281
3. భక్ష్యేడాది భాగానుమంత్రణము	 287
4. అనుయాజాద్యనుమంత్రణము	 292
5. ఆప్యాయనాది మంత్రములు	 296
6. సూర్యోపస్థానాదికము	 300
7. దేవతాది పరిగ్రహాది విధి	 305
8. యజ్ఞాయుధ సంభృత్యభిధానము	 309
9. ద్వాదశ సంపత్తి	 315
10. హవిస్సాదనవిధి	 321
11. ఆశ్రావణాది మంత్రములు	 327
12. యాజ్యా పురోనువాక్యలు	 333

సప్తమ ప్రపాఠకము

విషయము	పుట
1. ఇడానుమంత్రణము	 341
2. ఇడా ప్రశంస	 348
3. అన్వాహార్యాభిధానము	 353
4. శేషాహుత్యనుమంత్రణ మంత్ర వ్యాఖ్యానము	 357
5. ఆప్యాయనాద్యనుమంత్రణ మంత్ర వ్యాఖ్యానము	 365
6. ఉపస్థానాది మంత్ర వ్యాఖ్యానము	 369
7. వాజపేయ రథ మంత్రములు	 376
8. రథ ధావన మంత్రములు	 381
9. యూపారోహణాభిధానము	 386
10. వాజపేయోపయుక్తాన్న హోమము	 389
11. ఉజ్జితి మంత్రాభిధానము	 393
12. అతిగ్రాహ్య మంత్రములు	 395
13. యాజ్యా పురోనువాక్యలు	 399

అష్టమ ప్రపాఠకము

1. రాజసూయ నైరృత మంత్రములు	 405
2. రాజసూయ యాగ మంత్రములు	 407
3. వరుణ ప్రఘాసాభిధానము	 408
4. చాతుర్మాస్య తృతీయ పర్వము	 410
5. ,,	 412
6. తృతీయ సాకమేధ పర్వము	 416
7. శునాశీర్యాది మంత్రములు	 420
8. దేవికాది కర్మషట్కము	 422
9. రత్ని హవిరభిధానము	 425
10. దేవసూ హవిరభిధానము	 427
11. అభిషేకజల విషయ మంత్రములు	 430
12. అభిషేకజల సంస్కార మంత్రములు	 432
13. దిగ్వ్యాస్థాపన మంత్రములు	 436
14. అభిషేకాభిధానము	 440
15. విజయాభిధానము	 443
16. రాజుయొక్క సర్వసేవ్యత్వ వర్ణనము	 446
17. సర్వసేవ్యత్వ వర్ణనము	 449
18. సంసృప హవిరభిధానము	 450
19. అవేష్ట్యాది విధి	 453
20. అవేష్టి పశుద్వయ సౌత్యదూత హవిరభిధానము	 455
21. సౌత్రామణీ మంత్ర పశు హవిరభిధానము	 456
22. యాజ్యా పురోనువాక్యలు	 459
ప్రథమకాణ్డ విషయ సమీక్ష	 466

గ్రంథ నియమములు

శ్రీమత్సాయణాచార్య విరచిత భాష్యమును ప్రమాణముగాఁ గైకొని యీ వేదార్థ దీపిక వ్రాయఁబడినది. అక్కడక్కడ కొన్నిపదములకు విశేషార్థములను నిర్ణయించుటలోను వ్యుత్పత్త్యర్థములను గ్రహించుటలోను భట్టభాస్కర భాష్యము కూడ ప్రమాణముగ తీసికొనఁబడినది. మంత్రములలోని ఉదాత్తానుదాత్తాది స్వరములను నిర్దేశించుటలో ఆనందాశ్రమ ముద్రణాలయము (పూనే) వారి సాయణ భాష్య సహిత కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహిత, చెన్నపురి వైదిక ముద్రాయంత్రమున తెలుగు లిపిలో ముద్రితమైన కృష్ణయజుర్వేద తైత్తిరీయ సంహితయు ప్రమాణములుగా గ్రహించఁబడినవి. (ఈ తెలుగు లిపి గ్రంథము 1894 సంవత్సరమున మద్రాసు జూబ్లీ ప్రెస్సులోను, శ్రీరామవిలాస్ ప్రెస్సులోను ముద్రిత మైనది.) ప్రతిపదార్థమును వ్రాయునపుడు మూలమంత్రములలో లేని పదములు సాయణ భాష్యాధారముగ అధ్యాహారము చేయఁబడినవి. అట్టి అధ్యాహృతములైన పదములు కుండలీ కరణము (బ్రాకెట్) చేయఁబడినవి. రచనా విషయమున గ్రాంథిక భాషయే వాడఁబడినది. కాని, ఏకపద సంధులు సమాస సంధులు మాత్రమే పాటించఁబడినవి. వాక్య సంధులు పాటింపఁబడలేదు. ఒక మారు అర్థము వ్రాయఁబడిన పదములు మరల ఆవృత్తము లైనప్పుడు వానికి ఒక్కొకచోట అర్థము వ్రాయఁబడినది. ఒక్కొకచోట అన్వయ క్రమము మాత్రము చూపఁబడినది. కొన్ని కొన్ని పదముల సాధుత్వమును నిరూపించుటలోను, అవసరమైన స్థలమున కొన్నిపదముల స్వరూపమును నిర్దేశించుటలోను పాణినీయ సూత్రములను ధాతుపాఠమును తత్త్వబోధిని గ్రంథమును ప్రమాణములుగా స్వీకరింపఁబడినవి.

భాష్యకారుల వ్యవహారము ననుసరించి అనువాకారంభమునందు కాండ మనియు, ప్రాచీన సంప్రదాయానుగత వ్యవహారము ననుసరించి అనువాకాంతమునందు ప్రపాఠకాంతమునందును అష్టక మనియు వాడఁబడినది.

ఇట్లు
బుధజన విధేయులు
శిరోమణి రామవరపు కృష్ణమూర్తి శాస్త్రి
డాక్టరు. దివాకర్ల వేంకటావధాని

శ్రీ

అంకితము



ఓం విశ్వాని దేవ సవితర్దురితాని పరాసువ।

యద్భద్రం తన్మ ఆసువ।

ఓం శాన్తి శ్శాన్తి శ్శాన్తిః।

వేద వేదాన్త వేద్యో యో నిఖిలాగమ సంస్తుతః।
వేదార్థదీపికా తస్మై వేఙ్కటేశాయ దీయతే॥

సకలామ్నాయవనీవిహారుఁడు జగత్సర్గ స్థితి ధ్వంస కా
రకుఁ డవ్యాజకృపాపరుండు శ్రితసంరక్షైక దక్షుండు శే
షకుభృ న్మందిరుఁడౌ శ్రియఃపతికి భాస్వద్భక్తి వేదార్థ దీ
పిక నర్పించెద వేంకటేశ్వరునకున్ వేమాఱు కేల్మోడ్చుచున్.

శిరోమణి, భాషాప్రవీణ
తర్కవ్యాకరణ పూర్వోత్తర మీమాంసా విశారద
రామవరపు కృష్ణమూర్తి శాస్త్రి

ఓం తత్సద్బ్రహ్మణే నమః

కృష్ణ యజుర్వేదీయ తైత్తిరీయ సంహిత

వేదార్థదీపికాసహితము

ప్రథమకాణ్డే ప్రథమప్రపాఠకే ప్రథమోఽనువాకః

గజవదనమచిన్త్యం తీక్ష్ణదన్తం త్రినేత్రం
బృహదుదరవిశేషం భూతరాజం పురాణమ్।
అమరవరసుపూజ్యం రక్తవర్ణం సురేశం
పశుపతిసుతమీశం విఘ్నరాజం నమామి॥

వాగీశాద్యాస్సుమనసః సర్వార్థానాముపక్రమే।
యం నత్వా కృతకృత్యాస్స్యుః తం నమామి గజాననమ్॥

అఙ్కుశం చాక్షసూత్రం చ పాశపుస్తకధారిణీమ్।
ముక్తాహార సమాయుక్తాం దేవీం ధ్యాయే చ్చతుర్భుజామ్॥

నమామి విష్ణుం విధియజ్ఞరూపం సరస్వతీం చాపి తదీయజిహ్వామ్।
త్రైవిద్యవృద్ధాన్విదుషో గురూంశ్చ బౌధాయనాచార్యపదద్వయం చ॥

యస్య నిశ్వసితం వేదా యో వేదేభ్యోఽఖిలం జగత్।
నిర్మమే తమహం వన్దే విద్యాతీర్థమహేశ్వరమ్॥

వన్దారుజనమన్దారం ప్రణిపత్య రఘూద్వహమ్।
వేదార్థదీపికా వ్యాఖ్యా క్రియతే సుమనో ముదే॥

భాష్యకారోపోద్ఘాతము

వేదార్థమును వ్రాయుటకు ముందు 'వేదమనగా నేమి? ఆ వేదమునకు లక్షణ మేమి? దానికి ప్రామాణ్య మెట్లు?' అను విషయమును తెలిసికొనవలెను. ఆ విషయము తెలిసినఁ గాని వేదము వ్యాఖ్యానయోగ్యము కాదు.

ఇష్టప్రాప్తికి అనిష్టపరిహారమునకు అలౌకికోపాయమును తెలియఁజేయు గ్రంథము వేదము. ఇచట అలౌకిక పదము చేత ప్రత్యక్షానుమానములు వ్యావృత్తము లగుచున్నవి. అనుభూయమాన స్రక్చందనవనితాదులకు ఇష్టప్రాప్తిహేతుత్వము, ఔషధసేవాదులకు అనిష్టపరిహారహేతుత్వము ప్రత్యక్ష ప్రమాణమువలననే సిద్ధించుచున్నవి. అనుభవింపఁబడఁబోవు స్రక్చందన వనితాదులకు ఇష్టప్రాప్తిహేతుత్వము, ఔషధసేవాదులకు అనిష్టపరిహారహేతుత్వము అనుమానగమ్యములు. జ్యోతిష్టోమాది కము ఇష్టప్రాప్తిహేతు వనియు, కలంజభక్షణవర్జనాదికము అనిష్టపరిహారహేతు వనియు వేదవ్యతిరేకమైన అనుమాన సహస్రము చేతఁగూడ ఊహించుటకు తార్కిక శిరోమణులు సమర్థులు కానేరరు. కావున 'అలౌకికోపాయ బోధకము వేదము' అను లక్షణ మునకు అతివ్యాప్తి లేదు. కావుననే —

" ప్రత్యక్షేణానుమిత్యా వా యస్తూపాయో న బుధ్యతే।
ఏనం విదన్తి వేదేన తస్మాద్వేదస్య వేదతా॥ "

ప్రత్యక్షానుమానములచేఁ దెలియఁబడని ఉపాయమును తెలియఁజేయునది కావున వేదమునకు వేదత్వము సిద్ధించు చున్నది. పూర్వోక్తమైన అలౌకికోపాయమే వేదమునకు విషయము. తద్వేదబోధయే ప్రయోజనము. ఆ బోధను కోరునట్టి పురుషుఁడు అధికారి. ఆ యధికారితోఁగూడ కల ఉపకార్యోపకారకభావము సంబంధము. ప్రత్యక్షాదులచే సిద్ధించని అలౌకికోపా యమును బోధించుటచే వేదమునకు ప్రామాణ్యము స్వతస్సిద్ధమైనది. పౌరుషేయవాక్యము బోధకమైనను సత్పురుషగత భ్రాంతి సంభవించవచ్చును. కావున తత్పరిహారమునకై మూలప్రమాణ మపేక్షితమై యుండును. వేదము నిత్యము కనుక వక్తృదోషశంకయే కలుగనేరదు. ప్రమాణాంతరాపేక్షయు ఉండదు. కనుకనే జైమినిమహర్షి "తత్ప్రమాణం బాదరాయణ స్యానపేక్షితత్వాత్" అని సూత్రీకరించియుండెను.

"ఋచః సామాని జజ్ఞిరే। ఛన్దాగ్ంసి జజ్ఞిరే తస్మాత్। యజుస్తస్మాదజాయత" అను శ్రుతి వేదమును బ్రహ్మకార్య ముగా చెప్పుటచే కాళిదాసాది వాక్యమువలె వేదముకూడ పౌరుషేయమే. కనుకనే భగవత్స్వరూపుడగు బాదరాయణమహర్షి "శాస్త్ర యోనిత్వాత్" అను బ్రహ్మసూత్రమునందు బ్రహ్మ వేదకారణ మని నిర్వచించియుండెను కదా? అని యనరాదు. "వాచా విరూపనిత్యయా" అను శ్రుతియు, "అనాదినిధనా వాగుత్సృష్టా స్వయంభువా" అను స్మృతియు వేదనిత్యత్వము నుద్ఘాటించుచున్నవి. కావుననే బాదరాయణమహర్షియు దేవతాధికరణమునందు "అతఏవ చ నిత్యత్వమ్" అను సూత్ర ముచే వేదనిత్యత్వమును ప్రతిపాదించిరి. ఇట్లు చెప్పినచో 'శాస్త్రయోనిత్వాత్' 'అత ఏవ చ నిత్యత్వమ్' అను రెండు సూత్రములు పరస్పర విరుద్ధ సిద్ధాంతముల నుపపాదించుట అయుక్తము కాదా? అనవచ్చును. వేదనిత్యత్వప్రతిపాదకమైన బ్రహ్మసూత్రము వ్యావహారిక నిత్యత్వమునే చెప్పినది. కాని త్రికాలాబాధ్యత్వ రూపబ్రహ్మనిత్యత్వమువంటి నిత్యత్వమును చెప్పుట లేదు. సృష్టి కనంతరము సంహారమునకుఁ బూర్వము కల కాలము వ్యవహారకాలము. ఈ వ్యవహారకాలమునందు వేదము నకు ఉత్పత్తికాని, వినాశముకాని కనుపించుటలేదు. వేదము కాళిదాసాది వాక్యమువలె పురుషవిరచితము కాదు కావున కాలా కాశాదులవలె వ్యవహారకాలమునందు నిత్యము. ఆదిసృష్టియందు కాలాకాశాదులవలెనే బ్రహ్మ సమీపము నుండి వేదోత్పత్తి యేర్పడినది. కావున పై రెండు సూత్రములు చెప్పిన యర్థములందు విషయభేదము కలదు కనుక ఆ రెండింటికి పరస్పర విరోధము లేదు. బ్రహ్మ దోషరహితుఁడు కావున వేదమునకు వక్తృదోషము లేకుండుటచే వేదప్రామాణ్యము స్వతస్సిద్ధమైన దని స్పష్టమగుచున్నది. కావున లక్షణ ప్రమాణము లుండుటచేతను, విషయప్రయోజన సంబంధాధికారులు ఉండుటచేతను, ప్రామా ణ్యము సుస్థిత మగుటచేతను వేదము వ్యాఖ్యానింపఁ దగినదియే.

పూర్వోక్త విషయప్రయోజన సంబంధాధికారి సద్భావము నభిలక్షించి "స్వాధ్యాయోఽధ్యేతవ్యః" అని అధ్యయనము విధింపఁబడినది. పాఠమాత్రమే అధ్యయన శబ్దవాచ్యము కావున అర్థబోధ ఈ విధిచే నభిహితము కాలేదు. కనుక వేదము వ్యాఖ్యా నింప నవసరములేదని యనరాదు. అధ్యయనవిధి బోధపర్యవసాయి యని పలువురు భట్టమతానుసారులగు మీమాంసకులు స్పష్ట పఱచినారు. కనుకనే

"యదధీత మవిజ్ఞాతం నిగదేనైవ శబ్ద్యతే।
అనగ్నావివ శుష్కైధో నతజ్జ్వలతి కర్హిచిత్॥

"స్థాణురయం భారహారః కిలాభూత్। అధీత్య వేదం న విజానాతి యోఽర్థమ్।
యోఽర్థజ్ఞ ఇత్సకలం భద్ర మశ్నుతే నాకమేతి జ్ఞానవిధూతపాప్మా॥"

"బ్రాహ్మణేన నిష్కారణో ధర్మః షడఙ్గో వేదోఽధ్యేయో జ్ఞేయశ్చ" అని బహుముఖముగ వేదాధ్యయనముతోఁబాటు వేదార్థ బోధకూడ విహితమైయున్నది. వేదపాఠమును మాత్రము అధ్యయనముచేసి తదర్థమును తెలిసికొననిచో ఆ వేదపాఠము అగ్నిలేని చోట ఎండు సమిధయు జ్వలింపని విధముగ ప్రకాశింపదు. వేదమును అధ్యయనము మాత్రముచేసి తదర్థమును తెలియనివాఁడు బరువును మోయు స్థాణువువంటి వాఁడే యగుచున్నాఁడు. వేదార్థవేత్త సకల శ్రేయస్సును పొందుచున్నాఁడు. వేదార్థ జ్ఞానముచే పాపమును పోగొట్టుకొని స్వర్గమును పొందుచున్నాఁడని ఈ పై శ్రుతి వాక్యముల వలన అవగతమగుచున్నది.

"సర్వం పాప్మానం తరతి తరతి బ్రహ్మహత్యాం యోఽశ్వమేధేన యజతే। య ఉ చైన మేవం వేద" - అశ్వమేధ యాగము చేసిన యతఁడు సర్వపాపమును పోగొట్టుకొనుచున్నాఁడు. బ్రహ్మహత్యాదోషమునుగూడఁ బోగొట్టుకొనుచున్నాఁడు. ఏతద్విషయక జ్ఞానవంతుఁడుకూడ బ్రహ్మహత్యాది సర్వపాపములను పోగొట్టుకొనుచున్నాఁడు అని కర్మవిధాయక వాక్యము లచే తత్తత్కర్మ విషయక జ్ఞానముకూడ విధింపఁబడినది. తత్తత్కర్మ విషయక జ్ఞానము కలిగి కర్మలుచేయు నతనికి తత్తత్కర్మ ఫలము అతిశయముగ కలుగునని "ఉభౌ కురుతో యశ్చైతదేవం వేద యశ్చ న వేద" అని విద్వదవిద్వత్ప్రయోగముల నుద్దేశించి "యదేవ విద్యయా కరోతి తదేవ వీర్యవత్తరం భవతి" అని చెప్పిన శ్రుతివాక్యముల వలననే వేదార్థజ్ఞానమత్యం తావశ్యక మని స్పష్టముగఁ దెలియుచున్నది. మఱియు తత్తద్విధి వాక్యముల సమీపమున "య ఏవం వేద" అను వాక్యములు బహుళముగ వేదార్థవేదనమువలననే ఫలము కలుగునని చెప్పుచున్నవి. వేయేల? వేదార్థమును దెలిసికొనుట వలన విశేష ఫలము కలదు. కావున వేదార్థమును తెలిసికొనుటకై వేదము వ్యాఖ్యానింపఁబడుచున్నది.

హరిః ఓమ్

మూలము: [1]ఇషే త్వో[2]ర్జే త్వా[3]వాయవస్థోప పాయవస్థ [4]దేవో వస్సవితా ప్రార్పయతు శ్రేష్ఠతమాయ కర్మణ [5]ఆప్యాయధ్వమఘ్నియా దేవభాగ మూర్జస్వతీః పయస్వతీః ప్రజావతీరనమీవా అయక్ష్మామావ స్తేన ఈశత మాఘశగ్ంసో [6]రుద్రస్య హేతిః పరివో వృణక్తు[7]ధ్రువా అస్మిన్ గోపతౌ స్యాత బహ్వీ[8]ర్య జమానస్య పశూన్పాహి॥ (ఇషే త్రిచత్వారిగ్ంశత్।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ప్రథమప్రపాఠకే ప్రథమోఽనువాకః।

వేదార్థదీపిక

అవతారిక : దర్శయాగముచేయఁగోరు యజమానుని నిమిత్తము అధ్వర్యుఁడు అమావాస్యనాటి ఉదయమున అన్వాధానము (సమిదాధాన రూపకర్మవిశేషము) చేసినపిమ్మట వత్సాపాకరణార్థక మంత్రము నుచ్చరించుచు మోదుగుకొమ్మను నఱుకవలెను. (యజ్ఞము చేయించువాఁడు అధ్వర్యుఁడు. ఋత్విజులలో నితఁడు ప్రధాన వ్యక్తి.)

1. **అర్థము:** (హే పలాశ!=ఓ మోదుగుకొమ్మా!), ఇషే=(దేవతలకు దధిరూపమైన) అన్నముకొఱకు, త్వా=నిన్ను, (అచ్ఛినద్మి=నఱుకుచున్నాను.)

2. **అర్థము:** ఊర్జే=(దేవతలకు బలము నిచ్చునట్టి) రసముకొఱకు, త్వా=నిన్ను, (అనుమార్జ్మి=శుభ్రముచేయుచున్నాను, లేదా–సన్నమయామి=సరిచేయు చున్నాను.)

తాత్పర్యము: ఓ పలాశమా! దేవతలకు అన్నము నిమిత్తము నిన్ను నఱుకుచున్నాను. దేవతలకు బలప్రదమైన రసము కొఱకు నిన్ను శుభ్రము చేయుచున్నాను. లేదా–సరిచేయుచున్నాను.

విశేషాంశములు: "ఇషే త్వోర్జే త్వా" మంత్రము ఒకటియే యని బౌధాయన మహర్షి మతము. ఈ పక్షమున "అచ్ఛినద్మి" అను క్రియాపదము మాత్రము అధ్యాహారము చేయవలయును. ఆపస్తంబ మహర్షి యీ పక్షము నంగీకరించి పైని వ్రాసిన విధముగ మంత్రభేదపక్షమును గూడ నాశ్రయించిరి. వీరి పక్షమున అచ్ఛినద్మి, అనుమార్జ్మి – లేక సన్నమయామి అను క్రియా పదములను అధ్యాహారము చేయవలెను. అనుమార్జన మనఁగా నఱికిన మోదుగుకొమ్మను ధూళిపోవుటకై శుభ్రముచేయుట. సన్నమన మనఁగా ఆ పలాశశాఖను వంకర లేకుండునట్లు సరిచేయుట. ఈ ప్రపాఠకము నందలి మంత్రము లన్నియు అధ్వర్యుఁడు పఠింప వలసినవి. అధ్వర్యుఁడు యజమానునకు భోజనమునకై అన్నమును, బలమునకై రసమును గలుగఁ జేయుచున్నాఁడని ఈ మంత్రపాఠమువలనఁ దెలియుచున్నది.

3. **అర్థము:** హే వాయవః!=(దూడలారా!) (మీరు తల్లులవద్దనుండి వెడలి అరణ్యమునకు) వెళ్లువారు, స్థ=కండు. ఉపాయవః=(సాయంకాలమున యజమానుని గృహమునకు) వచ్చినవారలై, స్థ=ఉండుడు.

తాత్పర్యము: ఓ దూడలారా! మీరు గడ్డిమేయుటకై మీ తల్లులనుండి తొలఁగి అరణ్యమునకు వెళ్లియుండుఁడు. సాయంకాలమున తిరిగి యజమానుని గృహమునకు వచ్చియుండుఁడు. (అధ్వర్యుఁడు ఈ మంత్రము నుచ్చరించుచు ఆలదూడలను మోదుగుకొమ్మతో నదలించుచు నావులనుండి తొలఁగించవలెను. వాన్తి - గచ్ఛన్తీతి - వాయవః = గన్తారః అని యర్థము. ఉప = సమీపే, ఆయన్తి = ఆగచ్ఛన్తీతి-ఉపాయవః ఆగన్తారః అని యర్థము.)

4. **అర్థము:** (హే గావః!=ఓ యావులారా!) వః=మిమ్ము, సవితా=ప్రేరకుఁడైన, దేవః=పరమేశ్వరుఁడు, శ్రేష్ఠతమాయ=మిక్కిలి శ్రేష్ఠమైన, కర్మణే=(ఇష్టిరూపమైన) కర్మకొఱకు, ప్రార్పయతు=(అరణ్యమునందు గడ్డిమేయుటకు) ప్రేరణచేయుఁగాక.

తాత్పర్యము: ఆవులారా! ప్రేరకుఁడైన పరమేశ్వరుఁడు అత్యంత శ్రేష్ఠమైన యిష్టి యనెడి కర్మనిమిత్తము మిమ్ము అరణ్యమునందు గడ్డిమేయుటకుఁ బ్రేరణచేయుఁగాక. (అధ్వర్యుఁడు ఈ మంత్రము చెప్పుచు అవుల నడవి యందు గడ్డిమేయుటకై మోదుగుకొమ్మతోఁ దోలవలెను.)

5. **అర్థము:** హే అఘ్నియాః!=ఓ గోవులారా! దేవభాగమ్=(దేవేంద్రున కీయఁదగిన (దధిరూపమైన) భాగమును, ఆప్యాయధ్వమ్=(విశేషముగ గడ్డితినుటచే) వృద్ధినొందించుఁడు. ఊర్జస్వతీః=అత్యంతరసముకలిగినట్టియు, పయస్వతీః=ఎక్కువపాలు కలిగినట్టియు, ప్రజావతీః=బహుసంతానము కలిగినట్టియు, అనమీవాః=క్రిమిదోషములు లేనట్టియు, అయక్ష్మాః=ఇతరరోగములు లేనట్టియు, వః=మిమ్ము, స్తేనః=చోరుఁడు, మా + ఈశత=(అపహరించుటకు) సమర్థుఁడు కాకుండుఁగాక, అఘశంసః=క్రూరజంతువు, మా + ఈశత=(హింసించుటకు) సమర్థముకాకపోవుఁగాక.

తాత్పర్యము: ఓ గోవులారా! మీరు దేవేంద్రున కీయఁదగిన దధిరూపభాగమును విశేషముగ గడ్డిని మేసి వృద్ధినొందించుఁడు. మీరు అత్యంత రసము కలవారు. ఎక్కువ పాలు కలిగినవారు, బహుసంతానము కలవారు. క్రిమి దోషములు ఇతరరోగములును లేనివారు. అట్టి మిమ్ము దొంగ అపహరించుట కసమర్థుఁ డగుఁగాక. క్రూరజంతువు హింసించుటకు సమర్థము కాక పోవుఁగాక. (యాగప్రవృత్తికిఁ బూర్వము గోగ్రాసముచేత గోక్షీరమున వత్స భాగము మనుష్య భాగము వృద్ధినొందును. యాగప్రవృత్త్యనంతరము గోగ్రాసముచే క్షీరాజ్యరూపమైన దధి రూపమగు నింద్రభాగముకూడ వృద్ధినొందునని బ్రాహ్మణమునఁ జెప్పఁబడియుండుటచే నిచట దేవేంద్రుని భాగమని అర్థము వ్రాయఁబడినది. మేఁతకై యడవికి బయలుదేరిన యావులలో నొకదానిని మోదుగు కొమ్మచేఁగాని, దర్భలచేఁగాని అధ్వర్యుఁడు ఈ మంత్రము నుచ్చరించుచు స్పృశించవలెను.)

6. **అర్థము:** రుద్రస్య=రుద్రుఁడను పేరుగల క్రూరదేవునియొక్క, హేతిః=ఆయుధము, వః=మిమ్ము, పరివృణక్తు=అంతట విడుచుఁగాక.

తాత్పర్యము: ఓ యావులారా! క్రూరుఁడయిన రుద్రదేవుని యాయుధము మిమ్ము బాధింపకుండుఁగాక. (అధ్వర్యుఁడు ఈ మంత్రము నుచ్చరించుచు గోవుల ననుమంత్రణ చేయవలెను.)

7. **అర్థము:** (హే గావః=ఓ గోవులారా! భవత్యః=మీరు) అస్మిన్=ఈ, గోపతౌ=గోస్వామియగు యజమానునియందు, ధ్రువాః=స్థిరమైనవారును, బహ్వీః=(సంతాన పరంపరచే) అనేకులుగాను, (=వృద్ధికలవారుగా) స్యాత=కండు.

తాత్పర్యము: ఓ యావులారా! మీరు ఈ యజమానుని యొద్ద సంతాన పరంపరచే వృద్ధినొందుచు స్థిరముగ నుండుఁడు. (అధ్వర్యుఁ డీ మంత్రము నుచ్చరించుచు యజమానునిఁ జూడవలెను.)

8. **అర్థము:** (హే పలాశ!=ఓ మోదుగుకొమ్మా! త్వమ్=నీవు) యజమానస్య=యజమానునియొక్క, పశూన్=పశువులను (గోవులను), పాహి=రక్షింపుము.

తాత్పర్యము: ఓ పలాశశాఖా! నీవు యజమానుని గోవులను రక్షింపుము. (అధ్వర్యుఁడు ఈ మంత్రమునుచ్చరించుచు మోదుగు కొమ్మను అగ్నిశాలయందు పైన నుంచవలెను.)

ప్రథమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ప్రథమప్రపాఠకే ద్వితీయోఽనువాకః

మూలము: [1]యజ్ఞస్య ఘోషదసి[2]ప్రత్యుష్టగ్ం రక్షః ప్రత్యుష్టా అరాతయః[3]ప్రేయమగాద్ధిషణా బర్హిరచ్ఛమను నాకృతా స్వధయా వితష్టా త ఆవహన్తి కవయః పురస్తాద్దేవేభ్యోజుష్టమిహబర్హి రాసదే [4]దేవానాం పరిషూతమసి వర్ష వృద్ధ మసి[5]దేవ బర్హి ర్మాత్వాఽన్వ జ్మాతిర్యక్ప[6]ర్వ తే రాధ్యాస[7]మాచ్ఛేత్తా తేమా రిషం[8]దేవబర్హిః శతవల్శం విరోహ[9]సహస్రవల్శాః(౧)వివయగ్ం రుహేమ[10]పృథివ్యాస్సం పృచఃపాహి [11]సుసంభృతా త్వా సంభరామ్య[12]దిత్యై రాస్నాఽ[13]సీంద్రాణ్యై సన్నహనం[14]పూషా తే గ్రన్థిం గ్రథ్నాతు[15]సతేమాఽఽస్థా[16]దిన్ద్రస్య త్వా బాహుభ్యాముద్యచ్ఛే[17]బృహస్పతే ర్మూర్ధ్నా హరా [18]మ్యుర్వం తరిక్షమన్విహి[19]దేవంగమమసి ॥ ౨ ॥ (సహస్రవల్శాఅష్టాత్రిగ్ంశచ్చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయతైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ప్రథమ ప్రపాఠకే ద్వితీయోఽనువాకః।

వేదార్థ దీపిక

అవతారిక : ప్రథమానువాకమున వత్సాపకరణము చెప్పఁబడినది. ఈ ద్వితీయానువాకమున బర్హిరాహరణము చెప్పఁబడుచున్నది.

1. అర్థము: (హే అగ్నే!=ఓ యగ్నీ! త్వమ్=నీవు) యజ్ఞస్య=యజ్ఞమునకు, ఘోషత్=సాధనద్రవ్యము (ధనరూపము) అసి=అగుచున్నావు. (ఇచట హే అశ్వపర్శో!=ఓ గుఱ్ఱముయొక్క ప్రక్కభాగమునందలి యెముకా! అనియు సంబోధించవచ్చును. 'ఘోషత్' అనునది ధన విశేషమునకు పేరు.)

తాత్పర్యము: ఓ గార్హపత్యాగ్నీ! నీవు యజ్ఞమునకు 'ఘోషత్' అనుపేరు గల ధన మగుచున్నావు. (అధ్వర్యుఁడీ మంత్రము నుచ్చరించుచు గార్హపత్యాగ్నిని అభిమంత్రించ వలెను. లేదా అశ్వపర్శువు నభిమంత్రించ వలెను. అశ్వము యొక్క ప్రక్కయెముక మిక్కిలి పదను గలిగియుండుటచే బర్హిస్సునుఁగోయుటకు సమర్థమగు నని భావము.)

2. అర్థము: రక్షః=రాక్షసుఁడు, ప్రత్యుష్టమ్=మిక్కిలి దహింపబడినవాఁడు, (భవతు=అగుఁగాక) అరాతయః=శత్రువులు, ప్రత్యుష్టాః=మిక్కిలి దహింపఁబడినవారు, (భవన్తు=అగుదురుఁగాక.)

తాత్పర్యము: రాక్షసుఁడు శత్రువులును నశింతురుఁగాక. (అధ్వర్యుఁడు ఈ మంత్రము నుచ్చరించుచు కత్తిని ఆహవనీయాగ్నియందుఁగాని, గార్హపత్యాగ్నియందుఁగాని వెచ్చ చేయవలెను. యజ్ఞసాధనమైన బర్హిస్సును గోయుటకు గుఱ్ఱము ప్రక్కయెముకను కత్తిగా నుపయోగింప వలెననియు, కోయుటకుముందు దానిని అగ్నియందు వెచ్చ చేయవలె ననియు భావము. కత్తి రాక్షస సంహారకము, శత్రు సంహారకమును గావున ఈ విధముగఁ జెప్పఁబడినది. 'రి=హింసాయామ్' అను ధాతువు వలన రక్షశ్శబ్దము పుట్టినది. 'శ్రేయాంసి బహు విఘ్నాని' అను న్యాయము ననుసరించి ముందుఁజేయఁబోవు యజ్ఞమునకు విఘ్నములు నశింపవలె నను భావముతో అధ్వర్యుఁ డీ విధముగఁ ప్రార్థన చేయుచున్నాడు.)

3. అర్థము: తే=ఆ (ప్రాచీనులైన,) కవయః=విద్వాంసులు (యస్మాత్=ఏ కారణమువలన) పురస్తాత్=తూర్పు దిక్కునుండి, అవహన్తి=(దర్భను) తెచ్చుచున్నారో, (తస్మాత్=ఆ కారణమువలన) దేవేభ్యః=దేవతల కొఱకు, జుష్టమ్=ప్రియమైనదియు, ఇహ=ఈ వేదికయందు, ఆసదే=పఱచుటకుఁ దగినదియునగు, బర్హిః=బర్హిస్సును, (దర్భను) అచ్ఛ=తెచ్చుటకు, మనునా=మనుప్రజాపతిచేత, కృతా=చేయఁబడినదియు, స్వధయా=(తినిన) ఆహారముచేత, వితష్టా=మిక్కిలి పదనుచేయఁబడినదియు నగు, ఇయమ్=ఈ గుఱ్ఱము ప్రక్కయెముక, ధిషణా=(జ్ఞానరూప మగుటచే) తెలిసినదై, ప్రాగాత్=తూర్పు దిక్కునకుఁ బోవుచున్నది. ('అగాత్' అనునది వర్తమానార్థమున భూతకాలిక ప్రయోగము.)

తాత్పర్యము: పూర్వము ప్రాచీన విద్వాంసులు తూర్పు దిక్కునుండి బర్హిస్సును దెచ్చుచుండిరి. కావున జ్ఞాన స్వరూపమును, మనుప్రజాపతి కృతమును, తినిన ఆహారముచే పదను చేయఁబడినదియు నగు నశ్వము ప్రక్కయెముక యజ్ఞవేదికయందుఁ బఱచుటకు సరిపోవు బర్హిస్సును దెచ్చుటకై తూర్పు దిక్కునకుఁ బోవుచున్నది. (అధ్వర్యుఁ డీ మంత్రము నుచ్చరించుచు యజ్ఞవేదికయందుఁ బఱచుటకు సరిపోవు బర్హిస్సును దెచ్చుటకై తూర్పు దిక్కునకుఁ బోవలెను.) బర్హిరాహరణము=బర్హిస్సును దెచ్చుట.

విశేషాంశములు: ఆపస్తంబమహర్షి మతము ననుసరించి యిది యేకమంత్రముగా విద్యారణ్యభాష్యమునఁ జెప్పఁబడినది. ఈ మంత్రమునందు ఋక్కు, యజుస్సును ఉండుటచే (1) 'ప్రత్యుష్టగ్ం రక్షః, (2) ప్రత్యుష్టా అరాతయః' అని రెండు భాగములుగాఁ జేయవచ్చును. ఇందు మొదటిది ఋక్కు, రెండవది యజుస్సు. 'ధిషణా' శబ్దము ధీ యను నర్థముగలది. 'ధారయత్యర్థమితి ధీః' అని వేదనిఘంటువునఁజెప్పఁబడినది. స్వధాశబ్దము – అన్నము, నామము అను రెండర్థములు కలదిగా వేదనిఘంటువునఁ గలదు. 'వితష్టా' అను పదము 'వి' ఇత్యుపసర్గపూర్వక 'తక్షూ=తనూకరణే' అను ధాతువునుండి యుత్పన్నమైనది. 'విశేషేణ తనూకృతా' అని భట్టభాస్కరుల వ్యాఖ్యానము. 'కవృ=వర్ణనే' అను ధాతువునుండి 'కవి' యను పదము ఉత్పన్నమైనది. 'క్రాంతదర్శనో భవతి కవిః' అని నిరుక్తమునఁ గలదు. క్రాంతమ్=అతీతానాగత విప్రకృష్టవిషయమ్, దర్శనమ్=జ్ఞానమ్, యస్య సః='క్రాంతదర్శనః' అని ఉవ్వటాచార్యులు నిర్వచించిరి. 'ఋషయః కవయః' అని మైత్రాయణీయ సంహితలోఁ గలదు.

4. అర్థము: (హే దర్భసమూహ=ఓ దర్భసముదాయమా! త్వమ్=నీవు) దేవానామ్=దేవతల నిమిత్తము, పరిషూతమ్=పరిగ్రహింపఁబడినదానవు, అసి=అగుచున్నావు. వర్షవృద్ధమ్=(మఱల) వర్షముచే వృద్ధినొందినదానవు, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: యజ్ఞ సాధన మయిన బర్హిస్సును గోయుటకు అధ్వర్యుఁడు వెళ్లి "ఓ దర్భ సముదాయమా! దేవతల నిమిత్తము నిన్నుఁ దీసికొనుచున్నాను. నీవు మఱల వర్షముచేత వృద్ధినొందెదవు" అని కోయుటకు ముందు దర్భను స్పృశించవలెను. ఇది ఒకే మంత్రముగ విద్యారణ్యమున వ్రాయఁబడినది. దీనికి సంబంధించిన బ్రాహ్మణమున మాత్రము రెండు మంత్రములుగా ((1) దేవానాం పరిషూతమసి, (2) వర్షవృద్ధమసి) విభజింపఁబడినది.

5. అర్థము: హే దేవబర్హిః=దేవతల కిష్టమైన ఓ దర్భా!, త్వా=నిన్ను, అన్వక్=నిలువుగా (కోయుటచేత) మా (హింసిషమ్)=హింసింపను, తిర్యక్=అడ్డముగా (కోయుటచేతను) మా (హింసిషమ్)=హింసింపను.

తాత్పర్యము: దేవతలకు హితమైన దర్భా! నిన్ను నిలువుగాఁ గోయుటచేతగాని, అడ్డముగాఁ గోయుటచేతఁగాని హింసింపను. (అనగా స్వార్థమునకై నిన్నుఁ గోయుటలేదు. దేవతల నిమిత్తము కోయుచున్నాను. కావున హింసాదోషము నాకు వర్తించదని భావము. అధ్వర్యుఁడు ఈ మంత్రమును జెప్పుచు దర్భను పట్టుకొనవలెను. లోకమునందు రాజసేవకుఁడు రాజాజ్ఞ ననుసరించి ప్రజలనుండి క్షీరాదిద్రవ్యమును బలవంతముగాఁ దీసికొనుచు ఇది నాకుఁగాదు, రాజుగారినిమిత్తము తీసికొనుచున్నానని చెప్పుచున్నవిధము ఇక్కడ స్ఫురించుచున్నది.)

6. అర్థము: (హే బర్హిః=ఓ దర్భా!) తే=నీయొక్క, (మఱల చిగురించుటకు స్థానమైన) పర్వ=గనుపును, రాధ్యాసమ్=(నష్టము కాకుండగ) వృద్ధినొందించెదను.

తాత్పర్యము: ఓ దర్భా! నీ గనుపు నశింపకుండగ వృద్ధినొందించెదను. (అధ్వర్యుఁడు ఈ మంత్రము నుచ్చరించుచు కత్తిని దర్భకుఁ దాకించవలెను. 'రాధ్యాసమ్' అను క్రియాపదము 'రాధ=వృద్ధౌ' అను ధాతువునుండి యేర్పడినది.)

7. అర్థము: (హే బర్హిః=ఓ దర్భా! అహమ్=నేను) ఆచ్ఛేత్తా=కోయువాఁడనైనను, తే=నీకు,(=దర్భకు) మా రిషమ్=హింస చేయను.

తాత్పర్యము: ఓ దర్భా! నేను కోయువాఁడనైనను నీకు హింస చేయను. (అధ్వర్యుఁడీ మంత్రము నుచ్చరించుచు దర్భను గోయవలెను.)

8. అర్థము: హే దేవబర్హిః=దేవతలకుఁ బ్రియమైన ఓ దర్భా! (త్వమ్=నీవు) శతవల్శమ్=నూఱుశాఖలుగా, విరోహ=అంకురింపుము.

తాత్పర్యము: ఓ దర్భా! నీవు అనేక శాఖలుగా నంకురింపుము. (అధ్వర్యుఁడు దర్భను కోయగా మిగిలిన మొదళ్లను ఈ మంత్రము నుచ్చరించుచుఁ దాకవలెను. 'వల్శమ్' అను పదమును శాఖార్థకముగ విద్యారణ్యులవారును, ప్రరోహార్థకముగ భట్టభాస్కరులును వ్యాఖ్యానించినారు. 'వి' ఇత్యుపసర్గపూర్వక 'రుహ-బీజజన్మని, ప్రాదుర్భావే చ' అను ధాతువునుండి 'విరోహ' క్రియాపద మేర్పడినది.)

9. అర్థము: వయమ్=మేము, సహస్రవల్శాః=వేయి (అనేక) శాఖలుగల వారమై, విరుహేమ=వృద్ధి నొందెదము.

తాత్పర్యము: మేము అనేకశాఖలు కలవారముగ వృద్ధి నొందెదము. (ఈ మంత్రము నుచ్చరించుచు అధ్వర్యుఁడు తన హృదయమును స్పృశించుకొనవలెను.)

10. అర్థము: (హే తృణకాష్ఠాద్యాధార=ఓ తృణకాష్ఠాదుల యాధారమా!, త్వమ్=నీవు) పృథివ్యాః=భూమియొక్క, సంపృచః=సంపర్కము నుండి, (ఇమమ్=ఈ దర్భను) పాహి=రక్షింపుము.

తాత్పర్యము: ఓ తృణకాష్ఠాదుల యాధారమా! భూమి సంపర్కము నుండి యీ దర్భను రక్షింపుము. (అధ్వర్యుఁడు ఈ మంత్రము నుచ్చరించుచు కోసిన దర్భను ఏదేని ఒక ఆధారము మీద నుంచవలెను.)

11. అర్థము: (హేదర్భసమూహ=ఓ దర్భల సముదాయమా!) త్వా=నిన్ను, సుసంభృతా=యోగ్యమైన త్రాటిచేత, సంభరామి=సంగ్రహించుచున్నాను.

తాత్పర్యము: ఓ దర్భసమూహమా! నిన్ను మంచి త్రాటిచేత సంగ్రహించుచున్నాను.

12. అర్థము: హే రజ్జో=ఓ త్రాడూ, త్వమ్=నీవు, అదిత్యై=భూమికి, రాస్నా=మొలత్రాడువు, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: దర్భమయమైన ఓ త్రాడూ! నీవు భూమికి మొలత్రాడువు అగుచున్నావు. (అధ్వర్యుఁడీ మంత్రము నుచ్చరించుచు దర్భను త్రాటిమీద నుంచుటకు పూర్వము త్రాటిని ఉత్తరాగ్రముగఁ బఱచవలెను. ('అదిత్యై' అను పదమునందు షష్ఠ్యర్థమున చతుర్థి వాడఁబడినది.)

విశేషాంశములు: భట్టభాస్కర భాష్యమునందు అదితిశబ్దమునకు అనంతుఁడు, అంతములేనివాఁడు అని అర్థము చెప్పఁబడినది. 'అదితిరదీనా' అని నిరుక్తమునఁ గలదు. దీనము కానిదని యర్థము. 'దిఙ్=క్షయే' అను ధాతువు నుండి 'అదితి' శబ్ద ముత్పన్నమైనది. "సకల ప్రపంచ ధారణే ష్వదీనా న స్విద్యతే" అని వేదనిఘంటువు. ఖండన లేనిదియు, క్షీణించనిదియు, సర్వప్రపంచమును ధరించునట్టిదియు నగు లక్షణము పరబ్రహ్మమునకే కలదు కావున ఇచట అదితి శబ్దమునకు భూమియను నర్థము గౌణార్థమునఁ జెప్పఁబడినది. పరబ్రహ్మము ముఖ్యార్థము.

13. అర్థము: సన్నహనమ్=త్రాటిచేత దర్భలసమూహమును బిగించుట, ఇంద్రాణ్యై=ఇంద్రాణీదేవికి (ఇంద్రునిభార్యకు) ప్రియమ్=ఇష్టమైనది.

తాత్పర్యము: దర్భలసముదాయమును త్రాటిచే బంధించుట ఇంద్రాణీదేవి కిష్టమైనది. (కావున అధ్వర్యుఁడు దర్భల సముదాయమును ఈ మంత్రము నుచ్చరించుచు బిగించవలెను.)

విశేషములు: ఇంద్రపదవి నొందిన యింద్రుఁడు పూర్వజన్మమునందు నూఱుయజ్ఞములను జేసియుండవలెను. ఆ యజ్ఞములు చేయుసమయమున ఆ యజ్ఞకర్త తన భార్యయొక్క నడుమును దర్భలత్రాటిచే బంధించవలయును. ఆ విధముగ బంధింపఁ బడినదగుటచే నామె మఱుజన్మమున నింద్రాణియై దేవతలలో నొక విశిష్టస్థానమును బొందియున్నది. వెనుకటి జన్మములోని ఆ బంధనములు ఆమెకు ఇంద్రాణీపదవిని సమకూర్చినవి కావున ఆమెకు దర్భరజ్జు బంధనము ప్రియమై యుండవచ్చునను భావము స్ఫురించుచున్నది.

14. అర్థము: (హే సన్నద్ధరజ్జో!=బిగింపఁబడిన ఓ త్రాడూ!-లేక, హే సన్నద్ధదర్భసమూహ!=బిగింపఁబడిన ఓ దర్భసమూహమా!) తే=నీకు, పూషా=పోషకుఁడైన దేవుఁడు, గ్రన్థిమ్=ముడిని, గ్రథ్నాతు=కూర్చుఁగాక.

తాత్పర్యము: త్రాటిచే బిగింపఁబడిన దర్భసముదాయమా! పోషకుఁడగు భగవంతుఁడు నిన్ను ముడివేయుఁగాక. ఈ మంత్రము నుచ్చరించుచు నధ్వర్యుఁడు త్రాటిని ముడివేయవలయును. 'పూషా=పోషకో దేవః' అని విద్యారణ్యభాష్యము.

15. అర్థము: (హే దర్భ!=ఓ దర్భా!) తే=నీకు, సః=(నిర్బంధకమైన) ఆ ముడి, మా స్థాత్=(చాలకాలము) ఉండకపోవుఁగాక.

తాత్పర్యము: ఓ దర్భా! నిన్ను బంధించిన యీ త్రాటిముడి చిరకాలము ఉండకపోవుఁగాక. (అధ్వర్యుఁడీ మంత్రము నుచ్చరించుచు త్రాటికొనలను ముడియందు గ్రుచ్చవలయును.)

16. అర్థము: (హే దర్భసమూహ!=ఓ దర్భసమూహమా!) త్వా=నిన్ను, ఇంద్రస్య=ఇంద్రునియొక్క, బాహుభ్యామ్=బాహువులచేత, ఉద్యచ్ఛే=ఎత్తుచున్నాను.

తాత్పర్యము: త్రాటిచేఁగట్టఁబడిన దర్భసమూహమా! ఇంద్రుని బాహువులతో నిన్ను ఎత్తుచున్నాను. (అధ్వర్యుఁడీ మంత్రమును జెప్పుచు దర్భల మోపును తలమీఁదఁ బెట్టుకొనుటకుఁ బైకెత్తవలయును. ఈ మంత్రము నందలి ఇంద్రపదప్రయోగముచేత అధ్వర్యునకు ఇంద్రుని సామర్థ్యము సిద్ధించునని ధ్వనించుచున్నది.)

17. అర్థము: (హే దర్భసమూహ!=ఓ దర్భసముదాయమా! త్వా=నిన్ను) బృహస్పతేః=(దేవతలకు గురువైన) బృహస్పతి యొక్క, మూర్ధ్నా=శిరస్సుచేత; హరామి=హరించుచున్నాను.

తాత్పర్యము: ఓ దర్భసమూహమా! నిన్ను బృహస్పతిశిరస్సుచేత ధరించుచున్నాను. (అధ్వర్యుఁడీ మంత్రము నుచ్చరించుచు దర్భలమోపును శిరస్సు పై నుంచుకొనవలెను.)

18. అర్థము: (హేదర్భసమూహ!=ఓ దర్భసముదాయమా!) ఉరు=విస్తీర్ణమైన, అంతరిక్షమ్=ఆకాశమును, అన్విహి=అనుసరించి వెడలుము.

తాత్పర్యము: ఓ దర్భసముదాయమా! నీవు విశాలమైన ఆకాశమున వెడలుము. (దర్భల మోపును తలపై నుంచుకొనిన యధ్వర్యుఁడు యజ్ఞవాటికకు రావలెను.)

19. అర్థము: (హే దర్భసమూహ! ఓ దర్భసముదాయమా!, (త్వమ్=నీవు)దేవంగమమ్=దేవతలను బొందినదానవు, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: ఓ దర్భసముదాయమా! నీవు దేవతలను బొందుదువు. (అధ్వర్యుఁడు ఈ మంత్రము నుచ్చరించుచు దర్భల మోపును యజ్ఞశాలయందలి పై భాగమున నుంచవలెను. మొదటి యనువాకాంతమున మోదుగకొమ్మను పై నుంచినవిధముగ నిట దర్భలమోపును పై భాగమున నుంచవలెను.)

ద్వితీయానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ప్రథమప్రపాఠకే తృతీయోఽనువాకః (దోహన మంత్రములు.)

మూలము: [1]శుంధధ్వం దైవ్యాయ కర్మణే దేవయజ్యాయై[2]మాతరిశ్వనో ఘర్మోఽసి ద్యౌరసి పృథివ్యసి విశ్వ ధాయా అసి పరమేణ ధామ్నా దృగ్ంహస్వ మాహ్వా[3]ర్వసూనాం పవిత్రమసి శతధారం వసూనాం పవిత్రమసి సహస్రధారగ్ం[4]హుతః స్తోకోహుతోద్రప్సోఽగ్నయే బృహస్పతే నాకాయ స్వాహా ద్యావాపృథివీభ్యాగ్ం[5] సా విశ్వాయుః సా విశ్వవ్యచా సా విశ్వకర్మా[6]సంపృచ్యధ్వ మృతావరీ రూర్మిణీర్మధుమత్తమా మన్ద్రా ధనస్య సాతయే[7] సోమేనత్వాఽఽతనచ్మీన్ద్రాయ దధి[8]విష్ణో హవ్యగ్ం రక్షస్వ॥౧॥ (సోమేనాష్టౌ చ)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయసంహితాయాం ప్రథమాష్టకే ప్రథమప్రపాఠకే తృతీయోఽనువాకః

వేదార్థ దీపిక

అవతారిక: వెనుకటి అనువాకద్వయముచే దర్శయాగమునకు అమావాస్యనాటి పగటియందుఁ జేయవలసిన విధానము చెప్పఁబడినది. అమావాస్యనాటి రాత్రియందుఁ జేయవలసిన విధానము ఈ యనువాకమునఁ జెప్పఁబడు చున్నది. ఆవులనుండి పాలుపితుకుటకు రెండుపాత్రలు అవసరములైయున్నవి, ఆ పాత్రలను గూర్చి మొదటి మంత్రము చెప్పుచున్నది.

1. అర్థము: (హే పాత్రే!)=ఓ పాత్రలారా!, యువామ్=మీరు) దేవయజ్యాయై=దేవయాగరూపమైనదియు, దైవ్యాయ= దేవసంబంధమైనదియునగు, కర్మణే=కర్మకొఱకు, శుంధధ్వమ్=పరిశుద్ధి నొందుఁడు.

తాత్పర్యము: ఓ పాత్రలారా! మీరు దేవతాసంబంధియగు దేవయాగరూపకర్మకు పరిశుద్ధినొందుఁడు. (అధ్వర్యుఁడీ-మంత్రము పఠించుచు పాలు పితుకుటకు యోగ్యములైన పాత్రలపై నీటిని ప్రోక్షించవలయును. (ప్రోక్షించుట= నీటిని చల్లుట)

2. అర్థము: (హే పాత్ర!=ఓ పాత్రమా! త్వమ్=నీవు) మాతరిశ్వనః=వాయువునకు ఘర్మః=(సంచారమున కవకాశము నిచ్చుటచే) ప్రకాశరూపమైన అంతరిక్షలోకరూపము, అసి=అగుచున్నావు. ద్యౌః=(స్వర్గలోక సంబంధమైన వర్షోదకముచేఁజేయఁబడియుండుటచే) స్వర్గలోకరూపము, అసి=అగుచున్నావు. పృథివీ=(భూమిసంబంధమైన మట్టితోఁజేయఁ బడియుండుటచే) భూలోకరూపము, అసి=అగుచున్నావు. పరమేణ=గొప్పదియగు, ధామ్నా= సామర్థ్యముచేత, విశ్వధాయాః=ప్రపంచాధారమైన వర్షరూపము, అసి=అగుచున్నావు. దృంహస్వ=దృఢముగానుండుము. మా హ్వాః=భంగము నొందకుము.

తాత్పర్యము: ఓ క్షీరకుంభమా! నీలోని ఆకాశములో వాయుసంచారమున కవకాశముండుటచే నీవు ప్రకాశరూపమైన అంతరిక్ష మగుచున్నావు. ద్యులోకమునుండి పుట్టిన వర్షోదకమువలనను, భూలోకస్థమృత్తికవలనను పుట్టుటచే నీవు ద్యావాపృథివీ (లోకద్వయ) రూపమగుచున్నావు. బహుక్షీర ధారణసామర్థ్యముచే విశ్వధారక వృష్టిరూపము గూడ నగుచున్నావు. కావున నీవు దృఢముగ నుండుము. భగ్నము కావలదు. (అధ్వర్యుఁడు ఈ మంత్రము నుచ్చరించుచు క్షీరపాత్రలలో నొకటియైన కుంభియను పాత్రను అగ్నిమీద నుంచవలెను.)

3. అర్థము: (హే శాఖాపవిత్ర!=ఓ శాఖాపవిత్రమా!, త్వమ్=నీవు) వసూనామ్=ప్రాణముల కాధారములైన క్షీరబిందువులకు, పవిత్రమ్=(పాలలోనుండెడి ఆకులు మొదలగువానిని నిరోధించి) పవిత్రము చేయుదానవు, అసి=అగుచున్నావు. శతధారమ్=నూఱు ధారలుగాను, సహస్రధారమ్=వేయిధారలుగాను, పవిత్రమ్=శోధకము, అసి=అగుచున్నావు. (మూఁడు దర్భల నొకచోటఁ గూర్చి ముడివేయని పవిత్రమునకు శాఖాపవిత్ర మని పేరు.)

తాత్పర్యము: (పాలు పితుకుటకుఁ బూర్వము క్షీరపాత్రయందు శాఖాపవిత్రము నుంచి పాలు పితుకవలెను. అట్టి శాఖాపవిత్రమునుగూర్చి అధ్వర్యుఁడు ఈ విధముగ ననుచున్నాఁడు.) ఓ శాఖాపవిత్రమా! నీవు పాత్రలోఁబడుచున్న క్షీర(ధారలలో) బిందువులలోని నలకలను పాత్రయందుఁబడకుండునట్లు చేయుటచే శతసంఖ్యాకముగను, సహస్ర సంఖ్యాకముగను పడుచున్న క్షీరబిందువులను శోధించుదాన వగుచున్నావు. అధ్వర్యుఁడీ మంత్రము పఠించుచు క్షీరపాత్రయందు శాఖాపవిత్రము నుంచవలయును.)

4. అర్థము: బృహతే=గొప్పవాఁడగు, నాకాయ='నాక' అనుపేరుగల, అగ్నయే=అగ్నికొఱకు (నాకమందు నివసించుటచే అగ్నికి నాక మనుపేరువచ్చినది.) స్తోకః=అల్పక్షీరబిందువు, హుతః స్వాహా=హోమముచేయఁబడినదగుఁగాక, ద్రప్సః=పెద్దదైనక్షీరబిందువు, హుతః స్వాహా=హుత మగుఁగాక. ద్యావాపృథివ్యామ్=ఆకాశము భూమి-ఈ రెండింటికొఱకు, స్వాహా=స్వాహాకృతమగుఁగాక. (అగ్నియందు హవిస్సు నుంచుటమాత్రము హుతమనియు, దేవత నుద్దేశించి త్యాగమును దెలుపు స్వాహాశబ్దము నుచ్చరించుచు నగ్నియందు హవిస్సునుంచుట స్వాహాకృతమనియు భావము.)

తాత్పర్యము: క్షీరపాత్రయందుఁబడిన చిన్నదియు, పెద్దదియు నగు ప్రతి క్షీరబిందువు అగ్నియందు హుతమగుఁగాక. ద్యావాభూములకొఱకు హోమముచేయఁబడినదియు నగుఁగాక. హోమమునిమిత్తము క్షీరము పితుకఁబడుచున్నది కావున పైవిధముగ భావన చేయఁబడినది. (అధ్వర్యుఁడీ మంత్రము నుచ్చరించుచు క్షీరబిందువుల నభిమంత్రించవలెను.)

విశేషములు: "అగ్నిః=అంగతి-సకలవేదాంత ప్రతిపాద్యత్వం గచ్ఛతీతి వ్యుత్పత్త్యా అగ్నిశబ్దస్య పరమాత్మపరత్వ" మని కృష్ణపండిత విరచిత సంధ్యావందనభాష్యమునఁగలదు. అంగతీతి=అగ్నిః, అంగతి యనఁగా పొందుచున్నదని యర్థము. సకల వేదాంతములచేఁ బ్రతిపాదింపఁబడుటను బొందుచున్నది. అనగా సకల వేదాంతములచేఁ జెప్పఁబడుచున్న పరమాత్మయని భట్టభాస్కర వ్యాఖ్యానము. 'నాకాయ'-కమ్=సుఖము, సుఖము లేనిది అకమ్=దుఃఖము. ఆ అకములేనివాఁడు పరమాత్మయని అగ్నిశబ్దము పరమాత్మార్థకము గూడ నగుచున్నది.)

5. అర్థము: సా=క్షీరము పితుకఁబడిన ఆ మొదటి యావు, విశ్వాయుః=చిరాయువుకలది (చిరాయువుగల పృథివ్యభిమాన దేవతతో సమానమైనదని భావము.) సా=పాలుపితుకఁబడిన ఆ రెండవ గోవు, విశ్వవ్యచాః=సర్వ ప్రపంచమును వ్యాపించినది (సర్వవ్యాపియైన అంతరిక్షాభిమాన దేవతతో సమానమైనది.) సా=పాలు పితుకఁబడిన ఆ మూఁడవ గోవు, విశ్వకర్మా=సమస్త కర్మలుకలది. (మూఁడవదియగు ద్యులోకాభిమాన దేవతతో సమానమైనది.)

తాత్పర్యము: పాలు పితుకఁబడిన మూఁడు ఆవులలో మొదటిది పృథివ్యభిమానదేవతతోను, రెండవది అంతరిక్షాభిమాన దేవతతోను, మూఁడవది ద్యులోకాభిమానదేవతతోను సమానమైనవిగా వర్ణింపఁబడినవి (అధ్వర్యుఁడీమంత్రము పఠించుచు మూఁడు గోవులను అభిమంత్రించవలెను.)

విశేషములు: విశ్వమ్+ఆయుః—యస్యాః సా='విశ్వాయుః' అని సమాసార్థమైనను యజ్ఞకర్తకు సంపూర్ణాయువు కలుగునని 'విశ్వాయు' పదప్రయోగము సూచించుచున్నదని మహీధరభాష్యమునఁగలదు.

6. అర్థము: (హే ఉదకాని!=ఓ యుదకములారా!) ఊర్మిణీః=అలలు కలిగినట్టియు (చలించునట్టి) మధుమత్తమాః=అతి మధురములైనట్టియు, మంద్రాః=ప్రియములగునట్టియు, ఋతావరీః=క్షాళనముచేయు సామర్థ్యము కలిగినట్టియు, (యూయమ్=మీరు) ధనస్య=సాన్నాయ్యమనెడి ధనముయొక్క, సాతయే=ప్రాప్తికొఱకు, సంపృచ్యధ్వమ్=(పాత్రయందు పాలతో) కలిసికొనుఁడు. సాన్నాయ్యము=హోమమున కర్హమైన క్షీరము-లేక దధిరూపమైన హవిస్సు.

తాత్పర్యము: సమర్థములైన ఓ యుదకములారా! మీరు క్షీరపాత్రయందలి క్షీరముతో సాన్నాయ్య మనెడి ధనము లభించుటకై కలిసికొనుఁడు. మీరు క్షీరపాత్రను క్షాళనము చేయుటచే నత్యంత మాధుర్యము కలవారు. వాయుసహజమైన చలనము కలవారు. ప్రియమైనవారు కూడ. (అధ్వర్యుఁడు ఈ మంత్రము నుచ్చరించుచు క్షీరపాత్రను కడిగిన జలమును పితికిన పాలలోఁ బోయవలెను.)

7. అర్థము: (హే క్షీర!=ఓ క్షీరమా!) త్వా=నిన్ను, సోమేన=దధిరూపమైన సోమరసముచేత, ఆతనచ్మి=తోడుపెట్టుచున్నాను. దధి=(తోడుపెట్టుటచే నేర్పడిన) పెరుఁగు, ఇంద్రాయ=ఇంద్రునికొఱకు, (హోష్యతే=హోమము చేయఁబడును.)

తాత్పర్యము: ఓ క్షీరమా! నిన్ను దధియనెడి సోమరసముచేత తోడుపెట్టుచున్నాను. తోడుపెట్టుటచే నేర్పడిన పెరుఁగు ఇంద్రుని కొఱకు హోమముచేయఁబడును. (అధ్వర్యుఁడీ మంత్రము చెప్పుచు కొంచెము పెరుఁగును పాలలో వేయవలెను) 'సోమేన' అను పదమునకు దధిరూపమైన సోమరసమని అర్థము చెప్పుటచే నింద్రునకు సోమరసము అత్యంతప్రియమను విషయము ధ్వనించుచున్నది. ఓ మనసా! నిన్ను జ్ఞానమను నమృతముతోఁ గూర్చుటచే నీవు జ్ఞానస్వరూపమును బొందుచున్నావు. అటువంటి నిన్ను భగవంతున కర్పణ చేయుచున్నాను అను నర్థముకూడ స్ఫురించుచున్నది. "షు=ప్రసవైశ్వర్యయోః" అను ధాతువునకు మన్ప్రత్యయము చేయగా 'సోమ' శబ్దమేర్పడినది. ఈ శబ్దమునకు భగవంతుఁడు, అమృతము, సోమరసము మొదలగు ననేకార్థములు కలవు.)

8. అర్థము: (హే విష్ణో!=ఓ విష్ణువా! త్వమ్=నీవు) హవ్యమ్=దధిరూపమైన హవిస్సును, రక్షస్వ=రక్షింపుము. (హవ్యమ్=హోమస్య యోగ్యమ్=హవ్యమ్. అనఁగా హోమమున కర్హమైనదని భావము.)

తాత్పర్యము: ఓ విష్ణూ! నీవు దధిరూపమైన హవిస్సును రక్షింపుము. (అధ్వర్యుఁ డీ మంత్రమునుచ్చరించుచుఁదోడుపెట్టిన క్షీరపాత్రను భద్రముగా నుండుట కర్హమైన ప్రదేశమున నుంచవలెను. ఇచట విష్ణుపదము రక్షణార్థమున ప్రయుక్తమైనది. కాని యింద్రపదమువలె హవిస్స్వీకారము నిమిత్తము ప్రయుక్తమైనది కాదు.)

తృతీయానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ప్రథమప్రపాఠకే చతుర్థోఽనువాకః

మూలము: [1]కర్మణే వాం దేవేభ్య శ్శకేయం[2]వేషాయత్వా[3]ప్రత్యుష్టగ్ం రక్షః ప్రత్యుష్టా అరాతయో[4]ధూరసి ధూర్వ ధూర్వన్తం ధూర్వ తం యోఽస్మాన్ధూర్వతి తం ధూర్వ యం వయం ధూర్వామ[5]స్త్వందేవానా మసి సస్నితమం పప్రితమం జుష్టతమం వహ్నితమం దేవహూతమ[6]మహ్రుత మసి హవిర్ధానం దృగ్ంహస్వ మాహ్వా [7]ర్మిత్రస్య త్వా చక్షుషా ప్రేక్షేమాభేర్మా సంవిక్థా మా త్వా(౧)హిగ్ంసిష [8]మురువాతాయ[9]దేవస్య త్వా సవితుఃప్రసవేఽశ్వినో ర్బాహుభ్యాం పూష్ణో హస్తాభ్యామగ్నయే జుష్టం నిర్వపా[10]మ్యగ్నిషోమాభ్యా[11]మిదందేవానా[12]మిదమునస్సహ [13]స్ఫాత్యై త్వా నారాత్యై [14]సువరభివిఖ్యేషం[15]వైశ్వానరం జ్యోతి[16]ర్దృగ్ంహన్తాం దుర్యా ద్యావాపృథివ్యో[17]రుర్వన్తరిక్ష మన్విహ్య[18]దిత్యాస్త్వోపస్థే సాదయామ్య[19]గ్నే హవ్యగ్ం రక్షస్వ ॥౨॥ (మాత్వాషట్చత్వారిగ్ంశచ్చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయసంహితాయాం ప్రథమాష్టకే ప్రథమప్రపాఠకే చతుర్థోఽనువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: వెనుకటి యనువాకత్రయమునందు అమావాస్యనాడు చేయఁదగిన విధానమంతయుఁ జెప్పఁబడినది. ఇఁక మీఁదట పది యనువాకములందుఁజేయవలసిన విధానము చెప్పఁబడుచున్నది. అందుఁ బ్రథమమున ఈ నాల్గవయనువాకమునందు హవిర్నిర్వాపణవిధానము చెప్పఁబడుచున్నది. ఈ యాగమునందు శూర్పము(=చేఁట) బర్హిస్సునుదెచ్చిన శకటము మొదలగు సాధనముల నుపయోగించు విధము చెప్పఁబడుచున్నది.

1. అర్థము: (హేహస్తౌ!=ఓ హస్తములారా!) వామ్=మిమ్ము, దేవేభ్యః=దేవతలసంబంధమైన (షష్ఠ్యర్థమునఁజతుర్థీ విభక్తి.) కర్మణే=కర్మకొఱకు, శకేయమ్=ప్రయోగించుటకు సమర్థుఁడ నగుదును.

తాత్పర్యము: ఓ హస్తములారా! బాగుగా కడుగఁబడిన మిమ్ము దేవతలకర్మకై యుపయోగించుటకు సమర్థుఁడ నగుదును. (అధ్వర్యుఁ డీ మంత్రము పఠించుచుఁ దన చేతులను నీటితో కడుగు కొనవలెను.)

2. అర్థము: (హే శూర్ప!=ఓ శూర్పమా) త్వా=నిన్ను, వేషాయ=యజ్ఞముకొఱకు, గృహ్ణామి=గ్రహించుచున్నాను. (శూర్పము-ఇదియొక యజ్ఞసాధనము. వ్రీహ్యాదిధాన్యము యొక్క పొట్టును చెరుగుటకై వెదురుతో నిర్మింపఁబడిన చేఁటకు శూర్ప మని పేరు. అధ్వర్యుఁ డీ మంత్రము పఠించుచు శూర్పమును దీసికొనవలెను.)

తాత్పర్యము: ఓ శూర్పమా! నిన్ను యజ్ఞము నిమిత్తము తీసికొనుచున్నాను.

విశేషములు: 'వేష' శబ్దము 'విష్లృ=వ్యాప్తౌ' అను ధాతువునుండి యేర్పడినది. 'వేషః, వ్రతమ్, క్రతుః' – ఇత్యాది పదములు వేదనిఘంటువునందు కర్మనామములయందుఁ జెప్పఁబడినవి.

3. అర్థము: దీని యర్థతాత్పర్యములు ద్వితీయానువాకములోని రెండవవాక్యమునందు వివరింపఁబడినవి. (అధ్వర్యుఁడు ఈ మంత్రము నుచ్చరించుచు గార్హపత్యాగ్నియందుఁగాని, ఆహవనీయాగ్నియందుఁ గాని శూర్పమును వెచ్చచేయవలయును.

4. అర్థము: (హే అగ్నే!=ఓ యగ్నీ! త్వమ్=నీవు) ధూః=హింసించువాఁడవు, అసి=అగుచున్నావు. ధూర్వన్తమ్=హింసించు (పాపరూపమైన) దానిని, ధూర్వ=నశింపఁజేయుము. యః=ఎవఁడు, అస్మాన్=మమ్ము, ధూర్వతి=హింసించుచున్నాఁడో, తమ్=వానిని, ధూర్వ=నశింపఁజేయుము-యమ్=ఏ(ఆలస్యరూపమైన) శత్రువును, వయమ్=మేము, ధూర్వామః=నశింపఁ జేయవలెనని అనుకొనుచున్నామో. తమ్=వానిని, ధూర్వ=నశింపఁ జేయుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు దుష్టులను నశింపఁజేయుస్వభావము కలవాడవు కావున పాపమును నశింపఁ జేయుము. మమ్ము హింసించువానిని నశింపఁజేయుము. మేము నశింపఁజేయవలెనని తలంచుచున్న ఆలస్య రూప శత్రువును నశింపఁ జేయుము. (అధ్వర్యుఁ డీ మంత్రము పఠించుచు బండికాడియొక్క దక్షిణరంధ్రమును గాని ఉత్తర రంధ్రమునుగాని తాఁకవలెను.)

విశేషములు: ఓ పరమేశ్వరా! నీవు పాపాత్ములను శిక్షించువాఁడవు కావున నాయందుండు పాపమును, కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యము లనెడి అంతశ్శత్రువులను ఆలస్యాదిరూపశత్రువును నశింపఁజేయుమని వేదాంతపరమైన భావము. "తుర్వీ దుర్వీ–ధుర్వీ–హింసార్థాః" అను పాణినీయధాతుపాఠములోని 'ధుర్వీ' అను ధాతువునకు 'క్విప్' ప్రత్యయము చేయగా 'ధూః' అను శబ్దము ఏర్పడినది. "సర్వదోష నాశకః, అంధకారనాశకో వా" అని శుక్లయజుర్వేదభాష్యమునందుఁ గలదు. 'ఆలస్యాదిరూపం వైరిణం వయం జిఘాంసామః; తమపి వినాశయ' అని యున్న విద్యారణ్యభాష్యము ననుసరించి పైన అర్థము వ్రాయఁబడినది.

5. అర్థము: (హే శకట!=ఓ శకటమా!) త్వమ్=నీవు, దేవానామ్=దేవతలసంబంధివి, అసి=అగుచున్నావు. (కావున) సస్నితమమ్=పరిశుద్ధమైనదానవు, పప్రితమమ్=(ధ్యానముతో) నిండియున్నదానవు, జుష్టతమమ్=మిక్కిలి యిష్టమైనదానవు, వహ్నితమమ్=(హవిస్సును) ధరించుదానవు, దేవహూతమమ్=దేవతల నాహ్వానించు దానవును, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: (పురోడాశమున కుపయోగించు ధాన్యవిశేషమును బండిమీద యజ్ఞప్రదేశమునకుఁ దీసికొనిరావలయును. ఆ బండి యిచట స్తుతింపఁ బడుచున్నది.) ఓ శకటమా! నీవు దేవతలకు సంబంధించినదానవు. కావున పరిశుద్ధమైనదానవు, ధ్యానింపఁబడుదానవు, ఇష్టమైనదానవు, హవిస్సును మోయుదానవు, దేవతల నాహ్వానించు దానవు నగుచున్నావు. (అధ్వర్యుఁ డీ మంత్రము పఠించుచు బండికాడియొక్క యుత్తరపు నగను స్పృశించి జపము చేయవలెను.) "ష్ణా=శుద్ధౌ" అను ధాతువునుండి 'సస్నితమమ్' అను పదమును, 'వహ=ప్రాపణే' అను ధాతువునుండి వహ్నిశబ్దము ఉత్పన్నము లైనవి. కావున వరుసగా పరిశుద్ధమైనది, (హవిస్సును) ధరించునది అను నర్థములు చెప్పఁబడినవి.

6. అర్థము: (హే శకట!=ఓ శకటమా! త్వమ్=నీవు) అహ్రుతమ్=(ధాన్యపు బరువుచేత) వంగనిదానవు, హవిర్ధానమ్=హవిస్సును ధరించుదానవును, అసి=అగుచున్నావు. (కావున) దృంహస్వ=దృఢముగ నుండుము. మా హ్వాః=భగ్నము కావలదు.

తాత్పర్యము: ఓ శకటమా! నీవు ధాన్యమును మోయుటచేత వంగవలదు. హవిస్సును వహించుదాన వగుచున్నావు. కావున దృఢముగ నుండుము. భగ్నము కావలదు.

విశేషములు: (1) 'హ్వృ=కౌటిల్యే' అను ధాతువునకు క్తప్రత్యయము చేయఁగా 'హ్రుత' శబ్దమేర్పడినది. న+హ్రుతమ్='అహ్రుతమ్' అని నఞ్ సమాసము. (2) 'హవిశ్శబ్దము ఉపపదముగాఁగల ధారణ పోషణార్థకమైన 'ధా' ధాతువునకు ల్యుట్ప్రత్యయముచేయఁగా దాని స్థానమున 'అనాదేశము' వచ్చి 'హవిర్ధానమ్' అని యేర్పడినది. కనుక హవిస్సును వహించుదాన వనునర్థము చెప్పఁబడినది,

7. అర్థము: (హే ధాన్యసమూహ! = ఓ ధాన్యసముదాయమా!) త్వా=నిన్ను, మిత్రస్య =(జగత్తునకు) మిత్రుఁడైన సూర్యునియొక్క, చక్షుషా=నేత్రముచేత, ప్రేక్షే=చూచుచున్నాను. (కావున) మా భేః=భయపడకుము. మా సంవిక్థాః=చలింపకుము. త్వా=నిన్ను, మా హింసిషమ్=హింసించను.

తాత్పర్యము: ఓ ధాన్య సముదాయమా! నిన్ను జగన్మిత్రుఁడైన సూర్యునినేత్రముతోఁ జూచుచున్నాను. భయపడకుము. నిన్ను నేను హింసింపను. (అధ్వర్యుఁడు ఈ మంత్రము నుచ్చరించుచుఁ బురోడాశమున కుపయోగింపఁబోవు ధాన్యమును జూడవలయును).

విశేషములు: మా-'భేః' ఇది మధ్యమపురుషైకవచనము. ఛాందసము. దీనికి లౌకిక సంస్కృతమునందు మా-'భైషీః' అని యుండును. 'ఞీ-భీ=భయే' అను ధాతువునుండి యేర్పడినది.

8. అర్థము: (హే కరిష్యమాణద్వార!=(ధాన్యపు గోతమునకు చేయఁబడఁ బోవు ద్వారమా! త్వమ్=నీవు) వాతాయ=వాయుసంచారము కొఱకు, ఉరు=విశాలమైనదానవు (భవ=అగుము)

తాత్పర్యము: (పురోడాశమున కుపయోగించువ్రీహిధాన్యమున్న గోతముముడి నూడదీయునపుడు ధాన్యము వెలుపలకు వచ్చుట కేర్పడునట్టి ద్వార మిచ్చట సంబోధింపఁబడినది.) ఓ ద్వారమా! నీవు వాయువు సంచరించుటకు విశాలమైనదాన వగుము. (అధ్వర్యుఁ డీ మంత్రము నుచ్చరించుచు ధాన్యపు గోతము ముడి నూడ దీయవలెను.)

విశేషములు: 'వీ=గతిగంధనయోః' అను ధాతువునుండి 'వాతః', 'వాయుః' అను శబ్దము లేర్పడినవి. వ్యాపించువాఁడని వ్యుత్పత్త్యర్థము. కావున ఈ శబ్దములు భగవదర్థమునందుప్రసిద్ధములు. హృదయగ్రంథి యనగ ఆత్మను భగవంతునియందుఁ బ్రవేశింపనీయని సంసారబంధము. ఇట్టి బంధనమును ఛేదించి భగవత్ప్రసరణము కలుగునటుల చేయవలెనని వేదాంతపరమైన భావము గ్రహింపవచ్చును.

9. అర్థము: (హే ధాన్యసమూహ!=ఓ ధాన్యసముదాయమా!) త్వా=నిన్ను, సవితుః=ప్రేరకుఁడైన, దేవస్య=దేవునియొక్క, ప్రసవే(సతి)=ప్రేరణ కలుగుచుండగా, అశ్వినోః=అశ్వినీదేవతలయొక్క, బాహుభ్యామ్=బాహువులచేతను, పూష్ణః='పూష' యను దేవునియొక్క, హస్తాభ్యామ్=చేతులచేతను, అగ్నయే=అగ్నిదేవతకొఱకు, జుష్టమ్=ఇష్ట మగునట్లుగా, నిర్వపామి=ఉంచుచున్నాను.

తాత్పర్యము: ఓ ధాన్యసముదాయమా! దేవుని ప్రేరణవలన అశ్వినీదేవతల యొక్కయు, పూషదేవునియొక్కయు హస్తములతో నిన్ను నగ్నికిఁ బ్రియమగు విధముగ నుంచుచున్నాను. (అధ్వర్యుఁ డీ మంత్రము నుచ్చరించుచు ధాన్యమును చేఁటయం దుంచవలయును. హస్తములకుఁగల పవిత్రతను సూచించుటకై 'అశ్వినోర్బాహుభ్యామ్' అనియు, 'పూష్ణోహస్తాభ్యామ్' అనియుఁ జెప్పఁబడినది.)

10. అర్థము: (హే ధాన్యసమూహ!=ఓ ధాన్యసముదాయమా! త్వా=నిన్ను) అగ్నీషోమాభ్యామ్=అగ్నీషోమదేవతలకై (జుష్టం నిర్వపామి=ఇష్టమగు విధముగ నుంచుచున్నాను.)

తాత్పర్యము: ఓ ధాన్యసముదాయమా! నిన్ను అగ్నీషోమదేవతలకొఱకు ఇష్టమగువిధముగ శూర్పమునం దుంచుచున్నాను. 9వ మంత్రము దర్శయాగమునకును, 10వ మంత్రము పౌర్ణమాసయాగమునకును వర్తించునని గ్రహించవలెను.)

11. అర్థము: ఇదమ్=ఈ చేఁటయందుంచఁబడిన ధాన్యము, దేవానామ్=దేవతలకు (వర్తతామ్=వర్తించుఁగాక, చెందుఁగాక)

తాత్పర్యము: ఈ చేఁటయం దుంచఁబడినధాన్యము దేవతలకుఁ జెందునుగాక. (అధ్వర్యుఁడీ మంత్రమును బఠించుచుఁ జేఁటయందుఁ బోసిన ధాన్యమును చేతితో స్పృశించవలెను.)

12. అర్థము: ఇదమ్+ఉ (=ఇదము) ఈ బండియందున్నధాన్యమైతే, సహ (దేవతాభిః)=దేవతలతోఁగూడియున్న, నః=మాకు (వర్తతామ్=చెందును.)

తాత్పర్యము: ఈ బండియందున్నధాన్యము దేవతలతోఁగూడియున్నమాకుఁ జెందును. (అధ్వర్యుఁ డీ మంత్రము పఠించుచు బండియందున్న ధాన్యమును తాఁకవలెను) 'ఉ' అను నిపాతము 'తు' అనుదానియర్థముకలది.

13. అర్థము: (హే హవిః=ఓ హవిస్సా!) త్వా=నిన్ను, స్ఫాత్యై=అభివృద్ధికొఱకు, (అభి మంత్రయామి=అభిమంత్రించుచున్నాను. (ఆ యభివృద్ధి) అరాత్యై=దేవతలకు దానము చేయకుండుటకు, న=కాదు.

తాత్పర్యము: ఓ హవిస్సా! అభివృద్ధికొఱకు నిన్ను అభిమంత్రించుచున్నాను. ఈ యభివృద్ధి దేవతలకు దానము చేయకుండుటకుఁగాదు. (అధ్వర్యుఁ డీ మంత్రము పఠించుచుఁ జేఁటలోని ధాన్యము నభిమంత్రించవలెను.)

14. అర్థము: సువః=విహారప్రదేశమును, అభివిఖ్యేషమ్=అంతటను విశేషముగాఁ జూచుచున్నాను.

తాత్పర్యము: విహారప్రదేశము నంతటను విశేషముగాఁ జూచుచున్నాను (అధ్వర్యుఁడీ మంత్రము పఠించుచు విహారప్రదేశమంతయు బాగుగాఁ జూడవలెను. విహారప్రదేశ మనఁగా యాగప్రదేశము. ఇది స్వర్గసాధన మగుటచే స్వర్గరూపముగ విద్యారణ్యభాష్యమున పర్ణింపఁబడినది.)

15. అర్థము: వైశ్వానరమ్=ఆహవనీయాగ్నిని, జ్యోతిః=(స్వర్గప్రకాశకమైన) జ్యోతిస్సుగా, (వీక్షే=చూచుచున్నాను.)

తాత్పర్యము: ఆహవనీయాగ్నిని స్వర్గప్రకాశకజ్యోతిస్సుగాఁ జూచుచున్నాను. (ఈ మంత్రము పఠించుచు నధ్వర్యుఁడు ఆహవనీయాగ్నినిఁ జూడవలయును. హవిస్సును వేల్చుటకై యాగమునందు 'ఆహవనీయము', 'గార్హపత్యము', 'దాక్షిణాగ్ని' అను మూఁడగ్నుల నుపయోగింతురు.)

విశేషములు: "వైశ్వానర స్సాధారణశబ్దవిశేషాత్" అని బ్రహ్మసూత్ర వైశ్వానరాధికరణమునందు వైశ్వానరశబ్దము భగవత్పరముగ వివరింపఁబడినది. 'వైశ్వానరః=పరమేశ్వరః సిధ్యతి' అని శంకరభాష్యము, కావున జీవులను పరమపదమును బొందించుచున్నాననెడి వేదాన్తపరమైన యర్థముకూడ ఇచట స్ఫురించుచున్నది.

16. అర్థము: ద్యావాపృథివ్యోః=ఇహలోక పరలోకములందలి, దుర్యాః=(మా) గృహములు, దృంహన్తామ్=దృఢముగ నుండుఁగాక.

తాత్పర్యము: ద్యులోకమునందును, ఈ లోకమునందునుగల మా గృహములు దృఢముగ నుండుఁగాక. (అధ్వర్యుఁడు ఈ మంత్రము పఠించుచు శకటమునుండి క్రిందికి దిగవలెను.)

17. అర్థము: (హే ధాన్యరూపహవిః=ఓ ధాన్యరూపమైన హవిస్సా! త్వమ్=నీవు) ఉరు=విశాలమైన, అంతరిక్షమ్=ఆకాశమును, అన్విహి=పొందుము.

తాత్పర్యము: ఓ ధాన్యరూపహవిస్సా! నీవు విశాలాకాశమును బొందుము. (అధ్వర్యుఁ డీ మంత్రము నుచ్చరించుచుఁ జేఁటలోని ధాన్యమును దీసికొనవలయును.)

విశేషములు: 'అంతరిక్షమాత్మా' అని తైత్తిరీయారణ్యక భాష్యమునందుఁ జెప్పఁబడియుండుటచే "ఓ జీవాత్మ! నీవు పరమాత్మను బొందుము" అను వేదాంతార్థము ఇచ్చట స్ఫురించుచున్నది.

18. అర్థము: (హే ధాన్యహవిః!=ఓ ధాన్యరూప హవిస్సా!) త్వా=నిన్ను, అదిత్యాః=భూమియొక్క, ఉపస్థే=సమీపము నందు, సాదయామి=ఉంచుచున్నాను.

తాత్పర్యము: ఓ ధాన్యరూప హవిస్సా! నిన్ను భూమిసమీపమునం దుంచుచున్నాను. (అధ్వర్యుఁడీ మంత్రము పఠించుచు ధాన్యమును గార్హపత్యాగ్నిసమీపమునందుంచవలెను.

19. అర్థము: హే అగ్నే!=ఓ గార్హపత్యాగ్నీ! (త్వమ్=నీవు) హవ్యమ్=(ఈ ధాన్యరూప) హవిస్సును, రక్షస్వ=రక్షించుము.

తాత్పర్యము: ఓ గార్హపత్యాగ్నీ! నీవు ఈ ధాన్యరూప హవిస్సును రక్షించుము. (అధ్వర్యుఁడీ మంత్రము చెప్పుచు గార్హపత్యాగ్నిని అభిమంత్రించవలెను. ఈ వినియోగము విద్యారణ్యులచేఁ జెప్పఁబడినదియే కాని, దీనికిఁ బ్రత్యేకముగ ఆపస్తంబమహర్షిసూత్రములేదు. ఈ మంత్రమునకు మహీధరాచార్యుల భాష్యమునందు 'హే అగ్నే! తవ సమీపే స్థాపితమిదం హవ్యం త్వం రక్ష. సుప్త పుత్రమివ బాధకేభ్యః పాలయ!' అనఁగా–ఓ యగ్నీ! నీ సమీపమున నుంచఁబడిన యీ హవిస్సును రక్షింపుము. నిద్రించుచున్న పుత్త్రునివలె హింసకులనుండి పాలింపుము" అని చెప్పఁబడినది. (శ్రౌతసూత్రము ననుసరించి యిట వాక్యవిభాగము చేయఁబడినది.)

చతుర్థానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ప్రథమప్రపాఠకే పఞ్చమోఽనువాకః

మూలము: దేవో వః సవితోత్పునాత్వచ్ఛిద్రేణ పవిత్రేణ వసోః సూర్యస్య రశ్మిభిః [2]ఆపో దేవీరగ్రే పువో
అగ్రే గువోఽగ్ర ఇమం యజ్ఞం నయతాగ్రే యజ్ఞపతిం ధత్త యుష్మానిన్ద్రోఽవృణీత వృత్ర
తూర్యే యూయ మిన్ద్ర మవృణీధ్వం వృత్రతూర్యే ప్రోక్షితాః స్థ[3]అగ్నయే వో జుష్టం ప్రోక్షామ్య
[4]గ్నీషోమాభ్యాగ్ం [5]శున్ధధ్వం దైవ్యాయ కర్మణే దేవయజ్యాయా [6]అవధూతగ్ం రక్షోఽవధూతా
అరాతయో[7]ఽదిత్యా స్త్వగసి ప్రతి త్వా(౧) పృథివీ వేత్త్వ[8]ధిషవణ మసి వానస్పత్యం ప్రతి త్వాఽ
దిత్యా[9]స్త్వగ్వేత్త్వగ్నే స్తనూరసి వాచోవిసర్జనం దేవవీతయే త్వా గృహ్ణామ్య[10]ద్రిరసి వానస్పత్య
స్స ఇదం దేవేభ్యో హవ్యగ్ం సుశమి శమిష్వ[11]ఇషమావదోర్జ మావద ద్యుమ ద్వదత వయగ్ం సంఘా
తం జేష్మ[12]వర్షవృద్ధ మసి[13]ప్రతి త్వా వర్షవృద్ధంవేత్తు[14]పరాపూతగ్ం రక్షః పరాపూతా అరాతయో
[15]రక్షసాం భాగోఽసి[16]వాయుర్వో వివినక్తు[17]దేవో వః సవితా హిరణ్యపాణిః ప్రతిగృహ్ణాతు ॥(౨)॥

(త్వా భాగ ఏకాదశ చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ప్రథమప్రపాఠకే పఞ్చమోఽనువాకః।

వేదార్థదీపిక

అవతారిక: వ్రీహి(=ధాన్యము)పై భాగమున నుండు పొట్టు రాక్షసభాగము కావున దానిని పోగొట్టుటకై యీ యనువాకమునందు అవహననము(దంచుట) విధింపఁబడుచున్నది.

1. **అర్థము:** (హే ఆపః!=ఓ ఉదకములారా!) వః=మిమ్ము, అచ్ఛిద్రేణ=రంధ్రములులేని, పవిత్రేణ=దర్భలపవిత్రము చేతను, వసోః=జగదాధారుఁడైన, సూర్యస్య=సూర్యునియొక్క, రశ్మిభిః=కిరణములచేతను, పవితా=ప్రేరకుఁడగు, దేవః=(అధ్వర్యుని హృదయమునం దంతర్యామిగానున్న) దేవుఁడు, ఉత్పునాతు=పవిత్రము చేయుఁగాక.

తాత్పర్యము: ఓ యుదకములారా! ప్రేరకుఁడైన పరమేశ్వరుఁడు రంధ్రములులేని దర్భపవిత్రముచేతను జగదాధారుఁడైన సూర్యుని కిరణములచేతను మిమ్ము పవిత్రము చేయుఁగాక. (ఉత్పవన మనఁగా దర్భపవిత్రమును నీటిలో నుంచి ముందు వెనుకలకుఁగదలించుటచేఁ బరిశుద్ధిచేయుట. అధ్వర్యుఁడు ఈ మంత్రము పఠించుచు అగ్నిహోత్రహవణి యను పేరుగల పాత్రయందున్న యుదకమును దర్భపవిత్రముతో స్పృశించి మూఁడు మారులు పవిత్రము (ఉత్పవనము) చేయవలెను. హోమసాధనములైన స్రుక్–స్రువములలో–స్రుక్కునకు అగ్నిహోత్రహవణి యని వివక్ష చేయఁబడినది.)

విశేషములు: ఇచట దర్భలచేఁ జేయఁబడిన పవిత్రముచేత అగ్నిహోత్రహవణియందలి యుదకమును మూఁడు పర్యాయములు పవిత్రము చేయవలయునని చెప్పఁబడినది. లోకమునందు సాధారణముగ ఏ వస్తువునైనను ఉదకముచే శుద్ధిచేయుట కలదు. అట్టి యుదకమును దర్భలచేఁ బవిత్రముచేయుట ఇచటఁ జెప్పఁబడినది, అనఁగా నుదకములకంటెను దర్భలు పవిత్రతమము లని ధ్వనించుచున్నది. ఉదకములకంటెను దర్భలు పవిత్రతమము లనువిషయము బ్రాహ్మణమునందీ విధముగ వివరింపఁబడినది–పూర్వము ఇంద్రుఁడు వృత్రాసురుని సంహరింపగా నతఁడు-నీటి కభిముఖముగఁబడి మరణించెను. అప్పు డా నీటి యందలి సారముపోయి భూమియందు దర్భలుగా నావిర్భవించెను. కావున దర్భలచే నీటిని శుద్ధిచేయవలయు నను విషయము ఈ గాథవలన స్పష్టమగుచున్నది. మఱియు నీటియందు 'మానుషము', 'దైవము'–అని రెండు విధము లయిన సారముగలదు. మలప్రక్షాళనోపయుక్తమైనది మానుషము. దైవము ప్రత్యేకముగ రెండు విధములుగ నున్నది. స్నానాదులచే శుద్ధి చేయునది ఒక విధము. ప్రోక్షణాదులచే శుద్ధి చేయునది రెండవ విధము. ఈ రెండు విధములయిన యుదకసారము భూమియందు దర్భలుగా నావిర్భవించెనని భావము. ఈ మంత్రమును మూఁడుభాగములుగాఁ జేసి ఒక్కొక్కభాగము నుచ్చరించుచు నొక్కొక్క పర్యాయము ఉదకమును ఉత్పవనము చేయవలయునని ఆపస్తంబమహర్షి చెప్పియుండిరి.

2. **అర్థము:** హే ఆపోదేవీః=ఓ జలదేవతలారా! అగ్రే పువః=ముందుగాఁ బవిత్రము చేయువారును, అగ్రే గువః=ముందుగావెళ్ళువారునునగు (యూయమ్=మీరు) ఇమమ్=ఈ యజ్ఞముమ, అగ్రే=(సమాప్తియందు) సమాప్తిని, నయత=పొందించుఁడు. యజ్ఞపతిమ్=యజ్ఞకర్తను, అగ్రే=శ్రేష్ఠస్థానమందు, ధత్త=ఉంచుఁడు(=స్వర్గమును బొందించుఁడు.) ఇన్ద్రః=ఇంద్రుఁడు, యుష్మాన్=మిమ్ము, వృత్రతూర్యే=వృత్రాసురుని సంహరించుట యందు, అవృణీత=సహాయము కోరెను. యూయమ్=మీరు, వృత్రతూర్యే=వృత్రాసురసంహారమునందు, ఇన్ద్రమ్=ఇంద్రుని, అవృణీధ్వమ్=సహాయము కోరితిరి. ప్రోక్షితాః=(ఈ మంత్రముచే మీరు) ప్రోక్షింపఁ బడినవారుగా, స్థ=ఉండుఁడు.

తాత్పర్యము: ఓ జలదేవతలారా! శుద్ధి హేతువులగు దర్భలనుగూడ శుద్ధి చేయువారు కావున మీరు ఈ యజ్ఞమును నిర్విఘ్నముగ సమాప్తి నొందించుఁడు. మనుష్యులకంటెను ప్రవాహరూపముగ శీఘ్రముగ నడచువారు కావున మీరు ఈ యజ్ఞకర్తను స్వర్గమునొందించుఁడు. పూర్వము ఇంద్రుఁడు వృత్రాసురుని సంహరించుటకై మీ సహాయము కోరెను. (అనగాఁ బూర్వము ఇంద్రుఁడు వృత్రాసురునివలన భయపడి ప్రజాపతిని ప్రార్థింపఁగా నా ప్రజాపతి వజ్రాయుధమును నీటితో కడిగి యింద్రున కిచ్చి దానిచే వృత్రుని సంహరింపుమని యాదేశించెను. ఉదకప్రోక్షితమైన వజ్రాయుధముచే నింద్రుఁడు వృత్రుని సంహరించెను. నీటిచే క్షాళనముచేయఁబడిన వజ్రాయుధము వృత్రసంహారక మగుటచే నింద్రునకు ఉదకసహాయమేర్పడినది. ఉదకప్రక్షాళితవజ్రాయుధమును వృత్రసంహారమున ఇంద్రుఁ డుపయోగించుటచే నుదకముల కింద్రసహాయ మేర్పడినది. ఈ విధముగఁ బరస్పరసహకార మేర్పడినట్లు బ్రాహ్మణమునందు (కాం౨.ప్ర౭.అను.౯) వివరింపఁబడినది.) కావున మీరు ప్రోక్షింపఁబడిన వారలై యుండుఁడు. (అధ్వర్యుఁడీ మంత్రము పఠించుచు నుదకములచేత వ్రీహులను ప్రోక్షింపవలెను.)

విశేషములు: భగవత్కరుణారసము అజ్ఞానాంధకారమును బోఁగొట్టి జీవులను పవిత్రులనుజేసి మోక్షము నిచ్చుననెడి వేదాంత పరమైన అర్థముకూడ నిచట స్ఫురించుచున్నది='అపః' అను పదము సాధారణముగ ఉదకవాచకముగఁ బ్రసిద్ధమైయున్నను మానవులను బవిత్రముచేయు భగవత్కరుణాపరముగ వేదమునందు పలుతావులందుఁ జెప్పఁబడినది. ఉదా:- "యా ఏవ మేధ్యా యజ్ఞియాస్సదేవా అపః" (తై. బ్రా-3.2.5)=ఏ పవిత్రమైనవి యజ్ఞసంబంధమైనవై యున్నవో అవియే దేవసంబంధమైన రసములు - అని అర్థము. దీనిని బట్టి మనము ధ్యానముచేయునది భగత్కరుణయనెడి ఆపోదేవినిగాని సాధారణజలమును గాదు. అట్టి కరుణ బహిరింద్రియముల కగోచరమగుటచే కర్మయందు భావనచే ఉదకము వినియోగింపఁబడుచున్నది. వృత్రశబ్దము వేదనిఘంటువునందు 'మేఘము' అను నర్థమునఁ జెప్పఁ బడినది. మేఘము వెలుతురు నే విధముగ నాచ్ఛాదించునో, ఆ విధముగనే వృత్రము(=అజ్ఞానము) జ్ఞానము నాచ్ఛాదించును. "వృణోతే రాచ్ఛాదనార్థాత్" అని వేదనిఘంటుభాష్యము. మేఘమును భేదించి వర్షమును గలుగఁజేయునట్లు అజ్ఞానమును భేదించి జ్ఞానమును గలుగఁజేయునని వృత్రాసురకథాతాత్పర్యము. వేదార్థము ప్రకటితముకాకుండ వేదముల నాచ్ఛాదించి అజ్ఞానమునందుఁబడఁద్రోయువాఁడనియు వృత్రుఁడు శతపథ బ్రాహ్మణమునందు వర్ణింపఁబడెను. వృత్రతూర్య మనఁగ సంగ్రామమని వేదనిఘంటువు చెప్పుచున్నది.

3. అర్థము: (హే ధాన్యా!=ఓ ధాన్యమా!) వః=మిమ్ము, అగ్నయే=అగ్నిదేవతకొఱకు, జుష్టమ్=ఇష్టమగునట్లు, ప్రోక్షామి=ప్రోక్షించుచున్నాను.

తాత్పర్యము: ఓ ధాన్యమా! మిమ్ము అగ్నిదేవతకొఱకుఁ బ్రియమగునట్లు ప్రోక్షించుచున్నాను. (అధ్వర్యుఁడీ మంత్రము చెప్పుచు నగ్నిదేవుని నిమిత్తము ఉదకముచే ధాన్యరూపహవిస్సును బ్రోక్షించవలెను.)

4. అర్థము: (హే ధాన్యా!=ఓ ధాన్యమా!) అగ్నీషోమాభ్యామ్=అగ్నీషోమదేవతలకొఱకు (జుష్టమ్=ఇష్టమగునట్లు, ప్రోక్షామి=ప్రోక్షించుచున్నాను. వినియోగము మూఁడవమంత్రమునందుఁ జెప్పినదియే. తాత్పర్యము సులభము.)

5. అర్థము: (హే పాత్రాణి=ఓ పాత్రలారా! యూయమ్=మీరు) దేవయజ్యాయై=దేవయాగరూపమైనదియు, దైవ్యాయ=దేవతాసంబంధియునగు, కర్మణే=కర్మకొఱకు, శుంధధ్వమ్=శుద్ధినొందుఁడు.

తాత్పర్యము: యాగమునం దుపయోగించునట్టి పాత్రల శుద్ధిని గుఱించి యీ మంత్రము చెప్పుచున్నది. ఓ పాత్రలారా! మీరు దేవయాగరూపమును, దేవసంబంధియునగు కర్మనిమిత్తము పరిశుద్ధినొందుఁడు. (అధ్వర్యుఁ డీ మంత్రము చెప్పుచు నీటితో మూఁడుమారులు పాత్రలపైఁ బ్రోక్షణము చేయవలెను.)

6. అర్థము రక్షః=(కృష్ణాజినమున నంతర్భూతముగనుండెడి) రాక్షసుఁడు, అవధూతమ్=అత్యంతము నశింపఁజేయఁబడినవాఁడు (భవతు=అగుఁగాక) అరాతయః=(కృష్ణాజినమున నంతర్భూతముగనుండెడి) శత్రువులు, అవధూతాః=మిక్కిలి నశింపఁజేయఁబడినవారు (భవన్తు=అగుదురుగాక).

తాత్పర్యము: కృష్ణాజినము (జింకచర్మము) నందు సూక్ష్మముగానుండు రాక్షసుఁడు శత్రువులును నశింతురుగాక. (ఈ మంత్రము పఠించుచు నధ్వర్యుఁడు కృష్ణాజినమును మూఁడు పర్యాయములు విదిలించవలెను.)

7. అర్థము: (హే కృష్ణాజిన!-ఓ కృష్ణాజినమా! త్వమ్=నీవు) అదిత్యాః=భూమికి, త్వక్=చర్మరూపము, అసి=అగుచున్నావు. త్వా=నిన్ను, పృథివీ=భూమి, ప్రతివేత్తు=తన చర్మమని తెలిసికొనుఁగాక.

తాత్పర్యము: ఓ కృష్ణాజినమా! నీవు భూమియొక్క స్వరూపమవు. నిన్ను తన చర్మమునుగాఁ దెలిసికొనుఁగాక. (అధ్వర్యుఁ డీ మంత్రము పఠించుచు గార్హపత్యాగ్నికి నుత్తరభాగమునఁ గృష్ణాజినమును పఱచవలెను. దాని శిరోభాగము పశ్చిమ దిక్కువైపునను లోమములు అధోభాగమునను ఉండవలెను.)

8. అర్థము: (హే ఉలూఖల!=ఓ ఉలూఖలమా!, త్వమ్=నీవు) అధిషవణమ్=దంపుటకాధారమైనదానవు, వానస్పత్యమ్=వనస్పతి(చెట్టు) నుండి పుట్టినదానవును, అసి=అగుచున్నావు, త్వా=(అటువంటి) నిన్ను, అదిత్యాః=భూమియొక్క, త్వక్=కృష్ణాజినరూపచర్మము, ప్రతివేత్తు=(తన తోలు అని) తెలిసికొనుఁగాక (ఉలూఖలము=తోలు).

తాత్పర్యము: ఓ ఉలూఖలమా! నీవు దంపుట కాధారమైనదానవు; వనస్పతిసంబంధివి. భూమియొక్క చర్మమైన కృష్ణాజినము నిన్ను తనదానినిగాఁ దెలిసికొనుఁగాక. (అధ్వర్యుఁడీ మంత్రము పఠించుచు కొయ్యతోఁ జేసిన తోటిని గృష్ణాజినముపై నుంచవలెను.)

విశేషములు: అధి+సవనమ్=అధిషవణమ్. సవనమనునది యజ్ఞనామముగ వేదనిఘంటువునఁ జెప్పఁబడినది. అవఘాతాధారం కర్తు మధిషవణ మని విద్యారణ్యభాష్యము. దంపుట కాధారమైనదని యర్థము.

9. అర్థము: (హే ధాన్య!=ఓ ధాన్యమా!, త్వమ్=నీవు), అగ్నేః=అగ్నికి, తనూః=శరీరముగాను, వాచః విసర్జనమ్=వాక్కును గలుగఁజేయుదానవుగాను, అసి=అగుచున్నావు. (కావున) త్వా=నిన్ను, దేవవీతయే=దేవతలు భక్షించుటకై, గృహ్ణామి=గ్రహించుచున్నాను.

తాత్పర్యము: ఓ ధాన్యమా! నీవు అగ్నికి శరీరమవు. వాక్కు ఏర్పడుటకుఁ గారణభూతమవు. కావున నిన్ను దేవతలు భక్షించుటకు గ్రహించుచున్నాను. (అధ్వర్యుఁడీ మంత్రము పఠించుచు ధాన్యమును తోటిలోఁ బోయవలెను).

విశేషములు: 'తనూః', 'త్వక్' అనునవి శరీరార్థకములు. తనోతి–కర్మ–తనూః. 'బ్రహ్మ హ్యగ్నిః' అని శ్రుతి. బ్రహ్మ వాక్కునుచ్చరించుట యీ శరీరముయొక్క ముఖ్యప్రయోజనము. "వీ=గతివ్యాప్తిప్రజనకాంత్యసవ ఖాదనేషు" అను ధాతువునుండి వీతిశబ్దము పుట్టినది. కనుక 'వీతి' శబ్దము ఖాదనార్థకము.

10. అర్థము: (హే ముసల!=ఓ రోకలీ!, త్వమ్=నీవు) వానస్పత్యః=వనస్పతినుండి పుట్టినదానవు; అద్రిః=(దృఢత్వము విషయమున) పాషాణమువంటిదానవును, అసి=అగుచున్నావు. సః=అటువంటి నీవు, దేవేభ్యః=దేవతల కొఱకు, ఇదమ్=ఈ ధాన్యరూపమైన, హవ్యమ్=హవిస్సును, శమీ=బాగుగ అగునట్లు (భుజించుటకు ప్రతిబంధకమైన పొట్టు మొదలగునవి లేకుండునట్లు) శమిష్వ=చేయుము.

తాత్పర్యము: ఓ రోకలీ! నీవు చెట్టునుండి పుట్టినదానవు. అయినను దృఢత్వమున ఱాతివంటిదానవు. అటువంటి నీవు దేవతలకై యీ ధాన్యరూపహవిస్సును పొట్టుమొదలగునవి పోవునట్లు చేయుము (=దంచుము) (ఈ మంత్రము పఠించుచు నధ్వర్యుఁడు రోకలిని రోటియం దుంచవలెను.)

విశేషములు: సు+శమీ=అనగా సుకర్మ. 'శమీ' అను పదము వేదనిఘంటువునందు కర్మనామములందుఁ జెప్పఁబడినది. "శమ=ఉపశమే" అను ధాతువునుండి పుట్టినది. 'శమిష్వ' అను క్రియాపదము "శమ=శాన్తౌ" అను ధాతువునుండి యేర్పడినది. అనఁగా ధాన్యమును పాషాణమువంటి దారునిర్మితమైన రోటిలోఁబోసి దంపి పొట్టు మొదలగువానిని దీసిపైచి శుభ్రముచేయవలెనని స్పష్టమగుచున్నది.

11. అర్థము: (హే పాషాణ!=ఓ ఱాయి! త్వమ్=నీవు) ఇషమ్=హవిస్స్వరూపమైన (యీ) యన్నమును, ఆవద=(యజమానుఁడు తీసికొనివచ్చుచున్నాఁడని దేవతలకు) ప్రకటించుము, ఊర్జమ్=అ యన్నరసమును, ఆవద=(యజమానుఁడు తీసికొనివచ్చుచున్నాఁడని దేవతలకు) ప్రకటించుము. (హే యజ్ఞాయుధాని!=ఓ యజ్ఞాయుధములారా! యూయమ్=మీరు) ద్యుమత్ (ఇతి)=ఈ హవిస్సు మంచిరసముకలదని, వదత=(దేవతలకు) ప్రకటింపుఁడు. వయమ్=మేము, సంఘాతమ్=శత్రుసమూహమును జేష్మ=(పాషాణధ్వనిచేత) జయించెదము.

తాత్పర్యము: (యజ్ఞమున కంగములైన పాషాణముల (ఱాల)లో నొకటి యిచట సంబోధింపఁబడినది.) ఓ పాషాణమా! యజ్ఞకర్త హవిస్సును దీసికొనివచ్చుచున్నాఁడనియు. ఆ హవిస్సు మధురరసముకలదనియు దేవతలకుఁ దెలియఁజేయుము. మేము దృషదుపలముల ధ్వనిచేత శత్రుసమూహమును జయించెదము. (అధ్వర్యుఁడీ మంత్రము పఠించుచు దృషదుపలములను ఒకదానిపై నొకటి కొట్టవలయును. దృషత్, ఉపలా=ఇవి ఱాలలోని భేదములు.)

12. అర్థము: (హే శూర్ప!=ఓ శూర్పమా!, త్వమ్=నీవు) వర్షవృద్ధమ్=(వర్షముచే వృద్ధినొందిన వెదురుచేఁజేయఁబడిన దానవు కనుక) వర్షముచే వృద్ధినొందినదానవు, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: ఓ శూర్పమా! నీవు వర్షముచే వృద్ధిపొందిన వెదురుచేఁజేయఁబడుటచే నీవును వర్షముచే వృద్ధినొందిన దానవే యగుచున్నావు. (అధ్వర్యుఁడీ మంత్రము పఠించుచు దంపిన ధాన్యమును పొట్టుపోవునట్లు చెరిగిన పిమ్మట చేఁటను ముందువైపునఁగాని, ఉత్తరమువైపునఁగాని యుంచవలెను.)

13. అర్థము: (హే ధాన్యసమూహ!=ఓ ధాన్యసముదాయమా!) త్వా=నిన్ను, వర్షవృద్ధమ్=వర్షముచే వృద్ధినొందిన దానవుగా, ప్రతివేత్తు=(శూర్పము) తెలిసికొనుఁగాత.

తాత్పర్యము: ఓ ధాన్యసముదాయమా; వర్షవృద్ధములైన వెదుళ్లచే నిర్మితమైన శూర్పము నిన్ను వర్షవృద్ధమైనదానినిగా తెలిసికొనుఁగాక. (అధ్వర్యుఁడు ఈ మంత్రము పఠించుచు దంపిన ధాన్యమును శూర్పము (చేఁట)తో చెరగవలెను. ఈ పనిచేసినపిమ్మటనే 12వ మంత్రమునఁ జెప్పినవిధముగఁ జేయవలెను.)

14. అర్థము: రక్షః=రాక్షసుఁడు, పరాపూతమ్=పోఁగొట్టఁబడినవాఁడు, (భవతు=అగుఁగాక) అరాతయః=శత్రువులు, పరాపూతాః=పోఁగొట్టఁబడినవారు, (భవన్తు=అగుదురుగాక).

తాత్పర్యము: దంచిన ధాన్యమును చెరుగుటచే వచ్చినపొట్టును దీసివేయుటచే రాక్షసులు శత్రువులు, పోఁగొట్టఁబడుదురని భావము. (అధ్వర్యుఁడు ఈ మంత్రము పఠించుచు పొటును ఉత్కర ప్రదేశమునందు వేయవలెను.)

విశేషములు: "యజ్ఞగ్ంం రక్షాగ్ంస్యనుప్రావిశన్" ఇత్యాది బ్రాహ్మణ వాక్యముల ననుసరించి జీవుఁడు అజ్ఞానాంధకారముచేఁ గప్పఁబడియున్నట్లు ధాన్యము పొట్టుచేఁ గప్పఁబడియున్నట్లున్నదను విషయము స్ఫురించుచున్నది.

15. అర్థము: (హే తుష!=ఓ పొట్టా! త్వమ్=నీవు) రక్షసామ్=రాక్షసులకు, భాగః=భాగము, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: ఓ పొట్టా! నీవు రాక్షసులభాగము అగుచున్నావు. (అధ్వర్యుఁడీ మంత్రము పఠించుచుఁ బురోడాశకపాలములలో మధ్యనున్న కపాలమునందు పొట్టునుంచి దానినిఁ గృష్ణాజినము క్రిందఁగాని యితర ప్రదేశమునందుఁగాని వేయవలెను.

16. అర్థము: (హే తండులాని!=ఓ తండులములారా!) వః=మిమ్ము, వాయుః=వాయువు, వివినక్తు=నూకలు మొదలగువానినుండి వేరుచేయుఁగాక. (తండులములు=బియ్యము.)

తాత్పర్యము: ఓ తండులములారా! వాయువు మిమ్ము నూకలుమొదలగునవి లేకుండునట్లు బాగుఁజేయుఁగాక. (ఈ మంత్రము చెప్పుచు నధ్వర్యుఁడు బియ్యములోని నూకలు మొదలగువానిని వేరుచేయవలెను.)

17. అర్థము: (హే తండులాని!=ఓ తండులములారా!) వః=మిమ్ము, హిరణ్యపాణిః=బంగారము హస్తమునందుఁ గలవాఁడును, సవితా=ప్రేరకుఁడునగు, దేవః=దేవుఁడు, ప్రతిగృహ్ణాతు=స్వీకరించుఁగాక.

తాత్పర్యము: ఓ తండులములారా! చెరుగుచున్న చేఁటనుండి పడుచున్న మిమ్ము ఇటునటు పడకుండునట్లు హిరణ్యపాణియుఁ బ్రేరకుఁడునగు దేవుఁడు ప్రతిగ్రహించుఁగాక. (ఈ మంత్రము నుచ్చరించుచు నధ్వర్యుఁడు చేఁటలోని బియ్యమును పాత్రయందుఁ బోయవలెను.)

విశేషములు: వేదనిఘంటు భాష్యకర్తయగు దేవరాజయజ్వ 'హిరణ్య' శబ్దము "ద్విధాతుజం రూపం, హినోతేః, రమతేశ్చ ధాతుద్వయాత్ సముదితాత్ రూపసిద్ధిః" 'హిను,' 'రమ' అను రెండు ధాతువులనుండి యేర్పడినదని వ్రాసియుండెను.

పంచమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ప్రథమప్రపాఠకే షష్ఠోఽనువాకః

మూలము: [1]అవధూతగ్ం రక్షోఽవధూతా అరాతయోఽ[2]దిత్యాస్త్వగసి ప్రతి త్వా పృథివీ వేత్తు[3]దివస్స్కమ్భని రసి ప్రతి త్వాఽదిత్యాస్త్వగ్వేత్తు [4]ధిషణాఽసిపర్వత్యా ప్రతి త్వా దివస్స్కమ్భనిర్వేత్తు[5]ధిషణాఽసి పార్వతేయీ ప్రతి త్వా పర్వతిర్వేత్తు [6]దేవస్య త్వా సవితుః ప్రసవేఽశ్వినోర్బాహుభ్యాం పూష్ణో హస్తాభ్యా మధివపామి ధాన్యమసి ధినుహిదేవాన్[7]ప్రాణాయ త్వాఽ[8]పానాయ త్వా[9]వ్యానాయ త్వా [10]దీర్ఘామను ప్రసితిమాయుషే ధాం[11]దేవో వస్సవితా హిరణ్యపాణిః ప్రతిగృహ్ణాతు ॥౧॥ (ప్రాణాయ త్వా పఞ్చదశ చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయసంహితాయాం ప్రథమాష్టకే ప్రథమప్రపాఠకే షష్ఠోఽనువాకః

వేదార్థదీపిక

అవతారిక: పంచమానువాకమునందు వ్రీహ్యవహననము చెప్పఁబడినది. ఈ షష్ఠానువాకమునందు తండులపేషణము (బియ్యమును పిండిగాఁ జేయుట) చెప్పఁబడుచున్నది. ఈ యనువాకము విద్యారణ్యమున ఎనిమిది వాక్యములుగా విభజించి వ్యాఖ్యానించ బడినది. వినియోగ సౌకర్యము ననుసరించి యిచట పదునొకండు వాక్యములుగ విభజింపఁబడినది.

1\. అర్థము: దీని యర్థ తాత్పర్యాదులను 5వ యనువాకమునందలి 6వ మంత్ర వ్యాఖ్యానమునఁ జూడుఁడు.

2\. అర్థము: ఈ మంత్రముకూడ 5వ అనువాకమున వ్యాఖ్యానముచేయఁబడినది.

3\. అర్థము: (హే శమ్యే!=ఓ శమ్యా! త్వమ్=నీవు) దివః=స్వర్గలోకమును, స్కమ్భనిః=ధరించుదానవు, అసి=అగుచున్నావు. అదిత్యాః=భూమియొక్క, త్వక్=(కృష్ణాజిన రూపమైన) చర్మము, త్వా=నిన్ను, ప్రతివేత్తు=తన సంబంధమైన దానినిగాఁ దెలిసికొనుఁగాక. (శమ్యా=చంద్ర కఱ్ఱతోఁ జేయఁబడినదియు, సన్నెకల్లు నుంచుటకుఁ దగినదియు, గదాకారము కలదియునగు నొకానొక సాధనము.)

తాత్పర్యము: ఓ శమ్యా! నీవు స్వర్గలోకమును ధరించిన దానవు. కావున కృష్ణాజిన రూపమైన భూమియొక్క చర్మము నిన్ను తన దానినిగాఁ దెలిసికొనుఁగాక. (అధ్వర్యుఁడు ఈ మంత్రము పఠించుచుఁ గృష్ణాజినమునందు శమ్యనుంచవలెను.)

4\. అర్థము: (హే దృషత్!=ఓ పాషాణ విశేషమా! నూఱుటకుఁ దగిన ఱాయి. దీనిని సన్నెకల్లు అని యందురు.) త్వమ్=నీవు, ధిషణా=నూఱుటను దెలిసిన దానవును, పర్వత్యా=పర్వత సంబంధమైన దానవును, అసి=అగుచున్నావు. త్వా=(అటువంటి) నిన్ను, దివస్స్కమ్భనిః=స్వర్గలోకమును ధరించిన శమ్య, ప్రతివేత్తు=తన సంబంధమైన దానినిగాఁ దెలిసికొనుఁగాక.

తాత్పర్యము: 'సన్నెకల్లు' అనెడి ఓ పాషాణ విశేషమా! నీవు నూఱుటను దెలిసిన దానవు. పర్వతసంబంధమైన దానవు. అటువంటి నిన్ను స్వర్గలోకమును ధరించిన శమ్య తనకు సంబంధించిన దానినిగాఁ దెలిసికొనుఁగాక. (అధ్వర్యుఁడీ మంత్రమును బఠించుచు శమ్యపైన సన్నెకంటి నుంచవలెను.)

విశేషములు: 'దృషత్' అను పదమున కిచట 'సన్నెకల్లు' అను నర్థము వ్రాయఁబడినది. "పాషాణమయీ పేషణకాలే పేషణీ ద్రవ్యాశ్రయభూతా దృషదిత్యుచ్యతే" అని శ్రౌతపదార్థ నిర్వచనము. పిండిచేయుటకు సాధనమైన పాషాణ విశేషమని మా ఆంధ్ర వేదములో వ్రాయఁబడినది. మనుజుఁడు పరమాత్మ సంబంధియైన జీవునితోను, ప్రకృతి సంబంధమైన శరీరముతోను నిరూపింపఁబడినవాఁడు. కావున జీవాత్మను పరమాత్మ సంబంధిగాఁ దెలిసికొనవలెనను వేదాంతార్థముకూడ నిచట స్ఫురించుచున్నది. 'ధిషణా'=ధారయత్యర్థమితి-ధీః=కర్మబుద్ధిః, అథవా=ధారయతి కర్తారం ఫలం ప్రదానేనేతి ధీః=కర్మబుద్ధిః=, తాం సనోతి=సంభజతే ఇతి=ధిషణా, అర్షం హ్రస్వమ్. అనఁగా విషయమును మనస్సునందు ధరింపఁజేయునది ధీ యనియు, లేదా – కర్మఫలము నిచ్చుటచే కర్తను ధరింపఁజేయునది ధీ యనియు, దానిని భజించునది ధిషణయనియు వ్యుత్పత్త్యర్థము– 'ధీ' లోని దీర్ఘము వైదికము కావున హ్రస్వమైనది.

5. అర్థము: (హే ఉపలే!=ఓ ఉపలయనెడి పాషాణవిశేషమా! త్వమ్=నీవు) ధిషణా=నూఱుటను దెలిసినదానవు, పార్వతేయీ=పర్వతసంబంధమైనదానవును, అసి=అగుచున్నావు. త్వా=(అటువంటి) నిన్ను, పర్వతిః=పర్వత సంబంధియైన సన్నెకల్లు (దృషత్తు) ప్రతివేత్తు=తన సంబంధమైనదానినిగాఁదెలిసికొనుఁగాక.

తాత్పర్యము: సన్నెకంటిపైనుంచి బియ్యమును పిండిగా నూఱునట్టి ఱాతికి ఉపలయని యర్థము. ఓ యుపలా! నీవు నూఱుటను దెలిసినదానవు. పర్వతసంబంధినివి. కావున దృషత్తు (=సన్నెకల్లు) నిన్ను తనదానినిగాఁ దెలిసికొనుఁగాక. (ఈ మంత్రమునుచ్చరించుచు నధ్వర్యుఁడు సన్నెకంటిపైనుపల నుంచవలెను. ఉపలా= ''పాషాణనిర్మితా పేషణసాధనభూతా ఉపలా కథితా'' శ్రౌతపదార్థనిర్వచనము.)

6. అర్థము: (హే తండులా!=ఓ బియ్యమా!) సవితుః=ప్రేరకుఁడైన, దేవస్య=దేవునియొక్క, ప్రసవే(సతి)=అనుజ్ఞకలుగు చుండఁగా, అశ్వినోః=అశ్వినీదేవతలయొక్క, బాహుభ్యామ్=బాహువులచేతను, పూష్ణః='పూష'అనుదేవత యొక్క, హస్తాభ్యామ్=హస్తములచేతను, త్వా=నిన్ను, అధివపామి=(సన్నెకంటిమీద) ఉంచుచున్నాను. (త్వమ్=నీవు) ధాన్యమ్=నూఱఁదగినతండులము, అసి=అగుచున్నావు. దేవాన్=దేవతలను, ధినుహి=సంతోషపఱచుము.

తాత్పర్యము: ఓ బియ్యమా! ప్రేరకుఁడైన పరమేశ్వరు నాజ్ఞ ననుసరించి అశ్వినీ దేవతలయొక్క బాహువులచేతను, పూష దేవునిహస్తములచేతను నిన్ను (పిండిగాఁజేయుటకు) దృషత్తు (సన్నెకంటి)పై నుంచుచున్నాను. నీవు నూఱఁబడదగిన దానవు. (పిండిచేయఁబడఁదగినదానవు.) దేవతలను సంతోషపఱచుము. (అధ్వర్యుఁడీ మంత్రము చెప్పుచు బియ్యము నభిమంత్రించి సన్నెకంటిపై నుంచవలెను.

7. అర్థము: (హే తండులా!=ఓ బియ్యమా!) త్వా=నిన్ను, ప్రాణాయ=ప్రాణవాయువుకొఱకు (ప్రో)హామి=నూఱు చున్నాను. ''ఊహిర్=అర్దనే'' ఇతిధాతుః.)

తాత్పర్యము: ఓ బియ్యమా! నిన్నుఁ బ్రాణవాయువుకొఱకు నూఱుచున్నాను. (ఈ మంత్రము పఠించుచు నధ్వర్యుఁడు సన్నెకంటిపైనుంచిన బియ్యమును మొదట తూర్పువైపున నూఱవలయును.)

8. అర్థము: (హే తండులా!=ఓ బియ్యమా!) త్వా=నిన్ను, అపానాయ=అపానవాయువుకొఱకు, (ప్రో)హామి=అధికముగా నూఱుచున్నాను).

తాత్పర్యము: ఓ బియ్యమా! నిన్ను అపానవాయువుకొఱకు బాగుగా నూఱుచున్నాను. (ఈ మంత్రము పఠించుచు సన్నెకంటిపైని పడమటవైపు బియ్యమును నూఱవలయును.

9. అర్థము: (హే తండుల!=ఓ తండులమా!) త్వా=నిన్ను, వ్యానాయ=వ్యానవాయువుకొఱకు, (పోహామి=బాగుగ నూఱుచున్నాను.)

తాత్పర్యము: సులభము. (ఈ మంత్రము పఠించుచు సన్నెకంటి మధ్యనున్న బియ్యమును నూఱవలెను.)

తాత్పర్యము: (ఉచ్ఛ్వాసనిశ్వాసాదులసంబంధములైన వృత్తులు ప్రాణాపానవ్యానములు. ప్రాణాపానములసంధి వ్యానమని శ్రుత్యంతరమునఁ గలదు.) ఓ హవిస్సా! ప్రాణాపానవ్యాన వృత్తులను మూఁడింటిని యజమానుని యందు చిరకాల ముంచుటకు నిన్ను పిండిచేయుచున్నాను అని భావము.

10. అర్థము: దీర్ఘామ్=అవిచ్ఛిన్నమైన, ప్రసితిమ్=(కర్మసముదాయమునకు హేతువైన) ఉపలను, ఆయుషే=ఆయువుకొఱకు, అనుధామ్=పట్టుకొనినవాఁడను.

తాత్పర్యము: యజమానుని ఆయురభివృద్ధికొఱకు అవిచ్ఛిన్నకర్మసముదాయమునకు హేతువైన యుపలను బట్టుకొనుచున్నాను. (ఈ మంత్రము చెప్పుచు నూఱినపిండిని తూర్పువైపునకు త్రోయవలెను.)

11. ఈ మంత్రార్థమును 5వ అనువాకములోని 17వ మంత్రమునఁ జూడుడు. (ఈ మంత్రము చెప్పుచు నూఱిన పిండిని కృష్ణాజినమున నుంచవలెను.)

షష్ఠానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ప్రథమప్రపాఠకే సప్తమోఽనువాకః (కపాలోపధానార్థమంత్రములు)

మూలము: [1]ధృష్టి రసి బ్రహ్మ యచ్ఛ[2]పాగ్నేఽగ్నిమామాదం జహి[3]నిష్క్రవ్యాదగ్ం సేధా[4]ఽఽదేవయజం వహ[5]నిర్దగ్ధగ్ం రక్షో నిర్దగ్ధా అరాతయో [6]ధ్రువమసి పృథివీం దృగ్ం హాయు ర్దృగ్ంహ ప్రజాం దృగ్ంహ సజాతా నస్మై యజమానాయ పర్యూహ[7] ధర్త్ర మస్యన్తరిక్షం దృగ్ంహ ప్రాణం దృగ్ంహా పానం దృగ్ంహ సజాతా నస్మై యజమానాయ పర్యూహ [8]ధరుణమసి దివం దృగ్ంహ చక్షుః(౧)దృగ్ంహ శ్రోత్రం దృగ్ంహ సజాతా నస్మై యజమానాయ పర్యూహ [9]ధర్మా సి దిశో దృగ్ంహ యోనిం దృగ్ంహ ప్రజాం దృగ్ంహ సజాతా నస్మై యజమానాయ పర్యూహ [10]చితస్థ ప్రజామస్మై రయి మస్మై సజాతా నస్మై యజమానాయ పర్యూహ[11] భృగూణా మంగిరసాం తపసా తప్యధ్వం[12] యాని ఘర్మే కపాలాన్యుప చిన్వన్తి వేధసః। పూష్ణ స్తాన్యపి వ్రత ఇంద్ర వాయూ విముఞ్చతామ్ ॥౭॥ (చక్షు రష్టా చత్వారిగ్ంశచ్చ)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయసంహితాయాం ప్రథమాష్టకే ప్రథమప్రపాఠకే సప్తమోఽనువాకః।

వేదార్థదీపిక

అవతారిక: షష్ఠానువాకమునందు బియ్యము పిండిచేయు విధానము చెప్పఁబడినది. ఈ సప్తమానువాకమునందుఁ బురోడాశము నుంచుట కవసరములైన కపాలములను (పాత్రలను) వేడిచేయు విధము చెప్పఁబడుచున్నది.

1. అర్థము: (హే ఉపవేష!=ఓ ఉపవేషమా!, త్వమ్=నీవు, అఙ్గారాన్=నిప్పుకణికలను) ధృష్టిః=పట్టుకొను సాధనము వంటి దానవు, అసి=అగుచున్నావు. బ్రహ్మ=మంత్రపూతమైన పురోడాశమును, యచ్ఛ=(దేవతలకు)ఇమ్ము. (ఉపవేషము=మోదుగ కొమ్మ మొదటిని ప్రాదేశమాత్ర పరిమితముగ పట్టకారుమాదిరి ఛేదించిన భాగము.)

తాత్పర్యము: ఓ యుపవేషమా! నీవు నిప్పుకణికలను బట్టుకొనుటకు సాధనము వంటి దానవు. మంత్ర పూతమైన పురోడాశమును దేవతల కిమ్ము. (ఈ మంత్రమును బఠించుచు నధ్వర్యుఁడు ఉపవేషమును గ్రహించవలెను.)

2. అర్థము: హే అగ్నే!=ఓ గార్హపత్యాగ్ని! (త్వమ్=నీవు) ఆమాదమ్=ద్రవ్యమును భక్షించుచున్నట్టి, అగ్నిమ్=అగ్నిని, అవజహి=పోఁగొట్టుము.

తాత్పర్యము: ఓ గార్హపత్యాగ్నీ? శాస్త్రీయముగాఁ బక్వమైన ద్రవ్యమునుగాక ఇతరద్రవ్యమును భక్షించునట్టి యగ్నిని బోఁగొట్టుము. (ఈ మంత్రమును జెప్పుచు గార్హపత్యాగ్నిలోనుండి రెండు నిప్పుకణికలను పడమటివైపుగా విడదీయవలెను. 'ఆ'+ఉపసర్గపూర్వక 'అమ్' ధాతువునకు ఘఞ్+ప్రత్యయముచేయఁగా 'ఆమ' అను పద మేర్పడినది. దీనికి మాంసమను నర్థము ప్రసిద్ధముగనున్నను 'దర్వ్యము' అని విద్యారణ్యులు చెప్పియున్నారు.)

3. అర్థము: క్రవ్యాదమ్=మాంసమును భక్షించునట్టి యగ్నిని, నిస్సేధ=నిషేధించుము.

తాత్పర్యము: ఓ గార్హపత్యాగ్నీ! మాంసమును భక్షించునగ్నిని నిషేధించుము. (ఈ మంత్రమును జెప్పుచు నధ్వర్యుఁడు నిప్పు కణికలలో నొకదానిని వెలుపలఁ బడవేయవలెను.)

4. అర్థము: (హే గార్హపత్య!=ఓ గార్హపత్యాగ్నీ!) దేవయజమ్=దేవయాగమున కనుకూలమైన యగ్నిని, ఆవహ=ఆవహించుము.

తాత్పర్యము: ఓ గార్హపత్యాగ్నీ! నీవు దేవయాగమున కనుకూలమైన అగ్నిని ఆవహించుము. (ఈ మంత్రము పఠించుచు నధ్వర్యుఁడు రెండవ నిప్పుకణికను దక్షిణ భాగమునం దుంచవలెను.)

5. అర్థము: రక్షః=రాక్షసుఁడు, నిర్దగ్ధమ్=నిశ్శేషముగ దహింపఁబడినవాఁడు, (భవతు=అగుఁగాక) అరాతయః=శత్రువులు, నిర్దగ్ధాః=నిశ్శేషముగ దహింపఁబడినవారు (భవన్తు=అగుదురుగాక.)

తాత్పర్యము: రాక్షసుఁడు, ఇతర శత్రువులును నిశ్శేషముగ దగ్ధు లగుదురుగాక. (అధ్వర్యుఁ డీ మంత్రము పఠించుచు కపాలము(మూకుడు)నందు నిప్పుకణిక నుంచవలెను.)

6. అర్థము: (హే కపాల!=ఓ కపాలమా!, త్వమ్=నీవు) ధ్రువమ్=దృఢముగా, అసి=అగుచున్నావు. (కావున) పృథివీమ్=భూమిని, దృంహ=దృఢముగాఁ జేయుము. ఆయుః=(యజమానునకు) ఆయువును, దృంహ=దృఢముగాఁజేయుము. ప్రజామ్=(యజమానునియొక్క) సంతానమును, దృంహ=దృఢముగాఁ జేయుము. సజాతాన్=జ్ఞాతులు మొదలగు వారిని, అస్మై=ఈ యజమానునికొఱకు, పర్యూహ=స్వాధీనులనుగాఁ జేయుము.

తాత్పర్యము: ఓ కపాలమా! నీవు దృఢమైన దానవు కావునఁ బృథివిని దృఢముగాఁ జేయుము. యజమానునియొక్క ఆయువును సంతానమును దృఢముగాఁ జేయుము. జ్ఞాతులు మున్నగువారిని యజమానునకు స్వాధీనులనుగాఁ జేయుము. (అధ్వర్యుఁడు ఈ మంత్రము పఠించుచు దక్షిణభాగమున నుంచిన అంగారమునందు కపాలము నుంచవలెను.)

7. అర్థము: (హే కపాల!=ఓ కపాలమా! త్వమ్=నీవు) ధర్త్రమ్=ధరించునట్టి సామర్థ్యము కలదానవు, అసి=అగుచున్నావు. (కావున) అంతరిక్షమ్=ఆకాశమును, దృంహ=దృఢముగాఁజేయుము. ప్రాణమ్=(ఈ యజమానునియొక్క) ప్రాణమును, దృంహ=దృఢముగాఁ జేయుము. అపానమ్=(ఈ యజమానునియొక్క) అపానమును, దృంహ=దృఢముగాఁజేయుము. సజాతాన్, అస్మై, పర్యూహ. (6వ మంత్రమున వీని యర్థము వ్రాయఁ బడినది.) తాత్పర్యము సులభము. ఈ మంత్రము చెప్పుచు నధ్వర్యుఁడు ప్రథమ కపాలమునకుఁ దూర్పు వైపున రెండవ కపాలము నుంచవలెను.)

విశేషములు: అంతరిక్ష మనగా ద్యావాభూములమధ్య మందుఁ బృథివ్యంతము వఱకు వ్యాపించినదని వ్యుత్పత్త్యర్థము. "అన్తరా హిదం ద్యావాపృథివ్యోరవస్థితం క్షాంతం చ భవతి పృథివ్యన్తమిత్యర్థః; అథవా—అన్తరా ఇమే ద్యావాపృథివ్యౌ క్షియతి నివసతీతి అన్తరిక్షమ్; అథవా—శరీరేషు ఏతదేవ అన్తః మధ్యే అవస్థితం అక్షయం ఇతరాణి పృథివ్యాదీని క్షియన్తే తస్మా దక్షయత్వాదన్తరిక్షమ్" అని నిరుక్తమున దుర్గాచార్యభాష్యమునఁ గలదు.

8. అర్థము: (హే కపాల!, త్వమ్) ధరుణమ్=ధరించుసామర్థ్యముకలదానవు, అసి=అగుచున్నావు. మిగిలినభాగమును 7వ మంత్రవ్యాఖ్యానమునఁజూడుఁడు. ఈ మంత్రము చెప్పుచు రెండవ కపాలమునకుఁ దూర్పువైపున మూఁడవ కపాలము నుంచవలెను.

9. అర్థము: (హే కపాల! త్వమ్) ధర్మా=ధరించుసామర్థ్యముకలదానవు, అసి=అగుచున్నావు. మిగిలినది సులభము.

తాత్పర్యము: ఓ కపాలమా! నీవు ధరించుసామర్థ్యముకలదానవు. కావున దిక్కులను, యజమానునియొక్క యోనిస్థానమును సంతానమును దృఢముగఁ జేయుము. శేషము పూర్వవత్తు. (ఈ మంత్రముచెప్పుచు సప్తమ కపాలము నుంచవలెను.)

10. అర్థము: (హే అష్టమకపాల!=ఓ ఎనిమిదవ కపాలమా!, త్వమ్=నీవు) చితః=ఉపచితరూపమైనదానవు. స్థ=అగుచున్నావు. (కావున) అస్మై=ఈ యజమానునికొఱకు, ప్రజామ్=సంతానమును (దేహి=ఇమ్ము). అస్మై=ఈ యజమానునికొఱకు, రయిమ్=ధనమును, (దేహి=ఇమ్ము). శేషము పూర్వమువలె గ్రాహ్యము.

తాత్పర్యము: ఓ అష్టమకపాలమా! నీవు వృద్ధినొందినరూపముకలదానవు. ఈ యజమానునకు సంతానమును, ధనమును ఇమ్ము. జ్ఞాతులు మున్నగువారిని స్వాధీనులనుగాఁ జేయుము. (ఈ మంత్రము పఠించుచు నెనిమిదవ కపాలము నుంచవలెను.)

విశేషములు: 'చితః' అను పదము బహువచనాంతము. ఈ బహువచనము ఆదరార్థమున వాడఁబడినది 'చిత్' అనునది దీని యేకవచనరూపము. ఈ పదమునకు "ఉపచితరూపోఽసి" అని విద్యారణ్యభాష్యమున అర్థము వ్రాయఁబడినది. అనగా వృద్ధిపొందినరూపము కలదానవని యర్థము. 'చిత్' అనగా జ్ఞానము. కనుక జ్ఞానస్వరూప మనియు అర్థము చెప్పవచ్చును. సంతానాదికమును ప్రత్యేకముగ సంపాదింపవలయునని చెప్పుటచే 'అస్మై' అను పదము ఆవృత్తమైనది. "అచేతనదేహాది సంఘాతస్య చేతనత్వం సంపాదయన్తీ బాహ్యవస్తుషు నిర్వికల్పరూపం జనయన్తీ వృత్తిశ్చిత్తమ్. తదేవాత్ర చిదిత్యుచ్యతే" అని తారానాథవాచస్పత్యమునందుఁ గలదు.

11. అర్థము: (హే కపాలాని!=ఓ కపాలములారా!, యూయమ్=మీరు) భృగూణామ్=భృగుమహర్షులయొక్కయు, అంగిరసామ్=అంగిరసులయొక్కయు, తపసా=తపోరూపమైన అగ్నిచేత, తప్యధ్వమ్=తపింపఁజేయఁబడినవా రగుదురుగాక.

తాత్పర్యము: ఓ కపాలములారా! మీరు భృగుమహర్షియొక్కయు, అంగిరసమహర్షియొక్కయు తపోఽగ్నిచేతతపింపఁబడినవారు కండు. 'భృగూణామ్' 'అంగిరసామ్' అను పదముల బహువచనము పూజార్థమున ఉపయోగింపఁబడినది. (ఈ మంత్రము చెప్పుచు కపాలములందు అంగారముల నుంచవలెను. భృగ్వంగిరసులు మహాతపశ్శాలులని ప్రసిద్ధి. కావున వీరు దేవతలుగా బ్రాహ్మణమునందు, విద్యారణ్యమునందును వర్ణింపఁబడిరి.)

12. అర్థము: వేధసః=అధ్వర్యులు, ఘర్మే=వేడికల అగ్నియందు, యాని కపాలాని=ఏ కపాలములను, ఉపచిన్వన్తి=ఉంచినారో, తాన్యపి=ఆ కపాలములనుగూడ, ఇన్ద్రవాయూ=ఇంద్రుఁడు వాయువు, పూష్ణః=పోషకుఁడగు యజమానునియొక్క, వ్రతే=యాగరూపవ్రతము, అపి=సమాప్తము కాఁగా, విముఞ్చతామ్=(అగ్నినుండి) విడచిపెట్టుదురుగాక (=తీయుదురుగాక).

తాత్పర్యము: అధ్వర్యుఁడు అగ్నియందుంచిన కపాలములను యాగము సమాప్తినొందినపిమ్మట ఇంద్రవాయుదేవతలు అగ్నినుండి వెలుపలకుఁదీయుదురుగాక. (ఈ మంత్రము చెప్పుచు నధ్వర్యుఁడు దర్శయాగము సమాప్తినొందినపిమ్మట కపాలముల నగ్నినుండి తీసి లెక్కపెట్టి ఉద్వాసన చేయవలెను. ఈ వినియోగమునకు సూత్రము దర్శపూర్ణమాస సమాప్తియందుఁ జెప్పఁబడినది.)

విశేషములు: "ఘర్మే=దీప్తౌ వహ్నౌ" అని విద్యారణ్యమునందును, 'యజ్ఞే='అని వేదనిఘంటువునందును జెప్పఁబడినది. వేధసః=అధ్వర్యురూపా వేధసః అని విద్యారణ్యమునఁ గలదు. పూజార్థమున బహువచనము. 'అపిసమాప్తౌ' అని భట్టభాస్కరభాష్యము. ఈ యనువాకము విద్యారణ్యమున ఆఱువాక్యములుగ విభజించి వ్యాఖ్యానింపఁబడినది. వినియోగభేదము ననుసరించి యిచట పన్రెండువాక్యములుగఁ జేయబడినది.

సప్తమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ప్రథమప్రపాఠకే అష్టమోఽనువాకః

మూలము: [1]సంవపామి [2]సమాపో అద్భి రగ్మత సమోషధయో రసేన సగ్ంరేవతీ ర్జగతీభి ర్మధుమతీర్మ ధుమతీభి స్సృజ్యధ్వ[3] మద్భ్యః పరిప్రజాతా స్థన సమద్భిః పృచ్యధ్వం[4] జనయత్యై త్వా సంయౌ [5]మ్యగ్నయే త్వా[6]ఽగ్నిషోమాభ్యాం[7] మఖస్య శిరోఽసి ఘర్మోఽసి[8] విశ్వాయు [9]రురు ప్రథస్వోరు తే యజ్ఞపతిః ప్రథతాం[10] త్వచం గృహ్ణీష్వాం [11]తరితగ్ం రక్షోఽన్తరితా అరాతయో[12]దేవ స్త్వా సవితా శ్రపయతు వర్షిష్ఠే అధినాకేఽగ్నిస్తే తనువం మాఽతిధా[13]గగ్నే హవ్యగ్ం రక్షస్వ [14]సంబ్రహ్మణా పృచ్యస్వై [15]కతాయ స్వాహా[16]ద్వితాయ స్వాహా [17]త్రితాయ స్వాహా ॥౧॥ (సవితా ద్వావిగ్ంశతిశ్చ ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ప్రథమ ప్రపాఠకే ఽష్టమోఽనువాకః ।

వేదార్థదీపిక

అవతారిక: సప్తమానువాకమునందు పురోడాశము నుంచు పాత్రలను (కపాలములను) అగ్నిచేత వేడిచేయుట చెప్పఁబడినది. ఈ యను వాకమునందు పురోడాశమును జేయుటకై పిండిని పాత్రలయందు తడుపవలయునను విధము చెప్పఁబడుచున్నది.

1. అర్థము: (హే పిష్ట!=ఓ పిండీ! త్వామ్=నిన్ను, పాత్రే=పాత్రయందు) సంవపామి=బాగుగ నుంచుచున్నాను.

తాత్పర్యము: ఓ బియ్యపు పిండీ! నిన్ను పాత్రయం దుంచుచున్నాను. (అధ్వర్యుఁ డీ మంత్రమును జెప్పుచు ఆ యా దేవతల నుద్దేశించి బియ్యపు పిండిని పాత్రయం దుంచవలయును.)

2. అర్థము: ఆపః=(పాత్రమునందలి) ప్రణీతోదకములు, అద్భిః=(పాత్రము నందలి) 'మదన్తి' అను నుదకములతో, సమగ్మత=కలిసికొనుఁ గాక. ఓషధయః=(పిష్ట రూపమైన) ఓషధులు, రసేన=ఆ రెండు రకములైన ఉదక ముల రసములతో, (సమగ్మన్త=కలిసికొనుఁ గాక) (హే ఉదకాని!=ఓ యుదకములారా! రేవతీః=(సస్యాభి వృద్ధిచే) ధనము నభివృద్ధి చేయునట్టియు, మధుమతీః=మధురములైనట్టియు, (మీరు) జగతీభిః=పశ్వభి వృద్ధి హేతువగుటచేఁ బహురూప ధనముతోఁ గూడుకొనినవియు, మధుమతీభిః=మాధుర్యము కలవియునగు (పిష్టరూపములైన) ఓషధులతో, సంసృజ్యధ్వమ్=కలిసికొనుఁడు.

తాత్పర్యము: (చమస పాత్రమందలి నీరు ప్రణీతము. తప్తమైన ఉదకము మదన్తి) ప్రణీతోదకములారా! మీరు 'మదన్తి' యను నుదకములతోఁ గలిసికొనుఁడు. ఓ యుదకములారా! సస్యమువూలమున ధనమును వృద్ధి చేయు నట్టియు, మధురములైనట్టియు మీరు పశ్వభివృద్ధి హేతువులును, మాధుర్యము కలవియునగు పిష్టరూప ముగా నున్న ఓషధులతోఁ గలిసికొనుఁడు. (ఈ మంత్రము చెప్పుచు పిండియందు ప్రణీతోదకములను బోయవలెను.)

విశేషములు: ఓషమ్=దోషమ్, ధయన్తీతి=ఓషధయః. దోషమును బోఁగొట్టునవి యని నిరుక్తము. 'రేవతీః=ధనవత్యః, అని భట్ట భాస్కర భాష్యము. ''రై' శబ్దాత్ మతుపః ఉదాత్తత్వం వక్తవ్యమ్' అని విద్యారణ్య భాష్యము. ధనము కలవియని యర్థము. రేవతి యనఁగ ఉదకము లనియు జగతి యనగఁ బశువు లనియు, మధుమతి యనగ ఓషధు లనియు బ్రాహ్మణమునందుఁ గలదు.

3. అర్థము: (హే ఓషధయః=పిష్టరూపముగా నున్న ఓ యోషధులారా! యూయమ్=మీరు, పూర్వమ్=పూర్వము) అద్భ్యః=ఉదకముల వలన, పరిప్రజాతాః=అంతటను బాగుగఁ బుట్టిన వారుగ, స్థ=అగుచున్నారు. అద్భిః=ఉదకములతో, సంపృచ్యధ్వమ్=కలిసికొనుఁడు.

తాత్పర్యము: పిండిగానున్న ఓషధులారా! పూర్వము మీరు ఉదకముల వలనఁ బుట్టినవారు కనుక ఉదకములతో బాగుగఁ గలిసికొనుఁడు. (ఈ మంత్రము చెప్పుచు వేడినీటిని పిండియందుఁ బోయవలెను.)

4. అర్థము: (హే పరిప్లావితపిష్ట=అంతటను బాగుగ తడుపఁ బడిన పిష్టమా!) త్వా=నిన్ను, (శుక్లశోణిత మిశ్రమముచే యజమానునకు) జనయత్యై=సంతానోత్పత్తి కొఱకు, సం యౌమి=(ఉదకములతో హస్తాంగుళి మర్దనముచేత) బాగుగఁ గలుపుచున్నాను. (పరిప్లావితము=నీటిచే బాగుగ తడుపఁబడినది.)

తాత్పర్యము: బాగుగ తడుపఁబడిన పిండీ! యజమానునకు సంతానోత్పత్తికై నిన్ను ఉదకములతో చేతివ్రేళ్లచేత బాగుగ మర్దించు చున్నాను. (ఈ మంత్రము చెప్పుచు పిండిని నీటితోఁ గలిపి బాగుగా మర్దనము చేయ వలెను.)

5. అర్థము: (హే పిష్ట!=ఓ పిష్టమా!) త్వా=నిన్ను, అగ్నయే=అగ్నిదేవత కొఱకు, (స్పృశామి=తాఁకుచున్నాను.)

తాత్పర్యము: ఓ పిష్టమా! అగ్నిదేవత కొఱకు నిన్ను స్పృశించుచున్నాను. (ఈ మంత్రము చెప్పుచు పిష్టమును చేతితోఁ దాఁకవలయును.)

6. అర్థము: (హే పిష్ట!) త్వా=నిన్ను, అగ్నీషోమాభ్యామ్=అగ్నీషోమ దేవతల కొఱకుఁ (స్పృశామి=తాఁకుచున్నాను.) తాత్పర్యము, వినియోగము 5వ మంత్రమునందువలె గ్రాహ్యము.

7. అర్థము: (హే పురోడాశ!=ఓ పురోడాశమా!, త్వమ్=నీవు) మఖస్య=యజ్ఞమునకు, శిరః=శిరస్సువు, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: ఓ పురోడాశమా! నీవు యజ్ఞమునకు శిరస్సువగుచున్నావు. (ఈ మంత్రము చెప్పుచు నీటితోఁ దడిపి మర్దించిన పిండిని ఒక్క ముద్దగాఁ (పిండముగా) జేయవలెను. (హోమార్హమైన యీ పిండికే పురోడాశమని పేరు.)

8. అర్థము: (హే పురోడాశ!=ఓ పురోడాశమా!, త్వమ్=నీవు) ఘర్మః=(తప్తకపాలమునందుండుటచే) ప్రకాశించుదానవు, విశ్వాయుః=సమస్తమైన ఆయువు నిచ్చుదానవును, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: సులభము. (ఈ మంత్రము చెప్పుచుఁ బురోడాశమును కపాలములయం దుంచవలెను.)

9. అర్థము: (హే పురోడాశ!=ఓ పురోడాశమా! త్వమ్=నీవు) ఉరు=గొప్పదానవుగా, ప్రథస్వ=వృద్ధినొందుము. తే=నీ యొక్క, యజ్ఞపతిః=యజమానుఁడు, ఉరు=గొప్పవాఁడుగ, ప్రథతామ్=వృద్ధినొందుఁ గాక. (ఈ మంత్రము చెప్పుచు సర్వ కపాలములందలి పురోడాశమును గుఱ్ఱపు కాలిగిట్ట యంతటి పరిమాణము కలిగిన కూర్మాకార ముగఁ జేయవలెను.)

10. అర్థము: (హే పురోడాశ!, త్వమ్) త్వచమ్=(ఉదకముచే మృదువైన) త్వక్కును, గృహ్ణీష్వ=స్వీకరించుము.

తాత్పర్యము: ఓ పురోడాశమా! నీవు ఉదకముచే మృదువైన శరీరమును గ్రహింపుము. (ఈ మంత్రము చెప్పుచు నుదకముచేతఁ బురోడాశమును హెచ్చు తగ్గులు లేకుండునట్లు సవరించవలెను.)

11\. అర్థము: రక్షః=రాక్షసజాతి, అన్తరితమ్=దూరమున నుండినదగుఁగాక. అరాతయః=శత్రువులు, అన్తరితాః=దూరమున నున్నవా రగుదురు గాక.

తాత్పర్యము: రాక్షస జాతియు, శత్రువులును దూరముగ నుండినవా రగుదురు గాక. (ఈ మంత్రము నుచ్చరించుచు దర్భను కాల్చి పురోడాశమునకు చుట్టును మూఁడు మారులు త్రిప్పవలెను.)

విశేషములు: 'అన్తరిత' శబ్దమునకు తిరోహితమని భట్టభాస్కరులును, 'వ్యవహితా' అని విద్యారణ్యులును చెప్పినారు. "ప్రత్యుష్టగ్ం రక్షః", "అవధూతగ్ం రక్షః", "పరాపూతగ్ం రక్షః", "అన్తరితగ్ం రక్షః" – ఈ మంత్రము లన్నియు ఏకార్థకములే.

12\. అర్థము: (హే పురోడాశ!=ఓ పురోడాశమా!) త్వా=నిన్ను, సవితా=ప్రేరకుఁడైన, దేవః=పరమేశ్వరుఁడు, వర్షిష్ఠే=గొప్పది యైన, నాకే=నాకమను పేరుగల అగ్నియందు, అధి=ఉంచి, శ్రపయతు=పక్వము చేయుఁగాక.

తాత్పర్యము: ఓ పురోడాశమా! ప్రేరకుఁడైన దేవుఁడు నిన్ను నాకమను పేరుగల గొప్ప యగ్నియందుఁ బక్వము చేయుఁ గాక. (ఈ మంత్రమును పఠించుచుఁ బురోడాశమును నిప్పుకణికలచేఁ గాల్చవలెను.)

13\. అర్థము: (హే పురోడాశ!) తే=నీ యొక్క, తనువమ్=శరీరమును, అగ్నిః=అగ్ని, మాతి ధాక్=ఎక్కువ దహింప కుండుఁగాక. హే అగ్నే!=ఓ గార్హపత్యాగ్ని! (త్వమ్=నీవు) హవ్యమ్=పురోడాశరూపహవిస్సును, రక్షస్వ= రక్షింపుము.

తాత్పర్యము: ఓ పురోడాశమా! అగ్ని నీ శరీరము నెక్కువగా దహింప కుండుఁగాక. ఓ గార్హపత్యాగ్ని! నీవు పురోడాశ రూప హవిస్సును రక్షింపుము. (ఈ మంత్రము చెప్పుచుఁ బురోడాశమును దర్భలచేత జ్వలింపఁ జేయవలెను.)

14\. అర్థము: (హే పురోడాశ!, త్వమ్=నీవు) బ్రహ్మణా=మంత్రముతో, సంపృచ్యస్వ=బాగుగఁ గలిసికొనుము.

తాత్పర్యము: ఓ పురోడాశమా! నీవు మంత్రముతో బాగుగఁ గలిసి కొనుము. (ఈ మంత్రము చెప్పుచుఁ బురోడాశముల యందు నిప్పు కణికలతోఁ గూడిన భస్మము నుంచవలెను.)

15\. అర్థము: ఏకతాయ='ఏకత' అను పేరు గల దేవత కొఱకు, స్వాహా=(పాత్రప్రక్షాళనోదకము) హోమము చేయఁబడిన దగుఁ గాక. తాత్పర్యము సులభము.

16\. అర్థము: ద్వితాయ='ద్విత' అను పేరు గల దేవత కొఱకు, స్వాహా=(పాత్ర ప్రక్షాళనోదకము) హోమము చేయఁబడిన దగుఁ గాక.

17\. అర్థము: త్రితాయ='త్రిత' యను దేవత కొఱకు, స్వాహా=(పాత్ర ప్రక్షాళనోదకము) హోమము చేయఁబడినదగుఁ గాక.

తాత్పర్యము సులభము. 15, 16, 17 మంత్రముల నుచ్చరించుచు అధ్వర్యుఁడు పాత్రలు కడిగిన నీటిని గార్హపత్యాగ్ని యొక్క అంగారము చేత వెచ్చఁ జేసి హోమవేది మధ్య యందలి మూఁడు రేఖలయందుంచ వలెను. గార్హపత్యాగ్నియందు హోమము చేయవలెనని భావము.

విశేషములు: పూర్వము దేవతలు వ్రీహులను దంచుటచే హవిస్సును సంపాదించి ఆ బీజవధచేఁ గలిగిన పాపము నెచట నుంచుదుమా? అని యాలోచించి తమ వీర్యము నగ్నియందుంచిరట. పిమ్మట నా యగ్ని యుదక దేవతను ధ్యానించి యా దేవ వీర్యమును ఉదక దేవతయందుంచె నట! ఆ యుదకము నుండి 'ఏకత', 'ద్విత', 'త్రిత' అను దేవతలు పుట్టిరని పూర్వగాథ.

అష్టమానువాకము సమాప్తము.

ప్రథమకాణ్డే ప్రథమప్రపాఠకే నవమోఽనువాకః

మూలము: [1]అదదే[2] ఇన్ద్రస్య బాహురసి దక్షిణ స్సహస్ర భృష్టి శ్శతతేజా వాయురసి తిగ్మతేజాః[3] పృథివి దేవయజ న్యోషధ్యా స్తే మూలం మాహిగ్ంసిష[4] మపహతోఽరరుః పృథివ్యై[5] వ్రజం గచ్ఛ గోస్థానం [6]వర్షతు తే ద్యౌ [7]ర్బధాన దేవ సవితః పరమస్యాం పరావతి శతేన పాశై ర్యోఽ స్మాన్ద్వేష్టి యం చ వ యం ద్విష్మ స్తమతో మామౌగ్[8] పహతోఽరరుః పృథివ్యై దేవయజన్యై[9] వ్రజమ్(౧) గచ్ఛ గోస్థా నం[10]వర్షతు తే ద్యౌ[11] ర్బధాన దేవ సవితః పరమస్యా మ్పరావతి శతేన పాశై ర్యోఽస్మాన్ద్వేష్టి యం చ వయం ద్విష్మ స్తమతో మామా[12] గపహతోఽరరుః పృథివ్యా అదేవయజనో[13] వ్రజం గచ్ఛ గోస్థానం[14] వర్షతు తే ద్యౌ[15] ర్బధాన దేవ సవితః పరమస్యాం పరావతి శతేన పాశై ర్యోఽస్మాన్ద్వేష్టి యం చ వయం ద్విష్మ స్తమతో మా(౨) మౌ[16]గరరు స్తే దివం మాస్కాన్[17] వసవ స్త్వా పరి గృహ్ణన్తు గాయత్రేణ ఛన్దసా[18]రుద్రా స్త్వా పరిగృహ్ణన్తు త్రైష్టుభేన ఛన్దసాఽఽ[19] దిత్యాస్త్వా పరి గృహ్ణన్తు జాగతేన ఛన్దసా [20]దేవస్య సవితు స్సవే కర్మ కృణ్వన్తి వేధస[21] ఋతమ[22] స్యృ తసదన మ[23]స్యృతశ్రీ రసి[24]ధా అసి స్వధా అస్యుర్వీ చాసి వస్వీ చాసి పురా క్రూరస్య విసృపో విరప్శి[25]న్ను దాదాయ పృథివీం జీరదాను ర్యా మైరయశ్చన్ద్రమసి స్వధాభి స్తాం ధీరాసో అనుదృశ్య యజన్తే ॥౩॥ (దేవయజన్యై వ్రజం తమతో మా విరప్శి న్నేకాదశ చ॥)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ప్రథమప్రపాఠకే నవమోఽనువాకః।

వేదార్థదీపిక

అవతారిక: అష్టమానువాకమునందు పురోడాశశ్రపణము చెప్పఁబడినది. ఈ యనువాకమునందుఁ బురోడాశము నుంచుట కవసరమైన వేదికరణము చెప్పఁబడుచున్నది.

1\. అర్థము: (హే స్ఫ్యః=ఓ 'స్ఫ్య' మనెడి ఆయుధమా!, త్వా=నిన్ను) ఆదదే=తీసికొనుచున్నాను.

తాత్పర్యము: 'స్ఫ్య' మనెడి ఆయుధమా! నిన్ను గ్రహించుచున్నాను. (ఈ మంత్రము చెప్పుచు నధ్వర్యుఁడు 'స్ఫ్య' మనెడి కత్తిని పట్టుకొనవలెను. "దేవస్య త్వా సవితుః ప్రసవే" ఇత్యాది పూర్వోక్త మంత్రము నిచట అనుసంధానముచేసికొని 'ఆదదే' అను మంత్రమున కర్థము చెప్పవలెను. చతురంగుళ పరిమితమును బదరికాష్ఠ నిర్మితమును నగు ఖడ్గము వంటి ఆకారముగల వస్తువునకు 'స్ఫ్య' మని పేరు.)

2\. అర్థము: (హే స్ఫ్యః=ఓ 'స్ఫ్య' మనెడి ఆయుధమా! త్వమ్=నీవు) ఇన్ద్రస్య=ఇంద్రునియొక్క, దక్షిణః=కుడిదియైనదియు, సహస్రభృష్టిః=వేల కొలఁది శత్రువులను సంహరించునదియు, శతతేజాః=తేజోవంతములయిన వాఁడిగల శత సంఖ్యాకములయిన ఆయుధములు కలదియునగు, బాహుః=భుజమువలె సమర్థమైనదానవు, అసి=అగుచున్నావు. తిగ్మతేజాః=తీక్ష్ణములైన అగ్నిజ్వాలలను కలుగఁజేయు, వాయుః=వాయువు వంటి దానవును, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: 'స్ఫ్య' మనెడి ఆయుధమా! ఇంద్రుని దక్షిణ బాహువు వేలకొలఁది శత్రువులను సంహరించునది; మఱియు మంచి వదనైన శత సంఖ్యాకములైన ఆయుధములు కలిగి యుండునది. నీవు అట్టి యింద్రుని కుడి భుజమువలె సమర్థమైనదానవు. మఱియుఁ దీక్ష్ణములైన అగ్ని జ్వాలలను గలుగఁజేయు వాయువు వంటి దానవు. (ఈ మంత్రముచే 'స్ఫ్య' మను కత్తి నభిమంత్రించవలెను.)

3\. అర్థము: దేవ యజని=దేవయాగమున కాశ్రయమైన, హే పృథివి=ఓ భూమీ!, తే=నీ యొక్క, ఓషధ్యాః=ఓషధి యొక్క, మూలమ్=వేరును, మా హింసిషమ్=హింసించను.

తాత్పర్యము: దేవ యాగాశ్రయమైన భూమీ! నీకు సంబంధించిన ఓషధియొక్క వేరును హింసించను. (ఈ మంత్రము చెప్పుచు స్ఫ్యముచేత వేది నేర్పఱచు స్థలము నందలి గడ్డిని కోయవలెను.)

4\. అర్థము: అరరుః='అరరు' అను రాక్షసుఁడు, పృథివ్యై=భూమి మీది ధూళిని బోఁగొట్టుటచేత, అపహతః=పోఁగొట్టఁబడినవాఁడు, (భవతు=అగుఁగాక).

తాత్పర్యము: వేదిని నిర్మించు స్థలమందున్న గడ్డిని స్ఫ్యమను నాయుధముచేతఁ గోయవలెనని 3వ మంత్రమునఁ జెప్పఁబడినది. ఆ కోసిన గడ్డిని విదిలించుటచేత అందు అంతర్భూతముగనున్న 'అరరు'వను రాక్షసుఁడు నశించుఁగాక యని యీ మంత్రమున కర్థము. (ఈ మంత్రము నుచ్చరించుచు గడ్డితోఁ గూడిన ధూళిని స్ఫ్యమను నాయుధముచేఁ దీసివేయవలెను.)

5\. అర్థము: (హే తృణసహితపాంసో=గడ్డితోఁగూడిన ఓ ధూళీ! త్వమ్=నీవు,) గోస్థానమ్=ఆగ్నీధ్రుఁడు పలుకునట్టి 'అస్తు శ్రౌషట్' అనువాక్కునకు స్థానమైన, వ్రజమ్=ఉత్కరప్రదేశమును, గచ్ఛ=పొందుము.

తాత్పర్యము: (ఓ గడ్డితోఁగూడిన ధూళీ! నీవు గోస్థానమైన ఉత్కర ప్రదేశమునకుఁ బొమ్ము. (ఈ మంత్రము చెప్పుచు గడ్డితోఁగూడిన ధూళిని ఉత్కర ప్రదేశమునకుఁదీసికొని పోవలయును. యజ్ఞ భూమి యందు ధూళి మొదలగునవి యుంచు స్థానమునకు 'ఉత్కర' మని పేరు. ఇది ఆహవనీయాగ్నికి ఉత్తర భాగమున నుండును.)

6\. అర్థము: (హే యజ్ఞవేదే=ఓ యజ్ఞవేదీ!) తే=నీ కొఱకు, ద్యౌః=ద్యులోక సంబంధియగు మేఘము, వర్షతు=వర్షించుఁగాక.

తాత్పర్యము: ఓ యజ్ఞవేదీ! నీ తృప్తి కొఱకు మేఘము వర్షించుఁగాక. (ఈ మంత్రము చెప్పుచు నధ్వర్యుఁడు యజ్ఞ వేదిని జూడవలయును.)

7. అర్థము: సవితః=ప్రేరకుఁడవైన, దేవః=ఓ దేవా! యః=ఎవఁడు, అస్మాన్=మమ్ము, ద్వేష్టి=ద్వేషించుచున్నాఁడో, చ=మఱియు, వయమ్=మేము, యమ్=ఎవరిని, ద్విష్మః=ద్వేషించుచున్నామో, తమ్=వానిని, పరమస్యామ్=అత్యంతమైన, పరావతి=దూరదేశమునందు, శతేన పాశైః=వందలకొలఁది పాశములచేత, బధాన=బంధించుము. అతః=ఈ బంధముల నుండి, మా మౌక్=విడువకుము.

తాత్పర్యము: ప్రేరకుఁడవైన పరమేశ్వరా! నీవు మమ్ము ద్వేషించు వానిని, మేము ద్వేషించువానిని గూడ అత్యంత దూర దేశమునందు శతసంఖ్యాకము లయిన పాశములచేత బంధించుము. ఈ బంధములనుండి విడువకుము. (ఈ మంత్రము చెప్పుచు గడ్డితోఁ గూడిన దుమ్మును ఉత్కర ప్రదేశమునందు వేయవలెను.)

విశేషములు: 'పరమస్యామ్' అనునది సప్తమ్యేకవచనాంతము. 'ఛన్దసి స్యాడాగమః' అను సూత్రముచేత పరమా శబ్దమునకు స్యాడాగమము వచ్చినదని భట్టభాస్కరుల వ్యాఖ్యానము. పరత్వం మాతీతి='పరమా' అని తారానాథవాచస్పత్యము. మిక్కిలి అని యర్థము. 'పరావతి'–'పరా' అను ఉపసర్గకు 'ఉపసర్గాచ్ఛన్దసి ధాత్వర్థే'' అను సూత్రముచే 'వతి' ప్రత్యయము చేయఁగా సప్తమీ విభక్తి వచ్చి 'పరావతి' అని యైనది. యజ్ఞమునకు విఘ్నములు కల్పించుటకై భూమి యందు నిగూఢముగా దాగి యున్న శత్రువు గడ్డితోఁ గూడిన దుమ్మును మంత్రోచ్చారణ పూర్వకముగఁ దీసి వేయుటచే నశింపఁ జేయఁబడుచున్నాఁడని భావము.

8. అర్థము: దేవయజన్యై=దేవయాగమునకు స్థానమైన, పృథివ్యై=భూమి నుండి (పంచమ్యర్థే చతుర్థీ) అరరుః=అరరు వను రాక్షసుఁడు, అపహతః=పోఁగొట్టఁబడినవాఁడు, (భవతు=అగుఁగాక) తాత్పర్యము పూర్వోక్తము. (ఈ మంత్రము చెప్పుచు భూమి మీది ధూళిని రెండవ మారు తీయవలెను.)

9. అర్థము: దీని యర్థ తాత్పర్యములు 5వ మంత్ర వ్యాఖ్యానమునఁ గలవు. (ఈ మంత్రము చెప్పుచు గడ్డితోఁగూడిన దుమ్మును ఉత్కర ప్రదేశమునకుఁ దీసికొని పోవలయును.)

10. అర్థ తాత్పర్యములకు 6వ మంత్రమును జూడుఁడు. (ఈ మంత్రము నుచ్చరించుచు యజ్ఞవేదిని రెండవ మారు చూడవలెను.)

11. దీని అర్థ తాత్పర్యములకు 7వ మంత్రమును జూడుఁడు. (ఈ మంత్రము పఠించుచు గడ్డితోఁ గూడిన దుమ్మును రెండవ మారు ఉత్కరమున వేయవలెను.)

12. అర్థము: అదేవయజనః=దేవయాగమున కర్తుఁడు కానట్టి, అరరుః=అరరు వను రాక్షసుఁడు, అపహతః=పోగొట్టఁబడినవాఁడు, (భవతు=అగుఁగాక).

తాత్పర్యము: దేవ యాగమున కర్తుఁడుకాని అరరు వను రాక్షసుఁడు నశించుఁగాక. (ఈ మంత్రము చెప్పుచు భూమి యందలి గడ్డితోఁ గూడిన దుమ్మును మూఁడవ మారు తీయవలెను.)

13. దీని యర్థ తాత్పర్యములకు 5వ మంత్రమును జూడుఁడు. (ఈ మంత్రము పఠించుచు గడ్డితోఁ గూడిన ధూళిని మూఁడవ మారు ఉత్కరమునకుఁ దీసికొని పోవలెను.)

14. ఈ మంత్రము 6వ మంత్రము ఒక్కటియే. (ఈ మంత్రము చెప్పుచు మూఁడవ మారు యజ్ఞ వేదిని జూడవలెను.)

15. దీని యర్థ తాత్పర్యములకు 7వ మంత్రమును జూడుఁడు. (ఈ మంత్రము చెప్పుచు తృణ సహిత ధూళిని మూఁడవ మారు ఉత్కరమునందు వేయవలెను.) 4, 5, 6, 7, 8. మంత్రములే మూఁడు మారులు వినియోగము చేయుటకై త్రిరావృత్తము లైనవి.

16. అర్థము: (హే పాంసు సమూహరూపోత్కర!=ధూళి సమూహరూపమైన ఉత్కరప్రదేశమా!) తే=నీకు సంబంధించిన, అరరుః='అరరు' రాక్షసుఁడు, దివమ్=స్వర్గమును, మా స్కాన్=పొందకుండుఁగాక. ('మా స్కాన్=మా గాత్' అని భట్ట భాస్కరులు.)

తాత్పర్యము: ధూళితోఁ గూడిన యుత్కర ప్రదేశమా! నీకు సంబంధించిన అరరు రాక్షసుఁడు స్వర్గమును బొంద కుండుగాక. (ఈ మంత్రము చెప్పుచు ఆగ్నీధ్రుఁడు ఉత్కరము నందుంచినఁ దృణ సహిత ధూళిని దోసిటితోఁ దీయవలెను.)

17. అర్థము: (హే యజ్ఞవేదే!=ఓ యజ్ఞవేదీ!) త్వా=నిన్ను, వసవః=వసువులు, గాయత్రేణ='గాయత్ర' మనెడి, ఛన్దసా=ఛన్దోరూపమైన స్ఫ్యముచేత, పరిగృహ్ణన్తు=(దక్షిణ భాగము నందు) స్వీకరింతురుగాక.

తాత్పర్యము: వసువులు గాయత్ర మనెడి ఛందోరూపమైన స్ఫ్యము (కత్తి)చే యజ్ఞవేది యొక్క దక్షిణ భాగమును నిర్మింతురు గాక యని భావము.

విశేషములు: దేవతలు మృత్యుదేవత వలన భయపడి త్రయీ విద్య (వేదము)ను బొంది యీ మంత్రములచే నాచ్ఛాదనము చేసికొనిరి కావున మంత్రములకు 'ఛన్దస్సు' అను పేరు వచ్చినట్లు ఛాందోగ్యోపనిషత్తునందుఁ జెప్పఁబడినది

18. అర్థము: (హే యజ్ఞవేదే!=ఓ యజ్ఞవేదీ) త్వా=నిన్ను, రుద్రాః=రుద్రులు, త్రైష్టుభేన ఛన్దసా=త్రిష్టుప్ ఛన్దోరూపమైన స్ఫ్యముచేత, పరిగృహ్ణన్తు=స్వీకరింతురుగాక.)

తాత్పర్యము: రుద్రులు త్రిష్టుప్ ఛందోరూపమైన స్ఫ్యముచేత యజ్ఞవేదియొక్క పశ్చిమ భాగము నేర్పఱచుదురుగాక. (ఈ మంత్రము చెప్పుచు నధ్వర్యుఁడు వేది యొక్క పశ్చిమ భాగమును నిర్మించ వలెను.)

19. అర్థము: (హే యజ్ఞవేదే!=ఓ యజ్ఞవేదీ!) త్వా=నిన్ను, ఆదిత్యాః=ఆదిత్యులు, జాగతేన ఛన్దసా=జగతి యనెడి ఛందోరూపమైన స్ఫ్యముచేత, పరిగృహ్ణన్తు=అంతటను గ్రహింతురుగాక.

తాత్పర్యము: ఆదిత్యులు జగతియను ఛందోరూపమైన స్ఫ్యముచేత యజ్ఞ వేది యొక్క ఉత్తర భాగమును నిర్మింతురు గాక. (ఈ మంత్రము చెప్పుచు వేది యొక్క ఉత్తర భాగమును నిర్మించవలెను.)

విశేషములు: ఆహవనీయ గార్హపత్యాగ్నుల మధ్య ప్రదేశమునందు వేదిని నిర్మించుటకు వేది పరిమాణమును దెలిసికొనుటకై దక్షిణ పశ్చిమోత్తర దిక్కులందు అధ్వర్యుఁడు స్ఫ్యముచేత మూఁడు రేఖలను గీయవలెను. దీనినే వేది పరిగ్రహణ మందురు. ఈ పరిగ్రహణ సాధనమైన స్ఫ్యము వసు రుద్రాదిత్యరూపములైన గాయత్రీ త్రిష్టుప్ జగతీ ఛందస్సులుగా వర్ణింపఁబడినది.

20. అర్థము: సవితుః=ప్రేరకుఁడైన, దేవస్య=దేవునియొక్క, సవే(సతి)=ప్రేరణ కలుగుచుండఁగా, వేధసః=బ్రహ్మస్వరూపులయిన అధ్వర్యులు, కర్మ=(త్రవ్వునట్టి)కర్మను, కృణ్వన్తి=చేయుచున్నారు.

తాత్పర్యము: ప్రేరకుఁడైన పరమేశ్వరుని ప్రేరణ ననుసరించి బ్రహ్మ సమానులైన అధ్వర్యులు వేది కవసరమైన ప్రదేశమును త్రవ్వుచున్నారు. 'వేధసః'=పూజాయాం బహువచనమ్. (ఈ మంత్రము పఠించుచు నధ్వర్యుఁడు వేది ప్రదేశము తూర్పు భాగమును త్రవ్వవలయును.)

21. అర్థము: (హే వేదే!=ఓ యజ్ఞవేదీ! త్వమ్=నీవు) ఋతమ్=(యాగఫలము నిచ్చుట యందు) సత్యమైనదానవు, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: ఓ యజ్ఞవేదీ! నీవు సత్యముగ యజ్ఞ ఫలమునిచ్చు దానవు. (ఈ మంత్రము నుచ్చరించుచు నధ్వర్యుఁడు వేదియొక్క దక్షిణ భాగము నేర్పఱచవలెను.)

22. అర్థము: (హే వేదే!, త్వమ్=నీవు) ఋతుసదనమ్=సత్యమైన హవిస్సునకు స్థానము, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: ఓ యజ్ఞ వేదీ! నీవు సత్యమైన హవిస్సునకు స్థానమగు చున్నావు. యాగఫలమునకుఁ గారణమైన హవిస్సునకు స్థానమని భావము. (ఈ మంత్రము చెప్పుచు నధ్వర్యుఁడు వేదియొక్క పశ్చిమ భాగము నేర్పఱచ వలెను.)

23. అర్థము: (హే వేదే!, త్వమ్=నీవు) ఋతశ్రీః=సత్యము నొందు దానవు, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: యజ్ఞవేది సత్యమును బొందునది. (ఈ మంత్రము నుచ్చరించుచు యజ్ఞవేది యొక్క ఉత్తరభాగమును నిర్మించవలెను.)

24. అర్థము: హే విరప్శిన్!=వివిధ మంత్రముల నుచ్చరించు ఋత్విజులుకల ఓ వేదీ! పురా=పూర్వము, క్రూరస్య=క్రూరుఁడైన(ఉత్కరమందు పాశ బద్ధుఁడైన) అరరు రాక్షసునియొక్క, విస్రుపః=పోఁగొట్టుటవలన, ధాః=దేవ హవిస్సులను ధరించు దానవు, అసి=అగుచున్నావు. స్వధా=పితృదేవతల హవిస్సుతోఁగూడిన దానవు, అసి=అగుచున్నావు. ఉర్వీ చ=ద్వివిధ హవిస్సులను ధరించు వైశాల్యము కలదానవు, అసి=అగుచున్నావు. వస్వీ చ=పురోడాశాది రూప ధనము కలదానవును, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: ఉచ్చైరుపాంశుత్వాది స్వర భేదముచే వివిధ మంత్రముల నుచ్చరించు ఋత్విజులుకల ఓ వేది ప్రదేశమా! నీవు క్రూరుఁడైన 'అరరు' రాక్షసుని (ఉత్కరమందు బంధించియుండుటచే) పోఁగొట్టుటవలన దేవతల హవిస్సును, పితృదేవతల హవిస్సును, ధరించుచున్నావు. కావున విశాలమైన దానవు. మఱియుఁ బురోడాశాదు లనెడి ధనముకల దానవు. (ఈ మంత్రము చెప్పుచు స్ఫ్యముచే వేదిని బాగుగఁ జేయవలెను.)

విశేషములు: స్వమ్=ధనమ్, దధాతీతి=స్వధా=ధనమును ధరించునది యని స్వధాశబ్దమునకు వేదనిఘంటువునందు వ్యుత్పత్తి చెప్పఁబడినది. ''ఉర్వీ మహతీ చాసి'' ''వస్వీ వాసహేతుశ్చాసి'' అని భట్ట భాస్కర భాష్యము. 'సంగ్రామో వై క్రూరః' అనిశ్రుతి యుండుట వలన 'క్రూర' శబ్దము సంఘాతవాచకముగా మహీధర భాష్యమున నున్నది. వివిధం సర్పన్తి యోధాః యస్మిన్నితి విస్రుప్, తస్య విస్రుపః-పంచమ్యర్థే షష్ఠీ అని మహీధర భాష్యము. 'విస్రుపః=విసర్పణాత్' అని భట్ట భాస్కర భాష్యము. వివిధం ఈరణం శబ్దము చ్చైచ్చ రుపాంశుత్వాది భేదేన మంత్రోచ్చారణం విరప్శి. తద్వన్తః=ఋత్విజః యస్యాం వేద్యాం సా వేదీ విరప్శినీ, తత్సంబోధనం విరప్శి న్నితి ఛాన్దస, మితి విద్యారణ్య భాష్యము.

25. అర్థము: జీరదానుః=వృద్ధులైన(హవిర్దాతలు)యజ్ఞకర్తలు, యామ్=ఏ, పృథివీమ్=భూమిని, ఉదాదాయ=రాక్షసుల నుండి పైకిఁదీసికొనివచ్చి, చంద్రమసి=చంద్రుని యందు, స్వధాభిః=అమృత కిరణములతో, ఐరయన్=స్థాపించిరో; తామ్=వేది రూపమైన ఆ భూమిని, ధీరాసః=(ఇప్పటి)బుద్ధి మంతులు, అనుదృశ్య=మనస్సుచే నాలోచించి, యజన్తే=యాగము చేయు చున్నారు.

తాత్పర్యము: హవిః ప్రదాతలైన వృద్ధ యజమానులు పూర్వము వేది రూపమైన భూమిని రాక్షసులనుండి రక్షించి చంద్రుని యందమృత కిరణములతో స్థాపించిరి. అట్టి వేదిని ఇప్పటి బుద్ధి మంతులగు యజమానులు ఆ విషయమును మనస్సుతో నాలోచించి యాగము చేయుచున్నారు. (ఈ మంత్రము నుచ్చరించుచు నధ్వర్యుఁడు వేదిని జూడ వలయును.)

విశేషములు: జీరా జీవనశీలా దానవః హవిషాం దాతారో యజమానాః యస్యాం పృథివ్యాం సా జీరదానుః — అని విద్యారణ్య భాష్యమున సమాసార్థము చెప్పఁబడినది. ఈ పక్షమున జీరదాను శబ్దము పృథివికి విశేషణమగును. ద్వితీయార్థే ప్రథమా. 'చంద్రమసి' చారు=శోభనం, ద్రవతి=గచ్ఛతీతి=చంద్రమాః తస్మిన్–'చంద్రమసి' అని వేద నిఘంటువు.

నవమానువాకము సమాప్తము

అథ ప్రథమకాణ్డే ప్రథమప్రపాఠకే దశమోఽనువాకః

మూలము: [1]ప్రత్యుష్టగ్ం రక్షః ప్రత్యుష్టా అరాతయో ఽ[2]గ్నే ర్వ స్తేజిష్ఠేన తేజసా నిష్టపామి [3]గోష్ఠం మా
నిర్మృక్షం వాజినం త్వా సపత్నసాహగ్ం సమ్మార్జ్మి [4]వాచం [5]ప్రాణం[6]చక్షు శ్శ్రోత్రం[6]ప్రజాం
యోనిం మా నిర్మృక్షం వాజినీం సపత్నసాహీగ్ం సమ్మార్జ్మ్యై [7]శాసానా సౌమనసం ప్రజాగ్ం
సౌభాగ్యం తనూమ్। అగ్నే రనువ్రతా భూత్వా సన్నహ్యే సుకృతాయ కమ్। [8]సుప్రజస స్త్వా
వయగ్ం సుపత్నీ రుప(గ)సేదిమ। అగ్నే సపత్నదమ్భన మదబ్ధాసో అదాభ్యమ్। [9]ఇమం
విష్యామి వరుణస్య పాశం య మబధ్నీత సవితా సుకేతః। ధాతుశ్చ యోనౌ సుకృతస్య లోకే
స్యోనం మే సహ పత్యా కరోమి। [10]సమాయుషా సం ప్రజయా సమగ్నే వర్చసా పునః। సం
పత్నీ ప్రత్యాహం గచ్ఛే సమాత్మా తనువా మమ। [11]మహీనాం పయో ఽస్యో షధీనాగ్ం రస
స్తస్య తే ఽక్షీయమాణస్య నిః(ఋ)వపామి [12]మహీనాం పయో ఽస్యో షధీనాగ్ం రసో ఽదబ్ధేన
త్వా చక్షుషా ఽవేక్షే సుప్రజాస్త్వాయ [13]తేజో ఽసి [14]తేజో ఽనుప్రేహ్య [15]గ్ని స్తే తేజో మా విన్సై
[16]దగ్నే ర్జిహ్వా ఽసి సుభూ ర్దేవానాం ధామ్నే ధామ్నే దేవేభ్యో యజుషే యజుషే భవ [17]శుక్ర
మసి [18]జ్యోతి రసి [19]తేజో ఽసి [20]దేవో వ స్సవితో త్పునా త్వచ్ఛిద్రేణ పవిత్రేణ వసో స్సూర్యస్య
రశ్మిభిః [21]శుక్రం త్వా శుక్రాయాం ధామ్నే ధామ్నే దేవేభ్యో యజుషే యజుషే గృహ్ణామి
[22]జ్యోతి స్త్వా జ్యోతిష్య [23]ర్చి స్త్వా ర్చిషి ధామ్నే ధామ్నే దేవేభ్యో యజుషే యజుషే గృహ్ణామి ॥౩॥
(ఉపనీ రశ్మిభిః శుక్రగ్ం షోడశ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయసంహితాయాం ప్రథమాష్టకే ప్రథమప్రపాఠకే దశమోఽనువాకః

వేదార్థదీపిక

అవతారిక: నవమాను వాకమునందు వేదినిర్మాణము చెప్పఁబడినది. ఈ దశమాను వాకమునందు ఆజ్యాదిహవిస్సులను గ్రహించు విధానము చెప్పఁబడుచున్నది. అందు మొదట ఆజ్యాది హవిస్సులను హోమము చేయుటకు సాధనములైన 'స్రుక్కు' 'స్రువము' 'జుహువు' 'ఉపభృత్తు' 'ధ్రువము' 'ప్రాశిత్రహరణము' మున్నగువానినుపయోగించు విధానము చెప్పఁబడుచున్నది. (విద్యారణ్యమున 13వాక్యములుగా వ్యాఖ్యానింపఁబడిన ఈ యనువాకము ఇచట వినియోగ భేదము ననుసరించి 23వాక్యములుచేసి వ్యాఖ్యానింపఁబడినది.)

1. అర్థము: రక్షః=(హోమ సాధనములైన 'స్రుక్కు' మున్నగు వానియందు అంతర్భూతముగ దాగియున్న) రాక్షసుఁడు, ప్రత్యుష్టమ్=మిక్కిలి దహింపఁబడినవాఁడు, (భవతు=అగుగాక) అరాతయః=(హోమ సాధనములలో నిగూఢముగానున్న) శత్రువులు, ప్రత్యుష్టాః=మిక్కిలి దహింపఁబడినవారు, (భవన్తు=అగుదురుగాక). (అధ్వర్యుఁ డీ మంత్రము పఠించుచు స్రుక్కు మున్నగు హోమ సాధనములను గార్హపత్యాగ్ని యందు వెచ్చచేయవలెను. ఈ మంత్రము పూర్వము వ్యాఖ్యాతము.)

2. అర్థము: (హే స్రుచః=స్రుక్కు మున్నగు హోమ సాధనములారా!) వః=మిమ్ము, అగ్నేః=అగ్నియొక్క, తేజిష్ఠేన=మిక్కిలి తీక్ష్ణమైన, తేజసా=తేజస్సుచేత, నిష్టపామి=(నిః+తపామి) బాగుగ వెచ్చచేయుచున్నాను.

తాత్పర్యము: స్రుక్కు స్రువము మున్నగు హోమసాధనములారా! మిమ్ము మిక్కిలి తీక్ష్ణమైన అగ్నితేజస్సుచే వెచ్చ చేయుచున్నాను. ఈ మంత్రము చెప్పుచు స్రుగాదులను గార్హపత్యాగ్నియందు రెండవమారు వెచ్చ చేయవలెను.)

3. అర్థము: (హే స్రువ!=ఓ స్రువమా!) గోష్ఠమ్=గోస్థానమును, మా నిర్మృక్షమ్=నశింపఁజేయను. సపత్నసాహమ్=శత్రువులను దిరస్కరించునట్టియు, వాజినమ్=అన్నమును గలుగఁజేయునట్టియు, త్వా=నిన్ను, సమ్మార్జ్మి=బాగుగఁ దుడుచుచున్నాను.

తాత్పర్యము: ఓ స్రువమా! గోస్థానమును నశింపఁజేయను. శత్రువులను నశింపఁజేయుదానవు, అన్నమును గలుగఁ జేయుదానవునగు నిన్ను బాగుగఁ దుడుచుచున్నాను. (ఈ మంత్రము చెప్పుచు దర్భలచే స్రువమును తుడువ వలెను.)

విశేషములు: గోష్ఠమనఁగా గవాం స్థానమని యర్థము. గోశబ్దమునకు వాక్కు, ఇంద్రియము మున్నగు ననేకార్థములు కలవు. 'సపత్నసాహమ్'–సపత్నాన్+సహతే, ఇతి=విద్యారణ్యభాష్యము. సపత్నివత్ దుఃఖహేతుత్వాత్ సపత్నః అని గురుబాలప్రబోధిక. సవతి వలె దుఃఖ హేతువైన వాఁడని యర్థము. సమానపతిత్వా ద్వా సపత్నః.

4. అర్థము: (హే జుహో!=ఓ జుహువా!) వాచమ్=(యజమానునియొక్క)వాక్కును, ప్రాణమ్=ప్రాణమును(మా నిర్మృక్షమ్=నశింపఁజేయను, త్వా సమ్మార్జ్మి=నిన్ను బాగుగఁ దుడుచుచున్నాను.) తాత్పర్యము సులభము. (ఈ మంత్రము చెప్పుచు జుహువును దర్భలచేత తుడువ వలెను.)

5. అర్థము: (హే ఉపభృత్!=ఉపభృత్తను హోమ సాధనమా!) చక్షుః=(యజమానునియొక్క)నేత్రమును, శ్రోత్రమ్=శ్రవణేంద్రియమును, (మా నిర్మృక్షమ్=నశింపఁజేయను. త్వా=నిన్ను, సమ్మార్జ్మి=బాగుగఁ దుడుచు చున్నాను. తాత్పర్యము సులభము. (ఈ మంత్రము చెప్పుచు ఉపభృత్తును దర్భలచేతఁ దుడువ వలెను.)

6. అర్థము: (హే ధ్రువ!=ధ్రువ మనెడి హోమసాధనమా!) ప్రజామ్=(యజమానునియొక్క)సంతానమును, యోనిమ్=భార్యను, మా నిర్మృక్షమ్=నశింపఁజేయను. వాజినమ్=అన్నమును గలుగఁ జేయునట్టియు, సపత్నసాహమ్=శత్రువులను దిరస్కరించు నట్టియు, త్వా=నిన్ను, సమ్మార్జ్మి=బాగుగఁ దుడుచుచున్నాను. తాత్పర్యము సులభము. ఈ మంత్రము పఠించుచు ధ్రువమును దర్భలచేతఁ దుడువ వలెను.)

7. అర్థము: అగ్నేః=అగ్నికి, అనువ్రతా=(యజమానునిభార్య)శుశ్రూషచేయునదిగా, భూత్వా=అయి, సౌమనసమ్=మంచిమనస్సును, ప్రజామ్=సంతానమును, సౌభాగ్యమ్=సువాసినీత్వమును, తనూమ్=(మంచి)రూపమును, ఆశాసానా=కోరుచున్నదిగా, (భవతి=అగుచున్నది. తామ్=ఆమెను) సుకృతాయ=మంచి కర్మకొఱకు, కమ్=సుఖముకలుగునట్లుగా, సన్నహ్యే=(త్రాటిచే నడుమును)బాగుగ బంధించు చున్నాను.

తాత్పర్యము: యజమానునిభార్య అగ్నికి సేవ చేయు చున్నదియై మంచి మనస్సును, సంతానమును, సువాసినీత్వమును(=ఐదువ తనము)మంచి రూపమును గోరుచున్నది. అట్టి యామె నడుమును త్రాటిచే బాగుగ బంధించు చున్నాను. (ఈ మంత్రము చెప్పుచు నధ్వర్యుఁడు యజమానుని భార్యనడుమును త్రాటిచే బంధించవలెను.)

విశేషములు: 'తనూమ్'–'అవినాశం శరీర'మని భాష్యము. ఐహిక శరీరము నశించును గావున శాశ్వతమైన దివ్య శరీరము నొసఁగు మని యజమానుని భార్య కోరుచున్నది. వ్రతమనఁగా 'కర్మ'యని వేదనిఘంటువునందుఁ జెప్పఁబడినది. 'వృఞు' ధాతువునకు 'వృషిరంజిభ్యాం కిత్' అను సూత్రముచేత విధింపఁబడు 'అతచ్' ప్రత్యయము బాహుళకత్వముచే రాగా 'వ్రత' మను శబ్ద మేర్పడినది. 'ణహ=బన్ధనే' అను ధాతువు నుండి 'నహ్యే' అను క్రియా పద మేర్పడినది.

8. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నిదేవా!, సపత్నదమ్భనమ్=శత్రువులను నశింపఁ జేయువాఁడవును, అదాభ్యమ్=తిరస్కరింపఁబడనివాఁడవునగు, త్వా=నిన్ను, సుప్రజసః=మంచి సంతానము కలవారమును, సుపత్నీకః=మంచి భర్త కలవారమును, అదబ్ధాసః=ఎవ్వరి చేతను తిరస్కరింపఁబడని వారమునగు, వయమ్=మేము, ఉపసేదిమ=పొందుచున్నాము(=సేవించుచున్నాము).

తాత్పర్యము: ఓ యగ్నీ! సత్సంతానము సద్భర్త కలవారమును, ఎవ్వరి చేతను తిరస్కరింపఁబడని వారము నగు మేము శత్రువులను నశింపఁజేయువాఁడవును, అన్యులచేఁ దిరస్కరింపఁబడని వాడవు నగు నిన్ను సేవించు చున్నాము. (యజమానునిభార్య ఈ మంత్రము చెప్పుచు నగ్నిదేవునిఁ బ్రార్థించవలెను.)

9. అర్థము: సుకేతః=సుజ్ఞానియైన, సవితా=ప్రేరకుఁడగు నీశ్వరుఁడు, యమ్=ఏ, పాశమ్=పాశమును(=త్రాటిని) అబధ్నీత=బంధించెనో, వరుణస్య=వరుణ దేవుని సంబంధియగు, ఇమమ్=ఈ పాశమును, విష్యామి=విప్పు చున్నాను. చ=మఱియు, ధాతుః=బ్రహ్మదేవునకు, యోనౌ=స్థానమైనదియు, సుకృతస్య=(ఫలే)పుణ్యమునకు ఫలమైనదియు నగు, లోకే=(ఉత్తమ)లోకము నందు, పత్యా సహ=భర్తతోఁగూడ, మే=నాకు, స్యోనమ్=సుఖమును, కరోమి=కలుగఁ జేసికొనుచున్నాను.

తాత్పర్యము: సుజ్ఞానియుఁ బ్రేరకుఁడునగు నీశ్వరుఁడు బంధించిన యీ వరుణపాశమును నేను విప్పుచున్నాను. బ్రహ్మదేవునకు స్థానమైనదియు, పుణ్య ఫలమును నగు నుత్తమ లోకము నందు భర్తతోఁగూడ నాకు సుఖమును గలుగఁజేసికొనుచున్నాను. (యజమానుని భార్య తన నడుమునకు బిగించిన త్రాటిని(యోక్త్రము) విప్పవలెను.)

10. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ!, అహమ్=నేను, ఆయుషా=ఆయువుతో, సంగచ్ఛే=కలిసికొనుచున్నాను. ప్రజయా=సంతానముతో, సంగచ్ఛే=కలిసి కొనుచున్నాను. వర్చసా=(పాతివ్రత్యరూప)వర్చస్సుతో, సంగచ్ఛే=కలిసి కొనుచున్నాను. పత్యా=భర్తతో, పునః(పునః)=మఱల మఱల, పత్నీ=భార్యగా, సంగచ్ఛే=కలిసి కొనుచున్నాను. మమ=నా యొక్క, తనువా=శరీరముతో, ఆత్మా=జీవాత్మ, చిరమ్=చాల కాలము, సం(గచ్ఛతామ్)=కలిసి కొనుఁగాక.

తాత్పర్యము: ఓ యగ్నీ! నేను ఆయువును సంతానమును పాతివ్రత్య రూప వర్చస్సును పొందుచున్నాను. మాటి మాటికి భర్తగా నా భర్తను పొందుచున్నాను. (మాకు వియోగము లేకుండుగాక అని భావము.) జీవాత్మ, ఇంద్రియములు వికలములుకాని ఈ శరీరమును బొందుఁగాక. (యజమానుని భార్య ఈ మంత్రము చెప్పుచు నడుము నుండి విప్పిన త్రాటితోఁగూడియున్న హస్తముల దోసిటి యందు పూర్ణ పాత్రను గ్రహించ వలెను.

11. అర్థము: (హే ఆజ్య!=ఓ ఘృతమా! త్వమ్=నీవు) మహీనామ్=గోవులయొక్క, పయః=క్షీరస్వరూపము(క్షీరము నుండి పుట్టిన దానవు) ఓషధీనామ్=ఓషధులయొక్క, రసః=రసస్వరూపము, అసి=అగుచున్నావు. అక్షీయమాణస్య=క్షీణించనట్టి (నాశరహితమైన), తే=నిన్ను, (ద్వితీయార్థే షష్ఠీ) నిర్వపామి=(పాత్రయందు) ఉంచుచున్నాను.

తాత్పర్యము: ఓ ఆజ్యమా! నీవు ఆవుపాలనుండి పుట్టిన దానవు. ఓషధుల రస స్వరూపమైన దానవు. అటు వంటి నాశ రహితమైన నిన్ను దేవయాగము నిమిత్తము పాత్రము నందుంచుచున్నాను. (ఈ మంత్రము చెప్పుచు అధ్వర్యుఁడు ఆజ్యపాత్రయందు ఆజ్యము నుంచవలెను. 'దేవయజ్యాయై' అను పదము మంత్రమున లేకున్నను బ్రాహ్మణము ననుసరించి 'దేవయాగముకొఱకు' అని తాత్పర్యమునందు వ్రాయఁబడినది.)

విశేషములు: 'పయః, రసః, ఘృతమ్, వీర్యమ్' ఇత్యాది పదములు ఏకార్థకములని వేదనిఘంటువునఁగలదు. కావున ఇచట పయశ్శబ్దమునకు ఆజ్యమని అర్థము వ్రాయఁబడినది.

12. అర్థము: (హే ఆజ్య!=ఓ ఆజ్యమా! త్వమ్) మహీనామ్, పయః, ఓషధీనామ్, రసః, అసి. (11వ మంత్రమున వీని యర్థము వ్రాయఁబడినది.) అదబ్ధేన=సౌమ్యమైన, చక్షుషా=దృష్టి చేత, సుప్రజాస్త్వాయ=మంచి సంతానము కొఱకు, త్వా=నిన్ను, అవేక్షే=చూచుచున్నాను.

తాత్పర్యము: ఓ యాజ్యమా! నీవు గోక్షీరము నుండి పుట్టిన దానవు. ఓషధుల రసస్వరూపమవు. అట్టి నిన్ను మంచి సంతానము కొఱకు సౌమ్యమైన దృష్టితోఁజూచుచున్నాను. 'అదబ్ధేన=రోగానుపహతేన' అని విద్యారణ్యులును, 'తిమిరాదిభి రనుపహతేన' అని భట్ట భాస్కరులును వ్రాసిరి. (యజమానుని భార్య ఈ మంత్రము పఠించుచు ఆజ్యమును జూడవలెను.)

13. అర్థము: హే ఆజ్య!=ఓ ఆజ్యమా! త్వమ్=నీవు) తేజః=తేజోరూపము, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: ఓ ఆజ్యమా! నీవు తేజస్స్వరూపమవు. (ఈ మంత్రమును జెప్పుచు నాజ్యపాత్రమును గార్హపత్యాగ్ని యందుంచవలెను.)

14. అర్థము: (హే ఆజ్య! త్వమ్) తేజః=తేజస్సును, అనుప్రేహి=పొందుము.

తాత్పర్యము: ఓ ఆజ్యమా! నీవు తేజస్సును పొందుము. (ఈ మంత్రము చెప్పుచు నాజ్యపాత్రమును గార్హపత్యాగ్ని నుండి తీయవలెను.)

15. అర్థము: (హే ఆజ్య!=ఓ ఆజ్యమా!) తే=నీ యొక్క, తేజః=తేజస్సును, అగ్నిః=అగ్ని, మా వినైత్=పోఁగొట్ట కుండుఁ గాక.

తాత్పర్యము: ఓ ఆజ్యమా! అగ్ని నీ తేజస్సును బోఁగొట్టకుండుఁగాక. ఈ మంత్రము చెప్పుచు నాజ్యపాత్రమును ఆహవనీయాగ్ని యందుంచ వలెను.)

16. (హే ఆజ్య! త్వమ్) అగ్నేః=అగ్నికి, జిహ్వా=నాలుక వంటి దానవు. దేవానామ్=దేవతలకు, సుభూః=సుఖము కొఱకగు దానవు; అసి=అగుచున్నావు. దేవేభ్యః=దేవతలకొఱకు, ధామ్నే ధామ్నే=ప్రతిస్థానము కొఱకు, యజుషే యజుషే=ప్రతి మంత్రము కొఱకు, భవ=అగుము.

తాత్పర్యము: ఓ యాజ్యమా! నీవు అగ్నికి నాలుక వంటి దానవును, దేవతల సుఖమునకుఁగారణమును అగుచున్నావు. కావున దేవతలకు ప్రతిస్థానము నందును, ప్రతి మంత్రము నందును ఉపయోగపడుము. (ఈ మంత్రము చెప్పుచు 'స్ఫ్య' మనెడి 'కత్తిచే గీచిన గీతయందు ఆజ్యపాత్రము నుంచ వలెను.)

విశేషములు: జిహీతే=విజానాతి – రసమ్ – అనయేతి= 'జిహ్వా' అని వ్యుత్పత్తి. ధామ్నే ధామ్నే=తత్తద్యాగఫలోపభోగస్థాన సిద్ధ్యర్థం భవ; యజుషే యజుషే=తత్తద్యాగసిద్ధయే యోగ్యం భవేత్యర్థః అని శుక్లయజుర్వేద భాష్యము.

17. అర్థము: (హే ఆజ్య! త్వమ్) శుక్రమ్=దీప్తి కలదానవు, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: ఓ యాజ్యమా! నీవు ప్రకాశము కలదానవు. (ఈ మంత్రము చెప్పుచు ఆజ్యమును పవిత్రముచేత శుద్ధి చేయవలెను.)

18. అర్థము: (హే ఆజ్య!, త్వమ్) జ్యోతిః=జ్యోతి స్స్వరూపము, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: ఓ యాజ్యమా! నీవు జ్యోతిస్స్వరూపమవు. (ఈ మంత్రము చెప్పుచు ఆజ్యమును పవిత్రముచేత రెండవ మారు శుద్ధి చేయవలెను.)

19. అర్థము: (హే ఆజ్య!, త్వమ్) తేజః=తేజస్స్వరూపము, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: ఓ యాజ్యమా! నీవు తేజస్స్వరూపమవు. (ఈ మంత్రము చెప్పుచు నాజ్యమును మూఁడవమారు శుద్ధి చేయవలెను.

20. • ఈ మంత్రమునకు అర్థతాత్పర్యములను 5వ అనువాకము నందలి 1వ మంత్రమును జూడుడు. (ఈ మంత్రము చెప్పుచుఁ బ్రోక్షణీ పాత్రయందలి యుదకమును పవిత్రముచేత శుద్ధి చేయవలెను.)

21. అర్థము (హే ఆజ్య!) శుక్రమ్=ప్రకాశించుచున్న, త్వా=నిన్ను, శుక్రాయామ్=ప్రకాశించుచున్న పాత్రయందు, దేవేభ్యః=దేవతల కొఱకు, ధామ్నే ధామ్నే=ప్రతిస్థానము కొఱకును, యజుషే యజుషే=ప్రతి మంత్రము కొఱకును, గృహ్ణామి=(సరిపడునట్లు) గ్రహించుచున్నాను.

తాత్పర్యము: ఓ యాజ్యమా! ప్రకాశించుచున్న నిన్ను దేవతల నిమిత్తము ప్రతి హోమస్థానమునకు, ప్రతి మంత్రమునకు సరిపోవునట్లు పాత్రము నందు గ్రహించుచున్నాను.(=ఉంచుచున్నాను) ఈ మంత్రము చెప్పుచు జుహూవు నందు ఆజ్యము నుంచవలెను.)

22. అర్థము: (హే ఆజ్య!) జ్యోతిః=జ్యోతిస్స్వరూపమైన, త్వా=నిన్ను, జ్యోతిషి=జ్యోతిస్స్వరూపమైన (ఉపభృత్తు అనెడి) పాత్ర యందు, ధామ్నేధామ్నే, యజుషేయజుషే, గృహ్ణామి=గ్రహించు చున్నాను.

తాత్పర్యము: ఓ యాజ్యమా! జ్యోతిస్స్వరూపమైన నిన్ను జ్యోతిస్స్వరూపమైన 'ఉపభృత్' అనెడి పాత్రయందు దేవతల నిమిత్తము ప్రతి హోమస్థానమునకుఁ బ్రతి మంత్రమునకు సరిపోవునట్లు గ్రహించుచున్నాను. (ఈ మంత్రము చెప్పుచు నాజ్యమును ఉపభృత్తు నందుంచ వలెను.)

23. అర్థము: (హే ఆజ్య!) అర్చిః=కాంతిస్వరూపమైన, త్వా=నిన్ను, అర్చిషి=కాంతిస్వరూపమైన ధ్రువపాత్రయందు, దేవేభ్యః, ధామ్నేధామ్నే, యజుషేయజుషే, గృహ్ణామి. (అర్థము పూర్వోక్తము.)

తాత్పర్యము: ఓ కాంతి స్వరూపమైన ఆజ్యమా! నిన్ను దేవతల నిమిత్తము ప్రతిహోమస్థానమునకు ప్రతి మంత్రమునకు సరిపోవునట్లు కాంతిస్వరూపమైన ధ్రువపాత్రయందుంచు చున్నాను. (ధ్రువపాత్ర యందు ఆజ్యము నుంచవలెను.)

దశమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ప్రథమప్రపాఠక ఏకాదశోఽనువాకః ।

మూలము: [1]కృష్ణో ఽస్యాఖరేష్ఠో ఽగ్నయే త్వా స్వాహా [2]వేది రసి బర్హిషే త్వా స్వాహా [3]బర్హి రసి స్రుగ్భ్య
స్త్వా స్వాహా [4]దివే త్వా ఽన్తరిక్షాయ పృథివ్యై త్వా [5]స్వధా పితృభ్య ఊర్గ్భవ బర్హిషద్భ్య
ఊర్జా పృథివీం గచ్ఛత [6]విష్ణో స్తూపో [7]ఽస్యూర్ణామ్రదసం త్వా స్తృణామి స్వాసస్థం దేవేభ్యో
[8]గన్ధర్వో ఽసి విశ్వావసు ర్విశ్వస్మా దీషతో యజమానస్య పరిధి రిడ ఈడిత [9]ఇన్ద్రస్య బాహు రసి
(౧)దక్షిణో యజమానస్య పరిధి రిడ ఈడితో [10]మిత్రావరుణౌ త్వో త్తరతః పరిధత్తాం ధ్రువేణ
ధర్మణా యజమానస్య పరిధి రిడ ఈడితః [11]సూర్యస్త్వా పురస్తా త్పాతు కస్యాశ్చి దభిశస్త్యా [12]వీతి
హోత్రం త్వా కవే ద్యుమన్తగ్ం సమధీమ హ్యగ్నే బృహన్తం మధ్వరే [13]విశో యన్త్రే స్థో [14]వసూ
నాగ్ం రుద్రాణా మాదిత్యానాగ్ం సదసి సీద [15]జుహూ రుపభృ ద్ధ్రువా ఽసి ఘృతాచీ నామ్నా
ప్రియేణ నామ్నా ప్రియే సదసి సీదై [16]తా అసద న్సుకృతస్య లోకే తా విష్ణో పాహి పాహి
యజ్ఞం పాహి యజ్ఞపతిం పాహి మాం యజ్ఞనియమ్ ॥౨॥ (బాహు రసి ప్రియే సదసి పఞ్చదశ చ)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయసంహితాయాం ప్రథమాష్టకే ప్రథమప్రపాఠక ఏకాదశోఽనువాకః

వేదార్థ దీపిక

అవతారిక: దశమానువాకమునందు ఆజ్యరూప హవిర్గ్రహణము చెప్పఁబడినది. ఈ యనువాకమునందు వేదియందు ఇధ్మ బర్హిః పూర్వక హవిరాసాదనము చెప్పఁబడుచున్నది. (ఈ యనువాకము విద్యారణ్యమున 13వాక్యములుగా వ్యాఖ్యాతమైనది. ఇచట వినియోగభేదమననుసరించి 16వాక్యములుగా విభజించి వ్యాఖ్యానింపఁబడినది.)

1. అర్థము: (హే ఇధ్మ!=ఓ యిధ్మమా! త్వమ్=నీవు) కృష్ణః=కృష్ణరూపమైనదానవు, ఆఖరేష్ఠః=వృక్షమునందుండు దానవు, అసి=అగుచున్నావు, అగ్నయే=అగ్నికొఱకు, త్వా=నిన్ను, స్వాహా=ప్రోక్షించుచున్నాను. (ఇధ్మము=మోదుగు సమిధ — లేదా రావి సమిధ. కల్పసూత్రము ననుసరించి నానార్థకమైన స్వాహాశబ్దమున కిచట ప్రోక్షణము అర్థము.)

తాత్పర్యము: ఓ యిధ్మమా! నీవు నల్లని రూపముకల దానవు. వనస్పతి స్వరూపమునగుచున్నావు. అట్టి నిన్ను అగ్ని కొఱకుఁ బ్రోక్షించుచున్నాను. (ఈ మంత్రము చెప్పుచు నధ్వర్యుఁడు ఇధ్మముమీద నీటిని మూఁడుమారులు చల్లవలెను.

2. అర్థము: (హే వేదే!=ఓ వేది ప్రదేశమా!, త్వమ్=నీవు,) వేదిః=పొందఁబడిన దానవు, అసి=అగుచున్నావు. బర్హిషే=దర్భ కొఱకు (దర్భలనుంచుటకొఱకు) త్వా=నిన్ను, స్వాహా=ప్రోక్షించుచున్నాను.

తాత్పర్యము: హే వేది ప్రదేశమా! నీవు బర్హిస్సు మున్నగువాని నుంచుట కాధారమైనదానవు. బర్హిస్సు నుంచుటకు నిన్నుఁ బ్రోక్షించుచున్నాను. (బర్హిస్సు నుంచు వేదిపై నీటిని మూఁడుమారులు జల్లవలెను.)

3. అర్థము: హే బర్హిః!=ఓ దర్భా!, (త్వమ్=నీవు, బృంహణమ్=వేదియందుంచఁబడిన దానవు). అసి=అగుచున్నావు. స్రుగ్భ్యః=స్రుక్కు మొదలగువాని (నుంచుట) కొఱకు, త్వా=నిన్ను, స్వాహా=ప్రోక్షించుచున్నాను.

తాత్పర్యము: ఓ దర్భా! నీవు వేది యందుఁబఱచఁబడిన దానవు. స్రుక్కు మున్నగు హోమసాధనముల నుంచుట కొఱకు నిన్నుఁ బ్రోక్షించుచున్నాను. (బర్హిస్సుమీద నీటిని జల్లవలెను.)

4. అర్థము: (హే బర్హిస్సమూహ!=ఓ దర్భ సముదాయమా!) త్వా=నిన్ను, దివే=స్వర్గముకొఱకు, త్వా=నిన్ను, అన్తరిక్షాయ=అంతరిక్షము కొఱకు, త్వా=నిన్ను, పృథివ్యై=భూలోకము కొఱకును, (స్వాహా=ప్రోక్షించుచున్నాను.)

తాత్పర్యము: ఓ బర్హిస్సముదాయమా! నిన్ను స్వర్గము, అంతరిక్షము భూలోకములకొఱకుఁ బ్రోక్షించుచున్నాను. (ఈ మంత్రము చెప్పుచు దర్భల అగ్రభాగమునందు నీటిని జల్లవలెను.)

5. అర్థము: (హే ఉదక!=ఓ ఉదకమా! త్వమ్=నీవు) పితృభ్యః=పితృదేవతల కొఱకు, స్వధా=ఇవ్వఁబడినదానవు, బర్హిషద్భ్యః=దర్భల యందుండు పితృదేవతల కొఱకు, ఊర్క్=రసరూపమైనదానవు, భవ=అగుము. (హే ఉదకాని!=ఓ ఉదకములారా! యూయమ్=మీరు) ఊర్జా=రసముతో, పృథివీమ్=భూమిని, గచ్ఛత=పొందుఁడు.

తాత్పర్యము: (దర్భలమీఁద బ్రోక్షింపఁగా మిగిలిన నీటినిగూర్చి యీ మంత్రము చెప్పఁబడుచున్నది.) ఓ ఉదకమా! నీవు పితృదేవతల కివ్వఁబడుటచే దర్భల యందుండు పితృదేవతలకై రసరూపమగుము. (రసరూపముతోఁ బృథివినిఁ బొందుముఁ అని భావము. ప్రోక్షింపఁగా మిగిలిన యుదకమును భూమిమీఁదఁ బోయవలెను.)

6. అర్థము: (హే ప్రస్తర!=ఓ ప్రస్తరమా!, త్వమ్=నీవు) విష్ణోః=వ్యాప్తమైన యజ్ఞమునకు, స్తూపః=సంఘాతరూపముగ ధారకము, అసి=అగుచున్నావు. (ప్రస్తరము=దర్భల కట్ట)

తాత్పర్యము: ఓ ప్రస్తరమా! నీవు ఇచట విస్తరించియున్న యజ్ఞమును ధరించిన దానవు. (ఈ మంత్రము చెప్పుచు దర్భల కట్టను గ్రహించవలెను.)

7. అర్థము: (హే దర్భసమూహ!=ఓ దర్భల సముదాయమా!) ఊర్ణామ్రదసమ్=కంబళివలె మృదువైనట్టియు, దేవేభ్యః=దేవతల కొఱకు, స్వాసస్థమ్=సుఖ స్థానమైనట్టియు, త్వా=నిన్ను, స్తృణామి=(వేదియందు) పఱచుచున్నాను.

తాత్పర్యము: ఓ దర్భసముదాయమా! కంబళివలె మృదువును, దేవతలకు సుఖకరమును నగు నిన్ను వేదియందుఁ బఱచు చున్నాను. (వేదియందు దర్భలను పఱచవలయును.)

విశేషములు: ఊర్ణోతీత్యూర్ణా. 'ఊర్ణుఞ్=ఆచ్ఛాదనే' అను ధాతువు నుండి 'ఊర్ణావద మేర్పడినది. 'మ్రద=మర్దనే' అను ధాతువునకు 'సుబ్' ప్రత్యయము వచ్చి 'మ్రదసమ్' అని యేర్పడినది. సుశోభనాః+ఆసాః=అసితారః, స్థాతారశ్చ యస్మిన్ సః 'స్వాసస్థః'. 'అస'ధాతువునకు 'అచ్' ప్రత్యయము, 'స్థా' ధాతువునకు 'క్విప్' ప్రత్యయము చేయఁగా 'స్వాసస్థః' అని యేర్పడినది.

8. **అర్థము:** (హే మధ్యమ పరిధే!=ఓ మధ్యమ పరిధీ!, త్వమ్=నీవు) విశ్వావసుః=విశ్వావసువను పేరుగల, గంధర్వః=గంధర్వునివంటిదానవు, అసి=అగుచున్నావు. విశ్వస్మాత్=సమస్తమైన, ఈషతః=హింసనుండి, యజమానస్య=యజమానునకు. పరిధిః=సంరక్షకమును, ఇడః=అన్నరూపమైన దానవును, ఈడితః=(అందఱిచేత) స్తుతింపబడిన దానవును, (భవ=అగుము) (వేది యందున్న మోదుగు పుల్లలలోమధ్యనున్నదానికి మధ్యమ పరిధి యని వ్యవహారము. ఈ మోదుగుపుల్లలనే ఇట సమిధలుగా నుపయోగింతురు.)

తాత్పర్యము: ఓ మధ్యమపరిధీ! నీవు విశ్వావసు వనెడి గంధర్వునివంటి దానవు. కావున యజమానుని సమస్త హింసలనుండి రక్షించు దానవు, అన్నరూపమైన దానవు, అందఱిచే స్తుతింపఁబడిన దానవు నగుము. (ఈ మంత్రము చెప్పుచు మోదుగుపుల్లలలో మధ్యనున్న దానిని అగ్నికిఁ దూర్పుగ నుంచవలెను.)

విశేషములు: గాః=గీతిరూపాః, స్తుతిరూపావా వాచః ధారయతీతి-'గంధర్వః' అని తారానాథ వాచస్పత్యము. గోశబ్దమునకు 'గమ్' ఆదేశము. 'ఈష=గతి హింసా దానేషు' అను ధాతువునుండి 'ఈషత్' అను పదమేర్పడినది. 'ఈషతః' పంచమ్యంతము.

9. **అర్థము:** (హే దక్షిణపరిధే!=ఓ దక్షిణ పరిధీ! త్వమ్=నీవు) ఇన్ద్రస్య=ఇంద్రునియొక్క, బాహుః=బాహువు వంటిదానవు, అసి=అగుచున్నావు. (కావున దక్షిణ దిక్కునందుండి) యజమానస్య=యజమానునకు, పరిధిః=రక్షకము, ఇడః=అన్నరూపమైనదానవు, ఈడితః=(అందఱిచేత) స్తుతింపఁబడిన దానవును, భవ=అగుము.

తాత్పర్యము: ఓ దక్షిణ పరిధీ! నీవు ఇంద్రుని బాహువు వంటిదానవు. కావున దక్షిణ దిక్కునందుండి యజమానుని రక్షింపుము. అన్నరూపమును, అందఱిచేత స్తుతింపఁబడిన దానవు నగుము. (ఈ మంత్రము చెప్పుచు నగ్నికి దక్షిణ దిక్కునందు మోదుగు సమిధ నుంచవలెను.)

10. **అర్థము:** (హే ఉత్తరపరిధే!=ఓ ఉత్తరపరిధీ!) త్వా=నిన్ను, మిత్రావరుణౌ=మిత్రావరుణదేవతలు, ఉత్తరతః=ఉత్తర దిక్కునందు, పరిధత్తామ్=ఉంచుదురుగాక. (త్వమ్=నీవు) ధ్రువేణ=నిత్యమైన, ధర్మణా=ధర్మముచేత, యజమానస్య=యజమానునకు, పరిధిః=సంరక్షకమును, ఇడః=అన్నరూపమును, ఈడితః=(అందఱిచేత) స్తుతింపఁబడినదానవును, (భవ=అగుము.)

తాత్పర్యము: ఉత్తరపు వైపునను న్న ఓ మోదుగు సమిధా! నిన్ను మిత్రావరుణదేవతలు ఉత్తర దిక్కునందుంచుదురు గాక. నీవు నిత్యమైన ధర్మముచేత సంరక్షకము, అన్నరూపము, అందఱిచేత స్తుతింపఁబడినదానవు నగుము. (ఈ మంత్రము చెప్పుచు నగ్నికి ఉత్తర దిక్కున మోదుగు సమిధనుంచవలెను.)

11. **అర్థము:** (హే అగ్నే!=ఓ ఆహవనీయాగ్నీ!) త్వా=నిన్ను, సూర్యః=సూర్యుఁడు, పురస్తాత్=తూర్పుదిక్కునుండి, కస్యాశ్చిదభిశస్త్యాః=ఏ యొక హింసనుండియు, పాతు=రక్షించుఁగాక.

తాత్పర్యము: ఓ యాహవనీయాగ్నీ! సూర్యుఁడు నిన్ను తూర్పుదిక్కునుండి ప్రతిహింస నుండియు రక్షించుఁగాక. (ఈ మంత్రము చెప్పుచు నాహవనీయాగ్నిని అభిమంత్రించవలెను.)

12. **అర్థము:** కవేః=విద్వాంసుఁడవైన, హే అగ్నే!=ఓ యగ్నీ!, వీతిహోత్రమ్=సమృద్ధి కొఱకుఁ జేయఁబడిన హోమము కలవాఁడవును, ద్యుమన్తమ్=ప్రకాశము కలవాఁడవును, బృహన్తమ్=గొప్పవాఁడవునునగు, త్వా=నిన్ను, అధ్వరే=యాగమునందు, సమిధీమహి=ప్రజ్వలింపఁ జేయుచున్నాము.

తాత్పర్యము: విద్వాంసుఁడవైన ఓ యగ్నీ! నీవు సమృద్ధమైన హోమము కలవాఁడవు, ప్రకాశించువాఁడవు, గొప్పవాఁడవు. అట్టి నిన్ను యాగము నిమిత్తము ప్రజ్వలింపఁ జేయుచున్నాము. (ఈ మంత్రము చెప్పుచు నగ్నికిఁ దూర్పుదిక్కునందు అఘార సమిధలను ఊర్ధ్వముఖముగ నుంచవలెను.)

విశేషములు: వి + ఈతీనామ్=విశేషములైన ఈతిబాధలను, హోత్రమ్=హరించువాఁడు. 'హు'=దానాదనయోః అను ధాతువునుండి హోత్రశబ్ద ముత్పన్నమైనది. సమ్ + ఇధీమహి అను క్రియాపదము="ఇన్ధీ=దీప్తౌ" అను ధాతువునుండి యేర్పడినది. 'బృహ న్తమ్=మహా న్తమ్' అని భట్ట భాస్కరభాష్యము.

13. అర్థము: (హే విధృతౌ!=ఓ విధృతులారా!, యువామ్=మీరు,) విశః=ప్రజలకు, యన్త్రీ=నియామకులు, స్థః=అగు చున్నారు. (వేదియందు పఱచెడి రెండు దర్భలకు విధృతులని పేరు.)

తాత్పర్యము: ఓ విధృతులారా! మీరు ప్రజలను నియమించువారు అగుచున్నారు. (ఈ మంత్రము చెప్పుచు వేదియందు రెండు దర్భలను పఱచవలెను. విశేషేణ ధృతిః ధారణం=ప్రస్తరాదీనాం ధారణం యస్మిన్నితి వ్యుత్పత్త్యా విధృతి పదవాచ్యమితి శ్రౌతపదార్థ నిర్వచనము.)

14. అర్థము: (హే ప్రస్తర!=ఓ ప్రస్తరమా! త్వమ్=నీవు) వసూనామ్=వసువులకును, రుద్రాణామ్=రుద్రులకును, ఆదిత్యానామ్=ఆదిత్యులకును, సదసి=స్థానమైన విధృతి ద్వయమునందు, సీద=ఉండుము.

తాత్పర్యము: ఓ ప్రస్తరమా! నీవు వసురుద్రాదిత్య దేవతలకు స్థానమైన విధృతి ద్వయము నందుండుము. (ప్రస్తరమును విధృతి ద్వయమునందుంచవలయును.)

15. అర్థము: (హే జుహో!=ఓ జుహూపాత్రమా! త్వమ్=నీవు) నామ్నా=పేరుచేత, జుహూః=జుహువు, అసి=అగు చున్నావు. ప్రియేణ నామ్నా=ప్రియమైనపేరు చేత, ఘృతాచీ=ఘృతాచివి (=ఘృతముచే నిండిన దానవు) అసి=అగుచున్నావు. (కావున) ప్రియే=ప్రియమైన, సదసి=విధృతియను స్థానమునందు, సీద=ఉండుము. (హే ఉపభృత్=ఓ ఉపభృత్తూ! త్వమ్=నీవు) నామ్నా=పేరుచేత, ఉపభృత్=ఉపభృత్తువు, అసి=అగు చున్నావు. ప్రియేణ నామ్నా=ప్రియమైనపేరుచేత, ఘృతాచీ=ఘృతాచివి(=ఘృతముచే నిండిన దానవు) అసి=అగుచున్నావు(కావున) ప్రియే సదసి సీద=ప్రియమైన విధృతి స్థానము నందుండుము. (హే ధ్రువే!=ఓ ధ్రువపాత్రమా!, త్వమ్=నీవు) నామ్నా=పేరుచే, ధ్రువా=ధ్రువవు, అసి=అగుచున్నావు. ప్రియేణ నామ్నా=ప్రియమైనపేరుచే, ఘృతాచీ=ఘృతాచివి(=ఘృతముచేనిండినదానవు) అసి=అగుచున్నావు. (కావున) ప్రియే సదసి సీద=ప్రియమైన విధృతిస్థానమునందుండుము.

తాత్పర్యము: జుహువు, ఉపభృత్తు, ధ్రువ — అనుహోమసాధన పాత్రములకు జుహ్వాదినామములు సాధారణములైనవి. అవి ఘృతముతో నిండి యుండుటచే 'ఘృతాచి' అనుపేరు వానికిఁబ్రియమైనది. ఘృతమ్=అజ్యమ్, అఞ్చతి=ప్రాప్నోతీతి=ఘృతాచి యను వ్యుత్పత్తిచే ఘృతమును బొందునది యను నర్థమేర్పడుచున్నది. అందువలన జుహూపభృ ద్ధ్రువ పాత్రములు తమకు బ్రియమైన విధృతి స్థానము నందుండవలసినదిగాఁ బ్రార్థింపఁ బడినవి. (ఈ మంత్రము చెప్పుచు జుహ్వాది పాత్రములను ప్రస్తరమునందుంచవలెను.)

16. అర్థము: ఏతాః=ఈ జుహూపభృ ద్ధ్రువ పాత్రలు, సుకృతస్య=పుణ్యమునకు, లోకే=స్థానమైన ప్రస్తరమునందు, అసదన్=ఉన్నవి. హే విష్ణో!=ఓ విష్ణూ! తాః=ఆ పాత్రలను, పాహి=రక్షింపుము. యజ్ఞమ్=యాగమును, పాహి=రక్షింపుము. యజ్ఞపతిమ్=యజమానుని, పాహి=రక్షింపుము. యజ్ఞనియమ్=యజ్ఞమును జేయించు చున్న, మామ్=నన్ను(అధ్వర్యుని) పాహి=రక్షింపుము.

తాత్పర్యము: ఓ విష్ణూ! ఈ జుహూపభృ ద్ధ్రువ పాత్రలు పుణ్యస్థానమైన ప్రస్తరమునందున్నవి. నీవు ఈ పాత్రలను, యజ్ఞమును, యజమానుని, యజ్ఞము చేయించుచున్న నన్ను (అధ్వర్యుని) రక్షింపుము. (ఈ మంత్రము చెప్పుచు జుహ్వాది పాత్రల నభిమంత్రించవలెను.)—

ఏకాదశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ప్రథమప్రపాఠకే ద్వాదశోఽనువాకః।

మూలము: [1]భువన మసి వి ప్రథస్వా గ్నే యష్ట రిదం నమః [2]జుహ్వేహ్యగ్ని స్త్వా హ్వయతి దేవయజ్యాయా
[3]ఉపభృ దేహి దేవ స్త్వా సవితా హ్వయతి దేవయజ్యాయా [4]అగ్నావిష్ణూ మా వా మవ క్రమిషం
విజిహాథాం మా మా సం తాప్తం లోకం మే లోకకృతౌ కృణుతం [5]విష్ణో స్థాన మసి [6]త ఇన్ద్రో
అకృణో ద్వీర్యాణి సమారభ్యో ర్ధ్వ అధ్వరో దివిస్పృశ మహ్రుతో యజ్ఞో యజ్ఞపతే రిన్ద్రావా
న్త్స్వాహా [7]బృహద్భాః [8]పాహి మా ఽగ్నే దుశ్చరితా దా మా సుచరితే భజ [9]మఖస్య శిరో ఽసి
సం జ్యోతిషా జ్యోతి రజ్యతామ్ ॥౧౨॥ (అప్రహుత ఏకవిగ్ంశతి శ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ప్రథమ ప్రపాఠకే ద్వాదశోఽనువాకః।

వేదార్థ దీపిక

అవతారిక: ఏకాదశానువాకమునందు ఇధ్మా బర్హిస్స్రుక్కులకు ప్రోక్షణాది తంత్రము చెప్పఁబడినది. ఈ ద్వాదశానువాకమునందు ఇధ్మకాష్ఠముపై హోమము చేయుటకు అఘారహోమము విధింపఁబడుచున్నది.

1. అర్థము: యష్టః=యాగనిర్వాహకుఁడవైన, హే అగ్నే!=ఓ యగ్నీ! (త్వమ్=నీవు) భువనమ్=(సర్వపదార్థములకు) కారణము, అసి=అగుచున్నావు. (కావున), విప్రథస్వ=వృద్ధి నొందుము. (తే=నీకొఱకు), ఇదమ్=ఈ, నమః=నమస్కారము.

తాత్పర్యము: యాగ నిర్వాహకుఁడవైన ఓ యగ్నీ! నీవు సర్వపదార్థములకు కారణభూతుఁడవు. కావున వృద్ధినొందుము. నీకి నమస్కారము.

విశేషములు: భవన్త్యస్మాత్ భూతానీతి భువనమ్. అతో భూతకారణత్వాత్ విస్తృతోభవేతి విద్యారణ్యభాష్యము. 'యష్టః+ఇదమ్' అని యుండగా "హ్వః అభాః" ఇత్యాదిక ప్రాతిశాఖ్య సూత్రముచే రేఫము వచ్చి 'యష్టరిదమ్' అని యేర్పడినది.

2. అర్థము: హే జుహు!=ఓ జుహూ పాత్రమా!, త్వా=నిన్ను, అగ్నిః=అగ్ని, దేవయజ్యాయై=దేవయాగము కొఱకు, హ్వయతి=పిలుచుచున్నాఁడు, ఏహి=రమ్ము.

తాత్పర్యము: ఓ జుహూపాత్రమా! అగ్ని నిన్ను దేవయాగమునకై పిలుచుచున్నాఁడు. రమ్ము. (అధ్వర్యుఁ డీ మంత్రము చెప్పుచు జుహూపాత్రమును తీసికొనవలయును. ఆ+ఇహి=ఏహి)

3. అర్థము: హే ఉపభృత్!=ఓ ఉపభృత్తనెడి పాత్రమా!, సవితా=ప్రేరకుఁడగు, దేవః=దేవుఁడు, త్వా=నిన్ను, దేవ యజ్యాయై=దేవయాగముకొఱకు, హ్వయతి=పిలుచుచున్నాఁడు. ఏహి=రమ్ము. తాత్పర్యము సులభము. (ఈ మంత్రము చెప్పుచు ఉపభృత్తును స్వీకరించవలయును.)

4. అర్థము: హే అగ్నా విష్ణూ!=ఓ అగ్నా విష్ణు దేవతలారా!, వామ్=మిమ్ము, మా అవక్రమిషమ్=(ఆఘారహోమము నకై మీమధ్యగా వెళ్లుచున్ననేను పాదముచేత) అతిక్రమించను. విజిహాథామ్=(నేనువెళ్లుటకై మీరు ఉభ యులు) విడివడియుండుడు. మా=నన్ను, మా సంతాప్తమ్=సంతాప పెట్టవలదు. లోకకృతౌ=స్థానకర్తలగు మీరు, మే=నాకు, లోకమ్=గమనస్థానమును, కృణుతమ్=కలుగఁజేయుఁడు. (పాదముచే నతిక్రమించిన దోషము నాకుఁగలుగకుండుఁగాక యని యర్థము.)

తాత్పర్యము: ఓ అగ్నా విష్ణు దేవతలారా! ఆఘారహోమము చేయుటకై మీయుభయుల మధ్యగా వెళ్లుచున్న నేను మిమ్ము పాదములచే దాటను. నేను పోవుటకై మీరు విడి విడిగా నుండుడు. నన్ను సంతాపపెట్టకుఁడు. స్థానము కలుగఁజేయునట్టి మీరు నేను వెళ్లుటకు స్థానమును గలుగఁజేయుడు. (ఈ మంత్రము చెప్పుచు దక్షిణ పాదముచే ప్రస్తరమును దాటవలెను.

5. అర్థము: (హే భూప్రదేశ!=ఓ భూప్రదేశమా; త్వమ్=నీవు) విష్ణోః=యజ్ఞ పురుషునకు, స్థానమ్=స్థానముగా, అసి= అగుచున్నావు. ఇతః=ఈ స్థానబలమువలన, ఇన్ద్రః=ఇంద్రుఁడు, వీర్యాణి=అసురవధరూపములైన వీరకృత్య ములను, అకృణోత్=చేసెను.

తాత్పర్యము: ఓ భూప్రదేశమా! నీవు యజ్ఞ పురుషునకు స్థానమగుచున్నావు. ఈ స్థానబలమువలన ఇంద్రుఁడు అసురులను వధించుట మొదలగు వీరకృత్యములను చేయఁగలిగెను. (ఈ మంత్రము చెప్పుచు అధ్వర్యుఁడు ఆహవనీ యాగ్నికి దక్షిణభాగము నందుండవలెను.)

విశేషములు: విష్ణు పదమును యజ్ఞ పరముగ 'యజ్ఞోవై విష్ణుః' అని బ్రాహ్మణము చెప్పుచున్నది. 'ఇతః' అనునది అవ్యయము. ''ఇతః=ప్రశస్తే అస్మిన్‌స్థానే స్థిత్వా యాగం నిర్వర్తయామీతి భావః'' అని భట్ట భాస్కర భాష్యము.

6. అర్థము: సమారభ్య=(నైరృతి దిక్కు) మొదలుకొని, దివిస్పృశమ్=ఈశాన్యదిక్కును స్పృశించి, ఊర్ధ్వః=పొడవైన దియు, అధ్వరః=ఎడతెగనిదియు, అహ్రుతః=వంకరలేనిదియు, ఇన్ద్రావాన్=ఇంద్ర దేవతాకమైనదియునగు, యజ్ఞపతేః=యజమానునియొక్క, యజ్ఞః=ఆఘారహోమము, స్వాహా=(దేవతకొఱకు)ఈయఁబడినది.

తాత్పర్యము: ఆఘారహోమము నైరృతి దిక్కున ప్రారంభించి యీశాన్యదిక్కున సమాప్తమగునట్లుగాఁ జేయవలెను. అట్టి హోమము ఎడ తెగకుండఁ జేయవలసి యుండుటచే ఆ హోమము పొడవైనదిగాను, వంకర లేనిదిగాను, ఉండును. ఈయాఘారహోమమునకు నింద్రుఁడు దేవత. (ఈ మంత్రము చెప్పుచు అధ్వర్యుఁడు ఆ ఘారహోమము చేయవలెను. 'ఇంద్రవాన్' అని ఉండవలసియుండగా 'ఇంద్రావద్వన్‌పరః' 'అను ప్రాతిశాఖ్య సూత్రముచే దీర్ఘమువచ్చి 'ఇంద్రావాన్' అని యైనది.)

7. అర్థము: బృహత్ + భాః=(అగ్ని ఆఘారహోమముచే) గొప్ప తేజస్సు కలవాఁడుగా, (భవతి=అగుచున్నాఁడు.)

తాత్పర్యము: అగ్ని ఆఘారహోమముచే గొప్ప తేజస్సుతో ప్రకాశించుచున్నాఁడు. (ఈ మంత్రము చెప్పుచు జుహువు దగ్ధము కాకుండుటకై పైకి తీసికొనవలెను.)

8. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ! (త్వమ్=నీవు) మా=నన్ను, దుశ్చరితాత్=పాపము నుండి, పాహి=రక్షించుము. సుచరితే=మంచి నడవడియందు, మా=నన్ను, ఆభజ=స్థాపించుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు నన్ను దుష్కృతమునుండి కాపాడుము. నన్ను మంచి నడవడియందుంచుము. (మంచి నడవడి కలవానినిగాఁ జేయుము.) (ఈ మంత్రము చెప్పుచు జుహూ వభృత్తులను తాఁకకుండ వెళ్లుచు జపము చేయ వలెను.)

9. అర్థము: (హే అఘార హవిశ్శేష!=ఓ ఘార హవిశ్శేషమా! త్వమ్=నీవు) మఖస్య=యజ్ఞమునకు, శిరః=శిరస్సువంటి దానవు, అసి=అగుచున్నావు. జ్యోతిషా=జ్యోతిస్సుతో, జ్యోతిః=ధ్రువపాత్రము నందుండునట్టి ఆజ్యరూప మైన) తేజస్సును, సమజ్తామ్=బాగుగఁగలిసికొనుము.

తాత్పర్యము: ఆఘారహోమము చేయఁగా మిగిలిన హవిస్సా! నీవు యజ్ఞమునకు శిరస్సు వంటి దానవు. (=ప్రధానమైన దానవు.) నీ తేజస్సుతో ధ్రువపాత్రమునందలి ఆజ్యరూప తేజస్సును కలిసికొనుము. (ఈ మంత్రము చెప్పుచు జుహూ పాత్రమునుండి ధ్రువపాత్రమునందు మూఁడు ఆజ్య బిందువులనుంచవలెను.)

ద్వాదశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ప్రథమప్రపాఠకే త్రయోదశోఽనువాకః ।

మూలము: వాజస్య మా ప్రసవేనో ద్గ్రాభేణో ద్గ్రభీత్। అథా సపత్నాగ్ం ఇన్ద్రో మే నిగ్రాభేణా ధరాగ్ం అకః। ఉద్గ్రాభం చ నిగ్రాభం చ। బ్రహ్మ దేవా అవీవృధన్। అథా సపత్నా నిన్ద్రాగ్నీ మే విషూచీనా న్వ్యస్యతామ్। [2]వసుభ్య స్త్వా రుద్రేభ్య స్త్వా ఽఽదిత్యేభ్య స్త్వా ఽ[3]క్తగ్ం రిహాణా వియన్తు వయః। ప్రజాం యోనిం మా నిర్మృక్ష [4]మాప్యాయన్తా మాప ఓషధయో మరుతాం పృషతయ స్థ్స దివమ్ (౧) గచ్ఛ తతో నో వృష్టి మేరయ। [5]ఆయుష్పా అగ్నే ఽస్యాయు ర్మే పాహి చక్షుష్పా అగ్నే ఽసి చక్షు ర్మే పాహి [6]ధ్రువా ఽసి [7]యం పరిధిం పర్యధత్థా అగ్నే దేవ పణిభి ర్వీయమాణః। తం త ఏత మను జోషం భరామి నేదే ష త్వ దపచేతయాతై యజ్ఞస్య పాథ ఉపసమితగ్ం [8]సగ్ం స్రావభాగాస్థ్సే షా బృహన్తః ప్రస్తరేష్ఠా బర్హిషద శ్చ। (౨) దేవా ఇమాం వాచ మభి విశ్వే గృణన్త ఆసద్యా స్మి న్బర్హిషి మాదయధ్వ [9]మగ్నే ర్వా మపన్నగృహస్య సదసి సాదయామి సుమ్నాయ సుమ్నినీ సుమ్నే మా ధత్తం ధురి ధుర్యౌ పాత మ[10]గ్నే ఽదబ్ధాయో ఽశీతతనో పాహి మా ఽద్య దివః పాహి ప్రసిత్యై పాహి దురిష్ట్యై పాహి దురద్మన్యై పాహి దుశ్చరితా దవిషం నః పితుం కృణు సుషదా యోనిగ్ం స్వాహా [11]దేవా గాతువిదో గాతుం విత్త్వా గాతు మిత మనస స్పత ఇమం నో దేవ దేవేషు యజ్ఞగ్ం స్వాహా వాచి స్వాహా వాతే ధాః ॥౩॥ (దివం చ విత్త్వా గాతుం త్రయోదశ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ప్రథమప్రపాఠకే త్రయోదశోఽనువాకః ।

వేదార్థదీపిక

అవతారిక: ద్వాదశానువాకమునందు అఘారహోమములు చెప్పఁబడినవి. ఈ యనువాకమునందు స్రుగ్వ్యూహనాది మంత్రములు చెప్పఁబడుచున్నవి.

1. ౧ అర్థము: వాజస్య=అన్నముయొక్క, ప్రసవేన, ఉత్పత్తిహేతువైన, ఉద్గ్రాభేణ=జుహువును పైకెత్తి పట్టుకొనుటచేత, మా=నన్ను, ఉదగ్రభీత్=(ఇంద్రుఁడు)పైకి తీసికొని పోవును.

తాత్పర్యము: జుహువును పైకెత్తి పట్టుకొనవలెను. అట్లు పట్టుకొనుట అన్నోత్పత్తికి హేతువు. అట్లు చేయుటచే ఇంద్రుఁడు నన్ను పైకిఁగొనిపోవును. (ఈ మంత్రము చెప్పుచు జుహువును పైకెత్తిపట్టుకొనవలెను.)

౨ అర్థము: అథ=పిమ్మట, నిగ్రాభేణ=ఉపభృత్తును క్రిందుగనుంచుటచే, మే=నాయొక్క, సపత్నాన్=శత్రువులను, అధరాన్=నికృష్టులనుగా, ఇన్ద్రః=ఇంద్రుఁడు, అకః=చేసెను.

తాత్పర్యము: ఉపభృత్తును క్రిందుగ నుంచుటచే నింద్రుఁడు నా శత్రువులను నికృష్టులనుగాఁ జేసెను. (ఉపభృత్తును క్రిందుగ నుంచవలెను.)

విశేషములు: 'అకః' – ''డు – కృఞ్=కరణే'' అను ధాతువునకు 'లఙ్' ప్రత్యయము చేయగా, 'బహుళం ఛన్దసి' అను సూత్రముచే 'శప్' ప్రత్యయము లోపించగా గుణము వచ్చి తిప్ ప్రత్యయము కూడ లోపించి 'అకః' అను రూప మేర్పడినది.

౩ అర్థము: బ్రహ్మ=బ్రహ్మ, దేవాశ్చ=దేవతలును, ఉద్గ్రాభం చ=(నాకు)ఉత్కర్షను, నిగ్రాభం చ=(శత్రువులకు)అపకర్షనుకూడ, అవీవృధన్=వృద్ధి చేసిరి.

తాత్పర్యము: జుహువును పైకెత్తుటచేతను, ఉపభృత్తును క్రిందుగ నుంచుటచేతను బ్రహ్మయు దేవతలును నాకు ఉత్కర్షను శత్రువులకు అపకర్షను జేసిరి. (ఈ మంత్రము చెప్పుచు జుహువును తూర్పు ముఖముగ కదలింపవలెను.)

౪ అర్థము: అథ=పిమ్మట, ఇన్ద్రాగ్నీ=ఇంద్రాగ్ని దేవతలు, మే=నాయొక్క, సపత్నాన్=శత్రువులను, విషూచీనాన్=స్థాన భ్రష్టులనుగా; వ్యస్యతామ్=విశేషముగ ప్రవర్తింపఁ జేయుదురుగాక.

తాత్పర్యము: ఇంద్రాగ్ని దేవతలు నా శత్రువులను స్థాన భ్రష్టులనుగాఁ జేయుఁదురుగాక. (ఈ మంత్రము చెప్పుచు ఉపభృత్తును ఎడమ చేతితో వెలుపల పడమరగా నుంచవలెను. ఈ 1వ మంత్రము వినియోగ సౌకర్యముకై నాలుగు భాగములుచేసి వ్యాఖ్యానింపఁబడినది.)

2. అర్థము: (హే మధ్యమ పరిధే!=ఓ మధ్యమ పరిధీ!) త్వా=నిన్ను, వసుభ్యః=వసువులకొఱకు, (అనజ్మి=తుడుచుచున్నాను.) (హే దక్షిణపరిధే!=ఓ దక్షిణపరిధీ!) త్వా=నిన్ను, రుద్రేభ్యః=రుద్రులకొఱకు, (అనజ్మి=తుడుచుచున్నాను.) (హే ఉత్తరపరిధే!=ఓ ఉత్తరపరిధీ!=ఓ ఉత్తరపరిధీ!) త్వా=నిన్ను, ఆదిత్యేభ్యః=ఆదిత్యులకొఱకు, (అనజ్మి=తుడుచుచున్నాను.)

తాత్పర్యము: వసువులకొఱకు మధ్యమపరిధిని, రుద్రులకొఱకు దక్షిణపరిధిని, ఆదిత్యులకొఱకు ఉత్తరపరిధిని తుడుచుచున్నాను. (ఈ మూడు మంత్రభాగములను చెప్పుచు వరుసగా మధ్యమ దక్షిణోత్తర పరిధులను తుడువవలెను.)

3. ౧ అర్థము: అక్తమ్=ఆజ్యముచే తడుపఁబడిన ప్రస్తరాగ్రమును, వయః=పక్షులు, రిహాణాః=అస్వాదించినవై (నాకినవై) వియన్తు=ఆకాశమున నెగురుగాక.

తాత్పర్యము: నేతితో తడిసిన ప్రస్తరాగ్రమును పక్షులు నాకి పైకెగురుగాక. (ఈ మంత్రము చెప్పుచు జుహువును ప్రస్తరాగ్రముతో తుడువవలెను.)

విశేషములు: 'అజ=గతిక్షేపణయోః' అను ధాతువునుండి 'అక్తమ్' అని యేర్పడినది. 'రిహాణాః'—లిహానాః. "లిహ=ఆస్వాదనే" వర్ణవ్యత్యయేన లకారస్య రేఫః' అని భట్టభాస్కరము.

౨ అర్థము: ప్రజామ్=(యజమానుని యొక్క) సంతానమును, యోనిమ్=భార్యను, మా నిర్మృక్షమ్=నశింపఁజేయను.

తాత్పర్యము: యజమానుని సంతానమును భార్యను నశింపఁజేయను. (ఉపభృత్తును ప్రస్తరమధ్య భాగముచే తుడువ వలెను.)

4. ౧ అర్థము: ఆపః=ఉదకములు, ఓషధయః=ఓషధులను, ఆప్యాయన్తామ్=వృద్ధి నొందించుఁగాక. (ఓషధయః=ఓషధీః, అని బ్రాహ్మణము. ద్వితీయార్థమున ప్రథమ.)

తాత్పర్యము: ఉదకములు ఓషధులను వృద్ధినొందించుఁగాక. (ఈ మంత్రము చెప్పుచు ధ్రువ పాత్రను ప్రస్తరము మొదటిచే తుడువ వలెను.)

౨ అర్థము: (హే ప్రస్తర దర్భాః=ఓ ప్రస్తర దర్భలారా! యూయమ్=మీరు) మరుతామ్=వాయుప్రేరిత వర్షము యొక్క, పృషతయః=బిందువులు (వలనఁబుట్టినవారు) స్థ=అగుచున్నారు. (హే ప్రస్తర!=ఓ ప్రస్తరమా!, త్వమ్=నీవు) దివమ్=స్వర్గలోకమును, గచ్ఛ=పొందుము. తతః=ఆ పొందుటవలన, నః=మాకు, వృష్టిమ్=వర్షమును, ఆ+ఈరయ=అంతటను ప్రేరణచేయుము.

తాత్పర్యము: ప్రస్తరము నందలి దర్భలారా! మీరు వాయువుచే ప్రేరితమైన వర్షముయొక్క బిందువులవలనఁ బుట్టినవారు. ఓ ప్రస్తరమా! నీవు స్వర్గలోకమును బొందుము. పిమ్మట మాకు వర్షమును గల్పించుము. (ఈ మంత్రము చెప్పుచు పలాశశాఖను ప్రస్తరమును ఆహవనీయాగ్నియందు వేయవలెను.)

5. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ! (త్వమ్=నీవు) ఆయుష్పాః=ఆయువును రక్షించువాఁడవు, అసి=అగుచున్నావు. మే=నా యొక్క, ఆయుః=ఆయువును, పాహి=రక్షించుము. హే అగ్నే!=ఓ యగ్నీ!, (త్వమ్=నీవు) చక్షుష్పాః=చక్షుస్సును రక్షించువాఁడవు. అసి=అగుచున్నావు. మే=నా యొక్క, చక్షుః=దృష్టిని, పాహి=రక్షింపుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు ఆయువును చక్షుస్సును రక్షించువాఁడవు. కావున నా ఆయువును చక్షుస్సును రక్షించుము. (ఈ మంత్రము చెప్పుచు ఆహవనీయాగ్ని నభిమంత్రించవలెను.)

6. అర్థము: (హే వేది భూమే!=ఓ వేదిభూమీ! త్వమ్=నీవు) ధ్రువా=స్థిరమైనదానవు, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: ఓ వేది భూమీ! నీవు స్థిరమైనదానవు. (కావున నన్ను స్థిరముగఁ జేయుము. ఈ మంత్రము చెప్పుచు వేది మధ్య ప్రదేశమును స్పృశించవలెను.)

7. ౧ అర్థము: దేవ! ప్రకాశించుచున్న, హే అగ్నే!=ఓ యగ్నీ!, పణిభిః=స్తుతులచేత, వీయమానః=సాధ్యుఁడవగుచున్న, (త్వమ్=నీవు) యం పరిధిమ్=ఏ పరిధిని, పర్యదత్థాః=పశ్చిమభాగమునందు ధరించితివో, తే=అటువంటి నీకు, అనుజోషమ్=ప్రియానుకూలమైన, తమ్+ఏతమ్=ఆ యీ పరిధిని, భరామి=(నీయందు) ఉంచు చున్నాను. ఏషః=ఈ పరిధి, త్వత్=నీ వలన, న+ఇత్+అపచేతయాతై=అనురాగము లేనిది కాకపోవుఁగాక.

తాత్పర్యము: ఓ ప్రకాశించుచున్న యగ్నీ! స్తోత్రములకు సాధ్యుఁడవైన నీవు పశ్చిమ భాగమున ధరించి యున్న ప్రియమైన పరిధిని నీయందుంచుచున్నాను. ఇది నీ కిష్టము కానిది కాకపోవుఁగాక. (ఈ మంత్రము చెప్పుచు మధ్యమ పరిధిని ఆహవనీయాగ్నియందు వేయవలెను.)

విశేషములు: పరితః—దధతి=పుష్టాతీతి=పరిధిః, సంరక్షణము. "పణ=స్తుతౌ" అను ధాతువువలన 'పణిభిః' అని యేర్పడి నది. "అపచేతయాతై" 'అప' ఇత్యుపసర్గపూర్వక 'చితీ=సంజ్ఞానే" అను ధాతువునకు 'ణిచ్' ప్రత్యయము 'లేట్' లకారము చేయగా—ఐకారము, ఆడాగమము, గుణా యా దేశములువచ్చి "అపచేతయాతై" అను రూపమేర్పడినది.

౨ అర్థము: (హే దక్షిణోత్తర పరిధీ!=ఓ దక్షిణోత్తర పరిధులారా! యువామ్=మీరు, యజ్ఞస్య=యజ్ఞమునకు, పాథః=ఫలరూపమైన అన్నమును, ఉపసమితమ్=పొందుడు.

తాత్పర్యము: ఓ దక్షిణోత్తర పరిధులారా! మీరు యజ్ఞమునకు ఫలరూపమైన అన్నమును బొందుఁడు. (ఈ మంత్రము చెప్పుచు దక్షిణోత్తర పరిధులను రెండింటిని ఆహవనీయాగ్నియందు వేయవలెను.)

8. అర్థము: విశ్వే=సమస్తమైన, దేవాః!=దేవతలారా! (యూయమ్=మీరు) బృహన్తః=గొప్పవారును, ఇషా=(హవిర్భాగము నొందవలెననెడి) ఇచ్ఛతో, సంస్రావభాగాః=సంస్రావాజ్యభాగము కలవారును, స్థ=అగుచున్నారు. ప్రస్తరేష్ఠాః=(మీలో కొందఱు) ప్రస్తరమనెడి దర్భపిడికిటిలో నున్నవారును, బర్హిషదశ్చ=(మఱికొందఱు) పఱచఁబడిన దర్భలందున్నవారును, స్థ=అగుచున్నారు. ఇమామ్=ఈ (మాచేఁజేయఁబడిన) వాచమ్=స్తుతి రూపవాక్కును(శ్రుత్వా=విని) అభిగృణన్తః=బాగుగ నున్నదని గ్రహించుచున్నవారై, అస్మిన్ బర్హిషి=ఈ యజ్ఞమునందు, ఆసద్య=కూర్చుండి, మాదయధ్వమ్=ఆనందింతురుగాక.

తాత్పర్యము: ఓ సమస్తదేవతలారా! మీరు సంస్రావాజ్యభాగమును బొందవలెనను గోరిక కలవారు. మీలోఁ గొందఱు ప్రస్తరము ముష్టియందున్నవారు. మఱికొందఱు వేది యందుఁబఱచఁబడిన దర్భల యందున్నవారు. మేము చేయునట్టి యీ స్తుతిని బాగుగ నున్నదని గ్రహించుచున్నవారై ఈ యజ్ఞమునందుండి సంతుష్టులు కండు. సంస్రావాజ్యము=జుహూపభృత్తులచే హోమముచేయఁబడిన ఆజ్యశేషము. (ఈ మంత్రము చెప్పుచు జుహువుచేత హోమము చేయవలెను.)

విశేషములు: "సంస్రావభాగాః" అనునది మూఁడుపదములుగల సమాసము. ఇట్టి సమాసములు వేదమునందు అరుదుగా నుండును. "స్రు=గతౌ" అను ధాతువునుండి 'స్రవ' అను పదము నిష్పన్నమైనది. క్షరణమని యర్థము. ఇది అమృతము, ఆజ్యము మొదలగువానికిఁ జెందును.

9. ౧ అర్థము: (హే జుహూపభృతౌ!=ఓ జుహూపభృత్తులారా!) వామ్=మిమ్ము, అపన్నగృహస్య=అవినశ్వరస్థానముకల, అగ్నేః=అగ్నియొక్క, సదసి=శకటరూపమైన స్థానమునందు, సుమ్నాయ=(యజమానునియొక్క) సుఖము కొఱకు, సాదయామి=స్థాపించుచున్నాను. సుమ్నినీ!=సుఖవంతములైన జుహూప భృత్తులారా!, (యువామ్=మీరు) మా=నన్ను, సుమ్నే=సుఖమునందు, ధత్తమ్=స్థాపించుఁడు.

తాత్పర్యము: ఓ జుహూపభృత్తులారా! మిమ్ము నశించని స్థానముగల అగ్నియొక్క శకట రూప స్థానమునందు యజమానుని సుఖము కొఱకు స్థాపించుచున్నాను. సుఖవంతములైన మీరు నన్ను సుఖమునందుంచుఁడు. (=నాకు సుఖము కలుగఁజేయుఁడు. ఈ మంత్రము చెప్పుచు ధాన్యశకటముంచిన స్థలమునందు జుహూపభృత్తుల నుంచవలెను.)

౨ అర్థము: ధురి=బండియందు, ధుర్యౌ=యజ్ఞభారమును వహించుచున్న పత్నీయజమానులను, పాతమ్=రక్షించుఁడు.

తాత్పర్యము: యజ్ఞ భారమును వహించుచున్న యజమానుని యజమానపత్నిని రక్షింపుఁడు. అని యధ్వర్యుఁడు జుహూప భృత్తులను ప్రార్థించుచున్నాఁడు. (ఈ మంత్రము చెప్పుచు జుహూప భృత్తులను బండికాడియొక్క రంధ్ర మధ్య భాగమునందు త్రోయవలెను.)

10. అర్థము: అదబ్ధాయో!=హింసింపఁబడని జీవితము కలిగినవాఁడవును, అశీతతనో=ఉష్ణశరీరము కలవాఁడవునునగు, హే అగ్నే!=ఓ యగ్నీ! అద్య=ఇప్పుడు, మా=నన్ను, దివః=స్వర్గమునుండి, పాహి=(స్వర్గలోక వాసులగు దేవతలు నా యపరాధమును గ్రహింపకుండునట్లు) రక్షింపుము. ప్రసిత్యై=గొప్పదియగు విఘ్నరూప బంధమునుండి, పాహి=రక్షింపుము. దురిష్ట్యై=శాస్త్రవిరుద్ధ దుష్టప్రవర్తనమునుండి, పాహి=రక్షింపుము. దురద్మన్యై=యాగాధికారవిరోధి దుష్టభోజనమునుండి, పాహి=రక్షింపుము. దుశ్చరితాత్=నిషిద్ధాచరణము నుండి, పాహి=రక్షింపుము. పితుమ్=అన్నమును, నః=మాకు, అవిషమ్=అమృతముగ, కృణు=చేయుము. సుషదా=సుఖముగనుండు నిమిత్తము, యోనిమ్=స్థానమును, కురు=చేయుము. స్వాహా=(ఈఫలీకరణ ద్రవ్యము)హుతమగుఁగాక. (ఫలీకరణము=ఇంటిలో బియ్యము బాగుచేయునపుడు తీసి వేయఁదగిన మా లిన్యాంశము.)

తాత్పర్యము: ఓ యగ్నీ! స్వర్గవాసులు నా యపరాధమును గ్రహింపకుండునట్లును, విఘ్నరూపబంధము నుండియు, శాస్త్రవిరుద్ధ దుష్ట ప్రవర్తనము నుండియు, యాగాధికారమునకు విరుద్ధమైన దుష్ట భోజనము నుండియు, నిషిద్ధాచరణము నుండియు నన్ను రక్షింపుము. మా యన్నము నమృతముగఁ జేయుము. నీవు హింసింపఁబడని జీవితము కలవాఁడవు. ఉష్ణశరీరుఁడవు. ఈ ఫలీకరణ ద్రవ్యము హుతమగుఁగాక. (ఈ మంత్రము చెప్పుచు దక్షిణాగ్నియందు ఫలీకరణ ద్రవ్యమును హోమము చేయవలెను.)

విశేషములు: 'దభ్నోతి వధకర్మ' అని వేదనిఘంటువు. ఈ మంత్రమునందు విభక్తులు వ్యత్యయములుగ నున్నవి. ప్రసిత్యై, దురిష్ట్యై–ఇత్యాది చతుర్థ్యంతములు పంచమ్యర్థమునను, 'సుషదా' అను తృతీయాన్తము చతుర్థ్యర్థమునను వాడఁబడినవి.

11. **అర్థము:** గాతువిదః=మార్గమును దెలిసినవారగు, దేవాః!=దేవతలారా: గాతుమ్=(పూర్వము ఏ)మార్గమును, విత్వా=తెలిసికొని, (ఆగతాః=వచ్చితిరో!) గాతుమ్=(ఆ)మార్గమును, ఇత=పొందుఁడు. మనసఃపతే దేవః=మనోనాయకుఁడవైన ఓ దేవా!, దేవేషు=(మీరుచెప్పిన) దేవతలయందు, నః=మాయొక్క, ఇమం యజ్ఞమ్=ఈ యజ్ఞమును, ధాః=ఉంచుము, స్వాహా=(ఈ యాజ్యము)హుతమగుఁగాక, వాచి=సర్వక్రియాప్రవర్తకుఁడైన, వాతే=వాయువునందు, ధాః=ఉంచుము, స్వాహా=(ఈ యాజ్యము)హుతమగుఁగాక.

తాత్పర్యము: మార్గము దెలిసిన దేవతలారా! మీరు వచ్చిన మార్గముననే తిరిగి వెళ్లుఁడు. మనస్సునకు నాయకుఁడవైన దేవా! నీవు చెప్పిన దేవతల యందు మా యీ యజ్ఞమునుంచుము. వారికై హోమము చేయఁబడిన యీ యాజ్యము హుతమగుఁగాక. సర్వక్రియాప్రవర్తకుఁడైన వాయుదేవునియందు ఈ యజ్ఞము నుంచుము. వాయుదేవునకై హోమము చేయఁబడిన ఈ యాజ్యము హుతమగుఁగాక. (అధ్వర్యుఁడు వాయుదేవుని వలన యజ్ఞము నుపక్రమించెను గావున వాయుదేవునితోడనే యజ్ఞ సమాప్తిని సూచించుటకై ఈ యజ్ఞ సమాప్తి మంత్రము నందు వాయుదేవప్రసంగము చేయఁబడినది. ఈ మంత్రము చెప్పుచు బర్హిస్సు నగ్నిలో వేయవలెను.)

త్రయోదశానువాకము సమాప్తము

అథ ప్రథమకాణ్డే ప్రథమప్రపాఠకే చతుర్దశోఽనువాకః।

మూలము: [1]ఉభా వా మిన్ద్రాగ్నీ ఆహువధ్యా ఉభా రాధసః సహ మాదయధ్యై। ఉభా దాతారా విషాగ్ం
రయీణా ముభా వాజస్య సాతయే హువేవామ్। [2]అశ్రవగ్ం హి భూరిదావత్తరా వాం వి జామాతు
రుతవా ఘా స్యాలాత్। అథా సోమస్య ప్రయతీ యువాభ్యా మిన్ద్రాగ్నీ స్తోమం జనయామి
నవ్యమ్। [3]ఇన్ద్రాగ్నీ నవతిం పురోదా సపత్నీ రధూనుతమ్। సాక మేకేన కర్మణా। [4]శుచిం ను
స్తోమం నవజాత మద్యే న్ద్రాగ్నీ వృత్రహణా జుషేథామ్।(౧)ఉభా హి వాగ్ం సుహవా జోహవీమి
తా వాజగ్ం సద్య ఉశతే ధేష్టా। [5]వయ ము త్వా పథస్పతే రథం న వాజసాతయే। ధియే పూష
న్నయుజ్మహి।[6]పథస్పథః పరిపతిం వచస్యా కామేన కృతో అభ్యాన డర్కమ్।స నో రాస చ్ఛురుధ
శ్చన్ద్రాగ్రా ధియంధియగ్ం సీషధాతి ప్ర పూషా।[7]క్షేత్రస్య పతినా వయగ్ం హి తేనేవ జయా
మసి।గా మశ్వం పోషయిత్న్వా స నః (౨)మృడాతీదృశే।[8]క్షేత్రస్య పతే మధుమన్త మూర్మిం
ధేను రివ పయో అస్మాసు ధుక్ష్వ। మధుశ్చుతం ఘృత మివ సుపూత మృతస్య నః పతయో
మృడయన్తు।[9]అగ్నే నయ సుపథా రాయే అస్మాన్ విశ్వాని దేవ వయునాని విద్వాన్।యుయో
ధ్యస్మ జ్జుహురాణ మేనో భూయిష్ఠా న్తే నమ ఉక్తిం విధేమ।[10]ఆ దేవానా మపి పన్థా మగన్మ య
చ్ఛక్నవామ తదను ప్రవోఢుమ్।అగ్ని ర్విద్వా న్త్స యజాత్(౩)సేదు హోతా సో అధ్వరా న్త్స
ఋతూ న్కల్పయాతి।[11]య ద్వాహిష్ఠం త దగ్నయే బృహ దర్చ విభావసో।మహిషీవ త్వ ద్రయి
స్త్వ ద్వాజా ఉదీరతే।[12]అగ్నే త్వం పారయా నవ్యో అస్మా న్త్స్వస్తిభి రతి దుర్గాణి విశ్వా।పూ
శ్చ పృథ్వీ బహులా న ఉర్వీ భవా తోకాయ తనయాయ శంయోః।[13]త్వ మగ్నే వ్రతపా అసి

దేవ అమర్త్యే ష్వా। త్వం యజ్ఞే ష్వీడ్యః।[14]య ద్వో వయం ప్రమినామ వ్రతాని విదుషాం దేవా

అవిదుష్టరాసః। అగ్నిష్ట ద్విశ్వ మా పృణాతి విద్వా న్యేభి ర్దేవాగ్ం ఋతుభిః కల్పయాతి॥౪॥

(జుషేథా మా స నో యజా దా త్రయోవిగ్ంశతి శ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయసంహితాయాం ప్రథమాష్టకే ప్రథమప్రపాఠకే చతుర్దశోఽనువాకః ॥౧౪॥

మూలము: ఇషే త్వా యజ్ఞస్య శున్ధధ్వం కర్మణే దేవోఽవధూతం ధృష్టిః సంవపామ్యా దదే ప్రత్యుష్టం కృష్ణోఽసి భువనమసి వాజస్యో ఖావాం చతుర్దశ ॥౧౪॥ ఇషే దృగ్ంహ భువన మష్టా విగ్ం శతిః॥౨౮॥ హరిః ఓమ్।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ప్రథమః ప్రపాఠకః ॥౧॥

వేదార్థదీపిక

అవతారిక: త్రయోదశానువాకమునందు దర్శపూర్ణమాసయాగ మంత్రములు పరిసమాప్తములైనవి. ద్వితీయకాండము ద్వితీయ ప్రపాఠకమునందలి ప్రథమానువాకమునఁ జెప్పఁబడుకామ్యేష్టులకు సంబంధించిన యాజ్యా పురోనువాక్య మంత్రములు ఈ యనువాకమునందుఁ జెప్పఁబడుచున్నవి. తాత్కాలికమైన ఐహికఫలమును గోరి చేయునట్టి ఇష్టులు కామ్యేష్టులనఁ బడును. 'పురస్తాత్ + అక్యా' పురోనువాక్యా. అప్పటికి జనించియున్న శత్రువులను సంహరించునది పురోనువాక్య. ఈ పురోనువాక్య మంత్రములందుఁ బూర్వార్థమున దేవతా వాచకపద ముండును. పుట్టఁబోవు శత్రువులను సంహరించునది యాజ్యానువాక్య. ఈ యాజ్యలందు ఉత్తరార్ధమునందు దేవతావాచకపద ముండును. "ఉపరిష్టాత్ లక్ష్మ–యాజ్యా." పురస్తాదామ్నాతాః=పురోనువాక్యాః. పశ్చాత్ అమ్నాతాః=యాజ్యాః. అనియు విద్యారణ్యమున నిర్వచింపఁబడినది.

1. పురోనువాక్య-అర్థము: హే ఇన్ద్రాగ్నీ!=ఓ యింద్రాగ్నులారా!, ఆహువధ్యై=సంపూర్ణముగా హోమము చేయుటకొఱకును, రాధసః సహ=పురోడాశ రూపమైన అన్నముతోఁ గూడియున్నవారలై, మాదయధ్యై=సంతోషించుట కొఱకును, ఇషామ్=అన్నములకు, రయాణామ్=ధనములకును, దాతారౌ=దాతలునగు, వామ్ + ఉభౌ=మీ యుభయులను, వాజస్య=అన్నముయొక్క, సాతయే=లాభము కొఱకు, హువే=ఆహ్వానించుచున్నాను.

తాత్పర్యము: ఓ యింద్రాగ్నులారా! పురోడాశమనెడి అన్నము కలవారై మీ రుభయులు సంతోషించుటకును, సంపూర్ణముగా హోమము చేయుటకును అన్నమును ధనమును ఇచ్చునట్టి మీ యుభయులను అన్నలాభమునకై ఆహ్వానించుచున్నాను. (ఇది పురోనువాక్య మంత్రము. కామ్యేష్టి జరుపుటకు ముందుగా దేవతాహ్వానమునకై అధ్వర్యుఁడు "ఇన్ద్రాగ్నిభ్యామనుబ్రూహి" అని పలుకవలెను. దీనిని అధ్వర్యుప్రైష యందురు. ఈ ప్రైష యైన పిమ్మట 'హోత' ఈ పురోనువాక్య మంత్రమును పఠింపవలెను.)

2. యాజ్య-అర్థము: హే ఇన్ద్రాగ్నీ!=ఓ యింద్రాగ్నులారా! జామాతుః=అల్లుని కంటెను,ఉతవా=లేదా, స్యాలాత్ ఘా=బావమఱది కంటెను, వామ్=మిమ్ము, భూరి దావత్తరా=ఎక్కువ సంతానము నిచ్చువారినిగా, వి+అశ్రవమ్=ఎక్కువగా వినియున్నాను. అథా=ఇందువలన, యువాభ్యామ్=మీ కొఱకు, సోమస్య=సోమ సదృశమైన పురోడాశము యొక్క, ప్రయతీ=ఇచ్చుటచేత, (మీ మనస్సునందు) నవ్యమ్=నూతనమైన, స్తోమమ్=హర్ష రూపమైన చిత్తవృత్తుల సముదాయమును, జనయామి=కలుగఁజేయుచున్నాను.

తాత్పర్యము: లోకమునందు స్వదుహిత కత్యంత ప్రియుఁడైన తన యల్లుడు దౌహిత్రాది రూప బహు సంతానమును, బావమఱది తన సోదరి యందలి స్నేహముచేత గృహధన రక్షణ నిమిత్తము దాసదాసీ జనమును (అరణముగా) ఇచ్చుచున్నారు. ఓ యింద్రాగ్నులారా! మీరు వారికంటె నధికముగ సంతానము నిచ్చువారినిగా వినియున్నాను. కావున మీకు సోమరస సదృశమైన పురోడాశము నిచ్చుటచే మీ మనస్సులు సంతుష్టములగు నట్లుగాఁ జేయుచున్నాను. (ఇది యాజ్యానువాక్య మంత్రము. ఇజ్యతే+అనయేతి='యాజ్యా' అని వ్యుత్పత్తి. ఈ మంత్రము నుచ్చరించగానే 'యజ' అని పలుకవలెను.)

3. పురోనువాక్య-అర్థము: హే ఇన్ద్రాగ్నీ! ఓ యింద్రాగ్నులారా! (యువామ్=మీరు) నవతిమ్=తొంబదియైన, దాసపత్నీః=ప్రజల నపహరించునట్టి నాయకులు గల, పురః=పట్టణములను, ఏకేన కర్మణా=ఒక్క ప్రహారకర్మచేత, అధూనుతమ్=నశింపఁజేయుఁడు.

తాత్పర్యము: ఓ యింద్రాగ్నులారా! మీరు ప్రజల నపహరించు నాయకులు గల తొంబది పట్టణములను ఒక దెబ్బచే నశింపఁజేయుఁడు. (ద్వితీయ కాండమునందలి ద్వితీయ ప్రపాఠకమునందు మూఁడు కామ్యేష్టులు విహితములైనవి. ఆ మూఁడు ఇష్టులలో ఇది పురోనువాక్య.)

4. యాజ్య-అర్థము: వృత్రహణా=వృత్రాసురుని సంహరించిన, ఇన్ద్రాగ్నీ!=ఓ యింద్రాగ్నులారా!, శుచిమ్=నిర్దుష్టమైనదియు, నవజాతమ్=క్రొత్తదియైన అన్న విశేషములతో పుట్టుక కలదియునగు, స్తోమమ్=స్తోత్రమును, అద్య=ఇప్పుడు, జుషేథామ్+ను=సేవింతురుగాక. సుహవా=సుఖముగా హోమము చేయుటకు శక్యులైన, వామ్+ఉ భా=మీ యిద్దఱిని, జోహవీమిహి=ఆహ్వానించుచుంటిని కావున, తాః=ఆ మీరుభయులు, ఉశతే=(మిమ్ము) కోరునట్టి యజమానుని కొఱకు, సద్యః=వెంటనే, వాజమ్=అన్నమును, ధేష్టా=ఒసగుఁడు.

తాత్పర్యము: వృత్రాసురుని సంహరించిన యింద్రాగ్నులారా! దోషము లేనట్టియు, నూతనములైన అన్న విశేషముల వలన నేర్పడినదియు నగు స్తోత్రమును మీ రిప్పుడు సేవింతురు గాక. సుఖముగా హోమము చేయుటకు సాధ్యులైన మిమ్ము నాహ్వానించు చుంటిని; కావున మిమ్ముఁ బ్రార్థించుచున్న యజమానునకు వెంటనే అన్నము నొసఁగుడు.

5. పురోనువాక్య-అర్థము: పథః+పతే!=మార్గమునకు పతివైన, హే పూషన్=ఓ సూర్యదేవా! త్వా=నిన్ను, వయమ్+ఉ=మేమే, రథమ్+న=రథమును వలె, వాజసాతయే=అన్నలాభము కల, ధియే=కర్మకొఱకు, అయుజ్మహి=యోజన చేయుచున్నాము.

తాత్పర్యము: మార్గమునకు ప్రభువైన సూర్యదేవా! అన్నమును లభింపఁజేయునట్టి కర్మకొఱకు రథమును వలె నిన్ను యోజన చేయుచున్నాము. ఇంద్రాగ్నులు వీర్యదాతలనియు, వారి ననుసరించి పూష (సూర్య)దేవుఁడు కూడ వీర్యము నిచ్చువాఁడని తెలియుచున్నది. (ధీయతే=అనుష్ఠీయతే ఇతి=ధీః=కర్మ. అయుజ్మహి=ఇది వర్తమా నార్థము; లఙ స్తక్రియా రూపము.)

6. యాజ్య-అర్థము: కామేన=ఫలము నందలి కోరికచేత, కృతః=ప్రేరణ చేయఁబడిన(నేను), పథస్పథః=ఆ యా మార్గమునకు, పరిపతిమ్=పరిపాలకుఁడైన, అర్కమ్=('పూష' అను నామాంతరము కల) సూర్యుని, వచస్యా=స్తోత్ర రూప వాక్కుచేత, అభ్యానట్=పొందినవాఁడనైతిని, సః పూషా=ఆ పూషదేవుఁడు, నః=మాకు, శురుధః=శోక నిరోధకములైన, చంద్రాగ్రాః=చంద్రుని వలె నాహ్లాద కరములైన అగ్రభాగములుకల ఓషధులను, (మఱియు) ధియం ధియమ్=తత్తద్విషయకమైన ప్రజ్ఞను, ప్రసీషధాతి=ఎక్కువగా సాధించుఁ గాక.

తాత్పర్యము: ఫలము నందలి కోరికచే నేను ప్రేరితుఁడనై ఆ ఫల మార్గమునకు పాలకుఁడైన పూష యను నామాంతరముకల సూర్యదేవుని స్తోత్రముచేత ప్రసన్నునిఁ జేసికొనుచున్నాను. ఆ పూష దేవుఁడు శోకమును బోగొట్టునవియు, లేదా — శోకమును రాకుండగఁ జేయునవియు, చంద్రునివలె నాహ్లాదమును గలిగించునవియునగు అగ్రములు కల ఓషధులను, తత్తద్విషయకమైన ప్రజ్ఞను మా కొసగుఁగాక.

7. **పురోనువాక్య-అర్థము:** హితే నేవ=హితునిచేత వలె, క్షేత్రస్య పతినా=క్షేత్రపతిచేత, వయమ్=మేము, గామ్=గోవును, అశ్వమ్=గుఱ్ఱమును, పోషయిత్ను=పోషకమైన అన్నాదికమును, ఆ జయామసి=అంతటను సంపాదించుచున్నాము, సః=ఆ క్షేత్రపతి, ఈదృశే=ఇటువంటి గవాది విషయమున, నః=మమ్ము, మృడాతి=సుఖపెట్టుఁగాక.

తాత్పర్యము: 'క్షేత్రపత్యం చరుం నిర్వపేత్' అనునది మఱి యొక కామ్యేష్టి విధాయకము. ప్రతిష్ఠాకాముఁడు ఈ కామ్యేష్టిని జేయవలెనని భావము. ఈ కామ్యేష్టికి 'క్షేత్రస్య పతినా' అను మంత్రము పురోనువాక్య. క్షేత్రములకు పతి భూమి యని యర్థము. లోకమునందు యజమానుఁడు తనకు హితుఁడైన కుమారుఁడు మున్నగువాని మూలమున గోవులను అశ్వములను అన్నమును బొందిన విధముగ ప్రతిష్ఠను గోరు మేము క్షేత్రపతి నుండి గవాదికమును బొందుచున్నాము. ఆ క్షేత్రపతి మాకు ఇటువంటి గవాది విషయమున సుఖము కలుగఁజేయుఁగాక.

8. **యాజ్య-అర్థము:** క్షేత్రస్య పతే!=ఓ క్షేత్రపతీ! ధేనుః=ఆవు, పయః ఇవ=పాలను వలె, (త్వమ్=నీవు) అస్మాసు=మాయందు, మధుమన్తమ్=మాధుర్యము కలదియు, ఊర్మిమ్=పునరావృత్తితోఁ గూడినదియు, మధుశ్చుతమ్=(ద్రవ్యాంతరమందుఁగూడ) మాధుర్యమును స్రవించునదియు, ఘృతమివ=నేయివలె, సుపూతమ్=మిక్కిలి పవిత్రమైనదియునగు (కొబ్బరికాయ, చెఱకు, బెల్లము మొదలగు) భోగ్యపదార్థ సమూహమును, ధుక్ష్వ=కలుగఁజేయుము. (పితుకుము అని క్రియాపదార్థము.) ఋతస్య=యజ్ఞముయొక్క, పతయః=(యజ్ఞము నధిష్ఠించి యుండు) దేవతలు, నః=మమ్ము, మృడయన్తు=సంతోషపెట్టుదురు గాక.

తాత్పర్యము: ఓ క్షేత్రపతీ! గోవు క్షీరము నిచ్చు విధముగ నీవు, మాధుర్యము కలదియు, మాటిమాటికి మాధుర్యమును స్రవించునదియు, నేయివలె పవిత్రమైనదియునగు భోగ్యపదార్థ సమూహమును గలుగఁజేయుము. యజ్ఞ దేవతలు మమ్ము సుఖపెట్టుదురుగాక.

9. **పురోనువాక్య-అర్థము:** హే అగ్నే!=ఓ యగ్నిదేవా!, (త్వమ్=నీవు) రాయే=(దర్శపూర్ణమాసేష్టి ఫలమైన) ధనముకొఱకు, సుపథా=మంచి మార్గముచేత, అస్మాన్=మమ్ము, నయ=పొందించుము. హే దేవ!=ఓ యగ్నిదేవా! (త్వమ్=నీవు) విశ్వాని=సమస్తములైన, వయునాని=మార్గములను, విద్వాన్=తెలిసిన వాఁడవు. అస్మత్=మానుండి, జుహురాణమ్=(నరక హేతువగుటచే) కుటిలమైన, ఏనః=(అతిపాదరూపమైన) పాపమును, యుయోధి=పోఁగొట్టుము. తే=నీ కొఱకు, భూయిష్ఠామ్=అత్యధికమైన, నమ ఉక్తిమ్=నమస్కారోక్తిని, విధేమ=చేయుదుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు దర్శపూర్ణమాసేష్టి ఫలమైన ధనము పొందుటకు మమ్ము దోషరహితమైన మంచి మార్గమునందు పయనింపఁజేయుము. ఓ యగ్నిదేవా! నీవు సర్వమార్గములను దెలిసినవాఁడవు. నరక హేతువగుటచే కుటిలమైన అతిపాదరూప పాపమును మా నుండి తొలఁగింపుము. నీకు బహు విధములైన నమస్కారములు చేయుదుము.

విశేషములు: ప్రతి యమావాస్యయందు, పూర్ణిమయందు దర్శపూర్ణమాసేష్టులు చేయవలెను. ప్రమాదవశమున ఆ యిష్టులను ఆ సమయమునఁ జేయనిచో ప్రాయశ్చిత్తముగ "అగ్నయే పథికృతే పురోడాశ మష్టాకపాలమ్" అను మంత్రముచే నొక ప్రాయశ్చిత్తేష్టి చెప్పఁబడినది. ఆ యిష్టికి 'అగ్నే నయ' అను మంత్రము పురోనువాక్య. దర్శపూర్ణమాసేష్టులు విహిత సమయమునందుఁ జేయనిచో అతిపాద దోషము సంభవించును. ఆ దోషము నరక హేతువు. అట్టి దోషము కలుగకుండుటకై యజమానుఁడు పై విధముగ నగ్నిదేవుని ప్రార్థించుచున్నాడు.

10. యాజ్య-అర్థము: యత్=ఏ కర్మను, శక్నవామ=(అనుష్ఠించుటకు మేము) సమర్థుల మగుదుమో, తత్=ఆ కర్మను, విచ్ఛిత్తి లేకుండగ ననుష్ఠించుటకు, దేవానామ్=దేవతలయొక్క, పన్థామ్=మార్గమును గూర్చి, ఆ+అగన్మ=వచ్చితిమి. అగ్నిః=అగ్నిదేవుఁడు, విద్వాన్=కర్మ మార్గమును దెలిసినవాఁడు. సః=ఆ యగ్ని, యజాత్=(మా కొఱకు) యాగము చేయఁగలఁడు. సేదు=ఆ యగ్నియే, హోతా=ఆహ్వానించువాఁడు. సః=ఆ యగ్ని, (అతిపన్నాన్=అతిపన్నములైన) క్రతూన్–యాగములను, ఋతూన్=ఋత్వాదికాలములను, కల్పయాతి=కల్పించఁగలఁడు. (అతిపన్నము=సకాలమునఁ జేయక నిలిపి వేయఁబడినది.)

తాత్పర్యము: ఇదివరలో మేము ఏ కర్మమార్గమునుండి భ్రష్టులమైతిమో, ఏ కర్మను జేయుటకు సమర్థులమో, ఆ కర్మ ననుష్ఠించుటకు దేవతా మార్గమునకు వచ్చినాము. సహజముగ మా కా మార్గము తెలియకపోయినను కర్మమార్గ మును దెలిసిన యగ్ని మా యపరాధమును క్షమించుట నెఱుఁగును. కావున ఆ యగ్ని మా కొఱకు యాగము చేయఁగలఁడు. ఆ యగ్నియే దేవతల నాహ్వానించును. ఆ యగ్నియే అతిపన్నయాగములను, వాని నాచ రించుటకుఁ దగిన కాలములను కల్పించఁగలఁడు. (పన్థామ్, శక్నవామ, యజాత్, కల్పయాతి=ఇవి వైదిక ప్రయోగములు. వీనికి లౌకిక సంస్కృతమున వరుసగా 'పన్థానమ్, శక్నువామ, యజేత్, కల్పయిష్యతి' అను ప్రయోగము లుండును.)

11. (పురోనువాక్య)-అర్థము: యత్=ఏ, వాహిష్ఠమ్=ప్రాయణీయహవిస్సు, (అస్తి=కలదో,) తత్=ఆ హవిస్సు, అగ్నయే=అగ్నికొఱకు, బృహత్=గొప్పదియగుఁగాక. హే విభావసో!=ఓ సూర్యదేవా! మహిషీవ=మహిషివలె, అర్చ=(ఫలము నిచ్చు రూపమున నన్ను) ఆదరించుము. త్వత్=నీ(యనుగ్రహము)వలన, రయిః=ధనము, త్వత్=నీ(యనుగ్రహము)వలన, వాజాః=గుఱ్ఱములు, ఉదీరతే=అతిశయముగఁగలుగుచున్నవి. (అదితి దేవ తాకమైన ప్రాయణీయేష్టి సోమయాగారంభమునఁ జేయఁబడును. ఆ యిష్టియందు హోమమము చేయఁబడు హవిస్సు ప్రాయణీయ హవిస్సు అనఁబడును. ఇది అగ్నికి ప్రియమైనది.)

తాత్పర్యము: ప్రాయణీయ హవిస్సు అగ్నికి గొప్పదియగుఁగాక. ఓ సూర్యదేవా! ప్రవృత్తి విత్తులు మొదలగువానిని బెట్టుటచే మహిషి క్షీరము నధికముగ నిచ్చు రూపమున యజమాను నాదరించు విధముగ మేము చేయు హోమమును స్వీకరించి ఫలము నిచ్చు రూపమున మమ్మాదరింపుము. ఇట్లు చేసినచో నీ యనుగ్రహము వలన ధనము అశ్వములు అధికముగ మాకు లభించును. (ద్వితీయాష్టకమునందు "అగ్నయే వ్రతపతయే" ఇత్యాదికముచే నొక కామ్యేష్టి చెప్పఁబడినది. యజ్ఞ విరుద్ధమైన అనృతాదికము అవ్రత్యమనఁబడును. అట్టి అవ్రత్యదోషము పోవుటకు ఆ కామ్యేష్టి చేయవలెను. ఆ కామ్యేష్టికిది పురోనువాక్య మంత్రము.)

12. (యాజ్య)-అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ!, నవ్యః=(నా యపరాధమును దొలఁగించుటకై వచ్చినవాఁడవగుటచే)క్రొత్త వాఁడవైన, త్వమ్=నీవు, అస్మాన్=మమ్ము, స్వస్తిభిః=శాస్త్రీయానుష్ఠానములచేత, విశ్వా=సమస్తములైన, దుర్గాణి=(అతిపాదరూపములు, అవ్రత్యరూపములునైన) పాపములను, అతి=అతిక్రమింపఁజేసి, పారయా=(ఫల పర్యంతములైన కర్మలయొక్క) పారమును బొందింపుము. చ=మఱియు, నః=మాకు, (నివాసమునకై) పూః=నగరము, పృథ్వీ=విశాలమైనది, (భవతు=అగుఁగాక.) ఉర్వీ=భూమి, బహులా=(సస్యసంపదకై) అధికమైనది, (భవతు=అగుఁగాక) తనయాయ=(మా)కుమారుని కొఱకు, తోకాయ=దుహితృరూపసంతానము కొఱకును, శంయోః=సుఖప్రదుఁడవు, భవా=అగుము. (=భవ)

తాత్పర్యము: ఓ యగ్నీ! నా యపరాధములను బోఁగొట్టుటకు వచ్చినవాఁడవగుటచే నవ్యుఁడవయిన నీవు శాస్త్రీయములైన అనుష్ఠానములచేత మమ్ము పాపముల నతిక్రమింపఁజేసి మాకు సంపూర్ణ కర్మఫలముల నొసఁగుము. మఱియు మేము నివసించుటకై నగరము విశాలమును, సస్యసంపదకై భూమి బహుళమును నగుఁగాక. మా సంతా నమునకు సుఖము కలుగఁజేయుము.

13. (పురోనువాక్య)-అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ! త్వమ్=నీవు, ఆ+మర్త్యేషు=మానవుల యందంతటను, వ్రతపాః=వ్రతమును పాలించునటువంటి, దేవః=దేవుఁడవు, అసి=అగుచున్నావు. త్వమ్=నీవు, ఆ+యజ్ఞేషు=యజ్ఞ ముల యందంతటను, ఈడ్యః=స్తుతింపఁబడినవాఁడవు, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: ఓయగ్నీ! నీవు సర్వమానవుల వ్రతములను గాపాడువాఁడవును, సర్వ యజ్ఞములందు స్తుతింపఁబడిన వాఁడవు నగుచున్నావు.

14. (యాజ్య)-అర్థము: హే దేవాః!=ఓ దేవతలారా!, విదుషామ్=విద్వాంసులైన మీ యొక్క, వ్రతాని=(మేమనుష్ఠింపవలసిన) కర్మలను, వయమ్=మేము, అవిదుష్టరాసః=తెలియనివారమై, ప్రమినామః యత్=ఎక్కువగా నశింపఁజేయుచున్నా మనుట యేది కలదో, తత్ విశ్వమ్=ఆ సర్వమును, విద్వాన్=విద్వాంసుఁడగు, అగ్నిః=అగ్ని, ఆపృణాతి=సంపూర్ణము చేయుఁగాక. యైఃఋతుభిః=ఏ కాలములచేత, దేవాన్=దేవతలను, (హవిస్సును భుజించుటకు) కల్పయాతి=(అగ్ని)కల్పించుచున్నాఁడో, (తైః=ఆ కాలములచే, వ్రతాని=వ్రతములను, పూరయతు=పూరించుఁగాక.)

తాత్పర్యము: ఓ దేవతలారా! విద్వాంసులయిన మీకు సంబంధించినవియు, మేము ఆచరింపవలసినవియునగు వ్రతములను మేము తెలియనివారమై నశింపఁ జేయుచున్నామనినచో ఆ లోపమును విద్వాంసుఁడగు నగ్ని పూరించుఁగాక. దేవతలు హవిస్సును భుజించుటకు అగ్ని యే కాలములను గల్పించెనో, అగ్ని ఆ కాలములందు వ్రతములను పూరించుఁగాక.

ప్రథమకాండమున ప్రథమప్రపాఠకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ద్వితీయః ప్రపాఠకః

తత్ర ప్రథమోఽనువాకః

హరిః ఓమ్।

మూలము: [1]ఆప ఉన్దన్తు జీవసే దీర్ఘాయుత్వాయ వర్చస [2]ఓషధే త్రాయ స్వైనగ్ం స్వధితే మై నగ్ం
హిగ్ంసీ ర్దేవశ్రూ రేతాని ప్రవపే [3]స్వస్త్యు త్తరాణ్య శీయాఽఽపో అస్మా న్మాతర శ్శున్ధన్తు
ఘృతేన నో ఘృతపువః పునన్తు విశ్వ మస్మ త్ప్రవహన్తు రిప్ర [5]ముదాభ్య శ్శుచి రాపూత ఏమి
[6]సోమస్య తనూ రసి తనువం మే పాహి [7]మహీనాం పయో ఽసి వర్చోదా అసి వర్చః (౧)
మయి ధేహి [8]వృత్రస్య కనీనికా ఽసి చక్షుష్పా అసి చక్షు ర్మే పాహి [9]చిత్పతి స్త్వా పునాతు
వాక్పతి స్త్వా పునాతు దేవ స్త్వా సవితా పునా త్వచ్ఛిద్రేణ పవిత్రేణ వసో స్సూర్యస్య రశ్మిభి
[10]స్తస్య తే పవిత్రపతే పవిత్రేణ యస్మై కం పునే తచ్ఛకేయ [11]మా వో దేవాస ఈమహే
సత్యధర్మాణో అధ్వరే యద్వో దేవాస ఆగురే యజ్ఞియాసో హవామహ [12]ఇన్ద్రాగ్నీ ద్యావా
పృథివీ ఆప ఓషధీ [13]స్త్వం దీక్షాణా మధిపతి రసీహ మా సన్తం పాహి ॥౧॥ (వర్చ ఓషధీ
రష్టౌ చ)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ద్వితీయప్రపాఠకే ప్రథమోఽనువాకః॥

వేదార్థ దీపిక

అవతారిక: ప్రథమ ప్రపాఠకము నందు దర్శపూర్ణమాసేష్టి చెప్పఁబడినది. ద్వితీయ తృతీయ చతుర్థ ప్రపాఠకము లందు సోమ యాగము చెప్పఁబడుచున్నది. ఏకాహము, అహీనము, సత్రము – అని సోమయాగము మూఁడు విధములుగానున్నది. ఒకనాఁడు చేయఁదగిన సోమయాగమునకు ఏకాహమని పేరు. రెండవనాటినుండి పదునొకండవ నాటివఱకుఁ జేయఁదగిన సోమయాగము అహీనమనఁ బడును. పదుమూఁడవనాఁడు ప్రారంభించి సహస్ర సంవత్సరములవఱకుఁజేయు సోమ యాగమునకు సత్రమని వ్యవహారము. "ఆప ఉన్దన్తు" ఇత్యాదికము అధ్వరకాండము. ఈ ప్రథమానువాకము నందు సోమయాగము చేయనున్న యజమానునకు క్షౌర కర్మ మొదలు ప్రాచీన వంశమనెడి పేరుగల యాగశాలా ప్రవేశము వఱకుఁగల సంస్కారములు చెప్పఁబడుచున్నవి.

1\. అర్థము: ఆపః=ఉదకములు, జీవసే=జీవనముకొఱకు, దీర్ఘాయుత్వాయ=దీర్ఘాయువుకొఱకు, వర్చసే=బ్రహ్మవర్చస్సు కొఱకును, ఉన్దన్తు=(శిరోభాగమును)తడుపుఁగాక.

తాత్పర్యము: జీవనము, ఆయుర్వృద్ధి, బ్రహ్మవర్చస్సుల కొఱకు యజమానుని శిరోభాగమును ఉదకములు తడుపుఁగాక. (ఈ మంత్రము చెప్పుచు అధ్వర్యుఁడు తూర్పు ముఖముగ నాసీనుఁడై యున్న యజమానుని శిరస్సును నీటితో తడుపవలెను.)

2\. అర్థము: హే ఓషధే!=ఓ దర్భవిశేషమా! ఏనమ్=ఈ యజమానుని, త్రాయస్వ=రక్షింపుము. స్వధితే!=ఓకత్తీ!, ఏనమ్=ఈ యజమానుని, మా హింసీః=హింసింపకుము. దేవశ్రూః=దేవతలలో ప్రసిద్ధుఁడుగా వినఁబడుచున్న నాపితగా(నేను)ఏతాని=ఈ కేశములను, ప్రవపే=వపనముచేయుచున్నాను. (నాపిత=మంగలి) (అధ్వర్యుఁడీ మంత్రము నుచ్చరించుచు యజమానుని శిరస్సుపై బర్హిస్సు నుంచి కత్తిని అధోముఖముగాఁబెట్టి కేశఖండనము చేయవలెను.)

విశేషములు: సోమయాగముచేయుటకై దీక్షవహించుటకుముందుగా యజమానుఁడు వపనాదికర్మల నాచరింపవలెను. ఇట యజమానునకు అధ్వర్యుఁడే వపనము చేయవలెను. వపనము చేయునపుడు అధ్వర్యుఁడు తనను దేవతలలో నాపితగా భావనచేసికొనుచు క్షురకర్మ చేయుచున్నాఁడని భావము. తాత్పర్యము సులభము.

3\. అర్థము: స్వస్తి=నిర్విఘ్నముగా, ఉత్తరాణి=ఉత్తరకర్మలను (తరువాతఁజేయవలసిన కర్మలను) అశీయ=పొందఁగలను.

తాత్పర్యము: క్షురకర్మానంతరము చేయవలసిన కర్మలను నిర్విఘ్నముగాఁ జేయఁగలను. (ఈ మంత్రమును యజమానుఁడు జపించవలెను.)

4\. అర్థము: మాతరః=తల్లులగు, ఆపః=ఉదకములు, అస్మాన్=మా యజమానులను, శున్ధన్తు=పరిశుద్ధులుగాఁ జేయుఁగాక. ఘృతపువః=నీటిని స్రవించుచున్న మేఘములు, ఘృతేన=స్రవించు నీటిచే, నః=మమ్ము, పునన్తు=పవిత్రులునుగాఁజేయుగాక. అస్మత్=మా నుండి, విశ్వమ్=సమస్తమైన, రిప్రమ్=పాపమును, ప్రవహన్తు=పోఁగొట్టుఁగాక.

తాత్పర్యము: తల్లులవంటి ఉదకములు మా యజమానులను పరిశుద్ధులనుగాఁజేయుఁగాక. నీటిని వర్షించుచున్న మేఘములు స్రవించుచున్న నీటిచేత మమ్ము పునీతులనుగాఁ జేయుఁగాక. మానుండి సమస్తపాపమును తొలఁగించుఁగాక. (ఈ మంత్రము చెప్పుచు అధ్వర్యుఁడు యజమానుని స్నానము చేయించి యతని శరీరముపై నున్న రజస్సును తుడువ వలెను.)

5\. అర్థము: శుచిః=(స్నానమువే)శుద్ధుఁడను, ఆపూతః=(ఆచమనముచే)పునీతుఁడనునై, ఉదాభ్యః=ఉదకములనుండి, ఏమి=(లేచి)వచ్చుచున్నాను.

తాత్పర్యము: స్నానముచేతను ఆచమనముచేతను నేను పరిశుద్ధుఁడనై ఉదకములనుండి లేచి వచ్చుచున్నాను. (యజమానుఁడు నీటినుండి లేచివచ్చి ఈ మంత్రమును జపించవలెను. వపనాది సంస్కారము దీక్షయనియు, ఆహారాది నియమము తపస్సనియు, నీటిలో స్నానము చేసినచో నా రెండింటిని బొందినట్లగునని బ్రాహ్మణము చెప్పుచున్నది.)

6\. అర్థము: (హే ధవళవస్త్ర!=ఓ తెల్లని వస్త్రమా!, త్వమ్=నీవు) సోమస్య=చంద్రునియొక్క, తనూః=శరీరము, అసి=అగుచున్నావు. మే=నాయొక్క, తనువమ్=శరీరమును, పాహి=రక్షింపుము. (తనువమ్=తనూమ్)

తాత్పర్యము: ఓ ధవళవస్త్రమా! నీవు సోముని శరీర మగుచున్నావు. (ధవళవస్త్రమునకు సోముఁ డభిమానదేవత.) కావున నా శరీరమును రక్షింపుము. (ఈ మంత్రము చెప్పుచు యజమానుఁడు ధవళవస్త్రమును ధరించవలెను.)

7\. అర్థము: (హే నవనీత!=ఓ నవనీతమా! త్వమ్=నీవు) మహీనామ్=గోవులయొక్క, పయః=క్షీరకార్యము. (పాల నుండి పుట్టినదానవు) అసి=అగుచున్నావు. వర్చోధాః=స్నిగ్ధ(=నునుపు)రూపవర్చస్సును ధరింపఁజేయు దానవు, అసి=అగుచున్నావు, (అతః=ఇందువలన) మయి=నాయందు, వర్చః=బ్రహ్మవర్చస్సును, ధేహి=ఉంచుము. (నవనీతము=వెన్న)

తాత్పర్యము: ఓ నవనీతమా! నీవు గోక్షీరమునుండి పుట్టిన దానవు, స్నిగ్ధతా రూపవర్చస్సును గలుగఁ జేయుదానవు నగు చున్నావు. కావున నాయందు వర్చస్సును గలుగఁజేయుము. (యజమానుఁడు ఈ మంత్రము పఠించుచు ముఖమునుండి పాదములవరకు వెన్నను రాసి కొనవలెను.)

8\. అర్థము: (హే అఞ్జన!=ఓ కాటుకా!, త్వమ్=నీవు) వృత్రస్య=వృత్రాసురునియొక్క, కనీనికా=కంటినల్లగ్రుడ్డువు, అసి=అగుచున్నావు. చక్షుష్పాః=నేత్రములను గాపాడు దానవు, అసి=అగుచున్నావు. మే=నాయొక్క, చక్షుః=చక్షుస్సును, పాహి=కాపాడుము.

తాత్పర్యము: ఓ కాటుకా! నీవు వృత్రాసురుని నల్లగ్రుడ్డువు, కంటినిఁగాపాడు దానవు నగుచున్నావు. కావున నా చక్షుస్సును గాపాడుము. (అధ్వర్యుఁడు యజమానుని కళ్లకు కాటుకపెట్టవలెను.)

విశేషములు: పూర్వమింద్రుఁడు వృత్రాసురుని సంహరింపగా నా వృత్రుని కంటి గ్రుడ్డుక్రిందఁబడి కాటుకయ్యెను. ఆ కాటుకను కంటికిఁబెట్టుకొనినచో అది శత్రువును నశింపఁ జేయుననెడి కథయొకటి "ఇన్ద్రో వృత్రమహన్తస్య" ఇత్యాది బ్రాహ్మణము వలనఁ దెలియుచున్నది.

9\. అర్థము: (హే యజమాన!=ఓ యజమానుఁడా!) చిత్పతిః=జ్ఞానములకు పతియగు దేవుఁడు, త్వా=నిన్ను, వసోః=జగన్నివాసహేతువైన, సూర్యస్య=సూర్యునియొక్క, రశ్మిభిః=కిరణరూపములయిన దర్భలచే నిర్మితమైన, అచ్ఛిద్రేణ=ఛిద్రములులేని, పవిత్రేణ=పవిత్రముచేత, పునాతు=పవిత్రునిఁ జేయుఁగాక. వాక్పతిః=వాక్కులకు పతియగు సరస్వతి, త్వా=నిన్ను, (అచ్ఛిద్రేణ పవిత్రేణ=ఛిద్రరహిత పవిత్రముచేత) పునాతు=పునీతునిఁ జేయుఁగాక. సవితా=ప్రేరకుఁడైన, దేవః=దేవుఁడు, త్వా=నిన్ను, (అచ్ఛిద్రేణ పవిత్రేణ=రంధ్రములు లేని పవిత్రముచేత) పునాతు=పవిత్రునిఁ జేయుఁగాక.

తాత్పర్యము: ఓ యజమానుఁడా! జ్ఞానమునకుఁబతియగు దేవుఁడును, వాక్కులకు పతియగు సరస్వతియు, ప్రేరకుఁడగు సర్వేశ్వరుఁడును జగన్నివాసహేతువైన సూర్యుని కిరణరూపములైన దర్భలచే నిర్మితమయిన రంధ్రరహిత పవిత్రముచే నిన్ను పవిత్రునిఁ జేయుదురుగాక. (అధ్వర్యుఁడీ మంత్రము పఠించుచు ఇరువదియొక్క దర్భల కొనలచే నిర్మితమైన పవిత్రముతో యజమానునిపై నీటితో మార్జనచేయవలెను.)

10\. అర్థము: హే పవిత్రపతే!=ఆదిత్యరూపమైన అచ్ఛిద్ర పవిత్రమున నంతర్యామివైన దేవా!, తస్య=అటువంటి, తే=నీ యొక్క, పవిత్రేణ=పవిత్రముచేత, యస్మై=ఏ యగ్నిష్టోమ కర్మకొఱకు, కమ్=ఆత్మను, పునే=పవిత్రము చేయుచున్నానో, తత్=ఆ యగ్నిష్టోమ కర్మను (కర్తుమ్=చేయుటకు) శకేయమ్=శక్తుఁడనగుదునుగాక.

తాత్పర్యము: ఓ పవిత్రపతీ! అచ్ఛిద్ర పవిత్రమున నంతర్యామివిగానున్న నీయొక్క పవిత్రముచేత అగ్నిష్టోమ యాగమును జేయుటకు ఆత్మను పవిత్రము చేసికొంటిని కావున ఆ యగ్నిష్టోమ యాగమును జేయుటకు సమర్థుఁడ నగుదునుగాక. (ఈ మంత్రము నధ్వర్యుఁడు యజమానునిచే పఠింపఁ జేయవలెను.)

11\. అర్థము: యజ్ఞియాసః=యజ్ఞసంబంధులైన, హే దేవాసః!=ఓ దేవతలారా! యత్=ఏ కారణమువలన, ఆగురే=యజ్ఞోద్యమమునందు, వః=మిమ్ము, హవామహే=ఆహ్వానించుచున్నామో, (తత్=ఆ కారణమువలన) హే దేవాసః=ఓ దేవతలారా!, వః=మీయొక్క, అధ్వరే=యజ్ఞమునందు, సత్యధర్మాణః=సత్యమైన ధర్మము కలవారమై (=నిత్యకర్మానుష్ఠానపరులమై) ఆ+ఈమహే=వచ్చుచున్నాము.

తాత్పర్యము: యజ్ఞ సంబంధులైన దేవతలారా! మిమ్ము ఈ యజ్ఞోద్యమమునందు ఆహ్వానించుచున్నాము. కావున నిత్య కర్మానుష్ఠానపరులమై మేము మీ యజ్ఞమునకు వచ్చుచున్నాము. (అధ్వర్యుఁడీ మంత్రము చెప్పుచు ప్రాగ్వంశమనుపేరుగల యజ్ఞశాల యందు యజమానునితోఁగూడ ప్రవేశించవలెను.)

12. అర్థము: హే ఇన్ద్రాగ్నీ!=ఓ యింద్రాగ్నులారా! హే ద్యావాపృథివీ!=ఓ ద్యావాపృథివీ దేవతలారా!, హే ఆపః!=ఓ యుదకములారా!, హే ఓషధీః=ఓ యోషధులారా! (ఏనమ్=ఈ యజమానుని, అనుజానీత=గుర్తింపుఁడు.)

తాత్పర్యము: ఓ యింద్రాగ్న్యాది దేవతలారా! ఓ ఉదకములారా! ఓషధులారా! మీ రీ యజమానుని గుర్తింపుఁడు. (యజమానుఁడు అధ్వర్యునితోఁగూడ దక్షిణాగ్నినతిక్రమించి ఆహవనీయాగ్ని దగ్గఱకు వెళ్లవలెను.)

13. అర్థము: (హే ఆహవనీయ!=ఓ ఆహవనీయాగ్నీ!) త్వమ్=నీవు, దీక్షాణామ్=నియమములకు, అధిపతిః=పాలకుఁడవు, అసి=అగుచున్నావు. (తత్=అందువలన) ఇహ=ఇచట, సన్తమ్=ఉంటున్న, మా=నన్ను, పాహి=రక్షింపుము.

తాత్పర్యము: ఓ యాహవనీయాగ్నీ! నీవు నియమపాలకుఁడవు. కావున నీ సమీపముననున్న నన్ను రక్షింపుము. (యజమానుఁడీ మంత్రము చెప్పుచు ఆహవనీయాగ్ని సమీపమునఁ గూర్చుండవలెను.)

ప్రథమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ద్వితీయప్రపాఠకే ద్వితీయోఽనువాకః।

మూలము: [1]ఆకూత్యై ప్రయుజే ఽగ్నయే స్వాహా మేధాయై మనసే ఽగ్నయే స్వాహా దీక్షాయై తపసే ఽగ్నయే స్వాహా సరస్వత్యై పూష్ణే ఽగ్నయే స్వాహా ఽఽపో దేవీ ర్బృహతీ ర్విశ్వశంభువో ద్యావాపృథివీ ఉర్వ న్తరిక్షం బృహస్పతి ర్నో హవిషా వృధాతు స్వాహా [2]విశ్వే దేవస్య నేతు ర్మర్తో వృణీత సఖ్యం విశ్వే రాయ ఇషుధ్యసి ద్యుమ్నం వృణీత పుష్యసే స్వాహా [3]ఋక్సామయో శ్శిల్పే స్థ స్తే వా మారభేతే మా (౧)పాత మా ఽఽస్య యజ్ఞస్యో దృచ [4]ఇమా ధియగ్ం శిక్ష మాణస్య దేవక్రతుం దక్షం వరుణ సగ్ం శిశాధి యయాతి విశ్వా దురితా తరేమ సుతర్మాణ మధి నావగ్ం రుహేమో [5]ర్గ స్యాఙ్గిర సూర్ణమ్రదా ఊర్జం మే యచ్ఛ పాహి మా మా మా హిగ్ంసీ ర్విష్ణో శ్శర్మా సి శర్మ యజమానస్య శర్మ మే యచ్ఛ నక్షత్రాణాం మా ఽతీకాశా త్పాహి [6]న్ద్రస్య యోని రసి (౨)మా మా హిగ్ంసీః [7]కృష్యై త్వా సుసస్యాయై [8]సుపిప్పలాభ్య స్త్వౌ షధీభ్య [9]స్సూపస్థా దేవో వనస్పతి రూర్ధ్వో మాపాహ్యో దృచః [10]స్వాహా యజ్ఞం మనసా స్వాహా ద్యావాపృథివీభ్యాగ్ం స్వాహో రో ర న్తరిక్షా త్స్వాహా యజ్ఞం వాతా దారభే॥(౩)॥

[మా యోని రసి త్రిగ్ంశ చ్చ]।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయసంహితాయాం ప్రథమాష్టకే ద్వితీయప్రపాఠకే ద్వితీయోఽనువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: ప్రథమానువాకము నందు ప్రాచీన వంశప్రవేశము చెప్పబడినది. ఈ ద్వితీయానువాకమునందు యజ్ఞశాలా ప్రవిష్టుఁడైన యజమానునకు యజ్ఞదీక్ష విధింపఁబడుచున్నది.

1. **అర్థము:** ఆకూత్యై=యజ్ఞము చేయఁగల ననెడి మానస సంకల్పసిద్ధి కొఱకు, ప్రయుజే=ప్రేరణ చేయునట్టి, అగ్నయే=అగ్ని కొఱకు, స్వాహా=(ఈ హవిస్సు) హుతమగుఁగాక. మేధాయై=(ఫల సాధనముల) ధారణాశక్తి రూపమైన మేధ సిద్ధించుటకై, మనసే=మదీయ మనోఽభిమానియైన, అగ్నయే=అగ్నికొఱకు, స్వాహా=(ఈ హవిస్సు) హుతమగుఁగాక. సరస్వత్యై=మంత్రోచ్చారణ శక్తి సిద్ధికై, పూష్ణే=(వాగింద్రియ) పోషకుఁడగు, అగ్నయే=అగ్నికొఱకు, స్వాహా=(ఈ హవిస్సు) హుతమగుఁగాక. బృహస్పతిః=బృహస్పతి, నః=మాయొక్క, హవిషా=హవిస్సు చేత, వృధాతు=వృద్ధి నొందుఁగాక. దేవీః=ద్యులోకమునుండి (వర్షరూపమున) వచ్చునవియు, బృహతీః=బహుళములును, విశ్వశంభువః=(సస్యమును పండించుటచే) సర్వ జగత్తునకు సుఖమును కలుగఁ జేయునవియునగు, హే ఆపః!=ఓ యుదకములారా! (యూయమ్=మీరు, వర్ధన్తామ్=వృద్ధినొందుదురుగాక.) హే ద్యావాపృథివీ!=ఓ ద్యావా భూములారా! (యువామ్=మీరు, వర్ధేతామ్=వృద్ధినొందుఁడు.) ఉరు=విస్తీర్ణమైన, అన్తరిక్షమ్=అంతరిక్షము, వృధాతు=వృద్ధినొందుఁగాక. స్వాహా=(ఈ హవిస్సు) హుతమగుఁగాక. (వృధాతు=వర్ధతామ్)

తాత్పర్యము: యజ్ఞము చేయుదునను సంకల్పమునకు ఆకూతి యని పేరు. తాను వినిన ఫల సాధనములను బుద్ధియందు ధారణ చేయుట 'మేధ' యనఁబడును. వ్రత నియమము దీక్ష యనఁబడును. మంత్రోచ్చారణ శక్తి సరస్వతి యని యిచట అర్థము. ఆకూతిని, మేధను, దీక్షను, మంత్రోచ్చారణ శక్తిని గలుగఁజేయుటలో యజమానునకు అగ్ని తోడ్పడును. కావున అట్టి ఆకూత్యాదులు సిద్ధించుటకై అగ్నికి హోమము చేయఁబడుచున్నదని భావము. మఱియు దేవతలకు గురువైన బృహస్పతి, ద్యావాభూములు, ఉదకములు వృద్ధి నొందుఁగాక యని ప్రార్థన చేయఁబడినది. ఉదకములు ద్యులోకమునుండి భూలోకమునకు వర్షరూపమున వచ్చుననియు, అనేకములనియు, సస్యోత్పత్తికి కారణము లనియు వర్ణింపఁబడినవి. అట్టి బృహస్పత్యాదులకుఁగూడ నిట హోమము చేయఁబడుచున్నదనియు భావము. (ఈ మంత్రము చెప్పుచు ఆజ్యపాత్ర యందలి నేతిని అగ్నియందు హోమము చేయవలెను.)

2. **అర్థము:** విశ్వః=ప్రపంచ స్వరూపుఁడును, నేతుః=జగన్నిర్వాహకుఁడునగు, దేవస్య=దేవునియొక్క, సఖ్యమ్=అనుగ్రహమును, మర్తః=మరణశీలుఁడైన యజమానుఁడు, వృణీత=కోరవలెను. హే విశ్వ!=ఓ విశ్వాత్మకుఁడవైన దేవా!, రాయః=ధనమునకు, ఇషుధ్యసి=ప్రభువగుచున్నావు. పుష్యసే=యజ్ఞపోషణమునకై, ద్యుమ్నమ్=ధనమును, వృణీత=కోరవలయును. స్వాహా=(ఈ హవిస్సు) హుతమగుఁగాక.

తాత్పర్యము: "ఓ విశ్వాత్మకుఁడవైన దేవా!, నీవు ధనమునకు ప్రభువగుచున్నావు. యజ్ఞము చేయుటకై ధనమును కోరుచున్నాను. ఈ హవిస్సు నీకు హుతమగుఁగాక." అను స్తోత్రము చేత విశ్వాత్మకుఁడును, విశ్వ నిర్వాహకుఁడును నగు దేవుని యనుగ్రహమును మరణశీలుఁడైన యజమానుఁడు కోరవలెను. (ఈ మంత్రము చెప్పుచు ఆజ్యపాత్రమునుండి పండ్రెండు పర్యాయములు నేతిని స్రుక్కులోనికిఁ దీసికొని పూర్ణాహుతిగా హోమము చేయవలెను.)

3. **అర్థము:** హే శుక్ల కృష్ణేరేఖే!=ఓ శుక్ల కృష్ణలేఖలారా!, ఋక్సామయోః=ఋక్సామ దేవతల యొక్క, శిల్పే=చిత్తరువులుగా, స్థః=ఉంటున్నారు. తే=అటువంటి, వామ్=మిమ్ము, ఆరభే=స్పృశించుచున్నాను. ఉదృచః=ఉత్తమఋక్కుగల, అస్య యజ్ఞస్య=ఈ యజ్ఞముయొక్క, ఆ(సమాప్తేః)=సమాప్తి పర్యంతము, తే=(అటువంటి) ఆ మీరు మా=నన్ను, పాతమ్=రక్షింపుఁడు.

తాత్పర్యము: కృష్ణాజినమునకు సంబంధించిన శుక్ల కృష్ణ లేఖలారా!, మీరు ఋక్సామ దేవతల శిల్పములుగా నున్నారు. ఉత్తమ ఋక్కుగల యజ్ఞముయొక్క పరిసమాప్తి పర్యంతము మీరు నన్ను రక్షింపుఁడు. యజ్ఞశాల యందు యజమానుఁడు కూర్చుండుటకై కృష్ణాజినము పఱచి అందలి శుక్లకృష్ణరేఖలను (చారలను) యజమానుఁడు స్పృశించవలెను. (కృష్ణాజినము=జింక చర్మము.)

4\. అర్థము: హే వరుణదేవ!=ఓ వరుణదేవా!, ఇమామ్=ఈ యగ్నిష్టోమ యాగవిషయకమైన, బుద్ధిమ్=బుద్ధిని, శిక్షమాణస్య=స్వీకరించుచున్న యజమానుని యొక్క, దక్షమ్=సమృద్ధమైన, క్రతుమ్=అగ్నిష్టోమ యాగమును, సంశిశాధి=బాగుగ నుపదేశించి సమాప్తినొందించుము. (వయమపి=మేముకూడ) యయా=ఏ నావచేత, విశ్వా=సమస్తమైన, దురితా=విఘ్నరూపములను, అతితరేమ=దాటఁగలమో, సుతర్మామ్=సుఖముగ తరింపఁజేయునట్టి, నావమ్=కృష్ణాజిన రూపమైన నావను, అధిరుహేమ=అధిష్ఠింతుము. (విశ్వాని, దురితాని-అనుటకు బదులు 'విశ్వా, దురితా' అని లుప్తవిభక్త్యంతములు ప్రయుక్తములైనవి.)

తాత్పర్యము: ఓ వరుణదేవా! ఈ యగ్నిష్టోమ యాగసంబంధమైన బుద్ధిని గ్రహించిన యజమానునియొక్క అగ్నిష్టోమ యాగమును బాగుగ బోధించి పూర్తి చేయించుము. మేము కూడ విఘ్నరూప సమస్త పాపముల నతిక్రమింపఁ జేయునదియు, సుఖముగ తరింపఁజేయఁగలదియునైన కృష్ణాజిన రూపమైన నావను అధిష్ఠించెదము. (యజమానుఁ డీ మంత్రము చెప్పుచు కుడి మోకాలిని జూపి కృష్ణాజినమును సమీపించవలెను.)

5\. అర్థము: (హే మేఖలే!=ఓ మేఖలమా!, త్వమ్=నీవు) ఆఙ్గిరసీ=అంగిరసుల సంబంధమైన, ఊర్క్=అన్నరసరూపమైన, ఊర్ణమ్రదా=కంబలమువలె మృదువైన దానవు, అసి=అగుచున్నావు. (తత్=అందువలన) మే=నాకు, ఊర్జమ్=అన్నరసమును, యచ్ఛ=ఇమ్ము. మా=నన్ను, పాహి=రక్షించుము. మా=నన్ను, మా హింసీః=(బన్ధనముచేత) బాధింపకుము. (హే వస్త్ర!=ఓ వస్త్రమా! త్వమ్=నీవు) విష్ణోః=విష్ణువునకు, శర్మ=సుఖము (నిచ్చుదానవు) అసి=అగుచున్నావు. యజమానస్య=యజమానునకు, శర్మ=(అ) సుఖమును, యచ్ఛ=ఇమ్ము. మే=నాకు, సుఖమ్=సుఖమును, యచ్ఛ=ఇమ్ము. నక్షత్రాణామ్=నక్షత్రముల యొక్క, అతీకాశాత్=ప్రకాశమునుండి, మా=నన్ను, పాహి=రక్షించుము. (మేఖల=మొలత్రాడు.)

తాత్పర్యము: ఓ మేఖలా! నీవు అంగిరసుల అన్నరూపమును, కంబలమువలె మృదువైనదానవు నగుచున్నావు. నా కన్నరసము నిమ్ము. (నిన్ను నడుమునకు కట్టుకొనుటచే) నన్ను బాధింపకుము. నన్ను రక్షించుము. ఓ వస్త్రమా! నీవు విష్ణువునకు సుఖప్రదమగుచున్నావు. యజమానునకు, నాకును సుఖము నిమ్ము. నక్షత్రముల ప్రకాశము నుండి నన్నుఁ గాపాడుము. (ఈ మంత్రము రెండు భాగములుగా నున్నది. 'మా హిగ్ంసీః' అను నంత వఱకుఁ గల భాగము పఠించుచు అధ్వర్యుఁడు యజమానుని నడుమునకు దర్భలచేఁ జేయఁబడిన త్రాటిని కట్టవలెను. రెండవ భాగము పఠించుచు యజమానుని భుజములపై వస్త్రమును కప్పవలయును.)

6\. అర్థము: (హే కృష్ణవిషాణ!=ఓ కృష్ణవిషాణమా! త్వమ్=నీవు) ఇన్ద్రస్య=ఇంద్రునకు యోనిః=జన్మకారణము, అసి=అగుచున్నావు. (తతః=అందువలన) మా=నన్ను, మా హింసీః=బాధింపకుము. (కృష్ణవిషాణము=జింక కొమ్ము)

తాత్పర్యము: ఓ కృష్ణవిషాణమా! నీవు ఇంద్రుని జన్మకు కారణమైతివి. నన్ను బాధింపకుము. (ఈ మంత్రము చెప్పుచు అధ్వర్యుఁడు యజమానునకు జింక కొమ్ము నీయవలెను. కృష్ణవిషాణము ఇంద్రుని జన్మకుఁ గారణమైన విధము 6-వ కాండము 1-వ అనువాకమునందు కథానికగా వివరింపఁబడినది.)

7\. అర్థము: హే లోష్ట!=ఓ లోష్టమా! (మట్టిగడ్డ) త్వా=నిన్ను, సుసస్యాయై=మంచి సస్యముతోఁ గూడిన కృషి (వ్యవసాయము) కొఱకు, ఉద్దన్మి=పైకిఁ దీయుచున్నాను.

తాత్పర్యము: ఓ లోష్టమా! నిన్ను మంచి సస్యముతోఁ గూడిన వ్యవసాయము కొఱకు పెల్లగించుచున్నాను. (ఈ మంత్రము చెప్పుచు వేదికనుండి కృష్ణవిషాణముతో మట్టిగడ్డను పెల్లగించవలెను.)

8\. అర్థము: (హే శిరః=ఓ శిరమా!) త్వా=నిన్ను, సుపిప్పలాభ్యః=సత్ఫలవంతములైన, ఓషధీభ్యః=ఓషధుల కొఱకు, (కణ్డూయే=గోకుకొనుచున్నాను.)

తాత్పర్యము: ఓ శిరమా! నిన్ను సత్ఫలములు గల ఓషధుల కొఱకు గోకుకొనుచున్నాను. (యజమానుఁడు తన తలపై దురద కలిగినపుడు కృష్ణవిషాణముతో గోకుకొనవలెను.)

9. అర్థము: (హే దణ్డ=ఓ దండమా!) దేవః=దేవతారూపమును, వనస్పతిః=వనస్పతి (వృక్షము) నుండి పుట్టినదానవును, సూపస్థాః=బాగుగ దగ్గఱగా నున్నదానవునునగు, త్వమ్=నీవు; ఊర్ధ్వః=పై నున్న దానవై, ఆ+ఉదృచః=ఉత్తమ ఋక్కులు గల యజ్ఞము సమాప్తమగునంతవఱకు, మామ్=నన్ను, పాహి=రక్షింపుము.

తాత్పర్యము: ఓ దండమా! నీవు దేవతాస్వరూపమవు. వనస్పతి నుండి పుట్టిన దానవు. బాగుగా దగ్గఱగా నున్న దానవు. కావున నీవు పై నుండి యజ్ఞము పరిసమాప్త మగునంతవఱకు నన్నుఁ గాపాడుము. (అధ్వర్యుఁడు యజమానునకు మేడిచెట్టు సంబంధమైన కఱ్ఱ నీయవలెను.)

10. అర్థము: మనసా=మనస్సుచేత, యజ్ఞమ్=యజ్ఞమును, స్వాహా=పొందుచున్నాను. ద్యావాపృథివీభ్యామ్=ద్యులోక భూలోకములచేత, స్వాహా=(యజ్ఞము) ఆశ్రయింపఁబడినది. ఉరోః=గొప్పదియగు, అన్తరిక్షాత్=ఆకాశము వలన, స్వాహా=(యజ్ఞము) ఆశ్రయింపఁబడినది. వాతాత్=వాయుదేవుని యనుగ్రహము వలన, యజ్ఞమ్=యజ్ఞమును, ఆరభే=ఆరంభించుచున్నాను.

తాత్పర్యము: నేను యజ్ఞమును మనస్సుతోఁ బొందుచున్నాను. యజ్ఞము ద్యావాభూములచేతను ఆకాశము చేతను ఆశ్రయింపఁబడినది. వాయుదేవుని యనుగ్రహము వలన యజ్ఞము నారంభించుచున్నాను. (యజమానుఁడు ఈ మంత్రము చెప్పుచు తన చేతివ్రేళ్ళను వరుసగా రెండేసి చొప్పున ముడుచుచు పిడికిలి బిగించవలెను. 'స్వాహా' అను శబ్దము 'పొందుట'. 'ఆశ్రయింపఁబడుట' అను రెండర్థములందు ప్రయుక్తమైనది.)

ద్వితీయానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ద్వితీయప్రపాఠకే తృతీయోఽనువాకః।

మూలము: [1]దైవీం ధియం మనామహే సుమృడీకా మభిష్టయే వర్చోధాం యజ్ఞవాహసగ్ం సుపారా నో అసద్వశే। [2]యే దేవా మనోజాతా మనోయుజః సుదక్షా దక్షపితార స్తే నః పాన్తు తే నో ఽవన్తు తేభ్యో నమ స్తేభ్య స్స్వాహా ఽ[3]గ్నే త్వగ్ం సుజాగృహి వయగ్ం సుమన్దిషీమహి గోపాయ న స్స్వస్తయే ప్రబుధే నః పున ర్దదః। [4]త్వ మగ్నే వ్రతపా అసి దేవ ఆమర్త్యేష్వా। త్వమ్ (౧)యజ్ఞే ష్వీడ్యః। [5]విశ్వేదేవా అభి మా మాఽవవృత్రన్ పూషా సన్యా సోమో రాధసా దేవః సవితా వసో ర్వసుదావా రాస్వే యత్వేమా ఽఽభూయో భర మా పృణన్ పూర్త్యా విరాధి మా హ మా యుషా [6]చన్ద్ర మసి మమ భోగాయ భవ వస్త్ర మసి మమ భోగాయ భవో స్రా ఽసి మమ భోగాయ భవ హయో ఽసి మమ భోగాయ భవ (౨)ఛాగో ఽసి మమ భోగాయ భవ మేషో ఽసి మమ భోగాయ భవ [7]వాయవే త్వా వరుణాయ త్వా నిర్ఋత్యై త్వా రుద్రాయ త్వా [8]దేవీ రాపో అపాంనపా ద్య ఊర్మి ర్హవిష్య ఇన్ద్రియావా న్మదిన్తమ స్తం వో మా ఽవక్రమిష మచ్ఛిన్నం తన్తుం పృథివ్యా అనుగేషం [9]భద్రా దభి శ్రేయః ప్రేహి బృహస్పతిః పుర ఏతా తే అస్త్వ థే మవస్య వరఆ పృథివ్యా ఆరే శత్రూన్ కృణుహి సర్వవీర [10]ఏద మగన్మ దేవయజనం పృథివ్యా విశ్వేదేవా యద జుషన్త పూర్వఋక్సామాభ్యాం యజుషా సన్తరన్తో రాయస్పోషేణ సమిషా మదేమ ॥(౩)॥ (ఆ త్వం హయో ఽసి మమ భోగాయ భవస్య పఞ్చవిగ్ంశతి శ్చ।)

వేదార్థ దీపిక

అవతారిక: ద్వితీయానువాకమునందు సోమయాగముచేయు యజమానునకు యజ్ఞదీక్ష విధింపఁబడినది. ఈ యనువాకమునందు దేవయజన స్వీకారము వర్ణింపఁ బడుచున్నది.

1\. **అర్థము:** వయమ్=మేము, అభీష్టయే=ఈప్సితార్థసిద్ధికై, దైవీమ్=దేవతాసంబంధమైనదియు, సుమృడీకామ్=సుఖమునకు హేతువైనదియు, వర్చోధామ్=బ్రహ్మవర్చోధారణ హేతువైనదియు, యజ్ఞవాహసమ్=యజ్ఞనిర్వాహికయునగు, ధియమ్=బుద్ధిని, మనామహే=(ఈ బుద్ధిచే) సంపాదించుచున్నాము. (సా+ఇయమ్=అ యీ బుద్ధి) సుపారా=బాగుగ పరిపక్వమై. అసద్వశే=మాయధీనమునందు (అస్తు=ఉండుగాక)

తాత్పర్యము: మేము ఈప్సితార్థము సిద్ధించుటకై ఈ సాధారణబుద్ధిచే దేవతాసంబంధమైన కర్మానుష్ఠాన బుద్ధిని సంపాదించుచున్నాము. ఈ బుద్ధి సుఖహేతువైనది. బ్రహ్మవర్చస్సును ధరించుటలో కారణమైనది. యజ్ఞమును నిర్వహించు శక్తి కలది. అట్టి ఈ కర్మానుష్ఠాన బుద్ధి బాగుగ పరిపక్వత చెంది మా యధీనము నందుండుఁ గాక. (యజమానుఁడు ఈ మంత్రము చెప్పుచు ఆచమనము చేయవలెను. అసద్వశే=అస్మద్వశే)

2\. **అర్థము:** యే దేవాః=చక్షురాది ప్రాణాభిమానులయిన యే దేవతలు, మనోజాతాః=(జన్మకాలమున) మనస్సునందుఁ బుట్టినవారును, మనోయుజః=(వ్యవహారకాలమున) మనస్సుతోఁ గలిసియున్నవారును, సుదక్షాః=మిక్కిలి నేర్పరులును, దక్షపితారః=ప్రజాపతి తండ్రిగా గలవారునునై, (సన్తి=కలరో)తే=ఆ దేవతలు, నః=(పయఃపానవ్రతము ననుష్ఠించుచున్న) మమ్ము, పాన్తు=రక్షింతురు గాక. తే=ఆ దేవతలు, అవన్తు=(అంతర్బహిఃప్రదేశములందు శుద్ధిని గలిగించుటచే) పాలింతురు గాక. తేభ్యః=వారికొఱకు, నమః=నమస్కారము. తేభ్యః=వారి కొఱకు, స్వాహా=స్వాహాకారము.

తాత్పర్యము: ప్రాణాదుల కభిమానభూతులయిన దేవతలు పయఃపాన మనెడి వ్రతమును అనుష్ఠించుచున్న మమ్ము అంతర్బహిశ్శుద్ధి చేసి రక్షింతురు గాక. ఆ దేవతలు జనన కాలమున మనస్సునందు పుట్టినవారు. వ్యవహార కాలమున మనస్సుతో కలిసియుండువారు. నేర్పరులు. వారికి ప్రజాపతి పిత. అట్టి దేవతలకు నమస్కారము. స్వాహాకారము.

3\. **అర్థము:** హే అగ్నే!=ఓ యగ్నీ! త్వమ్=నీవు, నః=మా యొక్క, గోపాయ=రక్షణముకొఱకు, సుజాగృహి=బాగుగ మేల్కొని యుండుము. వయమ్=మేము, సుమన్దిషీమహి=నిర్భయులమై నిద్రింతుము. నః=మా యొక్క, స్వస్తయే=మంగళము కొఱకు (వినాశము లేకుండుటకై) పునః=మఱల, ప్రబుధే=మేల్కాంచుట కొఱకు, దదః=(సామర్థ్యమును) ఇమ్ము. (దేహి=అనుటకు బదులుగా 'దదః' అనునది వైదికప్రయోగము.)

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు మా రక్షణముకొఱకు బాగుగ మేల్కాంచి యుండుము. మేము నిర్భయముగ నిద్రింతుము. మాకు నాశము లేకుండుటకును, మఱల మేల్కాంచుటకును సామర్థ్యము నిమ్ము. (యజమానుఁడు నిద్ర కుపక్రమించునపు డీ మంత్రమును జపించుచు అహవనీయాగ్ని నభిమంత్రించవలెను.

4\. **అర్థము:** ఇది పురోనువాక్య మంత్రము. ఇది 1వ ప్రపాఠకమున 14వ అనువాకమునందు వ్యాఖ్యానింపఁబడినది.

5\. **అర్థము:** విశ్వే=సమస్తమైన, దేవాః=దేవతలు, అభి=అంతటను, మామ్=నన్ను, ఆవవృత్రన్=(రక్షణకై) ఆవరించి యుందురుగాక. పూషా=పోషకుఁడైన దేవుఁడు, సన్యా=ఇవ్వఁదగిన హిరణ్యాది ద్రవ్యముతోఁగూడ, (ఆయాతు=వచ్చుఁగాక) సోమః=సోమదేవుఁడు, రాధసా=సాధకమైన వస్త్రముతోఁగూడ, (ఆయాతు) వసోః=ఇతర ధనమైన గవాదికమునకు, సవితా=ప్రేరకుఁడైన, దేవః=దేవుఁడు, వసుదావా=ధనము నిచ్చువాఁడగుచు, (ఆయాతు) హే సోమ!=ఓ సోమదేవా! ఇయత్=(ఈ కర్మయందపేక్షితమైన సర్వమును) ఇమ్ము. పూర్త్యా=సంపూర్ణతచే, మామ్=నన్ను, పృణన్=పూరింపఁజేయుచు, భూయః=అధికముగా, అభర=భారమును వహింపుము. అహమ్=నేను, ఆయుషా=ఆయువుచే, మా విరాధి=వియుక్తుఁడను కాను.

తాత్పర్యము: సమస్త దేవతలు రక్షించుటకై అంతటను నన్నుఁగూడియుందురుగాక. పోషకుఁడైన దేవుఁడు ఇవ్వఁదగిన హిరణ్యాదికమును, సోమదేవుఁడు సాధకమయిన వస్త్రమును, గవాది ధనమునకుఁ బ్రేరకుఁడైన దేవుఁడు గవాదికమును ఇత్తురుగాక. ఓ సోమదేవా! ఈ కర్మయందవసరమైన సర్వము నిమ్ము. నన్ను సంపూర్ణతతో నిండింపఁ జేసిన వాఁడ వగుచు అధికముగా భారమును వహింపుము. నేను అయువుచేత వియుక్తుఁడను గాను. (అల్పాయుష్కుఁడను గాను.)

6. అర్థము: (హే సోమ!=ఓ సోమదేవా! త్వమ్=నీవు) చన్ద్రమ్=హిరణ్యము (బంగారము) అసి=అగుచున్నావు. మమ=నాయొక్క, భోగాయ=భోగము కొఱకు, భవ=అగుము. వస్త్రమ్=వస్త్రము, అసి=అగుచున్నావు. మమ భోగాయ భవ. ఉస్రా=గోవువు, అసి=అగుచున్నావు. మమ భోగాయ భవ. హయః=గుఱ్ఱము, అసి=అగుచున్నావు. మమ భోగాయ భవ. ఛాగః=మేకవు, అసి=అగుచున్నావు. మమ భోగాయ భవ. మేషః=గొఱ్ఱెవు, అసి=అగుచున్నావు. మమ భోగాయ భవ.

తాత్పర్యము: ఓ సోమదేవా! నీవు హిరణ్యాదికము అగుచున్నావు. హిరణ్యాదిక ద్రవ్యములు నా భోగమున కుపయోగపడుఁగాక (యజ్ఞదీక్షితుఁడైన యజమానుఁడు ఈ మంత్రము నుచ్చరించుచు హిరణ్యాదికములను కానుకలుగా నిచ్చు వారినుండి ఆ యా వస్తువులను కానుకలుగా స్వీకరింపవలెను.)

7. అర్థము: (హే హిరణ్యాదిద్రవ్య!=ఓ హిరణ్యాది ద్రవ్యమా!) త్వా=నిన్ను, వాయవే=వాయుదేవునికై, అనుదిశామి=ఇచ్చుచున్నాను. వరుణాయ = వరుణదేవుని కొఱకు, త్వా=నిన్ను, అనుదిశామి=ఇచ్చుచున్నాను. నిర్ఋత్యై=నిర్ఋతిదేవుని కొఱకు, త్వా, అనుదిశామి. రుద్రాయ=రుద్రదేవుని కొఱకు, త్వా, అనుదిశామి=అనుసరించి యిచ్చుచున్నాను. (వెంటనే యిచ్చుచున్నానని భావము.)

తాత్పర్యము: 6వ మంత్రమునఁ జెప్పఁబడిన హిరణ్యాదికములలో ఏది నశించునో దానిని వాయుదేవునకును, నీటిలోఁ బడి నశించిన దానిని వరుణదేవునకును, గోఁతిలోఁబడి నశించిన దానిని నిర్ఋతిదేవునకును, సర్ప వ్యాఘ్రాదుల వలన నశించిన దానిని రుద్రదేవునకును ఇచ్చుచున్నాను. అనఁగా అర్పణ చేయుచున్నానని భావము. (ఈ భావముతో యజమానుఁ డీ మంత్రము పఠించవలెను.)

8. అర్థము: హే అపాన్నపాత్=ఓ యగ్నీ!, హే దేవీః ఆపః=దేవతాస్వరూపములైన ఓ ఉదకములారా!, హవిష్యః=(వ్రీహ్యుత్పాదన మూలమున) హవిస్సునకు యోగ్యమైనదియు, ఇన్ద్రియావాన్=(నీటిని త్రాగుటచే) ఇంద్రియ శక్తిని గలుగఁజేయునదియు, మదిన్తమః=(దప్పికను బోగొట్టుటచే) సంతోషప్రదమును నగు, వః=మీ యొక్క, యః ఊర్మిః=ఏ కెరటము (అస్తి=కలదో, తమ్=ఆ నీటికెరటమును, మా అవక్రమిషమ్=పాదముచే నతిక్రమింపను. పృథివ్యాః=భూమియొక్క, అచ్ఛిన్నం తన్తుమ్=లోష్టరూపమైన సేతువును, అనుగేషమ్=అనుసరించి (ఒడ్డును) పొందుదును. (ఇంద్రియావాన్=ఇంద్రియవాన్.)

తాత్పర్యము: (సోమయాగము చేయనున్న యజమానుఁడు ఏదేని కారణముచేత యజ్ఞశాలయందు గాక వేఱొక ప్రదేశము నందు యజ్ఞ దీక్షను బొందినచో ఆ ప్రదేశము నుండి యజ్ఞశాలకుఁ బోవుచు మార్గము మధ్యనున్న జల ప్రవాహమున స్నానముచేయు సమయమున యజమానుఁడీ మంత్రమును జపించవలెను.) 'అపాన్నపాత్' అనునది అగ్నిసంబోధనము. ఓ దేవతా స్వరూపులైన యుదకములారా! పాదముచే మీ కెరటమును దాటను. మీ కెరటము హవిస్సునకుఁ గారణమైన వ్రీహిసముత్పాదించునది. త్రాగుటచే నింద్రియములకు శక్తి నిచ్చునది. దప్పికను బోఁగొట్టుటచే సంతోషమును గలుగఁజేయునది. భూమిలోని మట్టిగడ్డ (సేతువు) నాధారముగాఁ జేసికొని నీటి నుండి లేచి దానిపైన ఒడ్డునకుఁ జేరుదును.

9. అర్థము: (హే రథ!=ఓ రథమా!) భద్రాత్=ప్రశస్తమైన ఈ నిత్యాగ్నిహోత్రస్థానము నుండి, శ్రేయః=అతిప్రశస్తమైన సోమయాగ ప్రదేశమును(గూర్చి) అభిప్రేహి=అభిముఖముగాఁబొమ్ము. బృహస్పతిః=బృహస్పతి, పురః=(నీ)ఎదుట, ఏతా=పోవువాఁడుగా, అస్తు=అగుగాక. అథ=ప్రయాణానంతరము, పృథివ్యాః=భూమికి, ఆ=అంతటను, వరే=శ్రేష్ఠమైన స్థానమునందు, ఈమ్=ఈ నడకను, అవస్య=సమాప్తిచేయుము. (=ఆపుము) హే సర్వవీర!=రథాభిమానివగునో ఆదిత్యుఁడా!, శత్రూన్=శత్రువులైన రాక్షసాదులను, ఆరే=(దేవయజన ప్రదేశమునకు)దూరమునందు కృణుహి=చేయుము(ఉంచుము, ఈమ్=ఇదమ్)

తాత్పర్యము: (అర్థక్రమము ననుసరించి యీ మంత్రము 8వ మంత్రమునకుఁ బూర్వమున నుండవలయును. యజమానుఁడు యాగ దీక్షను గైకొన్న ప్రదేశమునుండి యాగ ప్రదేశమునకు రథము (బండి)మీద ప్రయాణము చేయవలయును. తత్ప్రయాణ సాధనమైన రథము ఇచట సంబోధింపఁబడినది. ఓ రథమా! నీవు ప్రశస్తమైన నిత్యాగ్నిహోత్ర స్థానము నుండి ప్రశస్తతరమైన సోమయాగ ప్రదేశమునకు పయనింపుము. బృహస్పతి నీకు ముందుఁపయనించును. ప్రయాణానంతరము భూమి యందంతటను శ్రేష్ఠమైన ప్రదేశమునందు ఈ ప్రయాణమును నిలుపుము. రథాభిమానివగు నో సూర్యదేవా! శత్రువులైన రాక్షసాదులను యజ్ఞప్రదేశమునకు దూరమునం దుంచుము. (యజమానుఁ డీ మంత్రమును జెప్పుచు మఱియొక అరణియందు అగ్నిని సమారోహణము చేసి నిత్యాగ్నిహోత్రస్థానమునుండి యజ్ఞప్రదేశమునకు బండిమీఁద పయనించవలెను.)

10. అర్థము: పూర్వే=ప్రాచీనులైన, విశ్వేదేవాః=సర్వదేవతలు, పృథివ్యాః=భూమిసంబంధమైన, యత్=ఏ దేవయజన స్థానమును, అజుషన్త=సేవించిరో, తత్=ఆ, ఇదమ్+దేవయజనమ్=ఈ దేవయజ్ఞ ప్రదేశమును, ఆ+అగన్మ=పొందితిమి. (మేము చేరితిమి. చేరి) ఋక్సామాభ్యామ్=ఋక్కులచేతను, సామములచేతను, యజుషా=యజుస్సుచేతను(=వేదత్రయ మంత్రములచేతను) సంతరన్తః=సోమయాగమును బాగుగ సమాప్తినొందించినవారమై, రాయస్పోషేణ=ధనసమృద్ధిచేతను, సమిషా=యోగ్యమైన అన్నముచేతను, మదేమ=సంతోషించెదము.

తాత్పర్యము: పూర్వపు దేవతలు సేవించిన దేవ యజన ప్రదేశమునకు మేము వచ్చితిమి. వచ్చి ఋగ్యజుస్సామవేదముల మంత్రములచేత ఈ సోమయాగమును సమాప్తి నొందించినవారమై మేము ధన సమృద్ధిచేతను యోగ్యమైన అన్నముచేతను సంతోషించెదము. (యజమానుఁడు అధ్వర్యాదులతో నిత్యాగ్ని హోత్ర ప్రదేశమునుండి సోమయాగ ప్రదేశమునకు వచ్చి వెంటనే ఈ మంత్రార్థమును భావనచేయవలెను.)

తృతీయానువాకము సమాప్తము

అథ ప్రథమకాణ్డే ద్వితీయప్రపాఠకే చతుర్థోఽనువాకః।

మూలము: [1]ఇయం తే శుక్ర తనూ రిదం వర్చ స్తయా సంభవ భ్రాజం గచ్ఛ [2]జూ రసి ధృతా మనసా జుష్టా
విష్ణవే తస్యా స్తే సత్యసవసః ప్రసవే వాచో యన్త్ర మశీయ స్వాహా [3]శుక్ర మస్య మృత మసి వైశ్వ
దేవగ్ం హవి [4]స్సూర్యస్య చక్షు రాఽరుహ మగ్నే రక్ష్ణః కనీనికాం యదే తశేభి రీయసే భ్రాజమానో
విపశ్చితా [5]చిదసి మనా ఽసి ధీరసి దక్షిణా (౧)అసి యజ్ఞియా ఽసి క్షత్రియా ఽస్య దితి
రస్యు భయత శ్శీర్ష్ణీ సా నః సుప్రాచీ సుప్రతీచీ సంభవ మిత్ర స్త్వా పది బధ్నాతు పూషా ఽధ్వనః
పాత్వి న్ద్రా యా ధ్యక్షాయా ను త్వా మాతా మన్యతా మను పితా ఽను భ్రాతా సగర్భ్యో ఽను
సఖా సయూథ్య స్సా దేవి దేవ మచ్ఛేహి న్ద్రా య సోమగ్ం రుద్ర స్త్వా ఽఽవర్తయతు మిత్రస్య
పథా స్వస్తి సోమసఖా పున రేహి సహ రయ్యా॥(౨)॥ (దక్షిణా సోమసఖా పఞ్చ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ద్వితీయప్రపాఠకే చతుర్థోఽనువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: తృతీయానువాకమునందు దేవయజన స్వీకారము చెప్పఁబడినది. ఆ దేవయజనమునందు సోమయాగమున కుపయోగించు సోమమును కొనుటకై సోమక్రయణీ సంబంధమైన హోమాదికము ఈ చతుర్థానువాకమునందు విధింపఁబడుచున్నది. సోమయాగమున కవసరమైన సోమమును హిరణ్యము నిచ్చి కొనవలెను. కావున హిరణ్యము సోమక్రయణి యనఁబడును.

1. **అర్థము:** హే శుక్ర!=దీప్తిమంతమైన హిరణ్యమా! తే=నీకు, ఇయమ్=ఈ జుహువు, తనూః=శరీరము. ఇదమ్=ఈ ఆజ్యము, వర్చః=వర్చస్సు. (తతః=అందువలన) తయా=ఆ జుహువుతో, సంభవ=కలిసికొనుము. (హే హిరణ్య!=ఓ హిరణ్యమా! త్వమ్=నీవు) భ్రాజమ్=ఆజ్యరూపమైన దీప్తిని, సంగచ్ఛ=బాగుగాఁ బొందుము.

తాత్పర్యము: (సోమక్రయసాధనము హిరణ్యము) కాంతిమంతమైన హిరణ్యమా! ఈ జుహువు నీకు శరీరము. ఈ అజ్యము నీకు వర్చస్సు. కావున నీవు ఆ జుహువుతోఁగలిసికొనుము. అజ్యరూపమైనకాంతిని బొందుము. (సోమక్రయ సాధనమైన హిరణ్యమును దారముతోఁగట్టి ఆజ్యపాత్రయం దుంచవలెను.)

2\. అర్థము: (హే సోమక్రయణి!=ఓ సోమక్రయణీ! వాగ్రూపా త్వమ్=వాక్స్వరూపమైన నీవు) జూః=వేగముకలదానవు, మనసా=మనస్సుచేత, ధృతా=నియమితవు, విష్ణవే=యజ్ఞముకొఱకు, జుష్టా=ప్రియమైనదానవు, అసి=అగుచున్నావు. సత్యసవసః=అమోఘమైన ప్రేరణకల, తస్యాః=అటువంటి, తే=నీ యొక్క, ప్రసవే(సతి)=ప్రేరణ కలుగుచుండగా, వాచః=మంత్రోచ్చారణరూపమైన వాక్కునకు, యన్త్రమ్=నియమమును, అశీయ=పొందుదును. స్వాహా=(ఈ యాజ్యము)హుతమగుఁగాక.

తాత్పర్యము: వాగ్దేవతారూపమైన ఓ సోమక్రయణీ! నీవు వేగము కలదానవు; మనోనియమితవు, యజ్ఞమునకు ప్రియమైనదానవు నగుచున్నావు. సత్యమైన ప్రేరణకలిగియున్న అటువంటి నీ యొక్క ప్రేరణ కలుగుచుండగా మంత్రోచ్చారణరూపమైన వాక్కును నియమించెదను. ఈ యాజ్యము హుతమగుఁగాక. (ఈ మంత్రము చెప్పుచు ఆహవనీయాగ్నియందు ఆజ్యమును హోమము చేయవలెను. సోమమును కొనునపుడు మాటలాడవలెను, గావున హిరణ్యమువలె వాక్కుకూడ సోమక్రయణి యగుచున్నది. సోమక్రయసాధనములలో వాక్కుకూడ నొకటి.)

3\. అర్థము: (హే హిరణ్య!=ఓ హిరణ్యమా!, త్వమ్=నీవు) శుక్రమ్=దీప్తి కలదానవు, అమృతమ్=నాశము లేనిదానవు, అసి=అగుచున్నావు. (హే ఆజ్య!=ఓ యాజ్యమా! త్వమ్=నీవు) వైశ్వదేవమ్=సర్వదేవతలకుఁ బ్రియమైన, హవిః=హవిస్సువు, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: ఓ హిరణ్యమా! నీవు కాంతికలదానవు, నాశములేనిదానవు అగుచున్నావు. ఓ ఆజ్యమా! నీవు సర్వదేవతలకుఁ బ్రియమైన హవిస్సువు అగుచున్నావు. (అధ్వర్యుఁడు ఈ మంత్రము చెప్పుచు యజ్ఞశాలకు అగ్రభాగమున నుండి యజమానుఁడు ఆజ్యమును జూచునట్లు చేయవలెను.)

4\. అర్థము: (హే సూర్య!=ఓ సూర్యుఁడా! త్వమ్=నీవు) యత్=ఏ కారణమువలన, ఏతసేభిః=ఏతశములనెడి పేరుగల అశ్వములచేత, ఈయసే=వెళ్లుచున్నావో, (హే అగ్నే!=ఓ యగ్నీ!, త్వమ్=నీవు) విపశ్చితా=తేజస్సుచే, భ్రాజమానః=ప్రకాశించుచున్నవాడవు, (అసి=అగుచున్నావో, తత్=అందువలన) సూర్యస్య=సూర్యసంబంధమైన, చక్షుః=చక్షురింద్రియమును, అగ్నేః=అగ్నియొక్క, అక్ష్ణః=కంటియొక్క, కనీనికామ్=నల్లగ్రుడ్డును, ఆరుహమ్=పొందితిని.

తాత్పర్యము: ఓ సూర్యదేవా! నీవు ఏతశములనెడి గుఱ్ఱములచేత వెళ్లుచుండుటచేతను, ఓ యగ్నీ! నీవు తేజస్సుతో ప్రకాశించుచుండుటచేతను, సూర్యసంబంధియగు చక్షురింద్రియమును, అగ్నిసంబంధియగు కంటినల్లగ్రుడ్డును రాక్షస నివారణమునకై పొందితిని. (యజమానుఁడు ఆజ్యములో హిరణ్యమును దాచి సూర్యునిఁజూడవలెను.)

5\. అర్థము: (హే వాగ్దేవతారూప సోమక్రయణి!=ఓ వాగ్దేవతారూపమైన సోమక్రయణీ!, త్వమ్=నీవు) చిత్=చిత్తము, అసి=అగుచున్నావు. మనా=మనస్సువు, అసి=అగుచున్నావు. ధీః=బుద్ధివి, అసి=అగుచున్నావు. దక్షిణా=ఈయఁదగిన ద్రవ్యరూపము, అసి=అగుచున్నావు. యజ్ఞియా=(సోమక్రయము మూలమున) యజ్ఞసంబంధినివి, అసి=అగుచున్నావు. క్షత్రియా=క్షత్రియజాత్యభిమానివి, అసి=అగుచున్నావు. ఉభయతః+శీర్ష్ణీ=సోమయాగముయొక్క ఆద్యంతేష్టులు రెండింటియందును దేవతాత్వముకల, అదితిః=అదితివి, అసి=అగుచున్నావు. సా=అటువంటి, (త్వమ్=నీవు) నః=మాకొఱకు, సుప్రాచీ=సోమలతను విక్రయించువానిని గూర్చి బాగుగా ప్రాఙ్ముఖముగా వెళ్లుదానవును, (తతః=పిమ్మట) సుప్రతీచీ=మమ్ముఁగూర్చి ప్రత్యఙ్ముఖముగా వచ్చుదానవునై, సంభవ=(మమ్ము)కలిసికొనుము. (2)(హే సోమక్రయణి!=ఓ సోమక్రయణీ!) హితః=హితమునుజేయుదేవుఁడు, త్వా=నిన్ను, పది=(దక్షిణ)పాదమునందు, బధ్నాతు=బంధించుఁగాక. (3) (హే సోమక్రయణి!=ఓ సోమక్రయణీ!, త్వా=నిన్ను) పూషా=పోషకుఁడైన దేవుఁడు, అధ్వనః=(భయంకరమైన)మార్గమునుండి, పాతు=రక్షించుఁగాక. అధ్యక్షాయ=యాగమున కధ్యక్షుఁడైన, ఇన్ద్రాయ=ఇంద్రునికొఱకు, త్వా=నిన్ను, మాతా=తల్లి, అనుమన్యతామ్=(సోమక్రయ సాధనముచేత)అనుమతించుఁగాక.

పితా=తండ్రి, అను(మన్యతామ్)=అనుమతించుఁగాక. సగర్భ్యః=ఒకేగర్భమునుండి పుట్టినవాఁడైన, భ్రాతా=సోదరుఁడు, అను(మన్యతామ్)=అనుమతించుఁగాక. సయూథ్యః=ఒక సంఘమునందు సాహచర్యముగల, సఖా=స్నేహితుఁడు, అను (మన్యతామ్)=అనుమతించుఁగాక. హే దేవి=ఓ దేవీ!, సా=అటువంటి(నీవు) ఇన్ద్రాయ=ఇంద్రునికొఱకు, సోమం దేవమ్=సోమదేవునిగూర్చి, అచ్ఛేహి=వెళ్లుము. రుద్రః=రుద్రదేవుఁడు, త్వా=నిన్ను, మిత్రస్య=సూర్యునియొక్క, పథా=మార్గముచేత, ఆ వర్తయతు=(మమ్ముఁగూర్చి)మఱలిం చుఁగాక. (తతః=అందువలన) స్వస్తి=(నీకు)సుఖమగుఁగాక. సోమసఖా=సోముఁడు మిత్రుఁడుగాఁగల దానవై, పునః=మఱల, రయ్యా సహ=ధనముతోఁగూడ, ఏహి=రమ్ము.

తాత్పర్యము: జ్యోతిష్టోమ యాగమున కవసరమైన సోమలతను కొనునప్పుడు హిరణ్యాదికము నుపయోగించుటకై ఆ సమయమున మాటలాడినమాట ఇట సోమక్రయణీ రూపమైన వాగ్దేవతగా అభివర్ణింపఁబడినది. ఆ వాగ్దేవతయే ఇచట చిదాదిరూపముగ వర్ణింపఁబడినది. చిత్తము, మనస్సు, బుద్ధి యనునవి అంతఃకరణప్రవృత్తులు. దేహాది సంఘాతమునకు అచేతనత్వమును నివర్తింపఁజేయుచు బాహ్యవస్తువులయందు నిర్వికల్పత్వరూప సామాన్య ప్రజ్ఞానమును గలుగఁజేయువృత్తి చిత్తమనఁబడును. ఈ పదార్థ మీ విధముగ నుండునా – లేదా – అనెడి విచారరూపమైన వృత్తి మనస్సు అనఁబడును. నిశ్చయాత్మకవృత్తి బుద్ధి యనఁబడును. ఇంద్ర సోమ వరుణాది దేవతలు క్షత్రియ జాత్యభిమానులు. ఆ సోమున కభిమాన విషయమైన ద్రవ్యము సోమలత. అది క్రయహేతువగుటచే క్షత్రియ అనివర్ణింపఁబడినది. జ్యోతిష్టోమయాగమునకు ఆదియందు ప్రాయణీయేష్టియు- అంతమునందు ఉదయనీయేష్టియుఁ జేయఁబడుచుండును. ఆ యిష్టిద్వయము అదితి దేవతాకము. కావున అదితి ఉభయతశ్శీర్షిగా వర్ణింపఁబడినది. పైని వర్ణింపఁబడిన వాగ్దేవత ఇంద్రుని నిమిత్తము సోమదేవు ననుసరించి వెళ్లవలెననియు మఱల ఆ దేవతను యజమానుని దగ్గఱకు రుద్రదేవుఁడు సూర్యమార్గముద్వారా తీసికొని రావలయు ననియు ఆ దేవత ధనముతో రావలయుననియు ప్రార్థింపఁబడినది. మిగిలినదంతయు సులభగ్రాహ్యము. (ఈ మంత్రము చెప్పుచు సోమక్రయణి నభిమంత్రించవలెను.)

చతుర్థానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ద్వితీయప్రపాఠకే పంచమోఽనువాకః।

మూలము: వస్వ్యసి రుద్రాఽస్య దితి రస్యా దిత్యా ఽసి శుక్రా ఽసి చన్ద్రా ఽసి [2]బృహస్పతి స్త్వా సుమ్నే
రణ్వతు రుద్రో వసుభి రాచికేతు [3]పృథివ్యా స్త్వా మూర్ధ న్నాజిఘర్మి దేవయజన ఇడాయాః పదే
ఘృతవతి స్వాహా [4]పరిలిఖితగ్ం రక్షః పరిలిఖితా అరాతయ ఇద మహగ్ం రక్షసో గ్రీవా అపి
కృన్తామి యోఽస్మాన్ ద్వేష్టి యం చ వయం ద్విష్మ ఇద మస్య గ్రీవాః (౧)అపి కృన్తామ్య
[5]స్మే రాయ స్త్వే రాయ స్తోతే రాయ [6]స్పం దేవి దేవ్యే ర్వశ్యా పశ్యస్వ [7]త్వష్టీమతీ తే సపేయ
సురేతా రేతో దధానా వీరం విదేయ తవ సందృశి [8]మా ఽహగ్ం రాయస్పోషేణ వియోషమ్॥(౨)॥
(అస్య గ్రీవా ఏకాన్నత్రిగ్ంశ చ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ద్వితీయప్రపాఠకే పఞ్చమోఽనువాకః॥

వేదార్థ దీపిక

అవతారిక: "అరుణయా పింగాక్ష్యా ఏకహాయన్యా గవా సోమం క్రీణాతి" అను శ్రుతి ననుసరించి అరుణవర్ణము కలదియు, పచ్చని కన్నులు కలదియు, ఒక సంవత్సరము వయస్సుకలిగిన దూడకలదియునగు గోవునిచ్చి సోమలతను కొనవలెను. కావున సోమక్రయణి యనగాఁ బైనఁజెప్పఁబడిన 'గోవు' అని యర్థము. సోమలతాక్రయమునకై యీ గోవును సోమలతను విక్రయించు ప్రదేశమునకు తీసికొనిపోవుట నాల్గవయనువాకము నందుఁ జెప్పఁబడినది. ఆ గోవు పోవునపుడు అది వేయు అడుగులకు సంబంధించిన విషయము ఈ యనువాకమునందుఁ జెప్పఁబడుచున్నది.

1. అర్థము: (హే సోమక్రయణి! త్వమ్=ఓ సోమక్రయణీ! నీవు) వస్వీ=వసుదేవతా స్వరూపము, అసి=అగుచున్నావు. [2]రుద్రా=రుద్రదేవతా స్వరూపము, అసి=అగుచున్నావు. [3]అదితిః=అదితిదేవతా స్వరూపము, అసి=అగుచున్నావు. [4]ఆదిత్యా=ఆదిత్యదేవతా స్వరూపము, అసి=అగుచున్నావు. [5]శుక్రా=ప్రకాశవంతమైన సోమదేవతా స్వరూపము, అసి=అగుచున్నావు. [6]చన్ద్రా=ఆహ్లాదకరమైన సువర్ణస్వరూపము, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: వసురుద్రాదిత్యులు సవనత్రయ దేవతలు. అదితి ప్రాయణీయేష్టికి, ఉదయనీయేష్టికిని దేవత. ఓ సోమక్రయణీ! నీవు వసురుద్రాదిత్యాదుల స్వరూపమవు. (యజమానుఁడు ఈ మంత్రముయొక్క షడ్భాగములను జెప్పుచు సోమక్రయణియైన గోవు నడచునపుడు వేయు నడుగుల గుర్తుల నాతింటియందు తన యడుగులను వేయుచుఁబోవలెను. ప్రాయణీయేష్టి సోమ యాగారంభమునందు, ఉదయనీయేష్టి అంతమునందు జేయఁబడును.)

2. అర్థము: (హే సోమక్రయణీపాదః=ఓ సోమక్రయణియొక్క పాదమా!) త్వా=నిన్ను, బృహస్పతిః=బృహస్పతి, సుమ్నే=(ఈ)సుఖప్రదేశమునందు, రణ్వతు=సంతోషపెట్టుఁగాక. వసుభిః=వసుదేవతలతోఁగూడ, రుద్రః=రుద్రదేవుఁడు, త్వా=నిన్ను, అచికేతు=గుర్తించుఁగాక.

తాత్పర్యము: ఓ సోమక్రయణియగు గోవుయొక్కపాదమా! నిన్ను సుఖకరమైన యీ ప్రదేశమునందు బృహస్పతి సంతోషపెట్టుగాక. వసుదేవతలతోఁగూడ రుద్రుఁడు నిన్ను గుర్తించుఁగాక. (సోమక్రయణియొక్క యెడవ అడుగు గుర్తును దోసిలితో గ్రహించవలెను.)

3. అర్థము: (హే ఘృత!=ఓ ఆజ్యమా!) త్వా=నిన్ను, పృథివ్యాః=భూమికి, మూర్ధన్=శిరస్స్థానీయమును, దేవయజనే=దేవతల యాగమునకు స్థానమైనదియు, ఘృతవతి=నేతితోఁగూడినదియునగు, ఇడాయాః=సోమక్రయణియొక్క, పదే=అడుగు(గుర్తు)నందు, ఆజిఘర్మి=అంతటను స్రవింపఁజేయుచున్నాను. స్వాహా=(ఈ ఆజ్యము)హుతమగుఁగాక.

తాత్పర్యము: ఓ ఆజ్యమా! పృథివికి శిరస్స్థానీయమును, దేవతాయాగస్థానమును, నేతితోఁగూడియున్నదియునగు సోమక్రయణియొక్క అడుగు గుర్తునందు నిన్ను స్రవింపఁ జేయుచున్నాను. ఈ ఆజ్యము హుతమగుఁగాక. (యజమానుఁడు సోమక్రయణియొక్క యెడవ అడుగుగుర్తునందు హిరణ్యము నుంచి ఆజ్యమును హోమము చేయవలెను.)

4. అర్థము: రక్షః=రాక్షసజాతి, పరిలిఖితమ్=నశింపఁజేయఁబడినది, (భవతు=అగుఁగాక) అరాతయః=శత్రువులు, పరిలిఖితాః=నశింపఁజేయఁబడినవారు, (భవన్తు=అగుదురుగాక) అహమ్=నేను, రక్షసః=రాక్షసజాతి యొక్క, గ్రీవా అపి=కంఠములనుగూడ, ఇదం కృన్తామి=ఇదిగో ఛేదించుచున్నాను. యః=ఎవఁడు, అస్మాన్=మమ్ము, ద్వేష్టి=ద్వేషించుచున్నాఁడో, చ=మఱియు, యమ్=ఎవనిని, వయమ్=మేము, ద్విష్మః=ద్వేషించుచున్నామో, అస్య=వీనియొక్క, గ్రీవా అపి=కంఠములనుగూడ, ఇదం కృన్తామి=ఇదిగో ఛేదించుచున్నాను.

తాత్పర్యము: రాక్షసజాతి, శత్రువులును నశింపఁజేయఁబడుదురుగాక. ఇదిగో నేను రాక్షసుల కంఠములను ఛేదించుచున్నాను. మమ్ము ద్వేషించువాని యొక్కయు, మేము ద్వేషించువారి యొక్కయు కంఠములనుగూడ ఇదిగో ఛేదించుచున్నాను. ('ఇదమ్' అను పదము హస్తనిర్దేశమునకు సూచకము. బంగారు శలాకచేత గాని, జింక కొమ్ముతోఁగాని సోమక్రయణియొక్క అడుగు గుర్తుగల ప్రదేశమును పెకలించి అంతటను గీయవలెను.)

5. అర్థము: అస్మే=ఈ అధ్వర్యునియందు, రాయః=రజోరూప ధనము (తిష్ఠతు=ఉండుఁగాక) త్వే=నీ యందు (=యజమానుని యందు) రాయః=రజోరూప ధనము (తిష్ఠతు) తోతే=(యజమానుని) భార్యయందు, రాయః=రజోరూప ధనము, (తిష్ఠతు) రజస్సు=ధూళి).

తాత్పర్యము: అధ్వర్యు యజమాన, యజమాన పత్నులయొద్ద రజోరూప ధనముండుగాఁక. (సోమక్రయణియొక్క యెడవ అడుగు గుర్తుగల ప్రదేశమునందలి నేతితోతడిసిన ధూళిని స్థాలియందుంచి 'త్వేరాయః' అని యజమానునకును, 'తోతేరాయః' అని యజమానుని భార్యకును అధ్వర్యుఁ డీయవలెను.

విశేషములు: 'అస్మిన్' అను పదమునకు సమానార్థకముగా 'అస్మే' అను వైదిక పదము ప్రయుక్తమైనది. ఇట్లే 'తోతే' అను పదము వైదికము.

6. అర్థము: హే (సోమక్రయణి!) దేవి!=ఓ సోమక్రయణి దేవీ!, (త్వమ్=నీవు) ఉర్వశ్యా దేవ్యా=ఉర్వశీదేవితోఁగూడ, సంపశ్యస్వ=(యజమానుని భార్యను) బాగుగఁ జూడుము.

తాత్పర్యము: ఓ సోమక్రయణీదేవీ! నీవు ఉర్వశీ దేవితోఁగూడ యజమానుని భార్యను బాగుగఁ జూడుము (యజమానుఁడు సోమక్రయణిచేతఁ దన భార్యను జూపించవలెను. 'పశ్య' అని లౌకిక సంస్కృతము. 'పశ్యస్వ' అను పదము వైదికము.)

7. అర్థము: (హే యజమాన!=ఓ యజమానుఁడా!) త్వష్టీమతీ=త్వష్టృప్రజాపతి యనుగ్రహము కలదానను, సురేతాః= అమోఘమైన స్వీయరేతస్సు కలదానను, రేతః=(పతియొక్క) రేతస్సును, దధానా=ధరించుచున్నదాననునై, తే=నీతో(తృతీయార్థమున షష్ఠి) సపేయ=కలిసికొందును. (అపి చ=మఱియు) తవ=(భర్తవైన), నీకు, సదృశీ=సమానమైన గుణములుకల, వీరమ్=శూరుఁడైన కుమారుని, విదేయ=పొందెదను.

తాత్పర్యము: ఓ యజమానుఁడా! త్వష్టృప్రజాపతి యనుగ్రహమును బొంది అమోఘమైన రేతస్సు కలదాననై నీ రేతస్సును ధరించి నీతోఁగలిసికొందును. మఱియు నీకు సదృశములైన గుణములుగల వీరుఁడైన కుమారుని పొందెదను. (యజమానుని పత్ని ఈ మంత్రము పఠించుచు యజమానుని చూడవలెను. మనుష్యులలోను, పశువులలోను స్త్రీ పురుష మిథునములను త్వష్టృ ప్రజాపతి నిర్మించును గావున ఆ త్వష్టృ ప్రజాపతి యనుగ్రహము కలదానవని చెప్పఁబడినది.)

8. అర్థము: అహమ్=నేను (యజమానపత్ని) రాయస్పోషేణ=ధనసమృద్ధిచేత, మా వియోషమ్=విడువఁబడుదానను గాను.

తాత్పర్యము: నేను ధనసమృద్ధిచే వియుక్తురాలను గాను. ధన సమృద్ధి కలిగి యుందునని భావము. (యజమానపత్ని సోమక్రయణిని జూడవలెను.)

పంచమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ద్వితీయప్రపాఠకే షష్ఠోఽనువాకః (సోమోన్నాన ప్రకరణము)

మూలము: [1]అగ్ంశునా తే అగ్ంశుః పృచ్యతాం పరుషా పరు ర్గన్ధ స్తే కామ మవతు మదాయ రసో అచ్యుతో ఽమాత్యో ఽసి శుక్ర స్తే గ్రహః [2]ఽభి త్యం దేవగ్ం సవితార మూణ్యోః కవి క్రతు మర్చామి సత్యసవసగ్ం రత్నధా మభిప్రియం మతి మూర్ధ్వా యస్యా మతి ర్భా అదిద్యుత త్స వీమని హిరణ్యపాణి రమిమీత సుక్రతుః కృపా సువః। [3]ప్రజాభ్య స్త్వా ప్రాణాయ త్వా వ్యానాయ త్వా ప్రజా స్త్వ మను ప్రాణిహి ప్రజా స్త్వా మను ప్రాణన్తు॥౧॥

(అను స ప్త చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయసంహితాయాం ప్రథమాష్టకే ప్రథమప్రపాఠకే షష్ఠోఽనువాకః

వేదార్థదీపిక

అవతారిక: పంచమానువాకమునందు సోమక్రయణికి మార్గమధ్యమందు పదసంగ్రహము వర్ణింపబడినది. ఈ షష్ఠానువాకమునందు ఉన్మానపూర్వకముగ సోమక్రయము చెప్పబడుచున్నది. సోమలతయొక్క నిడివిని గొలుచుట ఉన్మానము. క్రయము= కొనుట.

1. అర్థము: (హే సోమః=ఓ సోమలతా!) తే=నీయొక్క అంశునా=(ఒక) సూక్ష్మావయవముతో, అంశుః=(మఱియొక) అవయవము, పృచ్యతామ్=కలిసికొనుఁగాక. పరుషా=(ఒక) కణుపుతో, పరుః=(మఱియొక) కణుపు, (పృచ్యతామ్=కలిసికొనుగాక) తే=నీయొక్క, గంధః=వాసన, కామమ్=(యజమానుని) కోరికను, అవతు=రక్షించుఁగాక. రసః=(నీయొక్క) రసము, మదాయ=(దేవతల) హర్షముకొఱకు, అచ్యుతః=నాశరహితము, (భవతు=అగుఁగాక) (త్వమ్=నీవు) అమాత్యః=కొలుచుటకు సాధ్యముకాని దానవు, అసి=అగుచున్నావు. తే=నీయొక్క గ్రహః=స్వీకారము, శుక్రః=హిరణ్య సాధ్యము.

తాత్పర్యము: ఓ సోమలతా! నీలోని యొక సూక్ష్మావయవముతో మఱియొక అవయవమును, ఒక కణుపు (=పర్వము) తో మఱియొక కణుపును కలిసికొనుఁగాక. (ఏ అవయవము కూడ వాయ్వాదుల తాకిడి వలన నశింపకుండుఁగాక.) నీ గంధము యజమానుని కోరికను రక్షించుఁగాక. నీ రసము దేవతల సంతోషము కొఱకు నాశము లేనిదగుఁగాక. బంగారము వలన నిన్ను గ్రహించుట సాధ్యమగును. (అధ్వర్యుఁడు హిరణ్యపాణితో సోమలతను స్పృశించవలెను.)

2. అర్థము: యస్య=ఏ సవితృదేవునియొక్క, ఊర్ధ్వా=ఊర్ధ్వలోక వర్తినియగు, భాః=కాంతి, అమతిః=మననము చేయుటకు సాధ్యముకానిదై, అదిద్యుతత్=ప్రకాశించుచున్నదో, ఊణ్యోః=ద్యావాపృథివీ రూపములైన హస్తములకు, సవితారమ్=ప్రేరకుఁడును, కవిక్రతుమ్=వేదార్థ విదుల యాగములు కలవాఁడును, సత్య సవసమ్=సత్యమైన ప్రేరణ కలవాఁడును, (ఫలపర్యంతమైన ప్రేరణ కలవాఁడని భావము) రత్నధామ్=రత్నములను ధరించువాఁడును, అభిప్రియమ్=ప్రత్యక్షముగ నందఱకు ప్రియమైన వాఁడును, మతిమ్=(అందఱిచే) మననము చేయఁబడువాఁడునునగు, త్యం దేవమ్=ఆ సవితృ దేవుని, అభ్యర్చామి=అంతటను పూజించుచున్నాను. సువః=స్వర్గలోక వర్తియును, సుక్రతుః=మంచి యాగము కలవాఁడునైన, సః=ఆ దేవుఁడు కృపా=దయతో, ఏమని=వచ్చి, హిరణ్యపాణిః=బంగారము చేతియందుఁగలవాఁడై, అమిమీత=సోమలతను కొలుచుఁగాక, (అమిమీత=లోడర్థమున లఙన్తము ప్రయుక్తమైనది. అదిద్యుతత్=వర్తమానార్థమున లుఙ్ప్రయుక్త మైనది.)

తాత్పర్యము: ఊర్ధ్వలోకమునందలి సూర్యుని కాంతి తలఁచుటకుఁగూడ సాధ్యముకానిదై ప్రకాశించుచుండును. ఆ సూర్యుఁడు ద్యావాభూము లనెడి హస్తములతో ప్రేరణ చేయుచుండును. వేదార్థ విదులు చేయు యాగము నందుండును. ఫలము కలుగునంతవరకు కర్మలను ప్రోత్సహించుచుండును. అందఱకు ప్రత్యక్షముగఁ గనుపించుటచే ప్రియమైనవాఁడు. అందఱు అతనిని ధ్యానించుచుందురు. అటువంటి సవితృ దేవుని నేను పూజించుచున్నాను. అట్టి సవితృదేవుఁడు హిరణ్యపాణియై దయతో నాయొద్దకు వచ్చి సోమలతను కొలువవలె నని ప్రార్థించుచున్నాను. (అధ్వర్యుఁడు యథావిధిగ సోమలతను కొలువవలెను. ఉన్మానము=కొలుచుట)

3. అర్థము: (హే సోమశేష!=ఓ సోమలతాశేషమా!) త్వా=నిన్ను, ప్రజాభ్యః=ప్రజలకొఱకు, (సమూహామి=ప్రోగుచేయు చున్నాను.) ప్రాణాయ=ప్రాణముకొఱకు, త్వా=నిన్ను, (ఉపనహ్యామి=మూట గట్టుచున్నాను) వ్యానాయ=వ్యానవాయువు కొఱకు, త్వా=నిన్ను (విస్రంసయామి=విప్పుచున్నాను.) త్వమ్=నీవు, ప్రజాః=ప్రజలను, అను ప్రాణిహి=అనుసరించి జీవించుము. ప్రజాః=ప్రజలు, త్వామ్ అను=(జీవన్తు) నిన్ను అనుసరించి జీవింతురుగాక.

తాత్పర్యము: కొలువగా మిగిలిన సోమమా! ప్రజల నిమిత్తము నిన్ను ప్రోగుచేయు చున్నాను. ప్రాణము కొఱకు నిన్ను మూట కట్టుచున్నాను. వ్యానవాయువు కొఱకు నిన్ను విప్పుచున్నాను. ప్రజల ననుసరించి నీవు జీవించుము. నిన్ను అనుసరించి ప్రజలు జీవింతురుగాక (అధ్వర్యుఁడు కొలువగా మిగిలిన సోమమును ప్రోగుచేసి మూట కట్టి మఱల నూడదీయవలెను.)

షష్ఠానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ద్వితీయప్రపాఠకే సప్తమోఽనువాకః (సోమక్రయ ప్రకరణము)

మూలము: [1]సోమం తే క్రీణామ్యూ ర్జస్వన్తం పయస్స్వన్తం వీర్యావన్త మభిమాతిషాహగ్ం శుక్రం తే శుక్రేణ క్రీణామి చంద్రం చంద్రేణా మృత మమృతేన సమ్య త్తే గో [2]రస్మే చంద్రాణి [3]తపస స్తనూ రసి ప్రజాపతే ర్వర్ణ స్తస్యా స్తే సహస్రపోషం పుష్యన్త్యా శ్చరమేణ పశునా క్రీణా మ్యస్మే తే బన్ధు ర్మయి తే రాయ శ్శ్రయన్తా [4]మస్మే జ్యోతి [5]స్సోమ విక్రయణి తమో [6]మిత్రో న ఏహి సుమిత్రధా ఇన్ద్రస్యో రు మావిశ దక్షిణ ముశ న్నుశన్తగ్ం స్యోనః స్యోనగ్ం [7]స్వాన భ్రాజా ఙ్ఘారే బమ్భారే హస్త సుహస్త కృశాన వేతే వః సోమ క్రయణా స్తాన్ రక్షధ్వం మా వో దభన్ ॥౧॥ (ఉరుం ద్వావిగ్ంశతి శ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ద్వితీయప్రపాఠకే సప్తమోఽనువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: షష్ఠానువాకమునందు సోమోన్నానము చెప్పఁబడినది. ఈ సప్తమా నువాకమునందు సోమక్రయము (సోమమును కొనుట) చెప్పఁబడుచున్నది.

1. **అర్థము:** (హే సోమవిక్రయిన్!=ఓ సోమవిక్రేతా!, అహమ్=నేను) ఊర్జస్వన్తమ్=శరీరమునకు బలకరమైనదియు, పయస్వన్తమ్=అధిక రసము కలదియు, వీర్యావన్తమ్=ఇంద్రియపాటవ హేతువును, అభిమాతిషాహమ్=పాప మనెడి శత్రువును నశింపఁజేయునదియు, శుక్రమ్=తేజోవంతమునగు, తే=నీయొక్క, సోమమ్=సోమ మును, శుక్రేణ=తేజోవంతమైన హిరణ్యముచేత, క్రీణామి=కొనుచున్నాను. చంద్రమ్=సుఖకరమైన(నీ) సోమమును, చంద్రేణ=సుఖకరమైన హిరణ్యముచేత, క్రీణామి=కొనుచున్నాను. అమృతమ్=నాశ రహిత మైన(నీ)సోమమును, అమృతేన=నాశ రహిత హిరణ్యముచేత, క్రీణామి=కొనుచున్నాను. తే=నీ కొఱకు, గోః=గోవుయొక్క, సమ్యత్=సమీచీనమైన ఒక సంవత్సరము వయస్సుగల రూపము(=గోవు), దత్తమ్= ఈయఁబడినది. (సోమవిక్రేత=సోమమును అమ్మువాఁడు.)

తాత్పర్యము: ఓ సోమవిక్రేతా! నీ సోమమును హిరణ్యము నిచ్చి కొనుచున్నాను. సోమము శరీర బలకరమైనది. అధిక రసము కలది. ఇంద్రియ పాటవమును గలుగఁజేయునది. పాపమును ఫోగొట్టునది. తేజోవంతము, సుఖ కరము, నాశరహితము నైనది. నేనిచ్చు హిరణ్యముకూడ తేజోవంతము, సుఖకరము, నాశరహితము నైనది. తేజస్సుఖాదులు సోమహిరణ్యముల రెండింటియందు సమానముగానే ఉన్నవి. కావున హిరణ్యముతో సోమ మును కొనుట న్యాయమే. కేవలము హిరణ్యమేకాక ఒక సంవత్సరము వయస్సుతోఁగూడిన దూడగల ఆవు కూడ నీ కివ్వఁబడినది. కావున ఈ హిరణ్యము నీకు అదనపు లాభము. (సోమవిక్రేతకు హిరణ్యమునిచ్చి సోమమును కొనవలెను.)

2. అర్థము: చన్ద్రిణి=బంగారములు, అస్మే=మాయందే, (తిష్ఠన్తు=ఉండుఁగాక.)

తాత్పర్యము: సోమవిక్రేతకు సోమము కొనుటకై యిచ్చిన బంగారము మాయందే ఉండుఁగాక. (ఈ మంత్రము చెప్పుచు సోమవిక్రేతనుండి బంగారమును దీసికొనవలెను.)

3. అర్థము: (హే అజే!=ఓ మేకా! త్వమ్=నీవు) తపసః=పుణ్యముయొక్క, తనూః=శరీరము, అసి=అగుచున్నావు. ప్రజాపతేః=ప్రజాపతికి, వర్ణః=దేహము, అసి=అగుచున్నావు. సహస్రపోషం పుష్యన్త్యాః=సహస్ర సంఖ్యాకముగ సంతానమును పోషించుచున్న, తస్యాః=ఆ, తే=నీ యొక్క, చరమేణ=చివరిదైన, పశునా=పశువుచేత, క్రీణామి=(సోమమును) కొనుచున్నాను. అస్మే=నేను, తే=నీకు, బన్ధుః=బంధువును. మయి=నాయందు, తే=నీ యొక్క, రాయః=అపత్యరూప ధనములు, శ్రయన్తామ్=ఉండుఁగాక. ('అస్మే' అనునది వేదమున సప్తమ్యర్థమునను, ప్రథమార్థమునను ప్రయుక్తమైనది.)

తాత్పర్యము: ఓ మేకా! నీవు పుణ్యముయొక్క మూర్తివి. ప్రజాపతియొక్క దేహమవు. నీవు అపత్య పరంపరచే ననేక సంతానములను పోషించుచున్నావు. ఆ విధముగ అపత్యములను పోషించుచున్న నీ చరమ సంతానమైన పశువుచేత నేను సోమమును కొనుచున్నాను. (నీవలన లభ్యమైన సోమముయొక్క కర్మయందు ప్రవర్తించుటచే) నేను నీకు బంధువును. నీకు సంబంధించిన అపత్యరూప ధనములు నా యొద్ద ఉండుఁగాక. (యజ్ఞనిష్పాదక సోమము ద్యులోకమునందు మేకచే నవరోధింపఁబడుటచే మేక పుణ్యమూర్తి. ప్రజాపతివలె నజ సర్వదేవాత్మక కావున మేక ప్రజాపతికి దేహము. సహస్రసంఖ్యాకం పోషయిత్వా=సహస్రపోషమ్. ఇది ణముల్ ప్రత్యయాన్తము. ఈ మంత్రము చెప్పుచు మేక నిచ్చి సోమమును కొనవలెను.)

4. అర్థము: జ్యోతిః=జ్యోతిస్స్వరూపమైన ఊర్ణాస్తుక, అస్మే=మాయందు, అవతిష్ఠతామ్=ఉండుఁగాక. (గొఱ్ఱెబొచ్చుతోఁ జేయఁబడిన దారము ఊర్ణాస్తుక.)

తాత్పర్యము: జ్యోతిస్స్వరూపమైన తెల్లని ఊర్ణాస్తుక మాయొద్ద ఉండుఁగాక. (యజమానునకు ఊర్ణాస్తుక నీయవలెను.)

5. అర్థము: తమః=నల్లని యూర్ణాస్తుక, సోమవిక్రయిణి=సోమవిక్రేతయందు, (అవతిష్ఠతామ్=ఉండుఁగాక.)

తాత్పర్యము: నల్లని యూర్ణాస్తుక సోమమునమ్మినవానియొద్ద ఉండుఁగాక. (ఈ మంత్రము చెప్పుచు నల్లని యూర్ణాస్తుకను సోమవిక్రేత కీయవలెను.)

6. అర్థము: (హే సోమ!=ఓ సోమమా!) సుమిత్రధాః=మంచి మిత్రునిఁగలిగియున్న, (త్వమ్=నీవు) నః=మాకు మిత్రః=మిత్రుఁడవుగా, ఏహి=రమ్ము, స్యోనః=సుఖకరమైన, (త్వమ్=నీవు) ఉశన్తమ్=కోరుచున్నదియు, స్యోనమ్=సుఖకరమైనదియునగు, ఇన్ద్రస్య=యజమానునియొక్క, దక్షిణమూరుమ్=కుడితొడను, (కోరుచున్నదానవై) ఆవిశ=ప్రవేశించుము. (కుడితొడపైనుండుము.)

తాత్పర్యము: ఓ సోమమా! (నన్ను) మంచి మిత్రునిగాఁగలిగియున్న నీవు నాకు మిత్రుఁడవుగా రమ్ము. సుఖకరమైన నీవు సుఖకరమైన యజయానుని కుడితొడను కోరుచున్నదానవై ఆ తొడపైనుండుము. (సోమవిక్రేత నుండి సోమమును దీసికొని యజమానుని తొడపై దక్షిణభాగమున నుంచవలెను.)

7. అర్థము: హే స్వాన! హే భ్రాజ! హే అఙ్ఘారే! హే బమ్భారే! హే హస్త! హే సుహస్త! హే కృశానో!=ఓ స్వానాది సప్త సూర్యమండలములారా! ఏతే=ఈ గవాదులు, సోమక్రయణాః=సోమమును కొనుటకు మూల్యములైన ద్రవ్యములు. తాన్=ఆ గవాదులను, రక్షధ్వమ్=రక్షింపుఁడు. వః=మిమ్ము, మా ఉదభన్ వా=(ఏశత్రువులు) హింసింపకుందురుగాక.

తాత్పర్యము: స్వాన, భ్రాజాదులు ఏడును సూర్యమండలములు. ఆ సూర్యమండలము లేడును సోమమును కొనుటకు మూల్యములైన గో హిరణ్యాదులను రక్షించవలెననియు, ఆ సూర్యమండలములను ఏ శత్రువులును హింసింపకుందురుగాక యనియు ఈ మంత్రమున ప్రార్థింపఁబడినది. (స్వాన భ్రాజాదులను సంబోధించుచు ఈ మంత్రము నుచ్చరింపవలెను.)

సప్తమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ద్వితీయప్రపాఠకే అష్టమోఽనువాకః।

మూలము: ఉదాయుషా స్వాయుషో దోష ధీనాగ్ం రసేనో త్పర్జన్యస్య శుష్మేణో దస్థా మమృతాగ్ం అను। [2]ఉర్వ న్తరిక్ష మన్వి [3]హ్యదిత్యా స్సదో ఽస్యా దిత్యా స్సద ఆసీ దా స్తభ్నా ద్ద్యా మృషభో అన్తరిక్ష మమిమీత వరిమాణం పృథివ్యా ఆసీద ద్విశ్వా భువనాని సమ్రా డ్విశ్వేత్తాని వరుణస్య వ్రతాని [4]వనేషు వ్యన్తరిక్షం తతాన వాజ మర్వత్సు పయో అగ్నియా సుహృత్సు (౧) క్రతుం వరుణో విక్ష్వ గ్నిం దివి సూర్య మదధా త్సోమ మద్రా [5]వుదుత్యం జాతవేదసం దేవం వహన్తి కేతవః। దృశే విశ్వాయ సూర్యమ్ ।[6]ఉస్రా వేతం ధూర్షాహౌ వన్రశూ అవీరహణౌ బ్రహ్మ చోదనౌ [7]వరుణస్య స్కమ్భన మసి వరుణస్య స్కమ్భసర్జన మసి ప్రత్యస్తో వరుణస్య పాశః ॥౮॥ (హృత్సు పఞ్చత్రిగ్ం శ చ్చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయసంహితాయాం ప్రథమాష్టకే ద్వితీయప్రపాఠకే ఽష్టమోఽనువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: సప్తమానువాకమునందు సోమక్రయణము విహితమైనది. ఈ యష్టమా నువాకమునందు ఆ సోమమును ప్రాచీనవంశ మనెడి పేరుగల యజ్ఞశాలయొద్దకుఁ దీసికొనిపోవుటకై సోమమును శకటముపై నెక్కించుట చెప్పఁబడుచున్నది.

1. **అర్థము:** అమృతాన్ + అను = దేవతలను లక్ష్యముగాఁ జేసికొని, (అహమ్ = నేను) ఆయుషా = (ఆయుఃప్రదమగుటచే) ఆయూరూప సోమముతోఁగూడ, ఉదస్థామ్ = (ఉత్ + అస్థామ్) పైకి లేచుచున్నాను. స్వాయుషా = రోగాద్యుపద్రవ రహిత సోమముతోఁగూడ, ఉదస్థామ్ = పైకి లేచుచున్నాను. ఓషధీనామ్ = ఓషధుల యొక్క, రసేన = సారమైన సోమముతోఁగూడ, ఉదస్థామ్ = పైకి లేచుచున్నాను. పర్జన్యస్య = మేఘము యొక్క, శుష్మేణ = సారమైన సోమముతోఁగూడ, ఉదస్థామ్ = పైకి లేచుచున్నాను. (ఉదస్థామ్ = ఉత్తిష్ఠామి. ఆయుషా, స్వాయుషా – ఇత్యాది చతుర్విశేషణములతో వేర్వేరుగా క్రియాపదము నన్వయింపఁజేయుటకై 'ఉత్' అను ఉపసర్గము నాలుగు మారులు ఆవృత్తమైనది.)

తాత్పర్యము: యజమానుఁడనైన నేను దేవతలను లక్ష్యముగాఁ జేసికొని ఆయుఃప్రదమును రోగాద్యుపద్రవ రహితమును ఓషధుల యొక్కయు మేఘము యొక్కయు సారమునైన సోమముతోఁగూడ పైకి లేచుచున్నాను. (యజమానుఁడు సోమముతోఁ గూడ లేవవలెను.)

విశేషములు: జీవనము ఆయు వనియు, రోగాదులు లేని ఆయువు స్వాయు వనియు భావము. సోమము ఆయువును స్వాయువును గూడ నిచ్చును, గావున సోమమునకు తదుభయరూపత్వము చెప్పఁబడినది. ఇతరములైన ఓషధుల వలెనే సోమముకూడ భూమియందు మొలచుట చేతను, వర్షముచేత వృద్ధినొందుట చేతను, అది ఓషధుల సారముగాను, పర్జన్య సారముగాను వర్ణింపఁబడినది.

2. అర్థము: (హే సోమ!=ఓ సోమమా! త్వమ్=నీవు) ఉరు=గొప్పదైన (=విశాలమైన) అన్తరిక్షమ్=ఆకాశమును, అన్విహి=అనుసరించి పొమ్ము. (అను + ఇహి)

తాత్పర్యము: ఓ సోమమా! నీవు ఆకాశమున పొమ్ము. అనఁగా సోమము యాగశాలకు బండిపైని తీసికొని పోఁబడును. కావున దానికి భూమి యాధారము గాక, యాకాశమే ఆధారమైనదని భావము. (యజమానుఁడు సోమమును బండి యొద్దకుఁ దీసికొని పోవలయును.)

3. అర్థము: (హే కృష్ణాజిన!=ఓ కృష్ణాజినమా! త్వమ్=నీవు) అదిత్యాః=భూమికి, సదః=స్థానము, అసి=అగుచున్నావు. (హే సోమ!=ఓ సోమమా!, త్వమ్=నీవు) అదిత్యాః=భూమి యొక్క, సదః=స్థానమును (కృష్ణాజినమును) ఆసీద=పొందుము. ఋషభః=శ్రేష్ఠమైన సోమము, ద్యామ్=ద్యులోకమును, అస్తభ్నాత్=(క్రింద పడకుండునట్లు) స్తంభింపఁజేసెను. అన్తరిక్షమ్=ఆకాశమును (ఆకాశపరిమాణమును) పృథివ్యాః=భూమి యొక్క, పరిమాణమ్=గురుత్వమును (బరువును) అమిమీత=కొలిచెను. (సః=ఆ సోమదేవుఁడు) సమ్రాట్=బాగుగఁ బ్రకాశించుచున్నవాఁడై, విశ్వా=సమస్తములైన, భువనాని=లోకములను, ఆసీదత్=వ్యాపించెను. విశ్వేత్తాని=ఆ సమస్త కర్మలు, వరుణస్య=వరుణ నామము గల సోమదేవునకు, వ్రతాని=వ్రతములవలె నియతములైనవి.

తాత్పర్యము: ఓ కృష్ణాజినమా! నీవు భూమికి స్థానము. ఓ సోమమా! నీవు ఆ భూమియొక్క స్థానమైన కృష్ణాజినమును పొందుము. శ్రేష్ఠమైన సోమము ద్యులోకమును పడకుండునట్లు స్తంభింపఁజేసెను. ఆకాశము యొక్క పరిమాణమును, భూమి యొక్క బరువును కొలిచెను. ఆ సోమదేవుఁడు తన మహిమచేతఁ బ్రకాశించుచున్నవాఁడై సమస్త లోకములను వ్యాపించెను. సర్వకర్మలు వరుణుఁ డను పేరు గల సోమదేవునకు వ్రతముల వలె నియతములు. (బండి పైని కృష్ణాజినము నుంచి దానిపైని సోమము నుంచవలెను.)

4. అర్థము: వరుణః=వరుణుఁ డనుపేరు గల సోమదేవుఁడు, వనేషు=వృక్షముల యందు, అన్తరిక్షమ్=అవకాశమును, వ్యతతాన=విస్తరింపఁజేసెను. అర్వత్సు=అశ్వముల యందు, వాజమ్=వేగముతోఁ గూడిన గమనమును, (వ్యతతాన=వృద్ధిచేసెను.) అగ్నియాసు=గోవుల యందు, పయః=క్షీరమును, హృత్సు=చిత్తములందు, క్రతుమ్=సంకల్పమును, (వ్యతతాన=వృద్ధిచేసెను.) విక్షు=మనుష్యులయందు, అగ్నిమ్=జఠరాగ్నిని, అదధాత్=స్థాపించెను.) దివి=ద్యులోకమునందు, సూర్యమ్=సూర్యుని, అద్రౌ=పర్వతమునందు, సోమమ్=సోమలతను, (అదధాత్=స్థాపించెను.)

తాత్పర్యము: వరుణ నామకుఁడైన జగదీశ్వరుఁడు వృక్షములయం దవకాశమును, అశ్వముల యందు వేగముతోఁ గూడిన గమనమును, గోవులయందు క్షీరమును, మనస్సులందు సంకల్పమును వృద్ధిచేసెను. మనుష్యుల యందు జఠరాగ్నిని, ద్యులోకమునందు సూర్యుని, పర్వతమునందు సోమలతను స్థాపించెను. (ఈ మంత్రము చెప్పుచు బండిపై నున్న సోమమును వస్త్రముచేత చుట్టవలెను. ''విట్'' అను శబ్దమునకు_ 'విక్షు' అనునది సప్తమ్యంతము.)

5. అర్థము: కేతవః=కిరణములు, విశ్వాయ దృశే=ప్రపంచము యొక్క దర్శనము కొఱకు, జాతవేదసమ్=ఉత్పన్నమైన జగత్తును తెలిసికొనునట్టి, త్యమ్=ఆ (=పరోక్షమున నున్న) సూర్యం దేవమ్=సూర్యదేవుని, ఉరు వహన్తి=ఊర్ధ్వప్రదేశమును పొందించుచున్నవి.

తాత్పర్యము: కిరణములు సర్వప్రపంచమును చూచుటకై ఉత్పన్నమైన జగత్తును తెలిసికొనునట్టి పరోక్షభూతుఁడైన సూర్య దేవుని ఊర్ధ్వప్రదేశమునకు కొనిపోవుచున్నవి. (ఈ మంత్రము చెప్పుచు కృష్ణాజినమును సోమముపై కప్ప వలెను.)

6. అర్థము: ధూర్షాహౌ=బరువును సహించునవియు, అనస్రుూ=శకటమునందు ప్రసిద్ధములును, అవీరహణౌ=బాధించ నవియు, బ్రహ్మచోదనౌ=(కృషి ముఖమున) అన్నమును గలుగఁజేయునవియునగు, హే ఉస్రౌ=ఓ వృషభములారా! (యువామ్=మీరు) ఏతమ్=రండు. (ఆ+ఇతమ్=ఏతమ్. 'ఇణ్=గతౌ'. బ్రహ్మ= అన్నము. తాత్పర్యము సులభము. ఈ మంత్రము చెప్పుచు సోమము నుంచిన శకటమును లాగుటకు ఎద్దులను తీసికొని రావలెను.)

7. అర్థము: (హే శమ్యే=ఓ శమ్యా!, త్వమ్=నీవు) వరుణస్య=వారింపఁదగిన వృషభమునకు, స్కమ్భనమ్=నివారణము, అసి=అగుచున్నావు. హే యోక్త్రే=(ఓ యోక్త్రమా!, త్వమపి=నీవు కూడ) వరుణస్య=పారిపోవుటనుండి వారింపఁ దగిన వృషభమునకు, స్కమ్భ సర్జనమ్=నివారణమును సృజించు దానవు, అసి=అగుచున్నావు. వరుణస్య=వారింపఁదగిన యెద్దు యొక్క, పాశః=(పొడవైన) త్రాడు, ప్రత్య స్తః=(శకటముపై) వణచఁ బడినది.

తాత్పర్యము: (శమ్యా=బండి కాడిరంధ్రమున నుంచఁబడు చిడుత; యోక్త్రమ్=ఎద్దు మెడయందు తగిలించెడి త్రాడు.) ఓ శమ్యా! నీవు ఎద్దును నివారించుదానవు. ఓ యోక్త్రమా!,నీవు ఎద్దును పారిపోకుండ నివారించుదానవు. పొడవైన త్రాడు శకటముపైని వణచఁబడినది. (ప్రథమమున శకటము దక్షిణ భాగమున ఎద్దును కట్టి కాడి రంధ్రమునందు చిడుతను దూర్చి యెద్దు మెడకు త్రాడు కట్టవలెను.)

అష్టమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ద్వితీయప్రపాఠకే నవమోఽనువాకః।

మూలము: [1]ప్రచ్యవస్వ భువస్పతే విశ్వా న్యభి ధామాని మా త్వా పరిపరీ విద న్మా త్వా పరిపన్థినో విద న్మా త్వా వృకా అఘాయవో మా గన్ధర్వో విశ్వావసు రా దఘ చ్ఛ్యేనో భూత్వా పరాపత యజమానస్య నో గృహే దేవై స్సగ్ంస్కృతం యజమానస్య స్వస్త్యయ న్య స్య పి పన్థా మగన్మహి స్వస్తిగా మనేహసం యేన విశ్వాః పరి ద్విషో వృణక్తి విన్దతే వసు [2]నమో మిత్రస్య వరుణస్య చక్షసే మహో దేవాయ తదృ తగ్ం సపర్యత దూరేదృశే దేవజాతాయ కేతవే దివస్పుత్రాయ సూర్యాయ శగ్ంసత [3]వరుణస్య స్కమ్భన మసి వరుణస్య స్కమ్భ సర్జన మస్యు న్ముక్తో వరుణస్య పాశః ॥౧॥ (మిత్రస్య త్రయోవిగ్ంశతి శ్చ)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ద్వితీయప్రపాఠకే నవమోఽనువాకః॥

వేదార్థ దీపిక

అవతారిక: అష్టమానువాకమునందు శకటమునందు సోమము నుంచుట చెప్పఁబడినది. సోమము నుంచిన శకటము యజ్ఞశాలకుఁబోవుట గుఱించి ఈ నవమానువాకమునందుఁ జెప్పఁబడుచున్నది.

1. **అర్థము:** హే భూతపతేః=యజమానాదులకు పాలకుఁడవైన ఓ సోమమా!, విశ్వాని=సమస్తమైన, ధామాని అభి=ప్రాచీన వంశ హవిర్ధానాది స్థానముల నుద్దేశించి, ప్రచ్యవస్వ=ప్రకర్షతో పొమ్ము. పరిపరీ=మార్గమునందు బాధకుఁడైన తస్కరనాయకుఁడు, త్వా=నిన్ను, మావిదత్=తెలిసికొనకుండుఁగాక, పరిపన్థినః=ఆ తస్కర నాయకుని భృత్యులు(కూడ) త్వా=నిన్ను, మావిదత్=తెలిసికొనకుందురుగాక. అఘాయవః=హననరూప పాపమును గోరునట్టి, వృకాః=తోడేళ్లు, త్వా=నిన్ను, మా విదన్=తెలిసికొనకుండుఁగాక. విశ్వావసుః=విశ్వావసువను పేరుకల, (స్వర్గమార్గమున సోమము నపహరించునట్టి) గన్ధర్వః=గంధర్వుఁడు, త్వా=నిన్ను, మాదఘత్=నిరీక్షింపకుండుఁగాక. (హే సోమః=ఓ సోమమా! త్వమ్=నీవు) శ్యేనః భూత్వా=డేగవుఅయి, (డేగవలె పై కెగురుటకు సమర్థమై) నః=మా యొక్క, యజమానస్య=యజమానునియొక్క, గృహే=ప్రాచీనవంశమనెడి గృహమునందు, (యజ్ఞశాలకు) పరాపత=శీఘ్రముగా పొమ్ము. దేవైః=దేవతుల్యులైన అధ్వర్యుఁడు మున్నగువారిచేత, సంస్కృతమ్=(నీవు కూర్చుండుటకు స్థానము)సంస్కరింపఁబడినది. యజమానస్య=యజమానునకు, స్వస్త్యయనీ=శ్రేయోదాయకమైన యజ్ఞఫలమును బొందించుదానవు, అసి=అగుచున్నావు. యేన=ఏ మార్గముచేత, విశ్వాః ద్విషః=సమస్త శత్రువులను, పరివృణక్తి=అంతటను విడిచిపెట్టుచున్నావో; వసు=ధనము, విన్దతే=లభించుచున్నదో, స్వస్తిగామ్=శ్రేయస్సునుపొందించునదియు, అనేహసమ్=పాపరహితమైనదియునగు, పన్థామ్=మార్గమును, అగన్మ హి=పొందితిమి. (భూతపతి=భూమియందున్న అధ్వర్యుయజమానాదులకు పాలకము కావున సోమము భూతపతిగా పరింపఁబడినది. (పన్థామ్=పన్థానమ్.)

తాత్పర్యము: భూతపతివైన సోమమా! నీవు ప్రాచీనవంశ హవిర్ధానాది స్థానములకు బాగుగఁబొమ్ము. త్రోవయందు చోర నాయకుఁడుకాని, అతని యనుచరులుకాని నిన్ను గుర్తింపకుందురుఁగాక. హింసించునట్టి తోడేళ్లు నిన్నుఁ దెలిసికొనకుండుఁగాక. విశ్వావసువను గంధర్వుఁడు స్వర్గమార్గమున నిన్నపహరించుటకై నిరీక్షింపకుండుఁగాక. మా యజమానుని ప్రాచీనవంశమనెడి యజ్ఞశాలకు శీఘ్రముగ పొమ్ము. దేవసదృశులైన అధ్వర్యుఁడు మున్నగువారు నీవు కూర్చుండుట కర్హమైన స్థానమును శుభ్రపఱచినారు. మేము, శత్రువులను దూరము చేయునదియు, ధనమును లభింపఁజేయునదియు, శ్రేయోదాయకమును, పాపరహితమునునగు అనుష్ఠాన మార్గమును పొందితిమి. (అధ్వర్యుఁడు 'సుబ్రహ్మణ్యోమ్' అని మూఁడు మారు లుచ్చరించుచు ఈ మంత్రము చెప్పి సోమము నుంచిన శకటమును యజ్ఞశాలకు నడిపింపవలెను.)

2\. అర్థము: వరుణస్య=(తన కిరణములచే జగత్తును) ఆవరించువాఁడును, చక్షసే=సర్వజ్ఞుఁడు నగు, మిత్రస్య=(సోమాభిన్న) సూర్యునికొఱకు, నమః=నమస్కారము. (హే ఋత్విజః!=ఓ ఋత్విజులారా! యూయమ్=మీరు) మహో=గొప్పవాఁడగు, దేవాయ=దేవునకై, తత్=ఆ జ్యోతిష్టోమమనెడి, ఋతమ్=సత్యరూపమైన(=అవశ్యఫలప్రదమైన)కర్మను, (కృత్వా=చేసి) సపర్యత=సేవ చేయుఁడు. దూరేదృశే=దూరమునందు కనఁబడుచున్నవాఁడును, దేవజాతాయ=దేవుఁడుగాఁబుట్టినవాఁడును, కేతవే=పగటికి చిహ్నమైనవాఁడును, దివస్పుత్రాయ=ద్యులోకమునకు పుత్రునివలె ప్రియమైనవాఁడునగు, సూర్యాయ=సూర్యునికొఱకు, శంసత=స్తుతి చేయుఁడు. (ఇచట మిత్రస్య – వరుణస్య – అను పదములు చతుర్థ్యర్థమున షష్ఠ్యంతములుగా ప్రయుక్తములైనవి.)

తాత్పర్యము: (ఈ మంత్రమునందు సోమము సూర్యరూపమున స్తుతింపఁబడినది) తన కిరణములచే సర్వజగత్తు నావరించినవాఁడును, సర్వజ్ఞుఁడునగు సూర్యునకు నమస్కారము. ఓ ఋత్విజులారా! మీరు జ్యోతిష్టోమ కర్మను జేసి గొప్పవాఁడగు ఆ సూర్యుని ప్రీతికై సేవచేయుఁడు. సూర్యుఁడు దూరమునందు కనఁబడుచున్న ప్రత్యక్ష దైవము. దేవాంశమునఁబుట్టినవాఁడు. పగటికిఁ జిహ్నమైనవాఁడు. ద్యులోకమునకు పుత్త్రునిలె ప్రియమైనవాఁడు. అట్టి సూర్యదేవుని స్తుతింపుఁడు. (అధ్వర్యుఁ డీ మంత్రము చెప్పుచు యజ్ఞశాల కగ్రభాగమున నుండి శకటముపై వచ్చుచున్న సోమమును ఆమంత్రణము చేయవలయును.)

3\. ఈ మంత్రమున కర్థతాత్పర్యములు అష్టమానువాకాంతమునందు వ్రాయఁబడినవి. (ఈ మంత్రము చెప్పుచు యజ్ఞశాల కగ్రభాగమున శకటము నందలి శమ్యా యోక్త్రముల నూడఁదీయవలెను.)

నవమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ద్వితీయప్రపాఠకే దశమోఽనువాకః

మూలము: [1]అగ్నే రాతిథ్య మసి విష్ణవే త్వా సోమస్యా తిథ్య మసి విష్ణవే త్వా ఽఽతిథే రాతిథ్య మసి విష్ణవే త్వా ఽగ్నయే త్వా రాయస్పోషదావ్నే విష్ణవే త్వా శ్యేనాయ త్వా సోమభృతే విష్ణవే త్వా [2]యా తే ధామాని హవిషా యజన్తి తా విశ్వా పరిభూ రస్తు యజ్ఞం గయస్ఫానః ప్రతరణ స్సువీరో ఽవీరహా ప్రచరా సోమ దుర్యా[3] నదిత్యా స్సదో ఽస్య దిత్యా స్సద ఆ(గ)సీద [4]వరుణో ఽసి ధృతవ్రతో వారుణ మసి శంయో ర్దేవానాగ్ం సఖ్యా న్మా దేవానా మపస శ్ఛిత్స్మ [5]హ్యాపతయే త్వా గృహ్ణామి పరిపతయే త్వా గృహ్ణామి తనూనప్త్రే త్వా గృహ్ణామి శాక్వరాయ త్వా గృహ్ణామి శక్మ న్నోజిష్ఠాయ త్వా గృహ్ణా [6]మ్యనాధృష్ట మస్య నాధృష్యం దేవానా మోజో ఽభిశ స్తిపా అనభిశస్తేన్య [7]మను మే దీక్షాం దీక్షాపతి ర్మన్యతా మను తప స్తపస్పతి రఞ్జసా సత్య ముపగేషగ్ం సువితే మా ధాః ॥౨౫॥ (ఆమైకంచ)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ప్రథమప్రపాఠకే త్రయోదశోఽనువాకః ।

వేదార్థదీపిక

అవతారిక: నవమానువాకమునందు సోమము యజ్ఞశాలకు వచ్చుటనుగూర్చి చెప్పఁబడినది. ప్రాచీనవంశమునకు అతిథిరూపముగ వచ్చిన సోమముయొక్క సత్కారమునకై ఆతిథ్యేష్టి యీ దశమానువాకమునందుఁ జెప్పఁబడుచున్నది.

1\. అర్థము: (హే హవిః–ఓ హవిస్సా! త్వమ్–నీవు) అగ్నేః–అతిథిరూపుఁడైన అగ్ని దేవునకు, ఆతిథ్యమ్–సత్కారరూపము, అసి–అగుచున్నావు. త్వా–(అటువంటి) నిన్ను, విష్ణవే–విష్ణుశబ్ద వాచ్యమైన సోమమునకొఱకు, నిర్వపామి–ఉంచుచున్నాను. సోమస్య–సోమమునకు, ఆతిథ్యమ్–సత్కారరూపము, అసి–అగుచున్నావు. త్వా–నిన్ను, విష్ణవే–విష్ణుశబ్ద వాచ్యమైన సోమమునకొఱకు, నిర్వపామి–ఉంచుచున్నాను. అతిథేః–అతిథి అను పేరుగల యగ్నికి, ఆతిథ్యమ్, అసి, త్వా, విష్ణవే, నిర్వపామి. రాయస్పోషదావ్నే–ధనసమృద్ధి నిచ్చునట్టి యగ్నికొఱకు, ఆతిథ్యమ్, అసి; విష్ణవే, త్వా, నిర్వపామి. సోమభృతే–సోమమును పోషించునది, శ్యేనాయ–శ్యేన నామకుఁడగు నగ్నికొఱకు, ఆతిథ్యమ్, అసి; త్వా, విష్ణవే, నిర్వపామి.

తాత్పర్యము: ఇచట విష్ణువొక్కడే ప్రధాన హవిర్దేవత. అగ్న్యాదులు విష్ణువున కనుచరులు. లోకమునందు యజమానున కిచ్చిన ఆతిథ్యముచేత తదనుచరులుకూడ సంతసింతురు. యజమానునకు వలె తదనుచరులకుఁగూడ సత్కారము చేయఁబడుచుండును. అదే విధముగ నిచటఁగూడ ప్రధాన దేవతయగు విష్ణువునకు, తదనుచరులైన అగ్న్యాదులకుఁగూడ హవీ రూపమైన ఆతిథ్య మీయఁబడుచున్నది. ఇట సోమము విష్ణుశబ్దవాచ్యముగా వివక్ష చేయఁబడినది. విష్ణవే, ఆతిథ్యమ్, ఇత్యాదిపదముల కొకమారు అర్థము వ్రాయఁబడినది; కావున తరువాత వాని కర్థము వ్రాయలేదు. అన్వయక్రమము మాత్రము చూపఁబడినది. 'సోమస్య' అను పదమునకు ప్రధానమైన 'సోమము' అని యర్థమేకాని, సోమనామకాగ్ని యని మాత్రము కాదు. "అగ్నేరాతిథ్యమసి విష్ణవే త్వా" అనునది ఒక యజుస్సు. "సోమస్యాతిథ్యమసి విష్ణవే త్వా" అనునది మఱియొక యజుస్సు. మిగిలినవి కూడ నిట్లే యజుస్సులు. ధన సమృద్ధి దాతయగు నగ్నియు శ్యేననామకాగ్నియు సోమమునకత్యంత సన్నిహితులు. అట్టి విష్ణుశబ్దవాచ్యమైన సోమమునకు, తదనుచరులైన అగ్న్యాదులకు ఈ హవిస్సు ఆతిథ్యముగా నీయఁబడుచున్నదని తాత్పర్యము. అతతి=సతతం.గచ్ఛతీతి, అతిథిః=ఎల్లపుడు సంచరించువాఁడు కావున అతిథి యనఁబడును. అట్టి యతిథికిఁ జేయఁబడునట్టి కర్మవిశేషము ఆతిథ్యమని వ్యుత్పత్త్యర్థము. ఈ మంత్రమునందుఁగల అయిదు యజుస్సులను జెప్పుచు నతిథియైన సోమమునకు ఆతిథ్యేష్టి (=ఆతిథ్యము) చేయవలెను.

2. **అర్థము:** హే సోమ!=ఓ సోమమా!, తే=నీయొక్క, యా ధామాని=ఏ ప్రాతస్సవనాది స్థానములందు, హవిషా=హవిస్సుచేత, యజన్తి=హోమము చేయుచున్నారో, తా విశ్వా=ఆ సర్వ స్థానములందు, యజ్ఞమ్=యజ్ఞము నుద్దేశించి, పరిభూః=అంతటను పొందిన దానవు, అస్తు=అగుము. హే సోమ!=ఓ సోమమా! గయస్ఫానః=గృహాభివర్ధకము, ప్రతరణః=ప్రకృష్టముగ (మమ్ము) యజ్ఞపారమును పొందించుదానవు, సువీరః=(నీ యనుగ్రహము వలన) మంచి వీరులు (మాయొక్క పుత్త్రపౌత్రాదులు) కలదానవు, అవీరహా=ఆ వీరులకు హన్తవు కాని దానవునగు, (త్వమ్=నీవు) దుర్యాన్=ప్రాచీనవంశరూప గృహములను, ప్రచరా=పొందుము. యా, తా, విశ్వా – ఈ పదములు, సప్తమ్యర్థమున లుప్తవిభక్త్యంతములుగాను, 'ధామాని' అను పదము ద్వితీయాంతముగాను ప్రయుక్తములైనవి.

తాత్పర్యము: ఓ సోమమా! నీకు సంబంధించిన ఏ ప్రాతస్సవనాది స్థానములందు హవిస్సుచే హోమము చేయుచున్నారో, నీవు ఆ స్థానముల నన్నిటిని పొందుము. నీవు గృహము నభివృద్ధి చేయుదానవు; నీ యనుగ్రహము వలన మా పుత్త్రపౌత్రాదులు వీరు లగుచున్నారు. అట్టి వీరులకు నీవు పరిపాలకురాలవు. అట్టి నీవు ప్రాచీన వంశమనెడి యజ్ఞశాలను పొందుము. (యజమానుఁడు శకటమునందలి సోమమును యజ్ఞశాలయందుఁ బ్రవేశపెట్టవలెను.)

3. ఈ మంత్రమున కర్థ తాత్పర్యములు అష్టమాను వాకమునందు వ్రాయఁబడినవి. (ఈ మంత్రము చెప్పుచు సోమము నాహవనీయాగ్ని దక్షిణ భాగమున కృష్ణాజినమునం దుంచవలెను).

4. **అర్థము:** (హే సోమ!=ఓ సోమమా! త్వమ్=నీవు) వరుణః=వరుణపాశమును బోఁగొట్టుదానవు, ధృతవ్రతః=యజ్ఞమనెడి వ్రతమును ధరించిన దానవును, అసి=అగుచున్నావు. (హే సోమ! త్వమ్) వారుణమ్=వరుణ సంబంధివి, అసి=అగుచున్నావు. (తతః=అట్లగుటవలన) శంయోః=సుఖముతోఁ గూడిన, దేవానామ్=వరుణాది దేవతల యొక్క, సఖ్యాత్=స్నేహమువలన, అపసః=కర్మనుండి, మా ఛిత్స్మహి=(మేము) భ్రష్టులము కాకుందుముగాక.

తాత్పర్యము: ఓ సోమమా, నీవు వరుణపాశమును బోఁగొట్టుదానవు, యజ్ఞమనెడి వ్రతము నవలంబించిన దానవు, వరుణదేవుని సంబంధివి. అందుచేత సుఖమిశ్రితమైన వరుణాది దేవతల సఖ్యమువలన మేము కర్మభ్రష్టులము కాకుందుముగాక. (ఈ మంత్రము చెప్పుచు సోమము నభిమంత్రించి దానిపై వస్త్రమును గప్పవలయును).

5. అర్థము: (హే ఆజ్య!=ఓ ఆజ్యమా!) ఆపతయే=ప్రాణముకొఱకు, త్వా=నిన్ను, గృహ్ణామి=(పాత్రములోనికి)తీసికొను చున్నాను. పరిపతయే=మనస్సుకొఱకు, త్వా=నిన్ను, గృహ్ణామి=గ్రహించుచున్నాను. తనూనప్త్రే=జఠరాగ్నికొఱకు, త్వా=నిన్ను, గృహ్ణామి. శాక్వరాయ=శక్తి స్వరూపముకొఱకు, త్వా, గృహ్ణామి. శక్మన్=శక్తిమంతమయిన పదార్థమునందలి, ఓ జిష్ఠాయ=అష్టమ ధాతువు యొక్క సారముకొఱకు, త్వా, గృహ్ణామి.

తాత్పర్యము: ఓ ఆజ్యమా! ప్రాణము, మనస్సు, జఠరాగ్ని, శక్తి స్వరూపము, శక్తిమంతములయిన పదార్థములందలి అష్టమ ధాతుసారములకొఱకు నిన్ను ఈ పాత్రములోనికిఁ దీసికొనుచున్నాను. (హోమము చేయుటకై ఆజ్యమును పాత్రములోఁ బోయవలెను.)

విశేషములు: 'ఆపతిః'=నిశ్వాస రూపేణ బహిర్గతః పున రాభిముఖ్యేన అన్తః పతతీతి ఆపతిః. నిశ్వాస రూపమున బహిర్గతమైన వాయువు ఉచ్ఛ్వాస రూపమున అభిముఖముగ లోపలఁ బడుచున్నది కావున ప్రాణము 'ఆపతి' యనఁబడు చున్నది. 'పరిపతిః'=పరితః నానా విషయేషు పతతీతి-పరిపతిః=అనేక విషయములందు ప్రవర్తించునది మనస్సు. తనూం న పాతయతి=న వినాశయతీతి='తనూనపాత్'. శరీరమును నశింపకుండ నుంచునది జఠరాగ్ని, యని యర్థము. శక్వరః=శక్తిమంతుడైన పురుషుఁడు. శక్తిమంతుని సంబంధి-శాక్వరము=శక్తి స్వరూపము శక్తిమత్పదార్థముల అష్టమ ధాతువుయొక్క సారము ఓజిష్ఠ మనబడును. పాత్రములోనికిఁదీసి కొనఁబడిన ఆజ్యమునకు తానూనప్త్రమనిపేరు.

6. అర్థము: (హే తానూనప్త్ర!=ఓ తానూనప్త్రమనెడి ఆజ్యమా! త్వమ్=నీవు) అనాధృష్టమ్=(ఇంతకు పూర్వము ఎవరి చేతను) తిరస్కరింపఁబడని దానవు, అసి=అగుచున్నావు. అనాధృష్యమ్=(ఇకముందుగూడ) తిరస్కరింపఁబడని, దేవానామ్=దేవతలయొక్క, ఓజః=సారము, అసి=అగుచున్నావు. అభిశస్తిపాః=అన్యోన్య విరోధము నుండి (మమ్ము) కాపాడు దానవు. అనభిశస్తేన్యమ్=(నీ పైతే) అన్యోన్య విరోధమునకు విషయము కాని దానవు

తాత్పర్యము: ఓ తానూనప్త్రాజ్యమా! నీవు పూర్వము ఎవ్వరి చేతను తిరస్కరింపఁబడలేదు. ఇకముందుఁగూడ ఎవ్వరి చేతను తిరస్కరింపఁబడని దేవతల సారమగుచున్నావు. అన్యోన్య విరోధమునుండి మమ్ము రక్షించు చున్నావు. నీవు ఆ విరోధమునకు విషయమగుటలేదు. (ఈ మంత్రము చెప్పుచు అచట నున్న ఋత్విజు లందఱు తానూనప్త్రాజ్యమును స్పృశించవలెను).

విశేషములు: పూర్వమొకప్పుడు దేవతలు రాక్షసులు యుద్ధమునకు సన్నద్ధులైరి. దేవతలు తమలోఁదాము ఎవరికి వారే గొప్పవారమని, తనకంటె నితరులు తక్కువయని భావించి కలహించుకొని యైదు వర్గములుగ విడిపోయిరి. ఆ వర్గములలో వసువు మొదలగు వారికి అగ్ని, రుద్రాదులకు సోముఁడు, మరుత్తులకు ఇంద్రుఁడు, ఆదిత్యులకు వరుణుఁడు, విశ్వేదేవతలకు బృహస్పతియు నాయకులుగ నుండిరి. కొంతకాలమునకుఁ బిమ్మట తాము అన్తఃకలహములతో నున్నచో బలహీనులమై శత్రువులకు జయమును తామే సాధించిన వారల మగుదుమని యాలోచించి అంతఃకలహ నివారణ హేతువైన శపథము చేయుటకు తమ దారాపుత్రాదుల నొకచోట సంఘటిత పఱచి "మనలో నెవరు ప్రథమమున కలహించుదురో వారు మనలో నుండి బయటకు వెళ్లవలె"నని శపథము చేసిరి. మనుజులలోఁగూడ నిట్లు శపథము చేసినవారిలో నెవఁడు ప్రథమమున కలహమును దలపెట్టునో, వాఁడు నశించును. ఈ యాచారము దేవ మనుష్యులకు సమానము. తనూః=పుత్రాది సంతానము ఆ పుత్రాదులను సంఘటిత పఱచి ఏయగ్ని సమక్షమున శపథము చేయఁబడినదో! ఆ యగ్నియందు హోమము చేయఁబడు నాజ్యము "తానూనప్త్ర" మనఁబడుచున్నది.

7. అర్థము: దీక్షాపతిః=దీక్షణీయేష్టికి సంబంధించిన దేవుఁడు, మే=నాయొక్క, దీక్షామ్=దీక్షను, అను మన్యతామ్=గుర్తించుఁగాక. తపస్పతిః=తపస్పతియగు దేవుఁడు, తపః=(నా) తపస్సును, అను మన్యతామ్=గుర్తించుఁగాక. (అహమపి=నేనుఁగూడ) అఞ్జసా=ఋజు మార్గముతో, సత్యమ్=తానూనప్త్రి స్పర్శ రూప శపథమును, ఉప గేషమ్=పొందితిని. (హే తానూనప్త్రిజ్య!=ఓ తానూనప్త్రిజ్యమా!) మా=నన్ను, సువితే=శోభన మార్గమైన యజ్ఞకర్మయందు, ధాః=స్థాపించుము.

తాత్పర్యము: దీక్షణీయేష్టి దేవత నా దీక్షను నా తపస్సును గుర్తించుఁగాక. నేను గూడ తానూనప్త్రిజ్య స్పర్శరూప శపథమును బొందితిని. ఓ తానూనప్త్రిజ్యమా! నీవు నన్ను శోభన మార్గమైన యజ్ఞ కర్మయందు స్థాపించుము. (అధ్వర్యుఁడు యజమానునిచే నీ మంత్రమును జెప్పించవలెను.)

దశమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ద్వితీయప్రపాఠకే ఏకాదశోఽనువాకః।

మూలము: అగ్ంశు రగ్ంశు ష్టే దేవ సోమా ఽఽప్యాయతా మిన్ద్రాయైక ధనవిద ఆ తుభ్య మిన్ద్రః ప్యాయతా మా త్వ మిన్ద్రాయ ప్యాయస్వా ఽఽప్యాయయ సఖీ న్త్సన్యా మేధయా స్వస్తి తే దేవ సోమ సుత్యా మశీయే ²ష్టా రాయః ప్రే షే భగాయ ర్త మృతవాదిభ్యో నమో దివే నమః పృథివ్యా ³అగ్నే వ్రతపతే త్వం వ్రతానాం వ్రతపతి రసి యా మమ తనూ రేషా సా త్వయి (౧)యా తవ తనూ రియగ్ం సా మయి సహ నౌ వ్రతపతే వ్రతినో ర్వ్రతాని యా తే అగ్నే రుద్రియా తనూ స్తయా నః పాహి తస్యా స్తే స్వాహా ⁵యా తే అగ్నే ఽయాశయా రజాశయా హరాశయా తనూ ర్వర్షిష్ఠా గహ్వరేష్ఠో గ్రం వచో అపావధీం త్వేషం వచో అపావధీగ్ం స్వాహా ॥౧౧॥ (త్వయి చత్వారిగ్ంశ చ్చ)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ద్వితీయప్రపాఠకే ఏకాదశోఽనువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: దశమానువాకమునందు ఆతిథ్యేష్టి చెప్పఁబడినది. యజ్ఞశాలయందు సోమముంచఁబడినది. ఆ సోమముతోఁ జేయు యాగమునకు విఘ్నములు చేయు నసురులను ప్రథమమున జయింపవలెనని, తద్రాతిన విజయ నిమిత్తము ఈ యను వాకమునందు ఉపసత్తులు వర్ణింపఁబడుచున్నవి. ఈ యనువాకమునందలి అయిదవ మంత్రముచే హోమము చేయఁబడు ఆహుతులకు ఉపసత్తులని పేరు.

1\. **అర్థము:** హే సోమదేవ!-దేవతా స్వరూపమైన ఓ సోమమా!, తే-నీ యొక్క, అంశుః-శుష్కించుచున్న సూక్ష్మావయవము, అంశుః-నశించుచున్న సూక్ష్మావయవము, (సర్వము) ఏకధనవిదే-ముఖ్యమైన సోమరూప ధనము నెఱిఁగిన, ఇన్ద్రాయ-ఇంద్రుని కొఱకు, ఆప్యాయతామ్-వృద్ధి నొందుఁగాక. (హే సోమ!-ఓ సోమమా!) తుభ్యమ్-నీకొఱకు, ఇన్ద్రః-ఇంద్రుఁడు, ఆప్యాయతామ్-(నిన్ను రక్షించుటకై) ఉత్సాహపడుఁగాక. త్వమ్-నీవు(కూడ) ఇన్ద్రాయ-ఇంద్రునికొఱకు, ఆప్యాయస్వ-వృద్ధినొందుము. సఖీన్-మిత్రులైన ఋత్విజులను, సన్యా-ధనలాభము చేతను, మేధయా-ప్రజ్ఞచేతను, అప్యాయయ-వృద్ధి నొందించుము. హే సోమదేవ!-దేవతారూప మైన సోమమా! తే-నీకు, స్వస్తి-శుభమగుఁగాక. (అహమ్-నేను) సుత్యామ్-అభిషవ తంత్ర మును, అశీయ-(నీ యనుగ్రహముచేత) పొందుదును.

తాత్పర్యము: దేవతా రూపమైన ఓ సోమమా! శుష్కించుచున్నదియు నశించుచున్నదియునగు నీ సూక్ష్మావయవము సోమ రూప ధనము నెఱిఁగిన యింద్రుని కొఱకు వృద్ధి నొందుఁగాక. నీవు కూడ నింద్రుని కొఱకు వృద్ధి నొందుము. ధన లాభముచేతను, మేధస్సు చేతను మిత్రులయిన ఋత్విజులను వృద్ధి నొందించుము. నీ యనుగ్రహము చేత నేను అభిషవ తంత్రమును పొందుదును. నీకు శుభమగుఁగాక. (అధ్వర్యుఁడు వేది నీటిచే హస్తములను తుడుచుకొని లేచి నిలుచుండి సోమ లతల కట్ట నూఁదదీసి అందు బంగారము నుంచి ఈ మంత్రము చెప్పుచు ప్రార్థించవలెను.)

2. అర్థము: ఏష్టా:=ద్యావా పృథివ్యభిమానివగు దేవా! (త్వమ్=నీవు) ఋత వాదిభ్య:=యజ్ఞ వాదులమైన మా కొఱకు, ఋతమ్=యజ్ఞమును, రాయ:=ధనముకొఱకు, ఇషే=అన్నము కొఱకు, భగాయ=ఐశ్వర్యాది షడ్గుణములకొఱకు, ప్ర(దేహి)=అధికముగ నిమ్ము. దివే=ద్యులోక దేవతకొఱకు, నమ:=నమస్కారము. పృథివ్యై=పృథివీ దేవతకొఱకు, నమ:=నమస్కారము.

తాత్పర్యము: ఓ ద్యావా పృథివ్య భిమానివగు దేవా! యజ్ఞమును గూర్చి చెప్పుచున్న మాకు, ధనము అన్నము ఐశ్వర్యాది షడ్గుణముల కొఱకు యజ్ఞము నధికముగ నిమ్ము. (ఈ యజ్ఞము సక్రమముగ జరుగునట్లు చేయుమని భావము.) మేము ద్యులోక దేవతలకు పృథివీ దేవతకు నమస్కరించుచున్నాము. ('ఐశ్వర్యము, సమగ్ర మైన ధర్మము, యశస్సు, సంపద, జ్ఞానము, వైరాగ్యము' అను నాఱును ఐశ్వర్యాది షడ్గుణములు. ప్రస్త రమును గూర్చి యీ మంత్రము చెప్పఁబడినది. 'రాయ:' అను పంచమ్యంతము చతుర్థ్యర్థమున ప్రయుక్తమైనది.)

3. అర్థము: వ్రతపతే=వ్రతముల కధిపతివగు, హే అగ్నే!=ఓ యగ్నీ!, త్వమ్=నీవు, వ్రతపతి:=వ్రతములకు ప్రభువువు, అసి=అగుచున్నావు. వ్రతానామ్=సర్వవ్రతములకు, (పతి:=ప్రభువువు.) మమ=నాయొక్క, యా తనూ:= (వ్రతము నాచరించుచున్న) ఏ శరీరము, (అస్తి=కలదో) సా ఏషా=ఆ యీ శరీరము, త్వయి=నీయందు, (అర్పితా=మనస్సుచే నర్పింపఁబడినది. వ్రతమును బాలించుచున్న నీ శరీరము నాయందు అర్పింపఁబడినది.) హే వ్రతపతే!=వ్రతపతివగు ఓ యగ్నీ! వ్రతినో:=వ్రతులమగు, నౌ=మనయొక్క, వ్రతాని=వ్రతములు, సహ=కూడ, ప్రవర్తన్తామ్=ప్రవర్తించుగాక.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు కేవలము ఒక్క వ్రతమునకే కాక సర్వవ్రతములకు నధిపతివి. వ్రతముల నాచరించుచున్న నా శరీరము మానసికముగ నీ యందర్పితమైనది. వ్రతములను బాలించుచున్న నీ శరీరము మనస్సుచే నా యందు స్థాపితమైనది. కావున మన ముభయులము వ్రతులమే. వ్రతులమైన మనయొక్క వ్రతములు ఒకసారిగా ప్రవర్తించుఁగాక. (అధ్వర్యుఁ డీ మంత్రమును యజమానునిచేఁ జెప్పించుచు నతనికి అవాంతర దీక్ష నొసఁగవలయును.)

4. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ! తే=నీ యొక్క, యా=ఏ, రుద్రియా=రుద్ర సంబంధమైన (క్రూరమైన) తనూ:= శరీరము, (అస్తి=కలదో,) తయా=ఆ శరీరముతో, న:=మమ్ము పాహి=రక్షింపుము. తే=నీ యొక్క, తస్యా:=ఆ శరీరమునకు, స్వాహా=(ఈ హవిస్సు) హుతమగుఁగాక.

తాత్పర్యము: ఓ యగ్నీ! రుద్రసంబంధమైన నీ శరీరము మమ్ము రక్షించుఁగాక. ఈ హోమము చేయఁబడు పదార్థము నీ శరీరమునకు హుతమగుఁగాక. (అధ్వర్యుఁ డీ మంత్రమును యజమానునిచేఁ జెప్పించుచు నవాంతర దీక్షా నియమముల నతనిచే ననుష్ఠింపఁజేయవలెను.)

5. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ! తే=నీ యొక్క, యా=ఏ, అయాశయా=లోహ నిర్మితమైనదియు, రజాశయా=రజత నిర్మితమైనదియు, హరాశయా=హిరణ్య నిర్మితమైనదియు నగు, తనూ:=శరీరము, వర్షిష్ఠా=వృద్ధతమమైన దియు, గహ్వరేష్ఠా=స్పృశింప సాధ్యము కానిదియునై యున్నదో, (తయా=ఆ శరీరముచే) ఉగ్రంవచ:= (అన్నపానములు లేకుండుటచే ఆకలి గొన్నవాఁడను, దప్పికగొన్న వాఁడను అనునట్టి) తీవ్రమైన వాక్కును, అపావధీమ్=నశింపజేసితిని. త్వేషం వచ:=మన సంతాపకరమైన వాక్కును, అపావధీమ్=నశింపఁజేసితిని. స్వాహా=(ఈ హవిస్సు అగ్నికొఱకు) హుతమగుఁగాక.

తాత్పర్యము: ఓ యగ్నీ! లోహ రజత హిరణ్య నిర్మితమైనదియు, వృద్ధతమమైనదియు స్పృశింప సాధ్యము కానిదియునగు నీ శరీరముచే ఉగ్రవాక్కును త్వేషవాక్కును నశింపఁజేసితిని. (ఉగ్రవాక్కు-ఐహికము, త్వేషవాక్కు ఆముష్మికము. ఈ మంత్రము నందలి 'అయాశయా' 'రజాశయా' 'హరాశయా' అను మూఁడు పదములు ప్రత్యేకముగ 'తనూః' అను పదముతో నన్వయించుచున్నవి. అయాశయయగు నగ్నిశరీరముచే ఉగ్ర త్వేష, వాక్కులను రెండింటిని నశింపఁజేసితిని, ఇట్లే 'రజాశయ' యగు నగ్నిశరీరముచేతను, హరాశయ యగు నగ్నిశరీరముచేతను ఉగ్ర, త్వేష వాక్కులను నశింపఁజేసితిని' అని అన్వయించుటచే మూఁడు మంత్రార్థము లగుచున్నవి. ఒక్కొక్క మంత్రము నుచ్చరించుచు ఒక్కొక్కమారు హవ్యము నగ్నియందు హోమము చేయవలెను. ఈ హోమము చేయఁబడునట్టి ఆహుతులకు ఉపసత్తులని పేరు. ఒక్కొక్క మంత్రముచే నొక్కొక్క ఆహుతిని ఒక్కొక్క దినము చొప్పున మూఁడు దినములందు ఈ ఉపసదాఖ్యములైన ఆహుతులను హోమము చేయవలెను. ఆజ్యస్థాలినుండి స్రువముతో ఆజ్యమును గ్రహించి మొదటి మంత్రముచే మొదటి ఉపసత్తును (ఆహుతిని) హోమము చేయవలెను. ఇట్లే మిగిలినవి కూడ.)

ఏకాదశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ద్వితీయప్రపాఠకే ద్వాదశోఽనువాకః

మూలము: విత్తాయనీ మేఽసి తిక్తాయనీ మేఽస్యవతా న్మా నాథిత మవతా న్మా వ్యథితం [2]విదే రగ్ని ర్నభోనామా గ్నే అఙ్గిరో యోఽస్యాం పృథివ్యా మస్యా యుషా నామ్నే హి య త్తేఽనా ధృష్టం నామ యజ్ఞియం తేన త్వాఽఽదధే [3]ఽగ్నే అఙ్గిరో యో ద్వితీయస్యాం తృతీయస్యాం పృథివ్యా మస్యా యుషా నామ్నే హి య త్తేఽనాధృష్టం నామ (౧)యజ్ఞియం తేన త్వాఽఽదధే [4]సిగ్ంహీ రసి మహిషీ రస్యు [5]రు ప్రథస్వో రు తే యజ్ఞపతిః ప్రథతాం ధ్రువాఽసి దేవేభ్య శ్శున్ధస్వ దేవేభ్య శ్శుమ్భస్వ [6]న్ద్రఘోష స్త్వా వసుభిః పురస్తా త్పాతు మనోజవా స్త్వా పితృభి ర్దక్షిణతః పాతు ప్రచేతా స్త్వా రుద్రైః పశ్చా త్పాతు విశ్వకర్మా త్వాఽఽదిత్యై రుత్తరతః పాతు [7]సిగ్ంహీ రసి సపత్న సాహీ స్వాహా సిగ్ంహీ రసి సుప్రజావని స్స్వాహా సిగ్ంహీః (౨)అసి రాయ స్పోషవని స్స్వాహా సిగ్ంహీ రస్యా దిత్యవని స్స్వాహా సిగ్ంహీ రస్యా వహ దేవా న్దేవ యతే యజమానాయ స్వాహా [8]భూతేభ్య స్త్వా [9]విశ్వాయు రసి పృథివీం దృగ్ంహ ధ్రువక్షి దస్య న్తరిక్షం దృగ్ంహా చ్యుతక్షి దసి దివం దృగ్ంహా [10]గ్ని ర్భస్మా స్య గ్నేః పురీష మసి ॥౩॥ (నామ సుప్రజావనిః స్వాహా సిగ్ంహీః పఞ్చవిగ్ంశ చ్చ)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ద్వితీయప్రపాఠకే ద్వాదశోఽనువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: ఏకాదశానువాకమునందు ఉపసత్తులనెడి మూఁడు ఆహుతులు చెప్పఁబడినవి. అందు రెండవ ఉపసద్దినమునందు ముప్పదిరెండడుగుల పరిమితికల వేదికకుఁ బూర్వభాగమునందు ఉత్తరవేది నిర్మాణము ఈ ద్వాదశానువాకమునందుఁ జెప్పఁబడుచున్నది.

1\. అర్థము: (హే ఉత్తరవేదే!=ఓ ఉత్తరవేదీ!, త్వమ్=నీవు) మే=నాకు, విత్తాయనీ=వహ్నిరూప ధనమును పొందించుదానవు, అసి=అగుచున్నావు. మే=నాకు, తిక్తాయనీ=జ్వాలారూపమైన అగ్నితేజస్సును పొందించునానవు, అసి=అగుచున్నావు. నాథితమ్=వహ్నిని గోరువాఁడనైన, మా=నన్ను, అవతాత్=రక్షింపుము. వ్యథితమ్=అగ్నిప్రజ్వలింపడేమో? అని భయపడిన, మా=నన్ను,=అవతాత్=రక్షింపుము.

తాత్పర్యము: (ఉప సదాహుతులు హోమముచేయు మూఁడుదినములలో రెండవ ఉపసద్దినమునందు నిర్మింపఁబడుచున్న ఉత్తరవేదిని సంబోధించుచు ఈ మంత్రార్థము చెప్పఁబడుచున్నది.) ఓ ఉత్తరవేదీ! నీవు నాకు అగ్నిని ప్రజ్వలించునట్లు చేయుము. అగ్నిని ప్రజ్వలించునట్లుచేయు మని నిన్నుఁ బ్రార్థించుచున్న నన్ను రక్షింపుము. అగ్నిజ్వలింపఁడేమో! అని భయపడుచున్న నన్ను రక్షింపుము. (ఈ మంత్రము నుచ్చరించుచు ఉత్తరవేదిని నిర్మించవలెనని బౌధాయనుని మతము.)

2\. అర్థము: విదేః=ఉత్తరవేది సంబంధియైన, అగ్నిః=అగ్ని, నభోనామా='నభస్సు' అనుపేరుకలవాఁడు, అఙ్గిరః=అంగిరసుఁడను బేరుగలవాఁడును. అగ్నే!=ఓ యగ్నీ! (అఙ్గానాం రసః=అఙ్గిరః) యః=ఏ, (త్వమ్=నీవు) అస్యామ్=ఈ, పృథివ్యామ్=(చాత్వాలగత మృద్రూప) భూమియందు, అసి=ఉంటున్నావో, (సః త్వమ్=ఆ నీవు) ఆయుషా నామ్నా=ఆ యుఃప్రదమైన నభోనామముతోఁగూడ, ఏహి=రమ్ము. అనాధృష్టమ్=తిరస్కృతము కానిదియు, యజ్ఞియమ్=యజ్ఞసంబంధియునగు, తే=నీ యొక్క, యత్ నామ=ఏ పేరు, (కలదో,) తేన=ఆ పేరుతో, (వ్యవహృత్య=వ్యవహరించి) త్వా=నిన్ను, ఆదధే=ఆధానము చేయుచున్నాను.

తాత్పర్యము: ఉత్తరవేదికి సంబంధించిన అగ్ని నభోనామకుడు. అఙ్గానాం + రసః=అఙ్గిరః=అంగములసారమని అఙ్గిరశ్శబ్దార్థము. సోమాహుతుల కాధారమగుటచే ఈ యగ్ని గార్హపత్యాద్యగ్నులలో సారమైనవాఁడని భావము. అట్టి అంగిరమైన యగ్నీ! చాత్వాలగత మృద్రూప పృథివియందున్న నీవు ఆయుర్దాయకుడైన నభోనామాగ్నితోఁగూడ ఈ ఉత్తరవేదియందు రమ్ము. నీ నభో నామము అన్యులచే తిరస్కృతము కానిది. యజ్ఞమునకు సంబంధించినది. నిన్ను ఆ పేరుతోఁబిలిచి ఉత్తరవేదియందు ఆధానము చేయుచున్నాను. (ఉత్తరవేదియందలి ధూళిరేణువులను తీసివేయవలెను.)

3\. అర్థము: ద్వితీయస్యామ్=రెండవది, తృతీయస్యామ్=మూఁడవదియునగు, పృథివ్యామ్=భూమియందు, (మిగిలిన యర్థము రెండవ మంత్రమునఁ జూడుడు. ఉత్తరవేదియందలి ధూళిని ఈ మంత్రము చెప్పుచు మూఁడు మారులు తీసివేయవలెను. నాల్గవమారు మంత్రోచ్చారణ లేకుండ ధూళిని దీసివేయవలెను.)

4\. అర్థము: (హే ఉత్తరవేదే!=ఓ యుత్తరవేదీ! త్వమ్=నీవు) సింహీః=సింహస్వరూపము, అసి=అగుచున్నావు. మహిషీః=కొనియాడఁదగినదానవు, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: ఓ యుత్తరవేదీ! నీవు సింహమువంటిదానవు. కొనియాడఁదగినదానవు. (ఈ మంత్రము చెప్పుచు నధ్వర్యుఁడు ఇసుకను మిశ్రమముచేయవలెను.)

5\. అర్థము: (హే ఉత్తరవేదే!, త్వమ్)ఉరు=గొప్పగా, ప్రథస్వ=విస్తరించుము. యజ్ఞపతిః=యజమానుఁడు, తే=నిన్ను, ఉరు=గొప్పగా, ప్రథతామ్=విస్తరింపఁజేయుఁగాక. ధ్రువా=దృఢమైనదానవు, అసి=అగుచున్నావు. దేవేభ్యః=దేవతలకొఱకు, శున్ధస్వ=పరిశుద్ధమగుము. దేవేభ్యః=దేవతలకొఱకు, శుమ్భస్వ=ప్రకాశింపుము. ('తే'=ద్వితీయార్థమున షష్ఠి.)

తాత్పర్యము: ఓ ఉత్తరవేదీ! నీవు ఎక్కువగా విస్తరించుము. యజమానుఁడు నిన్ను ఎక్కువగా విస్తరింపఁజేయుఁగాక. దేవతలకొఱకు పరిశుద్ధమగుము. ఆ దేవతల నిమిత్తము ప్రకాశించుము. (అధ్వర్యుఁ డీ మంత్రమునుచ్చరించుచు నుత్తరవేదిని విశాలమైనదిగాఁజేసి శమ్యచే సరిచేసి నీటితో ప్రోక్షణ చేసి పైన ఇసుకను చల్లవలెను.)

6. అర్థము: (హే ఉత్తరవేదే!) త్వా=నిన్ను, ఇన్ద్రఘోషః=ఇంద్రఘోష నామక దేవుఁడు, వసుభిః=వసుగణములతో (కూడి) పురస్తాత్=తూర్పు దిక్కునందు, పాతు=రక్షించుఁగాక. మనోజవాః=మనోజవసనామక దేవుఁడు, త్వా=నిన్ను, పితృభిః=పితృదేవలతో(కూడి) దక్షిణతః=దక్షిణ దిక్కునందు, పాతు=రక్షించుఁగాక. ప్రచేతాః=ప్రచేతస నామక దేవుఁడు, త్వా=నిన్ను, రుద్రైః=రుద్రులతో(కూడి) పశ్చాత్=పశ్చిమ దిక్కునందు, పాతు=రక్షించుగాక. విశ్వకర్మా=విశ్వకర్మయనుదేవుఁడు, త్వా=నిన్ను, ఆదిత్యైః=ఆదిత్యులతో(కూడి) ఉత్తరతః=ఉత్తర దిక్కునందు, పాతు=రక్షించుఁగాక.

తాత్పర్యము: ఓ ఉత్తరవేదీ! ఇంద్ర ఘోషాదిదేవతలు వస్వాది దేవగణములతోఁగూడినవారై ప్రాచ్యాదులైన నాలుగు దిక్కుల యందు నిన్ను రక్షింతురుగాక. (ఉత్తరవేదియందు ఉదకములతో ప్రోక్షించవలెను.)

7. అర్థము: (హే ఉత్తరవేదే!) సింహీః=సింహరూప ధారిణివగు, (త్వమ్=నీవు) సపత్నసాహీ=శత్రువులను నశింపఁజేయు దానవు, అసి=అగుచున్నావు. స్వాహా=(ఈ ఆహుతి నీకు)హుతమగుఁగాక. సింహీః=సింహరూప ధారిణివైన (నీవు) సుప్రజావనిః=యోగ్యమైన సంతానమును భృత్యులను ఇచ్చుదానవు, అసి=అగుచున్నావు. స్వాహా=(ఈ ఆహుతి నీకు)హుతమగుఁగాక. సింహీః=సింహరూప ధారిణివగు నీవు, రాయస్పోషవనిః=పశ్వాది ధన సమృద్ధి నిచ్చుదానవు, అసి=అగుచున్నావు. స్వాహా=(ఈ ఆహుతి నీకు)హుతమగుఁగాక. సింహీః=సింహ స్వరూపిణివగు నీవు, ఆదిత్యవనిః=ఐశ్వర్యసంబంధి ప్రతిష్ఠాదాయినివి, అసి=అగుచున్నావు. దేవయతే=దేవ తలను గోరుచున్న, యజమానాయ=యజమానునికొఱకు, స్వాహా=(ఈ ఆహుతి నీకు)హుతమగుఁగాక.

తాత్పర్యము: ఓ ఉత్తరవేదీ! సింహరూప ధారిణివగు నీవు శత్రుసంహారిణివి, శోభన సంతాన-భృత్య-దాయినివి, పశ్వాది ధన ప్రదాయినివి, ఐశ్వర్యసంబంధి ప్రతిష్ఠాదాయినివియు నగుచున్నావు. ఈ దేవతలను గోరుచున్న యజమానుని నిమిత్తమై ఈ ఆహుతులు నీకు హుతములగుఁగాక. (అధ్వర్యుఁడు ఈ మంత్రములోని యైదుభాగములలో నొక్కొక్క భాగము నుచ్చరించుచు హిరణ్యమును లోపల నుంచుకొని ఐదు మారులు హోమము చేయవలెను.)

8. అర్థము: హే జుహూః=ఓ జుహూ!, త్వా=నిన్ను, భూతేభ్యః=చిరంతనులైన దేవతలకొఱకు, ఉద్గృహ్ణామి=పైకితీసి కొనుచున్నాను.

తాత్పర్యము: ఓ జుహూ! పురాతనులైన దేవతలకై నిన్ను పైకి తీసికొనుచున్నాను. (హోమసాధనమైన జుహువును పైకి తీసి కొనవలెను.)

9. అర్థము: (హే మధ్యమ పరిధే!=ఓ మధ్యమ పరిధీ! త్వమ్=నీవు) విశ్వాయుః=సమస్తమైన ఆయువు నిచ్చుదానవు, అసి=అగుచున్నావు. పృథివీమ్=భూమిని, దృంహ=దృఢముగాఁజేయుము. (హే దక్షిణ పరిధే!=ఓ దక్షిణ పరిధీ! త్వమ్=నీవు) ధ్రువక్షిత్=స్థిరనివాసము కలదానవు, అసి=అగుచున్నావు. అన్తరిక్షమ్=అంతరిక్ష లోకమును, దృంహ=దృఢముగాఁజేయుము. (హే ఉత్తరపరిధే!=ఓ ఉత్తరపరిధీ!, త్వమ్=నీవు) అచ్యుత క్షిత్=నశింపని నివాసము కలదానవు, అసి=అగుచున్నావు. దివమ్=ద్యులోకమును, దృంహ=దృఢముగాఁ జేయుము.

తాత్పర్యము: ఓ మధ్యమపరిధీ! నీవు సమస్తమైన ఆయువు నిచ్చుదానవు. భూలోకమును దృఢపఱచుము. ఓ దక్షిణ పరిధీ! నీవు స్థిరనివాసముకలదానవు. అంతరిక్షలోకమును దృఢపఱచుము. (అధ్వర్యుఁ డీ మంత్రము నుచ్చరించుచు నుత్తరవేదియందు దేవదారు సంబంధములైన సమిధల సముదాయములోని మధ్యమ దక్షిణోత్తర సమిధలను వఱచవలెను.)

10. అర్థము: (హే సమిధ సముదాయః=ఓ సమిధల సముదాయమా! త్వమ్=నీవు) అగ్నేః=అగ్నికి, భస్మ=ప్రకాశకము, అసి=అగుచున్నావు. పురీషమ్=పూరకము, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: ఓ సమిధల సముదాయమా! నీ వగ్నిని భాసింపఁ జేయుదానవు, పూరకము నగుచున్నావు. (ఈ మంత్రము చెప్పుచు మిగిలిన సమిధలను వేదియందు వఱచవలెను.)

ద్వాదశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ద్వితీయప్రపాఠకే త్రయోదశోఽనువాకః ।

మూలమ్: [1]యుఞ్జతే మన ఉత యుఞ్జతే ధియో విప్రా విప్రస్య బృహతో విపశ్చితః ।విహోత్రా దధే వయునా విదే క ఇన్మహీ దేవస్య సవితుః పరిష్టుతిః ।[2]సువా గ్దేవ దుర్యాగ్ం ఆ వద దేవశ్రుతా దేహిష్వా ఘోషేథా [3]మా నో వీరో జాయతాం కర్మణ్యో యగ్ం సర్వేఽనుజీవామ యో బహూనా మసద్వశీ। [4]ఇదం విష్ణు ర్విచక్రమే త్రేధా నిదధే పదమ్ ।సమూఢ మస్య (౧)పాగ్ంసుర ఇరావతీ ధేనుమతీ హి భూతగ్ం సూయవసినీ మనవే యశస్యే।వ్యస్కభ్నా ద్రోదసీ విష్ణు రేతే దాధార పృథివీ మభితో మయూఖైః ।[5]ప్రాచీ ప్రేత మధ్వరం కల్పయన్తే ఊర్ధ్వం యజ్ఞం నయతం మా జీహ్వరత [6]మత్ర రమేథాం వర్ష్మన్ [7]పృథివ్యా దివో వా విష్ణ వుత వా పృథివ్యా మహో వా విష్ణ వుత వాఽన్తరిక్షా ద్ధస్తౌ పృణస్వ బహుభి ర్వసవ్యై రాప్రయచ్ఛ (౨)దక్షిణా దోత సవ్యాత్। విష్ణో ర్నుకం వీర్యాణి ప్రవోచం యః పార్థివాని విమమే రజాగ్ంసి యో అస్కభా య దుత్తరగ్ం సధస్థం విచక్రమాణ స్త్రేధో రుగాయో [8]విష్ణో రరాట మసి [9]విష్ణోః పృష్ఠ మసి [10]విష్ణోః శ్నప్త్రే స్థో [11]విష్ణో స్స్యూ రసి [12]విష్ణో ర్ధ్రువ మసి వైష్ణవ మసి విష్ణవే త్వా ॥౩॥ (అస్య యచ్ఛైకాన్నచత్వారిగ్ంశచ్చ)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ద్వితీయప్రపాఠకే త్రయోదశోఽనువాకః॥

వేదార్థ దీపిక

అవతారిక: ద్వాదశానువాకమునందు ఉత్తరవేది చెప్పఁబడినది. ఈ త్రయోదశానువాకమునందు తత్సమీపవర్తియగు హవిర్ధానము చెప్పఁబడుచున్నది. హవిస్సు నుంచునట్టి శకటమునకు హవిర్ధానమని పేరు.

అర్థము: బృహతః=(వేదాధ్యయనము చేయుటచే)గొప్పవాఁడును, విపశ్చితః=(వేదార్థమును దెలిసినవాఁడగుటచే) విద్వాంసుఁడునగు, విప్రస్య=బ్రాహ్మణుఁడైన యజమానుని సంబంధులగు, హోత్రాః=హోమకర్తలగు, విప్రాః=బ్రాహ్మణులగు ఋత్విజులు, మనః=మనస్సును, యుఞ్జతే=(లౌకిక చింతలనుండి మఱలించి యజ్ఞ చింతయందు)నియమించుచున్నారు. ధియః ఉత=ఇంద్రియములనుగూడ, యుఞ్జతే=(యజ్ఞసంబంధము లైన విషయములందు)నియమించుచున్నారు. సవితుః=ప్రేరకుఁడైన, దేవస్య=దేవునియొక్క, పరిష్టుతిః= సృష్టి, మహీ=గొప్పది(కావున), వయునావిత్=మార్గములను గుర్తెఱిఁగిన, ఏక ఇత్=ఈశ్వరుఁడొక్కడే, విదధే=(బ్రాహ్మణులకు మనోనియమనాది సామర్థ్యమును)కలిగించెను.

తాత్పర్యము: యజ్ఞము-చేయు యజమానుఁడు వేదాధ్యయన సంపన్నుఁడు. వేదార్థము నెఱిఁగినవాఁడు. ఆ యజమానుని సంబంధులగు హోమకర్తలైన ఋత్విజులు, మనస్సును, ఇంద్రియములను లౌకిక చింతలనుండి తొలఁగించి యజ్ఞ చింతయందు లగ్నము చేయుచున్నారు. ప్రేరకుఁడగు దేవుని సృష్టి గొప్పది కావున, దేవుఁడొక్కడే బ్రాహ్మణులకు మనోనియమనాది సామర్థ్యమును కలుగఁజేసెను. (అధ్వర్యుఁడు గార్హపత్యాగ్నియందు ఆజ్యమును హోమము చేయవలెను.)

2\. **అర్థము:** హే దేవ!=ఓ అక్షదేవా! (త్వమ్=నీవు) దుర్యాన్=గృహములనుగూర్చి, సువాక్=మంచివాక్కులు కలవాఁడవై, ఆవద=అంతటను శ్రేయస్కరియగు వాక్కును పలుకుము. హే దేవశ్రుతౌ!=ప్రఖ్యాతులైన అక్షదేవతలారా! (యూయమ్=మీరు) దేవేషు=దేవతలయందు, ఆఘోషేథామ్=(ఈ యజమానుఁడు మిమ్ముఁగూర్చి యజ్ఞము చేయుచున్నాఁడని)అంతటను చాటింపుఁడు.

తాత్పర్యము: ఓ అక్షదేవా! గృహములందు మంచివాక్కుకలవాఁడవై శ్రేయోదాయకమగు వాక్కును బలుకుము. ప్రఖ్యాతులైన ఓ అక్షదేవతలారా! ఈ యజమానుఁడు మిమ్ముఁగూర్చి యజ్ఞము చేయుచున్నాఁడని దేవతలకుఁదెలియఁ బలుకుఁడు. (అధ్వర్యుఁ డీ మంత్రముచే అనుమంత్రణ చేయవలెను.)

విశేషములు: అక్షదేవుఁడు బంధనహేతువైన పాశముతోఁగూడియుండుటచే వరుణదేవుఁడనియు, ఆ వరుణుఁడు క్రూరుఁడగుటచే సహజముగ దుర్వాక్కులు కలిగి యుండుటవలన మంచివాక్కును బలుకవలసినదని ప్రార్థింపఁబడు చున్నాఁడని బ్రాహ్మణము చెప్పుచున్నది.

3\. **అర్థము:** యమ్=ఏ వీరుని, సర్వే=అందఱు, అనుజీవామ=అనుసరించి జీవింతురో, యః=ఏ వీరుఁడు, బహూనామ్= అనేకులను, వశీ=నియమించుశక్తి కలవాఁడుగా, అసత్=అగునో, కర్మణ్యః=కర్మలయందు నేర్పరియగు, వీరః=(ఆ)వీరుఁడు(=అలసత లేనివాఁడు) నః=మాకు, ఆజాయతామ్=అంతటను(పుత్త్రుఁడుగా)కలుగుఁగాక.

తాత్పర్యము: అందఱకు జీవనాధారుఁడును, అనేకులను నియమించుశక్తి కలవాఁడును, కర్మలయందు నేర్పరియునగు వీరుఁడైన పుత్త్రుఁడు మాకు కలుగుఁగాక. (సోమక్రయణియగు గోవుయొక్క మూఁడవ అడుగు గుర్తునందలి ధూళియొక్క తృతీయాంశమును నేతితోఁగలిపి, యజమానపత్ని దానిని హవిర్ధానము (శకటము)యొక్క కంటికి పూయవలెను. హవిర్ధాన మనఁగా సోమలతను మోయు శకటమని వెనుకఁ జెప్పఁబడినది.)

4\. **అర్థము:** విష్ణుః=విష్ణుమూర్తి, ఇదమ్=ఈ విశ్వమును, విచక్రమే=విభజించి ఆక్రమించెను. పదమ్=అడుగును, త్రేధా=మూఁడువిధములుగా, నిదధే=ఉంచెను. అస్య=ఈ విష్ణువుయొక్క, పాంసురే=(భూమ్యాది లోక రూపములైన)పాంసువులుకల పాదమునందు, సమూఢమ్=(విశ్వము)బాగుగ అంతర్భూతమైనది. రోదసీ= ద్యావాభూములు, ఇరావతీ=అన్నము కలవియు, ధేనుమతీ=బహుక్షీరములుగల గోవులు కలవియు, సూయవసినీ=మంచి ఆహారపదార్థములతోఁగూడినవియునై, మనవే=మానవ సంతతి నిమిత్తము, యశస్యే=కీర్తి కొఱకు, భూతమ్=అగుఁగాక. విష్ణుః=విష్ణుమూర్తి, ఏతే=ఈ ద్యావాభూములను, వ్యస్కభ్నాత్ హి=విభజించి స్థాపించినవాఁడుకదా!. (సః=ఆ విష్ణువు) పృథివీ మభితః=భూమిని అంతటను, మయూఖైః=స్వతేజో రూపములైన జీవులచే, దాధార=పోషించెను. (సమ్యక్ + ఊఢమ్=సమూఢమ్.)

తాత్పర్యము: పూర్వము విష్ణువు విశ్వమును మూఁడుగా విభజించి, భూలోకమునందొక పాదమును, అంతరిక్షమున నొక పాదమును, ద్యులోకమునందొక పాదమును ఉంచెను. భూమ్యాది లోకరూప ధూళిరేణువులు కల యీ విష్ణువు యొక్క పాదమునందు ప్రపంచ మంతర్భూతమై యున్నది. బహుక్షీరములుకల ధేనువులు, మంచి ఆహార పదార్థములుగల ద్యావాభూములు, మానవాళి నిమిత్తము కీర్తికొఱకు నుపయోగపడుఁగాక. విష్ణువు ఈ ద్యావా భూములను విభజించి స్థాపించెనుగదా! విష్ణువు ఆ భూమినంతటను స్వతేజోరూప జీవులచే వ్యాపించి పోషించెను. (అధ్వర్యుఁడు హవిర్ధానమున కభిముఖముగ హోమము చేయవలెను.)

5. అర్థము: (హే శకటీ=ఓ శకటములారా! యువామ్=మీరు) అధ్వరమ్=యాగమును, కల్పయన్తీ=బాధారహితముగఁ జేయుచు, ప్రాచీ ప్రేతమ్=తూర్పుముఖము కలవారై వెళ్లుఁడు. యజ్ఞమ్=యజ్ఞమును, ఊర్ధ్వమ్=ఊర్ధ్వ లోకమున నున్న దేవతలనుగూర్చి, నయతమ్=పొందించుఁడు. మా జిహ్వరతమ్=కుటిలముగఁ బోవలదు. (అసురులకుఁ జెందనీయ వలదు.)

తాత్పర్యము: ఓ హవిర్ధానములారా! మీ రీ యాగమును బాధారహితముగఁ జేయుఁడు. మఱియు ఈ యజ్ఞమును ఊర్ధ్వలోకమునను న్న దేవతలకుఁ బొందించుఁడు, అసురులకుఁ జెందనీయ వలదు. (అధ్వర్యుఁ డీ మంత్రము చెప్పుచు యజ్ఞశాలయందున్న రెండుహవిర్ధానము(శకటము)లను ప్రార్థించవలెను.)

6. అర్థము: (హే శకటీ=ఓ శకటములారా!, యువామ్=మీరు) అత్ర=ఈ ఉత్తరవేదియందలి, పృథివ్యాః=భూమి యొక్క, వర్ష్మన్=(దేవయజన మనెడి)శరీరమునందు, రమేథామ్=విహరించుఁడు.

తాత్పర్యము: ఓ శకటములారా! మీరు ఉత్తరవేదియొక్క పశ్చిమభాగమునందలి మొదటి మూఁడడుగుల ప్రదేశమును విడిచి మిగిలిన ప్రదేశమునందు విహరించుఁడు. (ఉత్తరవేదియందలి ఆహవనీయాగ్నికి పశ్చిమభాగమున మొదటి మూఁడడుగుల ప్రదేశమును వదలి మిగిలిన భూమియందు మూఁడు ఫలకములతోఁగూడిన చక్రము నందలి నాభిసహిత మధ్యమ ఫలకమునందు హవిర్ధానము లనెడి రెండు శకటముల నుంచవలెను.)

7. అర్థము: హే విష్ణో!ఓ విష్ణూ! దివః వా=ద్యులోకమునుండికాని, ఉత=లేక, పృథివ్యాః వా=భూలోకమునుండికాని, మహః వా=మహర్లోకమునుండికాని, అన్తరిక్షాత్ వా=అంతరిక్షలోకమునుండికాని, (ఆనీతైః=తీసికొనిరాఁబడిన) బహుభిః=అనేకములైన, వసవ్యైః=ధనసముదాయములచేత, హస్తౌ=స్వహస్తములను, పృణస్వ=నిండింపుము. హే విష్ణో!=ఓ విష్ణూ! దక్షిణాత్=(ధనముతో నిండిన)కుడి చేతినుండి, సవ్యాత్=ఎడమచేతినుండి(యు) ఆప్రయచ్ఛ=అనేక పర్యాయములు ప్రకృష్టముగా(మణిముక్తాదుల)నిమ్ము. యః=ఏ విష్ణుమూర్తి, పార్థివాని=పృథివీ సంబంధములైన, రజాంసి=అణువులను, విమమే=నిర్మించెనో, యః=ఏ విష్ణుమూర్తి, ఉత్తరమ్=ఉపరివర్తియగు, సధస్థమ్=దేవతలకు సహవాసస్థానమైన స్వర్గమును, అస్కభాయత్=(క్రింద పడకుండ పైన) స్తంభింపఁజేసెనో, యః=ఏ విష్ణుమూర్తి, త్రేధా విచక్రమాణః=మూఁడడుగులచే ముల్లోకముల నాక్రమించినవాఁడై, ఉరుగాయః=మహాత్ములచే గానము చేయఁబడెనో, విష్ణోః=(అ)విష్ణువు యొక్క, వీర్యాణి నుకమ్=ఘనకార్యములను, ప్రవోచమ్=చెప్పుచున్నాను.

తాత్పర్యము: ఓ విష్ణూ! నీవు స్వర్గలోకమునుండికాని, భూలోకమునుండికాని, అంతరిక్ష మహర్లోకముల నుండికాని తీసికొనిరాఁబడిన ధనములతో నీ చేతులను నింపి ఆ చేతులనుండి మణిముక్తాదులను మా కిమ్ము. పృథివీ వికారములగు పరమాణువులను నిర్మించినట్టియు, దేవతల నివాసమునకై స్వర్గలోకమును క్రిందపడకుండ పైన స్తంభింపఁ జేసినట్టియు, మూఁడులోకములందు మూఁడు అడుగుల నుంచినట్టియు విష్ణుమూర్తి ఘనకార్యములను నేను కీర్తించుచున్నాను.

8. అర్థము: (హే దర్భమాలే=ఓ దర్భమాలా! త్వమ్=నీవు) విష్ణోః=విష్ణువునకు, రరాటమ్=లలాటము, అసి=అగుచున్నావు,

వివరణము: యజ్ఞశాలయందు హవిర్ధాన మండప మొకటి యుండును. ఆ మండపముయొక్క తూర్పు దిక్కునందున్న రెండు స్తంభములయందు దర్భలమాల కట్టఁబడి యుండును. ఆ దర్భమాల యిచట సంబోధింపఁబడుచున్నది. హవిర్ధాన మండపము విష్ణుదేవతాకము కావున అది విష్ణువుగా నారోపింపఁబడినది. అట్టి విష్ణు స్వరూపమైన హవిర్ధాన మండపమునకు దర్భమాల లలాటము వంటిది. కనుబొమ్మల మధ్యమందు స్థానమునకు లలాటమని పేరు.

9. అర్థము: (హే దర్భమాలే! త్వమ్) విష్ణోః=విష్ణు స్వరూపమైన హవిర్ధాన మండపమునకు, పృష్ఠమ్=పృష్ఠ(వెనుక) భాగము, అసి=అగుచున్నావు. తాత్పర్యము స్పష్టము.

10. అర్థము: (హే ఉపరి ఆచ్ఛాదిత చర్మణీ!=పైనఁగప్పఁబడిన చర్మములారా!, యువామ్=మీరు) విష్ణోః=విష్ణుస్వరూపమైన హవిర్ధానమండపమునకు, శ్నప్త్రే=దవడలు, స్థః=అగుచున్నారు. తాత్పర్యము స్పష్టము.

11. అర్థము: (హే రజ్జో!=ఓ రజ్జువా!, త్వమ్=నీవు) విష్ణోః=విష్ణుస్వరూపమైన హవిర్ధాన మండపమునకు, స్యూః=బంధన హేతువు, అసి=అగుచున్నావు. తాత్పర్యము స్పష్టము.

12. అర్థము: (హే గ్రన్థే!=ఓ గ్రంథీ!, త్వమ్=నీవు) విష్ణోః=విష్ణుస్వరూపమైన హవిర్ధాన మండపమునకు, ధ్రువమ్=దృఢము, అసి=అగుచున్నావు. (హే హవిర్ధాన!=ఓ హవిర్ధాన మండపమా! త్వమ్=నీవు) వైష్ణవమ్=విష్ణు దేవతాకము, అసి=అగుచున్నావు. విష్ణవే=విష్ణు ప్రీతికొఱకు, త్వా=నిన్ను, (స్పృశామి=తాకుచున్నాను.)

త్రయోదశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ద్వితీయప్రపాఠకే చతుర్దశోఽనువాకః

మూలము: [1]కృణుష్వ పాజః ప్రసితిం న పృథ్వీం యాహి రాజేవా మవాగ్ం ఇభేన। తృష్వీ మను ప్రసితిం ద్రూణానో ఽస్తాసి విధ్య రక్షస స్తపిష్ఠైః। [2]తవ భ్రమాస ఆశుయా పత న్త్య నుస్పృశ ధృషతా శోశుచానః। తపూగ్ంషృగ్నే జుహ్వా పతఙ్గా నసందితో విసృజ విష్వ గుల్కాః। [3]ప్రతి స్పశో విసృజ తూర్ణితమో భవా పాయు ర్విశో అస్యా అదబ్ధః। యో నో దూరే అఘశగ్ంసః (౧)యో అ న్త్యగ్నే మాకి ష్టే వ్యథి రాదధర్షీత్। [4]ఉ దగ్నే తిష్ఠ ప్రత్యా తనుష్వ న్య మిత్రాగ్ం ఓషతా త్తిగ్మహేతే। యో నో అరాతిగ్ం సమిధాన చక్రే నీచా తం ధక్ష్య తసం న శుష్కమ్। [5]ఊర్ధ్వో భవ ప్రతి విధ్యా ధ్య స్మ దావిష్కృణుష్వ దైవ్యా న్యగ్నే। అవస్థిరా తనుహి యాతుజూనాం జామి మజామిం ప్రమృణీహి శత్రూన్। [6]సతే (౨)జానాతి సుమతిం యవిష్ఠ య ఈవతే బ్రహ్మణే గాతు మైరత్। విశ్వా న్యస్మై సుదినాని రాయో ద్యుమ్నా న్యర్యో వి దురో అభి ద్యౌత్। [7]సే దగ్నే అస్తు సుభగ స్సుదాను ర్య స్త్వా నిత్యేన హవిషా య ఉక్థైః। పిప్రీషతి స్వ ఆయుషి దురోణే విశ్వే దస్మై సుదినా సా ఽసదిష్టిః। [8]అర్చామి తే సుమతిం ఘోష్య ర్వా క్సం తే వావాతా జరతామ్ (౩) ఇయం గీః। స్వశ్వా స్త్వా సురథా మర్జయే మా స్మే క్షత్రాణి ధారయే రనుద్యూన్। [9]ఇహ త్వా భూ ర్యా చరే దుప త్మ న్దోషావ స్తర్దీదివాగ్ంస మనుద్యూన్। క్రీడన్త స్త్వా సుమనస స్సపేమా భి ద్యుమ్నా తస్థివాగ్ంసో జనానామ్। [10]యస్త్వా స్వశ్వ స్సుహిరణ్యో అగ్న ఉప యాతి వసుమతా రథేన। తస్య త్రాతా భవసి తస్య సఖా య స్త ఆతిథ్య మానుష గ్జుజోషత్। [11]మహో రుజామి (౪) బన్ధుతా

వచోభి స్త్వా పితు ర్గోతమా దన్వియాయ త్వం నో అస్య వచస శ్చికిద్ధి హోత ర్యవిష్ఠ సుక్రతో దమూనాః। [12]అస్వప్నజ స్తరణయ స్సుశేవా అతన్ద్రాసో ఽవృకా అశ్రమిష్ఠాః। తే పాయవ స్సధ్రియఞ్చో నిషద్యా గ్నే తవ నః పాన్త్వ మూర। [13]యే పాయవో మామతేయం తే అగ్నే పశ్యన్తో అన్ధం దురితా దరక్షన్। రరక్ష తా న్సుకృతో విశ్వవేదా దిప్సన్త ఇ ద్రిపవో నాహ దేభుః। [14]త్వయా వయగ్ం సధన్య స్త్వోతా స్తవ ప్రణీ త్యశ్యామ వాజాన్। ఉభాశగ్ంసా సూదయ సత్యతాతే ఽనుష్ఠుయా కృణు హ్యహ్రయాణ। [15]అయా తే అగ్నే సమిధా విధేమ ప్రతి స్తోమగ్ం శస్యమానం గృభాయ। దహా శసో రక్షసః పాహ్య స్మా న్ద్రుహో నిదో మిత్రమహో అవద్యాత్। [16]రక్షోహణం వాజిన మా జిఘర్మి మిత్రం ప్రథిష్ఠ ముపయామి శర్మ। శిశానో అగ్నిః క్రతుభి స్సమిద్ధ స్స నో దివా (౬) స రిషః పాతు నక్తమ్। [17]వి జ్యోతిషా బృహతా భాత్య గ్ని రావి ర్విశ్వాని కృణుతే మహిత్వా। ప్రా దేవీ ర్మాయా స్సహతే దురేవా శ్శిశీతే శృఙ్గే రక్షసే వినిక్షే। [18]ఉత స్వానాసో దివి షన్త్వ గ్నే స్తిగ్మాయుధా రక్షసే హ న్తవాఉ। మదేచి దస్య ప్ర రుజ న్తి భామా న వరన్తే పరిబాధో అదేవీః ॥౭॥ (అఘశగ్ంసః స తేజ రతాగ్ం రుజా మిహ ది వైకచత్వారిగ్ంశ చ్చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ద్వితీయప్రపాఠకే చతుర్దశోఽనువాకః

[ఆవ ఉన్ద త్వాకూత్యై దైవీమియంవ స్వ్యస్యగ్ం శునా సోమ ముదాయుషా ప్రచ్యవస్వాగ్నే రాతి ర్యమగ్ంశు రగ్ంశు ర్విత్తాయనీమే ఽసి యుఞ్జతే కృణుష్వ పాజ శ్చతుర్దశ ॥౧౪॥] (ఆపో వస్వ్యసి యాతవేయం గీశ్చతు స్త్రిగ్ంశత్ ॥౩౪॥) హరిః ఓమ్।

ఇతి కృష్ణ యజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ద్వితీయః ప్రపాఠకః ॥౨॥

వేదార్థ దీపిక

అవతారిక: త్రయోదశానువాకమునందు హవిర్ధాన మండప నిర్మాణము చెప్పఁబడినది. ఈ యనువాకమునందు కామ్యములైన సామిధేనీ యాజ్యా పురోనువాక్య మంత్రములు చెప్పఁబడుచున్నవి. ఇష్టి కాండయందు వ్రాతపత్యేష్టికి పిమ్మట రక్షోఘ్నేష్టి విహితమైనది. ఈ యనువాకమునందుఁగల పదునెనిమిది ఋక్కులన్నియు ఆ రక్షోఘ్నేష్టియందు వినియుక్తములైనవి. వీనిలో పదునైదు ఋక్కులు సామిధేనీ ఋక్కులు. ఒకటి పురోనువాక్య. రెండు యాజ్యలుగా నున్నవి.

1. సామిధేనీఋక్కు: (హే అగ్నే!=ఓ యగ్నీ! త్వమ్=నీవు) పృథ్వీం ప్రసితిం న=(మృగ బంధనమునకై) ప్రసారితమైన గొప్ప పాశము వలె, పాజః=(రక్షోనివారణమునకై) గొప్ప బలమును, కృణుష్వ=(కలుగ) చేయుము. అమవాన్=అమాత్య యుక్తుఁడును, ఇభేన(సహితః)=ఏనుఁగుతోఁ గూడిన వాఁడునగు, రాజేవ=రాజువలె, యాహి=(రాక్షసులపైకి)పొమ్ము. తృష్వీమ్=శీఘ్ర గామిని యగు, ప్రసితిమను=గొప్ప శత్రుసేన ననుసరించి (వెళ్ళి), ద్రూణానః=హింసించుచున్న వాఁడవై, అస్తాసి=(మిగిలిన సేనను) పాఱదోలిన వాఁడ వగుము. రక్షసః=పరుగిడుచున్న రాక్షసులను, తపిష్ఠైః=పదునైన బాణముల చేత, విధ్య=పొడువుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు మృగమును బంధించుటకు ప్రసారితమైన గొప్ప పాశమును వలె గొప్ప బలమును రాక్షస నివారణమునకై కలుగఁజేయుము. అమాత్యయుక్తుఁడై యేనుఁగుమీఁద నున్న రాజువలె రాక్షసులపైకిఁ బొమ్ము. గొప్ప శత్రు సేనను వెంబడించి హింసించుచు పాఱిపోవుచున్న మిగిలిన సేనను పాఱఁదోలుము. పాఱిపోవుచున్న మిగిలిన సేనను బాణములతో గ్రుచ్చుము.

౨. సామిధేనీఋక్కు: అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ!, తవ=నీకు సంబంధించిన, భ్రమాసః=భ్రమణ శీలములైన విస్ఫు లింగములు, ఆశు యాః=శీఘ్రముగఁ బోవుచున్నవై, విష్వక్=అంతటను, పతన్తి=పడుచున్నవి. (త్వమపి=నీవు కూడ) శోశుచానః=మిక్కిలి ప్రజ్వలించు చున్నవాఁడవై, ధృషతా=ధార్ష్ట్యముతో, (=దిట్టతనముతో) అనుస్పృశ=(విస్ఫులింగములతో ఆ యసురులను) తాకుము. (అపి చ=మఱియు) జుహ్వా=హుతమైన హవిస్సుతో, అసందితః=అవిచ్ఛిన్నుఁడవై, పతఙ్గాన్=పతనశీలములయిన, తపూంషి=తపింపఁ జేయునట్టి విస్ఫులింగములను, ఉల్కాః=మహాజ్వాలలను, విసృజ=విశేషముగ సృష్టించుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! తిరుగునట్టి స్వభావము గల నీ విస్ఫులింగములు అంతటను పడుచున్నవి. నీవు కూడ ఎక్కువగ ప్రజ్వలించు చున్నవాఁడవై దిట్టతనముతో ఆ యసురులను తాకుము. హుతమైన హవిస్సుతోఁ గూడిన వాఁడవై పతనశీలములును, తపింపఁ జేయునవియునగు విస్ఫులింగములను, మహాజ్వాలలను, ఆ యసురులను బాధించుటకై విశేషముగ సృష్టించుము.

౩. సామిధేనీ ఋక్కు: అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ! అఘశగ్ంసః=చిత్రవధ చేయునట్టి, యః=ఏ శత్రువు, (రాక్షసుఁడు) నః=మాకు, దూరే=దూరమునందు, (అస్తి=కలఁడో) యః=ఏ వైరి, అన్తి=సమీపమునందు, (వర్తతే=ఉంటున్నాఁడో) (తమ్) ప్రతి=వానిని గూర్చి, (త్వమ్=నీవు) తూర్ణితమః=అతివేగము కలవాఁడవై, స్పశః=పాశములను, విసృజ=వివిధములైన వానిని సృజించుము. అదబ్ధః=(ఎవ్వనిచేతను) హింసింపఁబడని వాఁడవైన నీవు, అస్యాః=ఈ(మావంటి) విశః=ప్రజకు, పాయుః=పాలకుఁడవు, భవా=అగుము. వ్యథిః=బాధను గలుగఁజేయు ఏ రాక్షసుఁడును, తే=నీ యొక్క, (సమీపమునందు) మా కిరాదధర్షీత్=సర్వత్ర ధృష్టుఁడు కాకుండుఁగాక.

తాత్పర్యము: ఓ యగ్నీ! చిత్రవధ చేయునట్టి రాక్షసుఁడైన యే శత్రువు మా దగ్గఱను దూరమునందును ఉండెనో, వానిని బంధించుట కర్హములైన యనేక పాశములను శీఘ్రముగ సృజింపుము. ఎవ్వని చేతను హింసింపఁబడని నీవు మాబోటి ప్రజానీకమునకు పాలకుఁడ వగుము. బాధాకరుఁడగు ఏ రాక్షసుఁడును నీ సమీపమున అంతటను దిట్టతనము కలవాఁడు కాకుండుఁగాక.

4. సా.ఋక్కు. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ!, (త్వమ్=నీవు), ఉత్తిష్ఠ=లెమ్ము. ప్రతి=శత్రువులను గూర్చి, ఆతనుష్వ=అంతటను ప్రవర్తింపుము. హే తిగ్మహేతే!=తీక్ష్ణమైన ఆయుధము కల ఓ యగ్నీ!, అమిత్రాన్=శత్రువులను, న్యోషతాత్=నిశ్శేషముగ దహింపుము. హే సమిధాన!=వేల్చబడుచున్న ఓ యగ్నీ!, యః=ఎవడు, నః=మాకు, అరాతిమ్=శత్రుత్వమును, చక్రే=చేసెనో, తమ్=వానిని, నీచా=అధమునిగాఁ జేసి, శుష్కమ్=ఎండిన, అతసం న=కాష్ఠమును వలె, ధక్షి=భస్మము చేయుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు లెమ్ము. (కార్యోన్ముఖుఁడవు కమ్ము.) శత్రువులను గూర్చి అంతటను ప్రవర్తింపుము. తీక్ష్ణమైన ఆయుధము గల ఓ యగ్నీ! నీవు శత్రువులను నిశ్శేషముగ దహింపుము. (=కాల్చుము.) వేల్చఁబడుచున్న ఓ యగ్నీ! మాతో శత్రుత్వము బూనిన వానిని నీచునిగాఁ జేసి యెండిన కట్టెను వలె భస్మము చేయుము. (సమిధాన=సమిధ్యమాన అగ్నే!, నీచా=నీచం కృత్వా.)

5. సా.ఋ: అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ! (త్వమ్=నీవు) ఊర్ధ్వః=ఉద్యుక్తుఁడవు, భవ=అగుము. అస్మదధి=మా పైకి వచ్చిన శత్రువులను, ప్రతివిధ్య=బాధింపుము. దైవ్యాని=దైవికములైన, వీర్యాణి=శక్తులను, అవిష్కృణుష్వ=ఆవిష్కరింపుము. యాతుజూనామ్=రాక్షసుల యొక్క, స్థిరా=స్థిరములైన శక్తులను, అవతనుహి=తగ్గిపోవునట్లు చేయుము. జామిమ్=(మాటి మాటికి కొట్టఁబడిన) శత్రువును, అజామిమ్=కొట్టఁబడని శత్రువును, శత్రూన్=సర్వశత్రువులను, ప్రమృణీహి=సంహరింపుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు ఉద్యుక్తుఁడవు కమ్ము. దైవిక శక్తుల నావిష్కరింపుము. రాక్షసుల యొక్క స్థిరములైన శక్తులను క్షీణింపఁజేయుము. మాటి మాటికి కొట్టఁబడినట్టియు, కొట్టఁబడనట్టియు శత్రువుల నందఱిని సంహరింపుము.

6. సా.ఋ. అర్థము: హే యవిష్ఠ! నిండు యౌవనము కల ఓ యగ్నీ!, యః=ఏ యజమానుఁడు, ఈవతే=(స్వగృహమును గూర్చి) వెళ్లువాఁడవును, బ్రహ్మదే=అంతటను వ్యాపించి యున్నవాఁడవు నగు నీ కొఱకు, గాతుమ్=హవీరూపమైన యన్నమును, భరత్=ఇచ్చుచున్నాఁడో, సః=(ఏవ)ఆ యజమానుఁడే, (త్వదనుగ్రహ యుక్తాం) సుమతిమ్=నీ యనుగ్రహముతోఁ గూడిన మంచి బుద్ధిని, జానాతి=తెలిసికొనుచున్నాఁడు. (త్వమపి=నీవు కూడ) అర్యః=స్వామివై, రాయః=ధనములను, ద్యుమ్నాని=కీర్తులను, దురః అభి=గృహముల నుద్దేశించి, అస్మై=ఈ యజమానుని కొఱకు, విశ్వాని=అన్నిటిని, సుదినాని=సుదినములనుగా, విద్యోత్=ప్రకాశింపఁజేయుము.

తాత్పర్యము: నిండు యౌవనముకల యగ్నీ! స్వగృహమునకుఁబోవు వాఁడవును అంతటను వ్యాపించి యున్నవాఁడవును నగు నీ కొఱకు హవిస్సు నిచ్చుచున్న యజమానుఁడే నీ మంచి బుద్ధిని తెలిసికొనుచున్నాఁడు. నీవును స్వామివై ధనములను కీర్తులను గృహములను ఉద్దేశించి ఈ యజమానున కన్ని దినములును మంచివి యగునట్లుగా అనుగ్రహింపుము.

7. సా.ఋ: అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ! యః=ఏ యజమానుఁడు, స్వఆయుషి=యావజ్జీవితము, దురోణే=స్వగృహమునందు, నిత్యేన=నిత్యమైన, (ప్రతి దిన మనుష్ఠింపఁదగిన) హవిషా=హవిస్సుచేత, (త్వామ్=నిన్ను) పిప్రీషతి=సంతోషపెట్టుట కిచ్ఛయించుచున్నాఁడో, యః=ఏ యజమానుఁడు, ఉక్థైః=శస్త్రముల(=మంత్ర విశేషముల)చేత, పిప్రీషతి=సంతోషపెట్టఁ గోరుచున్నాఁడో, సేత్=ఆ యజమానుఁడే, సుభగః=సౌభాగ్యవంతుఁడు, సుదానుః=మంచి దానము కలవాఁడును, అస్తు=అగుఁగాక. అస్మై=ఈ యజమానుని కొఱకు సా, విశ్వేత్, ఇష్టిః=ఆ సమస్తేష్టియు, సుదినా=మంచిదినము కలదిగా, అసత్=అగుచున్నది.

తాత్పర్యము: ఓ యగ్నీ! స్వగృహమునందు జీవిత పర్యంతము నిత్య హవిస్సుచేతను, మంత్ర విశేషములగు శస్త్రముల చేతను నిన్ను సంతోషపఱచుచున్న యజమానుఁడే సౌభాగ్యవంతుఁడు, మంచి దానము కలవాఁడునగుఁగాక. అట్టి యజమానునకు ఆ సమస్తేష్టియు మంచి దినములుకలది యగుచున్నది. ('అసత్'=వర్తమానార్థమున వైదిక ప్రయోగము. సేత్=స ఏవ, విశ్వేత్=విశ్వా అపి)

8. సా.ఋ. అర్థము: (హే అగ్నే!=ఓ యగ్నీ!) తే=నీ యొక్క, సుమతిమ్=అనుగ్రహ బుద్ధిని, అర్చామి=(మనస్సుతో) పూజించుచున్నాను. అర్వాక్=నవీనమైనదియు, ఘోషి=స్తుతి రూపమైనదియు, హవాతా=మాటి మాటికి ప్రసరించు చున్నదియు నగు, ఇయం గీః=ఈ(నా)వాక్కు, తే=నీయందు, సంజరతామ్=బాగుగా జీర్ణించుఁ గాక. (నిన్ను విడిచి మఱియొక చోటుకు వెళ్ళకుండుఁ గాక.) (వయం తు=మేమైతే నీ యనుగ్రహమువలన) స్వశ్వాః=మంచి గుఱ్ఱములు కలవారము, సురథాః=మంచి రథములు కలవారమునై, త్వా=నిన్ను, మర్జయేమ=సేవింతుము. (త్వమపి=నీవు కూడ) అనుద్యూన్=అనుదినము, అస్మే=మాయందు, క్షత్రాణి=సామర్థ్యములను, ధారయేః=ధరింపఁజేయుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీ యనుగ్రహ బుద్ధిని మానసికముగ నేనుఁ బూజించుచున్నాను. అర్వాచీనమైనను స్తుతిరూపమైన నా యీ వాక్కు మాటి మాటికిఁ బలుకఁబడుచున్నదై నీ యందు బాగుగా జీర్ణించుఁగాక. అనఁగా నిన్ను విడిచి మఱియొక చోటునకుఁ బోకుండుఁ గాక. మేము నీ యనుగ్రహము వలన మంచి గుఱ్ఱములు రథములతోఁ గూడిన వారమై నిన్ను సేవించెదము. నీవును ప్రతిదినము మా యందు సామర్థ్యములను గల్పించుము.

9. సా.ఋ. అర్థము: (హే అగ్నే!=ఓ యగ్నీ!) ఇహ=ఈ లోకమునందు, (శ్రేయస్కామః=శ్రేయస్సును గోరువాఁడు) దోషావస్తర్దివాంసమ్=రేయుంబవల్లు ప్రకాశించుచున్న, త్వా=నిన్ను, అనుద్యూన్=ప్రతిదినము, భూరి=బహుళముగ, త్మన్=తన నిమిత్తము, ఆ ఉపచరేత్=అంతటను సేవించును. (తతః=అందువలన, వయమ్=మేము) క్రీడన్తః=సంతోషించుచున్న వారమును, సుమనసః=మంచి మనస్సు కల వారమును, జనానామ్=జనులలో, ద్యుమ్నా=ధనములను, అభి తస్థివాంసః=పొందినవారమునై, త్వా=నిన్ను, సపేమ=సేవించెదము. (కలిసికొందుము.)

తాత్పర్యము: ఓ యగ్నీ! ఈ లోకమునందు శ్రేయస్కాముఁడయిన పురుషుఁడు అనుదినము రాత్రింబవళ్లు తననిమిత్తము అధికముఁగ నిన్ను సేవించును. కావున సంతుష్టమైన మంచి మనస్సు కలవారమై మేము నీ యనుగ్రహము వలన ప్రజలలో ధనవంతులమై నిన్ను సేవించెదము.

10. సా.ఋ. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ! (త్వదనుగ్రహాత్=నీ యనుగ్రహము వలన) స్వశ్వః=మంచి గుఱ్ఱములు కలవాఁడును, సుహిరణ్యః=మంచి బంగారము కలవాఁడును అగు, యః=ఏ యజమానుఁడు, వసుమతా=హవిస్స్వరూప ధనము కల, రథేన=రథముతోఁగూడ, త్వా=నిన్ను, ఉపయాతి=సమీపించు చున్నాఁడో, తస్య=ఆ యజమానునకు, (త్వమ్=నీవు) త్రాతా=రక్షకుఁడవు, భవసి=అగుచున్నావు. (అపి చ=మఱియు) యః=ఏ యజమానుఁడు, తే=నీకు, ఆతిథ్యమ్=అతిథి సత్కారమును, ఆనుషక్=ప్రతిదినము, జుజోషత్=ప్రీతి పూర్వకముగఁజేయుచున్నాఁడో, తస్య=అతనికి, (త్వమ్=నీవు) సఖా భవసి=మిత్రునివలె స్వాధీనుఁడవగుచున్నావు.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీ యనుగ్రహమువలన మంచి గుఱ్ఱములు, యోగ్యమైన బంగారము కలిగి హవీరూప ధనముతోఁ గూడ నిన్నుఁ జేరుచున్న యజమానునకు నీవు రక్షకుఁడ వగుచున్నావు. మఱియు ప్రతిదినము ప్రీతి పూర్వకముగ నీ కతిథి సత్కారము చేయుచున్న యజమానునకు నీవు మిత్రునివలె స్వాధీనుఁడ వగుచున్నావు.

11. సా.ఋ. అర్థము: (హే అగ్నే! ఓ యగ్నీ!) బన్ధుతా=నీ బాంధవ్యముచేత, మహః=(అసురుల) తేజస్సును, వచోభిః=అధిక్షేపరూప వాక్కులచేత(నే), రుజామి=భగ్నము చేయుచున్నాను. తత్=ఆ నీ బంధుత్వమును, గోతమాత్=గోతమునివంటి అధ్యాపకుఁడైన, పితుః=తండ్రినుండి, మా=నన్ను, అన్వియాయ=పొందించుము. యవిష్ఠ=యువతముఁడవును, సుక్రతోః=శోభన క్రతువులు కలవాఁడవును, (=యాగ నిష్పాదకుఁడు)దమూనాః=దాన్తమనస్సు కలవాఁడవునగు, హెహోతః!=దేవతల నాహ్వానించునట్టి ఓ యగ్నీ! త్వమ్=నీవు, నః=మాయొక్క, అస్య వచసః=అధ్యయనము చేయఁబడిన ఈ వేద వాక్కుయొక్క, (రహస్యమును,) చికిద్ధి=తెలిసికొనుచున్నావు.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీ బంధుత్వము (సంబంధము) చే నసురుల తేజస్సును అధిక్షేప వాక్యములచేతనే భగ్నము చేయుచున్నాము. నీ బంధుత్వమును గోతముని వంటి ఉపాధ్యాయుఁడగు నా తండ్రినుండి నాకు సంక్రమింపఁజేయుము. దేవతల నాహ్వానించునట్టి ఓ యగ్నీ! నీవు యువతముఁడవు. శోభన క్రతువులు కలవాఁడవు. (=యాగ నిష్పాదకుఁడవు.) అట్టి నీవు మే మధ్యయనము చేసిన వేదముయొక్క రహస్యమును తెలిసికొనుచున్నావు. (దాన్తః=బహిరింద్రియ నిగ్రహము కలవాఁడు, లేక, తపము వలని కష్టము నోర్చువాఁడు, లేక ఆచార్యులచే శిక్షింపఁబడినవాఁడు.)

12. సా.ఋ. అర్థము: అమూరః=మూర్ఛా రహితుఁడవైన, హే అగ్నే!=ఓ యగ్నీ! అస్వప్నజః=మిథ్యా రహితములును, సుశేవాః=సుఖముగా సేవించుటకు యోగ్యమైనవియు, అతన్ద్రాసః=ప్రమత్తములు కానివియు, (=అప్రమత్తాః), అవృకాః=హింసించునవి కానివియు, అశ్రమిష్ఠాః=శ్రమరహితములును, పాయవః=పాలించునవియు, సధ్రియఞ్చః=ఒక్కమారుగా ప్రసరించునవియునగు, తవ=నీయొక్క, తే తరణయః=దురితరూప తమస్సును పోఁగొట్టునట్టి ఆ కిరణములు, నిషద్య=యాగప్రదేశమునందుండి, నః=మమ్ము, పాన్తు=రక్షించుఁగాక.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీ కిరణములు మిథ్యారహితములు, మూర్ఛా రహితములు, దురితరూప తమస్సును పోఁగొట్టునవి, సుఖసేవ్యములు, ప్రమత్తములు కానివి, హింసింపనివి, శ్రమరహితములు, పాలకములు, ఒక్కమారుగా సంతతను ప్రసరించునవి. అట్టి నీ కిరణములు ఈ యాగప్రదేశమునందుండి మమ్ము రక్షించుఁగాక.

13. సా.ఋ. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ! తే=నీ యొక్క, యే=ఏ, పాయవః=పాలించునట్టి కిరణములు, మామతేయమ్=మమత యనెడి స్త్రీ యొక్క సంతానమును, అన్ధమ్=గ్రుడ్డిదానినిగా, పశ్యన్తః=చూచుచున్నవై, దురితాత్=గ్రుడ్డితన మనెడి పాపమునుండి, అరక్షన్=రక్షించెనో, విశ్వవేదాః=సర్వమును తెలిసినవాఁడవైన నీవు, సుకృతః=మంచి పనులుకల, తాన్=ఆ కిరణములను, రరక్ష=రక్షించితివి. రిపవః=శత్రువులు(=రాక్షసులు) దిప్సన్త ఇత్=ఆ కిరణములను పరిభవించఁదలఁచినను, నా హదేభుః=పరిభవింపలేరైరి.

తాత్పర్యము: ఓ యగ్నీ! పరిపాలకములైన నీ కిరణములు మమత యనెడి స్త్రీయొక్క సంతానమును గ్రుడ్డిదానినిగాఁ జూచినవై గ్రుడ్డితనమనెడి పాపమునుండి రక్షించినవి. విశ్వవేత్తవగు నీవు శోభన కర్మగల ఆ కిరణములను రక్షించితివి. శత్రువులైన రాక్షసు లా కిరణములను పరిభవింపఁదలఁచినను పరిభవింపలేరైరి.

14. సా.ఋ. అర్థము: (హే అగ్నే!=ఓ యగ్నీ!) త్వయా=నీతో, సధన్యః=కూడ యజ్ఞ కర్మను కొనసాగించు చున్నవారమును, త్వోతాః=నీచే రక్షింపఁబడిన వారమునగు, వయమ్=మేము, తవ=నీ యొక్క, ప్రణీతి=ప్రేరణచేత, వాజాన్=అన్నములను, అశ్యామ=తినుచున్నాము. హే సత్యతాతే!=సత్యమును విస్తరింపఁజేయునట్టి ఓ యగ్నీ!, ఉభాశంసా=మాచే కొనియాడఁబడుచున్న ఐహికాముష్మికము లనెడి పురుషార్థములను రెండింటిని, సూదయ=ఇమ్ము. హే అహ్రయమాణ!=భక్తులకు సిగ్గును జేయని ఓ యగ్నీ! అనుష్ఠుయా=సాధనము ననుష్ఠింపఁ జేయుటచేత, కృణుహి=(ఐహికాముష్మికములను రెండింటిని) చేయుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! మేము నీతోఁగూడ యజ్ఞమును కొనసాగించు చున్నవారము. నీచే రక్షింపఁబడినవారము. అట్టి మేము నీ ప్రేరణచేత అన్నము తినుచున్నాము. ఓ యగ్నీ! నీవు సత్యమును వ్యాపింపఁజేయువాఁడవు. మేము కోరునట్టి యైహికాముష్మికములను రెండింటి నిమ్ము. భక్తులకు సిగ్గు కలిగించని ఓ యగ్నీ! ఐహికాముష్మికముల ప్రాప్తికి సాధనములైన వాని ననుష్ఠింపఁజేయుట మూలమున ఐహికాముష్మికములను కలుగఁజేయుము.

14 సా.ఋ. అర్థము: (హే అగ్నే!=ఓ యగ్నీ!; త్వమ్=నీవు) అయా=ఈ, సమిధా=సామిధేనీ ఋక్కుచేత, తే=నిన్ను, (ద్వితీయార్థమున షష్ఠి) విధేమ=సేవింతుము. శస్యమానమ్=(మాచే) స్తుతింపఁబడుచున్న, స్తోమమ్=స్తోత్రమును, ప్రతి గృభాయ=ప్రతిగ్రహించుము. అశసః=అప్రశస్తులైన, రక్షసః=రాక్షసులను, దహ=కాల్చుము. హే మిత్రమహః=ఉపకారకమైన తేజస్సుకల ఓ యగ్నీ!, ద్రుహః=వైరికృత ద్రోహమునుండి, నిదః=వైరికృతమైన నిందనుండి, అవద్యాత్=అనుష్ఠాన దోషమునుండియు, అస్మాన్=మమ్ము, పాహి=రక్షించుము. (అయా='అనయా' అను పదమున కిది ఛాన్దసప్రయోగము.)

తాత్పర్యము: ఓ యగ్నీ! ఈసామిధేనీ ఋక్కుచే నిన్ను సేవింతుము. మేము చేయు స్తోత్రమును గ్రహించుము. అప్రశస్తులైన రాక్షసులను దహించుము. ఉపకారకమైన తేజస్సుగల ఓ యగ్నీ! వైరులు చేసిన ద్రోహము నుండియు, వారు చేసిన నిందనుండియు, అనుష్ఠాన దోషము నుండియు మమ్ము రక్షించుము.

16. పురోనువాక్య. అర్థము: రక్షోహణమ్=రాక్షసులను సంహరించువాఁడును, వాజినమ్=అన్నము కలవాఁడునగు,(అగ్నిమ్=అగ్నిని) ఆ జిఘర్మి=అభి ముఖముగా దీపింపఁజేయుచున్నాను. మిత్రమ్=(లోకములకు) మిత్రుఁడును, ప్రథిష్ఠమ్=అతి విస్తీర్ణుఁడును, శర్మ=రక్షకుఁడునగు నగ్నిని, ఉపయామి=సేవించుచున్నాను. క్రతుభిః=యజ్ఞములచే, సమిద్ధః=బాగుగ జ్వలింపఁ జేయఁబడినవాఁడును, శిశానః=తీక్ష్ణుఁడునగు, సః=ఆ, అగ్నిః=అగ్ని, దివా=పగటియందు, నః=మమ్ము, రిషః=హింసకునినుండి, పాతు=రక్షించుఁగాక. సః (ఏవ)=ఆ యగ్నియే, నక్తమ్=రాత్రియందు, (కూడ) పాతు=రక్షించుఁగాక.

తాత్పర్యము: రక్షస్సంహర్తయు, అన్నవంతుఁడునగు నగ్ని నభి ముఖముగా దీపింపఁజేయుచున్నాను. లోకములకు మిత్రుఁడును మిక్కిలి విస్తీర్ణుఁడును, రక్షకుఁడునగు అగ్నిని సేవించుచున్నాను. యజ్ఞములచే బాగుగ జ్వలింపఁ జేయఁబడినవాఁడును, తీక్ష్ణుఁడునగు ఆ యగ్ని హింసకునినుండి మమ్ము రేయుంబవలు రక్షించుఁగాక.

17. యాజ్య. అర్థము: (అయమ్=ఈ) అగ్నిః=అగ్ని, బృహతా=గొప్పదియగు, జ్యోతిషా=తేజస్సుచే, విభాతి=విశేషముగఁ బ్రకాశించుచున్నాఁడు. విశ్వాని=లోకములను, మహిత్వా=మాహాత్మ్యముచేత, ఆవిష్కృణుతే=ఆవిష్కరించుచున్నాఁడు. అదేవీః=అసుర సంబంధములైనవియు, దురేవాః=అతిక్రమించుటకు శక్యము కానివియునగు, మాయాః=మాయలను, ప్రసహతే=ఎక్కువగా నశింపఁజేయుచున్నాఁడు. రక్షసే=రాక్షసులను, వినిక్షే=నశింపఁజేయుటకు, శృంగే=రెండు జ్వాలలను, శిశీతే=తీక్ష్ణముగాఁ జేయుచున్నాఁడు.

తాత్పర్యము: ఈ యగ్ని గొప్ప తేజస్సుతో విశేషముగఁ బ్రకాశించుచున్నాఁడు. లోకములను మహిమచే నావిష్కరించుచున్నాఁడు. అసుర సంబంధములైనవియు, అతిక్రమించుటకు సాధ్యము కానివియునగు మాయల నధికముగ నశింపఁజేయుటకు రెండు జ్వాలలను తీక్ష్ణముగఁ జేయుచున్నాఁడు. ('రక్షసే' అను చతుర్థ్యంతము ద్వితీయార్థమున ప్రయుక్తమైనది)

18. యాజ్య. అర్థము: తిగ్మాయుధాః=తీక్ష్ణతయే ఆయుధముగాఁగలవియు, స్వానాసః=పురోడాశముచే ధ్వనిచేయుచున్నవియునగు, అగ్నేః=అగ్నియొక్క, (రశ్మయః=కిరణములు) రక్షసే+హన్తవా ఉ=రాక్షసులను సంహరించుటకు, ఉత దివి=ద్యులోకమునందుఁగూడ, షన్తు=ప్రసరించుఁగాక. అస్య=ఈ అగ్నియొక్క, భామాః=కాంతులు, మదేచిత్=మా సంతోషము కొఱకే, ప్రరుజన్తి=(శత్రువుల నధికముగ) నశింపఁజేయుచున్నవి. అదేవీః=అసుర సంబంధమైన, పరిబాధః=అంతటను జేయఁబడుచున్న బాధలు, న వరన్తే=మమ్ము నావరించుటలేదు.

తాత్పర్యము: తీక్ష్ణతయే ఆయుధముగాఁగలవియుఁ, బురోడాశముచే ధ్వనిచేయు చున్నవియునగు అగ్ని కిరణములు రాక్షసులను సంహరించుటకు ద్యులోకమునందుఁగూడ ప్రసరించుఁగాక. ఈ యగ్నికాంతులు మా సంతోషము కొఱకే శత్రువులను నశింపఁజేయుచున్నవి. అంతటను జేయు నాసుర బాధలు మమ్మావరించుటలేదు. 'పరిబాధః'=ఇది ఏకవచనాంతమైనను బహువచనార్థమున ప్రయుక్తమైనది. 'రక్షసే'—ద్వితీయార్థమున చతుర్థ్యంతము.

ద్వితీయ ప్రపాఠకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే తృతీయః ప్రపాఠకః

తత్ర ప్రథమోఽనువాకః।

హరిః ఓమ్।

మూలముః [1]దేవస్య త్వా సవితుః ప్రసవే ఽశ్వినో ర్బాహుభ్యాం పూష్ణో హస్తాభ్యా మాదదే [2]ఽభ్రి రసి
నారి రసి [3]పరిలిఖితగ్ం రక్షః పరిలిఖితా అరాతయ ఇద మహగ్ం రక్షసో గ్రీవా అపి కృన్తామి
యో ఽస్మా న్ద్వేష్టి యం చ వయం ద్విష్మ ఇద మస్య గ్రీవా అపి కృన్తామి [4]దివే త్వా ఽన్తరి
క్షాయ త్వా పృథివ్యై త్వా [5]శున్ధతాం లోకః పితృషదనో [6]యవో ఽసి యవయా స్మ ద్వేషః
(౧)యవయా రాతీః [7]పితృణాగ్ం సదన మస్య [8]ద్దివగ్ం స్తభానా న్తరిక్షం పృణ పృథివీం
దృగ్ంహ [9]ద్యుతాన స్త్వా మారుతో మినోతు మిత్రావరుణయో ర్ధ్రువేణ ధర్మణా [10]బ్రహ్మవనిం
త్వా క్షత్రవనిగ్ం సుప్రజావనిగ్ం రాయస్పోషవనిం పర్యూహామి [11]బ్రహ్మ దృగ్ంహ క్షత్రం
దృగ్ంహ ప్రజాం దృగ్ంహ రాయస్పోషం దృగ్ంహ [12]ఘృతేన ద్యావాపృథివీ ఆపృణేథా
[13]మిన్ద్రస్య సదో ఽసి విశ్వజనస్య ఛాయా [14]పరి త్వా గిర్వణో గిర ఇమా భవన్తు విశ్వతో
వృద్ధాయు మను వృద్ధయో జుష్టా భవన్తు జుష్టయ [15]ఇన్ద్రస్య స్యూ రసీ న్ద్రస్య ధ్రువ మస్యైన్ద్ర
మసీ న్ద్రాయ త్వా ॥౧॥ (ద్వేష ఇమా అష్టాదశ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే తృతీయప్రపాఠకే ప్రథమోఽనువాకః॥

వేదార్థదీపిక

అవతారికః ద్వితీయ ప్రపాఠకమునందు సోమక్రయమును ప్రధానముగఁజెప్పి పిమ్మట హవిర్ధాన మండప నిర్మాణ పర్యంతముగల కర్మ కలాపము ప్రతిపాదింపఁబడినది. ఈ మూఁడవ ప్రపాఠకమునందు ముఖ్యముగ అగ్నీ షోమీయ పశువు ప్రతిపాదింపఁబడుచున్నది. ఆ ప్రతిపాదనకు ముందు పూర్వోక్త శేషమైన సదోమండప నిర్మాణాదికము చెప్పఁబడుచున్నది.

1. అర్థము: (హే అభ్రే=‘అభ్రి’యను పేరుగల ఆయుధ విశేషమా!) త్వా=నిన్ను, సవితుః=ప్రేరకుఁడైన, దేవస్య=దేవుని యొక్క, ప్రసవే సతి=ప్రేరణ కలుగుచుండఁగా, అశ్వినోః=అశ్వినీ దేవతల యొక్క, బాహుభ్యామ్=బాహువులచేతను, పూష్ణః=పూష దేవతయొక్క, హస్తాభ్యామ్=హస్తముల చేతను, ఆదదే=స్వీకరించుచున్నాను.

తాత్పర్యము: ఓ అభ్రి యను ఆయుధ విశేషమా! ప్రేరకుఁడైన దేవుని ప్రేరణ కలుగుచుండగా అశ్వినీ దేవతల బాహువుల చేతను, పూషదేవుని చేతుల చేతను నిన్ను స్వీకరించుచున్నాను. (అభ్రి=భూమిని త్రవ్వుటకు సాధనమైనదియు, అగ్రభాగము పదనుగాఁగలదియు, మోదుగు కఱ్ఱతోఁ జేయఁబడినదియునగు త్రవ్వుకోలవంటి ఒక వస్తువు. అధ్వర్యుఁ డీ మంత్రము చెప్పుచు అభ్రిని చేతిలోనికి తీసికొనవలెను.)

2. అర్థము: (హే అభ్రే=ఓ యభ్రీ! త్వమ్=నీవు) అభ్రిః=అభ్రివి, (ఖనన సాధనము) అసి=అగుచున్నావు. నారిః=శత్రువు కానిదానవు, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: ఓ యభ్రీ! నీవు అభ్రి యను ఖనన సాధనమైనను, మాకు శత్రువు కాని దానవు అగుచున్నావు. (అధ్వర్యుఁడు అభ్రిపై నీటితో ప్రోక్షించవలెను. న+అరిః=నారిః.)

3. అర్థ తాత్పర్యములు ద్వితీయ ప్రపాఠకమునందలి పంచమాను వాకమున వ్రాయఁబడినవి. (ఈ మంత్రము చెప్పుచు ‘అవట’ మను పేరుగల ప్రదేశమును అభ్రితో అంతటను గీయవలెను. పితృదేవతలుండు లోక విశేషమునకు అవట మనిపేరు.)

4. అర్థము: హే అభ్రే=ఓ అభ్రీ! త్వా=నిన్ను, దివే=ద్యులోకముకొఱకు, (ప్రోక్షామి=ప్రోక్షించుచున్నాను.) అంతరిక్షాయ=అంతరిక్ష లోకము కొఱకు, (త్వా, ప్రోక్షామి.) పృథివ్యై=పృథివీ లోకముకొఱకు, (త్వా, ప్రోక్షామి.)

తాత్పర్యము: ఓ యభ్రీ! నిన్ను ద్యులోకాంతరిక్ష పృథివీ లోకములకొఱకుఁ బ్రోక్షించుచున్నాను. (అధ్వర్యుఁడు అభ్రి యొక్క అగ్ర మధ్య మూల భాగములను వరుసగా ప్రోక్షించవలెను. మోదుగు కొమ్మతోఁజేయఁబడిన అభ్రి యొక్క మూఁడు భాగములకు లోకత్రయాత్మకత్వము వర్ణింప బడినది.)

5. అర్థము: పితృషదనః=పితృదేవతలకు స్థానమైన, లోకః=లోకము, శున్ధతామ్=పరిశుద్ధమగుఁగాక.

తాత్పర్యము: పితృ దేవతలుండు ‘అవట’ మను లోకము పరిశుద్ధ మగుఁగాక. (అధ్వర్యుఁడు అవట ప్రదేశమునందు నీటిని బోయవలెను. పితరః సీదన్తి అస్మిన్నితి=పితృషదనః. ఈ లోకమునందుఁ బితృదేవత లుందురు అని పితృషదన సమాసార్థము.)

6. అర్థము: (హే ధాన్య!=ఓ ధాన్యమా!, త్వమ్=నీవు) యవః=వేఱుచేయుదానవు, అసి=అగుచున్నావు. ద్వేషః=ద్వేషించునట్టి రాక్షసులను, అస్మత్=మా నుండి, యవయ=వేఱుచేయుము. అరాతీః=శత్రువులను (కూడ) యవయ=వేఱుచేయుము.

తాత్పర్యము: ఓ ధాన్యమా! నీవు వేఱుచేయునట్టి శక్తి కలదానవు. కావున మమ్ము ద్వేషించునట్టి రాక్షసులను, శత్రువులను గూడ మానుండి వేఱుచేయుము. (ఈ మంత్రము చెప్పుచు అవట ప్రదేశమునందు ధాన్యము చల్లవలెను.)

7. అర్థము: (హే బర్హిః=ఓ బర్హిస్సా!, త్వమ్=నీవు) పితృణామ్=పితృదేవతలకు, సదనమ్=స్థానము, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: ఓ బర్హిస్సా! నీవు పితృదేవతలకు స్థానము అగుచున్నావు. (అధ్వర్యుఁడు బర్హిస్సుకట్ట నూడఁదీసి అవట ప్రదేశము నందు పఱచవలెను.)

8. అర్థము: (హే ఔదుమ్బరి!=ఓ మేడిచెట్టుకొమ్మా! త్వమ్=నీవు) దివమ్=ద్యులోకమును, ఉత్తభాన=ఊర్ధ్వదేశమునందు నిలుపుము. అన్తరిక్షమ్=అంతరిక్ష లోకమును, పృణ=పూరించుము. పృథివీమ్=పృథివీలోకమును, దృంహ=దృఢముగాఁజేయుము.

తాత్పర్యము: ఓ మేడికొమ్మా! నీవు స్వర్గలోకమును ఊర్ధ్వదేశమునందు నిలుపుము. అంతరిక్షమును పూరించుము. పృథివిని దృఢముగఁ జేయుము. (అధ్వర్యుఁడు ఈ మంత్రము చెప్పుచు మేడికొమ్మను పైకెత్తి పట్టుకొనవలెను.)

9. అర్థము: (హే ఔదుమ్బరి!) మిత్రావరుణయోః=మిత్రావరుణ దేవతల సంబంధమైన, ధ్రువేణ=దృఢమైన, ధర్మణా=ధారణముచేత(=పట్టుకొనుటచేత), త్వా=నిన్ను, మారుతః=మరుద్దేవ కుమారుండైన, ద్యుతానః=ద్యుతాన నామక దేవుండు, మినోతు=(అవట ప్రదేశమునందు) ఉంచుంగాక.

తాత్పర్యము: ఓ మేడికొమ్మా! మిత్రా వరుణ దేవతలు నిన్ను పట్టుకొనుటచేత ఇటు నటు పడిన నిన్ను మరుత్పుత్రుండగు ద్యుతాన నామక దేవుండు అవట ప్రదేశమునం దుంచుంగాక. (ఔదుంబరిని ప్రాచీనాగ్రముగ పట్టుకొని అవట ప్రదేశమునం దుంచవలెను.)

10. అర్థము: (హే ఔదుమ్బరి!) బ్రహ్మవనిమ్=బ్రాహ్మణ్యము నిచ్చునట్టియు, క్షత్రవనిమ్=క్షత్రియత్వము నిచ్చునట్టియు, సుప్రజావనిమ్=మంచి సంతతి నిచ్చునట్టియు, రాయస్పోషవనిమ్=ధనసమృద్ధి నిచ్చునట్టియు, త్వా=నిన్ను, పర్యూహామి=నలువైపుల (మట్టియందు) ఉంచుచున్నాను.

తాత్పర్యము: ఓ ఔదుంబరీ! బ్రాహ్మణ్యాదికము నిచ్చునట్టి నీకు నలువైపుల మట్టి నుంచుచున్నాను. (అవటమునం దుంచిన మేడికొమ్మకు నాలుగు ప్రక్కలందు మట్టిని వేయవలెను.)

11. అర్థము: (హే దండ!=ఓ దండమా! త్వమ్=నీవు) బ్రహ్మ=బ్రాహ్మణ్యమును, దృంహ=దృఢము చేయుము. క్షత్రమ్=క్షత్రియత్వమును, దృంహ=దృఢము చేయుము. ప్రజామ్=సంతానమును, దృంహ=దృఢము చేయుము. రాయస్పోషమ్=ధన సమృద్ధిని, దృంహ=దృఢము చేయుము.

తాత్పర్యము: ఓ మైత్రా వరుణ దండమా! నీవు బ్రాహ్మణత్వాది ధర్మములను, సంతానమును, ధనసమృద్ధిని, దృఢముగాం జేయుము. (ఈ మంత్రము చెప్పుచు మైత్రా వరుణ దేవతాక దండము (కఱ్ఱ)తో మట్టిపైన గట్టిగా కొట్ట వలెను.)

12. అర్థము: హే ద్యావా పృథివీ!=ద్యావా పృథివీ రూపములైన ఔదుంబరియొక్క అగ్ర మూలములారా!, ఘృతేన=ఆజ్యము చేత, అపృణేథామ్=అంతటను తృప్తి నొందుఁడు.

తాత్పర్యము: (ఔదుంబరియొక్క అగ్రభాగము ద్యులోకముగను, మూలభాగము పృథివీ రూపముగను ఆరోపింపంబడినవి.) ఓ ద్యావాపృథివీ రూపములైన ఔదుంబరి యగ్ర మూల భాగములారా! ఈ హోమము చేయంబడుచున్న ఆజ్యముచేత మీరు అంతటను తృప్తినొందుఁడు. (అధ్వర్యుఁడు ఔదుంబరియందు ఆజ్యమును పోయవలెను.)

13. అర్థము: విశ్వజనస్య=సమస్త జనమునకు, ఛాయా=నీడవైన (హే ఔదుంబరి!=ఓ యౌదుంబరీ, త్వమ్=నీవు) ఇన్ద్రస్య=ఇంద్రునకు, సదః=స్థానము, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: సర్వజనులకు నీడనిచ్చునట్టి యౌదుంబరీ! నీవు ఇంద్రునకు స్థాన మగుచున్నావు.

14. అర్థము: హే గిర్వణః!=స్తోత్రములచే సేవింపం దగినవాండ వగు నో యింద్రా! వృద్ధాయుమ్+అను=దీర్ఘాయువుగల నిన్ననుసరించి, వృద్ధయః=వృద్ధికలవియగు, ఇమాః గిరః=స్తోత్ర శస్త్రరూపములైన ఈ వాక్కులు, విశ్వతః=అంతటను, త్వా=నిన్ను, పరి భవన్తు=కడియము రూపమున చుట్టుకొనుంగాక. జుష్టయః=(మా) సేవలు, (తవ=నీకు) జుష్టాః=ప్రియములు, భవన్తు=అగుంగాక.

తాత్పర్యము: స్తోత్రములచే సేవింపం దగినవాండ వగు నో యింద్రా! దీర్ఘాయువుగల నిన్ననుసరించి వృద్ధి నొందుచున్న స్తోత్రరూపములైన యీ వాక్కులు కంకణ రూపమున నిన్ను చుట్టుకొనుంగాక. మా సేవలు నీకు ప్రియము అగుంగాక.

15. ఈ మంత్రము 2 ప్ర. 13 అనువాకమునందు వ్యాఖ్యానింపంబడినది.

ప్రథమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే తృతీయప్రపాఠకే ద్వితీయోఽనువాకః।

మూలము: [1]రక్షోహణో వలగహనో వైష్ణవా న్ఖనామీ [2]ద మహం తం వలగ ముద్వపామి యం న స్సమానో య మసమానో నిచఖానే ద మేన మధరం కరోమి యో న స్సమానో యో ఽసమానో ఽరాతీ యతి గాయత్రేణ ఛన్దసా ఽవబాఢో వలగః [3]కి మత్ర భద్రం త న్నౌ సహ [4]విరా డసి సపత్నహా సమ్రా డసి భ్రాతృవ్యహా స్వరా డస్య భిమాతిహా విశ్వారా డసి విశ్వాసాం నాష్ట్రాణాగ్ం హన్తా (౧)[5]రక్షోహణో వలగహనః ప్రోక్షామి వైష్ణవా న్రక్షోహణో వలగహనో ఽవనయామి వైష్ణవా న్యవో ఽసి యవయా స్మ ద్ద్వేషో యవయా రాతీ రక్షోహణో వలగహనో ఽవస్తృణామి వైష్ణవా న్రక్షోహణో వలగహనో ఽభి జుహోమి వైష్ణవా [6]న్రక్షోహణౌ వలగహనా వుపదధామి వైష్ణవీ రక్షోహణౌ వలగహనౌ పర్యూహామి వైష్ణవీ రక్షోహణౌ వలగహనౌ పరి స్తృణామి వైష్ణవీ రక్షోహణౌ వలగహనౌ వైష్ణవీ [7]బృహన్నసి బృహద్గ్రావా బృహతీ మిన్ద్రాయ వాచం వద ॥౨॥

(హ_న్తే న్ద్రాయ ద్వే చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే తృతీయప్రపాఠకే ద్వితీయోఽనువాకః॥

వేదార్థ దీపిక

అవతారిక: ప్రథమానువాకమునందు సదోమండప నిర్మాణము చెప్పఁబడినది. ఇంతవఱకు మహావేదియందు, ఉత్తరవేది, హవిర్ధాన సదోమండప నిర్మాణములు సంపూర్ణము లయినవి. హవిర్ధాన మధ్యయం దవసరములయిన ఉపరవములను పేరు గల గర్తముల నిర్మాణము ఈ యనువాకమునందుఁ జెప్పఁబడుచున్నది. (గర్తము=గుంట)

1. అర్థము: వైష్ణవాన్=విష్ణువు దేవతగాఁగలవియు, రక్షోహణః=రాక్షసులను నశింపఁజేయునవియు, వలగహనః=వలగము లను నశింపఁజేయునవియునగు (ఉపరవములను,) ఖనామి=త్రవ్వుచున్నాను. (ఉపరవములు=గుంటలు; వలగములు=విరోధిమారణమునకై జీర్ణ కటవటాదుల ఖండములందు కట్టఁబడిన ఎముకలు, రోమములు, పాద ధూళి మొదలగునవి భూమియందు పాతిపెట్టఁబడినవి.)

తాత్పర్యము: నేను విష్ణుదేవతాకములయిన ఉపరవములను త్రవ్వుచున్నాను. ఈ ఉపరవములు రాక్షస నాశకములు వలగ నాశకములునైనవి. (అధ్వర్యుఁడు హవిర్ధానమునకు క్రింది భాగమున తూర్పు ముఖముగా నాలుగు ఉపరవ నామక గర్తములను త్రవ్వవలెను.)

2. అర్థము: నః=మాకు, సమానః=(విద్యా విత్త సౌభాగ్యాదులచే) సదృశుఁడైన యతఁడు, యమ్=ఏ వలగమును, నిచ ఖాన=పాతిపెట్టెనో, అసమానః=సమానుఁడు కానివాఁడు, యమ్=ఏ వలగమును, నిచఖాన=పాతిపెట్టెనో, తమ్ + ఇదం వలగమ్=ఆ యీ వలగమును, అహమ్=నేను, ఉద్వపామి=పెల్లగించుచున్నాను. (అపి చ=మఱియు,) యః సమానః=ఏ సదృశుఁడు, యః అసమానః=ఏ యసదృశుఁడు, నః=మమ్ము (ఉద్దిశ్య=ఉద్దేశించి) అరాతీయతి=శత్రువువలె నాచరించు చున్నాఁడో, ఏనమ్=ఈ శత్రువును, ఇద మధరమ్=ఈ యజమాన పాదమున కధోవర్తినిగా, కరోమి=చేయుచున్నాను. గాయత్రేణ ఛన్దసా=గాయత్రీఛన్దోఽభిమాని దేవునిచేత, వలగః=వలగము, అవబాధః=బాధింపఁబడినది, (భవతు=అగుఁగాక.)

తాత్పర్యము: విద్యా ధన సౌభాగ్యాదులయందు, మాతో సమానుఁడుకాని, అసమానుఁడుకాని భూమియందు పాతిపెట్టిన వలగమును పెల్లగించుచున్నాను. సమానుఁడుకాని, అసమానుఁడుకాని, మా విషయమున శత్రువువలె వర్తించుచున్నచో వానిని ఈ యజమానుని కాలిక్రింద నుండునట్లుగా చేసెదను. గాయత్రీ ఛన్దోఽభిమాని దేవతచేత, వలగము బాధింపఁబడినదగుఁగాక. (అధ్వర్యుఁ డీ మంత్రము చెప్పుచు పైనఁజెప్పబడిన గర్తములనుండి ధూళిని పైకి తీయవలెను.)

3. అర్థము: (హే అధ్వర్యో!=ఓ అధ్వర్యుఁడా!) అత్ర=ఈ ఉపరవములందు, కిమ్=(మా కుపయోగించునది) ఏమి? (అస్తి=కలదు? ఇది యజమానుని ప్రశ్న.) భద్రమ్=(సోమాభిషవము మూలమున) సేవింపఁదగినది, (సర్వ మస్తి=సర్వము కలదు. ఇది అధ్వర్యుని సమాధానము.) తత్=ఆ భద్రము, నౌ సహ=మనకుఁగూడ, (భవేత్=అగుఁగాక.)

తాత్పర్యము: ఓ అధ్వర్యుడా! ఈ ఉపరవములందు ఏమి కలదు? ఇది యజమానుని ప్రశ్న. సోమాభిషవము మూలమున సేవింపఁదగినది సర్వము కలదు. ఇది అధ్వర్యుని సమాధానము. ఆ భద్రము మనకు ఉభయులకు నగుఁగాక. ఇది యజమానుని సమాధానము. (యజమానుఁడు ప్రశ్నించుచు ఉపరవమును స్పృశించవలెను.)

4. అర్థము: (హే ఉపరవ!=ఓ ఉపరవమా! త్వమ్=నీవు) సపత్నహా!=అభ్యంతర శత్రువును సంహరించు దానవు. (తత్=ఆ కారణము వలన) విరాట్=వివిధ రీతులుగా ప్రకాశించు దానవు, అసి=అగుచున్నావు. (హే ఉపరవ! త్వమ్=నీవు,) భ్రాతృవ్యహా=బాహ్యశత్రువును సంహరించుదానవు. (అతః=ఇందువలన,) సమ్రాట్=బాగుగఁ బ్రకాశించుదానవు, అసి=అగుచున్నావు. (హే ఉపరవ! త్వమ్=నీవు) అభిమాతిహా!=ఇతర శత్రుహన్తవు. (అతః=ఇందువలన) స్వరాట్=స్వయముగాఁ బ్రకాశించు దానవు, అసి=అగుచున్నావు. (హే ఉపరవ!, త్వమ్=నీవు) విశ్వాసామ్=సమస్తమైన, నాష్ట్రాణామ్=రాష్ట్రముల శత్రువులకు, హన్తా=సంహర్తవు. (అతః=ఇందువలన,) విశ్వారాట్=సర్వమునందు ప్రకాశించుదానవు, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: ఓ సపత్నాది శత్రువులను సంహరించునట్టి ఉపరవములారా! మీరు విరాడాది శబ్ద వాచ్యు లగుచున్నారు. (అధ్వర్యుఁ డీ మంత్రము పఠించుచు దక్షిణదిక్కు మొదలగు నాలుగు దిక్కులకు యథాక్రమముగ తిరిగి ఉపరవములను స్పృశించ వలెను.)

విశేషములు: ఇచట సపత్న శబ్దమునకు విరుద్ధమగు ఇంద్రియ వృత్తియని యర్థము. ఇదియే అభ్యంతర శత్రువు. భ్రాతృవ్యః=బాహ్యశత్రువు. అనగా ఇంద్రియ వృత్తికి బాహ్యమైన విరుద్ధజాతి. అభిమాతిః=గ్రామసీమ అందు కలహించునట్టి అన్యగోత్రజుఁడు. అంతకంటెను బాహ్యమైనవి పరరాష్ట్రసేనలు. ఇవి సర్వనాశ హేతువులు. వివిధం రాజతే ఇతి=విరాట్. సమ్యక్ రాజత ఇతి=సమ్రాట్. స్వయం రాజత ఇతి=స్వరాట్. విశ్వేషు రాజత ఇతి=విశ్వారాట్ – అని వ్యుత్పత్తి.

5. అర్థము: రక్షోహణః, వలగహనః, వైష్ణవాన్, (ఉపరవములను) ప్రోక్షామి=ప్రోక్షించుచున్నాను. రక్షోహణః, వలగహనః, వైష్ణవాన్, అవనయామి=(ఉపరవములలో)ఉదకములను పోయుచున్నాను. (హే ధాన్య! త్వమ్) యవః, అసి, ద్వేషః=ద్వేషించునట్టి రాక్షసులను, అస్మత్=మా నుండి, యవయ=వేరుచేయుము. అరాతీః=శత్రువులను, యవయ. రక్షోహణః, వలగహనః, వైష్ణవాన్, అవస్తృణామి=(ఉపరవములలో)దర్భలను పఱచుచున్నాను. రక్షోహణః, వలగహనః, వైష్ణవాన్, అభిజుహోమి=ఉపరవములందు హోమముచేయుచున్నాను.

తాత్పర్యము: సులభము. ఈ మంత్రము నందలి పదము లన్నియు ఒకటవ మంత్ర వ్యాఖ్యానమున వివరింపఁబడినవి. (అధ్వర్యుఁడు ఈ మంత్రము చెప్పుచు ఉపరవములందు ఉదకములచే ప్రోక్షించి దర్భలను పఱచి హోమము చేయవలెను.)

6. అర్థము: రక్షోహణౌ, వలగహనౌ, వైష్ణవీ=విష్ణుదేవతాకములగు, ఫలకే=రెండు ఫలకములను, ఉపదధామి=ఉంచుచున్నాను. రక్షోహణౌ, వలగహనౌ, వైష్ణవీ, ఫలకే, పర్యూహామి=(తడిచేతితో) తుడుచుచున్నాను. రక్షోహణౌ, వలగహనౌ, వైష్ణవీ, ఫలకే, పరిస్తృణామి=పఱచుచున్నాను. రక్షోహణౌ, వలగహనౌ, వైష్ణవీ, ఫలకే, అభిస్పృశామి=తాఁకుచున్నాను.

తాత్పర్యము: రాక్షస వినాశకములు, వలగ హన్తకములు, విష్ణు దేవతాకములునగు రెండు ఫలకములను ఉపరవములలో నుంచి తడిచేతితో తుడిచి వానిపై దర్భలను పఱచి చేతితో స్పృశించుచున్నాను. (ఇది అధ్వర్యుఁడు చేయవలసిన పని. 'రక్షోహణౌ' ఇత్యాది పదములు ద్వివచనాంతములు. అధ్యాహృతమైన 'ఫలకే' అను పదమునకు విశేషణములు.)

7. అర్థము: (హే పాషాణ!=ఓ పాషాణమా! త్వమ్=నీవు) బృహన్=(దార్ఢ్యముచే) గొప్పదానవు, బృహద్గ్రావా=గొప్ప ఱాళ్లు అవయవములుగాఁ గల దానవు, అసి=అగుచున్నావు. ఐన్ద్రీయ=ఇంద్రునికొఱకు, బృహతీమ్=గొప్పదియైన, వాచమ్=శబ్దమును (ధ్వనిని) వద=పలుకుము. (చేయుము.)

తాత్పర్యము: ఓ పాషాణమా! నీవు దృఢత్వముచేత గొప్పదానవు, గొప్పపటుత్వముగల ఱాళ్లు నీకు అవయవములు. ఇంద్రుని నిమిత్తము గట్టిగా ధ్వనిచేయుము. (పాషాణముతో ధ్వని కలుగునట్లు ఫలకములపై కొట్టవలయును. పాషాణము=ఱాయి.)

ద్వితీయానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే తృతీయప్రపాఠకే తృతీయోఽనువాకః

మూలము: [1]విభూ రసి ప్రవాహణో వహ్ని రసి హవ్యవాహన శ్శ్వాత్రో ఽసి ప్రచేతా స్తుథో ఽసి విశ్వవేదా ఉశిగసి కవి రఙ్ఘారి రసి బమ్భారి రవస్యు రసి దువస్వా ఞ్ఛున్ధ్యూ రసి మార్జాలీయ స్సమ్రా డసి కృశానుః పరిషద్యో ఽసి పవమానః ప్రతక్వాసి నభస్వా నసమ్మృష్టో ఽసి హవ్యసూద ఋత ధామా ఽసి సువర్జ్యోతి ర్బ్రహ్మజ్యోతి రసి సువర్ధామా ఽజో ఽస్యే కపా దహి రసి బుధ్నియో రౌద్రేణా నీకేన పాహి మా ఽగ్నే పిపృహి మా మా మా హిగ్ంసీః ॥౧॥ (అనీకేనా ష్టౌ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే తృతీయప్రపాఠకే తృతీయోఽనువాకః।

వేదార్థదీపిక

అవతారిక: ద్వితీయానువాకమునందు హవిర్ధానమందలి ఉపరవ నిర్మాణము చెప్పఁబడినది. అగ్నీధ్రీయ సదస్సు మొదలగు స్థానములందలి 'ధిష్ణియము'లు ఈ తృతీయానువాకమునందు చెప్పఁబడుచున్నవి. 'ధిష్ణియ' శబ్దమునకు స్థానము, అగ్ని అని యర్థములు కలవు. ధృష్ణోతీతి='ధిష్ణ్యమ్' అని వ్యుత్పత్తి. సమర్థమై యుండునదియని యర్థము. "ఞి-ధృషా=ప్రాగల్భ్యే" అను ధాతువునుండి ఈ శబ్ద మేర్పడినది. అగ్నీధ్రుఁడు' మొదలగు పదునాఱుగురు ఋత్విజులు యజ్ఞకర్తకు సహాయకులుగానుండి యాగము చేయించువారు. అగ్నీధ్రుఁడు కూర్చుండు స్థానమునకు 'అగ్నీధ్రీయ' మని పేరు. ఇట్లే మిగిలిన ఋత్విజుల స్థానములకు కూడ పేర్లు కలవు. (1) బ్రహ్మ, (2) ఉద్గాతా, (3) హోతా, (4) అధ్వర్యుః, (5) బ్రాహ్మణాచ్ఛంసీ (6) ప్రస్తోతా (7) మైత్రావరుణః (8) ప్రతిప్రస్థాతా (9) పోతా (10) ప్రతిహర్తా (11) అచ్ఛావాకః (12) నేష్టా (13) అగ్నీధ్రః (14) సుబ్రహ్మణ్యః (15) గ్రావస్తుత్ (16) ఉన్నేతా. యజ్ఞకర్తచేత ధనములచే వరింపఁదగిన ఈ పదునాఱుగురు ఋత్విజులు యాజకు లనఁబడుదురు. "అగ్నిన్ + ఇన్ధే-ఇతి=అగ్నీధ్రః. 'ఞి-ఇన్ధీ=దీప్తౌ' అను ధాతువునుండి అగ్నీధ్ర శబ్ద మేర్పడినది. అగ్నిని ప్రకాశింపఁజేయువాఁడని వ్యుత్పత్త్యర్థము.

1. **అర్థము:** (హే అగ్నీధ్రీయ!=ఓ అగ్నీధ్రుని స్థానమందలి యగ్నీ! (త్వమ్=నీవు) విభూః=వివిధ రూపములు కలవాఁడవు, అసి=అగుచున్నావు. హే హోత్రీయ!=ఓ హోతృస్థానమునందలి అగ్నీ! ప్రవాహణః=హవిస్సును ప్రవహింపఁజేయునట్టి, వహ్నిః=అగ్నివి, హవ్యవాహనః=హవిస్సును వహించువాఁడవును, అసి=అగుచున్నావు. (హే మైత్రావరుణీయ!=ఓ మైత్రావరుణస్థానీయాగ్నీ! త్వమ్=నీవు) శ్వాత్రః=మిత్ర దేవతా స్వరూపము, ప్రచేతాః=వరుణ దేవతా స్వరూపమును, అసి=అగుచున్నావు. (హే బ్రాహ్మణాచ్ఛంసి సంబంధిన్=బ్రాహ్మణాచ్ఛంసి స్థానీయాగ్నీ!, త్వమ్=నీవు) విశ్వవేదాః=దేవతలకు దక్షిణను విభజించువాఁడుగా ప్రసిద్ధి చెందిన, తుథః=తుథరూప దేవతా స్వరూపము, అసి=అగుచున్నావు (హే పోతృస్థానీయాగ్నే!=ఓ పోతృస్థానీయాగ్నీ! త్వమ్=నీవు) ఉశిక్=మనోహరమైన, కవిః=విద్వాంసుఁడవు, అసి=అగుచున్నావు. (హే నేష్టృస్థానీయాగ్నే!=ఓ నేష్టృస్థానీయాగ్నీ! త్వమ్=నీవు) అఙ్ఘారిః=(సోమరక్షకమగు)అఙ్ఘారినామక దేవతా

స్వరూపము, అసి=అగుచున్నావు. బమ్భారిః=(సోమ రక్షక)బమ్భారినామక దేవ స్వరూపము, అసి=అగుచున్నావు. (హే అచ్ఛావాక సంబంధిన్!=ఓ అచ్ఛావాక స్థానీయాగ్నీ! త్వమ్=నీవు) అవస్యుః, దువస్వాన్=అవస్యు–దువస్వత్తులనెడి వాయువుల స్వరూపము, అసి=అగుచున్నావు. (హే మార్జాలీయ!=ఓ మార్జన స్థానీయాగ్నీ! త్వమ్=నీవు) శున్ధ్యూః=శోధకుఁడవు, మార్జాలీయః=మార్జన స్థానభూతుఁడవును, అసి=అగుచున్నావు. (హే ఆహవనీయ!=ఓ ఆహవనీయాగ్నీ! త్వమ్=నీవు) సమ్రాట్=బాగుగ ప్రకాశించునట్టియు, కృశానుః=కృశించిననువృద్ధి నొందునట్టి యగ్నివి,అసి=అగుచున్నావు. (హే ఆస్తావ!=ఓ స్తోత్ర స్థానమా! త్వమ్=నీవు) పరిషద్యః=అంతట నుండుటకు యోగ్యము, పవమానః=పవిత్రమును, అసి=అగుచున్నావు, (హే చాత్వాల!=ఓ చాత్వాలమా! త్వమ్=నీవు) ప్రతక్వా=శ్రేష్ఠగమన విషయమైన, నభస్వాన్=అంతరవకాశము కలదానవు, అసి=అగుచున్నావు. (హే పశుశ్రపణప్రదేశ!=యజ్ఞపశువును శ్రపణముచేయుటకు యోగ్యమైన స్థానమా! త్వమ్=నీవు) అసమ్మృష్టః=రాక్షసాదులతో కలియనిదానవు, హవ్యసూదః=హవిస్సును పక్వముచేయుదానవును, అసి=అగుచున్నావు. (హే ఔదుమ్బరి!=ఓ ఔదుంబరీ, త్వమ్=నీవు) ఋతధామా=సత్యమైన నివాసస్థానము కలదానవు, సువర్జ్యోతిః=స్వర్గమును ప్రకాశింపఁజేయుదానవును, అసి=అగుచున్నావు. (హే బ్రహ్మసదన!=ఓ బ్రహ్మస్థానమా! త్వమ్=నీవు) బ్రహ్మజ్యోతిః=బ్రహ్మయను ఋత్విజునియొక్క జ్యోతిస్స్వరూపము, సువర్ధామా=స్వర్గ తుల్యస్థానమును, అసి=అగుచున్నావు. (హే నూతన గార్హపత్య!=ఓ నూతన గార్హపత్యాగ్నీ! త్వమ్=నీవు) అజః=ప్రోష్ఠపదా నక్షత్రమనియు, ఏకపాత్=ఏకపాద్దేవతయనియు చెప్పఁబడు దేవతా స్వరూపము, అసి=అగుచున్నావు. (హే పరిత్యాజ్య గార్హపత్య!=విడువఁదగిన గార్హపత్యాగ్నీ! త్వమ్=నీవు) అహిర్బుధ్నియః=అహిర్బుధ్నియ యనిచెప్పఁబడు దేవతాస్వరూపము, అసి=అగుచున్నావు. హే అగ్నే!=పూర్వోక్తము లయిన ఆగ్నీధ్రీయాది షోడశ ఋత్విక్స్థానములం దుండు నగ్నీ! రౌద్రేణ=క్రూరమైన, అనీకేన=(నీ)సేనచేత, మా=నన్ను, పాహి=(రాక్షసులనుండి)రక్షించుము. మా=నన్ను, పిపృహి=పూర్ణ మనోరథునిగాఁ జేయుము. మా=నన్ను, మా హింసీః=హింసింపకుము. (చాత్వాలము=యజ్ఞప్రదేశమునందలి యాజకుల సంబంధమైన గర్తవిశేషము.) తాత్పర్యము సుగ్రాహ్యము.

విశేషములు: ధిష్ణియములను పేర్లతో ఋత్విజులస్థానములు ఈ మంత్రమున చెప్పఁబడినవి. చాత్వాల ప్రదేశమునుండి తీసిన మట్టితో ఉత్తరవేది నిర్మిత మగుటచే ఈ చాత్వాలము యజ్ఞమునకు కీలకమువంటిది. ఆగ్నీధ్రీయ ధిష్ణియమునందలి యగ్నినుండి కొంతయగ్నిని తీసి హోత్రీయాది ధిష్ణియము లందుంచ వలెనని యీ మంత్రములోని సారాంశము. (అధ్వర్యుఁడు ఈ మంత్రమును పఠించుచు నాగ్నీధ్రుని స్థానమునొద్దకు వెళ్లి 'స్ఫ్యము' అను నాయుధముతో అచ్చటి మట్టిని పెల్లగించి నీటితో ప్రోక్షించి చాత్వాలమునందలి మట్టి నిచ్చట నుంచవలెను. ఈ విధముగా మిగిలిన ఋత్విజుల స్థానములయొద్దకుఁగూడ పోయి పై విధముగఁజేయవలెను. ఇచటఁబూర్వపు గార్హపత్యాగ్ని స్థానమును తొలఁగించి గార్హపత్యాగ్నికి మఱియొకస్థానమును కల్పించవలెను. కనుకనే నూతన గార్హపత్యాగ్ని యనియు, పరిత్యాజ్య గార్హపత్యాగ్ని యనియు అగ్ని సంబోధించఁబడెను.)

తృతీయానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే తృతీయప్రపాఠకే చతుర్థోఽనువాకః

మూలము: [1]త్వగ్ం సోమ తనూకృద్భ్యో ద్వేషోభ్యో ఽన్యకృతేభ్య ఉరు యన్తా ఽసి వరూథగ్ం స్వాహా జుషాణో అప్తు రాజ్యస్య వేతు స్వాహా యం నో అగ్ని ర్వరివః కృణో త్వయం మృధః పుర ఏతు ప్రభిన్దన్। అయగ్ం శత్రూ న్జయతు జర్హృషాణో ఽయం వాజం జయతు వాజసాతౌ। ఉరు విష్ణో విక్రమస్వో రు క్షయాయ నః కృధి। ఘృతం ఘృతయోనే పిబ ప్రప్ర యజ్ఞపతిం తిర। [2]సోమో జిగాతి గాతువిత్ (౧)దేవానా మేతి నిష్కృత మృతస్య యోని మా సద [3]మదిత్యా స్సదో ఽస్య దిత్యా స్సద ఆసీదై[4]ష వో దేవసవిత స్సోమ స్తగ్ం రక్షధ్వం మా వో దభదేత త్త్వగ్ం సోమ దేవో దేవా నుపాగా ఇద మహం మనుష్యో మనుష్యా న్త్సహ ప్రజయా సహ రాయస్పోషేణ [6]నమో దేవేభ్య స్స్వధా పితృభ్య ఇద మహం ని ర్వరుణస్య పాశా త్స్వవ రభి (౨)విఖ్యేషం వైశ్వానరం జ్యోతి [7]రగ్నే వ్రతపతే త్వం వ్రతానాం వ్రతపతి రసి యా మమ తనూ స్త్వయ్య భూది యగ్ం సా మయి యా తవ తనూ ర్మయ్య భూ దేషా సా త్వయి యథా యథం నౌ వ్రతపతే వ్రతినో ర్వ్రతాని। ॥౩॥ (గాతువి దభ్యే కత్రిగ్ంశ చ్చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే తృతీయప్రపాఠకే చతుర్థోఽనువాకః॥

వేదార్థ దీపిక

అవతారిక: తృతీయానువాకమునందు ధిష్ణియములనెడి స్థానములు వర్ణితములైనవి. దీనితో వేదిగత విశేష నిర్మాణము సమాప్తమైనది. ఆ వేదియందు అగ్నీషోమీయ పశువు విధింపఁదగియున్నది. అగ్నీషోమ దేవతల ప్రణయనము చెప్పిన పిమ్మట అగ్నీషోమీయ పశువిధానము యుక్తము; కావున అగ్నీషోమ దేవతల ప్రణయనమునకై వైసర్జనమనెడి హోమ విశేషము ముందుగా ఈ చతుర్థానువాకమునందుఁజెప్పఁబడుచున్నది.

1. అర్థము: (హే సోమ!=ఓ సోమదేవతా!) త్వమ్=నీవు, తనూకృద్భ్యః=రాక్షసుల కొఱకు, ద్వేషోభ్యః=విరోధులకొఱకు, అన్యకృతేభ్యః=అన్యుల (మా విరోధుల) చే ప్రేరింపఁబడినవారికొఱకును, ఉరు=గొప్ప, యన్తా=నియన్తవు, వరూథమ్=(మాకు) బలమును, అసి=అగుచున్నావు. స్వాహా=(అట్టి నీకొఱకు ఈ హవిస్సు) హుత మగుఁగాక. (హే సోమ!=ఓ సోమ దేవతా! త్వమ్=నీవు) జుషాణః=మాయందు ప్రీతికలదానవు, అప్తుః=(రాక్షసులకు కనఁబడకుండుటకై) అల్ప దేహము కలదానవునై, ఆజ్యస్య=నేతియొక్క (అల్ప బిందువును) వేతు=త్రాగుము. స్వాహా=(ఇది నీకు) హుత మగుఁగాక. అయమ్=ఈ, అగ్నిః=అగ్ని, నః=మాకు, వరివః=శ్రేయస్సును, కృణోతు=చేయుఁగాక. అయమ్=ఈ యగ్ని, మృధః=శత్రువులను, ప్రభిన్దన్=నశింపఁజేయుచు, పురః=ఎదుట, ఏతు=పోవుఁగాక. అయమ్=ఈ యగ్ని, జర్హృషాణః=సంతుష్టాంతఃకరణము కలవాఁడగుచు, శత్రూన్=శత్రువులను, జయతు=జయించుఁగాక. వాజసాతౌ=(అన్నముయొక్క లాభముకల) సంగ్రామమునందు, అయమ్=ఈ యగ్ని, వాజమ్=అన్నమును, జయతు=జయించుఁగాక. (=మా కొఱకు స్వాధీనము చేసికొనుఁగాక.). హే విష్ణో!=సర్వవ్యాపియైన ఓ ఆహవనీ యాగ్నీ!, ఉరు విక్రమస్వ=(మా కొఱకు శత్రువులయందు) అధికముగ పరాక్రమించుము. నః=మాయొక్క, క్షయాయ=నివాసముకొఱకు, ఉరు కృధి=అధిక గృహ ధనాదికమును సంపాదించుము. హే ఘృతయోనే!=నేయి మూల కారణముగాఁగల యగ్నీ!, ఘృతమ్=(ఈ హోమము చేయఁబడుచున్న) నేతిని, పిబ=త్రాగుము. యజ్ఞపతిమ్=యజ్ఞకర్తను, ప్రప్రతిర=అతిశయముగ వృద్ధి నొందించుము.

తాత్పర్యము: ఓ సోమదేవతా! నీవు రాక్షసులకు, శత్రువులకు, ఆ శత్రువులచే ప్రేరితులయిన వారికిఁగూడ నియన్తవు. ఆ రాక్షసులు మమ్ము బాధించని విధముగ మమ్ము సురక్షిత ప్రదేశము నందుంచి పాలించుచున్నావు. కావున నీవే మాకు గొప్ప బలముగ నున్నావు. అట్టి నీకు ఇది హుతమగుఁగాక. ఓ సోమదేవతా! నీవు మాయందు ప్రీతి కలదాన వగుచు రాక్షసులకు కనిపించకుండుటకై అల్పదేహము కలదాన వగుచు ఆజ్యము యొక్క అల్ప బిందువును త్రాగుము. ఈ హవిస్సు నీకు హుతమగుఁగాక. ఈ యగ్ని మాకు శ్రేయస్సును గలుగఁజేయుఁగాక. ఈ యగ్ని శత్రువులను జీల్చుచు ముందుఁబోవుఁగాక. ఈ యగ్ని సంతుష్టాం తఃకరణుఁడై శత్రువులను జయించుఁగాక. అన్నము లభించునట్టి సంగ్రామమునందు ఈ యగ్ని మా నిమిత్తము అన్నమును స్వాధీనము చేసికొనుఁగాక. సర్వవ్యాపివగు నో ఆహవనీయాగ్నీ! మా నిమిత్తము శత్రువులయందు బహు పరాక్రమము చూపుము. మా నివాసమునకై గృహ ధనాదికమును బహుళముగా సంపాదించుము. నేతిచే వృద్ధి నొందునట్టి ఓ యగ్నీ! హోమము చేయఁబడుచున్న యీ నేతిని త్రాగుము. యజ్ఞకర్త నధికముగ వృద్ధి నొందించుము. (అధ్వర్యుఁడు స్రుచములోనికి నాలుగుమారులు నేతిని తీసికొని శాలాముఖీయము నందు వైసర్జన హోమము చేయవలెను. అవాంతర దీక్షను విసర్జించుటకుఁ జేయఁబడు హోమములు కావున ఇవి వైసర్జన హోమము అనఁబడుచున్నవి.)

విశేషములు: తనూమ్=శరీరమ్, కృన్తన్తి=ఛిన్దన్తీతి=తనూకృన్తి. రక్షాంసీత్యర్థః. ద్విషన్తీతి=ద్వేషాంసి. ఇది 'ద్వేషస్' అను సకారాంత శబ్దము కనుక చతుర్థ్యంతము–'ద్వేషోభ్యః' అని యైనది. ఇది ఛాన్దసము.

2. అర్థము: గాతువిత్=మార్గమును దెలిసిన, సోమః=సోమము, జిగాతి=వెళ్లుచున్నది. నిష్కృతమ్=అలంకృత మైనదియు, ఋతస్య=యజ్ఞమునకు, యోనిమ్=కారణ మైనదియువగు, దేవానామ్=దేవతలయొక్క, ఆ సదమ్=స్థానమైన హవిర్ధానమునుగూర్చి, ఏతి=పోవుచున్నది.

తాత్పర్యము: హవిర్ధానమునకు మార్గము తెలిసిన సోమము దేవతల స్థానమైన హవిర్ధాన దేశమునకు పోవుచున్నది. ఆ హవిర్ధాన దేశము అలంకరించఁబడియున్నది. గ్రహ చమసాది హవిస్సు లందుండుటచే అది యజ్ఞమునకు కారణమైనది. (అధ్వర్యుఁడు సోమలతను తీసికొని తూర్పుద్వారము ద్వారా హవిర్ధానములోనికి కొని పోవలెను.)

3. అర్థము: హే కృష్ణాజిన!=ఓ కృష్ణాజినమా!, త్వమ్=నీవు, అదిత్యాః=భూమికి, సదః=స్థానము, అసి=అగుచున్నావు. (హే సోమ!=ఓ సోమమా!, త్వమ్=నీవు) అదిత్యాః=భూమికి, సదీ=స్థానమైన కృష్ణాజినమునందు, ఆసీద=కూర్చుండుము.

తాత్పర్యము: ఓ కృష్ణాజినమా! నీవు భూమికి స్థాన మగుచున్నావు. ఓ సోమమా! నీవు భూమికి స్థానమైన కృష్ణాజినము నందు కూర్చుండుము. (అధ్వర్యుఁడు దక్షిణ దిక్కునందున్న హవిర్ధాన మండపమునందు కృష్ణాజినమును పఱచి దానిపై సోమము నుంచవలెను.)

4. అర్థము: హే సవితః దేవ!=ఓ సవితృదేవా!, ఏషః=ఇది, వః=మీయొక్క, సోమః=సోమము. తమ్=అ(ఈ) సోమమును, రక్షధ్వమ్=రక్షించుఁడు. వః=(సోమమును కాపాడుచున్న) మిమ్ము, మా దభత్=(ఏ ఒక్కఁడును) హింసింపకుండుఁగాక.

తాత్పర్యము: ఓ సూర్యదేవా! ఇది మీ దేవతల సోమము. దీని నింతవఱకు యజ్ఞకర్త కాపాడెను. ఇక ముందు దీనిని మీరు కాపాడుఁడు. అట్టి మిమ్ము ఏ ఒక వ్యక్తియు హింసింపకుండుఁగాక. సోమరక్షణము ఇంద్రాది దేవతల కందఱకు కర్తవ్యమే కావున సవితృ పదము ఉపలక్షణముచే దేవతల కందఱకు వాచకము. (అధ్వర్యుఁడు సోమమును ఇంద్రాది దేవతల కీయవలెను.)

5. అర్థము: హే సోమ!=ఓ సోమమా! త్వమ్=నీవు, దేవః (సన్)=దేవత వగుచు, దేవాన్=మీ దేవతలను, ఏతత్+ఉపాగాః=ఇదిగో ఇప్పుడు పొందుచున్నావు. అహమ్=నేను (కూడ) మనుష్యః=మనుష్యుఁడనై, మనుష్యాన్=(మా) మనుష్యులను, ప్రజయా సహ=పుత్త్రాది సంతానముతోఁగూడ, రాయస్పోషేణ సహ=ధన సమృద్ధితోఁగూడను, ఇదమ్=ఇదిగో (ఉపాగామ్=పొందుచున్నాను.)

తాత్పర్యము: ఓ సోమమా! నీవు దేవతవై ఇదిగో ఇప్పుడు మీ దేవతలను బొందుచున్నావు. నేను గూడ మనుష్యుఁడనై మా మనుష్యులను పుత్త్రాది సంతానముతోడను ధన సమృద్ధితోడను పొందుచున్నాను. (అధ్వర్యుఁ డీ మంత్రము చెప్పుచు సోమమున కెదుట నిలుచుండవలెను.)

6. అర్థము: దేవేభ్యః=దేవతలకొఱకు, నమః=నమస్కారము. పితృభ్యః=పితృదేవతలకొఱకు, స్వధా=నమస్కారము. (పితృదేవతలకుఁజేయు నమస్కారమునకు స్వధాకార మని పేరు) అహమ్=నేను, ఇదమ్=దీనిని, వరుణపాశాత్=వరుణ పాశమునుండి, నిర్ముఞ్చామి=విడిపించు చున్నాను. సువః అభి=(స్వర్గసాధక మగుటచే) స్వర్గరూప పర్వయాగ ప్రదేశమును, విఖ్యేషమ్=విశేషముగ చూచుచున్నాను. వైశ్వానరమ్=ఆహవనీయాగ్నిని, జ్యోతిః=జ్యోతి స్స్వరూపముగా, (పశ్యామి=చూచుచున్నాను.)

తాత్పర్యము: దేవతలకు నమస్కారము. పితృదేవతలకు స్వధాకారము. నేను ఈ సోమమును వరుణ పాశమునుండి విడిపించుచున్నాను. ఆహవనీయాగ్నిని జ్యోతిస్స్వరూపముగా చూచుచున్నాను. ('నమో దేవేభ్యః' అని చెప్పి అధ్వర్యుఁడు తూర్పు దిక్కునకు నమస్కరించవలెను. 'స్వధా పితృభ్యః' అని పఠించి దక్షిణ దిక్కునకు నమస్కరించవలెను. 'ఇద మహం నిర్వరుణస్య పాశాత్' అని పలికి దక్షిణ దిక్కునుండి మఱలి 'సువ రభి విఖ్యేషమ్' అని పఠించుచు యాగ ప్రదేశము నంతయు చూడవలెను. 'వైశ్వానరంజ్యోతిః' అని చెప్పి ఆహవనీయాగ్నిని చూడవలెను.)

7. అర్థము: వ్రతపతే=వ్రతములకు నాయకుఁడవైన, హే అగ్నే!=ఓ యగ్నీ! త్వమ్=నీవు, వ్రతానామ్=వ్రతములలో, వ్రతపతిః=వ్రతపతివి, అసి=అగుచున్నావు. మమ=నాయొక్క, యా, తనూః=ఏ శరీరము, త్వయి నీయందు, అభూత్=ఉండెనో, సా ఇయమ్=ఆ యీ శరీరము, త్వయి=నీయందు, (అస్తి=కలదు.) హే వ్రతపతే=వ్రతపతివైన ఓ యగ్నీ!, వ్రతినోః=దీక్ష నవలంబించిన వారలమగు, నౌ=మనయొక్క, వ్రతాని=వ్రతములు, యథాయథమ్=యథా పూర్వముగ, (సన్తి=కలవు.)

తాత్పర్యము: యాగకర్త యాగారంభమున అవలంబించిన దీక్ష తరువాత యాగముచేయుచు, యాగ మధ్యమున అవాంతర దీక్షను గైకొనవలెను. ఆ యవాంతర దీక్షారంభమున యజమానుఁడు మంత్రముచేత తన శరీరము నగ్ని యందును, అగ్నియొక్క పవిత్ర శరీరమును తన యందును ఆవాహనము చేసికొనవలెను. ఇప్పుడు అవాంతర దీక్షను విసర్జించు సమయమున 'మఱల తమ తమ శరీరములను యథాపూర్వముగ మార్చుకొనుచున్నాము' అని యజమానుఁడు అగ్నితోఁ జెప్పుచున్నట్లు ఈ మంత్రము చెప్పుచున్నది. ఈ మంత్ర తాత్పర్యము సులభము. యజమానుఁడు ఈ మంత్రము చెప్పుచు అవాంతర దీక్షను విసర్జించవలెను.

చతుర్థానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే తృతీయప్రపాఠకే పఞ్చమోఽనువాకః।

మూలము: [1]అత్యన్యా నగాం నాన్యా నుపాగా మర్వాక్త్వా పరైరవిదం పరోఽవరై స్తం త్వా జుషే వైష్ణవం దేవయజ్యాయై [2]దేవ స్త్వా సవితా మధ్వా నక్త్వోషధే త్రాయస్వైనగ్ం స్వధితే మైనగ్ం హిగ్ంసీ [3]ర్దివ మగ్రేణ మా లేఖీ రన్తరిక్షం మధ్యేన మా హిగ్ంసీః పృథివ్యా సంభవ వనస్పతే శతవల్శో విరోహ సహస్రవల్శా వి వయగ్ం రుహేమ యం త్వా ఽయగ్ం స్వధితి స్తేతిజానః ప్రణినాయ మహతే సౌభగాయా చ్ఛిన్నో రాయ స్సువీరః। ॥౧॥ (యం దశ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే తృతీయప్రపాఠకే పఞ్చమోఽనువాకః।

వేదార్థదీపిక

అవతారిక: చతుర్థానువాకమునందు వైసర్జన హోమమునందు అవాంతర దీక్షను విసర్జించుట, హవిర్ధానమునందు అగ్నీషోముల ప్రణయనము విహితము లైనవి. ఈ పంచమానువాకము మొదలు ఏకాదశానువాకము పర్యంతము ప్రణీతులైన అగ్నీషోములకు సంబంధించిన పశువు చెప్పఁదగియున్నది. ఈ పంచమానువాకమునందు పశ్వంగ యూప చ్ఛేదనము చెప్పఁబడుచున్నది.

1. అర్థము: (హే యూపవృక్ష!=ఓ యూపార్హమైన వృక్షమా!) అన్యాన్=నీకంటె నితరములైన కొన్ని యూపార్హ వృక్షములను, (గూడ) అత్యగామ్=పొందితిని. అన్యాన్=యూపార్హములు కాని వృక్షములను, నోపాగామ్=పొందలేదు. పరైః=ఉత్కృష్ట లక్షణములతో, అర్వాక్=కూడియున్నట్టియు, పరోఽవరైః=నికృష్ట లక్షణములచే దూరవర్తి యునగు, త్వా=నిన్ను, అవిదమ్=పొందితిని. (హే వృక్ష!=ఓ వృక్షమా!) తమ్=అటువంటి, వైష్ణవమ్=విష్ణు దేవతాకమైన, త్వా=నిన్ను, దేవయజ్యాయై=దేవయాగము కొఱకు, జుషే=సేవించుచున్నాను.

తాత్పర్యము: (వృక్షములు యూప్యములు అయూప్యములు అని రెండు విధములు. యజ్ఞ పశువును కట్టుట కవసరమైన యూపము అను పేరు గల స్తంభము నిచ్చుట కర్హములైన మోదుగు, మేడి మొదలగు వృక్షములు యూప్యములు. తద్భిన్నములు నిమ్మ, వేప, మొదలగు వృక్షములు అయూప్యములు.) ఓ యూపార్హమైన పలాశ వృక్షమా! నిన్నే గాక నీ కంటె నితరములైన యూపార్హ వృక్షములను గూడ పొందితిని. యూపార్హములు గాని వృక్షములను పొందలేదు. ఉత్కృష్ట లక్షణ సహితమును, నికృష్ట లక్షణ రహితమునైన నిన్ను పొందితిని. ఓ వృక్షమా! విష్ణుదేవతాకమైన నిన్ను దేవయాగము నిమిత్తము సేవించుచున్నాను. (యజ్ఞకర్త యూప్య వృక్షము నొద్దకు పోయి ఈ మంత్రము చెప్పుచు దాని నభిమంత్రించి స్పృశించవలెను.)

2. అర్థము: (హే పలాశ!=ఓ పలాశ వృక్షమా!) సవితా=ప్రేరకుఁడైన, దేవః=దేవుఁడు, త్వా=నిన్ను, మధ్వా=మధుర మైన ఆజ్యముతో, అనక్తు=అంతటను తడుపుఁగాక. హే ఓషధే!=ఓ ఓషధి విశేషమా!, ఏనమ్=ఈ యూపవృక్షమును, త్రాయస్వ=రక్షింపుము. హే స్వధితే!=ఓ స్వధితి యను ఆయుధ విశేషమా! ఏనమ్=ఈ వృక్షమును, మా హింసీః=హింసింపకుము.

తాత్పర్యము: ఓ పలాశ వృక్షమా! సవితృదేవుఁడు నిన్ను మధురమైన ఆజ్యముతో తడుపుఁగాక. ఓ ఓషధి విశేషమా! ఈ పలాశ వృక్షమును రక్షింపుము. ఓ స్వధితీ! ఈ వృక్షమును హింసింపకుము. (అధ్వర్యుఁడు ఈ మంత్రము నుచ్చరించుచు ఆజ్యసహిత స్రువముతో వృక్షమూలము నంతటను తడిపి, దానిపై రెండు దర్భల నుంచి స్వధితి యను నాయుధముచే ఆ వృక్షమును ఛేదించవలెను.)

3. అర్థము: (హే ఛిన్నవృక్ష!=ఓ ఛేదించఁబడిన వృక్షమా!, త్వమ్=నీవు, పతన్=పడుచు) దివమ్=ద్యులోకమును, అగ్రేణ=అగ్రభాగముచే, మా లేఖీః=బ్రద్దలు చేయకుము. మధ్యేన=మధ్యభాగముచే, అన్తరిక్షమ్=అంతరిక్ష లోకమును, మా హింసీః=హింసింపకుము. పృథివ్యా=భూమితో, సంభవ=కలిసి యుండుము.

తాత్పర్యము: ఓ ఛిన్న వృక్షమా! నీవు పడుచు నీ యగ్రభాగముచే ద్యులోకమును చీల్చకుము. మధ్యభాగముచే నంతరిక్షమును హింసింపకుము. పృథివితో కలిసి యుండుము. (తూర్పు కొనలుగాఁ గాని, ఉత్తరాగ్రములుగాఁ గాని పడుచున్న పలాశ వృక్షమును ఈ మంత్రము చెప్పుచు నభిమంత్రించవలెను.)

4. అర్థము: హే వనస్పతే!=ఓ వనస్పతీ! (త్వమ్=నీవు) శతవల్శః=అనేక శాఖలు కలదానవై, విరోహ=విశేషముగ మొలువుము.

తాత్పర్యము: ఓ వనస్పతీ! నీవు మఱల అనేక శాఖలతో మొలువుము. (వనస్పతిః=పుష్పములు లేకుండ ఫలములతో ప్రకాశించు వృక్షము. ఈ మంత్రము చెప్పుచు ఛేదింపఁబడిన వృక్ష మూలభాగమునందలి నఱుకుడు పడిన ప్రదేశమునందు హిరణ్యము నుంచి అందు హోమము చేయవలెను.)

5. అర్థ తాత్పర్యములు 1. ప్ర. 2. అ. న వ్రాయఁబడినవి.

6. అర్థము: (హే ఛిన్న వృక్ష!=ఓ ఛిన్న వృక్షమా!) తేతిజానః=తీక్ష్ణమైన, అయమ్=ఈ, స్వధితిః=స్వధితి, యమ్=ఏ, త్వా=నిన్ను, మహతే సౌభగాయ=గొప్ప సౌభాగ్యము కొఱకు, ప్రణినాయ=(యూప భావమును) పొందించెనో, (తాదృశః=అటువంటి, త్వమ్=నీవు, అస్మాచ్ఛేదనాత్=ఈ ఛేదనము వలన, మా భైషీః=భయపడకుము.)

తాత్పర్యము: ఓ ఛేదింపఁబడిన వృక్షమా! మంచి పదను గల ఈ స్వధితి యను నాయుధము మహా సౌభాగ్యమునకై తిర్యక్శాఖా చ్ఛేదనము చేసి నీకు యోగ్యమైన యూపభావమును గలుగఁ జేసినది. కావున నీవు ఈ ఛేదనము వలన భయపడకుము. (ఛిన్నవృక్షమును అగ్రములు పై కుండునట్లుగా నుంచవలెను.)

7. అర్థము: (హే యూప!=ఓ యూపమా!) సువీరః=మంచి వీరులు కల, (త్వమ్=నీవు)అచ్ఛిన్నః=ఛేదన వ్యధ లేనిదానవై, రాయః=ధనములను, (యజమానాయ దేహి=యజమానుని కొఱకిమ్ము.)

తాత్పర్యము: ఓ యూపమా! యజమానునకు నీ వలన పుత్త్రపౌత్రాదులు లభింతురు; కావున నీవు సువీరుఁడవు. అట్టి నీవు మంత్ర సామర్థ్యముచే ఛేదనము వలన వ్యధ లేని దానవై యజమానునకు ధనముల నిమ్ము. (వృక్షము కొనలను ఛేదించవలెను.)

పంచమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే తృతీయప్రపాఠకే షష్ఠోఽనువాకః

మూలము: [1]పృథివ్యై త్వా ఽన్తరిక్షాయ త్వా దివే త్వా [2]శున్ధతాం లోకః పితృషదనో యవో ఽసి యవయా స్మ ద్ద్వేషో యవయా రాతీః పితృణాగ్ం సదన మసి [3]స్వావేశో ఽస్య గ్రేగా నేతృణాం వనస్పతి రధి త్వా స్థాస్యతి తస్య విత్తా [4]ద్దేవ స్త్వా సవితా మధ్వా నక్తు [5]సుపిప్పలాభ్య స్త్వౌ షధీభ్య [6]ఉద్దివగ్ం స్తభానా ఽన్తరిక్షం పృణ పృథివీ ముపరేణ దృగ్ంహ [7]తే తే ధామా న్యుశ్మసి (౧)గమధ్యే గావో యత్ర భూరి శృఙ్గా అయాసః। అత్రా హ తదురుగా యస్య విష్ణోః పరమం పద మవభాతి భూరేః। [8]విష్ణోః కర్మాణి పశ్యత యతో వ్రతాని పస్పశే। ఇన్ద్రస్య యుజ్య స్సఖా। [9]తద్విష్ణోః పరమం పదగ్ం సదా పశ్యన్తి సూరయః। దివీవ చక్షు రాతతమ్। [10]బ్రహ్మవనిం త్వా క్షత్రవనిగ్ం సుప్రజావనిగ్ం రాయస్పోషవనిం పర్యూహామి బ్రహ్మ దృగ్ంహ క్షత్రం దృగ్ంహ ప్రజాం దృగ్ంహ రాయస్పోషం దృగ్ంహ [11]పరివీ రసి పరి త్వా దైవీ ర్విశో వ్యయన్తాం పరీమగ్ం రాయస్పోషో యజమానం మనుష్యా అన్తరిక్షస్య త్వా సానా వవగూహామి। ॥౨॥

(ఉశ్మసి షోష మేకాన్నవిగ్ం శతి శ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమకాణ్డే తృతీయప్రపాఠకే షష్ఠోఽనువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: పంచమానువాకమునందు యూపచ్ఛేదము చెప్పఁబడినది. యూపస్థాపనము (యూపము నుంచవలసిన స్థానము) ఈ యను వాకమునందు చెప్పఁబడుచున్నది.

1. అర్థము: (హే యూప!=ఓ యూపమా!) త్వా=నిన్ను, పృథివ్యై=భూమికొఱకు, (ప్రోక్షామి=ప్రోక్షించుచున్నాను.) త్వా=నిన్ను, అన్తరిక్షాయ=అంతరిక్షముకొఱకు (ప్రోక్షామి=ప్రోక్షించుచున్నాను.) త్వా=నిన్ను, దివే=ద్యులోకముకొఱకు, (ప్రోక్షామి.) –

తాత్పర్యము: ఓ యూపస్తంభమా! నిన్ను పృథివ్యంతరిక్షముల కొఱకు ద్యులోకము కొఱకును ప్రోక్షించుచున్నాను. (అధ్వర్యుఁడు యూపమును నీటితో కడిగి ప్రక్షాళితమైన యూపము నగ్రభాగమున కటకము (కడియము) నుంచి దానిని అవట ప్రదేశమునకు తూర్పు భాగమున నుండి, మూలమునుండి అగ్రము వఱకు నీటితో ప్రోక్షించవలెను.)

2. అర్థ తాత్పర్యములకు I వ అనువాకమునందలి 5, 6, 7 మంత్రముల వ్యాఖ్యానములు చూడుఁడు. (ప్రోక్షణ శేషమైన ఉదకమును అవట ప్రదేశమున పోసి యవలను ఉంచి పిడికెడు బర్హిస్సులోని సగము భాగమును ప్రాగగ్రముగను, సగము భాగమును ఉత్తరాగ్రముగను వేఱుచేసి పఱచవలెను.)

3. అర్థము: (హే యూప ప్రథమ శకల!=ఓ యూప ప్రథమ శకలమా! త్వమ్=నీవు)స్వావేశః=మంచి యూపావస్థితి లక్షణము కలదానవు. నేతౄణామ్=యూపముయొక్క నేతలలో, అగ్రేగాః=మొదటిదానవు, అసి=అగుచున్నావు. వనస్పతిః=వనస్పతి రూప యూపము, త్వా=నిన్ను, అధి స్థాస్యతి=అధిష్ఠించఁగలదు. తస్య విత్తాత్=ఆ యూపమును గుర్తించుము. ('తస్య'–ద్వితీయార్థే షష్ఠీ.)

తాత్పర్యము: (యూపమును ఛేదించినపుడు తెగిపడిన మొదటి ముక్కకు ప్రథమ శకలమనిపేరు. రెండవదానికి 'స్వరువు' అని వ్యవహారము. యూపముయొక్క చివర నాలుగంగుళముల పరిమాణముగల భాగమును ఛేదించి దాని మధ్యమునందు, రంధ్రము నేర్పఱచవలెను. ఆ రంధ్రముతో కూడిన భాగమునకు 'చషాల' మని పేరు. ఈ చషాలమును యూపాగ్రమునందు కడియముగా ధరింపఁజేయుదురు. ప్రథమ శకలము, స్వరువు, చషాలము-అను మూఁడును ఛిన్నమైన వృక్షభాగమును యూపముగాఁజేయుచున్నవి. కావున ఈ మూఁడు భాగములను యూప నేతలుగా వ్యవహరింపఁబడుచున్నవి. ఈ యూప నేతలలో మొదటిది ప్రథమ శకలము.) ఓ ప్రథమ శకలమా! నీవు యూపావస్థితి లక్షణములు కలదానవు, యూప నేతలలో మొదటిదానవు నగుచున్నావు. వనస్పతి రూప యూపధర్మము నీలో నుండును. నీవు యూపమును గుర్తించుము. (యూపావస్థితి లక్షణము=యూపమునకు యూపత్వ స్థితిని గలుగఁజేయు లక్షణము. ఈ మంత్రము చెప్పుచు యూపము నుండి ప్రథమ శకలమును తొలఁగించవలెను. స్వరువు లొడితెడు పరిమాణము కలిగియుండును.)

4. అర్థము: (హే చషాల!=ఓ చషాలమా!) సవితా=ప్రేరకుఁడగు, దేవః=దేవుఁడు, త్వా=నిన్ను, మధ్వా=మధురమైన నేతితో, అనక్తు=తడుపుఁగాక.

తాత్పర్యము: ఓ చషాలమా! సవితృదేవుఁడు నిన్ను మధురమైన (తేజోరూపమగు) అజ్యముతో తడుపుఁగాక. (చషాలమును నేతితో తడుపవలెను.)

5. అర్థము: (హే చషాల!=ఓ చషాలమా!) త్వా=నిన్ను, సు పిప్పలాభ్యః=మంచి ఫలములతోఁగూడిన, ఓషధీభ్యః=ఓషధులకొఱకు, (యూపాగ్రే=యూపముయొక్క అగ్రభాగమునందు, ప్రతి ముఞ్చామి=విడుచుచున్నాను.)

తాత్పర్యము: ఓ చషాలమా! నిన్ను మంచి ఫలములతోఁగూడిన యోషధులకొఱకు యూపాగ్రమున నుంచుచున్నాను. (చషాలమును లోపల వెలుపల నేతితో తడిపి యూపాగ్రమున అగ్నము చేయవలెను.)

6. అర్థము: (హే యూప!=ఓ యూపమా! త్వమ్=నీవు) దివమ్=ద్యులోకమును, ఉత్తభాన=స్తంభింపఁజేయుము. (=క్రింద పడకుండునట్లు చేయుము.) అన్తరిక్షమ్=అంతరిక్ష లోకమును, పృణ=పూరించుము. ఉపరేణ=మూలభాగముచేత, పృథివీమ్=భూమిని, దృంహ=దృఢముగాఁ జేయుము.

తాత్పర్యము: ఓ యూపమా! నీవు స్వర్గలోకమును క్రింద పడకుండునట్లు స్తంభింపఁజేయుము. ఆకాశమును పూరించుము. నీ మూల భాగముచేత భూమిని దృఢముగాఁజేయుము. (అధ్వర్యుఁడు యూప స్తంభమును అవట ప్రదేశమునందు స్థాపించవలెను.)

7. అర్థము: (హే యూపాభిమానిన్ విష్ణో!=యూపాభిమాని వగు ఓ విష్ణూ!) యత్ర=ఏ స్థానములందు, గావః=వెళ్లు చున్న వారును, భూరిశృంగాః=అధిక కాంతిగల వారును, అయాసః=అపాయము లేనివారును నై, (వర్తన్తే= ఉంటున్నారో!) తే=నీయొక్క తే=ఆ, ధామాని=స్థానములను, గమధ్యై=పొందుటకు, ఉశ్మసి=కోరు చున్నాము. అత్రాహ=ఈ స్థానములయందే, ఉరుగాయస్య=మహాత్ములచే గానము చేయఁబడుచున్న వాఁడును, భూరేః=గొప్పవాఁడునగు, విష్ణోః=విష్ణుమూర్తియొక్క, తత్=ఆ, పరమమ్=గొప్పదియగు, పదమ్=స్థానము, అవభాతి=ప్రకాశించుచున్నది. ('ధామాని' అను నపుంసకపదమునకు విశేషణమైన 'తే' అనునది పుంలిఙ్గ ప్రయోగము ఛాందసము.)

తాత్పర్యము: ఓ యూపాభిమానివగు విష్ణూ! నీ స్థానములందు పోవువారు అధికకాంతి కలవారుగను, అపాయము లేనివారు గను ఉంటున్నారు. కావున ఆ నీ స్థానములను మేము కోరుచున్నాము. గొప్పగా కీర్తింపఁబడుచున్న వాఁడును, గొప్పవాఁడునగు విష్ణువుయొక్క ఆ స్థానము ఈ స్థానములయందే ప్రకాశించుచున్నది. అట్టి స్థానము నొందుటకు కారణమైన కర్మకొఱకు యూపము ఈ యవటము నందుండుఁగాక. (ఈ మంత్రము, 8 వ మంత్రముకూడ విష్ణు దేవతాకములు. ఈ విష్ణు దేవతాకములయిన రెండు మంత్రముల నుచ్చరించుచు యూపముయొక్క ఒక యంచును ఆహవనీయాగ్నికి సమీపమున నుండునట్లు చేయవలెను.)

8. అర్థము: (హే జనాః!=ఓ జనులారా!, యూయమ్=మీరు) విష్ణోః=విష్ణుమూర్తియొక్క, కర్మాణి=సృష్టి స్థితి లయ రూప కర్మలను, పశ్యత=చూడుఁడు. యతః=ఏ కర్మల వలన, వ్రతాని=(మీ యొక్క) లౌకిక వైదిక కర్మ లను, పస్పశే=సృష్టించెనో, (సః=ఆ విష్ణుమూర్తి) ఇన్ద్రస్య=ఇంద్రునకు, సఖా=మిత్రుఁడు.

తాత్పర్యము: ఓ జనులారా! విష్ణువు తాను సృష్టించిన సృష్టి స్థితి లయ కర్మలచేత మా లౌకిక వైదిక కర్మలను నిర్మించెను. ఆ విష్ణువు ఇంద్రునకు యోగ్య సఖుఁడు.

9. అర్థము: సూరయః=విద్వాంసులు, విష్ణోః=విష్ణువుయొక్క, తత్=ఆ, పరమమ్=ఉత్కృష్టమైనదియు, దివి=ఆకాశము నందు, చక్షురివ=చక్షుస్సువలె, ఆతతమ్=వ్యాప్తమైనదియునగు, పదమ్=స్థానమును (=స్వరూపమును) సదా=ఎల్లప్పుడు, పశ్యన్తి=చూచుచున్నారు.

తాత్పర్యము: వేదాంత పారంగతులైన విద్వాంసులు నిరావరణమైన ఆకాశమునందు దృష్టివలె వ్యాప్తమైన విష్ణు స్వరూప మును సర్వదా చూచుచున్నారు. అట్టి విష్ణువు యొక్క అనుగ్రహమువలన విష్ణు దేవతాక యూపముయొక్క అగ్నిష్ఠమైన అంచును ఆహవనీయముతో సమ్మతముగా స్థాపించుచున్నానని తాత్పర్యము. (ఈ మంత్రము చెప్పుచు యూపాగ్రమునందలి చషాలమును పరీక్షించవలెను.)

10. దీని యర్థతాత్పర్యములను 1 వ అనువాకమున 10 వ మంత్ర వ్యాఖ్యానమున చూడుఁడు. (అధ్వర్యుఁడు యూపమును ప్రదక్షిణముగ తుడిచి మైత్రావరుణ దేవతాక దండముతో యూపముపై కొట్టవలెను.)

11. అర్థము: (హే యూప!=ఓ యూపమా! త్వమ్=నీవు) పరివీః=అంతటను (త్రాటిచే) చుట్టఁబడినదానవు, అసి=అగు చున్నావు. త్వా=నిన్ను, దైవీః=దేవతా సంబంధులైన, విశః=మరుద్గణాది ప్రజలు, పరి=అంతటను, వ్యయన్తామ్=చుట్టుకొని యుందురుగాక. ఇమం యజమానమ్=ఈ యజమానుని, రాయస్పోషః=ధన సమృ ద్ధులు, మనుష్యాః=పుత్ర భృత్యాది మనుష్యులు, వ్యయన్తామ్=చుట్టుకొని యుందురుగాక.

తాత్పర్యము: ఓ యూపమా! నీవు త్రాటిచే అంతటను చుట్టఁబడుచున్నావు. దేవతా సంబంధులైన మరుద్గణాది ప్రజలు నీ దగ్గఱకు చేరుదురుగాక. ధన సమృద్ధులు పుత్ర భృత్యాది మనుష్యులు ఈ యజమానుని చేరుదురుగాక. (అధ్వర్యుఁడు ప్రదక్షిణ పూర్వకముగ యూపమును త్రాటిచే చుట్టవలెను.)

12. అర్థము: (హే స్వరో!=ఓ స్వరువా!) త్వా=నిన్ను, అన్తరిక్షస్య=అంతరిక్షలోక మధ్యవర్తియగు రశనాగుణము (త్రాటి) యొక్క, సానౌ=పార్శ్వమునందు, అవగూహామి=దాఁచుచున్నాను. స్వరువు=లొడితెడు పరిమాణముగల కాష్ఠ విశేషము.)

తాత్పర్యము: ఓ స్వరువా! నిన్ను యూపమునకు చుట్టిన త్రాటియొక్క అంచునందు దాఁచుచున్నాను. (అధ్వర్యుఁడు యూపముయొక్క అంచునకు ఉత్తరపువైపున చుట్టిన త్రాటి వరుసలలో మధ్యభాగమున స్వరువును గ్రుచ్చి యుంచవలెను.)

షష్ఠానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే తృతీయప్రపాఠకే సప్తమోఽనువాకః ।

మూలము: [1]ఇషే త్వో పవీ రస్యు పో దేవా న్దైవీ ర్విశః ప్రాగు ర్వహనీ రుశిజో బృహస్పతే ధారయా వసూని హవ్యా తే స్వదన్తాం దేవ త్వష్ట ర్వసు రణ్వ రేవతీ రమధ్వ [2]మగ్నే ర్జనిత్ర మసి వృషణౌ స్థ ఉర్వశ్యస్యా యు రసి పురూరవా ఘృతేనా క్తే వృషణం దధాతాం [3]గాయత్రం ఛన్దో ఽను ప్రజాయస్వ త్రైష్టుభం జాగతం ఛన్దో ను ప్రజాయస్వ [4]భవతమ్ (౧)న స్సమనసౌ సమో కసా వరేపసౌ। మా యజ్ఞగ్ం హిగ్ంసిష్టం మా యజ్ఞపతిం జాతవేదసౌ శివౌ భవత మద్య నః। అగ్నా వగ్ని శ్చరతి ప్రవిష్ట ఋషీణాం పుత్రో అధిరాజ ఏషః। స్వాహాకృత్య బ్రహ్మణా తే జుహోమి మా దేవానాం మిథుయాక ర్భాగధేయమ్ ॥౭॥

(భవత మేకత్రిగ్ంశ చ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే తృతీయప్రపాఠకే సప్తమోఽనువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: షష్ఠానువాకమునందు యూపస్థాపనము చెప్పఁబడినది. ఈ సప్తమానువాకమునందు ఆ యూపమునకు పశువును కట్టుటకు ఉపాకరణము చెప్పఁబడుచున్నది. ఉపాకరణము=మంత్రపూర్వకముగా చేయు సంస్కార విశేషము.

1. **అర్థము:** (హే బర్హిః!=ఓ బర్హిస్సా!) ఇషే=(పశు లక్షణమైన దేవతల) అన్నముకొఱకు, త్వా=నిన్ను, ఆదదే=తీసి కొనుచున్నాను. (హే ప్లక్షశాఖే!=ఓ జువ్వికొమ్మా! త్వమ్=నీవు)ఉపవీః=ఉపాకరణము చేయుటకై పోవు దానవు, అసి=అగుచున్నావు. (ఉపాక్రియమాణ పశు సంబంధి హృదయాదయః=ఉపాకరణము చేయఁబడు పశువుయొక్క హృదయా ద్యవయవములు) దేవాన్=అగ్ని షోమాది దేవతలను, దైవీః విశః=దేవతా సంబంధు లగు ప్రజలను, వహనీః=యాగ నిర్వాహకులగు, ఉశిజః=(దేవతలు భక్షింపఁగా మిగిలిన పశు హృదయాది హవిస్సును భక్షించుటకు) కోరిక కలవారిని, ఉపో=సమీపమునందు, ప్రాగుః=పొందినవి. హే బృహస్పతే!=ఓ బృహస్పతీ!, వసూని=(పశువుయొక్క హృదయాది) ద్రవ్యములను, ధారయా=పోషించుము. (హే పశో!=ఓ పశువా!) తే=నీ యొక్క, హవ్యా=హవిస్సులు, స్వదన్తామ్=స్వాదువులగుఁగాక. హే త్వష్టః దేవ!=ఓ త్వష్టృదేవా! వసు=పశు ద్రవ్యమును, రణ్వ=రమణీయముగాఁజేయుము. హే రమణీః!=క్షీరాది ధనముకల పశువులారా! రమధ్వమ్=(యజమాన గృహమునందు) విహరించుఁడు.

తాత్పర్యము: ఓ బర్హిస్సా! పశులక్షణమైన దేవతల అన్నము కొఱకు నిన్ను తీసికొనుచున్నాను. ఓ జువ్వికొమ్మా! నీవు ఉపాకరణము చేయుటకు పోవు (దానవగు) చున్నావు. ఉపాక్రియమాణ పశుసంబంధి హృదయాది ద్రవ్యములు, అగ్ని షోమాది దేవతలను, దేవతాసంబంధులైన ప్రజలను, యాగ నిర్వాహకులగు హవ్యభక్షణకాములను, (=ఋత్విజాదులను) దగ్గఱగా పొందినవి. ఓ బృహస్పతీ! పశువుయొక్క హృదయాద్యవయవములను పోషించుము. ఓ యజ్ఞ పశువా! నీ హవ్యములు రుచ్యములగుఁగాక. ఓ త్వష్టృదేవా! పశుద్రవ్యమును రమణీయముగఁ జేయుము. క్షీరాది ధనములుగల పశువులారా! యజమానుని గృహమునందు విహరించుఁడు.

విశేషములు: యూపమునకు పశువును కట్టి దానినుండి హృదయాది భాగములు తీసి దేవతల నుద్దేశించి హోమముచేయఁబడును. కావున యజ్ఞపశువు దేవతలకు అన్నమైనది. ఆ పశువును బర్హిస్సుచేతను జువ్వికొమ్మచేతను మంత్రపూర్వకముగ సంస్కారము చేయుదురు. ఆ సంస్కార విశేషమునకే ఉపాకరణమనిపేరు. హోమమునకర్హములైన పశు హృదయాద్యవయవములు హవ్యములు. హోమము చేయఁగా మిగిలిన హవ్యమును యజమానునితోఁగూడ యాగ నిర్వహణమునందు సహాయకారులైన ఋత్విజాదులు హవ్యభక్షణ కాములుగా వర్ణింపఁబడినారు.

'హవ్యాని' అని యుండుటకు బదులుగా 'హవ్యా' అని యుండుట వైదిక వైలక్షణ్యము. ఇట్లే ప్రాగుః, రణ్వ-ఇత్యాదులు విలక్షణ ప్రయోగములు. ఈ మంత్రము నుచ్చరించుచు బర్హిస్సుచేతను, జువ్వికొమ్మచేతను పశువునకు ఉపాకరణము చేయవలెను.

2. అర్థము: (హే శకల!=ఓ శకలమా! త్వమ్=నీవు) అగ్నేః=అగ్నికి, జనిత్రమ్=ఉత్పాదకము, అసి=అగుచున్నావు. (హే దర్భౌ!=ఓ దర్భలారా!, యువామ్=మీరు) వృషణౌ=వీర్యసేచకములు, స్థః=అగుచున్నారు. (హే అధరారణే!=ఓ క్రింది అరణీ! త్వమ్=నీవు) ఊర్వశీ=ఊర్వశివంటి దానవు, అసి=అగుచున్నావు. (హే ఉత్తరారణే!=పైననుండెడి అరణీ!, త్వమ్=నీవు) పురూరవాః=పురూరవునివంటి దానవు, అసి=అగుచున్నావు. (హే ద్వే అరణీ!=ఓ రెండు అరణులారా!, యువామ్=మీరు) ఘృతేన=నేతిచే, అక్తే=తడుపఁబడినవారై, వృషణమ్=వీర్య సేచనమును, దధాతామ్=పోషించుఁడు. (హే అరణి ద్వయ!=ఓ అరణి ద్వయమా!, త్వమ్=మాతృ పితృ స్థానీయమైన నీవు) ఆయుః=యజ్ఞమునకు ఆయు స్థానమువంటి దానవు, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: క్రింది భాగమున నొక కొయ్యను, పై భాగమున నొక కొయ్యను ఉంచి రెండింటికి మధ్య భాగమున రంధ్రము చేసి ఆ రంధ్రములందు ఒక కాష్ఠమునుంచి పై దానిని గట్టిగా నదిమి పట్టుకొని మధ్యమున నున్న కాష్ఠ విశేషమును త్రాడు కట్టి కవ్వమునువలె త్రిప్పినచో అగ్ని పుట్టును. క్రింది దారువునకు అధరారణి యనియు, పైన నున్న దారువునకు ఉత్తరారణి యనియు వ్యవహారము. మధ్యమున నున్న కాష్ఠము ఇచట శకలమని వ్యవహరింపఁబడినది. క్రింది యరణి ఊర్వశిగాను, ఉత్తరారణి పురూరవుఁడుగాను వర్ణింపఁబడినవి. ఈ రెండింటి సంబంధమువలన అగ్ని పుట్టును కావున అరణులు రెండు మాతా పితృ స్థానీయములైనవి. యజ్ఞమునకు ముఖ్యముగా కావలసిన అగ్ని అరణి ద్వయమునుండి పుట్టును. కావున అరణి ద్వయము యజ్ఞమునకు ఆయుస్థానము వంటిది. (అధ్వర్యుఁడు అరణి ద్వయమును దర్భలచే నభిమంత్రించి అగ్ని మంథన శకలమును ఆ అరణి ద్వయమునందు సమకూర్చవలెను.)

3. అర్థము: (హే అగ్నే!=ఓ యగ్నీ!, త్వమ్=నీవు) గాయత్రం ఛన్దః అను=(హోతచే పఠింపఁబడుచున్న) గాయత్రీ ఛన్దస్సు ననుసరించి, ప్రజాయస్వ=ప్రకృష్టముగా పుట్టుము. త్రైష్టుభం ఛన్దః అను=త్రిష్టుప్ ఛన్దస్సు ననుసరించి, ప్రజాయస్వ=ప్రకృష్టముగా పుట్టుము. జాగతం ఛన్దః అను=జగతీ ఛన్దస్సు ననుసరించి, ప్రజాయస్వ=ప్రకృష్టముగా పుట్టుము. ('ఛన్దస్సు'- అనగా ఛన్దోబద్ధమైన మంత్రభాగము.)

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు హోత పఠించుచున్న గాయత్రీ, త్రిష్టుప్, జగతీ ఛందస్సుల ననుసరించి అతిశయముగా నుద్భవించుము. (అగ్ని పుట్టుటకై అధ్వర్యుఁడు అరణిని మథించవలెను.)

4. అర్థము: (హే ఆహవనీయ మథితాగ్నీ!=ఓ యాహవనీయ మథితాగ్నులారా! యువామ్=మీరు) నః=మమ్ముఁగూర్చి, సమనసౌ=సమాన మనస్సు కలవారును, సమోకసౌ=సమాన నివాస స్థానము కలవారును, అరేపసౌ=పాప చిత్త రహితులును, భవతమ్=కండు. యజ్ఞమ్=యజ్ఞమును, మా హింసిష్టమ్=హింసింపవలదు. యజ్ఞపతిమ్=యజ్ఞ కర్తను, మా హింసిష్టమ్=హింసింప వలదు. హే జాతవేదసౌ!=ఓ యగ్నులారా! అద్య=ఇప్పుడు, నః=మమ్ముఁగూర్చి, శివౌ=శాంతులు, భవతమ్=కండు. ఋషీణామ్=మంత్రములయొక్క, పుత్రః=పుత్రుఁడును, అధిరాజః=అధికముగ ప్రకాశించువాఁడును నగు, ఏషః=ఈ, అగ్నిః=అగ్ని, (=మథితాగ్ని) అగ్నౌ=ఆహవనీయాగ్నియందు, ప్రవిష్టః=ప్రవేశించినవాఁడై, చరతి=సంచరించు చున్నాఁడు. (హే మథితాగ్నీ! మథించఁబడిన ఓ యగ్నీ!) తే=నీ కొఱకు, స్వాహాకృత్య=స్వాహా శబ్దము నుచ్చరించి, బ్రహ్మణా=మంత్రము చేత, జుహోమి=హోమము చేయుచున్నాను. దేవానామ్=దేవతలయొక్క, భాగధేయమ్=అదృష్టమును, మా మిథుయాకః=మిథ్యగాఁజేయవలదు.

తాత్పర్యము: సద్యోమథితాగ్నియు ఆహవనీయాగ్నియు ఇచట సంబోధింపఁబడుచున్నారు. ఓ యగ్నులారా! మీరు మా విషయమున సమ మనస్కులు, సమాన నివాసస్థానము కలవారు, పాపచిత్త రహితులునై యుండుఁడు. యజ్ఞమును యజ్ఞకర్తను హింసింపకుఁడు. ఓ యగ్నులారా! ఇప్పుడు మమ్ముఁగూర్చి శాంతులు కండు. ఋషులకు-లేదా-మంత్రములకు పుత్త్రుఁడును, మిక్కిలి ప్రకాశించువాఁడునునగు ఈ మథితాగ్ని ఆహవనీయాగ్ని యందు ప్రవేశించి సంచరించుచున్నాడు. ఓ మథితాగ్నీ! నీకు స్వాహా శబ్దము నుచ్చరించి మంత్ర పూర్వకముగ హోమము చేయుచున్నాను. దేవతల యదృష్టమును మిథ్యగా చేయవలదు. ఋత్విజులచే ఉత్పాదితుఁడగుటచే, అగ్ని ఋషిపుత్రుఁడన వచ్చును. ఋషిపదము మంత్రవాచకముగాఁ గూడ నుండుటచే మంత్రములకు పుత్త్రుఁడనియుఁ జెప్పవచ్చును. (అధ్వర్యుఁడు యజ్ఞ పరిధిని ఆహవనీయాగ్ని యందుంచి స్రువముతో హోమము చేయవలెను.)

సప్తమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే తృతీయప్రపాఠకే ఽష్టమోఽనువాకః।

మూలము: [1]ఆదదే ఋతస్య త్వా దేవహవిః పాశేనా ఽరభే ధర్షా మానుషా న్న[2]ద్భ్య స్త్వౌ షధీభ్యః ప్రోక్షా మ్యపాం పేరు రసి స్వాత్తంచి త్సదేవగ్ం హవ్య మాపో దేవీ స్స్వదతై నగ్ం [3]సం తే ప్రాణో వాయునా గచ్ఛతాగ్ం సం యజత్రై రఙ్గాని సం యజ్ఞపతి రాశిషా [4]ఘృతేనా క్తౌ పశుం త్రాయేథాగ్ం [5]రేవతీ ర్యజ్ఞపతిం ప్రియధా ఽఽవిశతో [6]రో అన్తరిక్ష సజూ ర్దేవేన (౧)వాతేనా స్య హవిష స్త్మనా యజ సమస్య తనువా భవ వర్షీయో వర్షీయసి యజ్ఞే యజ్ఞపతిం ధాః [7]పృథివ్యా స్సంపృచః పాహి [8]నమ స్త ఆతానా [9]నర్వా ప్రేహి ఘృతస్య కుల్యా మను సహ ప్రజయా సహ రాయస్పోషేణా ఽఽపో దేవీ శ్శుద్ధాయువ శ్శుద్ధా యూయం దేవాగ్ం ఊఢ్వగ్ం శుద్ధా వయం పరివిష్టాః పరివేష్టారో వో భూయాస్మ ॥౨॥

(దేవేన చతుశ్చత్వారిగ్ంశ చ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే తృతీయప్రపాఠకే ఽష్టమోఽనువాకః।

వేదార్థదీపిక

అవతారిక: సప్తమానువాకమునందు ప్రధానముగా పశూపాకరణము చెప్పఁబడినది. ఉపాకృతమైన పశువునకు విశసనము ఈ యష్టమానువాకమునందు చెప్పఁబడుచున్నది. (విశసనము=వధ.)

1. అర్థము: (హే రశనే!=ఓ రశనా! (=త్రాడు) సవితుః=ప్రేరకుఁడైన, దేవస్య=దేవుని యొక్క, ప్రసవే(సతి)=ప్రేరణ కలుగుచుండగా, అశ్వినోః=అశ్వినీ దేవతల యొక్క, బాహుభ్యామ్=బాహువుల చేతను, పూష్ణః=పూష దేవుని యొక్క, హస్తాభ్యామ్=హస్తముల చేతను, త్వా=నిన్ను) ఆదదే=స్వీకరించుచున్నాను. హే దేవహవిః=దేవతలకు హవిస్సువైన పశువా! ఋతస్య=యజ్ఞము యొక్క (సిద్ధ్యై=సిద్ధికొఱకు) త్వా=నిన్ను, పాశేన=త్రాటిచేత, ఆరభే=బంధించుచున్నాను. మానుషాన్=మనుష్య కృతములైన తాడనాద్యుపద్రవములను, ధర్షా=తిరస్కరించుము.

తాత్పర్యము: ఓ రశనా! సవితృదేవుని ప్రేరణ వలన అశ్వినీదేవతల బాహువుల చేతను పూషదేవుని హస్తముల చేతను నిన్ను స్వీకరించుచున్నాను. దేవతలకు హవీరూపమైన పశువా! యజ్ఞము సిద్ధించుటకై త్రాటిచే నిన్ను బంధించు చున్నాను. ఇట్లు బంధించుటచే నీకు దేవత్వము సిద్ధించినది, కావున మనుష్య కృతములైన తాడనాద్యుపద్రవ ములను తిరస్కరించుము. (అధ్వర్యుఁడు "దేవస్య త్వా" ఇత్యాది మంత్రము పఠించుచు త్రాటిని గ్రహించ వలెను. ఇందలి 'ఆదదే' అనునది "దేవస్య త్వా" ఇత్యాది మంత్రమునకు ఉపలక్షకము. 'ఆరభే=అవ బధ్నామి' అని విద్యారణ్యము. "రభ=రాభస్యే" అను ధాతువు నుండి 'ఆఙ్' అను నుపసర్గతో 'ఆరభే' అని యైనది'. "రాభస్యం నామ=ఉపక్రమః" అని తత్త్వబోధినీకారుని వ్యాఖ్యానము. అయినను 'ధాతూనా మనేకార్థకత్వమ్' ప్రసిద్ధము కావున, ఆరభే=బంధించుచున్నాను, అనెడి అర్థము నిరాక్షేపణీయము.)

2. **అర్థము:** (హే పశో!=ఓ పశువా!) త్వా=నిన్ను, అద్భ్యః=ఉదకముల చేతను, ఓషధీభ్యః=ఓషధుల చేతను, ప్రోక్షామి=ప్రోక్షించు చున్నాను. అపామ్=నీటిని, పేరుః=త్రాగుదానవు, అసి=అగుచున్నావు. దేవీః=దేవతా సంబంధు లగు, హే ఆపః!=ఓ యుదకములారా!, స్వాత్తంచిత్=సహజముగ రుచి కలదైనను, సదేవమ్=దేవతార్థమైన. ఏనం హవ్యమ్=ఈ హవిస్సును, స్వదత=(ఇంకను) రుచి కలదిగాఁజేయుఁడు.

తాత్పర్యము: ఓ యజ్ఞపశువా! ఉదకముల చేతను ఓషధుల (=దర్భల) చేతను నిన్ను ప్రోక్షించు చున్నాను. నీవు ఉదక మును త్రాగు దానవు అగుచున్నావు. (=త్రాగుము) దేవతా సంబంధులగు ఉదకములారా! సహజముగ రుచి కలదైనను, దేవతల కొఱకైన ఈ పశురూప హవ్యమును ఇంకను రుచి గలదానిగా చేయుఁడు. (అధ్వ ర్యుఁడు యజ్ఞపశువును ఉదకముల చేతను దర్భల చేతను ప్రోక్షించవలెను. 'అద్భ్యః', 'ఓషధీభ్యః—ఇచట తృతీయార్థమున చతుర్థి ప్రయుక్తమైనది. 'అపామ్'=కర్మణి షష్ఠి. దర్భలచే ఉదకములు కూడ పవి త్రము చేయఁబడుట కలదు కావున దర్భలకు ప్రోక్షణ సాధనత్వము కలదు.)

3. **అర్థము:** (హే పశో!=ఓ యజ్ఞపశువా! తే=నీ యొక్క, ప్రాణః=ప్రాణము, వాయునా=వాయువుతో, సంగచ్ఛతామ్=కలిసికొనుఁగాక. అఙ్గాని=హృదయా ద్యవయవములు, యజత్రైః=యాగ విశేషములతో, సంయుజ్యన్తామ్=కలిసికొనుఁగాక. యజ్ఞపతిః=యజ్ఞకర్త, ఆశిషా=ఆశీస్సుతో, సంయుజ్యతామ్=కలిసికొనుఁగాక.

తాత్పర్యము: ఓ యజ్ఞపశువా! నీ ప్రాణము వాయువుతోడను, హృదయాద్యవయవములు యాగ విశేషములతోడను, యజమానుఁడు ఆశీస్సుతోడను, కలిసికొనుఁగాక. (అధ్వర్యుఁడు స్రుక్కునందు ఆజ్యము నుంచుకొని దానిని జుహువుతో క్రమముగా పశువు యొక్క శిరస్సు, మూపు, పిఱుదులపైన పోసి వానిని తడుపవలెను.)

4. **అర్థము:** (హే స్వరు స్వధితీ!=ఓ స్వరు స్వధితులారా!, యువామ్=మీరు) ఘృతేన=ఆజ్యముచే, అక్తౌ=తడిసినవారలై, పశుమ్=పశువును, త్రాయేథామ్=రక్షింపుఁడు.

తాత్పర్యము: ఓ స్వరు స్వధితులారా! మీరు నేతితో తడిసినవారై యజ్ఞ పశువును రక్షింపుఁడు. (అధ్వర్యుఁడు స్వరువును, స్వధితిని పశు శిరస్సుపైని ఎత్తి పట్టుకొని వాని మీదుగా నేతిని పశు శిరస్సుపైని పోయవలెను. స్వరువు=యూప శకలము. స్వధితి=కొయ్యతో చేయఁబడిన ఆయుధ విశేషము. ఇది పశు విశసనమునకు సాధనము.)

5. **అర్థము:** హే రేవతీః!=ధనవంతములైన పశ్వవయవములారా! (యూయమ్=మీరు) యజ్ఞపతిమ్=యజమానుని గూర్చి, ప్రియధాః=ప్రీతినిఁ గలుగఁజేయువారు కండు. (హవిషా యజ్ఞమ్) ఆ విశత=హవీరూపమున యజ్ఞము నావహింపుఁడు.

తాత్పర్యము: ధనవంతములయిన ఓ పశ్వవయవములారా! మీరు యజమానునకు ప్రీతిని గలుగఁజేయుఁడు. హవీరూప మున యజ్ఞము నావహింపుఁడు. (అధ్వర్యు యజమాను లిద్దఱు ఈ మంత్రము పఠించుచు పశువును అన్వార భము చేయవలెను. అన్వారభము=వధించుట.)

6. అర్థము: హే ఉరో అన్తరిక్ష!=విస్తీర్ణమైన ఓ ఇంద్రియ సముదాయమా!, అస్య=ఈ పశువు యొక్క, దేవేన=అభిమాన దేవుఁడగు, వాతేన=ప్రాణవాయువుతోడను, త్మనా=జీవాత్మతోడను, సజూః=కూడ, హవిషః=హవిస్సులను, యజ=ఇమ్ము. అస్య=ఈ పశువు యొక్క, తనువా=భావి దేవతా శరీరముతో, సంభవ=కలిసికొనుము. హే వర్షియో!—ఓ విస్తీర్ణమైన ఇంద్రియ సముదాయమా! వర్షీయసి=అతి విస్తీర్ణమయిన, యజ్ఞే=యజ్ఞమునందు, యజ్ఞపతిమ్=యజమానుని, ధాః=స్థాపించుము.

తాత్పర్యము: ఓ విస్తీర్ణమైన యింద్రియ సముదాయమా! ఈ పశువు నభిమానించి యుండునట్టి ప్రాణవాయువుతోడను, జీవాత్మతోడను గూడ హవిస్సు నిమ్ము. మఱియు ఈ పశువునకు రాబోవు దేవతా శరీరముతో కలిసికొనుము. అతి విస్తీర్ణమయిన యజ్ఞమునందు యజమానుని స్థాపించుము. (శ్రోత్రాదులైన ఇంద్రియ రంధ్రములందుండెడి ఇంద్రియ సముదాయము ఇచట అంతరిక్ష శబ్దముచేత ఉపలక్షింపఁబడుచున్నది. ఆగ్నీధ్రుఁడు ఆ హవనీయాగ్నినుండి ఒక అంగారమును తీసికొని ముందు నడుచుచుండఁగా యజ్ఞ పశువును వధించు నట్టి వ్యక్తి ఉత్కర-చాత్వాల ప్రదేశముల మధ్యమున ఉత్తర దిక్కునకు యజ్ఞపశువును గొనిపోవలెను. అంగారముతోఁగూడ ఆగ్నీధ్రుఁడు యజ్ఞ పశువునకు ముందు నడువవలెను.)

7. అర్థము: (హే బర్హిః=ఓ బర్హిస్సా!, ఏతత్=ఈ పశ్వంగమును) పృథివ్యాః=భూమియొక్క, సంపృచః=సంపర్కము నుండి, పాహి=రక్షింపుము.

తాత్పర్యము: ఓ దర్భా! నీవు ఈ పశ్వవయవమును భూమిమీద పడకుండునట్లు కాపాడుము. (ఆగ్నీధ్రుఁడు అగ్ని ప్రదేశమునందు అంగారము నుంచవలెను. పశ్వాలంభనకర్త ఈ యంగారమునకు దక్షిణ దిక్కునందు పశువును పశ్చిమ ముఖముగ నుంచి ఈ మంత్రముచే బర్హిస్సును ప్రార్థించవలెను.)

8. అర్థము: హే అతాన!=అంతటను వ్యాప్తిగల సూర్యరశ్మీ! తే=నీ కొఱకు, నమః=నమస్కారము.

తాత్పర్యము: ఓ సూర్యరశ్మీ! నీకు నమస్కారము. (ప్రతిప్రస్థాతయను ఋత్విజుఁడు యజమాన పత్నిని సూర్యాభిముఖముగ నుంచవలెను. ఆమె ఈ మంత్రము చెప్పుచు సూర్యునకు నమస్కారము చేయవలెను.)

9. అర్థము: (హే యజమానపత్ని!, త్వమ్) అనర్వా=శత్రురహితవై, ఘృతస్య=ఆజ్యముయొక్క, కుల్యామను=ప్రవాహము ననుసరించి, ప్రజయా సహ=సంతానముతో కూడను, రాయస్పోషేణ సహ=ధన సమృద్ధితో కూడను, ప్రేహి=బాగుగ పొమ్ము. హే ఆపః!=ఓ యుదకములారా! శుద్ధాయువః=మా శుద్ధిని కోరువారును, శుద్ధాః=స్వయముగ శుద్ధి కలవారునునగు, యూయమ్=మీరు, దేవాన్=దేవతలను, ఉద్వమ్=(యాగప్రదేశమునకు) పొందించుఁడు. వయమ్=మేము, పరివిష్టాః=(మీతోఁ) గూడియున్నవారమై, శుద్ధాః=పరిశుద్ధుల మగుచు, వః=మిమ్ము, పరివేష్టారః=చుట్టుకొనినవారము, భూయాస్మ=అగుదుము.

తాత్పర్యము: ఓ యజమానపత్నీ! నీవు శత్రువులు లేనిదానవగుచు నాజ్య ప్రవాహము ననుసరించి సంతానముతోడను ధన సమృద్ధితోడను కూడ వెళ్లుము. దేవతాస్వరూపములైన ఉదకములారా! మా శుద్ధిని గోరుచున్నవారును స్వయముగ పరిశుద్ధులునగు మీరు దేవతలను యాగ ప్రదేశమునందు ప్రవేశపెట్టుఁడు. మేము కూడ మీతోఁగూడుకొనినవారమై పరిశుద్ధుల మగుచు మిమ్ము చుట్టుకొని యుండువార మగుదుము. (అధ్వర్యుఁడు యజమాన పత్నిని ఉత్కర చాత్వాల ప్రదేశముల మధ్యమునకుఁగొనిపోయి ఆమెచే ఈ మంత్రమును పఠింపఁజేసి ఉదకమును స్పృశింపఁజేయవలెను.)

అష్టమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే తృతీయప్రపాఠకే నవమోఽనువాకః।

మూలము: [1]వా క్త ఆప్యాయతాం ప్రాణ స్త ఆప్యాయతాం చక్షు స్త ఆప్యాయతాగ్ం శ్రోత్రం త ఆప్యాయతాం యా తే ప్రాణా ఞ్ఛు గ్జగామ యా చక్షు ర్యా శ్రోత్రం య త్తే క్రూరం యదా స్థితం త త్త ఆప్యాయతాం త త్త ఏతేన శున్ధతాం నాభి స్త ఆప్యాయతాం పాయు స్త ఆప్యాయతాగ్ం శుద్ధా శ్చరిత్రా శ్శ మద్భ్యః (౧)శ మోషధీభ్య శ్శం పృథివ్యై శ మహోభ్యా [2]మోషధే త్రాయస్వై నగ్ం స్వధితే మై నగ్ం హిగ్ంసీ [3]రక్షసాం భాగో ఽసీ ద మహగ్ం రక్షో ఽధమం తమో నయామి యో ఽస్మా న్ద్వేష్టి యం చ వయం ద్విష్మ ఇద మేన మధ మం తమో నయామీ [4]షి త్వా ఘృతేన ద్యావాపృథివీ ప్రోర్ణ్వాథా [5]మచ్ఛిన్నో రాయ స్సువీర [6]ఉర్వ న్తరిక్ష మన్విహి [7]వాయో వీహి స్తోకానాగ్ం [8]స్వాహో ర్ధ్వనభసం మారుతం గచ్ఛతమ్ ॥౨౨॥ (అద్భ్యయో వీహి పఞ్చ చ)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే తృతీయప్రపాఠకే నవమోఽనువాకః

వేదార్థ దీపిక

అవతారిక: అష్టమానువాకమునందు పశు సంజ్ఞపనము విహితమైనది. ఈ నవమానువాకమునందు వపోత్ఖేదనము విధింపఁబడుచున్నది. సంజ్ఞపనము=సంహరణము, వప + ఉత్ఖేదనము=వపను పెల్లగించుట.

1. అర్థము: (హే యజ్ఞపశో!=ఓ యజ్ఞపశువా!) తే=నీ యొక్క, వాక్=వాగింద్రియము, ఆప్యాయతామ్=(గోళక పరిత్యాగ శోకమును విడిచి ధరింపఁబోవు దేవతా శరీరమునందు సుఖముగా)వృద్ధినొందుఁగాక. తే=నీ యొక్క, ప్రాణః=ప్రాణవాయువు, ఆప్యాయతామ్=వృద్ధినొందుఁగాక; తే, చక్షుః=చక్షురింద్రియము, ఆప్యాయతామ్. తే, శ్రోత్రమ్=శ్రోత్రేంద్రియము, ఆప్యాయతామ్. తే=నీ యొక్క, ప్రాణాన్=(నిర్యాణకాలమునందు హృదయ పుండరీకమున సంకుచితములైన) ప్రాణవాయువులను, యా శుక్=ఏ శోకము, జగామ=పొందెనో, యా=ఏ శోకము, చక్షుః=చక్షురింద్రియమును, యా=ఏ శోకము, శ్రోత్రమ్=శ్రోత్రేంద్రియమును, జగామ=పొందెనో, తే=నీకు, యత్ క్రూరమ్=ఏ క్రూరమైన(బంధన, ముఖ నిరోధాది)కర్మ, ఆస్థితః

కృతమ్=మాచే చేయఁబడినదో, యత్=ఏ ఛేదనాదికము, (కోయుట మొదలగునది) అస్థితమ్=చేయుటకు సిద్ధమైయున్నదో, తత్=అదియంతయు, తే=నీకు, ఆప్యాయతామ్=శమించుఁగాక. (అపి చ=మఱియు) తే=నీ యొక్క, తత్=ఆ ప్రాణాదికము, ఏతేన=ఈ జలముచేత, శుద్ధతామ్=(రాబోవు దేవతా దేహ ప్రవేశము నకై)పరిశుద్ధ మగుఁగాక. తే=నీ యొక్క, నాభిః=బొడ్డు, అప్యాయతామ్=వృద్ధినొందుఁగాక. తే=నీ యొక్క, పాయుః=గుదస్థానము, ఆప్యాయతామ్. చరిత్రాః=పాదములు, శుద్ధాః=పరిశుద్ధములు, సన్తు= అగుఁగాక. అద్భ్యః(ప్రోక్షణ సాధనములైన)ఉదకములకొఱకు, శమ్=సుఖము, (భవతు=అగుఁగాక) ఓష ధీభ్యః=(పశువు క్రింద పఱచఁబడిన)బర్హిస్సులకొఱకు, శమ్, (భవతు) పృథివ్యై=(మరణించుచున్న పశువును వహించిన)పృథివికొఱకు, శమ్, (భవతు). అహోభ్యామ్=(పశు మరణకాలమందుండిన)దివా రాత్రులకొఱకు, శమ్, (భవతు.)

తాత్పర్యము: (యజ్ఞపశువులోని హృదయాది స్థానములందలి వపాదికము యజ్ఞమునందు హోమము చేయవలసి యున్నం దున, ఆ పశువును బంధించి ముఖాదికమును నిరోధించి సంహరించుటచేత కలుగుబాధ పోవుటకును, ప్రాణ ములు, ఇంద్రియాదికము, ధరింపఁబోవు దేవతా దేహమునందు సుఖముగ నుండుటకును, వేడుకొనుట ఈ మంత్రమున విహితమైనది.) ఓ యజ్ఞపశువా! నీ యొక్క వాగాదులైన ఇంద్రియములు, ప్రాణాది వాయు వులును తమ తమ స్థానములను విడుచుటవలన కలిగెడి దుఃఖమును పరిత్యజించి ధరింపఁబోవు దేవతా దేహము నందు సుఖముగా వృద్ధినొందుఁగాక. నీకు మేము చేసిన బంధనము, ముఖాదుల నిరోధాదికము, ఇప్పుడు చేయఁబోవు హృదయాది చ్ఛేదనము మొదలగునది యంతయు శాంతించుఁగాక. నిన్ను ప్రోక్షించుట కుప యోగించిన ఉదకములకు, నీ క్రింద పఱచఁబడిన బర్హిస్సులనెడి ఓషధులకు, చనిపోవునపుడు నీ భారము వహించిన పృథివికి, ఆ సమయమున సాక్షులుగానున్న అహోరాత్రులకు, సుఖము కలుగుఁగాక. (పాతీతి— పాయుః, మలాది విసర్జనముచేత శరీరమును రక్షించునది గుదస్థానము. చరత్యేభిరితి=చరిత్రాః=పాదము లచే శరీరము నడుచుచున్నది. అధ్వర్యుఁడు పశువుయొక్క వాగాదులైన ఇంద్రియములను స్పృశించవలెను.)

2. అర్థము: హే ఓషధే!=ఓ యోషధీ! ఏనమ్=ఈ పశువును, త్రాయస్వ=రక్షింపుము. హే స్వధితే!=ఓ స్వధితీ! ఏనమ్= ఈ పశువును, మా హింసీః=హింసింపకుము.

తాత్పర్యము: (పూర్వోక్త యూపశకలము ఇచట ఓషధిగా సంబోధింపఁబడినది. స్వధితి శకలములు రెండును పశూ పాకరణ సాధనములుగా వినియోగింపఁబడినవి. పశు విశసన కర్మ శాంతికై ఇట్లు ప్రార్థన చేయఁబడుచున్నది.) ఓ యోషధీ! పశువును రక్షింపుము. ఓ స్వధితీ! పశువును హింసింపకుము. (అధ్వర్యుఁడు శకలమును పశు నాభి స్థానమునకు దక్షిణభాగమున లోనికి పోనిచ్చి వపను దీయుటకై స్వధితితో నాభి దక్షిణభాగము ప్రక్క నుండి అడ్డముగా కోయవలెను.)

3. అర్థము: (హే రక్తసిక్తబర్హిః!=రక్తముచే తడుపఁబడిన దర్భా!, త్వమ్=నీవు) రక్షసామ్=రాక్షసులయొక్క, భాగః= భాగము, అసి=అగుచున్నావు. యః=ఎవఁడు, అస్మాన్=మమ్ము, ద్వేష్టి=ద్వేషించు చున్నాఁడో, ఇదమ్=ఈ రక్షస్సును(=రాక్షసుని) అధమం తమః=మహా దుఃఖమును, అహమ్=నేను, నయామి=పొందించుచున్నాను. వయం చ=మేము కూడ, యమ్=ఏ శత్రువును, ద్విష్మః=ద్వేషించుచున్నామో, ఏనమ్=ఈ శత్రువును, ఇదమ్ అధమం తమః=ఇదిగో గొప్పదుఃఖమును, నయామి=పొందించుచున్నాను.

తాత్పర్యము: రక్తముచే తడుపఁబడిన యో బర్హిర్విశేషమా! నీవు రాక్షసుల భాగము. మమ్ము ద్వేషించుచున్న రాక్షసు నకు నేను మహాదుఃఖమును గలుగఁ జేయుచున్నాను. మేము ద్వేషించుచున్న శత్రువునకుఁగూడ గొప్ప దుఃఖమును గలుగఁ జేయుచున్నాను. (అధ్వర్యుఁడు బర్హిస్సును రక్తముతో తడిపి దక్షిణ దిక్కున పడవైచి, దానిని కుడికాలితో త్రొక్కవలెను.)

4. అర్థము: (హేవపే!=ఓ వపా!) ఇషే=(యజమానుఁడు దేవతలను కోరుచున్న) అన్నముకొఱకు, త్వా=నిన్ను (ఉద్భిదామి=పశు శరీరమునుండి పెల్లగించుచున్నాను.) హే ద్యావాపృథివీ!=ద్యావాపృథివీ తుల్యములైన వపాశ్రపణులారా!, ఘృతేన=అజ్య సమాన వపచేత, ప్రోర్ణ్వాథామ్=(మీ స్వరూపమును) అచ్ఛాదించుఁడు. (వపను శూలద్వయము పై భాగమున ఉంచి, అగ్నియందు నేతితో హోమము చేయుటచే, ఆ వప పక్వ మగును. వపను పక్వము చేయుటకు సాధనములైన శూలములు రెండు వపాశ్రపణు లనఁబడును. అవి యిచట ద్యావా భూములుగా వర్ణింపఁబడినవి. అందొకటి ఒక కొన గల శాఖ. ఇంకొకటి రెండు కొనలు గల శాఖ. శూల మనగా అగ్రమని భావము.)

తాత్పర్యము: ఓ వపా! నిన్ను యజమానుఁడు దేవతలు కోరునట్టి యన్నముకొఱకు పశు శరీరమునుండి వెలుపలకు తీయుచున్నాను. వపాశ్రపణులారా! ద్యావాపృథివీ తుల్యములగు మీరు ఘృత సమానమైన వపచేత మీ స్వరూపమును అచ్ఛాదింపుఁడు. (అధ్వర్యుఁడు పశు శరీరమునుండి వపను వెలుపలకు తీసి వపాశ్రపణులపై నుంచవలెను.)

5. అర్థము: అచ్ఛిన్నః=ఛిన్నము కానిదియు, సువీరః=యోగ్యులైన యజమానుని పుత్త్రపౌత్రాదులు కలదియునగు ఈ వపాభాగము, రాయః=ధనములను (ప్రయచ్ఛతు=ఇచ్చుఁగాక.)

తాత్పర్యము: వప ఛేదింప బడినదైనను మంత్ర సామర్థ్యముచే బాధ కలుగకుండుటచే అచ్ఛిన్నమైనది. యజమానునకు పుత్త్రపౌత్రాదులను గలుగఁజేయునది. అట్టి యీ వప యజమానునకు ధనముల నొసగుఁగాక. (అధ్వర్యుఁడు వపతో నిండియున్న శూల ద్వయమును క్రింద నుంచవలెను.)

6. అర్థము: (హే వపే!=ఓ వపా!, త్వమ్=నీవు,) ఉరు=విస్తీర్ణమయిన, అన్తరిక్షమ్+అను=ఆకాశమును ప్రవేశించి, ఇహి=(ఆహవనీయమును గూర్చి) పొమ్ము.

తాత్పర్యము: వపను పెల్లగించుట రూపమైన క్రూరత్వము శాంతించుటకై విశాలమైన అంతరిక్షమున ప్రవేశించి ఆహవనీయ ప్రదేశమునకు వెడలుమని అధ్వర్యుఁడు వపను వేడుకొనుచున్నాఁడు. (అధ్వర్యుఁడు శూలద్వయమును తీసికొని ఆహవనీయ ప్రదేశమునకు పోవలెను.)

7. అర్థము: హే వాయో!=ఓ వాయుదేవా! స్తోకానామ్=అజ్య బిందువులను, వీహి=విభక్తములనుగాఁ జేయుము. ('స్తోకానామ్'=కర్మణి షష్ఠి.)

తాత్పర్యము: (హోమము చేయునపుడు క్రిందపడిన ఆజ్యబిందువులు స్తోకము లనఁబడును.) ఓ వాయుదేవా! నీవు స్తోకములను విభక్తములు చేయుము. (త్రాగుమని భావము.) (అధ్వర్యుఁడు ఆహవనీయాగ్ని చివరనున్న నిప్పు కణికలపై వపను వెచ్చఁబెట్ట వలెను. ఆ సమయమున బర్హిరగ్రభాగమును ఈ మంత్రముచే నుపాసించవలెను.)

8. అర్థము: (హే వపాశ్రపణీ!=ఓ వపాశ్రపణులారా! యువామ్=మీరు) స్వాహా=వప బాగుగ అహుతియగు చుండగా, ఊర్ధ్వనభసమ్=ఊర్ధ్వ నభస్సు అను పేరుగల, మారుతమ్=మరుత్పుత్రుని గూర్చి, గచ్ఛతమ్=పొందు.

తాత్పర్యము: ఓ వపాశ్రపణులారా! వప బాగుగ నాహుతియగు చుండగా మీరు ఊర్ధ్వనభో నామక మరుత్పుత్రుని పొందుఁడు. (ప్రతిప్రస్థాత వపాశ్రపణులను ఆహవనీయాగ్నియందు పడవేయవలెను.)

నవమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే తృతీయప్రపాఠకే దశమోఽనువాకః ।

మూలము: [1]సం తే మనసా మన స్సం ప్రాణేన ప్రాణో జుష్టం దేవేభ్యో హవ్యం ఘృతవ త్స్వాహై
[2]న్ద్రః ప్రాణో అఙ్గే అఙ్గే నిదధ్యే దైన్ద్రో ఽపానో అఙ్గే అఙ్గే వి బోభువ ద్దేవ త్వష్ట ర్భూరి తే
సగ్ం సమేతు విషురూపా య త్సలక్ష్మాణో భవథ దేవత్రా యన్త మవసే సఖాయో ఽను
త్వా మాతాపితరో మదన్తు [3]శ్రీ ర స్యగ్ని స్త్వా శ్రీణా త్వాప స్సమరిణ న్వాతస్య (౧) త్వా
ధ్రజ్యై పూష్ణో రగ్ంహ్యా అపా మోషధీనాగ్ం రోహిష్యై [4]ఘృతం ఘృతపావానః పిబత
వసాం వసాపావానః పిబతా న్తరిక్షస్య హవి రసి స్వాహా త్వా ఽన్తరిక్షాయ దిశః ప్రదిశ
ఆదిశో విదిశ ఉద్దిశ స్స్వాహా దిగ్భ్యో నమో దిగ్భ్యః ॥౧౦॥ (వాతస్యాష్టావిగ్ంశతి శ్చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే తృతీయ ప్రపాఠకే దశమోఽనువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: నవమానువాకమునందు వపా ప్రయోగము చెప్పఁబడినది. ఈ దశమానువాకమునందు వసా హోమము చెప్పఁబడుచున్నది.

1. **అర్థము:** (హే హృదయ!—ఓ హృదయమా!) తే—నీయొక్క, మనసా—మనస్థానీయమైన పృషదాజ్యముతో, మనః—దేవతల మనస్సు, సంగతం భవతు—కలిసికొనుఁగాక. ప్రాణేన—ప్రాణ స్థానీయమైన పృషదాజ్యముతో, ప్రాణః—దేవతలప్రాణము, సంగచ్ఛతు—కలిసికొనుఁగాక. హవ్యమ్—హవిస్సవైన నిన్ను, దేవేభ్యః—దేవతల కొఱకు, జుష్టమ్—ప్రియమైన, ఘృతవత్—నేయివలె, స్వాహా—అభిఘరించుచున్నాను.

తాత్పర్యము: ఓ హృదయమా! నీ మనస్సునకు బదులుగా నున్న పృషదాజ్యముతో దేవతల మనస్సు కలిసికొనుఁగాక. నీ ప్రాణమునకు బదులుగానున్న పృషదాజ్యముతో దేవతల ప్రాణము కలిసికొనుఁగాక. హవిస్సుగానున్న నిన్ను దేవతలకు ప్రియమైన నేయివలె అభిఘరించుచున్నాను. (పృషదాజ్యము—దధి సమ్మిశ్రితమైన ఆజ్యము. అధ్వర్యుఁడు శమితనుండి హృదయ శూలమును తీసికొని దానిచేత హృదయమును తీసి శమిత కిచ్చి దాని పై భాగమున పృషదాజ్యముతో అభిఘరించవలెను. శమిత—పశువుయొక్క హృదయాది స్థానీయమైన వపను పక్వము చేయువ్యక్తి.)

2. **అర్థము:** ఐన్ద్రః—ఇంద్ర దేవతాకమైన, ప్రాణః—ప్రాణము, అఙ్గే అఙ్గే—ఈ పశువుయొక్క ఆ యా హృదయాద్యంగమునందు, నిదధ్యేత్—గట్టిగా స్థాపింపఁబడుఁగాక. అపానః—అపానము (కూడ) అఙ్గే అఙ్గే—ఆ యా హృదయాద్యంగమునందు విబోభువత్—విశేషముగ నుండుఁగాక. హే త్వష్టఃదేవ!—ఓ త్వష్టృదేవా! తే—నీయొక్క

(అనుగ్రహముచేత) భూరి=సమస్తమైన అంగ సముదాయము. సంసమేతు=(ఛేదనముచే విశ్లిష్టమైనను) బాగుగ కలిసికొనుఁగాక. (హే హృదయాద్యవయవాః=ఓ హృదయాద్యవయవములారా!, యూయమ్= మీరు) యత్ విషురూపాః=విలక్షణ రూపము కలవారైనను, సలక్ష్మాణః=(హవీరూపముచే) సమానలక్షణము కలవారుగా, భవథ=కండు. (హే పశో!=ఓ పశువా!) దేవత్రా=దేవతల లోనికి, యన్తమ్=వెళ్లుచున్న, త్వా=నిన్ను, సఖాయః=మిత్రములైన యితర పశువులు, మాతా పితరః=తల్లి దండ్రులు, అవసే=(నీ మూలమున స్వర్గ ప్రాప్తిచే స్వకులమును సర్వమును) సేవించుట కొఱకు, అను మదన్తు=అమోదింతురుగాక.

తాత్పర్యము: ఇంద్ర దేవతాకమైన ప్రాణము పశువుయొక్క ఆ యా యంగము నందుంచఁబడుగాక. అపానముకూడ నా యా యంగమునందు విశేషముగ నుండుఁగాక. ఓ త్వష్టృదేవా! ఈ పశువుయొక్క సమస్తమైన యంగ జాతము ఛేదనముచేత విడిపోయినను నీ యనుగ్రహము వలన కలిసికొనుఁగాక. ఓ హృదయా ద్యవయవము లారా! మీరు విలక్షణ స్వరూపులైనను హవీ రూపముచే సమాన లక్షణము కలవారు కండు. ఓ పశువా! దేవతలలోనికి పోనున్న నిన్ను మిత్రములైన యితర పశువులు తల్లిదండ్రులును నీ మూలమున స్వర్గమును బొందుటచే తమ కులమును సర్వమును సేవించుట కంగీకరింతురుగాక. (అధ్వర్యుఁడు పశువుయొక్క హృదయాది హవిస్సులను స్పృశించవలెను.)

3. అర్థము: (హే వసే!=ఓవసా! త్వమ్=నీవు) శ్రీః=ఆశ్రయింప తగినదానవు, అసి=అగుచున్నావు. అగ్నిః=ఆహవనీ యాగ్ని, త్వా=నిన్ను, శ్రీణాతు=ఆశ్రయించుఁగాక. (=స్వీకరించుఁగాక.) ఆపః=ఉదకములు, త్వా= నిన్ను, సమరిణన్=బాగుగ బొందుఁగాక. (హే వసే!=ఓ వసా!) త్వా=నిన్ను, వాతస్య=వాయువుయొక్క, ధ్రజ్యై=గతికొఱకు, పూష్ణః=సూర్యునియొక్క, రంహ్యై=గమనముకొఱకు, అపామ్=ఉదక సంబంధము లైన ఓషధీనామ్=ఓషధులయొక్క, రోహిష్యై=ప్రరోహము(=బాగుగా మొలచుట) కొఱకు, (అపిధామి= కప్పుచున్నాను.)

తాత్పర్యము: ఓ వసా! నీవు ఆశ్రయింపఁదగిన దానవగుచున్నావు. కావున ఆహవనీయాగ్ని నిన్నాశ్రయించుఁగాక, ఉదకములు నిన్నుపొందుఁగాక, ఓ వసా! వాయ్వాదిత్యాదుల సంచారముకొఱకు, ఉదకముల వలన బాగుగ వృద్ధి నొందునట్టి ఓషధులు బాగుగ మొలచుట కొఱకును, నిన్ను కప్పుచున్నాను. (వసను కప్పుటచే అది రక్షిత మగును గావున అట్టి వసాహోమమువలన కలుగు పుణ్యముచే వాయ్వాదిత్యాది సంచారమగుటచే జగద్వ్యాపారము జరుగునని భావము. మాంసమును వండు పాత్రమందలి చిక్కని ద్రవవిశేషము వస యనఁబడును. అధ్వర్యుఁడు పాత్రములోనికి తీసికొనిన వసారూప హోమ ద్రవ్యమును ఎముక కొనచే ఆలో డనము చేయవలెను. ఆలోడనము=కలఁచుట)

4. అర్థము: హే ఘృత పావానః=ఆజ్యమును త్రాగునట్టి దేవతలారా! ఘృతమ్=నేతిని, పిబత=త్రాగుఁడు. హే వసా పా వానః=వసను త్రాగునట్టి దేవతలారా! వసామ్=వసను, పిబత=త్రాగుఁడు. (హే పశో!=ఓ పశువా!, త్వమ్= నీవు) అన్తరిక్షస్య=అంతరిక్ష నివాసియగు దేవతా గణమునకు, హవిః=హవిస్సువు, అసి=అగుచున్నావు. (తతః=అందువలన) త్వా=నిన్ను, అన్తరిక్షాయ=అంతరిక్ష వాసియగు దేవగణమునకై, స్వాహా=హోమము చేయుచున్నాను. దిశః=తూర్పుదిక్కుకొఱకు, ప్రదిశః=దక్షిణ దిక్కుకొఱకు, ఆదిశః=పశ్చిమ దిక్కుకొఱకు, ఉద్దిశః=ఉత్తర దిక్కుకొఱకు, త్వా=నిన్ను, స్వాహా=హోమము చేయుచున్నాను. దిగ్భ్యః=సర్వదిక్కుల కొఱకు, స్వాహా=హోమము చేయుచున్నాను. దిగ్భ్యః=సర్వదిక్కుల కొఱకు, నమః=నమస్కారము.

తాత్పర్యము: ఆజ్యమును, వసను, త్రాగునట్టి దేవతలారా! మీరి ఘృతమును వసను త్రాగుఁడు. ఓ పశువా! నీవు అంతరిక్ష నివాసియగు దేవగణమునకు హవిస్సువు కావున నిన్ను అంతరిక్ష నివాసియగు దేవగణము కొఱకు హోమము చేయుచున్నాను. ప్రాగ్దక్షిణ పశ్చిమోత్తర దిక్కులకై నిన్ను హోమము చేయుచున్నాను. సర్వదిక్కుల కొఱకు నిన్ను హోమము చేయుచున్నాను. సర్వదిక్కులకు నమస్కారము. (ప్రతిప్రస్థాత వసను దేవతలకు దిక్కులకు హోమముచేసి నమస్కరించవలెను. 'దిశః' ఇత్యాదులు చతుర్థ్యంతార్థకములు.)

దశమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే తృతీయప్రపాఠకే ఏకాదశోఽనువాకః

మూలము: [1]సముద్రం గచ్ఛ స్వాహా ఽన్తరిక్షం గచ్ఛ స్వాహా దేవగ్ం సవితారం గచ్ఛ స్వాహా ఽహో
రాత్రే గచ్ఛ స్వాహా మిత్రావరుణౌ గచ్ఛ స్వాహా సోమం గచ్ఛ స్వాహా యజ్ఞం గచ్ఛ స్వాహా
ఛన్దాగ్ంసి గచ్ఛ స్వాహా ద్యావాపృథివీ గచ్ఛ స్వాహా నభో దివ్యం గచ్ఛ స్వాహా ఽగ్నిం
వైశ్వానరం గచ్ఛ స్వాహా ఽద్భ్యస్త్వౌ షధీభ్యో మనో మే హార్ది యచ్ఛ తనూం త్వచం
పుత్రం నప్తార మశీయ [2]శుగసి త మభిశోచ యో ఽస్మా న్ద్వేష్టి యం చ వయం ద్విష్మో
ధామ్నో ధామ్నో రాజ న్నితో వరుణ నో ముఞ్చ యదాపో అఘ్నియా వరుణేతి శపామహే
తతో వరుణ నో ముఞ్చ ॥౧౧॥ (అసి షడ్విగ్ంశతి శ్చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే తృతీయప్రపాఠకే ఏకాదశోఽనువాకః॥

వేదార్థ దీపిక

అవతారిక: దశమానువాకమునందు వపా హోమము విహితమైనది. ఈ యేకాదశానువాకమున 'ఉపయట్' సంజ్ఞక హోమములు విధింపబడుచున్నవి.

1. అర్థము: (హే హవిః=ఓ హవ్యమా! త్వమ్=నీవు) సముద్రమ్=సముద్ర దేవుని, గచ్ఛ=పొందుము. త్వా=నిన్ను, స్వాహా=(సముద్ర దేవునికొఱకు) హోమము చేయుచున్నాను. అన్తరిక్షమ్=అంతరిక్ష దేవతను, గచ్ఛ=పొందుము. త్వా=నిన్ను, స్వాహా=(అంతరిక్ష దేవతకై) హోమము చేయుచున్నాను. సవితారమ్=ప్రేరకుఁడగు, దేవమ్=దేవుని, గచ్ఛ=పొందుము. స్వాహా=(నిన్ను సవితృ దేవునకై) హోమము చేయుచున్నాను. అహోరాత్రే=అహోరాత్ర దేవతలను, గచ్ఛ. స్వాహా. మిత్రా వరుణౌ=మిత్రా వరుణ దేవతలను, గచ్ఛ, స్వాహా. సోమమ్=సోమ దేవుని, గచ్ఛ, స్వాహా. యజ్ఞమ్=యజ్ఞదేవుని, గచ్ఛ, స్వాహా. యజ్ఞమ్=యజ్ఞ దేవుని, గచ్ఛ, స్వాహా. ఛన్దాంసి=వేదములను, గచ్ఛ, స్వాహా. ద్యావా పృథివీ=ద్యావా పృథివీ దేవతలను, దివ్యమ్=ప్రకాశించునట్టి, నభః=నభోదేవుని (=ఆకాశ దేవతను) గచ్ఛ, స్వాహా. వైశ్వానరమ్=సర్వప్రకాశకుఁడగు, అగ్నిమ్=అగ్ని దేవుని, గచ్ఛ. స్వాహా. (హే హవిర్లేప=ఓ హవిర్లేపమా!) త్వా=నిన్ను, అద్భ్యః=ఉదక కార్యములైన, ఓషధీభ్యః=ఓషధుల కొఱకు (నిమార్జ్మి=బర్హిస్సునందు మార్జనము చేయుచున్నాను. హే సముద్రాది దేవతా సమూహ=ఓ సముద్రాది దేవతా సమూహమా!) మే=నాకు, హార్ది=సంతోషవంతమైన, మనః=మనస్సును, యచ్ఛ=ఇమ్ము. (త్వదనుగ్రహేణ=నీ యనుగ్రహముచేత) తనూమ్=ఉత్తమ శరీరమును, త్వచమ్=కాంతిమంతమైన రూపమును, పుత్రమ్=గుణవంతుఁడైన పుత్రుని, నప్తారమ్=పౌత్రుని, అశీయ=పొందుదును.

తాత్పర్యము: ఓ హవ్యమా! నీవు సముద్రాది దేవతా సమూహమును పొందుము. ఆ సముద్రాది దేవతా సమూహము కొఱకు నిన్ను హోమము చేయుచున్నాను. ఓ హవి ర్లేపమా! నిన్ను ఉదకములవలన వృద్ధి నొందుచున్న ఓషధుల కొఱకు బర్హిస్సునందు మార్జనము చేయుచున్నాను. ఓ సముద్రాది దేవతా సమూహమా! నాకు సంతోషవంతమయిన మనస్సు నిమ్ము. నీ యనుగ్రహము వలన ఉత్తమ జాతి యుక్తమైన శరీరమును, కాంతిమంతమైన రూపమును, గుణవంతులయిన పుత్త్ర పౌత్త్రులను పొందుదును. (పశువుయొక్క గుద కాండము నడ్డముగా పదునొకండు భాగములుగా ఛేదించి, ఆ ఛేదించిన పదునొకండు భాగములను ప్రతిప్రస్థాత 'సముద్రం గచ్ఛ' ఇత్యాదులయిన పదునొకండు మంత్రములచేత పదునొకండు మారులు హస్తముతో అగ్ని యందు హోమము చేయవలెను. ఈ హోమమునకు 'ఉపయట్' హోమ మని పేరు. అనూయాజల సమీపమున చేయఁబడునవి కనుక ఇవి ఉపయట్టు లనఁబడును. పిమ్మట 'అద్భ్య స్త్వౌషధీభ్యః' ఇత్యాది మంత్ర భాగము పఠించుచు హవి ర్లేపమును బర్హిస్సునందు మార్జనము చేసి 'హార్ది యచ్ఛ తనూమ్' ఇత్యాది మంత్రభాగమును జపించవలెను.)

2. **అర్థము:** (హే హృదయ శూల!=ఓ హృదయ శూలమా! త్వమ్=నీవు) శుక్=శోక రూపము, అసి=అగుచున్నావు. (తతః=అందువలన) యః=ఎవఁడు, అస్మాన్=మమ్ము, ద్వేష్టి=ద్వేషించుచున్నాఁడో, చ=మఱియు, యమ్=ఎవనిని, వయమ్=మేము, ద్విష్మః=ద్వేషించు చున్నామో, తమ్=వానిని, అభి శోచ=శోకింపఁజేయుము. హే వరుణ, రాజన్!=ఓ వరుణ రాజా! (త్వమ్=నీవు) ఇతః ధామ్నః ధామ్నః=ఆ యా శోకప్రాపకమైన ద్వేష్టృ ద్వేష్య స్థానమునుండి, నః=మమ్ము, ముఞ్చ=విడువుము. హే ఆపః!=ఓ యుదకములారా! హే అఘ్న్యాః!=ఓ గోవులారా!=హే వరుణ!=ఓ వరుణదేవా!, ఇతి=అని, శపామహే యత్=బాధించుచున్నాము కావున, హే వరుణ! ఓ వరుణదేవా!, తతః=దేవతా నామోచ్చారణ జన్యమైన ఆ పాపమునుండి, నః=మమ్ము, ముఞ్చ=విడువుము.

తాత్పర్యము: ఓ హృదయ శూలమా! నీవు శోకరూప మగుచున్నావు. కావున మమ్ము ద్వేషించుచున్నవానిని, మేము ద్వేషించువానినిఁగూడ అభిముఖముగ పోయి శోకింపఁజేయుము. ఓ వరుణ రాజా! నీవు శోకమును గలిగించు నట్టి ఆ యా ద్వేష్టృ ద్వేష్య స్థానమునుండి మమ్ము విడిపించుము. ఓ యుదకములారా! ఓ గోవులారా! ఓ వరుణదేవా! అని (మా కిష్టము కలుగుటకు, అనిష్టము తొలఁగుటకు,) దేవతా నామోచ్చారణము చేయుట వలనను, అస్మదపేక్షిత కార్యసాధన ప్రయాసము వలనను కలిగిన పాపమునుండి, ఓ వరుణదేవా! మమ్ము విముక్తులను జేయుము. (హృదయ శూలమును తొలగించవలెను.)

ఏకాదశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే తృతీయప్రపాఠకే ద్వాదశోఽనువాకః।

మూలము: [1]హవిష్మతీ రిమా ఆపో హవిష్మా న్దేవో అధ్వరో హవిష్మాగ్ం ఆ వివాసతి హవిష్మాగ్ం అస్తు సూర్యః। [2]అగ్నే ర్వో ఽపన్నగృహస్య సదసి సాదయామి సుమ్నాయ సుమ్నినీ స్సుమ్నే మా ధత్త ధుర్యో స్థాగ్నియో ర్భాగధేయా స్థ మిత్రావరుణయో ర్భాగధేయా స్థ విశ్వేషాం దేవానాం భాగధేయా స్థ యజ్ఞే జాగృత ॥౧॥ (హవిష్మతీ శ్చతుస్త్రిగ్ంశత్)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే తృతీయప్రపాఠకే ద్వాదశోఽనువాకః॥

వేదార్థ దీపిక

అవతారిక: ఏకాదశానువాకమునందు గుడకాండ హోమము చెప్పఁబడినది. ఈ ద్వాదశానువాకమునందు వసతీ వరీ సంజ్ఞకములైన ఉదకములను గ్రహించుట చెప్పఁబడుచున్నది. ఇంతవఱకు అగ్నీషోమీయ పశువు సమాప్తమైనది.

1. అర్థము: ఇమాః=ఈ వసతీ వరీ సంజ్ఞకములైన, ఆపః=ఉదకములు, హవిష్మతీః=(స్వ సంస్కారము కల సోమముచేత) హవిస్సు కలవి, (భవన్తు=అగుఁగాక.) దేవః=ఇంద్రుఁడు, హవిష్మాన్=హవిస్సు కలవాఁడు, అస్తు=అగుఁగాక. అధ్వరః=యాగము, హవిష్మాన్=హవిస్సు కలదియై, ఆ వివాసతి=అంతటను విశేషముగ ప్రవర్తించుఁగాక. సూర్యః=సూర్యుఁడు, (కూడ) హవిష్మాన్=(వసతీ వరీ జలములను ప్రకాశింపఁజేయుటచే) హవిష్మంతుఁడు, అస్తు=అగుఁగాక.

తాత్పర్యము: వసతీ వరీ సంజ్ఞకములైన ఉదకములు స్వ సంస్కారముగల సోమముచే హవిస్సు కలవి యగుఁగాక. ఇంద్రుఁడు హవిష్మంతుఁడగుఁగాక. యాగము హవిష్మంతమై అంతటను విశేషముగ ప్రవర్తించుఁగాక. వసతీ వరీ సంజ్ఞకములైన ఉదకములకు ప్రకాశకుఁడగుటచే సూర్యుఁడు కూడ హవిష్మంతుఁడగుగాక. ఈ ఉదకములకు వసతీ వరీ సంజ్ఞ వచ్చిన విధము (6వ కాండము 4వ ప్రపాఠకము 2వ అనువాకమునందు వివరింపఁబడును.)

2. అర్థము: (హే వసతీ వర్యః!=ఓ వసతీ వరీ సంజ్ఞకములయిన ఉదకములారా!) వః=మిమ్ము, అపన్న గృహస్య=వినశ్వరముకాని గృహము కల, అగ్నేః=శాలాముఖీయాగ్ని యొక్క, సదసి=సమీప స్థానమునందు, సాదయామి=స్థాపించుచున్నాను. (హే ఆపః!=ఓ యుదకములారా!) సుమ్నాయ=(సర్వప్రాణులయొక్క) సుఖము కొఱకు, (ప్రవృత్తాః=ప్రవృత్తములును) సుమ్నినీః=(స్వయముగ) సుఖము కలవారునగు, (యూయమ్=మీరు) మా=నన్ను, (=యజమానుని) సుమ్నే=సుఖమునందు, ధత్త=స్థాపించుఁడు. (యూయమ్=మీరు)

ఇన్ద్రాగ్నియోః=ఇంద్రాగ్ని దేవతలకు, భాగధేయాః=భాగరూపములు, స్థ=అగుచున్నారు. మిత్రావరుణయోః=మిత్రావరుణ దేవతలకు, భాగధేయాః=భాగరూపములు, స్థ=అగుచున్నారు. విశ్వేషాం దేవానామ్=విశ్వేదేవతలకు, భాగధేయాః=భాగరూపములు, స్థ=అగుచున్నారు. (అతః=ఇందువలన) యజ్ఞే=యజ్ఞమునందు, జాగృత=(రక్షో నివారణమునకై) జాగరూకులై యుండుఁడు. (ఇన్ద్రాగ్నియోః=ఇన్ద్రాగ్నయోః.)

తాత్పర్యము: వసతీవరీ సంజ్ఞకములైన ఓ యుదకములారా! నశ్వరముకాని గృహము కల శాలాముఖీయాగ్నికి సమీపమునందు మిమ్ము స్థాపించుచున్నాను. ఓ యుదకములారా! సర్వప్రాణుల సుఖమునకై ప్రవర్తించుచున్న మీరు స్వయముగ సుఖము కలవారై యజ్ఞకర్తనగు నన్ను సుఖవంతునిఁజేయుఁడు. మీరు ఇంద్రాగ్నులకు, మిత్రావరుణులకు విశ్వేదేవతలకు భాగ స్వరూపులు కావున యజ్ఞమును రాక్షసులనుండి రక్షించుటలో జాగరూకులై యుండుడు.

ద్వాదశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే తృతీయప్రపాఠకే త్రయోదశోఽనువాకః।

మూలము: [1]హృదే త్వా మనసే త్వా దివే త్వా సూర్యాయ త్వో ర్ధ్వ మిమ మధ్వరం కృధి దివి దేవేషు హోత్రా యచ్ఛ సోమ రాజ న్నేహ్య వరోహ మా భే ర్మా సంవిక్థా మా త్వా హిగ్ంసిషం ప్రజా స్త్వ ముపావరోహ ప్రజా స్త్వా ముపావరోహన్తు [2]శృణో త్వగ్ని స్సమిధా హవం మే శృణ్వ న్త్వాపో ధిషణా శ్చ దేవీః। శృణోత గ్రావాణో విదుషో ను (౧)యజ్ఞగ్ం శృణోతు దేవ స్సవితా హవం మే। [3]దేవీ రాపో అపాంనపా ద్య ఊర్మి ర్హవిష్య ఇన్ద్రియావా న్మదిన్తమ స్తం దేవేభ్యో దేవత్రా ధత్త శుక్రగ్ం శుక్రపేభ్యో యేషాం భాగ స్థ స్వాహా [4]కార్షి రస్య పా పాం మృధ్రగ్ం [5]సముద్రస్య వో ఽక్షిత్యా ఉన్నయే। [6]య మగ్నే పృత్సు మర్త్య మావో వాజేషు యం జునాః।స యన్తా శశ్వతీ రిషః॥ ౨॥ (ను సప్తచత్వారిగ్ంశ చ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే తృతీయప్రపాఠకే త్రయోదశోఽనువాకః।

వేదార్థదీపిక

అవతారిక: ద్వాదశానువాకమునందు సోమాభిషవార్థములైన వసతీ వరీ సంజ్ఞకములైన ఉదకముల గ్రహణము విధింపబడినది. ఈ త్రయోదశానువాకమునందు అభిషోతవ్యమైన సోమమును శకటమునుండి దింపుట చెప్పబడుచున్నది. (సోమోపావరోహము=సోమమును సమీపమున దింపుట.)

1. అర్థము: హే సోమః=ఓ సోమమా!, త్వా=నిన్ను, హృదే=హృదయము కల మనుజుల కొఱకు, (ఉపాహరామి=గ్రహించుచున్నాను.) మనసే=మనస్సుకల పితృదేవతల కొఱకు, (ఉపాహరామి=గ్రహించుచున్నాను.) మనసే=మనస్సుకల పితృదేవతల కొఱకు, త్వా=నిన్ను, (గృహ్ణామి=గ్రహించుచున్నాను.) దివే=ద్యులోక వాసులైన దేవతలకొఱకు, త్వా=నిన్ను, (గృహ్ణామి) సూర్యాయ=సూర్యునికొఱకు, త్వా=నిన్ను, (గృహ్ణామి.) (త్వమ్=నీవు) ఇమమ్=ఈ, అధ్వరమ్=యజ్ఞమును, ఊర్ధ్వమ్=ఉన్నతమైనదిగా, కృధి=చేయుము. దివి=ద్యులోకమునందలి, దేవేషు=దేవతలయందు, హోత్రాః=స్తోత్రరూపములైన మా యాహ్వానములను, యచ్ఛ=స్థాపించుము. (ఉంచుము.) హే సోమరాజన్=ఓ సోమరాజా!, ఏహి=రమ్ము. అవరోహ=(శకటము నుండి)దిగుము. మా భేః=భయపడవలదు. మా సంవిక్థాః=కంపించవద్దు. (అహం తు=నేనైతే) త్వా=నిన్ను, మా హింసిషమ్=హింసించను. (తత్=అందువలన) త్వమ్=నీవు, ప్రజాః=దేవలోక ప్రజలను, ఉపావరోహ=పొందుము. ప్రజాః=దేవలోక ప్రజలు, త్వామ్=నిన్ను, ఉపావరోహన్తు=పొందుదురుగాక.

తాత్పర్యము: ఓ సోమమా! సహృదయులైన మనుజుల నిమిత్తము, మనస్సు కల పితృదేవతల కొఱకు, ద్యులోక వాసు లయిన దేవతల కొఱకు, సూర్యుని నిమిత్తమును నిన్ను గ్రహించుచున్నాను. ఈ యజ్ఞమును సమాప్తము చేయుము. ద్యులోక వాసులైన దేవతలకు స్తోత్ర రూపములైన మా యాహ్వానముల నందించుము. ఓ సోమ రాజా! రమ్ము. శకటమునుండి దిగుము. భయపడవలదు. కంపించవద్దు. నేను మాత్రము నిన్ను హింసించను. కావున నీవు దేవలోక ప్రజలను పొందుము. దేవలోక ప్రజలు నిన్ను పొందుదురుగాక. (హవిర్ధానము దక్షిణపు వైపున ప్రాచీన గ్రీవముగ కృష్ణాజినమును పఱచి దాని పై భాగమున మంచి కొనలు గల వాళ్లనుంచి శకటమునుండి సోమము నచట దింపవలెను,)

2. అర్థము: సమిధా=బాగుగా వేల్చఁబడిన ఆహుతిచే, (జ్వలితః=జ్వలింపఁజేయఁబడిన,) అగ్నిః=అగ్ని, మే=నాయొక్క, హవమ్=ఆహ్వానమును, శృణోతు=వినుఁగాక. ధిషణాః=విద్యతోఁగూడినవియు, దేవీః=దేవతారూపము లును అగు, హే ఆపః=ఓ యుదకములారా!, (భవత్యః) చ=మీరుకూడ, శృణ్వన్తు=వినుఁడు. హే గ్రావాణః= ఓ గ్రావాణములారా!, (సోమాభిషవమునకై యున్న మీరుకూడ,) విదుషః ను=విద్వాంసులే యగుచు, యజ్ఞమ్=యజ్ఞమును, శృణోత=వినుఁడు. సవితా దేవః=ప్రేరకుఁడగు సూర్యదేవుడు, మే=నాయొక్క, హవమ్=ఆహ్వానమును, వి శృణోతు=విశేషముగ వినుఁగాక.

తాత్పర్యము: బాగుగా వేల్చఁబడుచున్న ఆహుతిచే జ్వలించుచున్న అగ్ని నా యాహ్వానమును వినుఁగాక. విద్య కలవారును, దేవతారూపులునగు ఓ యుదకములారా! మీరు కూడ వినుఁడు. ఓ గ్రావములారా! సోమాభిషవమునకై ఉపస్థితములై యున్న మీరు కూడ విద్వాంసులగుచు యజ్ఞమును వినుఁడు. సవితృదేవుఁడు నా యాహ్వానమును వినుఁ గాక. (హోత పఠించుచున్న ప్రాతరనువాకము యొక్క మంత్ర విశేషమును తెలిసికొనుచు, అధ్వర్యుఁడు ఈ మంత్రము చెప్పుచు హోమము చేయవలెను. ఇచట 'హృత్, మనః, దిక్' అను శబ్దములు లుప్త మతుబంతములుగాను, బహ్వర్థమున ఏకవచనాంతములుగాను ప్రయుక్తములైనవి.)

3. అర్థము: హే ఆపః దేవీః=ఓ ఉదక దేవతలారా! హే అపాంనపాత్='అపాంనపాత్' అను పేరుగల యగ్నీ! హవిష్యః=సోమరూప హవిస్సునకు హితమైనదియు, ఇంద్రియావాన్=ఇంద్రియ వృద్ధికారియు, మదిన్తమః= అత్యంత హర్షకారియునగు, యః ఊర్మిః=ఏ తరంగము, (అస్తి=కలదో,) శుక్రమ్=దీప్తిమన్తమైన, తమ్= ఆ తరంగమును, (యూయమ్=మీరు) యేషామ్=ఏ దేవతలకు, భాగః స్థ=భాగ మగుచున్నారో! శుక్ర పేభ్యః=సోమపానము చేయునట్టి, దేవేభ్యః=ఆ దేవరలకొఱకు, దేవత్రా=దేవతలయందు, ధత్త=స్థాపిం చుఁడు. స్వాహా=ఈ యాజ్యము మీకు హుతమగుఁగాక.

తాత్పర్యము: దేవతా స్వరూపులగు ఉదకములారా!, 'అపాంనపాత్' అను పేరుగల అగ్నీ! మీ తరంగమును దేవతల నుద్దేశించి హోమము చేయుటకు దేవతల యందు స్థాపించుఁడు. నీటి యల సోమమనెడి హవిస్సునకు హితమైనది, త్రాగఁగానే యింద్రియ వృద్ధినిఁజేయునది; త్రాగిన వెంఁటనే సంతోషమును గలుగఁజేయునది. దీప్తిమంతమైనది. దేవతలు సోమపానము చేయువారు కావున మీరు ఆ దేవతలకు భాగములైనవారు. ఈ యాజ్యము మీకు హుత మగుఁగాక. (నాలుగు పర్యాయములు ఆజ్యమును తీసికొని ఈ మంత్రము చెప్పుచు హోమము చేయవలెను.)

విశేషములు: 'అపాంనపాత్'=న పాతయతి ఉదకమధ్యే గూఢతయా స్థితోఽపి, ఉదకం న వినాశయతీతి='నపాత్' అపాం నపాదితి='అపాంనపాత్' ఉదకముయొక్క మధ్యమున గూఢముగ నున్నను ఉదకమును నశింపఁజేయనిది అని వ్యుత్పత్త్యర్థము. ఉదకమధ్యమున ఉండు అగ్ని. 'ఇంద్రియవాన్' 'దేవత్ర' అని యుండుటకు బదులుగా ఇంద్రియావాన్, దేవత్రా అని ప్రయుక్తములైనవి. ఛాందస వైలక్షణ్యము.

4. అర్థము: (హే ఆజ్య!=ఓ ఆజ్యమా!, త్వమ్=నీవు) కార్షిః=తొలగింపఁబడిన దానవు, అసి=అగుచున్నావు. అపామ్= ఉదకములకు, మృధ్రమ్=అనిష్టరూపమైన (నిన్ను,) అప (నయామి)=తొలఁగించు చున్నాను.

తాత్పర్యము: ఓ యాజ్యమా! నీవు ఉదకములకు అనిష్టరూపముగనున్నావు. కావున నీటికి మాలిన్యరూపా నిష్టమును గలుగఁజేయుచున్న నిన్ను తొలఁగించుచున్నాను. (ఉదకములపై హోమము చేయఁబడిన ఆజ్యమును దర్భలచే తొలఁగించవలెను.)

5. **అర్థము:** (హే ఆపః!=ఓ ఉదకములారా!) సముద్రస్య, (ఇవ)=సముద్రమునకు వలె, వః=మీకు, అక్షిత్యై=క్షీణత లేకుండుటకై, ఉన్నయే=(మిమ్ము) ఎత్తుచున్నాను.

తాత్పర్యము: ఓ యుదకములారా! వసతీవరీ సంజ్ఞకములయిన మిమ్ము నిన్నటి దినమున గ్రహించినను సముద్రమునకు క్షీణత లేకుండుటకై ఎత్తివేయుచున్నాను. (వసతీవరీ సంజ్ఞకములైన ఉదకములను మైత్రావరుణ దేవతాక చమస పాత్రముతో తీసికొనవలెను.)

6. **అర్థము:** హే అగ్నే!=ఓ యగ్ని!, యమ్=ఏ, మర్త్యమ్=మనుజుని, పృత్సు=సంగ్రామములయందు, అవః=రక్షించుచున్నారో, వాజేషు=అన్నముల నిమిత్తము, యమ్=ఏ మనుజుని గూర్చి, జునాః=వెళ్లుచున్నారో, సః=ఆ మనుజుఁడు, శశ్వతీః=శాశ్వతములైన, ఇషః=ధనరూపములైన అన్నములను, యన్తా=(నీ యనుగ్రహము వలన) పొందఁగలఁడు.

తాత్పర్యము: ఓ యగ్నీ! ఏ మనుజుని నీవు యుద్ధములందు రక్షించుచున్నావో, హవిస్సులను గ్రహించుటకై ఏ మనుజుని యొద్దకు పోవుచున్నావో, ఆ మనుజుఁడు నీ యనుగ్రహము వలన శాశ్వతములైన ధన రూపములగు అన్నములను పొందఁగలడు. (ఈ మంత్రము చెప్పుచు క్రతు కరణమనెడి హోమము చేయవలెను.)

త్రయోదశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే తృతీయప్రపాఠకే చతుర్దశోఽనువాకః।

మూలము: [1]త్వ మగ్నే రుద్రో అసురో మహో దివ స్త్వగ్ం శర్ధో మారుతం పృక్ష ఈశిషే। త్వం వాతై
రరుణై ర్యాసి శంగయ స్త్వం పూషా విధతః పాసి ను త్మనా [2]ఆ వో రాజాన మధ్వర
స్య రుద్రగ్ం హోతారగ్ం సత్యయజగ్ం రోదస్యోః। అగ్నిం పురా తనయిత్నో రచిత్తా ద్ధిరణ్య
రూప మవసే కృణుధ్వమ్। [3]అగ్ని ర్హోతా నిషసాదా యజీయా నుపస్థే మాతు స్సురభా వు
లోకే। యువా కవిః పురునిష్ఠః (౧) ఋతావా ధర్తా కృష్టీనా ముత మధ్య ఇద్ధః। [4]సాధ్వీ
మక ర్దేవవీతిం నో అద్య యజ్ఞస్య జిహ్వా మవిదామ గుహ్యామ్। స ఆయు రాఽగా త్సురభి
ర్వసానో భద్రా మక ర్దేవహూతిం నో అద్య। [5]అక్రన్ద దగ్ని స్తనయ న్నివ ద్యౌః క్షామా
రేరిహ ద్వీరుధ స్సమఞ్జన్। సద్యో జజ్ఞానో వి హీ మిద్ధో అఖ్య దా రోదసీ భానునా భాత్యన్తః।
[6]త్వే వసూని పుర్వణీక (౨) హోత ర్దోషావస్తో రేరిరే యజ్ఞియాసః। క్షామేవ విశ్వా భువనాని
యస్మి న్త్సగ్ం సౌభగాని దధిరే పావకే। [7]తుభ్యం తా అఙ్గిర స్తమ విశ్వా స్సుక్షితయః
పృథక్। అగ్నే కామాయ యేమిరే। [8]అశ్యామ తం కామ మగ్నే తవో త్యశ్యామ రయిగ్ం
రయివ స్సువీరమ్। అశ్యామ వాజ మభి వాజయన్తో ఽశ్యామ ద్యుమ్న మజరాజరం తే।
[9]శ్రేష్ఠం యవిష్ఠ భారతా గ్నే ద్యుమన్త మాభర (౩) వసో పురుస్పృహగ్ం రయిమ్। [10]స
శ్వితాన స్తన్యతూ రోచనస్థా అజరేభి ర్నానదద్భి ర్యవిష్ఠః। యః పావకః పురుతమః పురూణి
పృథూ న్యగ్ని రను యాతి భర్వన్। [11]ఆయుష్టే విశ్వతో దధ దయ మగ్ని ర్వరేణ్యః।

పున స్తే ప్రాణ ఆఽయతి పరా యక్ష్మగ్ం సువామి తే।[12]ఆయుర్దా అగ్నే హవిషో జుషాణో ఘృతప్రతీకో ఘృతయోని రేధి।ఘృతం పీత్వా మధు చారు గవ్యం పితేవ పుత్ర మభి (४)రక్షతా దిమమ్।[13]తస్మై తే ప్రతి హర్యతే జాతవేదో విచర్షణే।అగ్నే జనామి సుష్టుతిమ్। [14]దివస్పరి ప్రథమం జజ్ఞే అగ్ని రస్మ ద్ద్వితీయం పరి జాతవేదాః।తృతీయ మప్సు నృమణా అజస్ర మిన్ధాన ఏనం జరతే స్వాధీః।[15]శుచిః పావక వన్ద్యో ఽగ్నే బృహ ద్విరోచసే।త్వం ఘృతేభి రాహుతః।[16]దృశానో రుక్మ ఉర్వ్యా వ్యద్యౌ ద్దుర్మర్ష మాయు శ్శ్రియే రుచానః। అగ్ని రమృతో అభవ ద్వయోభిః (३)య దేనం ద్యౌ రజనయ త్సురేతాః।[17]ఆ య దిషే నృపతిం తేజ ఆనట్ శుచి రేతో నిషిక్తం ద్యౌ రభీకే।అగ్ని శ్శర్ధ మనవద్యం యువానగ్ం స్వాధియం జనయ త్సూదయచ్చ।[18]స తేజీయసా మనసా త్వోత ఉత శిక్ష స్వపత్యస్య శిక్షోః।అగ్నే రాయో నృతమస్య ప్రభూతౌ భూయామ తే సుష్టుతయ శ్చ వస్వః। [19]అగ్నే సహన్త మాభర ద్యుమ్నస్య ప్రాసహా రయిమ్।విశ్వా యః (६)చర్షణీ రభ్యాసా వాజేషు సాసహత్।[20]త మగ్నే పృతనాసహగ్ం రయిగ్ం సహస్వ ఆభర।త్వగ్ం హి సత్యో అద్భుతో దాతా వాజస్య గోమతః।[21]ఉక్షాన్నాయ వశాన్నాయ సోమపృష్ఠాయ వేధసే।స్తోమై ర్విధేమా గ్నయే।[22]వద్మా హి సూనో అస్యద్మసద్వా చక్రే అగ్ని ర్జనుషా ఽజ్మా న్నమ్।స త్వం న ఊర్జంసన ఊర్జం ధా రాజేవ జే రవృకే క్షేష్య న్తః।[23]అగ్న ఆయూగ్ంషి (८)పవస ఆసువో ర్జమిషం చ నః।ఆరే బాధస్వ దుచ్ఛునామ్।[24]అగ్నే పవస్వ స్వపా అస్మే వర్చ స్సువీర్యమ్।

దధ త్పోషగ్ం రయిం మయి।[25]అగ్నే పావక రోచిషా మన్ద్రయా దేవ జిహ్వయా।ఆ దేవా న్వక్షి యక్షి చ।[26]స నః పావక దీదివో ఽగ్నే దేవాంగ్ ఇహా ఽఽవహ। ఉప యజ్ఞగ్ం హవి శ్చ నః।[27]అగ్ని శ్శుచివ్రతతమ శ్శుచి ర్విప్ర శ్శుచిః కవిః।శుచీ రోచత ఆహుతః। [28]ఉదగ్నే శుచయ స్తవ శుక్రా భ్రాజన్త ఈరతే।తవ జ్యోతీగ్ంష్య ర్చయః ॥౮॥

(పురునిష్ఠః పూర్వణీక భరాభి వయోభి ర్య ఆయూగ్ంషి విప్రః శుచి శ్చతుర్దశ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే తృతీయప్రపాఠకే చతుర్దశోఽనువాకః॥

[దేవస్య రక్షోహణో విభూ స్త్వగ్ం సోమా త్య న్యానగాం పృథివ్యా ఇషే త్వా ఽఽదదే వాత్తే సం తే సముద్రగ్ం హవిష్మతీ ర్హృదే త్వ మగ్నే రుద్ర శ్చతుర్దశ] ॥౧౪॥

(దేవస్య గమధ్యే హవిష్మతీః పవస ఏకత్రిగ్ంశత్) ॥౩౧॥

హరిః ఓమ్

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే తృతీయః ప్రపాఠకః।

వేదార్థదీపిక

అవతారిక: త్రయోదశానువాకమునందు హవిర్ధాన శకటమునుండి అధిషవణ ఫలకమున సోమోపావరోహము చెప్పఁబడినది. ఇఁక అభిషవము చెప్పవలసి యున్నది. అయినను అధ్యాపక సంప్రదాయము ననుసరించి ప్రపాఠకము చివర కావున క్రమ ప్రాప్తములయిన కామ్య యాజ్యా పురోనువాక్యలు చెప్పఁబడుచున్నవి. కామ్యేష్టి కాండమునందు రక్షోఘ్నేష్టికి విమ్మట విహితమయిన యిష్ట్యంతరము నందలివి ఈ యాజ్యా పురోనువాక్యలు.

1. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ! త్వమ్=నీవు, రుద్రః=రుద్రుఁడవు. (=భయంకర శరీరము కలిగి యున్న వాడవు.) అసురః=శత్రువులను, (నిరసితా=నిరసించువాఁడవు,) దివః=ద్యులోకమునకు, మహః=(హవిస్సును వహించుటచే) ఉత్సవ రూపుఁడవు. త్వమ్=నీవు, మారుతమ్=మరుద్దేవతల సంబంధియగు, శర్ధః=బల స్వరూపమవు. (కావున) పృక్షః=మరుద్గణములతో కూడిన వాఁడవై, ఈశిషే=మరుద్గణముల సైన్యమును నియమించుము. (అపి చ=మఱియు) త్వమ్=నీవు, శంగయః=సుఖము నొందినవాఁడవై, వాతైః=వాయువేగము కలిగిన, అరుణైః=అరుణ వర్ణము గల గుఱ్ఱములచే, యాసి=వెళ్లుచున్నావు. (మఱియు) పూషా=పోషకుఁడవైన, త్వమ్=నీవు, నుత్మనా=స్వయముగనే, విధతః=హవిస్సుచే పరిచర్య చేయుచున్న యజమానులను, పాసి=రక్షించు చున్నావు.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు భయంకర శరీరము కలిగినవాఁడవు. శత్రువులను నిరసించు వాఁడవు. స్వర్గమునకు హవిస్సును గొనిపోవుటచే ఉత్సవ రూపుఁడవు. మరుద్గణముల బల స్వరూపుఁడవు. (=నీ యనుగ్రహము వలననే మరుద్గణములకు బలము కలుగుచున్నది.) కావున మరుద్గణములతో కూడి సైన్యమును నియమించుము. నీవు సుఖముగ వాయువేగము గల యెఱ్ఱని రంగు గల గుఱ్ఱములచే వెళ్లుచున్నావు. పోషకుఁడవైన నీవు హవిస్సుచే పరిచర్య చేయుచున్న యజమానులను స్వయముగనే రక్షించుచున్నావు. (ఇది పురోనువాక్య.)

2. అర్థము: (హే ఋత్విగ్యజమానాః!=ఓ ఋత్విగ్యజమానులారా!) అధ్వరస్య=యజ్ఞమునకు, రాజానమ్=స్వామియు, రుద్రమ్=(శత్రువులకు) భయంకరుఁడును, హోతారమ్=(ఫలముల నిచ్చుటకై భక్తులను) ఆహ్వానించు వాఁడును, రోదస్యోః=భూలోక ద్యులోకములందు, సత్యయజమ్=సత్యమైన కర్మఫలము నిచ్చువాఁడును, హిరణ్యరూపమ్=హిరణ్య సదృశుఁడునగు, అగ్నిమ్=అగ్నిదేవుని, తనయిత్నోః=శత్రువుచే విస్తరింపఁజేయఁబడిన, అచిత్తాత్పురా=(మీ) మరణముకంటె ముందుగనే, వః=మీయొక్క, అవసే=రక్షణముకొఱకు, ఆ కృణుధ్వమ్=వశ్యునిగా చేసికొనుఁడు.

తాత్పర్యము: ఓ ఋత్వి గ్యజమానులారా! మీకు శత్రువుల వలన మరణము సంభవించక ముందే మీ రక్షణము కొఱకు అగ్ని దేవుని వశ్యునిగా చేసికొనుఁడు. అగ్ని దేవుఁడు యజ్ఞస్వామి. శత్రువులకు భయంకరుఁడు. ఫలముల నిచ్చుటకై భక్తుల నాహ్వానించువాఁడు. ద్యులోకమునందు భూలోకమునందును అవశ్యమైన కర్మఫలముల నిచ్చువాఁడు. హిరణ్యమువంటి రూపము కలవాఁడు. (ఈ యాజ్య 'అగ్నయే సురభిమతే పురోడాశ మష్టాకపాలం నిర్వపేత్' (కాం 2, ప్ర 2 అను 2) అని విధింపఁబడిన ఇష్ట్యంతరమునకు సంబంధించినది.)

3. అర్థము: హోతా=దేవతల నాహ్వానించువాఁడును, యజీయాన్=అతిశయముగ యాగము చేయువాఁడును, యువా=నిత్య యౌవనవంతుఁడును, కవిః=మేధావియు, పురునిష్ఠః=గార్హపత్యాది స్థానములందున్న వాఁడును, ఋతావా=సత్యవంతుఁడును, కృష్టీనామ్=మనుష్యులకు, ధర్తా=పోషకుఁడును, మధ్యే=మనుష్యుల ఉదరమునందు, ఇద్ధః=జఠరాగ్ని రూపమున దీపించువాఁడునగు, అగ్నిః=(ఈ) అగ్ని, మాతుః=వేదియొక్క, ఉపస్థే=సమీప వర్తియగు, (సురభౌ+ఉ=) సురభావు=సుగంధ యుక్తమైన ఆహవనీయ స్థానమునందు, నిషసాద=కూర్చుండెను.

తాత్పర్యము: వేదికి సమీపమున నున్న సుగంధ యుక్తమైన ఆహవనీయమునందున్న ఈ యగ్ని మానుష హోతలకంటె అతిశయముగ, యాగము చేయువాఁడు. నిత్య యౌవన వంతుఁడు. మేధావి. గార్హపత్యాది స్థానములందున్న వాఁడు. సత్యవంతుడు. మనుష్యపోషకుఁడు. మానవుల యుదరములందు జఠరాగ్ని రూపమున ప్రజ్వలించు వాఁడు. (ఇది పురోనువాక్యం.)

4. అర్థము: (అయ మగ్నిః=ఈ యగ్ని,) అద్య=ఇప్పుడు, నః=మా యొక్క, దేవ హూతిమ్=దేవతల కీయఁబడిన పురోడాశ రూపమైన ఆహుతిని, సాధ్వీమ్=స్వాదుపుగా, అకః=చేసెను. (అతః=ఇందువలన) యజ్ఞస్య=యజ్ఞమునకు, జిహ్వామ్=జిహ్వ స్థానీయమైన, గుహ్యమ్=అగ్ని దేవతను, అవిదామ=పొందితిమి. సురభిః=పరిమళముతోఁ గూడిన, సః=ఆ యగ్ని, ఆయుః=ఆయువును, వసానః=(సన్=) రక్షించుచు, ఆగాత్=వచ్చుఁగాక. (ఇది ప్రార్థనార్థకము.) నః=మాయొక్క, దేవహూతిమ్=దేవతల కీయఁబడిన ఆహుతిని, భద్రామ్=శాస్త్రీయమైన దానినిగా, అద్య=ఇప్పుడు, అకః=చేయుఁగాక. (ప్రార్థనార్థమున భూతకాలిక ప్రయోగము ఛాందసము.)

తాత్పర్యము: ఈ యగ్ని యిప్పుడు మేము దేవతల కిచ్చిన పురోడాశ రూపమైన ఆహుతిని స్వాదుపుగా చేసెను. కావున యజ్ఞమునకు జిహ్వ స్థానీయమైన అగ్ని దేవతను పొందితిమి. హుతమైన పురోడాశాహుతి గంధముచే పరిమళ యుక్తమైన ఆ యగ్ని మా ఆయువును కాపాడుచు వచ్చుఁగాక. మఱియు ఇప్పుడు మేమిచ్చిన పురోడాశా హుతిని శాస్త్రీయమైనదిగా చేయుఁగాక. (ఇదియాజ్య)

5. అర్థము: అగ్నిః=(ఈ) యగ్ని, స్తనయన్=ధ్వనించుచున్న, ద్యౌరివ=ద్యులోకస్థమైన మేఘమువలె, క్షామా=దాహక పదార్థమును, రేరిహత్=నాకుచున్నవాఁడై, వీరుధః=పుష్పలతాదికములను, సమఞ్జన్=అభివ్యక్తము చేయుచు, అక్రన్దత్=ధ్వనిచేయుఁగాక. (అయ మగ్నిః,) జజ్ఞానః=పుట్టుచున్నవాఁడై, సద్యః ఈమ్=అప్పుడే, ఇద్ధః=దీపించినవాఁడై, వ్యఖ్యత్=జగత్తును వివిధములుగా ప్రఖ్యాపించెను. రోదసీ అన్తః=ద్యావాభూముల మధ్యమందు, భానునా=రశ్మిచే, ఆ భాతి=అంతటను ప్రకాశించుచున్నాఁడు.

తాత్పర్యము: ఈ యగ్ని ద్యులోకస్థమైన మేఘము గర్జించుచు సస్య శోషభీతిని పోగొట్టుచున్న విధముగా, దాహక పదార్థ మును నాకుచు పుష్పలతాదికము నభివ్యక్తము చేయుచు గర్జించుఁగాక. ఈ యగ్ని పుట్టిన వెంటనే దీపించినవాఁడై జగత్తును వివిధములుగా ప్రఖ్యాపన చేసెను. (ఇది పురోనువాక్య.)

6. అర్థము: పుర్వణీక=అత్యంత బహుళమైన, హే హోతః=దేవతలకు హోతవైన (ఆహ్వానించువాఁడవైన) ఓ యగ్నీ!, దోషావస్తోః=రేవగలు, యజ్ఞియాసః=యజ్ఞమున కర్హములైన, వసూని=హవిస్సులు, ఏదిరే=వచ్చు చున్నవి. యస్మిన్ + అసతి సతి=ఎవని యనుగ్రహము లేనిదగుచుండగా, క్షామేవ=దగ్ధ పటాదికమువలె, విశ్వా భువనాని=సమస్త లోకములు, (నిస్సారాణి అభూవన్=సారవిహీనము లయ్యెనో, తాని=అవి,) పావకే త్వే=పావకుఁడవైన నీవు, (అనుగృహ్ణాతి యది=అనుగ్రహించుచున్నచో) సౌభగాని=సౌభాగ్యములను, సంద ధిరే=బాగుగఁబొందినవి.

తాత్పర్యము: అత్యంతము అధికముగా దేవతల కాహ్వాతవైన యగ్నీ! రేవగలు యజ్ఞమున కర్హములయిన హవిస్సులు లభించుచున్నవి. నీ యనుగ్రహము లేనప్పుడు దగ్ధ పటాదికమువలె నిస్సారములైయున్న లోకములు నీ యనుగ్రహమువలన సౌభాగ్య వంతములైనవి. (అట్టి నీవు మమ్ము ననుగ్రహింపుము. ఇది యాజ్య.)

7. అర్థము: అఙ్గిరస్తమః అవయవ సారముగల, హే అగ్నే!=ఓ యగ్నీ! సుక్షితయః=యోగ్య వేదిరూప భూమి గలిగిన, విశ్వాః=సమస్తమైన, తాః=ఆ ప్రజలు, పృథక్=వేరువేరుగా కోరికలు కలవారై, కామాయ=కోరికల నిచ్చునట్టి, తుభ్యమ్=నీ కొఱకు, యేమిరే=నియమమును స్వీకరించిరి.

తాత్పర్యము: అత్యంత సారవంతములయిన అవయవములు కల యగ్నీ! యోగ్యవేది రూప భూమి కల ఆ ప్రజలు విభిన్నము లైన కోరికలు కలవారై కామ ప్రదుఁడవైన నీ కొఱకు నియమమును స్వీకరించిరి. (ఇది పురోనువాక్య.)

8. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ! తవ=నీ యొక్క, ఊతీ=రక్షణచేత, తమ్=ఆ, కామమ్=అభీష్ట ఫలమును, అశ్యామ=విశేషముగ పొందుదుము. హే రయివః=ధనవంతుఁడవైన యగ్నీ!, సువీరమ్=శోభన పుత్త్ర పౌత్త్రాద్యుపేతమైన, రయిమ్=ధనమును, అశ్యామ=విశేషముగ పొందుదుము. వాజయన్తః=అన్నమును కోరుచున్నట్టి మేము, వాజమ్=అన్నమును, అభ్యశ్యామ=అంతటను విశేషముగ పొందుదుము. హే అజర=జరా రహితుఁడవైన అగ్నీ! తే=నీ యొక్క(అనుగ్రహమువలన), అజరమ్=అక్షయమైన, ద్యుమ్నమ్=యశస్సును, అశ్యామ=విశేషముగ పొందుదుము. (భూతకాలికములైన 'అశ్యామ' "అభ్యశ్యామ"అను క్రియా పదము లిచట ప్రార్థనార్థమున ప్రయుక్తములైనవి.)

తాత్పర్యము: ఓ యగ్నీ! నీ రక్షణచేత అభీష్ట ఫలమును విశేషముగ పొందుదుము. ధనవంతుఁడవైన యగ్నీ! శోభన పుత్త్రపౌత్త్రాద్యుపేతమైన ధనమును పొందుదుము. అన్నమును కోరుచున్న మేము అన్నమును విశేషముగ పొందుదుము. జరా రహితుఁడవైన అగ్నీ! నీ యనుగ్రహమువలన క్షీణించని కీర్తిని విశేషముగ పొందుదుము. (ఇది యాజ్య)

9. అర్థము: యవిష్ఠ=అతిశయముగ వియోగమును జేయువాఁడవును, భారతః=ఋత్విజులచే భరింపఁ దగినవాఁడవును, వసోః=ఆహుతులకు నివాసమైనవాఁడువునగు, అగ్నే!=ఓ యగ్నీ! శ్రేష్ఠమ్=యోగ్యమైనదియు, ద్యుమన్తమ్=దీప్తికలదియు, పురుస్పృహమ్=అనేకులచే కోరఁదగినదియునగు, రయిమ్=మణి ముక్తాది రూప ధనమును, ఆ భర=తీసికొనిరమ్ము.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు ఎక్కువ వియోగము కలుగఁజేయువాఁడవు. ఋత్విజులచే భరింపఁదగినవాఁడవు. ఆహుతులకు నివాసమైనవాఁడవు. అట్టి నీవు ప్రశస్తమైనదియు కాంతిమంతమైనదియు అనేకులు కోరునదియునగు మణి ముక్తాది రూప ధనమును తీసికొనిరమ్ము. (ఇది పురోనువాక్య)

10. అర్థము: యః అగ్నిః=ఏ అగ్ని, పావకః=శోధన చేయువాఁడో, పురుతమః=అనేకవిధములైనవాఁడో, పురూణి=అనేక విధములైన, పృథూని=విస్తృతములైన పురోడాశాది హవిస్సులను, భర్వన్=భక్షించుచు, అను యాతి=అను దినము (యజమాన గృహమునకు) పోవుచున్నాఁడో, సః=ఆ యగ్ని, శ్వితానః=ప్రకాశించుచున్నవాఁడు, తన్యతుః=ఫలములను విస్తరింపఁజేయువాఁడు, రోచనస్థాః=దీప్తిమంతములైన దేవయాగములందున్నవాఁడు, అజరేభిః=జరా రహితులైన, నానదద్భిః=స్తుతిని జేయుచున్న దేవతలతో, (సహితః=కూడియున్నవాఁడును), యవిష్ఠః=అతిశయముగ (వైరులకు) వియోగమును కలుగఁజేయుచున్నవాఁడును, (భవతి=అగుచున్నాఁడు.)

తాత్పర్యము: అగ్ని, శోధనచేయుఁవాడు. ఆహవనీయ గార్హపత్యాది నామధేయములచేతను, యవిష్ఠాది విశేషములచేతను, బహువిధములుగ నున్నవాఁడు. విస్తృతములైన అనేక పురోడాశాది హవిస్సులను భక్షించుచు అనుదినము యజమాన గృహమునకు పోవువాఁడు. ప్రకాశించువాఁడు. ఫలములను విస్తరింపఁజేయువాఁడు. దీప్తిమంతములైన దేవయాగములందున్నవాఁడు. జరా రహితులైన దేవతలచే స్తుతింపఁబడుచున్నవాఁడు. శత్రువులకు వియోగము కలుగఁజేయువాఁడు. (ఇది యాజ్య)

11. అర్థము: (హే యజమాన!=ఓ యజమానుడా!) తే=నీ కొఱకు, వరేణ్యః=శ్రేష్ఠుఁడైన, అయమ్=ఈ యగ్నిదేవుఁడు, విశ్వతః=సంపూర్ణముగా, ఆయుః=ఆయువును, దధత్=ఇచ్చుఁగాక. తే=నీ యొక్క, ప్రాణః=ప్రాణము, (అపమృత్యుగృహీతోఽపి=అపమృత్యువుచే గ్రహింపఁపడినదైనను,) పునః=మఱల, ఆయాతి=(నీ శరీరము, నందు)వచ్చుఁగాక. తే=నీ యొక్క, యక్ష్మమ్=వ్యాధిని, పరాసువామి=నశింపఁజేయుదును. (వర్తమాన సమీప భవిష్యత్తునందు వర్తమాన ప్రయోగము.)

తాత్పర్యము: ఓ యజమానుఁడా! శ్రేష్ఠుఁడైన ఈ యగ్నిదేవుఁడు నీకు సంపూర్ణమైన ఆయువు నిచ్చుఁగాక. నీ ప్రాణము అపమృత్యువుచే గ్రహింపఁబడినదైనను మఱల నీ శరీరమునందు ప్రవేశించుఁగాక. నీ వ్యాధిని నశింపఁజేయుదును. (దధత్=ప్రార్థనార్థకము. ఇదిపురోనువాక్య.)

12. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ! హవిషః=పురోడాశాది హవిస్సులను, జుషాణః=సేవించుచున్నవాఁడవును, ఘృత ప్రతీకః=(ఆఘార ప్రయాజాదులు ఆజ్యముచే హూయమానములగుటచే)ఉపక్రమమునందు ఆజ్యము కలవాఁడవును, ఘృతయోనిః=జన్మోత్పత్తికి ఆజ్యము కారణముగాఁగలవాఁడవునగు, (త్వమ్=నీవు) ఆయుర్దాః=(యజమానునకు)ఆయువునిచ్చువాఁడవై, ఏధి=ఉండుము (అపి చ=మఱియు) మధు=స్వాదువైనదియు, చారు=(శోధింపఁబడుటచే)నిర్మలమైనదియు, గవ్యమ్=గోసంబంధమైనదియునగు, ఘృతమ్=నేతిని, పీత్వా=త్రాగి, పితా=తండ్రి, పుత్త్రమివ=పుత్త్రునివలె, ఇమమ్=ఈ యజమానుని, అభిరక్షతాత్=అంతటను రక్షించుఁగాక. (ఏధి='అస=భువి'–ధాతువునకు లోటి మధ్యమ పురుషైకవచనము)

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు పురోడాశాది హవిస్సులను సేవించువాఁడవు. ఆఘార ప్రయాజాదులు ఉపక్రమమున ఘృతముచే హూయమానములగుటచే ఉపక్రమమున నేయి కలవాఁడవు. అనూయాజాదులు అంతమున ఆజ్యముచే హూయమానములగుటచే జన్మోత్పత్తికి ఆజ్యము కారణముగాఁగలవాఁడవు. అట్టి నీవు యజమానునకు ఆయువు నిచ్చి స్వాదుతమమును నిర్మలమైనదియునగు గోసంబంధి హవ్యమును త్రాగి తండ్రి కుమారునివలె ఈ యజమానుని రక్షించుము. (ఇది యాజ్య.)

13. అర్థము: విచర్షణే!=వివిధ యజమానులు గలవాఁడవును, జాతవేదః!=పుట్టిన దేహము నందెల్ల నుండువాఁడవునగు, అగ్నే!=ఓ యగ్నీ!, ప్రతిహర్యతే=ప్రతిదినము(యజమాన గృహమునకు)వెళ్లుచున్నవాఁడవగు, తస్మై=అ, తే=నీ కొఱకు, సుష్టుతిమ్=మంచి స్తోత్రమును, జనామి=పుట్టించుచున్నాను.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు వివిధ యజమానులచే సేవింపఁబడుచున్నవాఁడవు. పుట్టిన దేహమునందెల్ల (జఠరాగ్ని రూపమున)నుండువాఁడవు. ప్రతిదినము యజమాన గృహమునకు పోవుచున్న అట్టి నీకు మంచి స్తోత్రమును పుట్టించుచున్నాను. (జనామి=జనయామీ త్యర్థః. ఇది పురోనువాక్య)

14. అర్థము: అగ్నిః=అగ్ని, ప్రథమమ్=మొదట, దివస్పరి=ద్యులోకమునకుపైన, జజ్ఞే=(సూర్యరూపమున)పుట్టెను. ద్వితీయమ్=రెండవ పర్యాయము, అస్మత్ పరి=మన మనుష్యలోకమునకుపైన, జాతవేదాః=(ప్రసిద్ధమైన) అగ్నిగా, జజ్ఞే=పుట్టెను. తృతీయమ్=మూఁడవ పర్యాయము, అప్సు=నీటియందు(సముద్రమునందు) జజ్ఞే=(బడబానల రూపమున)పుట్టెను. అజస్రమ్=ఎల్లపుడు, నృమణాః=మనుష్యులయం దనుగ్రహబుద్ధి కలవాఁడు, హే యజమాన!=ఓ యజమానుఁడా! ఏనమ్=ఈ యగ్నిని, ఇన్ధానః=పురోడాశాది హవిస్సులచే దీపింపఁజేయుచున్నవాఁడవును, స్వాధీః=స్వాయత్త చిత్తుఁడవునై, జరతే=జరాపర్యంతము పరిచర్యచేయుము.

తాత్పర్యము: అగ్నిదేవుఁడు మొదట ద్యులోకమున సూర్యరూపమునను, రెండవ పర్యాయము మనుష్యలోకమున అగ్ని రూపమునను, మూఁడవ పర్యాయము సముద్ర జలమునందు బడబానల రూపమునను ఉద్భవించెను. ఈ మూఁడు జన్మలందును అగ్ని యజమానులం దనుగ్రహబుద్ధి గలవాఁడుగానుండును. ఓ యజమానుఁడా! ఈ యగ్నిని పురోడాశాది హవిస్సులచే దీపింపఁజేయుము. స్వాయత్త చిత్తుఁడవై జరాపర్యంతము పరిచర్య చేయుము. (ఇది యాజ్య)

15. అర్థము: పావక!=శోధింపఁజేయునట్టి, అగ్నే!=అగ్నీ! శుచిః=పరిశుద్ధి కలవాఁడవును, వన్ద్యః=నమస్కరింపఁదగిన వాఁడవునగు, త్వమ్=నీవు, ఘృతేభిః=ఆజ్యము మొదలగు హవిర్ద్రవ్యములచేత, ఆహుతః=అంతటను హోమము చేయఁబడుచున్నవాఁడవగుచు, బృహత్=అధికముగ, విరోచసే=ప్రకాశించుచున్నావు.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు శోధింపఁజేయువాఁడవు. శుచివి. వంద్యుఁడవు. అట్టి నీవు ఆజ్యాది హవిస్సులచే హోమము చేయఁబడిన వాఁడవగుచు అధికముగ ప్రకాశించుచున్నావు. (ఇది పురోనువాక్య.)

16. అర్థము: దృశానః=దర్శనీయ రూపము కలవాఁడును, రుక్మః=సువర్ణ సదృశుఁడునగు, అగ్నిః=అగ్నిదేవుఁడు, దుర్మర్షమ్=(ఇతరులచే)తిరస్కరింపఁదగనిదియగు, ఆయుః=జీవనమును, శ్రియే=ఆశ్రయించుటకొఱకు, రుచానః=కోరుచున్నవాఁడై, ఉర్వ్యా=గొప్ప దీప్తితో, వ్యద్యౌత్=ప్రకాశించుచుండెను. యత్=ఏ కారణమువలన, ఏనమ్=ఈ యగ్నిని, ద్యౌః=ద్యులోకవాసియగు దేవగణము, సురేతాస్సన్=మంచి రేతస్సు కలదగుచు, అజనయత్=పుట్టించెనో, తత్=ఆకారణమువలన, (అయమ్=ఈ యగ్ని) వయోభిః=హవీ రూపములయిన అన్నములచేత, అమృతః=మరణము లేనివాఁడై, అభవత్=ఆయెను.

తాత్పర్యము: దర్శనీయ రూపము కలవాఁడును స్వర్ణ సదృశుఁడునగు అగ్నిదేవుఁడు తిరస్కరింపఁదగని జీవనము నాశ్రయించుటకు వాంఛ కలవాఁడై గొప్ప దీప్తితో ప్రకాశించుచుండెను. ద్యులోకమునందలి దేవగణము మంచి రేతస్సు కలదియై యీ అగ్నిని పుట్టించెను. కావున ఈ యగ్ని హవీ రూపములైన అన్నములచే అమృతుఁడయ్యెను. (ఇది యాజ్య.)

17. అర్థము: యత్ తేజః=ఏ తేజస్సు, ఇషే=అభీష్ట సిద్ధికై, నృపతిమ్=యజమాన పాలకుఁడైన అగ్నిని, ఆ=అంతటను, (=సమన్తాత్,) ఆనట్=పొందెనో!, శుచి=పరిశుద్ధమైన, యత్ రేతః=ఏ రేతస్సు (=బీజము) నిషిక్తమ్=(తల్లి దండ్రులచే) ఉంచఁబడినదో!, తేన=ఆ తేజస్సుచేతను, (=ఆ బీజముచేతను,) ద్యౌః=ద్యులోకస్థుఁడైన, అగ్నిః=అగ్నిదేవుఁడు, అభీకే=ప్రత్యాసన్న కాలమునందు, శర్ధమ్=బలవంతుఁడును, అనవద్యమ్=దోష రహితుఁడును, స్వాధియమ్=స్వాయత్త చిత్తుఁడును, యువానమ్=తరుణ వయస్కుఁడునగు పురుషుని, జనయత్=పుట్టించుచున్నాఁడు, సూతయచ్చ=(విరోధియైన పాపమును) నశింపఁజేయుచున్నాఁడు కూడ.

తాత్పర్యము: ద్యులోకమునందలి అగ్నిదేవుఁడు తేజోవంతుఁడు. యజమానుని రక్షించువాఁడును. అట్టి యగ్నిదేవుఁడు తన తేజస్సుచేత మాతా పితరులచే నిషేకింపఁబడిన బీజముచే బలవంతుఁడును, స్వాధీన చిత్తుఁడును, దోష రహితుఁడును, తరుణ వయస్కుఁడు నగు పురుషుని పుట్టించుచున్నాఁడు. విరోధియైన పాపమును నశింపఁ జేయుచున్నాఁడు కూడ. కావున అగ్ని యజమానునకు తేజస్సు నిచ్చుటకు సమర్థుఁడని భావము. (ఇది పురోనువాక్య.)

18. అర్థము: సః=ఆ యజమానుఁడు, తేజీయసా=తేజోయుక్తమైన, మనసా=మనస్సుచేత, త్వోతః=నీ చేత రక్షింపఁబడిన వాఁడు. ఉత=మఱియు, హే అగ్నే!=ఓ యగ్నీ! స్వపత్యస్య=శోభన సంతాన యుక్తుఁడును, శిక్షోః=సామర్థ్యమును కోరుచున్న వాఁడును, నృతమస్య=మనుష్యులలో శ్రేష్ఠుఁడునగు యజమానునకు, రాయః=ధనములను, శిక్ష=ఒసగుము. తే=నీయొక్క, (అనుగ్రహముచేత) ప్రభూతౌ=ప్రభుత్వము కలుగుచుండగా, (వయమ్=మేము) వస్వః=ధనము కలవారము, సుష్టుతయశ్చ=మంచి స్తుతికలవారమును, భూయామ=అగుదుముగాక.

తాత్పర్యము: ఓ యగ్నీ! ఆ యజమానుని అత్యంతము తేజోవంతమైన మనస్సుతో నీవు రక్షించినావు. మఱియు ఓ యగ్నీ! శోభన పుత్త్రపౌత్త్రాదులతో కూడిన వాఁడును, సమర్థుఁడగుటకు ఇచ్ఛయించుచున్న వాఁడును, మనుజులలో శ్రేష్ఠుఁడునగు యజమానునకు ధనము నొసగుము. నీ ప్రభుత్వముండగా నీ యనుగ్రహము వలన మేము ధనవంతులము శోభన స్తుతులతో కూడిన వారమును అగుదుముగాక.

విశేషములు: నౄణామ్+తమః=నృతమః, 'శిక్ష, శిక్షోః, వస్వః, భూయామ' ఈ పదములు ఆ యా యర్థములందు లౌకిక సంస్కృతమునకు విలక్షణముగా ఈ వేదమంత్రమునందు ప్రయుక్తము లైనవి.

19. అర్థము: హే అగ్నే! ఓ యగ్నీ! ద్యుమ్నస్య=(నా) యశస్సును, సహన్తమ్=తిరస్కరించుచున్నట్టి శత్రువును, ప్రాసహా=నా స్వాధీనమునకు తీసికొని రమ్ము. రయిం చ=శత్రు ధనమునుగూడ, ఆ భర=తీసికొని రమ్ము. యః=ఏ నీవు, చర్షణీః=మనుష్య సేనలను, విశ్వాః=సమస్తమయిన వానిని, ఆసా=నీ సన్నిధానముచేత, వాజేషు=మా యన్నములు నిమిత్తము లగుచుండగా, అభి సాసహత్=తిరస్కరించుదువో!.

తాత్పర్యము: శత్రుసేనల నన్నిటిని మా అన్నము నిమిత్తము నీ సాన్నిధ్యముచేత తిరస్కరించుచున్నట్టి ఓ యగ్నీ! మా కీర్తిని తిరస్కరించునట్టి శత్రువును, అతని ధనమును మా యధీనము చేయుము. (ఇతరులను తిరస్కరించుటకు నీ సన్నిధానముకంటె వేఱొక సాధనము లేదని భావము. ఇది పురోనువాక్య.)

20. అర్థము: సహస్వః=బలవంతుఁడవైన, అగ్నే!=ఓ యగ్నీ!, త్వమ్=నీవు, పృతనాసహమ్=పరసేనను తిరస్కరించుటకు సమర్థమైన, రయిమ్=ధనమును, ఆ భర=తెమ్ము. త్వమ్=నీవు, సత్యః=బాధా రహితుఁడవు, అద్భుతః హి=ఆశ్చర్యకరమైన చరిత్ర కలవాడవును కావున, గోమతః బహు గోయుక్తమైన, వాజస్య=అన్నమునకు, దాతా=దాతవు, (త్వమేవ=నీవే.)

తాత్పర్యము: బలవంతుఁడవైన ఓ యగ్నీ! శత్రుసేనను తిరస్కరించుటకు సమర్థమైన ధనమును తీసికొని రమ్ము. నీవు బాధా రహితుఁడవు; ఆశ్చర్యకరమైన చరిత్ర కలవాడవును కావున, అనేక గోవులతో కూడుకొనిన అన్నము నిచ్చువాఁడవు నీవే. (ఇది యాజ్య.)

21. అర్థము: ఉక్షాన్నాయ=వృషభము హవీ రూపాన్నముగాఁ గలవాఁడును, వశాన్నాయ=వంధ్యగోవు హవీ రూపాన్నముగాఁ గలవాఁడును, సోమపృష్ఠాయ=సోమ యుక్తములైన స్తోత్రములు కలవాఁడును, వేధసే=అన్నమునకు విధాతయునగు, అగ్నయే=అగ్నిదేవుని కొఱకు, స్తోమైః=స్తోత్రములచేత, విధేమ=పరిచర్య చేయుదుము.

తాత్పర్యము: మేము అగ్నికి పరిచర్య చేయుదుము. ఒకానొక యాగమునందు అగ్ని, వృషభమును, వంధ్యగోవును హవిస్సుగా గ్రహించువాఁడు. సోమయుక్తము అయిన స్తోత్రములు కలవాఁడు. అన్నమును సృష్టించు వాఁడు. (ఇది పురోనువాక్య.)

22. అర్థము: హే సూనో!=కుమారుని వలె అభిమత కారివైన యగ్నీ!, త్వమ్=నీవు, వద్మా=వాగ్దేవతా స్వరూపుఁడవు, అసి హి=అగుచున్నావు కదా! అద్మసద్వా=(భుక్తాన్నమును జీర్ణింపఁ జేయుటకు) అన్నకోశమునందు జఠరాగ్ని రూపమున ఉన్నటువంటి, సః అగ్నిః=ఆ యగ్ని, జనుషా=జన్మ మాత్రము చేత, నః=మా కొఱకుఁ అజ్మ=గృహమును, అన్నమ్=అన్నమును, చక్రే=చేసెను. హే ఊర్జసనే!=రస ప్రదుఁడవైన ఓ యగ్నీ! త్వమ్=నీవు, నః=మా కొఱకు, ఊర్జమ్=రసమును, ధాః=ఇమ్ము. రాజేవ=రాజువలె, జేః=జయింపుము. అవృకే=హింసాది దోష రహితుఁడైన యజమానునియందు, (అనుగ్రహించుటకు) అన్తః క్షేషి=లోపల నివసించుచున్నావు. ("అగ్ని ర్వాగ్భూత్వా ముఖం ప్రావిశత్" అను శ్రుతి అగ్ని వాగ్దేవతా స్వరూపమనుటలో ప్రమాణము.)

తాత్పర్యము: పుత్త్రుఁడు వలె అభీష్టమును కలుగఁజేయునట్టి ఓ యగ్నీ! నీవు వాగ్దేవతా స్వరూపుఁడ వగుచున్నావు కదా! వివాహ కాలమున గృహస్థాశ్రమమును స్వీకరించిన వ్యక్తి గార్హపత్యాగ్నిని ప్రతిష్ఠించి అగ్ని సేవ చేయ నారంభించును. అప్పుడు ఏర్పడిన అగ్ని మానవుని అన్నకోశమున జఠరాగ్ని రూపమున ప్రవేశించి భుక్తాన్నమును జీర్ణింపఁ జేయుచున్నాఁడు. అట్టి యగ్ని జఠరాగ్ని రూపమున నుండి మానవునకు జన్మ మాత్రము చేతనే అన్నమును గృహమును కల్పించుచున్నాఁడు. రస ప్రదుఁడవైన ఓ యగ్నీ! రాజు విజయము సంపాదించిన విధముగ విజయమును సాధించుము. హింసాది దోషములు లేని యజమానుని యందు అనుగ్రహించుటకు నీవు నివసించుచున్నావు. (ఇది యాజ్య.)

23. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ!, ఆయూంషి=(మా)జీవనములను, పవసే=(వృద్ధి బొందునట్లుగా) శోధించుచున్నావు. ఊర్జమ్=క్షీరాది రసమును, అన్నం చ=అన్నమును గూడ, నః=మాకు, ఆ సువ=అభిముఖ్యముగ ప్రేరణ చేయుము. (=అనుకూలముగ కలుగఁజేయుము) దుచ్ఛునామ్=ఉపద్రవమును, ఆరే=దూరమునందుండు నట్లుగఁ జేసి. బాధస్వ=బాధించుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! మా జీవనములను వృద్ధినొందు విధముగ శోధించుచున్నావు. మాకు క్షీరాది రసమును అన్నమును కలుగఁజేయుము. ఉపద్రవమును దూరముగ పారద్రోలి నశింపఁజేయుము. (ఇది పురోనువాక్య.)

24. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ!, స్వపాః=సుకర్మ కలిగిన నీవు, అస్మే=మా సంబంధమైన, వర్చః=బ్రహ్మ వర్చస్సును, సువీర్యమ్=మంచి సామర్థ్యమును, పవస్వ=శోధించుము. (=వృద్ధి నొందించుము.) మయి=నా యందు, పోషమ్=పుష్టిని, రయిమ్=ధనమును, దధత్=స్థాపించుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! మంచి కర్మలు కల నీవు నా బ్రహ్మ వర్చస్సును మంచి సామర్థ్యమును వృద్ధి నొందించుము. నా యందు ధనమును పుష్టిని స్థాపించుము.

విశేషములు: 'దధత్' అను కృదన్తము ఇచట క్రియగా ప్రార్థనార్థమున ప్రయుక్తమైనది. 'స్వపాః'—సు=శోభనమ్, అపః=కర్మ, యస్య సః=స్వపాః. ఇది అగ్నికి విశేషణము. 'అప్' శబ్దము కర్మార్థకముగా ప్రయుక్తమైనది. 'అస్మదీయమ్' అను నర్థమున 'అస్మే' అని ప్రయుక్తమైనది. (ఇది యాజ్య)

25. అర్థము: పావక!=శోధకుఁడవును, దేవః=ద్యోతనాత్మకుఁడవునగు, హే అగ్నే!=ఓ యగ్నీ! రోచిషా=దీప్తి మంతమును, మన్ద్రియా=శ్లక్ష్ణమైనదియునగు, జిహ్వయా=నాలుకతో, దేవాన్=దేవతలను, ఆ వక్షి=ఆవహించుము. చ=మఱియు, యక్షి=యాగము చేయుము. (శ్లక్ష్ణము=సన్నము; ప్రియమును పలుకునది; అందఱిచే నాలింగనము చేయఁబడినది.)

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు శోధకుఁడవు; ప్రకాశకుఁడవు. అట్టి నీవు కాంతిమంతమును శ్లక్ష్ణమునునైన నాలుకతో దేవతల నావహించి ఈ యాగమును ప్రవర్తింపఁజేయుము. (ఇది పురోనువాక్య.)

26. అర్థము: పావక!=శోధకుఁడవు, దీదివః=ప్రకాశించుచున్న వాఁడవునగు, హే అగ్నే!=ఓ యగ్నీ!, నః=మా కొఱకు, దేవాన్=దేవతలను, ఇహ=ఈ యజ్ఞ కర్మయందు, ఆవహ=ఆవహింపఁ జేయుము. (=ఉండునట్లు చేయుము.) నః=మా యొక్క, యజ్ఞమ్=యజ్ఞమును, హవిశ్చ=హవిస్సును గూడ, ఉప=దేవతల సమీపమునందు, (ప్రాపయ=పొందించుము.)

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు శోధకుఁడవు, ప్రకాశించుచున్న వాఁడవు. అట్టి నీవు మా నిమిత్తము దేవతలను ఈ యజ్ఞమునం దావహింపఁ జేయుము. మా యీ యజ్ఞమును, హవిస్సును గూడ దేవతల కందఁజేయుము. (ఇది యాజ్య.)

27. అర్థము: అగ్నిః=(ఈ) అగ్ని, శుచివ్రతతమః=మిక్కిలి శుద్ధమైన ఆచరణము కలవాఁడు. విప్రః=విప్రాభిమాని. (కావున) శుచిః=పరిశుద్ధుఁడు. కవిః=పండితాభిమాని.(కావున) శుచిః=పరిశుద్ధుఁడు. ఆహుతః=అభిముఖముగా హోమము చేయఁబడు హవిస్సున కాధారమైనవాఁడు. (కావున) శుచిః=కాంతి కలవాఁడై, రోచతే=ప్రకాశించుచున్నాఁడు.

తాత్పర్యము: ఈ యగ్ని దాహ పావక ప్రకాశరూప పరిశుద్ధాచరణము కలవాఁడు. ఇంకను బ్రాహ్మణాభిమాని యగుటచే శుచియైనవాఁడు. పండితాభిమాని యగుటచేత ఇంకను శుచియైనవాఁడు. అభిముఖమున హవిస్సును వేల్చుటచేత ఇంకను దీప్తి మంతుఁడై ప్రకాశించుచున్నాఁడు. (ఇది పురోనువాక్య.)

28. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ! శుచయః=శుద్ధములైన, శుక్రాః=కాంతులు భ్రాజన్తః=ప్రకాశించుచున్నవై, ఉదీరతే=పైకి పోవుచున్నవి. అర్చయః=(నిన్ను) అర్చించువారు, జ్యోతింషి=భాసింపఁజేయు దేవతారూపములను, (ప్రాప్నువన్తి=పొందుచున్నారు.)

తాత్పర్యము: ఓ యగ్నీ! శుద్ధములైన నీ కాంతులు ప్రకాశించుచున్నవై పైకి వ్యాపించుచున్నవి. నిన్ను పూజించువారు భాసింపఁజేయు దేవతా రూపములను పొందుచున్నారు. (ఇది యాజ్య.)

తృతీయ ప్రపాఠకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థః ప్రపాఠకః।

తత్ర ప్రథమోఽనువాకః।

హరిః ఓమ్।

మూలము: [1]ఆదదే గ్రావా ఽస్యధ్వరకృ ద్దేవేభ్యో గమ్భీర మిమ మధ్వరం కృధ్యుత్తమేన పవినే
న్ద్రాయ సోమగ్ం సుషుతం మధుమన్తం పయస్వన్తం వృష్టివని [2]మిన్ద్రాయ త్వా వృత్రఘ్న
ఇన్ద్రాయ త్వా వృత్రతుర ఇన్ద్రాయ త్వా ఽభిమాతిఘ్న ఇన్ద్రాయ త్వా ఽఽదిత్యవత
ఇన్ద్రాయ త్వా విశ్వదేవ్యావతే [3]శ్వాత్రా స్థ వృత్రతురో రాధోగూర్తా అమృతస్య పత్నీ
స్తా దేవీ ర్దేవత్రేమం యజ్ఞం ధత్తో పహూతాః సోమస్య పిబతో పహూతో యుష్మాకమ్
(౧)సోమః పిబతు [4]యత్తే సోమ దివి జ్యోతి ర్యత్పృథివ్యాం య దురా వన్తరిక్షే తేనా
స్మై యజమానాయోరు రాయా కృధ్యధి దాత్రే వోచో [5]ధిషణే వీడూసతీ వీడయేథా మూర్జం
దధాథా మూర్జం మే ధత్తం మా వాగ్ం హిగ్ంసిషం మా మాహిగ్ంసిష్టం [6]ప్రాగపాగుద
గధరా క్తాస్త్వా దిశ ఆ ధావ న్త్వమ్బ నిష్వర। [7]య త్తే సోమా దాభ్యం నామ జాగృవి
తస్మై తే సోమ సోమాయ స్వాహా ॥౧॥ (యుష్మాకగ్ం స్వర యత్తే నవ చ)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే ప్రథమోఽనువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: తృతీయ ప్రపాఠకమునందు అగ్నీ షోమీయ పశువు ప్రధానముగ చెప్పఁబడినది. పిమ్మట వసతీ వరీ జల గ్రహణము చెప్పఁబడినది. దానితో జ్యోతిష్టోమ యాగము చేయు దినములలో సుత్యా దినమునకు పూర్వము చేయవలసిన కార్యకలాపము సమాప్తమైనది. తరువాత సుత్యా దినము నందలి కర్తవ్యమును ప్రారంభించుటకై సోమోపావరోహణము కూడ తృతీయ ప్రపాఠకమునందే చెప్పఁబడినది. ఈ చతుర్థ ప్రపాఠకము నందు సుత్యా దినమునందు కర్తవ్యములైన గ్రహములు ప్రధానముగ చెప్పఁబడుచున్నవి. ఈ ప్రథమానువాకమునందు పాత్రములందు సోమ రసమును గ్రహించుటకై సోమాభిషవము చెప్పఁబడుచున్నది. (సోమాభిషవము=సోమలతను వలగఁగొట్టి రసము తీయుట.)

1\. అర్థము: (హే గ్రావన్=అభిషవ సాధనమైన శిలావిశేషమా!, త్వామ్=నిన్ను) ఆదదే=స్వీకరించుచున్నాను. (త్వమ్=నీవు,) అధ్వరకృత్=యజ్ఞనిష్పాదకము, గ్రావా=దృఢమునైన పాషాణము, అసి=అగుచున్నావు. ఇమమధ్వరమ్=ఈ యజ్ఞమును, దేవేభ్యః=దేవతలకొఱకు, గమ్భీరమ్=గహనమైనదిగా, కృధి=చేయుము. (అహమ్=నేను,) ఉత్తమేన=శ్రేష్ఠమైన, పవినా=వజ్రాయుధ సదృశమైన నీ చేత, సోమమ్=సోమమును, (సోమలతను,) సుషుతమ్=బాగుగ నభిషుతమైనదిగను, మధుమన్తమ్=మాధుర్యము కలదిగను, పయస్వన్తమ్=క్షీరమువలె రసవంతమైనదిగను, వృష్టివనిమ్=వర్షప్రదమైనదిగను, (కరోమి=చేయుచున్నాను.)

తాత్పర్యము: అభిషవ సాధనమైన శిలావిశేషమా!, యజ్ఞ నిష్పాదకమును దృఢమునైన నిన్ను గ్రహించు చున్నాను. నీవు ఈ యజ్ఞమును దేవతల నిమిత్తము గంభీరమైనదిగా చేయుము. వజ్రాయుధముతో సమానమును, శ్రేష్ఠమునైన నీచేత ఈ సోమలతను బాగుగ నభిషుతముగను, మాధుర్యము కలదిగను క్షీరమువలె రసోపేతమైనదిగను, వర్షప్రదమైనదిగను చేయుచున్నాను. (యజ్ఞమున అగ్నియందు హవిస్సును వేల్చుటచే ఆ హుతమైన హవిస్సు ఆదిత్యుని మూలమున వర్షము కురియుటలో కారణమగునని "అగ్నౌ ప్రాస్తాఽఽహుతిస్సమ్య గాదిత్య ముపతిష్ఠతే। ఆదిత్యా జ్జాయతే వృష్టి ర్వృష్టే రన్నం తతః ప్రజాః" అను స్మృతి చెప్పుచున్నది. (ఈ మంత్రము చెప్పుచు శిలలలో విశిష్టమైన శిలను తీసికొని అభిమంత్రించవలెను. సోమలతను రసముతీయుటకై నలగఁగొట్టుటకు సాధనమైన ఱాయి యిచట వర్ణించఁబడినది.)

2\. అర్థము: (హే సోమః=ఓ సోమమా!) త్వా=నిన్ను, వృత్రఘ్నే=మేఘ విదారయిత యగు, ఇన్ద్రాయ=ఇంద్రునికొఱకు, (మిమే=హింసించు చున్నాను.) త్వా=నిన్ను వృత్రతురే=వృత్రాసుర సంహర్తయగు, ఇన్ద్రాయ, (మిమే.) త్వా=నిన్ను, అభిమాతిఘ్నే=పాప నాశకుఁడగు, ఇన్ద్రాయ, (మిమే.) త్వా=నిన్ను, ఆదిత్యవతే=ఆదిత్యవంతుఁడైన, ఇన్ద్రాయ, (మిమే.) త్వా=నిన్ను, విశ్వదేవ్యావతే=విశ్వేదేవతలు గల, ఇన్ద్రాయ, (మిమే.)

తాత్పర్యము: ఓ సోమమా! మేఘ విదారయితయు, వృత్రాసుర సంహర్తయు, పాప నాశకుఁడు, ఆదిత్యవంతుఁడు, విశ్వేదేవతలు కలవాఁడునగు నింద్రుని కొఱకు నిన్ను హింసించుచున్నాను. (హింస యనగా నిచట నలగఁగొట్టుట. సోమలతను తూర్పు కొనలు కలదిగా నుంచి ఱాతితో నలగఁ గొట్టవలెను, ప్రాత స్సవనమునందు ఆదిత్య దేవత నుద్దేశించి సోమము గ్రహింపఁబడుచున్నది కావున 'ఆదిత్యవతే' అనియు, తృతీయ సవనమునందు విశ్వేదేవతల నుద్దేశించి గ్రహింపఁబడును కావున విశ్వేదేవ్యావతే అనియు చెప్పఁబడినది.)

3\. అర్థము: (హే ఆపః=ఓ ఉదకములారా! యూయమ్=మీరు) శ్వాత్రాః=శీఘ్రముగ చేయువారును, వృత్రతురః=వృత్రాసురుని సంహరించినవారును, రాధోగూర్తాః=అన్నమును సంపాదించుటకు యత్నించినవారును, అమృతస్య=అమృతమునకు, పత్నీః=పాలకురాండ్రును, స్థ=అగుచున్నారు. తాః=అటువంటి మీరు, దేవీః=దేవతా రూపులై, దేవత్రా=దేవతలయందు, ఇమం యజ్ఞమ్=ఈ యజ్ఞమును, ధత్త=స్థాపించుఁడు. (కించ=మఱియు,) ఉపహూతాః=అనుజ్ఞాతలై, సోమస్య=సోమముయొక్క, (అంశమ్=అంశమును,) పిబత=త్రాగుఁడు. సోమః (చ)=సోమముకూడ, ఉపహూతః=అనుజ్ఞాతమై, యుష్మాకమ్=మీయొక్క (అంశమ్=అంశమును,) పిబతు=త్రాగుఁగాక.

తాత్పర్యము: ఓ ఉదకములారా! మీరు శీఘ్రకారిణులు, వృత్రాసుర సంహర్తలు. అన్నమును సంపాదించుట కుద్యమించినవారు. సోమమును పాలించువారు. అటువంటి మీరు దేవతలయందు మా యీ యజ్ఞమును స్థాపించుఁడు. మఱియు అనుజ్ఞపొందినవారై సోమరసాంశమును త్రాగుఁడు. సోమము కూడ అనుజ్ఞాతమై మీ యంశమును త్రాగుఁగాక. (నలగఁగొట్టఁబడిన సోమమును హోతృ చమసములందలి పదార్థములతో కలుపవలెను.)

4. అర్థము: హే సోమ!=ఓ సోమమా! తే=నీకు, దివి=ద్యులోకమునందు, యత్ జ్యోతిః=ఏ జ్యోతిస్సు, (అస్తి=కలదో,) పృథివ్యామ్=భూలోకమునందు, యత్=ఏ తేజస్సు, (అస్తి=కలదో) ఉరౌ=గొప్పదియగు- (=విశాలమైన,) అన్తరిక్షే=అంతరిక్షలోకమునందు, యత్=ఏ తేజస్సు, (అస్తి=కలదో,) తేన=ఆ జ్యోతిస్సుచేత, అస్మై=ఈ, యజమానాయ=యజమానునికొఱకు, రాయా=ధనముచేత, ఉరు=సమృద్ధమైన, (=విస్తీర్ణమైన,) స్థానమును, కృధి=చేయుము. (అపి చ=మఱియు) అధి=(యజమానుఁడు భక్తిచే) అధికుఁడని, దాత్రే=ఫలదాతయగు నింద్రునికొఱకు, వోచః=చెప్పుము.

తాత్పర్యము: ఓ సోమమా! నీకు ముల్లోకములందుఁగల తేజస్సుచే ఈ యజమానునకు ధన సమృద్ధమైన స్థానమును కల్పించుము. మఱియు ఈ యజమానుఁడు అత్యంత భక్తికలవాఁడని ఫలదాతయగు ఇంద్రునకు చెప్పుము. (సోమమును అభిమంత్రించవలెను. 'వచ్యాః' అని యుండవలసిన ఆశీర్లిఙన్త ప్రయోగమునకు బదులుగా 'వోచః' అని ప్రయుక్తమైనది. ఛాన్దసము.)

5. అర్థము: హే ధిషణే!=(సోమాభిషవమునకు సాధనములైన) చర్మఫలకములారా! (యువామ్=మీరు,) వీడూ సతీ=దృఢమైన వారలగుచు, వీడయేథామ్=(మఱల మఱల అభిషవాది ఘాతముచే విశ్లేషము చెందకుండ) దృఢముగా నుండుఁడు. ఊర్జమ్=సోమ రసమును, దధాథామ్=ధరించుఁడు. ఊర్జమ్=సోమరసమును, మే=నాకొఱకు, ధత్తమ్=ఒసగుఁడు. (అహమ్=నేను) వామ్=మిమ్ము, మా హింసిషమ్=హింసింపను. (యువామపి=మీరు కూడ) మా=నన్ను, మా హింసిష్టమ్=హింసింపకుఁడు.

తాత్పర్యము: (సోమలతను ఒక చర్మఫలకమునందుంచి, దానిపై మఱియొక చర్మఫలకమునుంచి రసము వచ్చుటకు ఆ చర్మఫలకముపై ఱాతితో కొట్టవలెను. అప్పుడా నలిగిన సోమలతనుండి బాగుగ రసము ప్రవహించును. ఈ సందర్భమున ఈ మంత్రము చెప్పఁబడినది.) ఓ చర్మఫలకములారా! సోమలతను ఱాతితో కొట్టినప్పుడు మీరు దృఢముగ నుండుఁడు. మఱల మఱల కొట్టునప్పుడు విశ్లేషము చెందకుండుటకై దృఢత్వము కలిగి యుండుఁడు. సోమరసము కారిపోకుండునట్లు మీరు దానిని ధరించుఁడు. మాకు సోమరసము నొసఁగుఁడు. నేను మిమ్ము హింసించను. మీరు కూడ నన్ను హింసింపకుఁడు. (చర్మఫలకమును స్పృశించవలెను.)

6. అర్థము: (హే సోమ!=ఓ సోమమా!) ప్రాక్, అపాక్, ఉదక్, అధరాక్=ప్రాగాది దిక్కులు, (యాః సన్తి=ఏవి కలవో!) తాః దిశః=ఆ దిక్కులు, త్వా=నిన్నుఁగూర్చి, ఆ ధావన్తు=అభిముఖముగ పరుగిడుఁగాక. హే అంబ!=మాతృ స్థానీయమైన ఓ సోమమా! నిష్పర=(అంశువులనుండి) వెలుపలకు వెడలుము.

తాత్పర్యము: ఓ సోమమా! ప్రాగాది దిశలు నీకభిముగ పరుగిడుఁగాక. మాతృదేవతవంటి సోమమా! నీ యంశువుల నుండి రసము వెలుపలకు వెడలుఁగాక. (యజ్ఞవేదియందు హోత్రాది ఋత్విజుల యెదుట సోమరసమును నింపు పాత్రలుండును. వానికి గ్రహములని పేరు. వానిలో ఒక గ్రహమునకు సరిపోవునంతటి రసము నిచ్చు సోమలతను పైని ఉంచి హోతృ సంబంధియగు చమసమునందు ఆ సోమలతయొక్క కొనల నుంచి వానిపై ఆ పాషాణమునుంచి మూఁడు మారులు ప్రదక్షిణముగా త్రిప్పుచు ఈ మంత్రము పఠించవలెను.)

7. అర్థము: హే సోమ!=ఓ సోమమా! తే=నీకు, అదాభ్యమ్=తిరస్కార్యముగాని, యత్ నామ=ఏ పేరు, జాగృవి=జాగరూకమై యున్నదో, హే సోమ!=ఓ సోమమా! తస్మై సోమాయ=అటువంటి సోమ నామము ధరించిన నీకొఱకు, స్వాహా=సోమాంశు ద్వయము హుతమగుఁగాక.

తాత్పర్యము: ఓ సోమమా! తిరస్కార్యముకాని సోమనామము ధరించిన నీకు ఈ సోమాంశు ద్వయము హుతమగుఁగాక. (ప్రతిప్రస్థాత సోమలతయొక్క రెండేసి కొనలను కలుపవలెను.)

ప్రథమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే ద్వితీయోఽనువాకః ।

మూలము: [1]వాచ స్పతయే పవస్వ వాజి న్వృషా వృష్ణో అగ్ంశుభ్యాం గభస్తిపూతో దేవో దేవానాం పవిత్ర మసి యేషాం భాగో ఽసి తేభ్య స్త్వా [2]స్వాంకృతో ఽసి మధుమతీ ర్న ఇష స్కృధి విశ్వేభ్య స్త్వే న్ద్రియేభ్యో దివ్యేభ్యః పార్థివేభ్యో [3]మన స్త్వా ష్టు ర్వన్తరిక్ష మన్విహి స్వాహా త్వా సుభవ స్సూర్యాయ దేవేభ్య స్త్వా మరీచిపేభ్య [4]ఏష తే యోనిః ప్రాణాయ త్వా ॥౧॥ (వాచః సప్తచత్వారిగ్ంశత్)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే ద్వితీయోఽనువాకః॥

వేదార్థ దీపిక

అవతారిక: ప్రథమానువాకము నందు ఉపాంశు గ్రహమును గ్రహించుటకై సోమాభిషవ సన్నాహ మభిహితమైనది. ఈ ద్వితీయానువాకము నందు ఉపాంశు గ్రహము చెప్పఁబడుచున్నది.

1. అర్థము: హే వాజిన్!=అన్నప్రదమైన సోమమా!, పతయే=పాలకుఁడైన దేవుని కొఱకు, వాచః=వాక్సంబంధియగు, (మంత్రేణ=మంత్రముచేత,) పవస్వ=పరిశుద్ధ మగుము. వృషా=రసరూప మగుటచే, వృష్ణః=వర్షించుటకు సమర్థమైన, (త్వమ్=నీవు) గభస్తిపూతః=(పూర్వ మరణ్యమందు) సూర్యకిరణములచే పవిత్రమైనదానవు. (ఇదానీమ్=ఇప్పుడు,) వృష్ణః=వర్షణ సమర్థమైన సోమముయొక్క, అంశుభ్యామ్=అంశువులచే, పవస్వ=పవిత్రము కమ్ము. (అపి చ=మఱియు, త్వమపి=నీవుకూడ) దేవః ఏవ సన్=దేవుఁడవే అగుచు, దేవానామ్=సోమపానము చేయు దేవతలకు, పవిత్రమ్=పవిత్ర హేతువు, అసి=అగుచున్నావు. యేషామ్=ఏ దేవతలకు, భాగః=భాగము, అసి=అగుచున్నావో, తేభ్యః=ఆ దేవతలకొఱకు, త్వా=నిన్ను, గృహ్ణామి=గ్రహించుచున్నాను.

తాత్పర్యము: అన్నదాతవైన ఓ సోమమా! పాలకుఁడగు దేవుని కొఱకు వాక్సంబంధియైన మంత్రముచేత శుద్ధము కమ్ము. రస రూప మగుటచే వర్షణ సమర్థమైన నీవు పూర్వ మరణ్యమునందు సూర్యకిరణములచే పవిత్ర మైతివి. ఇప్పుడు వర్షణ సమర్థములయిన సోమముయొక్క అంశువులచే (పాత్రము లోపలనుంచఁబడిన సోమలత కొనలచేత) పవిత్రము కమ్ము. మఱియు నీవు కూడ దేవుఁడవే యగుచు సోమపానము చేయునట్టి దేవతలకు పవిత్ర హేతు వగుచున్నావు. నీవు భాగమైన దేవతలకై నిన్ను గ్రహించుచున్నాను. (సోమలతను ఎనిమిది భాగములుగా అభిషవము చేసి పిమ్మట ప్రతిప్రస్థాత ఉపాంశువను పేరుగల పాత్రమును గ్రహించి అందు రెండు సోమలత కొనల నుంచవలెను. అం దభిషుతమైన సోమరసమును అధ్వర్యుఁడు ఈ మంత్రము చెప్పుచు అంజలితో గ్రహించవలెను.)

2\. అర్థము: (హే ఉపాంశు గ్రహ!=ఓ ఉపాంశు గ్రహమా!, త్వమ్=నీవు,) స్వాంకృతః=నాచే గ్రహింపఁబడిన దానవు, అసి=అగుచున్నావు. మధుమతీః=మధురములైన, ఇషః=అన్నములను, నః=మాకొఱకు, కృధి=చేయుము. దివ్యేభ్యః=దేవతా సంబంధులును, పార్థివేభ్యః=మనుష్య జన్మ సంబంధులునగు, విశ్వేభ్యః=సమస్తములైన, ఇంద్రియేభ్యః=ఇంద్రియముల హితము నిమిత్తమై, (త్వామ్=నిన్ను, స్వీకరోమి=స్వీకరించుచున్నాను.)

తాత్పర్యము: ఓ ఉపాంశు గ్రహమా! నా కొఱకు మధురములైన అన్నములను కలుగఁజేయుము. దేవజన్మము నందును, మనుష్య జన్మము నందును ఉన్నట్టి సర్వేంద్రియముల హితము నిమిత్తము నిన్ను గ్రహించు చున్నాను. (అధ్వర్యుఁ డీ మంత్రము పఠించుచు ప్రతిప్రస్థాతనుండి ఉపాంశు గ్రహమును స్వీకరించవలెను.)

3\. అర్థము: (హే ప్రాణ రూపోపాంశుగ్రహ!=ప్రాణ రూపమైన ఉపాంశు గ్రహమా!) త్వా=నిన్ను, మనః=మనస్సు, అష్టు=వ్యాపించుఁగాక, ఉరు=విస్తీర్ణమైన, అన్తరిక్షమ్=అంతరిక్షమును, అన్విహి=అనుసరించి (ఆహవనీయమునందు) పొమ్ము. హే సుభవః!=మధ్యావస్థితి రూప సద్భావముకల ప్రాణమా!, త్వా=త్వద్రూపమైన గ్రహమును, సూర్యాయ=బహిః ప్రాణ రూపముకొఱకు, స్వాహా=హోమము చేయుచున్నాను. హే లేప!=ఓ లేపమా!) త్వా=నిన్ను, మరీచిపేభ్యః=మరీచి పాలకులైన, దేవేభ్యః=దేవతల కొఱకు, (పరిధౌ=పరిధియందు, మార్జ్మి=పూయుచున్నాను.)

తాత్పర్యము: ప్రాణరూపమైన ఓ ఉపాంశు గ్రహమా! మనస్సు నిన్ను పొందుఁగాక. విస్తీర్ణమైన ఆకాశము ననుసరించి ఆహవనీయాగ్ని సంబంధియైన ప్రదేశమునకు పొమ్ము. మధ్యమునసుండుట యను సద్భావము గల ప్రాణమా! త్వద్రూపమైన గ్రహమును బహిఃప్రాణరూప సూర్యుని కొఱకు హోమము చేయుచున్నాను. ఓ లేపమా! (=కొటుకవంటిది) మరీచి పాలక దేవతల నిమిత్తము నిన్ను పరిధియందు పూయుచున్నాను. "ఆదిత్యో హవై బాహ్యః ప్రాణ ఉదయత్యేష హ్యేనం చాక్షుషం ప్రాణ మనుగృహ్ణాతి నః" అని అథర్వణమునందు సూర్యునకు ప్రాణ రూపత్వ మభిహితమైనది. (మధ్యమ పరిధియందు లేపమును పూయవలెను.)

4\. అర్థము: (హే ఉపాంశు గ్రహ!=ఓ ఉపాంశు గ్రహమా!) ఏషః=ఈ ఖరము యొక్క దక్షిణ భాగము, తే=నీకు, యోనిః=స్థానము. త్వా=నిన్ను, ప్రాణాయ=ప్రాణ దేవతా సంతోషమునకై (అత్ర=ఇచ్చట, సాదయామి=ఉంచుచున్నాను. ఖరము=హవిర్ధాన మంటపమున కెదుట మట్టితో నిర్మితమైన ప్రదేశము. అది విత్తనము నాటని ప్రదేశమై యుండును.)

తాత్పర్యము: ఓ ఉపాంశుగ్రహమా! ఈ ఖరముయొక్క దక్షిణ భాగము నీకు స్థానము. నిన్ను ప్రాణ దేవత సంతోషమునకై ఈ ఖరప్రదేశము నందుంచు చున్నాను. (ఉపాంశు గ్రహము నందలి సోమరసము నంతయు ఆగ్రయణ స్థాలియందు పోసి రిక్తమైన ఆ ఉపాంశుపాత్రమునందు సోమలతయొక్క కొనలను ఉంచి దానిని ఖరప్రదేశమున నుంచవలెను.)

ద్వితీయానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే తృతీయోఽనువాకః

మూలము: [1]ఉపయామ గృహీతో ఽస్య న్త ర్యచ్ఛ మఘవ న్పాహి సోమ మురుష్య రాయ స్సమిషో
యజస్వా న్త స్తే దధామి ద్యావాపృథివీ అన్త రుర్వ న్తరిక్షగ్ం సజోషా దేవై రవరైః
పరై శ్చా న్తర్యామే మఘవ న్మాదయస్వ [2]స్వాంకృతో ఽసి మధుమతీ ర్న ఇష
స్కృధి విశ్వేభ్య స్త్వే న్ద్రియేభ్యో దివ్యేభ్యః పార్థివేభ్యో మన స్త్వా ష్టూ ర్వ న్తరిక్ష
మన్విహి స్వాహా త్వా సుభవ స్సూర్యాయ దేవేభ్య స్త్వా మరీచిపేభ్య ఏష తే యోని
రపానాయ త్వా ॥౧॥ (దేవేభ్యః సప్త చ)॥

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థ ప్రపాఠకే తృతీయోఽనువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: ద్వితీయానువాకమునందు ఉపాంశు గ్రహము అభిహితమైనది. ఈ తృతీయానువాకము మొదలు ముప్పది యాఱవ యనువాకము పర్యంతము అంతర్యామ గ్రహము మొదలు షోడశి గ్రహము వఱకుఁగల గ్రహములు చెప్పఁబడుచున్నవి.

1. అర్థము: (హే సోమరస!=ఓ సోమరసమా!, త్వమ్=నీవు,) ఉపయామగృహీతః=పృథివియందు త్పన్నమయిన దారుమయ పాత్రము చేత గ్రహింపఁబడిన దానవు. అసి=అగుచున్నావు. హే మఘవన్!=ఓ యింద్రా!, అన్తః+యచ్ఛ=(ఈ పాత్రము మా శత్రువులకు కనిపించనట్లు) అంతర్ధాన మగునట్లు నియమించుము. (తతః=దాని వలన,) సోమమ్=సోమమును, పాహి=రక్షింపుము. రాయః=ధనములను, ఉరుష్య=రక్షింపుము. సమిషః=సమీచీనము లయిన అన్నములను, యజస్వ=ఇమ్ము. ద్యావా పృథివీ=ద్యావా భూములను, తే=నీ యొక్క, (అనుగ్రహేణ=అనుగ్రహము చేత,) అన్తః+దధామి=వ్యవధానము కలవిగాఁ జేయుచున్నాను. ఉరు=విస్తీర్ణమైన, అన్తరిక్షమ్=ఆకాశమును, అన్తర్దధామి=వ్యవధానము కలదిగాఁ జేయుచున్నాను. హే మఘవన్!=ఓ యింద్రా! (త్వమ్=నీవు,) అవరైః=చిన్నవారును, పరైశ్చ=పెద్దవారు నగు, దేవైః=దేవతల చేత, సజోషాః=సేవింపఁబడుచున్నవాఁడవై, అన్తర్యామే=అన్తర్యామ పాత్రమునందు, మాదయస్వ=(వారిని) సంతోషపెట్టుము. ("అన్తర్యామ" అను పదము దారు నిర్మిత పాత్ర విశేష వాచకము.)

తాత్పర్యము: ఓ సోమరసమా!, నీవు పృథివీ వికారమైన దారువుచే నిర్మితమైన అంతర్యామ సంజ్ఞక పాత్రములోనికి గ్రహింపఁబడినదాన వగుచున్నావు. ఓ దేవేంద్రా! అంతర్యామ పాత్రమును శత్రువులకు కనిపించని విధముగ చేసి సోమరసమును కాపాడుము. మంచి యన్నము నొసఁగుము. సోమరసమును ధనములను రక్షింపుము. నీ యనుగ్రహము వలన ద్యావా భూములను ఆకాశమును వ్యవధానము కలవిగా చేయుచున్నాను. ఓ యింద్రా! చిన్నవారును పెద్దవారును నైన దేవతలచే సేవింపఁబడుచున్న వాఁడవై అంతర్యామ పాత్రము నందు నీవు సంతోషించి వారిని సంతోష పఱచుము. (సూర్యోదయమైన పిమ్మట దశా పవిత్రముచే శుద్ధి చేయఁబడిన సోమరసముతో కూడియున్న అంతర్యామ సంజ్ఞక పాత్రమును గ్రహించవలెను.)

2. ఈ మంత్రమున కర్థ తాత్పర్యములకు, 2 వ యనువాకము నందలి 3, 4 మంత్రముల వ్యాఖ్యానము చూడ వలసినది. అపానాయ=అపాన వాయు దేవతా సంతోషమునకై. (ఉపాంశు గ్రహమును, అంతర్యామ గ్రహమును కలిపి ఖరప్రదేశము నందుంచవలెను.)

తృతీయానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే చతుర్థోఽనువాకః।

మూలము: [1]ఆ వాయో భూష శుచిపా ఉప న స్సహస్రం తే నియుతో విశ్వవార। ఉపో తే అన్ధో మద్య మయామి యస్య దేవ దధిషే పూర్వపేయమ్। ఉపయామగృహీతో ఽసి వాయవే త్వే న్ద్రవాయూ ఇమే సుతాః। ఉప ప్రయోభి రాగత మిన్దవో వా ముశన్తి హి। ఉపయామగృహీతో ఽసీ న్ద్రవాయుభ్యాం త్వై ష తే యోని స్సజోషాభ్యాం త్వా ॥౧॥

(ఆ వాయో త్రిచత్వారిగ్ంశత్)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే చతుర్థోఽనువాకః।

వేదార్థ దీపిక

1. అర్థము: హే వాయో!=ఓ వాయుదేవా!, (త్వమ్=నీవు, ఆగత్య=వచ్చి, గ్రహాన్=పాత్రములను) భూష=అలంకరించుము. హే శుచిపాః!=పరిశుద్ధమైన సోమరసమును త్రాగునట్టి యో వాయూ!, నః ఉప=మా దగ్గఱకు, ఆ (గచ్ఛ)=రమ్ము. హే విశ్వవార!=విశ్వవ్యాపకుఁడవైన వాయూ!, తే=నీకు, సహస్రమ్=సహస్ర సంఖ్యాకములైన, నియుతః=అశ్వములు, (సన్తి=కలవు.) తే=నీయొక్క, అన్ధః=సోమరస రూపమైన అన్నము, మద్యమ్=హర్షదాయకము. (తస్మాత్=అందువలన,) ఉపో=సమీపమునందు, (త్వామ్=నిన్ను) అయామి=పొందుచున్నాను. హే దేవ!=ఓ వాయుదేవా! యస్య=ఏ సోమ సంబంధమైన, (రసద్రవ్యము) పూర్వ పేయమ్=ప్రథమముననే త్రాగఁదగినది, (ఇతి మనః=అనెడి మనస్సును,) దధిషే=ధరించితివో!, (హే సోమరస!=ఓ సోమరసమా!, త్వమ్=నీవు,) ఉపయామ గృహీతః=పృథివీరూప దారు పాత్రముచేత గ్రహింపఁబడిన దానవు, అసి=అగుచున్నావు. త్వా=నిన్ను, వాయవే=వాయుదేవుని కొఱకు, గృహ్ణామి=గ్రహించుచున్నాను. హే ఇన్ద్రవాయూ!=ఓ యింద్ర వాయుదేవతలారా! ఇమే=ఈ సోమలతలు, సుతాః=అభిషుతము లైనవి. (=రసము తీయఁబడినవి. తతః=అందువలన, యువామ్=మీరు,) ప్రయోభిః=ఈ సోమరస రూపాన్నములు కారణములుగా, ఉప=సమీపము నందు, ఆ గతమ్=రండు. హి=ఏ కారణము వలన, ఇన్దవః=సోమరసములు, వామ్=మిమ్ము, ఉశన్తి=కోరుచున్నవో. (హే సోమ!=ఓ సోమ రసమా!, త్వమ్=నీవు,) ఉపయామ గృహీతః=పృథివీ రూప దారు పాత్రముచేత గ్రహింపఁబడినదానవు, అసి=అగుచున్నావు. ఇన్ద్రవాయుభ్యామ్=ఇంద్ర వాయు దేవతల కొఱకు, త్వా=నిన్ను, (గృహ్ణామి=గ్రహించుచున్నాను. హే పాత్ర!=ఓ పాత్ర విశేషమా!) ఏషః=ఈ ఖర ప్రదేశము యొక్క ఒక భాగము, తే=నీకు, యోనిః=స్థానము. (తతః=అందువలన, అత్ర=ఈ స్థానమునందు) సజోషాభ్యామ్=సమాన ప్రీతి గల ఇంద్ర వాయుదేవతల కొఱకు, త్వా=నిన్ను, సాదయామి=ఉంచుచున్నాను.

తాత్పర్యము: ఓ వాయుదేవా! నీవు వచ్చి ఈ పాత్రమును అలంకరించుము. పరిశుద్ధమైన సోమరసమును త్రాగునట్టి వాయుదేవా! నీవు మా యొద్దకు రమ్ము. ఓ విశ్వవ్యాపకుడా! నీకు సహస్ర సంఖ్యాకములయిన అశ్వములు కలవు. నీయొక్క సోమరస రూపాన్నము హర్షదాయకము. నీవు సోమరసము ప్రథమముననే త్రాగుటకు తగినదిగా సంకల్పించితివి. కావున నేను నీ సమీపమును పొందుచున్నాను. ఓ సోమరసమా! నిన్ను వాయుదేవునికొఱకు పృథివీ రూపదారు పాత్రముచే గ్రహించుచున్నాను. ఓ యింద్ర వాయు దేవతలారా! సోమలతలనుండి రసము తీయఁబడినది. సోమరసము మిమ్ము కోరుచున్నది. కావున సోమరస కారణముగా మీరు మా సమీపమునకు రండు. ఓ సోమరసమా! నిన్ను ఇంద్ర వాయు దేవతల కొఱకు పృథివీ రూపదారు పాత్రముచే గ్రహించుచున్నాను. ఓ పాత్ర విశేషమా! ఈ ఖరైక దేశము నీకు స్థానము. కావున సమాన ప్రీతి గల ఇంద్ర వాయు దేవతల కొఱకు నిన్నిచ్చట ఉంచుచున్నాను. (ఈ మంత్రము పఠించుచు ఇంద్ర వాయు దేవతాకమైన పాత్రమును గ్రహించి దశా పవిత్రముచే పరిశుద్ధిచేసి ఖర ప్రదేశము నందొక వైపున ఆ పాత్రము నుంచవలెను.)

చతుర్థాను వాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే పఞ్చమోఽనువాకః।

మూలము: [1]అయం వాం మిత్రావరుణా సుత స్సోమ ఋతావృధా। మమేదిహ శ్రుతగ్ం హవమ్।
ఉపయామగృహీతోఽసి మిత్రావరుణాభ్యాం త్వై ష తే యోనిర్ ఋతాయుభ్యాం త్వా ॥౧॥
(అయం వాం విగ్ంశతిః)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే పఞ్చమోఽనువాకః।

వేదార్థ దీపిక

1. అర్థము: ఋతావృధా=సత్యమును వృద్ధి చేయునట్టి, హేమిత్రా వరుణా!=ఓ మిత్రా వరుణ దేవతలారా!, వామ్=మీ యొక్క, అయమ్=ఈ సోమము, సుతః=అభిషుతమైనది. ఇత్=కావున, ఇహ=ఈ యజ్ఞ కర్మయందు, మమ=నా యొక్క, హవమ్=ఆహ్వానమును, శ్రుతమ్=వినుఁడు. (హే సోమరస!=ఓ సోమరసమా!, త్వమ్=నీవు) ఉపయామ గృహీతః=పృథివీ వికారదారు పాత్రముచే గ్రహింపఁబడిన దానవు, అసి=అగుచున్నావు. త్వా=నిన్ను, మిత్రా వరుణాభ్యామ్=మిత్రా వరుణ దేవతల కొఱకు, (గృహ్ణామి=గ్రహించుచున్నాను హే పాత్ర!=ఓ పాత్ర విశేషమా!) ఏషః=ఈ ఖరైక దేశము, తే=నీకు, యోనిః=స్థానము. ఋతాయుభ్యామ్=సత్యమును కోరు మిత్రా వరుణుల కొఱకు, త్వా=నిన్ను (ఇహ=ఇచ్చట, సాదయామి=ఉంచుచున్నాను.)

తాత్పర్యము: సత్యమును వృద్ధిచేయునట్టి ఓ మిత్రా వరుణ దేవతలారా! ఈ సోమము రసము తీయఁబడినది. కావున ఈ యజ్ఞ కర్మయందు మీరు మా యాహ్వానమును వినుఁడు. ఓ సోమరసమా! నీవు పృథివీ వికారమైన దారు పాత్రముచే గ్రహింపఁబడిన దానవగుచున్నావు. మిత్రా వరుణుల కొఱకు నిన్ను గ్రహించుచున్నాను. ఓ పాత్రమా! ఈ ఖర ప్రదేశముయొక్క యొక భాగము నీకు స్థానము. సత్యమును కోరుచున్న మిత్రా వరుణుల కొఱకు నిన్నిచ్చట ఉంచుచున్నాను. (మిత్రా వరుణ దేవతాకమైన గ్రహమును గ్రహించి అందు సోమరసమును పోసి దానిని పాలతో మిశ్రమము చేసి ఖరైక దేశమునందా పాత్రము నుంచవలెను. 'ఋతా వృధా', 'మిత్రా వరుణా' అను పదములు ద్వివచనాంతములు. ఛాందసములు. లౌకిక సంస్కృతమున 'ఋతా వృధౌ', 'మిత్రా వరుణౌ' అని యుండును.)

పంచమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే షష్ఠోఽనువాకః।

(ఆశ్వినగ్రహాభిధానము)

మూలము: [1]యా వాం కశా మధుమ త్యశ్వినా సూనృతావతీ। తయా యజ్ఞం మిమిక్షితమ్। ఉపయామగృహీతో ఽస్య శ్విభ్యాం త్వై ష తే యోని ర్మాధ్వీభ్యాం త్వా ॥౧॥ (యా వా మష్టాదశ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే షష్ఠోఽనువాకః।

వేదార్థదీపిత

1. **అర్థము:** హే అశ్వినా!=ఓ అశ్వినీ దేవతలారా! వామ్=మీయొక్క, మధుమతీ=మాధుర్యము కలదియు, సూనృతావతీ=ప్రియ వచనోపేతయునగు, యా కశా=ఏ వాక్కు (అస్తి=కలదో,) తయా=ఆ వాక్కుచేత, యజ్ఞమ్=యజ్ఞమును, మిమిక్షితమ్=నిష్పాదనము చేయుఁడు. (హే సోమరస!=ఓ సోమరసమా!, త్వమ్=నీవు,) ఉపయామ గృహీతః=పృథివీ రూప దారుపాత్రముచే గ్రహింపఁబడిన దానవు, అసి=అగుచున్నావు. త్వా=నిన్ను, అశ్విభ్యామ్=అశ్వినీ దేవతల కొఱకు, (గృహ్ణామి=గ్రహించుచున్నాను. హే పాత్ర!=ఓ పాత్ర విశేషమా!) ఏషః=ఈ ఖరైక ప్రదేశము, తే=నీకు, యోనిః=స్థానము. మాధ్వీభ్యామ్=మధువుతోకూడి యున్న అశ్వినీ దేవతల కొఱకు, త్వా=నిన్ను, (అత్ర=ఇచ్చట, సాదయామి=ఉంచుచున్నాను.)

తాత్పర్యము: ఓ యశ్వినీ దేవతలారా! పరుషాక్షర రహితయు, ప్రియ వచన సహితయునగు మీ వాక్కుచే ఈ యజ్ఞమును నిర్వహింపుఁడు. ఓ సోమరసమా! నీవు పృథివీ వికార దారుపాత్రముచే గ్రహింపఁబడిన దానవగుచున్నావు. నిన్ను అశ్వినీ దేవతల కొఱకు గ్రహించు చున్నాను. ఓ పాత్ర విశేషమా! ఈ ఖరైక దేశము నీకు స్థానము. మధువుతో కూడిన అశ్వినీ దేవతల కొఱకు నిన్నిచట ఉంచుచున్నాను. (అశ్వినీ దేవతాకమైన పాత్రమునందు సోమ రసమునుంచి దానిని ఖరదేశైక భాగమునం దుంచ వలెను.)

షష్ఠానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే సప్తమోఽనువాకః

మూలము: [1]ప్రాతర్యుజౌ విముచ్యేథా మశ్వినా వేహ గచ్ఛతమ్। అస్య సోమస్య పీతయే। ఉపయామగృహీతో ఽస్యశ్విభ్యాం త్వైష తే యోని రశ్విభ్యాం త్వా ॥౧॥ (ప్రాతర్యుజా వేకాన్నవిగ్ంశతిః)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే సప్తమోఽనువాకః।

వేదార్థదీపిక

1. **అర్థము:** (ఆశ్విన గ్రహమును గ్రహించుటకై ఈ మంత్రాంతరము వికల్పితమైనది.) హే అశ్వినౌ=ఓ అశ్వినీ దేవతలారా! (యువామ్=మీరు) ప్రాతర్యుజౌ=ప్రాతఃకాలమునందే యజమానునితో కూడిన వారగుచు, విముచ్యేథామ్=ఇతర యజమానులచే విముక్తులు కండు. ఇహ=ఈ కర్మయందు, అస్య=ఈ సోమ రసముయొక్క, పీతయే=త్రాగుటకొఱకు, ఆగచ్ఛతమ్=రండు. (మిగిలిన మంత్ర భాగము పై మంత్రము వలెనే గ్రహించవలెను.

తాత్పర్యము: ఓ అశ్వినీ దేవతలారా! మీరు ప్రాతఃకాలము నందే యజమానునితో కూడిన వారై యితర యజమానులను విడువుఁడు. ఈ యజ్ఞ కర్మయందు సోమరసమును త్రాగుటకు రండు. (మిగిలిన తాత్పర్యము పూర్వోక్తము.)

సప్తమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే ఽష్టమోఽనువాకః ।

(శుక్రగ్రహాభిధానము.)

మూలము: [1]అయం వేన శ్చోదయ త్పృశ్నిగర్భా జ్యోతిర్జరాయూ రజసో విమానే। ఇమ మపాగ్ం సంగమే సూర్యస్య శిశుం న విప్రా మతిభీ రిహన్తి। ఉపయామగృహీతోఽసి శణ్డాయ త్వై ష తే యోని ర్వీరతాం పాహి ॥౧॥ (అయం వేనః షడ్వింశతిః)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే ఽష్టమోఽనువాకః॥

వేదార్థ దీపిక

1. అర్థము: అయమ్=ఈ యింద్రుఁడు, వేనః=అభీష్టుఁడు, జ్యోతిర్జరాయుః=జరాయువువలె తేజస్సుతో కూడినవాఁడునై, పృశ్నిగర్భాః=ఆదిత్య గర్భములైన ఉదకములను, రజసః=ధూళియొక్క, విమానే=విశేషమైన కలయిక గల భూమియందు, చోదయత్=వర్షించుచున్నాఁడు. విప్రాః=బ్రాహ్మణులు (=ఋత్విజులు) సూర్యస్య=సూర్యునకు, అపామ్=ఉదకములకు, సంగమే=కలయిక కలుగుచుండఁగా, ఇమమ్=ఈ యింద్రుని, శిశుం న=శిశువునువలె, (లాలయన్తః=లాలన చేయు చున్నవారై,) మతిభిః=మంత్ర సహితములైన ఆహుతులచే, రిహన్తి=యాగము చేయుచున్నారు. (హే శుక్రగ్రహ!=ఓ శుక్రగ్రహమా! త్వమ్=నీవు,) ఉపయామ గృహీతః=పృథివీ రూప దారుపాత్రముచేత గ్రహింపఁబడినదానవు, అసి=అగుచున్నావు. త్వా=నిన్ను, శణ్డాయ=శుక్రుని కుమారుఁడైన శండునికొఱకు, (గృహ్ణామి=గ్రహించుచున్నాను.) ఏషః=ఈ ఖరైక ప్రదేశము, తే=నీకు, యోనిః=స్థానము. (సః=అటువంటి నీవు,) వీరతామ్=(యజమానుని యొక్క) కర్మ శూరత్వమును, పాహి=రక్షించుము.

తాత్పర్యము: ఈ యింద్రుఁడు ఇష్టుఁడు, జరాయువు వలె చుట్టుకొని యున్న తేజస్సు కలవాఁడునై ఆదిత్య గర్భములైన యుదకములను ధూళితో కూడియున్న భూమియందు వర్షించుచున్నాఁడు. సూర్యునకు ఉదకములకు కలయిక ఏర్పడు చుండగా ఋత్విజులు ఈ యింద్రుని శిశువును వలె లాలన చేయుచున్నవారై మంత్ర సహితములైన ఆహుతులచే యజ్ఞము చేయుచున్నారు. ఓ శుక్ర గ్రహమా! నీవు పృథివీ రూప దారు పాత్రముచే గ్రహింపఁబడిన దానవగుచున్నావు. శుక్రపుత్రుఁడైన శండుని కొఱకు నిన్ను గ్రహించు చున్నాను. ఈ ఖరైక దేశము నీకు స్థానము. అటువంటి నీవు యజమానుని కర్మశూరత్వమును రక్షించుము. (యజమానుని కర్మదీక్షాపరునిగా చేయుమని భావము.) సూర్యరశ్మి వలన ఉదకములు ఆవిరిగా ఏర్పడినపుడు శిశువును లాలన చేసినట్లు ఋత్విజులు ఇంద్రుని మంత్ర యుక్తము అయిన ఆహుతులచే లాలన చేయుచు యజ్ఞము చేయుటచే ఇంద్రుఁడు వర్షము కురియించు చున్నాఁడు. కావున ఉదకములు సూర్య గర్భములని చెప్పఁబడినవి. ఈ విషయము వేదమునందు ఒకానొకచో ఈ క్రింది ప్రశ్నోత్తర రూపమున స్పష్టమైనది. "క్వేమా ఆపో ని విశన్తే! యదితోయాన్తి"=ఇక్కడ నుండి వెళ్లిన యుదకములు ఎచట నివసించుచున్నవి? ఇది ప్రశ్న. "అప స్సూర్యే సమాహితాః అభ్రాణ్యాపః ప్రపద్యన్తే"!=ఉదకములు సూర్యుని యందు చేరి యున్నవి. మేఘములు ఉదకములను పొందుచున్నవి. ఇది సమాధానము. "విన=కాన్తౌ" అను ధాతువు నుండి వేన శబ్దముత్పన్నమైనది. కాంతుఁడు=అభీష్టుఁడు, అని యర్థము. 'పృశ్ని' అనగా ఆదిత్యుఁడు. తస్య గర్భభూతాః పృశ్ని గర్భాః అని యర్థము.)

అష్టమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే నవమోఽనువాకః।

మూలము: [1]తం ప్రత్నథా పూర్వథా విశ్వథే మథా జ్యేష్ఠతాతిం బర్హిషదగ్ం సువర్విదం ప్రతీచీనం వృజనం దోహసే గిరాఽఽశుం జయన్త మను యాసు వర్ధసే। ఉపయామగృహీతో ఽసి మర్కాయ త్వైష తే యోనిః ప్రజాః పాహి ॥౧॥ (తగ్ం షడ్విగ్ం శతిః)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే నవమోఽనువాకః॥

వేదార్థదీపిక

1. అర్థము: (హే ఇన్ద్ర!=ఓ యింద్రుఁడా! యః త్వమ్=ఏ నీవు) ప్రతీచీనమ్=మాకు ప్రతికూలమైన, వృజనమ్=విడువఁదగిన (అశ్రద్ధ, ఆలస్యము మొదలుగాఁ గల) దోషమును, దోహసే=నశింపఁ జేయుచున్నావో, యాసు=ఏ కర్మల యందు, ఆశుమ్=శీఘ్రకారియు, జయన్త మను=సమ్యగనుష్ఠానముచే ఇతర యజమానునికంటె నతిశయముగ నున్న వాఁడునగు యజమాను ననుసరించి, (సోమపానేన=సోమపానముచేతను,) గిరా=స్తుతి చేతను, వర్ధసే=వృద్ధి నొందుచున్నావో!, ప్రత్నథా=ప్రాచీన భృగ్వాది మహర్షుల వలెను, పూర్వథా=పిత్రాదుల వలెను, విశ్వథా=వెనుకటి సర్వ యజమానుల వలెను, ఇమథా=వర్తమాన యజమానుల వలెను, జ్యేష్ఠతాతిమ్=జ్యేష్ఠుఁడవును, బర్హిషదమ్=యాగమునందు సన్నిహితుఁడవుగా నున్న వాఁడవును, సువర్విదమ్=(యజ్ఞకర్తకు) స్వర్గము నీయవలెనని తెలిసిన వాఁడవునగు, తమ్=ఆ యింద్రుఁడవైన నిన్ను, స్తుమః=స్తోత్రము చేయుచున్నాము. (హే మన్థిగ్రహ!=ఓ మన్థిగ్రహమా! త్వమ్=నీవు) ఉపయామ గృహీతః=పృథివీరూప దారుపాత్రముచే గ్రహింపఁబడిన దానవు, అసి=అగుచున్నావు. త్వా=నిన్ను, మర్కాయ=శుక్ర పుత్రుఁడైన మర్కునికొఱకు, (గృహ్ణామి=గ్రహించుచున్నాను.) ఏషః=ఈ ఖరైక దేశము, తే=నీకు, యోనిః=స్థానము. (త్వమ్=నీవు,) ప్రజాః=యజమానుని ప్రజలను, పాహి=రక్షింపుము.

తాత్పర్యము: ఓ యింద్రుఁడా! పురాతనులైన భృగ్వాది మహర్షుల వలెను, పిత్రాదుల వలెను, గతించిన సర్వ యజ్ఞకర్తల వలెను, ఇప్పుడున్న యజ్ఞకర్తల వలెను నిన్ను స్తోత్రము చేయుచున్నాను. నీవు దేవతలలో జ్యేష్ఠుఁడవు. యజ్ఞకర్తలకు స్వర్గము నీయవలెనని తెలిసినవాఁడవు. యజమానుని సంబంధి యగు ఆలస్యాదిరూప దోషమును నశింపఁజేయువాఁడవు. యజ్ఞములందు శీఘ్రకారియు, సమ్యగనుష్ఠానముచే ఇతర యజమానుని కంటె అతిశయించినవాఁడు నగు యజమానునితో కూడ నీవు సోమపానముచేతను స్తుతిచేతను వృద్ధి నొందుచున్నావు. ఓ 'మన్థి'యనుగ్రహ విశేషమా! నీవు పృథివీరూప దారుపాత్రముచే గ్రహింపఁబడిన దానవగుచున్నావు. శుక్రపుత్రుఁడగు మర్కునికొఱకు నిన్ను గ్రహించుచున్నాను. ఈ ఖరైక దేశము నీకు స్థానము. నీవు యజమానుని ప్రజలను రక్షించుము '(మన్థి' యనుపేరు గల పాత్ర విశేషమునందు సక్తువులను వండి యా పాత్రమును ఖరప్రదేశమున నొకచో నుంచవలెను. 'ప్రత్నథా' ఇత్యాది పదములందలి 'థా' ప్రత్యయము ఉపమార్థకము. 'జ్యేష్ఠతాతిమ్' – అను పదము నందలి 'తాతి' ప్రత్యయము స్వార్థకము.)

నవమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే దశమోఽనువాకః ।

(ఆగ్రయణ గ్రహాభిధానము)

మూలము: ¹యే దేవా దివ్యేకాదశ స్థ పృథివ్యా మధ్యేకాదశస్థా ప్సుషదో మహినై కాదశ స్థ తే దేవా యజ్ఞ మిమం జుషధ్వ ముపయామగృహీతో ఽస్యా గ్రయణో ఽసి స్వాగ్రయణో జిన్వ యజ్ఞం జిన్వ యజ్ఞపతి మభి సవనా పాహి విష్ణు స్త్వాం పాతు విశం త్వం పాహి న్ద్రియేణై ష తే యోని ర్విశ్వేభ్య స్త్వా దేవేభ్యః ॥౧॥ (యే దేవా స్త్రిచత్వారిగ్ం శత్)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే దశమోఽనువాకః

వేదార్థదీపిక

1. అర్థము: హే దేవాః=ఓ దేవతలారా!, యే=(యూయమ్,) ఏ మీరు, దివి=ద్యులోకమునందు, ఏకాదశ=ఏకాదశ సంఖ్యాకులుగా, స్థ=ఉంటున్నారో, పృథివ్యామ్+అధి=భూలోకమునందును, ఏకాదశ=ఏకాదశ సంఖ్యాకులుగా, స్థ=ఉంటున్నారో, మహినా=స్వమహిమచేత, అప్సుషదః=జలోపలక్షితమైన అంతరిక్షము నందున్నట్టి మీరు, ఏకాదశ=ఏకాదశ సంఖ్యాకులుగా, స్థ=ఉంటున్నారో, తే దేవాః=ఆ దేవతలందఱు, ఇమం యజ్ఞమ్=ఈ యజ్ఞమును, జుషధ్వమ్=సేవింపుఁడు. (హే సోమ!=ఓ సోమరసమా! త్వమ్=నీవు) ఉపయామ గృహీతః=స్థాలీరూప పార్థివ పాత్రముచేత గ్రహింపఁబడిన దానవు, అసి=అగుచున్నావు. (హే పాత్ర!, త్వమ్) ఆగ్రయణః='ఆగ్రయణ' మనుపేరు కల దానవు, అసి=అగుచున్నావు. స్వాగ్రయణః=శ్రేష్ఠత్వమును పొందించునట్టి, (త్వమ్=నీవు,) యజ్ఞమ్=యజ్ఞమును, జిన్వ=సంతోష పఱచుము. యజ్ఞపతిమ్=యజ్ఞ కర్తను, జిన్వ=సంతోష పఱచుము. సవనా=సోమాభిషవములను, అభి పాహి=అభిముఖముగ పాలించుము. విష్ణుః=విష్ణు దేవుఁడు, త్వామ్=నిన్ను, పాతు=రక్షించుఁగాక. త్వమ్=(విష్ణు పాలితమైన) నీవు, విశమ్=యజమానుని యొక్క ప్రజను, ఇంద్రియేణ=సామర్థ్య ప్రదానముచేత, పాహి=రక్షించుము. ఏషః=ఈ ఖరప్రదేశము, తే=నీకు, యోనిః=స్థానము. విశ్వేభ్యః దేవేభ్యః=సర్వ దేవతల కొఱకు, త్వా=నిన్ను, (అత్ర=ఈ ఖరప్రదేశమునందు, సాదయామి=ఉంచుచున్నాను.)

తాత్పర్యము: ఓ దేవతలారా! ద్యులోకమునందు, పృథివ్యంతరిక్ష లోకములందును మీ మహిమచే పదునొకండుగురుగా నుంటున్న మీరందఱు ఈ యజ్ఞమును సేవింపుఁడు. ఓ సోమరసమా! నీవు స్థాలీరూపముగా నున్న పృథివీ పాత్రముచే గ్రహింపఁబడిన దానవగుచున్నావు. ఓ పాత్ర విశేషమా! నీవు ఆగ్రయణ మనుపేరు గల దానవు. యజ్ఞమునకు బాగుగ శ్రేష్ఠత్వమును గలుగఁజేయునట్టి నీవు ఈ యజ్ఞమును రక్షించుము. సవనములను (=సోమాభిషవములను) ప్రధానముగ రక్షించుము. విష్ణువు నిన్ను రక్షించుఁగాక. విష్ణు రక్షితమైన నీవు యజమానుని యొక్క సంతానమును సామర్థ్యము నిచ్చి రక్షించుము. ఈ ఖరప్రదేశము నీకు స్థానము. సమస్త దేవతలకొఱకు నిన్నిచట నుంచుచున్నాను. (ఈ మంత్రము చెప్పుచు ఆగ్రయణ మనుపేరు గల స్థాలీ రూప గ్రహమునందు సోమరసమును పోసి ఆ పాత్రమును ఖరప్రదేశమునం దుంచవలెను.)

దశమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠక ఏకాదశోఽనువాకః।

మూలము: [1]త్రిగ్ంశత్త్రయశ్చ గణినో రుజన్తో దివగ్ం రుద్రాః పృథివీం చ సచన్తే। ఏకాదశాసో అప్సుషద స్సుతగ్ం సోమం జుషన్తాగ్ం సవనాయ విశ్వే। ఉపయామగృహీతో ఽస్యాగ్రయణో ఽసి స్వాగ్రయణో జిన్వ యజ్ఞం జిన్వ యజ్ఞపతి మభి సవనా పాహి విష్ణు స్త్వాం పాతు విశం త్వం పాహి న్ద్రియేణైష తే యోని ర్విశ్వేభ్య స్త్వా దేవేభ్యః ॥౧॥

(త్రిగ్ంశ ద్ద్విచత్వారిగ్ంశత్)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టక చతుర్థప్రపాఠక ఏకాదశోఽనువాకః।

వేదార్థ దీపిక

1. అర్థము: (యే దేవా ఇత్యాది మంత్ర స్థానమున శత్రుమంతునకై ఈ మంత్రాంతర మభిహితమైనది.) గణినః=ఏకాదశ సంఖ్యాకములయిన మూఁడు గణములు గల, త్రింశత్త్రియశ్చ=(అ)ముప్పది ముగ్గురు దేవతలును, రుజన్తః=శత్రువులను నశింపఁ జేయువారును, రుద్రాః=శత్రు స్త్రీలను ఏడ్పించువారునై, (కేచన=కొందఱు) దివమ్=స్వర్గమును, (కేచన=కొందఱు) పృథివీం చ=పృథివిని, సచన్తే=సేవించుచున్నారు. (శిష్టాః=మిగిలిన) ఏకాదశాసః=పదునొకండుగురు దేవతలును, అప్సుషదః=జలోపలక్షితమైన అంతరిక్షమునందు ఉంటున్నవారు. విశ్వే=అందఱు దేవతలును, సుతమ్=అభిషుతమైన, సోమమ్=సోమమును, సవనాయ=తృతీయ సవనము కొఱకు, జుషన్తామ్=సేవింతురుగాక. (మిగిలిన మంత్రమున కర్థము దశమానువాక వ్యాఖ్యానమున వ్రాయఁబడినది.)

తాత్పర్యము: మూఁడు పదునొకండు సంఖ్యలు గల దేవగణములు శత్రువులను నశింపఁ జేయుచున్నవారును, శత్రు స్త్రీల నేడ్పించు చున్నవారునై వారిలో కొందఱు ద్యులోకమునందును, మఱికొందఱు భూలోకమునందును ఉంటున్నారు. మిగిలిన పదునొకండుగురు అంతరిక్షమున నుంటున్నారు. ఆ సమస్త దేవతలు తృతీయ సవనమునకై అభిషుతమైన సోమరసమును సేవింతురుగాక. (వినియోగము పై మాదిరిగానే.)

ఏకాదశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే ద్వాదశోఽనువాకః।

(ఉక్థ్యగ్రహాభిధానము.)

మూలము: [1]ఉపయామగృహీతోఽసి స్వాహేన్ద్రాయ త్వా బృహద్వతే వయస్వత ఉక్థాయువే యత్త ఇన్ద్ర బృహ ద్వయ స్తస్మై త్వా విష్ణవే త్వైష తే యోని రిన్ద్రాయ త్వో క్థాయువే ॥౧॥

(ఉపయామగృహీతో ద్వావిగ్ంశతిః)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే ద్వాదశోఽనువాకః।

వేదార్థ దీపిక

1. అర్థము: (హే సోమః=ఓ సోమమా!, త్వమ్=నీవు) ఉపయామ గృహీతః=ఉపయామ మను స్థాలిచేత గ్రహింపఁబడిన దానవు, అసి=అగుచున్నావు. త్వా=నిన్ను, బృహద్వతే=బృహత్సామ మను ఋక్కు నభిలషించువాఁడును, వయస్వతే=సోమరస రూపమైన అన్నము కలవాఁడును, ఉక్థాయువే=సామవిశేషమును కోరుచున్నవాఁడు నగు, ఇన్ద్రాయ=ఇంద్రుని కొఱకు (గృహ్ణామి=గ్రహించుచున్నాను.) హే ఇన్ద్ర!=ఓ యింద్రా!, తే=నీకు, యత్=ఏ, బృహత్=గొప్పది యగు, వయః=సోమరూపమైన అన్నము, (అస్తి=కలదో) తస్మై=ఆ సోమరసమును త్రాగుటకొఱకు, త్వా=నిన్ను, (ప్రార్థయే=ప్రార్థించుచున్నాను. హే సోమ!=ఓ సోమరసమా!) త్వా=నిన్ను, విష్ణవే=విష్ణువు కొఱకు, (గృహ్ణామి=గ్రహించుచున్నాను.) ఏషః=ఈ ఖరప్రదేశము, తే=నీకు, యోనిః=స్థానము. ఉక్థాయువే=ఉక్థ శస్త్రప్రియుఁడైన, ఇన్ద్రాయ=ఇంద్రుని కొఱకు, త్వా=నిన్ను (అత్ర=ఈ ఖరప్రదేశమునందు, సాదయామి=ఉంచుచున్నాను. ఉక్థమ్=ఏకాక్షర ఛన్దస్సు గల సామవిశేషము.)

తాత్పర్యము: ఓ సోమమా! నీవు ఉపయామ మను స్థాలిచే గ్రహింపఁ బడుచున్నావు. బృహత్సామ ప్రియుఁడును, సోమ రసాన్నము కలవాఁడును, ఉక్థమను సామవిశేషము నభిలషించువాఁడు నగు ఇంద్రుని కొఱకు నిన్ను గ్రహించుచున్నాను. ఓ యింద్రా! ఆ సోమరసమును త్రాగుటకై నిన్ను కోరుచున్నాను. ఓ సోమ రసమా! నిన్ను విష్ణువు కొఱకు గ్రహించుచున్నాను. ఈ ఖరప్రదేశము నీకు స్థానము. ఉక్థ సామప్రియుఁడైన యింద్రుని కొఱకు నిన్ను ఈ ఖరప్రదేశమునందుంచుచున్నాను. (ఉక్థ సామ పూతమైన సోమరసమును ఉక్థ్యమను గ్రహములోనికి తీసికొని ఆ పాత్రమును ఖరప్రదేశము నందుంచవలెను.)

ద్వాదశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే త్రయోదశోఽనువాకః।

మూలము: [1]మూర్ధానం దివో అరతిం పృథివ్యా వైశ్వానర మృతాయ జాత మగ్నిమ్। కవిగ్ం సమ్రాజ మతిథిం జనానా మాస న్నా పాత్రం జనయన్త దేవాః। ఉపయామగృహీతో ఽస్యగ్నయే త్వా వైశ్వానరాయ ధ్రువో ఽసి ధ్రువక్షితి ర్ధ్రువాణాం ధ్రువతమో ఽచ్యుతానా మచ్యుతక్షిత్తమ ఏష తే యోని రగ్నయే త్వా వైశ్వానరాయ ॥౧॥ (మూర్ధానం పఞ్చత్రిగ్ంశత్)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే త్రయోదశోఽనువాకః।

వేదార్థదీపిక

1. అర్థము: దివః=ద్యులోకమునకు, మూర్ధానమ్=శిరస్సు వంటి సూర్యుని వలె ప్రకాశించువాఁడును, పృథివ్యాః=భూమికి, అరతిమ్=ఉపరతి లేనివాఁడును, వైశ్వానరమ్=వైశ్వా నరుఁడను పేరు కలవాఁడును, ఋతాయ=యజ్ఞము కొఱకు, జాతమ్=పుట్టినవాఁడును, కవిమ్=(భక్తుల ననుగ్రహించుటను) తెలిసిన వాఁడును, సమ్రాజమ్=బాగుగ ప్రకాశించు వాఁడును, జనానామ్=యజమానులకు, అతిథిమ్=సత్కార యోగ్యుఁడు నగు, అగ్నిమ్=అగ్నిహోత్రుని, (వయమ్=మేము, స్తుమః=స్తోత్రము చేయుచున్నాము.) ఆసన్=(ఇటువంటి అగ్నియొక్క) ముఖమునందు, దేవాః=దేవతలు, పాత్రమ్=(హోమము చేయుటకు) చమస రూప సోమ పాత్రమును, ఆ జనయన్త=(ఇంద్ర వ్వాయాది) స్థానముల నన్నిటియందు పుట్టించిరి. (హే సోమ!=ఓ సోమరసమా! త్వమ్=నీవు) ఉపయామ గృహీతః=ఉపయామమను స్థాలిచేత గ్రహింపఁబడిన దానవు, అసి=అగుచున్నావు. వైశ్వానరాయ=వైశ్వా నరుఁడను పేరు గల, అగ్నయే=అగ్నికొఱకు, త్వా=నిన్ను (గృహ్ణామి=గ్రహించుచున్నాను. హే గ్రహ!=ఓ సోమగ్రహమా! త్వమ్=నీవు,) ధ్రువః=ధ్రువమను పేరుగల దానవు, ధ్రువక్షితిః=స్థిర నివాసము కలదానవును, అసి=అగుచున్నావు. ధ్రువాణామ్=ఆదిత్య స్థాల్యాదులలో, ధ్రువతమః=మిక్కిలి స్థిరమైన దానవు. అచ్యుతానామ్=నశించని వానిలో, అచ్యుతక్షిత్తమః=మిక్కిలి నశించని దానవు. ఏషః=ఈ ఖరప్రదేశము, తే=నీకు, యోనిః=స్థానము. వైశ్వానరాయ=వైశ్వానరాగ్ని కొఱకు, త్వా=నిన్ను (అత్ర=ఈ ఖరప్రదేశమునందు. సాదయామి=ఉంచుచున్నాను.)

తాత్పర్యము: యజ్ఞకర్తల సత్కారమున కర్హుఁడైన వైశ్వానరాగ్నిని మేము నుతించుచున్నాము. ఈ వైశ్వానరాగ్ని ద్యులోకమునకు శిరస్సువంటి సూర్యుని వలె ప్రకాశించువాఁడు. భూమియందు విశ్రాంతి లేనివాఁడు. యజ్ఞముల కొఱకు పుట్టి తన భక్తుల ననుగ్రహించు విధము తెలిసినవాఁడు. దేవతలు ఇటువంటి యగ్ని ముఖమునందు హోమము చేయుటకై చమస రూప సోమగ్రహమును వాయ్వాది స్థానముల నన్నిటియందు కల్పించిరి. ఓ సోమమా! నీవు ఉపయామమను స్థాలిచే గ్రహింపఁబడుచున్నావు. వైశ్వానరాగ్ని కొఱకు నిన్ను స్వీకరించుచున్నాను. ఓ సోమగ్రహమా! నీవు ధ్రువమను పేరు గల దానవు, స్థిరనివాసము కలదానవు నగుచున్నావు. ఆదిత్య స్థాల్యాదులలో మిక్కిలి దృఢమైన దానవు. నశించని వానిలో మిక్కిలి నశించని దానవు. ఈ ఖరప్రదేశము నీకు స్థానము. వైశ్వానరాగ్ని కొఱకు నిన్ను స్థానము నందుంచుచున్నాను. (సోమరసపూర్ణమైన ధ్రువ మనుగ్రహమును ఖరప్రదేశము నందుంచవలెను.)

త్రయోదశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే చతుర్దశో౽నువాకః।

(ఋతుగ్రహాభిధానము.)

మూలము: [1]మధుశ్చ మాధవ శ్చ శుక్రశ్చ శుచిశ్చ నభశ్చ నభస్య శ్చేష శ్చోర్జశ్చ సహశ్చ సహస్యశ్చ తపశ్చ తపస్య శ్చోపయామగృహీతో౽సి సగ్ంసర్పో౽ స్యగ్ంహస్పత్యాయ త్వా ॥౧॥

(మధు స్త్రిగ్ంశత్)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే చతుర్దశో౽నువాకః।

వేదార్థ దీపిక

1. అర్థము: (హే సోమ!=ఓ సోమరసమా! త్వమ్=నీవు,) ఉపయామ గృహీతః=పృథివీ రూప దారు పాత్రముచే గ్రహింపఁబడినదానవు, చ=మతియు, మధుః=చైత్రమాస స్వరూపమును, మాధవశ్చ=వైశాఖమాస స్వరూపమును, శుక్రశ్చ=జ్యేష్ఠమాస స్వరూపమును, శుచిశ్చ=ఆషాఢమాస స్వరూపమును, నభశ్చ=శ్రావణమాస స్వరూపమును, నభస్యశ్చ=భాద్రపదమాస స్వరూపమును, ఇషశ్చ=ఆశ్వీయుజమాస స్వరూపమును, ఊర్జశ్చ=కార్తికమాస స్వరూపమును, సహశ్చ=మార్గశీర్షమాస స్వరూపమును, సహస్యశ్చ=పుష్యమాస స్వరూపమును, తపశ్చ=మాఘమాస స్వరూపమును, తపస్యశ్చ=ఫాల్గుణమాస స్వరూపమును, సంసర్పః=అధికమాస స్వరూపమును, అహస్పత్యశ్చ=శూన్యమాస స్వరూపమును, అసి=అగుచున్నావు. త్వా=నిన్ను, అహస్పత్యాయ=అహస్పత్య దేవతకొఱకు, (గృహ్ణామి=గ్రహించుచున్నాను.)

తాత్పర్యము: ఓ సోమరసమా! నీవు పృథివీరూప దారుపాత్రముచే గ్రహింపఁబడినదానవు, చైత్ర వైశాఖాది మాసముల స్వరూపమును నగుచున్నావు. నిన్ను అహస్పత్య దేవతకొఱకు గ్రహించుచున్నాను. (సోమరసమును ఋతుగ్రహ మనెడి పాత్రమునందు నింపవలెను.

చతుర్దశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే పంచదశోఽనువాకః।

మూలము: ¹ఇన్ద్రాగ్నీ ఆగతగ్ం సుతం గీర్భి ర్నభో వరేణ్యమ్। అస్య పాతం ధియే షితా। ఉపయా మగృహీతోఽ సీ న్ద్రాగ్నిభ్యాం త్వైష తే యో ని రిన్ద్రాగ్నిభ్యాం త్వా ॥౧॥

(ఇన్ద్రాగ్నీ విగ్ం శతిః)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే పంచదశోఽనువాకః।

వేదార్థదీపిక

1. అర్థము: హే ఇన్ద్రాగ్నీ!=ఓ యింద్రాగ్నులారా!, గీర్భిః=(స్తుతుల రూపములయిన)వాక్కులతో, (యుక్తమ్=కూడిన దియు,) నభః=స్వర్గవాసులైన దేవతలచే, వరేణ్యమ్=కోరఁదగినదియు, సుతమ్=అభిషవము చేయఁబడిన దియునగు సోమరసమునుగూర్చి, ఆగతమ్=రండు. ధియా=బుద్ధిచే, ఇషితా=ప్రార్థింపఁబడిన, (యువామ్=మీరు) అస్య=ఈ సోమసంబంధియైన స్వీయాంశమును, పాతమ్=త్రాగుఁడు. (హే సోమ!=ఓ సోమరసమా!, త్వమ్=నీవు,) ఉపయామ గృహీతః=పృథివీ వికార దారుపాత్రముచే గ్రహింపఁబడినదానవు, అసి=అగు చున్నావు. ఇన్ద్రాగ్నిభ్యామ్=ఇంద్రాగ్ని దేవతలకొఱకు, త్వా=నిన్ను, (గృహ్ణామి=గ్రహించుచున్నాను.) ఏషః=ఈ ఖరప్రదేశము, తే=నీకు, యోనిః=స్థానము. (హే గ్రహ!=ఓ పాత్రవిశేషమా!) త్వా=నిన్ను, ఇన్ద్రాగ్నిభ్యామ్=ఇంద్రాగ్ని దేవతలకొఱకు, (అత్ర=ఈ ఖరప్రదేశమునందు, సాదయామి=ఉంచుచున్నాను. ఇచట నభశ్శబ్దము స్వర్గదేవతలకు ఉపలక్షకము. 'ఇషితా' అనునది ద్వివచనార్థకము.)

తాత్పర్యము: ఓ యింద్రాగ్నులారా! స్తోత్రయుక్తము, నభోవాసులైన దేవతలు కోరఁదగినదియు, అభిషవము చేయఁబడి నదియునగు సోమరసము నిమిత్తము రండు. సోమరసములోని మీ భాగమును త్రాగుఁడు. ఓ సోమ రసమా! నీవు పృథివీ వికార దారుపాత్రముచే గ్రహింపఁబడుచున్నావు. ఇంద్రాగ్ని దేవతలకొఱకు నిన్ను గ్రహించుచున్నాను. ఓ పాత్ర విశేషమా! ఈ ఖరప్రదేశము నీకు స్థానము. ఇంద్రాగ్ని దేవతల కొఱకు నిన్ను ఈ ఖరమునం దుంచుచున్నాను.)

పంచదశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే షోడశోఽనువాకః।

(వైశ్వదేవ గ్రహాభిధానము.)

మూలము: ఓమాస శ్చర్షణీధృతో విశ్వే దేవాస ఆగత। దాశ్వాగ్ంసో దాశుషః సుతమ్। ఉపయామ గృహీతో ఽసి విశ్వేభ్య స్త్వా దేవేభ్య ఏష తే యోని ర్విశ్వేభ్య స్త్వా దేవేభ్యః ॥౧॥

(ఓ మాసో విగ్ంశతిః)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే షోడశోఽనువాకః॥

వేదార్థ దీపిక

1. అర్థము: హే విశ్వేదేవాః=ఓ విశ్వేదేవ దేవతలారా!, ఓమాసః=రక్షించువారును, చర్షణీధృతః=మనుష్య పోషకులును, సుతమ్=అభిమతమైన సోమమును, దాశుషః=ఇచ్చునట్టి యజమానునకు, దాశ్వాంసః=పూర్వము ఫలము నిచ్చినవారునగు, (యూయమ్=మీరు) ఆగత=రండు. (హే సోమ!=ఓ సోమమా! త్వమ్=నీవు,) ఉపయామ గృహీతః=పృథివీ వికార దారుపాత్రముచే గ్రహింపఁబడినదానవు, అసి=అగుచున్నావు. త్వా=నిన్ను, విశ్వేభ్యః దేవేభ్యః=విశ్వేదేవ దేవతలకొఱకు, (గృహ్ణామి=గ్రహించుచున్నాను. హే గ్రహ!=ఓ పాత్ర విశేషమా!) ఏషః=ఈ ఖరప్రదేశము, తే=నీకు, యోనిః=స్థానము. విశ్వేభ్యః దేవేభ్యః=విశ్వేదేవ దేవతలకొఱకు, త్వా=నిన్ను, (అత్ర=ఇచట, సాదయామి=ఉంచుచున్నాను. (రక్షణము=అనిష్టనివారణము. పోషణము=ఇష్టమును కలుగఁజేయుట.)

తాత్పర్యము: ఓ విశ్వేదేవ దేవతలారా! రక్షకులు, మనుష్యపోషకులు, అభిమతమైన సోమరసము నిచ్చునట్టి యజమానునకు పూర్వము ఫలము నిచ్చినవారునగు మీరు రండు. ఓ సోమమా! నీవు పృథివీ వికార దారుపాత్రముచే గ్రహింపఁబడినదానవు. విశ్వేదేవ దేవతలకొఱకు నిన్ను గ్రహించుచున్నాను. ఓ పాత్ర విశేషమా! ఈ ఖరప్రదేశము నీకు స్థానము. విశ్వేదేవ దేవతలనిమిత్తము నిన్నిచట నుంచుచున్నాను, (వినియోగము పూర్వవత్తు.)

షోడశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే సప్తదశోఽనువాకః।

మూలము: [1]మరుత్వన్తం వృషభం వావృధాన మకవారిం దివ్యగ్ం శాస మిన్ద్రమ్। విశ్వా సాహ మవసే నూతనాయోగ్రగ్ం సహోదా మిహ తగ్ం హువేమ। ఉపయామ గృహీతో ఽసీ న్ద్రాయ త్వా మరుత్వత ఏష తే యోని రిన్ద్రాయ త్వా మరు త్వతే ॥౧॥

(మరుత్వన్తగ్ం షడ్విగ్ంశతిః)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే సప్తదశోఽనువాకః॥

వేదార్థ దీపిక

1. అర్థము: మరుత్వన్తమ్=మరుద్గణములతో కూడినవాఁడును, వృషభమ్=జలమును వర్షించువాఁడును, వావృధానమ్=కోరికలను వృద్ధి నొందించువాఁడును, అకవారిమ్=(వృత్రాసురాది)ప్రబల శత్రువులు కలవాఁడును, దివ్యమ్=ద్యులోకమునందుండువాఁడును, శాసమ్=దుష్టులను శిక్షించువాఁడును, విశ్వాసాహమ్=విశ్వమును పాలించుటకు సహనము కలవాఁడును, అవసే=రక్షణము కొఱకు, నూతనాయ + ఉగ్రమ్=వర్తమాన శత్రువు కొఱకు భయంకరుఁడును, సహోదామ్=బలప్రదుఁడుననగు, తమ్=అ, ఇన్ద్రమ్=ఇంద్రుని, ఇహ=ఈ యజ్ఞకర్మయందు, హువేమ=ఆహ్వానించెదము. (హే సోమ!, త్వమ్,) ఉపయామ గృహీతః, అసి. మరుత్వతే=మరుద్గణములతోఁగూడిన, ఇన్ద్రాయ, త్వా, (గృహ్ణామి. హే గ్రహ!, ఏషః, తే, యోనిః, మరుత్వతే, ఇన్ద్రాయ, త్వా, అత్ర, సాదయామి. అర్థము పూర్వోక్తము.)

తాత్పర్యము: ఈ యజ్ఞ కర్మయందు ఇంద్రు నాహ్వానించెదము. అ యింద్రుఁడు మరుద్గణములతో కూడినవాఁడు. జలమును వర్షించువాఁడు. కోరికలను వృద్ధి చేయువాఁడు. ఇప్పటి శత్రువులను రక్షించుటకై అ శత్రువులకు భయంకరుఁడుగ నుండువాఁడు: ద్యులోకవాసి; వృత్రాసురాది ప్రబల శత్రువులు కలవాఁడు. దుష్ట శిక్షకుఁడు. బలప్రదుఁడు. ఓ సోమమా! నీవు పృథివీరూప దారుపాత్రముచే గ్రహింపఁబడినదానవు. మరుద్గణములతో కూడిన ఇంద్రునికొఱకు నిన్ను గ్రహించుచున్నాను. ఓ పాత్రవిశేషమా! ఈ ఖరప్రదేశము నీకు స్థానము. మరుత్వంతుడైన ఇంద్రునికొఱకు నిన్నిచట నుంచుచున్నాను. (వినియోగము పూర్వమువలెనే.)

సప్తదశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే అష్టాదశో౽నువాకః।

(మరుత్వతీయ మాహేన్ద్రి గ్రహాభిధానము.)

మూలము: [1]ఇన్ద్ర మరుత్వ ఇహ పాహి సోమం యథా శార్యాతే అపిబ స్సుతస్య। తవ ప్రణీతీ తవ శూర శర్మ న్నావివాసన్తి కవయ స్సుయజ్ఞాః। ఉపయామగృహీతో ౽సీ న్ద్రాయ త్వా మరుత్వత ఏష తే యోని రిన్ద్రాయ త్వా మరుత్వతే। ॥౧॥ (ఇన్ద్ర మరుత్వ ఏకాన్నత్రిగ్ంశత్)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే అష్టాదశో౽నువాకః॥

వేదార్థదీపిక

1. అర్థము: మరుత్వ! మరుద్గణములతో కూడిన, హే ఇన్ద్ర!=ఓ యింద్రుండా! శార్యాతే='శర్యాతి' అను పేరుగల యజమానుని యజ్ఞమునందు, యథా=ఏ విధముగా, సుతస్య=అభిషుతమైన సోమముయొక్క, (అంశమ్=అంశమును,) అపిబః=త్రాగితివో; (తథా=ఆ విధముగా) ఇహ=ఈ యజ్ఞమునందు, సోమమ్=సోమరసమును, పాహి=త్రాగుము. ('పా=పానే' అను ధాతువునకు లోటి మధ్యమ పురుషైకవచనము.) హే శూర!=శూరుండవైన ఓ యింద్రా! తవ=నీ యొక్క, ప్రణీతీ=అనుజ్ఞచేత, సుయజ్ఞాః=మంచి యజ్ఞములుకల, కవయః=విద్వాంసులగు(పూర్వపు) యజమానులు, తవ=నీకు, శర్మన్(సతి)=సౌఖ్యము కలుగుచుండగా, అవివాసన్తి=పరిచర్య చేయుచున్నారు. (హే సోమ!, త్వమ్,) ఉపయామ గృహీతః, అసి. మరుత్వతే, ఇన్ద్రాయ, త్వా, గృహ్ణామి. హే మరుత్వతీయ గ్రహ!, ఏషః, తే, యోనిః. మరుత్వతే, ఇన్ద్రాయ, త్వా, (అత్ర, సాదయామి.)

తాత్పర్యము: మరుద్గణములతో కూడిన యింద్రా! నీవు శర్యాతి యను యజమానుని యజ్ఞమునందు అభిషుతమైన సోమరసమును త్రాగిన విధముగ ఈ యజ్ఞమునందు కూడ సోమరసమును త్రాగుము. శూరుండవైన యింద్రా! నీ యనుజ్ఞచేత పూర్వము యజ్ఞము చేసిన విద్వాంసులగు యజమానులు నీకు సుఖము కలుగునట్లు పరిచర్య చేసిరి. ఈ యజమానుఁడు కూడ ఆ విధముగ పరిచర్య చేయుచున్నాఁడని భావము. ('మరుత్వ' అను పదము సంబుద్ధ్యంతము వైదికము. దీనికి 'మరుత్వన్' అనునది లౌకిక సంస్కృత రూపము) "ఉపయామ గృహీతః" ఇత్యాదికము పూర్వము వలె గ్రహింపఁదగినది.

అష్టాదశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠక ఏకోనవింశోఽనువాకః।

మూలము: [1]మరుత్వా గ్ంం ఇన్ద్ర వృషభో రణాయ పిబా సోమ మనుష్వధం మదాయ। ఆ సిఞ్చస్వ జఠరే మధ్వ ఊర్మిం త్వగ్ం రాజాఽసి ప్రదివ స్సుతానామ్। ఉపయామగృహీతోఽసీన్ద్రాయ త్వా మరుత్వత ఏష తే యోని రిన్ద్రాయ త్వా మరుత్వతే ॥౧॥

(మరుత్వా న్నేకాన్న త్రిగ్ంశత్)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠక ఏకోనవింశోఽనువాకః।

వేదార్థదీపిక

1. అర్థము: హే ఇన్ద్ర!=ఓ యింద్రుఁడా!, మరుత్వాన్= మరుద్గణములతో కూడినవాఁడవును, వృషభః=జలమును వర్షించు వాఁడవునునగు, త్వమ్=నీవు, రణాయ=క్రీడార్థము, అనుష్వధమ్=(సవన సంబంధి పురోడాశ రూపమైన) అన్నము ననుసరించి యున్నదియగు, సోమమ్=సోమరసమును, పిబా=త్రాగుము. (అపి చ=మఱియు,) మదాయ=సంతోషమునకై, మధ్వః=త్రాగిన మధుర రసముయొక్క, ఊర్మి=సారమును, జఠరే=(నీ)జఠర ప్రదేశమునందు, ఆ సిఞ్చస్వ=స్థాపించుము. త్వమ్=నీవు, ప్రదివః=ప్రాప్యమైన స్వర్గమునకు, సుతానామ్= అభిషుతములైన సోమములకును, రాజా=రాజువు, అసి=అగుచున్నావు. (హే సోమ! త్వమ్,) ఉపయామ గృహీతః, అసి. మరుత్వతే, ఇన్ద్రాయ, త్వా, (గృహ్ణామి. హే గ్రహ!) ఏషః, తే, యోనిః. మరుత్వతే, ఇన్ద్రాయ, త్వా, (అత్ర, సాదయామి. అర్థము పూర్వోక్తము.)

తాత్పర్యము: ఓ యింద్రా! మరుద్గణవంతుఁడవును, జలమును వర్షించువాఁడవునునగు నీవు క్రీడార్థము సవనీయ పురోడాశ రూపాన్నము ననుసరించి సోమరసమును త్రాగుము. సంతోషమునకై త్రాగిన మధుర సోమరసము యొక్క సారమును నీ జఠరమునందు స్థాపించుము. నీవు ప్రాప్యమైన స్వర్గమునకు అభిషుతములైన సోమములకును రాజువు. (శేషము పూర్వమువలె గ్రహించవలసినది. అధ్వర్యుఁడు అభిక్షిత పాత్రముచే తృతీయ మరుత్వతీయ సోమరసమును గ్రహించి పాత్రమును ఖరప్రదేశమునం దుంచవలెను.)

ఏకోనవింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థ ప్రపాఠకే వింశోఽనువాకః।

(మాహేన్ద్ర గ్రహాభిధానము)

మూలము: [1]మహాగ్ం ఇన్ద్రో య ఓజసా పర్జన్యో వృష్టిమాగ్ం ఇవ। స్తోమై ర్వత్సస్య వావృధే। ఉపయామ గృహీతో ఽసి మహేన్ద్రాయ త్వై ష తే యోని ర్మహేన్ద్రాయ త్వా ॥౧॥

(మహానే కాన్నవిగ్ం శతిః)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే వింశోఽనువాకః।

వేదార్థ దీపిక

1. అర్థము: వృష్టిమాన్=వర్షముకల, పర్జన్య ఇవ=మేఘమువలె, యః ఇన్ద్రః=ఏ యింద్రుఁడు, ఓజసా=బలముచేత, మహాన్=గొప్పవాఁడు, (అభూత్=అయెనో, సః=ఆ యింద్రుఁడు) వత్సస్య=వత్స స్థానీయుఁడగు యజమానునియొక్క, స్తోమైః=స్తోత్రములచేత, వావృధే=వృద్ధినొందుఁగాక. (హే సోమః, త్వమ్,) ఉపయామ గృహీతః, అసి. మహేన్ద్రాయ, త్వా, (గృహ్ణామి.) (హే గ్రహః) ఏషః, తే, యోనిః. మహేన్ద్రాయ, త్వా, (అత్ర, సాదయామి. అర్థము పూర్వోక్తము.)

తాత్పర్యము: వర్షముకల మేఘమువలె బలముచే గొప్పవాఁడైన యింద్రుఁడు బాలునివంటి వాఁడగు యజమానునియొక్క స్తోత్రములచే వృద్ధి నొందుఁగాక. శేషము పూర్వోక్తము. (మహేంద్ర దేవతాక సోమరసమును శుక్ర గ్రహములోనికి గ్రహించి ఆ పాత్రమును ఖరప్రదేశము నందుంచ వలెను.) 'వృధు=వర్ధనే' అను ధాతువునకు 'లిడన్తము 'వవృధే 'యగును. 'వావృధే' ఇది ఛాందసము. మఱియు ఇది యిచట ప్రార్థనార్థమున ప్రయుక్త మైనది.)

వింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠక ఏకవింశోఽనువాకః

మూలము: [1]మహాగ్ం ఇన్ద్రో నృవదా చర్షణిప్రా ఉత ద్విబర్హా అమిన స్సహోభిః। అస్మద్రియ గ్వావృధే వీర్యాయోరుః పృథు స్సుకృతః కర్తృభి ర్భూత్। ఉపయామగృహీతో ఽసి మహేన్ద్రాయ త్వై ష తే యోని ర్మహేన్ద్రాయ త్వా ॥౧॥ (మహా న్నృవ త్షడ్విగ్ంశతిః)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థ ప్రపాఠక ఏకవింశోఽనువాకః॥

వేదార్థదీపిక

1. అర్థము: (అయమ్=ఈ,) మహాన్+ఇన్ద్రః=మహేంద్రుఁడు, నృవత్=మనుష్యునివలె, అచర్షణిప్రాః=భోగములచే మనుష్యులను పూరించువాఁడు, ఉత=మఱియు, ద్విబర్హాః=ప్రకృతి వికృతి రూపములైన రెండు సోమ యాగముల వృద్ధి కలవాఁడు, సహోభిః=బలములచేత, అమినః=సాటిలేనివాఁడునై, అస్మద్రియక్=మనవలె, వావృధే=వృద్ధినొందెను. వీర్యాయ=సామర్థ్యముకొఱకు, కర్తృభిః=యజ్ఞకర్తలచేత, ఉరుః=కీర్తిచే విపులుఁడు, పృథుః=బలముచే విస్తృతుఁడు, సుకృతః=బాగుగ వృద్ధి నొందింపఁ బడినవాఁడును, భూత్=(అభూత్)ఆయెను. (శేషము పూర్వవత్తు.)

తాత్పర్యము: ఈ మహేంద్రుఁడు, రాజామాత్యాదులు తమసేవకులకు నభీష్ట భోగములను గలుగఁ జేయువిధముగ, మనుష్యులకు భోగములను సమృద్ధిగ కలుగఁజేయువాఁడు. మఱియు ప్రకృతి వికృతి రూప సోమయాగము యొక్క వృద్ధి కలవాఁడు. బలముచే సాటి లేనివాఁడు. మన మితని యనుగ్రహము వలన వృద్ధినొందు విధముగ ఈ యింద్రుఁడు మన హవిస్సులచే వృద్ధినొందినవాఁడు. సామర్థ్య సిద్ధికై ఈ యింద్రుఁడు కీర్తి బలముల విషయమున సాటిలేని వృద్ధి నొందింపఁబడినవాఁడు. (శేషము పూర్వమువలెనే గ్రాహ్యము.)

ఏకవింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే ద్వావింశోఽనువాకః।

(ఆదిత్య గ్రహాభిధానము.)

మూలము: [1]కదాచన స్తరీ రసి నేన్ద్ర సశ్చసి దాశుషే। ఉపోపేన్ను మఘవ న్భూయ ఇన్ను తే దానం దేవస్య పృచ్యతే। ఉపయామగృహీతో ఽస్యాదిత్యేభ్య స్త్వా। [2]కదాచన ప్ర యుచ్ఛ స్యుభే ని పాసి జన్మనీ। తురీయా ఽఽదిత్య సవనం త ఇన్ద్రియ మా తస్థా వమృతం దివి। [3]యజ్ఞో దేవానాం ప్రత్యేతి సుమ్న మాదిత్యాసో భవతా మృడయన్తః। ఆ వోఽర్వాచీ సుమతి ర్వవృత్యా దగ్ంహోశ్చి ద్యా వరివో విత్తరాఽఽసత్। [4]వివస్వ అదిత్యైష తే సోమపీథ స్తేన మన్దస్వ తేన తృప్య తృప్యాస్మ తే వయం తర్పయితారో [5]యా దివ్యా వృష్టి స్తయా త్వా శ్రీణామి। ॥౧॥ (వః సప్తవిగ్ంశతి శ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే ద్వావింశోఽనువాకః॥

వేదార్థదీపిక

1. అర్థము: హే ఇన్ద్ర!=ఓ యింద్రుఁడా! (త్వమ్=నీవు) కదాచన=ఒకప్పుడును, స్తరీః=హింసకుఁడవు, నాసి=అగుట లేదు. దాశుషే=హవిస్సునిచ్చు యజమానుని కొఱకు, ఉపోపేన్ను=(యజమానునకు) అత్యంత సమీపమునకే, సశ్చసి=(ఫలము నిచ్చుటకై) పోవుచున్నావు. హే మఘవన్!=ఓ యింద్రా! భూయః ఇన్ను=మఱలనే, దేవస్య=దేవుఁడవైన, తే=నీకు, దానమ్=ఈయఁదగిన హవిస్సు, పృచ్యతే=సంబంధింపఁబడుచున్నది. (యజమానునిచే హవిస్సు ఈయఁబడుచున్నదని భావము.) (హే సోమ!=ఓ సోమరసమా! త్వమ్=నీవు) ఉపయామ గృహీతః, అసి. త్వా, ఆదిత్యేభ్యః=ఆదిత్య దేవతల కొఱకు, (గృహ్ణామి=గ్రహించుచున్నాను.)

తాత్పర్యము: ఓ యింద్రా! నీవు ఒకప్పుడును హింసకుఁడవు కావు. హవిస్సు నిచ్చు యజమానుని సమీపమునకే ఫలము నిచ్చుటకై వెళ్లు చున్నావు. ఓ యింద్రా! మఱల నీ కీయఁదగిన హవిస్సు యజమానునిచే ఈయఁబడుచున్నది. ఓ సోమమా! నీవు పృథివీ వికార రూప దారు పాత్రముచే గ్రహింపఁబడిన దానవగుచున్నావు. నిన్ను ఆదిత్యుని కొఱకు గ్రహించుచున్నాను. (సోమరసమును ఆదిత్య పాత్రములోనికి తీసికొనవలెను.)

2. అర్థము: హే ఇన్ద్ర!=ఓ యింద్రా!, కదాచన=ఒకప్పుడును (త్వమ్=నీవు) ప్రయుచ్ఛసి=ప్రమాదము చేయువాఁడ వగుటలేదు. ఉభే జన్మనీ=(యజమానునియొక్క) వర్తమాన భవిష్య జన్మల రెండిటిని, నిపాసి=అత్యంతము పాలించుచున్నావు. హే ఆదిత్య!=ఓ ఆదిత్యుఁడా!, తురీయ=మూఁడవదైన, సవనమ్=సవనము, తే=నీకు సంబంధమైనది. (తస్మిన్=ఆ సవనమునందు) ఇన్ద్రియమ్=ఇంద్రియాభివృద్ధి కారణమైన, అమృతమ్=అమృత సమానమైన దధి, (=పెరుగు) దివి=ద్యులోక సమానమైన హవిర్ధానమునందు, ఆ తస్థౌ=అభిముఖముగ నున్నది.

తాత్పర్యము: ఓ యింద్రా! నీవు ఒకప్పుడును ప్రమాదము చేయువాఁడవు కావు. యజమానుని వర్తమాన జన్మను, భావిజన్మను ఎక్కువగ పాలించుచున్నావు, ఓ యాదిత్యదేవా! మూఁడవ సవనము నీకు సంబంధించినది. ఆ సవనమునందు ఇంద్రియాభివృద్ధి హేతువును, అమృత సమానమునగు దధి ద్యులోక సమానమైన హవిర్ధానమునందు అభిముఖముగ నున్నది. (వినియోగము పూర్వోక్తమే. ఇచట 'యుచ్ఛ' ధాతువు ప్రమాదార్థకము. 'ప్ర' అనునది నిషేధార్థకము. 'తృతీయ' శబ్దము వర్ణ వ్యత్యయముచే 'తురీయ' అని ప్రయుక్తమైనది.)

3. అర్థము: యజ్ఞః=(ఈ) యజ్ఞ పురుషుఁడు, దేవానామ్=దేవతలయొక్క సుమ్నమ్=సుఖమును, ప్రత్యేతి=తెలిసికొనుచున్నాఁడు. హే ఆదిత్యాసః!=ఓ ఆదిత్యులారా! మృడయన్తః=(మమ్ము) సుఖపెట్టువారు, భవతా=కండు. వః=మీ యొక్క, సుమతిః=అనుగ్రహ రూపమైన సద్బుద్ధి, అర్వాచీ=నవీనులమైన మా యందు, (ప్రవృత్తా=ప్రవర్తించినదై,) ఆ వవృత్యాత్=అంతట నుండుఁగాక. యా=ఏ యనుగ్రహ బుద్ధి, అంహోశ్చిత్=(మా) పాపమునుండి, (వ్యావర్తతే=నివృత్త మగుచున్నదో,) సా=ఆ సుమతి, వరివో విత్తరా=అతిశయముగ (మా) పరిచర్యను గుర్తెఱిగినది, అసత్=అగుఁగాక. (భవతా=భవత)

తాత్పర్యము: ఈ యజ్ఞ పురుషుఁడు దేవతలకు సుఖము కలుగ జేయుచున్నాఁడు. ఓ యాదిత్యులారా! మమ్ము సుఖపెట్టువారు కండు. మీ యనుగ్రహ బుద్ధి మా యందు ప్రవృత్తమై విశేషముగ నుండుఁగాక. మా పాపమును నశింపఁజేయునట్టి మీ యనుగ్రహ బుద్ధి మా పరిచర్యను బాగుగ తెలిసికొనిన దగుఁగాక. ('అసత్' అనునది భూతకాలిక మైనను ఇచట ప్రార్థనార్థమున ప్రయుక్తమైనది.)

4. అర్థము: వివస్వః=విశిష్ట నివాసముకల, హే ఆదిత్య!=ఓ ఆదిత్యదేవా! ఏషః=ఇది (మూఁడవది) తే=నీకు, సోమపీథః=త్రాగఁదగిన సోమము. తేన=ఆ సోమపానము చేత, మన్దస్వ=సంతుష్టి నొందుము. తే=నీకు, తర్పయితారః=తృప్తిని గలిగించునట్టి, వయమ్=మేము, తృప్యాస్మ=తృప్తి నొందుదుము.

తాత్పర్యము: విశిష్ట నివాసముగల ఓ యాదిత్యదేవా! ఈ మూఁడవది నీకు త్రాగఁ దగిన సోమరసము. (యజ్ఞము యొక్క మూఁడవ దినమున అని యర్థము.) ఆ సోమ పానముచేత సంతుష్టి నొందుము. నిన్ను తృప్తి పఱచునట్టి మేము కూడ తృప్తి నొందెదము.

5. అర్థము: (హే సోమ!=ఓ సోమ రసమా!) యా=ఏది, దివ్యా=దేవ సంబంధమైన, వృష్టిః=వృష్టియో, (=వృష్టి కారణమో!) తయా=ఆ దివ్యవృష్టి కారణమైన దధితో, త్వా=నిన్ను, శ్రీణామి=కలుపుచున్నాను. (మిశ్రమము చేయుచున్నాను.)

తాత్పర్యము: ఓ సోమమా! దివ్యవృష్టికి కారణమైన దధితో నిన్ను మిశ్రమము చేయుచున్నాను. (సోమ రసమునందు దధిని మిశ్రమము చేయవలెను.)

ద్వావింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే త్రయోవింశోఽనువాకః।

(సావిత్ర గ్రహాభిధానము)

మూలము: [1]వామ మద్య సవిత ర్వామ ము శ్వో దివే దివే వామ మస్మభ్యగ్ం సావీః। వామస్య హి క్షయస్య దేవ భూరే రయా ధియా వామభాజ స్స్యామ। ఉపయామగృహీతో ఽసి దేవాయ త్వా సవిత్రే ॥౧॥ (వామం చతుర్విగ్ంశతిః)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే త్రయోవింశోఽనువాకః॥

వేదార్థదీపిక

1\. అర్థము: హే సవితః=ఓ సూర్యుఁడా!, అద్య=ఇప్పుడు, వామమ్=పొందఁదగిన కర్మఫలమును, అస్మభ్యమ్=మా కొఱకు, సావీః=ప్రోత్సహించుము. (=ఇమ్ము) శ్వః ఉ=రేపు కూడ, సావీః=ప్రేరేపించుము. దివే దివే=ప్రతి దినమునందును, సావీః=ఇమ్ము. హే దేవ!=ఓ సూర్యదేవా!, వామస్య=పొందఁ దగినదియు, భూరేః=విస్తీర్ణమైనదియు నగు, క్షయస్య=స్వర్గ నివాసముయొక్క, అయా=శ్రద్ధాయుతమైన, ధియా=బుద్ధిచేత, వామభాజః=పొందఁదగిన కర్మానుష్ఠానము కలవారము, స్యామ=అగుదుము. (హే సోమ!=ఓ సోమరసమా!, త్వమ్=నీవు) ఉపయామ గృహీతః, అసి. త్వా, సవిత్రే దేవాయ=సవితృ దేవునికొఱకు, (గృహ్ణామి=గ్రహించుచున్నాను.)

తాత్పర్యము: ఓ సూర్యదేవా! నీవు ఇప్పుడు రేపు పిమ్మట ప్రతి దినము పొందఁదగిన కర్మ ఫలమును మా కిమ్ము. స్వర్గ నివాసము నందలి శ్రద్ధతోఁ గూడిన బుద్ధిచేత మేము కర్మానుష్ఠానము కలవార మగుదుము. ఆ స్వర్గము పొందఁదగినది. విస్తీర్ణమైనది. ఓ సోమరసమా! నీవు పృథివీ వికార దారు పాత్రముచే గ్రహింపఁబడిన దానవగు చున్నావు. నిన్ను సూర్యదేవునికొఱకు గ్రహించుచున్నాను. (సోమ రసమును సూర్యదేవతాక గ్రహములోనికి గ్రహించవలెను.)

త్రయోవింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే చతుర్వింశోఽనువాకః ।

మూలము: [1]అదబ్ధేభి స్సవితః పాయుభి ష్ట్వగ్ం శివేభి రద్య పరి పాహి నో గయమ్। హిరణ్యజిహ్వ
స్సువితాయ నవ్యసే రక్షా మాకి ర్నో అఘశగ్ంస ఈశత। ఉపయామగృహీతోఽసి దేవాయ
త్వా సవిత్రే। ॥౧॥ (అదబ్ధేభి స్త్రయోవిగ్ంశతిః)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే చతుర్వింశోఽనువాకః।

వేదార్థ దీపిక

1\. అర్థము: హే సవితః=ఓ సూర్యదేవా! త్వమ్=నీవు, అదబ్ధేభిః=హింసింపఁబడనివియు, పాయుభిః=పాలించునవియు నగు, శివేభిః=మంగళముల (అనుగ్రహ విశేషముల) చేత, నః=మా యొక్క, గయమ్=గృహమును, పరిపాహి=అంతటను రక్షించుము. హిరణ్య జిహ్వః=హితము, రమణీయమునగు నాలుక గల, త్వమ్=నీవు, నవ్యసే=నూతనమైన, సువితాయ=స్వర్గ ప్రాప్తికొఱకు, రక్షా=(మా యీ కర్మను) రక్షించుము. నః=మాకు, అఘశగ్ంసః=పాపాపవాద నిందకుఁడవుగా, మా కి రీశత=సమర్థుఁడవు కాకుందువుగాక. (శేషము పూర్వవత్తు. రక్షా=రక్ష, హిరణ్యా, జిహ్వా, యస్య సః=హిరణ్య జిహ్వః హి=హితా. రణ్యా=రమణీయా. ఈ రెండును జిహ్వాశబ్ద విశేషణములు.)

తాత్పర్యము: ఓ సూర్యదేవా! నీవు అనుగ్రహ రూప మంగళములచే మా గృహమును పాలించుము. నీ యనుగ్రహములు హింసింపఁబడనివి. పాలింప సమర్థములు; హితకరమును రమణీయమునగు నీ నాలుక హితమును ప్రియమును వలుకునది. నీవు మమ్ము పాపాత్మకులనుగా నిందింపకుందువుగాక. (వినియోగము పూర్వోక్తము.)

చతుర్వింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే పఞ్చవింశోఽనువాకః ।

(సావిత్ర గ్రహాభిధానము)

మూలము। [1]హిరణ్యపాణి మూతయే సవితార ము పహ్వయే। స చేత్తా దేవతాపదమ్। ఉపయామగృహీతో

ఽసి దేవాయ త్వా సవిత్రే ॥౧॥ (హిరణ్యపాణిం చతుర్దశ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే పఞ్చవింశోఽనువాకః

వేదార్థదీపిక

1. అర్థము: హిరణ్య పాణిమ్=బంగారము హస్తమునందుఁగల, సవితారమ్=సూర్యుని, ఊతయే=రక్షణముకొఱకు, ఉపహ్వయే=పిలుచుచున్నాను. సః=ఆ సూర్యుఁడు, దేవతాపదమ్=దేవతారూప స్థానమును, చేత్తా=తెలిసినవాఁడు. (శేషము పూర్వవత్తు.)

తాత్పర్యము: బంగారము హస్తమునందుఁగల సూర్యుని రక్షణమునకై పిలుచుచున్నాను. ఆ సూర్యుఁడు మాకు యోగ్యమైన దేవతా స్థానమును తెలిసినవాఁడు. (శేషము పూర్వోక్తము.)

పంచ వింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే షడ్వింశోఽనువాకః।

మూలము: [1]సుశర్మా ఽసి సుప్రతిష్ఠానో బృహదుక్షే నమ ఏష తే యోని ర్విశ్వేభ్య స్త్వా దేవేభ్యః ॥౧॥

(సుశర్మా ద్వాదశ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే షడ్వింశోఽనువాకః॥

వేదార్థదీపిక

1. అర్థము: (హే వైశ్వదేవ గ్రహః=ఓ వైశ్వదేవ గ్రహమా!, త్వమ్=నీవు,) సుశర్మా=యోగ్యమైన సుఖము కల దానవు, సుప్రతిష్ఠానః=మంచి స్థితి కల దానవును, అసి=అగుచున్నావు. ఉక్షే=కొనియాడఁబడుచున్న, (తే=నీ కొఱకు,) బృహత్=గొప్పదియైన, నమః=నమస్కారము. ఏషః=ఈ ఖర ప్రదేశము, తే=నీకు, యోనిః=స్థానము. విశ్వేభ్యః దేవేభ్యః=విశ్వేదేవ దేవతల కొఱకు, త్వా=నిన్ను, (అత్ర=ఇచట, సాదయామి=ఉంచుచున్నాను.)

తాత్పర్యము: విశ్వేదేవ దేవతల సంబంధియగు గ్రహ విశేషమా! నీవు మంచి సుఖము కల దానవు, మంచి స్థానము కల దానవును. ఈ ఖర ప్రదేశము నీకు స్థానము. విశ్వేదేవ దేవతల కొఱకు నిన్ను ఇచట ఉంచుచున్నాను. (ద్రోణ కలశము నుండి వైశ్వదేవ గ్రహము లోనికి సోమ రసమును గ్రహించి దానిని ఖర ప్రదేశము నందుంచవలెను. "శౄ=హింసాయామ్" అను ధాతువు నుండి 'శర్మన్' శబ్ద ముత్పన్నమైనది. శృణాతీతి=శర్మ. అశుభమును బోఁగొట్టునది యని వ్యుత్పత్త్యర్థము.)

షడ్వింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే సప్తవింశోఽనువాకః।

(పాత్నీవత గ్రహాభిధానము)

మూలము: [1]బృహస్పతిసుతస్య త ఇన్దో ఇన్ద్రియావతః పత్నీవన్తం గ్రహం గృహ్ణామ్యగ్నా౩ ఇ పత్నీవా౩ః సజూర్దేవేన త్వష్ట్రా సోమం పిబ స్వాహా ॥౧॥ (బృహస్పతిసుతస్య పఞ్చదశ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే సప్తవింశోఽనువాకః॥

వేదార్థదీపిక

1. అర్థము: హే ఇన్దో!=ఓ సోమమా!, ఇన్ద్రియావతః=వీర్యవంతమును, బృహస్పతి సుతస్య=యజమానునిచే నభిషుతమునైన, తే=నీ యొక్క, పత్నీవంతమ్=పత్నీవద్దేవతాకమైన, గ్రహమ్=పాత్రమును, గృహ్ణామి=గ్రహించుచున్నాను. పత్నీవాః=పత్నీవంతుఁడవైన, హే అగ్నే!,=ఓ యగ్నీ!, త్వష్ట్రా దేవేన సజూః=త్వష్ట్ర దేవునితోకూడ, సోమమ్=సోమ రసమును, పిబ=త్రాగుము. స్వాహా=(ఇది నీకు) హుత మగుఁగాక.

తాత్పర్యము: పత్నీవంతుఁడవైన ఓ యగ్నీ! నీ వీ సోమ రసమును త్వష్ట్ర దేవునితో కూడ త్రాగుము. ఈ సోమ రసము వీర్యవంతమైనది. మఱియు యజమానునిచే అభిషుతమైనది. ఓ సోమమా! అటువంటి నీ సంబంధియైన పత్నీవద్దేవతాక పాత్రమును గ్రహించుచున్నాను. ఈ హవ్యము నీకు హుత మగుఁగాక. [1]బృహస్పతిః'-బృహతః=యజ్ఞస్య, పతిః=పాలకః. యజ్ఞమునకు పాలకుఁడగుటచే యజమానుఁడు బృహస్పతి శబ్దముచే చెప్పఁబడుచున్నాఁడు. సుతస్య=అభిషుతస్య అని యర్థము. (పత్నీవద్దేవతాకమైన గ్రహమును గ్రహించి సోమ రసమును హోమము చేయవలెను.)

సప్తవింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే ఽష్టవింశోఽనువాకః।

మూలము: [1]హరి రసి హారియోజనో హర్యోః స్థాతా వజ్రస్య భర్తా పృశ్నేః ప్రేతా తస్య తే దేవ సోమేష్ట యజుష స్తుతస్తోమస్య శస్తోక్థస్య హరివన్తం గ్రహం గృహ్ణామి హరీ స్థ హర్యో ర్ధానా స్సహసో మా ఇన్ద్రాయ స్వాహా ॥౧॥ (హరిః షడ్విగ్ంశతిః)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే ఽష్టవింశోఽనువాకః॥

వేదార్థ దీపిక

1. అర్థము: హే సోమ!=ఓ సోమమా! (త్వమ్-నీవు) హరిః=హరిత వర్ణము కలదానవు, అసి=అగుచున్నావు. హారియోజనః=ఇంద్ర సంబంధివి. (=ఇంద్ర దేవతాకము.) హర్యోః=అశ్వములందు, (=అశ్వములచే పూన్చఁబడిన రథమునందు,) స్థాతా=ఉండు దానవు. వజ్రస్య=వజ్రాయుధమునకు, భర్తా=పోషకమవు. పృశ్నేః=అన్నమునకు, ప్రేతా=ప్రేరకమవు. హే సోమదేవ!=దేవతా రూపమైన సోమమా!, ఇష్ట యజుషః=యజ్ఞ సాధనముగా ప్రయుక్తమైన గ్రహణ సాదనాది మంత్ర రూప యజుస్సు కలదానవును, శస్తోక్థస్య=ప్రశస్తములైన ప్రఉగాజ్య నిష్కైవల్య, మరుత్వతీయ వైశ్వదేవాగ్ని, మారుత, నామక శస్త్రములు కల దానవును, స్తుత స్తోమస్య=త్రివృత్, పంచదశ, సప్తదశాది, నామక స్తోమములు కల దానవునగు, తస్య=అ, (=అటువంటి) తే=నీ యొక్క, హరివన్తమ్=ఇంద్ర దేవతాకమైన, గ్రహమ్=పాత్రమును, గృహ్ణామి=గ్రహించుచున్నాను. హే ధానాః!=వెచ్చపెట్టఁబడిన తండులములారా! (యూయమ్=మీరు) హర్యోః=ఇంద్ర రథమును మోయునట్టి అశ్వములకు సంబంధించిన, హరీః=హరిశబ్దార్థములుగా, స్థ=ఉంటున్నారు. సహసోమాః=సోమముతో కూడినవారై, స్థ=ఉంటున్నారు. (తదిదం హవిః=అటువంటి యీ హవిస్సు,) ఇన్ద్రాయ=ఇంద్రుని కొఱకు, స్వాహా=హుతమగుఁగాక.

తాత్పర్యము: ఓ సోమమా! నీవు హరిత వర్ణము కలదానవు. ఇంద్రుఁడు దేవతగాఁగల దానవు. గుఱ్ఱములచే పూన్చఁబడిన రథమునందుండు దానవు. (నీవు ఇంద్రునిచే త్రాగఁబడుటచే ఇంద్రాభేదమును పొంది) వజ్రాయుధమును పోషించుదానవు. (యాగమును సాధించుట మూలమున) అన్నమును ప్రేరణ చేయుదానవు. ఓ సోమదేవతా! నీవు యజ్ఞ సాధనముగా ప్రయోగింపఁబడిన గ్రహణ సాదనాది మంత్రములు కలదానవు. స్తోత్రము చేయఁబడిన త్రివృదాది నామకములైన స్తోమములు కలదానవు. ప్రశస్తములైన ప్రఉగాజ్యాది నామకములైన శస్త్రములు కలదానవు. అటువంటి నీ యొక్క ఇంద్ర దేవతాకమైన గ్రహమును గ్రహించుచున్నాను. వేడి చేయఁబడిన తండులములారా! మీరు ఇంద్ర రథమును మోయునట్టి గుఱ్ఱములకు సంబంధించిన హరి శబ్దార్థముచే రూఢము లగుచున్నారు. (సోమముతో మిశ్రితము లగుటచే) సోమముతో కూడినవారు అగుచున్నారు. అటువంటి యీ హవిస్సు ఇంద్రుని కొఱకు హుతమగుఁగాక. (ఇంద్ర దేవతాక గ్రహమును సోమరసముతో నింపి, తండులములను వెచ్చచేసి (=బొరుగులకు ధానములని పేరు.) సోమ రసముతో మిశ్రమముచేసి హోమము చేయవలెను.)

అష్టవింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠక ఏకోనత్రింశోఽనువాకః ।

(అతిగ్రాహ్య గ్రహాభిధానము)

మూలము: [1]అగ్న ఆయూగ్ంషి పవస ఆసువోర్జ మిషం చ నః । ఆరే బాధస్వ దుచ్ఛునామ్ । ఉపయామ గృహీతో ఽస్యగ్నయే త్వా తేజస్వత ఏష తే యోని రగ్నయే త్వా తేజస్వతే ॥౧॥

(అగ్నే త్రయోవిగ్ంశతిః)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠక ఏకోనత్రింశోఽనువాకః ॥

వేదార్థ దీపిక

1. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ! (త్వమ్=నీవు, భక్తానామ్=భక్తులయొక్క) ఆయూంషి=ఆయువులను, పవసే=వృద్ధి నొందించుచున్నావు. నః=మాకు, ఇషమ్=అన్నమును, చ=మఱియు, ఊర్జమ్=బలమును, ఆసువ=ఒసఁగుము. దుచ్ఛునామ్=శత్రుసేనను, ఆరే=దూరమునందు, (ఉండునట్లుగా) బాధస్వ=బాధించుము. (హే సోమ!=ఓ సోమరసమా!, త్వమ్=నీవు,) ఉపయామ గృహీతః=పృథివీ వికారమైన దారుపాత్రముచే గ్రహింపఁబడిన దానవు, అసి=అగుచున్నావు. త్వా=నిన్ను, తేజస్వతే=తేజోవంతుఁడైన, అగ్నయే=అగ్నికొఱకు, (గృహ్ణామి=గ్రహించుచున్నాను. హే అతిగ్రాహ్య గ్రహ!=ఓ అతిగ్రాహ్య గ్రహమా!) ఏషః=ఈ ఖర ప్రదేశము, తే=నీకు, యోనిః=స్థానము. త్వా=నిన్ను, తేజస్వతే=తేజోవంతుఁడైన, అగ్నయే=అగ్నికొఱకు, (అత్ర=ఈ ఖరప్రదేశమునందు, సాదయామి=ఉంచుచున్నాను.)

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు భక్తుల ఆయువును వృద్ధి నొందించుచున్నావు. (=శోధించు చున్నావు.) మాకు అన్నమును బలమును ఒసఁగుము. శత్రుసేనను దూరము నందుండునట్లుగా బాధించుము. (శేషము పూర్వవత్తు.)

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే త్రింశో౽నువాకః।

మూలము: [1]ఉత్తిష్ఠ న్నోజసా సహ పీత్వా శిప్రే అవేపయః। సోమ మిన్ద్ర చమూసుతమ్। ఉపయామ గృహీతో ఽసి త్వేన్ద్రాయ త్వౌజస్వత ఏష తే యోని రిన్ద్రాయ త్వౌజస్వతే ॥౧॥

(ఉత్తిష్ఠ న్నేకవిగ్ంశతిః)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే త్రింశో౽నువాకః।

వేదార్థదీపిక

1. అర్థము: హే ఇన్ద్ర!=ఓ యింద్రుడా! సుతమ్=అభిషుతమైన, సోమమ్=సోమరసమును, పీత్వా=త్రాగి, ఓజసా సహ=బలముతోకూడ, ఉత్తిష్ఠన్=లేచినవాఁడ వగుచు, చమూ=భక్షణ సాధనములైన, శిప్రే=దవడలను, అవేపయః=కదలించుము. (హే సోమ!) త్వమ్, ఉపయామ గృహీతః, అసి. ఓజస్వతే=బలవంతుఁడైన, ఇన్ద్రాయ=ఇంద్రుని కొఱకు, త్వా, (గృహ్ణామి. హే గ్రహ!=ఓ పాత్ర విశేషమా!) ఏషః, తే, యోనిః. త్వా, ఓజస్వతే, ఇన్ద్రాయ, (అత్ర, సాదయామి.)

తాత్పర్యము: ఓ యింద్రా! అభిషుతమైన సోమమును త్రాగి, ఆ త్రాగుట వలన కలిగిన బలముతో లేచి భక్షణ సాధనములైన దవడలను కదలించుము. శేషము పూర్వవత్తు.

త్రింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠక ఏకత్రింశో౽నువాకః।

(అతిగ్రాహ్య గ్రహాభిధానము)

మూలము: [1]తరణి ర్విశ్వదర్శతో జ్యోతిష్కృ దసి సూర్య। విశ్వ మాభాసి రోచనమ్। ఉపయామ గృహీతో౽సి సూర్యాయ త్వా భ్రాజస్వత ఏష తే యోని స్సూర్యాయ త్వా భ్రాజస్వతే ॥౧॥

(తరణి ర్విగ్ంశతిః)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠక ఏకత్రింశో౽నువాకః।

వేదార్థ దీపిక

1. అర్థము: హే సూర్య!=ఓ సూర్యుఁడా! (త్వమ్=నీవు,) తరణిః=చీకటిని పోగొట్టువాడవును, విశ్వదర్శతః=అందఱిచే చూడఁదగినవాఁడవును, జ్యోతిష్కృత్=(సమస్త లోకములందు) కాంతిని కలుగఁజేయు వాఁడవును, అసి=అగుచున్నావు. విశ్వమ్=ప్రపంచమును, రోచనమ్=కాంతిగల దానినిగా, ఆభాసి=అంతటను ప్రకాశింపఁజేయు చున్నావు. (హే సోమ, త్వమ్,) ఉపయామ గృహీతః, అసి. త్వా, భ్రాజస్వతే=దీప్తి మంతుఁడైన, సూర్యాయ=సూర్యుని కొఱకు, (గృహ్ణామి. హే గ్రహ!=జ్యోతిష్టోమమందలి అతిగ్రాహ్య మనెడి పాత్రమా!) ఏషః, తే, యోనిః. త్వా, భ్రాజస్వతే, సూర్యాయ, (అత్ర, సాదయామి.)

తాత్పర్యము: ఓ సూర్యుఁడా! నీవు చీకటిని పోగొట్టు వాఁడవు. అందఱిచే చూడఁదగిన వాఁడవు. సర్వలోకములందును కాంతిని గలుగఁజేయు వాఁడవు. సర్వ ప్రపంచమును కాంతి కలుగునట్లు అంతటను ప్రకాశింపఁజేయు చున్నావు. శేషము పూర్వవత్తు.

ఏకత్రింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే ద్వాత్రింశోఽనువాకః।

మూలము: [1]ఆప్యాయస్వ మదిన్తమ సోమ విశ్వాభి రూతిభిః। భవా న స్సప్రథస్తమః ॥౧॥ (ఆనవ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే ద్వాత్రింశోఽనువాకః

వేదార్థదీపిక

1. **అర్థము:** మదిన్తమః=అత్యంత సంతోషయుక్తమైన, హే సోమః=ఓ సోమమా! విశ్వాభిః=సమస్తములైన, నః=మా యొక్క, ఊతిభిః=రక్షణముల చేత, ఆప్యాయస్వ=అంతటను వృద్ధి నొందుము. నః=మమ్ముఁగూర్చి, సప్రథస్తమః=మిక్కిలి ప్రసిద్ధి కల దానవు, భవా=కమ్ము. (భవా=భవ.)

తాత్పర్యము: అత్యంత సంతోష యుక్తమైన సోమమా! రక్షణముల నన్నిటిచేత అంతటను వృద్ధినొందుము. మమ్ముఁ గూర్చిఁ మిక్కిలి ప్రసిద్ధి కల దానవు కమ్ము.

ద్వాత్రింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే త్రయస్త్రింశోఽనువాకః ।

మూలము: [1]ఈయుష్టే యే పూర్వతరా మపశ్య న్వ్యుచ్ఛన్తీ ముషసం మర్త్యాసః। అస్మాభి రూను
ప్రతిచక్ష్యా ఽభూ దో తే యన్తి యే అపరీషు పశ్యాన్ ॥౧॥ (ఈయు రేకాన్నవిగ్ంశతిః)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే త్రయస్త్రింశోఽనువాకః॥

వేదార్థదీపిక

1\. అర్థము: యే మర్త్యాసః=ఏ మనుజులు, ఉషసమ్=ప్రాతఃకాలమును, వ్యుచ్ఛన్తీమ్=చేయునట్టి ఉషోదేవతను, పూర్వతరామ్=ఇతరులకంటె పూర్వము, అపశ్యన్=చూచుచున్నారో, తే=ఆ మనుజులు, (తామ్=ఆ ఉషో దేవతను) ఈయుః=పొందుచున్నారు. (సా=ఆ ఉషోదేవత) అస్మాభిః+ఊను=మా చేతఁగూడ, ప్రతి చక్ష్యా ఓ=చూడఁదగినదియే, అభూత్=అయినది. యే=ఏ యితరులు, అపరీషు=రాత్రుల చివరలయందు (తామ్=ఆ దేవతను,) పశ్యాన్=చూచుచున్నారో, తే=(అపి) వారు, (కూడ,) యన్తి=పొందుచున్నారు. (పశ్యాన్=పశ్యన్తీత్యర్థః.)

తాత్పర్యము: ప్రాతఃకాలమును జేయు నుషో దేవతను ఇతరులకంటె ముందుగా చూచుచున్నవారు ఆ ఉషో దేవతను పొందుచున్నారు. ఆ ఉషో దేవత మాచేతఁగూడ పొందఁ దగినదే యైనది. రాత్రుల చివర ఆ దేవతను చూచుచున్నవారుకూడ ఆ దేవతను పొందుచున్నారు. (ఇట 'పశ్యాన్' అను క్రియా పదమునకు 'పశ్యన్తి' అని యర్థము. మర్త్యాసః=మర్త్యాః. "అపశ్యన్" "ఈయుః" అను భూతార్థములకు వర్తమానార్థము చెప్పఁబడినది.)

త్రయస్త్రింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే చతుస్త్రింశోఽనువాకః।

మూలము: [1]జ్యోతిష్మతీం త్వా సాదయామి జ్యోతిష్కృతం త్వా సాదయామి జ్యోతిర్విదం త్వా సాదయామి భాస్వతీం త్వా సాదయామి జ్వలన్తీం త్వా సాదయామి మల్మలాభవన్తీం త్వా సాదయామి దీప్యమానాం త్వా సాదయామి రోచమానాం త్వా సాదయామ్యజస్రాం త్వా సాదయామి బృహజ్జ్యోతిషం త్వా సాదయామి బోధయన్తీం త్వా సాదయామి జాగ్రతీం త్వా సాదయామి ॥౧॥ (జ్యోతిష్మతీగ్ం షట్త్రిగ్ంశత్)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే చతుస్త్రింశోఽనువాకః॥

వేదార్థ దీపిక

1. అర్థము: (హే సమిధే!=అగ్నియందు వేల్చఁబడు కాష్ఠ విశేషమా!) జ్యోతిష్మతీమ్=అతి స్వల్పకాంతితో కూడిన, త్వా=నిన్ను, సాదయామి=(ఈ అగ్నియందు) ఉంచుచున్నాను. జ్యోతిష్కృతమ్=కొంచెమధికమైన ప్రకాశము కల, త్వా, సాదయామి. జ్యోతిర్విదమ్=అధిక ప్రకాశముకల, త్వా, సాదయామి. భాస్వతీమ్=కొంచెము కాంతిగల, త్వా, సాదయామి. జ్వలన్తీమ్=కొంచె మధికమైన కాంతిగల, త్వా, సాదయామి. మల్మలాభవన్తీమ్=(తగులఁబడుచున్న కాష్ఠము యొక్క ధ్వన్యనుకరణమైన) 'మల్మల' అను శబ్దముకల, త్వా, సాదయామి. దీవ్యమానామ్=అతి స్వల్ప కాంతిగల, త్వా, సాదయామి. రోచమానామ్=కొంచె మధికమైన కాంతిగల, త్వా, సాదయామి. అజస్రామ్=ఎక్కువ అధికమైన కాంతిగల, త్వా, సాదయామి. బృహ జ్జ్యోతిషమ్=వృద్ధి నొందు కాంతిగల, త్వా, సాదయామి. బోధయన్తీమ్=వ్యాపించుచున్న కాంతిగల, త్వా, సాదయామి, జాగ్రతీమ్=స్వభావముచేతనే ప్రకాశము కల, త్వా=నిన్ను, సాదయామి=(అస్మిన్+అగ్నౌ=ఈ యగ్నియందు)ఉంచుచున్నాను.

తాత్పర్యము: ఓ సమిధా! మిక్కిలి స్వల్పమైన కాంతితో కూడిన నిన్ను ఈ యగ్ని యందు ఉంచుచున్నాను. మిగిలినది సుబోధము.

చతుస్త్రింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే పఞ్చత్రింశోఽనువాకః।

మూలము: [1]ప్రయాసాయ స్వాహా ఽయాసాయ స్వాహా వియాసాయ స్వాహా సంయాసాయ స్వాహో ద్యాసాయ స్వాహా ఽవయాసాయ స్వాహా శుచే స్వాహా శోకాయ స్వాహా తప్యత్వై స్వాహా తపతే స్వాహా బ్రహ్మహత్యాయై స్వాహా సర్వస్మై స్వాహా ॥౧॥ (ప్రయాసాయ చతుర్విగ్ంశతిః)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే పఞ్చత్రింశోఽనువాకః।

వేదార్థదీపిక

1. **అర్థము:** ప్రయాసాయ='ప్రయాస' అను దేవత కొఱకు, స్వాహా=(స్రువేణ గృహీత మిద మాజ్యమ్=స్రువముచే గ్రహింపఁబడిన యీ యాజ్యము) హుతమగుఁగాక. ఇట్లే 'అయాస' 'వియాస' ఇత్యాది నామ ధేయములు గల దేవతలకొఱకు ఈ యాజ్యము హుతమగుఁగాక, అని సమన్వయము.

తాత్పర్యము: స్రువముచే గ్రహింపఁబడిన యాజ్యము ప్రయాసాది దేవతలకు హుతమగుఁగాక. 'ప్రయాస' ఇత్యాది పదములు ఆ యా దేవతల పేర్లను దెలుపునవి.

పంచత్రింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే షట్త్రింశోఽనువాకః।

మూలము: [1]చిత్తగ్ం సంతానేన భవం యక్నా రుద్రం తనిమ్నా పశుపతిగ్ం స్థూలహృదయేనాగ్నిగ్ం హృదయేన రుద్రం లోహితేన శర్వం మతస్నాభ్యాం మహాదేవ మన్తఃపార్శ్వేనౌ షిష్ఠహనగ్ం శిఙ్గీనికోశ్యాభ్యామ్ ॥౧॥ (చిత్త మష్టాదశ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే షట్త్రింశోఽనువాకః।

వేదార్థదీపిక

1. అర్థము: చిత్తమ్='చిత్త' అను దేవతను, సంతానేన=సంతానమనెడి పశు మాంసముచేత, (సంతోషయామః=సంతోష పఱచుచున్నాము.) ఇట్లే 'భవమ్' ఇత్యాది ద్వితీయాన్త పదములు దేవతా విశేష వాచకములు. 'యక్నా' ఇత్యాది తృతీయాన్త పదములు పశు మాంస విశేషవాచకములు. పైని వ్రాసిన విధముగ 'సంతోష యామః' అను క్రియాపదమును అధ్యాహారము చేసికొని మిగిలిన యెనిమిది వాక్యములకు అర్థము సమన్వయము చేసికొనవలెను. సంతానాది పశుమాంస విశేషములచే చిత్తాది దేవతా విశేషములను సంతోష పఱచుచున్నామని తాత్పర్యము.

షట్త్రింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే సప్తత్రింశోఽనువాకః।

(షోడశి గ్రహాభిధానము)

మూలము: [1]ఆతిష్ఠ వృత్రహ న్రథం యుక్తా తే బ్రహ్మణా హరీ। అర్వాచీనగ్ం సుతే మనో గ్రావా కృణోతు వగ్నునా। ఉపయామగృహీతో ఽసీన్ద్రాయ త్వా షోడశిన ఏష తే యోని రిన్ద్రాయ త్వా షోడశినే ॥౧॥ (ఆతిష్ఠ షడ్విగ్ంశతిః)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే సప్తత్రింశోఽనువాకః।

వేదార్థదీపిక

1. అర్థము: హే వృత్రహన్!=వృత్రహన్తవైన ఓ యింద్రా!, తే=నీ యొక్క, హరీ=అశ్వములు, బ్రహ్మణా=మంత్రము చేత, యుక్తా=(రథమునకు) కూర్చఁబడినవి. (తతః=అందువలన) రథమ్=రథమును, ఆ తిష్ఠ=ఎక్కుము. (=అధిరోహించుము.) గ్రావా=(ఈ) ఱాయి, వగ్నునా=అభిషవ ధ్వనిచేత, తే=నీయొక్క, సు= యోగ్యమైన, మనః=మనస్సును, అర్వాచీనమ్=(అభిషుత సోమమునందు) అభిముఖమైనదిగా, (కరోతు= చేయుఁగాక. హే సోమ!, త్వమ్) ఉపయామ గృహీతః, అసి. త్వా=నిన్ను, షోడశినే=షోడశ సంఖ్యాక స్తోత్రములు గల, ఇన్ద్రాయ=ఇంద్రుని కొఱకు, గృహ్ణామి=గ్రహించు చున్నాను. (హే షోడశిగ్రహ!=ఓ షోడశి గ్రహమా!) ఏషః=ఈ ఖర ప్రదేశము, తే=నీకు, యోనిః=స్థానము. షోడశినే, ఇన్ద్రాయ, త్వా, (అత్ర, సాదయామి.)

తాత్పర్యము: వృత్రాసుర సంహర్తవైన ఓ యింద్రా! నీ గుఱ్ఱములు మంత్ర పూర్వకముగ రథమునకు పూన్చఁబడినవి. సోమలతను అభిషవము చేయుటకు సాధనమైన యీ ఱాయి అభిషవ సమయమున పుట్టిన ధ్వనిచేత నీ మనస్సును సోమరసమున కభిముఖమయినదిగాఁ జేయుఁగాక. శేషము స్పష్టము. (షోడశి గ్రహమును సోమరసముచే నింపి ఖరప్రదేశము నందుంచ వలెను.)

సప్తత్రింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే ఽష్టత్రింశోఽనువాకః।

మూలము: [1]ఇన్ద్ర మిద్ధరీ వహతో ఽప్రతి ధృష్టశవస మృషీణాం స్తుతీ రుప యజ్ఞం చ మానుషాణామ్।

ఉపయామగృహీతో ఽసి న్ద్రాయ త్వా షోడశిన ఏష తే యోని రిన్ద్రాయ త్వా షోడశినే ॥౧॥

(ఇన్ద్రం త్రయోవిగ్ంశతిః)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే ఽష్టత్రింశోఽనువాకః।

వేదార్థదీపిక

1. అర్థము: ఋషీణామ్=మంత్రములయొక్క, స్తుతీః=స్తోత్రములను, చ=మఱియు, మానుషాణామ్=మనుష్యుల యొక్క, యజ్ఞమ్=యజ్ఞమును, ఉప=పొంది, అప్రతి ధృష్ట శవసమ్=ఎవ్వని చేతను తిరస్కరింపఁబడని బలముగల, ఇన్ద్రమ్+ఇత్=ఇంద్రునే, హరీ=గుఱ్ఱములు, వహతః=(రథముచే) మోయుచున్నవి. శేషము పూర్వోక్తము.

తాత్పర్యము: అశ్వములు మంత్రముల యొక్క స్తోత్రములను, మనుష్యులయొక్క యజ్ఞమును పొంది యెవ్వనిచేతను తిరస్కరింపఁబడని బలము కల యింద్రునే (రథముచే) మోయుచున్నవి. (శేషము పూర్వోక్తము. షోడశిగ్రహ గ్రహణ సాదనముల విషయమునే 38, 39, 40, 41, 42 అనువాక మంత్రములు చెప్పు చున్నవి.)

అష్టత్రింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠక ఏకోన చత్వారింశోఽనువాకః।

(షోడశి గ్రహాభిధానము)

మూలము: [1]అసావి సోమ ఇన్ద్ర తే శవిష్ఠ ధృష్ణ వాగహి। ఆ త్వా వృణ క్త్విన్ద్రియగ్ం రజ స్సూర్యం న రశ్మిభిః। ఉపయామగృహీతో ఽసీ న్ద్రాయ త్వా షోడశిన ఏష తే యోని రిన్ద్రాయ త్వా షోడశినే ॥౧॥ (అసావి సప్తవిగ్ంశతిః)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠక ఏకోన చత్వారింశోఽనువాకః।

వేదార్థదీపిక

1. అర్థము: హే శవిష్ఠ=అత్యంత బలవంతుఁడవైన, హే ఇన్ద్ర=ఓ యింద్రా! తే=నీ కొఱకు, సోమః=సోమము, అసావి=అభిషుతమైనది. హే ధృష్ణో=ధార్ష్ట్యముతో కూడిన యింద్రా!, ఆ గహి=రమ్ము. ఇన్ద్రియమ్=ఇంద్రియ శక్తి, త్వా=నిన్ను, రశ్మిభిః=కిరణములచేత, (గృహీతమ్=గ్రహింపఁబడిన) రజః=ఉదకము, సూర్యమ్+న=సూర్యునివలె, ఆ వృణక్తు=అంతటను పూరించుఁగాక. (శేషము పూర్వోక్తము.)

తాత్పర్యము: అత్యంత బలవంతుఁతవైన ఓ యింద్రా! నీ నిమిత్తము సోమము అభిషుతమైనది. ధార్ష్ట్యవంతుఁడవైన యింద్రా! కిరణములచే గ్రహింపఁబడిన ఉదకము సూర్యుని ఆవరించిన విధముగ ఇంద్రియశక్తి నిన్ను అంతటను పూరించుఁగాక. (శేషము పూర్వోక్తము.)

ఏకోన చత్వారింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థ ప్రపాఠకే చత్వారింశోఽనువాకః।

మూలము: [1]సర్వస్య ప్రతి శీవరీ భూమి స్త్వోపస్థ అధిత।-స్యోనా ఽస్మై సుషదా భవ యచ్ఛాస్మై శర్మ సప్రథాః। ఉపయామగృహీతో ఽసీ న్ద్రాయ త్వా షోడశిన ఏష తే యోని రిన్ద్రాయ త్వా షోడశినే ॥౧॥ (సర్వస్య షడ్విగ్ంశతిః)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే చత్వారింశోఽనువాకః।

వేదార్థదీపిక

1. అర్థము: హే ఇన్ద్ర!=ఓ యింద్రుఁడా!, సర్వస్య=సర్వప్రాణికి, ప్రతి శీవరీ=అభిముఖ్యముతో నొప్పుచున్న (=అభిముఖముగా నున్న) భూమిః=భూమి, త్వా=నిన్ను, ఉపస్థే=పై స్థానమునందు, అధిత=అంతటను ధరించుఁగాక. (హే భూమే!=ఓ భూమీ!, త్వమ్=నీవు) అస్మై=ఈ యింద్రునికొఱకు, స్యోనా=సుఖప్రదురాలవు, సుషదా=శోభన నివాస స్థానమైన దానవును, భవ=అగుము. అస్మై=ఈ యజమానునికొఱకు, సప్రథాః=అతి విస్తృతమై, శర్మ=సుఖమును, యచ్ఛ=ఇమ్ము. (శేషము పూర్వోక్తము.)

తాత్పర్యము: ఓ యింద్రా! సర్వప్రాణికి అభిముఖముగా నున్న భూమి నిన్ను ఉపరితన స్థానమునందు వహించుఁగాక. ఓ భూమీ! నీవు ఈ యింద్రునకు సుఖము నిమ్ము. శోభనమైన స్థానమగుము. నీవు అతి విస్తృతమై ఈ యజమానునకు సుఖము నిమ్ము. (శేషము పూర్వోక్తము.)

చత్వారింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠక ఏకచత్వారింశోఽనువాకః।

మూలము: [1]మహాగ్‌ం ఇన్ద్రో వజ్రబాహు షోడశీ శర్మ యచ్ఛతు। స్వస్తి నో మఘవా కరోతు హన్తు పాప్మానం యో ఽస్మా న్ద్వేష్టి। ఉపయామగృహీతో ఽసి న్ద్రాయ త్వా షోడశిన ఏష తే యోని రిన్ద్రాయ త్వా షోడశినే ॥౧॥ (మహా న్షడ్విగ్‌ంశతిః)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠక ఏకచత్వారింశోఽనువాకః॥

వేదార్థదీపిక

1. అర్థము: వజ్ర బాహుః=వజ్రాయుధము హస్తమునందు కలవాఁడును, షోడశీ=షోడశ సంఖ్యాక శస్త్ర స్తోత్రములు కలవాఁడునగు, మహాన్ + =ఇన్ద్రః=మహేంద్రుడు, (అస్మై=ఈ యజమానుని కొఱకు) శర్మ=సుఖమును, యచ్ఛతు=ఒసఁగుఁగాక. మఘవా=ఇంద్రుఁడు, నః=మాకు, స్వస్తి=శుభమును, కరోతు=చేయుఁగాక. యః=ఏ పాపము, అస్మాన్=మమ్ము, ద్వేష్టి=ద్వేషించుచున్నదో, (తమ్=ఆ) పాప్మానమ్=పాపమును, హన్తు=నశింపఁజేయుఁగాక. శేషము పూర్వోక్తము.

తాత్పర్యము: వజ్రబాహువు, షోడశ సంఖ్యాక శస్త్ర స్తోత్రములు కలవాఁడునగు మహేంద్రుఁడీ యజమానునకు సుఖము నొసఁగుఁగాక. ఇంద్రుఁడు మాకు శుభమును కలుగఁజేయుఁగాక. మఱియు మమ్ము ద్వేషించునట్టి పాపమును నశింపఁజేయుఁగాక. శేషము పూర్వోక్తము.

ఏకచత్వారింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే ద్విచత్వారింశోఽనువాకః।

మూలము: [1]సజోషా ఇన్ద్ర సగణో మరుద్భి స్సోమం పిబ వృత్రహా శూర విద్వాన్। జహి శత్రూగ్ం రప మృధో నుదస్వా థా భయం కృణుహి విశ్వతో నః। ఉపయామ గృహీతో ఽసీ న్ద్రాయ త్వా షోడశిన ఏష తే యోని రిన్ద్రాయ త్వా షోడశినే ॥౧॥ (సజోషా త్రిగ్ంశత్)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థ ప్రపాఠకే ద్విచత్వారింశోఽనువాకః॥

వేదార్థ దీపిక

1. అర్థము: వృత్రహన్=వృత్రాసుర సంహర్తవు, శూర=శూరుఁడవునగు, హే ఇన్ద్ర!=ఓ యింద్రా!, సజోషాః=ప్రీతి యుతుఁడవై, మరుద్భిః=మరుద్గణములతో, (సహితత్వేన=కూడినవాఁడ వగుటచే,) సగణః=గణసహితుఁడ వైన, (త్వమ్=నీవు) విద్వాన్=యజమాన భక్తిని తెలిసికొనిన వాఁడవై, సోమమ్=సోమరసమును, పిబ=త్రాగుము. శత్రూన్=(మమ్ము చంపుటకు ఉద్యతులైన) శత్రువులను, జహి=చంపుము. మృధః=ఇతర శత్రువులను, అపనుదస్వ=పోఁగొట్టుము. అథ=పిమ్మట, నః=మాకు, విశ్వతః=అంతటను, అభయమ్=భయ రాహిత్యమును, కృణుహి=చేయుము. శేషము పూర్వోక్తము.

తాత్పర్యము: ఓ యింద్రా! నీవు వృత్రాసురుని సంహరించిన వాఁడవు. శూరుఁడవు. అట్టి నీవు ప్రీతి యుక్తుఁడవు, మరుద్గణ సహితుఁడవు, యజమానుని భక్తిని తెలిసికొనిన వాఁడవునై సోమరసమును త్రాగుము. మమ్ము చంపుటకు ఉద్యతులైన శత్రువులను సంహరించుము. ఇతర శత్రువులను పోఁగొట్టుము. అనంతరము మా కంతటను భయము లేకుండునట్లు చేయుము. శేషము పూర్వోక్తము.

ద్విచత్వారింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే త్రిచత్వారింశోఽనువాకః।

మూలము: [1]ఉదు త్యం జాతవేదసం దేవం వహన్తి కేతవః। దృశే విశ్వాయ సూర్యమ్॥ [2]చిత్రం దేవానా
ముదగా దనీకం చక్షు ర్మిత్రస్య వరుణస్యా గ్నేః। ఆ ప్రా ద్యావాపృథివీ అన్తరిక్షగ్ం సూర్య
ఆత్మా జగత స్తస్థుష శ్చ। [3]అగ్నే నయ సుపథా రాయే అస్మాన్ విశ్వాని దేవ వయునాని
విద్వాన్। యుయోధ్యస్మ జ్జుహురాణ మేనో భూయిష్ఠాం తే నమ ఉక్తిం విధేమ [4]దివం
గచ్ఛ సువః పత [5]రూపేణ (౧)వో రూప మభ్యైమి వయసా వయః। [6]తుథో వో విశ్వవేదా
విభజతు వర్షిష్ఠే అధి నాకే। [7]ఏత త్తే అగ్నే రాధ ఐతి సోమచ్యుతం తన్మిత్రస్య పథా
నయ ర్తస్య పథా ప్రేత చన్ద్ర దక్షిణా యజ్ఞస్య పథా సువితా నయన్తీ [8]ర్బ్రాహ్మణ
మద్య రాధ్యాస మృషి మార్షేయం పితృమన్తం పైతృమ త్యగ్ంసుధాతు దక్షిణం [9]వి సువః
పశ్య వ్యన్తరిక్షం యతస్వ సదస్యైః [10]రస్మ ద్దాత్రా దేవత్రా గచ్ఛత మధుమతీః ప్రదాతార
మా విశతా నవహాయా స్మా న్దేవయానేన పథేత సుకృతాం లోకే సీదత త న్నః సగ్ంస్కృతమ్ ॥౨॥ (రూపేణ సదస్యై రష్టాదశచ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే త్రిచత్వారింశోఽనువాకః॥

వేదార్థదీపిక

1. అర్థము: కేతవః=కిరణములు, త్యమ్=ఆ, జాతవేదసమ్=అగ్ని సదృశుఁడైన, సూర్యం దేవమ్=సూర్యదేవుని, విశ్వాయ=సర్వజగత్తుయొక్క, (షష్ఠ్యర్థే చతుర్థీ) దృశే=దృష్టికొఱకు, ఉద్వహన్తి=ఊర్ధ్వప్రదేశమునందే పొందుచున్నవి.

తాత్పర్యము: (37 నుండి 42 వరకుఁ గల యనువాక మంత్రములు ఆరణ్యక తృతీయ ప్రపాఠకమునం దభిహితములైనవి. ఆ యాఱు అనువాకములను మినహాయించినచో ఇది 37 వ యనువాక మగును. ఇంత వఱకు గ్రహములు చెప్పఁబడినవి. ఈ యనువాకమునందు దక్షిణ వర్ణింపఁబడుచున్నది. దక్షిణ నిచ్చు యజమానునిచే చేయఁబడు హోమములు దాక్షిణ హోమము లనఁబడును. దక్షిణగా నీయఁదగిన హిరణ్యమును మూట కట్టి గార్హపత్యాగ్నియందు 1,2 మంత్రములు పఠించుచు హోమము చేయవలెను.) అగ్ని సదృశుఁడైన సూర్యుని సర్వ ప్రపంచము చూచుటకై కిరణములు ఊర్ధ్వ ప్రదేశమున వ్యాపించుచున్నవి. (అని యీ మంత్ర తాత్పర్యము.)

2. అర్థము: చిత్రమ్=అనేక వర్ణములు కలదియు, మిత్రస్య=మిత్రదేవునకు, వరుణస్య=వరుణ దేవునకు, అగ్నేః=అగ్నికి (మొదలు సర్వప్రాణి సమూహమునకు,) చక్షుః=చక్షు స్థానీయమునగు, దేవానామ్=కిరణములయొక్క, అనీకమ్=(సైన్య సదృశ) మండలము, ఉదగాత్=ఉదయించుచున్నది. సూర్యః=(ఆ మండలము నందలి) సూర్యుఁడు, జగతః=జంగమ రూపమును, తస్థుషః + చ=స్థావర రూపమును నైన ప్రపంచమునకు, ఆత్మా=ఆత్మయగుచు, ద్యావా పృథివీ=ద్యులోక భూలోకములను, అన్తరిక్షమ్=అంతరిక్ష లోకమును, ఆప్రాః=పూరించెను. (ఉదగాత్=ఉదయం గచ్ఛతి అని విద్యారణ్యము. భూతకాలికమైనను వర్తమానార్థము చెప్పఁబడినది.)

తాత్పర్యము: రక్త శ్వేతాది వివిధ వర్ణములు కలదియు, అగ్ని మిత్ర వరుణాది సర్వప్రాణి లోకమునకు చక్షుస్థానీయము నైన కిరణమండలము (సైన్యమువంటిది) ఉదయించుచున్నది. ఆ మండలమునందున్న సూర్యుఁడు స్థావర జంగమాత్మక సర్వ ప్రపంచమునకు ఆత్మ యగుచు లోకత్రయమును పూరించెను. (వినియోగము 1 వ మంత్రమున చెప్పఁబడినది.)

3. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ! రాయే=పరలోక సంబంధమైన ధనముకొఱకు, అస్మాన్=మమ్ము, సుపథా=మంచి మార్గముచే, నయ=తీసికొని పొమ్ము. హే దేవ!=ఓ యగ్నిదేవా!, త్వమ్=నీవు, విశ్వాని=సమస్తములైన, వయునాని=మార్గములను, విద్వాన్=తెలిసినవాఁడవు. జుహురాణమ్=కుటిలమైన, ఏనః=పాపమును, అస్మత్=మానుండి, యుయోధి=పోఁగొట్టుము. తే=నీ కొఱకు, భూయిష్ఠామ్=గొప్పదియైన, నమ ఉక్తిమ్=నమస్కారోక్తిని, విధేమ=ఆచరింతుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! పారలౌకిక ధనముకొఱకు మమ్ము మంచి మార్గముతో కొనిపొమ్ము. ఓ దేవా! నీవు సర్వ మార్గములను దెలిసినవాఁడవు. మానుండి కుటిల పాపమును పోఁగొట్టుము. నిన్నధికముగ నమస్కరించెదము. (అగ్నీధ్రుని యొద్దకు వచ్చి ఈ మంత్రము చెప్పుచు దాక్షిణ హోమము చేయవలెను.)

4. అర్థము: (హే హిరణ్య!=ఓ హిరణ్యమా! త్వమ్=నీవు) దివమ్=ఆకాశమును గూర్చి, గచ్ఛ=పొమ్ము. (తతః=పిమ్మట) సువః=స్వర్గమును, పత=పొందుము.

తాత్పర్యము: ఓ హిరణ్యమా! నీవు ఆకాశమునకు పొమ్ము. పిమ్మట స్వర్గమును పొందుము. (ఈ మంత్రము చెప్పుచు హిరణ్యమును హోమము చేసి మఱల దానిని హోమ కుండమునుండి పైకి తీయవలెను.)

5. అర్థము: హే దక్షిణాః!=ఓ దక్షిణలారా! వయసా=కమనీయమైన, రూపేణ=(హోమ కుండమునుండి తీయఁబడిన హిరణ్యముయొక్క) రూపముచేత, వః=(వేదికకు దక్షిణ భాగమున నున్న) మీయొక్క, వయః=కమనీయమైన రూపమును, అభ్యైమి=పొందుచున్నాను.

తాత్పర్యము: (ఋత్విజులకు దక్షిణగా నీయఁదగిన బంగారము వేదికకు దక్షిణ భాగమున నుండును. ఆ హిరణ్య మిచట సంబోధింపఁబడుచున్నది. దక్షిణగా నీయఁదగిన) హిరణ్యములారా! మొదట హోమము చేయఁబడి, పిమ్మట పైకి తీయఁబడిన హిరణ్యముయొక్క మనోహర రూపముచేత వేదికకు దక్షిణ భాగమున నున్న మీయొక్క కమనీయ రూపమును పొందుచున్నాను. (దక్షిణగా నీయఁదగిన బంగారమును తీసికొనవలెను.)

6. అర్థము: (హే దక్షిణాః=దక్షిణగా నీయఁదగిన హిరణ్యములారా!) వర్షిష్ఠే=వృద్ధతమమైన, నాకే=స్వర్గమునందు, అధి=అధిరూఢుఁడై యున్న, విశ్వవేదాః=సర్వజ్ఞుఁడగు, తుథః=తుథుఁడను దేవుఁడు, వః=మిమ్ము, విభజతు=విభజించుఁగాక.

తాత్పర్యము: దక్షిణగా నీయఁదగిన హిరణ్యములారా! గొప్ప స్వర్గమునందు నివసించి యున్న సర్వజ్ఞుఁడగు తుథుఁడను దేవుఁడు మిమ్ము విభజించుఁగాక. (అనఁగా యజ్ఞమునందు ఋత్విజులుగా పనిచేయుచున్న వారికి ఎవ రెవరికి ఎంతెంత ఈయవలెనో, వారి వారికి అంతంతగా ఇచ్చుటకు బంగారమును విభజించుట యని యర్థము. (ఈ మంత్రము చెప్పుచు ఋత్విజులకు దక్షిణగా ఇచ్చుటకు బంగారమును విభజించవలెను.)

7. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ!, తే=నీకు, రాధః=సమృద్ధి కారణమైనదియు, సోమచ్యుతమ్=సోమయాగము నందు ప్రాప్తమైనదియునగు, ఏతత్=ఈ, దక్షిణా ద్రవ్యము, (ఆ + ఏతి=) ఐతి=వచ్చుచున్నది. మిత్రస్య= శాంతుఁడవైన, (తే=నీయొక్క) పథా=మార్గముచేత, నయ=పొందించుము. సువితా=సద్గమనముతో కూడిన, యజ్ఞస్య=యజ్ఞపురుషునియొక్క, పథా=మార్గముచేత, నయన్తీః=(దక్షిణ ప్రదేశమునుండి ఉత్తర ప్రదేశమునకు కొనిపోఁబడుచున్న, హే చంద్ర దక్షిణాః!=ఓ సువర్ణాది ద్రవ్యములారా!, ఋతస్య= సత్యము యొక్క, పథా=మార్గముచేత, ప్రేత=(ప్ర + ఇత) ప్రకర్షగా వెళ్లుఁడు.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీ సమృద్ధికి కారణమును, సోమయాగమునందు ప్రాప్తమైనదియునగు దక్షిణాద్రవ్యము లభ్య మగుచున్నది. సద్గమన యుక్తమైన యజ్ఞపురుషుని మార్గముచే (సదో గార్హపత్యముల మధ్యవర్తి మార్గ ముచే దక్షిణ ప్రదేశమునుండి ఉత్తర ప్రదేశమునకు) కొని పోఁబడుచున్న సువర్ణాది ద్రవ్యములారా! సత్య మార్గముచే నతిశయముగ వెళ్లుఁడు. (సత్య ఫలవంతుఁడైన దేవునిచే యథాయోగముగ విభ జింపఁబడి పోవలయునని భావము. (ఈ మంత్రము దక్షిణ నిచ్చుటయం దుపయుక్తమైనది.)

8. అర్థము: అద్య=ఈ యజ్ఞ దినమునందు; ఋషిమ్=వేదార్థమును తెలిసినవాఁడును, ఆర్షేయమ్=వేదార్థవేత్తయొక్క పుత్రుఁడును, పితృమన్తమ్=తండ్రిచే బాగుగ శిక్షణ పొందినవాఁడును, పైతృమత్యమ్=మంచి శిక్షణ గల పతివ్రతకు కుమారుఁడును, సుధాతు దక్షిణమ్=ఉత్తమ హిరణ్య రూప ధాతువు దక్షిణగా కలవాఁ డును నగు, బ్రాహ్మణమ్=బ్రాహ్మణుని, (=అత్రి గోత్రోద్భవుఁడైన వానిని) రాధ్యాసమ్=(హిరణ్యముచే) సంతోష పెట్టుదును.

తాత్పర్యము: నేను ఈ యజ్ఞ దినమునందు అత్రి గోత్రోద్భవుఁడైన బ్రాహ్మణుని హిరణ్యముచే సంతోష పెట్టుదును. (అని యజమానుఁ డనుచున్నాఁడు.) ఆ బ్రాహ్మణుఁడు వేదార్థవేత్తయు, వేదార్థవిదుని కుమారుఁడును, పితృ శిక్షణ కలవాఁడును, ఉత్తమ శిక్షణ గల పతివ్రతకు పుత్రుఁడును, హిరణ్యమును దక్షిణగా పొందుట కర్హుఁడునై యుండవలెను. (ఆత్రేయస గోత్రమునందు ముగ్గురు ఋషు లుందురు. అందు మొదటి ఋషి అత్రి. ఆ అత్రి గోత్రోద్భవుఁడు లభింపనిచో ద్వితీయ గోత్రోద్భవునకుఁగాని, లేనిచో తృతీయ గోత్రోద్భవునకుఁగాని, అతఁడును లభింపనిచో సన్నిహితుఁడైన వేదార్థ విదుఁడగు బ్రాహ్మణునకు హిరణ్యము దక్షిణగా నీయవలెను.)

9. అర్థము: (హే యజమాన!=ఓ యజమానుఁడా!, త్వమ్=నీవు,) సువః=స్వర్గమును, విపశ్య=విశేషముగ చూడుము. అంతరిక్షమ్=ఆకాశమును, విపశ్య=విశేషముగ చూడుము. సదస్యైః=సభయందలి విప్రులతో, యతస్వ= అనుసరించి యుండుము.

తాత్పర్యము: ఓ యజమానుఁడా! నీవు స్వర్గమును ఆకాశమును విశేషముగ చూడుము. సభ యందున్న విప్రుల నను సరించి యుండుము. (సభకు వచ్చి యజమానుఁడు సభ యందలి విప్రులను చూడవలెను.)

10. అర్థము: (హే దక్షిణాః=దక్షిణగా నీయఁదగిన హిరణ్యాది ద్రవ్యములారా!, యూయమ్=మీరు,) అస్మ ద్దాత్రాః=మాచే ఈయఁబడిన వారగుచు, దేవత్రా=దేవరూపులైన ఋత్విజులయందు, గచ్ఛత=వెళ్లుఁడు. (హే గావః=ఓ గోవులారా!, యూయమ్=మీరు,) మధుమతీః=తీయని పాలు కల వారగుచు, ప్రదాతారమ్=(ఇచట) గొప్పగా దానము చేయు యజమానుని, ఆవిశత=(పరలోకమున రూపాంతరముతో) ఆవేశించుఁడు. అస్మాన్=మమ్ము, అనవహాయ=విడువక, దేవయానేన=దేవయానమగు, పథా=మార్గము చేత, ఇత=వెళ్లుఁడు. (గత్వా చ=వెళ్ళియు) సుకృతామ్=పుణ్యాత్ములయొక్క, లోకే=స్థానమునందు, సీదత=కూర్చుండుఁడు. తత్=ఆ స్థానము, నః=మాకు, సంస్కృతమ్=(ఉపభోగార్థముగా) సంస్కరింపఁబడినది.

తాత్పర్యము: ఋత్విజులకు దక్షిణగా ఈయఁబడునట్టి హిరణ్యాది ద్రవ్యములారా! మీరు మాచే ఈయఁబడిన వారలై దేవ స్వరూపులయిన ఋత్విజులలోనికి వెళ్లుఁడు. ఓ గోవులారా! మీరు మధుర క్షీరములు కల వారగుచు ఈ యజమానుని పరలోకమునందు రూపాంతరమున ఆవహింపుఁడు. మమ్ము విడువక దేవయాన మార్గమున వెళ్లుఁడు. వెళ్లియు అచట పుణ్యాత్ముల స్థానమున కూర్చుండుఁడు. ఆ స్థానము మాకు ఉపభోగార్థముగా సంస్కరింపఁబడినది. (దక్షిణగా హిరణ్యాదికమును ఋత్విజుల కీయవలెను.)

త్రిచత్వారింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే చతుశ్చత్వారింశోఽనువాకః।

మూలము: [1]ధాతా రాతి స్సవితేదం జుషన్తాం ప్రజాపతి ర్నిధిపతి ర్నో అగ్నిః। త్వష్టా విష్ణుః ప్రజయా
సగ్ంరరాణో యజమానాయ ద్రవిణం దధాతు। [2]సమిన్ద్ర ణో మనసా నేషి గోభి స్సగ్ం
సూరిభి ర్మఘవ న్త్సగ్ం స్వస్త్యా। సం బ్రహ్మణా దేవకృతం యదస్తి సం దేవానాగ్ం
సుమత్యా యజ్ఞియానామ్। [3]సం వర్చసా పయసా సం తనూభి రగన్మహి మనసా సగ్ం శివేన।
త్వష్టా నో అత్ర వరివః కృణోతు(౧) అనుమార్ష్టు తనువో యద్విలిష్టమ్। [4]యదద్య త్వా
ప్రయతి యజ్ఞే అస్మి న్నగ్నే హోతార మవృణీమహీ హ। ఋధ గయా డృధ గుతా శమిష్ఠాః
ప్రజాన న్యజ్ఞ ముపయాహి విద్వాన్। [5]స్వగావో దేవా స్సదన మకర్మ య ఆజగ్మ సవనేదం
జుషాణాః। జక్షివాగ్ంసః పపివాగ్ంస శ్చ విశ్వే ఽస్మే ధత్త వసవో వసూని। [6]యా నావహ
ఉశతో దేవ దేవా న్తాన్ (౨) ప్రేరయస్వే అగ్నే సుధస్థే। వహమానా భరమాణా హవీగ్ంషి
వసుం ఘర్మం దివ మాతిష్ఠతా ను। [7]యజ్ఞ యజ్ఞం గచ్ఛ యజ్ఞపతిం గచ్ఛ స్వాం యోనిం
గచ్ఛ స్వాహా [8]ష తే యజ్ఞో యజ్ఞపతే సహ సూక్తవాక స్సువీర స్స్వాహా [9]దేవా గాతువిదో
గాతుం విత్త్వా గాతు మిత మనసస్పత ఇమం నో దేవ దేవేషు యజ్ఞగ్ం స్వాహా వాచి స్వాహా
వాతేధాః ॥(౩)॥ (కృణోతు తా నష్టౌ చత్వారిగ్ంశ చ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే చతుశ్చత్వారింశోఽనువాకః।

వేదార్థదీపిక

1\. అర్థము: రాతిః=దానశీలుఁడగు, ధాతా=బ్రహ్మ, సవితా=సూర్యుఁడు, నిధిపతిః=మహాశంఖ ఖర్వాది నవనిధులకు పాలకుఁడగు, ప్రజాపతిః=ప్రజాపతి, అగ్నిః=అగ్నిదేవుఁడు, త్వష్టా=త్వష్టృదేవుఁడు, విష్ణుః=విష్ణువును, నః=మాయొక్క, ఇదమ్=ఈ హవిస్సును, జుషన్తామ్=సేవింతురుగాక. (సః అయమ్=ఆ యీ దేవగణము) ప్రజయా=యజమానుని సంబంధి యగు సంతానముతో, సం రరాణః=బాగుగ క్రీడించు చున్నదై, యజమానాయ=యజమానుని కొఱకు, ద్రవిణమ్=ధనమును, దధాతు=పోషించుఁగాక.

తాత్పర్యము: దానశీలుఁడగు బ్రహ్మయు, మహాశంఖ ఖర్వాది నవనిధుల కధిపతియైన ప్రజాపతియు, సూర్యాగ్ని త్వష్టృ విష్ణుదేవులును మా యీ హవిస్సును సేవింతురుగాక. ఆ యీ షడ్దేవతలు యజమానునియొక్క సంతానముతో క్రీడించుచు యజమానునకు ధనము నభివృద్ధి చేయుదురుగాక. (జుహువునందు తొమ్మిది మారులు హవిస్సును తీసికొని ఆఱు ఋక్కులతోను, మూఁడు యజుస్సులతోను, హోమము చేయవలయును. ఆ యాఱు ఋక్కులలో ఇది మొదటి ఋక్కు.)

2\. అర్థము: హే ఇన్ద్ర!=ఓ యింద్రుఁడా! (త్వమ్=నీవు,) మనసా=అనుగ్రహ యుక్త మనస్సుతో, నః=మమ్ము, గోభిః=గోవులతో, సన్నేషి=సంయోజింపఁజేయుము. సూరిభిః=(హోత మొదలగు) విద్వాంసులతో, సన్నేషి=కలుపుము. హే మఘవన్!=ఓ యింద్రుఁడా! స్వస్త్యా=క్షేమముతో, సన్నేషి=కలుపుము. బ్రహ్మణా=అర్థజ్ఞాన సహిత వేదముతో, దేవకృతమ్=దేవతల నిమిత్తమైన కర్మ, యత్=ఏది, అస్తి=కలదో!, (తేన=ఆ కర్మతో) సన్నేషి=కలుపుము. యజ్ఞియానామ్=యజ్ఞ సంబంధులగు, దేవానామ్=దేవతలయొక్క, సుమత్యా=అనుగ్రహ బుద్ధితో, సన్నేషి=కలుపుము.

తాత్పర్యము: ఓ యింద్రా! నీవు అనుగ్రహ సహిత మనస్సుతో మాకు గోవుల నొసఁగుము. హోత్రాది విద్వాంసులతో కలుపుము. మాకు క్షేమమును కలుగఁజేయుము. అర్థజ్ఞాన సహిత వేదముతో కర్మను జేయునట్లు చేయుము. యజ్ఞ సంబంధులగు దేవతల యనుగ్రహ బుద్ధి మాపై కలుగునట్లు చేయుము. (పైని పేర్కొనఁబడిన ఆఱు ఋక్కులలో ఇది రెండవది. క్షేమము=ఉన్నదానిని నష్టము కాకుండునట్లు కాపాడుకొనుట.)

3\. అర్థము: (వయమ్=మేము, దేవతానుగ్రహేణ=దేవతానుగ్రహముచేత) వర్చసా=బలముతోను, పయసా=(తద్బల హేతువైన) క్షీరముతోను, సమగన్మహి=కూడియుంటిమి. శివేన=శ్రద్ధాళువైన, మనసా=మనస్సుతో, సమగన్మహి=కూడియుంటిమి. త్వష్టా=త్వష్టృదేవుఁడు, నః=మాకు, అత్ర=ఈ యజ్ఞకర్మయందు, వరివః=కోరఁదగిన ధనమును, కృణోతు=చేయుఁగాక. (అపి చ=మఱియు) తనువః=శరీరములను, అనుమార్ష్టు=శోధన చేయుఁగాక. యత్+విలిష్టమ్=ఏ పాపము, (అస్తి=కలదో), తదపి=ఆ పాపమును కూడ, అనుమార్ష్టు=శోధించుఁగాక.

తాత్పర్యము: మేము దేవతానుగ్రహము వలన బలముతోను, తద్బల కారణమైన క్షీరాదికముతోను, శోభన శరీరముతోను, శ్రద్ధాయుత మనస్సుతోను కూడియుంటిమి. త్వష్టృ దేవత మాకీ కర్మయందు కోరఁదగిన ధనము నొసఁగుఁగాక. మఱియు మా శరీరమును శోధించి పాపమును నశింపఁజేయుఁ గాక. (ఇది తృతీయ ఋక్కు.)

4\. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ! యత్=ఏ కారణమువలన, అద్య=ఈ దివసమున, ఇహ=ఈ దేవయజన ప్రదేశమునందు, అస్మిన్ యజ్ఞే=ఈ యజ్ఞము, ప్రయతి సతి=జరుగుచుండఁగా, త్వా=నిన్ను, హోతారమ్=(హోమ నిష్పాదకునిగా) హోతగా, అవృణీమహి=వరించితిమో, (తత్=ఆ కారణమువలన,) ఋధక్=సమృద్ధముగా, అయాట్=దేవపూజను పూర్తి చేసితిమి. ఉత=మఱియు, (త్వమ్=నీవు,) ఋధక్=సమృద్ధముగా, ప్రజానన్=తెలిసికొనుచు, అశమిష్ఠాః=(మాకు) విఘ్న శాంతిని చేసితివి. (తతః=అందువలన, త్వమ్=నీవు,) విద్వాన్=(మా శక్తిని) తెలిసికొనినవాఁడవై, యజ్ఞమ్=(ఈ) యజ్ఞమును, ఉపయాహి=పొందుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! ఈ దినమున ఈ యాగ ప్రదేశమునందు ఈ యజ్ఞము జరుగుచుండగా నిన్ను హోతగా వరించి నాము. కావున ఈ యజ్ఞమును సమృద్ధముగా నిర్వర్తించితివి. మఱియు సమృద్ధముగా తెలిసికొనుచు మాకు విఘ్న శాంతిని చేసితివి. కావున మా భక్తిని తెలిసికొనిన వాఁడవై యీ యజ్ఞమును పొందుము. (ఇది చతుర్థ ఋక్కు.)

5. అర్థము: హే దేవాః=ఓ దేవతలారా!, యే=ఏ మీరు, జుషాణాః=ప్రీతి నొందుచున్నవారై, ఇదమ్=ఈ, సవనా= (మూఁడు) సవన కర్మలను గూర్చి, ఆ జగ్మ=వచ్చితిరో, వః=(ఆ) మీ యొక్క, సదనమ్=స్థానమును, స్వగా= స్వాధీనము చేసికొంటిమి. విశ్వే=(ఆ) మీరందఱు, జక్షివాంసః=సవనీయ పురోడాశములను భక్షించిన వారును, పపివాంసః=సోమరసమును త్రాగిన వారును. హే వసవః=నివాస హేతువులగు ఓ దేవతలారా!, (యూయమ్=మీరు) అస్మే=నా యందు, వసూని=ధనములను, ధత్త=స్థాపించుఁడు.

తాత్పర్యము: ఓ దేవతలారా! ప్రీతి నొందినవారై ఈ మూఁడు సవనీయ పురోడాశములను గూర్చి వచ్చిన మీయొక్క స్థానమును మేము స్వాధీనము చేసికొంటిమి. మీరందఱు సవనీయ పురోడాశములను భక్షించినవారు. సవనీయ సోమరసమును త్రాగినవారు కూడ. నివాస హేతువులగు దేవతలారా! మీరు మాకు ధనముల నొసఁగుఁడు (ఇది పంచమ ఋక్కు.)

6. అర్థము: హే అగ్నే దేవ!=ఓ యగ్నిదేవా!, ఉశతః=హవిస్సులను కోరుచున్న, యాన్ దేవాన్=ఏ దేవతలను, ఆవహః= ఆహ్వానించినవాఁడవో! తాన్=ఆ దేవతలను, స్వే=స్వీయమైన, సధస్థే=సహనివాస స్థానమునందు, ప్రేరయ=ప్రేరణ చేయుము. (హే దేవాః!=ఓ దేవతలారా!) హవీంషి=హవిస్సులను, వహమానాః= (రథాదులచే) కొనిపోవుచున్నవారును, భరమాణాః=పోషించుచున్నవారునై, వసుమ్=జగన్నివాస హేతు వగు, ఘర్మమ్=ఆదిత్యుని గూర్చి, ఆ తిష్ఠత=రండు. అను=పిమ్మట, దివమ్=స్వర్గమునుగూర్చి, ఆ తిష్ఠత=రండు.

తాత్పర్యము: ఓ యగ్నిదేవా! నీ వాహ్వానించిన హవిష్కాములగు దేవతలను వారి స్థానమునందు ఉండునట్లు ప్రేరణ చేయుము. ఓ దేవతలారా! మీరు రథాదులచేత హవిస్సులను వహించుచున్నవారును, పోషించుచున్న వారునై, జగన్నివాస హేతువగు నాదిత్యుని గూర్చి రండు. పిమ్మట స్వర్గమును గూర్చి రండు. (ఇది యాఱవ ఋక్కు.)

7. అర్థము: హే యజ్ఞ!=ఓ యజ్ఞమా! (త్వమ్=నీవు,) యజ్ఞమ్=(స్వప్రతిష్ఠకై) యజ్ఞ స్వరూపుఁడగు విష్ణువును, గచ్ఛ=పొందుము. యజ్ఞపతిమ్=యజ్ఞకర్తను, గచ్ఛ=(ఫలప్రదానమునకై) పొందుము. స్వాం యోనిమ్= స్వకారణ భూతమైన క్రియాశక్తిని, గచ్ఛ=(స్వనిష్పత్తి కొఱకు) పొందుము. స్వాహా=(ఈ హవిస్సు) హుతమగుఁగాక.

తాత్పర్యము: ఓ యజ్ఞమా! నీవు నీ స్థితికై యజ్ఞ స్వరూపుఁడైన విష్ణువును పొందుము. ఫలప్రదానమునకై యజ్ఞ కర్తను పొందుము. స్వకారణ భూతమైన క్రియా శక్తిని స్వనిష్పత్తి కొఱకు పొందుము. ఈ హవిస్సు హుతమగుఁగాక. (ఇది ప్రథమ యజుస్సు.)

8. అర్థము: హే యజ్ఞపతే!=ఓ యజ్ఞస్వామీ! (=అగ్నీ!,) తే=నీయొక్క, ఏషః=ఈ చేయఁబడుచున్న యజ్ఞము, సహ సూక్తవాకః=స్తోత్రములతో కూడినది, సువీరాః=మంచి వీరులు (=కర్మకుశలులు) కలది. స్వాహా= (కావున ఈ యాజ్యము నీచే) హుతము చేయఁబడుఁగాక.

తాత్పర్యము: యజ్ఞస్వామివగు నగ్నీ! ఈ చేయఁబడుచున్న యజ్ఞము స్తోత్రములతో కూడియున్నది. కర్మకుశలులైన ఋత్విజులు కలది. కావున ఈ యాజ్యము నీచే హుతము చేయఁబడుఁగాక.

9. అర్థము: గాతువిదః=మార్గమును తెలిసిన, హే దేవాః=ఓ దేవతలారా!, గాతుమ్=మీ యాగమన మార్గమును, విత్వా=తెలిసికొని, గాతుమిత=(యజ్ఞము సమాప్తమైన పిమ్మట) ఆ మార్గముననే వెళ్లుఁడు, మనసస్పతేః=మనస్సున కధిపతివైన, హే దేవః=ఓ పరమేశ్వరా! నః=మాయొక్క, ఇమమ్=ఈ, యజ్ఞమ్=యజ్ఞమును, దేవేషు=(హవిర్భోక్తలగు) దేవతలయందు, స్వాహా=స్థాపించుము. (తతః=పిమ్మట) వాచి=మంత్రరూప వాగ్దేవతయందు, స్వాహా=స్థాపించుము. (తతః=పిమ్మట) వాతే=క్రియా ప్రవర్తకుఁడగు దేవునియందు, ధాః=స్థాపించుము.

తాత్పర్యము: మీ యాగమన మార్గమును తెలిసిన దేవతలారా! ఈ యజ్ఞము సమాప్తమైన పిమ్మట మఱల ఆ మార్గముననే వెళ్లుఁడు. మనస్సున కధిపతివైన పరమేశ్వరా! మా యీ యజ్ఞమును హవిర్భోక్తలగు దేవతల యందు స్థాపించుము. పిమ్మట మంత్రరూప వాగ్దేవత యందు, క్రియా ప్రవర్తకుఁడగు దేవుని యందును స్థాపించుము. (ఇది మూఁడవ యజుస్సు.)

చతుశ్చత్వారింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే పంచచత్వారింశోఽనువాకః ।

మూలము: [1]ఉరుగ్ం హి రాజా వరుణ శ్చకార సూర్యాయ పన్థా మన్వేతవా ఉ। అపదే పాదా ప్రతిధాతవే

ఽక రుతాపవక్తా హృదయావిధ శ్చిత్। [2]శతం తే రాజ న్భిషజ స్సహస్ర ముర్వీ గమ్భీరా

సుమతి ష్టే అస్తు।బాధస్వ ద్వేషో నిర్ఋతిం పరాచైః కృతం చిదేనః ప్ర ముముగ్ధ్యస్మత్।

[3]అభిష్ఠితో వరుణస్య పాశో [4]ఽగ్నే రనీక మప ఆ వివేశ। అపాంనపా త్ప్రతి రక్ష న్నసూర్యం

దమే దమే (౧)సమిధం యక్ష్యగ్నే।ప్రతి తే జిహ్వా ఘృతముచ్చరణ్యే [5]త్సముద్రే తే హృదయ

మప్స్వన్తః। సం త్వా విశ న్త్వోషధీ రుతా ఽఽపో యజ్ఞస్య త్వా యజ్ఞపతే హవిర్భిః॥

సూక్తవాకే నమోవాకే విధేమా [6]వభృథ నిచఙ్కుణ నిచేరు రసి నిచఙ్కుణా వ దేవై ర్దేవకృత

మేనో ఽయా డవమర్త్యై ర్మర్త్యకృత మురో రా నో దేవరిష స్పాహి [7]సుమిత్రా న ఆప

ఓషధయః (౨)సన్తు దుర్మిత్రా స్తస్మై భూయాసు ర్యో ఽస్మా న్ద్వేష్టి యం చ వయం ద్విష్మో

[8]దేవీ రాప ఏష వో గర్భ స్తం వ స్సుప్రీతగ్ం సుభృత మకర్మ దేవేషు న స్సుకృతో

బ్రూతా [9]త్ప్రతియుతో వరుణస్య పాశః ప్రత్యస్తో వరుణస్య పాశ[10] ఏధో ఽస్యేధిషీమహి

సమిదసి తేజోఽసి తేజో మయి ధేహ్యపో అన్వచారిషగ్ం రసేన సమసృక్ష్మహి। పయస్వాగ్ం

అగ్న ఆగమం తం మాసగ్ం సృజ వర్చసా ॥3॥ (దమే దమ ఓషధయ ఆ షట్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే పఞ్చచత్వారింశోఽనువాకః॥

వేదార్థదీపిక

1. **అర్థము:** వరుణః రాజా ఉ=వరుణరాజే, సూర్యాయ=సూర్యుని కొఱకు, అన్వేతవై=అనుక్రమముగ పోవుటకు, అపదే=ఆధార రహితమైన అంతరిక్షమునందు, ఉరుమ్=విస్తీర్ణమైన, పన్థామ్=మార్గమును, హి=ఏ కారణము వలన, చకార=చేసెనో, (తత్=ఆ కారణము వలన) పాదా ప్రతిధాతవే=పాదమునుంచుటకు, (మార్గమ్=మార్గమును) అకః=చేయుఁగాక. ఉత=మఱియు, (యః=ఏ శత్రువు) అపవక్తా=నిందకుఁడో, (యశ్చ=ఎవఁడును) హృదయావిధః=హృదయోపలక్షితమైన శరీరమును బాధించుచున్నాఁడో, (సః) చిత్=వాఁడు కూడ (ప్రతిబంధించకుండ మార్గము చేయుఁగాక.)

తాత్పర్యము: (ఈ యనువాకమునందు అవభృథము వర్ణింపఁబడుచున్నది. అవభృథము=యజ్ఞము సమాప్తమైన పిమ్మట తుది దినమున చేయు కర్మకలాపము. అవభృథమునాఁడు యజ్ఞకర్త యజ్ఞదీక్షను విడిచిపెట్టును.) వరుణరాజే సూర్యుని పొందుటకు నిరాధారమగు నంతరిక్షమునందు విపులమగు మార్గము నేర్పఱచెను. కావున మాకుఁగూడ పాదము నుంచుటకై మార్గమును జేయుఁగాక. మఱియు నిందకుఁడు, శరీరమును బాధించువాఁడునై యుండెడి శత్రువు కూడ ప్రతిబంధకము లేకుండ మార్గమును జేయుఁగాక. (యజమానాదులు వేదినుండి బయలుదేరిన వారై యీ మంత్రము పఠించవలెను.)

2. **అర్థము:** హే రాజన్!=ఓ వరుణదేవా! తే=నీకు, శతం సహస్రమ్=శత సహస్ర సంఖ్యాకులగు, భిషజః=ఉపద్రవ నివారకులు. (సన్తి=కలరు. తతః=అందువలన) తే=నీయొక్క, ఉర్వీ=విపులమైనదియు, గంభీరా=ఆదర యుక్తమునునగు, సుమతిః=అనుగ్రహబుద్ధి, అస్తు=(మా యందు)ఉండుఁగాక. ద్వేషః=శత్రువులను, బాధస్వ=బాధించుము. నిర్ఋతిమ్=యజ్ఞ విఘాతినియగు రాక్షసిని, పరాచైః కురు=తిరస్కరించుము. కృతమ్= (మా చేత) చేయఁబడిన, ఏనశ్చిత్=పాపమునుగూడ, అస్మత్=మా నుండి, ప్ర ముముగ్ధి=విమోచనము చేయుము. (ద్వేషః=ద్విషః.)

తాత్పర్యము: ఓ వరుణదేవా! నీకు శతసహస్ర సంఖ్యాకులుగా ఉపద్రవనివారకులు గలరు. కావున మా యందు ఆదర యుక్తమును, సార్వకాలికమునైన, నీ యనుగ్రహబుద్ధి నుంచుము. మా శత్రువులను బాధించుము. యజ్ఞ విఘాతినియగు రాక్షసిని తిరస్కరించుము. మేము చేసిన పాపమును గూడ మా నుండి పోఁగొట్టుము. (ఈ మంత్రమును జపించవలెను.)

3. **అర్థము:** వరుణస్య=వరుణదేవునియొక్క, పాశః=పాశము, అభిష్ఠితః=తిరస్కృతమైనది.

తాత్పర్యము: సూక్ష్మతంత్వాకారముతో జలమధ్యమం దుండునట్టి బంధన హేతువైన జీవవిశేషము వరుణపాశము. పాదాక్రమణముచే ఆ పాశము తిరస్కృతమైనదనిభావము. (యజమానాదులు వేదినుండి లేచి నిలుచుండవలెను.)

4. **అర్థము:** అగ్నేః=అగ్నియొక్క, అనీకమ్=ముఖము, అపః=జలమును, ఆవివేశ=ప్రవేశించెను. హే అపాంనపాత్ అగ్నే!=‘అపాంనపాత్’ అను పేరుగల యగ్నీ! దమేదమే=ప్రతి గృహమునందు; అసుర్యమ్=అసురకృత యజ్ఞవిఘ్నమును, ప్రతిరక్షన్=నివర్తింపఁజేసి, సమిధమ్=ప్రజ్వలన సాధనమైన అజ్యమును, యక్షి=సంయోగింపఁజేయుము. తే=నీయొక్క, జిహ్వా=నాలుక, ఘృతం ప్రతి=అజ్యమునుగూర్చి, ఉచ్చరణ్యేత్=ఉద్యుక్తమగుఁగాక. (ప్రతిరక్షన్=క్త్వార్థమున శతృప్రత్యయము ప్రయుక్తమైనది.)

తాత్పర్యము: అగ్నిముఖము నీటిని ప్రవేశించినది. ‘అపాంనపాత్’ అను పేరుగల యగ్నీ! ఆ యా గృహములందు అసురులు చేయుచున్న యజ్ఞవిఘ్నములను తొలఁగించి యజ్ఞమును కాపాడుచు జ్వలనసాధనమైన అజ్యమును కలిసికొనునట్లు చేయుము. నీ నాలుక అజ్యమును గ్రహించుట కుద్యుక్త మగుఁగాక.

5. అర్థము: హే జుహు!=ఓ జుహువా!, తే=నీయొక్క, హృదయమ్=బిలము, సముద్రే అప్సు=సముద్ర సమానము అయిన ఉదకములయందు, అన్తః=మధ్యలో, ప్రతితిష్ఠతు=ఉండుగాక. ఓషధీః=ఓషధులు, త్వా=నిన్ను, సంవిశన్తు=బాగుగా ప్రవేశించుగాక. ఉత=మఱియు, ఆపః=ఉదకములు, విశన్తు=ప్రవేశించుగాక. హే యజ్ఞపతే!=ఓ యజమానుఁడా! తే=నీ యొక్క, యజ్ఞస్య=యజ్ఞముయొక్క, హవిర్భిః=హవిస్సులచే, త్వా=నిన్ను, సూక్తవాకే="ఇదం ద్యావాపృథివీ" ఇత్యాది సూక్తవాక మంత్రముయొక్క ఫలమునందు, నమోవాకే="నమో వాచే యా చోదితా" ఇత్యాది నమోవాక మంత్ర ఫలమునందును, విధేమ=స్థాపించుదుము.

తాత్పర్యము: ఓ జుహువా! నీ బిలము సముద్ర సమానము అయిన యుదకములం దుండుఁగాక. ఋజీషరూపములయిన ఓషధులు, ఉదకములు నీలో ప్రవేశించుఁగాక. ఓ యజ్ఞపతీ! నీ యజ్ఞమునకు సంబంధించిన హవిస్సులచే దేవతలను తృప్తిపఱచి నిన్ను సూక్తవాక నమోవాకములచే చెప్పఁబడిన ఫలములందు స్థాపించుచున్నాము. ఆ సూక్తవాక నమోవాకములచే ప్రతిపాదితములైన ఫలములు నీకు కలుగునట్లు చేయుదుమని భావము. (యజమానాదులు అవభృథము సందర్భమున యజ్ఞవేది నుండి బయలుదేరి ఉదక సమీపమునకు పోయి హోమసాధనమైన స్రుచమును ఉదకములందు వేయవలెను.)

6. అర్థము: హే అవభృథ!=ఓ అవభృథ కర్మాభిమాని వగు వరుణదేవా! (త్వమ్=నీవు,) నిచఙ్కుణ=(రాక్షస నివృత్తికై) మిక్కిలి ధ్వని చేయించినవాఁడవు, నిచేరుః=(మమ్ము రక్షించుటకై) నిగూఢముగ సంచరించు స్వభావము కలవాఁడవును, అసి=అగుచున్నావు. హే నిచఙ్కుణ!=ఓ వరుణదేవా! దేవకృతమ్=(మాచే) దేవతలయందు చేయఁబడిన, ఏనః=అపరాధమును, దేవైః=దేవతలతో కూడ, (త్వమ్=నీవు,) అవాయాట్=నశింపఁ జేయుము. మర్త్యకృతమ్=మానవు లయిన ఋత్విజుల యందు చేయఁ బడిన, ఏనః=అపరాధమును, మర్త్యైః=మానవుల (ఋత్విజుల) తోఁ గూడ, అవాయాట్=నశింపఁ జేయుము. హే దేవ!=ఓ వరుణ దేవా!, ఉరోః=అధికమైన, రిషః=(దేవ మర్త్యకృత) హింసనుండి, నః=మమ్ము, ఆ=అంతటను, పాహి=రక్షింపుము. (నిచఙ్కుణ=నిచఙ్కుణః అని యర్థము. విభక్తి లోపము ఛాందసము.)

తాత్పర్యము: అవభృథ కర్మాభిమాని వగు వరుణ దేవా! నీవు రాక్షస నివృత్తికై అత్యంతము ధ్వనిని చేయించుచున్న వాఁడవు. మమ్ము రక్షించుటకై నిగూఢముగ సంచరించు స్వభావము కలవాఁడవు కూడ. ఓ వరుణ దేవా! మేము దేవతల యందు ఋత్విజుల యందును చేసిన యపరాధమును ఆ దేవతలతోను ఋత్విజులతోనుగూడ నశింపఁ జేయుము. ఓ వరుణదేవా! దేవతలు ఋత్విజులు చేసిన అధిక హింస నుండి మమ్ము రక్షింపుము.

7. అర్థము: ఆపః=ఉదకములు, ఓషధయః=ఓషధులు, నః=మాకు, సుమిత్రాః=మంచి మిత్రములై, సన్తు=ఉండుఁగాక. యః=ఎవఁడు, అస్మాన్=మమ్ము, ద్వేష్టి=ద్వేషించు చున్నాఁడో, చ=మఱియు, వయమ్=మేము, యమ్=ఎవనిని, ద్విష్మః=ద్వేషించు చున్నామో; తస్మై=ఆ శత్రువు కొఱకు, దుర్మిత్రాః=(ఉదకములు ఓషధులును) దుష్ట మిత్రములు, భూయాసుః=అగుఁగాక.

తాత్పర్యము: ఉదకములు ఓషధులు మాకు సుమిత్రము అగుఁగాక. మమ్ము ద్వేషించువానికిని, మేము ద్వేషించువానికిని అవి దుర్మిత్రము లగునుగాక. (అంజలితో ఉదకములను తీసికొని పశ్చిమ దిగభిముఖముగ విడువవలెను.)

8. అర్థము: హే ఆపః దేవీః!=ఓ ఉదక దేవతలారా!, ఏషః=ఈ వరుణ దేవుఁడు, వః=మీ యొక్క, గర్భః=గర్భము వలె లోపల నున్నవాఁడు. వః=మీ యొక్క, (పరితోషాయ=సంతోషమునకై,) తమ్=ఆ వరుణ దేవుని, సుప్రీతమ్=(హవిస్సుచే) మిక్కిలి సంతుష్టి కలవానినిగాను, సుభృతమ్=మిక్కిలి పుష్టిగల వానినిగాను, అకర్మ=చేసితిమి. (సః=ఆ వరుణ దేవుఁడు) నః=మమ్ము, సుకృతః=సదనుష్ఠానము చేసిన వారినిగా, దేవేషు=దేవతలయందు, బ్రూతాత్=పలుకుఁగాక.

తాత్పర్యము: ఓ యుదక దేవతలారా! వరుణ దేవుఁడు మీ లోపల గర్భమువలె నున్నవాఁడు. కావున మీ సంతోషము నకై హవిస్సుచే ఆ వరుణ దేవుని, సంతుష్టియు సంపుష్టియుఁ గల వానినిగాఁ జేసితిమి. ఆ వరుణ దేవుఁడు మమ్ము సదనుష్ఠానవంతులని దేవతలకు చెప్పుఁగాక. (అవభృథము నభిమంత్రించ వలెను.)

9. అర్థము: వరుణస్య=వరుణ దేవునియొక్క, పాశః=పాశము, ప్రతియుతః=వేఱుచేయఁబడినది. వరుణస్య=వరుణ దేవునియొక్క, పాశః=పాశము, ప్రత్యస్తః=నశింపఁజేయఁబడినది.

తాత్పర్యము: వరుణ దేవుని పాశము వేఱుచేయఁబడినది. నశింపఁజేయఁబడినది కూడ. (యజమానుఁడు నీటి మధ్యమున ప్రవేశించవలెను.)

10. అర్థము: హే సమిత్!=ఓ సమిధా! (త్వమ్=నీవు,) ఏధః=వృద్ధి హేతువు, అసి=అగుచున్నావు. (వయమ్=మేము) ఏధిషీమహి=అభివృద్ధి నొందితిమి. తేజః=కాంతి సాధనము, అసి=అగుచున్నావు. మయి=నాయందు, తేజః=కాంతిని, ధేహి=స్థాపించుము. ఆపః అను=జలమును పొంది, అచారిషమ్=అవభృథ కర్మను ఆచరించినవాఁడను. రసేన=ఫలముతో, సమ సృక్ష్మహి=కూడినవాఁడను అగుచున్నాను. హే అగ్నే!=ఓ యగ్నీ!=పయస్వాన్=క్షీరాది సమృద్ధి కలవాఁడనై, ఆగమమ్=(ఇచటకు) వచ్చితిని. తమ్=ఆ, (=అటువంటి) మా=నన్ను, సంసృజ=బలముతో కలుపుము.

తాత్పర్యము: ఓ సమిధా! నీవు వృద్ధి హేతువు, కాంతి సాధనము నగుచున్నావు. మేము అభివృద్ధి నొందితిమి. నాయందు కాంతి నుంచుము. జలమును పొంది అవభృథ కర్మ నాచరించితిని. ఫలవంతుఁడను. ఓ యగ్నీ! క్షీరాదుల సమృద్ధి కలవాఁడనై యిచటకు వచ్చితిని. అటువంటి నన్ను బలము కల వానినిగ చేయుము. (యజమానుఁడు ఆహవనీయాగ్ని యందు సమిధనుంచి అగ్ని సమీపమున నుండవలెను.)

పంచచత్వారింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే షట్చత్వారింశోఽనువాకః।

మూలము: [1]య స్త్వా హృదా కీరిణా మన్యమానో ఽమర్త్యం మర్త్యో జోహవీమి। జాతవేదో యశో అస్మాసు ధేహి ప్రజాభి రగ్నే అమృతత్వ మశ్యామ్।[2] యస్మై త్వగ్ం సుకృతే జాతవేద ఉ లోక మగ్నే కృణవ స్స్యోనమ్। అశ్వినగ్ం సపుత్రిణం వీరవన్తం గోమన్తగ్ం రయిం నశతే స్వస్తి। [3]త్వే సుపుత్ర శవసో ఽవృత్రన్ కామకాతయః। న త్వా మిన్ద్రాతి రిచ్యతే। [4]ఉక్థ ఉక్థే సోమ ఇన్ద్రం మమాద నీథే నీథే మఘవానమ్ (౧)సుతాసః। యదీగ్ంసబాధః పితరం న పుత్రా స్సమానదక్షా అవసే హవన్తే। [5]అగ్నే రసేన తేజసా జాతవేదో విరోచసే। రక్షోహా ఽమీవ చాతనః। [6]అపో అన్వచారిషగ్ం రసేన సమసృక్ష్మహి। పయస్వాగ్ం అగ్న ఆగమం తం మా సగ్ంసృజ వర్చసా [7]వసు ర్వసుపతి ర్హి క మ స్యగ్నే విభావసుః। స్యామతే సుమతా వపి। [8]త్వా మగ్నే వసుపతిం వసూనా మభి ప్రమన్దే (౨)అధ్వరేషు రాజన్। త్వయా వాజం వాజయన్తో జయేమాభి ష్యామ పృత్సుతీ ర్మర్త్యానామ్। [9]త్వా మగ్నే వాజసాతమం విప్రా వర్ధన్తి సుష్టుతమ్। సనో రాస్వ సువీర్యమ్ [10]అయం నో అగ్ని ర్వరివః కృణో త్వయం మృధః పుర ఏతు ప్రభిన్దన్। అయగ్ం శత్రూ ఞ్జయతు జర్హృషాణో ఽయం వాజం జయతు వాజసాతౌ [11]అగ్నినా ఽగ్ని స్సమిధ్యతే కవి ర్గృహపతి ర్యువా హవ్యవా డ్జుహ్వాస్యః। [12]త్వగ్ం హ్యగ్నే అగ్నినా విప్రో విప్రేణ సన్త్సతా। సఖా సఖ్యా సమిధ్యసే। [13]ఉదగ్నే శుచయ స్తవ విజ్యోతిషా ॥౩॥

(మఘవానం మన్దేహ్యగ్నే చతుర్దశ చ)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే షట్చత్వారింశోఽనువాకః॥

(ఆదదీ వాచస్పతయ ఉపయామ గృహీతో ఽస్యావాయో అయం వాం యా వాం ప్రాత ర్యుజా వయం వేన స్తం ప్రత్నథా యే దేవా స్త్రిగ్ంశ దుపయామ గృహీతో ఽసి మూర్ధానం మధు శ్చేన్ద్రాగ్నీ ఓ మా నో మరుత్వం స్త ఇన్ద్ర మరుత్వో మరుత్వా న్మహా న్మహా న్నృవ త్కదా వామ మదర్ధీ ర్హిరణ్యపాణిగ్ం సుశర్మా బృహస్పతి ర్హరి రస్యగ్న ఉత్తిష్ఠ న్తరణి రాప్యాయస్వే యుష్టే యే జ్యోతిష్మతీం ప్రయాసాయ చిత్త మాతిష్ఠేన్ద్ర మసావి సర్వస్య మహా న్త్సజోషా ఉదు త్యం ధాతా రుగ్ంహి య స్త్వా షట్చత్వారిగ్ం శత్ ॥౪౬॥)

(ఆదదే యే దేవా మహా నుత్తిష్ఠ న్త్సర్వస్య సన్త దుర్మిత్రా శ్చతుః (తుష్) పఞ్చాశత్ ॥౫౪॥)

(హరిః ఓమ్)॥

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థఃప్రపాఠకః ॥౪॥

వేదార్థదీపిక

అవతారిక: పంచచత్వారింశానువాకము నందు సోమయాగము సమాప్తమైనది. ఈ యనువాకమునందు యాజ్యాపురోను వాక్యలు చెప్పఁబడుచున్నవి.

1. అర్థము: హే జాతవేదః=ఓ యగ్నీ!, యః=ఏ, (అహమ్=నేను) మర్త్యః=మర్త్యుఁడ నగుచు, కీరిణా=గుణకీర్తన స్వభావము కల, హృదా=మనస్సుతో, త్వా=నిన్ను, అమర్త్యమ్=మరణ రహితునిగా, మన్యమానః=తలఁచుచున్నవాఁడనై, ఆహ్వయామి=ఆహ్వానించుచున్నానో, అస్మాసు=(అటువంటి) మా యందు, ప్రజాభిః=పుత్ర పౌత్రాది సంతానములచే, (సంపాదితమ్=సంపాదింపఁబడిన) యశః=కీర్తిని, ధేహి=ఉంచుము. (హే అగ్నే!=ఓ యగ్నీ!, త్వదనుగ్రహేణ=నీ యనుగ్రహముచే) అమృతత్వమ్=అమృతత్వమును, అశ్యామ్=పొందుదును.

తాత్పర్యము: ఓ యగ్నీ! నేను మర్త్యుఁడ నగుచు గుణకీర్తన స్వభావము గల మనస్సుతో నిన్ను మరణ రహితునిగా భావించుచు ఆహ్వానించుచున్నాను. అటువంటి మమ్ము సంతానముచే సంపాదించఁబడిన కీర్తి కల వారినిగాఁ జేయుము. నీ యనుగ్రహమువలన అమృతత్వమును పొందుదును. (ఇష్టికాండ యందలి ద్విహవిష్కేష్టి కిది పురోనువాక్య. అమృతత్వము=మరణ రాహిత్యము=దేవత్వము.)

2. అర్థము: హే జాతవేదః అగ్నే!=ఓ జాతవేదాగ్నీ!, త్వమ్=నీవు, సుకృతే=మంచి కర్మను జేయుచున్నట్టి, యస్మై=ఏ యజమానుని కొఱకు, స్యోనమ్=ఉత్కృష్టమైన, లోకమ్+ఉ=స్థానమునే, కృణవః=చేయుచున్నావో; సః=ఆ యజమానుఁడు, అశ్వినమ్=అశ్వములతో కూడినదియు, పుత్రిణమ్=పుత్రులతో కూడినదియు, వీరవన్తమ్=శూర భటులతో కూడినదియు, గోమన్తమ్=గోవులు కలదియు నగు, రయిమ్=ధనమును, స్వస్తి=బాగుగా, నశతే=పొందుచున్నాఁడు. (కృణవః=కరోషి.)

తాత్పర్యము: ఓ జాతవేదాగ్నీ! నీవు మంచి కర్మలను జేయు యజమానునకు గొప్ప స్థానమును కల్పించుచున్నావు. ఆ యజమానుఁడు అశ్వములు, పుత్రులు, వీరులు, గోవులతోఁ గూడిన ధనమును పొందుచున్నాఁడు. (ఇది యాజ్య.)

3. అర్థము: హే శవసః పుత్రః=బలమునకు పుత్రుఁడవైన యింద్రా!, త్వే=నీయందు, కామకాతయః=భోగమును కోరునట్టి స్తోత్రములు (సు+అవృత్రన్=) స్వవృత్రన్=బాగుగా కలవు. త్వా=నిన్ను, నాతిరిచ్యతే=(ఒక్క స్తుతియు) అతిక్రమించుట లేదు.

తాత్పర్యము: బలమునకు పుత్రుఁడవైన ఓ యింద్రా! భోగములను కోరునట్టి స్తుతులన్నియు నీ యందు బాగుగా నుంటున్నవి. ఒక్కటియు నిన్నతిక్రమించుట లేదు. ('త్వయి' అను నర్థమున 'త్వే' అనునది వైదిక ప్రయోగము. కామాః కామ్యన్తే యాభిః స్తుతిభి రితి='కామకాతయః' అని సమాసార్థము. ఇది పురోనువాక్య.)

4. అర్థము: ఉక్థే+ఉక్థే=ఉక్థ ఉక్థే=సోమయాగవర్తి యగు ఆ యా శస్త్రమునందు, సోమః=సోమము, ఇన్ద్రమ్=ఇంద్రుని, మమాద=సంతోషపెట్టెను. సమానదక్షాః=సమాన యజమానులందు కుశలులైన, సుతాసః=పుత్ర స్థానీయులైన యజమానులు, మఘవానమ్=ఇంద్రుని, పుత్రాః పితరం న=కుమారులు తండ్రిని వలె, నీథే నీథే=ఆ యా యాగప్రదేశమునందు, అవసే=రక్షణముకొఱకు, యదీంసబాధః=ఇటువంటి యింద్రుఁడు శత్రువులను బాధించువాఁడు కావున, హవన్తే=ఆహ్వానించుచున్నారు.

తాత్పర్యము: సోమయాగమునందలి ఆ యా శస్త్రమునందు సోమము ఇంద్రుని సంతోషపెట్టెను. సాటి యజమానులలో నేర్పరులైన పుత్రస్థానీయు లగు యజమానులు, పితృ స్థానీయుఁడైన యింద్రుడు శత్రువులను బాధించువాఁడు కావున, రక్షణమునకై ఆ యింద్రుని, కుమారులు తండ్రిని వలె ఆహ్వానించుచున్నారు. (ఇది యాజ్య. ఇతరులచే బాధింపఁబడిన పుత్రులు తమ్ము రక్షించుటకై తండ్రిని పిలుచు విధముగ యజమానులు ఇంద్రుని పిలుచుచున్నారని భావము. ఇంద్రుఁడు శత్రువులను నశింపఁ జేయువాఁడగుట యిందుకుఁ గారణము. కావ్యలింగాలంకారము.)

5. అర్థము: హే జాతవేదః అగ్నే!=ఓ జాతవేదాగ్నీ!, రసేన=బలముతో, (అస్మాన్=మమ్ము, యోజయ=కలుపుము.) రక్షోహా=(యాగ ప్రదేశమున) రాక్షస సంహర్తవు, అమీవచాతనః=(శరీరమునందలి) అంతర రోగమునకు వినాశకుఁడవునగు (త్వమ్=నీవు) తేజసా=తేజస్సుతో, విరోచసే=విశేషముగ ప్రకాశించుచున్నావు.

తాత్పర్యము: ఓ జాతవేదాగ్నీ! యాగ దేశమున రాక్షసులను సంహరించు వాఁడవు, శరీరము నందలి అంతర రోగమును నశింపఁ జేయువాఁడవు నగు నీవు మమ్ము బలము కలవారినిగాఁ జేయుము. నీవు తేజస్సుచే విశేషముగ ప్రకాశించుచున్నావు. (ఇది పురోనువాక్య.)

6. అర్థ తాత్పర్యములకు 45 అనువాకము నందలి 10 వ మంత్ర వ్యాఖ్యానము చూడుఁడు. (ఇది యాజ్య.)

7. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ!, హిరకమ్=ఏ కారణము వలన, (త్వమ్=నీవు) వసుః=లోకముల నుండునట్లుగా చేయువాఁడవు, వసుపతిః=ధనపతివి, విభావసుః=తేజోధనుఁడవు, అసి=అగుచున్నావో; తత్=ఆ కారణము వలన, (వయమ్) అపి=(మేము) కూడ, తే=నీ యొక్క, సుమతౌ=అనుగ్రహ బుద్ధియందు, స్యామ=ఉందుము.

తాత్పర్యము: ఓ జాతవేదాగ్నీ! నీవు లోకస్థితి కారకుఁడవు, ధనపతివి, తేజోధనుఁడవు కావున మేము కూడ నీ యనుగ్రహ బుద్ధియం దుందుము. మమ్ము అనుగ్రహ బుద్ధితో చూడుమని భావము. (ఇది యాజ్య.)

8. అర్థము: రాజన్=ప్రకాశించునట్టి, హే అగ్నే!=ఓ యగ్నీ!, అధ్వరేషు=యజ్ఞములందు, వసూనామ్=ధనములలో, వసుపతిమ్=శ్రేష్ఠ ధనమున కధిపతివైన, త్వామ్=నిన్ను, అభిప్రమన్దే=అధికముగ సంతోషపెట్టుచున్నాము. వాజయన్తః=అన్నమును కోరుచున్న, వయమ్=మేము, త్వయా=నీ(యనుగ్రహము)చేత, వాజమ్=అన్నమును, జయేమ=జయించెదము. (=పొందెదము.) మర్త్యానామ్=(విరోధులగు) మనుష్యుల యొక్క, పృత్సుతీః=సేనలను, అభిష్యామ=తిరస్కరించుటకు సమర్థుల మగుదుము.

తాత్పర్యము: ప్రకాశించుచున్న యగ్నీ! ధనములలో శ్రేష్ఠ ధనముల కధిపతివైన నిన్ను యజ్ఞములం దంతటను అధికముగ సంతోషపెట్టుచున్నాము. అన్నము కోరుచున్న మేము నీ యనుగ్రహముచే అన్నమును పొందెదము. విరోధుల సేనలను తిరస్కరించుటకు సమర్థుల మయ్యెదము. (ఇది పురోనువాక్య.)

9. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ!, వాజసాతమమ్=అధికముగ అన్నము నిచ్చు వాఁడవును, సుష్టుతమ్=(స్తోత్రములచే) సుష్ఠుగ స్తుతింపఁబడినవాఁడవు నగు, త్వామ్=నిన్ను, విప్రాః=బ్రాహ్మణులు, (=యజమానులు) వర్ధన్తి=అభివృద్ధిని పొందించుచున్నారు. సః=అటువంటి నీవు, నః=మాకు, సువీర్యమ్=మంచి సామర్థ్యమును, రాస్వ=ఒసఁగుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! అధికముగ అన్నము నిచ్చుచున్న వాఁడవు, స్తోత్రములచే మిగుల స్తుతింపఁబడు వాఁడవునగు నిన్ను యజ్ఞకర్తలు అభివృద్ధి నొందించుచున్నారు. అటువంటి నీవు మాకు మంచి సామర్థ్యము నొసఁగుము. ('అభివర్ధన్తే' అను ఆత్మనేపదమునకు బదులు 'అభివర్ధన్తి' అను పరస్మైపద ప్రయోగము వైదికము. ఇది యాజ్య.)

10. అర్థము: అయమ్=ఈ, అగ్నిః=అగ్ని, నః=మాకు, పరివః=పరిచర్య చేయు భృత్య వర్గమును, కృణోతు=చేయుఁగాక. అయమ్=ఈ యగ్ని, మృధః=శత్రువులను, ప్రభిన్దన్=చీల్చుచు, పురః=ఎదుట, ఏతు=పోవుఁగాక. అయమ్=ఈ యగ్ని, జర్హృషాణః=కొట్టుచున్నవాఁడై, శత్రూన్=శత్రువులను, జయతు=జయించుఁ గాక. అయమ్=ఈ యగ్ని, వాజసాతౌ=అన్నదాన నిమిత్తము, వాజమ్=(ఇతరుల) అన్నమును, జయతు=జయించుఁ గాక.

తాత్పర్యము: ఈ యగ్ని మాకు పరిచర్య చేయునట్టి భృత్య వర్గమును కలుగఁజేయుఁ గాక. శత్రువులను చెండాడుచు, ముందు నడచుఁ గాక. శత్రువులను కొట్టుచు జయించుఁ గాక. అన్నదానము నిమిత్తము ఇతరుల యన్నమును సంపాదించుఁ గాక. (ఇది యాజ్య.)

11. అర్థము: అగ్నినా=(రెండవ మారు ఉంచఁబడిన) అగ్నిచేత, కవిః=పండితుఁడును, గృహపతిః=గృహమునకు యజమానుఁడును, యువా=యువకుఁడును, హవ్యవాట్=హవిస్సును వహించువాఁడును, జుహ్వాస్యః=జుహువు ముఖముగాఁ గలవాఁడును నగు, అగ్నిః=(పూర్వస్థితుఁడైన) అగ్ని, సమిధ్యతే=బాగుగ ప్రజ్వలింపఁజేయఁబడుచున్నాఁడు.

తాత్పర్యము: మొదట నున్న యగ్ని మరల నుంచఁబడిన యగ్నితో కలిసి బాగుగ జ్వలించుచున్నాఁడు. ఈ యగ్ని పండితుఁడు. గృహమునకు యజమాని వంటి వాఁడు. నవనవోన్మేషముగ ప్రకాశించుటచే యువకుఁడు. హవిస్సును వహించువాడు. జుహువు ముఖముగాఁ గలవాఁడు.

12. **అర్థము:** హే అగ్నే!=ఓ పూర్వాగ్నీ!, త్వమ్=నీవు, సతా=సన్మార్గుఁడైన, విప్రేణ=బ్రాహ్మణునిచే, విప్రస్సన్=బ్రాహ్మణుఁడ వగుచు, సఖ్యా=స్నేహితునిచే, సఖా=స్నేహితుఁడ వగుచు, అగ్నినా=(రెండవమారు ఉంచఁబడిన) అగ్నిచే, సమిధ్యసే=బాగుగ జ్వలింపఁ జేయఁబడుచున్నావు.

తాత్పర్యము: ఓ పూర్వ స్థితాగ్నీ! నీవు పిమ్మట ఉంచఁబడిన యగ్నితో కలిసి మిగుల ప్రకాశించుచున్నావు. అటువంటి నీవు సన్మార్గవర్తి యగు బ్రాహ్మణునిచే బ్రాహ్మణుఁడవు, స్నేహితునిచే స్నేహితుఁడవు నగుచున్నావు.

13. **అర్థము:** హే అగ్నే!=ఓ యగ్నీ!, శుచయః=పరిశుద్ధములైన, (శుక్రాః=కాంతులు) ఉత్(+ఈరతే)=పైకి వెడలుచున్నవి. జ్యోతిషా=తేజస్సుచే, వి(భ్రాజసే)=విశేషముగ ప్రకాశించుచుచున్నావు.

తాత్పర్యము: ఓ యగ్నీ! పరిశుద్ధములైన నీ కాంతులు పైకి వెడలుచున్నవి. నీవు విశేషముగ ప్రకాశించుచున్నావు.

షట్చత్వారింశానువాకము సమాప్తము.

చతుర్థ ప్రపాఠకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే పంచమః ప్రపాఠకః।

తత్ర ప్రథమోఽనువాకః।

హరిః ఓమ్

మూలము: [1]దేవాసురా స్సంయత్తా ఆస న్తే దేవా విజయ ముపయన్తో ఽగ్నౌ వామం వసు సం న్యదధతే
ద ము నో భవిష్యతి యది నో జేష్య న్తీతి తదగ్ని ర్న్యకామయత తేనా పాక్రామ త్తద్దేవా
విజి త్యావ రురుత్సమానా అన్వాయ న్తదస్య సహసా ఽదిత్స న్త సోఽరోదీ ద్యదరోదీ త్తద్రు
ద్రస్య రుద్రత్వం యదశ్ర్వశీయత తత్(౧)రజతగ్ం హిరణ్య మభవ త్తస్మా ద్రజతగ్ం
హిరణ్య మదక్షిణ్య మశ్రుజగ్ం హి యో బర్హిషి దదాతి పురా ఽస్య సంవత్సరా ద్గృహే
రుద న్తి తస్మా ద్బర్హిషి న దేయగ్ం [2]సో ఽగ్ని రబ్రవీ ద్భాగ్యసా న్యథ వ ఇదమితి పునరా
ధేయం తే కేవల మిత్యబ్రువ న్నృధ్నవత్ఖలు స ఇత్యబ్రవీ ద్యో మద్దేవత్య మగ్ని మాద
ధాతా ఇతి[3]తం పూషా ధత్త తేన (౨)పూషా ఽఽర్ధ్నో త్తస్మా త్పౌష్ణాః పశవ ఉచ్య న్తే తం
త్వష్టా ఽధత్త తేన త్వష్టా ఽఽర్ధ్నో త్తస్మా త్త్వాష్ట్రాః పశవ ఉచ్య న్తే తం మను రాఽధత్త
తేన మను రార్ధ్నో త్తస్మా న్మానవ్యః ప్రజా ఉచ్య న్తే తం ధాతా ఽధత్త తేన ధాతా ఽఽర్ధ్నో
త్సంవత్సరో వై ధాతా తస్మా త్సంవత్సరం ప్రజాః పశవో ఽను ప్రజాయ న్తే [4]య ఏవం
పునరాధేయస్యర్ద్ధిం వేద(౩)ర్ధ్నో త్యేవ [5]యో ఽస్యైవం బన్ధుతాం వేద బన్ధుమా న్భవతి
[6]భాగధేయం వా అగ్ని రాహిత ఇచ్ఛమానః ప్రజాం పశూ న్యజమానస్యో పదోద్రావో ద్వాస్య
పునరాదధీత భాగధేయేనై వై నగ్ం సమర్ధయ త్యథో శా న్తి రేవా స్యైషా [7]పునర్వస్వో రాద

ధీత్యై తద్వై పునరాధేయస్య నక్షత్రం యత్పునర్వసూ స్వాయామేవైనం దేవతాయా

మాధాయ బ్రహ్మవర్చసీ భవతి [8]దర్భై రాదధా త్యయాతయామత్వాయ [9]దర్భై రాదధా

త్యద్భ్య ఏవైన మోషధీభ్యో ఽవరుధ్యా ఽఽధత్తే [10]పఞ్చకపాలః పురోడాశో భవతి పఞ్చ వా

ఋతవ ఋతుభ్య ఏవైన మవరుధ్యా ఽఽధత్తే ॥4॥

(అశీయత తత్తేన వేద దర్భైః పఞ్చవిగ్ంశతి శ్చ)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే పఞ్చమప్రపాఠకే ప్రథమోఽనువాకః॥

వేదార్థ దీపిక

అవతారిక: ఈ పంచమ ప్రపాఠకమునందలి మొదటి నాలుగనువాకములందు పునరాధేయమను కర్మ చెప్పఁబడుచున్నది. పిమ్మట ఆఱనువాకములందు అగ్న్యుపస్థానము చెప్పఁబడును. ఏకాదశానువాకమునందు కామ్యములైన యాజ్యా పురోనువాక్యలు చెప్పఁబడును.

1\. **అర్థము:** దేవాసురాః=దేవతలు అసురులు, సంయత్తాః=(పూర్వము యుద్ధమునందు) సన్నద్ధులు, ఆసన్=అయిరి. తే దేవాః=ఆ దేవతలు, విజయమ్=విశిష్టమైన జయమును, ఉపయన్తః=పొందినవారై, నః=మమ్ము, (=దేవతలను,) జేష్యన్తి యది=(రాక్షసులు) జయించినచో, ఇదమ్= ఈ ధనము, నః=మాకు, (=దేవతలకు,) భవిష్యతి ఉ=ఉండఁగలదు కదా!, (ఉపయోగపడును కదా!) ఇతి=అనెడి భావముతో, వామమ్=శ్రేష్ఠమైన, వసు=(రాక్షసుల నుండి అపహరించిన) ధనమును, అగ్నౌ=అగ్నియందు, న్యదధత=ఉంచిరి. అగ్నిః=అగ్ని, తత్=ఆ ధనమును, న్యకామయత=(తనకు కావలెనని) గట్టిగా కోరుకొనెను. (తతః=పిమ్మట) తేన=ఆ ధనముతో, అపాక్రామత్=పాఱిపోయెను. దేవాః=దేవతలు, విజిత్య=(అదృష్ట వశమున రాక్షసులను) జయించి, తత్=ఆ ధనమును, అవ రురుత్సమానాః=పొందవలెనని కోరినవారై, అగ్నేరను=అగ్నికి వెనుకనే, ఆయన్=వెళ్లిరి. తత్=ఆ ధనమును, సహసా=బలవంతముగ, అదిత్సన్త=తీసికొనుట కిచ్ఛయించిరి. సః=ఆ యగ్ని, అరోదీత్=ఏడ్చెను. యత్=ఏ కారణము వలన, అరోదీత్=ఏడ్చెనో, తత్=ఆ కారణము వలన, రుద్రస్య=రుద్ర శబ్దమునకు, రుద్రత్వమ్=ఏడ్చుట అను అర్థము, (అభవత్=ఏర్పడెను.) యత్ అశ్రు=ఏ కన్నీటిబిందువు, అశీయత=(భూమి యందు) కారెనో, తత్=ఆ కన్నీటిబొట్టు, రజతమ్=వెండి యనెడి, హిరణ్యమ్=ధనముగా, అభవత్=ఆయెను. తస్మాత్=అందువలన, రజతం హిరణ్యమ్=రజతరూప ధనము, అదక్షిణ్యమ్=దక్షిణగా నిచ్చుటకు యోగ్యము కానిది. యః=ఏ యజ్ఞకర్త, బర్హిషి=యజ్ఞమునందు, అశ్రుజం హి=కన్నీటినుండి పుట్టిన వెండినైతే, దదాతి=దక్షిణగా ఇచ్చుచున్నాఁడో, అస్య=ఈ యజమానుని యొక్క, గృహే=గృహమునందు, సంవత్సరాత్=సంవత్సరముకంటె, పురా=ముందు, రుదన్తి=ఏడ్చెదురు. తస్మాత్=అందువలన, బర్హిషి=యజ్ఞమునందు, న దేయమ్=(వెండి) దానము చేయరాదు.

తాత్పర్యము: పూర్వము దేవతలు రాక్షసులు యుద్ధ సన్నద్ధులైరి. దేవతలు రాక్షసులను జయించి, వారినుండి శ్రేష్ఠమైన ధనము నపహరించి, ఇఁకముందెప్పుడైనను రాక్షసులు తమ్ము జయించినచో అప్పు డుపయోగపడఁ గలదని తలఁచి ఆ ధనమును అగ్నియొద్ద నుంచిరి. అగ్నిదేవుఁ డాధనము తనకు కావలెనని యనుకొని ఆ ధనముతో పాఱిపోయెను. దేవతలు అదృష్టవశమున రాక్షసులను జయించి ఆ ధనమును తీసికొనవలెనని తలఁచినవారై

అగ్నిని వెంబడించిరి. అప్పు డాయగ్ని రోదించెను. (=ఏడ్చెను.) అగ్ని రోదించుటచే రుద్రశబ్దమునకు రుద్రత్వ (ఏడ్చుట యను నర్థ) మేర్పడెను. అగ్ని యేడ్చుటచే కారిన కన్నీటిబొట్టు వెండి యైనది. కావున ఆ రజత రూప ధనము యజ్ఞమునందు దక్షిణగా నీయఁదగినది కాదు. రజతమును యజ్ఞమునందు దక్షిణగా నిచ్చిన యజమానుని యింట సంవత్సరము లోపల రోదన ధ్వని వినఁబడును. అందువలన యజ్ఞమునందు రజతమును దానము చేయరాదు. (సోమ యాగమునందలి అవభృథకర్మ ముగిసిన పిమ్మట అగ్నికి ఉద్వాసన చెప్పి యనంతరము ఆ యగ్నికి పునరాధేయతను విధించుటకై ముందుగా ఈ మంత్రమున అగ్నివిషయకమైన ఉపాఖ్యానము నుదాహరించి ప్రసంగవశమున యజ్ఞమునందు రజతమునకు దక్షిణాత్వము నిషేధింపఁబడినది.)

2. అర్థము: సః అగ్నిః=ఆ యగ్ని, అదౌ=ప్రథమమున, భాగ్యసాని=(యజ్ఞ హవిస్సునందు) అసాధారణ భాగస్వామి నయ్యెదను. అథ=పిమ్మట, వః=మీకు, ఇదమ్=ఈ ధనము, ఇతి=అని, అబ్రవీత్=పలికెను. తే=ఆ దేవతలు, పునరాధేయమ్=పునరాధేయ మనెడి భాగము, కే=స్వర్గమునందు, బలమ్=బలకరము, ఇతి=అని, అబ్రువన్=పలికిరి. యః=ఎవఁడు, మద్దేవత్యమ్=అస్మ ద్దేవతాకమైన పునరాధేయమును, (కృత్వా=చేసి,) అగ్నిమ్=అగ్నిని, ఆదధాతా=అధానము చేయునో, సః=వాఁడు, ఋధ్నవత్=సమృద్ధిమంతుఁడు, ఇతి=అని, సః=ఆ యగ్ని, అబ్రవీత్=పలికెను.

తాత్పర్యము: 'ప్రథమమున నేను యజ్ఞ హవిస్సునందు అసాధారణ భాగస్వామి నగుదును. పిమ్మట మీకు (=దేవతలకు) ఈ ధనము నిత్తు'నని అగ్ని దేవతలతో పలికెను. అప్పు డాదేవతలు పునరాధేయము నగ్నికిచ్చి యిది స్వర్గమునందు బలకరమైనదని పలికిరి. అందువలన సంతుష్టి నొందిన అగ్ని అస్మద్దేవతాకమైన పునరాధేయమును చేసి అగ్ని నాధానము చేసినవాఁడు సమృద్ధి కలవాఁడగునని పలికెను. (పునరాధానము=కర్మవిశేషము. రెండవమారు చేయు నగ్న్యాధాన మని భావము. పునరాధేయము=రెండవమారు ఆధానము చేయఁబడిన యగ్నికి సమర్పింపఁబడు హవిర్విశేషము.)

3. అర్థము: పూషా=సూర్యుఁడు, తమ్=ఆ యగ్నిని, ఆధత్త=అధానము చేసెను. తేన=ఆ అధానముచేత, పూషా=సూర్యుఁడు, ఆర్ధ్నోత్=పశురూప సమృద్ధి నొందెను. తస్మాత్=అందువలన, పశవః=పశువులు, పౌష్ణాః=పూష దేవతాకములు, (ఇతి=అని,) ఉచ్యన్తే=చెప్పఁబడుచున్నవి. తమ్=ఆ యగ్నిని, త్వష్టా=త్వష్టృ ప్రజాపతి, అధత్త=అధానము చేసెను. త్వష్టా=త్వష్టృ ప్రజాపతి, ఆర్ధ్నోత్=పశుసమృద్ధి నొందెను. తస్మాత్=అందువలన, పశవః=పశువులు, త్వాష్ట్రాః=త్వష్టృ ప్రజాపతి దేవతాకములుగా, ఉచ్యన్తే=చెప్పఁబడుచున్నవి. తమ్=ఆ యగ్నిని, మనుః=మనువు, అధత్త=ఆధానము చేసెను. తేన=ఆ ఆధానముచేత, మనుః=మనువు, ఆర్ధ్నోత్=ప్రజాసమృద్ధి నొందెను. తస్మాత్=అందువలన, ప్రజాః=ప్రజలు, మానవ్యః=మను సంబంధులుగా, ఉచ్యన్తే=చెప్పఁబడుచున్నారు. తమ్=ఆ యగ్నిని, ధాతా=బ్రహ్మ, అధత్త=అధానము చేసెను. తేన=ఆ అధానముచేత, ధాతా=బ్రహ్మ, ఆర్ధ్నోత్=ప్రజా సమృద్ధి నొందెను. ధాతా=బ్రహ్మ, సంవత్సరః వై=సంవత్సరాభిమానియే. తస్మాత్=అందువలన, ప్రజాః=ప్రజలు, పశవః=పశువులు, అను సంవత్సరమ్=ప్రతి సంవత్సరము, ప్రజాయన్తే=అధికముగ పుట్టుచున్నారు.

తాత్పర్యము: పూష త్వష్టృ మను సంవత్సరాభిమాని ధాతలు పూర్వోక్తమైన అగ్నిని పునరాధానము చేసిరి. ఆ చేయుటచే ఆ పూషాది దేవతలు పశు ప్రజా సమృద్ధుల నొందిరి. అందువలన పశువులు పూషదేవతాకములు త్వష్టృ ప్రజాపతి దేవతాకములు అనియు, ప్రజలు మానవులు అనియు చెప్పఁ బడుచున్నారు. సంవత్సరాభిమాని యగు ధాత అగ్న్యాధానము చేసి, ప్రజా సమృద్ధి నొందుటచే ప్రజలు పశువులు ప్రతి సంవత్సర మధికముగ ఉద్భవించుచున్నారు. (పూషాది దేవతలచే పశ్వాది సమృద్ధి పొందఁ బడినదని భావము.)

4. అర్థము: యః=ఎవఁడు, ఏవమ్=ఈ పూర్వోక్తవిధముగ, పునరాధేయస్య=పునరాధానము చేయఁబడిన యగ్నియొక్క, ఋద్ధిమ్=సమృద్ధిని, వేద=తెలిసికొనెనో, (సః=వాఁడు,) ఋధ్నోత్యేవ=నిశ్చయముగ సమృద్ధి నొందుచున్నాఁడు.

తాత్పర్యము: పైని చెప్పఁబడిన విధముగ పునరాధానము చేయఁబడిన అగ్నియొక్క సమృద్ధిని తెలిసికొనినవాఁడు నిశ్చయముగ సమృద్ధి నొందును.

5. అర్థము: యః=ఎవఁడు, ఏవమ్=ఈ విధముగ, అస్య=ఈ యగ్నియొక్క, బన్ధుతామ్=పూషాది దేవతలతోడి బంధుత్వమును, వేద=తెలిసికొనుచున్నాఁడో, (సః=అతఁడు,) బన్ధుమాన్=బంధువులు కలవాఁడు, భవతి=అగుచున్నాఁడు.

తాత్పర్యము: పైని చెప్పఁబడిన విధముగ అగ్నికి పూషాది దేవతలతోఁగల బంధుత్వమును తెలిసికొనినవాఁడు బంధువులు కలిగియుండును.

6. అర్థము: ఆహితః=(మొదట)ఆధానము చేయఁబడిన, అగ్నిః=అగ్ని, భాగధేయం వా=అధిక భాగమునే, ఇచ్ఛమానః=కోరుచున్నవాఁడై, యజమానస్య=యజ్ఞకర్తయొక్క, ప్రజామ్=సంతానమును, పశూన్=పశువులను, ఉప దో[ద్రావ=అధికమైన ఉపద్రవమునకు గురిచేసెను. (తతః=అందువలన,) ఉద్వాస్య=(ప్రథమమున ఆధానము చేయఁబడిన అగ్నిని) ఉద్వాసన చేసి, పునః ఆ దధీత=మఱల ఆధానము చేయవలయును. ఏవమ్=ఈ విధముగ (పున రాదధీత యది=పున రాధానము చేసినచో, అగ్నిః=అగ్ని,) ఏనమ్=ఈ యజమానుని, సమర్ధయతి=సమృద్ధిమంతుని చేయుచున్నాఁడు. అథో=అందువలన, అస్య=ఈ యగ్నికి, ఏషా ఏవ=ఈ పునరాధాన పద్ధతియే, శాన్తిః=శాన్తి. (ఉపద్రవ నివారకము.)

తాత్పర్యము: మొదట ఆధానము చేయఁబడిన అగ్ని అసాధారణ భాగమును కోరి యజమానుని సంతానమునకు పశువులకు, అధికోపద్రవము చేసెను. కావున మొదట ఆధానము చేయఁబడిన యగ్నిని ఉద్వాసనేష్టిచేత ఉద్వాసన చేసి మఱల అగ్నిని ఆధానము చేయవలెను. అట్లు చేసిన యజమానుని, అగ్ని సమృద్ధిమంతునిగా చేయును. ఈ పునరాధానమే అగ్నికి శాంతి దాయకము.

7. అర్థము: పునర్వసూ='పునర్వసూ' అను పేరుగల, యత్=ఏ నక్షత్రము, (అస్తి=కలదో,) ఏతద్వై=ఈ పునర్వసూ నక్షత్రమే, పునరాధేయస్య=పునరాధానము చేయఁదగిన అగ్నికి సంబంధించిన, నక్షత్రమ్=నక్షత్రము. (తతః=అందువలన,) పునర్వస్వోః=పునర్వసూ నక్షత్రయుక్త కాలమునందు, ఆ దధీత=ఆధానము చేయవలెను. (ఏవం చేత్=ఇట్లైనచో,) స్వీయామ్=స్వకీయమైన, దేవతాయా మేవ=నక్షత్ర దేవతయందే, ఏనమ్=ఈ యగ్నిని, ఆధాయ=ఆ ధానము చేసి, (యజమానుఁడు,) బ్రహ్మవర్చసీ=బ్రహ్మవర్చస్సు కలవాఁడు, భవతి=అగుచున్నాఁడు.

తాత్పర్యము: పునర్వసూ నక్షత్రము పునరాధేయాగ్నికి సంబంధించినది. కావున పునర్వసూ నక్షత్రయుక్త కాలమునందగ్నిని పునరాధానము చేయవలెను. అట్లు చేసినచో యజమానుఁడు స్వకీయ పునర్వసూ నక్షత్రాభిమాన దేవతయందే ఆధానము చేసినట్లగును. అట్టి యజమానుఁడు బ్రహ్మవర్చస్సు కలవాఁ డగును.

8. అర్థము: అయాత యామత్వాయ=సారము పోకుండుటకై, దర్భైః=దర్భలచేత, ఆ దధీత=ఆధానము చేయవలెను.

తాత్పర్యము: (పునరాధానకర్మ ప్రథమాధాన కర్మకు వికృతి. ప్రకృతికి వలెనే వికృతికిఁ గూడ కాష్ఠములచే ఆధానము ప్రాప్తించుచుండఁగా, ఈ మంత్రము దర్భలచే పునరాధానము చేయవలెనని విధించుచున్నది.) దర్భలచే పునరాధానము చేసినచో సారము నశించదు. కాష్ఠములచే పునరాధానము చేసినచో సారవిహీనత యేర్పడును.

9. అర్థము: దర్భైరేవ=దర్భలచేతనే, అదధాతి=(పునః) ఆధానము చేయవలెను. (ఏవం యది=ఇట్లైనచో,) అద్భ్యః=దర్భలకు కారణములైన ఉదకములనుండి, ఓషధీభ్యః=ఓషధులనుండి, ఏనమ్=ఈ యగ్నిని, అవరుధ్య=పొంది, ఆ ధత్తే=ఆధానము చేసినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: దర్భలచేతనే పునరాధానము చేయవలెను. అట్లు చేసినచో దర్భలకు కారణములైన ఉదకములనుండియు, ఓషధులనుండియు ఈ యగ్నిని సంపాదించి (యజమానుఁడు,) పునరాధానము చేసినవాఁ డగును.

10. **అర్థము:** పురోడాశః=పురోడాశము, పంచకపాలః=ఐదు పాత్రములందు సంస్కృతమైనదిగా, భవతి=కావలెను. ఋతవః=ఋతువులు, పఞ్చ=అయిదు (కావున), ఋతుభ్యః ఏవ=ఋతువులనుండియే, ఏనమ్=ఈ యగ్నిని, అవరుధ్య=పొంది, ఆధత్తే=అధానము చేసినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: పై మంత్రములందు పునరాహితమైన అగ్నియందు చేయఁదగిన యిష్టికి అగ్ని దేవతగా చెప్పఁబడినాఁడు. ఆ యిష్టియందు హోమద్రవ్యమైన పురోడాశము ఐదు పాత్రములందు సంస్కృతమై యుండవలెనని యీ మంత్రము చెప్పుచున్నది. అట్లు చేసినచో ఋతువుల సంఖ్య అయిదు కావున సంఖ్యాసాదృశ్యము ననుసరించి ఋతువులనుండి యీ యగ్నిని పొంది ఆధానము చేసినట్లగును. ఇచట హేమన్త శిశిరర్తువుల నొకటిగా వివక్ష చేసి అయిదు ఋతువులని చెప్పఁబడినది.

ప్రథమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే పఞ్చమ ప్రపాఠకే ద్వితీయోఽనువాకః।

మూలము: [1]పరా వా ఏష యజ్ఞం పశూ న్వపతి యో ఽగ్ని ముద్వాసయతే పఞ్చకపాలః పురో
డాశో భవతి పాఙ్క్తో యజ్ఞః పాఙ్క్తాః పశవో యజ్ఞ మేవ పశూ నవరున్ధే [2]వీరహా వా ఏష
దేవానాం యో ఽగ్ని ముద్వాసయతే న వా ఏతస్య బ్రాహ్మణా ఋతాయవః పురా ఽన్న
మక్ష న్పఙ్క్త్యో యాజ్యానువాక్యా భవన్తి పాఙ్క్తో యజ్ఞః పాఙ్క్తః పురుషో దేవానేవ వీరం
నిరవదా యాగ్నిం పునరా(౧)ధత్తే [3]శతాక్షరా భవన్తి శతాయుః పురుష శ్శతేన్ద్రియ ఆయుష్యే
వేన్ద్రియే ప్రతితిష్ఠతి [4]యద్వా అగ్ని రాహితో నర్ధ్యతే జ్యాయో భాగధేయం నికామయమానో
యదాగ్నేయగ్ం సర్వం భవతి సైవాస్యర్ద్ధి[5]స్సం వా ఏతస్య గృహే వాక్సృజ్యతే యో
ఽగ్ని ముద్వాసయతే స వాచగ్ం సగ్ంసృష్టాం యజమాన ఈశ్వరో ఽను పరాభవితో
ర్విభక్తయో భవన్తి వాచో విధృత్యై యజమానస్యా పరాభవాయ (౨)[6]విభక్తిం కరోతి
బ్రహ్మైవ తదక రుపాగ్ంశు యజతి యథా వామం వసు వివిదానో గూహతి తాదృగేవ
తదగ్నిం ప్రతి స్విష్టకృతం నిరాహ యథా వామం వసు వివిదానః ప్రకాశం జిగమిషతి
తాదృగేవ తద్విభక్తి ముక్త్వా ప్రయాజేన వష ట్కరో త్యాయతనాదేవ నైతి [7]యజమానో
వై పురోడాశః పశవ ఏతే ఆహుతీ యదభితః పురోడాశ మేతే ఆహుతీ (౩) జుహోతి యజమాన
మేవో భయతః పశుభిః పరిగృహ్ణాతి [8]కృతయజు స్సంభృతసంభార ఇత్యాహు ర్న సంభృత్యా
స్సంభారా న యజుః కర్తవ్య మి[9]త్యథో ఖలు సంభృత్యా ఏవ సంభారాః కర్తవ్యం
యజు ర్యజ్ఞస్య సమృద్ధ్యై [10]పున ర్నిష్కృతో రథో దక్షిణా పున రుత్స్యూతం వాసః

పున రుత్సృష్టో ఽనడ్వా న్పునరాధేయస్య సమృద్ధ్యై [11]సప్త తే అగ్నే సమిధ స్సప్త జిహ్వా ఇత్యగ్నిహోత్రం జుహోతి యత్ర యత్రై వాస్య న్యక్తం తతః (౪)ఏవైన మవరున్ధే [12]వీరహా వా ఏష దేవానాం యోఽగ్ని ముద్వాసయతే తస్య వరుణ ఏవ ర్ణయా దాగ్ని వారుణ మేకాదశకపాల మను నిర్వపే ద్యం చైవం హన్తి య శ్చాస్య ర్ణయా త్తౌ భాగధేయేన ప్రీణాతి నార్తి మార్ఛతి యజమానః ॥౨॥

(అఽపరాభావాయ పురోడాశ మేతే ఆహుతీ తతః షట్త్రిగ్ంశ చ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే పఞ్చమ ప్రపాఠకే ద్వితీయోఽనువాకః।

వేదార్థ దీపిక

అవతారిక: ఈ యనువాకమునందు పూర్వోక్త ద్రవ్యవిధి ప్రశంసింపఁ బడుచున్నది.

1. అర్థము: యః=ఏ యజమానుఁడు, అగ్నిమ్=అగ్నిని, ఉద్వాసయతే=ఉద్వాసన చేయుచున్నాఁడో, ఏషః=ఈ యుద్వాసన చేసిన యజమానుఁడు, యజ్ఞమ్=యజ్ఞమును, పశూన్=పశువులను, పరావపతి=నశింపఁ జేయు చున్నాఁడు. పురోడాశః=పురోడాశము, పఞ్చకపాలః=ఐదు పాత్రములందు సంస్కృతమైనదిగా, భవతి=కావలెను. యజ్ఞః=యజ్ఞము, (ధానాది ధాన్యవిశేషములచే నిష్పన్న మైనది) పాఙ్క్తః=పాఙ్క్తము. పశవః=పశువులు, పాఙ్క్తాః=పాఙ్క్తములు, (తతః=అందువలన, యజమానః=యజమానుఁడు,) యజ్ఞమ్=యజ్ఞమును, పశూన్=పశువులను, అవరున్ధే ఏవ=నిశ్చయముగ పొందుచున్నాఁడు. ('పఙ్క్తి' అనునది ఛన్దోవిశేష నామ ధేయము. ఆ పఙ్క్తిచ్ఛన్దస్సు పశుహేతు వగుటవలన యజ్ఞము పాఙ్క్త మనఁబడుచున్నది. పశువులు కూడ పాఙ్క్తము లనఁబడుచున్నవి.)

తాత్పర్యము: అగ్నిని ఉద్వాసన చేసిన యజ్ఞకర్త యజ్ఞమును పశువులను నాశము చేసికొనినవాఁడగును. పంచ సంఖ్యాకము అయిన ధాన్యవిశేషములచే యజ్ఞము నిష్పన్న మగుటచే పాఙ్క్తము. పఙ్క్తిచ్ఛన్దస్సు పశుహేతు వగుటచే పశువులు పాఙ్క్తములు. ఇష్టియం దుపయోగింపఁబడునట్టి పురోడాశము పంచకపాల సంస్కృతము కావున యజ్ఞకర్త యజ్ఞమును పురోడాశమును నిశ్చయముగ పొందును.

2. అర్థము: యః=ఎవఁడు, అగ్నిమ్=అగ్నిని, ఉద్వాసయతే=ఉద్వాసన చేయుచున్నాఁడో, ఏషః=ఇతఁడు, దేవానామ్=దేవతలలో, వీరహా వా=వీరుఁడైన యగ్నిని వధించినవాఁడే, (భవతి=అగుచున్నాఁడు.) పురా=పూర్వము, ఋతాయవః=సత్యమును కోరునట్టి, బ్రాహ్మణాః=బ్రాహ్మణులు, ఏతస్య=ఈ యగ్ని హన్త యగు యజమానునియొక్క, అన్నమ్=అన్నమును, న వా అక్షన్=భుజింపరైరి. యాజ్యానువాక్యాః=యాజ్యానువాక్యా సంజ్ఞకములైన ఋక్కులు, పఙ్క్త్యః=పంచ సంఖ్యాకములు. పురుషః=మానవుఁడు, పాఙ్క్తః=

(హస్తద్వయ పాదద్వయ శిరస్సులచే,) పంచ సంఖ్యాత్వము కలవాఁడు. (కావున,) దేవానేవ=దేవతలలోనే, వీరమ్=వీరుఁడైన అగ్నిని, నిరవదాయ=(ఉత్సర్జన లక్షణ వధనుండి)వేఱుచేసి, అగ్నిమ్=అగ్నిని, పునరా ధత్తే=పునరాధానము చేయవలెను.

తాత్పర్యము: దేవతలలో వీరుఁడైన అగ్నిని ఉద్వాసన చేసిన యజమానుఁడు అగ్నిహన్త యగుచున్నాఁడు. పూర్వము సత్యమును కోరుచున్న బ్రాహ్మణులు ఈ యగ్నిహన్తయగు యజమానునియొక్క అన్నమును భుజింపరైరి. యాజ్యానువాక్యా మంత్రములు పంచత్వసంఖ్యాకములు. మానవుఁడు హస్తద్వయ పాదద్వయ శిరస్సులచేత పంచత్వసంఖ్య కలవాఁడు. కావున పంచత్వసంఖ్యాక యాజ్యానువాక్య ఋక్కులచే పంచత్వ సంఖ్యకల మానవుఁడు దేవతలలో వీరుఁడైన అగ్నిని ఉత్సర్జన లక్షణవధనుండి తొలఁగించి పునరాధానము చేయవల యును. ("అశ"=భోజనే అను ధాతువునుండి 'అక్షన్' అను క్రియాపద మేర్పడినది.)

3. అర్థము: శతాక్షరాః="అగ్నే తమద్య" "అథా హ్యగ్నే క్రతోః" "అభిష్టే అద్య" "ఏభి ర్నో అర్కైః" ఈ ఋక్కు లన్నియు కలిసి శతాక్షరసంఖ్య కలవిగా, భవన్తి=అగుచున్నవి, పురుషః=పురుషుఁడు, శతాయుః= నూఱు సంవత్సరముల ఆయుఃప్రమాణము కలవాఁడు. శతేన్ద్రియః=(శరీరములోని నూఱు నాడులందు దశేంద్రియములు సంచరించుటవలన,) శతేంద్రియుఁడు. (పూర్వోక్తవిధముగ పునరాధానము చేసిన యజ మానుఁడు,) ఆయుషి=శత సంవత్సరాత్మకమైన ఆయువునందు, శతేన్ద్రియే=శతేంద్రియములందును, ప్రతి తిష్ఠత్యేవ=నిశ్చయముగ ప్రతిష్ఠావంతుఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: అగ్నిని పునరాధానము చేయు నిష్టియందు వినియోగింపఁబడు "అగ్నే తమద్య" ఇత్యాది ఋక్కుల అక్షరముల సంఖ్య శతము. మానవుని ఆయువు నూఱు సంవత్సరముల పరిమాణము కలది. మానవుఁడు తన దశేంద్రియములు శరీరములోని నూఱు నాడులందు సంచరించుటచే శతేంద్రియములు కలవాఁడు. కావున అగ్నిని పునరాధానము చేసిన యజమానుఁడు శతనాడులందు దశేంద్రియములు సంచరించుచుండుటచే నూఱు సంవత్సరముల ఆయువుతో ప్రతిష్ఠావంతుఁ డగును. (బ్రహ్మ స్వప్రమాణముచే శతాయువగుటవలన, తత్సంతతికి కూడ సామాన్యముగ శతసంవత్సరాయుష్ట్వము ప్రసిద్ధము.)

4. అర్థము: అగ్నిః=అగ్ని, ఆహితః యద్వా=ఆధానము చేయఁబడినను, జ్యాయః=అధికమైన, భాగధేయమ్=సంపదను, నికామయమానః=కోరుచున్నవాఁడై, (యజమానః=యజమానుఁడు,) న ఋధ్యతే=సమృద్ధి నొందుటలేదు. సర్వమ్=ప్రయాజా ద్యంగజాత మంతయు, ఆగ్నేయం యత్=అగ్నిదేవతాకమైనచో, సా+ఏవ=అదియే, అస్య=ఈ యజమానునకు, ఋద్ధిః=సమృద్ధి, భవతి=అగుచున్నది.

తాత్పర్యము: అగ్ని పునరాధానము చేయఁబడినను యజమానుఁడు అధిక సంపదను కోరుచున్నవాఁడై సమృద్ధిమంతుఁడు కానిచో ప్రయాజా ద్యంగజాత మంతయు అగ్ని దేవతాకముగ చేయవలెను. అప్పుడు యజమానుఁడు సమృద్ధిమంతుఁ డగును.

5. అర్థము: యః=ఏ యజమానుఁడు, అగ్నిమ్=అగ్నిని, ఉద్వాసయతే=ఉద్వాసన చేయుచున్నాఁడో!, ఏతస్య=ఈ యజమానునియొక్క, వాక్=వాక్కు, గృహే=గృహమునందు, (నివసించుచున్న స్త్రీ శూద్రాదుల వాక్కు లతో,) సంపృజ్యతే=కలియుచున్నది. సంపృష్టామ్=కలిసికొనిన, వాచమను=వాక్కుననుసరించి, సః యజ మానః=ఆ యజమానుఁడు, ఈశ్వరః=పరాభవమును పొందుటకు సమర్థుఁడగుచున్నాఁడు. (పరాభూతుఁ డగుచున్నాఁడని భావము.) పరాభవితోః=పరాభవించిన అగ్నియొక్క, విభక్తయః=(ప్రయాజమంత్రము లలో ప్రయుక్తము లయిన,) సంబుద్ధి ద్వితీయా తృతీయా సప్తమీ విభక్తులు, వాచః=సంస్పృష్టమైన వాక్కుయొక్క, విధృత్యై=వేఱుచేయుటకొఱకు, యజమానస్య=యజమానునియొక్క, అపరాభవాయ=పరా భవము లేకుండుటకొఱకును, భవన్తి=అగుచున్నవి.

తాత్పర్యము: అగ్నిని ఉద్వాసన చేసిన యజమానునివాక్కు అతని గృహమునందున్న స్త్రీ శూద్రాదుల వాక్కులతో కలియుచున్నది. (వారివాక్కులతో సమానమై అపవిత్ర మగుచున్నదని భావము.) సంసృష్టమైన వాక్కు ననుసరించి (ఇతరవైలక్షణ్య రూపమగు ఉత్కర్ష లేకపోవుటచే,) యజమానుఁడు తిరస్కృతుఁడగును. ''సమిధో అగ్న ఆజ్యస్య వ్యన్తు'' ఇత్యాది ప్రయాజ మంత్రములందున్న 'అగ్ని' శబ్దముమీది సంబుద్ధితోఁబాటు సప్తమీ తృతీయా ద్వితీయా విభక్తులను చేర్చి కర్మకాలమునందు ఉపయోగించినచో పునరాధేయమునకు అగ్న్యాధేయముకంటె వైలక్షణ్యము ఏర్పడి యజమానుఁడు విలక్షణుఁ డగును. అప్పుడు యజమానుని వాక్కు శుద్ధ మగుటచే వరాభవము శాంత మగును. ((1) 'సమిధో ఽగ్నే ఽగ్న ఆజ్యస్య వియన్తు' (2) ''తనూనపా దగ్నా వగ్న ఆజ్యస్య వేతు'' (3) ''ఇడో ఽగ్నినా గ్న ఆజ్యస్య వియన్తు'' (4) బర్హి రగ్ని మగ్న ఆజ్యస్య వేతు'' ఈ నాలుగు ప్రయాజమంత్రములం దీ విధముగ అగ్నిశబ్దముమీది విభక్తుల నుపయోగించి అనుష్ఠానము జరుపవలెను.)

6. అర్థము: (యః=ఏ యజమానుఁడు,) విభక్తిమ్=విభక్తి ప్రయోగమును, కరోతి=చేయుచున్నాఁడో, తత్=ఆ పునరాధేయమును, బ్రహ్మైవ=దృఢమైనదిగనే, అకః=చేసెను, (=చేసినట్లగును,) ఉపాంశు=మంత్రోచ్చారణము మెల్లగా నుండునట్లు, యజతి=యాగము చేయవలెను. యథా=ఏ విధముగ, వామమ్=శ్రేష్ఠమైన, వసు=ధనమును, వివిదానః=పొందుచున్నవాఁడై, గూహతి=దాఁచుకొనుచున్నాఁడో, తాదృగేవ=(ఉపాంశు మంత్రోచ్చారణ పూర్వక యాగవిధానము కూడ) అట్టిదే. స్విష్టకృతమ్=స్విష్టకృత్తనుపేరుగల, అగ్నిమ్=అగ్నిని గూర్చి, నిరాహ=మంత్రోచ్చారణమును ఉచ్చైస్స్వరముతో చేయవలెను. యథా=ఏ విధముగ, వామమ్=శ్రేష్ఠమైన, వసు=ధనమును, వివిదానః=పొందుచున్నవాఁడై, ప్రకాశమ్=ప్రసిద్ధిని, జిగమిషతి=పొందఁగోరుచున్నాఁడో, తాదృగేవ=(ఉచ్చై ర్మంత్రోచ్చారణపూర్వక యాగవిధానము కూడ) అట్టిదే. తత్=ఆ కారణమువలన, విభక్తిమ్=(పూర్వోక్త) విభక్తి విధమును, ఉక్త్వా=చెప్పి, ప్రయాజేన=ప్రయాజ మంత్రముచేత, వషట్ కరోతి=వషట్కార పూర్వకముగ యాగము చేయవలెను. (ఇట్లు చేసిన యజమానుఁడు,) ఆయతనాత్=స్వగృహమునుండి, నైవ ఏతి=తొలఁగుటయే లేదు.

తాత్పర్యము: విభక్తి విధానము ననుష్ఠించిన యజమానుఁడు ఆ పునరాధేయమును దృఢముగఁ జేసినవాఁడగు చున్నాఁడు. మంత్రమును మెల్లగ నుచ్చరించుచు యాగము చేయవలెను. ఇట్లు చేసిన యజమానుఁడు శ్రేష్ఠమైన ధనమును సంపాదించి దానిని జాగరూకతతో దాఁచుకొనిన విధముగ యాగఫలమును దాఁచుకొనినవాఁడగును. స్విష్టకృదగ్నినిగూర్చి ఉచ్చైస్స్వరముతో మంత్రము నుచ్చరించి యాగము చేసిన యజమానుఁడు శ్రేష్ఠమైన ధనమును పొంది దానివలన ప్రసిద్ధిని కోరువిధముగ ప్రసిద్ధి నొందుచున్నాఁడు. కావున పూర్వోక్త విభక్తి విధానపూర్వకముగ ప్రయాజ మంత్రముచేత వషట్కార పూర్వకముగ యాగము చేయవలెను. ఇట్లు చేసిన యజమానుఁడు స్వగృహమునుండి తొలఁగిపోఁడు.

7. అర్థము: యజమానః వై=యజమానుఁడే, పురోడాశః=పురోడాశము. పశవః=పశువులు, ఏతే ఆహుతీ=ఈ ఆహుతులు, పురోడాశ మభితః=పురోడాశము నంతటను, ఏతే ఆహుతీ=ఈ ఆహుతులను, జుహోతి=హోమము చేయవలెను. (ఇట్లు చేసినచో అగ్ని,) ఉభయతః=అంతటను, పశుభిః=పశువులతో, యజమానమేవ=యజమానునే, పరిగృహ్ణాతి=గ్రహించు చున్నాఁడు.

తాత్పర్యము: యజమానుఁడే పురోడాశము. (యజమానునివలె పురోడాశము పవిత్రమైనది.) పశువులే ఈ ఆహుతులు. కావున పురోడాశము నంతటను ఈ యాహుతులను హోమము చేయవలెను. ఇట్లు చేసినచో అగ్ని పశువులతోఁ గూడ యజమానుని పొందుచున్నాఁడు. అగ్ని యజమానునకు పశుసమృద్ధిని కలుగఁజేయు చున్నాఁడని భావము.

8. అర్థము: (ప్రథమాధానమ్=ప్రథమాధానము,) కృతయజుః=ఉచ్చరింపఁబడిన "సర్పరాజ్ఞీ"-ఇత్యాద్యాధాన మంత్రములు కలది, సంభృత సంభారః=సంపాదింపఁబడిన సప్తమృత్తికా విశేషములు కలది, ఇతి=అని, ఆహుః=చెప్పిరి. (అతః=ఇందువలన, అస్మిన్ కర్మణి=ఈ కర్మయందు,) సంభారాః=సప్తమృద్విశేషములు, న సంభృత్యాః=సంపాదింప నవసరమైనవి కావు. యజుః=ఆధానమంత్రము, న కర్తవ్యమ్=చేయవలసినది కాదు. ఇతి=అని, (పూర్వపక్షః=పూర్వపక్షము.)

తాత్పర్యము: ప్రథమాధానమునందు 'సర్పరాజ్ఞీ'త్యాద్యాధాన మంత్రము లుచ్చరింపఁబడినవి. 'సికత', 'ఊష' ఇత్యాది సప్త మృద్విశేషములు ఉపయోగింపఁబడినవి. కనుక ఈ పునరాధాన కర్మయందు ఆధానమంత్రము, సప్త మృత్తికా విశేషములు, ఉపయోగింప నవసరములేదని పూర్వపక్షము. (అనఁగా ప్రథమాధానమునందు "సర్పరాజ్ఞీ"త్యాది మంత్రములు, సప్త మృత్తికావిశేషములును ఉపయోగింపఁబడుటవలన, పునరాధానమునందు అవి ఉపయోగింప నవసరము లేదని భావము.)

9. అర్థము: అథో ఖలు=అయినను, యజ్ఞస్య=యజ్ఞముయొక్క, సమృద్ధ్యై=సమృద్ధికొఱకు, సంభారాః=సంభారద్రవ్యములైన సప్తమృద్విశేషములు, సంభృత్యా ఏవ=సంపాదింపఁదగినవియే. యజుః=ఆధానమంత్రముల సముదాయము, కర్తవ్యమ్=ఉచ్చారణచేయఁదగినది.

తాత్పర్యము: ప్రథమాధానమునందు ఆధానమంత్రము లుచ్చరింపబడినను, సంభారద్రవ్యము లుపయోగింపఁబడినను, ఈ పునరాధానమునందుఁగూడ సమృద్ధికై ఆ యాధానమంత్రములు మృత్తికా విశేషములు ఉపయోగింపవలెనని సిద్ధాంతము.

10. అర్థము: పునరాధేయస్య=పునరాధేయముయొక్క, సమృద్ధ్యై=సమృద్ధికొఱకు, పునః + నిష్కృతః=మొదట భగ్నమై పిమ్మట దృఢముగాఁ జేయఁబడిన, రథః=రథము, దక్షిణా=(ఈ యజ్ఞమునందు ఈయఁదగిన,) దక్షిణ. పునః + ఉత్స్యూతమ్=మొదట చినిఁగినదియై పిమ్మట కుట్టఁబడిన, వాసః=వస్త్రము, దక్షిణా=దక్షిణ. పునః + ఉత్సృష్టః=మొదట దుర్బలముగానుండి పిమ్మట పోషణముచే బలిష్ఠమైన, అనడ్వాన్=వృషభము, దక్షిణా=దక్షిణ.

తాత్పర్యము: పునరాధేయముయొక్క సమృద్ధికై, మొదట భగ్నమై పిమ్మట దృఢముగాఁ జేయఁబడిన రథము, మొదట చినిఁగినదై పిమ్మట కుట్టఁబడిన వస్త్రము, మొదట దుర్బలముగానుండి పిమ్మట పోషణముచే బలిష్ఠమైన వృషభము ఈ పునరాధాన కర్మయందు దక్షిణగా ఈయవలసినవి.

11. అర్థము: "సప్త తే అగ్నే సమిధః సప్త జిహ్వాః" ఇతి="సప్త తే అగ్నే" ఇత్యాది మంత్రముచేత, అగ్నిహోత్రమ్=అగ్నినుద్దేశించి, జుహోతి=హోమమును చేయవలెను. (అట్లు చేసినచో,) అస్య=ఈ పునరాధేయ దేవతయగు నగ్నికి, (యత్ యత్=ఏ యే యంగము,) యత్ర యత్ర=ఏ యే ప్రదేశమునందు, న్యక్తమ్=నిమగ్నమైనదో, (విస్మృతమైనదో,) తతః ఏవ=ఆ ప్రదేశమునుండియే, ఏనమ్=సాంగమైన ఈ యగ్నిని, అవరుద్ధే=పొందుచున్నాఁడు.

తాత్పర్యము: 'సప్త తే అగ్నే' ఇత్యాది మంత్రము నుచ్చరించుచు పునరాధేయ దేవతయగు అగ్ని నుద్దేశించి హోమము చేయవలెను. అట్లు చేసిన యజమానుఁడు, ఏ యే ప్రదేశమునందు ఈ యగ్నిసంబంధియగు ఏ యే యంగము విస్మృత మైనదో, ఆ యా ప్రదేశమునుండియే సాంగమైన ఈ యగ్నిని పొందఁగలుగుచున్నాఁడు. ('సప్త తే అగ్నే' ఇత్యాది మంత్రము ఈ ప్రపాఠకమునందలి 3వ అనువాకమున వ్యాఖ్యానింపఁబడును.)

12\. **అర్థము:** యః=ఏ యజ్ఞకర్త, అగ్నిమ్=అగ్నిని, ఉద్వాసయతే=ఉద్వాసన చేయుచున్నాఁడో, ఏషః వా=ఇతఁడే, దేవానామ్=దేవతలలో, వీరహా=వీరుఁడైన అగ్నిని హత్యచేసినవాఁడు. తస్య=ఆ యజ్ఞకర్తకు; వరుణః ఏవ=వరుణ దేవుఁడే, ఋణయాత్=ఋణగ్రహీతకువలె బాధకుఁడగును; (తతః=అందువలన; సః=ఆ యజ్ఞకర్త,) అగ్ని వారుణమ్=అగ్ని వరుణులు దేవతలుగాఁగల; ఏకాదశ కపాలమ్=పదునొకండు పాత్రములందు సంస్కరింపఁబడిన పురోడాశమును; అను=వెంటనే, నిర్వపేత్=నిర్వాపము చేయవలెను. యమ్=ఏ యగ్నిని, హన్తి చ=ఉద్వాసనరూప హత్య చేయుచున్నాఁడో; యశ్చ=ఏ వరుణుఁడును, అస్య=ఈ యజ్ఞకర్తకు, ఋణయాత్=ఋణగ్రహీతకువలె బాధకుఁ డగుచున్నాఁడో, భాగధేయేన=పురోడాశ భాగముచేత, తౌ=ఆ అగ్ని వరుణులను, ప్రీణాతి=సంతృప్తి పఱచుచున్నాఁడు. యజమానః=యజమానుఁడు, ఆర్తిమ్=బాధను, నార్ఛతి=పొందుటలేదు.

తాత్పర్యము: అగ్నిని ఉద్వాసన చేసిన యజమానుఁడు దేవతలలో వీరుఁడైన అగ్నిని హత్య చేసిన వాఁడగుచున్నాఁడు; మఱియు వరుణుఁ డాయజమానుని ఋణగ్రహీతనువలె బాధించును. ఆ దోషము పోవుటకై ఆ యజమానుఁడు, అగ్ని వరుణులు దేవతలుగాఁ గలదియు, పదునొకండు పాత్రములందు సంస్కృతమైనదియునగు పురోడాశమును (అగ్ని వరుణుల నుద్దేశించి,) హోమము చేయవలెను. ఇట్లు చేసినచో, ఉద్వాసన చేయఁబడిన అగ్నిని, ఋణగ్రహీతనువలె బాధించిన వరుణుని ఆ యజమానుఁడు పురోడాశభాగముచే సంతృప్తి పఱచినవాఁ డగుచున్నాఁడు. ఆ యజమానుఁడు బాధను పొందఁడు.

ద్వితీయానువాకము సమాప్తము

అథ ప్రథమకాణ్డే పఞ్చమప్రపాఠకే తృతీయోఽనువాకః।

మూలము: భూమి ర్భూమ్నా ద్యౌ ర్వరిణా ఽన్తరిక్షం మహిత్వా। ఉపస్థే తే దేవ్యదితే ఽగ్ని మన్నాద్య మన్నాద్యా యాఽఽదధే। [2]ఆఽయం గౌః పృశ్ని రక్రమీ దసన న్మాతరం పునః। పితరం చ ప్రయన్త్సువః। [3]త్రిగ్ంశద్ధామ విరాజతి వాక్పతఙ్గాయ శిశ్రియే। ప్రత్యస్య వహ ద్యుభిః। [4]అస్య ప్రాణా దపాన త్యన్త శ్చరతి రోచనా। వ్యఖ్య న్మహిష స్సువః। [5]యత్త్వా (౧)క్రుద్ధః పరోవప మన్యునా యదవర్త్యా। సుకల్ప మగ్నే తత్తవ పున స్త్వో ద్దీపయామసి। [6]యత్తే మన్యుపరో ప్తస్య పృథివీ మను దధ్వసే। ఆదిత్యా విశ్వే త ద్దేవా వసవశ్చ సమాభరన్। [7]మనో జ్యోతి ర్జుషతా మాజ్యం విచ్ఛిన్నం యజ్ఞగ్ం సమిమం దధాతు। బృహస్పతి స్తనుతా మిమం నో విశ్వేదేవా ఇహ మాదయన్తామ్। [8]సప్త తే అగ్నే సమిధ స్సప్త జిహ్వా స్సప్త (౨)ఋషయ స్సప్త ధామ ప్రియాణి। సప్త హోత్రా స్సప్తధా త్వా యజన్తి సప్త యోనీ రాపృణస్వా ఘృతేన। [9]పున రూర్జా నివర్తస్వ పున రగ్న ఇషా ఽఽయుషా। పున ర్నః పాహి విశ్వతః। [10]సహ రయ్యా నివర్తస్వా గ్నే పిన్వస్వ ధారయా। విశ్వప్స్నియా విశ్వత స్పరి। [11]లేక స్సలేక స్సులేక స్తే న ఆదిత్యా ఆజ్యం జుషాణా వియన్తు కేత స్సకేత స్సుకేత స్తే న ఆదిత్యా ఆజ్యం జుషాణా వియన్తు వివస్వాగ్ం అదితి ర్దేవ జూతి స్తే న ఆదిత్యా ఆజ్యం జుషాణా వియన్తు ॥౩॥ (త్వా జిహ్వాః సప్త సుకేత స్తే న త్రయోదశ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమకాణ్డే పఞ్చమప్రపాఠకే తృతీయోఽనువాకః।

వేదార్థ దీపిక

అవతారిక: ప్రథమ ద్వితీయానువాకములందు పునరాధేయము. తదంగములు నిరూపితములైనవి. ఈ తృతీయానువాకమునందు ఆధానమంత్రములు చెప్పఁబడుచున్నవి.

1. అర్థము: (హే గార్హపత్య ప్రదేశ!=ఓ గార్హపత్య ప్రదేశమా!, త్వమ్=నీవు) భూమ్నా=బాహుళ్యముచేత, భూమిః అసి=భూలోక మగుచున్నావు. వరిణా=శ్రేష్ఠత్వముచేత, ద్యౌః=ద్యులోకము, అసి=అగుచున్నావు. మహిత్వా=మహత్వముచేత, అన్తరిక్షమ్=అంతరిక్ష లోకము, అసి=అగుచున్నావు. హే అదితే దేవి!=ఓ గార్హపత్య ప్రదేశరూప భూదేవీ!, తే=నీ యొక్క, ఉపస్థే=ఉత్సంగమునందు, అన్నాదమ్=అన్నము తినునట్టి, అగ్నిమ్=గార్హపత్యాగ్నిని, అన్నాద్యాయ=భోజనార్థమైన యజమానుని అన్నముకొఱకు, ఆదధే=ఆధానము చేయుచున్నాను.

తాత్పర్యము: ఓ గార్హపత్య ప్రదేశమా! నీవు బాహుళ్యముచేత భూలోక స్వరూపము, శ్రేష్ఠత్వముచేత ద్యులోక స్వరూపము, మహత్వముచేత అంతరిక్షలోక స్వరూపమును అగుచున్నావు. ఓ గార్హపత్య ప్రదేశరూప భూదేవీ! నీ యుత్సంగమునందు అన్నమును (=పురోడాశమును) భుజించునట్టి గార్హపత్యాగ్నిని, భోజనార్థమైన యజమానునియొక్క అన్నముకొఱకు ఆధానము చేయుచున్నాను.

2. అర్థము: అయమ్=ఈ గార్హపత్యాగ్ని, గౌః=(ఆదిత్య రూపముతో) గమనశీలుఁడును, పృశ్నిః=శ్వేత వర్ణుఁడునై, ఆక్రమీత్=(జగత్తును) ఆక్రమించెను. పునః=అనఁగా, మాతరమ్=(భూమిని) తల్లిగా, అసనత్=పొందెను. చ=మఱియు, సువః=స్వర్గమును, పితరమ్=తండ్రినిగా, ప్రయన్=ప్రకర్షగా పొందుచు నుండెను.

తాత్పర్యము: ఈ గార్హపత్యాగ్ని ఆదిత్య రూపమున గమనశీలుఁడును శ్వేతవర్ణుఁడునునై జగత్తు నాక్రమించెను. అనఁగా భూమిని తల్లిగాను, స్వర్గమును తండ్రినిగాను పొందెను. (అగ్నికి భూమి తల్లియనియు, స్వర్గము తండ్రియనియు శ్రుత్యంతరమున చెప్పఁబడినది.)

3. అర్థము: త్రింశద్ధామ=ఆదిత్య రూపాగ్ని సంబంధియగు త్రింశత్సంఖ్యాక ముహూర్తరూప తేజస్సు, విరాజతి=విశేషముగ ప్రకాశించుచున్నది. (మఱియు,) వాక్=వైదిక స్తుతివాక్కు, పతఙ్గాయ=పక్షివలె నాకాశమున సంచరించుచున్నట్టి ఆదిత్యుని, శిశ్రియే=ఆశ్రయించెను, (హే గార్హపత్య! ఓ గార్హపత్యాగ్నీ!,) త్వామ్=నిన్నుఁగూర్చి, యత్=ఏ ఉద్వాసనరూప ప్రతికూల కర్మ, అస్మాభిః=మాచేత, ఆచరితమ్=ఆచరింపఁబడినదో, తత్=అది యంతయు, ప్రత్యస్య=విడిచి, (=మనస్సునం దుంచుకొనక,) ద్యుభిః=జ్వాలారూప కాంతులచేత, వహ=(మా హవిస్సును దేవతలందు,) పొందించుము.

తాత్పర్యము: ఆదిత్యరూప గార్హపత్యాగ్ని సంబంధియగు త్రింశత్సంఖ్యాక ముహూర్తరూప తేజస్సు విశేషముగ ప్రకాశించుచున్నది. (=పగలు పదునైదు ముహూర్తములు, రాత్రి పదునైదు ముహూర్తములు అని భావము.) మఱియు స్తుతిరూప వైదికవాక్కు పక్షివలె ఆకాశమున సంచరించుచు ఆదిత్యు నాశ్రయించెను. అటువంటి ఓ గార్హపత్యాగ్నీ! మేము నీకు చేసిన ఉద్వాసన రూప కర్మ విషయమును మనస్సునందు ఉంచుకొనవలదు. మా హవిస్సును జ్వాలారూప కాంతులచే దేవతలకు చేర్చుము. (''పతఙ్గాయ''-ద్వితీయార్థమున చతుర్థీ ప్రయోగము వైదికము.)

4. అర్థము: అస్య=ఈ ఆదిత్యునియొక్క, రోచనా=కాంతి, ప్రాణాత్=ఉచ్ఛ్వాస సదృశమైన ఉదయమునుండి, అపానతీ=నిశ్వాస తుల్యమైన అస్తమయమును పొందుచున్నదై, అన్తః=ద్యావా పృథువులయందు, చరతి=సంచరించుచున్నది. మహిషః=సూర్యుఁడు, సువః=స్వర్గమును, వ్యఖ్యత్=(యజమానుల కొఱకు,) ప్రకాశింపఁజేసెను.)

తాత్పర్యము: ఈ ఆదిత్యుని దీప్తి ఉచ్ఛ్వాస తుల్యమైన ఉదయమునుండి నిశ్వాస తుల్యమైన అస్తమయమును పొందుచున్నదై, ద్యావా భూముల మధ్యమున సంచరించుచున్నది. ఆదిత్యుఁడు యజ్ఞకర్తల కొఱకు స్వర్గమును ప్రకాశింపఁజేసెను. (మహిషః=మహతి మండలే సీదతీతి, మహిషః=సూర్యుఁడు, అని వ్యుత్పత్త్యర్థము.)

5. అర్థము: హే అగ్నే!=ఓ దక్షిణాగ్నీ! క్రుద్ధః=క్రోధ పరాధీనుఁడనైన, (అహమ్=నేను,) మన్యునా=కోపముచేత, త్వా=నిన్ను, (పరా + ఉవప,) పరోవప యత్=ఉద్వాసన చేసితిననుట యేది కలదో, హే అగ్నే!=ఓ యగ్నీ! తత్=అది యంతయు, తవ=నీ యొక్క, (అనుగ్రహేణ=అనుగ్రహముచేత) సుకల్పమ్=సుకృతముగా, అస్తు=అగుఁగాక. పునః=మఱల, త్వా=నిన్ను, ఉద్దీపయామి=ప్రజ్వలింపఁ జేయుచున్నాను. (ఉవప=లిటి ఉత్తమ పురుషైకవచనమ్.)

తాత్పర్యము: ఓ దక్షిణాగ్నీ! క్రోధపరాధీనుఁడనైన నేను కోపముచే నిన్ను ఉద్వాసన చేసితిని. పదార్థ సమృద్ధి లేమి యను దారిద్ర్యముచే ఉద్వాసన చేసితిని. ఓ యగ్నీ! నీ యనుగ్రహము వలన అది యంతయు బాగు చేయఁబడిన దగుఁగాక. మఱల నిన్ను ఉద్దీపింపఁ జేయుచున్నాను.

6. అర్థము: హే ఆహవనీయ!=ఓ ఆహవనీయాగ్నీ!, మన్యు పరోప్తస్య=(నా)కోపముచే ఉద్వాసితుఁడవైన, తే=నీ యొక్క, యత్=ఏ తేజస్సు, పృథివీమను=భూమిని ప్రవేశించి, దధ్వసే=నష్టమైనదో, తత్=ఆ తేజస్సును, ఆదిత్యాః=ఆదిత్య దేవతలు, విశ్వే దేవాః=విశ్వే దేవతలు, వసవశ్చ=వసు దేవతలును, సమాభరన్=స్వీకరింతురుగాక.

తాత్పర్యము: ఓ ఆహవనీయాగ్నీ! నా కోపముచే ఉద్వాసన చేయఁబడి భూమిని ప్రవేశించి నశించిపోయిన నీ తేజస్సును వస్వాదిత్య, విశ్వేదేవతలు స్వీకరింతురుగాక.

7. అర్థము: (ఉద్వాసన రూపమైన అపరాధము పోవుటకై,) మనః=మాననీయమైన, జ్యోతిః=అగ్నియొక్క తేజస్సు, ఆజ్యమ్=(హవ్యమైన) ఆజ్యమును, జుషతామ్=సేవించుఁగాక. విచ్ఛిన్నమ్=విచ్ఛిన్నమైన, ఇమం యజ్ఞమ్=ఈ యజ్ఞమును, సం దధాతు=బాగుగ పోషించుఁగాక. బృహస్పతిః=బృహస్పతి, నః=మా యొక్క, ఇమమ్=ఈ యజ్ఞమును, తనుతామ్=విస్తరింపఁ జేయుఁగాక. విశ్వే దేవాః=సర్వ దేవతలు, ఇహ=ఈ యజ్ఞ కర్మయందు, మాదయన్తామ్=తృప్తి నొందుదురుగాక.

తాత్పర్యము: గౌరవనీయమైన అగ్నితేజస్సు హోమము చేయఁబడిన ఆజ్యమును సేవించుఁగాక. ఉద్వాసనచే విచ్ఛిన్నమైన ఈ యజ్ఞమును బాగుగ పోషించుఁగాక. బృహస్పతి మా యీ యజ్ఞమును విస్తరింపఁ జేయుఁగాక. సమస్తదేవతలు ఈ యజ్ఞ కర్మయందు తృప్తి నొందుదురు గాక. (ఈ మంత్రమును జెప్పుచు యజమానుఁడు హోమము చేయుటకై ఆహవనీయాగ్ని దగ్గఱ కూర్చుండవలెను.)

8. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ! తే=నీకు, సమిధః=సమిధలు, సప్త=సప్త సంఖ్యాకములు. (సమిధలు అనఁగా= అశ్వత్థ, ఉదుంబర, పలాశ, శమీ, వికంకత, అశనిహత, పుష్కర పర్ణములు అనునవి, అగ్నియందు వేల్చఁబడునట్టి పుల్లలు.) జిహ్వాః=నాలుకలు, సప్త=సప్త సంఖ్యాకములు, (కాలీ కరాలీ చ మనోజవా చ సులోహితా యా చ సుధూమ్రవర్ణా, స్ఫులింగినీ, విశ్వరుచీ చ దేవీ లోలాయమానా ఇతి సప్త జిహ్వాః.) ఋషయః=మంత్రములు, సప్త=సప్త సంఖ్యాకములు. ("అశ్వో రూపం కృత్వా యదశ్వత్థే తిష్ఠే" త్యాదులు.) ప్రియాణి=ఇష్టములైన, ధామ=స్థానములు. (బహువచనార్థే ఏకవచనం ఛాన్దసమ్.) సప్త=సప్త సంఖ్యాకములు. (=ఆహవనీయము, గార్హపత్యము, దాక్షిణీయము, సభ్యము, అవసథ్యము, ప్రాజహితము, ఆగ్నీధ్రీయము, అనునవి.) హోత్రాః=హోత మొదలగు వషట్కర్తలు, (=హోత, ప్రశాస్త, బ్రాహ్మణాచ్ఛంసి, పోత, నేష్ట, ఆగ్నీధ్రుఁడు, అచ్ఛావాకుఁడు-అనువారు,) సప్త=సప్త సంఖ్యాకులు, త్వా=నిన్ను, సప్తధా=ఏడు విధములుగా, (=అగ్నిష్టోమము, అత్యగ్నిష్టోమము, ఉక్థ్యము, షోడశి, అతిరాత్రము, అప్తోర్యామము, వాజపేయము, అని సప్త ప్రకారములుగా,) యజన్తి=(యజ్ఞ కర్తలు) యాగము చేయుచున్నారు. (తాదృశః త్వమ్=అటువంటి నీవు,) సప్త యోనీః=ఆహవనీయాది సప్త స్థానములను, ఘృతేన=(హోమము చేయఁబడిన,) ఆజ్యముచే, ఆ పృణస్వ=అంతటను పూరించుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీయందు వేల్చఁబడు సమిధలు సప్త సంఖ్యాకములు. సమిధలను సంపాదించుటలో నుప యోగపడు మంత్రములు సప్త సంఖ్యాకములు. నీకిష్టమైన స్థానములు సప్త సంఖ్యాకములు. వష ట్కారము చేయు హోత్రాదులు సప్త సంఖ్యాకులు. యాగకర్తలు నిన్ను సప్త విధములుగా యాగము చేయుచున్నారు. అటువంటి నీవు ఆహవనీయాది సప్త స్థానములను హోమాజ్యముచే అంతటను పూరిం చుము. (ఈ మంత్రము చెప్పుచు యజమానుఁడు హోమము చేయవలెను.)

9. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ! (త్వ ముద్వాసితో ౭పి మయా=నీవు నాచే ఉద్వాసితుఁడ వైనను,) ఊర్జా=క్షీరాది రసముతోఁగూడ, పునః=మఱల, నివర్తస్వ=(ఇచ్చటకు,) రమ్ము. ఇషా=అన్నముతోడను, ఆయుషా=ఆయువుతోడను, పునః పునః=మఱల మఱల (ఏహి=రమ్ము.), విశ్వతః=(చేసిన) సమస్త దోషముల నుండి, పాహి=రక్షింపుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు నాచే ఉద్వాసితుఁడవైనను మఱల క్షీరాది రసముతోఁగూడ ఇచ్చటకు రమ్ము. ఆయువు తోడను, అన్నముతోడను మాటి మాటికి రమ్ము. మాటి మాటికి మేము చేసిన సమస్త దోషములనుండి మమ్ము కాపాడుము.

10. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ! రయ్యా=ధనముతో, నివర్తస్వ=మఱలుము. (రమ్ము.) విశ్వప్స్నియా=సమస్తముచే త్రాగఁబడిన, ధారయా=వర్షధారచేత, విశ్వతస్పరి=సమస్త తృణధాన్య లతా పాదపముల పైభాగమున, పిన్వస్వ=తడుపుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు ధనముతో రమ్ము. సమస్తము త్రాగునట్టి వర్షధారచేత సమస్త తృణధాన్య లతా పాద పముల పై భాగమున తడుపుము. (హోమము చేయుచు ఈ మంత్రము నుచ్చరించవలెను. విశ్వైన-ప్సాయతే=భక్ష్యతే=పీయతే, ఇతి విశ్వప్స్నిః. "ప్సా=భక్షణే" అను ధాతువునుండి ఈ శబ్దము ఏర్పడినది.)

11. అర్థము: లేకః, సలేకః, సులేకః=లేక సలేక, సులేక అను పేర్లు గల, తే ఆదిత్యాః=ఆ యాదిత్య దేవతలు, జుషాణాః=సంప్రీతులై, నః=మా యొక్క, ఆజ్యమ్=నేతిని, వియన్తు=త్రాగుదురుగాక. కేతః, సకేతః, సుకేతః=కేత సకేత సుకేత అను పేర్లు గల, తే ఆదిత్యాః=ఆ యాదిత్య దేవతలు, జుషాణాః=సంప్రీతులై, నః=మా యొక్క, ఆజ్యమ్=ఆజ్యమును, వియన్తు=త్రాగుదురుగాక. వివస్వాన్, అదితిః, దేవజూతిః=వివస్వన్తుఁడు, అదితి, దేవజూతి, అను పేర్లు గల, తే ఆదిత్యాః=ఆ యాదిత్యులు, జుషాణాః=సంప్రీతులై, నః=మా యొక్క, ఆజ్యమ్=ఆజ్యమును, వియన్తు=త్రాగుదురుగాక.

తాత్పర్యము: నవ సంఖ్యాకులైన లేకాది నామములతో ప్రసిద్ధులైన ఆదిత్యదేవతలు సంప్రీతులై మేము హోమము చేసిన ఆజ్యమును త్రాగుదురుగాక.

తృతీయానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే పఞ్చమప్రపాఠకే చతుర్థోఽనువాకః ।

మూలము: [1]భూమి ర్భూమ్నా ద్యౌ ర్వరిణే త్యాహా ఽఽశిషై వైన మాధత్తే [2]సర్పా వై జీర్యన్తో ఽమ న్యన్త స ఏతం కసర్ణీరః కాద్రవేయో మన్త్ర మపశ్య త్తతో వై తే జీర్ణా స్తనూ రపాఘ్నత సర్పరాజ్ఞియా ఋగ్భి ర్గార్హపత్య మాదధాతి పున ర్నవ మేవైన మజరం కృత్వా ఽఽధత్తే ఽథో పూత మేవ [3]పృథివీ మన్నాద్యం నోపానమ త్సైతమ్ (౧)మన్త్ర మపశ్య త్తతో వై తా మన్నాద్య ముపానమ ద్యత్సర్పరాజ్ఞియా ఋగ్భి ర్గార్హపత్య మాదధా త్యన్నాద్య స్యావరుద్ధ్యా అథో అస్యా మేవైనం ప్రతిష్ఠిత మాధత్తే [4]యత్త్వా క్రుద్ధః పరోవపే త్యాహా పహ్నుత ఏవా స్మై త[5]త్పున స్త్వో ద్దీపయామసీ త్యాహ సమిన్ధ ఏవైనం[6]యత్తే మన్యు పరో ప్తస్యే త్యాహ దేవతాభి రేవ (౨)ఏనగ్ం సంభరతి [7]వి వా ఏతస్య యజ్ఞ శ్ఛిద్యతే యో ఽగ్ని ముద్వాసయతే బృహస్పతివత్యర్చో పతిష్ఠతే బ్రహ్మ వై దేవానాం బృహస్పతి ర్బ్రహ్మ ణైవ యజ్ఞగ్ం సందధాతి [8]విచ్ఛిన్నం యజ్ఞగ్ం సమిమం దధాత్వి త్యాహ సంతత్యై [9]విశ్వే దేవా ఇహ మాదయన్తా మిత్యాహ సంతత్యైవ యజ్ఞం దేవేభ్యో ఽనుదిశతి [10]సప్త తే అగ్నే సమిధ స్సప్త జిహ్వాః (౩)ఇత్యాహ సప్త సప్త వై సప్తధా ఽగ్నేః ప్రియా స్తనువ స్తా ఏవా వరున్ధే [11]పున రూర్జా సహ రయ్యే త్యభితః పురోడాశ మాహుతీ జుహోతి యజమాన మేవో ర్జా చ రయ్యా చో భయతః పరిగృహ్ణా [12]త్యాదిత్యా వా అస్మా ల్లోకా దముం లోక మాయ స్తే ఽముష్మి న్లోకే వ్యతృష్య న్త ఇమం లోకం పున రభ్యవేత్యా గ్ని మాధాయై తాన్హోమా నజు

హవు స్త అర్ధ్నువ న్తే సువర్గం లోక మాయ న్యః పరాచీనం పునరాధేయా దగ్ని మాద ధీత స ఏతా న్హోమా ఇుహుయా ద్యా మేవా ఽఽదిత్యా ఋద్ధి మార్ధ్నువ న్తా మేవ ర్ధ్నోతి ॥౪॥ (సై తం దేవతాభి రేవ జిహ్వా ఏతా నృఫ్ఛ్వవిగ్ంశతి శ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే పఞ్చమప్రపాఠకే చతుర్థోఽనువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: తృతీయానువాకోక్తము లయిన మంత్రములు ఈ చతుర్థానువాకమున వ్యాఖ్యానింపఁబడుచున్నవి. (=తృతీయానువాకమునకు చతుర్థానువాకము వ్యాఖ్యాన రూపమైనది.)

1. అర్థము: ఆశిషా+ఏవ=అన్నమును పొందవలె ననెడి కోరికచేతనే, ఏనమ్=ఈ యగ్నిని, ఆ ధత్తే=ఆధానము చేయుచున్నాను, అను అర్థమును, "భూమి ర్భూమ్నా ద్యౌర్వరిణా" ఇతి=అను మంత్రము, ఆహ=చెప్పినది.

తాత్పర్యము: 'అన్నలాభేచ్ఛచేతనే అగ్నిని ఆధానము చేయుచున్నాను' అను అర్థమును "భూమి ర్భూమ్నా" ఇత్యాది మంత్రము చెప్పినది.

2. అర్థము: సర్పాః=పాములు, జీర్యన్తః=ముసలితనను పొందినవై, అమన్యన్త వై=(ఈ ముదుసలితనము ఎట్లు పోవునో కదా! యని) ఆలోచించినవట! సః=ప్రసిద్ధుఁడును, కాద్రవేయః=కద్రూపుత్రుఁడునగు, కసర్ణీరః=కసర్ణీరమను సర్పము, ఏతం మంత్రమ్=ఈ "భూమి ర్భూమ్నా" ఇత్యాది మంత్ర సముదాయమును, అపశ్యత్=(ముదుసలితనమును పోఁగొట్టునట్టిదిగా,) చూచెను. (=తెలిసికొనెను.) తతః=ఆ మంత్రసామర్థ్యము వలన, తే=ఆ సర్పములు. జీర్ణాః+తనూః=ముదుసలి శరీరములను, అపాఘ్నత వై=పోఁగొట్టుకొనినవఁట. (=జీర్ణములైన శరీరములను విడిచి కోమల శరీరములను పొందినవి.) సర్పరాజ్ఞియాః=సర్పములకు రాజ్ఞియగు భూమియొక్క, ఋగ్భిః="భూమి ర్భూమ్నా" ఇత్యాది ఋక్కులచే, గార్హపత్యమ్=గార్హపత్యాగ్నిని, పునరాధత్తే=పునరాధానము చేయవలెను. (అట్లు చేసిన యజమానుఁడు,) ఏనమ్=ఈ యగ్నిని, నవమ్=నూతనుఁడైన వానినిగాను, అజరమ్=జర లేని వానినిగాను, అథో=మఱియు, పూతమేవ=పవిత్రుఁడైన వానినిగానే, కృత్వా=చేసి, అధత్తే=ఆధానము చేసినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: పూర్వము సర్పములు ముదుసలితనమును పొందినవై ఈ జర ఎట్లు పోవునా, అని ఆలోచించినవఁట! ప్రసిద్ధ కద్రూ పుత్రుఁడగు కసర్ణీరమను సర్పము "భూమి ర్భూమ్నా" ఇత్యాది మంత్ర సముదాయమును జరను పోఁగొట్టుటకు సమర్థమైనదిగా తెలిసికొనెను. ఆ సర్పము అప్పు డా మంత్ర సామర్థ్యముచేత, జీర్ణ శరీరమును విడిచి కోమల శరీరములను పొందినవఁట!. కావున సర్పములకు రాజ్ఞియగు భూమికి సంబంధించిన "భూమి ర్భూమ్నా" ఇత్యాది ఋక్కులచే గార్హపత్యాగ్నిని పునరాధానము చేయవలెను. అట్లు చేసిన యజమానుఁడు అగ్నిని నూతనునిగాను జర లేనివానినిగాను, మఱియు పవిత్రునిగాను జేసి, అధానము చేసిన ట్లగును. ("ఇయం వై సర్పతో రాజ్ఞీ" ఇత్యాది మంత్రమునందు భూమి సర్పములకు రాజ్ఞిగా వర్ణింపఁబడినది.)

3. అర్థము: పృథివీమ్=భూమిని, అన్నాద్యమ్=అన్నసిద్ధి, నోపానమత్=పొందలేదు. సా=ఆ భూమి, ఏతం మంత్రమ్=ఈ మంత్రమును("భూమి ర్భూన్మా" ఇత్యాదికమును) అపశ్యత్=చూచెను. తతః=ఆ మంత్ర సామర్థ్యము వలన, తామ్=ఆ భూమిని, అన్నాద్యమ్=అన్నసిద్ధి, ఉపానమత్=పొందెను. సర్పరాజ్ఞియాః=సర్పరాజ్ఞి యగు భూమి యొక్క, ఋగ్భిః="భూమి ర్భూమ్నే" త్యాది ఋక్కులచేత, గార్హపత్యమ్=గార్హపత్యాగ్నిని, అన్నాద్యస్య=అన్నసిద్ధియొక్క, అవరుద్ధ్యై=లాభముకొఱకు, అదధాతియత్=ఆధానము చేసినచో, అథో=అప్పుడు, ఏనమ్=ఈ యగ్నిని, అస్యామేవ=ఈ భూమియందే, ప్రతిష్ఠితమ్=ప్రతిష్ఠితునిగా, అధత్తే=ఆధానము చేసిన ట్లగును.

తాత్పర్యము: భూమిని అన్నసిద్ధి పొందలేదఁట. అట్టి భూమి పై మంత్రమును అన్నసిద్ధి దాయకముగా తెలిసికొనెనఁట. ఆ మంత్ర సామర్థ్యము వలన ఆ భూమిని అన్నసిద్ధి పొందెనఁట. కావున అన్నసిద్ధిప్రాప్తికై సర్పరాజ్ఞియగు భూమి సంబంధములైన ఋక్కులచేత అగ్ని నాధానము చేసినచో అప్పు డాభూమియందే అగ్నిని ప్రతిష్ఠితునిగా చేసి అధానము చేసిన ట్లగును.

4. అర్థము: "యత్త్వా క్రుద్ధః పరోవప ఇతి"="యత్త్వా క్రుద్ధః పరోవప" అనెడి మంత్రము, (యత్) ఆహ=ఏది చెప్పెనో, తత్=అది, అస్మై=ఈ యగ్నికొఱకు, అపహ్నుతే ఏవ=నిగరణము చేయుచున్నదియే.

తాత్పర్యము: ఉద్వాసన చేయఁబడిన యగ్నిని, అలిగిన బాలుని లాలన చేయువిధముగనే "యత్త్వా క్రుద్ధః పరోవప" ఇత్యాది మంత్రము అగ్న్యుద్వాసనను నిగరణము (=కప్పిపుచ్చుట) చేసి లాలన చేసినట్లు అర్థము చెప్పుచున్నది.

5. అర్థము: "పున స్త్వో ద్దీపయామసి" =పున స్త్వో ద్దీపయామసి" అను మంత్రము, ఏనమేవ=ఈ ఉద్వాసితుఁడైన యగ్నినే, సమిన్ధే=బాగుగ జ్వలింపఁజేయుచున్నాను, ఇతి=అని, ఆహ=చెప్పుచున్నది.

తాత్పర్యము: "పున స్త్వోద్దీపయామసి" ఇత్యాది మంత్రము ఉద్వాసితుఁడైన అగ్నినే మఱల బాగుగ జ్వలింపఁ జేయుచున్నానను అర్థమును చెప్పుచున్నది.

6. అర్థము: "యత్తే మన్యు పరోప్తస్య"="యత్తే మన్యు పరోప్తస్య" ఇత్యాది మంత్రము, ఏనమేవ=తాత్కాలిక కోపముచే ఉద్వాసితుఁడైన ఈ యగ్నినే, దేవతాభిః=దేవతలతో, సంభరతి=బాగుగ కలుపుచున్నాఁడు, ఇతి=అని, ఆహ=చెప్పుచున్నది.

తాత్పర్యము: "యత్తే మన్యు పరోప్తస్య" ఇత్యాది మంత్రము, 'యజమానుఁడు తన కోపముచే ఉద్వాసితుఁడైన యగ్నినే మఱల ఆదిత్యాది దేవతలు స్వీకరించుచున్నా'రని చెప్పుచున్నది.

7. అర్థము: యః=ఏ యజమానుఁడు, అగ్నిమ్=అగ్నిని, ఉద్వాసయతి=ఉద్వాసన చేయుచున్నాఁడో, ఏతస్య=ఈ ఉద్వాసన చేసిన యజమానునియొక్క, యజ్ఞః=యజ్ఞము, విచ్ఛిద్యతే వా=విచ్ఛిన్నమే యగుచున్నది. (తద్దోష పరిహారాయ=ఆ దోషము పోవుటకై,) బృహస్పతివత్యా=బృహస్పతి శబ్ద ఘటితమైన, ఋచా=ఋక్కుచేత, ఉపతిష్ఠతే=ఉపస్థానము, (=ప్రార్థన) చేయవలెను. దేవానామ్=దేవతలకు, బృహస్పతిః వై=బృహస్పతియే, బ్రహ్మ=బ్రహ్మవంటి వాఁడు. (ఏవం యది=ఈ విధముగ బృహస్పతి శబ్ద ఘటిత ఋక్కుతో ఉపస్థానము చేసినయెడల,) బ్రహ్మణైవ=బ్రహ్మతోడనే, యజ్ఞమ్=యజ్ఞమును, సందధాతి=సంధానము చేసినవాఁ డగును.

తాత్పర్యము: అగ్నిని ఉద్వాసన చేసిన యజమానుని యజ్ఞము విచ్ఛిన్న మగును. (యజ్ఞఫలము లభించదని భావము.) ఆ దోషము నివృత్త మగుటకు, బృహస్పతి శబ్ద ఘటిత ఋక్కుతో ప్రార్థించవలెను. దేవతలకు బృహస్పతియే బ్రహ్మ కావున పై విధముగ ప్రార్థించిన యజమానుఁడు యజ్ఞమును బ్రహ్మతోడనే సంధానము చేసిన వాఁడగును.

8. అర్థము: "విచ్ఛిన్నం యజ్ఞగ్ం సమిమం దధాతు"='విచ్ఛిన్నం యజ్ఞ' మిత్యాది మంత్రము, సంతత్యై=అవిచ్ఛిత్తి కొఱకు, ఇతి=అని, ఆహ=చెప్పుచున్నది.

తాత్పర్యము: 'విచ్ఛిన్నం యజ్ఞ' మిత్యాది మంత్రమునందలి 'సందధాతు' అను క్రియాపదము యజ్ఞము యొక్క అవిచ్ఛిత్తిని చెప్పుచున్నది.

9. అర్థము: "విశ్వే దేవా ఇహ మాదయన్తామ్"="విశ్వేదేవా" ఇత్యాది మంత్రము, సంతత్యా ఏవ=అవిచ్ఛిత్తిచేతనే, దేవేభ్యః=దేవతలకొఱకు, అను దిశతీతి=చెప్పుచున్నదని, ఆహ=చెప్పుచున్నది.

తాత్పర్యము: 'విశ్వేదేవా' ఇత్యాది మంత్రము యజ్ఞమును విచ్ఛిన్నము కాకుండఁజేసి ఆ విషయమును దేవతలకు చెప్పుటకై విశ్వేదేవతలు సంబోధింపఁబడిరి.

10. అర్థము: సప్త సప్త వై=సమిధాది పదార్థములు ప్రత్యేకముగా సప్త సంఖ్యాకములుగా నిర్దిష్టములైనవి. అగ్నేః=అగ్నికి, ప్రియాః=ప్రియములైన, తనువః=శరీరములు, సప్తధా=ఏడు విధములు. (అతః=ఇందువలన, అసౌ=ఈ యజమానుఁడు,) తాః ఏవ=ఆ శరీరములనే, అవరున్ధే=పొందుచున్నాఁడు, ఇతి=అని, "సప్త తే అగ్నే సమిధ స్సప్త జిహ్వాః"="సప్త తే" ఇత్యాది మంత్రము, ఆహ=చెప్పుచున్నది.

తాత్పర్యము: 'సప్త తే అగ్నే' ఇత్యాది మంత్రమునందు సమిధాది ద్రవ్యములు ప్రత్యేకముగ ఏడేసి, అని నిర్దిష్టములైనవి. అగ్నికిష్టములైన శరీరములును సప్తసంఖ్యాకములే కావున ఇట్టి అగ్నిని ప్రార్థించిన యజమానుఁడు ఆ శరీరములను పొందునని భావము.

11. అర్థము: "పున రూర్జా" "సహ రయ్యా" ఇతి="పున రూర్జా నివర్తస్వే" త్యాది మంత్రపాఠముచేతను, "సహ రయ్యా నివర్తస్వాగ్నే" ఇత్యాది మంత్రపాఠముచేతను, పురోడాశ మభితః=పురోడాశము నంతటను, ఆహుతీ=అహుతులను, జుహోతి=హోమము చేయవలెను. ఊర్జా=క్షీరాది రసముచేతను, రయ్యా=ధనముచేతను, ఉభయతః=రెండు విధములచేతను, యజమానమేవ=యజమానునే, (అగ్నిః=అగ్ని) పరిగృహ్ణతి=స్వీకరించుచున్నాఁడు.

తాత్పర్యము: "పున రూర్జా నివర్తస్వ" "సహ రయ్యా నివర్తస్వ" ఇత్యాది మంత్రముల పాఠముచేత యజమానుఁడు పురోడాశము నంతటను ఆహుతులను హోమము చేయవలెను. అగ్ని ఈ విధముగ హోమము చేసిన యజమానునే క్షీరాది రసము కలవానినిగాను ధనవంతునిగాను జేయును.

12. అర్థము: ఆదిత్యాః=దేవతలు, అస్మాత్ లోకాత్=ఈ లోకమునుండి, అముం లోకమ్=స్వర్గలోకమును, ఆయన్తే వా=(ఆధాన పునరాధానానంతరము,) పొందిరఁట. అముష్మిన్ లోకే=స్వర్గలోకమునందు, వ్యతృష్యన్తే=మిక్కిలి దప్పిక గొన్నవారైరి. పునః=మఱల, ఇమం లోకమ్=ఈ లోకమును, అభ్యపేత్య=పొంది, అగ్నిమ్=అగ్నిని, ఆధాయ=ఆధానము చేసి, ఏతాన్ హోమాన్="లేక స్సలేక స్సులేకసః" ఇత్యాది మంత్రముల ఆహుతులను, అజుహ్వుః=హోమము చేసిరి. తే=వారు, ఆర్ధ్నువన్తే=సమృద్ధిని పొందిరి. (తతః=పిమ్మట,) సువర్గం లోకమ్=స్వర్గలోకమును, ఆయన్=పొందిరి. యః=ఏ యజమానుఁడు, పునరాధేయాత్=పునరాధేయముకంటె, పరాచీనమ్=పిమ్మట, అగ్నిమ్=అగ్నిని, ఆదధీత=ఆధానము చేయునో, (తతః=అటుపిమ్మట,) ఏతాన్ హోమాన్=ఈ పైని చెప్పిన ఆహుతులను, జుహుయాత్=హోమము చేయునో, ఆదిత్యాః=దేవతలు, యాం ఋద్ధిమేవ=ఏ సమృద్ధినే, ఆర్ధ్నువన్=పొందిరో, (అయమపి=ఈ యజమానుఁడు కూడ,) తామ్ ఏవ=ఆ సమృద్ధినే, ఋధ్నోతి=పొందుచున్నాఁడు.

తాత్పర్యము: దేవతలు ఆధాన పునరాధానములు చేసి స్వర్గలోకమునకు పోయి అచట దప్పికఁగొన్నవారైరఁట. అచట సమృద్ధి లేదని తలఁచి మఱల భూలోకమునకు వచ్చి "లేక స్సలేక" ఇత్యాది మంత్రములచే ఆహుతులను హోమము చేసి స్వర్గమునకు పోయి అతిశయముగ సమృద్ధిని పొందిరి. కావున యజమానుఁడు పునరాధేయానంతరము అగ్ని నాధానము చేసి 'లేక స్సలేక' ఇత్యాది మంత్రములచే ఆహుతులను హోమము చేయవలెను. అట్లు చేసిన యజమానుఁడు దేవతలు పొందిన సమృద్ధిని పొందును. ("లేక స్సలేక స్సులేకసః" ఇత్యాది మంత్రములు ఈ ప్రపాఠకమునందలి మూఁడవ యనువాకము మూడవ పంచాశత్తునందు కలవు. తద్వ్యాఖ్యానము అచటనే కలదు. ఈ నాల్గవ యనువాకము మూఁడవ యనువాకమునకు వివరణాత్మకము.)

చతుర్థానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే పఞ్చమప్రపాఠకే పఞ్చమోఽనువాకః।

మూలము: [1]ఉపప్రయన్తో అధ్వరం మన్త్రం వోచేమాగ్నయే।ఆరే అస్మే చ శృణ్వతే। [2]అస్య ప్రత్నా
మను ద్యుతగ్ం శుక్రం దుదుహ్రే అహ్రయః।పయః సహస్రసా మృషిమ్। [3]అగ్నిర్మూర్ధా
దివః కకుత్పతిః పృథివ్యా అయమ్।అపాగ్ం రేతాగ్ంసి జిన్వతి।[4]అయ మిహ ప్రథమో ధాయి
ధాతృభి ర్హోతా యజిష్ఠో అధ్వరే ష్వీడ్యః।యమప్నవానో భృగవో విరురుచు ర్వనేషు చిత్రం
విభ్వం విశేవిశే।[5]ఉభా వా మిన్ద్రాగ్నీ ఆహువధ్యా (౧)ఉభారాధస స్సహ మాదయధ్యై।ఉభా
దాతారా విషాగ్ం రయీణా ముభా వాజస్య సాతయే హువేవామ్।[6]అయం తే యోనిర్ ఋత్వియో
యతో జాతో అరోచథాః।తం జాన న్నగ్న ఆరోహా థా నో వర్ధయా రయిమ్। [7]అగ్న ఆయూ
గ్ంషి పవస ఆసువో ర్జ మిషం చ నః।ఆరే బాధస్వ దుచ్ఛునామ్।[8]అగ్నే పవస్వ స్వపా అస్మే
వర్చ స్సువీర్యమ్।దధ త్పోషగ్ం రయిమ్ (౨)మయి।[9]అగ్నే పావక రోచిషా మన్ద్రయా
దేవ జిహ్వయా।ఆ దేవా న్వక్షి యక్షి చ।[10]స నః పావక దీదివో ఽగ్నే దేవాగ్ం ఇహాఽఽవహ।
ఉప యజ్ఞగ్ం హవి శ్చ నః।[11]అగ్ని శ్శుచివ్రతతమ శ్శుచి ర్విప్ర శ్శుచిః కవిః।శుచీ రోచత
ఆహుతః।[12]ఉదగ్నే శుచయ స్తవ శుక్రా భ్రాజ న్త ఈరతే।తవ జ్యోతీగ్ం ష్యర్చయః।[13]ఆయుర్దా
అగ్నే ఽస్యాయు ర్మే (3) దేహి వర్చోదా అగ్నే ఽసి వర్చో మే దేహి తనూపా అగ్నే ఽసి
తనువం మే పాహ్యగ్నే యన్మే తనువా ఊనం తన్మ ఆపృణ।[14]చిత్రావసో స్వస్తి తే పార
మశీయ [15]ఇన్ధానా స్త్వా శతగ్ం హిమా ద్యుమన్త స్సమిధీమహి వయస్వన్తో వయస్కృతం

యశస్వన్తో యశస్కృతగ్ం సువీరాసో అదాభ్యమ్। అగ్నే సపత్నదమ్భనం వర్షిష్ఠే అధినాకే।
[16]సం త్వ మగ్నే సూర్యస్య వర్చసా ఽగథా స్స మృషీణాగ్ం స్తుతేన సం ప్రియేణ ధామ్నా।
త్వ మగ్నే సూర్యవర్చా అసి సం మా మాయుషా వర్చసా ప్రజయా సృజ (౪)॥
(ఆహువధ్యై పోషగ్ం రయిం క్షే వర్చసా సప్తదశ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే పఞ్చమప్రపాఠకే పఞ్చమోఽనువాకః।

వేదార్థ దీపిక

అవతారిక: మొదటి నాలుగనువాకములందు పునరాధానము పూర్తి చేయఁబడినది. ఈ పంచమానువాకము మొదలు దశమానువాకము నందలి పూర్వార్థము పర్యంతము అగ్న్యుపస్థానము (=అగ్నిప్రార్థన) చెప్పఁబడుచున్నది.

1. **అర్థము:** అధ్వరమ్=యజ్ఞమును, ఉపప్రయన్తః=పొందుచున్న, (వయమ్=మేము,) ఆరే చ=దూరమునుండియు, అస్మే(=అస్మాకం వాచమ్)=మా మాటను, శృణ్వతే=వినుచున్న, అగ్నయే=అగ్నికొఱకు, (మంత్రమ్=మంత్రమును,) వోచేమ=పలుకుదుము. (వోచేమ=లిఙన్తము. ఛాందసము.)

తాత్పర్యము: యజ్ఞము చేయుచున్న మేము దూరమునుండియు మా మాటను వినుచున్న అగ్నికొఱకు మంత్రమును పలుకుదుము. (యజమానుఁడు అగ్న్యుపస్థానము చేయుటకై ఆహవనీయాగ్ని కెదుట నిలుచుండి ఆఱు ఆహుతులవఱకు ప్రార్థన చేయవలెను.)

2. **అర్థము:** అస్య=ఈ యగ్నియొక్క, ప్రత్నామ్=పురాతనమైన, అనుద్యుతమ్=(గోస్థానీయమైన,) అనుకూలదీప్తిని(=దీప్తినుండియని యర్థము.) అహ్రయః=సంకోచములేని ఋత్విజులు, పయః=క్షీరస్థానీయమును, సహస్రసామ్=బహుధన ప్రదమును, ఋషిమ్=కర్మ ప్రవర్తకమునగు, శుక్రమ్=జ్యోతిస్సును, దుదుహ్రే=పితుకుచున్నారు. (=సంపాదించుచున్నారు.)

తాత్పర్యము: ఋత్విజులు సంకోచము లేనివారై ఈ యగ్నియొక్క పురాతన కాంతినుండి క్షీరస్థానీయమును, బహుధన ప్రదమును, కర్మప్రవర్తకమునగు జ్యోతిస్సును పితుకుచున్నారు. (=సంపాదించుచున్నారు. అగ్నిదీప్తి గోస్థానీయమైనది. జ్యోతిస్సు క్షీరస్థానీయము. 'దుదుహ్రే 'అనునది ద్వికర్మకప్రయోగము.)

3. **అర్థము:** అయ మగ్నిః=ఈ యగ్ని, దివః=ద్యులోకమునకు, కకుత్=ఎత్తైన, మూర్ధా=(ఆదిత్య రూపముచే, శిరస్థానీయుఁడు. పృథివ్యాః=భూమికి, పతిః=(దాహపాకాదులను జేయువాఁడు కావున,) పాలకుఁడు. (అపి చ=మఱియు,) అపామ్=ఉదకములయొక్క, రేతాంసి=కార్యములైన స్థావర జంగమ శరీరములను, జిన్వతి=(జఠరాగ్ని రూపమున)సంతోషపెట్టుచున్నాఁడు.

తాత్పర్యము: ఈ యగ్ని ఆదిత్యరూపమున ద్యులోకమునకు పైన శిరస్థానీయుఁడు. దాహ పాకాదులను జేయుటచే భూమికి పాలకుఁడు. మఱియు ఉదక కార్యములైన స్థావర జంగమ శరీరములను జఠరాగ్ని రూపమున సంతోషపెట్టుచున్నాఁడు.

4. అర్థము: హోతా=దేవతల నాహ్వానించువాఁడును, యజిష్ఠః=(మనుష్యులకంటె;) అతిశయముగ యాగము చేయువాఁడును, అధ్వరేషు=యాగములందు, ఈడ్యః=స్తుతింపఁబడువాఁడునగు, అయమ్+అగ్నిః=ఈ యగ్ని, ఇహ=ఈ యజ్ఞకర్మయందు, ప్రథమః=ప్రధానభూతుఁడుగా, ధాతృభిః=ధారణకై ప్రయత్నించుచున్న మా చేత, ధాయి=ధరింపఁబడుచున్నాఁడు. అప్నవానః=అప్నవాన సంజ్ఞకలవారును, భృగవః=భృగు సంజ్ఞ కలవారును నగు మునులు, వనేషు=(తమ)ఆశ్రమములందు, విశే విశే=ఆ యా ప్రజల అభ్యుదయముకొఱకు, యమ్=ఏ అగ్నిని, చిత్రమ్=(బహు యాగాధారుఁడగుటచే,) విచిత్రమైనవానినిగాను, విభువమ్=వ్యాప్తి కలవానినిగాను, విరురుచుః=విశేషముగ ప్రకాశింపఁజేసిరో! (ఆ యగ్నిని ఈ కర్మయందు ప్రధానునిగా భావించుచున్నామని సమన్వయము.)

తాత్పర్యము: అప్నవాన భృగు సంజ్ఞలుగల మునులు తమ యాశ్రమములందు అగ్నిని ఆ యా ప్రజల యభ్యుదయమునకై విచిత్రమైన వానినిగాను, వ్యాప్తి గలవానినిగాను, ప్రకాశింపఁజేసిరి. ఆ యగ్నిని మేమీ యజ్ఞకర్మయందు ప్రధానునిగా మనస్సునందు భావన చేయుచున్నాము. ఈ యగ్ని యజ్ఞములందు దేవతల నాహ్వానించువాఁడు. మనుష్యులకంటె నతిశయముగ యాగము చేయువాఁడు. యాగములందు స్తుతింపఁబడువాఁడు.

5. ఈ మంత్రము ప్రథమ ప్రపాఠకమునందలి పదునాల్గవ యనువాకమునందు వ్యాఖ్యాతము.

6. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ! అయమ్=ఈ యాహవనీయప్రదేశము, తే=నీకు, యోనిః=స్థానము. (అపి చ=మఱియు,) ఋత్వియః=ప్రతి ఋతువునందు హోమమును నిర్వర్తింపఁ జేయునది. యతః=ఏ యాహవనీయ ప్రదేశమునుండి, జాతః=పుట్టినవాఁడవై, అరోచథాః=ప్రకాశించితివో, (=ప్రకాశించుచున్నావో,) తమ్=ఆ ప్రదేశమును, జానన్=(నీకు స్థానమని,) తెలిసికొనుచు, ఆరోహ=అధిష్ఠించుము. అథా=అటుపిమ్మట, నః=మాకు, రయిమ్=ధనమును, వర్ధయా=వృద్ధినొందించుము. (వర్ధయా=వర్ధయ.)

తాత్పర్యము: ఓ యగ్నీ! ఈ యాహవనీయ ప్రదేశము నీకు స్థానము. సర్వ ఋతువులందు హోమమును నిర్వర్తింపఁ జేయునది. నీవు పుట్టి ప్రకాశింపఁజేసిన ఆహవనీయ ప్రదేశము నీకు స్థానమని తెలిసికొనుచు ఈ యాహవనీయ ప్రదేశము నధిష్ఠించుము. అనంతరము మా ధనమును వృద్ధి నొందించుము. ('అథా' అను దీర్ఘాంతావ్యయము ఛాందసము.)

7. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ!, (త్వమ్=నీవు,) ఆయూంషి=(మా)ఆయువులను, పవసే=శోధన చేయుచున్నావు. (=దోషరహితములుగాఁ జేయుచున్నావు,) నః=మాకు, ఊర్జమ్=క్షీరాది రసమును, చ=మఱియు, ఇషమ్=అన్నమును, ఆసువ=కలుగఁ జేయుము. దుచ్ఛునామ్=వైరిసేనను, ఆరే=దూరమునందు, బాధస్వ=బాధించుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు మా ఆయువులను దోషరహితములుగాఁ జేయుచున్నావు. మాకు క్షీరాది రసమును అన్నమును కలుగఁజేయుము. వైరిసేనను దూరమునందు బాధించుము. ("అగ్న ఆయూగ్ంషి"–ఇత్యాది షణ్మంత్రములచే ప్రతి సంవత్సరము సర్వ కాలములందు అగ్న్యుపస్థానము చేయవలెను.)

8. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ! స్వపాః=మంచికర్మలు గల నీవు, అస్మే=మాయందు, వర్చః=బ్రహ్మవర్చస్సును, సువీర్యమ్=తగిన సామర్థ్యమును, పవస్వ=శోధించుము. మయి=నాయందు, పోషమ్=పుష్టిని, రయిమ్=ధనమును, దధత్=ధరింపఁజేయుచు, పవస్వ=శోధించుము. ("అస్మే" అనునది అస్మచ్ఛబ్దార్థకమైన వైదిక శబ్దము. ఈ శబ్దము తఱచుగ షష్ఠ్యర్థమునందును, సప్తమ్యర్థమునందును వాడఁబడుచున్నది.)

తాత్పర్యము: ఓ యగ్నీ! మంచికర్మలు కల నీవు నాకు పుష్టిని ధనమును గలుగఁజేయుచు మా యందలి బ్రహ్మవర్చస్సును, తగిన సామర్థ్యమును శోధన చేయుము.

9. అర్థము: పావకః=పవిత్రము చేయునట్టి, హే అగ్నే దేవః=ఓ యగ్నిదేవా!, రోచిషా=ప్రకాశించుచున్నదియు, మంద్రయా=తృప్తిని కలుగఁజేయునదియునగు, జిహ్వయా=నాలుకచేత, దేవాన్=దేవతలను, ఆవక్షి=ఆవహించుము. చ=మఱియు, యక్షి=యాగము చేయించుము.

తాత్పర్యము: పవిత్రము చేయునట్టి ఓ యగ్నిదేవా! ప్రకాశించునదియు, తృప్తిని కలిగించునదియునగు నాలుకచేత దేవతల నావహించుము. మఱియు యాగము చేయించుము. ('వక్షి'=లోడన్త'వహ'ధాతువు. "యక్షి"=లోడన్త 'యజ'ధాతువు.)

10. అర్థము: పావకః=పవిత్రము చేయునట్టి, హే అగ్నే!=ఓ అగ్నీ!, దీదివః=ప్రకాశించుచున్న, సః(త్వమ్)=ఆ నీవు, దేవాన్=దేవతలను, ఇహ=ఈ యజ్ఞకర్మయందు, ఆవహ=ఆవహింపఁజేయుము. నః=మాయొక్క, యజ్ఞమ్=యజ్ఞమును, చ=మఱియు, హవిః=హవిస్సును, ఉప(నయ)=పొందించుము.

తాత్పర్యము: పవిత్రము చేయునట్టి ఓ యగ్నీ! ప్రకాశించుచున్నవాఁడవును, ప్రసిద్ధుఁడవును నగు నీవు ఈ యజ్ఞ కర్మయందు దేవతలను ఆవహింపఁజేయుము, మఱియు మా యజ్ఞమును హవిస్సును వారి కందించుము.

11. అర్థము: అగ్నిః=(ఈ)అగ్ని, శుచి వ్రతతమః=అత్యంత శుద్ధమైన వ్రతముతోఁ గూడినవాఁడు. విప్రః=విప్రాభిమాని. (అగుటచేఁగూడ,) శుచిః=పరిశుద్ధుఁడు. కవిః=విద్వదభిమాని. (అగుటచేఁగూడ,) శుచిః=పరిశుద్ధుఁడు. ఆహుతః=అంతటను (మాచేత) వేల్చఁబడినవాఁడును, శుచిః=పరిశుద్ధుఁడునై, రోచతే=ప్రకాశించుచున్నాఁడు.

తాత్పర్యము: ఈ యగ్ని అత్యంత శుద్ధమైన వ్రతము కలవాఁడు. విప్రాభిమాని యగుటవలనఁ గూడ శుద్ధుఁడు. విద్వదభిమాని యగుటవలనఁగూడ శుద్ధుఁడు. అట్టి శుద్ధుఁడైన యగ్ని మాచే ఆహుతుఁడై ప్రకాశించుచున్నాఁడు.

12. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ!, తవ=నీయొక్క, శుచయః=శుద్ధములైన, శుక్రాః=కిరణములు, భ్రాజన్తః=ప్రకాశించుచున్నవియై, ఉదీరతే=పైకి వ్యాపించుచున్నవి. అర్చయః=పూజించువారు, తవ=నీయొక్క, జ్యోతీంషి=తేజస్సులను, (ప్రాప్నువన్తి=పొందుచున్నారు.)

తాత్పర్యము: ఓ యగ్నీ! శుద్ధమైన నీ కిరణములు ప్రకాశించుచున్నవై పైకి వ్యాపించుచున్నవి. నిన్ను పూజించువారు నీ తేజస్సులను పొందుచున్నారు.

13. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ!, (త్వమ్=నీవు,) ఆయుర్దాః=ఆయువు నిచ్చువాఁడవు, అసి=అగుచున్నావు. మే=నా కొఱకు, ఆయుః=ఆయువును, దేహి=ఇమ్ము. హే అగ్నే!=ఓ యగ్నీ!, (నీవు,) వర్చోదాః=వర్చస్సు నిచ్చువాఁడవు, అసి=అగుచున్నావు. మే=నా కొఱకు, వర్చః=వర్చస్సును, దేహి=ఇమ్ము. హే అగ్నే!=ఓ యగ్నీ, (నీవు,) తనూపాః=శరీరమును రక్షించువాఁడవు, అసి=అగుచున్నావు. మే=నా యొక్క, తనువమ్=శరీరమును, పాహి=రక్షించుము. హే అగ్నే!=ఓ యగ్నీ!, మే=నాయొక్క, తనువా=శరీరముచేత, యత్=ఏది, ఊనమ్=తక్కువైనదో, తత్=ఆ తక్కువైనదానిని, మే=నాకు, ఆ పృణ=అంతటను పూరించుము. ('తనూమ్'–అనుటకు, తనువమ్, అను ప్రయోగము ఛాందసము.)

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు ఆయువును తేజస్సును ఇచ్చువాఁడవు. కావున నాకు ఆయువును తేజస్సును ఒసఁగుము. నీవు శరీరమును రక్షించువాఁడవు. కావున నా శరీరమును రక్షించుము. నా శరీరమునందు ఏ కొఱఁత కలదో; ఆ కొఱఁతను తీర్చుము. (ఈ మంత్రమున నాలుగు యజుస్సు లున్నవి.)

14. అర్థము: హే చిత్రావసో!=ఓ రాత్రీ!, తే=నీయొక్క, పారమ్=సమాప్తిని, స్వస్తి=క్షేమముగా, అశీయ=పొందుదునుగాక.

తాత్పర్యము: ఓ రాత్రీ! నీ సమాప్తిని క్షేమముగ పొందుదునుగాక. (ఇదియు యజుస్సే.)

15. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ!, వయస్కృతమ్=అన్నమునకు కర్తవును, యశస్కృతమ్=కీర్తిప్రదుఁడవును, వర్షిష్ఠే అధినాకే=అతిప్రౌఢమైన స్వర్గము విషయమున, సపత్న దంభనమ్=విరోధులను నశింపఁ జేయు వాఁడవునగు, త్వా=నిన్ను, ఇన్ధానాః=సమిధలచే ప్రజ్వలింపఁ జేయుచున్నవారమును, వయస్వన్తః=అన్నము కలవారమును, యశస్వన్తః=కీర్తి కలవారమును, సువీరాసః=యోగ్యులైన వీరులు (=పుత్రాదులు) కలవారమును నగు (వయమ్=మేము,) శతమ్=శత సంఖ్యాకములైన, హిమాః=హేమంతోపలక్షితములైన సంవత్సరములు, ద్యుమన్తః=దీప్తి కలవారమై, సమిధీమహి=బాగుగ ప్రఖ్యాతి కలవారము, (భవేమ=అగుదుము.)

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు అన్నకర్తవు. కీర్తిప్రదుఁడవు. అత్యున్నతమైన స్వర్గమునందు విరోధులు లేకుండఁ జేయువాఁడవు. అటువంటి నిన్ను మేము శతసంవత్సరములు సమిధలచే ప్రజ్వలింపఁ జేయువారము, దీప్తి కలవారమునై, బాగుగ కీర్తిని గడింతుము. మేము అన్నము కలవారము. కీర్తిమంతులము. యోగ్య పుత్రాదులు కలవారము.

16. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ!, త్వమ్=నీవు, సూర్యస్య=సూర్యునియొక్క, వర్చసా=తేజస్సుతో, సమగథాః=కలిసికొంటివి. ఋషీణామ్=ఋషులయొక్క, స్తుతేన=స్తోత్రముతో, సమగథాః=కలిసికొంటివి. ప్రియేణ ధామ్నా=ఇష్టమైన ఆహవనీయ ప్రదేశ మనెడి స్థానముతో, సమగథాః=కలిసికొంటివి. హే అగ్నే=ఓ యగ్నీ, త్వమ్=నీవు, సూర్యవర్చాః=సూర్యసమాన తేజస్సు కలవాఁడవు, అసి=అగుచున్నావు. మామ్=నన్ను, ఆయుషా=ఆయువుతోను, వర్చసా=తేజస్సుతోను, ప్రజయా=సంతానముతోను, సంసృజ=కలుపుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు సూర్య తేజస్సుతో కలిసికొంటివి. ఇట్లే ఋషుల స్తోత్రములతోను, నీ కిష్టమైన ఆహవనీయ ప్రదేశ మనెడి స్థానముతోను, కలిసికొంటివి. నీవు సూర్య సమాన తేజస్కుఁడవు. నన్ను ఆయు స్తేజస్సంతానములతో కలుపుము. (నాకు ఆయురాదుల నొసఁగుమని భావము.)

పంచమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే పఞ్చమ ప్రపాఠకే షష్ఠోఽనువాకః ।

మూలము: [1]సంపశ్యామి ప్రజా అహ మిడప్రజసో మానవీః। సర్వా భవన్తు నో గృహే। [2]అమ్భ స్థామ్భో వో భక్షీయ మహ స్థమహో వో భక్షీయ సహ స్థసహో వో భక్షీయోర్జ స్థోర్జం వో భక్షీయ[3]రేవతీ రమధ్వ మస్మి న్లోకే ఽస్మి న్గోష్ఠే ఽస్మి న్క్షయే ఽస్మి న్యోనా విహైవ స్త మా ఽపగాత బహ్వీ ర్మే భూయా స్త(1)[4]సగ్ంహితా ఽసి విశ్వరూపీ రా మో ర్జా విశా ఽఽ గౌపత్యేనా ఽఽ రాయస్పోషేణ సహస్రపోషం వః పుష్యాసం మయి వో రాయ శ్శ్రయన్తామ్। [5]ఉప త్వా ఽగ్నే దివే దివే దోషావ స్త ర్ధియా వయమ్। నమో భర న్త ఏమసి। [6]రాజ న్త మధ్వరాణాం గోపా మృతస్య దీదివమ్। వర్ధమానగ్ం స్వేదమే। [7]స నః పితేవ సూనవే ఽగ్నే సూపాయనో భవ। సచస్వా న స్స్వ స్తయే [8]అగ్నే (2)త్వం నో అ న్తమః। ఉత త్రాతా శివో భవ వరూథ్యః। [9]తం త్వా శోచిష్ఠ దీదివః। సుమ్నాయ నూన మీమహే సఖిభ్యః। [10]వసు రగ్ని ర్వసుశ్రవాః। అచ్ఛా నక్షి ద్యుమ త్తమో రయిం దాః। [11]ఊర్జా వః పశ్యా మ్యూర్జా మా పశ్యత రాయస్పోషేణ వః పశ్యామి రాయస్పోషేణ మా పశ్యతే డా స్థ మధుకృత స్స్యోనా మా ఽఽవిశతే రా మదః। సహస్రపోషం వః పుష్యాసమ్ (3)మయి వో రాయ శ్శ్రయన్తామ్। [12]తత్సవితు ర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి। ధియో యో నః ప్రచోదయాత్। [13]సోమానగ్ం స్వరణం కృణుహి బ్రహ్మణస్పతే। కక్షీవ న్తం య ఔశిజమ్। [14]కదాచన స్తరీ రసి నే న్ద్ర సశ్చసి దాశుషే। ఉపోపేన్ను మఘవ న్భూయ ఇన్ను తే దానం దేవస్య పృచ్యతే। [15]పరి త్వా ఽగ్నే పురం వయం విప్రగ్ం సహస్య ధీమహి। ధృషద్వర్ణం

దివే దివే భేత్తారం భఙ్గురావతః। [16]అగ్నే గృహపతే సుగృహపతి రహం త్వయా గృహపతినా భూయాసగ్ం సుగృహపతి ర్మయా త్వం గృహపతినా భూయాః శతగ్ం హిమా స్తా మాశిష మాశాసే త న్తవే జ్యోతిష్మతీం తా మాశిష మాశాసే ఽముష్మై జ్యోతిష్మతీమ్ ॥౪॥

(భూయా స్త స్వ స్తయే ఽగ్నే పుష్యాసం ధృషద్వర్ణ మేకాన్న త్రిగ్ం శ చ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే పఞ్చమప్రపాఠకే షష్ఠోఽనువాకః

వేదార్థ దీపిక

అవతారిక: ఈ షష్ఠానువాకమునందు గార్హపత్యాగ్నికి, మరల ఆహవనీయాగ్నికిని ఉపస్థానము చెప్పఁబడుచున్నది. (ఉపస్థానము=ప్రార్థన.)

1\. **అర్థము:** అహమ్=నేను, మానవీః ప్రజాః=మనుష్య రూప ప్రజలను, ఇడ ప్రజసః=ధేను సంతానములను, సంపశ్యామి=బాగుగ చూచుచున్నాను. నః=మాయొక్క, గృహే=గృహమునందు, సర్వాః=సర్వప్రజలు, (=మనుష్యసంతానము, ధేను సంతానము,) భవన్తు=ఉందురుగాక.

తాత్పర్యము: నేను మనుష్య సంతానమును, ధేను సంతానమును బాగుగ చూచుచున్నాను. మా గృహమునందు ఆ సర్వప్రజలు ఉందురుగాక. (ఈ మంత్రము చెప్పుచు యజమానుఁడు గృహములను చూడవలెను.)

2\. **అర్థము:** (హే పశవః=ఓ పశువులారా!, యూయమ్=మీరు,) అంభః=ఉదక రూప క్షీరాది స్వరూపము, స్థ=అగుచున్నారు. వః=మీ యొక్క, అంభః=(మీరు త్రాగిన) ఉదకసార క్షీరాదికమును, (అహమ్=నేను,) భక్షీయ=భక్షింతును. (=త్రాగుదును.) మహః=అందఱిచే ఆదరింపఁదగిన క్షీరస్వరూపము, స్థ=అగుచున్నారు. వః=మీ యొక్క, మహః=(అట్టి ఆదరణీయమైన క్షీరాదికమును, భక్షీయ=భక్షింతును. సహః=బలకరమైన క్షీరాది స్వరూపము, స్థ=అగుచున్నారు. వః=మీ యొక్క, సహః=బలకర క్షీరాదికమును, భక్షీయ=భక్షింతును. ఊర్జః=స్వాదుతమ రస రూపము, స్థ=అగుచున్నారు. వః=మీ యొక్క, ఊర్జమ్=స్వాదుతమ రస రూప క్షీరాదికమును, భక్షీయ=భక్షింతును.

తాత్పర్యము: ఓ పశువులారా!, మీరు అందఱిచే నాదరింపఁ దగినదియు, బలకరమైనదియు, స్వాదుతమము నగు ఉదక రూప క్షీరాది రస స్వరూపము కలవారు. మీ యొక్క క్షీరాది రసమును నేను త్రాగుచున్నాను. (ఈ మంత్రము పఠించుచు యజమానుఁడు గోశాలయం దుండవలెను.)

3\. **అర్థము:** హే రేవతీః=ఓ పశువులారా!, (యూయమ్=మీరు) అస్మిన్ లోకే=ఈ భూలోకమునందు, అస్మిన్ గోష్ఠే=ఈ గోశాలయందు, అస్మిన్ క్షయే=ఈ గృహమునందు, అస్మిన్ యోనౌ=ఈ స్థానమునందు, రమధ్వమ్=క్రీడించుఁడు. ఇహైవ=ఇచ్చటనే, స్త=ఉండుఁడు. ఇతః=ఇటనుండి, మా అవగాత=తొలఁగిపోవలదు. మే=నాకొఱకు, బహ్వీః=అనేకులుగా, భూయాస్త=కండు. (సంతానపరంపరచే బహు సంఖ్యాకులుగా వృద్ధి నొందుఁడు.

తాత్పర్యము: ఓ పశువులారా! మీరు ఈ భూలోకమునందు ఈ పశువుల కొట్టమునందు ఈ గృహమునందు ఈ ప్రదేశమునందు ఇచ్చటనే క్రీడించుఁడు. ఇటనుండి తొలఁగిపోవలదు. నా నిమిత్తమై సంతాన పరంపరచే బహు సంఖ్యాకులుగా వృద్ధి నొందుఁడు. (ఆహవనీయ గార్హపత్యాగ్నుల మధ్యమునందుండి యజమానుఁ డీ మంత్రము జపించవలెను.)

4. **అర్థము:** (హే వత్స!=ఓ వత్సమా!, త్వమ్=నీవు,) సంహితా=(తల్లితో) కూడియున్న దానవు, అసి=అగుచున్నావు. విశ్వరూపీః=అనేక రూపములు కలదానవగు, (త్వమ్=నీవు,) ఊర్జా=క్షీరాది రసము నిమిత్తముగా, మా=నన్ను, ఆ విశ=పొందుము. (=నా దగ్గఱకు రమ్ము.) గౌపత్యేన=నాదియగు బహుపశు స్వామిత్వము నిమిత్తముగా, ఆవిశ=నన్ను సమీపించుము. రాయస్పోషేణ=ధనసమృద్ధి నిమిత్తముగను, ఆవిశ=నన్ను పొందుము. సహస్రపోషమ్=సహస్ర సంఖ్యాకముగ పుష్టి యగునట్లుగా, వః=మిమ్ము, పుష్యాసమ్=పోషింతును. మయి=నాయందు, వః=మీయొక్క, రాయః=క్షీరాది ధనములు, శ్రయన్తామ్=ఆశ్రయించుఁగాత. (=ఉండుఁగాక. వత్సము=దూడ.)

తాత్పర్యము: ఓ వత్సమా! నీవు నీ తల్లితో కూడియున్నావు. నీ తల్లియొద్ద పాలు త్రాగుటకై ఎడమ ప్రక్కనుండియు, కుడి ప్రక్కనుండియు, పరుగిడుచు వచ్చుచుండుటచే, అనేక రూపములు కలదానవువలె భాసించుచున్నావు. అటువంటి నీవు క్షీరాదిరసము కారణముగాను, నేను పశుస్వామిని యను కారణముచేతను, మదీయ ధన సమృద్ధి కారణముగను నా యొద్దకు రమ్ము. మీరు బహుసంఖ్యాకములుగ వృద్ధి నొందునట్లు మిమ్ము పోషింతును. మీ సంబంధము లైన క్షీరాది రస రూప ధనములు నా యొద్ద నుండుఁగాక. (ఈ మంత్రము చెప్పుచు గోవత్సమును స్పృశించవలెను.)

5. **అర్థము:** హే అగ్నే!=ఓ యగ్ని! దివే దివే=ప్రతి దినమునందు, దోషావస్తః=సాయం ప్రాతఃకాలములందు, వయమ్=మేము, ధియా=బుద్ధిచే, నమః=నమస్కారమును, భరన్తః=సంపాదించుచున్నవారమై, త్వా=నిన్ను, ఉపైమసి=పొందుచున్నాము.

తాత్పర్యము: ఓ యగ్ని! ప్రతిదినము, మేము ప్రాత స్సాయంకాలములందు బుద్ధి పూర్వకముగ నమస్కరించు చున్న వారమై నిన్ను పొందుచున్నాము. (ఈ ఋక్కు మొదలు నాలుగు ఋక్కులచే గార్హపత్యాగ్నిని సేవించవలెను.)

6. **అర్థము:** అధ్వరాణామ్=యజ్ఞములకు, రాజన్తమ్=రాజువుగా ప్రకాశించుచున్నవాఁడవును, గోపామ్=గోవులకు పాలకుఁడవును, ఋతస్య దీదివమ్=సత్యముచే ప్రకాశించుచున్నవాఁడవును, స్వే దమే=స్వీయమైన (అగ్ని) గృహమునందు, వర్ధమానమ్=(హవిస్సులచే) వృద్ధి నొందుచున్నవాఁడవునగు, త్వా=నిన్ను, ఉపైమసి=పొందుచున్నాను.

తాత్పర్యము: ఓ యగ్ని! యజ్ఞరాజువు, గోపాలకుఁడవు, సత్యముచే ప్రకాశించువాఁడవు, స్వగృహమునందు హవిస్సులచే వృద్ధి నొందుచున్నవాఁడవు నగు నిన్ను పొందుచున్నాను. (=సేవించుచున్నాను. ఇది గాయత్రీచ్ఛన్దో బద్ధమైన ద్విపదాత్మక ఋక్కు. వినియోగము పైని చెప్పఁబడినది. ఉపైమసి=ఉపైమి. గోపామ్=గోపమ్.)

7. **అర్థము:** హే అగ్నే!=ఓ యగ్ని, సః=(అటువంటి,) ఆ నీవు, సూనవే=కుమారునికొఱకు పితేవ=తండ్రివలె, నః=మాకొఱకు, సూపాయనః=పొందుటకు శక్యుఁడవు, భవ=అగుము. నః=మాయొక్క, స్వస్తయే=క్షేమము కొఱకు, సచస్వా=సన్నిహితుఁడవు కమ్ము.

తాత్పర్యము: ఓ యగ్ని! అటువంటి నీవు, కుమారునకు తండ్రివలె మాకు లభ్యుఁడ వగుము. మా క్షేమమునకై సన్నిహితుఁడ వగుము.

8. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ!, త్వమ్=నీవు, నః=మాకు, అన్తమః=అత్యంత సన్నిహితుఁడవు, భవ=అగుము. ఉత=మఱియు, త్రాతా=రక్షకుఁడవు, శివః=మంగళకరుఁడవు నగుచు, వరూథ్యః=గృహమునందు నిత్యము సన్నిహితుఁడవు, భవ=అగుము.

తాత్పర్యము: ఓ యగ్నీ!, నీవు మా కత్యంత సన్నిహితుఁడవు కమ్ము. మఱియు రక్షకుఁడవు, మంగళకరుఁడవు, నగుచు గృహమునందు నిత్యము సన్నిహితుఁడ వగుము.

9. అర్థము: శోచిష్ఠ!=మిక్కిలి పరిశుద్ధుఁడవు, దీదివః =అధికముగ ప్రకాశించుచున్నవాఁడవునగు, అగ్నే!, సఖిభ్యః= మిత్రులమైన మాకొఱకు, సుమ్నాయ=సుఖముకొఱకు, నూనమ్=నిశ్చయముగ, తమ్=ఆ పూర్వోక్త గుణయుక్తుఁడవైన, త్వా=నిన్ను, ఈమహే=పొందుదుము.

తాత్పర్యము: మిక్కిలి పరిశుద్ధుఁడవు, అధికముగ ప్రకాశించుచున్నవాఁడవునగు, ఓ యగ్నీ! మిత్రులమైన మా సుఖము కొఱకు నిశ్చయముగ పూర్వోక్త గుణయుక్తుఁడ వయిన నిన్ను పొందుదుము.

10. అర్థము: వసుః=ధనవంతుఁడగు, అగ్నిః=ఈ యగ్ని, వసుశ్రవాః=వసు రుద్రాదులచే నాదరముగ చూడఁబడుచున్న వాఁడు. (హే అగ్నే!=అటువంటి ఓ యగ్నీ!,) అచ్ఛా=(మాకు) అభిముఖుఁడవై, నక్షి=(మమ్ము) పొందుము. ద్యుమత్తమః=అతిశయముగ దీపించుచున్నవాఁడవై, రయిమ్=ధనమును, దాః=ఇమ్ము.

తాత్పర్యము: ధనవంతుఁడైన ఈ యగ్ని వసు, రుద్రాదులచే నాదరింపఁబడుచున్నవాఁడు. అటువంటి ఓ యగ్నీ! మా కభిముఖుఁడవై మమ్ము పొందుము. అతిశయముగ ప్రకాశించుచున్నవాఁడవై ధనము నిమ్ము.

11. అర్థము: (హే గృహగతాః పశవః!=గృహము నందుండునట్టి ఓ పశువులారా!,) ఊర్జా=క్షీరాది రస నిమిత్తముచే, వః= మిమ్ము, పశ్యామి=చూచుచున్నాను. (యూయమ్=మీరు,) ఊర్జా=క్షీరాది రస నిమిత్తముచే, మా=నన్ను, పశ్యత=చూడుఁడు. రాయస్పోషేణ=ధన సమృద్ధి కారణముచే, వః=మిమ్ము, పశ్యామి=చూచుచున్నాను. (యూయమ్=మీరు,) రాయస్పోషేణ=ధనపుష్టి కారణముచే, మా=నన్ను, పశ్యత=చూడుఁడు. హే ఇడాః=ఓ గోవులారా! (యూయమ్=మీరు,) మధుకృతః=మధురమైన ఘృతమును జేయువారుగా, స్థ=కండు. స్యోనాః=సుఖము చేయువారును, ఇరాః=అన్నము కలవారును, మదః=తృప్తిని జేయువారునై, మా= నన్ను, ఆ విశత=ఆవేశించుఁడు, (=పొందుఁడు.) వః=మిమ్ము, సహస్రపోషమ్=సహస్ర సంఖ్యాకముగ వృద్ధి కలుగునట్లుగ, పుష్యాసమ్=పోషించెదను. వః=మీయొక్క, రాయః=ధనములు, మయి=నా యందు, శ్రయన్తామ్=ఆశ్రయించియుండుఁగాక.

తాత్పర్యము: గృహము నందుండునట్టి పశువులారా! పాలు, ధనవృద్ధి కారణములుగా నేను మిమ్ము చూచుచున్నాను. మీరు కూడ క్షీరము ధనవృద్ధి కారణములుగా నన్ను చూడుఁడు. ఓ గోవులారా! మీరు మధురమైన ఘృతమును చేయువారుగా నుండుఁడు. అన్నము సంతృప్తియు కలవారై నన్ను చేరుఁడు. మిమ్ము సహస్ర సంఖ్యాకముగ వృద్ధి నొందునట్లు పోషింతును. మీ ధనములు (క్షీరాదికములు) నాయందుండుఁగాక.

12. అర్థము: యః=ఏ సవితృ దేవుఁడు, నః=మాయొక్క, ధియః=బుద్ధులను, ప్రచోదయాత్=ప్రేరణ చేయుచున్నాఁడో, తత్సవితుః దేవస్య=ఆ సవితృ దేవునియొక్క, వరేణ్యమ్=శ్రేష్ఠమైన, (కోరఁదగిన) భర్గః=తేజస్సును, ధీమహి=ధ్యానము చేయుచున్నాము.

తాత్పర్యము: మా బుద్ధులను ప్రేరణ చేయునట్టి సవితృదేవుని యొక్క శ్రేష్ఠమైన తేజస్సును మేము ధ్యానము చేయు చున్నాము. (ఇది మొదలు 'పరి త్వా' వఱకుఁగల నాలుగు మంత్రములచేత ఆహవనీయాగ్నిని ప్రార్థించ వలెను.)

13. అర్థము: బ్రహ్మణస్పతే!=బృహత్తరమైన కర్మకు స్వామివగు ఓ యగ్నీ!, యః=ఏ నీవు, ఔశిజమ్=ఉశిజునికుమారుని, కక్షీవన్తమ్=కర్మప్రవర్తక ఋషినిగా, కృతవాన్ అసి=చేసినవాఁడ వగుచున్నావో, (తాదృశః త్వమ్= అటువంటి నీవు, మామపి=నన్నుఁగూడ,) సోమానమ్=సోమయాగములకు, స్వరణమ్=ఉపదేష్టనుగా, కృణుహి=చేయుము. ('సోమానామ్' అనుటకు 'సోమానమ్' అని ప్రయుక్తమైనది. ఛాందసము.)

తాత్పర్యము: బృహత్తర కర్మకు స్వామివైన అగ్నీ!, ఉశిజ కుమారుని కర్మప్రవర్తక ఋషినిగాఁ జేసిన నీవు నన్నుఁ గూడ సోమయాగములకు ఉపదేష్టనుగాఁ జేయుము.

14. అర్థము: హే అగ్నే!=ఓ పరమైశ్వర్య యుక్తుఁడవైన అగ్నీ!, (త్వమ్=నీవు,) కదాచన=ఒకానొకప్పుడును, స్తరీః=హింసకుఁడవు, నాసి=అగుటలేదు. దాశుషే=హవిస్సు నిచ్చునట్టి యజమానునకై, ఉపోపేన్ను=అత్యంత సమీపమునందే, సశ్చసి=కూడియున్నవాఁడ వగుచున్నావు. హే మఘవన్!=ఇంద్ర సదృశుఁడవైనయగ్నీ!, భూయః ఇన్ను=మఱలఁగూడ, దేవస్య=దేవుఁడవైన, తే=నీయొక్క, దానమ్=దానము, పృచ్యతే=మాతో కలిసికొనుచున్నది.

తాత్పర్యము: పరమైశ్వర్యవంతుఁడవైన యగ్నీ! నీవు ఒకప్పుడును హింసకుఁడవు కావు. హవిర్దానము చేయు యజమానునకు అత్యంత సమీపముననే ఉంటున్నావు. ఇంద్రునివంటి ఓ యగ్నీ! మఱలఁ గూడ దేవుఁడవైన నీయొక్క దానము మాకు చేరుచున్నది.

15. అర్థము: హే సహస్య!=బలవంతుఁడవైన ఓయగ్నీ! పురమ్=అభీష్టములను పూరించువాఁడవును, విప్రమ్=బ్రాహ్మణాభిమానివియు, ధృషద్వర్ణమ్=శత్రువును తిరస్కరించు నాకారము కలవాఁడవును, భఙ్గురావతః=నశింపఁజేయు శీలముగల రాక్షసునకు, భేత్తారమ్=భేదకుఁడవునగు, త్వా=నిన్ను, వయమ్=మేము, దివే దివే=ప్రతిదినము, పరిధీమహి=అంతటను ధరించుచున్నాము.

తాత్పర్యము: బలవంతుఁడవైన అగ్నీ! నీవు కోరికల నిచ్చువాఁడవు. బ్రాహ్మణాభిమానివి. శత్రువును తిరస్కరించు నాకారము కలవాఁడవు. అట్టి నిన్ను మేము అంతటను ధరించుచున్నాము.

16. అర్థము: గృహపతే!=గృహస్వామివగు, హే అగ్నే!=ఓ యగ్నీ!, గృహపతినా=గృహస్వామివగు, త్వయా=నీ (యనుగ్రహము) చేత, అహమ్=నేను, శతం హిమాః=హేమన్తర్తు సహిత శత సంవత్సరములు, సుగృహపతిః=మంచి గృహపతిని, భూయాసమ్=అగుదునుఁగాక. గృహపతినా=గృహపతినైన, మయా=నాచేత, (పూజితః=పూజింపఁబడిన,) త్వమ్=నీవు, శతం హిమాః=హేమంతర్తు సహిత శత సంవత్సరములు, సుగృహపతిః=మంచి గృహస్వామివి, భూయాః=అగుదువుగాక. అహమ్=నేను, తన్తవే=పుట్టఁబోవు పుత్ర సంతానము కొఱకు, జ్యోతిష్మతీమ్=బ్రహ్మవర్చ్చ యుక్తమును, తా మాశిషమ్=ఆయు రారోగ్యై శ్వర్యాభివృద్ధి రూపమునైన ఆశీస్సును, ఆశాసే=కోరుచున్నాను. అముష్మై=ఈ పుట్టిన సంతానముకొఱకు, జ్యోతిష్మతీమ్, తామ్, ఆశిషమ్, ఆశాసే.

తాత్పర్యము: గృహపతివగు అగ్నీ!, గృహస్వామివగు నీ యనుగ్రహముచేత, నేను నూఱు సంవత్సరములు సుగృహపతి నగుదునుగాక. గృహపతినైన నాచే పూజింపఁబడిన నీవును శత సంవత్సరములు సుగృహపతి వగుదువుగాక. నేను పుట్టఁబోవు పుత్ర సంతానముకొఱకు, బ్రహ్మవర్చ్చయుతమును, ఆయు రారోగ్యై శ్వర్యాభివృద్ధి రూపమునైన ఆశీస్సును కోరుచున్నాను. ఈ పుట్టిన సంతానము కొఱకు కూడ ఆయాశీస్సును కోరుచున్నాను.

షష్ఠానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే పంచమప్రపాఠకే సప్తమోఽనువాకః।

మూలము: [1]అయజ్ఞో వా ఏష యోఽసామో పప్రయన్తో అధ్వర మిత్యాహ స్తోమ మేవాస్మై యున [2]క్త్యుపేత్యాహ ప్రజా వై పశవ ఉపేమం లోకం ప్రజా మేవ పశూ నిమం లోక ముపై [3]త్యస్య ప్రత్నా మనుద్యుత మిత్యాహ సువర్గో వై లోకః ప్రత్న స్సువర్గ మేవ లోకగ్ం సమా రోహ [4]త్యగ్ని ర్మూర్ధా దివః కకుదిత్యాహ మూర్ధానమ్ (౧)ఏవైనగ్ం సమానానాం కరో త్యథో దేవలోకాదేవ మనుష్యలోకే ప్రతితిష్ఠ [5]త్యయ మిహ ప్రథమో ధాయి ధాతృభి రిత్యాహ ముఖ్య మేవైనం కరో త్యు[6]భావా మిన్ద్రాగ్నీ ఆహువధ్యా ఇత్యా హౌజో బల మేవా వరున్ధే [7]ఽయం తే యోనిర్ ఋత్వియ ఇత్యాహ పశవో వై రయిః పశూ నేవా వరున్ధే [8]షడ్భి రుపతి ష్ఠతే షడ్వై (౨)ఋతవ ఋతుష్వేవ ప్రతి తిష్ఠతి షడ్భి రు త్తరాభి రుప తిష్ఠతే ద్వాదశ సంప ద్యన్తే ద్వాదశ మాసా స్సంవత్సర స్సంవత్సర ఏవ ప్రతి తిష్ఠతి[9]యథా వై పురుషో ఽశ్వో గౌ ర్జీర్య త్యేవ మగ్ని రాహితో జీర్యతి సంవత్సరస్య పరస్తా దాగ్నిపావమానీభి రుపతిష్ఠతే పునర్నవ మేవైన మజరం కరో త్యథో పునాత్యే వో[10]ప తిష్ఠతే యోగ ఏవాస్యైష ఉపతిష్ఠతే దమ ఏవాస్యై ష ఉపతిష్ఠతే యాఞ్చా వా స్యైషో పతిష్ఠతే యథా పాపీయా న్ఛ్రేయస ఆహృత్య నమస్యతి తాదృగేవ త [11]దాయుర్దా అగ్నే ఽస్యా యు ర్మే దేహి త్యాహ ఽఽయుర్దా హ్యేష వర్చోదా అగ్నే ఽసి వర్చో మే దేహి త్యాహ వర్చోదా హ్యేష తనూపా అగ్నే ఽసి తనువం మే పాహి త్యాహ (౩)తనూపా హ్యేషో ఽగ్నే యన్మే తనువా ఊనం

తన్మ అప్పృడే త్యాహ యన్మే ప్రజాయై పశూనా మూనం తన్మ ఆపూరయేతి వావై తదాహ
[12]చిత్రావసో స్వస్తి తే పార మశీయే త్యాహ రాత్రి ర్వై చిత్రావసు రవ్యుష్ట్యై వా ఏతస్యై
పురా బ్రాహ్మణా అభైషు ర్వ్యుష్టి మేవా వరున్ధ [13]ఇన్ధానా స్త్వా శతమ్ (౨)హిమా ఇత్యాహ
శతాయుః పురుష శ్శతేన్ద్రియ ఆయుష్యేవేన్ద్రియే ప్రతి తిష్ఠ [14]త్యేషా వై సూర్మీ కర్ణకావ
త్యేతయా హ స్మ వై దేవా అసురాణాగ్ం శతతర్హా స్తృగ్ంహన్తి యదేతయా సమిధ
మా దధాతి వజ్ర మేవై తచ్ఛతఘ్నీ యజమానో భ్రాతృవ్యాయ ప్రహరతి స్తృత్యా అచ్ఛమ్బ
ట్కారగ్ం [15]సం త్వ మగ్నే సూర్యస్య వర్చసా ఽగథా ఇత్యా హైత త్త్వమసీ దమహం
భూయాస మితి వా వైత దాహ [16]త్వ మగ్నే సూర్యవర్చా అసీ త్యాహా ఽఽశిష మేవైతా
మాశాస్తే ॥౬॥ (మూర్ధానగ్ం షడ్వా ఏష ఉపతిష్ఠతే పాహీ త్యాహ శత మహగ్ం షోడశ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే పఞ్చమప్రపాఠకే సప్తమోఽనువాకః।

వేదార్థ దీపిక

అవతారిక: పంచమానువాకమునందలి మంత్రములకు ఈ యనువాకము వ్యాఖ్యాన రూపము.

1. **అర్థము:** యః=ఏ యజ్ఞము, అసామ=సామరహితమో, ఏషః=ఈ సామరహిత యజ్ఞము, అయజ్ఞః వా=యజ్ఞమే కాదు. "ఉప ప్రయన్తః"=పంచమానువాకమునందలి "ఉప ప్రయన్తః" ఇత్యాది మంత్రభాగము, అస్మై=ఈ యగ్ని కొఱకు, స్తోమమేవ=స్తోమమునే, యునక్తి=కలుగఁ జేయుచున్నది, ఇతి=అని, ఆహ=చెప్పుచున్నది.

తాత్పర్యము: సామ రహితముగఁ జేయు యజ్ఞము యజ్ఞమే కాదనియు, కావున పంచమానువాకమునందలి "ఉప ప్రయన్తః" ఇత్యాది మంత్రభాగము అగ్నిహోత్ర యాగమునందు స్తోమ(=సామసంఘ)సంబంధమును జెప్పుచున్నదని భావము. (ఋగ్భేదమువలన, ఆవృత్తి భేదమువలన నిష్పన్నమైన సామసంఘము స్తోమ మనఁబడును.)

2. అర్థము: ప్రజాః=ప్రజలు, పశవః=పశువులు, ఇమం లోకమేవ=ఈ భూలోకమునే, ఉపగచ్ఛన్తి=పొందుచున్నారు. (అతః=ఇందువలన, యజమానః అపి=యజమానుఁడు కూడ,) ప్రజామ్=సంతానమును, పశూన్=పశువులను, (ఉపేత్యైవ=పొందియే,) ఇమం లోకమ్=ఈ భూలోకమును, ఉపైతి=పొందుచున్నాఁడు, (అను నర్థమును,) ఉపేత్యాహ=''ఉపప్రయన్తః'' ఇత్యాది మంత్రభాగమునందలి, 'ఉప' అను పదము చెప్పుచున్నది.

తాత్పర్యము: 'ఉప ప్రయన్తః' అను మంత్రమందలి 'ఉప' అను పదము పైఅర్థమును తెలియఁ జేయుచున్నది.

3. అర్థము: సువర్గః లోకః ఏవ=స్వర్గలోకమే, ప్రత్నః=ప్రత్నశబ్దార్థము. ''అస్య ప్రత్నా మను ద్యుత మితి ''=''అస్య ప్రత్నా మను ద్యుతమ్' అను మంత్రమునందలి ప్రత్నశబ్దము, (యజమానః=యజమానుఁడు,) సువర్గం లోకమేవ=స్వర్గలోకమునే, సమారోహతి=అధిరోహించుచున్నాఁడను నర్థమును, ఆహ=చెప్పుచున్నది.

తాత్పర్యము: 'అస్య ప్రత్నా మను ద్యుతమ్' అను మంత్రమునందలి ప్రత్నశబ్దము (స్వర్గము ప్రాచీన మగుటచే) స్వర్గమును సూచించుచున్నది. యజమానుఁడు ఆ స్వర్గమునే పొందుచున్నాఁడని పైమంత్రముయొక్క భావము.

4. అర్థము: (అగ్నిః=అగ్ని,) ఏనమ్=ఈ యజమానుని, సమానానామ్=సజాతీయులలో, మూర్ధానమ్=శ్రేష్ఠునిగానే, కరోతి=చేయుచున్నాఁడు. అథో=మఱియు, దేవలోకాదేవ=దేవలోకమునుండియే, (ఆగత్య=వచ్చి,) మనుష్య లోకే=మనుష్యలోకమునందు, ప్రతి తిష్ఠతి=(యజమానుఁడు)ప్రతిష్ఠితుఁ డగుచున్నాఁడు, ఇతి=అని, ''అగ్ని ర్మూర్ధా దివః కకుత్పతిః ''=''అగ్ని ర్మూర్ధా'' ఇత్యాది మంత్రము, ఆహ=చెప్పుచున్నది.

తాత్పర్యము: 'అగ్ని ర్మూర్ధా' ఇత్యాది మంత్రభాగమునందలి 'మూర్ధన్' శబ్దము శ్రేష్ఠార్థకము కావున, అగ్ని యజమానుని సమానులలో శ్రేష్ఠునిగాఁ జేయుచున్నాఁడనియు, యజమానుఁడు దేవలోకమునుండి వచ్చి భూలోకమునందు ప్రతిష్ఠితుఁ డగుచున్నాఁ డనియు ''అగ్ని ర్మూర్ధా'' ఇత్యాది మంత్రము చెప్పుచున్నది.

5. అర్థము: (అగ్నిః=అగ్ని,) ఏనమ్=ఈ యజమానుని, ముఖ్యమేవ=ముఖ్యునిగానే, కరోతి=చేయుచున్నాఁడు, ఇతి=అని, ''అయ మిహ ప్రథమో ధాయి ధాతృభిః ''=అయ మిత్యాది మంత్రము, ఆహ=చెప్పుచున్నది.

తాత్పర్యము: అగ్ని ఈ యజమానుని ముఖ్యునిగానే చేయుచున్నాఁడని 'అయ మిహ' ఇత్యాది మంత్రము చెప్పుచున్నది.

6. అర్థము: (ఇంద్రుఁడు బలాభిమాని యగుటవలనను, అగ్ని తేజోఽభిమాని యగుటవలనను, యజమానః=యజమానుఁడు,)ఓజః=తేజస్సును, బలమ్=బలమును, అవరున్ధే ఏవ=నిశ్చయముగ పొందుచున్నాఁడు, ఇతి=అని, ''ఉభా వా మిన్ద్రాగ్నీ ఆహువధ్యై ''=''ఉభా వా మిన్ద్రాగ్నీ '' ఇత్యాది మంత్రము, ఆహ=చెప్పుచున్నది.

తాత్పర్యము: ఇంద్రుఁడు బలాభిమానియు, అగ్ని తేజోఽభిమానియు నగుటవలన యజమానుఁడు బలమును తేజస్సును తప్పక పొందుచున్నాఁడని ''ఉభా వా మిన్ద్రాగ్నీ'' ఇత్యాది మంత్రము చెప్పుచున్నది.

7. అర్థము: పశవః వై=పశువులే, రయిః=ధనము, (యజమానః=యజమానుఁడు,) పశూనేవ=పశువులనే, అవరున్ధే=పొందుచున్నాఁడు, ఇతి=అని, ''అయం తే యోనిర్ ఋత్వియః ''='అయంతే' ఇత్యాది మంత్రము, ఆహ=చెప్పుచున్నది.

తాత్పర్యము: పంచమానువాకమునందలి ''అయం తే యోనిః'' ఇత్యాది మంత్రము పశువులే ధన మనియు, యజమానుఁడు పశురూప ధనమునే పొందుచున్నాఁడనియు చెప్పుచున్నది.

8. అర్థము: షడ్భిః=''ఉప ప్రయన్తః'' ఇత్యాదులైన ఆఱు మంత్రములచే, (యజమానః=యజమానుఁడు,) ఉపతిష్ఠతే=గార్హపత్యాగ్నిని ఉపస్థానము చేయవలెను. ఋతవః=ఋతువులు, షట్+వై=ఆఱే. (అతః=ఇందువలన, యజమానః=పైవిధముగ ఉపస్థానము చేసిన యజమానుఁడు,) ఋతుషు=షడృతువులందు, ప్రతి తిష్ఠత్యేవ=ప్రతిష్ఠావంతుఁ డగుచునే యుండును. ఉత్తరాభిః షడ్భిః=ఉత్తరములైన ''అగ్న ఆయూంషి'' ఇత్యాది మంత్రములు ఆఱింటిచే, ఉపతిష్ఠతే=ఉపస్థానము చేయవలెను. ద్వాదశ=(పూర్వోత్తర షట్కములు రెండును

కలిసి,) పండ్రెండు, సంపద్యన్తే=ఏర్పడుచున్నవి. ద్వాదశ మాసాః=పండ్రెండు మాసములు, సంవత్సరః=సంవత్సరము, (భవతి=అగుచున్నది. ఇట్టి యజమానుఁడు,) సంవత్సరే ఏవ=సంవత్సరమునందే, ప్రతితిష్ఠతి=ప్రతిష్ఠావంతుఁ డగుచున్నాఁడు. (ఉపస్థానము=ప్రార్థన.)

తాత్పర్యము: పంచమానువాకమునందలి "ఉప ప్రయన్తః" ఇత్యాది మంత్రము మొదలు "అయం తే" ఇత్యాది మంత్రము వఱకుఁ గల మంత్రములు ఆఱు. ఈ యాఱింటికి పూర్వషట్క మనిపేరు. "అగ్న ఆయూంషి" ఇత్యాది మంత్రము మొదలు "ఉదగ్నే" ఇత్యాది మంత్రము వఱకుఁగల ఆఱు మంత్రములకు ఉత్తర షట్క మని పేరు. ఋతువులు షట్సంఖ్యాకములు. కావున పూర్వషట్కముచే అగ్ని నుపస్థానము చేసిన యజమానుఁడు షడృతువులందును ప్రతిష్ఠ నొందును. ఇట్లే ఉత్తర షట్కముచే కూడ అగ్ని నుపస్థానము చేయవలెను. రెండు షట్కములు కలుపగా పండ్రెండు సంఖ్య ఏర్పడును. పండ్రెండు మాసములు ఒక సంవత్సర మగును. కావున పండ్రెండు మంత్రములచే అగ్ని నుపస్థానము చేసిన యజమానుఁడు సంవత్సర మంతయు ప్రతిష్ఠను పొందునని భావము.

9. అర్థము: పురుషః=పురుషుఁడు, యథా=ఎట్లు, జీర్యతి=ముదుసలి యగుచున్నాఁడో, అశ్వః=గుఱ్ఱము, యథా=ఏ విధముగా, జీర్యతి=ముదుసలి యగుచున్నదో, గౌః=గోవు, యథా=ఏ విధముగ, జీర్యతి=ముసలి దగుచున్నదో! ఏవమ్=ఈ విధముగా, అగ్నిః=అగ్ని, ఆహితః=ఆధానము చేయఁబడినవాఁడై, జీర్యతి వై=జరను పొందుచునే యున్నాఁడు. సంవత్సరస్య=సంవత్సరమునకు, పరస్తాత్=పిమ్మట, అగ్ని పావమానీభిః=అగ్ని పవమాన దేవతల సంబంధము లయిన ఋక్కులచేత, ఉపతిష్ఠతే=ఉపస్థానము చేయవలయును. (ఇత్థం కృతవాన్ యజమానః=ఇట్లు చేసిన యజమానుఁడు,) పునః=మఱల, ఏనమ్=ఈ యగ్నిని, నవమేవ=నూతనునిగానే, కరోతి=చేయుచున్నాఁడు. (అపి చ=మఱియు) అజరమ్=జరారహితునిగాను, కరోతి=చేయుచున్నాఁడు. అథో=మఱియు, పునాత్యేవ=పవిత్రునిగనే చేయుచున్నాఁడు.

తాత్పర్యము: మనుష్యుఁడు, అశ్వము, గోవును కాలక్రమమున ముసలితనమును పొందు విధముగ, అగ్నియు ఆధానము చేయఁబడినవాఁడై జరను పొందును. కావున యజ్ఞకర్త సంవత్సరానంతరము అగ్ని పవమాన దేవతల సంబంధము లయిన ఋక్కులచే అగ్నిని ప్రార్థన చేసినచో యజ్ఞకర్త ఆ యగ్నిని నూతనునిగాను, జరారహితునిగాను పవిత్రునిగాను చేసినవాఁ డగుచున్నాఁడు.

10. అర్థము: ఉపతిష్ఠత ఇతి యత్=ప్రార్థన చేయుచున్నాఁ డనుట యేది కలదో, ఏష ఏవ=ఇదియే, అస్య=ఈ యగ్నికి, యోగః=అనుగ్రాహ్యాను గ్రాహక రూప సంబంధము. (అనుగ్రాహ్యః=అనుగ్రహింపఁబడినవాఁడు. అనుగ్రాహకః=అనుగ్రహించువాఁడు=అగ్ని. ఈ యుభయులకు గల సంబంధము అనుగ్రాహ్యానుగ్రాహక రూపము.) ఉపతిష్ఠత ఇతి యత్=ప్రార్థనచేయుచున్నాఁ డనుట యేది కలదో, ఏషః ఏవ=ఇదియే, అస్య=ఈ యగ్నికి, దమః=దాహాద్యుపద్రవ నివారణము. ఉపతిష్ఠత ఇతి యత్=ఉపస్థానము చేయుచున్నాఁ డనుట యేది కలదో, ఏష ఏవ=ఇదియే, అస్య=ఈ యగ్నికి, యాఞ్చా=ధనాది యాచనా రూపమైనది. (లోకే=లోకమునందు,) యథా=ఏ విధముగా, పాపీయాన్=దరిద్రుఁడు, శ్రేయసే=ధనవంతునికొఱకు, ఆహృత్య=కానుకను తీసికొనివచ్చి, నమస్యతి=నమస్కారము చేయుచున్నాఁడో, తత్=యజమానుఁడు అగ్నికి ఆ నమస్కారము చేయుట, తాదృగేవ=అటువంటిదియే.

తాత్పర్యము: లోకమునందు దరిద్రుఁడు ధనవంతుని యొద్దకు వచ్చి కానుకను సమర్పించి నమస్కరించి తనకు కావలసిన ధనాదికమును యాచించు విధమువంటిదే యజమానుఁ డగ్నిని నమస్కరించుట కూడ. ప్రార్థించి యాచించిన యజమానునకు అగ్ని దాహాద్యుపద్రవములను నివారించి ధనాదికము నిచ్చును. కనుకనే వీరిద్దఱకు అనుగ్రాహ్య నుగ్రాహక రూప సంబంధము కలదు.

11. అర్థము: ("ఆయుర్దా అగ్నే" ఇత్యాదులు నాలుగు యజుస్సులు (=మంత్రములు) పంచమానువాకములో వ్యాఖ్యాతములైనవి.) ఏషః=ఈ యగ్ని, ఆయుర్దాః హి=ఆయువు నిచ్చువాఁడు కదా, ఏషః=ఈ యగ్ని, వర్చోదాః హి=తేజస్సు నిచ్చువాఁడు కదా, ఏషః=ఈ యగ్ని, తనూపాః హి=శరీరమును రక్షించువాఁడు కదా, (అని మూఁడు యజుస్సులయొక్క అర్థ ప్రసిద్ధిని ఈ బ్రాహ్మణము వివరించుచున్నది. నాల్గవ యజుస్సులోని 'తనూ' శబ్దముచేత ప్రజలు పశువులు కూడ ఉపలక్షితులు, అను విషయమును "యత్త్వ జాయై పశూనామ్" ఇత్యాది బ్రాహ్మణవాక్యము వివరించుచున్నది.) మే=నాయొక్క, ప్రజాయై=సంతానము కొఱకు, పశూనామ్=పశువులకును, యత్=ఏది, ఊనమ్=తక్కువైనదో, మే=నాకు, తత్=ఆ లోపమును, ఆ పూరయ=అంతటను పూరించుము, ఇతి వావ=అను ఈ విషయమునే, తత్="అగ్నే యన్మే తనువా" ఇత్యాది యజుస్సు, ఆహ=చెప్పుచున్నది. తాత్పర్యము స్పష్టము.

12. అర్థము: హే చిత్రావసో!=ఓ రాత్రీ! తే=నీయొక్క, పారమ్=అంతమును, స్వస్తి=క్షేమముగా, అశీయ=పొందుదునుగాక, ఇతి=అని, ఆహ=(యజస్సు) చెప్పుచున్నది. (ఇదియు పంచమానువాకములోనిదే. ఈ యజస్సునందలి చిత్రావసు శబ్దముయొక్క అర్థమును ఈ బ్రాహ్మణవాక్యము వివరించుచున్నది.) రాత్రిః వై=రాత్రియే, చిత్రావసుః=చిత్రావసు శబ్దార్థము. నక్షత్రాది రూపచిత్రము స్పష్టముగా రాత్రియందుండును, కావున చిత్రావసు వనఁగా రాత్రి అని యర్థము. పురా=పూర్వము బ్రాహ్మణాః=బ్రాహ్మణులు, ఏతస్యై=ఈ, అవ్యుష్టై వా=ప్రభాత కాలాంతము కొఱకే, అభైషుః=భయపడిరి. హేమంతరాత్రి పొడవైనది కావున ఆ రాత్రి యెప్పటికిని అంతము కాదేమో, అని భయపడి రాత్రియొక్క అంతమును పొందుదుముగాక యని ప్రార్థించినారు. ఆ ప్రార్థనచేత, వ్యుష్టిమేవ=ప్రభాతమునే, అవరున్ధే=పొందుచున్నాను. (అని భావము. తాత్పర్యము కూడ అర్థమునందే వివరింపఁబడినది.)

13. అర్థము: పురుషః=పురుషుఁడు, (=మానవుఁడు) శతాయుః=నూఱు సంవత్సరముల ఆయుఃపరిమాణము కలవాఁడు. శతేంద్రియః=నూఱు ఇంద్రియములు కలవాఁడు. (అతః=ఇందువలన,) శతేంద్రియే=నూఱు ఇంద్రియములు గల, ఆయుష్యేవ=ఆయువునందే, ప్రతితిష్ఠతి=ప్రతిష్ఠితుఁ డగుచున్నాఁడు, ఇతి=అని, "ఇన్ధానా స్త్వా శతగ్ం హిమాః"='ఇన్ధానా స్త్వా' ఇత్యాది మంత్రము, ఆహ=చెప్పుచున్నది.

తాత్పర్యము: అయిదు కర్మేంద్రియములు, అయిదు జ్ఞానేంద్రియములును ప్రతి మానవునకు ఉండును. దశనాడులు కూడ ఉండును. ఆ పది యింద్రియములు పది నాడులయందు సంచరించుటవలన ఇంద్రియముల సంఖ్య శతమైనది. కావున మానవుఁడు శతేంద్రియుఁ డగుచున్నాఁడు. మానవుని ఆయుః పరిమాణము కూడ నూఱు సంవత్సరములే కావున పంచమానువాకమునందు "ఇన్ధానా స్త్వా శతగ్ం హిమాః" అని ప్రార్థన చేసిన యజమానుఁడు శతేంద్రియ సహిత శత సంవత్సరాత్మకమైన ఆయువునందు ప్రతిష్ఠితుఁ డగుచున్నాఁడని భావము.

14. అర్థము: ఏషా వై=ఈ ఋక్కే, కర్ణకావతీ=అంతర్జ్వాలకల, సూర్మీ=ఇనుప ప్రతిమ. (వంటిది.) ఏతయా=ఈ ఋక్కుచేత, దేవాః=దేవతలు, అసురాణామ్=రాక్షసులయొక్క, శతతర్హాః=ఒకదెబ్బచేత శతసంఖ్యాకులను హింసించువారిని, తృంహన్తి=హింసించుచున్నారు. ఏతయా=ఈ ఋక్కుచేత, సమిధమ్=సమిధను, ఆదధాతి (చేత్)=ఆధానము చేసినచో, శతఘ్నీమ్=శత సంఖ్యాకులను (=రాక్షసులను) సంహరించునట్టి యీ ఋక్కును, వజ్రమేవ=వజ్రాయుధముగానే, (కృత్వా=చేసి,) అచ్ఛంబట్కారమ్=తనకు నాశము లేకుండునట్లుగ, యజమానః=యజమానుఁడు, స్తృత్యై=విస్తీర్ణతకై, భ్రాతృవ్యాయ=శత్రువును, ప్రహరతి=కొట్టుచున్నాఁడు. ('భ్రాతృవ్యాయ' ద్వితీయార్థమున చతుర్థ్యంతము.)

తాత్పర్యము: "ఇన్ధానా స్త్వా శతగ్ం హిమాః" ఇత్యాది మంత్రముచే, అగ్న్యుపస్థానము సమిదాధానము చేయవలయును. ఈ ఋక్కు అంతర్జ్వాలగల ఇనుప ప్రతిమవంటిది. పూర్వము దేవతలు ఒక్కొక్క దెబ్బచేత నూర్లకొలఁది నరులను సంహరించునట్టి అసురులను ఈ ఋక్కుచే సంహరించిరి. ఈ ఋక్కుచే సమిదా

ధానము చేసినచో ఈ ఋక్కును వజ్రముగనే చేసి యజమానుఁడు తనకు నాశము కలుగకుండ విస్తృతముగ శత్రువులను చంపుటకై కొట్టినవాఁ డగును. (సూర్మి=సుష్ఠు ఊర్వతీతి=సూర్మిః, "ఊర్వీ=హింసాయామ్" బాగుగ హింసించునది అని భావము.)

15\. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ!, త్వమ్=నీవు, ఏతత్=ఈ సూర్య తేజస్సవు, అసి=అగుచున్నావు. అహమ్=నేను, ఇదమ్=ఈ సూర్యతేజస్సును, భూయాసమ్=(నీ ప్రార్థన వలన,) అగుదునుగాక, ఇతి వావ=ఈ యర్థమునే, ఏతత్="సం త్వ మగ్నే" ఇత్యాది మంత్రము, ఆహ=చెప్పుచున్నది. ('సం త్వ మగ్నే' ఇత్యాది మంత్రము పంచమానువాకమునందు వ్యాఖ్యాతము.)

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు సూర్య తేజస్స్వరూపుఁడవు. నీ ప్రార్థనవలన నేను సూర్య తేజస్స్వరూపుఁడ నగుదును గాక, అను నర్థమునే "సం త్వ మగ్నే" ఇత్యాది మంత్రము చెప్పుచున్నది.

16\. అర్థము: "త్వ మగ్నే సూర్యవర్చా అసి" ="త్వ మగ్నే"-ఇత్యాది మంత్రము, ఏతా మాశిషమేవ=ఆయువును తేజస్సును సంతానమును కలుగఁజేయు మనెడి ఆశీస్సునే, ఆశాస్తే=(యజమానుఁడు) కోరుచున్నాఁడు, ఇతి=అని, ఆహ=చెప్పుచున్నది.

తాత్పర్యము: 'త్వ మగ్నే' ఇత్యాది మంత్రము, 'యజమానుఁడు ఆయురాదికమును కోరుచున్నాఁ డనెడి' ఆశీస్సునే కోరుచున్నాఁడని చెప్పుచున్నది.

సప్తమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే పఞ్చమప్రపాఠకే ఽష్టమోఽనువాకః।

మూలము: [1]సం పశ్యామి ప్రజా అహ మిత్యాహ యావన్త ఏవ గ్రామ్యాః పశవ స్తా నేవావరున్ధే ఽ[2]మ్భ స్థామ్భో వో భక్షీయే త్యాహా మ్భో హ్యేతా మహ స్థ మహో వో భక్షీయే త్యాహ మహో హ్యేతా స్సహ స్థ సహో వో భక్షీయే త్యాహ సహో హ్యేతా ఊర్జ స్థో ర్జం వో భక్షీయేతి (౧)ఆహో ర్జో హ్యేతా [3]రేవతీ రమధ్వ మిత్యాహ పశవో వై రేవతీః పశూనే వాఽఽత్మ న్రమయత ఇహైవ స్తేతో మా ఽపగాతే త్యాహ ధ్రువా ఏవైనా అనపగాః కురుత [4]ఇష్టకచి ద్వా అన్యో ఽగ్నిః పశుచి దన్య స్సగ్ంహితా ఽసి విశ్వరూపీ రితి వత్స మభిమృశ త్యుపైవైనం ధత్తే పశుచిత మేనం కురుతే [5]ప్ర (౨)వా ఏషో ఽస్మా ల్లోకా చ్చ్యవతే య ఆహవనీయ ముపతిష్ఠతే గార్హపత్య ముపతిష్ఠతే ఽస్మి న్నేవ లోకే ప్రతితిష్ఠ త్యథో గార్హపత్యాయైవ నిహ్నుతే [6]గాయత్రీభి రుపతిష్ఠతే తేజో వై గాయత్రీ తేజ ఏవాత్మ న్ధత్తే ఽథో యదేతం తృచ మన్వాహ సంతత్యై [7]గార్హపత్యం వా అను ద్విపాదో వీరాః ప్రజాయన్తే య ఏవం విద్వా న్ద్విపదాభి ర్గార్హపత్య ముపతిష్ఠతే (౩)ఆ ఽస్య వీరో జాయత [8]ఊర్జా వః పశ్యా మ్యూర్జా మా పశ్యతే త్యాహా ఽఽశిష మేవైతా మాశాస్తే [9]తత్సవితు ర్వరేణ్య మిత్యాహ ప్రసూత్యై సోమానగ్ం స్వరణ మిత్యాహ సోమపీథ మేవావరున్ధే కృణుహి బ్రహ్మణస్పత ఇత్యాహ బ్రహ్మవర్చస మేవావరున్ధే [10]కదాచన స్తరీ రసీ త్యాహ న స్తరీగ్ం రాత్రిం వసతి (౪)య ఏవం విద్వా నగ్ని ముపతిష్ఠతే [11]పరి త్వా ఽగ్నే పురం వయ మిత్యాహ

పరిధి మేవైతం పరి దధా త్యస్కన్దాయా [12]గ్నే గృహపత ఇత్యాహ యథా యజు రేవైత

[13]చ్ఛతగ్ం హిమా ఇత్యాహ శతం త్వా హేమన్తా నిన్ధిషీయేతి వావైతదాహ [14]పుత్రస్య నామ

గృహ్ణా త్యన్నాద మేవైనం కరోతి తా మాశిష మాశాసే త న్తవే జ్యోతిష్మతీ మితి బ్రూయా

ద్యస్య పుత్రో ఽజాత స్స్యా త్తేజ స్వ్యే వాస్య బ్రహ్మవర్చసీ పుత్రో జాయతే తా మాశిష

మాశాసే ఽముష్మై జ్యోతిష్మతీ మితి బ్రూయా ద్యస్య పుత్రో జాత స్స్యా త్తేజ ఏవా స్మి

న్బ్రహ్మవర్చసం దధాతి। ॥౭॥

(ఊర్జం వో భక్షీయేతి ప్ర గార్హపత్య ముపతిష్ఠతే వసతి జ్యోతిష్మతీ మేకాన్నత్రిగ్ంశ చ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే పఞ్చమప్రపాఠకే ఽష్టమోఽనువాకః।

వేదార్థ దీపిక

అవతారిక: షష్ఠానువాకము నందలి మంత్రములకు ఈ యనువాకము వివరణాత్మకము.

1. **అర్థము:** యావన్తః గ్రామ్యాః పశవః=ఎన్నివిధములైన గ్రామ్య పశువులు, (సన్తి=కలవో,) తానేవ=ఆ పశువులనే, అహమ్=నేను (=యజమానుఁడు) అవరున్ధే=పొందుచున్నాను, ఇతి=అని, "సం పశ్యామి ప్రజా అహమ్"= "సం పశ్యామి" త్యాది మంత్రము, ఆహ=చెప్పుచున్నది.

తాత్పర్యము: సం పశ్యామీత్యాది షష్ఠానువాకమునందలి "ఇడ ప్రజసః" అను పదమునకు గోసంతానము మాత్రమే గాక అశ్వాది సర్వవిధములయిన గ్రామ్య పశువులు, అను నర్థమును ఆ మంత్రము చెప్పుచున్నది. అన్ని విధములైన పశువులు తన గృహమునందుండవలెనని యజమానుఁడు ప్రార్థించుచున్నాఁడని ఆ మంత్రమునకు తాత్పర్యము.

2. **అర్థము:** ఈ మంత్రము, ఆఱవ యనువాకమునందు వ్యాఖ్యానింపఁబడినది. అచట అంభః మహః, సహః, ఊర్జః, అను పదములు వివరింపఁబడినవి. అచట పశువులు అంభో మహ స్సహ ఊర్క్ పదార్థ స్వరూపములుగా వర్ణింపఁబడినవి. 'అంభః' ఇత్యాది పదములు గోవులకు ఉపలక్షకములు, అను నర్థమును ఈ బ్రాహ్మణ వాక్యములు వివరించుచున్నవి. ఏతాః=ఈ గోవులు, అమ్భః ఏవ=త్రాగఁబడిన ఉదక స్వరూపములే, అని యర్థము. ఇట్లే ఏతాః, మహః, ఏవ, ఏతాః, సహః, ఏవ, ఏతాః, ఊర్జః, ఏవ, అని సమన్వయము. (ఇందు తాత్పర్యము కూడ ఇమిడి యున్నది.)

3. అర్థము: పశవః వై=పశువులే, రేవతీః=రేవతీ పదార్థములు. హే రేవతీః!=ఓ పశువు లారా! రమధ్వమ్=క్రీడించుఁడు, ఇతి=అని, ఆహ=‘రేవతీ’ రిత్యాది మంత్రము చెప్పుచున్నది. (కావున యజమానుఁడు,) ఆత్మన్నేవ=స్వగృహమునందే, పశూన్=పశువులను, రమయతే=సంతోషపెట్టుచున్నాఁడు. “ఇహ ఏవస్త ఇత మా అపగాత”- ఈమంత్రము, ఏనాః=ఈ పశువులను, (యజమానః=యజమానుడు) ధ్రువాః=స్థిర జీవనము కలవిగాను, అనపగాః=తొలఁగిపోనట్టివిగాను, కురుతే=చేయుచున్నాఁడు, ఇతి=అని, ఆహ= చెప్పుచున్నది.

తాత్పర్యము: ‘రేవతీ’ పదమునకు పశువులు అర్థ మనియు, క్షీరాదిరస రూప ధనము గల ఆ పశువులు (=గోవులు.) తన గృహమునం దుండవలె ననియు, ఆ పశువులకు స్థిరజీవనమును, వియోగము లేకుండుటను, యజమానుఁడు కోరుచున్నాఁడని భావము.

4. అర్థము: ఇష్టకచిత్=ఇష్టకలను (=ఇటుకలను) పఱచి చయనము చేయఁబడునట్టి, అన్యః అగ్నిః వా=మఱియొక అగ్నివలె, అన్యః=వేఱొక యగ్ని, పశుచిత్=పశువునుంచి చయనము చేయఁబడువాఁ డగుచున్నాఁడు. (చయనము=జ్వలింపఁజేయుట.) “సగ్ంహితాసి విశ్వరూపీ రి”తివ త్సమభి మృశతి=‘సగ్ంహితాసి’ ఇత్యాది మంత్రము (షష్ఠానువాకమున వ్యాఖ్యాతము.) చెప్పుచు గోవత్సమును తాఁకవలయును. (ఏవం కృతం చేత్=ఈ విధముగ చేయఁబడినచో, ఏనమ్=ఈ వత్సమును, ఉపధత్తే ఏవ=(యజమానుఁడు,) ఉపధానము చేసినవాఁడే యగుచున్నాఁడు. (ఉపధానము=పఱచుట.)

తాత్పర్యము: ‘చయనము’ అనెడి ఒక క్రతువిశేషము కలదు. ఆ క్రతువును పరిమిత సంఖ్యాకము లయిన ఇటుకలను పఱచి అగ్నిని యథావిధిగ ప్రజ్వలింపఁ జేయుదురు. అట్లు చయనము చేయఁబడిన అగ్ని ‘ఇష్టకచిత్’ అని అనఁబడును. అట్లే గోవత్సమును స్పృశించి అగ్నిని యథావిధిగ చయనము చేసిన యజమానుఁడు, గోవత్సము నుపధానము చేసి అగ్నిని పశుచిత్తుగా చేసినవాఁ డగుచున్నాడు. ఆ యగ్ని ‘పశుచిత్’ అని వ్యవహరింపఁబడును.

5. అర్థము: యః=ఏ యజ్ఞకర్త, ఆహవనీయమ్=ఆహవనీయాగ్నిని, ఉపతిష్ఠతే=సేవించుచున్నాఁడో, ఏషః వా=ఈ యాహవనీయాగ్నిని ప్రార్థించిన యజమానుఁడే, అస్మాత్ లోకాత్=ఈ భూలోకమునుండి, ప్రచ్యవతే=ప్రకృష్టముగా చ్యుతుఁ డగుచున్నాఁడు. గార్హపత్యమ్=గార్హపత్యాగ్నిని, (యః=ఏ యజమానుఁడు,) ఉపతిష్ఠతే=సేవించు చున్నాఁడో, (సః=ఆ యజమానుఁడు,) అస్మిన్ లోకే ఏవ=ఈ లోకమునందే, ప్రతితిష్ఠతి=ప్రతిష్ఠితుఁ డగుచున్నాఁడు. అథో=అందువలన, గార్హపత్యాయైవ=గార్హపత్యాగ్నికొఱకే, నిహ్నుతే=ఆహవనీయాగ్నిని నిగరణము చేయవలెను.

తాత్పర్యము: “సువర్గో లోక ఆహవనీయః” అను శ్రుత్యంతరము ననుసరించి ఆహవనీయాగ్నిని సేవించిన యజమానుఁడు ఈ భూలోకమును విడిచి స్వర్గమును పొందును. గార్హపత్యాగ్నిని సేవించిన యజమానుఁడు భూలోకమునందే ప్రతిష్ఠితుఁ డగును. కావున ఆహవనీయమునందే తత్పరమైయున్న గార్హపత్యాగ్నిని స్వప్రతిష్ఠా సిద్ధికై సేవించవలెను.

6. అర్థము: గాయత్రీభిః=గాయత్రీచ్ఛన్దో బద్ధములైన “అగ్నే త్వం నో అంతమః” ఇత్యాది ఋక్కులచే, ఉపతిష్ఠతే=(గార్హపత్యాగ్నిని) సేవించవలెను. తేజః వై=తేజస్సే, గాయత్రీ=గాయత్రి. (ఏషః=ఈ ప్రార్థించిన యజమానుఁడు,) తేజః ఏవ=తేజస్సునే, ఆత్మన్=తనయందు, ధత్తే=ధరించుచున్నాఁడు.

తాత్పర్యము: యజ్ఞకర్త గాయత్రీచ్ఛన్దో బద్ధములైన ఋక్కులతో గార్హపత్యాగ్నిని ప్రార్థించవలెను. ప్రజాపతి ముఖమునుండి అగ్నితోఁగూడ గాయత్రి పుట్టుటచే గాయత్రి తేజస్స్వరూపము. ఇట్లు ప్రార్థించిన యజమానుఁడు తేజోవంతుఁ డగును. విచ్ఛేదము లేకుండుటకై గాయత్రీ ఛన్దస్సు చెప్పఁబడినది.

7. అర్థము: గార్హపత్య మను=గార్హపత్యాగ్ని ననుసరించి, ద్విపాదః వీరాః=రెండు పాదములు గల వీరులు, ప్రజాయన్తే=ప్రకృష్టముగ పుట్టుచున్నారు. యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ విధముగ, విద్వాన్=తెలిసికొనినవాఁడై, ద్విపదాభిః=రెండు పాదములుగల గాయత్రీచ్ఛన్దో బద్ధములైన ఋక్కులచేత, గార్హపత్యమ్=గార్హపత్యాగ్నిని, ఉపతిష్ఠతే=సేవించుచున్నాఁడో, అస్య=ఈ యజమానునకు, వీరః=వీరుఁడైన కుమారుఁడు, ఆ జాయతే=అంతటను పుట్టుచున్నాఁడు.

తాత్పర్యము: గార్హపత్యాగ్ని ననుసరించి వీరులయిన మానవులు ఉద్భవింతురు. ఈ విధముగ తెలిసికొని గార్హపత్యాగ్నిని సేవించిన యజమానునకు వీర కుమారుఁడు కలుగును.

8. అర్థము: "ఊర్జా వః పశ్యా మ్యూర్జా మా పశ్యత"=‘ఊర్జావః’-ఇత్యాది మంత్రము, ఏతా మాశిష మేవ=ఈ యాశీస్సునే, ఆశాస్తే=(యజమానుఁడు,) కోరుచున్నాఁడు, ఇతి=అని, ఆహ=చెప్పుచున్నది. ఈ మంత్రము షష్ఠానువాకమున వ్యాఖ్యానింపఁబడినది.)

తాత్పర్యము: ఓ గృహగత పశువులారా! క్షీరాదిరస నిమిత్తము నేను మిమ్ము చూచుచున్నాను. మీరును నన్ను క్షీరాదిరస నిమిత్తము చూడుఁడు, అనెడి ఆశీస్సునే యజమానుఁడు కోరుచున్నాఁడని "ఊర్జావః" ఇత్యాది మంత్రము చెప్పుచున్నది.

9. అర్థము: ప్రసూత్యై=ప్రకృష్టమైన ప్రేరణకొఱకు, "తత్సవితు ర్వరేణ్యమ్ ఇతి"=తత్సవితు ర్వరేణ్యమ్" అను మంత్రభాగము, ఆహ=చెప్పుచున్నది. సోమపీథమేవ=సోమయాగఫలమునే, (యజమానః=యజమానుఁడు,) అవరున్ద్ధే=పొందుచున్నాఁడు, ఇతి=అని, "సోమానసగ్ం స్వరణమ్"=సోమాన మిత్యాది మంత్రభాగము, ఆహ=చెప్పుచున్నది. (యజమానః=యజమానుఁడు), బ్రహ్మవర్చస మేవ=బ్రహ్మవర్చస్సునే, అవరున్ద్ధే=పొందుచున్నాఁడు, ఇతి=అని, "కృణుహి బ్రహ్మణస్పతే"=‘కృణుహి బ్రహ్మణస్పతే’ ఇత్యాది మంత్రభాగము, ఆహ=చెప్పుచున్నది. (తాత్పర్యము స్పష్టము. "తత్సవితుః" ఇత్యాది మంత్రము షష్ఠానువాకమున వ్యాఖ్యాతము.)

10. అర్థము: యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ విధముగ, (‘‘కదాచన స్తరీ’’ రిత్యాది మంత్రార్థమును,) విద్వాన్=తెలిసికొనినవాఁడై, అగ్నిమ్=అగ్నిని, ఉపతిష్ఠతే=సేవించుచున్నాఁడో, (సః=ఆ యజమానుఁడు,) స్తరీమ్=బాధాకరమైన, రాత్రిమ్=రాత్రిని, (=రాత్రి యందు,) న వసతి=వసించుట లేదు, ఇతి=అని, ‘‘కదాచన స్తరీ’’ రిత్యాది మంత్రభాగము, ఆహ=చెప్పుచున్నది.

తాత్పర్యము: రాత్రి చోర వృశ్చికాది బాధలతో కూడిన దగుటచే ‘స్తరీ’ అని చెప్పఁబడినది. ‘కదాచన స్తరీః’ అను మంత్రముయొక్క అర్థమును తెలిసికొని అగ్నిని సేవించిన యజమానుఁడు బాధాకరమైన రాత్రియందుఁ గాక, సుఖకరమైన రాత్రియందే ఉండునని ‘కదాచన స్తరీ’ రిత్యాది మంత్రభాగము చెప్పుచున్నది.

11. అర్థము: (యజమానః=యజమానుఁడు,) అస్కన్దాయ=శోషింపఁ జేయకుండుటకై, ఏతం పరిధి మేవ=ఈ పరిధినే, పరిదధాతి=అంతటను ధరింపఁ జేయవలెను, ఇతి=అని, ‘‘పరి త్వా ఒగ్నే పురం వయమ్’’=‘పరి త్వా గ్నే’ ఇత్యాది మంత్రము, ఆహ=చెప్పుచున్నది. (పరిధి=అగ్నికి నలువైపుల వేయునట్టి పుల్లలలో ఒకటి. ఇది ‘మేడి’ ‘మోదుగ’ చెట్లకు సంబంధించినది.)

తాత్పర్యము: యజమానుఁ డీపరిధినే అగ్నికి చుట్టును ధరింపఁ జేయవలెనని ‘‘పరి త్వా గ్నే’’ ఇత్యాది మంత్రము చెప్పుచున్నది.

12. అర్థము: ‘‘అగ్నే గృహపతే’’ఇతి=‘‘అగ్నే గృహపతే’’ అను మంత్రము, యథాయజుః ఏవ=యజుస్సు ననుసరించియే, ఏతత్=ఈ అగ్ని సంబంధమైన స్తోత్రమును, ఆహ=చెప్పుచున్నది.

తాత్పర్యము: ‘‘అగ్నే గృహపతే’’ ఇత్యాది మంత్రము యజుస్సు ననుసరించియే ఈ యగ్ని విషయక స్తోత్రమును జెప్పుచున్నది.

13. అర్థము: (హే అగ్నే!=ఓ యగ్నీ!,) త్వా=నిన్ను, శతమ్=నూరైన, హేమన్తాన్=సంవత్సరములను, ఇన్ధిషీయ=ప్రజ్వలింపఁజేయుదును, ఇతి ఏతత్ వా=అనెడి ఈ యర్థమునే, "శతగ్ం హిమాః" ఇతి="శతగ్ం హిమాః" అను మంత్రము, అహ=చెప్పుచున్నది.

తాత్పర్యము: ఓ యగ్నీ!, నిన్ను నూఱు సంవత్సరములు జ్వలింపఁజేయుదును అనెడి అర్థమునే, "శతగ్ం హిమాః" అను మంత్రము చెప్పుచున్నది. ఈ మంత్రమునందలి హిమశబ్దము హేమన్తవాచక మను అర్థమును ఈ బ్రాహ్మణవాక్యము వివరించుచున్నది.

14. అర్థము: పుత్రస్య=పుత్రునకు, నామ=పేరును, గృహ్ణాతి=గ్రహించవలెను. (అట్లు చేసినచో) ఏనమ్=ఈ పుత్రుని, అన్నాదమేవ=అన్నభోక్తనుగానే, కరోతి=చేయుచున్నాఁడు. తన్తవే=పుట్టఁబోవు సంతానము కొఱకు, జ్యోతిష్మతీమ్=బ్రహ్మవర్చోయుక్తమైన, తా మాశిషమ్=ఆ యాశీస్సును, ఆశాసే=కోరుచున్నాను. ఇతి=అని, (యజమానః=యజమానుఁడు,) బ్రూయాత్=చెప్పవలయును. యస్య=ఏ యజమానునకు, పుత్రః=పుత్రుఁడు, అజాతః=పుట్టనివాఁడు, స్యాత్=అయ్యెనో, అస్య=ఈ యజమానునకు, తేజస్వీ=తేజోవంతుఁడు, బ్రహ్మవర్చసీ=బ్రహ్మవర్చస్వంతుఁడునగు, పుత్రః=పుత్రుఁడు, జాయతే ఏవ=తప్పక పుట్టుచున్నాఁడు. యస్య=ఏ యజమానునకు, పుత్రః=కుమారుఁడు, జాతః స్యాత్=పుట్టినవాఁడగునో, అముష్మై=ఈ పుట్టిన సంతానము కొఱకు, జ్యోతిష్మతీమ్=తేజోవంతమైన, తా మాశిషమ్=ఆ యాశీస్సును, ఆశాసే=కోరుచున్నాను. ఇతి=అని, బ్రూయాత్=పలుకవలెను. (ఇట్లు చేసినచో,) అస్మిన్=ఈ కుమారునియందు, తేజః=తేజస్సును, బ్రహ్మవర్చసమ్=బ్రహ్మవర్చస్సును, దధాత్యేవ=నిశ్చయముగ ధరింపఁజేయుచున్నాఁడు.

తాత్పర్యము: షష్ఠానువాకమునందు చివరిదియగు "అగ్నే గృహపతే" ఇత్యాది మంత్రమునందలి 'తన్తవే' 'అముష్మై' అను పదములకు ఈ బ్రాహ్మణము వివరణాత్మకము. యజమానుఁడు తనకు పుట్టఁబోవు సంతానమునకు, పుట్టిన సంతానమునకును ఆశీస్సును కోరుచున్నాఁడు. పుట్టఁబోవు సంతానమునకు ఆశీస్సును కోరునపుడు, ఆ సంతానమునకు నామనిర్దేశము చేసి యాశీస్సును కోరవలెను. అట్లు చేసినచో ఆ పుట్టఁబోవు పుత్రుఁడు అన్నము తినఁగలవాడును, తేజోవంతుడును, బ్రహ్మవర్చోయుతుఁడును అగును. పుట్టిన కుమారునకు ఆశీస్సును కోరినచో కుమారుఁడు తేజోవంతుఁడు, బ్రహ్మవర్చోయుతుఁడు నగును. తన్తవే=పుట్టఁబోవు సంతానముకొఱకు, అముష్మై=ఈ పుట్టిన సంతానముకొఱకు అని వివేకము.

అష్టమానువాకము సమాప్తము

అథ ప్రథమకాణ్డే పఞ్చమప్రపాఠకే నవమోఽనువాకః।

మూలము: [1]అగ్నిహోత్రం జుహోతి యదేవ కించ యజమానస్య స్వం తస్యైవ త[2]ద్రేత స్సిఞ్చతి ప్రజ
ననే ప్రజననగ్ం హి వా అగ్ని [3]రథౌ షధీ రన్తగతా దహతి తా స్తతో భూయసీః ప్రజా
యన్తే [4]యత్సాయం జుహోతి రేత ఏవ తత్సిఞ్చతి ప్రైవ ప్రాత స్తనేన జనయతి త[5]ద్రేత
స్సిక్తం న త్వష్ట్రా ఽవికృతం ప్రజాయతే యావచ్ఛో వై రేతస స్సిక్తస్య (౧)త్వష్టా రూపాణి
వికరోతి తావచ్ఛో వై తత్ప్రజాయత ఏష వై దైవ్య స్త్వష్టా యో యజతే బహ్వీభి రుపతిష్ఠతే
రేతస ఏవ సిక్తస్య బహుశో రూపాణి వికరోతి [6]స ప్రైవ జాయతే శ్వ శ్శ్వోభూయా న్భవతి
య ఏవం విద్వా నగ్ని ముపతిష్ఠతే [7]ఽహ ర్దేవానా మాసీ ద్రాత్రి రసురాణాం తే ఽసురా
య ద్దేవానాం విత్తం వేద్య మాసీ త్తేన సహ (౨)రాత్రిం ప్రావిశ న్తే దేవా హీనా అమ
న్యన్త తే ఽపశ్య న్నాగ్నేయీ రాత్రి రాగ్నేయాః పశవ ఇమ మేవా గ్నిగ్ం స్తవామ స న
స్తుతః పశూ న్పున ర్దాస్యతీతి తే ఽగ్ని మస్తువ న్స ఏభ్య స్తుతో రాత్రియా అధ్యహ
రభి పశూ న్నిరార్జ త్తే దేవాః పశూ న్విత్త్వా కామాగ్ం అకుర్వత య ఏవం విద్వా నగ్ని
ముపతిష్ఠతే పశుమా న్భవతి (౩)[8]ఆదిత్యో వా అస్మా ల్లోకా దముం లోక మైత్సో ఽముం
లోకం గత్వా పున రిమం లోక మభ్యధ్యాయ త్స ఇమం లోక మాగత్య మృత్యో రబిభే
న్మృత్యుసంయుత ఇవ హ్యయం లోక స్సో ఽమన్యత మ మేవా గ్నిగ్ం స్తవాని సమాస్తుత
స్సువర్గం లోకం గమయిష్యతీ తి సో ఽగ్ని మస్తౌ త్స ఏనగ్ం స్తుత స్సువర్గం లోక మగ

మయ ద్యః॥ (౪)ఏవం విద్వా నగ్ని ముపతిష్ఠతే సువర్గ మేవ లోక మేతి సర్వ మాయు
రేత్యభి వా ఏషో ఽగ్నీ ఆరోహతి య ఏనా వుపతిష్ఠతే యథా ఖలు వై శ్రేయా నభ్యా
రూఢః కామయతే తథా కరోతి [10]నక్త ముపతిష్ఠతే న ప్రాత స్సగ్ంహి నక్తం వ్రతాని
సృజ్యన్తే సహ శ్రేయాగ్ంశ్చ పాపీయాగ్ంశ్చా ఽఽసాతే జ్యోతి ర్వా అగ్ని స్తమో రాత్రి
ర్యత్ (౫)నక్త ముపతిష్ఠతే జ్యోతిషైవ తమ స్తర[11] త్యుపస్థేయో ఽగ్ని౩ ర్నో పస్థేయా౩
ఇత్యాహు ర్మనుష్యాయే న్వై యో ఽహరహ రాహృత్యా థైనం యాచతి స ఇన్వై
త ముపార్ఛ త్యథ కో దేవా నహరహ ర్యాచిష్యతీతి తస్మా న్నో పస్థేయో ఽ [12]థో ఖల్వాహు
రాశిషే వై కం యజమానో యజత ఇత్యేషా ఖలు వై (౬) ఆహితాగ్నే రాశీ ర్యదగ్ని ముప
తిష్ఠతే తస్మా దుపస్థేయః [13]ప్రజాపతిః పశూ నసృజత తే సృష్టా అహోరాత్రే ప్రావిశ
న్తాఞ్ఛన్దోభి రన్వవిన్ద ద్యచ్ఛన్దోభి రుపతిష్ఠతే స్వమేవ తద న్విచ్ఛతి [14]న తత్ర జామ్యస్తీ
త్యాహు ర్యో ఽహరహ రుపతిష్ఠత ఇతి [15]యో వా అగ్నిం ప్రత్య ఙ్ఙుపతిష్ఠతే ప్రత్యేన మోషతి
యః పరా ఙ్విష్వ ఙ్ప్రజయా పశుభి రేతి కవా తిర్య ఙ్ఙివో పతిష్ఠతే నైనం ప్రత్యోషతి న విష్వ
ఙ్ప్రజయా పశుభి రేతి ॥౭॥ (నిక్తస్య సహ భవతి యో యత్ఖలు వై పశుభి స్త్రయోదశ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే పఞ్చమప్రపాఠకే నవమోఽనువాకః।

వేదార్థదీపిక

అవతారిక: అగ్న్యుపస్థానమునకు అగ్ని అంగము అను విషయము ఈ నవమానువాకమునందు ప్రదర్శింపబడుచున్నది. ప్రథమ
మున ఇచట అగ్నిహోత్రము విధింపబడుచున్నది.

1. అర్థము: (యజమానః=యజమానుఁడు,) అగ్నిహోత్రం జుహోతి=(వాక్యాంతర విహిత క్షీరాదులచేత,) అగ్నిహోత్రనామక హోమమును చేయవలెను. యజమానస్య=యజమానునకు, యదేవ కించ=ఏ క్షీరాదికమైన హవిర్ద్రవ్యము, (అగ్నియందు హుతమైనది, అస్తి=కలదో;) తత్=అది, తస్య=ఆ యజమానునకు, స్వమేవ=స్వకీయమైనదే.

తాత్పర్యము: యజమానుఁడు దధిక్షీరాదులచే అగ్నిహోత్రనామక హోమము చేయవలెను. అట్లు హోమము చేయఁబడిన క్షీరాదికము నశించదు. హోమము చేయఁబడిన క్షీరాదికము ఆ యజమానునకే చెందియుండును.

2. అర్థము: ప్రజననే=ప్రజోత్పాదకమైన యోనియందు, రేతః=వీర్యము, సిఞ్చతి వా=ఉంటున్నవిధముగా, అగ్నిః=అగ్ని, ప్రజననం హి=ప్రజనన రూపము కదా!

తాత్పర్యము: సంతానోత్పాదకమైన యోనియం దుంచిన వీర్యమువలె, అగ్ని యోనివంటివాఁడు కావున, ఆ యగ్నియందు హుతమైన క్షీరాదికము నశించకుండ ఉండునని భావము.

3. అర్థము: అగ్నిః=అగ్ని, అంతగతాః=తన సమీపము చేరిన ఓషధులను, అథ దహతి=దగ్ధము చేసినను తతః=పిమ్మట, తాః=ఆ ఓషధులు, భూయసీః=అధికములైనవిగా, ప్రజాయన్తే=ప్రకృష్టముగ పుట్టుచున్నవి.

తాత్పర్యము: గ్రీష్మకాలమున దావాగ్ని తన సమీపమున నున్న ఓషధులను దగ్ధము చేసినను, వర్షాకాలము వచ్చిన, పిమ్మట ఆ ఓషధులు అనేకములుగా నుద్భవించును. కావున అగ్ని యోనివంటిదని భావము. ద్వితీయ మంత్రగత విషయమునకు ఇది దృష్టాంతముగ ప్రతిపాదింపఁబడినది.

4. అర్థము: సాయమ్=సాయంకాలమునందు, యత్=దేనిని, (యజమానః=యజమానుఁడు,) జుహోతి=హోమము చేయుచున్నాఁడో, తత్=అది, రేతః ఏవ=రేతస్సునే, సిఞ్చతి=సేచనము చేసినట్లగుచున్నది. తత్=అది, ప్రాతస్తనేన=ప్రాతఃకాల హోమముచేత, ప్రజనయత్యేవ=ఉత్పాదనము చేసినట్లే యగుచున్నది.

తాత్పర్యము: సాయంకాలమునందు యజమానుఁడు హోమము చేసినది రేతస్సేచనము వంటిది. ప్రాతఃకాలమున హోమము చేసినది సంతానోత్పాదనమువంటిది. ప్రాతర్హోమము సంతానోత్పాదనమువంటిది. సాయంకాల హోమము వీర్యమును యోనియం దుంచుటవంటిది. సేచనము=తడుపుట. (=రేతస్సునుంచుట. ఉత్పాదనము=పుట్టించుట.)

5. అర్థము: (లోకే=లోకమునందు) సిక్తమ్=(యోనియందు) ఉంచఁబడిన, రేతః=వీర్యము, త్వష్ట్రా=విశ్వకర్మచే, అవికృతం యది=వివిధములుగా వికృతము చేయఁబడనిదియై, న ప్రజాయతే=(సంతాన రూపముగా,) ఉత్పన్న మగుటలేదు. సిక్తస్య=యోనియందు సేచనముచేయఁబడిన, రేతసః=వీర్యమునకు, యావచ్ఛః=(ఎంత పరిమాణములో,) ఎన్ని, రూపాణి వై=రూపములనే, (ఉద్దిశ్య=ఉద్దేశించి,) త్వష్టా=విశ్వకర్మ, వికరోతి=వివిధములుగాఁ జేయుచున్నాఁడో, తత్=ఆ సిక్తమైన వీర్యము, తావచ్ఛః వై=అంత పరిమాణములోనే, ప్రజాయతే=(సంతానరూపముగ) ఉత్పన్న మగుచున్నది. ఏషః వై=ఈ యజమానుఁడే, దైవ్యః=దేవతలచే అనుగ్రహింపఁబడిన, త్వష్టా=విశ్వకర్మ. యః=ఏ యజమానుఁడు, యజతే=యాగము చేయుచున్నాఁడో, బహ్వీభిః=అనేక ఋక్కులచే, ఉపతిష్ఠతే=(అగ్నిని) సేవించుచున్నాఁడో, (సః=ఆ యజమానుఁడు,) సిక్తస్య=యోనియం దుంచఁబడిన, రేతసః=వీర్యమునుండి, బహుశః=అనేకములుగా, రూపాణి=రూపములను, వికరోతి=వివిధములుగాఁ జేయుచున్నాఁడు.

తాత్పర్యము: యోనియం దుంచఁబడిన రేతస్సును విశ్వకర్మ వివిధములుగా చేయనిచో సంతానోత్పత్తి కలుగుట లేదు. యోనియందు సిక్తమైన రేతస్సును విశ్వకర్మ ఎన్ని రూపముల నుద్దేశించి వివిధములుగా చేయునో, ఆ రేతస్సు అన్ని రూపములుగా ఉత్పన్న మగుచున్నది. యజ్ఞకర్తయగు ఈ యజమానుఁడే దేవతలచే అనుగ్రహింపఁబడిన విశ్వకర్మ. యజ్ఞము చేయుచు అనేక ఋక్కులచే అగ్నిని సేవించునట్టి యజమానుఁడు యోనియందు సిక్తమైన రేతస్సు నుండి అనేక రూపములను వివిధములుగా చేయుచున్న వాఁడగును. ఇది ఉపస్థాన (=ప్రార్థనా)కర్మవిధి.

6. అర్థము: యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ పూర్వోక్తవిధముగా, విద్వాన్=తెలిసికొనినవాఁడై, అగ్నిమ్=అగ్నిని, ఉపతిష్ఠతే=సేవించుచున్నాఁడో, సః ఏవ=ఆ యజమానుఁడే, ప్రజాయతే=సంతానమును కలిగించుచున్నాఁడు, శ్వః శ్వః=ప్రతిదినము, భూయాన్=ఉత్తరోత్తరాభివృద్ధి కలవాఁడు, భవతి=అగుచున్నాఁడు.

తాత్పర్యము: ఈ పూర్వోక్త విధమును తెలిసికొని అగ్నిని సేవించు యజమానుఁడు సంతానోత్పత్తిని కలుగఁజేసి ప్రతి దినము ఉత్తరోత్తరాభివృద్ధి కలవాఁ డగును.

7. అర్థము: అహః=పగలు, దేవానామ్=దేవతలకు, ఆసీత్=(భాగము)అయెను. రాత్రిః=రాత్రి, అసురాణామ్=రాక్షసులకు, ఆసీత్=(భాగము) ఆయెను. దేవానామ్=దేవతలకు, యత్ విత్తమ్=ఏ పశురూపధనము, (పూర్వము సంపాదించినది,) ఆసీత్=ఉండెనో= వేద్యమ్=ఇఁకముందు పొందఁదగినది, (యత్+అస్తి=ఏది కలదో;) తేన సహ=ఆ ధనముతోఁగూడ, తే అసురాః=ఆ రాక్షసులు, రాత్రిమ్=రాత్రిని, ప్రావిశన్=ప్రవేశించిరి. (రాత్రి చీఁకటిలో ఎక్కడికో పోయిరని భావము.) తే దేవాః=ఆ దేవతలు, (తదా=అప్పుడు, ఆత్మానః=తాము) హీనాః=పశురూప ధనహీనులమని, అమన్యన్త=తలఁచిరి. రాత్రిః=రాత్రి, ఆగ్నేయీ=అగ్నిదేవతాక మైనది. (=అగ్ని ప్రకాశము కలది.) పశవః=పశువులు, ఆగ్నేయాః=అగ్ని స్వామికములు. (తతః=అందువలన,) ఇమ మగ్ని మేవ=ఈ యగ్నినే, స్తవామ=స్తుతింతుము. స్తుతః=స్తుతింపఁబడిన, సః=ఆ యగ్ని, నః=మనకు, పశూన్=పశువులను, పునః=మఱల, దాస్యతీతి=ఈయఁగలఁడని, అపశ్యన్=చూచిరి. (=తెలిసికొనిరి.) (అథ=పిమ్మట,) తే=ఆ దేవతలు, అగ్నిమ్=అగ్నిని, అస్తువన్=స్తుతించిరి. స్తుతః సః=స్తుతింపఁబడిన ఆ యగ్ని, ఏభ్యః=ఈ దేవతలకొఱకు, పశూన్=పశువులను, రాత్రియా అధి=రాత్రినుండి తెచ్చి, అహ రభి=పగటియందు, నిరార్జత్=పొందించెను. తే దేవాః=ఆ దేవతలు, పశూన్=పశువులను, విత్త్వా=పొంది, కామాన్=భోగములను, అకుర్వన్=చేసిరి. (=అనుభవించిరి.) యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ విధముగా, విద్వాన్=తెలిసికొనినవాఁడై, అగ్నిమ్=అగ్నిని, ఉప తిష్ఠతే=సేవించు చున్నాఁడో, (సః=అతఁడు,) పశుమాన్=పశుధనము కలవాఁడు, భవతి=అగుచున్నాఁడు.

తాత్పర్యము: పగలు దేవతలకు, రాత్రి రాక్షసులకు భాగములుగా ఏర్పడెను. రాక్షసులు దేవతలయొక్క విత్తము వేద్యము నైన పశుధనముల నపహరించి రాత్రి యంధకారమున ఎచ్చటికో పోయిరి. దేవతలు తామప్పుడు పశుధన హీనుల మని తలఁచి ఆ పశుధనమును సంపాదించుట కొక యుపాయము నాలోచించిరి. రాత్రియందు అగ్ని అధికముగ ప్రకాశించును గావున రాత్రి ఆగ్నేయి యగును. పశువులు అగ్నిదేవతాకములు కావున అవి ఆగ్నేయము లగును. అగ్నిని ప్రార్థించినచో పశుధనము పునః ప్రాప్త మగునని ఆలోచించి అగ్నిని స్తుతించిరి. అప్పుడు అగ్ని రాత్రినుండి పశువులను తెచ్చి దేవతలకు పగటియం దిచ్చెను. దేవత లాపశువులను పొంది భోగముల ననుభవించిరి. ఈ విధమును తెలిసికొని అగ్నిని స్తుతించిన యజమానుఁడు పశుధనము కలవాఁడగును. (విత్తము=సంపాదించినది. వేద్యము=సంపాదింపనున్నది.)

8. అర్థము: ఆదిత్యః వా=సూర్యుఁడైతే, అస్మాత్ లోకాత్=ఈ లోకమునుండి, అముం లోకమ్=స్వర్గమును, ఐత్=పొందెను. సః=ఆ సూర్యుఁడు, అముం లోకమ్=స్వర్గలోకమును, గత్వా=పొంది, పునః=మఱల, ఇమం లోక మభి=ఈ లోకమును గూర్చి, అధ్యాయత్=ధ్యానించెను. సః=ఆ సూర్యుఁడు, ఇమం లోకమ్=ఈ భూలోకమును గూర్చి, ఆగత్య=వచ్చి, మృత్యోః=మృత్యుదేవతవలన, అబిభేత్=భయపడెను. "అయం లోకః=ఈ భూలోకము, మృత్యు సంయుతః ఇవ హి=మృత్యువుతో కూడిన దానివంటిది కదా; ఇమ మగ్ని మేవ=ఈ యగ్నినే, స్తవాని=స్తుతించెదను. స్తుతః సః=స్తుతింపఁబడిన ఆ యగ్ని, మామ్=నన్ను, సువర్గం లోకమ్=స్వర్గలోకమును, గమయిష్యతీతి=పొందింపఁగలఁడని, సః=ఆ సూర్యుఁడు, అమన్యత=తలఁచెను. సః=ఆ సూర్యుఁడు, అగ్నిమ్=అగ్నిని, అస్తౌత్=స్తుతించెను. స్తుతః=స్తుతింపఁబడిన, సః=ఆ యగ్ని, ఏనమ్=ఈ యాదిత్యుని, సువర్గం లోకమ్=స్వర్గలోకమును, అగమయత్=పొందించెను. యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ విధముగ, విద్వాన్=తెలిసికొనినవాఁడై, అగ్నిమ్=అగ్నిని, ఉపతిష్ఠతే=సేవించుచున్నాఁడో, (సః=అతఁడు) సువర్గం లోకమ్=స్వర్గలోకమును, ఏత్యేవ=తప్పక పొందుచున్నాఁడు. సర్వమ్=సమస్తమైన, ఆయుః=ఆయువును, ఏతి=పొందుచున్నాఁడు.

తాత్పర్యము: పూర్వ మొకప్పుడు ఆదిత్యుఁడు భూలోకమునుండి స్వర్గలోకమునకు పోయి, అచట భూలోకమును గూర్చి ఆలోచించెను. పిమ్మట ఆ సూర్యుఁడు ఈ భూలోకమునకు వచ్చి మృత్యువువలన భయపడెను. "ఈ భూలోకము ఎల్లప్పుడు మృత్యువుతో కూడియుండును గదా!, కావున అగ్నినే స్తుతించెదను. స్తుతింపఁబడిన యగ్ని నన్ను స్వర్గలోకమునకు పంపించును" అని ఆదిత్యుఁ డాలోచించి అగ్నిని స్తుతించెను. స్తుతింపఁబడిన అగ్ని ఈ యాదిత్యుని స్వర్గలోకమునకు పంపించెను. ఈ విధముగ తెలిసికొని అగ్నిని సేవించిన యజమానుఁడు స్వర్గలోకమును నిశ్చయముగ పొందును. మఱియు సంపూర్ణాయువును పొందుచున్నాఁడు. (ఈ మంత్రము అగ్నిప్రశంసా పరమైనది.)

9. **అర్థము:** యః=ఏ యజమానుఁడు, ఏనౌ=ఈ ఆహవనీయ గార్హపత్యాగ్నులను, ఉపతిష్ఠతే=సేవించుచున్నాఁడో, ఏషః వా=ఇతఁడే, అగ్నీ=ఆహవనీయ గార్హపత్యాగ్నులను, అభ్యారోహతి=స్వాధీనులనుగా చేసికొనుచున్నాఁడు. యథా వై=ఏ విధముగనైతే, (కశ్చన=ఒకానొక పురుషుఁడు) శ్రేయాన్=విద్యాదికముచే శ్రేష్ఠుఁడుగా, అభ్యారూఢః ఇతి=కావలయునని, కామయతే=కోరుచున్నాఁడో, తథా=ఆ విధముగా, కరోతి ఖలు=చేయుచున్నాఁడు కదా!

తాత్పర్యము: లోకమునం దొకానొక పురుషుఁడు తాను విద్యాదులచే ఉత్తమ పదవిని పొందవలెనని కోరుచున్నవాఁడై అందుకు తగినట్లుగ అధికార పదవిలో నున్నవానిని సేవించి ఆ యున్నతపదవిని పొందుచున్నాఁడు. ఆ విధముగనే ఆహవనీయ గార్హపత్యాగ్నులను సేవించిన యజమానుఁడు ఆ యగ్నులను స్వాధీనులనుగా చేసికొనుచున్నాఁడని భావము. (ఇదియు అగ్ని ప్రశంసాపరమైనదే.)

10. **అర్థము:** నక్తమ్=రాత్రియందు, ఉపతిష్ఠతే=(అగ్నిని) సేవించవలెను. ప్రాతః=ప్రాతఃకాలమునందు, నోపతిష్ఠతే=సేవింపరాదు. నక్తమ్=రాత్రియందు, వ్రతాని=(అనుష్ఠింపఁబడిన) కర్మలు, సంసృజ్యన్తే=సంకీర్ణము అగుచున్నవి. శ్రేయాన్ చ=శాస్త్రీయముగ అనుష్ఠింపఁబడిన వ్రతవిశేషమును, పాపీయాన్ చ=అశాస్త్రీయముగ అనుష్ఠింపఁబడిన వ్రతవిశేషమును, ఆసాతే=(కలిసియే) ఉంటున్నవి. అగ్నిః=అగ్ని, జ్యోతి ర్వా=జ్యోతిస్సే. రాత్రిః=రాత్రి, తమః=అంధకారరూపము. నక్తమ్=రాత్రియందు, ఉపతిష్ఠతే యత్=(అగ్నిని) సేవించినచో, జ్యోతిషైవ=తేజస్సుచేతనే, తమః=(రాత్రి ప్రయుక్తమైన) అంధకారమును, తరతి=పోగొట్టుచున్నాఁడు.

తాత్పర్యము: అగ్నిని రాత్రియందు సేవింపవలెను. ప్రాతఃకాలమున సేవింపరాదు. రాత్రియందు చేసిన కర్మలు సంకీర్ణము లగును. చీఁకటిలో ఎవనిచే ఏ కర్మ యెట్లు చేయఁబడినదో, తెలిసికొనుట సాధ్యము కాదు. శాస్త్రీయముగ చేయఁబడిన కర్మయు, అశాస్త్రీయముగ చేయఁబడిన కర్మయు కలిసి ఒకచోటనే యుండును. తేజస్సె అగ్ని. రాత్రి అంధకారరూపము. అట్టిస్థితిలో అగ్ని సేవింపఁబడినచో, ఆ అగ్ని తేజస్సుచే రాత్రిప్రయుక్తమైన దోషమును పోఁగొట్టవచ్చును. కావున అగ్నిని రాత్రియందే సేవించవలెను. ప్రాతఃకాలమున సేవింపరాదు. ఇది యొక పూర్వపక్షము.

11. **అర్థము:** అగ్నిః=అగ్ని, ఉపస్థేయః=సేవింపఁదగినవాఁడా!, నోపస్థేయాః=సేవింపఁదగనివాఁడా!, ఇతి=అని, (విచారణీయమ్=విచారింపఁదగినది. ఇచట అగ్నిః, ఉపస్థేయః, అను పదములు ప్లుతాంతములుగా నిర్దిష్టములైనవి. ఈ ప్లుతము విచారణార్థకము. లోకే=లోకమునందు,) యః=ఏ మనుజుఁడు, మనుష్యాయ ఇవైవ=మానవమాత్రుఁడేయైన రాజుకొఱకు, అహరహః=ప్రతిదినము, ఆహృత్య=(ఫలాదికమును కానుకగా,) తెచ్చి, అథ=పిమ్మట, ఏనమ్=ఈ రాజును, యాచతి=(ధనాదికమును,) యాచించుచున్నాఁడో; సః=అతఁడు, తమ్=ఆ రాజును; ఉపార్చతి ఇవైవ=పీడించుచున్నవాఁడే యగుచున్నాఁడు. అథ=అట్టితఱి, కః=ఎవఁడు, దేవాన్=(మహామహిమ గల) దేవతలను, అహరహః=ప్రతిదినము, యాచిష్యతి=యాచింపఁగలఁడు; తస్మాత్=అందువలన, (అగ్నిః) నోపస్థేయః=అగ్ని సేవింపఁదగినవాఁడుకాఁడు, ఇతి=అని, (కేచన) ఆహుః=కొందఱు చెప్పుచున్నారు.

తాత్పర్యము: అగ్ని సేవింపఁదగినవాఁడా? కాఁడా?, అను విషయము విచారణీయము. లోకమునం దొకానొకఁడు మనుష్య మాత్రుఁడేయగు రాజునొద్దకు ప్రతిదినము కానుకగా ఫలాదికమును గొనివచ్చి యిచ్చి తనకు కావలసిన ధనాదికమును యాచించుచున్నాఁడుకదా! అట్టి యాచకుఁ డారాజును బాధించినవాడే యగును. ఇచట యాచ్ఞ బాధారూపమైనది. అట్టి పరిస్థితిలో మహామహిమాన్వితు లయిన దేవతలను ఎవఁడు యాచించి బాధింపఁ గలఁడు? కావున అగ్ని ఏ సమయమునందును సేవ్యుఁడు కాఁడని కొందఱనుచున్నారు. (ఇది రెండవ పూర్వపక్షము. అగ్ని ప్రాతఃకాలమున సేవ్యుఁడు కాఁ డనునది మొదటి పూర్వపక్షము. ఈ రెండవ పూర్వపక్షము విచారణ పూర్వకముగఁ జేయఁబడినది.)

12. అర్థము: అథో=అట్లు కాదు. (అథోశబ్దము పూర్వపక్ష నిరాసకము.) యజమానః=యజమానుఁడు, ఆశిషే వై=స్వాభిలషితమును కోఱుటకే, కమ్=ప్రజాపతి సదృశుఁడగు నగ్నినిగూర్చి, యజతే=యాగము చేయుచున్నాఁడు, ఇతి=అని, (విద్వాంసః=పండితులు,) ఆహుః ఖలు=చెప్పుచున్నారు కదా?. అగ్నిమ్=అగ్నిని, ఉపతిష్ఠతే యత్=సేవించుచున్నాఁ డనుట యేది కలదో, ఏషా వై=ఇదియే, ఆహితాగ్నేః=ఆహితాగ్నియగు యజమానునియొక్క, ఆశీః ఖలు=మంత్రపూర్వక ప్రార్థన కదా!, తస్మాత్=అందువలన, (అగ్నిః=అగ్ని,) ఉపస్థేయః=సేవింపఁదగినవాఁడు.

తాత్పర్యము: ఈ యజమానుఁడు తన కపేక్షితమగు దానిని కోరుటకే ప్రజాపతి సమానుఁడు సర్వదేవాత్మకుఁడునునగు అగ్నిని సేవించుచున్నాఁడని విద్వాంసులు చెప్పుచున్నారు కదా!; ఆహితాగ్నియొక్క మంత్రము అగ్నిని స్తోత్రము చేయుచున్నది. కావున అగ్ని సేవింపఁ దగినవాఁడు. లోకమునందుఁగూడ రాజుయొక్క చిత్తవృత్తి నెఱుంగక అసమయమునందు యాచించినచో అపరాధమే యగును. ప్రశంసా పూర్వకముగఁగాని, వినోద పూర్వకముగఁగాని సంతోషము కలుగునట్లు యాచించినచో, ఉత్సాహవంతుఁడగు రాజు అడిగిన దానికంటె నధికముగ నెట్లు ఇచ్చుచున్నాఁడో; ఆ విధముగనే ఆహితాగ్ని అగ్నిని మంత్రముచే స్తోత్రము చేయుటయే యాచ్ఞ కావున, ఆ యాచ్ఞ ప్రశంసాపూర్వక మగుటచే అపరాధము కానేరదు. అత్యంత సంతోషదాయకమే యగుచున్నది. కావున ప్రాత స్సాయంతనములందు రెండింటియందును అగ్ని సేవింపఁ దగినవాఁడేయని సిద్ధాంతము.

13. అర్థము: ప్రజాపతిః=ప్రజాపతి, పశూన్=పశువులను, అసృజత=సృష్టించెను. తే=ఆ పశువులు, సృష్టాః=సృజింపఁబడి, అహోరాత్రే=అహోరాత్రములయందును, ప్రావిశన్=ప్రవేశించినవి. తాన్=ఆ పశువులను, ఛన్దోభిః=ఛందోయుక్తము లయిన మంత్రములచే, ఉపతిష్ఠతే యత్=సేవించుచున్నచో, తత్=అప్పుడు, (సః=ఆ సేవించిన యజమానుఁడు,) స్వమేవ=స్వీయవస్తువునే, అన్విచ్ఛతి=పొందుచున్నాఁడు.

తాత్పర్యము: ప్రజాపతి పశువులను సృజించెను. సృజింపఁబడిన ఆ పశువులు అహోరాత్రదేవతలచే దాఁచఁబడినవి. అప్పుడు ప్రజాపతి ఛందోబద్ధము లయిన ఋక్కులచే అన్వేషించి ఆ పశువులను పొందెను. కావున ఛందోయుతము లయిన ఋక్కులచే అగ్నిని ప్రార్థించుట విశిష్ట వస్త్వన్వేషణమునకు సాధకము ప్రాపకముగూడ నగుచున్నదని భావము.

14. అర్థము: యః=ఏ యజమానుఁడు, అహ రహః=ప్రతిదినము, ఉపతిష్ఠతే=(అగ్నిని) సేవించుచున్నాఁడో, తత్ర=ఆ ఉపస్థానమునందు (=ప్రార్థనయందు,) జామి=ఆలస్యము, నాస్తి=లేదు, ఇతి=అని, ఆహుః=చెప్పుచున్నారు.

తాత్పర్యము: ఉపస్థాతకు (=ప్రార్థన చేయునతనికి,) అభీష్ట ప్రార్థన యుండుట వలనను, ఉపస్థేయుఁడైన (=ప్రార్థింపఁ దగినవాఁడైన) అగ్నికి స్తుతి యుండుటవలనను, ఆ ఉపస్థానమునం దెవ్వనికిని ఆలస్య ముండదని పండితులు చెప్పుచున్నారు.

15\. అర్థము: యో వా=ఏ యజమానుఁడైతే, ప్రత్యఙ్=పడమటి దిక్కున కభిముఖుఁడై, అగ్నిమ్=అగ్నిని, ఉప తిష్ఠతే=సేవించుచున్నాఁడో, ఏనమ్=ఈ యజమానుని, (అగ్నిః=అగ్ని,) ప్రత్యోషతి=ప్రతికూలముగ దహించుచున్నాఁడు. యః=ఏ యజమానుఁడు, పరాఙ్=పెడమోము కలవాఁడై, (అగ్ని ముపతిష్ఠతే= అగ్నిని సేవించుచున్నాఁడో, అగ్నిః=అగ్ని, ఏనమ్=ఈ యజమానుని,) ప్రజయా=సంతానముచేతను, పశుభిః=పశువులచేతను, విష్వఙ్ ఏతి=వియుక్తునిగా చేయుచున్నాఁడు, కవా తిర్యఙ్ ఇవ=కొంచెము అడ్డముగా నున్నవాఁడువలె, (యః=ఏ యజమానుఁడు,) ఉపతిష్ఠతే=సేవించుచున్నాడో, ఏనమ్=ఈ యజమానుని, (అగ్నిః=అగ్ని,) న ప్రత్యోషతి=ప్రతికూలముగా దహింపఁజేయుట లేదు. ప్రజయా=సంతానము చేత, పశుభిః=పశువులచేతను, న విష్వఙ్ ఏతి=వియుక్తునిగాఁ జేయుట లేదు.

తాత్పర్యము: అగ్ని తనను పశ్చిమ దిగభిముఖుఁడై సేవించుచున్న యజమానుని దహించును. పెడగా ముఖము కలవాఁడై సేవించు యజమానుని సంతాన వియుక్తునిగాను, పశు వియుక్తునిగాను చేయును. కొంచెము అడ్డముగ ముఖము కలవాఁడై సేవించుచున్న యజమానుని అగ్ని దహింపఁడు. సంతాన వియుక్తుని గాను. పశు వియుక్తునిగాను చేయఁడు. యజమానుఁడు కించిత్తిరశ్చీన ముఖుఁడై అగ్న్యుపస్థానము చేయవలెనని ఈ మంత్రము చెప్పుచున్నది.

నవమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే పఞ్చమప్రపాఠకే దశమోఽనువాకః

మూలము: [1]మమ నామ ప్రథమం జాతవేదః పితా మాతా చ దధతు ర్యదగ్రే। తత్త్వం బిభృహి పున రామదైతో
స్తవాహం నామ బిభరా ణ్యగ్నే। [2]మమ నామ తవ చ జాతవేదో వాససీ ఇవ వివసానౌ యే
చరావః। ఆయుషే త్వం జీవసే వయం యథాయథం విపరిదధావహై పున స్తే। [3]నమో-
ఽగ్నయే ఽప్రతివిద్ధాయ నమో ఽనాధృష్టాయ నమ స్సమ్రాజే। అషాఢః (౧)అగ్ని ర్బృహ
ద్వయా విశ్వజి త్సహన్త్య శ్శ్రేష్ఠో గన్ధర్వః। [4]త్వత్పితారో దేవా స్త్వామాహుతయ స్త్వద్వి
వాచనాః। సం మా మాయుషా సం గౌపత్యేన సుహితే మా ధాః। [5]అయ మగ్ని శ్శ్రేష్ఠతమో
ఽయం భగవత్తమో యగ్ం సహస్రసాతమః। అస్మా అస్తు సువీర్యమ్। [6]మనో జ్యోతి ర్జుషతా
మాజ్యం విచ్ఛిన్నం యజ్ఞగ్ం సమిమం దధాతు। యా ఇష్టా ఉషసో నిమ్రుచ శ్చ తా స్సన్దధామి
హవిషా ఘృతేన। [7]పయస్వతీ రోషధయః (౨)పయస్వ ద్వీరుధాం పయః। అపాం పయసో
యత్పయ స్తేన మా మిన్ద్ర సగ్ంసృజ। [8]అగ్నే వ్రతపతే వ్రతం చరిష్యామి తచ్ఛకేయం తన్మే
రాధ్యతామ్। [9]అగ్నిగ్ం హోతార మిహ తగ్ం హువే దేవా న్యజ్ఞియా నిహ యా న్హవామహే।
ఆయన్తు దేవా స్సుమనస్యమానా వియన్తు దేవా హవిషో మే అస్య। [10]క స్త్వా యునక్తి స
త్వా యునక్తు [11]యాని ఘర్మే కపాలా న్యుపచిన్వన్తి (౩)వేధసః। పూష్ణ స్తాన్యపి వ్రత ఇన్ద్ర
వాయూ విముఞ్చతామ్। [12]అభిన్నో ఘర్మో జీరదాను ర్యత ఆత్త స్తదగా న్పునః। ఇధ్మో వేదిః
పరిధయశ్చ సర్వే యజ్ఞస్యా ఽఽయు రను సంచరన్తి। [13]త్రయస్త్రిగ్ంశ త్తన్తవో యే వితత్నిరే

య ఇమం యజ్ఞగ్ం స్వధయా దదన్తే తేషాం ఛిన్నం ప్రత్యేత ద్దధామి స్వాహా ఘర్మో దేవాగ్ం అప్యేతు ॥౪॥ (అషాఢ ఓషధయ ఉపచిన్వన్తి పఞ్చచత్వారిగ్ంశ చ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే పఞ్చమప్రపాఠకే దశమోఽనువాకః।

వేదార్థదీపిక

అవతారిక: ఈ దశమానువాకము పూర్వార్ధభాగమునందు ప్రవాసము చేయఁబోవు యజమానునకు సంబంధించిన అగ్న్యుపస్థాన మంత్రములు, ఉత్తరార్ధమునందు దర్శపూర్ణమాసాంగభూత మంత్రములు కొన్నియు చెప్పఁబడుచున్నవి.

1\. అర్థము: హే జాతవేదః=ఓ యగ్నీ, అగ్రే=మొదట, (=జన్మకాలమందు,) మమ=నాకు, యత్ ప్రథమం నామ=ఏ మొదటి పేరును, మాతా పితా చ=తల్లి, తండ్రియు, దధతుః=ధరింపఁజేసిరో, తత్=ఆ పేరును, త్వమ్= నీవు, పునః ఆ మదైతోః=తిరిగి నేను వచ్చునంతవఱకు, ధారయ=ధరించుము. హే అగ్నే!=ఓయగ్నీ!, అహమ్=(అపి=) నేను కూడ, తవ=నీయొక్క, నామ=పేరును, బిభరాణి=ధరింతును.

తాత్పర్యము: ఓ యగ్నీ! నేను పుట్టిన సమయమున నా తల్లిదండ్రులు నాకు పెట్టిన పేరును నేను తిరిగి వచ్చునంత వఱకు నీవు ధరించుము. నేను కూడ నీ పేరు ధరింతును. (అనఁగా నేను ఇచట లేని సమయమున, నేను లేకుండుటచే ఏర్పడు లోపమును పోగొట్టుచు, నీవు నా పనిని నిర్వర్తింపుము. నీ పేరును ధరించిన నాకు నేను వెళ్లిన ప్రదేశమున వైకల్యము సంభవించదు, అని భావము. "తస్మా ద్ద్వినామా బ్రాహ్మణో ఽర్ధుకః" అను శ్రుతి ననుసరించి బ్రాహ్మణునకు రెండు నామధేయము లుండుననియు, మొదటిపేరును అతని జన్మకాలమున తల్లిదండ్రులు పెట్టుదురనియు, అధ్యయనానంతరము ఉపాధ్యాయుఁ డతనికి 'దీక్షిత' ఇత్యాది నామధేయములు పెట్టుననియు భావము. "డు, భృఞ్=ధారణ పోషణయోః", అను ధాతువునకు "బిభరాణి" అను రూపము లోటి ఉత్తమ పురుషైకవచనాంతము.)

2\. అర్థము: హే జాతవేదః!=ఓ యగ్నీ!, మమ=నాయొక్క, నామ=పేరును, తవ=నీయొక్క, నామ చ=పేరును, యే=ఏ పేర్లను, వివసానౌ=మార్చుకొనఁబడిన, వాససే ఇవ=వస్త్రములనువలె, (ధారయన్తౌ=ధరించుచున్న వారమై,) చరావః=(ఇప్పుడు) సంచరించు చున్నామో, ఆయుషే=(సంపూర్ణమైన,) ఆయువుకొఱకును, జీవసే=ప్రశస్త జీవనముకొఱకును, పునః=మఱల, తే=ఆ నామధేయములను, యథాయథమ్=యథాపూర్వముగ, వయమ్=మనము, విపరిదధావహై=మార్చుకొని ధరించుదము.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీపేరును నేను, నాపేరును నీవు, వస్త్రములను మార్చుకొనినవిధముగ మార్చుకొని ఇప్పుడు సంచరించుచున్నాము. ఇటుపిమ్మట నీ పేరును నీవును నా పేరును నేనును మఱల పూర్వమువలెనే ధరించుదము. ఇట్లు చేసినచో ఆయుర్వృద్ధియు ప్రశస్తజీవనమును కలుగును. (ఈ ఋక్కు మొదలు అయిదవ ఋక్కువఱకుఁగల మంత్రములతో ఆహవనీయాగ్నిని ఉపస్థానము చేయవలెను. ఆ ఉపస్థాన ఋక్కులలో ఇది మొదటిది. 'విపరిదధావహై' ఇది ద్వివచనము. దీని ననుసరించి 'ఆవామ్' అని కర్తృవాచక ముండవలెను. కాని 'వయమ్' అను బహువచనాంతము ప్రయుక్తమైనది. ఛాందసము.)

3. అర్థము: అప్రతిపద్ధాయ=(ఎవ్వరిచేతను,) కొట్టఁబడని, అగ్నయే=అగ్నికొఱకు, నమః=నమస్కారము. అనాధృష్టాయ=(ఎవరిచేతను,) తిరస్కరింపఁబడని అగ్నికొఱకు, నమః=నమస్కారము. సమ్రాజే=బాగుగ ప్రకాశించు అగ్నికొఱకు, నమః=నమస్కారము. (అయమ్=ఈ,) అగ్నిః=అగ్ని, అషాఢః=సహింప నశక్యుఁడు, బృహద్వయాః=అపరిమితాన్నము కలవాఁడు. విశ్వజిత్=సర్వమును జయించినవాఁడు. సహన్త్యః=సహన స్వభావము కలవాఁడు. శ్రేష్ఠః గంధర్వః=సంగీతాది కళలయం దతికుశలుఁడు.

తాత్పర్యము: ఎవ్వనిచేతను కొట్టఁబడనివాఁడును, ఎవ్వనిచేతను తిరస్కరింపఁబడని వాఁడును, బాగుగ ప్రకాశించువాఁడును నగు అగ్నికి నమస్కారము. ఈ యగ్ని సహింప నసాధ్యుఁడు. అపరిమితాన్నము కలవాఁడు. సర్వమును జయించినవాఁడు. సహనశీలి. సంగీతాది కళాకుశలుఁడు. (అగ్న్యుపస్థానము చేయుట కుపయోగించు ఋక్కులలో ఇది రెండవది.)

4. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ!, దేవాః=దేవతలు, త్వత్పితారః=నీవే పాలకుఁడవుగా కలవారు, త్వా మాహుతయః=నిన్నుఁజేరిన ఆహుతులు గలవారు. (నీయందు హుతమైన ఆజ్యాద్యాహుతులు దేవతలను తృప్తి పఱచుచున్నవని భావము.) త్వద్వివాచనాః=నీవే ప్రకటనకర్తగాఁ గలవారు. (హే అగ్నే!=ఓ యగ్నీ!) మామ్=నన్ను, ఆయుషా=ఆయువుతో, సంధాః=కలుపుము. గౌపత్యేన=గోస్వామిత్వముతో, సంధాః=కలుపుము. సుహితే=మంచి హితమునందు, మా=నన్ను ధాః=స్థాపించుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు దేవతలకు పాలకుఁడవు. నీయందు హుతములైన ఆజ్యాది హవిస్సులు దేవతలను తృప్తి పఱచును. దేవతలకు నీవే ప్రఖ్యాపకుఁడవు. ఓ యగ్నీ! నన్ను ఆయుష్మంతునిగాను, గోస్వామినిగాను జేయుము. నాకు మంచి హితమును కలుగఁజేయుము. (అగ్న్యుపస్థాన ఋక్కులలో ఇది మూఁడవది.)

5. అర్థము: అయమ్=ఈ, అగ్నిః=అగ్ని, శ్రేష్ఠతమః=శ్రేష్ఠులలో మిక్కిలి శ్రేష్ఠుఁడు. అయమ్=ఈ యగ్ని, భగవత్తమః=అతిశయించిన భగవంతుఁడు. అయమ్=ఈ యగ్ని, సహస్రసాతమః=సహస్ర సంఖ్యాకముగ ధనమును దానము చేయువారిలో నతిశయించినవాఁడు. (తదనుగ్రహేణ=అట్టి అగ్నియొక్క అనుగ్రహము చేత,) అస్మై=ఈ యజమానుఁడనైన నాకొఱకు, సువీర్యమ్=మంచిసామర్థ్యము, (అస్తు=కలుగుఁగాక.)

తాత్పర్యము: ఈ యగ్ని శ్రేష్ఠులలో మిక్కిలి శ్రేష్ఠుఁడు. భగవల్లక్షణములు కలవారిలో అతిశయించినవాఁడు. సహస్ర సంఖ్యాకముగ ధనమును దానము చేయువారిలో అధికుఁడు. ఇట్టి యగ్ని యనుగ్రహమువలన యజమానుఁడనైన నాకు మంచి సామర్థ్యము కలుఁగుగాక.

విశేషములు: "శ్రేష్ఠతమః"=ప్రశంసింపఁ దగినవారిలో నతిశయించినవాఁడు, శ్రేష్ఠుఁడనఁబడును. శ్రేష్ఠులలో అతిశయించినవాఁడు శ్రేష్ఠతముఁ డనఁబడును. ప్రశస్యానాం అతిశయేన శ్రేష్ఠః, పునరపి తాదృశానాం మధ్యే అతిశయేన శ్రేష్ఠః=శ్రేష్ఠతమః. 'భగవత్తమః' "ఐశ్వర్యస్య సమగ్రస్య ధర్మస్య యశస శ్శ్రియః, జ్ఞాన వైరాగ్యయో శ్చైవ షణ్ణాం భగ ఇతీరణా" ఇతి. సమగ్రమైన ఐశ్వర్యము, ధర్మము, కీర్తి, లక్ష్మి, జ్ఞానము, వైరాగ్యము. ఈ యాఱును భగ శబ్దార్థములు. "ఉత్పత్తిం ప్రలయం చైవ భూతానా మగతిం గతిమ్, వేత్తి విద్యా మవిద్యాం చ స వాచ్యో భగవానితి". సృష్టి స్థితి లయములను, ప్రాణుల గమనా గమనములను విద్యను (=జ్ఞానము) అవిద్యను (=మాయ) తెలిసినవాఁడు భగవంతుఁ డనఁబడును. అట్టి భగవంతుని లక్షణములు గలవారిలో అగ్ని మిక్కిలి గొప్పవాఁడని భావము. అగ్న్యుపస్థాన ఋక్కులలో ఇది నాల్గవది.

6. అర్థము: మనః=మాననీయమైన, జ్యోతిః=అగ్నియొక్క తేజస్సు, ఆజ్యమ్=హోమము చేయఁబడిన నేతిని, జుషతామ్=సేవించుఁగాక. (=భక్షించుఁగాక) విచ్ఛిన్నమ్=(అగ్నియొక్క ఉద్వాసనచే,) విచ్ఛిన్నమైన, ఇమం యజ్ఞమ్=ఈ యజ్ఞమును, సందధాతు=బాగుగ పోషించుఁగాక. ఉషసః=ప్రాతఃకాలమునకు సంబంధించినవియు, నిమ్రుచశ్చ=అస్తమయకాలమునకు సంబంధించినవియునగు, యాః=ఏ యాహుతులు, ఇష్టాః=ఇతర యజమానులచే అనుష్ఠింపఁబడినవో, (నాచే నతిక్రమింపఁబడినవో,) తాః=ఆ యాహుతుల నన్నిటిని, ఘృతేన=ఆజ్యరూపమైన, హవిషా=(ఈ) హవిస్సుచేత, సందధామి=అవిచ్ఛిన్నములనుగాఁ జేయుచున్నాను.

తాత్పర్యము: పూజనీయమైన అగ్ని తేజస్సు, హోమము చేయఁబడిన ఈ యాజ్యమును స్వీకరించుఁగాక. ప్రాతఃకాలమునకు సాయంకాలమునకు సంబంధించినవియు, ఇతర యజమానులచే యథావిధిగ ననుష్ఠింపఁబడినవియు, నేను అనుష్ఠించనివియునగు, ఆ యాహుతుల నన్నిటిని ఈ యాజ్యహవిస్సుచే అవిచ్ఛిన్నములనుగాఁ జేయుచున్నాను. (ఈ మంత్రము చెప్పుచు అగ్నియందు ఆజ్యమును హోమము చేయవలెను. యజమానుఁడు ప్రవాసమునకై బయలుదేరిన నాటినుండి తొమ్మిది దినములలోపల రాకుండ ప్రవాసమునందే ఉన్నచో పైని చెప్పఁబడిన హోమము చేయవలెను. దీనితో అగ్న్యుపస్థాన విషయకమైన పూర్వభాగము ముగిసినది. ఇఁక ధార్మిక యజమాన మంత్రాది విషయకమైన ఉత్తరభాగము చెప్పఁబడుచున్నది).

7. **అర్థము:** ఓషధయః=ఓషధులు, పయస్వతీః=సారము కలవి. వీరుధామ్=లతలయొక్క, పయః=క్షీరము, పయస్వత్=సారము కలది. అపామ్=ఉదకములకు, పయసః=గవాదుల క్షీరమునకును, యత్ పయః=ఏ సారము, (అస్తి=కలదో!,) తేన=ఆ సారముతో, హే ఇన్ద్ర!=ఓ యింద్రుఁడా!, మామ్=నన్ను, సంసృజ=కలుపుము.

తాత్పర్యము: (ఇచట పయశ్శబ్దము సారవాచకము.) ఓషధులు సారము కలవి. క్షీరము సారము కలది. ఓ యింద్రుఁడా! ఉదకములకు క్షీరములకుఁ గల సారముతో నన్ను కలుపుము. (=నన్ను సారవంతుని చేయుము. ఈ మంత్రము చెప్పుచు ఉదకమును ఆచమనము చేయవలెను. లేదా, స్పృశించవలెను. వివిధం రోహన్తీతి వీరుధః=అనేక విధములుగ మొలచునవి యని వ్యుత్పత్తి.)

8. **అర్థము:** వ్రతపతే!=వ్రతమున కధిపతివైన, హే అగ్నే!=ఓ యగ్నీ!, (అహమ్=నేను,) వ్రతమ్=వ్రతమును, చరిష్యామి=ఆచరింపఁగలను, తత్=ఆ వ్రతమును, శకేయమ్=చేయుటకు సమర్థుఁడ నగుదును. మే=నాయొక్క, తత్=ఆ వ్రతము, రాధ్యతామ్=సమృద్ధి కలది యగుఁగాక.

తాత్పర్యము: వ్రతముల కధిపతివైన అగ్నీ! నేను వ్రతమును జేయఁగలను. ఆ వ్రతము నాచరించుటకు సమర్థుఁడ నగుదును. ఆ నావ్రతము సమృద్ధమగుఁగాక. (యజమానుఁడు ఈ మంత్రమును జపించుచు ఆహవనీయాగ్నికి దక్షిణముగ నుండి వ్రతము చేయ నిశ్చయించుచు మనస్సుచే సముద్రమును ధ్యానించవలెను.)

9. **అర్థము:** ఇహ=ఈ యజ్ఞకర్మయందు, హోతారమ్=దేవతల నాహ్వానించునట్టి, తమ్=ఆ, అగ్నిమ్=అగ్నిదేవుని, (అహమ్=నేను,) హువే=ఆహ్వానించుచున్నాను. ఇహ=ఈ యజ్ఞకర్మయందు, యాన్=ఏ దేవతల నుద్దేశించి, (జుహుమః=హోమము చేయుచున్నామో;) యజ్ఞియాన్=యజ్ఞమునకు సంబంధించిన, తాన్=ఆ దేవతలను, హవామహే=ఆహ్వానించుచున్నాను. దేవాః=(ఆహ్వానింపఁబడిన) దేవతలు, సుమనస్యమానాః=మంచిమనస్సుతో కూడినవారై, ఆయాన్తు=వత్తురుగాక. (ఆగత్య చ=వచ్చియు,) మే=నాయొక్క, అస్య హవిషః=ఈ హవిస్సును (ద్వితీయార్థే షష్ఠీ,) వియన్తు=భక్షింతురుగాక.

తాత్పర్యము: యజ్ఞకర్మయందు దేవతల నాహ్వానించునట్టి ఆ యగ్ని నాహ్వానించుచున్నాను. నా చేయు యజ్ఞకర్మయందు ఉద్దిష్టులైన దేవతలను ఆహ్వానించుచున్నాను. ఆహూతులైన ఆ దేవతలు వచ్చి మంచి మనస్సు కలవారై నే నిచ్చునట్టి యీ హవిస్సును భక్షింతురుగాక. (హవిస్సు నభిమంత్రించవలెను. "హవామహే"–ఏకత్వార్థమున బహువచనము ప్రయుక్తమైనది.)

10. **అర్థము:** హే యజ్ఞ!=ఓ యజ్ఞమా! కః=ప్రజాపతి, త్వా=నిన్ను, యునక్తి=(అంతటను) యోగ్యముగాఁ జేయుచున్నాఁడు. (తతః=అందువలన, ఇహ చ=ఇచటఁ గూడ,) సః=(ఏవ)=ఆ ప్రజాపతియే, త్వా=నిన్ను, యునక్తు=యోగ్యముగాఁ జేయుఁగాక.

తాత్పర్యము: ఓ యజ్ఞమా! ప్రజాపతి నిన్ను అంతటను యోగ్యముగాఁ జేయుచున్నాఁడు. కావున ఇచటఁగూడ ఆ ప్రజాపతియే నిన్ను యోగ్యముగాఁ జేయుఁగాక. (ఈ మంత్రము చెప్పుచు యాగస్థలము నంతయు చూడవలెను.)

11. అర్థము: వేధసః=బ్రహ్మసమానులును, పుష్టః=పోషకులునగు, (ఋత్విజః=ఋత్విజులు) యాని కపాలాని=ఏ పాత్రములను, ఘర్మే=అగ్నియందు, ఉప చిన్వన్తి=ఉంచుచున్నారో; తాన్యపి=ఆ పాత్రములనన్నిఁటినిఁ గూడ, వ్రతే (సమాప్తే సతి)=యజ్ఞవ్రతము సమాప్త మగుచుండగా, ఇన్ద్రవాయూ=ఇంద్ర వాయు దేవతలు, విముఞ్చతామ్=విడిపింతురుగాక.

తాత్పర్యము: బ్రహ్మసమానులును పోషకులునగు ఋత్విజులు యజ్ఞకర్మయం దగ్నిలో ఉంచిన పాత్రములను యజ్ఞము పూర్తికాగా ఇంద్ర వాయువులు అగ్నినుండి తీయుదురుగాక. (అధ్వర్యు యజమానులు ఈ మంత్రమును జపించవలెను.)

12. అర్థము: ఘర్మః=సంతప్తమైన పాత్రవిశేషము, జీరదానుః=(యజ్ఞమునకు పురోడాశము మూలమున) జీవనము నిచ్చునది. కావున, అభిన్నః=భిన్నము కానిది. (కపాలః=కపాలము) యతః=ఏ పృథివినుండి, ఆత్తః=ప్రాప్తమైనదో, పునః=మఱల, తత్=ఆ పృథివీరూపమునే, అగాన్=పొందినది. ఇధ్మః=సమిధ, వేదిః=వేదియు, పరిధయశ్చ=పరిధులును, సర్వే=అన్నియు, (స్వ స్వరూపైః=స్వ స్వరూపములతో,) యజ్ఞస్య=యజ్ఞపురుషునియొక్క, ఆయుః అను=ఆయువు ననుసరించి, సంచరన్తి=సంచరించుచున్నవి. (జీరమ్=జీవనం, యజ్ఞస్య పురోడాశద్వారేణ దదాతీతి=జీరదానుః. జీవేః రదానుక్ ప్రత్యయః.)

తాత్పర్యము: సంతప్తమైన కపాలము జీవనము నిచ్చునది. పూర్వముకంటె వేఱుగా భాసించినను మంత్రసామర్థ్యముచే వేఱు కానిదియే. (భిన్నత్వ దోషము కలుగదు.) భిన్నమని యనినచో, అది తనకు కారణ మయిన మృద్రూపమును పొందినది. సమిధలు, వేది, పరిధులు, స్వ స్వరూపములతో యజ్ఞముయొక్క ఆయువు ననుసరించి సంచరించుచున్నవి. (ఈ మంత్రము చెప్పుచు కపాలమును ఉదకములందు విడువవలెను.)

13. అర్థము: యే=ఏ, త్రయస్త్రింశత్=ముప్పదిమూఁడు సంఖ్యకల, తన్తవః='యజ్ఞతను' నామక మంత్రములు, ఇమమ్=ఈ యజ్ఞమును, వితత్నిరే=విస్తరింపఁజేసినవో, యే=ఏ ఋత్విజులు మున్నగువారు, ఇమం యజ్ఞమ్=ఈ యజ్ఞమును, స్వధయా=హవిస్సుచే, దదన్తే=అనుష్ఠించుచున్నారో, తేషామ్=ఆ ప్రజాపత్యాది యజ్ఞాభిమాని దేవతలలోను, ఋత్విగాది యజ్ఞాంగములలోను, ఛిన్నమ్=(ఏది) వైగుణ్యము పొందినదో, ఏతత్=దీనిని, ప్రతి దధామి=దానికి మాఱుగా కూర్చుచున్నాను. స్వాహా=బాగుగ హుతమగుఁగాక. ఘర్మః=దీప్తమైన యజ్ఞాంగ కపాలవిశేషము, దేవాన్=దేవతలను, అప్యేతు=పొందుఁగాక.

తాత్పర్యము: చతుర్థ కాండమునందు ఇష్టకోపధానార్థమైన యజ్ఞతను నామక మంత్రములు ముప్పదిమూఁడు ఆమ్నాతములైనవి. తన్మంత్ర ప్రతిపాద్యములైన యజ్ఞతనువులు ఇచట తన్తుస్థానీయములు. తన్తువులచే వస్త్రము నిష్పన్నమైన విధముగ, ఆ యజ్ఞతనువులు ఈ యజ్ఞమును విస్తరింపఁజేయుచున్నవి. ఋత్విగాదులు హవిస్సుచే యజ్ఞము నాచరించుచున్నారు. యజ్ఞాంగములలో ఏదియేని విచ్ఛిన్నమైనచో అందుకు మాఱుగ ఈ యజ్ఞాంగమును సమకూర్చుచున్నాను. కావున ఈ హవిస్సు బాగుగ హుతమగుఁగాక. విచ్ఛిన్న కపాలమునకు మాఱుగ నిక్షిప్తమైన దీప్త యజ్ఞాంగవిశేషము దేవతలను పొందుఁగాక. (అగ్నియందు దీప్తము చేయుట కుద్దేశింపఁబడిన కపాలము ముందుగానే విచ్ఛిన్నమైనచో మఱియొక కపాలమును సంస్కరించి కపాలములం దుంచవలెను.)

దశమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే పంచమప్రపాఠక ఏకాదశోఽనువాకః।

మూలము: [1]వైశ్వానరో న ఊత్యా ఽఽప్రయాతు పరావతః। అగ్ని రుక్థేన వాహసా। [2]ఋతావానం వైశ్వానర మృతస్య జ్యోతిష స్పతిమ్। అజస్రం ఘర్మ మీమహే। [3]వైశ్వానరస్య దగ్ంసనాభ్యో బృహ దరిణా దేక స్స్వపస్యయా కవిః। ఉభా పితరా మహయ న్నజాయతాగ్ని ర్ద్యావాపృథివీ భూరి రేతసా। [4]పృష్టో దివిపృష్టో అగ్నిః పృథివ్యాం పృష్టో విశ్వా ఓషధీ రావివేశ। వైశ్వానర స్సహసా పృష్టో అగ్ని స్స నో దివా సః (౧)రిషః పాతు నక్తమ్। [5]జాతో యదగ్నే భువనా వ్యఖ్యః పశుం న గోపా ఇర్యః పరిజ్మా। వైశ్వానర బ్రహ్మణే విన్ద గాతుం యూయం పాత స్వస్తిభి స్సదా నః। [6]త్వ మగ్నే శోచిషా శోశుచాన ఆరోదసీ ఆ పృణా జాయమానః। త్వం దేవాగ్ం అభిశ స్తే రముఞ్చో వైశ్వానర జాతవేదో మహిత్వా। [7]అస్మాక మగ్నే మఘవత్సు ధారయా నామి క్షత్ర మజరగ్ం సువీర్యమ్। వయం జయేమ శతినగ్ం సహస్రిణం వైశ్వానర (౨)వాజ మగ్నే తవోతిభిః। [8]వైశ్వానరస్య సుమతౌ స్యామ రాజా హికం భువనానా మభిశ్రీః। ఇతో జాతో విశ్వ మిదం విచష్టే వైశ్వానరో యతతే సూర్యేణ। [9]అవతే హేడో వరుణ నమోభి రవ యజ్ఞేభి రీమహే హవిర్భిః। క్షయ న్నస్మభ్య మసుర ప్రచేతో రాజ న్నేనాగ్ంసి శిశ్రథః కృతాని। [10]ఉదు త్తమం వరుణ పాశ మస్మ దవా ధమం విమధ్యమగ్ం శ్రథాయ। అథా వయ మాదిత్య (౩)వ్రతే తవా నాగసో అదితయే స్యామ। [11]దధిక్రావ్ణో అకారిషం జిష్ణో రశ్వస్య వాజినః। సురభి నో ముఖా కర త్ప్రణ ఆయూగ్ంషి తారిషత్। [12]ఆ దధిక్రా శ్శవసా పఞ్చకృష్టీ సూర్య ఇవ

జ్యోతిషా ఽవ స్తతాన। సహస్రసా శ్శతసా వాజ్యర్వా పృణక్తు మధ్వా స మిమా వచాగ్ంసి।
[13]అగ్ని ర్మూర్ధా భువః। [14]మరుతో యద్ధ వో దివ స్సుమ్నాయన్తో హవామహే। ఆ తూ నః
(౪)ఉపగన్తన। [15]యా వ శ్శర్మ శశమానాయ సన్తి త్రిధాతూని దాశుషే యచ్ఛతాధి। అస్మ
భ్యం తాని మరుతో వియన్త రయిం నో ధత్త వృషణ స్సువీరమ్। [16]అదితి ర్న ఉరుష్య
త్వదితి శ్శర్మ యచ్ఛతు। అదితిః పాత్వగ్ంహసః। [17]మహీ మూ షు మాతరగ్ం సువ్రతానా మృతస్య
పత్నీ మవసే హువేమ। తువిక్షత్రా మజరన్తీ మురూచీగ్ం సుశర్మాణ మదితిగ్ం సుప్రణీతిమ్।
[18]సుత్రామాణం పృథివీం ద్యా మనేహసగ్ం సుశర్మాణ మదితిగ్ం సుప్రణీతిమ్। దైవీం నావగ్ం
స్వరిత్రా మనాగస మస్రవన్తీ మా రుహేమా స్వస్తయే। [19]ఇమాగ్ం సునావ మారుహగ్ం శతారి
త్రాగ్ం శతస్ఫ్యమ్। అచ్ఛిద్రాం పారయిష్ణుమ్। ॥౨౫॥

(దివా ససహస్రిణం వైశ్వానరా ఽఽదిత్యతూ నో ఽనేహసగ్ం సుశర్మాణ మేకాన్నవిగ్ంశతి శ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే పఞ్చమప్రపాఠక ఏకాదశోఽనువాకః।

(దేవాసురాః పరా భూమి ర్భూమి రుపప్రయన్తః సంపశ్యా మ్యయజ్ఞః సంపశ్యామీత్యాహా
గ్నిహోత్రం మమ నామ వైశ్వానర ఏకాదశ ॥౧౧॥)

(దేవాసురాః క్రుద్ధః సం పశ్యామి సం పశ్యామి నక్త ముపగన్తనై కపఞ్చాశత్ ॥౫౧॥)

హరిః ఓమ్।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే పఞ్చమః ప్రపాఠకః।

వేదార్థ దీపిక

అవతారిక: ఈ యేకాదశానువాకమునందు కామ్యములైన యాజ్యా పురోనువాక్యలు చెప్పఁబడుచున్నవి. ఇష్టికాండయందు త్రిహవిష్క-మను ఒక యిష్టి విహితమైనది. ఆ యిష్టియందు నాలుగు యాజ్యా పురోనువాక్య యుగ్మములు విహితములైనవి. అందు ప్రథమ యుగ్మములోని పురోనువాక్య యీ ప్రథమ మంత్రము.

1\. అర్థము: వైశ్వానరః=విశ్వమానవుల కుపకారియగు, అగ్నిః=అగ్ని, ఊత్యై=రక్షణముకొఱకు, పరావతః=దూరదేశము నుండి, ఉక్థేన=ఉత్థాన పూర్వకమైన, వాహసా=ఆగమనముచేత, నః=మమ్ముఁగూర్చి, ప్రాయాతు=ప్రకృష్టముగ వచ్చుఁగాక. (ఉత్థానము=లేచుట.)

తాత్పర్యము: సర్వమానవుల కుపకారియగు అగ్ని, రక్షణము నిమిత్తము దూరదేశమునుండి లేచి మా దగ్గఱకు వచ్చుఁగాక.

2\. అర్థము: ఋతావానమ్=సత్యవంతుఁడును, జ్యోతిషః=అభీష్టఫల ప్రకాశమగు, ఋతస్య=యజ్ఞమునకు, పతిమ్=పాలకుఁడును, అజస్రమ్=నిరంతరము, ఘర్మమ్=దీప్యమానుఁడునునగు, వైశ్వానరమ్=అగ్నిని, (వయమ్=మేము,) ఈమహే=పొందుచున్నాము.

తాత్పర్యము: మేము వైశ్వానరాగ్నిని పొందుచున్నాము. ఆ యగ్ని సత్యవంతుఁడు. అభీష్ట ఫలప్రదమైన యజ్ఞమునకు పాలకుఁడు. నిరంతరము ప్రకాశించువాఁడు. (ఇది యాజ్య.)

3\. అర్థము: కవిః=బుద్ధిమంతుఁడగు, ఏకః=ఒక యజమానుఁడు, స్వపస్యయా=మంచి కర్మయగుటచేత, వైశ్వానరస్య=వైశ్వానరయాగ సంబంధులగు, దంసనాభ్యః=క్రియలవలన, బృహత్=గొప్ప ఫలమును, అరిణాత్=పొందెను. (అయమ్=ఈ) అగ్నిః=అగ్ని, ద్యావా పృథివీ=ద్యావా భూమి రూపులును, భూరి రేతసా=గొప్ప రేతస్సు కలవారునగు, పితరా + ఉభా=తల్లిదండ్రుల నిద్దఱిని, మహయన్=లోకపూజ్యులనుగాఁ జేయుచు, అజాయత=పుట్టెను.

తాత్పర్యము: బుద్ధిమంతుఁడైన ఒకానొక యజమానుఁడు మంచి కర్మయగుటచే వైశ్వానరయాగ సంబంధులగు క్రియల వలన మహాఫలము నొందెను. ఈ యగ్ని ప్రభూత రేతస్కులును, ద్యావా భూమి రూపులునగు తల్లిదండ్రులను, లోకపూజ్యులనుగా చేసి పుట్టెను. (ఇచట 'అప్' శబ్దము కర్మవాచకము. శోభనం + అపః=స్వపః. స్వపసో భావః=స్వపస్యమ్. 'స్వపస్యేన' అని యుండవలెను. 'స్వపస్యయా' అని స్త్రీలింగాంతముగ నున్నది. ఈ లింగవ్యత్యయము ఛాందసము. 'భూరి రేతసా'—ఇది భూరి రేతసౌ' అని ఉండవలెను. వచన వ్యత్యయము ఛాందసము. పితరా=పితరౌ. ఇది ద్వితీయ యుగ్మములోని పురోనువాక్య.)

4\. అర్థము: అగ్నిః=(ఈ) అగ్ని, దివి=ద్యులోకమునందు, పృష్టః=(స్పృష్టః అని యర్థము. సకార లోపము ఛాందసము. ఆదిత్య రూపముతో,) ఉన్నవాఁడు. పృథివ్యామ్=భూమియందు, పృష్టః=(దాహపాక కారిగా,) ఉన్నవాఁడు. (తథా=అ విధముగా, ఫలపాకకారి యగుచు,) పృష్టః=సంబద్ధుఁడై, విశ్వాః=సమస్తములైన, ఓషధీః=ఓషధులను, ఆవివేశ=ప్రవేశించెను. వైశ్వానరః అగ్నిః=వైశ్వానరాగ్ని, సహసా=బలముచే, పృష్టః=సంబద్ధుఁడైనవాఁడు. సః=ఆ (అటువంటి,) అగ్ని, రిషః=హింసకమైన పాపమునుండి, దివా=పగలు, నక్తమ్=రాత్రియందును, నః=మమ్ము, పాతు=రక్షించుఁగాక.

తాత్పర్యము: ఈ యగ్ని ద్యులోకమునందు ఆదిత్యరూపుఁడుగాను, భూలోకమునందు దాహఫలపాక రూపుఁడుగాను, ఉన్నవాఁడై సమస్తమైన ఓషధులలో కూడ ప్రవేశించి యుండెను. (ఓషధులు కొన్ని మణికాంతులు కలవై ప్రకాశించుచుండును. అందలిప్రకాశము ఈ యగ్నిదే యని భావము.) వైశ్వానరాగ్ని బలముతో కూడి యున్నవాఁడు. అట్టి అగ్ని హింసపెట్టునట్టి పాపమునుండి మమ్ము దివారాత్రములందు రక్షించుఁగాక. (ఇది యాజ్య.)

5. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ! ఇర్యః=అన్నమునకు తగినవాఁడవు, పరిజ్మా=అంతటను వెళ్లువాఁడవునగు, త్వమ్=నీవు, జాతః=జాతమాత్రుఁడవేయై (=పుట్టుచునే,) గోపాః=గోపాలకులు, పశుం న=పశువునువలె, భువనాని=లోకములను, వ్యఖ్యః=విశేషముగ ప్రఖ్యాపన చేసినవాఁడ వై తివి. యత్=ఏ కారణమువలన, (ఏవంవిధః=ఇటువంటి వాఁడవో, తత్=అందువలన,) హే వైశ్వానర!=ఓ వైశ్వానరాగ్నీ!, బ్రహ్మణే=దృఢమైన (అస్మై కర్మణే=ఈ కర్మకొఱకు,) గాతుమ్=మార్గమును, విన్ద=పొందుము. యూయమ్=మీరు, (నీవు అని యర్థము. పూజాయాం బహువచనమ్.) స్వస్తిభిః=శ్రేయస్సులతో, సదా=ఎల్లప్పుడు, నః=మమ్ము, పాత=రక్షింపుఁడు.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు అన్నము కలవాఁడవు. అంతటను పోవువాఁడవు. అటువంటి నీవు పుట్టుచునే గోపాలకులు పశువును గుర్తించిన విధముగ నీ తేజస్సుచే లోకములను తెలియఁబఱచితివి. కావున ఓ వైశ్వానరాగ్నీ! దృఢమైన ఈ కర్మకొఱకు మార్గమును పొందుము. నీవు శ్రేయస్సులతో నెల్లప్పుడు మమ్ము కాపాడుము. (ఇది తృతీయ యుగ్మములోని పురోనువాక్య.)

6. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ!, త్వమ్=నీవు, శోశుచానః=ఎక్కువగ ప్రకాశించుచున్నవాఁడవై, జాయమానః=పుట్టుచున్న వాఁడవేయగుచు, రోదసీ=ద్యావా పృథువులను, శోచిషా=కాంతిచే, అపృణాః=అంతటను పూరించితివి. జాతవేదః=పుట్టిన జగత్తును తెలిసికొనినవాఁడవగు, హే వైశ్వానర!=ఓ యగ్నీ!, త్వమ్=నీవు, మహిత్వా=స్వమహిమచేత, దేవాన్=ఋత్విజులను, అభిశస్తేః=పాపమునుండి, అముఞ్చః=విడిపించితివి.

తాత్పర్యము: ఓ యగ్నీ!, ఎక్కువగ ప్రకాశించుచున్నవాఁడవై పుట్టుచునే కాంతిచేత ద్యావా భూములను అంతటను పూరించితివి. పుట్టిన జగత్తును తెలిసికొనినవాఁడవగు ఓ వైశ్వానరాగ్నీ! నీవు నీ మహిమచేత ఋత్విజులను పాపము నుండి విముక్తులను చేసితివి. (ఇది యాజ్య.)

7. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ!, అనామి=నమస్కరించని స్వభావము కలవాఁడును, అజరమ్=ముసలితనము లేని వాఁడును, సువీర్యమ్=మంచి సామర్థ్యము కలవాఁడును, అస్మాకమ్=మాకు, క్షత్రమ్=పాలకుఁడునగు పురుషుని, మఘవత్సు=ఇంద్రులయందు, ధారయ=స్థాపించుము. హే వైశ్వానర!=ఓ యగ్నీ! తవ=నీయొక్క, ఊతిభిః=పాలనములచేత, వయమ్=మేము, శతినమ్=శతసహస్ర సంఖ్యోపేతమైన, వాజమ్=అన్నమును, జయేమ=పొందెదము.

తాత్పర్యము: ఓ యగ్నీ! మాకు పాలకుఁడైన పురుషుని ఇంద్రులయందు స్థాపించుము. (=ఇంద్రసమానుఁడైన పురుషుని మాకు పాలకునిగా నియమించుమని భావము.) ఆ పురుషుఁడు ఎవ్వరికిని నమస్కరించనివాఁడును, జరా రహితుఁడును, మంచి సామర్థ్యము కలవాఁడునై యుండవలెను. ఓ యగ్నీ! నీ పరిపాలనములచేత మేము కూడ శతసహస్ర సంఖ్యోపేతమైన అన్నమును పొందెదము. ఇది చతుర్థ యుగ్మమునందలి పురోనువాక్య.)

8. అర్థము: (వయమ్=మేము,) వైశ్వానరస్య=వైశ్వానరాగ్నియొక్క, సుమతౌ=అనుగ్రహబుద్ధియందు, స్యామ=ఉందుము. అభిశ్రీః=అభిప్రాప్తమైన సంపద కల, (అయమ్=ఈ వైశ్వానరాగ్నియే) భువనానామ్=(సర్వ)లోకములకు, రాజా హికమ్=(హికమ్=ఖలు.) ప్రకాశకుఁడు కదా, ఇతః=ఈ కారణమువలన, జాతః ఏవ=జాతమాత్రుఁడే అయి, ఇదం విశ్వమ్=ఈ ప్రపంచమును, విచష్టే=విశేషముగ ప్రఖ్యాపన చేయుచున్నాఁడు. (అయమ్=ఈ) వైశ్వానరః=వైశ్వానరాగ్ని, సూర్యేణ=(పగటియందు) సూర్యరూపముతో, యతతే=ప్రవర్తించుచున్నాఁడు.

తాత్పర్యము: మేము వైశ్వానరాగ్ని యనుగ్రహమును సంపాదించెదము. ఈ వైశ్వానరుఁడు సర్వలోకములకు ప్రకాశకుఁడు కదా, ఈ కారణముచేతనే పుట్టుచునే ఈ విశ్వమును ప్రఖ్యాపన చేయుచున్నాఁడు. ఈ వైశ్వానరాగ్ని పగటియందు సూర్యరూపముతో ప్రవర్తించుచున్నాఁడు. (ఈ యర్థమే "ఉద్యన్తం వా వాదిత్య మగ్నిరను సమారోహతి" అను శ్రుత్యంతరమున కలదు. ఇది యాజ్య.)

9. అర్థము: హే వరుణ!=ఓ వరుణదేవా!, తే=నీయొక్క, హేడః=క్రోధమును, నమోభిః=నమస్కారములచేత, యజ్ఞేభిః=యజ్ఞ విశేషములచేతను, హవిర్భిః=పురోడాశాది హవిస్సులచేతను, అవేమహే=శమింపఁ జేయుచున్నాము. హే అసుర!=శత్రు నిరసనమునందు సమర్థుఁడవైన ఓ వరుణదేవా!, అస్మభ్యమ్=మాకొఱకు, క్షయన్=(ఇచట) నివసించుచున్నవాఁడవగుచు, కృతాని=(మాచే) చేయఁబడిన, ఏనాంసి=పాపములను, శిశ్రథః=నశింపఁజేయుము.

తాత్పర్యము: ఓ వరుణదేవా! నమస్కారములచేతను, యజ్ఞవిశేషములచేతను, పురోడాశాది హవిస్సులచేతను, నీ క్రోధమును శమింపఁ జేయుచున్నాము. ఓ వరుణదేవా! నీవు శత్రువులను నశింపఁజేయుటయందు సమర్థుఁడవు. గొప్ప మనస్సు కలవాఁడవు. ప్రకాశించు చున్నవాఁడవు. అట్టి నీవు మమ్ము అనుగ్రహించుటకైఇచట నివసించుచు మా పాపములను పోగొట్టుము. (యజ్ఞైః అని యుండుటకు బదులుగా 'యజ్ఞేభిః' అని ఛాందసము ప్రయుక్తమైనది. ఇది ద్వితీయ హవిస్సునకు పురోనువాక్య.)

10 అర్థము: హే వరుణ!=ఓ వరుణదేవా!, అస్మత్=మాయొక్క, (షష్ఠ్యర్థే పంచమీ.) ఉత్తమమ్=ఉత్తమాంగమైన శిరస్సునందు స్థాపితమైన, పాశమ్=(నీ)పాశమును, ఉత్(కృష్య)=పైకి తీసి, శ్రథాయ=(శ్రథయ) నశింపఁజేయుము. అధమమ్=అధమాంగమైన పాద ప్రదేశమునందు స్థాపితమైన, పాశమ్=పాశమును, అవ(కృష్య)=(లాగి,) ఆకర్షించి, శ్రథయ=నశింపఁజేయుము. మధ్యమమ్=శరీర మధ్యప్రదేశమునందు, స్థాపితమైన, పాశమ్=పాశమును, విశ్రథయ=విచ్ఛేదము చేయుము. హే ఆదిత్య!=ఓ సూర్య సదృశుఁడవైన వరుణదేవా!, అథ=పాశత్రయ వినాశానంతరము, వయమ్=మేము, అనాగసః=పాప రహితులమై, తవ=నీయొక్క, వ్రతే=కర్మయందు, అదితయే=అఖండత్వము కొఱకు, స్యామ=యోగ్యుల మగుదుము.

తాత్పర్యము: ఓ వరుణదేవా! నా శిరస్సునందు, పాదమునందు, శరీర మధ్యభాగమునందును, స్థాపితమైన నీ పాశమును తీసి నశింపఁజేయుము. సూర్య సదృశుఁడవైన వరుణదేవా! పాశత్రయ నాశానంతరము మేము పాప రహితులమై నీ కర్మయందు అఖండత్వముకొఱకు యోగ్యుల మగుదుము. (ఇది యాజ్య.)

11. అర్థము: జిష్ణోః=జయశీలుఁడును, అశ్వస్య=వ్యాపించువాఁడును, వాజినః=అన్నము కలవాఁడునగు, దధిక్రావ్ణః='దధిక్రావన్' అను పేరుగల (అగ్ని)దేవునియొక్క, (కర్మ=కర్మను,) అకారిషమ్=చేసితిని. సః=అ దేవుఁడు, నః=మాయొక్క, ముఖా=ముఖమును, సురభి=సుగంధోపేతముగ, కరత్=చేయుఁగాక. నః=మాయొక్క ఆయూంషి=అయువులను, ప్రతారిషత్=ఎక్కువ వృద్ధి నొందించుఁగాక.

తాత్పర్యము: "దధిక్రావన్" అను (అగ్ని)దేవుఁడు, జయశీలుఁడు. వ్యాపించువాఁడు. అన్నము కలవాఁడు. నేను ఆయగ్నిదేవుని సంబంధమైన కర్మను చేసితిని. కావున ఆ దేవుడు మా ముఖమును కర్పూరాది ద్రవ్యసమృద్ధి నిచ్చుటచే సుగంధోపేతముగ చేయుఁగాక. మఱియు మా ఆయువులను అధికముగ వృద్ధి నొందించుఁగాక. (ఇది తృతీయ హవిస్సుయొక్క పురోనువాక్య.)

విశేషములు: దధి–క్రామతి=ప్రాప్నోతీతి=దధిక్రావా, అని వ్యుత్పత్తి. పెఱుగును పొందునట్టి దధిక్రావన్ అను పేరుగల దేవతావిశేషము. ఆ పేరు గల అగ్ని యని కొందఱి యభిప్రాయము. అశ్వస్య–'అశూ=వ్యాప్తౌ' అను ధాతువునుండి అశ్వశబ్ద ముత్పన్నమైనది. కావున వ్యాపించునట్టిది యని యర్థము. ముఖా=ముఖమ్. కరత్=కరోతు, ఇవి వైదిక ప్రయోగములు.

12. అర్థము: సహస్రసాః=సహస్ర సంఖ్యాకముగ ధనము నొసఁగువాఁడును, శతసాః=అనేకముగ ధనము నొసఁగువాఁడును, వాజీ=అన్నము కలవాఁడును, అర్వా=కర్మభూమియందు సంచరించు వాఁడునగు, దధిక్రాః=పూర్వము చెప్పఁబడిన దధిక్రావన్నామక దేవుఁడు. జ్యోతిషా=రశ్మిచేత, సూర్యః అపః ఇవ=సూర్యుఁడు నీటినివలె, పఞ్చకృష్టీః=నిషాదవర్ణముతో (=జాతితో) కలిసి ఐదువిధములైన మనుష్యులను, శవసా=అన్నముతో (యోజనచేసి,) ఆతతాన=అంతటను విస్తరింపఁజేసెను. (సః=అట్టి ఆ దేవుఁడు,) మధ్వా=మధురములైన, ఇమాః=ఈ స్తుతిరూపములైన, వచాంసి=వాక్కులను, సంపృణక్తు=బాగుగ నంగీకరించుఁగాక.

తాత్పర్యము: పూర్వోక్త దధిక్రావన్నామక దేవుఁడు నిషాదజాతితో కలిసి యైదు విధములైన వర్ణములుగల మానవులను, అన్నము కల్పించి, సూర్యుఁడు తన కిరణ సముదాయముచే భూరసమును గ్రహించి, వర్షర్తువునందు నీటిని విస్తరింపఁ జేయువిధముగ విస్తరింపఁజేసెను. ఆ దధిక్రావన్నామక దేవుఁడు సహస్ర సంఖ్యాకగమును, అనేక సంఖ్యాకముగను ధనము నొసఁగువాఁడు. అన్నము కలవాఁడు. కర్మభూమియందు సంచరించువాఁడు. అట్టి దేవుఁడు మధురములైన మా యీ స్తుతిరూప వాక్కులను బాగుగ అంగీకరించుఁగాక. (ఈ మంత్రమువలన, మానవులలో నిషాద వర్ణముతో కలిసి అయిదు వర్ణములు సృష్ట్యాదినుండి యున్నట్లు స్పష్టమగుచున్నది. "నిషాద పంచమైః చతుర్భిః వర్ణైః పంచవిధాన్ మానవాన్ ఆతతాన సర్వతో విస్తారయతి" ఇతి విద్యారణ్యభాష్యమ్. ఇది యాజ్య.)

13. అర్థము: "అగ్ని ర్మూర్ధా" అనునది పురోనువాక్యకు ప్రతీక. "భువః యజ్ఞస్య" అనునది యాజ్యకు ప్రతీక. ఈ ప్రతీక ద్వయములో మొదటిది పంచమానువాకమున వ్యాఖ్యానింపఁబడినది. రెండవది చతుర్థకాండమునందలి దగుటచే అచట వ్యాఖ్యానింపఁబడును.

14. అర్థము: హే మరుతః! ఓ దేవతలారా!, యత్ హ=ఏ కారణమువలననైతే (వయమ్=మేము,) సుమ్నాయన్తః=సుఖము కోరుచున్నవారమై, దివః=ద్యులోకమునుండి, వః=మిమ్ము, హవామహే=ఆహ్వానించుచున్నామో!, తూ=ఆ కారణమువలన, ఆ=ఆహూతులైన మీరు, నః=మమ్ము, ఉపగన్తన=పొందుఁడు (=మాయొద్దకు రండు.)

తాత్పర్యము: ఓ దేవతలారా! మేము సుఖము కోరుచున్నవారమై స్వర్గలోకమునుండి మిమ్ము నాహ్వానించుచున్నాము. కావున ఆహూతులైన మీరు మాయొద్దకు విచ్చేయుఁడు. ('ఉపగన్తన' 'సుమ్నాయన్తః' ఇవి ఛాందసములు. ఇది మారుతయాగమునందు పురోనువాక్య.)

15. అర్థము: హే మరుతః!=ఓ దేవతలారా!, వః=మిమ్ము, శశమానాయ=సేవించుచున్న వానికొఱకు, (దాతుమ్=ఇచ్చుటకై,) యా శర్మ=ఏ సుఖములు, (సంపాదితములు,) సన్తి=కలవో, త్రిధాతూని=త్రిలోకములందున్నట్టి ఏ సుఖములను, దాశుషే=హవిస్సు నిచ్చునట్టి యజ్ఞకర్తకొఱకు, అధి యచ్ఛత=అధికమగునట్లుగా (మీరు) ఇచ్చుచున్నారో, తాని=ఆ సుఖములనన్నిటిని, అస్మభ్యమ్=మా కొఱకు, వియన్త=ఒసఁగుఁడు. (మఱియు,) వృషణః=అభిమతఫలము నొసఁగువారై, రయిమ్=ధనమును, నః=మా కొఱకు, ధత్త=సంపాదింపుఁడు. సువీరమ్=(అపి)=మంచి కుమారునిఁగూడ, ధత్త=సంపాదింపుఁడు.

తాత్పర్యము: ఓ దేవతలారా! మిమ్ము సేవించువాని కిచ్చుటకు ఏ సుఖములు సంపాదితములై యున్నవో, లోకత్రయమునందున్న యే సుఖములను మీకు హవిస్సు నిచ్చుయజ్ఞకర్మకు అధికమగునట్లుగ ఒసఁగుచున్నారో!, ఆ సుఖముల నన్నిటిని మాకొసఁగుడు. మఱియు అభిమత ఫలముల నిచ్చునట్టివారై మాకు ధనమును సుపుత్రుని సంపాదింపుఁడు. ('అధి యచ్ఛత', అధికం యథా భవతి తథా భవన్తః ప్రయచ్ఛన్తి' అని విద్యారణ్యభాష్యము. ఇది యాజ్య. యా శర్మ=యాని శర్మాణి.)

16. అర్థము: అదితిః=అదితి దేవత, నః=మమ్ము, ఉరుష్యతు=(శత్రువులనుండి,) రక్షించుఁగాక. అదితిః=అదితి దేవత, శర్మ=సుఖమును, యచ్ఛతు=(మాకు) ఇచ్చుఁగాక. అదితిః=అదితి దేవత, అంహసః=పాపమునుండి, పాతు=(మమ్ము)రక్షించుఁగాక.

తాత్పర్యము: అదితి దేవత మమ్ము శత్రువులనుండి పాపమునుండి రక్షించి సుఖము నొసఁగుగాక.

విశేషములు: సంగ్రామమున విజయము గోరు నతఁడు అదితి దేవతాకమైన యిష్టిని చేయవలెనని "ఆదిత్యం చరుం నిర్వపేత్" అను శ్రుతి చెప్పుచున్నది. ఈ మంత్రము ఆ యిష్టియందలి మొదటి యుగ్మమునందలి పురోనువాక్య. ఇచట అదితి యనఁగా భూదేవత యని యర్థము.

17\. అర్థము: మహీమ్=గొప్పదియు, సువ్రతానామ్=మంచికర్మలు కల పురుషులకు, మాతరమ్=తల్లియు, (తల్లివలె హితకారిణియు,) ఋతస్య=సత్యమునకు, పత్నీమ్=పాలకురాలును, తువిక్షత్రామ్=అనేక రాజులచే పాలింపఁబడినదియు, అజరన్తీమ్=ఎల్లప్పుడు జర లేనిదియు, ఉరూచీమ్=విస్తీర్ణగతి కలదియు, సుశర్మాణమ్=మంచి సుఖముతో కూడియున్నదియు, సుప్రణీతిమ్=సుఖముగ కర్మలను పొందించునదియునగు, అదితిమ్+ఉ=అదితి దేవతనే, అవసే=(మమ్ము) రక్షించుటకొఱకు, సుహువేమ=బాగుగ నాహ్వానించుచున్నాము.

తాత్పర్యము: మమ్ము రక్షించుటకై అదితి దేవతనే ఆహ్వానించుచున్నాము. ఆ యదితి దేవత మంచికర్మలు చేయువారికి తల్లివలె హితమును కలుగఁ జేయునది. సత్యమును కాపాడునది. అనేక రాజులచే పాలింపఁబడినది. ఏ కాలమునందును జర లేనిది. విస్తీర్ణ ప్రదేశము కలది. మంచి సుఖముతోఁ గూడియున్నది. సుఖముగా కర్మలు చేయుట కవకాశమును కలిగించునది. (హువేమ=ఆహ్వయామి. ఇతి విద్యారణ్యభాష్యమ్. ఇది యాజ్య.)

18\. అర్థము: సుత్రామాణమ్=బాగుగ రక్షించునదియు, పృథివీమ్=విస్తీర్ణమైనదియు, ద్యామ్=ప్రకాశించుచున్నదియు, అనేహసమ్=కాలస్వరూపమైనదియు, (=చిరకాలస్థాయిని,) సుప్రణీతిమ్=బాగుగ కర్మలను పొందించునదియు, దైవీం నావమ్=దేవతా నిర్మితమైన నావయు, స్వరిత్రామ్=(సు+అరి+త్రామ్) బాగుగ శత్రువులనుండి రక్షించునదియు, అనాగసమ్=పాప రహితమైనదియు, అస్రవన్తీమ్=ఛిద్ర రహితయునగు, అదితిమ్=భూదేవతను, స్వస్తయే=క్షేమముకొఱకు, ఆరుహేమ=పొందుదుము.

తాత్పర్యము: మేము అదితి (భూ)దేవతను క్షేమముకొఱకు పొందుదుము. ఆ భూదేవత విస్తీర్ణమైనది. ప్రకాశించునది. కాలస్వరూపమైనది. (=సర్వకాలములందుండునది.) బాగుగ కర్మలు చేయుటకు వీలు కలిగించునది. మనుజ నిర్మిత నావ సముద్రముపై నుండువిధముగ దేవతా నిర్మితమైన నావ యనఁదగిన ఈ భూమి మహాజలముపై నుండునది. శత్రువులనుండి బాగుగ రక్షించునది. పాపరహితయు, ఛిద్రరహితయునైనది. (ఇది ద్వితీయ యుగ్మమునందలి పురోనువాక్య.)

19\. అర్థము: శతారిత్రామ్=శత్రువులనుండి రక్షించు సాధనములు శతసంఖ్యాకముగఁగలదియు, శతస్ఫ్యామ్=శత సంఖ్యాకములైన స్ఫ్య సదృశ తరణ దండములు కలదియు, అచ్ఛిద్రామ్=రంధ్రములు లేనిదియు, పారయిష్ణుమ్=అభీష్టఫలమును సంపూర్ణముగ పొందించుటకు సమర్థమైనదియునగు, ఇమాం నావమ్=నావవంటి యీ భూమిని, స్వారుహమ్=(సు+ఆరుహమ్) బాగుగ పొందినవాఁడ నగుచున్నాను.

తాత్పర్యము: నావవంటి యీ భూమిని బాగుగ పొందినవాఁడ నగుచున్నాను. నావవంటి యీ భూమి శత్రువులనుండి రక్షించుటకు సాధనములయిన ఆయుధములు కలది. (=దిక్పాలకులచే పాలింపఁబడినది.) 'స్ఫ్యము' వంటి తరణ దండములు కలది. రంధ్రములు లేనిది. అభీష్టఫలదాత్రి. (తరణ దండము=నీటిలో నావను నడుపుటకు సాధనమైన తెడ్డు. స్ఫ్యము=కొయ్యతో నిర్మింపఁబడిన ఖడ్గవిశేషము. ఇది యాజ్య.)

పంచమ ప్రపాఠకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే షష్ఠః ప్రపాఠకః।

తత్ర ప్రథమోఽనువాకః।

హరిః ఓమ్

మూలము: [1]సం త్వా సిఞ్చామి యజుషా ప్రజా మాయు ర్ధనం చ। బృహస్పతిప్రసూతో యజమాన ఇహ మా రిషత్। [2]ఆజ్య మసి సత్య మసి సత్యస్యా ధ్యక్ష మసి హవి రసి వైశ్వానరం వైశ్వదేవ ముత్పూతశుష్మగ్ం సత్యౌజా స్సహో ఽసి సహమాన మసి సహస్వారాతీ స్సహస్వారాతీయత స్సహస్వ పృతనా స్సహస్వ పృతన్యతః। సహస్రవీర్య మసి తన్మాజిన్వా ఽఽజ్యస్యా ఽఽజ్య మసి సత్యస్య సత్య మసి సత్యాయుః (౧)అసి సత్యశుష్మ మసి సత్యేన త్వా ఽభిఘారయామి తస్య తే భక్షీయ [3]పఞ్చానాం త్వా వాతానాం యన్త్రాయ ధర్త్రాయ గృహ్ణామి పఞ్చానాం త్వ ర్తూనాం యన్త్రాయ ధర్త్రాయ గృహ్ణామి పఞ్చానాం త్వా దిశాం యన్త్రాయ ధర్త్రాయ గృహ్ణామి పఞ్చానాం త్వా పఞ్చజనానాం యన్త్రాయ ధర్త్రాయ గృహ్ణామి చరో స్త్వా పఞ్చబిలస్య యన్త్రాయ ధర్త్రాయ గృహ్ణామి బ్రహ్మణ స్త్వా తేజసే యన్త్రాయ ధర్త్రాయ గృహ్ణామి క్షత్రస్య త్వౌజసే యన్త్రాయ (౨)ధర్త్రాయ గృహ్ణామి విశే త్వా యన్త్రాయ ధర్త్రాయ గృహ్ణామి సువీర్యాయ త్వా గృహ్ణామి సుప్రజాస్త్వాయ త్వా గృహ్ణామి రాయస్పోషాయ త్వా గృహ్ణామి బ్రహ్మవర్చసాయ త్వా గృహ్ణామి భూ రస్మాకగ్ం హవి ర్దేవానా మాశిషో యజమానస్య దేవానాం దేవతాభ్యో గృహ్ణామి కామాయ త్వా గృహ్ణామి ॥౩॥

(సత్యాయు రోజసే యన్త్రాయ త్రయస్త్రిగ్ంశ చ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే షష్ఠప్రపాఠకే ప్రథమోఽనువాకః।

అవతారిక: ఈ ప్రథమానువాకమునందు ఆజ్య గ్రహణానుమంత్రణము చెప్పఁబడుచున్నది.

1. అర్థము: (హే స్కన్నాజ్య!=ఓ స్కన్నమైన ఆజ్యమా!) బృహస్పతి ప్రసూతః=బృహస్పతిచే ప్రేరితుఁడనైన, (అహమ్=నేను,) ఆయుః=ఆయువును, చ=మఱియు, ధనమ్=ధనమును, (సంపాదయేయమ్=సంపాదించెదను.) త్వా=నిన్ను, యజుషా=(ఈ) మంత్రముచేత, (పాత్రే=పాత్రమునందు,) సం సిఞ్చామి=బాగుగ ఉంచుచున్నాను. ఇహ=ఈ కర్మయందు, యజమానః=యజ్ఞకర్త, (త్వా=నిన్ను,) మా రిషత్=హింసింపకుండుగాక.

తాత్పర్యము: (స్కన్నాజ్యము=హోమ పాత్రమునందు పోయునపుడు క్రింద పడిన నేయి.) ఓ స్కన్నాజ్యమా! నేను బృహస్పతిచే ప్రేరితుఁడనై ఆయువును ధనమును సంపాదించెదను. ఈ మంత్రము నుచ్చరించుచు నిన్ను పాత్రమునందు బాగుగ ఉంచుచున్నాను. (హోమపాత్రమునందు పోయునపుడు పరిశుద్ధ ప్రదేశమునందు పడిన ఆజ్యమును మఱల పాత్రములోనికి తీసికొనుచు ఈ మంత్రమును పఠించవలెను.)

2. అర్థము: ("వైశ్వానరమ్" ఇత్యాది పద చతుష్టయముతో 'అసి' అను క్రియాపదమును ప్రత్యేకముగ అనువర్తింపఁజేసి, అన్వయము చేయవలెను. ఇట్లు చేయగా ఈ మంత్రములో ఇరువది రెండు వాక్యము లేర్పడును. ఈ యిరువదిరెండు వాక్యములచేత ఆజ్యము ప్రశంసింపఁబడుచున్నది.) హే ఆజ్య! ఓ ఘృతమా! త్వమ్=నీవు,) ఆజ్యమ్=ప్రాపకము, అసి=అగుచున్నావు. (గత్యర్థకమైన 'అజ' ధాతువునుండి ఆజ్య శబ్దముత్పన్నమైనది. హోమాధారమైన జ్వలించునగ్ని ఘృతముచే పొందఁబడుచున్నదని భావము.) సత్యమ్=విద్యమాన కర్మఫలమునకు అర్హమైనదానవు, (=కర్మఫలసాధనము,) అసి=అగుచున్నావు. సత్యస్య=సత్పురుషుల కర్మకు, అధ్యక్షమ్=స్వామివి, అసి=అగుచున్నావు. (జ్యోతిష్టోమ యాగమునందు ప్రవర్తించునట్టి ఋత్విజులు యజ్ఞకర్తతో కలిసి పదునేడుగురు. వారు పరస్పర ద్రోహశంకను పోగొట్టుకొనుటకై 'తానూనప్త్రి' మనెడి అగ్నిని స్పృశింతురు. ఆ స్పర్శ సత్పురుషుల కర్మ. కావున వారు సత్పురుషులు. ఆ కర్మకు స్వామివని భావము.) హవిః=(ప్రధానముగా) హోమము చేయఁబడుదానవు, అసి=అగుచున్నావు. (అగ్నియందు వేల్చఁబడు ఆజ్య పురోడాశాదులలో ఆజ్యము ప్రధానమైనది. అనఁగా=పురోడాశాది హవిస్సులు నశించినను ఆజ్యముచేతనే తత్కర్మ శేషము సమాప్తమగును. కావున హవిస్సులలో ఆజ్యమునకు ప్రాధాన్య మేర్పడినది.) వైశ్వానరమ్=సమస్త నరులకు సంబంధించిన దానవు, అసి=అగుచున్నావు. వైశ్వదేవమ్=సమస్తదేవతలకు సంబంధించినదానవు, అసి=అగుచున్నావు. (ఆజ్యము మానవులకు భోజ్యముగను, దేవతలకు హవిస్సుగను, ఉపయోగింపఁబడుటచే అగ్నికి తత్తత్సంబంధ మేర్పడినది.) ఉత్పూత శుష్మమ్=ఉత్పవనముచేత ఉద్దీపిత బలము కలదానవు, అసి=అగుచున్నావు. సత్యౌజాః=సత్యమైన బలము కలదానవు, అసి=అగుచున్నావు. (అగ్న్యుద్దీపనముచే ఆజ్యబలము వ్యర్థము కానిదని భావము.) సహః=శత్రువులను పరాభవించుటకు సమర్థమైనదానవు, అసి=అగుచున్నావు. సహమానమ్=నిరంతరము శత్రుపరాభవము చేయుటయందే ఉంటున్నదానవు, అసి=అగుచున్నావు.

(సః త్వమ్=అటువంటి నీవు,) అరాతీః=(మా) శత్రువులను, సహస్వ=పరాభవించుము. అరాతీయతః=(ప్రత్యక్షముగ శత్రుత్వము కోరుట కశక్తులై మానసికముగ,) శత్రుత్వమును కోరువారిని, సహస్వ=పరాభవించుము. పృతనాః=శత్రుసేనలను, సహస్వ=పరాభవించుము. సహస్రవీర్యమ్=శత్రుపరాభవకరణరూప బహువిధ సామర్థ్యము కలదానవు, అసి=అగుచున్నావు. తత్=అటువంటి స్వభావము కల (త్వమ్=నీవు,) మా=నన్ను, జిన్వ=(యాగము మూలమున,) సంతోషపఱచుము. ఆజ్యమ్=(లోకసంబంధమైన,) ఆజ్యమునకు, ఆజ్యమ్=(ముఖ్యమైన) ఆజ్యము, అసి=అగుచున్నావు. (ఇచట వర్ణింపఁబడిన ఆజ్యము యజ్ఞసంబంధి, ఉత్పూతశుష్మము నగుటచే లౌకికాజ్యముకంటె శ్రేష్ఠమైనదని భావము.) సత్యస్య=సత్యమునకు, సత్యమ్=ముఖ్యసత్యము, అసి=అగుచున్నావు. (ఇచట సత్యమనఁగా లౌకిక ఫలసాధనమైన కృష్యాదికము. అది ఒకానొకప్పుడు వర్షాద్యభావముచేత ఫలింపక వ్యర్థమగును. కావున అది ముఖ్యము కాదు. ఆజ్యము ఒకప్పుడును వ్యర్థముకాదు. కావున ముఖ్యసత్య మగును.) సత్యాయుః=

సత్యరూపమైన ఆయువు కలదానవు, అసి=అగుచున్నావు. (ఆజ్యముచే నిష్పన్నమైన కర్మచే ప్రాప్తమైన భావి దేహమునందు ప్రాప్తించునట్టి ఆయువు వ్యర్థము కానిది కావున ఇచట ఆయువునకు సత్యత్వము చెప్పఁబడినది.) సత్యశుష్మమ్=సత్యమైన బలము కలదానవు, అసి=అగుచున్నావు. త్వా=నిన్ను, సత్యేన=సత్యరూపమైన ఆజ్యముచే, అభిఘారయామి=అభిఘరించుచున్నాను. (అభిఘరించుట=ప్రోక్షించుట.) తస్య=అటువంటి, తే=నిన్ను, (ద్వితీయార్థే షష్ఠీ.) భక్షీయ=పొందుదును. (=కంటితో చూచుచున్నాను. తాత్పర్యము అర్థమునందే వివరింపఁబడినది. ఉత్పవనము=హోమపాత్రమందలి ఆజ్యమును బర్హిరాదులచే ముందు వెనుకలకు కదలించి పవిత్రము చేయుట.)

అర్థము: (హే ఆజ్య!=ఓ స్కన్నాజ్యమా!, పఞ్చానాం వాతానామ్=ప్రాచ్యాది ఊర్ధ్వాంత దిక్కులైదింటియందలి వాయువులయొక్క, లేదా-శరీరము నందలి ప్రాణా పాన వ్యానో దాన సమానము లనెడి అయిదు వాయువులయొక్క, యన్త్రాయ=వాని వాని వ్యాపారములందు నియమించుట కొఱకును, ధర్త్రాయ=జగద్విధారణ కౌశల్యము కొఱకును, త్వా=నిన్ను, గృహ్ణామి=గ్రహించుచున్నాను. పఞ్చానామ్=అయిదైన, ఋతూనామ్=ఋతువులయొక్క, యన్త్రాయ=నియమనముకొఱకు, ధర్త్రాయ=జగద్విధారణ కౌశల్యముకొఱకు, త్వా=నిన్ను, గృహ్ణామి=గ్రహించుచున్నాను. ("ద్వాదశ మాసాః పఞ్చర్తవః హేమన్త శిశిరయో స్సమాసేన" అను ఐతరేయ బ్రాహ్మణమునందు హేమన్త శిశిరఋతువుల నొకటిగాఁ జేసి సంవత్సరమున కైదు ఋతువులని చెప్పఁబడినది.) పఞ్చానాం దిశామ్=ప్రాక్ పశ్చిమ దక్షిణోత్తరోర్ధ్వ దిక్కులైదింటియొక్క, యన్త్రాయ=వాని వాని వ్యాపారములందు నియమించుటకొఱకు, ధర్త్రాయ=జగద్విధారణ కౌశల్యము కొఱకును, త్వా=నిన్ను, గృహ్ణామి=గ్రహించుచున్నాను. పఞ్చానాం పఞ్చజనానామ్=అయిదుగురైన దేవ మనుష్యా సుర రక్షో గంధర్వులయొక్క, యన్త్రాయ, ధర్త్రాయ, త్వా, గృహ్ణామి. పఞ్చబిలస్య=అయిదు రంధ్రములుగల, చరోః='చరువు' అనెడి హవిస్సున కాధారమైన పాత్రముయొక్క, యన్త్రాయ, ధర్త్రాయ, త్వా, గృహ్ణామి. (చరుపాత్రము కొన్నిచోట్ల పంచ బిలములతో కూడియుండునదిగా కల్పసూత్రకారుఁడు పురుషమేధావసాన ఘట్టమునందు వర్ణించి యుండెను.) బ్రహ్మణః=బ్రాహ్మణ జాతియొక్క, తేజసే=(శిష్టాంగీకృత సాధువేష రూపమైన,) బ్రహ్మవర్చస్సుకొఱకు, యన్త్రాయ, ధర్త్రాయ, త్వా, గృహ్ణామి. క్షత్రస్య తు=క్షత్రియ జాతికైనచో, ఓజసే=యుద్ధ సామర్థ్యము కొఱకు, యన్త్రాయ, ధర్త్రాయ, త్వా, గృహ్ణామి. విశే=వైశ్యజాతి కొఱకు, (కృషి వాణిజ్యాదుల యందు,) యన్త్రాయ, ధర్త్రాయ, త్వా, గృహ్ణామి. సువీర్యాయ=అందఱకు స్వస్వ వ్యాపారములయందు సామర్థ్యాతిశయము కొఱకు, త్వా, గృహ్ణామి. సుప్రజాస్త్వాయ=మంచి సంతానము కొఱకు, త్వా, గృహ్ణామి. రాయస్పోషాయ, ధనసమృద్ధికొఱకు, త్వా, గృహ్ణామి. బ్రహ్మవర్చసాయ=వేదాధ్యయన సంపత్తికొఱకు, త్వా, గృహ్ణామి.

(హే ఆజ్య! ఓ ఆజ్యమా!, త్వమ్=నీవు,) అస్మాకమ్=మా యొక్క, (శ్రేయసే=శ్రేయస్సుకొఱకు,) భూః=అగుము. దేవానామ్=దేవతలకు, హవిః=హవిస్సువు, భూః=అగుము. యజమానస్య=యజ్ఞకర్తకు, ఆశిషః=ఆశీస్సులుగా, భూః=అగుము. దేవానామ్=దేవతలకు, తర్పకమ్=తృప్తిని కలుగజేయునట్టి, త్వా=నిన్ను, దేవతాభ్యః=దేవతలకొఱకు, గృహ్ణామి=గ్రహించుచున్నాను. (హే ఆజ్య!=ఓ ఆజ్యమా!,) కామాయ=(హవిర్భోక్తలగు దేవతల) కోరికకొఱకు, త్వా=నిన్ను, గృహ్ణామి=గ్రహించుచున్నాను. (తాత్పర్యము అర్థమునందే వివరింపఁబడినది. "బ్రహ్మవర్చసాయ" ఇది బ్రహ్మవర్చస శబ్దమునకు చతుర్థ్యంతము నపుంసక లింగము.)

ప్రథమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే పఞ్చమప్రపాఠకే ద్వితీయోఽనువాకః।

మూలము: [1]ధ్రువో ఽసి ధ్రువో ఽహగ్ం సజాతేషు భూయాసం ధీర శ్చేత్తా వసువి దుగ్రో ఽస్యుగ్రో ఽహగ్ం సజాతేషు భూయాస ముగ్ర శ్చేత్తా వసువి దభిభూ రస్యభిభూ రహగ్ం సజాతేషు భూయాస మభిభూ శ్చేత్తా వసువి [2]ద్యునజ్మి త్వా బ్రహ్మణా దైవ్యేన హవ్యాయాస్మై వోఢవే జాతవేదః। [3]ఇన్ధానా స్త్వా సుప్రజస స్సువీరా జ్యోగ్ జీవేమ బలిహృతో వయం తే। [4]యన్మే అగ్నే అస్య యజ్ఞస్య రిష్యాత్ (౧)యద్వా స్కన్దా దాజ్యస్యోత విష్ణో। తేన హన్మి సపత్నం దుర్మరాయుమైనం దధామి నిరృత్యా ఉపస్థే। [5]భూ ర్భువ స్సువ [6]రుచ్ఛుష్మో అగ్నే యజమానాయైధి నిశుష్మో అభి దాసతే। అగ్నే దేవేద్ధ మన్విద్ధ మన్ద్రజిహ్వ [7]మర్త్యస్య తే హోత ర్మూర్ధ న్నా జిఘర్మి రాయస్పోషాయ సుప్రజాస్త్వాయ సువీర్యాయ [8]మనో ఽసి ప్రాజాపత్యం మనసా మా భూతేనా ఽఽవిశ [9]వాగ స్యైన్ద్రీ సపత్నక్షయణీ (౨)వాచా మే న్ద్రియేణా ఽఽవిశ [10]వసన్త మృతూనాం ప్రీణామి స మా ప్రీతః ప్రీణాతు గ్రీష్మ మృతూనాం ప్రీణామి స మా ప్రీతః ప్రీణాతు వర్షా ఋతూనాం ప్రీణామి తా మా ప్రీతాః ప్రీణన్తు శరద మృతూనాం ప్రీణామి సా మా ప్రీతా ప్రీణాతు హేమన్తశిశిరా వృతూనాం ప్రీణామి తౌ మా ప్రీతౌ ప్రీణీతా [11]మగ్నీషోమయో రహం దేవయజ్యయా చక్షుష్మా న్భూయాస [12]మగ్నే రహం దేవయజ్యయా ఽన్నాదో భూయాసమ్ (౩)[13]దబ్ధి రస్యదబ్ధో భూయాస మముం దభేయ [14]మగ్నీషోమయో రహం దేవయజ్యయా వృత్రహా భూయాస [15]మిన్ద్రాగ్నియో రహం దేవయజ్యయే న్ద్రియా వ్యన్నాదో

భూయాస [16]మిన్ద్రస్యాహం దేవయజ్యయే న్ద్రియావీ భూయాసం [17]మహేన్ద్రస్యాహం దేవ యజ్యయా జేమానం మహిమానం గమేయ [18]మగ్నే స్స్విష్టకృతో ఽహం దేవయజ్యయా ఽఽయుష్మా న్యజ్ఞేన ప్రతిష్ఠాం గమేయమ్। ॥౪॥

(రిష్యా త్సపత్నక్షయణ్యా న్నాదో భూయాసగ్ం షట్త్రిగ్ంశ చ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే షష్ఠప్రపాఠకే ద్వితీయోఽనువాకః॥

వేదార్థ దీపిక

అవతారిక: ప్రథమానువాకమునందు ఆజ్యగ్రహణానుమంత్రణము విహిత మైనది. ఈ ద్వితీయానువాకమునందు హవి ర్హోమాను మంత్రణము చెప్పఁబడుచున్నది. అందు ప్రథమమున హోమము చేయఁబడుచున్న హవిస్సునకు బహిస్స్కందన (వెలుపల చిందుట) నివారణమునకై హోమవేదియందు పఱచఁబడిన పరిధులకు అనుమంత్రణము చెప్పఁబడుచున్నది.

1. **అర్థము:** (హే మధ్యమ పరిధే!=ఓ మధ్యమ పరిధీ!, త్వమ్=నీవు,) ధ్రువః=స్థిరమైనదానవు, అసి=అగుచున్నావు. (తస్య తవ అను మంత్రణేన=అట్టి స్థిరమైన నిన్ను అనుమంత్రించుటచే) అహమ్=నేను, సజాతేషు=జ్ఞాతుల యందు, ధ్రువః=స్థిరమైనవాఁడను, భూయాసమ్=అగుదును. (అపి చ=మఱియు,) ధీరః=ధైర్యవంతుఁడను, చేత్తా=రాక్షస హననము తెలిసినవాఁడను, వసువిత్=ధనమును పొందువాఁడను, భూయాసమ్=అగుదును. (హే దక్షిణ పరిధే!=ఓ దక్షిణ పరిధీ!, త్వమ్=నీవు,) ఉగ్రః=తీవ్రమైనదానవు, అసి=అగుచున్నావు. అహమ్ (అపి)=నేను గూడ, సజాతేషు=జ్ఞాతులయందు, (తవ అనుమంత్రణేన=నిన్ను అను మంత్రించుటచే,) ఉగ్రః=ఉగ్రుఁడను, భూయాసమ్=అగుదును. (అపి చ=మఱియు,) చేత్తా, వసువిత్, భూయాసమ్. (హే ఉత్తర పరిధే!=ఓ ఉత్తరపరిధీ!, త్వమ్=నీవు,) అభిభూః=(రాక్షసులను.) తిరస్కరించుదానవు, అసి=అగుచున్నావు. అహమ్ (అపి)=నేను కూడ, సజాతేషు=జ్ఞాతులయందు, (తవ అనుమంత్రణేన,) అభిభూః=(రాక్షసాదులను) తిరస్కరించువాఁడను, చేత్తా, వసువిత్, భూయాసమ్=అగుదును.

తాత్పర్యము: ఓ మధ్యమ పరిధీ! నీవు రాక్షసులచే కదలింపఁబడని దానవగుటచే స్థిరమైనదాన వగుచున్నావు. అట్టి నిన్ను అనుమంత్రించుటచే నేను కూడ జ్ఞాతులలో స్థిరమైనవాఁడను, ధీరుఁడను, రాక్షసహననము తెలిసినవాఁడను, ధనమును పొందువాఁడను అగుదును. ఓ దక్షిణ పరిధీ! నీవు రాక్షస హననవిషయమున ఉగ్రమైనదానవు అగుచున్నావు. అట్టి నిన్ను అనుమంత్రించుటచే నేను కూడ జ్ఞాతులలో ఉగ్రుఁడను, రాక్షసహననము తెలిసినవాఁడను, ధనము పొందువాఁడను అగుదును. ఓ యుత్తర పరిధీ! నీవు రాక్షసులను పరిభవించు దాన వగుచున్నావు. అట్టి నిన్ను అనుమంత్రించుటచే నేను కూడ జ్ఞాతులను పరిభవించువాఁడను, రక్షో హననము తెలిసినవాఁడను, ధనమును పొందువాఁడను అగుదును. ('ధ్రువోఽసి' త్యాది మంత్రములు మూఁడు భాగములుగా నున్నవి. ఆ మూఁడు మంత్రభాగములచే వరుసగ మధ్యమ దక్షిణో త్తర పరిధుల ననుమంత్రించవలెను.

2. అర్థము: హే జాతవేదః=ఓ యగ్నీ! త్వా=నిన్ను, దైవ్యేన=దేవయోగ్యమైన, బ్రహ్మణా=మంత్రముచేత, త్వా=నిన్ను, అస్మై హవ్యాయ=ఈ హవిస్సును, (ద్వితీయార్థే చతుర్థీ.) వోఢవే=వహించుటకొఱకు, యునజ్మి=ఈ కర్మయందు లగ్నమైన వానినిగా చేయుచున్నాను.

తాత్పర్యము: ఓ యగ్నీ! నిన్ను దేవతలకు యోగ్యమైన మంత్రముచే ఈ హవిస్సును వహించుటకు ఈ కర్మయందు లగ్నమైన వానినిగా చేయుచున్నాను. (అగ్నిని కర్మయందు నిమగ్నునిగా చేయవలెను.)

3. అర్థము: (హే జాతవేదః=ఓ యగ్నీ!,) త్వా=నిన్ను, ఇన్ధానాః=జ్వలింపఁజేయుచున్న, వయమ్=మేము, తే=నీకు, బలిహృతః=పూజచేయుచున్న వారమై, సుప్రజసః=మంచి సంతానము కలవారమును, సువీరాః=మంచి భృత్యులు కలవారమునై, జ్యోక్=చాలకాలము, జీవేమ=జీవింతుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! నిన్ను జ్వలింపఁజేయుచున్న మేము నీకు పూజ చేయుచు మంచి సంతానము భృత్యులు కలవారమై చిరకాలము జీవింతుము గాక. (ఈ మంత్రము చెప్పుచు సమిధలను జ్వలింపఁ జేయవలెను.)

4. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ!, మే=నా యొక్క, అస్య యజ్ఞస్య=ఈ యజ్ఞమునకు సంబంధించిన, యత్=ఏ బర్హిస్సు మొదలగునది, రిష్యాత్=నశించునో, (=రాక్షసాదులచే నశింపఁ జేయఁబడునో,) ఆజ్యస్యోత=ఆజ్యమునకు కూడ సంబంధించినదియు, యద్వా=జుహువు మొదలగు హోమసాధనములకు సంబంధించిన ఏ అల్పబిందు సముదాయమైనను, స్కన్దాత్=క్రింద పడునో!, హే విష్ణో!=వ్యాపకుఁడవైన ఓయగ్నీ!, తేన=నష్టమైనదియు, క్రింద పడినదియునగు ఆ బిందుజాతముచేత, దుర్మరాయుమ్=మరణింపఁ జేయుట కశక్యుఁడైన, సపత్నమ్=శత్రువును, హన్మి=చంపుచున్నాను. ఏనమ్=ఈ శత్రువును, నిర్ ఋత్యాః=పాప దేవతయొక్క, ఉపస్థే=ఉత్సంగమునందు, ఆదధామి=ఉంచుచున్నాను.

తాత్పర్యము: వ్యాపకుఁడవైన ఓ యగ్నీ! నా యీ యజ్ఞమునకు సంబంధించిన బర్హిస్సు మొదలగున దేది రాక్షసాదులచే నశింపఁజేయఁబడునో, జుహువు మొదలగు హోమసాధనములందలి ఆజ్యమునకు సంబంధించిన యే బిందు సముదాయము క్రింద జారిపడునో దుర్మరణుఁడైన శత్రువును ఆ బిందుజాతముచే చంపుదును. ఈ శత్రువును పాపదేవత యుత్సంగమున నుంచుచున్నాను. (వేది మధ్యమందున్న హవిస్సుల నభిమంత్రించవలెను.)

5. అర్థము: (ఈ భూరాది శబ్దములు మూఁడు భూలోక భువర్లోక సువర్లోక వాచకములు. ఏతాని. హవీంషి=ఈ హవిస్సులు,) భూః, భువః, సువః=భూ ర్భువ స్సువ ర్లోకరూపములు.

తాత్పర్యము: ఈ హవిస్సులు భూరాదిలోకత్రయ రూపములుగా స్తుతింపఁబడుచున్నవి. (ఈ మూఁడు వ్యాహృతులచేతను అగ్నిహోత్రమును ఆసాదనము చేయవలెను.)

6. అర్థము: దేవేద్ధ!=దేవతలచే దీపింపఁ జేయఁబడినవాఁడవును, మన్విద్ధ!=మనువుచే దీపింపఁ జేయఁబడినవాఁడవును, మన్ద్రజిహ్వః=హర్ష హేతువులైన నాలుకలు కలవాఁడవును నగు, హే అగ్నే!=ఓ యగ్నీ!, యజమానాయ=యజ్ఞకర్తకొఱకు, ఉచ్ఛుష్మః=ఆవిష్కరింపఁజేసిన (=వ్యక్తము చేసిన,) బలము కలవాఁడవై, ఏధి=వృద్ధి నొందుము. అభిదాసతే=క్షీణించుచున్న శత్రువుకొఱకు, నిశుష్మః=గుప్తము చేయఁబడిన బలము కలవాఁడవై, ఏధి=వృద్ధినొందుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు దేవతలచేతను మనువుచేతను జ్వలింపఁ జేయఁబడిన వాఁడవు. నీ నాలుకలు హర్షహేతువులు. అట్టి నీవు యజమానునికొఱకు నీ బలమును వ్యక్తము చేయుచు వృద్ధి నొందుము. క్షీణించుచున్న బలము గల శత్రువు విషయమున నీ బలము నభివ్యక్తము చేయకుండ వృద్ధినొందుము. (అగ్నియం దుంచుచున్న ఇధ్మమును అభిమంత్రించవలెను.)

7. మంత్రము: హేహోతః! =(దేవతలను) ఆహ్వానించునట్టి ఓ యగ్నీ!, అమర్త్యస్య=మరణ రహితుఁడవైన, తే=నీయొక్క, మూర్ధన్=శిరస్సునందు, రాయస్పోషాయ=ధన సమృద్ధికొఱకు, సుప్రజాస్త్వాయ=మంచి సంతానముకొఱకు, సువీర్యాయ=యోగ్య భృత్యులకొఱకును, ఆజిఘర్మి=(ఘృతాదికమును,) స్రవింపఁ జేయుచున్నాను.

తాత్పర్యము: దేవతల నాహ్వానించునట్టి అగ్నీ! అమర్త్యుఁడవైన నీ శిరస్సునందు యజమానుని ధనసమృద్ధికొఱకు సుసంతానము సుభటుల నిమిత్తము, ఘృతాదికమును స్రవింపఁ జేయుచున్నాను. ('ప్రవర' అను యజ్ఞసాధనమును అభిమంత్రించవలెను.)

8. అర్థము: (హే స్రౌవాఘార!=స్రువములోని ఆఘారమనెడి ఆజ్యమా!, త్వమ్=నీవు,) మనః=మనస్సువు, ప్రాజాపత్యమ్=ప్రజాపతి సంబంధివియు, అసి=అగుచున్నావు. భూతేన=ప్రజాపతిచే సృజింపఁబడిన యజ్ఞముతోడను, మనసా=(ఆ యజ్ఞసాధనమైన,) మనస్సుతోడను, మా=నన్ను, ఆ విశ=ప్రవేశించుము.

తాత్పర్యము: స్రువమునందలి ఆఘార మనెడి ఆజ్యమా! నీవు మనస్సువు, ప్రజాపతి సంబంధివియు నగుచున్నావు. ప్రజాపతి సృష్టమైన యజ్ఞముతోను, మనస్సుతోను, నన్ను ఆవహింపుము. (స్రువము=యజ్ఞసాధనము. అందలి ఆజ్యవిశేషమునకు 'ఆఘార'మని వ్యవహారము. అధ్వర్యుఁడు మనస్సుచే ప్రజాపతిని ధ్యానించుచుండఁగా నిష్పన్నమైనది, కావున ఆఘారాజ్యము మనస్స్వరూపముగా వర్ణింపఁబడినది. ఇట భూతశబ్దము ప్రజాపతి సృష్ట యజ్ఞవాచకము. ఆ యజ్ఞమునకు మనస్సు సాధనము. ఈ మంత్రము నుచ్చరించుచు స్రువమునందలి ఆఘారాజ్యము నభిమంత్రించవలెను. ఆఘారశబ్దార్థము 1. ప్ర. 12 అను. 6వ మంత్రమున వివరింపఁబడినది.)

9. అర్థము: (హే స్రుచ్యాఘార!=స్రుచమునందలి అఘారాజ్యమా!, త్వమ్=నీవు,) ఐన్ద్రీ=ఇంద్ర సంబంధియు, సపత్నక్షయణీ=శత్రుక్షయము చేయునదియునగు, వాక్=వాక్స్వరూపము, అసి=అగుచున్నావు. వాచా=ఆర్ద్ర వాక్కుతోడను, ఇంద్రియేణ=ఇంద్ర సృష్టమైన చక్షురాదికమైన యింద్రియముతోడను, మా=నన్ను, ఆవిశ=ఆవహించుము.

తాత్పర్యము: స్రుచమునందలి అఘారాజ్యమా! నీవు ఇంద్రసంబంధియు, శత్రుక్షయకారిణియునగు వాక్స్వరూపము అగుచున్నావు. నీవు ఆర్ద్ర వాక్కుతోడను ఇంద్రసృష్ట చక్షురాదీంద్రియముతోడను, నన్ను ఆవహించుము. (స్రుచము=హోమసాధనవిశేషము. అందలి ఆజ్యవిశేషమునకు అఘార మనిపేరు. ఇది వాక్స్వరూపముగా వర్ణింపఁబడినది. ఈ మంత్రము చెప్పుచు స్రుచ్యాఘారాజ్యము నభిమంత్రించవలెను.)

10. అర్థము: ఋతూనామ్=ఋతువులలో, వసన్తమ్=వసంతఋతువును, ప్రీణామి=సంతోష పఱచుచున్నాను. ప్రీతః=సంతసించిన, సః=ఆ వసంతర్తువు, మా=నన్ను, ప్రీణాతు=సంతోష పఱచుఁగాక. ఋతూనామ్=ఋతువులలో, గ్రీష్మమ్=గ్రీష్మర్తువును, ప్రీణామి=సంతోష పఱచుచున్నాను. ప్రీతః సః=సంతోషించిన ఆ గ్రీష్మర్తువు, మా=నన్ను, ప్రీణాతు=సంతోష పఱచుఁగాక. ఋతూనామ్=ఋతువులలో, వర్షాః=వర్షఋతువును, ('వర్షా' శబ్దము నిత్యబహువచనము.) ప్రీణామి=సంతోష పెట్టుచున్నాను. ప్రీతాః తాః=సంతసించిన ఆ వర్షర్తువు, మా=నన్ను, ప్రీణన్తు=సంతోష పఱచుఁగాక. ఋతూనామ్, శరదమ్=శరదృతువును, ప్రీణామి. ప్రీతా, సా=సంతోషించిన ఆ శరదృతువు, మా, ప్రీణాతు. ఋతూనామ్, హేమన్త శిశిరౌ=హేమన్త శిశిర ఋతువులను, ప్రీణామి. ప్రీతౌ తౌ=సంతోషించిన ఆ హేమంత శిశిర ఋతువులు, మా, ప్రీణీతామ్.

తాత్పర్యము: ఇట ఋతు వాచకము లయిన వసంతాది శబ్దములచేత సమిద్యాగాది పంచ ప్రయాజాభిమాని దేవతలు వివక్ష చేయఁబడుచున్నారు. వసంతాది శబ్దములచే సూచింపఁబడిన ఆ పంచప్రయాజాభిమాని దేవతలను నేను సంతోష పఱచుచున్నాను. సంతుష్టి చెందిన ఆ దేవతలు నన్ను సంతోషపఱచుదురుగాక. (హేమంత శిరములు ఒక్కటే యను అర్థమును సూచించుటకై అవి ద్వివచనాంతముచే చెప్పఁబడినవి.

11. అర్థము: అహమ్=నేను, (=యజమానుఁడు) అగ్నీషోమయోః=అగ్నీషోమ దేవతాకములైన ఆజ్యభాగములకు సంబంధించిన, దేవయజ్యయా=మంత్రపూర్వకమైన ఆజ్యభాగాహుతిచేత, చక్షుష్మాన్=చక్షుష్మంతుఁడను, భూయాసమ్=అగుదునుగాక.

తాత్పర్యము: అగ్నీషోమ దేవతాకములైన ఆజ్యభాగముల సంబంధియగు సమంత్రకమైన ఆజ్యాహుతిచే నేను చక్షుష్మంతుఁడ నగుదునుగాక యని యజమానుఁడు ప్రార్థించుచున్నాఁడు. (ఈ మంత్రముచే యజమానుఁడు ఇష్టియందు ఆజ్యభాగముల ననుమంత్రించవలెను.)

12. అర్థము: అహమ్=నేను, (=యజమానుఁడు) అగ్నేః=అగ్నికి, దేవయజ్యయా=మంత్రపూర్వకమైన ఆజ్యాహుతిచేత, అన్నాదః=అన్నభోక్తను, భూయాసమ్=అగుదునుగాక.

తాత్పర్యము: దర్శపూర్ణమాస యాగములలో మొదటిది ప్రధానయాగము. ఆ యాగమునకు అగ్ని దేవత. ఆ యగ్ని అన్నభక్షకుఁడు. అట్టి యగ్నిదేవునకు మంత్రపూర్వకముగ ఆజ్యము నాహుతిచేయుటచే యజమానునకు అన్నాదత్వము లభించునని భావము. (ఈ మంత్రముచే అగ్నిని అనుమంత్రించవలెను.)

13. అర్థము: (హే ఉపాంశు యాగ దేవ!=ఉపాంశు యాగాభిమానివగు దేవా!, త్వమ్=నీవు,) దబ్ధిః=(మేము ద్వేషించు శత్రువునకు,) హింసకుఁడవు, అసి=అగుచున్నావు. అదబ్ధః=(నీ యనుగ్రహమువలన నేను వైరులచే,) హింసింపఁబడనివాఁడను, భూయాసమ్=అగుదును. అముమ్=నన్ను ద్వేషించుచున్న ఈ శత్రువును, దభేయమ్=చంపెదను.

తాత్పర్యము: ఓ ఉపాంశు యాగాభిమాని దేవా! నేను ద్వేషించుచున్న శత్రువునకు నీవు హింసకుఁడవు అగుచున్నావు. నీ యనుగ్రహమువలన నేను శత్రువులచే హింసింపఁ బడనివాఁడ నగుదును. నన్ను ద్వేషించుచున్న ఈ శత్రువును నేను సంహరించెదను. (ఇష్టమైన ఉపాంశుయాజను అనుమంత్రించవలెను.)

14. అర్థము: అహమ్=నేను, (=యజమానుఁడు) అగ్నీషోమయోః=అగ్నీషోమ దేవతాక యాగ సంబంధమైన, దేవయజ్యయా=సమంత్రకాజ్యాహుతిచేత, వృత్రహా=శత్రుహంతకుఁడను, భూయాసమ్=అగుదును. (ఇచట వృత్రపదము శత్రు సామాన్యవాచకము.)

తాత్పర్యము: పౌర్ణమాస యాగమునందు అగ్నీషోములు దేవతలు. "త్వష్టా హతపుత్రే" అను అనువాకమునందు అగ్నీషోమ దేవతలు వృత్రహత్యా విషయమున నిమిత్త కారణములుగా వర్ణింపఁబడినారు. కావున యజమానుఁడు అగ్నీషోమ దేవతాక యాగసంబంధియగు సమంత్రకాజ్యాహుతిచే తాను వైరిహంత నగుదునని కోరుచున్నాఁడు. (యాగమునందు ఇష్టులైన అగ్నీషోమదేవతలను అనుమంత్రించవలెను.)

15. అర్థము: అహమ్=నేను, (=యజమానుఁడు) ఇన్ద్రాగ్నియోః=ఇంద్రాగ్నిదేవతాక యజ్ఞసంబంధియగు, దేవయజ్యయా=సమంత్రకాజ్యాహుతిచేత, ఇన్ద్రియావీ=ఇంద్రియోపేతుఁడను, అన్నాదః=అన్నభక్షకుఁడను, భూయాసమ్=అగుదును.

తాత్పర్యము: దర్శయాగమునందలి ద్వితీయ పురోడాశమునకు ఇంద్రాగ్నులు దేవతలు. తద్దేవతాక యాగసంబంధియగు సమంత్రకాజ్యాహుతిచేత యజమానుఁడు తనకు ఇంద్రియ సమృద్ధిని అన్నభక్షకత్వమును కోరుచున్నాఁడు. (ఇంద్రుని యనుగ్రహమువలన ఇంద్రియోపేతత్వము, అగ్ని యనుగ్రహమువలన అన్నాదత్వము లభించునని భావము. ఈ మంత్రము చెప్పుచు ఇష్టియందు ఇంద్రాగ్నులను అనుమంత్రించవలెను. ఇంద్రాగ్నియోః=ఇంద్రాగ్నియోః.)

16. అర్థము: అహమ్=నేను, ఇన్ద్రస్య=ఇంద్రదేవతాక యాగసంబంధియగు, దేవయజ్యయా=సమంత్రకాజ్యాహుతిచేత, ఇన్ద్రియావీ=ఇంద్రియవంతుఁడను, భూయాసమ్=అగుదును.

తాత్పర్యము: సాన్నాయ్యమునకు ఇంద్రుఁడు దేవత. తద్దేవతాక యాగసంబంధియగు సమంత్రకాజ్యాహుతిచేత నేను ఇంద్రియవంతుఁడ నగుదును. (ఇది యజమానుని వాక్యము. యాగోద్దేశ్యుఁడైన యింద్రుని ఈ మంత్రముచే అనుమంత్రించవలెను.)

17. అర్థము: మహేంద్రస్య=మహేంద్ర దేవతాక యాగసంబంధియగు, దేవయజ్యయా=సమంత్రకాజ్యాహుతిచేత, అహమ్=నేను, జేమానమ్=జయశీలతను, మహిమానమ్=(విద్యైశ్వర్యాది గుణములచే,) మహత్త్వమును, గమేయమ్=పొందెదను.

తాత్పర్యము: శ్రీని కోల్పోయిన గ్రామవైద్యుఁడు, గ్రామనాయకుఁడు, రాజ్యాధికారియగు రాజు అను ఈ మువ్వురకు, సాన్నాయ్యమునకు, మహేంద్రుఁడు దేవత. అగ్నియందు వేల్చఁబడిన దధిరూప హవిస్సునకు సాన్నాయ్య మనిపేరు. అట్టి మహేంద్ర దేవతాక యాగ సంబంధియగు సమంత్రకాజ్యాహుతిచేత యజమానుఁడు తనకు జయమును, విద్యైశ్వర్యాది గుణయుక్త మహత్త్వమును, కోరుచున్నాఁడు. (ఈ మంత్రముచేత మహేంద్ర దేవతను అనుమంత్రించవలెను.)

18. అర్థము: అహమ్=నేను, స్విష్టకృతః=యాగములకు వైగుణ్యమును పరిహరించి ఆ యాగములను సుష్ఠుగాఁ జేసిన, అగ్నేః=అగ్నిదేవతాక యాగసంబంధియగు, దేవయజ్యయా=సమంత్రకాజ్యాహుతిచేత, ఆయుష్మాన్=ఆయుష్మంతుఁడను, భూయాసమ్=అగుదును. యజ్ఞేన=సగుణమైన సంపూర్ణ యజ్ఞముచేత, ప్రతిష్ఠామ్=ఫలప్రాప్తి లక్షణమైన ప్రతిష్ఠను, గమేయమ్=పొందెదను.

తాత్పర్యము: ఒకానొక అగ్ని ఒకానొక కారణముచేత రుద్రనామమును పొందెను. ఆయగ్ని ఒకప్పుడు దేవతలు చేసిన ఆహుతిచేత తుష్టినొంది పూర్వకృత యాగములలోని లోపములను పరిహరించి ఆ యాగములను స్విష్టములుగాఁ జేసెను. (సు+ఇష్టములు.) అట్టి అగ్ని దేవతగాఁ గల యాగమునకు సంబంధియగు సమంత్రకాజ్యాహుతి చేత యజమానుఁడు తనకు ఆయుష్మత్త్వమును ఫలప్రాప్తిలక్షణ ప్రతిష్ఠను కోరుచున్నాఁడు. (యాగోద్దేశ్యుఁడైన స్విష్టకృ దగ్నిని ఈ మంత్రముచే అనుమంత్రించవలెను.)

ద్వితీయానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే షష్ఠప్రపాఠకే తృతీయోఽనువాకః।

మూలము: [1]అగ్ని ర్మా దురిష్టా త్పాతు సవితా ఽఘశగ్ంసా[2]ద్యో మే ఽన్తి దూరే ఽరాయతీయతి త
మేతేన జేషగ్ం [3]సురూపవర్షవర్ణ ఏహీమా న్భద్రా స్దుర్యాగ్ం అభ్యేహి మా మనుప్రతా న్యు
శీర్షాణి మృడ్ఢ్వ మిడ ఏహ్యదిత ఏహి సరస్వత్యేహి ర న్తి రసి రమతి రసి సూన ర్యసి
జుష్టే జుష్టిం తే ఽశీయోపహూత ఉపహవమ్ (౧)తే ఽశీయ సా మే సత్యాశీ రస్య యజ్ఞస్య
భూయా దరేడతా మనసా తచ్ఛకేయం యజ్ఞో దివగ్ం రోహతు యజ్ఞో దివం గచ్ఛతు యో
దేవయానః పన్థా స్తేన యజ్ఞో దేవాగ్ం అప్యేత్వస్మా స్విన్ద్ర ఇన్ద్రియం దధా త్వస్మా న్రాయ
ఉత యజ్ఞా స్సచన్తా మస్మాసు సన్త్వాశిష స్సానః ప్రియాసు ప్రతూ ర్తి ర్మఘోనీ [4]జుష్టి రసి
జుషస్వ నో జుష్టానః (౨)అసి జుష్టిం తే గమేయం [5]మనో జ్యోతి ర్జుషతా మాజ్యం విచ్ఛిన్నం
యజ్ఞగ్ం సమిమం దధాతు। బృహస్పతి స్తనుతా మిమం నో విశ్వేదేవా ఇహ మాదయన్తామ్।
[6]బ్రధ్న పిన్వస్వ దదతో మే మాక్షాయి కుర్వతో మే మోపదస[7]త్ప్రజాపతే ర్భాగోఽ స్యూర్జస్వా
న్పయస్వా న్ప్రాణాపానౌ మే పాహి సమానవ్యానౌ మే పాహ్యుదానవ్యానౌ మే పాహ్య
క్షితో ఽస్యక్షిత్యై త్వా మా మే క్షేష్టా అముత్రాముష్మి న్లోకే ॥3॥ (ఉపహవంజుష్టానస్త్వాషట్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే షష్ఠప్రపాఠకే తృతీయోఽనువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: ద్వితీయానువాకమునందు హవి రనుమంత్రణము చెప్పబడినది. ఈ తృతీయానువాకమునందు భక్షింపదగిన యిడాది భాగములకు అనుమంత్రణము చెప్పబడుచున్నది.

1. అర్థము: అగ్నిః=అగ్ని దేవుఁడు, దురిష్టాత్=దూషితమైన క్రతు సంబంధి యిష్టమునుండి, మా=నన్ను, పాతు=రక్షించుఁ గాక. సవితా=సూర్యుఁడు, అఘశంసాత్=పాపమునం దభిరుచిగల అసురాదికమునుండి, మా=నన్ను, పాతు=రక్షించుఁగాక.

తాత్పర్యము: మంత్ర లోపమువలనఁగాని, క్రియా లోపమువలనఁగాని దూషితమైన క్రతుకర్మ దురిష్ట మనఁబడును. అట్టి దురిష్టమునుండి అగ్ని నన్ను రక్షించుఁగాక. పాపమునం దభిరుచిగల అసురాదికమునుండి సూర్యుఁడు నన్ను రక్షించుఁగాక. (యజ్ఞమునందలి హోమ దానాది క్రియ ఇష్ట మనఁబడును. మంత్ర క్రియా వైకల్యము కలది దురిష్టము. ప్రాశిత్ర మీయఁబడుచున్న సమయమున యజమానుఁ డీ మంత్రమును జపించవలెను.)

2. అర్థము: యః=ఎవఁడు, మే=నాకు, అన్తి=సమీపమునఁగాని, దూరే=దూరమునందుఁగాని, అరాతీయతి=శత్రుత్వ మును కోరుచున్నాఁడో, తమ్=అ శత్రుత్వమును కోరుచున్న రాక్షసాదికమును, ఏతేన=ఈ యజమాన భాగముచేత, జేషమ్=జయింతును.

తాత్పర్యము: నాకు సమీపమునఁగాని, దూరమునఁగాని, నాతో శత్రుత్వమును కోరుచున్నవానిని, యజమాన సంబంధి యగు ఇడాది హవి శ్శేష భాగముచేత జయించెదను. (యజమానభాగము ఈయఁబడుచున్న సమయమున యజమానుఁ డీ మంత్రమును జపించవలెను.)

3. అర్థము: హే సురూప వర్షవర్ణే!=శోభనరూపము వృష్టివర్ణములు గల యిడాదేవతా! ఇమాన్ భద్రాన్=ఈ (మా సంబంధము లైన,) శాస్త్రోక్త యజ్ఞసాధన సంపూర్ణములైన, దుర్యాన్=యజ్ఞ గృహములనుగూర్చి, ఏహి=రమ్ము. (అపి చ=మఱియు,) మా మభి=నన్ను ఉద్దేశించి, అనువ్రతా=(ఈ యజ్ఞమునందు,) అనుకూలమైన దానవగుచు, ఏహి=రమ్ము. ఉ=ఇంకను, (హే ఇడావిశేషాః!=ఓ యిడావిశేషములారా!, యూయమ్= మీరు,) శీర్షాణి=(మా) శిరస్సులను, నిమృడ్ఢ్వమ్=(స్నేహ పూర్వకమైన అఘ్రాణాదికముచే,) మిక్కిలిగ శోధింపుఁడు. హే ఇడే!=ఓ యిడా!, ఏహి=రమ్ము. హే అదితే! ఏహి, హే సరస్వతి!, ఏహి, హే రన్తే,! ఏహి, హే రమతే! ఏహి, హే సూనః! ఏహి, (అదిత్యాది శబ్దములు ఇడాశబ్ద పర్యాయములు. ఈ యాఱును ఇడావిశేషములు,) హే జుష్టే!=ఓ ప్రియమైన యిడా!, తే=నీ యొక్క, జుష్టిమ్=ప్రీతిని, అశీయ=పొందె దను. హే ఉపహూతే!=అగమనమునకై మాచే అనుజ్ఞాతవైన యిడా!, తే=నీయొక్క, ఉపహవమ్=అను జ్ఞను, అశీయ=పొందెదను, అస్య యజ్ఞస్య=ఈ యజ్ఞముయొక్క, (యా) ఆశీః=ఫలప్రార్థనా రూపమైన ఏ యాశీస్సు, (అస్తి=కలదో!) సా=అ యాశీస్సు, సత్యా=సత్యమైనది, భూయాత్=అగుఁగాక. అరేడతా= అనాదరము చేయునట్టి, మనసా=మనస్సుచేత, తత్=అ ఫలమును, (సాధితుమ్=సాధించుటకు,) శకేయమ్= సమర్థుఁడ నగుదును. యజ్ఞః=(నేను చేసిన) యజ్ఞము, దివమ్=స్వర్గమును (అ) రోహతు=అధిష్ఠించుఁగాక. యజ్ఞః=(స్వర్గమును పొందిన,) యజ్ఞము, దివమ్=(యజ్ఞ హవిస్సు భుజించిన దేవతలున్నట్టి) స్వర్గ ప్రదేశ మును, గచ్ఛతు=పొందుఁగాక. యః=ఏది, దేవయానః పన్థాః=దేవతల హవిర్భోజనశాలకు పోవుమార్గమో, తేన= ఆ మార్గముచేత, యజ్ఞః=(స్వర్గమును పొందిన) ఈ యజ్ఞము, దేవానపి=యజ్ఞసంబద్ధ హవిర్భోక్తలగు దేవత లను గూడ, ఏతు=పొందుఁగాక. ఇన్ద్రియః=(అ యజ్ఞముచేత సంతుష్టుఁడైన) ఇంద్రుఁడు, అస్మాసు=మాయందు, ఇన్ద్రియమ్=(మఱియొక యజ్ఞము ననుష్ఠించుటకు తగిన) చక్షురాది పాటవమును, దధాతు=స్థాపించుఁ గాక. అస్మాన్=(తాన్) అటువంటి మమ్ము, రాయః=(యజ్ఞసాధనములైన) ధనములు, యజ్ఞాః ఉత= చేయఁబోవు యజ్ఞములు కూడ, సచన్తామ్=ఆశ్రయించుఁగాక. ఆశిషః=ఆ యజ్ఞఫలములు, అస్మాసు= మాయందు, సన్తు=ఉండుఁగాక. సా=అటువంటి, ప్రియా=ప్రీతిపాత్రమైన, (త్వమ్=నీవు,) నః=మమ్ముఁ గూర్చి, సువ్రతూర్తిః=సుష్ఠుగా శత్రువులను హింసించుదానవు, మఘోనీ=ధనవతివియు, (భవ=అగుము.)

తాత్పర్యము: ఓ యిడాదేవతా!, నీవు శృంగ పుచ్ఛాదిక రూపమైన రూపమును, ఉదకము ఘృతము అను ద్వివిధమైన వృష్టిని, శుక్ల కృష్ణ కపిలత్వాది వర్ణమును కలదానవు. అట్టి నీవు శాస్త్రోక్త యజ్ఞసాధన పూర్ణములైన యజ్ఞగృహములకు మా కనుకూలమైన దాన వగుచు రమ్ము. ఓ యిడావిశేషములారా! మీరు స్నేహపూర్వక మైన అఘ్రాణాదికముచే మా శిరస్సులను శోధన చేయుఁడు. ఇడాదిపద వాచ్యమైన యిడా! రమ్ము.

ఓ ప్రియమైన యిడాదేవతా!, నీ ప్రీతిని పొందుదును. ఇచటకు వచ్చుటకు అనుజ్ఞాతవైన యిడా! నీ యనుజ్ఞను పొందెదను. ఈ యజ్ఞముయొక్క ఫలప్రార్థనా రూపమైన ఆశీస్సు సత్యమగుఁగాక. అనాదరము చేయని మనస్సుతో ఆ ఫలమును సాధించుటకు సమర్థుఁడ నగుదునుగాక. నేను చేసిన ఈ యజ్ఞము స్వర్గము నధిరోహించుఁగాక. అధిరోహించిన యజ్ఞము యజ్ఞహవిస్సును భుజించు దేవతలున్న ప్రదేశమునకు పోవుఁగాక. మఱియు ఈ యజ్ఞము, దేవతలు హవి ర్భోజనశాలకు పోవుమార్గముననే పోయి హవి ర్భుక్కు లగు దేవతలను కూడ పొందుఁగాక. ఈ యజ్ఞముచే సంతుష్టుఁడైన యింద్రుఁడు మఱియొక యజ్ఞము చేయుటకై మాకు చక్షురాది పాటవము నిచ్చుఁగాక. అటువంటి మమ్ము యజ్ఞసాధనములైన ధనములు మున్ముందు చేయఁబోవు యజ్ఞములు ఆశ్రయించుఁగాక. మాకు యజ్ఞఫల రూపములైన ఆశీస్సులు ఉండుఁ గాక. ఓ యిడాదేవతా! అటువంటి ప్రీతిపాత్రమైన నీవు మా నిమిత్తమై శత్రువుల నధికముగా హింసింపుము. ధనవతి వగుము. (ఈ మంత్రము చెప్పుచు ఇడను అనుమంత్రించవలెను.)

4. అర్థము: (హే అవాంతరేడే!=అవాంతరమైన యిడాభాగమా!, త్వమ్=నీవు,) జుష్టిః=ప్రీతి రూపము, అసి=అగుచున్నావు. నః=మమ్ము, జుషస్వ=సంతోష పఱచుము. నః=మాచేత, (తృతీయార్థే షష్ఠీ.) జుష్టా=సేవింపఁ బడినదానవు, అసి=అగుచున్నావు. తే=నీయొక్క, జుష్టిమ్=ప్రీతిని, గమేయమ్=పొందెదను.

తాత్పర్యము: (భుజింపఁదగిన యిడలోని యొకభాగము 'అవాంతరేడ' యనఁబడును.) ఓ అవాంతరేడా!, నీవు ప్రీతి స్వరూపమవు. మమ్ము సంతోషపఱచుము. మాచే సేవింపఁబడుచున్న నీ ప్రీతిని పొందెదను. (ఈ మంత్రముచేత అవాంతరేడను అనుమంత్రించవలెను.)

5. అర్థము: మనః=మననీయమైన, జ్యోతిః=అగ్ని, ఆజ్యమ్= (ఆ యా ఆహుతులందలి) ఆజ్యమును, జుషన్తామ్= సేవించుఁగాక. (=త్రాగుఁగాక.) విచ్ఛిన్నమ్=(ఏదేని వైకల్యముచేత,) విచ్ఛిన్నమైన, ఇమం యజ్ఞమ్= ఈ యజ్ఞమును, సందధాతు=(వైకల్యమును పోఁగొట్టి,) సంధానము చేయుఁగాక. బృహస్పతిః=బృహస్పతి, నః=మాయొక్క, ఇమమ్=ఈ యజ్ఞమును, తనుతామ్=విస్తరింపఁజేయుఁగాక. విశ్వేదేవాః=సర్వ దేవతలు, ఇహ=ఈ యజ్ఞమునందు, మాదయన్తామ్=తృప్తి నొందుదురుగాక.

తాత్పర్యము: మనన యోగ్యుఁడైన అగ్ని ఆ యా ఆహుతులందలి ఆజ్యమును త్రాగుఁగాక. ఏదేని వైకల్యముచే విచ్ఛిన్నమైన ఈ యజ్ఞమును లోపమును పోఁగొట్టి యోగ్యమైనదిగా చేయుఁగాక. బృహస్పతి ఈ యజ్ఞమును విస్తరింపఁజేయుఁగాక. సర్వదేవతలు ఈ యజ్ఞమునందు తృప్తి నొందుదురుగాక. (ఈ మంత్రము చెప్పుచు వేది మధ్యభాగమును ఉదకములచే మార్జనము చేయవలెను.)

6. అర్థము: హే బ్రధ్న!=ఓ యజ్ఞపురుషా! (అస్మాన్=మమ్ము, ఋత్విజః అపి=ఋత్విజులను కూడ,) పిన్వస్వ=సంతోష పెట్టుము. దదతః=ధనము నిచ్చుచున్న, మే=నాకు, మా క్షాయి=(ఈయఁదగిన ధనమును,) క్షీణింపఁ జేయవలదు. కుర్వతః=యాగము చేయుచున్న, మే=నాయొక్క, (సామర్థ్యమ్=సామర్థ్యమును,) మోపదసత్=క్షీణింపఁజేయవలదు.

తాత్పర్యము: ఓ యజ్ఞపురుషా!, మమ్ము, ఋత్విజులను కూడ సంతోష పెట్టుము. ధనము నిచ్చుచున్న నాకు ఈయఁదగిన ధనమును క్షీణింపఁ జేయవలదు. యాగము చేయుచున్న నా సామర్థ్యమును క్షీణింపఁ జేయవలదు. నాకు ధనమును, సామర్థ్యమును వృద్ధి నొందించుము అని భావము. (యజ్ఞ సంబంధమైన పురోడాశమును అనుమంత్రించవలెను.)

7. అర్థము: (హే అన్వాహార్య!=ఓ అన్వాహార్యమా! ప్రజాపతేః=ప్రజాపతికి, భాగః=భాగమైన, (త్వమ్=నీవు,) ఊర్జస్వాన్=బలము కలదానవు, పయస్వాన్=క్షీరమువలె స్వాదువైనదానవు, అసి=అగుచున్నావు. మే=నాయొక్క, ప్రాణాపానౌ=శరీరగత ప్రాణాపాన వాయువులను, పాహి=రక్షించుము. మే=నాయొక్క సమాన వ్యానౌ=సమాన వ్యాన వాయువులను, పాహి=రక్షించుము. ఉదాన వ్యానౌ=ఉదాన వ్యాన వాయువులను, పాహి=రక్షించుము. (హే అన్వాహార్య!=ఓ అన్వాహార్యమా! త్వమ్=నీవు,) అక్షితః=

క్షీణించని దానవు, అసి=అగుచున్నావు. (అతః=ఇందువలన) అక్షిత్యై=(పరలోకమునందుఁగూడ,) నాశము లేకుండుటకై, త్వా=నిన్ను, దదామి=ఇచ్చుచున్నాను. అముత్ర=పరలోకమునందు, మే=నాయొక్క, (భోగాయ=భోగము కొఱకు,) మా క్షేష్ఠాః=నాశము నొందవలదు. (తత్=ఆ కారణమువలన, అహ మపి=నేను కూడ,) అముష్మిన్ లోకే=పరలోకమునందు, త్వా=నిన్ను, (యథేష్ట మను భవిష్యామి=యథేచ్ఛగా ననుభవించఁగలను. అన్వాహార్యము=పితృయజ్ఞమునకు వెనుక చేయఁదగిన కర్మయందు దక్షిణాగ్నియందు పక్వమైన అన్నము.)

తాత్పర్యము: అన్వాహార్యము ఋత్విజుల భాగము. అయినను ప్రజాపతికి సంతోషము కలుగఁజేయునది కావున ప్రజాపతి భాగముగా ఇచట వర్ణింపఁబడినది. అన్వాహార్యము భుజించువారికి బలము కలుగును గావున బలము కలది. క్షీరముతో పక్వమగును గావున క్షీరమువలె స్వాదువైనది. ఓ అన్వాహార్యమా! నా శరీరమునందలి ప్రాణాపాన వ్యానోదాన సమాన వాయువులను రక్షించుము. (ఒకే వాయువు శరీరమునందలి వివిధ స్థానము లందు సంచరించుటచే స్థానభేదమునుబట్టి ప్రాణాపానాది వ్యవహార మేర్పడినది. ఉచ్ఛ్వాస నిశ్వాసములు ప్రాణవ్యాపారము. మల మూత్రములను బహిర్గతము చేయుట అపాన వ్యాపారము. భుజించిన అన్నాది రసమును శరీరమునం దంతటను సమానముగ ప్రసరింపఁ జేయుట సమాన వ్యాపారము. ఉద్గారాదికము ఉదాన వ్యాపారము. శరీరనాడు లన్నిటియందు వ్యాపించి ప్రాణాపాన వ్యాపారసంధి సమయమున శరీరమునకు బలము నిచ్చుట వ్యాన వ్యాపారము. బహువిధ వ్యాపార హేతు వగుటచే ప్రాధాన్యమును సూచించుటకు వ్యానశబ్దము ద్విరుక్తమైనది.) ఓ అన్వాహార్యమా! పరలోకమునందుఁగూడ నాశము లేకుండుటకై నిన్ను ఇచ్చుచున్నాను. ఆ అభిప్రాయముతో నే నిచ్చుటచే పరలోకమునందు నేను అనుభవించుటకై నాశము నొందవలదు. నేను కూడ పరలోకమునందు యథేచ్ఛగ నిన్ను అనుభవింతును. (అంతర్వేది గతమైన అన్వాహార్యమును అను మంత్రించవలెను.)

తృతీయానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే షష్ఠ ప్రపాఠకే చతుర్థోఽనువాకః ।

మూలము: [1]బర్హిషో ఽహం దేవయజ్యయా ప్రజావా న్భూయాసం నరాశగ్ంసస్యాహం దేవయజ్యయా పశుమా న్భూయాస మగ్నే స్స్విష్టకృతో ఽహం దేవయజ్యయా ఽఽయుష్మా న్యజ్ఞేన ప్రతిష్ఠాం గమేయ [2]మగ్నే రహ ముజ్జితి మనూజ్జేషగ్ం సోమస్యాహ ముజ్జితి మనూజ్జేష మగ్నే రహ ముజ్జితి మనూజ్జేష మగ్నీషోమయో రహ ముజ్జితి మనూజ్జేష మిన్ద్రాగ్నియో రహ ముజ్జితి మనూజ్జేష మిన్ద్రస్యాహమ్ (౧)ఉజ్జితి మనూజ్జేషం మహేన్ద్రస్యాహ ముజ్జితి మనూజ్జేష మగ్నే స్స్విష్టకృతో ఽహ ముజ్జితి మనూజ్జేషం [3]వాజస్య మా ప్రసవేనో ద్గ్రాభేణో ద్గ్రభీత్। అథా సపత్నాగ్ం ఇన్ద్రో మే నిగ్రాభేణాధరాగ్ం అకః। ఉద్గ్రాభం చ నిగ్రాభం చ బ్రహ్మ దేవా అవీవృధన్। అథా సపత్నా నిన్ద్రాగ్నీ మే విషూచీనా న్వ్యస్యతామ్। [4]ఏమా అగ్మ న్నాశిషో దోహకామా ఇన్ద్రవన్తః (౨)వనామహే ధుక్షీమహి ప్రజా మిషమ్। [5]రోహితేన త్వా ఽగ్ని ర్దేవతాం గమయతు హరిభ్యాం త్వేన్ద్రో దేవతాం గమయ త్వేతశేన త్వా సూర్యో దేవతాం గమయతు [6]వి తే ముఞ్చామి రశనా వి రశ్మీ న్వి యోక్త్రా యాని పరిచర్తనాని ధత్తా దస్మాసు ద్రవిణం యచ్చ భద్రం ప్ర ణో బ్రూతా ద్భాగధా న్దేవతాసు। [7]విష్ణో శ్శంయో రహం దేవయజ్యయా యజ్ఞేన ప్రతిష్ఠాం గమేయగ్ం [8]సోమస్యాహం దేవయజ్యయా (౩)సురేతా రేతో ధిషీయ త్వష్టు రహం దేవయజ్యయా పశూనాగ్ం రూపం పుషేయం దేవానాం పత్నీ రగ్ని ర్గృహపతి ర్యజ్ఞస్య మిథునం తయో రహం దేవయజ్యయా

మిథునేన ప్ర భూయాసం [9]వేదో ఽసి విత్తి రసి విదేయ కర్మాసి కరుణమసి క్రియా సగ్ం సని రసి సనితా ఽసి సనేయం ఘృతవన్తం కులాయినగ్ం రాయస్పోషగ్ం సహ స్రిణం వేదో దదాతు వాజినమ్ ॥౩॥

(ఇన్ద్రస్యాహ మిన్ద్రివ న్తః సోమస్యాహం దేవయజ్యయా చతుశ్చత్వారిగ్ంశ చ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే షష్ఠప్రపాఠకే చతుర్థోఽనువాకః।

వేదార్థదీపిక

అవతారిక: తృతీయానువాకమునందు భక్ష్యమైన ఇడాది భాగమునకు అనుమంత్రణము విధింపఁబడినది. ఈ చతుర్థానువాకమునందు శేషాహుతులైన అనూయాజాదులకు అనుమంత్రణము చెప్పఁబడుచున్నది.

1. అర్థము: బర్హిషః=బర్హిర్నామకాగ్ని సంబంధమైన, దేవయజ్యయా=సమంత్రకాజ్యాహుతిచేత, అహమ్=నేను, ప్రజావాన్=సంతానవంతుఁడను, భూయాసమ్=అగుదును. నరాశంసస్య=నరాశంసనామకాగ్ని సంబంధమైన, దేవయజ్యయా=సమంత్రకాజ్యాహుతిచేత, అహమ్=నేను, పశుమాన్=పశుమంతుఁడను, భూయాసమ్=అగుదును. (మిగిలిన మంత్రము ద్వితీయానువాకాంతమున వ్యాఖ్యానింపఁ బడినది.)

తాత్పర్యము: బర్హి ర్నరాశంస స్విష్టకృ చ్ఛబ్దములు అనూయాజ దేవతలగు అగ్నులకు వాచకములు. అనూయాజ దేవతలగు బర్హి ర్నరాశంస స్విష్టకృదగ్నులకు సమంత్రకాజ్యాహుతుల నిచ్చుటచే యజమానుఁడనైన నేను సంతానవంతుఁడను, పశుమంతుఁడను, ఆయుష్మంతుఁడనునై ఈ యజ్ఞముచేత ప్రతిష్ఠ నొందెదను. (ఈ మంత్రముచే అనూయాజాదుల హోమద్రవ్యముల ననుమంత్రించవలెను.)

2. అర్థము: అహమ్=నేను, అగ్నేః=అగ్నియొక్క, ఉజ్జితి మను=ఉత్కృష్ట జయము ననుసరించి, ఉజ్జేషమ్=ఉత్కృష్ట జయమును పొందితిని. సోమస్య=సోమ దేవతయొక్క, ఉజ్జితి మను=ఉత్కృష్ట జయము ననుసరించి, అహమ్=నేను, ఉజ్జేషమ్=జయమును పొందితిని. అహమ్ అగ్నేః, ఉజ్జితి మను, అనూజ్జేషమ్. ఇట్లే అగ్నిషోమ, ఇన్ద్రాగ్ని, ఇన్ద్ర, మహేన్ద్ర, స్విష్టకృదగ్నులకు కూడ సమన్వయము సులభ గ్రాహ్యము.

తాత్పర్యము: ఆజ్యభాగ దేవతయగు అగ్ని, తన కర్పింపఁబడిన హవిస్సును సేవించి పుష్టి నొందినవాఁడై యజ్ఞవిరోధులగు రాక్షసులను తిరస్కరించుచు గొప్పవిజయమును పొందెను. యజ్ఞకర్తనగు నేను కూడ ఆయగ్ని జయము ననుసరించి పాపరూప వైరి నభిభవించుచు ఉత్కృష్ట జయము నొందితిని. ఇట్లే సోమ, అగ్నిషోమ, ఇంద్ర, మహేంద్ర, స్విష్టకృ దగ్నుల జయము ననుసరించి నేను పాపరూప వైరి నభిభవించుచు గొప్పవిజయమును పొందితిని. (అగ్ని హవిస్సు ననుగ్రహించెనను విషయమును హోత గుర్తించినప్పుడు యజమానునిచే ఈ మంత్రమును పఠింపఁ జేయవలెను.)

3. **అర్థము:** ఇన్ద్రః=ఇంద్రుడు, వాజస్య=అన్నముయొక్క, ప్రసవేన=ఉత్పత్తి నిమిత్తముగా, ఉద్గ్రాభేణ=స్రుచమును పైకెత్తుటచే, మా=నన్ను, ఉదగ్రభీత్=ఉత్కర్షవంతునిఁ జేసెను. అథా=పిమ్మట, నిగ్రాభేణ=స్రుచమును క్రిందికి దించుటచేత, మే=నాయొక్క, సపత్నాన్=శత్రువులను, అధరాన్=తిరస్కృతులనుగా, అకః=చేసెను. దేవాః=దేవతలు, బ్రహ్మ చ=బ్రహ్మయు, ఉద్గ్రాభం చ నిగ్రాభం చ=స్రుచముయొక్క ఉద్గ్రాభ నిగ్రాభము లనెడి కర్మద్వయమును, అవీవృధన్=వృద్ధి నొందించిరి. అథా=పిమ్మట, ఇన్ద్రాగ్నీ=ఇంద్రాగ్ని దేవతలు, మే=నాయొక్క, సపత్నాన్=శత్రువులను, విషూచీనాన్=విశేషముగ పారిపోవు వారినిగా, వ్యస్యతామ్=నశింపఁజేయుదురుగాక.

తాత్పర్యము: ఇంద్రుఁడు అన్నము నుత్పత్తి చేయునపుడు స్రుచమును పైకెత్తుటచేత, నన్ను ఉత్కర్షవంతునిగాఁ జేసెను. స్రుచమును క్రిందికి దించుటచే నా శత్రువులను పరాభూతులనుగాఁ జేసెను. దేవతలు, బ్రహ్మయు స్రుచముయొక్క, ఉద్గ్రాభ నిగ్రాభము లనెడి కర్మద్వయమును వృద్ధి చేసిరి. పిమ్మట ఇంద్రాగ్నులు నా శత్రువులను అంతటను పారిపోవువారినిగా నశింపఁజేసిరి. (వాజశబ్ద ఘటితములయిన రెండు ఋక్కులను యజమానుఁడు పఠించుచుండఁగా, అధ్వర్యుఁడు 'జుహువు' 'ఉపభృత్తు' అను రెండు స్రుచములను పరస్పరము విపర్యాసముగ కదిలింపవలెను.)

4. **అర్థము:** ఇమాః ఆశిషః="అయు రాశాస్తే సుప్రజా స్త్వ మాశాస్తే" ఇత్యాదులైన ఆయురా ద్యాశిస్సులు, (మాం ప్రతి=నన్నుఁగూర్చి) అగ్మన్=వచ్చుఁగాక. (వయ మపి=మేము కూడ,) దోహకామాః=ఆయురాది దోహమును కోరుచున్నవారమై, ఇన్ద్రవన్తః=ఇంద్రుఁడు కలవారమై, వనామహే=(ఇంద్రుని) సేవించుచున్నాము. (తయా=ఆ సేవచేత), ప్రజామ్=పుత్రపౌత్రాది ప్రజను, ఇషమ్=కోరఁబడుచున్న ఆయురాదికమును, ధుక్షీమహి=(కామధేను సదృశయైన ఇంద్ర దేవతనుండి,) పితుకుదుము. (=పొందుదుము.)

తాత్పర్యము: హోత పఠించు సూక్తవాకమునందు "అయు రాశాస్తే సుప్రజా స్త్వ మాశాస్తే" ఇత్యా ద్యాయురా ద్యాశీస్సులు సమామ్నాతము లైనవి. ఆ యాశీస్సులు మాకు చెందుఁగాక. మేము ఆయురాదుల లాభమును కోరుచున్నవారమై తత్ఫల ప్రదాతయగు ఇంద్రుని సేవించెదము. ఆ సేవచేత కామధేను సదృశయైన యింద్ర దేవతనుండి పుత్రపౌత్రాది సంతానమును, అన్నాయు రాదికమును, పొందుదుము. (యజమానునిచే ఈ మంత్రమును పఠింపఁజేయవలెను.)

5. **అర్థము:** (హే ప్రస్తర!=ఓ ప్రస్తరమా!) అగ్నిః=అగ్నిదేవుఁడు, రోహితేన=రోహితాశ్వముచేత, త్వా=నిన్ను, దేవతామ్=సూక్తవాకోక్తయైన దేవతను, గమయతు=పొందించుఁగాక. ఇన్ద్రః=ఇంద్రుఁడు, త్వా=నిన్ను, హరిభ్యామ్='హరి'నామకాశ్వములచేత, దేవతామ్=సూక్తవాకోక్తదేవతను, గమయతు=పొందించుఁగాక. సూర్యః=సూర్యదేవుఁడు, ఏతశేన='ఏతశ'నామకాశ్వముచేత, త్వా=నిన్ను, దేవతామ్=సూక్తవాకోక్తదేవతను, గమయతు=పొందించుఁగాక.

తాత్పర్యము: 'రోహిత' 'హరి' 'ఏతశ' శబ్దములు వరుసగా అగ్నీంద్రసూర్యుల అశ్వములకు నామధేయములు. ఓ ప్రస్తరమా! అగ్నీంద్రసూర్యులు తమ తమ రోహిత హర్యేతశము లనెడి గుఱ్ఱములచేత సూక్తవాకోక్త దేవత యొద్దకు చేర్చుదురుగాక. (ఈ మంత్రముచేత, ప్రస్తరమును అనుమంత్రించవలెను.)

6. **అర్థము:** (హే అగ్నే!=ఓ యగ్నీ! త్వమ్=నీవు,) యాని పరిచర్తనాని=ఏ పరిధులను, ధత్తాత్=ధరించితివో, తే=నీయొక్క, తా రశనాః=ఆ రశనా స్థానీయములైన పరిధులను, విముఞ్చామి=విడఁదీయుచున్నాను. రశ్మీన్=రశ్మి స్థానీయములైన పరిధులను, విముఞ్చామి=విడదీఁయుచున్నాను. యోక్త్రః=యోక్త్ర స్థానీయములైన పరిధులను, విముఞ్చామి=విడఁదీయుచున్నాను. (తేన సంతుష్టః=ఆ విమోచనముచే సంతుష్టుఁడవైన, త్వమ్=నీవు,) అస్మాసు=మాయందు, ద్రవిణమ్=ధనమును, చ=మఱియు, యత్ భద్రమ్=మంగళకరమైనది యేది, (అస్తి=కలదో, తదపి=దానినిఁ గూడ) ధేహి=ఉంచుము. దేవతాసు=దేవతల యందు, భాగధాన్=హవిర్భాగముల నిచ్చునట్టి, నః=మమ్ముఁగూర్చి, ప్రబ్రూతాత్=ప్రకర్షగా చెప్పుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! అశ్వమునకువలె నీకుఁగల రశనాది స్థానీయములైన పరిధు లనెడి బంధనములను విడఁదీయుచున్నాను. ఈ విమోచనముచేత సంతుష్టుఁడవైన నీవు మాకు ధనమును మంగళకరమైన అన్నపానాదికమును ఇమ్ము, మా హవిస్సులను భుజించునట్టి దేవతలకు హవిర్భాగముల నిచ్చునట్టి మమ్ముఁగూర్చి గొప్పగా చెప్పుము. (ఈ మంత్రము నుచ్చరించుచు అగ్నియొద్ద నుండి తీయు పరిధుల ననుమంత్రించవలెను. రశనా=గుఱ్ఱము నడుమునకు కట్టునట్టి త్రాడు. లేదా తోలు. రశ్మిః=గుఱ్ఱము ముఖమునందు తగిలించెడి కళ్ళెము. యోక్త్రిః=గుఱ్ఱమును స్తంభమునకు కట్టుట కుపయోగించు త్రాడు. పరిచర్తనములు=గుఱ్ఱము నడుమునకు ముందుభాగమునుండి తోఁకవఱకు తగిలించెడి రజ్జువిశేషములు. అశ్వమునకువలె అగ్నికి పరిధులు రశనాది స్థానీయములుగా వర్ణితములు.)

7\. అర్థము: విష్ణోః=(బహుకార్యములందు)వ్యాపకుఁడైన, శంయోః='శంయు' అనుపేరుగల బృహస్పతి పుత్రుని సంబంధమైన, దేవయజ్యయా=సమంత్రకాజ్యాహుతిచేత, అహమ్=నేను, యజ్ఞేన=సంపూర్ణ యజ్ఞముచేత (లభించెడి) ప్రతిష్ఠామ్=ప్రతిష్ఠను, గమేయమ్=పొందెదను.

తాత్పర్యము: సుఖ సంమిశ్రితుఁడయిన శంయు వనునతఁడు బృహస్పతి పుత్రుఁడుగా బ్రాహ్మణమునందు చెప్పఁబడెను. ఆ శంయువు యజ్ఞమునం దనేక ఘట్టములందు వచ్చుచుండును. కావున సర్వవ్యాపకుఁడు. అట్టి శంయు సంబంధమైన సమంత్రకాజ్యాహుతిచేత నేను సంపూర్ణ యజ్ఞముచే లభించు ప్రతిష్ఠను పొందెదను. (యజమానుఁడీ మంత్రము చెప్పుచు శంయువుయొక్క పరిధిని అనుమంత్రించవలెను.)

8\. అర్థము: అహమ్=నేను, సోమస్య=సోమదేవతయొక్క, దేవయజ్యయా=సమంత్రకాజ్యాహుతిచేత, సురేతాః=ఫలవంతమైన రేతస్సు కలవాఁడనై, రేతః=రేతస్సును, ధిషీయ=ధరించెదను. అహమ్=నేను, త్వష్టుః=త్వష్టృ దేవతా సంబంధమైన, దేవయజ్యయా=సమంత్రకాజ్యాహుతిచేత, పశూనామ్=పశువులయొక్క, రూపమ్=రూపమును, పుషేయమ్=పోషించెదను. దేవానామ్=దేవతలయొక్క, పత్నీః=పత్నులు, గృహపతిః=గృహపతియగు, అగ్నిః=అగ్ని,(యు) యజ్ఞస్య=యజ్ఞమునకు (సంబంధించిన,) మిథునమ్=మిథునము. తయోః=ఆ యుభయుల సంబంధమైన, దేవయజ్యయా=సమంత్రకాజ్యాహుతిచేత, అహమ్=నేను, మిథునేన=పుత్త్రిపుత్త్రి రూపముతో, ప్రభూయాసమ్=ప్రకర్షవంతుఁడ నగుదును.

తాత్పర్యము: నాలుగు పత్నీసంయాజ లనెడి కర్మలకు సోమ, త్వష్టృ, దేవపత్నీ, గృహపత్యగ్నులు నలుగురు దేవతలు. వారిలో సోమదేవత రేతో ధారణాభిమాని యగుటచేత, తత్సోమ దేవతాక యాగముచేత, యజమానుఁడనైన నేను రేతస్సును ధరించెదను. త్వష్టృ దేవతాక యాగముచేత పశురూపమును పోషించెదను. (త్వష్టృదేవత, నిషిక్తమైన రేతస్సును పశురూపముగ మార్చును.) గృహపతియగు అగ్నియు దేవపత్నులును యజ్ఞసంబంధమైన మిథునము. తన్మిథున దేవతాక యాగముచేత, నేను పుత్త్రిపుత్త్రిరూప మిథునముచే, ప్రకర్షవంతుఁడ నగుదును. (పత్నీః=ప్రథమార్థే ద్వితీయా. యజమానుఁ డీ మంత్రము చెప్పుచు పత్నీసంయాజ కర్మలందు హుతమైన హవిస్సు ననుమంత్రించవలెను.)

9\. అర్థము: (హే దర్భమయః=ఓ దర్భల సముదాయమా!, త్వమ్=నీవు,) వేదః=వేదనామము కలదానవు, అసి=అగుచున్నావు. (కనుకనే,) విత్తిః=ద్రవ్యలాభ సాధనము, అసి=అగుచున్నావు. (అట్టి నీ యనుగ్రహముచేత,) విదేయ=(ధనమును) పొందెదను. కర్మ అసి='కర్మ' సంజ్ఞకము అగుచున్నావు. (కనుకనే,) కరణమ్ అసి=వేది సమ్మార్జన భస్మోద్వ్యూహన సాధనము అగుచున్నావు. (కావున,) క్రియాసమ్=(నీచేత సమ్మార్జనాదికమును,) చేయుదును. సనిః=సని యనుపేరు గలదానవు, అసి=అగుచున్నావు. సనితా=ధనదాతవు, అసి=అగుచున్నావు. (తతః=అందువలన, త్వదనుగ్రహేణ=నీ యనుగ్రహముచేత,) సనేయమ్=(ఋత్విగాదులకు,) ధనము నొసఁగుదును. (అపి చ=మఱియు,) వేదః=వేద స్వరూపమైన, (భవాన్=నీవు, మహ్యమ్=నాకొఱకు,) ఘృతవత్తమ్=ఆజ్యాది భోజన సాధన సమృద్ధమైనదియు, కులాయినమ్=బహు గృహోపేతమైనదియు, వాజినమ్=భోజ్యాన్న సమృద్ధమైనదియునగు, రాయస్పోషమ్=ధనసమృద్ధిని, దదాతు=ఒసఁగుము.

తాత్పర్యము: (ఈ మంత్రమునందు 'వేదోఽసి' త్యాది వాక్యములకు తదనంతర వాక్యములు వ్యాఖ్యాన రూపములు. ఇట కట్టగా కట్టఁబడిన దర్భల సముదాయము సంబోధింపఁబడుచున్నది.) ఓ దర్భల సముదాయమా! నీవు వేద నామకమవు. కావున ద్రవ్యలాభ సాధన మగుచున్నావు. అట్టి నీ యనుగ్రహమువలన ధనమును పొందుదును. నీవు కర్మనామక మగుచున్నావు. కావున వేది సమ్మార్జనాది సాధన మగుచున్నావు. నీచేత సమ్మార్జనము చేయుదును. నీవు సని యను పేరుగలదాన వగుచున్నావు. కావున ధనదాత వగుచున్నావు. అట్టి నీ యనుగ్రహమువలన, నేను ఋత్విగాదులకు ధనము నొసఁగెదను. వేదస్వరూపమైన నీవు ఆజ్యాది భోజన సాధన సమృద్ధమును, నివాసయోగ్య బహు గృహోపేతమును, భోజ్యాన్న సమృద్ధము నగు ధన సమృద్ధిని నాకొసఁగుము. (వేది మధ్యమునందు దర్భలకట్ట నుంచి యజమానునిచే ఈ మంత్రమును చెప్పించవలయును.)

చతుర్థానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే షష్ఠప్రపాఠకే పఞ్చమోఽనువాకః ।

మూలము: [1]ఆప్యాయతాం ధ్రువా ఘృతేన యజ్ఞం యజ్ఞం ప్రతి దేవయద్భ్యః। సూర్యాయా ఊధో ఽదిత్యా ఉపస్థ ఉరుధారా పృథివీ యజ్ఞే అస్మిన్। [2]ప్రజాపతే ర్విభాన్నామలోక స్తస్మిగ్ం స్త్వా దధామి సహ యజమానేన [3]సదసి సన్మే భూయాస్సర్వ మసి సర్వం మే భూయాః పూర్ణ మసి పూర్ణం మే భూయా అక్షితమసి మా మే క్షేష్ఠాః [4]ప్రాచ్యాం దిశి దేవా ఋత్విజో మార్జయన్తాం దక్షిణాయామ్ (౧)దిశి మాసాః పితరో మార్జయన్తాం ప్రతీచ్యాం దిశి గృహాః పశవో మార్జయన్తా ముదీచ్యాం దిశ్యాప ఓషధయో వనస్పతయో మార్జయన్తా మూర్ధ్వాయాం దిశి యజ్ఞ స్సంవత్సరో యజ్ఞపతి ర్మార్జయన్తాం [5]విష్ణోః క్రమో ఽస్యభిమాతిహా గాయత్రేణ ఛన్దసా పృథివీ మను విక్రమే నిర్భక్త స్స యం ద్విష్మో విష్ణోః క్రమో ఽస్యభిశస్తిహా త్రైష్టుభేన ఛన్దసా ఽన్తరిక్ష మను విక్రమే నిర్భక్త స్స యం ద్విష్మో విష్ణోః క్రమో ఽస్యరాతీయతో హన్తా జాగతేన ఛన్దసా దివ మను విక్రమే నిర్భక్త స్స యం ద్విష్మో విష్ణోః క్రమో ఽసి శత్రూయతో హన్తా ఽఽనుష్టుభేన ఛన్దసా దిశో ఽను విక్రమే నిర్భక్త స్స యం ద్విష్మః ॥౨॥

(దక్షిణాయా మన్తరిక్ష మను విక్రమే నిర్భక్తః స యం ద్విష్మో విష్ణో రేకాన్న త్రిగ్ంశచ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే షష్ఠప్రపాఠకే పఞ్చమోఽనువాకః।

వేదార్థ దీపిక

అవతారిక: చతుర్థానువాకమునందు అనూయాజాది శేషహోమానుమంత్రణము చెప్పఁబడినది. ఈ పంచమానువాకమునందు ఆప్యాయనాది మంత్రములు చెప్పఁబడుచున్నవి.

1\. **అర్థము:** యజ్ఞం యజ్ఞం ప్రతి=ప్రతి ఆహుతిని గూర్చి, దేవయద్భ్యః=దేవతల నాహ్వానింపఁ గోరుచున్న ఋత్విజుల కొఱకు, ధ్రువా=ధ్రువ యను పేరు గల హోమసాధనము, సూర్యాయాః=సూర్యపత్ని యగు గోరూపధారిణి యైన ఉషాదేవియొక్క, ఊధః(ఇవ)=పయఃపూర్ణ స్తన సముదాయమువలె (=పొదుగువలె,) ఘృతేన=ఆజ్యముతో, ఆప్యాయతామ్=పరిపూర్ణమగుఁగాక. అదిత్యాః=వేదిరూపిణి యగు పృథివియొక్క, ఉపస్థే=ఉత్సంగమునందు, (వర్తమానా=ఉంటున్నటువంటి, సేయమ్=ఆ యీ ధ్రువ,) ఉరుధారా=(మాటి మాటికి నింపఁబడిన ఆజ్యధారలచే) మహాధారయై, పృథివీ=విస్తీర్ణమై, అస్మిన్ యజ్ఞే=ఈ యజ్ఞమునందు, సమ్యక్=బాగుగా, ఆప్యాయతామ్=(ఆజ్యముచే,) పూరింపఁబడుఁగాక.

తాత్పర్యము: యజ్ఞమునందు వేల్చఁబడు ప్రతి ఆహుతి నిమిత్తము దేవతల నాహ్వానించునట్టి ఋత్విజులకొఱకు ధ్రువ యను పేరుగల హోమసాధనము సూర్యపత్నియు గోరూపధారిణియునగు ఉషాదేవి పాలపొదుగువలె నేతితో పరిపూర్ణమగుఁగాక. వేది రూపిణియైన పృథివియొక్క ఉత్సంగమునందున్న యీ ధ్రువ, మాటి మాటికి నింపుచున్న ఆజ్యధారలతోఁగూడి మహాధార కలదియైనది కనుక, విస్తీర్ణమై యీ యజ్ఞమునందు బాగుగా ఆజ్యముచే పూరింపఁబడుఁగాక. (ఆజ్యముచే నింపఁబడుచున్న ధ్రువపాత్ర నభిమంత్రించవలెను.)

2\. **అర్థము:** ప్రజాపతేః=ప్రజాపతి సంబంధమైన, విభాన్నామ లోకః=విభాఙ్ అనుపేరుగల లోకము, (అస్తి=కలదు, హే ధ్రువ!=ఓ ధ్రువ పాత్రమా!) తస్మిన్=ప్రజాపతి సంబంధియగు ఆ విభాన్నామలోకమునందు, యజమానేన సహ=(హవిర్భాగ భోక్తనైన,) యజమానుఁడనగు నాతోఁగూడ, త్వా=నిన్ను, దధామి=ఉంచుచున్నాను.

తాత్పర్యము: స్వర్గాది లోకములు ప్రజాపతి సృష్టములే కాని, యవి కర్మభూములు కావు. కనుక యజ్ఞకర్తలకు విశేషముగ భాసించవు కావున ఆ లోకములు విభాఙ్ఛబ్ద వాచ్యములు కానేరవు. భూలోకము కర్మభూమి కనుక యజ్ఞకర్తలకు విశేషముగ భాసించును. అందువలన భూలోకము విభాఙ్ఛబ్ద వాచ్యము. ఓ ధ్రువపాత్రమా! హవిర్భాగ భోక్తను యజమానుఁడును నగు నాతోఁగూడ నిన్ను ఆ విభాన్నామక లోకమునం దుంచుచున్నాను. (యజమానుఁడు ఈ మంత్రము చెప్పుచు తన హవిశ్శేష భాగమును భుజించవలెను.)

3\. **అర్థము:** (హే పూర్ణపాత్ర!=జలపూర్ణమైన ఓ పాత్రమా! త్వమ్=నీవు,) సత్=శోభనమైనదానవు, అసి=అగుచున్నావు. (తతః=అందువలన,) మే=నాకు, సత్=యోగ్యమైనదానవు, భూయాః=అగుము. సర్వమ్=సర్వదిక్కులందు వ్యాపించినదానవు, అసి=అగుచున్నావు. (తతః=అందువలన,) మే=నాకు (కావలసిన,) సర్వమ్=సర్వకార్యమును చేయుటకు సమర్థమైనదానవు, భూయాః=అగుము. పూర్ణమ్=నీటితో నిండినదానవు, అసి=అగుచున్నావు. (తతః=అందువలన,) మే=నా యొక్క (ప్రయోజనమును) పూర్ణమ్=సంపూర్ణముచేయ సన్నద్ధము, భూయాః=అగుము. అక్షితమ్=క్షయము లేనిదానవు, అసి=అగుచున్నావు. (తతః=అందువలన,) మే=నాకు, (నాపని చేయుటయందు,) మా క్షేష్ఠాః=నాశము నొందకుము.

తాత్పర్యము: ఓ జలపూర్ణ పాత్రమా! సంయవనాది కార్యకారి వగుటచే నీవు శోభనమైనదానవు. కావున నాకు ఫలము నిచ్చుటకు యోగ్య మగుము. నీవు ప్రాచ్యాది సర్వదిక్కులందు వ్యాపించియుండుటచే నే నపేక్షించిన సర్వకార్యమును చేయుటకు సమర్థ మగుము. నీటితో నిండినదానవగుటచే నా ప్రయోజనమును సంపూర్ణము చేయ సన్నద్ధ మగుము. క్షయములేనిదానవు కావున నా పనిని చేయుటలో నాశము నొందకుము. (అధ్వర్యుఁడు జలపూర్ణ పాత్రమును తీసికొని వచ్చుచుండగా యజమానుఁ డీ మంత్రము పఠించవలెను.)

4\. **అర్థము:** ప్రాచ్యాం దిశి=తూర్పు దిక్కునందు, దేవాః=దేవతలు, ఋత్విజః=ఋత్విజులు, మార్జయన్తామ్=శోధింతురుగాక. దక్షిణాయాం దిశి=దక్షిణ దిక్కునందు, మాసాః=మాసాభిమానులగు, పితరః=పితృదేవతలు, మార్జయన్తామ్=శోధింతురుగాక. ప్రతీచ్యాం దిశి=పశ్చిమ దిక్కునందు, గృహాః=గృహాభిమానులు, పశవః=పశ్వభిమానులునగు ప్రాణులు, మార్జయన్తామ్=శోధింతురుగాక. ఉదీచ్యాం దిశి=ఉత్తర దిక్కునందు, ఆపః=అపోఽభిమానులు, ఓషధయః=ఓషధ్యభిమానులు, వనస్పతయః=వనస్పత్యభిమానులును, మార్జయన్తామ్=శోధింతురు గాక, ఊర్ధ్వాయాం దిశి=ఊర్ధ్వ దిక్కునందు, యజ్ఞః=యాగాభిమానియు, సంవత్సరః=సంవత్సరాభిమానియు, యజ్ఞపతిః=యజ్ఞకర్తయు, మార్జయన్తామ్=శోధింతురు గాక.

తాత్పర్యము: ఋత్విగ్దేవాద్యభిమానులగు ప్రాణు లనేకులు యాగమును చూచుటకై ప్రాచ్యాది దిక్కులందు నివసించు చుందురు. వారందఱు ప్రాచ్యాది దిక్కులందు శోధింతురుగాక. (ఈ మంత్రము చెప్పుచు పూర్ణ పాత్రము నందలి నీటితో ప్రాచ్యాది దిక్కులందు ప్రోక్షించవలెను.)

5. అర్థము: (హే ప్రథమ ప్రక్రమః=ఓ ప్రథమ పాద విన్యాసమా!) అభిమాతిహా=నరక ప్రదమైన పాపమును నశింపఁజేయు నట్టి, (త్వమ్=నీవు,) విష్ణోః=విష్ణువుయొక్క, క్రమః=పాద విక్షేపము, అసి=అగుచున్నావు. గాయత్రేణ ఛన్దసా=గాయత్రీచ్ఛన్దో ఽభిమాని దేవతచే, (అనుగృహీతః=అనుగ్రహింపఁబడిన, అహమ్=నేను,) పృథివీ మను=ఏతత్ప్రదేశరూప పృథివి ననుసరించి, విక్రమే=పాదము నుంచుచున్నాను. వయమ్=మేము, యమ్=ఏ పాపమును, ద్విష్మః=ద్వేషించుచున్నామో; సః=ఆ పాపము, నిర్భక్తః=తొలగింపఁబడినది. (హే ద్వితీయ ప్రక్రమః=ఓ ద్వితీయ పాద విన్యాసమా!,) అభిశస్తిహా=ఇతరులచే ఆరోపింపఁబడిన అపవాదును పోగొట్టునట్టి, (త్వమ్=నీవు,) విష్ణోః క్రమః అసి. త్రైష్టుభేన ఛన్దసా=త్రిష్టుప్ ఛన్దోఽభిమాని దేవతచేత, (అనుగృహీతః, అహమ్) అన్తరిక్షమ్ అను=అంతరిక్ష లోకము ననుసరించి, విక్రమే=పాదము నుంచు చున్నాను. యమ్=ఏ అపవాదును, వయమ్=మేము, ద్విష్మః=ద్వేషించు చున్నామో, సః=ఆ యపవాదు, నిర్భక్తః=(ఈ ప్రదేశమునుండి,) తొలగింపఁబడినది. (హే తృతీయ ప్రక్రమః=ఓ తృతీయ పాదవిన్యాసమా!), అరాతీయతః=ద్రవ్యలాభ నివారణమును కోరుచున్న శత్రువునకు, హన్తా=నాశకమైన, (త్వమ్=నీవు,) విష్ణోః, క్రమః, అసి. జాగతేన ఛన్దసా=జగతీ చ్ఛన్దోఽభిమాని దేవతచే, (అనుగృహీతః, అహమ్=అనుగ్రహింపఁ బడిన నేను,) దివమను=ద్యులోకము ననుసరించి, విక్రమే=అడుగు నిడుచున్నాను. యమ్=ఏ శత్రువును, వయమ్=మేము, ద్విష్మః=ద్వేషించు చున్నామో, సః=ఆ శత్రువు, నిర్భక్తః=(ఈ ప్రదేశమునుండి,) తొలగింపఁబడినవాఁడు, (ఆసీత్=అయెను.) హే చతుర్థ ప్రక్రమః=నాల్గవ పాదవిన్యాసమా!, శత్రూయతః= హింసకత్వమును కోరుచున్న శత్రువునకు, హన్తా=నాశకమైన, (త్వమ్=నీవు,) విష్ణోః, క్రమః, అసి. ఆనుష్టుభేన ఛన్దసా=అనుష్టుప్ ఛన్దోఽభిమాని దేవతచేత, (అనుగృహీతః అహమ్=అనుగ్రహింపఁబడిన నేను,) దిశః అను=దిక్కుల ననుసరించి, విక్రమే=పాదము నుంచుచున్నాను. వయమ్=మేము, యమ్=ఏ శత్రువును, ద్విష్మః=ద్వేషించుచున్నామో, సః=ఆ శత్రువు, నిర్భక్తః=ఈ ప్రదేశమునుండి తొలగింపఁబడినవాఁడు, (ఆసీత్=అయెను.)

తాత్పర్యము: (ఈ మంత్రము నాలుగు భాగములుగా నున్నది. యజమానుఁడు మొదటి రెండుభాగముల నుచ్చరించుచు తనను తాను విష్ణువుగాను, వేదిమధ్యమందు, తాను వేయు నడుగులను విష్ణు పాద విన్యాసములుగాను, భావన చేసి, వేదియందే నాలుగడుగులు నడువవలెను. మూఁడు నాలుగు భాగముల నుచ్చరించుచు మూఁడవ యడుగును ముందుకు వేయవలెను. మంత్రోచ్చారణము లేకుండగనే నాల్గవ యడుగును వేయవలెను. గాయత్ర్యాది చన్దోభిమాని దేవతలు ఆ యా పాద ప్రక్షేపముల నభిమానించువారు. ఆహవనీయాగ్నికి పశ్చిమ భాగమున వేది మధ్యమందే నాలుగడుగులు నడువవలెను. పాద ప్రక్షేపము, పాద ప్రక్రమము, పాద విన్యాసము, ఇవి సమానార్థకములు. పాదము నుంచుట అని యర్థము.) ఓ ప్రథమ పాద ప్రక్షేపమా! పాప ఘాతియైన నీవు విష్ణువుయొక్క పాదప్రక్షేప మగుచున్నావు. గాయత్రీచ్ఛన్దో ఽభిమాని దేవతచే అనుగ్రహిం పఁబడిన నేను ఏతత్ప్రదేశరూప పృథివి ననుసరించి మొదటి యడుగు వేయుచున్నాను. మేము ద్వేషించు చున్న పాపము ఈ ప్రదేశమునుండి తొలగింపఁబడినది. ఇట్లే ద్వితీయ తృతీయ చతుర్థ పాద ప్రక్షేపముల విషయము గూడ గ్రహింపఁదగినది.

పంచమానువాకము సమాప్తము

అథ ప్రథమకాణ్డే షష్ఠప్రపాఠకే షష్ఠోఽనువాకః।

మూలము: [1]అగన్మ సువ స్సువ రగన్మ సన్దృశ స్తే మా ఛిత్సి యత్తే తప స్తస్మై తే మా ఽఽవృక్షి [2]సుభూ రసి శ్రేష్ఠో రశ్మీనా మాయుర్ధా అస్యాయు ర్మే ధేహి వర్చోధా అసి వర్చో మయి ధేహీ[3]ద మహ మముం భ్రాతృవ్య మాభ్యో దిగ్భ్య ఽస్యై దివో ఽస్మా దన్తరిక్షా దస్యై పృథివ్యా అస్మా దన్నాద్యా న్నిర్భజామి నిర్భక్త స్స యం ద్విష్మః (౧)[4]సం జ్యోతిషా ఽఽభూవ [5]మైన్ద్రీ మావృత మన్వావర్తే [6]సమహం ప్రజయా సం మయా ప్రజా సమహగ్ం రాయస్పోషేణ సం మయా రాయస్పోష [7]స్సమిద్ధో అగ్నే మే దీదిహి సమేద్ధా తే అగ్నే దీద్యాసం [8]వసుమా న్యజ్ఞో వసీయా న్భూయాస [9]మగ్న ఆయూగ్ంషి పవస ఆసువోర్జ మిషం చ నః। ఆరే బాధస్వ దుచ్ఛునామ్। అగ్నే పవస్వ స్వపా అస్మే వర్చ స్సువీర్యమ్। (౨)దధ త్పోషగ్ం రయిం మయి। [10]అగ్నే గృహపతే సుగృహపతి రహం త్వయా గృహపతినా భూయాసగ్ం సుగృహపతి ర్మయా త్వం గృహపతినా భూయా శ్శతగ్ం హిమా స్తా మాశిష మాశాసే తన్తవే జ్యోతిష్మతీం తా మాశిష మాశాసే ఽముష్మై జ్యోతిష్మతీం [11]క స్త్వా యునక్తి స త్వా విముఞ్చ త్వ[12]గ్నే వ్రతపతే వ్రత మచారిషం తదశకం తన్మే ఽరాధి [13]యజ్ఞో బభూవ స ఆ (౩)బభూవ స ప్రజజ్ఞే స వావృధే। స దేవానా మధిపతి ర్బభూవ సో అస్మాగ్ం అధిపతీ న్కరోతు వయగ్ం స్యామ పతయో రయీణామ్। [14]గోమాగ్ం అగ్నే ఽవిమాగ్ం అశ్వీ యజ్ఞో నృవత్సఖా సదమిద ప్రమృష్యః। ఇడావాగ్ం

ఏషో అసుర ప్రజావా న్దీర్ఘో రయిః పృథుబుధ్న స్సభావాన్ ॥౪॥

(ద్విషష్టిః సువీర్యగ్ం స అ వశ్చత్రిగ్ంశ చ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే షష్ఠప్రపాఠకే షష్ఠోఽనువాకః।

వేదార్థ దీపిక

అవతారిక: పంచమానువాకమునందు ఆప్యాయనాది మంత్రములు చెప్పఁబడినవి, ఈ షష్ఠానువాకమునందు సూర్యోపస్థానాది మంత్రములు చెప్పఁబడుచున్నవి. (ఉపస్థానము=ప్రార్థన.)

1. **అర్థము:** (హే ఆహవనీయ!=ఓ ఆహవనీయాగ్నీ!, త్వత్ప్రసాదాత్=నీ యనుగ్రహమువలన,) సువః=మొదటిదైన ఫలభోగస్థాన భూమిని, అగన్మ=(పుత్త్రపౌత్త్రాదులతోకూడిన మేము,) పొందితిమి. (తతః=పిమ్మట,) సువః=(మోక్షద్వారమైన రెండవదియగు,) ఆదిత్య లోకమును, అగన్మ=పొందితిమి. (తదర్థమ్=అందుకొఱకు, అహమ్=నేను,) తే=నీయొక్క, సందృశః=కటాక్షమునుండి, మా చ్ఛిత్సి=విచ్ఛిత్తిని పొందలేదు. తే=నీ కొఱకు, యత్ తపః=ఏ తపస్సు, (అస్మాభిః=మాచే, అనుష్ఠాస్యతే=అనుష్ఠింపఁబడునో,) తస్మై=ఆ తపస్సు కొఱకు, తే=నీయొక్క, (అనుగ్రహేణ=అనుగ్రహముచేత,) మా ఆ వృక్షి=అంతటను విచ్ఛిన్నుఁడను కాను.

తాత్పర్యము: ఓ ఆహవనీయాగ్నీ! నీ యనుగ్రహమువలన పుత్త్రపౌత్త్రాదులతో కూడిన మేము మొదటి ఫలభోగస్థాన భూమిని పొందితిమి. పిమ్మట మోక్షద్వారమైన రెండవదియగు ఆదిత్య లోకమును పొందుదుము. నీ కటాక్షము నుండి విచ్ఛిన్నుఁడను కాలేదు. నీకై యే తపస్సు చేయుదునో, ఆ తపస్సుకొఱకు నీ యనుగ్రహము నుండి విచ్ఛిన్నుఁడను కాను. (యజమానుఁడు వేదిమధ్యమున నాలుగడుగులు నడచిన పిమ్మట అచటనే యుండి ఆహవనీయాగ్నిని సేవించవలెను. మా చ్ఛిత్సి=మా చ్ఛిదమ్.)

2. **అర్థము:** (హే ఆదిత్య!=ఓ సూర్యదేవా!, త్వమ్=నీవు,) సుభూః=సుభువువు, అసి=అగుచున్నావు. రశ్మీనామ్=కిరణములతో కూడియుండు చంద్రాది గ్రహములలో, శ్రేష్ఠః=శ్రేష్ఠుఁడవు, అసి=అగుచున్నావు. ఆయుర్ధాః=ఆయువును స్థాపించువాఁడవు, అసి=అగుచున్నావు. మే=నాయందు, (సప్తమ్యర్థే షష్ఠీ.) ఆయుః=ఆయువును, ధేహి=స్థాపించుము. వర్చోధాః=బ్రహ్మవర్చస్సును స్థాపించువాఁడవు, అసి=అగుచున్నావు. మయి=నా యందు, వర్చః=బ్రహ్మవర్చస్సును, ధేహి=స్థాపించుము. (సుష్ఠు భవతీతి=సుభూః=బాగుగ నుంటున్న వాఁడు.)

తాత్పర్యము: ఓ యాదిత్య దేవా!, నీవు బాగుగ నుంటున్నవాఁడవు. కాంతిమంతములైన చంద్రాది గ్రహములలో శ్రేష్ఠుఁడవు. ఆయువును స్థాపించువాఁడవు. కావున నాయందు ఆయువును స్థాపించుము. బ్రహ్మవర్చస్సును స్థాపించువాఁడవు. కావున నా యందు బ్రహ్మవర్చస్సును స్థాపించుము. (నన్ను ఆయుష్మంతుని, బ్రహ్మతేజోవంతుని చేయుమని భావము. యజమానుఁడీ మంత్రమును పఠించుచు ఆదిత్యుని సేవించవలెను.)

3. అర్థము: అహమ్=నేను, అముం భ్రాతృవ్యమ్=ఈ శత్రువును, అభ్యః దిగ్భ్యః=ఈ దిక్కులనుండి, అస్యై దివః=ఈ ద్యులోకమునుండి, అస్మాత్ అంతరిక్షాత్=ఈ ఆకాశమునుండి, అస్యై పృథివ్యాః=ఈ భూలోకమునుండి, అస్మాత్ అన్నాద్యాత్=ఈ శ్రేష్ఠమైన అన్నమునుండి, ఇదం నిర్భజామి=శీఘ్రముగనే తొలఁగించు చున్నాను. యమ్=ఏ శత్రువును, (వయమ్=మేము,) ద్విష్మః=ద్వేషించు చున్నామో, సః=ఆ శత్రువు, నిర్భక్తః=తొలగింపఁబడినవాఁడు, (ఆసీత్=అయెను. అన్నాద్యము=రాజామాత్యాదులు భుజింపనర్హమైన శ్రేష్ఠమైన అన్నము.)

తాత్పర్యము: మేము ద్వేషించుచున్న శత్రువును ఈ దిక్కులు ద్యులోకము మున్నగు వానినుండి తొలఁగించుచున్నాను. భవిష్యత్తులో మమ్ము విరోధించువానినిగూడ తొలఁగించుచున్నాను. ('అస్యై దివః'=ఇదంశబ్దము పంచమ్యర్థమున చతుర్థ్యంతము. పృథివ్యాది లోకములనుండి శత్రునిష్కాసము కోరుచు ఈ మంత్రము పఠించవలెను.)

4. అర్థము: అహమ్=నేను, జ్యోతిషా=సూర్య తేజస్సుతో, సమభూవమ్=కలిసికొందును గాక. (ఇట 'అభూవమ్' అను లుఙన్తము ప్రార్థనార్థమున ప్రయుక్తమైనది.)

తాత్పర్యము: నేను ఆదిత్యతేజస్సుతో కలిసికొందునుఁగాక. (యజమానుఁడు ఈ మంత్రము నుచ్చరించుచు ఆత్మ పరామర్శము చేసికొనవలెను.)

5. అర్థము: ఐన్ద్రీమ్=ఆదిత్య సంబంధమైన, ఆవృతమను=అంతటను తిరుగుట ననుసరించి, (అహమపి=నేను గూడ,) అవర్తే=అంతటను తిరుగుచున్నాను.

తాత్పర్యము: ఆదిత్య సంబంధమైన ఆవర్తనమును అనుసరించి, నేనుఁగూడ అంతటను తిరుగుచున్నాను. ("ఇది=పరమైశ్వర్యే" పరమైశ్వర్య యోగమువలన నిట "ఐంద్రీమ్" అనుశబ్దమున కాదిత్యసంబంధమైన అని అర్థము చెప్పఁబడినది. ఈ మంత్రము పఠించుచు యజమానుఁడు కుడివైపునకు తిరుగవలెను.)

6. అర్థము: అహమ్=నేను, ప్రజయా=సంతానముతో, సం భూయాసమ్=కలిసినవాఁడ నగుదునుఁగాక. ప్రజా=సంతానము, మయా=నాతో, సంభూయాత్=కలిసికొనుఁగాక. అహమ్=నేను, రాయస్పోషేణ=ధనసమృద్ధితో, సం భూయాసమ్=కూడి యుందునుఁగాక. రాయస్పోషః=ధనసమృద్ధి, మయా=నాతో, సం భూయాత్=కూడి యుండుఁగాక.

తాత్పర్యము: నేను సంతానముతో కూడి యుందునుఁగాక. సంతానము నాతో కూడి యుండుఁగాక. నేను ధనసమృద్ధితో కూడియుందునుఁగాక. ధనసమృద్ధి నాతో కూడి యుండుఁగాక, (తనకు సంతాన సమృద్ధి ధనసమృద్ధియు కలుగవలెనని యజమానుని ప్రార్థన. ఈ మంత్రము చెప్పుచు యజమానుఁడు ఉత్తరవైపునకు తిరుగవలెను.)

7. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ!, సమిద్ధః=సమిధచే ప్రజ్వలించిన, (త్వమ్=నీవు,) మే=నాకొఱకు, సం దీదిహి=బాగుగ దీపించుము. హే అగ్నే!=ఓ యగ్నీ!, తే=నీకు, సమేద్ధా=దీపకుఁడనైన, (అహమపి=నేనుఁగూడ,) తవ ప్రసాదాత్=నీ అనుగ్రహమువలన) దీద్యాసమ్=దీపింతునుఁగాక. (స్వాహా=ఈ సమిధ హుత మగుఁగాక.)

తాత్పర్యము: ఓ యగ్నీ! ఈ సమిధచే జ్వలించుచున్న నీవు నా నిమిత్తము బాగుగ ప్రజ్వలించుము. నిన్ను ప్రజ్వలింపఁజేయుచున్న నేనుఁ గూడ నీ యనుగ్రహమువలన బాగుగ ప్రకాశింతునుఁగాక. ఈ సమిధ హుత మగుఁగాక. (ఈ మంత్రము చెప్పుచు ఆహవనీయాగ్నియందు సమిధ నుంచవలెను.)

8. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ!, (అయమ్=ఈ) యజ్ఞః=యజ్ఞము, (త్వత్ప్రసాదాత్=నీ యనుగ్రహమువలన,) వసుమాన్=ధనము కలది. (అహమపి=నేను కూడ,) వసీయాన్=ధనవంతులలో నధికుఁడను, భూయాసమ్=అగుదునుఁగాక.

తాత్పర్యము: ఓ యగ్నీ! ఈ యజ్ఞము నీ యనుగ్రహమువలన ధనము కలది. నేనుఁ గూడ ధనవంతులలో నధికుఁడ నగుదునుఁగాక. (ఆహవనీయాగ్నిని ఈ మంత్రముచే ప్రార్థించవలెను.)

9. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ! నః=మాయొక్క, ఆయూంషి=ఆయుపులను, పవసే=శోధించుచున్నావు. (=అపమృత్యువును పోఁగొట్టుచున్నావు.) నః=మాకు, ఊర్జమ్=బలమును, ఇషం చ=అన్నమును, ఆ సువ=అంతటను ఇమ్ము. దుచ్ఛునామ్=వైరిసేనను, దూరే=దూరమునందు, బాధస్వ=నిరాకరించుము. హే అగ్నే!=ఓ యగ్నీ!, (త్వమ్=నీవు.) స్వపాః=మంచికర్మ కలవాఁడవగుచు, అస్మే=మమ్ము, పవస్వ=శోధించుము. మయి=నాయందు, వర్చః=బ్రహ్మవర్చస్సును, సువీర్యమ్=వ్యవహార సామర్థ్యమును, పోషమ్=పుష్టిని, రయిమ్=ధనమును, దధత్=స్థాపించుము.

తాత్పర్యము: ఓ యగ్నీ! నీవు పుత్త్రపౌత్త్రాది యుక్తులమయిన మా ఆయువును శోధించుము. (=అపమృత్యువును పోగొట్టుము.) మాకు బలమును అన్నమునుఁ గూడ సమృద్ధిగ నిమ్ము. వైరిసేనను దూరమునందే నిరాకరించుము. ఓ యగ్నీ! నీవు మంచికర్మ గలవాఁడవగుచు నాకు బ్రహ్మవర్చస్సును, వ్యవహార సామర్థ్యమును, పుష్టిని ధనమును కలుగఁజేయుము. (ఈ మంత్రమును చెప్పుచు అగ్నిపవమాన ఋక్కులతో గార్హపత్యాగ్నిని సేవించవలెను.)

10. అర్థము: గృహపతే!=గృహపతివైన, హే అగ్నే!=ఓ గార్హపత్యాగ్నీ!, గృహపతినా=గృహపతివైన, త్వయా=నీచేత, అహమ్=నేను, సుగృహపతిః=మంచి గృహపతిని, భూయాసమ్=అగుదును. త్వమపి=నీవు కూడ, గృహపతినా=గృహపతినైన, మయా=నాచేత, (పూజితః=పూజింపఁబడినవాఁడవై,) సుగృహపతిః=మంచి గృహపతివి, భూయాః=అగుము. శతం హిమాః=నూఱు సంవత్సరములు, (అగ్నిమిన్ధానః అహమ్=అగ్నిని దీపింపఁ జేయుచున్న నేను,) తన్తవే=అనుత్పన్న పుత్త్రోత్పత్తికొఱకు, జ్యోతిష్మతీమ్=అతిబుద్ధి ప్రకాశన సమర్థమైన, తామ్ ఆశిషమ్=ఆ యాశీస్సును, ఆశాసే=కోరుచున్నాను.

తాత్పర్యము: (గార్హపత్యాగ్ని యెల్లపుడు గృహమందుండును. కావున అగ్ని గృహపతిగా వర్ణింపఁబడెను. గృహస్థునకు గృహపతి యని వ్యవహారము కలదు.) గృహపతివైన ఓ యగ్నీ! గృహపతివైన నీచే అనుగృహీతుఁడనైన నేను మంచి గృహపతి నగుదునుఁగాక. గృహపతినైన నాచేత పూజింపఁబడిన నీవు మంచి గృహపతి వగుము. అనేక సంవత్సరములు అగ్నిని సేవించుచున్న నేను అనుత్పన్న పుత్త్రోత్పత్తినిమిత్తము పుత్త్రోత్పత్తిప్రకాశన సమర్థమైన ఆశీస్సును కోరుచున్నాను. పుట్టినపుత్త్రునకై అత్యంత బుద్ధిప్రకాశన సమర్థమైన ఆశీస్సును కోరుచున్నాను. (ఈ మంత్రమును చెప్పుచు గార్హపత్యాగ్నిని సేవించవలెను.)

11. అర్థము: (హే యజ్ఞ!=ఓ యజ్ఞమా! యః=ఏ,) కః=ప్రజాపతి, త్వా=నిన్ను, యునక్తి=యోజన చేసెనో, సః=ఆ ప్రజాపతి, త్వా=నిన్ను, విముఞ్చతు=విడుచుఁగాక.

తాత్పర్యము: ఓ యజ్ఞమా! ఇదివరలో నిన్ను యోజన చేసిన ప్రజాపతి ఇప్పుడు విడుచుఁగాక. (ఈ మంత్రము చెప్పుచు యజ్ఞమునకు ఉద్వాసన చెప్పవలెను.)

12. అర్థము: వ్రతపతే!=యజ్ఞరూప వ్రతమున కధిపతివైన, హే అగ్నే!=ఓ యగ్నీ!, వ్రతమ్=(యజ్ఞరూప) వ్రతమును, అచారిషమ్=(నీ యనుగ్రహమువలన)ఆచరించితిని. తత్=ఆ వ్రతమును, (సమాపయితుమ్=సమాప్తి చేయుటకు,) అశకమ్=సమర్థుఁడ నైతిని. (మే=నాయొక్క,) తత్=ఆ వ్రతము, మే=నాకు, అరాధి=సమృద్ధమైనది.

తాత్పర్యము: యజ్ఞవ్రతమున కధిపతివైన ఓ యగ్నీ! నీ యనుగ్రహమువలన యజ్ఞవ్రతము నాచరించితిని. ఆ యజ్ఞము నాచరించుటకు సమర్థుఁడ నైతిని. నా యీ వ్రతము సమృద్ధమైనది. (ఆహవనీయాగ్నియందు సమిధ నుంచవలెను.)

13. అర్థము: యజ్ఞః=(ఇప్పుడాచరించిన,) యజ్ఞము, (సంపూర్ణః=సంపూర్ణము,) బభూవ=అయినది. సః=ఆ యజ్ఞము, ఆ బభూవ=మఱల ఆవృత్త మగుఁగాక. (లోడర్థే లిట్) సః=ఆ యజ్ఞము, (అస్మాన్=మమ్ము, అనాలస్యేన అనుష్ఠాతౄన్=ఆలస్యము లేకుండగ అనుష్ఠించు వారినిగా,) ప్రజజ్ఞే=గుర్తించినది. (అత ఏవ=కనుకనే,) సః=ఆ యజ్ఞము, వావృధే=వృద్ధి నొందుఁగాక. (లోడర్థమున లిట్.) సః=ఆ యజ్ఞము, దేవానామ్=దేవతలకు, అధిపతిః=అధిపతి, (=దేవతల నధికముగ పాలించునది.) బభూవ=అగుఁగాక. సః=ఆ యజ్ఞము, అస్మాకమ్=మమ్ము, (ద్వితీయార్థే షష్ఠీ.) అధిపతీన్=అధికముగ అనుష్ఠానమును పాలించువారినిగా, కరోతు=చేయుఁగాక. వయమ్=మేము, (తదనుగ్రహాత్=ఆ యజ్ఞపురుషుని యనుగ్రహమువలన, రయీణామ్=(యజ్ఞసాధన) ధనములకు, పతయః=అధిపతులము, స్యామ=అగుదుముగాక.

తాత్పర్యము: ఇప్పుడు మేమాచరించిన యజ్ఞము సంపూర్ణమైనది. అది మఱల మఱల ఆచరింపఁబడుఁగాక. అయ్యది మమ్ము ఆలస్యము లేకుండగ అనుష్ఠించిన వారినిగా గుర్తించినది. అందువలననే ఆ యజ్ఞము మాయింట మాటి మాటికి అనుష్ఠించుటచే వృద్ధినొందుఁగాక. మఱియు మాచే పూజింపఁబడుచున్న దేవతలను పాలించునది యగుఁగాక. మమ్ము నధికముగ అనుష్ఠించినవారినిగ చేయుఁగాక. యజ్ఞపురుషుని యనుగ్రహమువలన మేము యజ్ఞసాధన ధనముల కధిపతుల మగుదుముగాక. ('బభూవ', 'వావృధే' ఇవి లిడంతములైనను ప్రార్థనార్థమున ప్రయుక్తములైనవి. యజమానుఁ డీ మంత్రమును జపించవలెను.)

14. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ!, (పున రనుష్ఠానాయ=పున రనుష్ఠానమునకై, ప్రార్థ్యమానః=కోరబడుచున్న,) యజ్ఞః=యజ్ఞము, గోమాన్=బహు గోవులు కలదియు, అవిమాన్=గొఱ్ఱెలు కలదియు, అశ్వీ=గుఱ్ఱములు కలదియు, నృవత్సఖా=ఋత్విగ్రూప మనుష్యులతో కూడిన దేవతలు మిత్రులుగా కలదియు, సదమిత్=ఎల్లపుడును, అప్రమృష్యః=తిరస్కరింపఁ దగనిదియు, ఇడావాన్=అన్నము కలదియు, ప్రజావాన్=బహు సంతానప్రదమును, దీర్ఘః=(పునః పున రనుష్ఠానమువలన,) అవిచ్ఛిన్నమైనదియు, రయిః=బహు ధనోపేతమును, పృథుబుధ్నః=(మంత్రములందును, అనుష్ఠానములందును,) వైకల్యము లేనిదియు, సభావాన్=విద్వత్సభతో కూడినదియు, (భూయాత్=అగుఁగాక.) హే అసుర!=ప్రాణవంతుఁడవైన ఓ యగ్నీ! ఏషః=(మఱల మఱల కోరఁబడుచున్న,) ఈ యజ్ఞము, (భూయాత్=ఉక్త విశేషణ విశిష్టమైనదగుఁగాక.)

తాత్పర్యము: పున రనుష్ఠానమునకై కోరఁబడుచున్న యజ్ఞము పైని చెప్పఁబడిన విశేషములు కలది యగుఁగాక. (అని యజమానుఁడు అగ్నిని ప్రార్థించుచున్నాఁడు. యజమానుఁడు తూర్పుదిశగా ముందుకు జరిగి ఈ మంత్రము పఠించవలెను. 'గోమాన్' ఇత్యాది పదములన్నియు యజ్ఞపదమునకు విశేషణములు. రయిః=లుప్తమతుబంతము.)

షష్ఠానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే షష్ఠప్రపాఠకే సప్తమోఽనువాకః॥

మూలము: [1]యథా వై సమృతసోమా ఏవం వా ఏతే సమృతయజ్ఞా యద్దర్శపూర్ణమాసౌ కస్య వాఽహ
దేవా యజ్ఞ మాగచ్ఛన్తి కస్య వా న బహూనాం యజమానానాం యో వై దేవతాః పూర్వః
పరి గృహ్ణాతి స ఏనాః శ్వోభూతే యజత[2]ఏతద్వై దేవానా మాయతనం యదాహవనీయో
ఽన్తరాఽగ్నీ పశూనాం గార్హపత్యో మనుష్యాణా మన్వాహార్యపచనః పితృణా [3]మగ్నిం గృహ్ణాతి
స్వ ఏవా ఽఽయతనే దేవతాః పరి (౧)గృహ్ణాతి తాః శ్వోభూతే యజతే [4]వ్రతేన వై మేధ్యో
ఽగ్ని ర్వ్రతపతి ర్బ్రాహ్మణో వ్రతభృ [5]ద్వ్రత ముపైష్య న్బ్రూయా దగ్నే వ్రతపతే వ్రతం
చరిష్యామీత్య[6]గ్ని ర్వై దేవానాం వ్రతపతి స్తస్మా ఏవ ప్రతి ప్రోచ్య వ్రత మాలభతే
[7]బర్హిషా పూర్ణమాసే వ్రత ముపైతి వత్సై రమావాస్యాయా మేత ద్ధ్యేతయో రాయతన
[8]ముప స్తీర్యః పూర్వ శ్చాగ్ని రపరశ్చే త్యాహు [9]ర్మనుష్యాః (౨)ఇన్న్వా ఉప స్తీర్ణ మిచ్ఛన్తి
కిము దేవా యేషాం నవావసాన ముపాస్మిఞ్ఛ్వో యక్ష్యమాణే దేవతా వసన్తి య ఏవం
విద్వా నగ్ని ముప స్తృణాతి [10]యజమానేన గ్రామ్యా శ్చ పశవో ఽవరుధ్యా ఆరణ్యా శ్చే
త్యాహు ర్యద్గ్రామ్యా నుప వసతి తేన గ్రామ్యా నవరున్ధే యదారణ్యస్యా శ్నాతి తేనా ఽఽరణ్యా
న్యదనాశ్వా నుప వసే త్పితృదేవత్య స్స్యా [11]దారణ్యస్యా శ్నాతీన్ద్రియమ్ (౩)వా ఆరణ్య
మిన్ద్రియ మేవా ఽఽత్మ న్ధత్తే [12]యదనాశ్వా నుపవసే త్క్షోధుక స్స్యా ద్యదశ్నీయా ద్రుద్రో
ఽస్య పశూ నభిమన్యేతా[13]పో ఽశ్నాతి తన్నేవాశితం నేవానశితం న క్షోధుకో భవతి నా స్య

రుద్రః పశూ నభిమన్యతే [14]వజ్రో వై యజ్ఞః క్షుత్ఖలు వై మనుష్యస్య భ్రాతృవ్యో యద

నాశ్వా నుపవసతి వజ్రేణైవ సాక్షా త్క్షుధం భ్రాతృవ్యగ్ం హన్తి ॥౪॥

(పరి మనుష్యా ఇన్ద్రియగ్ం సాక్షా త్త్రీణి చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే షష్ఠప్రపాఠకే సప్తమోఽనువాకః।

వేదార్థ దీపిక

అవతారిక: ఈ ప్రపాఠకమునందలి ఆఱు అనువాకములందు యజమాన సంబంధములైన మంత్రములు చెప్పఁబడినవి. ఈ సప్తమానువాకము మొదలు అయిదు అనువాకములలో యజమాన సంబంధమైన బ్రాహ్మణము చెప్పఁబడుచున్నది. ఈ సప్తమానువాకమునందు దేవతా పరిగ్రహాదికము చెప్పఁబడుచున్నది.

1. **అర్థము:** సమృతసోమాః=ఒక సమయమునందే సామూహికముగ ప్రాప్తములైన సోమయాగములు, యథా వై=ఏ విధముగనో, ఏవం వా=ఈ విధముగనే, సమృత యజ్ఞాః=సామూహికముగ ఏక కాలమునందే ప్రాప్తము లైన యాగములు, సంభవన్తి=సంభవించుచున్నవి. దర్శపూర్ణమాసౌ యత్=దర్శపూర్ణమాస యాగములు ఏవి కలవో, (ఏవం స్థితే సతి=ఇట్టి పరిస్థితి కలుగుచుండగా,) బహూనాం యజమానానామ్=యజమాను లనేకులలో, కస్య వా యజ్ఞమ్=ఏ యజమానునియొక్క యజ్ఞమును గూర్చి, దేవాః=దేవతలు, ఆగచ్ఛన్తి=వచ్చుచున్నారు?, కస్య వా యజ్ఞమ్=ఏ యజమానునియొక్క యజ్ఞమునుగూర్చి, న ఆగచ్ఛన్తి=వచ్చుట లేదు? అహః=ఇది క్లిష్టపరిస్థితి. యో వై=ఏ యజమానుఁడైతే, పూర్వః=ఇతరులకంటె ముందుగా చేయుటకు ప్రవర్తించినవాఁడై, దేవతాః=దేవతలను, పరిగృహ్ణాతి=స్వీకరించుచున్నాఁడో, (=ఆహ్వానించుచున్నాఁడో,) సః=ఆ యజమానుఁడు, ఏనాః=ఈ దేవతలను ఉద్దేశించి, శ్వోభూతే=మఱునాఁడు, యజతే=యాగము చేయుట కర్హుఁడగు చున్నాఁడు.

తాత్పర్యము: యజమాను లనేకులు ఏకకాలమునందే సోమయాగములను దర్శపూర్ణమాసయాగములను చేయుట కుద్యుక్తులయినచో, ఏ యజమానుని యాగమునకు దేవతలు వత్తురు? ఏ యజమానుని యాగమునకు రారు?, ఇది సంకట పరిస్థితి కదా? ఇది యొక ప్రశ్న. ఇందుకు సమాధానము అనేక యజమానులలో ఏ యజమానుఁడు ఇతరులకంటె ముందు ప్రవృత్తుఁడై దేవతల నాహ్వానించునో, ఆ యజమానుఁడే మఱునాఁడు తాను పరిగ్రహించిన దేవతల నుద్దేశించి యాగము చేయుట కర్హుఁడగును. యజమాను లందఱు పరస్పర మాత్సర్యముతో ప్రథమముననే ప్రవర్తించినచో పైని పేర్కొనఁబడిన క్లిష్టపరిస్థితి యనివార్యమే కదా? అన్నచో, పరిగ్రహ మంత్ర పాఠముచేతనే ఈ క్లిష్టపరిస్థితి నివార్యమాణ మగును. యాగము ఉద్దేశ్యత్యాగ మాత్రమే కనుక దేవతలు రాకున్నను ఆ యజమానుఁడు యాగానుష్ఠానమున కర్హుఁడగును. ఇది మఱియొక సమాధానము. లేదా=దేవతలు యోగసామర్థ్యముచే బహు శరీరములను దాల్చి ఏకకాలమునందే సర్వయజ్ఞములకు రాగలరు. ఇది నిరాతంకమైన సమాధానము. ఈ విషయమును బాదరాయణ మహర్షి వేదాన్త సూత్రగ్రంథమునందు దేవతాధికరణమున "విరోధః కర్మణీతిచే న్నానేక ప్రతిపత్తే ర్దర్శనాత్" అను సూత్రమున విశదీకరించెను.

2. అర్థము: ఆహవనీయః యత్=ఆహవనీయాగ్ని యేది (కలదో,) ఏతత్ వై=ఈ ఆహవనీయమే, దేవానామ్=దేవతలకు, ఆయతనమ్=స్థానము. అన్తరాగ్ని=ఆహవనీయ గార్హపత్యాగ్నుల మధ్యప్రదేశము, పశూనామ్=పశువులకు, (ఆయతనమ్=స్థానము.) గార్హపత్యః=గార్హపత్యాగ్ని, మనుష్యాణామ్=మనుజులకు, (ఆయతనమ్=స్థానము. అన్వాహార్య పచనః=దక్షిణాగ్ని, పితృణామ్=పితృదేవతలకు, (ఆయతనమ్=స్థానము.)

తాత్పర్యము: దేవతా పరిగ్రహార్థములైన దేశవిశేషముల విధిని ఈ యర్థవాదవాక్యము వ్యక్తము చేయుచున్నది. దేవతల పరిగ్రహార్థమైన ప్రదేశము ఆహవనీయము. పశు పరిగ్రహార్థమైన ప్రదేశము ఆహవనీయ గార్హపత్యాగ్నుల మధ్య ప్రదేశము. మనుష్యుల పరిగ్రహార్థమైన స్థానము గార్హపత్యము. పితృదేవతల పరిగ్రహార్థమైన స్థానము దక్షిణాగ్ని.

3. అర్థము: (యజమానః=యజమానుఁడు,) అగ్నిమ్=అగ్నిని, గృహ్ణాతి=గ్రహించవలెను. స్వే ఆయతనే ఏవ=స్వీయ స్థానమునందే, దేవతాః=దేవతలను, పరిగృహ్ణాతి=పరిగ్రహించవలెను. తాః=ఆ పరిగ్రహింపఁబడిన దేవతలనుగూర్చి, శ్వోభూతే=మఱునాడు, యజతే=యాగము చేయవలెను.

తాత్పర్యము: యజమానుఁడు ప్రథమమున ఆహవనీయ గార్హపత్య దక్షిణాగ్ని స్థానములందు అగ్నిని ప్రతిష్ఠించి, పిమ్మట దేవతా పరిగ్రహణ స్థానమునందు దేవతల నాహ్వానించి ఆ దేవతల నుద్దేశించి, మఱునాఁడు యాగము చేయవలెను. (ఈ మంత్రము దేవతా పరిగ్రహణ విధాయకము.)

4. అర్థము: వ్రతపతిః=యాగరూప వ్రతమునకు పతియైన, అగ్నిః=అగ్ని, వ్రతేన వై=వక్ష్యమాణ మంత్రపాఠరూప వ్రతస్వీకారముచేతనే, మేధ్యః=యాగ యోగ్యుఁడు, భవతి=అగుచున్నాఁడు. బ్రాహ్మణః (అపి)=యజమానుఁడు కూడ, వ్రతభృత్=వ్రతము నవలంబించినవాఁడు, (భవతి=అగుచున్నాఁడు.)

తాత్పర్యము: "వ్రత ముపైష్యన్" ఇత్యాది వక్ష్యమాణ వ్రతస్వీకార మంత్రపాఠముచేతనే, యజ్ఞపతియగు అగ్ని యాగ యోగ్యుఁ డగుచున్నాఁడు. యజమానుఁడుకూడ వ్రతావలంబి యగుచున్నాఁడు.

5. అర్థము: (యజమానః=యజమానుఁడు) వ్రతమ్=వ్రతమును, ఉపైష్యన్=పొందఁబోవుచు, ''వ్రతపతే!=యాగరూప వ్రతమునకు పతివైన, హే అగ్నే!=ఓ యగ్నీ!, వ్రతమ్=యాగరూప వ్రతమును, చరిష్యామి=ఆచరించఁగలను'' ఇతి=అని, బ్రూయాత్=పలుకవలెను.

తాత్పర్యము: యజమానుఁడు యాగవ్రతము నాచరింపఁబోవుచు 'వ్రతపతివైన అగ్నీ! యాగవ్రతము నాచరింపఁగలను' అని పలుకవలెను.

6. అర్థము: దేవానామ్=దేవతలలో, అగ్నిః వై=అగ్నియే, వ్రతపతిః=యజ్ఞరూప వ్రతమునకు నాయకుఁడు. తస్మై ఏవ=ఆ యగ్నికొఱకే, ప్రతిప్రోచ్య=నిర్దేశము చేసి, వ్రతమ్=యజ్ఞరూప వ్రతమును, ఆలభతే=ఆరంభము చేయవలెను. (ఆలభతే=ఆరభతే)

తాత్పర్యము: దేవతలలో అగ్నియే వ్రతపతి కావున ఆ యగ్ని నుద్దేశించియే యజ్ఞము చేయవలెను.

7. అర్థము: బర్హిషా=బర్హి రాహరణముచే, (సూచితమైన కాలమునందు,) పూర్ణమాసే=పూర్ణిమ తిథియందును, వత్సైః=గోవత్సల అపాకరణముచే, (సూచితమైన కాలమునందు,) అమావాస్యాయామ్=అమావాస్య తిథియందును, వ్రతమ్=యజ్ఞ వ్రతమును, (యజమానః=యజమానుఁడు,) ఉపైతి=పొందవలెను. (=చేయవలెను.) ఏతత్=ఈ కాలద్వయము, ఏతయోః=ఈ పూర్ణిమామావాస్యలయందు, (వ్రతము స్వీకరించుటకు,) ఆయతనం హి=స్థానము కదా?.

తాత్పర్యము: బర్హి రాహరణము, (బర్హిస్సును తీసికొనివచ్చుట.) వత్సాపాకరణము (గోవులనుండి వత్సలను తొలగించుట,) ప్రథమ ప్రపాఠకమునందు వివరింపఁబడినవి. ఆ బర్హి రాహరణముచే ఉపలక్షితమైన కాలము పూర్ణిమనాటి వ్రతాచరణమునకు ఉచితమైనది. వత్సాపాకరణముచే ఉపలక్షితమైన కాలము అమావాస్యనాటి యజ్ఞవ్రతాచరణమునకు ఉచితమైనది. ఆ కాలములందు దర్శపూర్ణమాస యాగము లాచరించవలెను.

8. అర్థము: అగ్నిః=అగ్ని, పూర్వశ్చ=దర్భ పరిస్తరణమునకు పూర్వుఁడుగాను, అపరశ్చ=అపరుఁడుగాను, ఉపస్తీర్యః=ఉపస్తరణము చేయఁదగినవాఁడుగా, (ఋషయః=ఋషులు,) ఆహుః=చెప్పిరి.

తాత్పర్యము: అధ్వర్యుఁడు ఆహవనీయ గార్హపత్యాగ్నుల కంతటను దర్భలను పఱచవలెను. ఇట్లు దర్భలు పఱచుట పరిస్తరణ మనఁబడును. అచ్ఛిద్ర కాండ గతమైన "ఉభావగ్నీ ఉప స్తృణతే" ఇత్యాది మంత్రమును యజమానుఁడు జపించుట ఉపస్తరణ మనఁబడును. పరిస్తరణమునకు పూర్వమును పిమ్మటను గూడ అగ్న్యుపస్తరణము చేయవలెనని యీ మంత్రము చెప్పుచున్నది.

9. అర్థము: మనుష్యాః ఇన్న్వై=మనుష్యులు గూడ, ఉపస్తీర్ణమ్=తృణాదులచే అచ్ఛాదితమైన గృహమును, ఇచ్ఛన్తి=కోరుచున్నారు. దేవాః కిము=దేవతలు ఉపస్తరణమును కోరుచున్నారని యేమి చెప్పవలెను?, యేషామ్=ఏ దేవతలకు, నవావసానమ్=నూతన గృహము, నిష్పద్యతే=ఏర్పఱచఁబడుచున్నదో, యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ విధముగా, విద్వాన్=తెలిసికొనినవాఁడై, అగ్నిమ్=అగ్నిని, ఉపస్తృణాతి=ఉపస్తరించు చున్నాఁడో, అస్మిన్=ఈ యజమానుఁడు, శ్వః=మఱునాఁడు, యక్ష్యమాణే సతి=యాగము చేయఁబోవుచుండఁగా, పూర్వేద్యుః=పూర్వదినమున, ఉప=యజమాన సమీపమున, దేవాః=దేవతలు, వసన్తి=నివసించుచున్నారు.

తాత్పర్యము: (పై మంత్రమున విధింపఁబడిన ఉపస్తరణను ఈ బ్రాహ్మణమున వివరింపఁబడుచున్నది.) అత్యంత దరిద్రులయిన మనుష్యులు కూడ తృణాదులచే కప్పఁబడిన గృహము నభిలషించుచుండగా, మహా ప్రభావవంతులయిన దేవతలు ఉపస్తరణమును కోరుదురని వేఱుగ చెప్పవలెనా? ఏ దేవతల యిచ్ఛానుసారముగ అప్పుడప్పుడు అచ్చటచ్చట నూతన గృహము ఏర్పఱచఁబడునో, ఏ యజమానుఁ డీ విధముగ తెలిసికొనినవాఁడై అగ్నికి ఉపస్తరణము చేయునో, పూర్వదినమున ఆ యజమానుఁని సమీపమునందు హవిర్భుక్కులగు దేవతలు నివసించుచుందురు. (ఇత్ + ను + ఉ=ఇన్వా. ఈ నిపాతత్రయము అపి శబ్దార్థకము.)

10. అర్థము: యజమానేన=యజ్ఞకర్తచేత, గ్రామ్యాశ్చ=గ్రామ సంబంధమైనవియు, ఆరణ్యాశ్చ=అరణ్య సంబంధమైనవియునగు, పశవః=పశువులు, అవరుధ్యాః=సంపాదింపఁదగినవి. ఇతి=అని, (బుద్ధిమన్తః=బుద్ధిమంతులు,) ఆహుః=చెప్పుచున్నారు. (యజమానః=యజమానుఁడు,) గ్రామ్యాన్=గ్రామ్యములయిన వ్రీహ్యాది ధాన్యములకు సంబంధించిన ఆహారమును, ఉపవసేత్ యత్=ఉపవసించినచో, (విడిచినచో,) తేన=ఆ వ్రీహ్య ద్యాహారోపవాసముచేత, గ్రామ్యాన్=గ్రామ్య పశువులను, అవరున్ద్ధే=పొందుచున్నాఁడు. ఆరణ్యస్య=అరణ్యమునకు సంబంధించిన నీవారాది ధాన్యముయొక్క (అన్నమును,) అశ్నాతి యత్=భుజించినచో, తేన=ఆ నీవారాద్యన్న భోజనముచేత, ఆరణ్యాన్=ఆరణ్యక పశువులను, అవరున్ద్ధే=పొందుచున్నాఁడు. అనాశ్వాన్ ఉపవసతి యది=ఉభయ విధమయిన ఆహారమును వర్జించి ఉపవసించినచో, పితృదేవత్యః స్యాత్=(అ వ్రత విశేషము,) పితృదేవతాకమగును.

తాత్పర్యము: పశువులు గ్రామ్యములు ఆరణ్యకములు, అని రెండు విధములు. గవాశ్వాజాదులు గ్రామ్యములు. ద్విఖుర, శ్వాపదాదులు ఆరణ్యకములు. నీవారమను ధాన్యవిశేషము ఆరణ్యకము. యజమానుఁడు గ్రామ్య పశువులను ఆరణ్యక పశువులను సంపాదింపవలయును, అని బుద్ధిమంతులు చెప్పుచున్నారు. యజ్ఞకర్త యజ్ఞదీక్షా సమయమునందు వ్రీహ్యాది గ్రామ్యధాన్యపు టాహారమును వర్జించి ఉపసించినచో గ్రామ్య పశువులను సంపాదించును. ఆరణ్యకమైన నివ్వరి ధాన్యపు టాహారమును భుజించినచో ఆరణ్యక పశువులను సంపాదించును. రెండువిధములయిన ఆహారమును, వర్జించినచో పితృదేవతలు భోజనమును వర్జించి శ్రాద్ధము చేయువారి నభినందింతురు కావున, ఆ కర్మ పితృదేవతాక మగును. ఆరణ్య ధాన్యాహారమును విధింపఁబోవుచు ముందుగ ఆ భోజనమును ఈ బ్రాహ్మణము స్తుతించుచున్నది.

11. అర్థము: ఇంద్రియమ్=ఇంద్రియాభివృద్ధి హేతువైన, ఆరణ్యస్య=ఆరణ్య ధాన్యాహారమును, అశ్నాతి=భుజింపవలెను. ఆరణ్యమ్=ఆరణ్య ధాన్యాహారము, ఇన్ద్రియమేవ=ఇంద్రియాభివృద్ధినే, ఆత్మని=తనయందు, ధత్తే వా=కలుగఁజేయుచున్నది కదా.

తాత్పర్యము: యజమానుఁడు యజ్ఞ దీక్షాసమయమున ఇంద్రియాభివృద్ధిహేతువైన ఆరణ్య ధాన్యాహారమును భుజింపవలెను. ఆరణ్య ధాన్యాహారము తనయందు ఇంద్రియాభివృద్ధిని కలుగఁజేయును కదా.

12. అర్థము: (యజమానః=యజమానుఁడు,) అనాశ్వాన్=ఉభయవిధాహారభోజనము లేనివాఁడై, ఉపవసేత్ యత్=ఉపవసించినచో, క్షోధుకః=ఆఁకలిగొన్నవాఁడు, స్యాత్=అగును. అశ్నీయాత్ యత్=భుజించినచో, రుద్రః=రుద్రదేవుడు, అస్య=ఈ యజమానునియొక్క, పశూన్=పశువులను, అభిమన్యేత=చంపును.

తాత్పర్యము: యజ్ఞకర్త యజ్ఞదీక్షా సమయమున ఉభయవిధాహారమును భుజించని వాఁడై ఉపవసించినచో ఆఁకలిగొన్న వాఁడగును. భుజించినచో ఇతని పశువులను రుద్రదేవుఁడు చంపును.

13. అర్థము: (యజ్ఞకర్తా=యజ్ఞకర్త) అపః=ఉదకములను, అశ్నాతి=అశనము చేయవలెను (=త్రాగవలెను). తత్=ఆ ఉదకపానము, అశితమివ న=భోజనము చేసినట్లు ఉండదు. అనశితమివ న=భోజనము చేయనట్లు ఉండదు. క్షోధుకః న భవతి=ఆఁకలి గొన్నవాఁడు నగుటలేదు. అస్య=ఈ యుదకపానము చేసిన యజమానునియొక్క, పశూన్=పశువులను, రుద్రః=రుద్రదేవుఁడు, నాభిమన్యతే=హింసించుట లేదు.

తాత్పర్యము: యజ్ఞకర్త యజ్ఞ దీక్షాకాలమున నీటిని మాత్రమే త్రాగవలెను. ఇట్లు చేసినచో ఉదక పానము అన్నమును భుజించుటవంటిది కాదు. ఆఁకలి తీరును. కావున భుజించనియట్లును ఉండదు. కావున యజమానుఁడు ఆఁకలిగొన్నవాఁడు కాఁడు. ఇతని పశువులను రుద్రదేవుఁడు హింసింపఁడు. కావున పైని చెప్పిన దోషద్వయము ఈ పక్షమున లేదు.

14. అర్థము: యజ్ఞః=యజ్ఞము, వజ్రః వై=వజ్రాయుధమువంటిదే. మనుష్యస్య=మనుష్యునకు, క్షుత్=ఆఁకలి, భ్రాతృవ్యః ఖలు=శత్రువు కదా! అనాశ్వాన్=భోజనము విడిచినవాఁడై, (యజ్ఞకర్తా=యజ్ఞకర్త,) ఉపవసతి యత్=ఉపవాసము చేసినచో, వజ్రేణైవ=వజ్రాయుధముచేతనే, సాక్షాత్=సూటిగా, భ్రాతృవ్యమ్=శత్రువైన, క్షుధమ్=ఆఁకలిని, హన్తి=చంపుచున్నాఁడు.

తాత్పర్యము: యజ్ఞము నరకపాతాద్యనిష్ట నివారకము కావున, వజ్రాయుధ రూపమైనది. ఆఁకలి శత్రువువంటి దను విషయము ప్రసిద్ధమే. యజ్ఞాంగభూతమైన ఉపవాసము లక్షణముగాఁగల వజ్రముచేతనే ఈ యజ్ఞకర్త భావి జన్మమునందు రాబోవు ఆఁకలి యను ముఖ్య శత్రువును హింసించును. ఉపవాసము యజ్ఞాంగము కనుక యజ్ఞకర్త ఉపవాసము చేసినచో వజ్రాయుధము చేతనే ఆఁకలి యను శత్రువును సంహరించును. ఈ బ్రాహ్మణ వాక్యము ఉపవాసమును గూడ పక్షాంతరమున విధించుచున్నదని భావము.

సప్తమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే షష్ఠప్రపాఠకే అష్టమోఽనువాకః।

మూలము: [1]యో వై శ్రద్ధా మనారభ్య యజ్ఞేన యజతే నాస్యేష్టాయ శ్రద్దధతేఽ[2]పః ప్రణయతి శ్రద్ధా వా ఆప శ్శ్రద్ధా మే వాఽఽరభ్య యజ్ఞేన యజత ఉభయేఽస్య దేవమనుష్యా ఇష్టాయ శ్రద్దధతే [3]తదాహు రతి వా ఏతా వర్త్రం నేదన్త్యతి వాచం మనో వా వైతా నాతినేదన్తీతి [4]మనసా ప్రణయతీ[5]యం వై మనః (౧)అనయైవైనాః ప్రణయ త్య[6]స్కన్న హవి ర్భవతి య ఏవం వేద [7]యజ్ఞాయుధాని సంభరతి యజ్ఞో వై యజ్ఞాయుధాని యజ్ఞ మేవ తత్సంభరతి [8]యదేక మేకగ్ం సంభరే త్పితృదేవత్యాని స్యు ర్యత్సహ సర్వాణి మానుషాణి [9]ద్వేద్వే సంభరతి యాజ్యానువాక్యయో రేవ రూపం కరో త్యథో మిథున మేవ [10]యో వై దశ యజ్ఞాయుధాని వేదముఖతోఽస్య యజ్ఞః కల్పతే[11]స్ఫ్యశ్ (౨)చ కపాలాని చాగ్నిహోత్రహవణీ చ శూర్పం చ కృష్ణాజినం చ శమ్యా చోలూఖలం చ ముసలం చ దృషచ్చోపలా చైతాని వై దశ యజ్ఞాయుధాని య ఏవం వేద ముఖతోఽస్య యజ్ఞః కల్పతే [12]యో దేవేభ్యః ప్రతి ప్రోచ్య యజ్ఞేన యజతే జుషన్తేఽస్య దేవా హవ్యగ్ం [13]హవి ర్నిరుప్యమాణ మభిమన్త్రయేతాగ్నిగ్ం హోతార మిహ తగ్ం హువ ఇతి (౩)దేవేభ్య ఏవ ప్రతిప్రోచ్య యజ్ఞేన యజతే జుషన్తేఽస్య దేవా హవ్య [14]మేష వై యజ్ఞస్య గ్రహో గృహీత్వైవ యజ్ఞేన యజతే [15]తదుదిత్వా వాచం యచ్ఛతి యజ్ఞస్య ధృత్యా [16]అథో మనసా వై ప్రజాపతి ర్యజ్ఞ మతనుత మనసైవ తద్యజ్ఞం తనుతే రక్షసా మనన్వచా

రాయ [17]యో వై యజ్ఞం యోగ ఆగతే యునక్తి యుఙ్క్తే యుఙ్క్తానేషు [18]క స్త్వా యునక్తి స త్వా యునక్త్విత్యాహ ప్రజాపతి ర్వై కః ప్రజాపతినైవైనం యునక్తి యుఙ్క్తే యుఙ్క్తానేషు ॥౮॥ (వై మన స్సృ ఇతి యునక్త్వేకాదశ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే షష్ఠప్రపాఠకే ఽష్టమోఽనువాకః।

వేదార్థదీపిక

అవతారిక: సప్తమానువాకమున దేవతా పరిగ్రహాదికము చెప్పఁబడినది. ఈ అష్టమానువాకమున యజ్ఞాయుధ సంభృతి చెప్పఁబడు చున్నది. ఆ యజ్ఞాయుధ సంభృతికి ముందు జలప్రణయనము చెప్పఁబడుచున్నది.

1. అర్థము: యః వై=ఏ యజమానుఁడైతే, శ్రద్ధామ్=శ్రద్ధను, అనారభ్య=అవలంబింపక, యజ్ఞేన యజతే=యజ్ఞము చేయుచున్నాఁడో, (దేవాః ఋత్విజశ్చ=దేవతలు ఋత్విజులు కూడ,) అస్య=ఈ యజమానునియొక్క, ఇష్టాయ=అనుష్ఠిత యాగముకొఱకు, న శ్రద్దధతే=విశ్వసించుటలేదు. (=విశ్వసింపరు.)

తాత్పర్యము: మనస్సున శ్రద్ధవహింపక యజమానుఁడు చేసిన యజ్ఞమును దేవతలు ఋత్విజులు కూడ విశ్వసింపరు.

2. అర్థము: (యజమానః=యజమానుఁడు,) అపః=ఉదకములను, ప్రణయతి=ప్రణయనము చేయవలయును. ఆపః= ఉదకములు, శ్రద్ధా వా=శ్రద్ధా స్వరూపములే, (ఏవం చేత్=ఇట్లైనచో,) శ్రద్ధా మారభ్యైవ=శ్రద్ధ నవలంబించియే, యజ్ఞేన యజతే=యజ్ఞము చేసినవాఁడగును. దేవ మనుష్యాః=దేవతలు ఋత్విజులు, ఉభయే= ఉభయులు, అస్య=ఈ యజమానునియొక్క, ఇష్టాయ=చేయఁబడిన యజ్ఞముకొఱకు, శ్రద్దధతే=విశ్వసించుచున్నారు.

తాత్పర్యము: యజమానుఁడు ఉదకములను ప్రణయనము చేయవలెను. ఉదకములు శ్రద్ధా స్వరూపములే కావున, ఉదక ప్రణయనము చేసిన యజమానుఁడు శ్రద్ధతో యాగము చేసినవాఁడే యగును. అప్పుడు దేవతలు ఋత్విజులు ఉభయులును ఈ యజ్ఞకర్తయొక్క యజ్ఞమును విశ్వసింతురు. (ఉదకములు శ్రద్ధాహేతువు అని ఐతరేయ బ్రాహ్మణమున చెప్పఁబడినది. కనుక ఇచట ఉదకములకు శ్రద్ధాత్వము చెప్పఁబడినది.)

3. అర్థము: తత్=ఆ యుదకప్రణయనము విషయమున, ఇతి=ఈ విధముగ, (అభిజ్ఞాః=అభిజ్ఞులు,) ఆహుః=చెప్పుచున్నారు. ఏతాః=ఈ ఉదకములు, వర్త్మ=శరీరవృత్తిని, వాచం వా=వాక్కును గూడ, అతినేదన్తి= అతిక్రమించుచున్నవి. ఏతాః=ఈ యుదకములు, మనః వా వా=మనస్సు నొకదానినే, నా తినేదన్తి=అతి క్రమించుటలేదు, ఇతి=అని, ఆహుః=చెప్పుచున్నారు.

తాత్పర్యము: ఈ యుదకములు శరీర ధర్మమును, వాక్కును గూడ అతిక్రమించుచున్నవి. మనస్సును మాత్ర మతిక్రమించుట లేదని అభిజ్ఞులు చెప్పుచున్నారు. (నదీప్రవాహగత జలమును శరీరము కాని వాక్కు గాని అతిక్రమింప లేవు. అది మనస్సునకు మాత్రమే సాధ్యమని భావము.)

4. అర్థము: మనసా=మనస్సుతో, (పృథివీం ధ్యాయన్=భూమిని ధ్యానించుచు,) ప్రణయతి=ప్రణయనము చేయవలెను. (ఇది అపాంప్రణయన విధాయక మంత్రము.)

తాత్పర్యము: యజమానుఁడు మనస్సుతో పృథివిని ధ్యానించుచు అపాంప్రణయనము చేయవలెను.

5. అర్థము: ఇయం వై=ఈ పృథివియే, మనః=మనస్సు. అనయైవ=ఈ పృథివిచేతనే, ఏనాః=ఈ యుదకములను, ప్రణయతి=ప్రణయనము చేసినవాఁడగుచున్నాఁడు.

తాత్పర్యము: ఈ పృథివియే మనస్సు కావున మనస్సుతో భూమిని ధ్యానము చేయుచు అపాంప్రణయనము చేసిన యజమానుఁడు పృథివిచేతనే అపాంప్రణయనము చేసినవాఁడగుచున్నాఁడు, (పృథివివలె వ్యాపింప శక్యమైనది కావున, మనస్సునందు పృథివీత్వము ఆరోపించఁబడినది. నదీగత జలములు పృథివి నతిక్రమంపనేరవు.)

6. అర్థము: యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ పూర్వోక్తవిధముగా, వేద=తెలిసికొనుచున్నాఁడో, సః=ఆ యజమానుఁడు, అస్కన్న హవిః=జారిపోని హవిస్సు కలవాఁడు, (భవతి=అగుచున్నాఁడు.)

తాత్పర్యము: ఈ పై విధముగ తెలిసికొనిన యజమానుఁడు అస్కన్న హవిస్సు కలవాఁడగును. (ఇతని హవిస్సు అంతయు అగ్నియందే పడును గాని అగ్నికి వెలుపల పడదు.)

7. అర్థము: (అధ్వర్యుః=అధ్వర్యుఁడు,) యజ్ఞాయుధాని=యజ్ఞసాధనములైన స్ఫ్యకపాలాదులను, సంభరతి=సంపాదించవలెను. యజ్ఞో వై=యజ్ఞమే, యజ్ఞాయుధాని=యజ్ఞాయుధములు. తత్=అందువలన, (సః=ఆ యజ్ఞాయుధములను సంపాదించిన అధ్వర్యుఁడు,) యజ్ఞమేవ=యజ్ఞమునే, సంభరతి=సంపాదించిన వాఁడగుచున్నాఁడు.

తాత్పర్యము: (ముందు చెప్పఁబోవు స్ఫ్యకపాలాదులు యజ్ఞ సాధనము లగుటచే ఇచట యజ్ఞాయుధములుగా వర్ణింపఁబడినవి.) అధ్వర్యుఁడా యజ్ఞాయుధములను సంపాదించవలెను. యజ్ఞమే యజ్ఞాయుధములు కావున, యజ్ఞాయుధములను సంపాదించిన అధ్వర్యుఁడు యజ్ఞమునే సంపాదించినవాఁడగును. (సాధ్యమయిన యజ్ఞమునకు సాధనములైన స్ఫ్యకపాలాదులకు అభేదోపచారముచే యజ్ఞమునకు యజ్ఞాయుధత్వము సిద్ధించినది.)

8. అర్థము: ఏక మేకమ్=యజ్ఞాయుధముల నొకటొకటిగా, సంభరేత్ యత్=సంపాదించినచో, (=ప్రయోగించినచో,) పితృదేవత్యాని=(అవి) పితృదేవతాకములు, స్యుః=అగును. సర్వాణి=అన్నియు, సహ సంభరేత్ యత్=ఒకమారుగా ప్రయోగించినచో, (తాని=అవి,) మానుషాణి=మనుష్యసంబంధము కలవి. స్యుః=అగును.

తాత్పర్యము: యజ్ఞాయుధములను ఒకటొకటిగా ప్రయోగించినచో అవి పితృదేవతాకములగును. అన్నియు నొకమారుగ సామూహికముగ ప్రయోగించినచో అవి మానుషములగును. (యజ్ఞాయుధముల ప్రయోగము మూఁడు విధములుగా నున్నది. 1) ఒక్కటొక్కటిగా ప్రయోగించుట; 2) అన్నియు నొక్కమారుగ ప్రయోగించుట. 3) రెండేసిచొప్పున ప్రయోగించుట. వీనిలో మూఁడవ పక్షమును విధించుటకై మొదటి రెండు పక్షములు ఈ మంత్రముచే నిందింపఁబడినవి. మూఁడవ పక్షమును నవమ మంత్రము విధించుచున్నది.)

9. అర్థము: ద్వే ద్వే=రెండు రెండు ఆయుధములను, సంభరతి=ప్రయోగించవలెను. (సః ప్రయోగః=ఆ ప్రయోగము) యాజ్యానువాక్యయోః=యాజ్యా పురోనువాక్యలయొక్క, రూపమ్=స్వరూపమును, (=విధమును,) కల్పతి=కల్పించుచున్నది. అథో=ఇంకను, మిథునమేవ=(స్త్రీపురుషరూప,) మిథునమునే, కల్పతి=పొందుచున్నది.

తాత్పర్యము: యజ్ఞాయుధములను రెండేసి చొప్పున ప్రయోగించవలెను. అట్టి ప్రయోగమునకు జంటలుగానున్న యాజ్యా పురోనువాక్యల రూపము స్త్రీపురుషాత్మక మిథునత్వము సిద్ధించును.

10. అర్థము: యః=ఏ యజమానుఁడు, దశ=పదియగు యజ్ఞాయుధములను, ముఖతః వై=యజ్ఞారంభమునందే, (సంపాద్యాని ఇతి=సంపాదనీయములని,) వేద=తెలిసికొనుచున్నాఁడో, అస్య=ఈ తెలిసికొనిన యజమానుని యొక్క, యజ్ఞః=యజ్ఞము, కల్పతే=(నిర్విఘ్నప్రశ,) అనుష్ఠానయోగ్య మగుచున్నది.

తాత్పర్యము: యజ్ఞారంభమునందే దశవిధములయిన యజ్ఞాయుధములు సంపాదింపఁదగినవని తెలిసికొనిన యజమానుని యజ్ఞము నిర్విఘ్నముగ అనుష్ఠించుటకు యోగ్యమగుచున్నది.

11. అర్థము: 1)స్ఫ్యః,=బాహుమాత్ర పరిమాణముగల ఖడ్గాకార కాష్ఠవిశేషము. 2)కపాలాని=పగిలిన ఖాండలేశ సదృశములు. 3)అగ్నిహోత్రహవణీ=బాహుమాత్ర పరిమాణము కలదియు, కాలిపిక్కవలె నుండునదియునైన కాష్ఠవిశేషము. 4) శూర్పమ్=చేట. 5) కృష్ణాజినమ్=జింకచర్మము. 6) శమ్యా=బాహుమాత్ర పరిమాణము కలదియు, గదాకారము కలదియునైన కాష్ఠవిశేషము. 7) ఉలూఖలమ్=(కొయ్యతో చేయఁబడిన,) ఱోలు 8) ముసలమ్=(కొయ్యతో చేయఁబడిన,) రోఁకలి. 9) దృషత్=ఒకానొక ఱాయి. (దృణాతీతి=దృషత్, 'దౄ' హింసాయామ్.) 10) ఉపలా=ఒకానొక ఱాయి. (వస్తువులను ఖండించునదియని వ్యుత్పత్త్యర్థము.) ఏతాని వై=ఇవియే, దశ యజ్ఞాయుధాని=పది యజ్ఞాయుధములు. చకారములన్నియు పరస్పర సముచ్చయార్థకములు. తాత్పర్యము సులభము.

12. అర్థము: యో వై=ఏ యజమానుఁడైతే, దేవేభ్యః=దేవతలకొఱకు, ప్రతిప్రోచ్య=వినిపించి, యజ్ఞేన యజతే=యజ్ఞము చేయుచున్నాఁడో, అస్య=ఈ యజమానునియొక్క, హవ్యమ్=హవిస్సును, దేవాః=దేవతలు, జుషన్తే=సేవించుచున్నారు. (=భుజించుచున్నారు. "జుషీ"=ప్రీతిసేవనయోః, అను ధాతువునుండి 'జుషన్తే' అను రూప మేర్పడినది.)

తాత్పర్యము: ఈ హవిస్సును మీకొఱకు హోమము చేయుదునని దేవతలకు వినిపించిన యజ్ఞకర్తయొక్క హవిస్సును దేవతలు స్వీకరింతురు.

13. అర్థము: ఇహ=ఈ యజ్ఞ కర్మయందు, హోతారమ్=దేవతల నాహ్వానించునట్టి, తమ్+అగ్నిమ్=ఆ యగ్నిని, (అహమ్=నేను,) హువే=ఆహ్వానించుచున్నాను. ఇతి=అని, నిరుప్యమాణమ్=పాత్రమున నుంచఁబడుచున్న, హవిః=హవిస్సును, అభిమంత్రయేత=అభిమంత్రించవలెను. (అభితః+మంత్రణమ్=అభిమంత్రణమ్. 'దేవేభ్యః' ఇత్యాది మంత్రభాగము 2వ మంత్రవ్యాఖ్యానమున గతార్థము.)

తాత్పర్యము: 'ఈ కర్మయందు దేవతల నాహ్వానించు నగ్నిని, నే నాహ్వానించుచున్నాను' అనెడి అర్థము గల 'అగ్నిగ్ంం హోతారమ్' ఇత్యాది మంత్రముతో పాత్రమునం దుంచఁబడుచున్న హవిస్సు నభిమంత్రించవలెను. శేషము క్తము.

14. అర్థము: ఏషః=ఈ మంత్రప్రయోగము, (అభిమంత్రణము,) యజ్ఞస్య=యజ్ఞముయొక్క, సంగ్రహః వై=స్వీకారరూపమే, గృహీత్వైవ=(ఈ యభిమంత్రణమును,) గ్రహించియే, యజ్ఞేన యజతే=యాగము చేయవలెను.

తాత్పర్యము: ఈ యభిమంత్రణము స్వీకారరూపమే. ఈ యభిమంత్రణమును స్వీకరించియే యాగము చేయవలెను.

15. అర్థము: తత్=ఆ యభిమంత్రణ వాక్యమును, యజ్ఞస్య=యజ్ఞముయొక్క, ధృత్యై=స్థైర్యముకొఱకు, ఉదిత్వా=చెప్పి, వాచమ్=వాక్కును, (యజమానః=యజమానుఁడు,) యచ్ఛతి=నియమించవలెను. (ఉదిత్వా=ఉక్త్వా.)

తాత్పర్యము: యజమానుఁడు యజ్ఞ స్థిరత్వముకొఱకు పైని ఉదాహరించిన అభిమంత్రణవాక్యమును చెప్పి పిమ్మట మౌనము నవలంబించవలెను. (ఇది మౌనవిధాయక మంత్రము.)

16. అర్థము: ప్రజాపతిః=ప్రజాపతి, మనసా వై=మనస్సుచేతనే, (మౌనముచేతనే,) యజ్ఞమ్=యజ్ఞమును, అతనుత=అనుష్ఠించెను. అథో=అందువలన, (యజమానః=యజమానుఁడు,) రక్షసామ్=రాక్షసులయొక్క, అన్వవచారాయ=ప్రచారము లేకుండుటకై,. తత్=ఆ మౌనముచేత, మనసైవ=మనస్సుచేతనే, యజ్ఞమ్=యజ్ఞమును, తనుతే=అనుష్ఠించుచున్నాఁడు.

తాత్పర్యము: శబ్దోచ్చారణము చేయునపుఁడు మనస్సు ప్రకృతయజ్ఞమునుండి స్ఖలించును. కావున ప్రజాపతి మనస్సుతోనే యజ్ఞము నారంభించెను. రాక్షస సంచారము లేకుండుటకై యజమానుఁడు కూడ ఆవిధముగ మౌనముతోనే మనస్సుచే యజ్ఞము నాచరించుచున్నాఁడు. (ఈ మంత్రమునందు మౌనము ప్రశంసింపఁబడినది.)

17. అర్థము: యో వై =ఏ యజమానుఁడైతే, యోగే ఆగతే సతి=యజ్ఞ యోగకాలము ఆసన్న మగుచుండగా, యజ్ఞమ్= యజ్ఞమును, యునక్తి=సంధానము చేయుచున్నాఁడో, (స ఏవ=ఆ యజమానుఁడే) యుఞ్జానేషు=యాగ సంధానము చేయు యజమానులలో, యుక్తే=యోగకాలమునందు యాగము చేయుచున్నాఁడను పేరు పొందుట కర్హుఁడగుచున్నాఁడు.

తాత్పర్యము: యాగము చేయుటకు యోగము కలిసివచ్చినపుడు యాగము చేయు యజమానుఁడు యోగకాలమునందు యాగము చేయు యజమానులలో యోగకాలమున యాగము చేయుచున్నాఁడను పేరు పొందుట కర్హుఁడగు చున్నాఁడు. (యజ్ఞయోగ విధి యిచట ప్రశంసించఁబడినది.)

18. అర్థము: (హే యజ్ఞ!=ఓ యజ్ఞమా!,) కః=ప్రజాపతి, త్వా=నిన్ను, యునక్తి=యోగ్యముగా చేయుచున్నాఁడు. (తత్=అకారణముచే,) సః=ఆ ప్రజాపతి, త్వా=నిన్ను, యునక్తు=యోగ్యముగ చేయుఁగాక. ఇతి=అని, అహ=(అయిదవ ప్రపాఠకమునందలి పదునొకండవ మంత్రము,) చెప్పెను. ప్రజాపతిః వై =ప్రజాపతియే, కః='కిం' శబ్దవాచ్యుఁడు. (అతః=ఇందువలన, యజమానః=యజమానుఁడు,) ప్రజాపతినైవ=ప్రజాపతి చేతనే, ఏనమ్=ఈ యాగమును, యునక్తి=యోగ్యముగ చేయుచున్నాఁడు. యుఞ్జానేషు=యోగకాలమున యాగము చేయు యజమానులలో, యుక్తే=యోగకాలమునందు యాగము చేయుచున్నాఁడని అనిపించు కొనుచున్నాఁడు.

తాత్పర్యము: ఐదవ ప్రపాఠకమునందు 'క స్త్వా యునక్తి' అను మంత్రము ప్రజాపతి యజ్ఞమును యోగ్యముగ చేయు చున్నాఁడని చెప్పెను, 'కః' అనగా ప్రజాపతి. కావున, యజమానుఁడు ప్రజాపతిచేతనే యజ్ఞమును యోగ్య ముగ చేయుచున్నాఁడు. యోగకాలమున యాగము చేయువారిలో ఈ యజమానుఁడు 'యుక్తే' అని యనిపించుకొనుట కర్హుఁడగుచున్నాఁడు. (ఎల్లప్పుడు అందరి యజ్ఞములను యోగ్యములనుగా చేయునట్టి ప్రజాపతియే ఇప్పుడు నాయజ్ఞమును గూడ రథమునం దశ్వమువలె నాయందు సంబంధింపఁజేయుఁగాక యని యజమానుని ప్రార్థన.)

అష్టమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే షష్ఠప్రపాఠకే నవమోఽనువాకః

మూలము: [1]ప్రజాపతి ర్యజ్ఞా నసృజతాగ్నిహోత్రం చాగ్నిష్టోమం చ పౌర్ణమాసీం చోక్థ్యం చామావా
స్యాం చాతిరాత్రం చ తా నుదమిమీత యావ దగ్నిహోత్ర మాసీ త్తావానగ్నిష్టోమో యావతీ
పౌర్ణమాసీ తావా నుక్థ్యో యావత్యమావాస్యా తావా నతిరాత్రో [2]య ఏవం విద్వా నగ్ని
హోత్రం జుహోతి యావ దగ్నిష్టోమేనోపాప్నోతి తావ దుపాప్నోతి య ఏవం విద్వా న్పౌర్ణ
మాసీం యజతే యావ దుక్థ్యేనో పాప్నోతి (౧) తావ దుపాప్నోతి య ఏవం విద్వా నమా
వాస్యాం యజతే యావ దతిరాత్రేణోపాప్నోతి తావ దుపాప్నోతి [3]పరమేష్ఠినో వా ఏష
యజ్ఞో ఽగ్ర ఆసీ త్తేన స పరమాం కాష్ఠా మగచ్ఛ త్తేన ప్రజాపతిం నిరవాసాయయ త్తేన
ప్రజాపతిః పరమాం కాష్ఠా మగచ్ఛ త్తేనే న్ద్రం నిరవాసాయయ త్తేనేన్ద్రః పరమాం కాష్ఠా
మగచ్ఛ త్తేనాగ్నీషోమా నిరవాసాయయ త్తేనా గ్నీషోమౌ పరమాం కాష్ఠా మగచ్ఛతాం యః
(౨)ఏవం విద్వా న్దర్శపూర్ణమాసౌ యజతే పరమా మేవ కాష్ఠాం గచ్ఛతి [4]యో వై ప్రజాతేన
యజ్ఞేన యజతే ప్ర ప్రజయా పశుభి ర్మిథునై ర్జాయతే ద్వాదశ మాసా స్సంవత్సరో ద్వాదశ
ద్వంద్వాని దర్శపూర్ణమాసయో స్తాని సంపాద్యానీత్యాహు [5]ర్వత్సం చోపావసృజత్యుఖాం
చాధిశ్రయత్యవ చ హన్తి దృషదౌ చ సమాహ న్త్యధి చ వపతే కపాలాని చోపదధాతి
పురోడాశం చ (౩)అధిశ్రయత్యాజ్యం చ స్తమ్బయజు శ్చ హరత్యభి చ గృహ్ణాతి వేదిం చ
పరిగృహ్ణాతి పత్నీం చ సం నహ్యతి ప్రోక్షణీ శ్చాసాదయత్యాజ్యం [6]చైతాని వై ద్వాదశ ద్వం
ద్వాని దర్శపూర్ణమాసయో స్తాని య ఏవగ్ం సంపాద్య యజతే ప్రజాతేనైవ యజ్ఞేన యజతే

ప్ర ప్రజయా పశుభి ర్మిథునై ర్జాయతే ॥౪॥

(ఉక్థ్యేనోపాప్నోత్యగచ్ఛతాం యః పురోడాశం చ చత్వారిగ్‍ంశ చ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే షష్ఠప్రపాఠకే నవమోఽనువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: అష్టమానువాకమునందు యజ్ఞాయుధ సంపాదనము చెప్పఁబడినది. ఈ నవమానువాకమునందు ద్వాదశ ద్వంద్వ సంపత్తి చెప్పఁబడుచున్నది.

1. అర్థము: ప్రజాపతిః=ప్రజాపతి, యజ్ఞాన్=అగ్నిహోత్రాది నామక యాగములను, అసృజత=సృష్టించెను. (తేషు=ఆ యాగములలో,) అగ్నిహోత్రం చ=అగ్నిహోత్ర నామక యాగమును, అగ్నిష్టోమం చ=అగ్నిష్టోమ నామక యాగమును, (ఏకం) ద్వంద్వమ్=ఒక ద్వంద్వముగను, పౌర్ణమాసీం చ+ఉక్థ్యం చ=పౌర్ణమాసీ యాగమును ఉక్థ్య నామక యాగమును, (ఏకం ద్వంద్వమ్=ఒక ద్వంద్వముగను,) అమావాస్యాం చ, అతిరాత్రం చ=అమావాస్య యాగమును, అతిరాత్ర యాగమును, ఏకం ద్వంద్వమ్=ఒక ద్వంద్వముగను, తాన్=ఆ యాగములను, ఉదమిమీత=తులనాత్మకముగ చేసెను. అగ్నిహోత్రమ్=అగ్నిహోత్ర యాగము, యావత్=ఏమాత్రపు ఫలము నిచ్చునట్టిదిగ, ఆసీత్=ఆయెనో, అగ్నిష్టోమః=అగ్నిష్టోమ యాగము, తావాన్=ఆమాత్రపు ఫలము నిచ్చునదిగ, ఆసీత్=ఆయెను. పౌర్ణమాసీ=పౌర్ణమాసి యను యాగము, యావతీ=ఎంతటి ఫలము నిచ్చునదియో, ఉక్థ్యః=ఉక్థ్య నామక యాగము, తావాన్=అంతటి ఫలము నిచ్చునది. అమావాస్యా=అమావాస్య యాగము, యావతీ=ఎంతటి ఫలము నిచ్చునదియో, అతిరాత్రః=అతిరాత్ర యాగము, తావాన్=అంతటిఫలము నిచ్చునదిగను, ఆసన్=అయినవి.

తాత్పర్యము: ప్రజాపతి అగ్నిహోత్రాది యాగములను సృష్టించెను. వానిలో అగ్నిహోత్ర పౌర్ణమాస్యమావాస్య యాగములు అల్ప ద్రవ్య మంత్ర క్రియావిశేష సాధ్యములు. కావున అల్పఫల దాయకములు. అగ్నిష్టోమోక్థ్యాతిరాత్ర యాగములు బహు ద్రవ్య మంత్ర క్రియావిశేష సాధ్యములు. కావున అధిక ఫల ప్రదములు. ప్రజాపతి ఆ యుభయవిధ యాగములను సృష్టించి కనిష్ఠ పుత్రునియందు తండ్రివలె ఆ యాఱింటిని మూఁడు సమానములయిన ద్వంద్వములుగ చేసెను. అట్లు చేయుటవలన అగ్నిహోత్రాది యాగములు అగ్నిష్టోమాది యాగములతో సమానములైనవి.

2. అర్థము: యః=ఏ యజ్ఞకర్త, ఏవమ్=ఈ పై మంత్రమున చెప్పఁబడిన విధముగ, విద్వాన్=తెలిసికొనినవాఁడై, అగ్నిహోత్రమ్=అగ్నిహోత్ర యాగమునుగూర్చి, జుహోతి=హోమము చేయుచున్నాఁడో, (సః=ఆ యాగకర్త,) అగ్నిష్టోమేన=అగ్నిష్టోమ యాగముచేత, యావత్=ఎంతటి ఫలమును, ఉపాప్నోతి=పొందుచున్నాఁడో, తావత్=అంతటి ఫలమును, ఉపాప్నోతి=పొందుచున్నాఁడు. యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ విధముగ, విద్వాన్=తెలిసికొనినవాఁడై, పౌర్ణమాసీం యజతే=పౌర్ణమాసి యుగమును జేయుచున్నాఁడో, ఉక్థ్యేన=ఉక్థ్యనామక యాగముచేత, యావత్=ఎంతఫలము పొందుచున్నాఁడో, తావత్=అంతటి ఫలమును, ఉపాప్నోతి=పొందుచున్నాఁడు. యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ విధముగ, విద్వాన్=తెలిసికొనిన వాఁడై, అమావాస్యాం యజతే=అమావాస్య యాగమును జేయుచున్నాఁడో, (సః=ఆ యాగకర్త,) అతిరాత్రేణ=అతిరాత్ర నామక యాగముచేత, యావత్=ఎంతటి ఫలమును, ఉపాప్నోతి=పొందుచున్నాఁడో, తావత్=అంతటి ఫలమును, ఉపాప్నోతి=పొందుచున్నాఁడు.

తాత్పర్యము: ప్రజాపతి యనుగ్రహమువలన అగ్నిహోత్రాద్యల్పఫల ప్రదాయక యాగములకు అగ్నిష్టోమాద్యధికఫల దాయకయాగసామ్యము ఒకటవ మంత్రమున చెప్పఁబడినది. ఈ సామ్యమును తెలిసికొనిన యజమానుఁడు అగ్నిహోత్రాది యాగములను జేసినను అగ్నిష్టోమాది యాగముల యనుష్ఠానమువలన కలిగెడి అధిక ఫలములను పొందుచున్నాఁడు. దీనివలన "అనుష్ఠాతృభి రగ్నిష్టోమాదిసామ్యం భావయేత్" అనెడి విధి స్ఫురింపఁజేయఁబడుచున్నది. అనఁగా సాలగ్రామాదులందు విష్ణ్వాది భావన చేసి దేవతాపూజ చేయువిధముగ, అల్పఫల దాయకము అయిన అగ్నిహోత్రాది యాగములందు, అధికఫల దాయకములయిన అగ్నిష్టోమాది యాగభావన చేయుచు, అనుష్ఠానము చేయవలెను. అట్లు చేసిన అగ్నిహోత్రాది యాగములవలన కూడ అధికఫలసిద్ధి కలుగునని భావము. కావున ఈ మంత్రము అగ్నిహోత్రాదులందు అగ్నిష్టోమాదివిధి పరమైనదని స్పష్టమగుచున్నది.

3. అర్థము: పరమేష్ఠినః=చతుర్ముఖ బ్రహ్మకు, అగ్రే ఏవ=పూర్వ (కల్ప) మునందే, ఏషః యజ్ఞః=(యజమానుఁడుగా ఉన్న వానికి,) ఈ దర్శపూర్ణమాస యజ్ఞము, ఆసీత్=ప్రవృత్త మయ్యెను. (=అనుష్ఠిత మయ్యెను.) తేన=ఈశ్వరార్పణ బుద్ధితో అనుష్ఠింపఁబడిన ఆ దర్శపూర్ణమాస యజ్ఞముచేత, సః=ఆ యజ్ఞకర్త, పరమాం కాష్ఠామ్=(ఈ) పరమేష్ఠిత్వ పదవిని, అగచ్ఛత్=పొందెను. తేన=ఉత్తమ ఫలహేతువైన ఆ దర్శపూర్ణమాసోపదేశముచేత, ప్రజాపతిమ్=దక్షప్రజాపతిని, నిరవాసాయయత్=(దర్శపూర్ణమాస యాగానుష్ఠానమునకై,) ప్రోత్సహించెను. తేన=ఆ దర్శపూర్ణమాస యాగానుష్ఠానముచేత, ప్రజాపతిః=దక్షప్రజాపతి, పరమాం కాష్ఠామ్ (దక్షప్రజాపతిత్వ రూపమైన,) ఉత్తమ పదవిని, అగచ్ఛత్=పొందెను. తేన=ఆ దర్శపూర్ణమాసోపదేశముచేత, ఇన్ద్రమ్=ఇంద్రుని, నిరవాసాయయత్=(దర్శపూర్ణమాస యాగానుష్ఠానమునకై) ప్రోత్సహించెను. తేన=ఆ దర్శపూర్ణమాస యాగానుష్ఠానముచేత, పరమాం కాష్ఠామ్=(ఇంద్రపదవి యనెడి,) ఉత్తమ పదవిని, అగచ్ఛత్=పొందెను. తేన=ఆ దర్శపూర్ణమాసానుష్ఠానోపదేశముచేత, అగ్నీషోమౌ=అగ్నీషోమ దేవతలను, నిరవాసాయయత్=(దర్శపూర్ణమాసానుష్ఠానమునకై,) ప్రోత్సహించెను. తేన=ఆ దర్శపూర్ణమాసానుష్ఠానముచేత, అగ్నీషోమౌ=అగ్నీషోమదేవతలు, పరమాం కాష్ఠామ్=అగ్నీషోమపదవి యనెడి ఉత్తమ పదవిని, అగచ్ఛతామ్=పొందిరి. యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ విధముగ, విద్వాన్=తెలిసికొనినవాఁడై, దర్శపూర్ణమాసౌ యజతే=దర్శపూర్ణమాస యాగములను జేయుచున్నాఁడో, (సః=ఆయజ్ఞకర్త,) పరమాం కాష్ఠామ్=(స్వర్గము అనెడి) ఉత్తమ పదవిని, గచ్ఛత్యేవ=నిశ్చయముగ పొందుచున్నాఁడు.

తాత్పర్యము: చతుర్ముఖ బ్రహ్మకు పూర్వకల్పమున ఒక యజమానుఁడు దర్శపూర్ణమాస యాగముల ననుష్ఠించెను. ఆ యజమానుఁడు ఆ దర్శపూర్ణమాస యాగానుష్ఠానముచేత బ్రహ్మపదవిని పొందెను. ఆ పరమేష్ఠి దక్షప్రజాపతికి ఆ యజ్ఞము నుపదేశించెను. అతఁ డాయజ్ఞము ననుష్ఠించుటచే తదనంతరము దక్షప్రజాపతి పదవిని పొందెను. ఈ విధముగ ఇంద్రుఁడు అగ్నీషోములు దర్శపూర్ణమాస యాగానుష్ఠానముచేతనే తమ తమ యింద్రాగ్నీషోమ పదవుల నొందిరి. ఈ విధముగ తెలిసికొని దర్శపూర్ణమాస యాగముల ననుష్ఠించిన యజమానుఁడు నిశ్చయముగ స్వర్గపదవిని పొందును. (కనుకనే దర్శపూర్ణమాస యాగమునకు స్వర్గకామార్థత్వము చెప్పఁబడినది. ఈ విషయము మీమాంసకులచే పరిశీలింపఁబడినది కూడ. పరమే=సత్యలోకే, తిష్ఠతీతి=పరమేష్ఠీ=చతుర్ముఖబ్రహ్మ. పరమే=పరమే పదే సత్యలోకే ఇత్యర్థః.)

4. అర్థము: యః వై=ఏ యజమానుఁడైతే, ప్రజాతేవ=విస్తృతమైన, యజ్ఞేన యజతే=దర్శపూర్ణమాస యజ్ఞము చేయుచున్నాఁడో, సః=ఆ యజమానుఁడు, ప్రజయా=సంతానముచేతను, పశుభిః=పశువులచేతను, మిథునైః=స్త్రీపురుషరూప మిథునములచేతను, ప్రజాయతే=విస్తరించుచున్నాఁడు. ద్వాదశ మాసాః=పండ్రెండు నెలలు, సంవత్సరః=సంవత్సరము, (భవతి=అగుచున్నది.) దర్శపూర్ణ మాసయోః=దర్శపూర్ణమాస యాగములకు, తాని ద్వాదశ ద్వంద్వాని=(వక్ష్యమాణ) ఆ పండ్రెండు ద్వంద్వములు, సంపాద్యాని=సంపాదింపఁదగినవి, ఇతి=అని, (అభిజ్ఞాః=అభిజ్ఞులు,) ఆహుః=చెప్పిరి.

తాత్పర్యము: దర్శపూర్ణమాస యాగములను విస్తృతముగ చేసిన యజమానుఁడు సంతానాది సంపదచేత విస్తరించును. సంవత్సరమునకు పండ్రెండు మాసములు. దర్శపూర్ణమాస యాగములకు వక్ష్యమాణ ద్వాదశ ద్వంద్వములు సంపాదింపఁదగినవి. (ద్వంద్వ సంపాదనమును విధించుటకు ఈ బ్రాహ్మణమున ద్వంద్వవిధానము స్తుతింపఁబడినది. ద్వాదశ ద్వంద్వోపేత యజ్ఞమునకు ద్వాదశ మాసోపేత సంవత్సరముతో సామ్యము చెప్పఁబడినది.)

5\. **అర్థము:** (అధ్వర్యుః=అధ్వర్యుఁడు, గాం పయో దోగ్ధుమ్=గోవును పాలు పితుకుటకు "అయక్ష్మావః ప్రజయా" ఇత్యాది మంత్రముచేత,) వత్సమ్=దూడను, ఉపావసృజతి=బంధనమునుండి విడిపించవలెను. చ=మఱియు, (క్షీరం శ్రపయితుమ్=పాలు కాఁచుటకు, "మాతరిశ్వనో ఘర్మః" అను మంత్రముచేత,) ఉఖామ్=ఉఖ యను పాత్రమును, (గార్హపత్యే=గార్హపత్యాగ్ని యందు,) అధి శ్రయతి=ఉంచవలెను. చ=మఱియు, ("అవ రక్షో దివః"=అను శాఖాంతర మంత్రముచేత, వ్రీహీన్=ధాన్యములను,) అవహన్తి=దంచవలెను. చ=మఱియు, ("ఇషమావద" ఇతి=అను మంత్రముచేత, శమ్యయా, పాషాణేన వా=శమ్యచేఁగాని, పాషాణముచేఁగాని) దృషదుపలౌ=దృషదుపలములను, సమాహన్తి=కొట్టవలెను. చ=మఱియు, ("దేవస్య త్వా" ఇతి=అను మంత్రముచేత, దృషది=దృషత్తునందు, తండులాన్=బియ్యమును,) అధి వపతి=పిండి చేయవలెను. చ=మఱియు, (పురోడాశ శ్రపణాయ=పురోడాశమును వండుటకై, అగ్నౌ=అగ్నియందు, "ధ్రువ మసీతి"=అను మంత్రముచేత,) కపాలాని=కపాలములను, ఉపదధాతి=పెచ్చ పెట్టవలెను. చ=మఱియు, ("ఘర్మో உసీతి"=అను మంత్రముచేత,) పురోడాశమ్=పురోడాశమును, అధిశ్రయతి=ఉడికించవలెను. చ=మఱియు, ఆజ్యమ్=నేతిని, అధి శ్రయతి=ఉంచవలెను. చ=మఱియు, (చికీర్షిత వేదిస్థానే=వేది సమర్పఁబోవు స్థానమునందు, "పృథివి దేవయజని" ఇతి=అను మంత్రముచేత,) స్తమ్బయజుః=స్తంబయజువును, హరతి=హరించవలెను. చ=మఱియు, (ఆగ్నీధ్రః=అగ్నీధ్రుఁడు, ఉత్కరే ప్రక్షిప్తాన్=ఉత్కరమునం దుంచఁబడిన, సతృణ పాంశూన్=గడ్డితో కూడిన ధూళిని, అఞ్జలినా=దోసిలితో "అరరుస్తే దివమితి"=అను మంత్రముచే,) అభిగృహ్ణాతి=అంతటను తీసివేయవలెను. చ=మఱియు, వేదిమ్=వేదిని ("వసవ స్త్వా పరిగృహ్ణన్తు" ఇతి=అను మంత్రముచే,) పరిగృహ్ణాతి=అంతటను గ్రహించవలెను. చ=మఱియు, పత్నీమ్=యజమానపత్నిని ("ఆశాసానా" ఇతి=అను మంత్రముచే, యోక్త్రేణ=త్రాటితో,) సంనహ్యతి=బాగుగా (నడుమును) బంధించవలెను. చ=మఱియు, ("ఋతసదస్థేతి"=అను శాఖాంతర మంత్రముచే, స్ఫ్య నిష్పాదితాయాం లేఖాయామ్=స్ఫ్యముచే గీయఁబడిన గీతయందు,) ప్రోక్షణీః=ప్రోక్షణ పాత్రములను, ఆసాదయతి=ఉంచవలెను. చ=మఱియు, ("అగ్నే ర్జిహ్వాஉసీతి"=అను మంత్రముచే,) ఆజ్యమ్=నేతిని, (స్ఫ్య లేఖాయామ్=స్ఫ్యలేఖయందు,) ఆసాదయతి=ఉంచవలెను.

తాత్పర్యము: గోవత్సముయొక్క బంధనము నూడదీయుట మొదలగు ప్రక్రియలను పైని చెప్పినవిధముగ నాచరించవలెను.

6\. **అర్థము:** ఏతాని వై=ఇవియే, దర్శపూర్ణమాసయోః=దర్శపూర్ణమాస యాగములందలి, ద్వంద్వాని=ద్వంద్వ ప్రక్రియలు. యః=ఏ యజమానుఁడు, తాని=ఆ ద్వంద్వ ప్రక్రియలను, సంపాద్య=అనుష్ఠించి, యజతే=యాగము చేయుచున్నాఁడో, (సః=ఆ యజమానుఁడు,) ప్రజాతేన=విస్తృతమైన, యజ్ఞేనైవ యజతే=యజ్ఞమును జేసినవాఁడే యగుచున్నాఁడు. ప్రజయా, పశుభిః, మిథునైః, ప్రజాయతే, ఈ వాక్యార్థము చతుర్థమంత్ర వ్యాఖ్యానమున వ్రాయఁబడినది.

తాత్పర్యము: అయిదవ మంత్రమునందు చెప్పఁబడినవియే దర్శపూర్ణమాస యాగములందలి ద్వాదశ ద్వంద్వములు. ఈ విధముగ ఈ ద్వాదశద్వంద్వములను అనుష్ఠించి యాగము చేసిన యజమానుఁడు నిశ్చయముగ యాగమును విస్తృతముగ చేసినవాఁడగును. మఱియు అతఁడు విస్తృతమైన సంతానము పశువులు స్త్రీపురుషాత్మక మిథునములతో కూడినవాఁడగును. అయిదవ మంత్రమున చెప్పఁబడిన వత్సబంధన విమోచనాదులు పదు నాలుగే. ఆ పదునాల్గింటిని రెండేసిగా విభజించినచో సప్త ద్వంద్వములే యగును. (14 ÷ 2 = 7) అష్ట మానువాకమునందు చెప్పఁబడిన దశ యజ్ఞాయుధములను రెండేసిగా విభజించినచో అవి పంచ ద్వంద్వము లగును. ఆ అయిదు ద్వంద్వములు, ఈ సప్తద్వంద్వములు కలిసి (పండ్రెండు) ద్వాదశ ద్వంద్వము లగునని భావము.

నవమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే షష్ఠప్రపాఠకే దశమోఽనువాకః ।

మూలము: [1]ధ్రువో ఽసి ధ్రువో ఽహగ్ం సజాతేషు భూయాస మిత్యాహ ధ్రువా నేవైనా న్కురుత ఉగ్రో ఽస్యుగ్రో ఽహగ్ం సజాతేషు భూయాస మిత్యాహ ప్రతివాదిన ఏవైనా న్కురుతే ఽభిభూ రస్యభిభూ రహగ్ం సజాతేషు భూయాస మిత్యాహ య ఏవైనం ప్రత్యుత్పిపీతే త ముపాస్యతే [2]యునజ్మి త్వా బ్రహ్మణా దైవ్యేనేత్యాహైష వా అగ్నే ర్యోగ స్తేన (౧) ఏవైనం యునక్తి [3]యజ్ఞస్య వై సమృద్ధేన దేవా స్సువర్గం లోక మాయ న్యజ్ఞస్య వ్యృద్ధేనా సురా న్పరా భావయ న్యన్మే అగ్నే అస్య యజ్ఞస్య రిష్యా దిత్యాహ యజ్ఞస్యైవ తత్స మృద్ధేన యజమాన స్సువర్గం లోక మేతి యజ్ఞస్య వ్యృద్ధేన భ్రాతృవ్యా న్పరాభావయ త్య[4]గ్నిహోత్ర మేతాభి ర్వ్యాహృతీభి రుపసాదయే ద్య[5]జ్ఞముఖం వా అగ్నిహోత్రం బ్రహ్మై తా వ్యాహృతయో యజ్ఞముఖ ఏవ బ్రహ్మ (౨)కురుతే [6]సంవత్సరే పర్యాగత ఏతాభి రేవో పసాదయే [7]ద్బ్రహ్మణైవోభయత స్సంవత్సరం పరి గృహ్ణాతి [8]దర్శపూర్ణమాసౌ చాతుర్మాస్యా న్యాలభమాన ఏతాభి ర్వ్యాహృతీభి ర్హవీగ్ం ష్యాసాదయే ద్యజ్ఞముఖం వై దర్శపూర్ణమాసౌ చాతుర్మాస్యాని బ్రహ్మైతా వ్యాహృతయో యజ్ఞముఖ ఏవ బ్రహ్మ కురుతే సంవత్సరే పర్యా గత ఏతాభి రేవా ఽఽసాదయే ద్బ్రహ్మణైవోభయత స్సంవత్సరం పరి గృహ్ణాతి [9]యద్వై యజ్ఞస్య సామ్నా క్రియతే రాష్ట్రమ్ (౩)యజ్ఞస్యా ఽఽశీ ర్గచ్ఛతి యదృచా విశం యజ్ఞస్యా ఽఽశీ ర్గచ్ఛ త్యథ బ్రాహ్మణో ఽనాశీర్కేణ యజ్ఞేన యజతే సామిధేనీ రనువక్ష్య న్నేతా

వ్యాహృతీః పురస్తా ద్దధ్యా ద్బ్రహ్మైవ ప్రతిపదం కురుతే తథా బ్రాహ్మణ స్స్వాశీర్కేణ యజ్ఞేన యజతే [10]యం కామయేత యజమానం భ్రాతృవ్య మస్య యజ్ఞస్యా ఽఽశీ ర్గచ్ఛే దితి తస్యైతా వ్యాహృతీః పురోనువాక్యాయాం దధ్యా ద్భ్రాతృవ్యదేవత్యా వై పురోనువాక్యా భ్రాతృవ్య మేవాస్య యజ్ఞస్య (౪)ఆశీ ర్గచ్ఛతి [11]యా న్కామయేత యజమానా న్త్సమావత్యేనా న్యజ్ఞస్యా ఽఽశీ ర్గచ్ఛేదితి తేషా మేతా వ్యాహృతీః పురోనువాక్యాయా అర్ధర్చ ఏకాం దధ్యా ద్యాజ్యాయై పురస్తా దేకాం యాజ్యాయా అర్ధర్చ ఏకాం తథైనా న్త్సమావతీ యజ్ఞస్యా ఽఽశీ ర్గచ్ఛతి [12]యథా వై పర్జన్య స్సువృష్టం వర్షత్యేవం యజ్ఞో యజమానాయ వర్షతి స్థలయోదకం పరిగృహ్ణ న్త్యాశిషా యజ్ఞం యజమానః పరిగృహ్ణాతి [13]మనో ఽసి ప్రాజాపత్యమ్ (౫)మనసా మా భూ తేనా ఽఽవిశేత్యాహ మనో వై ప్రాజాపత్యం ప్రాజాపత్యో యజ్ఞో మన ఏవ యజ్ఞ మాత్మ న్ధత్తే వాగస్యైన్ద్రీ సపత్నక్షయణీ వాచా మేన్ద్రియేణా ఽఽవిశేత్యాహైన్ద్రీ వై వాగ్వాచ మేవైన్ద్రీ మాత్మ న్ధత్తే ॥౬॥

(తేనైవ బ్రహ్మ రాష్ట్ర మేవాస్య యజ్ఞస్య ప్రాజాపత్యగ్ం షట్త్రిగ్ంశ చ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే షష్ఠప్రపాఠకే దశమోఽనువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: నవమానువాకమునందు ద్వంద్వ సంపాదనము చెప్పఁబడినది. ఈ దశమానువాకమునందు హవి స్సాదనము విధింపఁ బడుచున్నది. ద్వితీయానువాక పూర్వభాగమునందలి పరిధ్యనుమంత్రణ మంత్రముల కీ బ్రాహ్మణము వివరణాత్మకము. "ధ్రువో ఽసి" త్యాది మంత్రము లచటనే వ్యాఖ్యాతములు కావున ఇచట వివరణవిశేషములు మాత్రము వ్రాయఁ బడుచున్నవి.

1. అర్థము: ఏనాన్=ఈ జ్ఞాతులను, ధ్రువానేవ=స్థిరమైన వారినిగానే, కురుతే=చేయుచున్నాఁడు, ఇతి=అని, "ధ్రువో ఽసి....భూయాసమ్" 'ధ్రువోఽసీ' త్యాది మంత్రము, ఆహ=చెప్పుచున్నది. యజమానుఁడు, 'ధ్రువోఽసీ' త్యాది మంత్రముచేత తనకే కాక, జ్ఞాతులకు కూడ స్థిరత్వమును కోరుచున్నాఁడని భావము. ఏనాన్=ఈ జ్ఞాతులను, అప్రతివాదినః ఏవ=ప్రతివాదులు కానివారినిగానే, కురుతే=చేయుచున్నాఁడు, ఇతి=అని, "ఉగ్రోఽసి....భూయాసమ్" 'ఉగ్రోఽసీ' త్యాది మంత్రము, ఆహ=చెప్పుచున్నది. యజమానుఁడు తనను ఉగ్రునిగా చేయుమని కోరుటచే జ్ఞాతులు తన నెదిరించనివారినిగా కోరుచున్నాఁడని భావము. యః=ఏ జ్ఞాతి, ఏనం ప్రతి=ఈ యజమానునిగూర్చి, ఉత్పిపీతే=ప్రతికూలుఁడై నశింపఁజేయఁ గోరుచున్నాఁడో, తమేవ=ఆ జ్ఞాతినే, (యజమానః=యజమానుఁడు,) ఉపాస్యతే=తిరస్కరించుచున్నాఁడు, ఇతి=అని, "అభిభూ రసి....సజాతేషు భూయాసమ్"='అభిభూరసీ' త్యాది మంత్రము, ఆహ=చెప్పుచున్నది. జ్ఞాతులలో ఏ జ్ఞాతి ప్రతికూలుఁడై తనను నశింపఁజేయఁదలఁచుచున్నాఁడో, ఆ జ్ఞాతినే ఈ యజమానుఁడు తిరస్కరించుచున్నాఁడని భావము. (అర్థవివరణమునందే తాత్పర్యము గతార్థమైనది.)

2. అర్థము: ఏషః వా=ఈ యునజ్మీత్యాది మంత్రపాఠమే, అగ్నేః=అగ్నియొక్క, యోగః=యోగము. (యజమానః=యజమానుఁడు,) తేనైవ=ఆ మంత్రపాఠముచేతనే, ఏనమ్=ఈ యగ్నిని, యునక్తి=(ఈ యజ్ఞకర్మయందు హవిస్సును వహించుటకై,) నియోగించుచున్నాఁడు, ఇతి=అని "యునజ్మి త్వా....దైవ్యేన"="యునజ్మి త్వా" ఇత్యాది మంత్రము, ఆహ=చెప్పుచున్నది. యునజ్మీత్యాది మంత్రపాఠమే అగ్నికి నియోజకము. యజమానుఁ డా మంత్రపాఠముచేతనే అగ్నిని హవిస్సు వహించుటకు నియోగించుచున్నాఁడని భావము.

3. అర్థము: యజ్ఞస్య=యజ్ఞముయొక్క, సమృద్ధేన=సమృద్ధమైన యథావిధ్యనుష్ఠానముచేత, దేవాః=దేవతలు, సువర్గం లోకమ్=స్వర్గలోకమును, ఆయన్=పొందిరి. యజ్ఞస్య=యజ్ఞముయొక్క, వ్యృద్ధేన=సమృద్ధముకాని యజ్ఞానుష్ఠానముచేత, అసురాన్=రాక్షసులను, పరాభావయన్=తిరస్కరించిరి, ఇతి=అని, "యన్మే అగ్నే యజ్ఞస్య రిష్యాత్"="యన్మే అగ్నే" ఇత్యాది మంత్రము, ఆహ=చెప్పుచున్నది. (అతః=ఇందువలన,) యజమానః=యజ్ఞకర్త, యజ్ఞస్య=యజ్ఞముయొక్క, సమృద్ధేనైవ=సమృద్ధమైన అనుష్ఠానముచేతనే, సువర్గం లోకమ్=స్వర్గలోకమును, ఏతి=పొందుచున్నాఁడు. యజ్ఞస్య=యజ్ఞముయొక్క, వ్యృద్ధేన=సమృద్ధము కాని (శత్రు) యజ్ఞానుష్ఠానముచేత, భ్రాతృవ్యాన్=శత్రువులను, పరాభావయతి=తిరస్కరించుచున్నాఁడు.

వివరణము: సమృద్ధము, వ్యృద్ధము అని యజ్ఞమునకు రెండంశములు కలవు. యథాశాస్త్రము యజ్ఞము ననుష్ఠించుట సమృద్ధ మనఁబడును. తద్భిన్నము వ్యృద్ధము. దేవతలు సమృద్ధ యజ్ఞముచేత స్వర్గము నొందిరి. రాక్షసులు యజ్ఞమును విధివిహితముగ అనుష్ఠించకపోవుటచే వారిని దేవతలు పరాభవింపఁగలిగిరి. రెండవ యనువాకమునందలి "యన్మే అగ్నే....రిష్యాత్, యద్వా స్కన్దాత్" అను మంత్రము ఈ యర్థమునే చెప్పుచున్నది. కావున యజమానుఁడు విధివిహితముగ యజ్ఞము ననుష్ఠించుటచే స్వర్గము నొందును. శత్రువులు వ్యృద్ధముగ అనుష్ఠించుటచే యజమానుఁడు వారిని తిరస్కరించెను. అనఁగా సమృద్ధ యజ్ఞము దేవతలకు స్వర్గప్రాప్తి హేతువు. వ్యృద్ధ యజ్ఞము అసురులకు పరాభవ హేతువు. కావున "యన్మే అగ్నే" ఇత్యాది మంత్రమునందలి 'రిష్యాత్', 'స్కన్దాత్' అను నంశముల నుద్దేశించి వైరి పరాభవము ముఖ్యముగ చెప్పఁబడుచున్నదని భావము.

4. అర్థము: (యజమానః=యజమానుఁడు,) ఏతాభిః వ్యాహృతీభిః=ద్వితీయానువాకోక్తములైన 'భూః', 'భువః', 'సువః' అను వ్యాహృతులచే, అగ్ని ముపసాదయేత్=అగ్నిహోత్ర కర్మయందు హవిస్సు నుంచవలెను.

తాత్పర్యము: యజమానుఁడు లోకత్రయ వాచకములైన 'భూ' రాది వ్యాహృతుల నుచ్చరించుచు అగ్నిహోత్ర కర్మయందు హవిస్సు నుంచవలెను. ఇది హవి రుపసాదన విధాయక మంత్రము. (అగ్నిహోత్రకర్మ=అగ్నిహోత్ర మను పేరుగల కర్మవిశేషము.)

5. అర్థము: అగ్నిహోత్రమ్=అగ్నిహోత్రకర్మ, యజ్ఞముఖం వా=యజ్ఞమునకు ముఖమువంటిది కదా?, ఏతాః=ఈ భూరాది వ్యాహృతులు, బ్రహ్మ=బ్రహ్మస్వరూపములు. (అగ్నిహోత్రమునందు వ్యాహృత్యుచ్చారణ పూర్వకముగ హవిస్సాదనము చేయుటవలన,) యజ్ఞముఖే ఏవ=ప్రశస్తమైన యజ్ఞముఖమునందే, (యజమానః=యజమానుఁడు) బ్రహ్మ=బ్రహ్మస్వరూపమైన వ్యాహృతి త్రయమును, కురుతే=చేసినవాఁడగుచున్నాఁడు.

తాత్పర్యము: అగ్నిహోత్ర క్రతువిశేషము ఆధానానంతరమే అనుష్ఠింపఁబడుటవలన, సర్వయజ్ఞములలో అగ్నిహోత్ర క్రతువునకు, ముఖత్వము(=ప్రాధాన్యము) సిద్ధించుచున్నది. త్రైలోక్యస్వరూప విరాడ్రూపము పరబ్రహ్మమునందారోపితమైన శరీరమును చెప్పుటచే లోకత్రయాత్మక వ్యాహృతులు పరబ్రహ్మస్వరూపములు. కావున అగ్నిహోత్ర క్రతువిశేషమునందు వ్యాహృతిపూర్వకముగ హవిస్సు నుంచిన యజమానుఁడు ప్రశస్తమైన యజ్ఞముఖమునందే బ్రహ్మరూపమైన వ్యాహృతి త్రయమును చేసినవాఁ డగుచున్నాఁడని భావము.

6. అర్థము: (అగ్నిహోత్రానంతరమ్=అగ్నిహోత్ర క్రతువు ననుష్ఠించిన పిమ్మట,) సంవత్సరే=సంవత్సరము, పర్యాగతే సతి=వచ్చిన దగుచుండఁగా, ఏతాభి రేవ=ఈ వ్యాహృతులచేతనే, ఉపసాదయేత్=హవి రుపసాదనము చేయవలెను. (ఉపసాదనము=ఉంచుట.)

తాత్పర్యము: అగ్నిహోత్రారంభదినమునందు వ్యాహృతిపూర్వక హవిస్సాదనమును అయిదవ మంత్రము విధించినది. ఈ మంత్రము కాలాంతరమున కూడ వ్యాహృతిపూర్వక హవిస్సాదనమును విధించుచున్నది. అగ్నిహోత్రకర్మ చేసిన సంవత్సరమునకు పిమ్మట కూడ వ్యాహృతిపూర్వకముగ హవిస్సాదనము చేయవలెను.

7. అర్థము: బ్రహ్మణైవ=బ్రహ్మచేతనే, ఉభయతః=అగ్నిహోత్ర క్రతువుయొక్క ఆద్యంత దినములందు, సంవత్సరమ్=సంవత్సరమును, (యజమానః=యజమానుఁడు,) పరిగృహ్ణాతి=పరిగ్రహించినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: వ్యాహృతులు బ్రహ్మస్వరూపములు కావున అగ్నిహోత్ర క్రతువిశేషముయొక్క, ఆద్యంత దినములందు కూడ వ్యాహృతులతో హవి స్సాదనము చేయుటవలన యజమానుఁడు బ్రహ్మచేతనే సంవత్సరమును గ్రహించిన వాఁడగుచున్నాఁడు. ఈ బ్రాహ్మణము వ్యాహృతిపూర్వక హవి రుపసాదనమును ప్రశంసించుచున్నది.

8. అర్థము: దర్శపూర్ణమాసౌ=దర్శపూర్ణమాస యాగములను, చాతుర్మాస్యాని=చాతుర్మాస్య యాగములను, ఆలభమానః=(యజమానః)=అనుష్ఠించుచున్న యజమానుఁడు, ఏతాభిః వ్యాహృతీభిః=ఈ భూరాది వ్యాహృతులచే, హవీంషి=హవిస్సులను, సాదయేత్=అగ్నియం దుంచవలెను. దర్శపూర్ణమాసౌ=దర్శపూర్ణమాస యాగములు, చాతుర్మాస్యాని=చాతుర్మాస్య కర్మలును, యజ్ఞముఖం వై=జ్యోతిష్టోమ యాగమునకు ముఖమువంటివి కదా? వ్యాహృతయః=భూరాది వ్యాహృతులు, బ్రహ్మ=బ్రహ్మ స్వరూపములు. (ఇత్థం క్రియమాణః సః=ఇట్లు చేయుచున్న ఆ యజమానుఁడు,) యజ్ఞముఖే ఏవ=ప్రశస్తమైన యజ్ఞముఖమునందే, బ్రహ్మ=బ్రహ్మ స్వరూపమైన వ్యాహృతి త్రయమును, కరోతి=చేసినవాఁ డగుచున్నాఁడు. సంవత్సరే పర్యాగతే(సతి)=సంవత్సరకాలము అవృత్త మగుచుండగా, ఏతాభి రేవ=ఈ వ్యాహృతులచేతనే, ఆసాదయేత్=(అగ్నియందు హవిస్సును,) ఉంచవలెను. (ఇత్థం చేత్=ఇట్లైనచో,) బ్రహ్మణైవ=బ్రహ్మస్వరూపమైన వ్యాహృతి త్రయముచేతనే, సంవత్సరమ్=సంవత్సరమును, పరిగృహ్ణాతి=పరిగ్రహించినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: దర్శపూర్ణమాస చాతుర్మాస్య యాగములందు కూడ వ్యాహృతి త్రయపూర్వకముగ హవిస్సు నగ్నియం దుంచవలెను. దర్శపూర్ణమాస చాతుర్మాస్య యాగములు అగ్నిష్టోమముకంటె ముందే అనుష్ఠేయములు కావున, అవి జ్యోతిష్టోమమునకు ముఖమువంటివి. వ్యాహృతులు బ్రహ్మస్వరూపములుగా పూర్వమంత్రమున వర్ణింపఁబడినవి. ఇట్లు చేసిన యజమానుఁడు ప్రశస్తమైన యజ్ఞముఖమునందే బ్రహ్మస్వరూపమైన వ్యాహృతి త్రయమును చేసినవాఁ డగుచున్నాఁడు. సంవత్సరకాలము గడిచిన పిమ్మట కూడ వ్యాహృతులచేతనే హవిస్సు నగ్నియం దుంచవలెను. ఇట్లు చేసిన యజమానుఁడు సంవత్సరకాలమును పరిగ్రహించినవాఁ డగును.

9. అర్థము: యజ్ఞస్య=యజ్ఞముయొక్క, యత్=ఏ యంగభాగము, (=బహిష్పవమానాదికము,) సామ్నా=సామవేద మంత్రముచేత, క్రియతే=చేయఁబడుచున్నదో, యజ్ఞస్య=(ఆ) యజ్ఞముయొక్క, ఆశీః=ఫలము, రాష్ట్రం వై=రాష్ట్రమునే, గచ్ఛతి=పొందుచున్నది. ఋచా=ఋగ్వేద మంత్రముచేత, యత్=ఏ యజ్ఞాంగము, (=యాజ్యా పురోనువాక్యాదికము) క్రియతే=చేయఁబడుచున్నదో, యజ్ఞస్య=(ఆ) యజ్ఞముయొక్క, ఆశీః=ఫలము, విశమ్=ప్రజను, గచ్ఛతి=పొందుచున్నది. అథ=అప్పుడు, (=ఇట్లుకాఁగా) బ్రాహ్మణః=యజమానుఁడు, అనాశీర్కేణ=ఫలరహితమైన, యజ్ఞేన యజతే=యజ్ఞము చేసినవాఁ డగుచున్నాఁడు. (అతః=ఇందువలన,) సామిధేనీః=''ప్రవో వాజాః'' ఇత్యాది ఋక్కులను, అనువక్ష్యన్=అనుసరించి చెప్పఁబోవుచు, పురస్తాత్=ముందుగా, ఏతాః వ్యాహృతీః=ఈ భూరాది వ్యాహృతులను, దధ్యాత్=ప్రయోగించవలెను. (తదా=అప్పుడు,) బ్రహ్మైవ=బ్రహ్మస్వరూప వ్యాహృతి త్రయముతోడనే, ప్రతిపదమ్=సామిధేనీ మంత్రములయొక్క ప్రతిపద ప్రారంభమును, కురుతే=చేసిన వాఁడగుచున్నాఁడు. (తథా సతి=అట్లుకాఁగా,) బ్రాహ్మణః=యజమానుఁడు, సాశీర్కేణ=ఫలసహితమైన, యజ్ఞేన యజతే=యజ్ఞము చేసినవాఁడగుచున్నాఁడు.

తాత్పర్యము: యజ్ఞమునకు సంబంధించిన కొంతభాగము సామవేదముచేతను, కొంతభాగము ఋగ్వేద మంత్రములచేతను అనుష్ఠించఁబడును. అందు సామవేద మంత్రసాధ్య యజ్ఞాంగముచే లభించిన ఫలము రాష్ట్రమును పొందును. అనఁగా రాష్ట్రమునందు సస్యాభివృద్ధి కలుగును. ఋగ్వేద మంత్ర సాధ్య యజ్ఞాంగముచే లభించిన ఫలము, ప్రజాసామాన్యమును పొందును. అనఁగా ప్రజలకు ఆయు రారోగ్యాదికము వృద్ధి యగును. కాని ఫల ప్రదములయిన యజుస్సుల నుపయోగింపకుండుటచే ఆ యజ్ఞము నిష్ఫలమైనదిగానే భావించవలెను. అందువలన, హోత ''ప్రవో వాజాః'' ఇత్యాది సామిధేనీ ఋక్కుల నుపయోగించునపుడు ముందుగా హోత వ్యాహృతులను పఠించవలెను. అట్లు చేసిన యజమానుఁడు బ్రహ్మరూపమైన వ్యాహృతి త్రయమునే సామిధేనీ ఋక్కుల ప్రతిపదారంభమునందు ఉపయోగించిన ట్లగును. ఆ విధముగ చేయఁగా యజమానుఁడు ఫలవంతమైన యజ్ఞమునే చేసినవాఁ డగును. (''ప్రవో వాజాః'' ఇత్యాది ఋక్కులు సామిధేను లనఁబడును.)

10. అర్థము: (హోతా=హోత) యం యజమానం ప్రతి=ఏ యజమానునిగూర్చి, అస్య యజ్ఞస్య=ఈ యజ్ఞముయొక్క, ఆశీః=ఫలము, భ్రాతృవ్యమ్=(యజమానుని యొక్క) శత్రువును, గచ్ఛేత్=పొందుఁగాక, ఇతి=అని, కామయేత=కోరునో, తస్య=ఆ యజమానునియొక్క, (యాగే=యాగమునందు,) పురోనువాక్యాయామ్=పురోనువాక్యయందు, ఏతాః వ్యాహృతీః=ఈ వ్యాహృతులను, దధ్యాత్=ప్రయోగించవలెను. పురోనువాక్యా=పురోనువాక్య, (దీని యర్థము 1వ ప్రపాఠకము చివర వివరింపఁబడినది.) భ్రాతృవ్య దేవత్యా వై=శత్రు దేవతాకము కదా, (అతః=ఇందువలన,) యజ్ఞస్య=యజ్ఞముయొక్క, ఆశీః=ఫలము, భ్రాతృవ్యమేవ=శత్రువునే, గచ్ఛతి=పొందుచున్నది.

తాత్పర్యము: హోత యజమానునియందలి ద్వేషభావముతో యజ్ఞఫలము శత్రువునకు చెందవలెనని కోరుకొనినచో, ఆ హోత ఆ యజమానుని యాగమునందు పురోనువాక్యకు పూర్వము వ్యాహృతులను ప్రయోగించవలెను. అప్పుడు యజ్ఞఫలము శత్రువునకే చెందును. పురోనువాక్య భ్రాతృవ్య దేవతాకము కదా! వ్యాహృతులను ప్రయోగించుటలో ప్రకారాంతరము చెప్పఁబడినది. ఇది హేయమైన పద్ధతి.

11. అర్థము: (హోతా=హోత,) యాన్ యజమానాన్=ఏ యజమానులనుగూర్చి, యజ్ఞస్య=యజ్ఞముయొక్క, ఆశీః=ఫలము, సమావతీ=సమానమైనదై, ఏనాన్=ఈ యజమానులను, గచ్ఛేత్=పొందుఁగాక, ఇతి=అని, కామయేత=కోరునో, తేషామ్=ఆ యజమానులయొక్క (యాగేషు=యాగములందు,) వ్యాహృతీః=భూరాది వ్యాహృతులను, (ఏవం దధ్యాత్=ఈ విధముగ ప్రయోగించవలెను.) పురోనువాక్యాయాః=పురోనువాక్య యొక్క, అర్ధర్చే (అభిహితే సతి)=ఋక్కుయొక్క అర్ధభాగము అభిహిత మగుచుండగా, ఏకామ్ (ప్రథమామ్)=మొదటి ఒక వ్యాహృతిని, దధ్యాత్=వినియోగించవలెను. యాజ్యాయాః=యాజ్యకు, పురస్తాత్=ముందుగా, ఏకామ్ (ద్వితీయామ్)=రెండవ ఒక వ్యాహృతిని, దధ్యాత్=వినియోగించవలెను. యాజ్యాయాః

యాజ్యయొక్క, అర్ధర్చే (అభిహితే సతి), ఋక్కుయొక్క అర్ధభాగము అభిహిత మగుచుండగా, ఏకామ్= (తృతీయామ్) మూఁడవ ఒక వ్యాహృతిని, దధ్యాత్=వినియోగించవలెను. తథా సతి=అట్లు కాఁగా, యజ్ఞస్య=యజ్ఞముయొక్క, ఆశీః=ఫలము, సమావతీ=సమానమై, ఏనాన్=ఈ యజమానులను, గచ్ఛతి=పొందుచున్నది.

తాత్పర్యము: బహు యజమాన కర్తృకములయిన సత్రయాగములకు అంగములైన ఇష్టులయందు హోత "యజమానుల కందఱకు యజ్ఞఫలము సమానముగ లభించుఁగాక" యని కోరునెడల ఆ హోత ఆ యజమానుల యజ్ఞము అందు పురోనువాక్యలోని ఋక్కుయొక్క అర్ధభాగము ఉచ్చరింపఁబడిన వెంటనే మొదటి వ్యాహృతిని, యాజ్యప్రారంభమునకు ముందు రెండవ వ్యాహృతిని, యాజ్యలోని ఋక్కుయొక్క సగభాగమును ఉచ్చరించగానే మూఁడవ వ్యాహృతిని వినియోగించవలెను. ఇట్లు చేసినచో యాగఫలము యజమానుల కందఱకు సమానముగ లభించును.

12. అర్థము: పర్జన్యః=మేఘము, యథా వై=ఏ విధముగనైతే, సువృష్టిమ్=సస్యోత్పత్తిక్షమమైన మంచివర్షమును, వర్షతి=వర్షించునో, ఏవమ్=ఈ విధముగ, యజ్ఞః=యజ్ఞము, యజమానాయ=యజమానునికొఱకు, వర్షతి=ఫలమును వర్షించుచున్నది. (=ఇచ్చుచున్నది; సర్వే జనాః=సమస్తప్రజలు,) స్థలయా=నది ఒడ్డుచేత, (=ఒడ్డున ఉండి,) ఉదకమ్=నీటిని, పరిగృహ్ణన్తి=తీసికొనుచున్నారు. యజమానః=యజమానుఁడు, (కూడ,) ఆశిషా=సాధారణ ఫలముచేత, యజ్ఞమ్=యజ్ఞమును, పరిగృహ్ణాతి=పరిగ్రహించుచున్నాఁడు.

తాత్పర్యము: 11వ మంత్రములోని విషయమునకు ఈ మంత్రము దృష్టాంతమును చెప్పుచున్నది. మేఘము పక్షపాతము లేకుండగ సర్వప్రదేశములందును ఒకేవిధమైన వర్షము కురియుచున్నది. ఆ వర్షముచే నిండిన నది యొడ్డున ఉండి జనులు తమ కవసరమైన నీటిని తీసికొనుచున్నారు. ఇట్లే వ్యాహృతి త్రయ సహితమైన ఈ యజ్ఞము సర్వ యజమాన సంఘమునకు సమానముగ మంచి ఫలము నిచ్చుచున్నది. ఆ యజమాన సంఘము సాధారణ యజ్ఞఫలముతో కూడిన ఈ యజ్ఞమును గ్రహించుచున్నదని యిచట మేఘదృష్టాంతము ఈయఁబడినది.

13. అర్థము: (హే స్రౌవాఘార!=స్రువమునందలి ఆఘారాజ్యమా! త్వమ్=నీవు,) "మనః=మనస్సువు, ప్రాజాపత్యమ్=ప్రజాపతి సంబంధివి, అసి=అగుచున్నావు. (అతః=ఇందువలన,) మనసా=మనస్సుతోను, భూతేన=ప్రజాపతి సృష్టమైన యజ్ఞముతోను, మా=నన్ను (=అధ్వర్యుని,) ఆవిశ=ప్రవేశించుము" ఇతి=అని, ఆహ=మనో౽సీ త్యాది మంత్రము చెప్పెను. మనః=మనస్సు, ప్రాజాపత్యం వై=మొదట ప్రజాపతిచే సృజింపఁబడుటచే ప్రాజాపత్యము కదా!. యజ్ఞః=యజ్ఞము, ప్రాజాపత్యః=ప్రజాపతి సృష్టము కావున, ప్రాజాపత్య మగుచున్నది. (అతః=ఇందువలన, అధ్వర్యుః=అధ్వర్యుఁడు,) మనః=యజ్ఞసాధనమైన మనస్సును, యజ్ఞమ్=యజ్ఞమును, ఆత్మన్నేవ=తనయందే, ధత్తే=స్థాపించినవాఁ డగుచున్నాఁడు. (హే స్రుచ్యాఘార!=స్రుచము నందలి ఆఘారాజ్యమా! త్వమ్=నీవు,) ఐన్ద్రీ=ఇంద్రసంబంధియు, సపత్నక్షయణీ=శత్రునాశకమునగు, వాక్=వాక్స్వరూపము, అసి=అగుచున్నావు. (తతః=అందువలన) వాచా=అట్టి వాక్కుతోడను, ఇన్ద్రియేణ=ఇంద్రసృష్టమైన చక్షురాదీంద్రియముతోడను, మా=నన్ను ఆవిశ=ప్రవేశించుము, ఇతి=అని, ఆహ='వాగసీ' త్యాది మంత్రము చెప్పినది. వాక్=వాక్కు, ఐన్ద్రీ వై=ఇంద్ర సృష్టమైనది కదా!, (అతః=ఇందువలన, అధ్వర్యుః=అధ్వర్యుఁడు, ఐన్ద్రీమ్=ఇంద్ర సృష్టమైన, వాచమేవ=వాక్కునే, ఆత్మన్=తనయందు, ధత్తే=స్థాపించుకొనినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: మనస్సు సర్వవ్యవహార సాధన మగుటచే ప్రజాపతి మనస్సును మొదట సృజించెను. కావున మనస్సు ప్రాజాపత్య మనఁబడును. యజ్ఞము కూడ ప్రజాపతి సృష్ట మగుటచే ప్రాజాపత్య మగును. అధ్వర్యుఁడు మనో౽సీ త్యాది మంత్రముచే మన స్స్వరూపముగా వర్ణింపఁబడిన స్రౌవాఘారాజ్యమును తన యందావ హించు మని కోరుటచే యజ్ఞ సాధన మయిన మనస్సును, యజ్ఞమును ఆత్మయందు స్థాపించుకొనిన వాఁడగు

చున్నాఁడు. ఇట్లే అధ్వర్యుఁడు ఇంద్రసంబంధియగు వాక్కుగా వర్ధింపఁబడిన స్రుచ్యాఘారాజ్యమును తనయందావహించుమని 'వాగసీ' త్యాది మంత్రముచే కోరుటచే ఇంద్ర సంబంధియగు వాక్కును, చక్షురాదింద్రియమును, ఆత్మయందు స్థాపించుకొనిన వాఁడగుచున్నాఁడు "మనోఽసి" ఇత్యాది మంత్రము, 'వాగసీ' త్యాది మంత్రము రెండవ యనువాకమునందు వ్యాఖ్యాతములైనవి.

దశమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే షష్ఠప్రపాఠక ఏకాదశోఽనువాకః

మూలము: [1]యో వై సప్తదశం ప్రజాపతిం యజ్ఞ మన్వాయత్తం వేద ప్రతి యజ్ఞేన తిష్ఠతి న యజ్ఞా ద్భ్రగ్ంశత [2]ఆశ్రావయేతి చతురక్షర మస్తుశ్రౌషడితి చతురక్షరం యజేతి ద్వ్యక్షరం యే యజామహ ఇతి పఞ్చాక్షరం ద్వ్యక్షరో వషట్కార ఏష వై సప్తదశః ప్రజాపతి ర్యజ్ఞ మన్వాయత్తో య ఏవం వేద ప్రతి యజ్ఞేన తిష్ఠతి న యజ్ఞా ద్భ్రగ్ంశతే [3]యో వై యజ్ఞస్య ప్రాయణం ప్రతిష్ఠామ్ (౧)ఉదయనం వేద ప్రతిష్ఠితేనారిష్టేన యజ్ఞేన సగ్ంస్థాం గచ్ఛ[4]త్యాశ్రావయాస్తుశ్రౌష ద్యజ యే యజామహే వషట్కార ఏతద్వై యజ్ఞస్య ప్రాయణ మేషా ప్రతిష్ఠైతదుదయనం య ఏవం వేద ప్రతిష్ఠితేనారిష్టేన యజ్ఞేన సగ్ంస్థాం గచ్ఛతి [5]యో వై సూనృతాయై దోహం వేద దుహ ఏవైనాం [6]యజ్ఞో వై సూనృతా ఽఽశ్రావయత్యేవైనా మహ్వ దస్తు (౨)శ్రౌష డి త్యుపావాస్రా గ్యజేత్యుదనైషీద్యే యజామహ ఇత్యుపాసద ద్వషట్కారేణ దోగ్ధ్యేష వై సూనృతాయై దోహో య ఏవం వేద దుహ ఏవైనాం [7]దేవా వై సత్ర మాసత తేషాం దిశో ఽదస్యన్త ఏతా మార్ద్రాం పఙ్క్తి మపశ్య న్నాశ్రావయేతి పురోవాత మజనయన్నస్తుశ్రౌషడిత్యభ్రగ్ం సమప్లావయ న్యజేతి విద్యుతమ్ (౩)అజనయన్యే యజామహ ఇతి ప్రావర్షయ న్నభ్యస్తనయ న్వషట్కారేణ తతో వై తేభ్యో దిశః ప్రాప్యాయన్త య ఏవం వేద ప్రాస్మై దిశః ప్యాయన్తే [8]ప్రజాపతిం త్వో వేద ప్రజాపతి స్త్వం వేద యం ప్రజాపతి ర్వేద స పుణ్యో భవత్యేష వై ఛన్దస్యః ప్రజాపతి రాశ్రావయాస్తు శ్రౌష ద్యజ యే య

జామహే వషట్కారో య ఏవం వేద పుణ్యో భవతి [10]వసన్తమ్ (४)ఋతూనాం ప్రీణామీ

త్యాహ ర్తవో వై ప్రయాజా ఋతూ నేవ ప్రీణాతి తే ఽస్మై ప్రీతా యథాపూర్వం కల్పన్తే

కల్పన్తే ఽస్మా ఋతవో య ఏవం వేదా[11]గ్నీషోమయో రహం దేవయజ్యయా చక్షుష్మా

న్భూయాస మిత్యాహాగ్నీషోమాభ్యాం వై యజ్ఞ శ్చక్షుష్మాన్తాభ్యా మేవ చక్షు రాత్మ న్ధత్తే ఽ

[12]గ్నే రహం దేవయజ్యయా ఽన్నాదో భూయాస మిత్యాహాగ్నిర్వై దేవానా మన్నాదో

భూయాస మిత్యాహాగ్ని ర్వై దేవానా మన్నాద స్తేనైవ (३)అన్నాద్య మాత్మ న్ధత్తే

[13]దబ్ధి రస్యదబ్ధో భూయాస మముం దభేయ మిత్యాహైతయా వై దబ్ధ్యా దేవా అసురాన

దభ్నువ న్తయైవ భ్రాతృవ్యం దభ్నో[14]త్యగ్నీషోమయో రహం దేవయజ్యయా వృత్రహా

భూయాస మిత్యాహాగ్నీషోమాభ్యాం వా ఇన్ద్రో వృత్ర మహ న్తాభ్యా మేవ భ్రాతృవ్యగ్ం

స్తృణుత [15]ఇన్ద్రాగ్నియో రహం దేవయజ్యయేన్ద్రియావ్యన్నాదో భూయాస మిత్యాహే

న్ద్రియావ్యేవాన్నాదో భవతీన్ద్రస్య(६)అహం దేవయజ్యయేన్ద్రియావీ భూయాస మిత్యాహే

న్ద్రియావ్యేవ భవతి [17]మహేన్ద్రస్యాహం దేవయజ్యయా జేమానం మహిమానం గమేయ

మిత్యాహ జేమాన మేవ మహిమానం గచ్ఛ[18]త్యగ్నే స్స్విష్టకృతో ఽహం దేవయజ్యయా

ఽఽయుష్మా న్యజ్ఞేన ప్రతిష్ఠాం గమేయ మిత్యాహ ఽఽయు రేవా ఽఽత్మ న్ధత్తే ప్రతి

యజ్ఞేన తిష్ఠతి ॥౭॥ (ప్రతిష్ఠా మహ్వ దస్తు విద్యుతం వసన్తం తేనైవే న్ద్రస్య షట్త్రిగ్ంశ చ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే షష్ఠప్రపాఠక ఏకాదశో ఽనువాకః॥

వేదార్థ దీపిక

అవతారిక: దశమానువాకమునందు హవిస్సాదనము చెప్పఁబడినది. ఈ యేకాదశానువాకమునందు ఆశ్రావణాది మంత్రములు ప్రధానముగా విధింపఁబడుచున్నవి. ఆ మంత్రములలో మొదటి అయిదు మంత్రముల ఉత్పత్తిని చెప్పుటకై ఆ మంత్రములు ఇచట స్తుతింపఁబడుచున్నవి.

1. **అర్థము:** యో వై=ఏ యజమానుఁడైతే, ప్రజాపతిమ్=ప్రజాపతిని, యజ్ఞమను ఆయత్తమ్=సర్వయజ్ఞముల ననుసరించి యుండువానినిగను, సప్తదశమ్=సప్తదశ నామకునిగను, వేద=తెలిసికొనుచున్నాఁడో, సః=ఆ యజమానుఁడు, యజ్ఞేన=సంపూర్ణ యజ్ఞముచేత, ప్రతి తిష్ఠతి=ప్రతిష్ఠితుఁ డగుచున్నాఁడు. యజ్ఞాత్=యజ్ఞమునుండి, న భ్రంశతే=భ్రష్టుఁ డగుట లేదు.

తాత్పర్యము: ఆశ్రావణాది మంత్రసంఘము సప్తదశాక్షరోపేత మగుటచేతను, ఆ సప్తదశాక్షర మంత్రసంఘము, ప్రజాపతి సృష్ట మగుటచేతను ప్రజాపతికి సప్తదశ నామ మేర్పడినది. ఆ ప్రజాపతి సర్వయజ్ఞములం దుండును. ఈ విధమును తెలిసిన యజమానుఁడు యజ్ఞముచేత ప్రతిష్ఠావంతుఁ డగును. కాని యజ్ఞమునుండి భ్రష్టుఁ డగుట లేదు.

2. **అర్థము:** (హే ఆగ్నీధ్ర=ఓ ఆగ్నీధ్రుఁడా!) ఆశ్రావయ=('యక్ష్యమాణ దేవతనుగూర్చి నీ కిది ఈయఁబడుచున్నది' అని ఆ దేవతకు) వినిపించుము. (ఈ విధముగ అధ్వర్యుఁ డాగ్నీధ్రు నడిగిన పిమ్మట, ఆగ్నీధ్రుఁడు,) అస్తు=అగుఁగాక, (='సరే' అని యంగీకరించి,) శ్రౌషట్='శ్రౌషట్' (అను శబ్దమును పలుకవలెను). శ్రౌషట్=(ఓ దేవతలారా! మీకు హవిర్దానము చేయుచున్నాము అను విషయమును,) వినుఁడు. (హే హోతః=ఓ హోతా!,) యజ=యాజ్యను పఠించుము. యే (వయమ్)=ఏ మేము, (యాజ్యను పఠించుఁడని అధ్వర్యునిచే పంపఁబడితిమో, హోతలమైన ఆ మేము,) యజామహే=యాజ్యను పఠించుచున్నాము. వషట్కారః='వౌషట్' అని వషట్కార శబ్దార్థము. (=హవిస్సు ఈయఁబడుచున్నది, అని వౌషట్ శబ్దార్థము.) చతురక్షరమ్="ఆశ్రావయ" అను మంత్రము నాలుగక్షరములు కలది. చతురక్షరమ్='అస్తుశ్రౌషట్' అను మంత్రము నాలుగక్షరములు కలది. ద్వ్యక్షరమ్='యజ' అను మంత్రము రెండక్షరములు కలది. పంచాక్షరమ్="యే యజామహే" అను మంత్రము అయిదక్షరములు కలది. వషట్కారః='వౌషట్' అను మంత్రము, ద్వ్యక్షరమ్=రెండక్షరములు కలది. ఏషః=ఈ, సప్తదశ వై=పదునేఁడక్షరములు గల అయిదు మంత్రముల సముదాయమే, ప్రజాపతిః=నామాంతరముగాఁగల ప్రజాపతి, యజ్ఞమ్ అను ఆయత్తః=యజ్ఞము లందంతటను వర్తించుచున్నవాఁడు. యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ విధముగా, వేద=తెలిసికొనుచున్నాఁడో, (సః=అతఁడు,) యజ్ఞేన=యజ్ఞముచేత, ప్రతి తిష్ఠతి=ప్రతిష్ఠావంతుఁ డగుచున్నాఁడు. యజ్ఞాత్=యజ్ఞమునుండి, న భ్రంశతే=భ్రష్టుఁడగుట లేదు.

తాత్పర్యము: 1) ఆశ్రావయ, 2) అస్తుశ్రౌషట్, 3) యజ, 4) యే యజామహే, 5) వషట్కారః, (=వౌషట్,) ఈ అయిదు మంత్రములందలి అక్షరముల సంఖ్య మొత్తము పదునేడు. సప్తదశ సంఖ్యాకాక్షరములు గల యీ మంత్ర సముదాయమును ప్రజాపతి సృష్టించుటచే అతనికి 'సప్తదశ' అనుపేరు ఏర్పడినది. అట్టి ప్రజాపతి యజ్ఞము లందంతటను వర్తించుచున్నాఁడు అని యీ విధమును దెలిసికొనిన యజ్ఞకర్త తానుఁ జేసిన యజ్ఞముచే ప్రతిష్ఠను పొందును గాని, యజ్ఞమున్ండి భ్రష్టుఁడు కాడు. (ఈ పంచమంత్రముల యర్థము పైని వివరింపఁబడినది. ఇందు ఈ మంత్రముల మహిమ వర్ణింపఁబడినది.)

3. **అర్థము:** యః వై=ఏ యజమానుఁడైతే, యజ్ఞస్య=యజ్ఞముయొక్క, ప్రాయణమ్=ప్రారంభమును, ప్రతిష్ఠామ్=అనుష్ఠానరూపమైన మధ్యభాగమును, ఉదయనమ్=సమాప్తిని, వేద=తెలిసికొనుచున్నాఁడో, (సః=ఆ యజమానుఁడు,) ప్రతిష్ఠితేన=అంగసహితమును, అరిష్టేన=వైకల్య రహితమునగు, యజ్ఞేన=యజ్ఞముచేత, సంస్థామ్=ఫలపరిసమాప్తిని, గచ్ఛతి=పొందుచున్నాఁడు.

తాత్పర్యము: యజ్ఞముయొక్క ప్రారంభమును, మధ్యదశను, సమాప్తిదశను, తెలిసికొనిన యజమానుఁడు సాంగము, వైకల్యరహితమునగు తన యజ్ఞముచేత ఫలపరిసమాప్తి నొందును.

4. **అర్థము:** "ఆశ్రావయ", "అస్తు శ్రౌషట్", "యజ", "యే యజామహే", "వషట్కారః", ఏతత్ వై = 'ఆశ్రావయ' ఇత్యాది మంత్రపంచకమే, యజ్ఞస్య=యజ్ఞమునకు, ప్రాయణమ్=ప్రారంభము. ఏషా=ఇది, ప్రతిష్ఠా=అనుష్ఠానరూప మధ్యభాగము. ఏతత్=ఇది, ఉదయనమ్=సమాప్తి. శేషము 3వ మంత్ర వ్యాఖ్యానమున గతార్థము.

తాత్పర్యము: ఈ మంత్రపంచకమునందలి మొదటి మంత్రము యజ్ఞమునకు ముఖ్యమైనది కావున ప్రారంభ రూపము. రెండు, మూఁడు, నాలుగు మంత్రముల సముదాయము అనుష్ఠానరూప మధ్యభాగము. ఐదవ మంత్రము సమాప్తిరూపము. అనఁగా దేవతోద్దేశ్యపూర్వక ద్రవ్యత్యాగరూప యాగశరీరము, ఈ మంత్రసంఘముచేతనే నిష్పన్నమగును కావున ఈ మంత్రసంఘమునకు యజ్ఞముయొక్క ఆది మధ్యాన్త స్వరూపత్వ మేర్పడినదని భావము. మిగిలినవి శరీరగత వస్త్రాలంకార స్థానీయములు.

5. **అర్థము:** యో వై=ఏ యజమానుఁడైతే, సూనృతాయై=సత్యప్రియరూపమైన సమీచీనవాక్కుయొక్క, (షష్ఠ్యర్థే చతుర్థీ.) దోహమ్=దోహన ప్రకారమును, వేద=తెలిసికొనుచున్నాఁడో, (సః=ఆ యజమానుఁడు,) ఏనామ్=ఈ సూనృతవాక్కును, (=గోవును) దుహే ఏవ=నిశ్చయముగ పితుకుచున్నాఁడు. (దుహే=దుగ్ధే, అని విద్యారణ్యము.)

తాత్పర్యము: సూనృతవాక్కనఁగా సత్యప్రియ వాక్కని యర్థము. అట్టి సూనృతవాక్కు సత్ఫలప్రద మైనదిగ తెలిసికొనిన యజమానునకు ఆ వాక్కు సత్ఫలములను గలుగఁ జేయునని తాత్పర్యము. "సత్యం బ్రూయా త్ప్రియం బ్రూయా న్న బ్రూయా త్సత్య మప్రియమ్। ప్రియం చ నా నృతం బ్రూయా దేష ధర్మ స్సనాతనః" అని స్మృతి. గోవు పాల నిచ్చునట్లు సూనృతవాక్కు సత్ఫలముల నిచ్చునని భావము. 'దోహమ్', 'దుహే' అను శబ్దములవలన ఇచట సూనృతవాక్కునందు గోత్వవివక్ష చేయఁబడినది. సూనృతవాక్కు కామధేనువువలె పరితోష హేతు వగుటచే ఆ వాక్కునకు గోసామ్యము. (సత్య ప్రియరూప వాక్కు=సత్యరూపము, ప్రియరూపము నైన వాక్కు.)

6. **అర్థము:** యజ్ఞో వై=యజ్ఞమే, సూనృతా=సత్యప్రియరూప వాక్కు. 'ఆశ్రావయ' ఇత్యేవ='ఆశ్రావయ' అను మంత్ర పాఠముచేతనే, ఏనామ్=ఈ సూనృతవాక్కనెడి గోవును, (అధ్వర్యుః=అధ్వర్యుఁడు,) అహ్వత్=ఆహ్వానించుచున్నాఁడు. 'అస్తు శ్రౌషట్ ఇతి'='అస్తు శ్రౌషట్' అను మంత్రపాఠముచే, (పయః పాతుమ్=పాలు త్రాగుటకై,) ఉపావాస్రాక్=వత్సమును విడుచుచున్నాఁడు. "యజ ఇతి"='యజ' అను మంత్రపాఠముచే, ఉదనైషీత్=దోహన పాత్రమును పైకెత్తుచున్నాఁడు. "యే యజామహే ఇతి"='యే యజామహే' అను మంత్ర పాఠముచే, ఉపాసదత్=దోగ్ధ(=పాలు పితుకు వ్యక్తి) గోవుదగ్గఱ కూర్చొనుచున్నాఁడు. వషట్కారేణ='వౌషట్' అను మంత్రపాఠముచేత, దోగ్ధి=పాలు పితుకుచున్నాఁడు. ఏషః వై=ఇదియే, సూనృతాయై=సత్యప్రియవాక్కనెడి గోవుయొక్క, దోహః=దోహనవిధము. యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ విధముగ, వేద=తెలిసికొనుచున్నాఁడో, సః=ఆ యజమానుఁడు, ఏనామ్=ఈ సూనృత గోవును, దుహే ఏవ=నిశ్చయముగ పాలు పితుకుచున్నాఁడు.

తాత్పర్యము: లోకమునందు గోస్వామి పాలు పితుకఁ బోవునపుడు, గోవును ఇతర సాంకేతిక నామములతో పిలుచుట సుప్రసిద్ధము. అట్లే ఇచటఁగూడ సాంకేతిక నామధేయములతో సూనృతగోవు నాహ్వానించుట వర్ణించఁబడుచున్నది. పైని ఉదాహరించిన పంచ మంత్రములచేత, వరుసగా సూనృతగోవు నాహ్వానించుట, ఆ గోవుదగ్గఱకు పాలు త్రాగుటకై వత్సమును విడుచుట, పాలు పితుకుటకై పాలచెంబును పైకెత్తి పట్టుకొనుట, పాలు పితుకు వ్యక్తి పాలు పితుకుటకై ఆవుదగ్గఱ కూర్చొనుట, పాలు పితుకుట, అను ప్రక్రియలు లోకమర్యాద ననుసరించి వర్ణింపఁబడినవి. ఇచట సూనృతవాక్కునందు గోత్వమును, 'ఆశ్రావయే' త్యాది మంత్రవాక్యములందు ఆ యా ప్రక్రియలను ఆరోపించుటచే మంత్రములకు తత్తదర్థ వాచకత్వ మపేక్షింపఁబడలేదు.

7\. అర్థము: దేవాః=దేవతలు, సత్రమ్=యజ్ఞమును, ఆసత వై=అధిష్ఠించిరంట! తేషామ్=ఆ దేవతలకు, దిశః=దిక్కులు, అదృశ్యన్త=క్షీణించిన వయ్యెను. (=దిగ్గతములయిన సస్యములు వర్షాభావముచే క్షీణించెను.) ఏతామ్ ఆర్ద్రామ్ పఙ్క్తిమ్=వర్షహేతువైన పూర్వోక్తమగు ఈ మంత్ర (పంచకమును) ముల పంక్తిని, అపశ్యన్=కనుఁగొనిరి. (అగ్రే=మొదట,) 'ఆశ్రావయేతి'='ఆశ్రావయ' అను మంత్రముచే, పురః=ఎదుట, వాతమ్=గాలిని, అజనయన్=పుట్టించిరి. "అస్తు శ్రౌషట్ ఇతి"='అస్తు శ్రౌషట్' అను మంత్రముచే, అభ్రమ్=ఆకాశమును, (వాతేన=గాలిచే,) సమప్లావయన్=పూరింపఁజేసిరి. 'యజ + ఇతి'='యజ' అను మంత్రముచేత, విద్యుతమ్=మెఱుపును, అజనయన్=పుట్టించిరి. "యే యజామహే ఇతి"='యే యజామహే' అను మంత్రముచేత, ప్రావర్షయన్=ఎక్కువగా వర్షింపఁజేసిరి. వషట్కారేణ='వౌషట్' అను మంత్రముచేత, అభ్యస్తనయన్=అంతటను గర్జింపఁజేసిరి. తతో వై=అట్లు చేయుటవలననే, తేభ్యః=ఆ దేవతలకొఱకు, దిశః=దిక్కులు, ప్రాప్యాయన్త=మిక్కిలి వృద్ధి నొందినవి. యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ విధముగ, వేద=తెలిసికొనుచున్నాఁడో, అస్మై=ఈ యజమానునికొఱకు, దిశః=దిక్కులు, ప్రాప్యాయన్తే=మిక్కిలి వృద్ధి పొందుచున్నవి. (ప్ర + ఆప్యాయన్తే=ప్రాప్యాయన్తే.)

తాత్పర్యము: పూర్వము దేవతలు ఒక యజ్ఞమునం దాసీనులై యుండఁగా సర్వదిక్కులందలి సస్యము లెండిపోవుటచే ఆ దిక్కులు క్షీణించినవి. యజ్ఞమునం దేదియో వైకల్య మేర్పడుటచే నిట్లు జరిగియుండునని గ్రహించి దేవత లప్పుడు వర్షహేతువైన 'ఆశ్రావయే'త్యాది మంత్ర పంచకమును కనుఁగొనిరి. వారామంత్రములలో మొదటి మంత్రముచే మొదట గాలిని పుట్టించిరి. పిమ్మట ద్వితీయ తృతీయ తురీయ పంచమ మంత్రములచే, వరుసగా ఆకాశమున వాయుపూరణము, విద్యుత్తు, వర్షము, మేఘగర్జనములను కలిగింపఁజేసిరి. అప్పుడు వారికి దిక్కులు ఆర్ద్రములైనవి. (అనఁగా సర్వదిక్కులందలి సస్యములు శ్యామలములై కళకళలాడుచున్నవి.) ఈ విధానమును తెలిసికొనిన యజమానునకు దిక్కులు సస్యశ్యామలములై ఒప్పుచుండును. (ఈ బ్రాహ్మణ భాగముచే పూర్వోక్త మంత్రపంచకముయొక్క మహిమ సోదాహరణముగ వర్ణింపఁబడినది.)

8\. అర్థము: త్వః=ఒక యజమానుఁడు, ప్రజాపతిమ్=సప్తదశాక్షరరూప ప్రజాపతిని, వేద=(వక్ష్యమాణ మహిమోపేతునిగా) తెలిసికొనెను. ప్రజాపతిః=(అ)ప్రజాపతి, త్వమ్=(అ) ఒక యజమానుని, వేద=గుర్తించెను. (=అనుగ్రహించెను.) ప్రజాపతిః=ప్రజాపతి, యమ్=ఏ యజమానుని, వేద=అనుగ్రహించెనో, సః=ఆ యజమానుఁడు, (పుణ్యేన=పుణ్యముచేత, ఇతరేభ్యః=ఇతర యజమానులకంటె,) పుణ్యః=ఉత్కృష్టుఁడు, భవతి=అగుచున్నాఁడు. ['త్వః' ఇది 'త్వ' శబ్దమునకు ప్రథమైకవచనాంతము. 'త్వమ్' అను రూపము 'త్వ' శబ్దమునకు ద్వితీయైకవచనాంతము.]

తాత్పర్యము: (మంత్రపంచకముయొక్క మహిమను మఱియొక రీతిగ కనఁబఱచుటకు ఈ బ్రాహ్మణము ప్రస్తావన చేయుచున్నది.) ఒక యజమానుఁడు సప్తదశాక్షరరూప ప్రజాపతిని వక్ష్యమాణ మహిమోపేతునిగా తెలిసికొనెను. ఆ తెలిసికొనిన యజమానుని ప్రజాపతి యనుగ్రహించెను. ప్రజాపతిచే అనుగ్రహింపఁబడిన యజమానుఁడు ఇతర యజమానులకంటె పుణ్యమువలన ఉత్కృష్టుఁ డగుచున్నాఁడు.

9\. అర్థము: 'ఆశ్రావయ' 'అస్తు శ్రౌషట్' 'యజ', 'యే యజామహే', 'వషట్కారః'=ఆశ్రావయేత్యాది రూపమయిన, ఏషః=ఈ సప్తదశాక్షరాత్మకుఁడైన, ప్రజాపతిః=ప్రజాపతి, వేదస్య=వేదములలో సారభూతుఁడు. యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ విధముగ, వేద=తెలిసికొనుచున్నాఁడో, (సః=అతఁడు,) పుణ్యః=ఉత్కృష్టుఁడు, భవతి=అగుచున్నాఁడు.

తాత్పర్యము: ఈ ఆశ్రావయేత్యాది మంత్రపంచకగత సప్తదశాక్షర రూపుఁడైన ప్రజాపతి వేదములలో సారభూతుఁడు. ఈ విధముగ తెలిసికొనిన యజమానుఁడు పుణ్యముచేత ఇతర యజమానులకంటె ఉత్కృష్టుఁ డగుచున్నాఁడు. (ఇచట మంత్రపంచకగత ప్రజాపతికి వేదసారత్వము చెప్పఁబడుటచే తన్మహిమ వ్యక్తమైనది.)

10. అర్థము: (ద్వితీయానువాకమునందలి 'వసన్తమ్' ఇత్యాది మంత్రముల కిచట రూపకల్పన చేయంబడుచున్నది.) ''వసన్తమ్ ఋతూనామ్ ప్రీణామి'' ఇతి=ఋతువులలో వసన్తర్తువును సంతోషపెట్టుచున్నానని, ఆహ=చెప్పుటచే, ఋతవః వై=ఋతువులే, ప్రయాజాః=ప్రయాజానుమంత్రణ మంత్రములు. (కావున యజమానుండు,) ఋతూనేవ=ఋతువులనే, ప్రీణాతి=సంతోషపెట్టుచున్నాండు. ప్రీతాః=సంతోషించిన ఋతువులు, అస్మై=ఈ యజమానునికొఱకు, యథాపూర్వమ్=పూర్వమువలెనే, కల్పన్తే=విపర్యాసము లేకుండ వర్తించుచున్నవి. (ఆ యా కాలముల కనుగుణమైన పుష్పోద్భవాది లక్షణ యుక్తములై వర్తించుచుండునని భావము.) యః=ఏ యజమానుండు, ఏవమ్=ఈ విధముగ, వేద=తెలిసికొనుచున్నాండో, అస్మై=ఈ తెలిసికొనిన యజమానునికొఱకు, ఋతవః=ఋతుదేవతలు, కల్పన్తే=విపర్యాసము లేకుండగ వర్తించుచున్నారు.

తాత్పర్యము: 'ఋతువులలో వసన్త ఋతువును సంతోషపెట్టుచున్నా'నని 'వసన్త' మిత్యాది మంత్రము చెప్పుటచేత ఋతువులే ప్రయాజానుమంత్రణ మంత్రములు. కనుక, ప్రయాజానుమంత్రణము చేయుటచే యజమానుండు ఋతువులనే సంతోషపెట్టుచున్నాండనియు, సంతోషించిన ఋతుదేవతలు ఈ యజమానునకు కాలానుగుణములైన పుష్పోద్భవాది లక్షణములు కలవియై వర్తించుచుండుననియు భావము. మఱియు ఈ విధమును తెలిసిన యజమానునకు కూడ ఋతుదేవతలు విపర్యాసము లేకుండగ వర్తించుచుండును.

11. అర్థము: (ఇది ఆజ్యభాగానుమంత్రణ మంత్రము. ఈ బ్రాహ్మణము ఈ మంత్రమును వ్యాఖ్యానించుచున్నది.) అహమ్=నేను, అగ్నీషోమయోః=అగ్నీషోమ దేవతల సంబంధమైన, దేవయజ్యయా=దేవయజ్యచే, చక్షుష్మాన్=చక్షుష్మన్తుండను, భూయాసమ్=అగుదును, ఇతి=అని, ఆహ='అగ్నీషోమాభ్యా' మిత్యాది మంత్రము చెప్పెను. చక్షుష్మన్తాభ్యామ్=చక్షుష్మంతులైన, అగ్నీషోమాభ్యాం వై=అగ్నీషోమ దేవతలకొఱకే, యజ్ఞః=యజ్ఞము. (అతః=ఇందువలన,) సః=ఆజ్యభాగానుమంత్రణము చేసిన ఆ యజమానుండు, ఆత్మన్నేవ=తనయందే, చక్షుః=చక్షువును, ధత్తే=ధరించుచున్నాండు.

తాత్పర్యము: "చక్షుషీ వా ఏతే యజ్ఞస్య యదాజ్యభాగౌ" అను అనువాకమునందు ఆజ్యభాగములకు యజ్ఞ చక్షుష్మత్త్వము ప్రతిపాదింపంబడినది. ద్వితీయానువాకమున ''అగ్నీషోమయో రహం దేవయజ్యయా చక్షుష్మాన్ భూయాసమ్'' అని చెప్పుటచేత, చక్షుష్మంతములును, అగ్నీషోమ దేవతాకములునగు ఆజ్యభాగముల కొఱకే యజ్ఞము కావున, ఆజ్యభాగ దేవతలైన అగ్నీషోమ దేవతలచే యజ్ఞమునకు చక్షుష్మత్త్వము, యజమానునకు తత్ఫలమును చెప్పంబడినవి.

12. అర్థము: అగ్నిః వై=అగ్నియే, దేవానామ్=దేవతలకు, అన్నాదః=అన్నము నిచ్చువాండు. తేనైవ=ఆ యగ్నిచేతనే, (యజమానః=యజమానుండు,) ఆత్మన్=తనయందు, అన్నాద్యమ్=అన్నాశిత్వమును, ధత్తే=ధరించుచున్నాండు, ఇతి=అని, "అగ్నేరహం దేవయజ్యయా ఽన్నాదో భూయాసమ్"='అగ్నేరహ' మిత్యాది మంత్రము, ఆహ=చెప్పినది.

తాత్పర్యము: ఈ బ్రాహ్మణము ఆగ్నేయ యాగానుమంత్రణ మంత్రమునకు వ్యాఖ్యాన రూపము. అగ్నియే దేవతలకు అన్నము నిచ్చువాండు కనుక, తదగ్ని దేవతాకమైన ఆగ్నేయ యాగము చేయు యజమానుండు బహ్వన్నమును తినువాం డగుచున్నాండు, అని 'అగ్నే రహ మిత్యాది' మంత్రము చెప్పుచున్నది.

13. అర్థము: ఏతయా దబ్ధ్యా ఏవ=ఈ 'ఉపాంశుయాజ' రూప వైరిఘాతినియగు హేతిచేతనే, దేవాః=దేవతలు, అసురాన్=రాక్షసులను, అదభ్నువన్=(సంహరించిరి.) హింసించిరి. తయైవ=ఆ హేతిచేతనే, (యజమానః=యజమానుండు) భ్రాతృవ్యమ్=శత్రువును, దభ్నోతి=సంహరించుచున్నాండు, ఇతి=అని, ''దబ్ధిర స్యదబ్ధో భూయాస మముం దభేయమ్''='దబ్ధిరస్యా'ది మంత్రము, ఆహ=చెప్పినది.

తాత్పర్యము: ఈ బ్రాహ్మణము ఉపాంశుయాజానుమంత్రణ మంత్రమునకు వ్యాఖ్యాన రూపము. ఈ ఉపాంశుయాజ రూప హేతిచేతనే దేవతలు శత్రువులను సంహరించిరి. ఉపాంశుయాజానుమంత్రణము చేసిన యజమానుండు ఆ ఉపాంశుయాజ రూప హేతిచేతనే శత్రువును సంహరించును. ఈ యర్థమునే 'దబ్ధిరస్యాది' మంత్రము చెప్పుచున్నది.

14. అర్థము: అహమ్=నేను, అగ్నీషోమయోః=అగ్నీషోమ దేవతల సంబంధమైన, దేవయజ్యయా=సమంత్రకాజ్యాహుతి చేత, వృత్రహా=వృత్రహన్తకుఁడను, భూయాసమ్=అగుదును, ఇతి=అని, ఆహ='అగ్నీషోమయో' రిత్యాది మంత్రము చెప్పెను. (అతః=ఇందువలన,) ఇన్ద్రః=ఇంద్రుఁడు, వృత్రహన్తాభ్యామ్=వృత్రాసుర హన్తకు లగు, అగ్నీషోమాభ్యాం వై=అగ్నీషోమ దేవతలచేతనే, భ్రాతృవ్యమ్=శత్రువును, స్తృణుతే=హింసించు చున్నాఁడు. (=హింసించెను.)

తాత్పర్యము: అగ్నీషోమ దేవతలకు సమంత్రకాజ్యాహుతిని సమర్పించుటచే నేను వృత్రాసుర హన్తకుఁడ నగుదునని ద్వితీయానువాకమునందలి పౌర్ణమాసీగత ద్వితీయ పురోడాశానుమంత్రణ మంత్రము చెప్పినది. ఇంద్రుఁడు వృత్రహన్తకులగు అగ్నీషోమ దేవతలచేతనే శత్రుహింస చేసెనని యీ బ్రాహ్మణము అగ్నీషోమ దేవతలకు వృత్రాసుర హన్తకత్వమును వివరించుచున్నది.

15. అర్థము: అహమ్=నేను (=యజమానుఁడు,) ఇన్ద్రాగ్నియోః=ఇంద్రాగ్ని దేవతల సంబంధమైన, దేవయజ్యయా= సమంత్ర కాజ్యాహుతిచేత, ఇన్ద్రియావీ=ఇంద్రియోపేతుఁడను, అన్నాదః=బహ్వన్నభోక్తను, భూయాసమ్= అగుదును, ఇతి=అని, ఆహ=(అమావాస్యాగత ద్వితీయ పురోడాశానుమంత్రణ మంత్రము) చెప్పినది. ఇన్ద్రియావ్యేవ=ఇన్ద్రియ పటుత్వము కలవాఁడే, అన్నాదః=బహ్వన్నభోక్త, భవతి=అగుచున్నాఁడు.

తాత్పర్యము: ఇంద్రాగ్ని దేవతలకు సమంత్రకాజ్యాహుతిని సమర్పించుటచేత యజమానునకు ఇంద్రియోపేతత్వము అన్నాదత్వము కలుగునని పైమంత్రము చెప్పినది. ఇంద్రియపటుత్వము కలవాఁడే బహ్వన్నభోక్త యగు నని యీ బ్రాహ్మణము వివరించుచున్నది.

16. అర్థము: ఇన్ద్రస్య=ఇంద్రుని సంబంధమైన, దేవయజ్యయా=సమంత్రకాజ్యాహుతిచేత, అహమ్=నేను, ఇన్ద్రియావీ= ఇంద్రియ పటుత్వము కలవాఁడను, భూయాసమ్=అగుదును, ఇతి=అని, ఆహ='ఇన్ద్రస్యాహ' మిత్యాది మంత్రము చెప్పుటచే, (యజమానుఁడు) ఇన్ద్రియావ్యేవ=నిశ్చయముగ ఇంన్ద్రియోపేతుఁడు, భవతి= అగుచున్నాఁడు.

తాత్పర్యము: ఇంద్రునకు సమంత్రకాజ్యాహుతి నిచ్చుటచే యజమానుఁడు నిశ్చయముగ ఇంద్రియోపేతుఁడగునని 'ఇన్ద్రస్యాహ' మిత్యాది సాన్నాయ్యానుమంత్రణ మంత్రము చెప్పిన యర్థమును ఈ బ్రాహ్మణము వివరించు చున్నది. (సాన్నాయ్యమున కింద్రుఁడు దేవత)

17. అర్థము: అహమ్=నేను, మహేన్ద్రస్య=మహేంద్రుని సంబంధమైన, దేవయజ్యయా=సమంత్రకాజ్యాహుతిచేత, జేమానమ్=జయశీలత్వమును, మహిమానమ్=విద్యైశ్వర్యాది గుణములచే మహత్త్వమును, గమేయమ్= పొందెదను, ఇతి=అని, ఆహ='మహేన్ద్రస్యాహ" మిత్యాది మంత్రము చెప్పుటచే, (యజమానః=యజ మానుఁడు,) జేమానమ్=జయ శీలత్వమును, మహిమానమ్=విద్యైశ్వర్యాది గుణములచే మహత్త్వమును, గచ్ఛత్యేవ=నిశ్చయముగ పొందుచున్నాఁడు.

తాత్పర్యము: సాన్నాయ్యమునకు మహేంద్రుఁడు కూడ దేవత. అట్టి మహేంద్ర దేవతాకమైన సాన్నాయ్యమును అను మంత్రించుటచే, యజమానుఁడు నిశ్చయముగ జయశీలుఁడు, విద్యైశ్వర్యాది గుణములచే మహత్త్వో పేతుఁడును అగునని యీ బ్రాహ్మణము పై మంత్రార్థమునే వివరించుచున్నది.

18. అర్థము: స్విష్టకృతః అగ్నేః=స్విష్టకృదగ్ని సంబంధమైన, దేవయజ్యయా=సమంత్రకాజ్యాహుతిచేత, అహమ్=నేను, ఆయుష్మాన్=ఆయుష్మంతుఁడనై, యజ్ఞేన=స్విష్టకృదగ్ని దేవతాక యజ్ఞముచేత, ప్రతిష్ఠామ్=ప్రతిష్ఠను, గమేయమ్=పొందెదను, ఇతి=అని, ఆహ='అగ్నే స్స్విష్టకృతో ఽహ' మిత్యాది మంత్రము చెప్పుటచే (యజమానః=యజమానుఁడు,) ఆత్మన్=తనయందు, ఆయుః=ఆయువును, ధత్త ఏవ=నిశ్చయముగ ధరించు, చున్నాఁడు. యజ్ఞేన=సంపూర్ణ యజ్ఞముచేత, ప్రతితిష్ఠతి=ఫలప్రాప్తిలక్షణ ప్రతిష్ఠను పొందుచున్నాఁడు.

తాత్పర్యము: యజమానుఁడు స్విష్టకృదగ్నికి సమంత్రకాజ్యాహుతిని సమర్పించుటచేత ఆయువును, సంపూర్ణ యజ్ఞముచేత ఫలప్రాప్తిలక్షణ ప్రతిష్ఠను, పొందుచున్నాఁడని యీ బ్రాహ్మణము పై మంత్రార్థమును వివరించుచున్నది.

ఏకాదశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే షష్ఠప్రపాఠకే ద్వాదశోఽనువాకః।

మూలము: [1]ఇన్ద్రం వో విశ్వతస్పరి హవామహే జనేభ్యః। అస్మాక మస్తు కేవలః। [2]ఇన్ద్రం నరో నేమధితా హవన్తే య త్పార్యా యునజతే ధియ స్తాః। శూరో నృషాతా శవస శ్చకాన ఆ గోమతి వ్రజే భజా త్వం నః। [3]ఇన్ద్రియాణి శతక్రతో యా తే జనేషు పఞ్చసు। ఇన్ద్ర తాని త ఆవృణే। [4]అను తే దాయి మహ ఇన్ద్రియాయ సత్రా తే విశ్వ మను వృత్రహత్యే। అను (౧) క్షత్త్ర మను సహో యజత్రేన్ద్ర దేవేభి రను తే నృషహ్యే [5]ఆ యస్మి న్త్సప్త వాసవా స్తిష్ఠన్తి స్వారుహో యథా। ఋషి ర్హ దీర్ఘశ్రుత్తమ ఇన్ద్రస్య ఘర్మో అతిథిః। [6]ఆమాసు పక్వ మైరయ ఆ సూర్యగ్ం రోహయో దివి। ఘర్మం న సామం తపతా సువృక్తిభి ర్జుష్టం గిర్వణసే గిరః। [7]ఇన్ద్ర మి ద్గాథినో బృహదిన్ద్ర మర్కేభి రర్కిణః। ఇన్ద్రం వాణీ రనూషత। [8]గాయన్తి త్వా గాయత్త్రిణః (౨) అర్చ న్త్యర్క మర్కిణః। బ్రహ్మాణ స్త్వా శతక్రత వుద్వగ్ంశమివ యేమిరే। [9]అగ్ంహోముచే ప్రభరేమా మనీషా మోషిష్ఠదావ్నే సుమతిం గృణానాః। ఇద మిన్ద్ర ప్రతి హవ్యం గృభాయ సత్యా స్సన్తు యజమానస్య కామాః। [10]వివేష య న్మా ధిషణా జజాన స్తవై పురా పార్యా దిన్ద్ర మహ్నః। అగ్ంహసో యత్ర పీపర ద్యథా నో నావేవ యాన్త ముభయే హవన్తే। [11]ప్ర సమ్రాజం ప్రథమ మధ్వరాణామ్ (౩) అగ్ంహోముచం వృషభం యజ్ఞియానామ్। అపాం నపాత మశ్వినా హయన్త మస్మి న్నర ఇన్ద్రియం ధత్త మోజః। [12]వి న ఇన్ద్ర మృధో జహి నీచా యచ్ఛ పృతన్యతః। అధస్పదం తమీం కృధి యో అస్మాగ్ం అభిదాసతి। [13]ఇన్ద్ర క్షత్త్ర మభి వామ మోజో ఽజాయథా వృషభ చర్షణీనామ్। అపానుదో జన మమిత్రయన్త మురుం దేవేభ్యో

అకృణోరు లోకమ్। [14]మృగో న భీమః కుచరో గిరిష్ఠాః పరావతః (౪) ఆ జగామా పరస్యాః। సృకగ్ం సగ్ంశాయ పవి మిన్ద్ర తిగ్మం వి శత్రూ న్తాఢి వి మృధో నుదస్వ। [15]వి శత్రూ న్వి మృధో నుద వి వృత్రస్య హనూ రుజ। వి మన్యు మిన్ద్ర భామితో ఽమిత్రస్యాభిదాసతః। [16]త్రాతార మిన్ద్ర మవితార మిన్ద్రగ్ం హవే హవే సుహవగ్ం శూర మిన్ద్రమ్। హువేను శక్రం పురుహూత మిన్ద్రగ్ం స్వస్తి నో మఘవా ధాత్విన్ద్రః। [17]మా తే అస్యామ్ (౫)సహసావ న్పరిష్టా వఘాయ భూమ హరివః పరాదై। త్రాయస్వ నో ఽవృకేభి ర్వరూథై స్తవ ప్రియాస స్సూరిషు స్యామ। [18]అనవ స్తే రథ మశ్వాయ తక్ష న్త్వష్టా వజ్రం పురుహూత ద్యుమన్తమ్। బ్రహ్మాణ ఇన్ద్రం మహయన్తో అర్కై రవర్ధయ న్నహయే హ న్తవా ఉ। [19]వృష్ణే య త్తే వృషణో అర్క మర్చా నిన్ద్ర గ్రావాణో అదితి స్సజోషాః। అనశ్వాసో యే పవయో ఽరథా ఇన్ద్రేషితా అభ్య వర్తన్త దస్యూన్ ॥(౬)॥

(వృత్రహత్యే ఽను గాయత్రిణో ఽధ్వరాణాం పరావతో ఽస్యా మష్టాచత్వారిగ్ంశ చ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే షష్ఠప్రపాఠకే ద్వాదశో ఽనువాకః ॥౧౨॥

(సం త్వా ధ్రువో ఽస్యగ్ని ర్మా బర్హిషో ఽహ మాప్యాయతా మగన్మ యథా వై యో వై శ్రద్ధాం ప్రజాపతి ర్యజ్ఞా స్థ్రవో ఽసీత్యాహ యో వై సప్తదశ మిన్ద్రం వో ద్వాదశ ॥౧౨॥)

[సం త్వా బర్హిషో ఽహం యథా వా ఏవం విద్వాన్త్రొఘ త్వహసావ న్నేకపఞ్చాశత్ ॥౫౧॥]

హరిః ఓమ్॥

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే షష్ఠప్రపాఠకః।

వేదార్థ దీపిక

అవతారిక: సప్తమానువాకమునుండి ఏకాదశానువాకము వఱకు యాజమాన బ్రాహ్మణ ప్రసంగమువలన అధ్వర్యవ బ్రాహ్మణము కూడ కొంత చెప్పఁబడినది. ఈ ద్వాదశానువాకమునందు యాజ్యా పురోనువాక్యలు చెప్పఁబడుచున్నవి.

1. **అర్థము!** (హే ఋత్విగ్యజమానాః!=ఓ ఋత్విగ్యజమానులారా!) వః=మీయొక్క, జనేభ్యః=పుత్త్రభృత్యాది జనుల కొఱకు, విశ్వతస్పరి=సర్వజగత్తునకు పైని (ఉన్న,) ఇన్ద్రమ్=ఇంద్రుని, హవామహే=ఆహ్వానించుచున్నాము. (సః=ఆ యింద్రుఁడు,) అస్మాకమ్=మాకు, కేవలః=అసాధారణ వ్యక్తిగా, అస్తు=అగుఁగాక, (ఇతి=అని, అధ్వర్యుః=అధ్వర్యుఁడు, ప్రార్థయతే=ప్రార్థించుచున్నాఁడు.)

తాత్పర్యము! ఓ ఋత్విగ్యజమానులారా! మీ పుత్త్రభృత్యాదుల నిమిత్తము సర్వజగత్తునకు పైనున్న యింద్రు నాహ్వానించుచున్నాము. ఆ యింద్రుఁడు మాకు అసాధారణ వ్యక్తి యగుఁగాక. అనఁగా ఇతర యజమానుల యందుకంటె మాయందు ఎక్కువ అనుగ్రహము కలిగి యుండుఁగాక, అని భావము. (ఇది అధ్వర్యుని ప్రార్థన. కామ్యేష్టికాండమునందు సప్తమానువాకమున చెప్పఁబడిన ఇంద్రదేవతాక కామ్యేష్టికి ఇది పురోనువాక్య.

2. **అర్థము!** నరః=అగ్నిచయనమును అనుష్ఠించుచున్న నరులు, ఇంద్రమ్=ఇంద్రుని, నేమధితా=(వహ్న్యాది దేవతలతోఁ గూడ,) అర్థహవిస్సును వహించుటకై, హవన్తే=ఆహ్వానించుచున్నారు. యత్=ఏ కారణమువలన, పార్యాః=(అగ్నిచయనానుష్ఠానానంతరము,) అగ్నిష్టోమాది పారమున కర్తలైన యజమానులు, తాః ధియః=ఆ అగ్నిష్టోమాది కర్మలను, యునజతే=అనుష్ఠించుచున్నారో, (తాదృశ=అటువంటి, హే ఇన్ద్ర!=ఓ యింద్రుఁడా!,) త్వమ్=నీవు, శూరః=శూరుఁడవు, (=రాక్షసులచే తిరస్కరింపఁబడనివాఁడవు,) నృషాతా=మనుష్యులకు ధనము నిచ్చువాఁడవు, శవసః=(మా) బలమునకు, చకానః=తర్పకుఁడవునై, నః=మమ్ము, గోమతి వ్రజే=బహు గవాది పశు సంఘమునందు, ఆ భజా=అభిముఖముగ స్థాపింపుము. (నేమస్య=అర్ధస్య హవిషః, ధితా=ధారణాయ, నేమధితా.)

తాత్పర్యము: అగ్నిచయనానుష్ఠానము సమాప్తమైన వెంటనే అగ్నిష్టోమమును పూర్తిచేయుట కర్తలయిన యజమానులు ఆ యగ్నిష్టోమాది కర్మల ననుష్ఠించుచుందురు. కనుక అట్టి యజమానులు అగ్న్యాది దేవతలతో కూడ అర్థహవిస్సును వహించుటకు ఇంద్రు నాహ్వానించుచున్నారు. అటువంటి యింద్రా! నీవు రాక్షసులచే తిరస్కరించఁబడనివాఁడవు, మనుజులకు ధనము నిచ్చువాఁడవు, మా బలమును తృప్తి పఱచువాఁడవునై మమ్ము బహుగవాది భూయిష్ఠమైన సంఘమునందు అభిముఖముగ స్థాపింపుము. (ఇది యాజ్య)

3. **అర్థము:** హే శతక్రతో!=నూఱు యజ్ఞములు చేసిన ఓ యింద్రా!, పఞ్చసు జనేషు=బ్రాహ్మణాది పంచవర్ణములందు, తే=నీకు, యా ఇన్ద్రియాణి=ఏ సామర్థ్యములు, (సన్తి=కలవో,) హే ఇన్ద్ర!=ఓ యింద్రా!, తాని=ఆ సామర్థ్యములను, తే=నీయొక్క (అనుగ్రహేణ=అనుగ్రహముచేత,) ఆ వృణే=అంతటను గ్రహించుచున్నాను.

తాత్పర్యము! శతక్రతువైన యింద్రా! బ్రాహ్మణాది పంచవర్ణములందు నీకుఁగల సామర్థ్యములను, నీ యనుగ్రహము వలన నేను సంపూర్ణముగ గ్రహించుచున్నాను. (ఇది పురోనువాక్య.)

4. **అర్థము!** (యజత్ర!=యాగోద్దేశ్యుఁడవైన,) హే ఇన్ద్ర!=ఓ యింద్రా!, మహే=(సర్వదేవతలకంటె,) గొప్పవాఁడవైన, తే=నీకొఱకు, సత్రా=యాగములందు, విశ్వమ్=(హవిః=)సర్వహవిస్సు, వృత్రహత్యే అను=వృత్రాసురవధ ననుసరించి, తే=నీయొక్క, ఇన్ద్రియాయ=బలము కొఱకు, అనుక్షత్రమ్=నీయొక్క క్షత్రియత్వ జాత్యభిమానము ననుసరించి, సహః అను=(నీయొక్క) బలము ననుసరించి, వృషహ్యే అను=వైరుల తిరస్కార శీలము ననుసరించి, దేవేభిః=అగ్న్యాది దేవతలచేత, అనుదాయి=అనుక్రమముగా ఈయఁబడుచున్నది. తే=నీకొఱకు (పునః పునః=మాటి మాటికి, దీయతే=ఈయఁబడుచున్నది.)

తాత్పర్యము: యాగోద్దేశ్యుఁడవైన యింద్రా! వృత్రాసురవధ ననుసరించి నీ బలము కొఱకు క్షత్రియత్వ జాత్యభిమానము ననుసరించియు, నీ బలము ననుసరించియు, వైరులను తిరస్కరించునట్టి నీ స్వభావము ననుసరించియు, యాగములందు సర్వదేవతలకంటె గొప్పవాఁడవైన నీ కొఱకు సర్వహవిస్సు, అగ్న్యాది దేవతలచే మాటి మాటికి అనుక్రమముగ ఈయఁబడుచున్నది. (ఇది యాజ్య.)

5. **అర్థము:** వాసవాః=అశ్వములు, సప్త=ఏడును, స్వారుహః యథా=స్వయముగ ఎక్కుచున్నవివలె, యస్మిన్=ఏ సూర్యునియందు, ఆ తిష్ఠన్తి=అంతట నుంటున్నవో, (సః=ఆ యాదిత్యుఁడు,) ఋషిర్హ=అతీంద్రియ జ్ఞానియే, దీర్ఘశ్రుత్తమః=ప్రసిద్ధ కీర్తిమంతులలో శ్రేష్ఠుఁడు. ఘర్మః=ప్రకాశించుచున్నవాఁడునగు (ఇట్టి) సూర్యుఁడు. ఇన్ద్రస్య=ఇంద్రునకు, అతిథిః=అతిథి.

తాత్పర్యము: సూర్యుని యశ్వము లేడును సుశిక్షితము లగుటచేత ప్రేరణ లేకుండగనే స్వయముగ ఆరోహించుచున్నవి వలె సూర్యునియొద్ద వర్తించుచున్నవి. అట్టి సప్తాశ్వములు కల సూర్యుఁడు (వేదత్రయోపేతుఁడగుటచే,) అతీంద్రియుఁడే. (జగత్తును ప్రకాశింపఁజేయుటచే) ప్రసిద్ధ కీర్తిమంతులలో శ్రేష్ఠుఁడు. అట్టి మహనీయుఁడైన యీ ఆదిత్యుఁడు ఇంద్రున కతిథి. సూర్యుఁడు తన యభీష్టమును సూచించుటకు అప్పుడప్పుడు ఇంద్రుని గృహమునకు వచ్చుచుండు ననఁగా, ఆ యింద్రుని మహిమ యెటువంటిదో, వేఱుగఁ జెప్పవలెనా! అని భావము. (ఇది పురోనువాక్య.)

6. **అర్థము:** (హే ఇన్ద్ర!=ఓ యింద్రుఁడా!, త్వమ్=నీవు,) ఆమాసు=ఫలపాక రహితములయిన ఓషధులందు, పక్వమ్=శోభన పాకయుక్తమైన ఫలమును, ఐరయః=(వృష్టిమూలమున,) సంపాదించినవాఁడవైతివి. సూర్యమ్=సంచరించుచున్న సూర్యుని, దివి=ఆకాశమునందు, ఆరోహయః=(పరివర్తన సామర్థ్యము నిచ్చుటచే,) అధిష్ఠింపఁజేసితివి. (యజమానాః=యజమానులు,) జుష్టమ్=(ఇంద్రునకు,) ప్రియమైన పురోడాశాది హవిస్సును, సువృక్తిభిః=శోభన భక్తి యుక్తములైన, సోమన్=సోమములచేత, ఘర్మం న=ప్రవర్గ్యమును వలె, తపతా=బాగుగా హుతమగునట్లు చేయుదురుగాక. గిర్వణసే=వాక్కులచే స్తుతింపఁదగిన యింద్రునకై, గిరః=స్తుతిరూప వాక్కులను, (ప్రయుఙ్త=ప్రయోగింతురుగాక.)

తాత్పర్యము: ఓ యింద్రా! నీవు ఫలపాక రహితములయిన ఓషధులందు వర్షమును వర్షింపఁజేయుటచే మంచి ఫలములను సంపాదించినవాఁడవు. సంచరించుటకు తగిన సామర్థ్యము నిచ్చుటచే సూర్యు నాకాశమునందు వర్తింపఁ జేసితివి. హేతు లనెడి మంత్ర విశేషములచే యజమానులు ఇంద్రునకు ప్రియమైన పురోడాశాది హవిస్సును శోభన భక్తియుక్తములైన సోమములచేత ప్రవర్గ్యమునువలె బాగుగ హుతమగునట్లు చేయుదురుగాక. (హేతి=స్తోత్ర విశేషము. ఇది యాజ్య.)

7. **అర్థము:** గాథినః=సామగాయకులు, బృహత్=గొప్పదియగు సామముచేత, ఇన్ద్రమిత్=ఇంద్రునే, అనూషత=స్తోత్రము చేసిరి. అర్కిణః (=ఋక్శాఖీయులు)బహ్వృచులు, అర్కేభిః=ఋక్కులతో, ఇన్ద్రమ్=ఇంద్రుని, అనూషత=స్తోత్రము చేసిరి, వాణీః=ఇతరములైన యజూరూప వాక్కులు, ఇన్ద్రమ్=ఇంద్రుని, అనూషత=స్తుతించినవి.

తాత్పర్యము: సామగాయకులు గొప్ప సామముచేతను, బహ్వృచులు ఋక్కులతోను, యజుశ్శాఖీయులు యజుస్సులతోను ఇంద్రునే స్తుతించిరి. ("ఋచ=స్తుతౌ" అను ధాతువు నుండి పుట్టిన అర్క శబ్దము ఋక్కును చెప్పుచున్నది. ఇది మఱియొక యిష్టియందలి పురోనువాక్య.)

8. **అర్థము:** హే శతక్రతో!=ఓ యింద్రా!, గాయత్రిణః=గాయత్ర సామ యుక్తులయిన ఉద్గాతలు, త్వా=నిన్ను, గాయన్తి=గానము చేయుచున్నారు. అర్కిణః=బహ్వృచులు, అర్కమ్=ఇంద్రుఁడవైన నిన్ను, అర్చన్తి=స్తోత్రము చేయుచున్నారు. బ్రహ్మాణః=బ్రహ్మ శబ్దోపలక్షితులయిన అధ్వర్యులు, త్వా=నిన్ను, వంశమివ=వంశమునువలె, ఉద్యేమిరే=ఉన్నతునిఁ జేయుచున్నారు.

తాత్పర్యము: ఓ శతక్రతూ! గాయత్ర సామపంతులయిన ఉద్గాతలు బహ్వృచులు, నిన్ను స్తోత్రము చేయుచున్నారు. అధ్వర్యులు కులాచారాదులచే వంశమును వృద్ధి నొందించు విధముగ నిన్ను వృద్ధి నొందించుచున్నారు. (ఇది యాజ్య.)

9\. అర్థము: గృణానాః=స్తోత్రము చేయుచున్న, (వయమ్=మేము,) ఓ షిష్ఠదావ్నే=గ్రీష్మకాలమునందు దావాగ్నిచే అత్యంత దగ్ధములైన భూములకు వర్షాకాలమున వర్షము నిచ్చువాఁడవును, అంహోముచే=పాపమును పోఁగొట్టువాఁడవునగు, (తే=నీకొఱకు) మనీషామ్=మననముతో కూడిన, సుమతిమ్=మంచిబుద్ధిని, ప్రభరేమా=స్వీకరించెదము. హే ఇంద్ర!=ఓ యింద్రుఁడా!, ఇదమ్=ఈ త్యాగము చేయఁబడుచున్న, హవ్యమ్=హవిస్సును, ప్రతిగృభాయ=స్వీకరించుము. యజమానస్య=యజ్ఞకర్తయొక్క, కామాః=కోరికలు, సత్యాః=యథార్థములు, సన్తు=అగుఁగాక.

తాత్పర్యము: ఓ యింద్రా! నీవు గ్రీష్మకాలమున దావాగ్నిచే పరితప్తములైన భూములకు వర్షాకాలమునందు వర్షము నిచ్చువాఁడవు, పాపమును పోఁగొట్టువాఁడవును. అట్టి నిన్ను స్తుతించుచున్న మేము నిన్ను సంతోష పెట్టెద మనెడి మననముతో కూడిన మంచి బుద్ధిని కలిగియుండెదము. ఈ హవిస్సును స్వీకరించుము. అట్లు స్వీకరించుటచే యజమానుని కోరికలు సత్యము అగుఁగాక. (ఇది పురోనువాక్య.)

10\. అర్థము: ధిషణా=(పూర్వోక్త) బుద్ధి, మా=నన్ను, వివేష యత్=ప్రవేశించుటవలన, (అహమ్=నేను,) జజాన=సుబుద్ధినైతిని. (అత ఏవ=కనుకనే,) పార్యా దహ్నః పురా=ఉత్తమ మరణ దినమునకు ముందు, (=మరణము వఱకు,) ఇంద్రమ్=ఇంద్రుని, స్తవై=స్తోత్రము చేయుదును. యత్ర=ఏ యుత్తమ బుద్ధి యుండఁగా, నః=మమ్ము, (ఇంద్రః=ఇంద్రుఁడు, అంహసః=పాపమునుండి, పీపరత్=ఉత్తరింపఁజేసెనో, యథా=ఏ విధముగ, (నద్యామ్=నదియందు,) నావా=పడవతో, యాన్తమ్=వెళ్లుచున్న నావికుని, ఉభయే=రెండు తీరము లందలి ప్రజలు, హవన్తే=(తమ్ము నదిని దాటింపుమని,) ఆహ్వానించుచున్నారో,

తాత్పర్యము: ఓ యింద్రా! నిన్ను సంతోషపెట్టెద మనెడి ఆలోచనతోఁ గూడిన బుద్ధి మాకు కలుగుటచే నేను సుబుద్ధినైతిని. కనుకనే ఉత్తమ మరణము ప్రాప్తించువఱకు నిన్ను స్తుతించెదను. నదియందు నావమీఁద పయనించుచున్న నావికుని, ఉభయ తీరములందలి ప్రజలు తమ్ము నదిని దాటింపుమని కోరినవిధముగ పాపములనుండి విముక్తులమైన మమ్ము ఉభయ వంశజులు ఆహ్వానించుచున్నారు. (ఇది యాజ్య)

11\. అర్థము: హే నరః!=ఓ మనుష్యులారా! (=ఋత్విజులారా!) సత్రామాజమ్=బాగుగ ప్రకాశించువాఁడును, అధ్వరాణామ్=అగ్నిష్టోమాది యాగములకు, ప్రథమమ్=ముఖ్యుఁడును, అంహోముచమ్=పాపమునుండి విడిపించువాఁడును, యజ్ఞియానామ్=యజ్ఞ సంబంధములైన ఫలములను, వృషభమ్=వర్షించువాఁడును, అపామ్=వర్షరూపము లైన ఉదకములకు, నపాతమ్=అవినాశకుఁడును, హయన్తమ్=ఐశ్వర్యమును కలుగఁజేయువాఁడునునగు నింద్రుని, ప్ర(భజ)=సేవింపుఁడు. హే అశ్వినౌ!=ఓ అశ్వినీ దేవతలారా!, అస్మిన్=ఈ యజమానుని యందు, ఇంద్రియమ్=చక్షురాదీంద్రియ పాటవమును, ఓజః=బలమును, ధత్త=స్థాపించుఁడు.

తాత్పర్యము: ఓ ఋత్విజులారా! మీరు ఇంద్రుని ప్రకృష్టముగ సేవింపుఁడు. ఇంద్రుఁడు బాగుగ ప్రకాశించువాఁడు. అగ్నిష్టోమాది యాగములకు ముఖ్యుఁడు. పాపములనుండి మమ్ము విడిపించువాఁడు. యజ్ఞఫలముల నిచ్చువాఁడు. వర్షోదకములను నాశనము చేయనివాఁడు. ఓ అశ్వినీ దేవతలారా! మీరు ఈ యజమానునకు చక్షురాదీంద్రియ పాటవమును, బలమును కలుగఁజేయుఁడు. (పైని చెప్పఁబడిన యిష్టికే యిది మఱియొక యాజ్య.)

12\. అర్థము: హే ఇంద్ర!=ఓ యింద్రుఁడా!, నః=మాయొక్క, మృధః=శత్రువులను, వి జహి=విశేషముగ హింసించుము. (కిం చ=మఱియు,) పృతన్యతః=మమ్ము చంపుటకు సేనను కోరుచున్న శత్రువులను, నీచాః=తిరస్కృతులనుగా, యచ్ఛ=చేయుము. యః=ఏ ఇతర శత్రువు కూడ, అస్మాన్=మమ్ము, అభి దాసతి=అంతటను నశింపఁజేయుచున్నాఁడో, తమీమ్=ఆ శత్రువును గూడ, అధస్పదమ్=మా పాదములందు పడినవానినిగా, కృధి=చేయుము. (తమ్ + ఈమ్=తమీమ్=తమపి.)

తాత్పర్యము: ఓ యింద్రా! మా శత్రువులను విశేషముగ హింసించుము. మఱియు మమ్ము చంపుటకై సేనను కోరుచున్న శత్రువులను తిరస్కృతులనుగా చేయుము. ఏ యితర శత్రువు కూడ మమ్ము క్షీణింపఁజేయుచున్నాఁడో, ఆ శత్రువును కూడ మా పాదములకు నమస్కరించువానినిగా చేయుము. (ఇది మఱియొక యిష్టికి పురోనువాక్య.)

13. అర్థము: హే ఇంద్ర!=ఓ యింద్రుఁడా! వామమ్=కోరఁదగిన, క్షత్త్రిమ్=క్షతమునుండి రక్షణమును, ఓజః=(మా) బలమును, అభి (లక్ష్య)=ఉద్దేశించి, అజాయథాః=ఉద్భవించితివి. చర్షణీనామ్=మనుజులకు, హే వృషభ!=కోరికలను వర్షించునట్టి ఓ యింద్రా!, అమిత్రయన్తమ్=శత్రుభావమును కోరుచున్న, జనమ్=జనమును, అపానుదః=తిరస్కరించితివి. దేవేభ్యః=దేవతలకు హవిష్ప్రదానాది వ్యవహారములను జేయునట్టి యజ్ఞకర్తలకొఱకు, ఉరుమ్=విస్తీర్ణమైన, లోకమ్=భోగస్థానమును, అకృణోరు=చేసినవాఁడవు కూడ. (అకృణోః+ఉ=అకృణోరు. 'ఉ'=అపి.)

తాత్పర్యము: ఓ యింద్రా! మాకు క్షతమునుండి కోరఁదగిన రక్షణమును బలమును సర్వమును చేయుటకు పుట్టితివి. మనుష్యుల కోరికల నిచ్చునట్టి యింద్రా! శత్రుభావమును కోరుచున్న జనమును తిరస్కరించితివి. దేవతలకు హవిష్ప్రదానాదులను జేయుచున్న యజ్ఞకర్తలకు విస్తీర్ణ భోగస్థానమును కలుగఁజేయనే చేసితివి. (ఇది యాజ్య.)

14. అర్థము: హే ఇంద్ర!=ఓ యింద్రుఁడా!, భీమః=భయంకరమును, కుచరః=కుత్సితముగ సంచరించునదియు, గిరిష్ఠాః=పర్వత నివాసియునగు, మృగో న=(సింహ వ్యాఘ్రాది) మృగమువలె, పరస్యాః పరావతః=మిక్కిలి దూరమునుండి, ఆ జగామా=(మా విరోధిని సంహరించుటకు,) వచ్చితివి. స్వకమ్=(పర శరీరాదులందు) దూరునట్టియు, తిగ్మమ్=పదనైనదియునగు, పవిమ్=వజ్రాయుధమును, సంశాయ=బాగుగ పదనుపెట్టి, శత్రూన్=శత్రువులను, వితాఢి=విశేషముగ కొట్టుము. మృధః=యోధులయిన శత్రువులను, నుదస్వ=నిరాకరింపుము.

తాత్పర్యము: ఓ యింద్రా! నీవు, భయంకరమైనదియు ప్రాణి భక్షణాదిరూప కుత్సితమైన నడవడి కలదియు, పర్వత నివాసియునగు సింహ వ్యాఘ్రాది మృగమువలె మిక్కిలి దూరదేశమునుండి మా విరోధిని సంహరించుటకు వచ్చితివి. పరుల శరీరములందు గ్రుచ్చుకొనునదియు, తీక్ష్ణమైనదియునగు వజ్రాయుధమును బాగుగ పదనుపెట్టి యెక్కువగ శత్రువును కొట్టుము. యోద్ధలైన శత్రువులను విశేషముగ నిరాకరించుము. (ఇది పురోనువాక్య.)

15. అర్థము: హే ఇన్ద్ర!=ఓ యింద్రుఁడా!, శత్రూన్=శత్రువులను, వి నుద=విశేషముగ నిరాకరించుము. మృధః(అపి)=యోద్ధలయిన శత్రువులను గూడ, వి నుద=విశేషముగ నిరాకరించుము. వృత్రస్య=వృత్రాసురుని యొక్క, హనూ=దవడలను, వి రుజ=భగ్నము చేయుము. (త్వమ్=నీవు,) భామితః=కోపించినవాఁడవై, అభిదాసతః=మమ్ము క్షీణింపఁజేయునట్టి, అమిత్రస్య=శత్రువుయొక్క, మన్యుమ్=కోపమును, వి రుజ=భగ్నము చేయుము.

తాత్పర్యము: ఓ యింద్రా! నీవు శత్రువులను యోద్ధలను గూడ ఎక్కువగ నిరాకరించుము. వృత్రాసురుని దవడలను పగులఁగొట్టుము. మిక్కిలి కోపించినవాఁడ వగుచు మమ్ము క్షీణింపఁజేయు శత్రువుయొక్క కోపమును భగ్నము చేయుము. (ఇది పైని చెప్పిన యిష్టియందే మఱియొక యాజ్య.)

16. అర్థము: త్రాతారమ్=(శృంఖలా బంధనమునుండి,) రక్షించువాఁడగు, ఇన్ద్రమ్=ఇంద్రుని, హువేను=నిశ్చయముగ ఆహ్వానించుచున్నాను. అవితారమ్=(భటావరోధమునుండి,) రక్షించువాఁడగు, ఇన్ద్రమ్=ఇంద్రుని, హువేను=ఆహ్వానించుచున్నాను. శూరమ్=(బంధకములను, అవరోధములను, తిరస్కరించుటయందు సమర్థుఁడైన,) శూరుఁడైన, ఇన్ద్రమ్=ఇంద్రుని, హువేను. హవే హవే=సమస్త హోమమునందు, సుహవమ్=సుఖముగ ఆహ్వానింప శక్యుఁడైన, ఇన్ద్రమ్=ఇంద్రుని, హువేను. శక్రమ్=సర్వకార్యములందు శక్తిమంతుఁడైన, ఇన్ద్రమ్, హువేను. మఘవా=ధనవంతుడైన యింద్రుఁడు, నః=మాకొఱకు, స్వస్తి=శుభమును, ధాతు=ఒసఁగుఁగాక. (ఇది మఱియొక యిష్టియందు పురోనువాక్య.)

తాత్పర్యము: శృంఖలా బంధమునుండియు, భటులు మొదలగువారి అవరోధమునుండియు, రక్షించువాఁడును, ప్రతిబంధకములను, అవరోధములను తిరస్కరించుటకు సమర్థుఁడును, సమస్త హోమమునందు సుఖముగ నాహ్వానింప వీలయినవాఁడును, సర్వకార్యములందు శక్తిమంతుఁడును, అనేక యజమానులచే నాహ్వానింపఁబడినవాఁడునునగు ఇంద్రుని ఆహ్వానించుచునే యుందును. ధనవంతుఁడగు ఇంద్రుఁడు మాకు స్వస్తి (=అవినాశము) నొసఁగుఁగాక. (ఇచట ప్రతి విశేషణమునకు ఇంద్రశబ్దావృత్తి వాక్యభేదమునకై చేయఁబడినది. అట్లు చెప్పుటచే ఆదరాతిశయము వ్యక్తమగుచున్నది.)

17. **అర్థము:** హే సహసావన్!=బలవంతుఁడవగు ఓ యింద్రా!, అస్యామ్=ఈ, పరిష్టౌ=పరిరక్షణమునకై చేయఁబడుచున్న యిష్టియందు, (వయమ్=మేము,) అఘాయ=వైకల్యమునకై, మా భూమ=కాకుందుము. (=మేము చేయునట్టి కర్మయందు వైకల్య మేర్పడకుండుఁగాక.) హే హరివః!=అశ్వములతో కూడిన యింద్రా!, పరాదై=(నిన్ను) అవమానించుటకై, (వయమ్=మేము,) మా భూమ=కాకుందుముగాక. (=ఒకప్పుడును మేము నిన్ను అవమానింపము.) అవృకేభిః=హింసకులు లేని, వరూథైః=గృహములచే, నః=మమ్ము, త్రాయస్వ=రక్షింపుము. సూరిషు=విద్వాంసులగు యజమానులందు, (వయమ్=మేము) తవ=నీకు, ప్రియాసః=ప్రీతిపాత్రులము, స్యామ=అగుదుము.

తాత్పర్యము: ఓ బలవంతుఁడవైన యింద్రా! రక్షణము నిమిత్తము మేము చేయుచున్న యీ యిష్టియందు లోపము జరుగకుండునట్లు ప్రవర్తింతుము గాక. అశ్వములతో కూడియున్న యింద్రా! ఎప్పుడును మేము నిన్ను అవమానింపము. హింసకులు లేని గృహములను మా కొసఁగుము. విద్వాంసులగు యజమానుల మధ్యమున మేము నీకు ప్రీతి పాత్రుల మగుదుము గాక. (ఇది యాజ్య.)

18. **అర్థము:** హే పురుహూత!=బహు యజమానులచే ఆహ్వానింపఁబడిన యింద్రా! తే=నీయొక్క, రథమ్=రథమును, అనవః=మనుష్యులు, అశ్వాయ=గుఱ్ఱము (ను కట్టుట) కొఱకు, తక్షన్=సంస్కరింతురు గాక. త్వష్టా=దేవశిల్పి, ద్యుమన్తమ్=దీప్తిమంతమైన, వజ్రమ్=వజ్రాయుధమును, తక్షన్=సంస్కరించుఁగాక. బ్రహ్మాణః=బ్రాహ్మణులు, (=ఋత్విజులు,) అర్కైః=పూజాసాధనములైన మంత్రములచేత, మహయన్తః=పూజించుచున్నవారై, అహయే=(మహా యజ్ఞ ప్రతి బంధకమైన,) పాపమును, హన్తవా ఉ=అవశ్యము నశింపఁజేయుటకు, ఇన్ద్రమ్=ఇంద్రుని, అవర్ధయన్=వృద్ధి నొందింతురు గాక. (లోడర్థమున లఙ్ ప్రయుక్తమైనది.)

తాత్పర్యము: బహు యజమానులచే ఆహ్వానింపఁబడిన యింద్రా! మనుష్యులు అశ్వమును కట్టుటకు నీ రథమును సంస్కరింతురు గాక. దేవశిల్పి దీప్తిమంతమైన నీ వజ్రాయుధమును సంస్కరించుఁగాక. ఋత్విజులు పూజాసాధనములైన మంత్రములచే పూజించుచున్నవారై మహా యజ్ఞ ప్రతిబంధకమైన పాపము నవశ్యము నశింపఁజేయుటకై యింద్రుని వృద్ధి నొందింతురు గాక. (ఇది మఱియొక యిష్టియందలి పురోనువాక్య.)

19. **అర్థము:** హే ఇన్ద్ర!=ఓ యింద్రా!, యత్=ఎప్పుడు, వృష్ణే=కోరికలను వర్షించునట్టి, తే=నీయొక్క, అర్కమ్=అర్చనీయమైన, వృషః=ఫలాభివర్షకమైన యాగమును, గ్రావాణః=సాధనములైన దృషదుపలాది పదార్థములు, అర్చాన్=అలంకరించుచున్నవో, (తదా=అప్పుడు) అదితిః=వేది రూపయైన భూమి, సజోషాః=నీతో సమానమైన ప్రీతి కలది యగుఁగాక. ఇన్ద్రేషితాః=ఇంద్ర ప్రేరితములైన, యే పవయః=ఏ వజ్రాయుధములు, (సన్తి=కలవో, . తే=అవి,) అరథాః=రథాపేక్ష లేనివియు, అనశ్వాసః=అశ్వ నిరపేక్షములేయై, దస్యూన్=అసురులను, అభ్యవర్తన్త=అభిలక్షించి సంహరించుటకు ప్రవర్తించుఁగాక.

తాత్పర్యము: ఓ యింద్రా! కోరికలను తీర్చునట్టి నీయొక్క అర్చనీయమైన ఫలాభివర్షక యాగమును సాధనభూత దృషదుపలాది పదార్థములు అలంకరించినప్పుడు వేదిరూపయగు భూమి నీతో సమానముగ ప్రీతి నొందుఁగాక. ఇంద్రునిచే ప్రేరితములయిన వజ్రాయుధ రథాశ్వములతో అపేక్ష లేకయే మహా యజ్ఞప్రతిబంధకులయిన అసురుల నభిలక్షించి సంహరించుటకు ప్రవర్తించుఁగాక.

షష్ఠప్రపాఠకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే సప్తమః ప్రపాఠకః।

తత్ర ప్రథమోఽనువాకః।

హరిః ఓమ్

మూలము: [1]పాకయజ్ఞం వా అన్వాహితాగ్నేః పశవ ఉపతిష్ఠన్త ఇడా ఖలు వై పాకయజ్ఞస్యైషా ఉత్తరా
ప్రయాజానూయాజా న్యజమానస్య లోకే ఽవహితా [2]తా మాహ్రియమాణా మభి మన్త్రయేత
సురూపవర్షవర్ణ ఏహీతి పశవో వా ఇడా పశూ నేవోప హ్వయతే [3]యజ్ఞం వై దేవా అదుహ్ర
న్యజ్ఞో ఽసురాగ్ం అదుహ త్తే ఽసురా యజ్ఞదుగ్ధాః పరాఽభవ న్యో వై యజ్ఞస్య దోహం
విద్వాన్ (౧)యజతే ఽప్యన్యం యజమానం దుహే [4]సా మే సత్యాఽశీ రస్య యజ్ఞస్య భూయా
దిత్యాహైష వై యజ్ఞస్య దోహ స్తేనైవైనం దుహే [5]ప్రత్తా వై గౌ ర్దుహే ప్రత్తేడా యజ
మానాయ దుహ ఏతే వా ఇడాయై స్తనా ఇడోపహూతేతి వాయు ర్వత్సో [6]యర్హి హోతేడా
ముపహ్వయేత తర్హి యజమానో హోతార మీక్షమాణో వాయుం మనసా ధ్యాయేత్ (౨)మాత్రే
వత్స ముపావ సృజతి [7]సర్వేణ వై యజ్ఞేన దేవా స్సువర్గం లోక మాయ న్పాకయజ్ఞేన మను
రశ్రామ్య త్సేడా మను ముపావర్తత తాం దేవాసురా వ్యహ్వయన్త ప్రతీచీం దేవాః పరాచీ
మసురా స్సా దేవా నుపావర్తత పశవో వై తద్దేవా నవృణత పశవో ఽసురా నజహు [8]ర్యం
కామయేతాపశు స్స్యాదితి పరాచీం తస్యేడా ముపహ్వయేతాపశు రేవ భవతి [9]యమ్
(౩)కామయేత పశుమాన్త్స్యాదితి ప్రతీచీం తస్యేడా ముపహ్వయేత పశుమానేవ భవతి
[10]బ్రహ్మవాదినో వదన్తి స త్వా ఇడా ముపహ్వయేత య ఇడా ముపహూయా ఽఽత్మాన

మిడాయా ముపహ్వయేతేతి [11]సా నః ప్రియా సుప్రతూర్తి ర్మఘోనీత్యాహేడా మేవోప

హూయా ఽఽత్మాన మిడాయా ముపహ్వయతే [12]వ్యస్త మివ వా ఏతద్యజ్ఞస్య యదిడా సామి

ప్రాశ్నన్తి (४)సామి మార్జయన్త ఏతత్ప్రతి వా అసురాణాం యజ్ఞో వ్యచ్ఛిద్యత బ్రహ్మణా

దేవా స్సమదధు [13]ర్బృహస్పతి స్తనుతా మిమం న ఇత్యాహ బ్రహ్మ వై దేవానాం బృహ

స్పతి ర్బ్రహ్మణైవ యజ్ఞగ్ం సం దధాతి [14]విచ్ఛిన్నం యజ్ఞగ్ం సమిమం దధాత్విత్యాహ

సంతత్యైవ [15]విశ్వే దేవా ఇహ మాదయన్తా మిత్యాహ సంతత్యైవ యజ్ఞం దేవేభ్యో ఽను

దిశతి [16]యాం వై (౫)యజ్ఞే దక్షిణాం దదాతి తామస్య పశవో ఽను సంక్రామన్తి స ఏష

ఈజానో పశు ర్భావుకో యజమానేన ఖలు వై తత్కార్య మిత్యాహు ర్యథా దేవత్రా దత్తం

కుర్వీతా ఽఽత్మ న్పశూ న్రమయేతేతి [17]బ్రధ్న పిన్వస్వేత్యాహ యజ్ఞో వై బ్రధ్నో యజ్ఞ

మేవ తన్మహయత్యథో దేవత్రైవ దత్తం కురుత ఆత్మన్పశూ న్రమయతే [18]దదతో మే

మా క్షాయి త్యాహాక్షితి మేవోపైతి [19]కుర్వతో మే మోపదస దిత్యాహ భూమాన మేవో

పైతి ॥౬॥ (విద్వా న్ధ్యాయే ధ్రువతి యం ప్రాశ్నన్తి యాం వై మ ఏకాన్నవిగ్ంశతి శ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే సప్తమప్రపాఠకే ప్రథమో ఽనువాకః॥

వేదార్థ దీపిక

అవతారిక : ఈ ప్రథమానువాకమునందు ఇడానుమంత్రణమును విధించుటకు ముందు ఈ మంత్రమునందు ఇడా ప్రశంస చేయఁబడుచున్నది.

1. అర్థము: ఆహితాగ్నేః=అహితాగ్నియొక్క, పాకయజ్ఞమ్ అను=పాకయజ్ఞము ననుసరించి, పశవః=గవాది పశువులు, ఉపతిష్ఠన్తే=పొందుచున్నవి. (=లభించుచున్నవి.) ఇడా వై =ఇడా భక్షణమే, పాకయజ్ఞః ఖలు=పాకయజ్ఞము కదా!, సా ఏషా=అ యీ యిడ, యజమానస్య=యజమానునియొక్క, లోకే=ఫలసాధన యజ్ఞమునందు, ప్రయాజానూయాజాన్ అన్తరా=ప్రయాజానూయాజల మధ్యమునందు, అవహితా=వ్యవస్థితమైనది.

తాత్పర్యము: ఔపాసనహోమము, వైశ్వదేవము, పార్వణము, అష్టకాహోమము, మాసిశ్రాద్ధము, సర్పబలి, ఈశానబలి, అనునవి యేడు పాకయజ్ఞములని ఆపస్తంబసూత్ర వ్యాఖ్యాతలు వివరించిరి. హుతము, ప్రహుతము, ఆహుతము, శూలగవము, బలిహరణము, ప్రత్యవరోహణము, అష్టకాహోమము, అనునవి సప్త పాకయజ్ఞములని బౌధాయన మహర్షి చెప్పియుండెను. ఆశ్వలాయన మహర్షి పాకయజ్ఞములు మూఁడని నుడివెను. ఈ పాకయజ్ఞములలో ఏది యేని ఒక పాకయజ్ఞము ననుసరించి గవాది పశువులు లభించుచున్నవి. ఇడా భక్షణమే పాకయజ్ఞము. కావున ఇడాభక్షణముచేత పశువులు లభించుచున్నవని భావము. అట్టి యీ యిడ యజమానునియొక్క ఫలసాధన యజ్ఞమునందు ప్రయాజానూయాజల మధ్యమున వ్యవస్థితమై యున్నది. ప్రయాజ, అనూయాజ, ఆజ్యభాగ, ప్రధాన స్విష్టకృత్తులు, అవాంతర కర్మవిశేషములు. ఇడ=హవిర్విశేషము. (ఇచట ఇడాశబ్దమునకు ఇడాభక్షణమని అర్థము వ్రాయఁబడినది.)

2. అర్థము: ఆహ్రియమాణామ్=హోతృసమీపమునకు తీసికొనిరాఁబడుచున్న, తామ్=ఆ యిడను, "హే సురూప వర్ష వర్ణే!=శోభనరూపము, వృష్టి వర్ణములు గల ఓ యిడా!, ఏహి=రమ్ము". ఇతి=అని, అభిమన్త్రయేత=అభిమంత్రించవలెను. పశవః వా=పశువులే, ఇడా=ఇడ. (అతః=ఇందువలన,) పశూనేవ=పశువులనే, (యజమానః=యజమానుఁడు,) ఉపహ్వయతే=ఆహ్వానించుచున్నవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: (ఈ మంత్రము ఇడానుమంత్రణమును విధించుచున్నది.) ఇడను హోతృసమీపమునకు 'ఓ సురూపవర్ష వర్ణా!' అని చెప్పి తీసికొనివచ్చి అభిమంత్రించవలెను. ఇడాదేవత పశుసాధన మగుటచేత, మంత్రగతమైన 'ఏహి' అను పదముచేత యజమానుఁడు పశువులనే ఆహ్వానించినవాఁ డగును.

3. అర్థము: దేవాః=దేవతలు, యజ్ఞమ్=యజ్ఞమును, అదుహన్ వై =ఫలమును పితికిరి. (=యజ్ఞమునుండి ఫలమును గ్రహించి యజ్ఞమును నిస్సారముగ చేసిరి.) యజ్ఞః=యజ్ఞము, అసురాన్=రాక్షసులను, అదుహత్=సారహీనులనుగ చేసెను. తే అసురాః=ఆ యసురులు, యజ్ఞదుగ్ధాః=యజ్ఞముచే నిస్సారులుగ చేయఁబడినవారై, పరాభవన్=పరాభూతులైరి. యః వై =ఏ యజమానుఁడైతే, యజ్ఞస్య=యజ్ఞముయొక్క, దోహమ్=దేవకర్తృక యజ్ఞ రిక్తీకరణమును, యజ్ఞకర్తృక రాక్షస రిక్తీకరణమును, విద్వాన్=తెలిసికొనినవాఁడై, యజతే=యాగము చేయుచున్నాఁడో, (సః=ఆ యజమానుఁడు,) అన్యం యజమాన మపి=ఇతర యజమానునిఁ గూడ, దుహే=రిక్తునిగా చేయుచున్నాఁడు. (దోహము=రిక్తీకరణము.)

తాత్పర్యము: పూర్వము దేవతలు యజ్ఞమునుండి ఫలమును గ్రహించి ఆ యజ్ఞమును రిక్తముగ చేసిరి. ఆ యజ్ఞము రాక్షసులను రిక్తులనుగా చేసినది. ఈ దేవకర్తృక యజ్ఞ రిక్తీకరణమును, యజ్ఞకర్తృక రాక్షస రిక్తీకరణమును తెలిసికొని యజ్ఞము చేసిన యజమానుఁడు ఇతర యజమానుని గూడ రిక్తునిగా చేయుచున్నాఁడు. (ఈ వాక్యము మంత్ర ప్రశంసా రూపమే కాని యజమానునకు హానికరమైనది కాదు. "సా మే సత్యాశీః" అను మంత్రభాగమును వ్యాఖ్యానించుటకు ముందు ఈ మంత్రము తత్ప్రశంసను చేసినది.)

4. అర్థము: అస్య యజ్ఞస్య=ఈ యజ్ఞమునకు సంబంధించిన, సా ఆశీః="ఉపహూతోఽయం యజమానః" ఇత్యాదికముచే చెప్పఁబడిన యజ్ఞఫల ప్రార్థనా రూపమైన ఆ యాశీస్సు, మే=నాకు, సత్యా భూయాత్=సత్య మగుఁగాక, ఇతి=అని, ఆహ="సత్యాశీ" రిత్యాది మంత్రము చెప్పెను. ఏషః వై =ఈ యాశీరూపమే, యజ్ఞస్య=యజ్ఞమునకు, దోహః=దోహమువంటిది. తేనైవ=ఆ దోహముచేతనే, ఏనమ్=ఈ యజమానుని, దుహే=రిక్తుని చేయుచున్నాను.

తాత్పర్యము: "ఉపహూతో౽యం యజమానః" ఇత్యాద్యాహ్వాన మంత్రగతమైన యజ్ఞసంబంధియగు ఆశీస్సే ఈ యజ్ఞముయొక్క దోహము. ఆ దోహముచేతనే ఇతర యజమానునినుండి సారమును గ్రహించుచున్నాను.

విశేషములు: దోహ మనఁగా సారమును గ్రహించుట. "గాం దోగ్ధి పయః" అను వాక్యమునకు ఆవునుండి పాలు పితుకుటచే గోవు పయస్సుచే రిక్త యగుచున్నది. అనఁగా పయశ్శూన్య యగుచున్నదని భావము. ఇటులనే "యజ్ఞం దోగ్ధి ఫలమ్"=యజ్ఞమునుండి ఫలమును గ్రహించుచున్నానని యర్థము. యజ్ఞఫల మనఁగా ఆశీరూపము. ఆ యాశీస్సు "ఉపహూతో౽యం యజమానః" అను మంత్రమున చెప్పఁబడినది. (ఈ యనువాకమునందలి బ్రాహ్మణ వాక్యము లన్నియు ఆఱవ ప్రపాఠకమునందలి మూఁడవ యనువాక మంత్రములకు వ్యాఖ్యాన రూపములు.)

5\. **అర్థము:** ప్రత్తా=(దూడ నాకుటచే,) ప్రస్నుత స్తనములు గల, గౌః=ఆవు, దుహే=క్షీరమును స్రవింపఁజేయుచున్నది. ఇడా=ఇడ, ప్రత్తా=ప్రస్నుతయై, యజమానాయ=యజమానునికొఱకు, దుహే=ఫలము నిచ్చుచున్నది. ఏతే వై "ఇడో పహూతాః ఇతి"="ఇడోపహూతే" త్యాది యీ మంత్ర భాగములే, ఇడాయై=ఇడకు, స్తనాః=స్తనములు. (వంటివి.) వాయుః=వాయువు, వత్సః=దూడ. (వంటిది.)

తాత్పర్యము: (వాయు ధ్యానము చేయుటకు ముందు వాయు స్తుతి చేయఁబడుచున్నది.) దూడ మొదట స్తనముల నాస్వాదించిన పిమ్మట గోవు ప్రస్నుత(=చేఁపిన) స్తనియై పాల నిచ్చుచున్న విధముగ, ఇడ ప్రస్నుతయై యజమానునకు ఫలముల నొసఁగుచున్నది. (ఇచట 'ఇడో పహూతే' త్యాది మంత్రములు ఇడా స్తనములుగాను, వాయువు వత్సముగాను వర్ణింపఁబడిరి.)

6\. **అర్థము:** యర్హి=ఏ సమయమునందు, హోతా=హోత, ఇడామ్=ఇడను, ఉపహ్వయేత=ఆహ్వానించునో, తర్హి=ఆ సమయమునందు, యజమానః=యజమానుఁడు, హోతారమ్=హోతను, ఈక్షమాణః=చూచుచున్నవాఁడై, వాయుమ్=వాయుదేవుని, మనసా=మనస్సుచే, ధ్యాయేత్=ధ్యానము చేయవలెను. (ఏవం కృతే సతి=ఇట్లు చేయఁగా,) మాత్రే=తల్లికొఱకు (=తల్లిదగ్గఱకు,) వత్సమ్=దూడను, ఉపావ సృజతి=విడిచినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: హోత యిడ నాహ్వానించిన సమయమున యజమానుఁడు హోతను చూచుచు వాయుదేవుని మనస్సుచే ధ్యానించవలెను. ఇట్లు చేసినచో దూడను తల్లిదగ్గఱకు చేర్చిన ట్లగును. (ఇది వాయుధ్యాన విధాయక మంత్రము.)

7\. **అర్థము:** దేవాః=దేవతలు, (సర్వే=అందఱు,) సర్వేణ యజ్ఞేన వై=సంపూర్ణ దర్శపూర్ణమాస యజ్ఞముచేతనే, సువర్గం లోకమ్=స్వర్గలోకమును, ఆయన్=పొందిరి. (తేషు=ఆ దేవతలయందు,) మనుః=మనువు, పాకయజ్ఞేన=పాకయజ్ఞముచేత, అశ్రామ్యత్=శాంతుఁడాయెను. (=విశ్రమించెను.) సా ఇడా=(అపి) ఆ యిడా దేవతయు, మనుమ్=మనువును, ఉపావర్తత=పొందెను. తామ్=ఆ యిడా దేవతను, దేవాసురాః=దేవతలు, అసురులు, వ్యహ్వయన్త=(వి+అహ్వయన్త) తారుమారుగా నాహ్వానించిరి. దేవాః=దేవతలు, ప్రతీచీమ్="ఇడోపహూతా" ఇత్యాది విధముగాను, అసురాః=రాక్షసులు, పరాచీమ్="ఉపహూతేడా" ఇత్యాది విధముగాను, ఆహ్వయన్త=ఆహ్వానించిరి. సా=ఆ యిడాదేవత, దేవాన్=దేవతలను, ఉపావర్తత=సమీపించెను. (పొందెను.) పశవః వై=పశువులే, తత్=ఆ యిడా స్వరూపము. (తతః=అందువలన,) పశవః=పశువులు, దేవాన్=దేవతలను, అవృణత=వరించినవి. అసురాన్=అసురులను, అజహుః=విడిచినవి.

తాత్పర్యము: మనువుతో కూడ దేవత లందఱు సంపూర్ణ దర్శపూర్ణమాస యజ్ఞముచే స్వర్గము నొందుట కుద్యుక్తు లయిరి. ఆ దేవతలలో మనువు 'ఇడయే పాకయజ్ఞము కదా!' అని చెప్పి పాకయజ్ఞముతోడనే విరమించుకొనెను. అనఁగా మనువు హోతయగుచు ఇడోపాహ్వానమునందే తాత్పర్యము కలిగియుండెను. ఆ యిడా దేవత అట్టి తాత్పర్యము గల మనువును పొందినది. ఆ యిడను చూచి దేవాసురులు పరస్పర వ్యత్యయముచే ఇడ నాహ్వ

నించిరి. వారిలో దేవతలు ఇడాదేవతను ఆహ్వాన మంత్రమునందు 'ఇడ' శబ్దమును ముందుంచి "ఇడోప హూతా" ఇత్యాది విధముగ నాహ్వానించిరి. (ఇది ప్రతీచీ పద్ధతి.) అసురులు, ఉపహూత పదమును ముందుంచి "ఉపహూతేడా" ఇత్యాది విధముగ ఇడా దేవత నాహ్వానించిరి. (ఇది పరాచీ పద్ధతి.) దేవతా హ్వానముచే సంతుష్టయైన ఇడా దేవత దేవతలను సమీపించినది. "పశవో వా ఇడా" అను శ్రుత్యంతరము ననుసరించి ఇడారూప పశువులు దేవతలను వరించెను. అసురుల యాహ్వానపు తీరుపట్ల విముఖత చెందుటచే ఇడారూప పశువులు అసురులను విడిచిపెట్టెను.

8. అర్థము: (సః=అతఁడు,) అపశుః=పశువిహీనుఁడు, స్యాత్=అగుఁగాక, ఇతి=అని, యమ్=ఎవనినిగూర్చి, అధ్వర్యుః= అధ్వర్యుఁడు, కామయేత=కోరునో, తస్య=అతనికి, ఇడామ్=ఇడా దేవతను, పరాచీమ్=పరాచీన పద్ధతిగ (='ఉపహూతేడా' ఇత్యాది విధముగ,) ఉపహ్వయేత=ఆహ్వానించవలెను. సః=అతఁడు, అపశు రేవ= పశు విహీనుఁడే, భవతి=అగుచున్నాఁడు.

తాత్పర్యము: ఎవఁడు పశు విహీనుఁడు కావలయునని ఎవని నుద్దేశించి అధ్వర్యుఁడు కోరునో, అప్పు డా యధ్వర్యుఁడు "ఉపహూతేడా" అని పరాచీన పద్ధతిగ ఇడ నాహ్వానించవలెను. అట్లు ఆహ్వానించినచో ఉద్దేశ్య భూతుఁడైన యతఁడు పశు విహీనుఁడే యగును. (ఇది హేయ పద్ధతి.)

9. అర్థము: యమ్=ఎవనిని ఉద్దేశించి, పశుమాన్=పశువులు కలవాఁడు, స్యాత్=అగుఁగాక, ఇతి=అని, కామయేత= కోరునో, తస్య=అతనికి, ఇడామ్=ఇడా దేవతను, ప్రతీచీమ్=ప్రతీచీన పద్ధతిగ (="ఇడోపహూతా" అని,) ఉపహ్వయేత=ఆహ్వానించవలెను. (సః=ఆ ఉద్దేశ్య భూతుఁడు) పశుమానేవ=పశువులు కలవాఁడే, భవతి= అగుచున్నాఁడు. (ఇది ఉపాదేయ పద్ధతి.)

10. అర్థము: యః=ఏ యజమానుఁడు, ఇడామ్=ఇడా దేవతను. ఉపహూయ=("ఇడ ఏహి, అదితి ఏహి" అని మంత్రముచే,) ఆహ్వానించి, ఇడాయామ్=ఇడా దేవతయందు, ఆత్మానమ్=ఆత్మను, ఉపహ్వయేత= యోజన చేయునో, స ఏవ=ఆ యజమానుఁడే, ఇడామ్=ఇడా దేవతనైన, త్వా=నిన్ను, ఉపహ్వయేత= ఆహ్వానించినవాఁ డగును, ఇతి=అని, బ్రహ్మవాదినః=వేదార్థ విచారణ చేయు విద్వాంసులు, వదన్తి= చెప్పుచున్నారు.

తాత్పర్యము: "ఇడ ఏహి", "అదితి ఏహి" అని మంత్రముచే ఇడా దేవత నాహ్వానించి తన యాత్మయందు అనుసంధానము చేయు యజమానుఁడే ఇడా దేవతను శాస్త్రీయముగ ఆహ్వానించినవాఁ డగునని వేదార్థ విచారణ చేయు విద్వాంసులు చెప్పుచున్నారు.

11. అర్థము: హే ఇడే!=ఓ యిడాదేవతా!, ప్రియా=ప్రీతిపాత్రమైన, సా=అటువంటి, త్వమ్=నీవు) నః=మమ్ముఁగూర్చి, సుప్రతూర్తిః=శత్రువులను, బాగుగ సంహరించుదానవు, మఘోనీ=ధనవతివి, (భవ=అగుము,) ఇతి=అని, ఆహ="సా నః ప్రియే" త్యాది మంత్రము చెప్పెను. (తతః=అందువలన,) ఇడామ్=ఇడా దేవతను, (యజమానః=యజమానుఁడు.) ఉపహూయ=ఆహ్వానించి, ఆత్మానమ్=మనస్సును, ఇడాయామ్=ఇడా దేవతయందు, ఉపహ్వయతే ఏవ=యోజన చేసినవాఁడే యగుచున్నాఁడు.

తాత్పర్యము: "సా నః ప్రియా" ఇత్యాది మంత్రమును జపించుచు యజమానుఁడు "ఇడ ఏహి, అదితి ఏహి" అని ఇడా దేవత నాహ్వానించి ఆ దేవతయందు ఆత్మను అనుసంధానము చేసిన యజమానుఁడు యథావిధిగ ఇడా దేవత నాహ్వానించినవాఁ డగును.

12. అర్థము: ఇడా యత్=ఇడ యనునది యేది, (అస్తి=కలదో!,) ఏతత్ యజ్ఞస్య=యజ్ఞముయొక్క ఈ యంగము, వ్యస్త మివ వా=విచ్ఛిన్న మైనదివలె, ఉన్నది. (ఎట్లనఁగా-) సామి=పురోడాశముయొక్క లేశభాగమును, ప్రాశ్నన్తి=(ఋత్విజాదులు,) తినుచున్నారు. సామి=ఉదక లేశమును, మార్జయన్తి=శిరస్సులపైని చల్లు కొనుచున్నారు. ఏతత్ ప్రతి=ఈ పురోడాశ లేశభాగ భక్షణము, ఉదకబిందు మార్జనములఁగూర్చి, అసురాణామ్=రాక్షసులయొక్క, యజ్ఞః=యజ్ఞము, వ్యచ్ఛిద్యత వా=విచ్ఛిన్నమే యైనది. దేవాః=దేవతలు, బ్రహ్మణా=సమర్థుడైన పురుషునిచే, సమదధుః=విచ్ఛిన్న యజ్ఞ భాగములను సంధానము చేసిరి.

తాత్పర్యము: ఋత్విజులు ప్రధాన యాగముల ననుష్ఠించిన పిమ్మట అనూయాజాది యాగముల ననుష్ఠించుటకు (ఈ రెండింటికి మధ్యకాలమున) పురోడాశలేశమును భక్షించి ఉదకలేశమును శిరస్సులపైని మార్జనము చేసికొనుచున్నారు. ఈ పురోడాశలేశ భక్షణము, ఉదకలేశ మార్జనము, అను నీ రెండును యాగరూపములు కానివగుటచే యజ్ఞాంగము విచ్ఛిన్నమైనదివలె నున్నది. ఈ పురోడాశలేశ భక్షణము, ఉదకలేశ మార్జనములు నిమిత్తముగా రాక్షసుల యజ్ఞము విచ్ఛిన్నమే యైనది. దేవతలు అప్రమత్తులై ఒక సమర్థుడైన పురుషుని చేత విచ్ఛిన్నమైన పూర్వోత్తర యజ్ఞభాగములను సరిచేసికొనిరి.

13. అర్థము: బృహస్పతిః=బృహస్పతి, నః=మాయొక్క, ఇమమ్=ఈ యజ్ఞమును, తనుతామ్=విస్తరింపఁ జేయుఁగాక, ఇతి=అని, ఆహ="బృహస్పతి స్తనుతా" మిత్యాది మంత్రము చెప్పెను. దేవానామ్=దేవతలకు, బృహస్పతిః వై=బృహస్పతియే, బ్రహ్మ=బ్రహ్మ. (అతః=ఇందువలన, యజమానః=యజమానుఁడు,) బ్రహ్మణైవ=బ్రహ్మచేతనే, యజ్ఞమ్=యజ్ఞమును, సందధాతి=సంధానము చేయుచున్నాఁడు.

తాత్పర్యము: 'మా యజ్ఞమును బృహస్పతి వృద్ధి చేయుఁగాక' అని "బృహస్పతి స్తనుతా" మిత్యాది మంత్రము చెప్పినది. అనఁగా యజమానుఁ డా మంత్రముచే బృహస్పతిని ప్రార్థించెను. బృహస్పతియే దేవతలకు బ్రహ్మ కావున, అట్లు ప్రార్థించిన యజమానుఁడు బ్రహ్మచేతనే తన యజ్ఞమును సంధానము చేయించినవాఁ డగుచున్నాఁడని స్పష్ట మగుచున్నది.

14. అర్థము: విచ్ఛిన్నమ్=(ఏదేని ఒక వైకల్యముచేత,) విచ్ఛిన్నమైన, ఇమం యజ్ఞమ్=ఈ యజ్ఞమును, సందధాతు=(మనోజ్యోతి యగు నగ్ని) బాగుగ సంధానము చేయుఁగాక, ఇతి=అని, సంతత్యైవ=అవిచ్ఛిత్తికొఱకే, ఆహ="విచ్ఛిన్న మిత్యా"ది మంత్రము చెప్పెను.

తాత్పర్యము: ఏదేని ఒక వైకల్యముచే విచ్ఛిన్నమైన ఈ యజ్ఞమును మనోజ్యోతి యగు నగ్ని దోషరహితముగఁ జేయుఁగాక, అని 'విచ్ఛిన్న' మిత్యాది మంత్రము చెప్పినది. అట్లు చెప్పుట అవిచ్ఛిత్తికొఱకే.

15. అర్థము: విశ్వే దేవాః=సర్వదేవతలు, ఇహ=ఈ యజ్ఞమునందు, మాదయన్తామ్=తృప్తి నొందుదురు గాక, ఇతి=అని, ఆహ="విశ్వే దేవా" ఇత్యాది మంత్రము చెప్పినది. సంతత్యైవ=అవిచ్ఛిత్తి కొఱకే, యజ్ఞమ్=యజ్ఞమును, అనుదిశతి=అజ్ఞాపించుచున్నది.

తాత్పర్యము: 'విశ్వే దేవా' ఇత్యాది మంత్రము సర్వ దేవతలు ఈ యజ్ఞమునందు తృప్తి నొందుదురు గాక యని చెప్పినది. ఇది అవిచ్ఛిత్తికొఱకే యజ్ఞము నుద్దేశించి దేవతలకొఱకు చెప్పుచున్నది.

16. అర్థము: (యజమానః=యజమానుఁడు, ఋత్విగ్భ్యః=ఋత్విజులకొఱకు,) యజ్ఞే=యజ్ఞమునందు, యాం దక్షిణామ్=(గవాన్వాహార్యాది రూపమైన,) ఏ దక్షిణను, దదాతి=ఇచ్చుచున్నాఁడో, అస్య=ఈ యజమానునియొక్క, పశవః అపి)=పశువులు కూడ, తామ్=ఆ దక్షిణను, అను సంక్రామన్తి=పొందుచున్నవి. (తదా=అప్పుడు,) ఈజానః=యజ్ఞము చేయుచున్న, సః ఏషః=ఆ యీ దక్షిణ యిచ్చిన యజమానుఁడు, అపశుః=పశు రహితుఁడు, భావుకః=కాఁగలవాఁడు. యథా=ఏ విధముగ, దేవత్రా=దేవతారూపులయిన ఋత్విజులయందు, దత్తమ్=ఈయఁబడినదిగా, (=ఉండునదిగా,) కుర్వీత=చేయునో, పశూన్=పశువులను, ఆత్మన్=తనయందు, రమయేత=రమింపచేయునో, తత్=ఆ విధముగ, యజమానేన=యజమానునిచేత, కార్యం ఖలు=చేయఁదగినది కదా! ఇతి=అని, ఆహుః=(బుద్ధిమంతులు,) చెప్పుచున్నారు.

తాత్పర్యము: యజ్ఞకర్త యజ్ఞమునందు ఋత్విజుల కిచ్చిన దక్షిణలో యజమానుని పశువులు కూడ చేరును కావున ఆ యజమానుఁడు పశురహితుఁడు కాఁగలఁడు. కావున దక్షిణ దేవతారూపులయిన ఋత్విజులయం దుండునట్లు గాను, పశువులు తన యొద్దనే యుండునట్లుగాను యజమానుఁడు చేయవలయునని బుద్ధిమంతులు చెప్పుచున్నారు. ("బ్రధ్న పిన్వస్వ" ఇత్యాది పురోడాశాభిమంత్రణ మంత్రమును వ్యాఖ్యానించుటకు ముందు తత్స్తుతి యిచట చేయఁబడినది.)

17. అర్థము: హే బ్రధ్న!=ఓ యజ్ఞపురుషా!, పిన్వస్వ=(మమ్ము ఋత్విజులను,) తృప్తి పఱచుము, ఇతి=అని, ఆహ= "బ్రధ్న పిన్వస్వే" త్యాది మంత్రము చెప్పుచున్నది. యజ్ఞో వై=యజ్ఞమే, బ్రధ్నః=బ్రధ్నశబ్ద వాచ్యము. (తతః=అందువలన,) తత్="బ్రధ్న పిన్వస్వ" ఇత్యాది విధముగ చెప్పుట, యజ్ఞమేవ=యజ్ఞమునే, మహయతి=పూజించిన ట్లగుచున్నది. అథో=అందువలన, (యజమానః=యజమానుఁడు,) దేవత్రైవ=దేవతల యందే, దత్తమ్=(దక్షిణ) ఈయఁబడినదిగా, కురుతే=చేయుచున్నాఁడు. ఆత్మన్=తనయందు, పశూన్=పశువులను, రమయతే=రమింపఁ జేయుచున్నాఁడు.

తాత్పర్యము: యజ్ఞమే బ్రధ్నశబ్ద వాచ్యము కావున "బ్రధ్న పిన్వస్వ" అని ప్రార్థించుటచే యజమానుఁడు యజ్ఞమును గౌరవించుచున్నవాఁ డగుచున్నాఁడు. ఇట్టి పూజా రూపమైన ప్రోత్సాహముచేత యజమానుఁడు ఋత్విజుల కిచ్చిన దక్షిణను దేవతలయందే ఉండునట్లుగాను, పశువులు తనయొద్దనే ఉండునట్లుగాను చేసిన ట్లగుచున్నది. (=దక్షిణ దేవతలకు చెందుట, పశువులు తనదగ్గఱ ఉండుట అను ప్రయోజన ద్వయమును సాధించిన ట్లగుచున్నది. ఇది పురోడాశాభిమంత్రణ మంత్రముయొక్క ప్రథమ భాగము.)

18. అర్థము: దదతః=ఇచ్చుచున్న, మే=నాయొక్క (ధనమ్=ధనము) మా క్షాయి=క్షీణించకుండుఁగాక, ఇతి=అని, ఆహ= చెప్పుటచే, (ధనమ్=ధనము,) అక్షితిమేవ=అక్షయమునే, ఉపైతి=పొందుచున్నది.

తాత్పర్యము: యజ్ఞమునందు ఋత్విజాదుల కిచ్చుచున్న నాధనము క్షీణించకుండుఁగాక, అని ప్రార్థించుటచే ఆ ధనము అక్షయమునే పొందుచున్నది. (ఇది రెండవ భాగము.)

19. అర్థము: కుర్వతః=యజ్ఞము చేయుచున్న, మే=నాయొక్క, (సామర్థ్యమ్=సామర్థ్యము,) మోపదసత్=క్షీణింపకుండుఁ గాక, ఇతి=అని, ఆహ=చెప్పుటచే, (యజమానః=యజమానుఁడు, భూమానమేవ=అభివృద్ధిరూప బాహుళ్యమునే, ఉపైతి=పొందుచున్నాఁడు.

తాత్పర్యము: యజ్ఞము చేయుచున్న నాయొక్క సామర్థ్యము క్షీణింపకుండుఁగాక, అని ప్రార్థించుటచే యజమానుఁ డధికముగనే అభివృద్ధిని పొందుచున్నాఁడు.

ప్రథమానువాకము సమాప్తము

అథ ప్రథమకాణ్డే సప్తమ ప్రపాఠకే ద్వితీయోఽనువాకః।

మూలము: [1]సగ్ంశ్రవా హ సౌవర్చనస స్తుమిఞ్జ మౌపోదితి ముండ్రాచ [2]యత్సత్రిణాగ్ం హోతాఽభూః
కామిడా ముపాహ్వథా ఇతి [3]తా ముపాహ్వ ఇతి హోవాచ యా ప్రాణేన దేవా న్దాధార
వ్యానేన మనుష్యా నపానేన పితౄ నితి [4]ఛినత్తి సా న ఛినత్తీ౩ ఇతి [5]ఛినత్తీతి హోవాచ [6]శరీ
రం వా అస్యై తదుపాహ్వథా ఇతి హోవాచ [7]గా ర్వై (౧) అస్యై శరీరం గాం వావతా
పర్యవదతాం [8]యా యజ్ఞే దీయతే సా ప్రాణేన దేవా న్దాధార యయా మనుష్యా జీవన్తి
సా వ్యానేన మనుష్యా న్యాం పితృభ్యో ఘ్నన్తి సా ఽపానేన పితౄన్ య ఏవం వేద
పశుమా న్భవత్య[9]థ వై తా ముపాహ్వ ఇతి హోవాచ యా ప్రజాః ప్రభవన్తీః ప్రత్యా
భవతి [10]త్యన్నం వా అస్యై తత్ (౨)ఉపాహ్వథా ఇతి హోవాచౌ[11]షధయో వా అస్యా
అన్న మోషధయో వై ప్రజాః ప్రభవన్తీః ప్రత్యా భవన్తి [12]య ఏవం వేదాన్నాదో భవ
[13]త్యథ వై తా ముపాహ్వ ఇతి హోవాచ యా ప్రజాః పరా భవన్తీ రను గృహ్ణాతి ప్రత్యా
భవన్తీ గ్గృహ్ణాతీతి [14]ప్రతిష్ఠాం వా అస్యై తదుపాహ్వథా ఇతి హోవాచే[15]యం వా అస్యై
ప్రతిష్ఠా (౩)ఇయం వై ప్రజాః పరా భవన్తీ రను గృహ్ణాతి ప్రత్యా భవన్తీ గ్గృహ్ణాతి [16]య
ఏవం వేద ప్రత్యేవ తిష్ఠ [17]త్యథ వై తా ముపాహ్వ ఇతి హోవాచ యస్యై నిక్రమణే
ఘృతం ప్రజా స్సంజీవన్తీః పిబన్తీతి [18]ఛినత్తి సా న ఛినత్తీ౩తి [19]న ఛినత్తీతి హోవాచ
ప్ర తు జనయతీ[20]త్యేష వా ఇడా ముపాహ్వథా ఇతి హోవాచ [21]వృష్టి ర్వా ఇడా వృష్ట్యై

వై నిక్రమణే ఘృతం ప్రజా స్సంజీవన్తీః పిబన్తి య ఏవం వేద ప్రైవ జాయతే ఽన్నాదో భవతి ॥౪॥ (గౌర్వా అస్యై తత్ప్రతిష్ఠాఽహ్వయథా ఇతి వింశతిశ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే సప్తమప్రపాఠకే ద్వితీయోఽనువాకః।

వేదార్థదీపిక

అవతారిక: ప్రథమానువాకమునందు ఇడాద్యనుమంత్రణ మంత్రములు వ్యాఖ్యానింపఁబడినవి. ఈ ద్వితీయానువాకమునందు ఇద్దఱు మహర్షుల ప్రశ్నోత్తరముల మూలమున ఆ యిడ ప్రశంసింపఁబడుచున్నది.

1. అర్థము: సౌవర్చనసః=సువర్చనసుని కుమారుఁడైన, సంశ్రవాః=సంశ్రవసుఁ డను పేరు గల ముని, ఔపోదితిమ్=ఉపోదితుని కుమారుఁడైన, తుమిఞ్జమ్=తుమింజుఁ డను పేరు గల మునిని గూర్చి, ఉవాచ=పలికెను.

తాత్పర్యము: సువర్చనసుని కుమారుఁడైన సంశ్రవసుఁ డను ముని ఉపోదితి కుమారుఁడైన తుమింజుఁ డను మునితో ఇట్లు పలికెను. (=సంశ్రవసుఁడు తుమింజుని ప్రశ్నించెను.)

2. అర్థము: యత్=ఎప్పుడు, సత్రిణామ్=యాగకర్తలకు, హోతా=హోతవు, అభూః=అయితివో, (తదా=అప్పుడు,) కామ్=ఎట్టి గుణములు కల, ఇడామ్=ఇడను, ఉపాహ్వథాః=అహ్వానించితివి?, ఇతి=అని. (ఉవాచ=పలికెను.) అని 1వ మంత్రములోని కన్వయము.)

తాత్పర్యము: ఓ తుమింజమునీ! నీవు యాగకర్తలకు హోతవైనప్పుడు ఎట్టి గుణములు కల యిడ నాహ్వానించితివి?, అని సంశ్రవసముని తుమింజ మునిని ప్రశ్నించెను.

3. అర్థము: యా=ఏ యిడాదేవి, ప్రాణేన=ప్రాణవాయువుచేత, దేవాన్=దేవతలను, వ్యానేన=వ్యానవాయువుచేత, మనుష్యాన్=మనుజులను, అపానేన=అపానవాయువుచేత, పితౄన్=పితృ దేవతలను, దాధార=ధరించెనో, తామ్=ఆ యిడా దేవిని, ఉపాహ్వే=ఆహ్వానించితిని, ఇతి=అని, ఉవాచ హ=పలికెనఁట!, ఇతి=అని.

తాత్పర్యము: ఇడాదేవి ప్రాణవాయువుచే దేవతలను, వ్యానవాయువుచే మనుష్యులను, అపానవాయువుచే పితృదేవతలను ధరించెనఁట! అట్టి గుణవిశిష్టయైన యిడాదేవి నాహ్వానించితి నని తుమింజముని సంశ్రవసమునికి సమాధానము చెప్పెను. (ఇడాదేవి ప్రాణాది వృత్తులచే దేవాదులను ధరించిన విధము 8వ వాక్యమున వివరింపఁబడును.)

4. అర్థము: (ప్రశ్న) సా=ఆ యిడాదేవి, ఛినత్తి=(గోరూపయై, దక్షిణా ప్రతిగ్రహీతలను ప్రతిగ్రహ దోషముచే,) నశింపఁజేయుచున్నదియా? న ఛినత్తి3? =నశింపఁజేయుట లేదా? ఇతి=అని, (పప్రచ్ఛ=అడిగెను.)

తాత్పర్యము: నీవు ఆహ్వానించిన యిడా దేవి గోరూపయై తనను దక్షిణగా స్వీకరించిన ప్రతిగ్రహీతలను ప్రతిగ్రహ దోషముచే నశింపఁజేయుచున్నదియా? నశింపఁజేయుట లేదా? (అని సంశ్రవసముని మఱల ప్రశ్నించెను. ఇచట 'ఛినత్తి' అనుచోట గల ప్లుతము 'అవునా? కాదా?' అనెడి విచారార్థకము.)

5. అర్థము: ఛినత్తి=నశింపఁ జేయుచున్నది, ఇతి=అని, ఉవాచ హ=పలికెనఁట!.

తాత్పర్యము: గోరూపయైన యిడను దక్షిణగా స్వీకరించిన ప్రతిగ్రహీతలను ప్రతిగ్రహ దోషముచే నశింపఁ జేయుచున్నదని సమాధానము.

6. అర్థము: అస్యై=ఈ యిడాదేవతయొక్క, శరీరమ్=శరీరము, (యత్ అస్తి=ఏది కలదో,) తత్ వా=ఆ శరీరమునే, ఉపాహ్వథాః=ఆహ్వానించితివి, ఇతి=అని, ఉవాచ హ=(పృచ్ఛకుఁడైన సంశ్రవసముని) పలికెనఁట !.

తాత్పర్యము: (ఓ తుమింజమునీ! నీ వాహ్వానించిన యిడా దేవత ప్రతిగ్రహీతలను నశింపఁ జేయునది యైనచో అది ముఖ్యమైన యిడ కాదు.) నీ వా యిడా దేవతయొక్క శరీరమునే ఆహ్వానించితివి అని ప్రశ్న. ("అస్యై" అనునది షష్ఠ్యర్థమున చతుర్థ్యంతము.)

7. అర్థము: గౌర్వై=గోవే, అస్యై=ఈ యిడయొక్క, శరీరమ్=శరీరము. (అతః=ఇందువలన,) గాం వా=గోవును గానే, అవతౌ=తెలిసికొనినవారై, తత్=అప్పుడు, పర్యవదతామ్=ఛినత్తీత్యాది ప్రశ్నోత్తరములచే నిందించిరి.

తాత్పర్యము: గోవే యిడయొక్క శరీరము. ఇడా శరీరమును గోవును గానే తెలిసికొనినవారై మునులిద్దఱు ఛినత్తీత్యాది ప్రశ్నోత్తరములచే అప్పుడు నిందించిరని శ్రుతి చెప్పుచున్నది.

8. అర్థము: యా=ఏ గోవు, యజ్ఞే=యజ్ఞమునందు, దీయతే=(దక్షిణగా) ఈయఁబడుచున్నదో, సా=ఆ యావు, దేవాన్=దేవతలను, ప్రాణేన=ప్రాణవాయువుచే, దాధార=ధరించెను. యయా=ఏ గోవుచే, మనుష్యాః=మనుష్యులు, జీవన్తి=జీవించుచున్నారో, సా=ఆ గోవు, మనుష్యాన్=మనుష్యులను, వ్యానేన=వ్యానవాయువుచే, దాధార=ధరించెను. పితృభ్యః=పితృదేవతల కొఱకు, యామ్=ఏ గోవును, ఘ్నన్తి=హింసించుచున్నారో, సా=ఆ గోవు, అపానేన=అపానవాయువుచేత, పితౄన్=పితృ దేవతలను, దాధార=ధరించెను. యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ విధముగా, వేద=తెలిసికొనుచున్నాఁడో, (సః=అతఁడు,) పశుమాన్=పశుమంతుఁడు, భవతి=అగుచున్నాఁడు.

తాత్పర్యము: (ఇడ ప్రాణాది వృత్తులచే దేవాదులను ధరించిన విధము ఈ మంత్రమున వివరింపఁబడుచున్నది.) యజ్ఞమునందు దక్షిణగా ఈయఁబడిన గోవు దేవతలను ప్రాణవాయువుచే ధరించెను. (అనఁగా దేవతలు గోవునుండి ఏ ఫలమును ఆశింపకయే తృప్తిపడుచున్నారు. కావున ప్రాణాది వృత్తులలో ఉత్తమమైన ప్రాణ వాయువుచే ధరించుచున్నదని భావము.) మనుష్యులు గోవునుండి క్షీరమును గ్రహించి ఆ క్షీరముచేత జీవించుచున్నారు. కావున ఇడాదేవి ప్రాణాపాన వృత్తులకు మధ్యవర్తియైన వ్యానవృత్తిచే మనుష్యులను ధరించెను. (అనఁగా మనుష్యులు గోవునుండి పాలు తీసికొనుటచే అది క్షీరహీన యగుచున్నది. దానిచే గోవునకు హాని చేయసట్లు కాదు. గోశరీరమును హింసించుట లేదు. గోవునకు హానియు కాదు. కావున ఉత్తమాధమ వృత్తులగు ప్రాణాపానముల మధ్యవర్తియగు వ్యానవాయువుచే ఇడ మనుష్యులను ధరించుచున్నదని భావము.) అష్టకా శ్రాద్ధమునందు పితృదేవతలకై గోవును వధించుట కలదు, కావున గోవునకు హాని కలుగుచున్నది. అందువలన అధమ వృత్తియగు అపానవాయువుచే పితృదేవతలను ధరించుచున్నదని స్పష్టార్థము. ఈ విధమును తెలిసికొనిన యజ్ఞకర్త పశుసమృద్ధి కలవాఁడగును.

9. అర్థము: అథవై=లేదా, యా=ఏ యిడ, ప్రభవన్తీః=ప్రభుత్వము కల, ప్రజాః ప్రతి=ప్రజలను గూర్చి, ఆభవతి=అభిముఖముగ నుంటున్నదో, తాం హ=ఆ యిడనే, ఉపాహ్వే=ఆహ్వానించుచున్నాను, ఇతి=అని, ఉవాచ=పలికెను.

తాత్పర్యము: (తుమింజముని తా నాహ్వానించిన యిడకు ముఖ్యత్వమును సంపాదించుటకు పక్షాంతరమును చెప్పుచున్నాఁడు.) ప్రభుత్వముతో కూడిన ప్రజల కభిముఖముగ నున్న యిడాదేవి నాహ్వానించుచున్నానని తుమింజుఁడు సమాధానము చెప్పెను.

10. అర్థము: అస్యై=ఈ యిడయొక్క, అన్నమ్=అన్నము, (యదస్తి=ఏది కలదో,) తద్వా=ఆ అన్నమునే. ఉపాహ్వథాః హ=ఆహ్వానించితివి కదా!, ఇతి=అని, ఉవాచ=పలికెను.

తాత్పర్యము: (తుమింజుఁ డాహ్వానించిన యిడయొక్క ప్రాధాన్యమును నివారించుచు సంశ్రవసుఁడు ఈ విధముగ చెప్పుచున్నాఁడు.) ఓ తుమింజమునీ! ఇడయొక్క అన్నమునే ఆహ్వానించితివి కాని ముఖ్యయైన యిడను కాదని సంశ్రవసుఁడు చెప్పెను.

11. అర్థము: ఓషధయః వా=ఓషధులే, అస్యాః=ఈ (గోరూపమైన,) యిడకు, అన్నమ్=అన్నము. ఓషధయః వై= ఓషధులే, ప్రభవన్తీః=ప్రభుత్వముతోకూడిన, ప్రజాః ప్రతి=ప్రజలను గూర్చి, అభవన్తి=అంతటను ఉంటున్నవి.

తాత్పర్యము: (ఓషధులు గోవులకు అన్నము, అను విషయము ప్రసిద్ధము.) ఓషధులే యిడకు అన్నము. ప్రభుత్వాధికారము గల ప్రజల గృహములందు బహుజన భోజనమునకై వ్రీహ్యాద్యోషధులు సమృద్ధముగ నుండునని భావము.

12. అర్థము: యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ పూర్వోక్తవిధముగ, వేద=తెలిసికొనుచున్నాఁడో, (సః=ఆ యజమానుఁడు,) అన్నాదః=అన్నభోక్త, భవతి=అగుచున్నాఁడు.

తాత్పర్యము: ఓషధులు గోరూపమైన యిడకు అన్నమనియు, వ్రీహ్యాద్యోషధులు ప్రభుత్వోపేతు లయిన ప్రజల గృహములలో బహుజన భోజనమునకై సమృద్ధముగ నుండుననియు తెలిసికొనిన యజమానుఁడు అన్నసమృద్ధికలవాఁ డగును.

13. అర్థము: అథవై=లేదా, యా=ఏ యిడ, పరాభవన్తీః=వ్యాధ్యాదులచే పరాభూతు లయిన, ప్రజాః=ప్రజలను, అనుగృహ్ణాతి=అనుగ్రహించుచున్నదో, ప్రత్యాభవన్తీః=పరాభూతులైన ప్రజలను, గృహ్ణాతి=(వారపేక్షించిన స్థానముల నిచ్చుటచే,) గ్రహించుచున్నదో, తాం హ=ఆ యిడనే, ఉపాహ్వే=ఆహ్వానించుచున్నాను, ఇతి=అని, ఉవాచ=(తుమింజుఁడు,) పలికెను, ఇతి=అని.

తాత్పర్యము: లేదా!, వ్యాధ్యాదులచే పీడితు లయిన ప్రజలను సుఖస్థితియందుంచి వా రపేక్షించిన స్థానములను వారికిచ్చుట రూపమున వారి ననుగ్రహించుచున్న యిడను నే నాహ్వానించుచున్నానని తుమింజుఁడు గుణాంతరోపేతయయిన యిడ నాహ్వానించుచున్నట్లు సమాధానము చెప్పెను.

14. అర్థము: తత్=అప్పుడు, అస్యై=ఈ యిడయొక్క, (షష్ఠ్యర్థే చతుర్థీ.) ప్రతిష్ఠాం వా=భూరూప ప్రతిష్ఠనే, ఉపాహ్వథాః=ఆహ్వానించితివి, ఇతి=అని, ఉవాచ హ=(సంశ్రవసుఁడు,) పలికెనఁట!

తాత్పర్యము: అయినచో నీవు ఇడయొక్క ప్రతిష్ఠాత్మక భూరూపమునే ఆహ్వానించితివి కాని ముఖ్యేడను కాదని సంశ్రవసుఁడు పలికెను. (=తుమింజుఁ డాహ్వానించినట్లు చెప్పిన యిడ ముఖ్యేడ కాదని సంశ్రవసుఁడు నిరాకరించెను.)

15. అర్థము: ఇయం వై=ఈ భూమియే, అస్యై=ఈ యిడయొక్క, ప్రతిష్ఠా=ప్రతిష్ఠ. (ప్రతి తిష్ఠత్యస్యా మిడా గోరూపిణేతి ప్రతిష్ఠా. భూమియందు ఇడ గోరూపమున నున్నది కావున ప్రతిష్ఠ యనఁగా భూమి యని వ్యుత్పత్త్యర్థము.) ఇయం వై=ఈ భూరూపమైన యిడయే, పరాభవన్తీః=వ్యాధ్యాదులచే పరాభూతులైన ప్రజలను, అను గృహ్ణాతి=స్వస్థత నిచ్చుటచే అనుగ్రహించుచున్నది. పరాభవన్తీః=పరాభూతులయిన ప్రజలను, గృహ్ణాతి=(వారు వారు కోరిన స్థానముల నిచ్చుటచే,) గ్రహించుచున్నది.

తాత్పర్యము: ఇడ భూమియందు గోరూపమున నుండుటచే ప్రతిష్ఠ యనఁబడుచున్నది. ఈ భూమియే ఇడయొక్క ప్రతిష్ఠారూపము. ఈ ప్రతిష్ఠా రూపమైన యిడయే వ్యాధ్యాదులచే పీడితు లయిన ప్రజలకు స్వస్థతను చేకూర్చి వారి ననుగ్రహించుచున్నది. మఱియు వారు వారు కోరిన స్థానములను వారికిచ్చి వారి ననుగ్రహించుచున్నదని వేదము చెప్పుచున్నది.

16. అర్థము: యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ విధముగ, వేద=తెలిసికొనుచున్నాఁడో, (సః=అతఁడు,) ప్రతి తిష్ఠత్యేవ=నిశ్చయముగ ప్రతిష్ఠావంతుఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: పూర్వోక్తవిధమును తెలిసికొనిన యజమానుఁడు నిశ్చయముగ ప్రతిష్ఠావంతుఁ డగుచున్నాఁడు.

17. అర్థము: అథవై=లేదా!, యస్యై=ఏ వృష్టిరూపమైన యిడయొక్క, నిక్రమణే(సతి)=అడ్డముగా పడుట కలుగుచుండఁగా, ఘృతమ్=స్రవించుచున్న నీటిని, ప్రజాః=ప్రజలు, సంజీవన్తీః=మంచి జీవనమును గోరుచున్నవారై, పిబన్తి=త్రాగుచున్నారో, తామ్=ఆ యిడను, ఉపాహ్వే=ఆహ్వానించుచున్నాను, ఇతి=అని, ఉవాచ హ=(తుమింజుఁడు) పలికెనఁట!.

తాత్పర్యము: వృష్టి రూపమైన యిడ పైనుండి అడ్డముగ పడుచుండఁగా ఆ స్రవించుచున్న యుదకమును ప్రజలు సుఖజీవనమును కోరువారై త్రాగుచున్నారు కదా! ఆ యిడను నే నాహ్వానించుచున్నానని తుమింజుఁడు మఱియొక రీతిగ సమాధానము చెప్పెను.

18. అర్థము: సా=ఆ వృష్టిరూపమైన యిడ, ఛినత్తి=(ప్రజలను) నశింపఁజేయుచున్నదా? న ఛినత్తి3!=నశింపఁజేయుట లేదా?, ఇతి=అని, (సంశ్రవాః=సంశ్రవసుఁడు, పప్రచ్ఛ=అడిగెను.)

తాత్పర్యము: ఓ తుమింజమునీ! నీ వాహ్వానించిన వృష్టిరూపమైన ఆ యిడ ప్రజలను నశింపఁజేయునా? లేదా? అని సంశ్రవసుఁడు మఱల ప్రశ్నించెను.

19. అర్థము: న ఛినత్తి=(వృష్టిరూపమైన యిడ ప్రజలను,) నశింపఁ జేయుట లేదు. తు=మఱేమనఁగా, ప్ర జనయతి హ=(సస్యాదికమును,) అధికముగ పుట్టించుచున్నది కదా!, ఇతి=అని, ఉవాచ=(తుమింజుఁడు,) పలికెను.

తాత్పర్యము: వృష్టిరూపమైన ఇడ ప్రతిగ్రాహ్య ద్రవ్యము కాదు కావున వృష్టిని గ్రహించిన ప్రజలకు ప్రతిగ్రాహ్యత్వ రూప దోషము కలుగదు. అందువలన వృష్టిరూపమైన యిడ జనులను నశింపఁ జేయకపోవుటయే గాక సస్యాదికమును పుట్టించుచున్నదని తుమింజుఁడు సమాధానము చెప్పెను.

20. అర్థము: ఏషః వై=ఈ వృష్టిరూపమైన యిడను చెప్పుచున్న నీవే, ఇడామ్=ముఖ్యమైన యిడను, ఉపాహ్వథాః=ఆహ్వానించితివి, ఇతి=అని, ఉవాచ హ=పలికెనఁట!.

తాత్పర్యము: ఓ తుమింజమునీ! వృష్టిరూపమైన యిడ నాహ్వానించితినని చెప్పిన నీవే ముఖ్యమైన యిడ నాహ్వానించితివని సంశ్రవసుఁడు తుమింజునితో పలికెనఁట!, (అని వేదము చెప్పుచున్నది.)

21. అర్థము: వృష్టిః వై=వృష్టియే, ఇడా=ఇడ. వృష్ట్యై=వృష్టియొక్క, నిక్రమణే (సతి) వై=అడ్డముగ పడుచుండుట కలుగుచుండఁగనే, ఘృతమ్=స్రవించుచున్న ఆ యుదకమును, ప్రజాః=ప్రజలు, సంజీవన్తీః=సుఖజీవనమును కోరుచున్నవారై, పిబన్తి=త్రాగుచున్నారు. యః=ఏ యజమానుఁడు, ఏవమ్=ఈ విధముగ, వేద=తెలిసికొనుచున్నాఁడో, (సః=అతఁడు,) ప్రజాయతే ఏవ=ప్రకృష్టముగనే పుట్టుచున్నాఁడు. అన్నాదః=అన్నభోక్త, భవతి=అగుచున్నాఁడు.

తాత్పర్యము: వృష్టియే యిడ. వృష్టి అడ్డముగ పైనుండి క్రిందకు పడుచుండఁగా, ప్రవహించుచున్న ఆ యుదకమును ప్రజలు సుఖజీవనమును కోరుచున్నవారై త్రాగుచున్నారు. ఈ విధమును తెలిసికొనిన యజమానుఁడు సంతాన సమృద్ధియు, అన్న సమృద్ధియు కలవాఁ డగుచున్నాఁడు. ఈ యనువాకమునందు ఇడ సర్వప్రాణుల కుపకారకములైన గవాన్న భూమి వృష్టుల రూపమున ప్రశంసింపఁ బడినది.

ద్వితీయానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే సప్తమప్రపాఠకే తృతీయోఽనువాకః

మూలముః [1]పరోక్షం వా అన్యే దేవా ఇజ్యన్తే ప్రత్యక్ష మన్యే యద్యజతే య ఏవ దేవాః పరోక్ష మిజ్యన్తే తానేవ తద్యజతి [2]య దన్వాహార్య మాహరత్యేతే వై దేవాః ప్రత్యక్షం యద్బ్రాహ్మణా స్తానేవ తేన ప్రీణా[3]త్యథో దక్షిణైవాస్యైషా ఽథో యజ్ఞస్యైవ ఛిద్ర మపిదధాతి [4]యద్వై యజ్ఞస్య క్రూరం యద్విలిష్టం తదన్వాహార్యేణ (౧)అన్వాహరతి తదన్వాహార్య స్యాన్వాహార్యత్వం [5]దేవదూతా వా ఏతే యదృత్విజో యదన్వాహార్య మా హరతి దేవదూతా నేవ ప్రీణాతి [6]ప్రజాపతి ర్దేవేభ్యో యజ్ఞా న్వ్యాదిశ త్స రిరిచానో ఽమన్యత స ఏత మన్వాహార్య మభ క్త మపశ్య త్త మాత్మ న్నధత్త స వా ఏష ప్రాజాపత్యో య దన్వాహార్యో యస్యైవం విదుషో ఽన్వాహార్య ఆహ్రియతే సాక్షాదేవ ప్రజాపతి మృధ్నో [7]త్యపరిమితో నిరుప్యో ఽపరిమితః ప్రజాపతిః ప్రజాపతేః (౨)ఆప్త్యై [8]దేవా వై యద్యజ్ఞే ఽకుర్వత తదసురా అకుర్వత తే దేవా ఏతం ప్రాజాపత్య మన్వాహార్య మపశ్య న్త మన్వాహ రన్త తతో దేవా అభవ న్పరా ఽసురా యస్యైవం విదుషో ఽన్వాహార్య ఆహ్రియతే భవ త్యాత్మనా పరా ఽస్య భ్రాతృవ్యో భవతి [9]యజ్ఞేన వా ఇష్టీ పక్వేన పూర్తీ యస్యైవం విదుషో ఽన్వాహార్య ఆహ్రియతే స త్వేవేష్టాపూర్తీ [10]ప్రజాపతే ర్భాగో ఽసి (౩)ఇత్యాహ ప్రజాపతిమేవ భాగధేయేన సమర్ధయ[11]త్యూర్జస్వా న్పయస్వా నిత్యాహోర్జ మేవాస్మి న్పయో దధాతి [12]ప్రాణాపానౌ మే పాహి సమానవ్యానౌ మే పాహీత్యాహా ఽఽశిష మేవైతా

మాశాస్తే [13]ఽక్షితో ఽన్యక్షిత్యై త్వా మామేక్షేష్ఠా అముత్రాముష్మి ల్లోక ఇత్యాహ క్షీయతే వా

అముష్మిల్లోకే ఽన్న మితః ప్రదానగ్ం హ్యముష్మి ల్లోకే ప్రజా ఉపజీవన్తి యదేవ మభిమృశ

త్యక్షితి మేవైన ద్గమయతి నా స్యాముష్మి ల్లోకే ఽన్నం క్షీయతే ॥౪॥

(అన్వాహార్యేణ ప్రజాపతే రసి హ్యముష్మిం ల్లోకే పఞ్చదశ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే సప్తమప్రపాఠకే తృతీయోఽనువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: ద్వితీయానువాకమునందు ఇడాప్రశంస చేయఁబడినది. తృతీయానువాకమున అన్వాహార్యము విధింపఁబడుచున్నది. ఆ అన్వాహార్యదానమును విధించుటకు ముందు తత్ప్రశంస చేయఁబడుచున్నది.

1. అర్థము: అన్యే దేవాః=ఇతరులైన యింద్రాది దేవతలు, పరోక్షం వా=పరోక్షముగానే, (కంటికి కనఁబడకయే,) ఇజ్యన్తే=యాగము చేయఁబడుచున్నారు. (=యాగములో ఉద్దేశింపఁ బడుచున్నారు.) అన్యే దేవాః=ఇతర దేవతలు, (=ఋత్విజాదులు,) ప్రత్యక్షమ్=ప్రత్యక్షముగ (కన్నులయెదుట) ఇజ్యన్తే=యాగము చేయఁబడుచున్నారు. యత్ యజతే=యాగము చేయుచో, యే దేవాః=ఏ యింద్రాది దేవతలే, పరోక్షమ్=పరోక్షముగ, ఇజ్యన్తే=యాగము చేయఁబడుచున్నారో, తానేవ=ఆ పరోక్ష దేవతల నుద్దేశించియే, తత్=అప్పుడు, యజతి=(యజ్ఞకర్త) యాగము చేసినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: యాగమునందు ఇంద్రాది దేవతలు కంటికి కనఁబడరు కావున వారు పరోక్షముగ యాగమునం దుద్దేశింపఁబడినవారు. ఋత్విజాదులు ప్రత్యక్షముగ యాగమునం దుద్దేశింపఁబడినవా రగుచున్నారు. యాగము చేయుచో పరోక్ష దేవతల నుద్దేశించి యాగము చేసిన యజమానుఁడే నిజముగ యాగము చేసినవాఁ డగుచున్నాఁడు.

2. అర్థము: అన్వాహార్యమ్=పక్వమైన అన్నమును, యత్ ఆహరతి=ఋత్విజుల కిచ్చుచున్నచో, ఏతే దేవా వై=ఈ యింద్రాది దేవతలే, ప్రత్యక్షమ్=ప్రత్యక్షముగ, వర్తన్తే=ఉంటున్నారు. తానేవ=ఆ ఋత్విజులనే, తేన=ఆ యన్వాహార్య దానముచేత, (యజమానః=యజ్ఞకర్త,) ప్రీణాతి=సంతోషపెట్టినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: అన్వాహార్య మనఁగా క్షీరముచే పక్వమైన అన్నము. యజ్ఞకర్త యజ్ఞ సమయమున ఋత్విజుల కన్న దానము చేయవలెను. అట్లు చేసినచో ఇంద్రాది దేవతలే ప్రత్యక్ష మగుదురు. ఆ అన్వాహార్య దానము చేతనే యజమానుఁడు ఋత్విజులను సంతోషపఱచినవాఁ డగుచున్నాఁడు.

3. అర్థము: అథో=మఱియు, అస్య=ఈ యజ్ఞమునకు, ఏషా=ఈ అన్వాహార్యము, దక్షిణైవ=దక్షిణయే. అథో=మఱియు, యజ్ఞస్య=యజ్ఞముయొక్క, ఛిద్రమ్ అ=లోపమునే, పిదధాతి=మఱుఁగు పఱచుచున్నది.

తాత్పర్యము: మఱియు ఈ యన్వాహార్య దానము యజ్ఞమునకు దక్షిణ కూడ. ఇది యజ్ఞముయొక్క లోపమును మఱుఁగు పఱచును (=పోఁగొట్టును).

4\. అర్థము: యజ్ఞస్య=యజ్ఞమునకు, యత్ వై=ఏ దయితే, క్రూరమ్=అధికమైనదో, యత్=ఏది, విలిష్టమ్=న్యూనమైనదో, తత్=ఆ న్యూనాతిరిక్తమైన యుభయము, అన్వాహార్యేణ=అన్వాహార్య (దాన) ముచేత, అన్వాహరతి=సరిచేయఁబడిన దగుచున్నది. తత్=ఆ కారణమువలన, అన్వాహార్యస్య=అన్వాహార్య శబ్దమునకు, అన్వాహార్యత్వమ్=(=అన్వాహార్యతే=అనుకూల్యేన సమాధీయతే ఇతి అన్వాహార్యమ్) అనుకూలముగా సరిచేయఁబడు చున్నదను అర్థము, (సిధ్యతి=ఏర్పడుచున్నది.)

తాత్పర్యము: యజ్ఞము ననుష్ఠించుటలో ఏర్పడిన న్యూనాతిరిక్తరూప దోషము కూడ ఈ యన్వాహార్య దానముచే పరిహరింపఁ బడుచున్నది. అనుకూలముగా పరిచేయఁ బడుచున్న దను నర్థ మన్వాహార్యశబ్దమున కేర్పడుచున్నది.

5\. అర్థము: ఋత్విజః యత్=ఋత్విజులు ఎవరు కలరో, ఏతే=వీరు, దేవదూతా వా=దేవదూతలే. అన్వాహార్యమ్=అన్వాహార్యము, ఆహరతి యత్=దానము చేయుచో, దేవదూతానేవ=దేవదూతలనే, (యజమానః=యజమానుఁడు) ప్రీణాతి=తృప్తి పఱచుచున్నవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: ఋత్విజులు దేవదూతలే. ఆ ఋత్విజుల కన్వాహార్యము దానము చేసిన యజమానుఁడు దేవదూతలనే తృప్తి పఱచినవాఁ డగుచున్నాఁడు.

6\. అర్థము: ప్రజాపతిః=ప్రజాపతి, దేవేభ్యః=దేవతలకొఱకు, యజ్ఞాన్=ఆగ్నేయాగ్నిషోమీయ పురోడాశ యాగములను, వ్యాదిశత్=విభజించి యిచ్చెను. సః=ఆ ప్రజాపతి, (తదా=అప్పుడు,) రిరిచానః=తనను యాగశూన్యునిగా, అమన్యత=తలఁచెను. సః=ఆ ప్రజాపతి, (తదా=అప్పుడు,) అన్వాహార్యమ్=అన్వాహార్యమును, అభక్తమ్=దేవతలకు విభజించి సమర్పింపఁ బడనదిగా, అపశ్యత్=చూచెను. (=తెలిసికొనెను.) తమ్=ఆ అన్వాహార్యమును, ఆత్మన్=తనయందు, అధత్త=ధరించెను. (=ఉంచుకొనెను. తత్=అందువలన,) అన్వాహార్యః యత్=అన్వాహార్య మేది కలదో, సః ఏషః వా=ఆ యీ అన్వాహార్యమే, ప్రాజాపత్యః=ప్రజాపతి దేవతాక మైనది. ఏవం విదుషః=ఈ విధముగ తెలిసికొనిన, యస్య=ఏ యజమానునియొక్క, అన్వాహార్యః=అన్వాహార్యము, ఆ హ్రియతే=(ఋత్విజులకు) ఈయఁబడుచున్నదో, (సః=ఆ యజమానుఁడు,) సాక్షాత్=ప్రత్యక్షముగ, ప్రజాపతిమేవ=ప్రజాపతినే, ఋధ్నోతి=తృప్తి పఱచినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: పూర్వము ప్రజాపతి అగ్న్యాది దేవతలకు ఆగ్నేయాగ్నిషోమీయ పురోడాశ యాగములను విభజించి యిచ్చెను. అతఁ డప్పుడు తనకు యాగము లేదని ఆలోచించి దేవతల కన్వాహార్యము నీయలేదని తెలిసికొని అన్వాహార్యమును తనకై ఉంచుకొనెను. కావున అన్వాహార్యము ప్రజాపతి దేవతాకమైనది. ఈ విధమును తెలిసికొని అన్వాహార్యమును ఋత్విజులకు దానము చేసిన యజమానుఁడు సాక్షాత్తు ప్రజాపతినే సంతృప్తి పఱచినవాఁ డగును.

7\. అర్థము: ప్రజాపతిః=ప్రజాపతి, అపరిమితః=పరిమితి లేనివాఁడు. (అన్వాహార్యః=అన్వాహార్యము,) ప్రజాపతేః=ప్రజాపతియొక్క, ఆప్త్యై=తృప్తికొఱకు, (భవతి=అగుచున్నది.)

తాత్పర్యము: ప్రజాపతి సర్వదేవతా స్వామి యగుటచేతను సర్వయజ్ఞములందు బహుళవ్యాప్తి కలవాఁ డగుటచేతను అపరిమితుఁడు. దానము చేయఁబడిన అన్వాహార్యము ప్రజాపతియొక్క తృప్తికొఱ కగుచున్నది.

8\. అర్థము: దేవాః=దేవతలు, యజ్ఞే=యజ్ఞమునందు, యత్=దేనిని, అకుర్వత=చేసిరో, అసురాః=రాక్షసులు, తత్=దానిని, అకుర్వత వై=చేసిరఁట!, (తదా=అప్పుడు, దేవాః=దేవతలు,) అన్వాహార్యమ్=అన్వాహార్యమును, ప్రాజాపత్యమ్=ప్రజాపతి దేవతాకముగ, అపశ్యన్=చూచిరి. (=తెలిసికొనిరి.) తత్=ఆ యన్వాహార్యమును, అన్వాహరన్త=వెంటనే స్వీకరించిరి. తతః=అందువలన, దేవాః=దేవతలు, (విజయినః) అభవన్=విజయులైరి. అసురాః=రాక్షసులు, పరాభవన్=పరాజితులైరి. ఏవం విదుషః=ఈ విధముగ తెలిసికొనిన, యస్య=ఏ యజ్ఞకర్తయొక్క, అన్వాహార్యః=అన్వాహార్యము, ఆ హ్రియతే=(ఋత్విజులకు) ఈయఁబడుచున్నదో, (సః=ఆ యజమానుఁడు,) ఆత్మనా భవతి=ధైర్యము (పరమాత్మ) తో కూడినవాఁ డగుచున్నాఁడు. అస్య=ఈ యజమానునియొక్క, భ్రాతృవ్యః=శత్రువు, పరాభవతి=తిరస్కృతుఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: పూర్వము దేవతలు యజ్ఞము నమష్ఠించిన విధముగనే అసురులు కూడ యజ్ఞము నమష్ఠించిరి. అప్పుడు దేవతలు ప్రజాపతి దేవతాకమైన అన్వాహార్యమును కనుఁగొని ఆ యన్వాహార్యమును సంపాదించిరి. తత్కారణముగ వారు విజయులైరి. అన్వాహార్యమును కనుఁగొనకుండుటచే అసురులు పరాభూతులైరి. ఈ విధమును దెలిసికొనిన యజమానుని అన్వాహార్యదానము తనకు ధైర్యసంపాదకమును, శత్రువినాశకము నగుచున్నది. (ఇచట అన్వాహార్యము స్వవిజయ హేతువుగను శత్రు పరాజయ హేతువుగను ప్రశంసింపఁబడినది.)

9. అర్థము: (యజమానః=యజ్ఞకర్త,) యజ్ఞేన=యజ్ఞముచేత, ఇష్టీ=ఆగ్నేయాది శ్రౌతకర్మలు కలవాఁడు, (భవతి=అగుచున్నాఁడు.) పక్వేన=అన్వాహార్యముచేత, పూర్తీ=వాపీకూపాది నిర్మాణరూప స్మార్తకర్మలు కలవాఁడు, (భవతి=అగుచున్నాఁడు.) ఏవమ్=ఈ విధముగ, విదుషః=తెలిసికొనిన, యస్య=ఏ యజమానునియొక్క, అన్వాహార్యః=అన్వాహార్యము, ఆ హ్రియతే=(ఋత్విజులకు) ఈయఁబడుచున్నదో, స ఏవ తు=ఆ యజమానుఁడే, ఇష్టాపూర్తీ=శ్రౌత స్మార్త కర్మలు చేసినవాఁడు.

తాత్పర్యము: యజ్ఞకర్త యజ్ఞముచేత ఆగ్నేయాది శ్రౌతకర్మలు కలవాఁడును, అన్వాహార్యముచేత వాపీకూపాది నిర్మాణరూప స్మార్తకర్మలు కలవాఁడు నగుచున్నాఁడు. ఈ విధమును తెలిసికొని యజ్ఞకర్త ఋత్విజులకు అన్వాహార్యము దానము చేసినచో ఇష్టాపూర్త కర్మలు చేసినవాఁ డగును. (అన్వాహార్య దానము ఇష్టాపూర్త కర్మకారిగ ఈ మంత్రమున ప్రశంసింపఁబడినది.)

10. అర్థము: (హే అన్వాహార్య!=ఓ అన్వాహార్యమా!, త్వమ్=నీవు,) ప్రజాపతేః=ప్రజాపతియొక్క, భాగః=భాగము, అసి=అగుచున్నావు, ఇతి=అని, ఆహ=(అన్వాహార్యాభిమంత్రణ మంత్రము,) చెప్పెను. (అతః=ఇందువలన, యజమానః=యజమానుఁడు,) ప్రజాపతిమేవ=ప్రజాపతినే, భాగధేయేన=అన్వాహార్య భాగముచేత, సమర్ధయతి=సమర్థించిన (సంతృప్తి పఱచిన) వాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: అన్వాహార్యము ప్రజాపతిభాగమని చెప్పుటచేత యజమానుఁడు అన్వాహార్య దానముచే ప్రజాపతినే సంతృప్తి పఱచినవాఁ డగుచున్నాఁడు. (ఇది అన్వాహార్యాభిమంత్రణ మంత్ర ప్రథమ భాగమునకు వ్యాఖ్యానము.)

11. అర్థము: (అన్వాహార్యః=అన్వాహార్యము,) ఊర్జస్వాన్=బలము కలది, పయస్వాన్=పయస్సు కలది, ఇతి=అని, ఆహ=(అన్వాహార్యాభిమంత్రణ మంత్రము,) చెప్పినది. (అతః=ఇందువలన,) అస్మిన్=ఈ అన్వాహార్య దానము చేసిన యజమానునియందు, (అన్వాహార్యః) ఏవ=అన్వాహార్యమే, ఊర్జమ్=బలమును, పయః=పయస్సును, దధాతి=ఉంచుచున్నది. (అన్వాహార్యము పాలతో ఉడుకుటచే పయస్వత్తుగా చెప్పఁబడినది.)

తాత్పర్యము: అన్వాహార్యాభిమంత్రణ మంత్రమునందు అన్వాహార్యము ఊర్జస్సు, పయస్సు కలదని చెప్పుటచే అట్టి యన్వాహార్యమును ఋత్విజులకు దానము చేసిన యజమానునకు క్షీరము, బలము కలుగును.

12. అర్థము: (హే అన్వాహార్య!=ఓ అన్వాహార్యమా! త్వమ్=నీవు,) మే=నాయొక్క, ప్రాణాపానౌ=ప్రాణాపాన వాయువులను, పాహి=రక్షింపుము. మే=నాయొక్క, సమానవ్యానౌ=సమానవ్యాన వాయువులను, పాహి=రక్షింపుము, ఇతి=అని, ఆహ=(అన్వాహార్యాభిమంత్రణ మంత్ర తృతీయభాగము,) చెప్పెను. (అతః=ఇందువలన,) యజమానః=యజ్ఞకర్త, ఏతా మాశిషమేవ=ఈ ప్రాణా పాన సమాన వ్యాన వాయువుల రక్షణ రూపమైన ఆశీస్సునే, ఆశాస్తే=కోరుచున్నాఁడు. (ఈ బ్రాహ్మణవాక్యము అన్వాహార్యాభిమంత్రణ మంత్ర తృతీయ భాగమునకు వ్యాఖ్యానరూపము.)

తాత్పర్యము: యజ్ఞకర్త తన ప్రాణాపానాది వాయువులను రక్షింపుమని అన్వాహార్యమును కోరుటచే అన్వాహార్య దానము వలన అతనికి ప్రాణాపానాదుల రక్షణరూపమైన యాశీస్సు లభించుచున్నది.

13. అర్థము: (హే అన్వాహార్య!=ఓ అన్వాహార్యమా!, త్వమ్=నీవు,) అక్షితః=క్షీణించని దానవు, అసి=అగుచున్నావు. (తతః=అందువలన, పరలోకేఽపి=పరలోకమునందుఁగూడ,) అక్షిత్యై=నాశము లేకుండుటకై, త్వా=నిన్ను, (దదామి=దానము చేయుచున్నాను. తదభిప్రాయేణ తవ దీయమానత్వాత్=ఆ యభిప్రాయముతో నిన్ను దానము చేయుటచే,) అముత్ర=పరలోకమునందు, మే=నాయొక్క, (భోగాయ=భోగము కొఱకు,) మా క్షేష్ఠాః=క్షయమును పొందవలదు. (తత్=అందువలన, అహమపి=నేను కూడ,) అముష్మిన్ లోకే=పరలోకమునందు, (త్వామ్=నిన్ను, యథేచ్ఛమ్=స్వేచ్ఛగా, అనుభవిష్యామి=అనుభవించఁగలను,) ఇతి=అని, ఆహ=(అన్వాహార్యాభిమంత్రణ మంత్ర చతుర్థ భాగము) చెప్పెను. అముష్మిన్ లోకే=స్వర్గలోకమునందు, అన్నమ్=భూలోకానుష్ఠిత కర్మచే సంపాదితమైన అన్నము, క్షీయతే వా=క్షీణించుచున్నది కదా!, అముష్మిన్ లోకే=స్వర్గలోకమునందలి, ప్రజాః=ప్రజలు, ఇతః ప్రదానమ్=ఈ లోకమునం దనుష్ఠితమైన కర్మయం దీయఁబడిన అన్నమును, ఉప జీవన్తి=అధారముగఁ జేసికొని జీవించుచున్నారు. ఏవమ్=అన్వాహార్యాభిమంత్రణ మంత్రమునందు చెప్పఁబడిన విధముగ, అభిమృశతి యత్=(అక్షితో ఽసీత్యాది మంత్రముచే అన్వాహార్యమును,) అభిమంత్రించినచో, ఏనత్=ఈ యభిమంత్రణము, అక్షితిమేవ=(స్వర్గలోక ప్రజల యన్నమునకు) నాశాభావమునే, గమయతి=పొందించుచున్నది.

తాత్పర్యము: "ఓ అన్వాహార్యమా! నీవు క్షయము లేనిదానవు. కావున పరలోకమునందు కూడ నాశము లేకుండుటకై నిన్ను (ఋత్విజులకు) దానము చేయుచున్నాను. అందువలన పరలోకమునందు నాయొక్క భోగమునకై క్షీణింపవలదు. కనుక నేనుఁ గూడ పరలోకమునందు నిన్ను యథేచ్ఛగా అనుభవింతును" అని అన్వాహార్యాభిమంత్రణ మంత్రమున చెప్పఁబడినది. స్వర్గలోకమునందలి ప్రజలు భూలోకమున అనుష్ఠింపఁబడిన కర్మలయం దీయఁబడిన అన్నము నాధారముగఁ జేసికొనియే జీవించుచున్నారు. భూలోకమునందు కర్మలయం దీయఁబడిన అన్నము స్వర్గలోకమునందలి ప్రజలు అనుభవించగానే క్షీణించు నను విషయము ప్రసిద్ధము. "క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి" అను స్మృతివచన మీ యర్థమునే చెప్పుచున్నది. "అక్షితో ఽసీ" త్యాది మంత్రముచే యజ్ఞమునం దన్వాహార్యము నభిమంత్రించి దానము చేసినచో ఆ యన్నము స్వర్గలోకమునందు నశించదు. (ఈ బ్రాహ్మణము "అక్షితో ఽసీ" త్యాది మంత్రమునకు వ్యాఖ్యాన రూపము.)

తృతీయానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే సప్తమప్రపాఠకే చతుర్థోఽనువాకః।

మూలము: [1]బర్హిషో ఽహం దేవయజ్యయా ప్రజావా న్భూయాస మిత్యాహ బర్హిషా వై ప్రజాపతిః ప్రజా అసృజత తేనైవ ప్రజా స్సృజతే నరాశగ్ంసస్యాహం దేవయజ్యయా పశుమా న్భూయాస మిత్యాహ నరాశగ్ంసేన వై ప్రజాపతిః పశూ నసృజత తేనైవ పశూ న్త్సృజతే ఽగ్నే స్స్విష్టకృతో ఽహం దేవయజ్యయా ఽఽయుష్మాన్ యజ్ఞేన ప్రతిష్ఠాం గమేయ మిత్యాహ ఽఽయు రేవా ఽఽత్మ న్ధత్తే ప్రతి యజ్ఞేన తిష్ఠతి [2]దర్శపూర్ణమాసయోః (౧)వై దేవా ఉజ్జితి మనూదజయ న్దర్శపూర్ణమాసాభ్యా మసురా నపానుదన్తాగ్నే రహ ముజ్జితి మనూజ్జేష మిత్యాహ దర్శపూర్ణమాసయో రేవ దేవతానాం యజమాన ఉజ్జితి మనూజ్జయతి దర్శపూర్ణమాసాభ్యాం భ్రాతృవ్యా నప నుదతే [3]వాజవతీభ్యాం వ్యూహత్యన్నం వై వాజో ఽన్న మేవావ రున్ధే [4]ద్వాభ్యాం ప్రతిష్ఠిత్యై [5]యో వై యజ్ఞస్య ద్వౌ దోహౌ విద్వాన్యజత ఉభయతః (౨)ఏవ యజ్ఞం దుహే పురస్తా చ్చోపరిష్టా చ్చైష వా అన్యో యజ్ఞస్య దోహ ఇడాయా మన్యో [6]యర్హి హోతా యజమానస్య నామ గృహ్ణీయా త్తర్హి బ్రూయాదేమా అగ్మ న్నాశిషో దోహ కామా ఇతి సగ్ంస్తుతా ఏవ దేవతా దుహే ఽథో ఉభయత ఏవ యజ్ఞం దుహే పురస్తా చ్చోప రిష్టాచ్చ [7]రోహితేన త్వా ఽగ్ని ర్దేవతాం గమయత్విత్యాహైతే వై దేవాశ్వాః (౩)యజ మానః ప్రస్తరో యదేతైః ప్రస్తరం ప్రహరతి దేవాశ్వై రేవ యజమానగ్ం సువర్గం లోకం గమయతి [8]వి తే ముఞ్చామి రశనా వి రశ్మీ నిత్యాహైష వా అగ్నే ర్విమోక స్తేనై వైనం

వి ముఞ్చతి [9]విష్ణో శ్శంయో రహం దేవయజ్యయా యజ్ఞేన ప్రతిష్ఠాం గమేయ మిత్యాహ
యజ్ఞో వై విష్ణు ర్యజ్ఞ ఏవా న్తతః ప్రతితిష్ఠతి [10]సోమస్యాహం దేవయజ్యయా సురేతాః (౪)
రేతో ధిషీయేత్యాహ సోమో వై రేతోధా స్తేనైవ రేత ఆత్మ న్ధత్తే [11]త్వష్టు రహం దేవయ
జ్యయా పశూనాగ్ం రూపం పుషేయ మిత్యాహ త్వష్టా వై పశూనాం మిథునానాగ్ం రూపకృ
త్తేనైవ పశూనాగ్ం రూప మాత్మ న్ధత్తే దేవానాం పత్నీ రగ్ని ర్గృహపతి ర్యజ్ఞస్య మిథునం
తయో రహం దేవయజ్యయా మిథునేన ప్రభూయాస మిత్యాహైతస్మా ద్వై మిథునా త్ప్రజా
పతి ర్మిథునేన (౫) ప్రాజాయత తస్మాదేవ యజమానో మిథునేన ప్రజాయతే [12]వేదో ఽసి
విత్తి రసి విదేయేత్యాహ వేదేన వై దేవా అసురాణాం విత్తం వేద్య మవిన్దన్త తద్వేదస్య
వేదత్వం [13]యద్య ద్భ్రాతృవ్యస్యాభిధ్యాయే త్తస్య నామ గృహ్ణీయా త్తదేవాస్య సర్వం
వృఙ్క్తే [14]ఘృతవన్తం కులాయినగ్ం రాయస్పోషగ్ం సహస్రిణం వేదో దదాతు వాజిన మిత్యాహ
ప్ర సహస్రం పశూ నాప్నో[15]త్యాఽస్య ప్రజాయాం వాజీ జాయతే య ఏవం వేద ॥౬॥
(దర్శపూర్ణమాసయో రుభయతో దేవాశ్వాః ధురేతాః ప్రజాపతి ర్మిథునేనా ఽఽప్నోత్వష్టా చ) ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమకాణ్డే సప్తమప్రపాఠకే చతుర్థో ఽనువాకః ॥౪॥

వేదార్థదీపిక

అవతారిక: తృతీయానువాకమునందు అన్వాహార్య మభిహిత మైనది. ఈ చతుర్థానువాకమునందు శేషాహార్యనుమంత్రణ మంత్రములు వ్యాఖ్యానింపఁబడుచున్నవి. ప్రథమమున అనూయాజానుమంత్రణ మంత్రములు వ్యాఖ్యానింపఁబడుచున్నవి.

1. అర్థము: బర్హిషః=బర్హిర్నామకాగ్ని సంబంధమైన, దేవయజ్యయా=సమంత్రకాజ్యాహుతిచేత, అహమ్=నేను, ప్రజావాన్=సంతానవంతుఁడను, భూయాసమ్=అగుదును గాక, ఇతి=అని, ఆహ="బర్హిషోఽహ" మిత్యాది మంత్రము చెప్పెను. బర్హిషా వై=బర్హిర్యాగానుమంత్రణముచేతనే, ప్రజాపతిః=ప్రజాపతి, ప్రజాః=ప్రజలను, అసృజత=సృజించెను. తేనైవ=ఆ బర్హిర్యాగానుమంత్రణముచేతనే, ప్రజాః=ప్రజలను, (ఇదానీమపి=ఇప్పుడు కూడ,) సృజతే=సృజించుచున్నాఁడు. నరాశంసస్య=నరాశంసనామకాగ్ని సంబంధమైన, దేవయజ్యయా=సమంత్రకాజ్యాహుతిచేత, అహమ్=నేను, పశుమాన్=పశుమంతుఁడను, భూయాసమ్=అగుదును గాక, ఇతి=అని, ఆహ="నరాశగ్ంసస్యాహ" మిత్యాది మంత్రము చెప్పెను. నరాశంసేన వై=నరాశంసనామకాగ్నిదేవతాక యాగానుమంత్రణముచేతనే, ప్రజాపతిః=ప్రజాపతి, పశూన్=పశువులను, అసృజత=సృజించెను. (ఇదానీమపి=ఇప్పుడు కూడ,) తేనైవ=ఆ నరాశంసనామకాగ్నిదేవతాక యాగానుమంత్రణముచేతనే, పశూన్=పశువులను, సృజతే=సృజించుచున్నాఁడు. స్విష్ట కృతః=స్విష్టకృన్నామకుఁడైన, అగ్నేః=అగ్నిసంబంధమైన, దేవయజ్యయా=సమంత్రకాజ్యాహుతిచేత, అహమ్=నేను, ఆయుష్మాన్=ఆయుష్మంతుఁడను, భూయాసమ్=అగుదును గాక. యజ్ఞేన=సగుణమైన సంపూర్ణ యజ్ఞము చేత, ప్రతిష్ఠామ్=ఫలప్రాప్తి లక్షణ ప్రతిష్ఠను, గమేయమ్=పొందెదను, ఇతి=అని, ఆహ=("అగ్నే స్స్విష్ట కృతో ఽహ" మిత్యాది మంత్రము) చెప్పెను. (ఏవమ్=ఈ విధముగ, ప్రార్థయమానః=ప్రార్థించుచున్న, యజమానః=యజమానుఁడు) ఆత్మన్=తనయందు, ఆయుః=ఆయువును, ధత్తే ఏవ=నిశ్చయముగ ధరించుచున్నాఁడు. యజ్ఞేన=సగుణమయిన సంపూర్ణ యజ్ఞముచేత, ప్రతి తిష్ఠతి=ప్రతిష్ఠావంతుఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: బర్హి ర్నరాశంస స్విష్టకృ చ్ఛబ్దములు అనూయాజ దేవతలగు అగ్నులకు వాచకములు. అనూయాజ దేవతలగు బర్హి ర్నరాశంస స్విష్టకృ దగ్నులకు సమంత్రకాజ్యాహుతుల నిచ్చుటచే యజమానుఁడు తాను ప్రజావంతుఁడు, పశుమంతుఁడు, ఆయుష్మంతుఁడు, సంపూర్ణ యజ్ఞముచేత ప్రతిష్ఠావంతుఁడును కావలెనని ఆ యా అగ్నిదేవతలను ప్రార్థించినట్లు "బర్హిషో ఽహ" మిత్యాది మంత్రములందు (షష్ఠ ప్రపాఠకమునందలి చతుర్థానువాకమునందు) చెప్పఁబడెను. ప్రజాపతి కూడ బర్హిరాద్యగ్ని దేవతాకములయిన తత్తద్యాగానుమంత్రణములచేతనే ప్రజాదులను సృష్టించెనని, యిప్పుడును తత్తదనుమంత్రణముచేతనే సృష్టించుచున్నాఁడనియు ఈ బ్రాహ్మణ భాగము సోదాహరణముగ యజమానుని ప్రార్థనను సమర్థించుచున్నది.

2. అర్థము: దేవాః=దేవతలు, దర్శపూర్ణమాసయోః=దర్శపూర్ణమాస యాగములయొక్క, ఉజ్జితిమను=ఉత్కర్షను (సంపూర్ణతా రూపమైనది,) అనుసరించి, అనూదజయన్=గొప్పగా జయించిరి. దర్శపూర్ణమాసాభ్యామ్=దర్శపూర్ణమాస యాగములచేత, అసురాన్=రాక్షసులను, అపానుదన్త=పోఁగొట్టిరి. (=నిరాకరించిరి.) యజమానః=యజమానుఁడు, దేవతానామ్=దేవతల సంబంధమైన, దర్శపూర్ణమాసయోః=దర్శపూర్ణమాస యాగములయొక్క, ఉజ్జితి మను=సంపూర్ణతా రూపమైన ఉత్కర్ష ననుసరించి, ఉజ్జయతి ఏవ=నిశ్చయముగ ఉత్కర్షరూప జయమును పొందుచున్నాఁడు. దర్శపూర్ణమాసాభ్యామ్=దర్శపూర్ణమాస యాగములచేత, భ్రాతృవ్యాన్=శత్రువులను, అప నుదతి=పోఁగొట్టుచున్నాఁడు.

తాత్పర్యము: దేవతలు అనుష్ఠితములయిన దర్శపూర్ణమాస యాగముల సంపూర్ణతారూపమైన ఉత్కర్ష ననుసరించి గొప్పగా విజయమును పొందిరి. వారు దర్శపూర్ణమాస యాగములచేత రాక్షసులను నిరాకరించిరి. యజ్ఞకర్త కూడ దేవతల సంబంధమైన దర్శపూర్ణమాస యాగముల సంపూర్ణతా రూపమైన ఉత్కర్ష ననుసరించి విజయమును పొందును. దర్శపూర్ణమాస యాగములచేత నిశ్చయముగ శత్రువులను పోఁగొట్టును. అగ్నియొక్క ఉత్కర్ష ననుసరించి యజమానుఁడు తాను జయమును పొందుదునుగాక' యని ప్రార్థించిన యజమానుని ప్రార్థనను ఈ బ్రాహ్మణము పై విధముగ సమర్థించినది.

3. అర్థము: వాజవతీభ్యామ్=వాజశబ్ద ఘటితములయిన ఋక్కులచేత, వ్యూహతి=అధ్వర్యుఁడు చేయుచున్న వ్యూహనమును యజమానుఁడు అనుమంత్రణము చేయవలెను. అన్నం వై=అన్నమే, వాజః=వాజ శబ్దార్థము. సః=అనుమంత్రణము చేసిన ఆ యజమానుఁడు, అన్నమ్=అన్నమును, అవ రుద్ధే ఏవ=నిశ్చయముగ పొందుచున్నాఁడు. (వ్యూహనము='జుహువు', 'ఉపభృత్తు', అను రెండు స్రుచములను వ్యత్యాసముగ కదలించుట: ఇది షష్ఠ ప్రపాఠకమునందలి చతుర్థానువాక వ్యాఖ్యానమునందు వివరించఁబడినది.)

తాత్పర్యము: యజమానుఁడు వాజశబ్ద ఘటితములయిన ఋక్కులచేత అధ్వర్యుఁడు చేయుచున్న వ్యూహనమును అనుమంత్రణము చేయవలెను. అన్నమే వాజశబ్దార్థము కావున అట్టి యజమానుఁడు నిశ్చయముగ అన్నమును పొందును.

4. అర్థము: ప్రతిష్ఠిత్యై=ప్రకృష్ట స్థితికొఱకు, ద్వాభ్యామ్="సా మే సత్యా ఽఽశీః", "ఏమా అగ్మన్" అను రెండు మంత్రపాఠములచేతను, (యజమానః=యజమానుఁడు, ప్రార్థయేత్=ప్రార్థించవలెను.)

తాత్పర్యము: యజమానుఁడు దృఢమైన స్థితికొఱకు రెండు మంత్రపాఠములచేతను ఆ యా దేవతలను ప్రార్థించవలెను. (1)"సా ఆశీః=యజ్ఞఫల ప్రార్థనా రూపమైన ఆ యాశీస్సు, మే=నాకు, సత్యా=సత్యమైనది, భూయాత్=అగుఁగాక. (2) ఇమాః=ఈ ఆయురాద్యాశీస్సులు, మామ్=నన్ను ఆ అగ్మన్=పొందుఁగాక." (ఈ రెండు మంత్రములు షష్ఠ ప్రపాఠకమునందలి 3, 4, అనువాకములందు వివరింపఁబడినవి. మానవుఁడు దృఢముగా నిలుచుండుటకు రెండు పాదములు అవసరమైనవిధముగ యజమానుని కోరికలు సత్యముగ ఫలించుటకు రెండు మంత్రపాఠములచే ప్రార్థించుట యవసరమని భావము.)

5. అర్థము: యో వై=ఏ యజమానుఁడైతే, యజ్ఞస్య=యజ్ఞముయొక్క, ద్వౌ దోహౌ, "సా మే సత్యా ఽఽశీః", "ఏమా అగ్మన్" అను రెండు ప్రార్థనారూప దోహములను, విద్వాన్=తెలిసికొనినవాఁడై, యజతే=యాగము చేయుచున్నాఁడో, సః=ఆ యజమానుఁడు, పురస్తాత్=పూర్వపుదైన "సా మే సత్యా ఽఽశీః" అను ప్రార్థన వలనను, ఉపరిష్టాత్ + చ=తరువాతిదైన, "ఏమా అగ్మన్" అను ప్రార్థన వలనను, ఉభయతః=రెండు ప్రార్థనల వలన, యజ్ఞమ్=యజ్ఞమును, దుహే ఏవ=నిశ్చయముగ పితుకును. (=యజ్ఞఫలమును పొందునని భావము.) ఏషః వా=ఈ చెప్పఁబోవునదియే, యజ్ఞస్య=యజ్ఞముయొక్క, అన్యో దోహః="ఏమా అగ్మన్" అను మఱియొక ప్రార్థనారూప దోహము. ఇడాయామ్=ఇడానుమంత్రణ మంత్ర భాగమునందు, అన్యః=మఱియొకటియైన "సా మే సత్యా ఽఽశీః" అను ప్రార్థనారూప దోహము.

తాత్పర్యము: యజ్ఞకర్త తాను జేయు యజ్ఞముయొక్క ఫలమును పొందుటకై రెండు మంత్రపాఠములచే ప్రార్థన చేయుచున్నాఁడు. దోగ్ధ గోవునుండి పాలు పితుకువిధముగ, యజ్ఞకర్త యనెడి దోగ్ధ యజ్ఞమనెడి గోవునుండి ప్రార్థనారూప దోహముచే యజ్ఞఫల మనెడి పాలను పితుకుచున్నాఁడు. అందువలన "సా మే సత్యా ఽఽశీః" అను ప్రార్థనారూప మంత్రపాఠము ఒక దోహము గాను, "ఏమా అగ్మన్" అను ప్రార్థనారూప మంత్రపాఠము మఱియొక దోహము గాను వర్ణింపఁబడినవి. ఈ మంత్ర పాఠములలో "ఏమా అగ్మన్" అనునది ఇఁక ముందుఁ జెప్పఁబడనున్నది. "సా మే సత్యా ఽఽశీః" అనునది పూర్వము ఇడానుమంత్రణానువాకమునందు చెప్పఁబడినది. ఈ విధమును తెలిసికొని యజ్ఞము చేసిన యజమానుఁడు నిశ్చయముగ యజ్ఞఫలమును పొందును.

6. అర్థము: యర్హి=ఎప్పుడు, హోతా=హోత, యజమానస్య=యజమానునియొక్క, నామ=పేరును, గృహ్ణీయాత్=గ్రహించునో, (=ఉచ్చరించునో,) తర్హి=అప్పుడు, "ఏమా అగ్మన్నాశిషో దోహకామాః" ఇతి=ఏమా అగ్మన్నిత్యాది మంత్రమును, బ్రూయాత్=పలుకవలెను. సః=ఆ పలికిన యజమానుఁడు, సంస్తుతాః=హోతచే "అగ్నిమగ్ని ఆవహ", "అగ్నిరిదం హవి రజుషత" ఇత్యాది రూపమున స్తుతింపఁబడిన, దేవతాః=దేవతలను, దుహే ఏవ=నిశ్చయముగ ఫలములను పిదుకుచున్నాఁడు. అథో=మఱియు, పురస్తాత్=పూర్వపు ప్రార్థనా మంత్రమునుండి, ఉపరిష్టాత్=తరువాతిదియగు ప్రార్థనామంత్రమునుండి, ఉభయతశ్చ=రెండు మంత్ర పాఠములనుండియు, యజ్ఞమ్=యజ్ఞమును, దుహే ఏవ=నిశ్చయముగ ఫలమును పితుకుచున్నాఁడు.

తాత్పర్యము: హోత సూక్తవాకమును పఠించుచు యజమానుని పేరు నుచ్చరించినప్పుడు యజమానుఁడు "ఏమా అగ్మన్నాశిషో దోహకామాః" అను మంత్రమును పఠించవలెను. అట్లు పఠించిన యజమానుఁడు "అగ్ని మగ్న అవహ" "అగ్ని రిదం హవి రజుషత" ఇత్యాదికముచే హోతచే స్తుతింపఁబడిన సర్వదేవతలనుండియు యజ్ఞఫలమును నిశ్చయముగ పొందును. మఱియు ఇడానుమంత్రణానువాకమునందలి ఆశీః ఫలమును గూడ పొందును. ("ఏమా అగ్మ" న్నిత్యాది మంత్రము సంపూర్ణముగ 6 ప్ర 4 అనువాకమునందు వ్యాఖ్యాతమైనది.)

7. అర్థము: (హే ప్రస్తర!=ఓప్రస్తరమా!,) అగ్నిః=అగ్నిదేవుఁడు, రోహితేన=రోహిత నామకాశ్వముచేత, త్వా=నిన్ను, దేవతామ్=సూక్తవాకోక్తదేవతను, గమయతు=పొందించుఁగాక, ఇతి=అని, ఆహ="రోహితేన త్వా" ఇత్యాది మంత్రము చెప్పెను. ఏతే వై=రోహిత హర్యేతశ నామకములైన అగ్నీంద్ర సూర్యుల యశ్వములే, దేవాశ్వాః=దేవతాశ్వములు. ప్రస్తరః=ప్రస్తరము, (=దర్భలకట్ట,) యజమానః=యజమానుఁడు. (వంటిది.) ఏతైః=ఈ దేవాశ్వములచేత, ప్రస్తరమ్=ప్రస్తరమును, ప్రహరతి యత్=సూక్తవాకోక్త దేవత సన్నిధికి చేర్చినచో, దేవాశ్వైః=దేవాశ్వములచేత, యజమానమేవ=యజమానునే, సువర్గం లోకమ్=స్వర్గలోకమును, గమయతి= (ప్రస్తరము,) పొందించిన దగుచున్నది.

తాత్పర్యము: ఓ ప్రస్తరమా! అగ్నిదేవుఁడు నిన్ను రోహిత నామకాశ్వముచేత సూక్తవాకోక్త దేవతాసన్నిధికి చేర్చుఁగాక, యని "రోహితేన త్వా" ఇత్యాది మంత్రము చెప్పినది. తన్మంత్రోక్తములైన రోహిత హర్యేతశ నామకాశ్వములే అగ్నీం, ద్ర,సూర్య, దేవతల యశ్వములు. యజమానునివలె ప్రస్తరము కూడ యజ్ఞసాధనమగుటచే ప్రస్తరము యజమాన స్థానీయ మైనది. దేవాశ్వములచే ప్రస్తరమును సూక్తవాకోక్త దేవతా సన్నిధికి చేర్చినచో ప్రస్తరము యజమానునే స్వర్గమునకు చేర్చును. (ఇచట ప్రస్తరమునందు యజమానత్వ మారోపితమైనది. ఇది ప్రస్తరానుమంత్రణ మంత్రమునకు వ్యాఖ్యానము.)

8. అర్థము: (హే అగ్నే!=ఓయగ్నీ!,) తే=నీయొక్క, రశనాః=రశనా స్థానీయములైన పరిధులను, రశ్మీన్=రశ్మి స్థానీయములైన పరిధులను, వి ముఞ్చామి=విడఁదీయుచున్నాను, ఇతి=అని, ఆహ=('వి తే ముఞ్చామీ' త్యాది మంత్రము) చెప్పెను. ఏషః వా=ఇదియే, (=నీ పరిధులను విడఁదీయుచున్నానని అగ్ని నుద్దేశించి చెప్పుటవలన,) అగ్నేః విమోకః=అగ్నియొక్క విమోకము. తేనైవ="తే రశనా విముఞ్చామీ" త్యాది మంత్రముచేతనే, ఏనమ్=ఈ యగ్నిని, వి ముఞ్చతి=(బంధనములనుండి,) విడఁదీయుచున్నాఁడు.

తాత్పర్యము: ఓ యగ్నీ! రశనా స్థానీయములైన నీ పరిధులను విడఁదీయుచున్నానని యజమానుఁడు అగ్ని నుద్దేశించి చెప్పుటవలన ఇదియే విమోకము. ఆ మంత్రముచేతనే యజమానుఁడు అగ్నిని బంధనములనుండి విడఁదీయుచున్నాఁడు. (ఇది పరిధి విమోకానుమంత్రణ మంత్రమునకు వ్యాఖ్యానము.)

9. అర్థము: అహమ్=నేను, విష్ణోః=వ్యాపకుఁడగు, శంయోః=బృహస్పతి పుత్రుఁడగు శంయువు సంబంధమైన, దేవయజ్యయా=సమంత్రకాజ్యాహుతిచేత, యజ్ఞేన=సంపూర్ణ యజ్ఞముచేత, ప్రతిష్ఠామ్=ప్రతిష్ఠను, గమేయమ్=పొందెదను, ఇతి=అని, ఆహ="విష్ణోశ్శంయు రహ" మిత్యాది మంత్రము చెప్పెను. యజ్ఞో వై=యజ్ఞమే, విష్ణుః=ఫలవ్యాప్తిచే విష్ణు స్వరూపము. (అతః=ఇందువలన,) యజ్ఞే ఏవ=యజ్ఞమునందె, అన్తతః=సమాప్తికాలమున, (యజమానః=యజమానుఁడు,) ప్రతి తిష్ఠతి=ప్రతిష్ఠావంతుఁడగుచున్నాఁడు.

తాత్పర్యము: యజమానుఁడనైన నేను వ్యాపకుఁడగు శంయువను బృహస్పతిపుత్రుని కల్పించిన సమంత్రకాజ్యాహుతిచేత సంపూర్ణ యజ్ఞముచే ప్రతిష్ఠను పొందెదను గాక, యని యజమానుఁడు ప్రార్థించుటచే, యజ్ఞము ఫలవ్యాప్తిచే విష్ణు స్వరూపము కావున యజ్ఞ పరిసమాప్తియందు యజమానుఁడు ప్రతిష్ఠావంతుఁ డగుచున్నాఁడు. (ఇది శంయువాకానుమంత్రణ మంత్రమునకు వ్యాఖ్యానము.)

10. అర్థము: అహమ్=నేను, సోమస్య=సోమదేవునియొక్క, దేవయజ్యయా=సమంత్రకాజ్యాహుతిచేత, సురేతాః= ఫలవంతమైన రేతస్సు కలవాఁడనై, రేతః=రేతస్సును, ధిషీయ=ధరించెదను, ఇతి=అని, ఆహ=''సోమస్యాహ''మి త్యాది మంత్రము చెప్పెను. (ఇది యజమానుని ప్రార్థన.) సోమో వై=సోమదేవుఁడే, రేతోధాః= రేతస్సును ధరింపఁజేయువాఁడు. (సః=ఆ ప్రార్థించిన యజమానుఁడు,) తేనైవ=ఆ సోమదేవునిచేతనే, రేతః=రేతస్సును, ఆత్మన్=తనయందు, ధత్తే=ధరించుచున్నాఁడు.

తాత్పర్యము: 'సోమదేవునకు సమంత్రకాజ్యాహుతి నిచ్చుటచే నేను (=యజమానుఁడు,) మంచి రేతస్సు కలవాఁడనై రేతస్సును ధరించెదను', అని యజమానుఁడు ప్రార్థించుటచేత సోమదేవుఁడే రేతస్సును ధరింపఁజేయువాఁడు కావున యజమానుఁడు ఆ సోమదేవునిచేతనే తనయందు రేతస్సును ధరించును. (ఇది ప్రథమ సంయాజానుమంత్రణ మంత్రమునకు వ్యాఖ్యానము.)

11. అర్థము: అహమ్=నేను, త్వష్టుః=త్వష్టృ దేవతా సంబంధమైన, దేవయజ్యయా=సమంత్రకాజ్యాహుతిచేత, పశూనామ్=పశువులయొక్క, రూపమ్=రూపమును, పుషేయమ్=పోషింతును గాక, ఇతి=అని, ఆహ=''త్వష్టురహ'' మిత్యాది మంత్రము చెప్పెను. త్వష్టా వై=త్వష్టృ దేవుఁడే, మిథునానామ్=స్త్రీపురుష మిథునాత్మకములైన, పశూనామ్=పశువులయొక్క, రూపకృత్=రూపమును జేయువాఁడు. (తతః=అందువలన, సః=ఆ ప్రార్థించిన యజమానుఁడు,) తేనైవ=ఆ త్వష్టృ దేవునిచేతనే, పశూనామ్=పశువులయొక్క, రూపమ్=రూపమును, ఆత్మన్=తనయందు, ధత్తే=ధరించుచున్నాఁడు.

తాత్పర్యము: 'నేను త్వష్టృ దేవునకు సమంత్రకాజ్యాహుతి నిచ్చుటచే పశువుల రూపమును పోషించెద'నని యజమానుఁడు ప్రార్థించుటవేత, త్వష్టృ దేవుఁడే (నిషిక్తమైన రేతస్సును పశురూపముగ మార్చును కనుక,) స్త్రీపురుషాత్మక మిథునరూప పశువుల రూపమును జేయును గనుక ఆ త్వష్టృ దేవునిచేతనే పశువులయొక్క రూపమునాత్మయందు ధరించును. (=పశువుల రూపమును యజమానుఁడు పోషించును అని భావము. ఇది ద్వితీయ పత్నీసంయాజానుమంత్రణ మంత్రమునకు వ్యాఖ్యానము. దీని వివరణము 6. ప్ర. 4. అనువాకమునందు గలదు.)

12. అర్థము: దేవానామ్=దేవతలయొక్క, పత్నీః=పత్నులు, గృహపతిః=గృహపతియగు, అగ్నిః=అగ్ని, యజ్ఞస్య= యజ్ఞమునకు సంబంధించిన, మిథునమ్=మిథునము. తయోః=ఆ ఉభయుల సంబంధమైన, దేవయజ్యయా=సమంత్రకాజ్యాహుతిచేత, అహమ్=నేను, మిథునేన=పుత్ర పుత్రీ రూపముతో, ప్ర భూయాసమ్=ప్రకర్షవంతుఁడ నగుదును గాక, ఇతి=అని, ఆహ=(దేవానాం పత్నీ రిత్యాది మంత్రము) చెప్పెను. ఏతస్మాత్= ఈ, మిథునాద్వై=మిథునమునుండియే, ప్రజాపతిః=ప్రజాపతి, మిథునేన=స్త్రీపురుషాత్మక మిథున రూపముతో, ప్రాజాయత=ప్రకర్షగా ఉద్భవించెను. తస్మాదేవ=ఆ మిథునమునుండియే, యజమానః=యజ్ఞకర్త, మిథునేన=పుత్ర పుత్రీరూప మిథునముతో, ప్రజాయతే=ప్రకర్షగ ఉద్భవించుచున్నాఁడు.

తాత్పర్యము: గృహపతియగు అగ్నియు, దేవపత్నులును యజ్ఞమునకు సంబంధించిన మిథునము. ఆ మిథునము నుద్దేశించి సమంత్ర కాజ్యాహుతి చేయుటచే యజమానుఁడనైన నేను పుత్ర పుత్రీరూప మిథునముచే ప్రకర్షవంతుఁడ నగుదునుగాక, యని యజమానుఁడు కోరెను. ఈ యజ్ఞసంబంధి మిథునమునుండియే ప్రజాపతి యుద్భవించెను. కావున అట్లు ప్రార్థించిన యజమానుఁడు ఆ యజ్ఞమిథునమునుండియే పుత్ర పుత్రీరూప మిథునముతో ఉద్భవించును. (ఇది తృతీయ చతుర్థ పత్నీ సంయాజానుమంత్రణ మంత్రమునకు వ్యాఖ్యానము.)

13. అర్థము: (హే దర్భమయ!=ఓ దర్భల సముదాయమా!, త్వమ్=నీవు), వేదః=వేదనామము కలదానవు, అసి=అగుచున్నావు. (అత ఏవ=ఇందువలననే,) విత్తిః=ద్రవ్యలాభ సాధనము, అసి=అగుచున్నావు. (త్వదనుగ్రహేణ=నీ యనుగ్రహముచేత,) విదేయ=(ధనమును) పొందెదను, ఇతి=అని, ఆహ=('వేదోఽసి'త్యాది మంత్రము,) చెప్పెను. వేదేన వై=దర్భల కట్టచేతనే, దేవాః=దేవతలు, అసురాణామ్=రాక్షసులయొక్క, విత్తమ్=పూర్వ లబ్ధమైన ధనమును, వేద్యమ్=ఇతః పరము పొందఁదగిన ధనమును. అవిన్దన్త=పొందిరి. తత్=అందువలన, వేదస్య=దర్భల కట్టకు, వేదత్వమ్='వేద'శబ్ద వాచ్యత్వము, సిధ్యతి=సిద్ధించుచున్నది.

తాత్పర్యము: ఓ దర్భల సముదాయమా! నీవు 'వేద'నామము కలదానవు. కనుకనే ద్రవ్యలాభ సాధన మగుచున్నావు. అట్టి నీ యనుగ్రహముచేత ధనమును పొందుదును గాక, యని యజమానుఁడు దర్భమయమైన వేదమును కోరెను. పూర్వ మొకప్పుడు దేవతలు దర్భల కట్టచే వేదభూమిని బాగుగ శుభ్రము చేసి అసురులు దాఁచుకొనిన విత్తము వేద్యమునైన ధనమును గ్రహించిరి. కనుకనే విద్యతే=లభ్యతే, విత్త మనేనేతి వ్యుత్పత్తిచే (=దీనిచే ధనము పొందఁబడుచున్న దను వ్యుత్పత్తిచే,) దీనికి వేదత్వము (=వేదశబ్ద వాచ్యమగుట,) సిద్ధించినది.

14. అర్థము: భ్రాతృవ్యస్య=శత్రువుయొక్క, యత్ యత్=ఏ యే గృహ క్షేత్రాదికము, (ఆత్మనః=తనకు, అస్తు=ఉండుఁగాక, ఇతి=అని, యజమానః=యజమానుఁడు,) అభి ధ్యాయేత్=తలఁచునో, తస్య=ఆ గృహ క్షేత్రాదికముయొక్క, నామ=పేరును, (మంత్ర మధ్యే=మంత్ర మధ్యమునందు,) గృహ్ణీయాత్=గ్రహించవలెను. (తదా=అప్పుడు, సః=ఆ యజమానుఁడు,) అస్య=ఈ శత్రువుయొక్క, తత్సర్వమ్=ఆ సమస్తమును, వృఙ్క్తే ఏవ=నిశ్చయముగ పోఁగొట్టుచున్నాఁడు.

తాత్పర్యము: యజమానుఁడు తన శత్రువుయొక్క గృహ క్షేత్రాదికము ఏది తనకు లభించవలెనని తలఁచునో, మంత్రమధ్యమునందు ఆ యా వస్తువుయొక్క పేరు నుచ్చరించి అది తనకు చెందవలెనని మంత్రమును పఠించినచో అట్టి యజమానుఁడు తన శత్రువుయొక్క ఆ గృహ క్షేత్రాదికమును సర్వమును నిశ్చయముగ పోఁగొట్టును.

15. అర్థము: ఘృతవన్తమ్=ఆజ్యాది భోజన సాధన సమృద్ధమైనదియు, కులాయినమ్=బహు గృహోపేతమైనదియు, వాజినమ్=భోజ్యాన్న సమృద్ధమైనదియునగు, సహస్రిణమ్=సహస్ర సంఖ్యాకమయిన, రాయస్పోషమ్=ధన సమృద్ధిని, వేదః=వేద నామకమైన దర్భలకట్ట, (మహ్యమ్=నాకొఱకు,) దదాతు=ఒసఁగుఁగాక, ఇతి=అని, ఆహ=('ఘృతవన్త' మిత్యాది మంత్రము) చెప్పెను. (తత్=అందువలన, సః=ఆ కోరుకొనిన యజమానుఁడు,) సహస్రమ్=సహస్ర సంఖ్యాకములయిన, పశూనపి=పశువులను కూడ, ప్రాప్నోతి=పొందుచున్నాఁడు.

తాత్పర్యము: ఆజ్యాది భోజన సమృద్ధమును, బహు గృహోపేతమును, భోజ్యాన్న సమృద్ధమును, సహస్ర సంఖ్యాకమునగు ధన సమృద్ధిని వేద నామకమైన దర్భలకట్ట తన కొసఁగుఁగాక యని యజమానుఁడు వేద నామకమైన దర్భల కట్టను సంబోధించి ప్రార్థించెను. అట్లు ప్రార్థించిన యజమానుఁడు సహస్ర సంఖ్యాకములుగ పశువులను గూడ పొందును. (ఇది వేదాభిమర్శన మంత్రమునకు వ్యాఖ్యానము.)

16. అర్థము: యః=ఏ యజమానుఁడు, ఏవమ్=మంత్రార్థము నీ విధముగ, వేద=తెలిసికొనుచున్నాఁడో, అస్య=ఈ యజమానునియొక్క ప్రజాయామ్=సంతానమునందు, వాజీ=అన్న సమృద్ధి కల, (పుత్రః=పుత్రుఁడు,) ఆ జాయతే=అంతటను పుట్టుచున్నాఁడు.

తాత్పర్యము: పూర్వోక్తవిధముగ తెలిసికొనిన యజమానునకు కలుగు సంతానములో అన్న సమృద్ధి కల పుత్రుఁడు అంతటను కలుగును. (ఇది మంత్రార్థ వేదన ప్రశంస.)

(చతుర్థానువాకము సమాప్తము.)

అథ ప్రథమకాణ్డే సప్తమప్రపాఠకే పఞ్చమోఽనువాకః।

మూలము: ధ్రువాం వై రిచ్యమానాం యజ్ఞో ఽను రిచ్యతే యజ్ఞం యజమానో యజమానం ప్రజా ధ్రువా మాప్యాయమానాం యజ్ఞో ఽన్వాప్యాయతే యజ్ఞం యజమానో యజమానం ప్రజా [2]ఆప్యాయతాం ధ్రువా ఘృతేనేత్యాహ ధ్రువా మేవాఽఽప్యాయయతి తా మాప్యాయమానాం యజ్ఞో ఽన్వాప్యాయతే యజ్ఞం యజమానో యజమానం ప్రజాః [3]ప్రజాపతే ర్విభాన్నామ లోక స్తస్మిగ్ం స్త్వా దధామి సహ యజమానేనేతి (౧)అహాయం వై ప్రజాపతే ర్విభా న్నామ లోక స్తస్మిన్నేవైనం దధాతి సహ యజమానేన [4]రిచ్యత ఇవ వా ఏతద్యద్యజతే యద్యజమానభాగం ప్రాశ్నాత్యాత్మాన మేవ ప్రీణా[5]త్యేతావా న్వై యజ్ఞో యావా న్యజమానభాగో యజ్ఞో యజమానో యద్యజమానభాగం ప్రాశ్నాతి యజ్ఞ ఏవ యజ్ఞం ప్రతిష్ఠాపయ[6]త్యేతద్వై సూయవసగ్ం సోదకం యద్బర్హి శ్చాఽఽపశ్చైతత్ (౨)యజమానస్యా ఽఽయతనం యద్వేది [7]ర్య త్పూర్ణపాత్ర మన్తర్వేది ని నయతి స్వ ఏవాఽఽయతనే సూయవసగ్ం సోదకం కురుతే [8]సదసి సన్మే భూయా ఇత్యాహాఽఽపో వై యజ్ఞ ఆపో ఽమృతం యజ్ఞ మేవా మృత మాత్మ న్ధత్తే [9]సర్వాణి వై భూతాని వ్రత ముపయన్త మనూపయన్తి ప్రాచ్యాం దిశి దేవా ఋత్విజో మార్జయన్తా మిత్యాహైష వై దర్శపూర్ణమాసయో రవభృథః (౩)యా న్యేవైనం భూతాని వ్రత ముపయన్త మనూపయన్తి తై రేవ సహావభృథ మవైతి [10]విష్ణుముఖా వై దేవా శ్ఛన్దోభి రిమా ల్లోకా ననపజయ్య మభ్యజయ న్యద్విష్ణుక్రమా న్క్రమతే విష్ణు రేవ భూత్వా

యజమాన శ్ఛన్దోభి రిమా ల్లోకా ననపజయ్య మభిజయతి ¹¹విష్ణోః క్రమో ఽస్యభి మాతిహే

త్యాహ గాయత్రీ వై పృథివీ త్రైష్టుభ మన్తరిక్షం జాగతీ ద్యౌ రానుష్టుభీ ర్దిశ శ్ఛన్దోభి రేవేమా

ల్లోకా న్యథాపూర్వ మభి జయతి ॥౪॥ (యజమానేనేతి చైత దవభృథో దిశః సప్త చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే సప్తమప్రపాఠకే పఞ్చమోఽనువాకః॥

వేదార్థ దీపిక

అవతారిక: చతుర్థానువాకమునందు శేషాహూత్యనుమంత్రణ మంత్రములు వ్యాఖ్యాతములైనవి. ఈ పంచమానువాకమునందు అప్యాయనాది మంత్రములు వ్యాఖ్యానింపఁబడుచున్నవి.

1. అర్థము: రిచ్యమానామ్=అజ్య శూన్యమైన, ధ్రువా మను వై=ధ్రువ పాత్రము ననుసరించియే, యజ్ఞః=యజ్ఞము, రిచ్యతే=అసంపూర్ణ మగుచున్నది. (తం) యజ్ఞమ్=ఆ అసంపూర్ణ యజ్ఞము ననుసరించి, యజమానః=యజమానుఁడు, రిచ్యతే=(యజ్ఞము సంపూర్ణము కాకుండుటచే,) ఫలశూన్యుఁ డగుచున్నాఁడు. (రిచ్యమానం) యజమాన మను=ఫలశూన్యుఁడైన యజమాను ననుసరించి, ప్రజా=సంతానము, రిచ్యతే=అన్నశూన్య మగుచున్నది. అప్యాయమానామ్=అజ్యపూర్ణమైన, ధ్రువా మను=ధ్రువ పాత్రము ననుసరించి, యజ్ఞః=యజ్ఞము. అప్యాయతే=సంపూర్ణ మగుచున్నది. (తం) యజ్ఞ మను=ఆ సంపూర్ణమైన యజ్ఞము ననుసరించి, యజమానః=యజమానుఁడు, అప్యాయతే=ఫలవంతుఁ డగుచున్నాఁడు. (తం) యజమాన మను=ఫలసహితుఁడైన ఆ యజమాను ననుసరించి, ప్రజాః=ప్రజలు, అప్యాయన్తే=అన్నసమృద్ధి కలవా రగుచున్నారు.

తాత్పర్యము: ధ్రువయను హోమసాధన పాత్రము అజ్యముచే పూరింపఁబడనిచో యజ్ఞము సంపూర్ణము కానేరదు. యజ్ఞము సంపూర్ణము కానిచో యజ్ఞకర్తకు యజ్ఞఫలము లభించదు. అప్పుడు యజ్ఞకర్తృ సంతానము అన్నము లేనిదగును. ధ్రువపాత్రము అజ్యముచే నింపఁబడినచో యజ్ఞము సంపూర్ణమగును. సంపూర్ణ యజ్ఞముచే యజ్ఞకర్తకు యజ్ఞఫలము లభించును. అప్పుడా యజమానుని సంతానము అన్నసమృద్ధి కలదగును. (అన్వయ వ్యతిరేకములచే ఈ మంత్రమున అప్యాయత ప్రశంసింపఁబడినది. (అప్యాయత=అజ్యాదులచే ధ్రువాది హోమసాధనములను నిండించుట.)

2. అర్థము: ధ్రువా=ధ్రువపాత్రము, ఘృతేన=అజ్యముచే, అప్యాయతామ్=నింపఁబడుఁగాక, ఇతి=అని, అహ=“అప్యాయతా” మిత్యాది మంత్రము చెప్పెను. (తతః=అందువలన,) ధ్రువామేవ=ధ్రువపాత్రమునే, అప్యాయయతి=(యజ్ఞకర్త ఘృతముచే) నింపవలయును. అప్యాయమానామ్=అజ్యపూర్ణమైన, తామను=ఆ ధ్రువ పాత్రము ననుసరించి, యజ్ఞః=యజ్ఞము, అప్యాయతే=సంపూర్ణ మగుచున్నది. యజ్ఞ మను, యజమానః, అప్యాయతే, యజమాన మను, ప్రజాః, అప్యాయన్తే. (వీనియర్థము 1 వ మంత్రవ్యాఖ్యానమున కలదు.)

తాత్పర్యము: ధ్రువ యను పాత్రము అజ్యముచే పూరింపఁబడుఁగాక, యని చెప్పుటచే యజమానుఁడు ధ్రువపాత్రము నాజ్యముచే పూరించవలెను. అజ్యపూర్ణ ధ్రువపాత్రము ననుసరించి యజ్ఞము సంపూర్ణమగును. (శేషము పూర్వోక్తము.)

3. అర్థము: ప్రజాపతేః=ప్రజాపతి సంబంధమైన, విభాన్ నామ='విభాన్' అను పేరుగల, లోకః=లోకము, (అస్తి=కలదు.) తస్మిన్=ఆ విభాన్నామక లోకమునందు, (హవిర్భాగ భోక్త్రీ=హవిర్భాగ భోక్తనగు,) యజమానేన (మయా) సహ=యజమానుఁడ నగు నాతో కూడ, త్వా=నిన్ను, దధామి=ఉంచుచున్నాను, ఇతి=అని, ఆహ="(ప్రజాపతే" రిత్యాది మంత్రభాగము.) చెప్పుచున్నది. అయం వై=ఈ భూలోకమే, ప్రజాపతేః=ప్రజాపతియొక్క, విభాన్నామ లోకః=విభాన్నామక లోకము. తస్మిన్నేవ=ఆ లోకమునందే, ఏనమ్=ఈ యజమాన భాగమును, యజమానేన సహ=యజమానునితోఁగూడ, దధాతి=(యజమానుఁడు) ఉంచిన వాఁడగుచున్నాఁడు.

తాత్పర్యము: (విశేషేణ కర్మభూమిత్వేన భాతీతి విభాన్ అయం భూలోకః=భూలోకము విశేషముగ కర్మభూమిగ భాసించుచున్నది కావున విభాన్నామ లోకము భూలోకమే.) "ఓ యజమాన భాగమా! హవిర్భాగమును భుజించుచున్న యజమానుఁడ నగు నేను నాతో కూడ నిన్ను ఈ విభాన్నామ లోకమునం దుంచుచున్నాను" అని చెప్పుటచే యజమానుఁడు యజమాన భాగమును భూలోకమునందే ఉంచినవాఁ డగుచున్నాఁడు. ఈ భూలోకమే విభాన్నామ లోకము. (ఏతద్వివరణము 6 ప్ర. 5 వ అనువాకమునందు కలదు.)

4. అర్థము: యజతే ఇతి యత్=యాగము చేయుచున్నచో, ఏతత్=ఈ పురోడాశాజ్య సాన్నాయ్య ద్రవ్య (హోమము) హానివలన, (యజమానః=యజమానుఁడు,) రిచ్యత ఇవ వా=శూన్యుఁడువలెనే, (భవతి=అగుచున్నాఁడు.) యజమాన భాగమ్=యజమానునకు సంబంధించిన హోమశేష హవి ర్భాగమును, ప్రాశ్నాతి యత్=(యజమానుఁడు) భుజించినచో, ఆత్మానమ్=తనను, ప్రీణాత్యేవ=నిశ్చయముగ సంతోషపఱచుచున్నాఁడు. (తృప్తి చెందినవాఁడై క్లేశమును పోఁగొట్టుకొనుచున్నాఁడు.)

తాత్పర్యము: యజ్ఞకర్త యజ్ఞమునందు పురోడాశాది హవిస్సులను హోమము చేయుటవలన శూన్యుఁడువలె కనఁబడుచుండును, హోమశేష హవి ర్భాగమును భుజించినచో యజమానుఁడు సంతుష్టి కలవాఁడై తాను పడిన శ్రమను విడనాడును.

5. అర్థము: యజ్ఞభాగః=యజ్ఞమునందు హోమశేష హవి ర్భాగము, (యజమానస్య=యజమానునకు,) యావాన్=ఎంత పరిమితి కలది, అస్తి=కలదో, ఏతావాన్ వై =ఈ మాత్రమే, యజ్ఞః=(లోకమునందు యజమానునకు ఉపయుక్తమైన) యజ్ఞము. (మిగిలిన హవిస్సును దేవతలు ఋత్విజులు భుజింతురు.) యజమానః=యజమానుఁడు, యజ్ఞః=యజ్ఞ (స్వామి కనుక) స్వరూపుఁడు. (తథాసతి=అట్లు కాఁగా, యజమానః=యజమానుఁడు,) యజమాన భాగమ్=హోమశేష హవిస్సునందలి యజమాన భాగమును, ప్రాశ్నాతి యత్=భుజించినచో, యజ్ఞమ్=యజ్ఞమును, యజ్ఞే ఏవ=యజ్ఞమునందే, ప్రతిష్ఠాపయతి ప్రతిష్ఠాపన చేసినవాఁ డగుచున్నాఁడు.

తాత్పర్యము: యజ్ఞమునందు హోమము చేయుఁగా మిగిలిన హవిస్సులో కొంతభాగమును యజమానుఁడు, మఱికొంత భాగమును ఋత్విజులు తీసికొని భుజించవలెను. ఇహలోకమునందు యజమానునకు చెందవలసిన హవిశ్శేషభాగమే అతని కుపయుక్తమైన యజ్ఞము. మిగిలినది ఋత్విజులు దేవతలు భుజింతురు కావున అది యజ్వ కుపయోగించునది కాదు. కనుక యజ్ఞకర్త తన హవిశ్శేష భాగమును ప్రాశనము చేసినచో, యజ్ఞస్వామి కావున యజమానుఁడు యజ్ఞమును యజ్ఞమునందే (=తనయందే,) ప్రతిష్ఠింపఁజేసిన వాఁడగుచున్నాఁడు.

6. అర్థము: బర్హిశ్చ=బర్హిస్సును, (=దర్భయు,) ఆపశ్చ=ఉదకములును, యత్=(వేదియందు అమర్చఁబడియుండుట,) ఏది కలదో, ఏతద్వై=ఇదియే, సూయవసమ్=సమీచీన తృణములతో కూడియుండుటయు, సోదకమ్=ఉదకముతో కూడియుండుటయు, (భవతి=అగుచున్నది.) వేదిః యత్=వేది యనునది యేది కలదో, ఏతత్=సమీచీన తృణోపేతము, సోదకమునైన యిది, యజమానస్య=యజ్ఞకర్తకు, ఆయతనమ్=స్థానము.

తాత్పర్యము: యజ్ఞశాలయందలి వేది హవిస్సును వహించుటచే యజమానునకు స్థానమగుచున్నది. ఆ వేదియందు బర్హిస్సును పఱచుటచే అది సమీచీన తృణోపేతమును, ప్రణీతపాత్రల నిచట స్థాపించుటచే ఉదకోపేతము నగుచున్నది.

7. అర్థము: పూర్ణపాత్రమ్=పూర్ణమైన పాత్రమును, అన్తర్వేది=వేది మధ్యభాగమునందు, ని నయతి యత్=చేర్చినచో, (యజమానః=యజమానుఁడు, స్వే ఆయతనే ఏవ=తన స్థానమునందే, సూయవసమ్=యోగ్య తృణ సమృద్ధిని, సోదకమ్=ఉదక సమృద్ధిని, కురుతే=చేసిన వాఁడగుచున్నాఁడు.)

తాత్పర్యము: జలపూర్ణ పాత్రమును వేది మధ్యభాగమున నుంచినచో యజమానుఁడు తన స్థానమునందే సమీచీన తృణ సమృద్ధిని, ఉదకసమృద్ధిని చేసిన వాఁడగుచున్నాఁడు. (ప్రణీతములు=నీళ్లు పోసి వండఁబడిన పదార్థములు. 'యవసం తృణ మర్జునమ్' అని అమర నిఘంటువు.)

8. అర్థము: (హే పూర్ణపాత్ర!=ఓ జలపూర్ణమైన పాత్రమా; త్వమ్=నీవు,) సత్=శోభనమైన దానవు, అసి=అగుచున్నావు. (తత్=అందువలన,) మే=నాకు, సత్=యోగ్యమైన దానవు, భూయాః=అగుము, ఇతి=అని, ఆహ('సదసి' త్యాది మంత్రము) చెప్పెను. ఆపో వై=ఉదకములే, యజ్ఞః=(యజ్ఞ సాధనములగుటచే) యజ్ఞ (స్వరూప)ములు. అపః=ఉదకములు, అమృతమ్=(జీవన హేతువులగుటచే,) అమృత (స్వరూప) ములు. (అతః=ఇందువలన, సః='సదసీ' త్యాది మంత్రమున ప్రార్థించిన యజమానుఁడు, అమృతమ్=అమృత స్వరూపమైన, యజ్ఞమేవ=యజ్ఞమునే, ఆత్మన్=తనయందు, ధత్తే=ధరించుచున్నాఁడు.

తాత్పర్యము: ఓ జలపూర్ణ పాత్రమా! నీవు శోభనమైన దానవు. కనుక నా విషయమున యోగ్యమైన దానవు కమ్ము అని యజమానుఁడు ప్రార్థించెను. ఉదకములు యజ్ఞసాధనములు కావున యజ్ఞ స్వరూపములు. జీవన హేతువు లగుటచే అమృత స్వరూపములు. కావున పై విధముగ ప్రార్థించిన యజమానుఁడు అమృత స్వరూపమైన యజ్ఞమునే తనయందు ధరించినవాఁ డగుచున్నాఁడు.

9. అర్థము: సర్వాణి భూతాని=దేవ పిత్రాది సర్వప్రాణులు, వ్రతమ్=యజ్ఞవ్రతమును, ఉపయన్తమను=ఆరంభించుచున్న యజమాను ననుసరించి, ఉప యన్తి వై=ప్రారంభించుచున్నవి కదా! ప్రాచ్యాం దిశి=తూర్పుదిక్కునందు, దేవాః=దేవతలు, ఋత్విజః=ఋత్విజులు, మార్జయన్తామ్=శోధింతురు గాక, ఇతి=అని, అహ="ప్రాచ్యాం దిశీ" త్యాది మంత్రము చెప్పెను. యాని భూతాన్యేవ=ఏ దేవ పిత్రాది ప్రాణులే, వ్రతమ్=యజ్ఞవ్రతమును, ఉప యన్త మను=ప్రారంభించిన యజమాను ననుసరించి, ఉపయన్తి=ప్రారంభించుచున్నారో; తైస్సహైవ=ఆ దేవ పిత్రాది ప్రాణులతో కూడనే, (సః=ఆ వ్రతము నాచరించిన యజమానుఁడు,) అవభృథమ్=అవభృథ కర్మను, అపైతి=పొందుచున్నాఁడు. ఏషః వై=ఇదియే, దర్శపూర్ణమాసయోః=దర్శపూర్ణమాస యాగముల యొక్క, అవభృథః=అవభృథ మనెడి కర్మవిశేషము.

తాత్పర్యము: దేవ పిత్రాది సర్వప్రాణులు యజ్ఞకర్మ నాచరించుచున్న యజమాను ననుసరించి యజ్ఞము ననుష్ఠించుచున్న వారే. కావున దేవ పిత్రాది మార్జన ప్రతిపాదకమైన 'ప్రాచ్యాం దిశీ' త్యాది మంత్రముచేత యజమానుఁ డా దేవ పిత్రాదు లందఱితోడను అవభృథమును బొందుచున్నాఁడు. ఇదియే దర్శపూర్ణమాసముల అవభృథము.

10. అర్థము: దేవాః=దేవతలు, విష్ణుముఖాః వై=విష్ణువును ముఖ్యునిగా చేసికొనినవారై యై, ఛన్దోభిః=ఛన్దోఽభిమాని దేవతలతో; (సహితాః=కూడినవారై) ఇమాన్=ఈ లోకములను, అనప జయ్యమ్=ఇతరులచే జయింప నలవి కాని విధముగ, అభ్యజయన్=అంతటను జయించిరి. (అతః=ఇందువలన,) యజమానః=యజమానుఁడు, విష్ణుక్రమాన్=విష్ణువుయొక్క పాద న్యాసములను, క్రమతే యత్=అనుసరించి పాద విక్షేపములను చేసినచో, విష్ణురేవ భూత్వా=విష్ణువుగానే అయి, ఛన్దోభిః(సహితః)=ఛన్దోభిమాని దేవతలతోఁగూడినవాఁడై, ఇమాన్ లోకాన్=ఈ లోకములను, అనప జయ్యమ్=ఇతరులు జయింప వీలు లేని విధముగ, అభి జయతి=అంతటను జయించుచున్నాఁడు.

తాత్పర్యము: పూర్వము దేవతలు తమలో విష్ణువును ముఖ్యునిగాఁ జేసికొని ఛందోభిమాని దేవతలతో కూడినవారై ఇతరులు జయించుటకు వీలు లేని విధముగ లోకములను జయించిరి. యజ్ఞకర్త వేదిపైని విష్ణు పాదన్యాసములలో పాద విక్షేపములను చేసినచో అతఁడు విష్ణువే యై ఛన్దోభిమాని దేవతలతో కూడినవాఁడై ఈ లోకములను ఇతరులు జయింప సాధ్యము కాని విధముగ జయించును.

11. అర్థము: (హే ప్రథమ ప్రక్రమః=ఓ ప్రథమ పాద విన్యాసమా!) అభిమాతిహా=నరక ప్రదమైన పాపమును నశింపఁజేయునట్టి, (త్వమ్=నీవు,) విష్ణోః=విష్ణువుయొక్క, క్రమః=పాద విక్షేపము, అసి=అగుచున్నావు, ఇతి=అని ఆహ=("విష్ణోః క్రమో ఽసీ" త్యాది మంత్రమునందు యజమానుఁడు,) పలికెను. గాయత్రీ వై=గాయత్రీ ఛన్దోదేవతయే, పృథివీ=పృథివీలోక స్వామి. త్రైష్టుభమ్=త్రిష్టుప్ ఛన్దోభిమాని దేవత, అన్తరిక్షమ్=అంతరిక్షలోక స్వామి. జాగతీ=జగతీ ఛన్దోఽభిమాని దేవత, ద్యౌః=ద్యులోకాధిపతి. ఆనుష్టుభీః=అనుష్టుప్ ఛన్దోదేవతలు, దిశః=దిగధిపతులు. (తత్=ఆ కారణమువలన,) ఛన్దోభిరేవ=(సహితః) ఛన్దోదేవతలతో కూడినవాఁడే యై, (సః=ఆ యజమానుఁడు,) ఇమాన్ లోకాన్=ఈ లోకములను, యథాపూర్వమ్=పూర్వము చెప్పఁబడిన విధముగ, అభి జయతి=అంతట జయించుచున్నాఁడు.

తాత్పర్యము: యజమానుఁడు అవభృథ సమయమున వేదియందు ముందుకు నడచుచు తన యడుగుల నుంచు ప్రదేశములను విష్ణుపాద న్యాసములుగా భావన చేసి ఆ పాద న్యాసములను సంబోధించి "విష్ణువుయొక్క ఓ ప్రథమ పాదన్యాసమా! నరక ప్రదమైన పాపమును నశింపఁజేయునట్టి నీవు విష్ణువుయొక్క పాద విక్షేపము అగుచున్నావు" అని యనెను. గాయత్ర్యాది ఛన్దోదేవతలు పృథివ్యాది లోకముల కధిపతులు కావున యజమానుఁడు తత్తచ్ఛన్దో దేవతలతో కూడినవాఁడై యీ లోకములను జయించును. గాయత్ర్యాది ఛన్దో దేవతలు పృథివ్యాది లోకాధిపతులు కావున ఆ దేవతలతో కూడ లోకములను జయించుట సాధ్య మగుటచే మంత్రములయందు "గాయత్రేణ ఛన్దసా" ఇత్యాది విధముగ చెప్పఁబడినది.

పంచమానువాకము సమాప్తము

అథ ప్రథమకాణ్డే సప్తమప్రపాఠకే షష్ఠోఽనువాకః

మూలము: [1]అగన్మ సువ స్సువ రగన్మేత్యాహ సువర్గ మేవ లోక మేతి [2]సన్దృశ స్తే మా ఛిత్సి యత్తే తప స్తస్మై తే మా ఽఽవృక్షీత్యాహ యథాయజు రేవైత [3]త్సుభూ రసి శ్రేష్ఠో రశ్మీనా మాయుర్ధా అస్యాయు ర్మే ధేహీత్యా హాఽఽశిష మేవైతా మాశాస్తే [4]ప్ర వా ఏషో ఽస్మా ల్లోకా చ్చ్యవతే యః (౧)విష్ణుక్రమా న్క్రమతే సువర్గాయ హి లోకాయ విష్ణుక్రమాః క్రమ్యన్తే బ్రహ్మవాదినో వదన్తి స త్వై విష్ణుక్రమాన్ క్రమేత య ఇమా ల్లోకా న్భ్రాతృవ్యస్య సంవిద్య పున రిమం లోకం ప్రత్యవరోహే ది[5] త్యేష వా అస్య లోకస్య ప్రత్యవరోహో యదాహేద మహ మముం భ్రాతృవ్య మాభ్యో దిగ్భ్య ఽస్యై దివ ఇతీమానేవ లోకా న్భ్రాతృవ్యస్య సంవిద్య పున రిమం లోకం ప్రత్యవరోహతి [6]సమ్ (౨) జ్యోతిషా ఽభూవ మిత్యాహాస్మిన్నేవ లోకే ప్రతి తిష్ఠ [7]త్యైన్ద్రీ మావృత మన్వావర్త ఇత్యాహాసౌ వా ఆదిత్య ఇన్ద్ర స్తస్యైవా ఽఽవృత మను పర్యావర్తతే [8]దక్షిణా పర్యావర్తతే స్వమేవ వీర్య మను పర్యావర్తతే తస్మా ద్దక్షిణో ఽర్ధ ఆత్మనో వీర్యావత్తరో ఽథో ఆదిత్య స్యైవా ఽఽవృత మను పర్యావర్తతే [9]స మహం ప్రజయా సం మయా ప్రజేత్యాహా ఽఽశిషమ్ (౩) ఏవైతా మాశాస్తే [10]సమిద్ధో అగ్నే మే దీదిహి సమేద్ధా తే అగ్నే దీద్యాస మిత్యాహ యథాయజు రేవైత [11]ద్వసుమా న్యజ్ఞో వసీయా న్భూయాస మిత్యాహా ఽఽశిష మేవైతా మాశాస్తే [12]బహు వై గార్హపత్యస్యాన్తే మిశ్రమివ చర్యత ఆగ్నిపావమానీభ్యాం గార్హపత్య ముపతిష్ఠతే పునా

త్యేవాగ్నిం పునీత ఆత్మానం ద్వాభ్యాం ప్రతిష్ఠిత్యా [13]అగ్నే గృహపత ఇత్యాహ (४)యథా యజు రేవైత చ్ఛతగం హిమా ఇత్యాహ శతం త్వా హేమన్తా నిన్ధిషీయేతి వా వైతదాహ పుత్రస్య నామ గృహ్ణాత్యన్నాద మేవైనం కరోతి తా మాశిష మాశాస్తే త న్తవే జ్యోతిష్మతీ మితి బ్రూయా ద్యస్య పుత్రో ఽజాత స్స్యా త్తేజస్వ్యేవాస్య బ్రహ్మవర్చసీ పుత్రో జాయతే తా మాశిష మాశాసే ఽముష్మై జ్యోతిష్మతీ మితి బ్రూయా ద్యస్య పుత్రః (౫)జాత స్స్యా త్తేజ ఏవాస్మి న్బ్రహ్మవర్చసం దధాతి [14]యో వై యజ్ఞం ప్రయుజ్య న విముఞ్చత్యప్రతిష్ఠానో వై స భవతి క స్త్వా యునక్తి స త్వా విముఞ్చత్విత్యాహ ప్రజాపతి ర్వై కః ప్రజాపతినైవైనం యునక్తి ప్రజాపతినా వి ముఞ్చతి ప్రతిష్ఠిత్యా [15]ఈశ్వరం వై వ్రత మవీసృష్టం ప్రదహో ఽగ్నే వ్రతపతే వ్రత మచారిష మిత్యాహ వ్రత మేవ (౬)వి సృజతే శాన్త్యా అప్రదాహాయ [16]పరాఙ్వా వ యజ్ఞ ఏతి న నివర్తతే పున ర్యో వై యజ్ఞస్య పునరాలమ్భం విద్వా న్యజతే తమభి నివర్తతే [17]యజ్ఞో బభూవ స ఆ బభూవేత్యాహైష వై యజ్ఞస్య పునరాలమ్భ స్తేనైవైనం పున రాలభతే[18]ఽనవరుద్ధా వా ఏతస్య విరాడ్య ఆహితాగ్ని స్స న్సభః వశవః ఖలు వై బ్రాహ్మణస్య సభే[19]ష్ట్వా ప్రాఙ్ఉత్క్రమ్య బ్రూయా ద్గోమాగం అగ్నే ఽవిమాగం అశ్వీ యజ్ఞ ఇత్యవ సభాగం రున్ధే ప్ర సహస్రం పశూ నాప్నో త్యాఽస్య ప్రజాయాం వాజీ జాయతే ॥౩॥

(యః సమాశిషం గృహపత ఇత్యాహాముష్మై జ్యోతిష్మతీ మితి బ్రూయా ద్యస్య పుత్రో వ్రతమేవ

ఖలు వై చతుర్విగ్ంశతి శ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే సప్తమప్రపాఠకే ద్వితీయోఽనువాకః।

వేదార్థదీపిక

అవతారిక: పంచమానువాకమునందు అప్యాయనాది మంత్రములు వ్యాఖ్యానింపఁబడినవి. ఈ షష్ఠానువాకమునందు ఉపస్థానాది మంత్రములు వ్యాఖ్యానింపఁబడుచున్నవి. (ఉపస్థానాది మంత్రములు షష్ఠ ప్రపాఠకమునందలి షష్ఠానువాకము నందు వివరింపఁబడినవి.)

1. **అర్థము:** (హే ఆహవనీయ!=ఓ ఆహవనీయాగ్నీ! త్వత్ప్రసాదాత్=నీ యనుగ్రహమువలన, వయమ్=మేము,) సువః=మొదటిదైన ఫలభోగ స్థానమును, అగన్మ=పొందితిమి. (తతః=పిమ్మట,) సువః=(మోక్షద్వార మైన రెండవది యగు) ఆదిత్య లోకమును. అగన్మ=పొందితిమి, ఇతి అహ=అని(యజమానుఁడు)పలికెను. (అతః=ఇందువలన, సః=ఆ యజమానుఁడు) సువర్గం లోకమేవ=స్వర్గలోకమునే, ఏతి=పొందుచున్నాఁడు.

తాత్పర్యము: "ఓ ఆహవనీయాగ్నీ! నీ యనుగ్రహమువలన పుత్రపౌత్రాదులతో కూడిన మేము మొదటిదైన ఫలభోగ స్థానమును, పిమ్మట రెండవది యగు మోక్షద్వారమైన ఆదిత్య లోకమును పొందితిమి" అని చెప్పుటచే ఆ యజమానుఁడు స్వర్గలోకమునే పొందుచున్నాఁడు. ("సువ రగన్మ" అను ద్విరుక్తిచే ఆదరము ప్రతీయ మాన మగుటవలన నిశ్చయముగ స్వర్గమును పొందునను అర్థము వ్యక్తమగుచున్నది.)

2. **అర్థము:** (హే ఆహవనీయాగ్నీ!=ఓ ఆహవనీయాగ్నీ!, తదర్థమ్=అందుకొఱకు, అహమ్=నేను, తే=నీయొక్క, సందృశః=కటాక్షమునుండి, మా ఛిత్సి=విచ్ఛిత్తిని పొందలేదు. తే=నీకొఱకు, యత్ తపః=ఏ తపస్సు, (అస్మాభిః=మాచేత, అనుష్ఠాస్యతే=అనుష్ఠింపఁబడునో!) తస్మై=ఆ తపస్సుకొఱకు, తే=నీయుక్క, (అను గ్రహేణ=అనుగ్రహముచేత,) మా అ వృక్షి=అంతటను విచ్ఛిన్నుఁడను కాను, ఇతి అహ=అని ("సంధృ శస్తే" ఇత్యాది మంత్రము) చెప్పెను. ఏతత్=ఇది, యథాయజు రేవ=మంత్రోక్త ప్రకారముగానే, (భవిష్యతి=కాఁగలదు.)

తాత్పర్యము: ఓ ఆహవనీయాగ్నీ! పూర్వోక్తవిధముగ స్వర్గమును పొందుటకై నీ కటాక్షమునుండి విచ్ఛిత్తిని పొందలేదు. నీకొఱకు మేము చేయఁబోవు తపస్సుకొఱకు నీయనుగ్రహమువలన ఏమాత్రము విచ్ఛిన్నుఁడను కాను, అని 'సందృశ స్తే' ఇత్యాది మంత్రమునందు చెప్పబడిన విధముగ కాఁగలదు.

3. **అర్థము:** (హే ఆదిత్య!=ఓ సూర్యదేవా! త్వమ్=నీవు,) సుభూః=సుభువువు, అసి=అగుచున్నావు. రశ్మీనామ్= కిరణములతో కూడియుండు చంద్రాది గ్రహములలో, శ్రేష్ఠః=శ్రేష్ఠుఁడవు, ఆయుర్ధాః=ఆయువును స్థాపించు వాఁడవును, అసి=అగుచున్నావు. మే=నాయందు, (సప్తమ్యర్థే షష్ఠీ.) ఆయుః=ఆయువును, ధేహి= ఉంచుము. ఇత్యాహ=ఈ మంత్రపాఠముచే, (యజమానః=యజమానుఁడు,) ఏతామ్+ఆశిష మేవ=ఈ యాశీస్సునే, ఆశాస్తే=కోరుచున్నాఁడు.

తాత్పర్యము: ఓ సూర్యదేవా! నీవు బాగుగ నుంటున్నవాఁడవు, కాంతిమంతములైన చంద్రాది గ్రహములలో శ్రేష్ఠుఁడవు, ఆయువును స్థాపించువాఁడవును కావున నన్నాయుష్మంతుని చేయుము, అను నర్థము కల ఈ మంత్ర పాఠముచే చెప్పఁబడిన యాశీస్సునే యజమానుఁడు కోరుచున్నాఁడు.

4. అర్థము: యః=ఏ యజ్ఞకర్త, విష్ణుక్రమాన్=విష్ణుపాద న్యాసములను, క్రమతే=దాఁటుచున్నాఁడో!, (=అనుసరించుచున్నాఁడో!,) ఏషః వా=ఇతఁడే, అస్మాల్లోకాత్=ఈ లోకమునుండి, ప్రచ్యవతే=ప్రకృష్టముగ జారిపోవుచున్నాఁడు. విష్ణుక్రమాః=విష్ణుపాద విక్షేపములు, సువర్గాయ లోకాయ=స్వర్గలోకముకొఱకు, క్రమ్యన్తే హి=అనుసరించఁబడుచున్నవి కదా! బ్రహ్మవాదినః=బ్రహ్మజ్ఞులు, వదన్తి=(ఈ విధముగ) చెప్పుచున్నారు. "యః=ఏ యజమానుఁడు, భ్రాతృవ్యస్య=శత్రువుయొక్క, (నిష్కాసేన=తొలఁగింపుచేత,) ఇమాన్ లోకాన్=ఈ లోకములను, సంవిద్య=బాగుగ పొంది, పునః=(విష్ణుక్రమములచే స్వర్గారోహణానంతరము,) మఱల, ఇమం లోకమ్=ఈ లోకమును గూర్చి, అవరోహతి=తిరిగి వచ్చుచున్నాఁడో, సత్వై=అతఁడే, విష్ణుక్రమాన్=విష్ణు పాద న్యాసములను, క్రమేత=అనుసరించినవాఁ డగును.

తాత్పర్యము: (యజ్ఞకర్త అవభృథ దినమున వేదియందు విష్ణుపాద న్యాసములుగా పేర్కొనఁబడిన వానియందు వరుసగా అడుగులు వేసికొనుచు ముందుకు నడవవలయునని పూర్వము చెప్పఁబడినది. ఆ విధముగ చేసినచో యజమానునకు స్వర్గము లభించును. కనుక విష్ణుక్రమములు స్వర్గ సాధనములైనవి.) విష్ణుక్రమముల (పాదన్యాసముల) యందు అడుగుల నుంచుచు నడచిన యజమానుఁడు స్వర్గమును పొందును గాన, అతనికీ లోకమునుండి చ్యుతి యేర్పడుచున్నది. ఆ ప్రచ్యుతి పరిహారమునకై బ్రహ్మజ్ఞులు ఈ విధముగ ఉపాయము నాలోచించిరి. "ఇద మహ" మిత్యాది మంత్రపాఠముచే వైరి నిష్కాసము చేసి యీ లోకములను పొందిన యజమానుఁడు విష్ణుక్రమములందు తన యడుగుల నుంచి నడచుటచే స్వర్గము నొందిన యనంతరము మఱల ఈ లోకమునకు వచ్చినచో, ఆ యజమానుఁడే విష్ణుక్రమములందు చతురుఁడని భావము. ("ఇద మహ" మిత్యాది వైరినిష్కాస మంత్రమును వ్యాఖ్యానించుటకు ముందు తత్ప్రశంస యిచట చేయఁబడినది.)

5. అర్థము: "అహమ్=నేను, అముం భ్రాతృవ్యమ్=ఈ శత్రువును, అభ్యః దిగ్భ్యః=ఈ దిక్కులనుండి, అస్యై దివః=ఈ ద్యులోకమునుండి, (పంచమ్యర్థే చతుర్థీ) (ఇదం నిర్భజామి=శీఘ్రముగ తొలఁగించుచున్నాను.") ఇతి యదాహ=అని "ఇద మహ నమము" మిత్యాది మంత్ర మేది చెప్పెనో, ఏష వా=ఈ మంత్రపాఠమే, అస్య లోకస్య=ఈ భూలోకమునకు సంబంధించిన, ప్రత్యవరోహః=ప్రత్యవరోహము. (స్వర్గమునుండి భూలోకమునకు వచ్చుట. (అనేన=ఈ మంత్రపాఠముచే, యజమానః=యజమానుఁడు,) ఇమాన్ లోకాన్=ఈ లోకములను, భ్రాతృవ్యస్య=శత్రువుయొక్క, (నిష్కాసేన=తొలఁగించుటచేత,) సంవిద్య=బాగుగ పొంది, పునః=(విష్ణుక్రమములచే స్వర్గమును పొందిన యనంతరము,) మఱల, ఇమం లోకమ్=ఈ లోకమునుగూర్చి, ప్రత్యవరోహతి=తిరిగి వచ్చుచున్నాఁడు.

తాత్పర్యము: 'నేను నాశత్రువులను ఈ దిక్కులనుండి యీ ద్యులోకమునుండి శీఘ్రముగ తొలఁగించుచున్నాను' అనెడి అర్థము గల 'ఇద మహ' మిత్యాది మంత్రము ఏది చెప్పెనో, ఈ మంత్రపాఠమే ఈ లోకమునకు సంబంధించిన ప్రత్యవరోహము. యజమానుడు ఈ మంత్రపాఠముచేత శత్రు నిష్కాసముచే ఈ లోకములను పొంది విష్ణుక్రమములచే స్వర్గమును పొందిన యనంతరము మఱల ఈ లోకమునకు వచ్చుచున్నాఁడు.

6. అర్థము: (అహమ్=నేను,) జ్యోతిషా=సూర్య తేజస్సుతో, సమభూవమ్=కలిసికొందును గాక, ఇతి=అని, ఆహ=చెప్పుటచే, (యజమానః=యజమానుఁడు) అస్మిన్ లోకే=ఈ లోకమునందు, ప్రతి తిష్ఠత్యేవ=నిశ్చయముగ ప్రతిష్ఠావంతుఁడగుచున్నాఁడు.

తాత్పర్యము: నేను (ఏతల్లోక ప్రాపకమైన) సూర్యతేజస్సుతో కలిసికొందును గాక యని కోరుటచే యజమానుఁడు నిశ్చయముగ ఈ లోకమునందు ప్రతిష్ఠను పొందును.

7. అర్థము: (అహమ్=నేను,) ఐన్ద్రీమ్=ఆదిత్య సంబంధమైన, అవృతమను=అంతటను తిరుగుట ననుసరించి, అవ ర్తే= అంతటను తిరుగుచున్నాను, ఇతి=అని, ఆహ='ఐన్ద్రీ' మిత్యాది మంత్రము చెప్పెను. అసౌ ఆదిత్యః=ఈ యాదిత్యుఁడు, ఇన్ద్రః వా=('ఇది'=పరమైశ్వర్యే, అను ధాతువువలన ఇంద్రశబ్ద మేర్పడుటచే ఇంద్రుఁడే,) ఐశ్వర్యము కలవాఁడే. తస్యైవ=ఆ యాదిత్యునియొక్కయే, అవృతమను=తిరుగుట ననుసరించి, పర్యా వర్తతే=(యజమానుఁడు,) అంతటను తిరుగవలెను.

తాత్పర్యము: (షష్ఠప్రపాఠకమునందలి షష్ఠానువాకమునందు సూర్యోపస్థాన సందర్భమున యజమానుఁడు సూర్యుని నమస్కరించుచు కుడివైపునకు తిరుగవలెనని చెప్పఁబడినది. ఆ విషయ మిచట వివరింపఁబడుచున్నది. ఇన్ద్రశబ్దమునకు వ్యుత్పత్త్యర్థము ననుసరించి ఆదిత్యుఁడను నర్థము పూర్వము చెప్పఁబడినది. కావున ఐన్ద్రీ మనఁగా ఆదిత్య సంబంధ మైనదని యర్థము స్పష్టమగుచున్నది.) 'ఆదిత్య సంబంధమయిన ఆవృతము(=తిరుగుట) ననుసరించి తిరుగుచున్నాను' అని చెప్పుటచేతను ఈ యాదిత్యుఁడు ఇన్ద్రశబ్ద వాచ్యుఁడే కావునను, యజమానుఁడు ఆదిత్యుని ఆవృతము ననుసరించియే తిరుగుచున్నవాఁ డగుచున్నాఁడు.

8. అర్థము: దక్షిణా=ప్రదక్షిణముగా, (కుడివైపుగా) పర్యావర్తతే=తిరుగవలెను. (ఏవం కృతం చేత్=ఇట్లు చేసినచో, యజమానః=యజమానుఁడు,) స్వం వీర్య మన్వేవ=తన సామర్థ్యాతిశయము ననుసరించియే, పర్యావర్తతే= అంతటను తిరిగినవాఁ డగుచున్నాఁడు. తస్మాత్=అందువలన, ఆత్మనః=తనయొక్క, దక్షిణః అర్ధః=కుడి భాగము సగము, వీర్యావత్తరః అర్ధః=సామర్థ్యముకల అర్ధభాగము. అథో=అందువలన, ఆదిత్యస్యైవ=ఆదిత్యునియొక్కయే, ఆవృతమను=ప్రదక్షిణము ననుసరించి, పర్యావర్తతే=ప్రదక్షిణము చేయవలెను.

తాత్పర్యము: అతఁడు ప్రదక్షిణముగ (=కుడివైపుగ) తిరుగవలెను. అట్లు తిరిగినచో తన సామర్థ్యాతిశయము ననుసరించియే తిరిగినవాఁడగుచున్నాఁడు. అందువలన పురుషునియొక్క కుడి సగము భాగము సామర్థ్యాతిశయము గల భాగము. అందువలన ఆదిత్యుని ప్రదక్షిణము ననుసరించియే ప్రదక్షిణముగ తిరుగవలెను. (ఇచట ఆదిత్యుఁడు మేరుపర్వతమునకు చుట్టూ ప్రదక్షిణముగ తిరుగుచున్నాఁడను నర్థము గ్రాహ్య మగుచున్నది.)

9. అర్థము: అహమ్=నేను, ప్రజయా=సంతానముతో, సం భూయాసమ్=కలిసికొందునుగాక. ప్రజా=సంతానము, మయా=నాతో, సం భూయాత్=కలిసికొనుఁగాక, ఇతి=అని, ఆహ=('సమహం ప్రజయా' ఇత్యాది మంత్రము,) చెప్పెను. (అనేన=ఈ మంత్రపాఠముచే, యజమానః=యజమానుఁడు,) ఏతామ్=ఈ పూర్వోక్తమైన దానిని, ఆశిషమేవ=ఆశీస్సుగానే, ఆశాస్తే=కోరుచున్నాఁడు.

తాత్పర్యము: నేను సంతానముతోఁడను, సంతానము నాతోడను కలిసికొనుఁగాక, అని యనుటచే దీనిని ఆశీస్సును గానే కోరెనని భావము. (తనకు ధనసమృద్ధి కావలెనని యజమానుని ప్రార్థన.)

10. అర్థము: (హే అగ్నే!=ఓ యగ్నీ!) సమిద్ధః=సమిధచే దీపించిన, (త్వమ్=నీవు,) మే=నాకొఱకు, సం దీదిహి=బాగుగ ప్రకాశించుము. హే అగ్నే!=ఓ యగ్నీ! (త్వదనుగ్రహేణ=నీ యనుగ్రహముచేత,) తే=నీకు, సమేద్ధా=బాగుగ దీపకుఁడనైన, అహమపి=నేనుఁగూడ, దీద్యాసమ్=ప్రకాశింతును, ఇతి=అని, ఆహ=చెప్పుటచే, ఏతత్=ఇది, యథాయజురేవ=మంత్రోక్త ప్రకారముగానే, (భవిష్యతి=కాఁగలదు.)

తాత్పర్యము: ఓ యగ్నీ! సమిధచే ప్రజ్వలించిన నీవు నాకై ప్రకాశించుము. నిన్ను దీపింపఁజేసిన నేను గూడ నీ యనుగ్రహముచే ప్రకాశింతును, అని చెప్పుటచే మంత్రోక్త ప్రకారముగానే యిది కాఁగలదు. (ఇచట సమిదాధాన మంత్రార్థము స్పష్టీకరించఁబడినది.)

11. అర్థము: (హే ఆహవనీయాగ్నే!=ఓ ఆహవనీయాగ్నీ!, త్వత్ప్రసాదాత్=నీ యనుగ్రహమువలన) యజ్ఞః=(ఈ) యజ్ఞము, వసుమాన్=ధనము కలది. (అహమపి=నేనుఁగూడ,) వసీయాన్=(ధనవంతులలో,) అధిక ధనము కలవాఁడను, భూయాసమ్=అగుదును గాక, ఇతి=అని, ఆహ='వసుమా' నిత్యాది మంత్రము చెప్పెను. (అనేన=ఈ మంత్రపాఠముచేత, యజమానః=యజమానుఁడు,) ఏతామ్=దీనిని, ఆశిషమేవ=ఆశీస్సునుగానే, ఆశాస్తే=కోరుచున్నాఁడు.

తాత్పర్యము: ఓ ఆహవనీయాగ్నీ! నీ యనుగ్రహమువలన ఈ యజ్ఞము ధనము కలది యగుచున్నది. నేనుంగూడ ధన వంతులలో నధికుఁడ నగుదును గాక, యని చెప్పుటచే యజమానుఁడు ఈ ప్రార్థనను ఆశీస్సునుగానే కోరు చున్నాఁడు. (ఇది ఆహవనీయోపస్థాన మంత్రమునకు వ్యాఖ్యానము.)

12. అర్థము: (యజమానేన=యజమానునిచేత) గార్హపత్యస్య=గార్హపత్యాగ్నియొక్క, అన్తే=సన్నిధియందు, బహు=బహు విధమైన, మిశ్రమివ=పాప మిశ్రితమైనదివలె, (హోమాది కర్మ=హోమాది కర్మ,) చర్యతే వా=ఆచరింపఁ బడుచున్నది కదా!, (తన్నివృత్త్యర్థమ్=ఆ పాప నివృత్తికై,) అగ్ని పావమానీభ్యామ్=అగ్ని పవమాన దేవ తాకములైన "అగ్న ఆయూగ్ంషి" త్యాది ఋక్కులచే, గార్హపత్యమ్=గార్హపత్యాగ్నిని, ఉపతిష్ఠతే=సేవిం చవలెను. (ఏవం కృతం చేత్=ఇట్లు చేయఁబడినచో, యజమానః=యజమానుఁడు,) అగ్నిమ్=గార్హపత్యా గ్నిని, పునాత్యేవ=నిశ్చయముగ పవిత్రుని చేసినవాఁ డగుచున్నాఁడు. ప్రతిష్ఠిత్యై=ప్రతిష్ఠకొఱకు, ద్వా భ్యామ్=అగ్ని పవమాన దేవతాకములయిన పూర్వోక్తములైన రెండు ఋక్కులచే, ఆత్మానమ్=తనను, పునీతే=పవిత్రుని చేసికొనుచున్నాఁడు.

తాత్పర్యము: గృహస్థుఁ డెల్లప్పుడు గార్హపత్యాగ్నిని సేవించుచుండును. అట్టి స్థితిలో ఆ గార్హపత్యాగ్ని సన్నిధియందు బహువిధ జన్తుపాతకము సంభవించుచుండును, అందువలన గార్హపత్యాగ్ని సన్నిధియందు చేయు హోమాది కర్మ పాప మిశ్రితమైనదివలె నుండును. తద్దోష పరిహారమునకై శుద్ధిహేతువులును, అగ్ని పవమాన దేవతాక ములు నయిన "అగ్న ఆయూగ్ంషి" త్యాది ఋక్కులచే యజ్ఞకర్త గార్హపత్యాగ్నిని సేవించవలెను. అట్లు సేవించిన యజమానుఁడు గార్హపత్యాగ్నిని పరిశుద్ధుని జేసినవాఁ డగును. మఱియు ప్రతిష్ఠకై ఆ రెండు ఋక్కులచే తనను పునీతుని జేసికొనినవాఁ డగును.

13. అర్థము: ఈ మంత్రబ్రాహ్మణము స్పష్టార్థ మిచట ఉదాహృతమైనది. ఇది పూర్వప్రపాఠకమునందు వ్యాఖ్యాత మైనది.

14. అర్థము: యో వై=ఏ యజమానుఁడైతే, యజ్ఞమ్=యజ్ఞమును, ప్రయుజ్య=అనుష్ఠించి, న విముఞ్చతి=విమోకము (ఉద్వాసనము)చేయుట లేదో, స వై=ఆ యజమానుఁడే, అప్రతిష్ఠానః=ప్రతిష్ఠారహితుఁడు, భవతి=అగు చున్నాఁడు.

(హే యజ్ఞ!=ఓ యజ్ఞమా! యః=ఏ,) కః=ప్రజాపతి, త్వా=నిన్ను, యునక్తి=యోజన చేసెనో, సః=ఆ ప్రజాపతి, త్వా=నిన్ను, వి ముఞ్చతు=విమోకము చేయుఁగాక, ఇతి=అని, ఆహ=('కస్త్వా యునక్తి' త్యాది మంత్రము,) చెప్పెను. (అతః=ఇందువలన,) ప్రజాపతి ర్వై=ప్రజాపతియే, కః=కింశబ్ద వాచ్యుఁడు. (యజమానః=యజమానుఁడు,) ప్రజాపతినైవ=ప్రజాపతిచేతనే, ఇమమ్=ఈ యజ్ఞమును, యునక్తి= యోజన (అనుష్ఠానము) చేయుచున్నాఁడు. ప్రతిష్ఠిత్యై=ప్రతిష్ఠకొఱకు, ప్రజాపతినా=ప్రజాపతిచేత, వి ము ఞ్చతి=విమోకనము చేయుచున్నాఁడు.

తాత్పర్యము: యజ్ఞము ననుష్ఠించి దానికి విమోచనము చేయని యజమానుఁడు ప్రతిష్ఠా రహితుఁ డగును. ఓ యజ్ఞమా! నిన్ను ఏ ప్రజాపతి ప్రారంభింపఁజేసెనో, ఆ ప్రజాపతి నిన్ను విమోచనము చేయుఁగాక, అని కస్త్వా యునక్తీత్యాది మంత్రము చెప్పును. ప్రజాపతియే కింశబ్ద వాచ్యుఁడు. కావున యజమానుఁడు ప్రజాపతి వలన యజ్ఞము నారంభించి ప్రతిష్ఠకై ప్రజాపతిచేత నుద్వాసనము చెప్పుచున్నాఁడు.

15 అర్థము: అవిసృష్టమ్=విమోచనము చేయని, వ్రతమేవ=(యజ్ఞ)వ్రతమే, (యజమానమ్=యజమానుని,) ప్రదహః= ఎక్కువగ దహించుటకు, ఈశ్వరమ్=సమర్థ మైనది. "వ్రతపతే=వ్రతమునకు పతివైన, హే అగ్నే!=ఓ యగ్నీ!, వ్రతమ్=యజ్ఞవ్రతమును, అచరిషమ్=ఆచరించితిని, ఇతి=అని, ఆహ=('అగ్నే వ్రతపతే' ఇత్యాది మం త్రము,)చెప్పెను. ఏషః ఏవ=ఈ మంత్రపాఠమే, వ్రతమ్=యజ్ఞవ్రతమును, శాన్త్యై=శాంతికొఱకు, అప్రదా హాయ=దాహాభావముకొఱకును, వి సృజతే=విమోచనము చేయుచున్నది.

తాత్పర్యము: ఉద్వాసనము చెప్పని యజ్ఞకర్మయే యజమానుని దహింపఁ జేయుటకు సమర్థమగుచున్నది. 'అగ్నే వ్రత పతే' ఇత్యాది మంత్రపాఠమే శాంతి కలిగి దహింపఁజేయకుండుటకై యజ్ఞకర్మ నుద్వాసనము చేయుచున్నది.

16. అర్థము: యజ్ఞః=యజ్ఞము, పరాఙ్=విముఖమే యై, ఏతి=పోవుచున్నది. న నివర్తతే=తిరిగి వచ్చుట లేదు. యో వై పునః=ఏ యజమానుఁడైతే, యజ్ఞస్య=యజ్ఞము యొక్క, పున రాలమ్భమ్=తిరిగివచ్చు (వద్ధతిని) టను, విద్వాన్=తెలిసికొనినవాఁడై, యజతే=యాగము చేయుచున్నాఁడో, తమ్ అభి=ఆ యజమానున కభిముఖముగ, నివర్తతే=మరలుచున్నది.

తాత్పర్యము: యజ్ఞముయొక్క పున రావృత్తిని తెలియని యజమానునకు యజ్ఞము విముఖమై యై పున రావృత్త మగుట లేదు. యజ్ఞముయొక్క పున రారంభమును తెలిసినవాఁడై యజ్ఞము ననుష్ఠించిన యజమానున కభిముఖము గనే యజ్ఞము పున రావృత్త మగుచున్నది.

17. అర్థము: యజ్ఞః=(ఇప్పుడాచరించిన) యజ్ఞము, (సంపూర్ణః=సంపూర్ణము,) బభూవ=అయినది. సః=ఆ యజ్ఞము, ఆ బభూవ=పున రావృత్తమగుఁగాక. (లోడర్థే లిట్) ఇతి=అని, ఆహ='యజ్ఞో బభూ' వే త్యాది మంత్రము చెప్పెను. ఏషః వై=ఈ మంత్రపాఠమే, యజ్ఞస్య=యజ్ఞముయొక్క, పున రాలమ్భః=పున రారంభము. (=యజ్ఞమును మఱల అవృత్తము చేయుచున్నది.) తేనైవ=ఆ మంత్రపాఠముచేతనే, (యజమానః=యజమానుఁడు,) ఏనమ్=ఈ యజ్ఞమును, పున రాలభతే=మఱల అనుష్ఠించుచున్నాఁడు.

తాత్పర్యము: "యజ్ఞో బభూవ స ఆ బభూవ" ఇత్యాది మంత్రపాఠమే యజ్ఞముయొక్క పునరావృత్తిదాయకము. ఆ మంత్రపాఠముచేతనే యజమానుఁడు యజ్ఞమును పునరావృత్తము చేయఁగలుగుచున్నాఁడు.

18. అర్థము: యః=ఏ యజమానుఁడు, ఆహితాగ్నిస్సన్=ఆహితాగ్నియగుచు, అసభః=సభలేనివాఁడు, (భవేత్=అగునో,) ఏతస్య=ఈ యజమానునకు, విరాట్=విశేషముగ ప్రకాశించుచున్న సభ, అనవరుద్ధా వా=(ఒకప్పుడును,) స్వాధీనము కానిదియే, (భవేత్=అగును.) బ్రాహ్మణస్య=యజ్ఞకర్తయగు బ్రాహ్మణునియొక్క, సభా=సభ, పశవః ఖలు వై=పశువులే కదా!

తాత్పర్యము: యజమానుఁడు ఆహితాగ్నియై యుండియు యాగకాలమునందు సభారహితుఁడైనచో అతనికి లోకవ్యవహార కాలమునందు కూడ సభ కలుగనేరదు. యజ్ఞకర్తయగు బ్రాహ్మణుని సభ రాజసభ వంటిది కాక, సామాన్య మనుష్యులు, పండితులు, పశువులతో కూడియుండునది. అతనికి యాగకాలము నందిట్టి సభ (అనఁగా యాగమును చూచుటకై వచ్చియుండు మనుష్యాదులతో కూడియుండు సభ) లేనిచో, అతనికి లోకవ్యవహార కాలమునందు కూడ సభ సంభవించదు, అని భావము.

19. అర్థము: (యజమానః=యజమానుఁడు) ఇష్ట్వా=యాగము చేసి, ప్రాఙ్=తూర్పుదిశగా, ఉత్క్రమ్య=జరిగి, హే అగ్నే!=ఓ యగ్నీ! యజ్ఞః=(పునరనుష్ఠానమునకై కోరబడుచున్న) యజ్ఞము, గోమాన్=బహు గోవులు కలది, అవిమాన్=అనేకములయిన గొఱ్ఱెలు కలదియు, అశ్వీ=బహ్వశ్వములు కలదియు, భూయాత్=అగుఁగాక, ఇతి=అని, బ్రూయాత్=పలుకవలెను. (సః=అట్లు ప్రార్థించిన యజమానుఁడు,) సభామ్=సభను, అవరున్ధే=పొందుచున్నాఁడు. సహస్రమ్=సహస్రసంఖ్యాకముగ, పశూన్=పశువులను, ప్రాప్నోతి=పొందుచున్నాఁడు. అస్య=ఈ యజమానునియొక్క, ప్రజాయామ్=సంతానమునందు, వాజీ=అన్నసమృద్ధికల పుత్రుఁడు, ఆ జాయతే=అంతటను పుట్టుచున్నాఁడు.

తాత్పర్యము: యజ్ఞకర్త యాగము చేసి తూర్పుదిశగా ముందుకు జరిగి, "ఓ యగ్నీ! పున రనుష్ఠానమునకై కోరఁబడు చున్న యజ్ఞము, బహుగోవులు అనేకములయిన గొఱ్ఱెలు అశ్వములు కలది యగుఁగాక" అని పలుకవలెను. అట్లు ప్రార్థించిన (పలికిన) యజమానుఁడు సభావంతుఁడగును. అతనికి సహస్ర సంఖ్యాకముగ పశువులు లభించును. అతని సంతానము అన్నసమృద్ధి కలది యగును. ('గోమాన్' అను మతుప్ప్రత్యయము "భూమనిందాప్రశంసాసు", అను సూత్రముచే బాహుల్యార్థకము.)

షష్ఠానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే సప్తమ ప్రపాఠకే సప్తమోఽనువాకః ।

మూలము: [1]దేవ సవితః ప్ర సువ యజ్ఞం ప్ర సువ యజ్ఞపతిం భగాయ దివ్యో గన్ధర్వః । కేతపూః కేతం నః పునాతు వాచస్పతి ర్వాచ మద్య స్వదాతి నః । [2]ఇన్ద్రస్య వజ్రోఽసి వార్త్రఘ్న స్త్వయాఽయం వృత్రం వధ్యాత్ । [3]వాజస్య ను ప్రసవే మాతరం మహీ మదితిం నామ వచసా కరామహే । యస్యా మిదం విశ్వం భువన మావివేశ తస్యాం నో దేవ స్సవితా ధర్మ సావిషత్ । [4]అప్సు (౧)అన్త రమృత మప్సు భేషజ మపా ముత ప్రశస్తిష్వశ్వా భవథ వాజినః । [5]వాయు ర్వా త్వా మనుర్వా త్వా గన్ధర్వా స్సప్తవిగ్ంశతిః । తే అగ్రే అశ్వ మా యుఞ్జన్తే అస్మిన్జవ మా దధుః । [6]అపాంనపా దాశుహేమన్య ఊర్మిః కకుద్మా న్ప్రతూర్తి ర్వాజసాతమ స్తేనాయం వాజగ్ం సేత్ । [7]విష్ణోః క్రమో ఽసి విష్ణోః క్రాన్త మసి విష్ణో ర్విక్రాన్త మస్య[8]ఙ్కౌ న్యఙ్కా వభితో రథం యౌ ధ్వాన్తం వాతాగ్ర మను సంచరన్తౌ దూరేహేతి రిన్ద్రియావా న్పతత్రీ తే నో ఽగ్నయః పప్రయః పారయన్తు ॥ ౭ ॥

(అప్స్వన్యఙ్కౌ పఞ్చదశ చ) ।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే సప్తమప్రపాఠకే సప్తమోఽనువాకః ।

వేదార్థదీపిక

అవతారిక :_ ఈయనువాకమునుండి వాజపేయ యాగ విషయకమంత్రములు చెప్పఁబడుచున్నవి.

1. అర్థము: హే సవితః దేవః=ప్రేరకుఁడవైన ఓ దేవా! యజ్ఞమ్=యజ్ఞమును, ప్ర సువ=ప్రవర్తింపఁ జేయుము. యజ్ఞపతిమ్=యజమానుని, భగాయ=అనుష్ఠాన రూపమైన ఐశ్వర్యముకొఱకు, ప్ర సువ=ప్రవర్తింపఁ జేయుము. కేతపూః=ప్రాణుల విజ్ఞానములను శోధన చేయునట్టి, దివ్యః గన్ధర్వః=ద్యులోకవాసియగు

గంధర్వుఁడు, నః=మాయొక్క, కేతమ్=విజ్ఞానమును, పునాతు=శోధన చేయుఁగాక. వాచస్పతిః (చ)=వాచస్పతియు, అద్య=ఈ కర్మయందు, నః=మమ్ము, వాచమ్=వాజపేయ మంత్రరూప వాక్కును, స్వదాతి=(యథావిధిగ) పఠింపజేయుఁగాక. (ఇది అధ్వర్యుని ప్రార్థన.)

తాత్పర్యము: ప్రేరకుఁడవైన ఓ దేవా! యజ్ఞమును, అనుష్ఠానరూపమైన ఐశ్వర్యముకొఱకు యజ్ఞపతిని ప్రవర్తింపఁజేయుము. సవితృదేవుని యనుగ్రహమువలన ప్రాణుల విజ్ఞానములను శోధన చేయునట్టి ద్యులోకవాసి యగు గంధర్వుఁడు మా విజ్ఞానములను శోధన చేయుఁగాక. వాచస్పతియు సవితృ దేవునిచే అనుజ్ఞాతుఁడై మాచే వాజపేయ మంత్రముల నీ కర్మయందు యథావిధిగ పఠింపఁజేయుఁగాక. (అధ్వర్యుఁడు సావిత్ర హోమమును ఈ మంత్రమును పఠించుచుఁ జేయవలెను.)

2. అర్థము: (హే రథ!=ఓ రథమా! త్వమ్=నీవు,) వార్త్రఘ్నః=శత్రుఘాతియగు, ఇన్ద్రస్య=ఇంద్రునియొక్క, వజ్రః=వజ్రాయుధము, అసి=అగుచున్నావు. త్వయా=నీ (సహాయము) చే, అయమ్=ఈ యజమానుఁడు, వృత్రమ్=శత్రువును, వధ్యాత్=వధించుఁగాక. (ఇట వృత్ర పదము శత్రు సామాన్య వాచకము.)

తాత్పర్యము: ఓ రథమా! నీవు శత్రుఘాతియగు నింద్రుని వజ్రాయుధ మగుచున్నావు. ఈ యజమానుఁడు నీ సహాయముచే శత్రువును వధించును గాక. (అధ్వర్యుఁడు హవిరాది పదార్థములను వహించునట్టి రథమును వేది యొక్క అంచు దగ్గఱకు తీసికొని రావలెను.)

3. అర్థము: వాజస్య ను=అన్నమునకే, ప్రసవే=ఉత్పత్తి నిమిత్తము, మాతరమ్=అన్నమునకు నిర్మాత్రియగు, మహీమ్=వేదిరూప భూమిని, అదితిం నామ=అఖండమైనదిగానే, వచసా=స్తుతిచే, కరామహే=చేయుచున్నాము. యస్యామ్=ఏ వేదిరూప భూమియందు, ఇదమ్=ఈ, విశ్వం భువనమ్=సమస్తమైన భూతజాతము, ఆ వివేశ=ప్రవేశించి యున్నదో, తస్యామ్=ఆ వేదిరూప పృథివియందు, సవితా దేవః=ప్రేరకుఁడగు అంతర్యామి, నః=మాయొక్క, ధర్మ=ధారణమును, (=ఉనికిని,) సావిషత్=ఆమోదించుఁగాక.

తాత్పర్యము: అన్నముయొక్క ఉత్పత్తి నిమిత్తము అన్న నిర్మాత్రియగు వేదిరూప పృథివిని అఖండమైనదిగా స్తుతిచే చేయుచున్నాము. సమస్త భూతజాతము ఉండుటకు నిలయమైన యీ వేదిరూప భూమియందు మేము ఉండుటకు సవితృదేవుఁ డనుజ్ఞ యిచ్చుఁగాక. (అధ్వర్యుఁ డీ మంత్రము చెప్పుచు దక్షిణవేది శ్రోణ్యంతమున రథవాహనమునుండి దింపఁబడిన రథమును ప్రదక్షిణముగ సౌమిక వేది మధ్యమునకు తీసికొని రావలెను.)

4. అర్థము: వాజినః=అన్నము కలిగిన, హే అశ్వాః=ఓ అశ్వములారా!, అప్సు=నీటియందు, అన్తః=లోపల, అమృతమ్=అమృతము, (అస్తి=కలదు.) అప్సు=నీటియందు, భేషజమ్=ఔషధము, అస్తి=కలదు. (ఇతి=అనెడి,) అపామ్=ఉదకముల సంబంధమైనవియు, ఉత ప్రశస్తిషు=తత్సదృశము లైనవియునగు ప్రశంసలయందు, (యూయమ్=మీరు, సంబద్ధాః=సంబంధము కలవారు.) భవథ=అగుఁడు.

తాత్పర్యము: (నీటిమధ్యమునందు అపమృత్యు నివారకము, రోగ నివారకమునైన సారము కలదని ప్రసిద్ధి.) ఓ యన్నవంతములైన అశ్వములారా! ఉదకములలో అపమృత్యు నివారకమైన అమృతము, రోగ నివారకమైన ఔషధము కలదనెడి ప్రశంసయందుగాని, తత్సదృశములైన గుణవత్వ ప్రశంసలయందుగాని మీరు సంబంధము కలిగియుండుఁడు. (అధ్వర్యుఁడు అశ్వముల శరీరములను నీటియందు ప్రక్షాళనము చేయవలెను.)

5. అర్థము: (హే అశ్వ!=ఓ అశ్వమా!) వాయుర్వా=వాయువును, మనుర్వా=మనువును, గన్ధర్వాః=(పంచవింశతి) గంధర్వులు, (ఆహత్య=కలిసి=మొత్తము) సప్తవింశతిః=ఆ యిరువదియేడుగురు. అగ్రే=(నాకంటె) ముందుగానే, త్వా=నిన్ను, ఆ యుఞ్జన్=రథమునకు కట్టిరి. తే=వారు, అస్మిన్=ఈ అశ్వమునందు, జవమ్=(పృష్ఠ సమ్మార్జనా ద్యుపచారములచేత,) వేగమును, ఆ దధుః=సంపాదించిరి.

తాత్పర్యము: ఓ యశ్వమా! వాయువు, మనువు, పంచవింశతి గంధర్వులు మొత్తము ఆ ఇరువదియేడుగురు నాకంటె ముందుగనే నిన్ను రథమునకు కట్టిరి. వారు ఈ యశ్వమునందు (పృష్ఠ సమ్మార్జనా ద్యుపచారములచేత,) వేగమును కలుగఁజేసిరి. (అధ్వర్యుఁడు ఈ మంత్రము చెప్పుచు యోగ్యమైన దక్షిణాశ్వమును రథమునకు కట్టవలెను. "వాయుర్వా త్వా, మనుర్వా త్వా" అని పృథగ్ వాక్యకరణము వాయు మనువుల ముఖ్యత్వ మును సూచించుటకు ఉద్దేశించఁబడినది. వాయుర్వా=వాయువును, త్వా=నిన్ను, ఆ యుఞ్జత్=రథమునకు గట్టివైచెను. ఇత్యాదికము పృథగ్వాక్య విధానము.)

6. అర్థము: అపాంనపాత్=నీటిని నశింపఁజేయని దానవును, ఆశుహేమన్=శీఘ్రముగ (దుముకుదానవు) పోవుదానవునగు, (హే అశ్వ!=ఓ అశ్వమా! జలే=నీటియందు), యః ఊర్మిః=ఏ అల, (తరంగము) కకుద్మాన్=మూపురము వలె ఎత్తైనది, ప్రతూర్తిః=మునుగుటచే నేర్పడిన ఉపద్రవము నధికముగ పోఁగొట్టునది, వాజసాతమః=(సస్యోపకారియగుటచే,) అతిశయముగ అన్నము నిచ్చునదియు, (భవతి=అగుచున్నదో,) తేన=ఆ ఊర్మి చేత, అయం (త్వమ్)=ఈ నీవు, (అస్మాకమ్=మాకు,) వాజమ్=అన్నమును, సేత్=సాధించుము.

తాత్పర్యము: ఓ యశ్వమా! నీవు (జలముచే శుభ్రము చేయునపుడు) నీటిని నశింపఁ జేయనిదానవు, (=కలుషితము చేయనిదానవు) శీఘ్రముగ దుముకుదానవు. అట్టి నీవు మూపురమువలె ఎత్తైనదియు, మునుగుటచే నేర్ప డిన ఉపద్రవమును బాగుగ పోఁగొట్టునదియు, సస్యోపకారి యగుటచే అన్నప్రదమునగు త్వత్పృష్ఠ లగ్న మైన యూర్మిచే మాకు అన్నమును సాధించుము. (అధ్వర్యుఁ డీ మంత్రమును జెప్పుచు అశ్వ పృష్ఠమును నీటితో బాగుగ ప్రక్షాళనము చేయవలెను.)

7. అర్థము: (యజమానస్య మమ=యజమానుఁడనైన నాయొక్క, హే ప్రథమ ప్రక్రమ!=ఓ ప్రథమ పాద ప్రక్షేపమా! త్వమ్=నీవు,) విష్ణోః=వ్యాపన శీలుఁడైన జగదీశ్వరునియొక్క, (=త్రివిక్రమావతారముయొక్క,) క్రమః ప్రథమ పాద ప్రక్షేపముచే జయింపఁబడిన భూలోకము, అసి=అగుచున్నావు. (హే ద్వితీయ ప్రక్రమ!=ఓ రెండవ పాద ప్రక్షేపమా! త్వమ్=నీవు,) విష్ణోః=వ్యాపన శీలుఁడైన త్రివిక్రమావతారముయొక్క, క్రాన్తమ్=ద్వితీయ పాద న్యాసముచే జయింపఁబడిన అంతరిక్షము, అసి=అగుచున్నావు. (హే తృతీయ ప్రక్రమ!=ఓ తృతీయ పాద ప్రక్షేపమా! త్వమ్=నీవు,) విష్ణోః=వ్యాపన శీలుఁడైన జగదీశ్వరునియొక్క, విక్రాన్తమ్=పరాక్రమముచే జయింపఁబడిన త్రివిష్టపము, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: యజమానుఁడనైన నా ప్రథమ పాదప్రక్షేపమా! నీవు సర్వవ్యాపియగు త్రివిక్రమావతారముయొక్క ప్రథమ పాదన్యాసముచే జయింపఁబడిన భూలోక మగుచున్నావు. ఓ ద్వితీయ పాద ప్రక్షేపమా! నీవు త్రి విక్రముని ద్వితీయ పాదన్యాసముచే జయింపఁబడిన అంతరిక్షలోక మగుచున్నావు. ఓ తృతీయ పాద ప్రక్షే పమా! నీవు విష్ణు పరాక్రమముచే జయింపఁబడిన త్రివిష్టప మగుచున్నావు. (యజమానుఁ డీ మంత్రము పఠించుచు రథము దగ్గఱకు నడచుచు పోవలెను. ఆ నడచునపుడు వేయు నడుగులు పై విధముగ వర్ణింపఁ బడినవి.)

8. అర్థము: రథ మభితః=రథమున కంతటను, యౌ=ఏ, అఙ్కౌ=చిహ్నములైన పార్శ్వవిశేషములు, న్యఙ్కౌ=మిక్కిలి చిహ్నములైన చక్రవిశేషములు, ధ్వాన్తమ్=ధ్వనితో కూడిన, వాతాగ్రమ్=వాయువుయొక్క ముందు భాగ మును, అను=అనుక్రమముగ, సంచరనౌ=సంచరించుచున్నవో, (తాదృగ్భ్యా ముభాభ్యామ్=అటువంటి రెండింటిచేత,) ఇన్ద్రియావాన్=ఇంద్రియావంతములనియు, దూరేహేతిః=దూరేహేతియనియు, పతత్రీ= పతత్రి యనియు పేర్లుకల, వప్రయః=అపేక్షితార్థమును పూరించునట్టి, తే అగ్నయః=ఆ అగ్నులు, నః= మమ్ము, పారయన్తు=ధావనావధి నంతము నొందించుఁగాక.

తాత్పర్యము: ధ్వనితో కూడిన వాయ్వగ్రభాగము నతిక్రమించి సంచరించుచున్నట్టియు, రథమున కంతటను లక్షణము అగు పార్శ్వవిశేషములచేత, అత్యంత లక్షణములైన చక్రవిశేషములచేతను అగ్నులు మమ్ము ధావనావధిని (నడవవలసిన హద్దును,) అంతము నొందించుఁ గాక. ఇన్ద్రియావంతము, దూరేహేతి, పతత్రి యను పేర్లు గల ఆ అగ్నులు అపేక్షితార్థము నొసఁగునవి. (ఈ మంత్రము పఠించుచు అధ్వర్యుఁడు రథపార్శ్వములను స్పృశించవలెను.)

సప్తమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే సప్తమప్రపాఠకే ఽష్టమోఽనువాకః

మూలము: [1]దేవస్యాహగ్ం సవితుః ప్రసవే బృహస్పతినా వాజజితా వాజం జేషం [2]దేవస్యాహగ్ం సవితుః ప్రసవే బృహస్పతినా వాజజితా వర్షిష్ఠం నాకగ్ం రుహేయ [3]మిన్ద్రాయ వాచం వదతేన్ద్రం వాజం జాపయతేన్ద్రో వాజ మజయిత్। [4]అశ్వాజని వాజిని వాజేషు వాజినీవత్యశ్వా న్త్సమత్సు వాజయ। [5]అర్వా ఽసి సప్తి రసి వాజ్యసి [6]వాజినో వాజం ధావత మరుతాం ప్రసవే జయత వియోజనా మిమీధ్వ మధ్వన స్స్కభ్నీత (౧)కాష్ఠాం గచ్ఛత [7]వాజే వాజే ఽవత వాజినో నో ధనేషు విప్రా అమృతా ఋతజ్ఞాః। అస్య మధ్వః పిబత మాదయధ్వం తృప్తా యాత పథిభి ర్దేవయానైః। [8]తేనో అర్వన్తో హవనశ్రుతో హవం విశ్వే శృణ్వన్తు వాజినః। [9]మితద్రవ స్సహస్రసా మేధసాతా సనిష్యవః। మహో యే రత్నగ్ం సమిథేషు జభ్రిరే శం నో భవన్తు వాజినో హవేషు। [10]దేవతాతా మితద్రవ స్స్వర్కాః। జమ్భయన్తోఽహిం వృకగ్ం రక్షాగ్ంసి సనేమ్యస్మ ద్యుయవన్ (౨)అమీవాః। [11]ఏష స్య వాజీ క్షిపణిం తురణ్యతి గ్రీవాయాం బద్ధో అపికక్ష ఆసని। క్రతుం దధిక్రా అను సంతవీ త్వ త్పథా మఙ్కాగ్ంస్యన్వాపనీఫణత్। [12]ఉతస్మాస్య ద్రవత స్తురణ్యతః పర్ణం న వేరనువాతి ప్రగర్ధినః। శ్యేనస్యేవ ధ్రజతో అఙ్కసం పరి దధిక్రావ్ణ స్సహోర్జా తరిత్రతః। [13]ఆ మా వాజస్య ప్రసవో జగమ్యాదా ద్యావా పృథివీ విశ్వశంభూ। ఆ మా గన్తాం పితరా (౩)మాతరా చాఽఽమా సోమో అమృతత్వాయ గమ్యాత్। [14]వాజినో వాజజితో వాజగ్ం సరిష్యన్తో వాజం జేష్యన్తో బృహస్పతే ర్భాగమవ

జేష్త [15]వాజినో వాజజితో వాజగ్ం సస్రవాగ్ంసో వాజం జిగివాగ్ంసో బృహస్పతే ర్భాగే
ని మృడ్ఢ్వ [16]మియం వ స్సా సత్యా సంధాఽభూద్యామిన్ద్రేణ సమధద్ధ్వ [17]మజీజిపత వనస్ప
తయ ఇన్ద్రం వాజం వి ముచ్యధ్వమ్। ॥౮॥ (స్కభ్నీత యుయవన్నితరా ద్విచత్వారిగ్ంశ చ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే సప్తమప్రపాఠకే ఽష్టమోనువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: సప్తమానువాకమునందు రథ మంత్రములు చెప్పఁబడినవి. ఈ యష్టమానువాకమునందు రథ ధావన మంత్రములు చెప్పఁబడుచున్నవి.

1. అర్థము: సవితుః=ప్రేరకుఁడైన, దేవస్య=దేవునియొక్క, ప్రసవే సతి=అనుజ్ఞ యుండగా, అహమ్=నేను, వాజజితా=అన్న జయకారియగు, బృహస్పతినా=బృహస్పతిచేత, వాజమ్=అన్నమును, జేషమ్=జయించఁగలను.

తాత్పర్యము: సవితయగు పరమేశ్వరుని యనుజ్ఞ కలుగుచుండఁగా నేను అన్న జయకారియగు బృహస్పతిచే అన్నమును జయించఁగలను(=పొందఁగలను. అధ్వర్యుఁడు ఈ మంత్రము పఠించుచు వాజపేయ యాగోపయుక్తమైన రథము నధిష్ఠించవలెను.)

2. అర్థము: సవితుః, దేవస్య, ప్రసవే సతి, అహమ్, వాజజితా, బృహస్పతినా, వర్షిష్ఠమ్=అధికముగ వృద్ధి నొందిన, నాకమ్=స్వర్గమును, రుహేయమ్=అధిష్ఠింతును.

తాత్పర్యము: అతిశయముగ వృద్ధి నొందిన స్వర్గము నధిరోహింతును. మిగిలిన భాగము పూర్వోక్తము. (ఈ మంత్రము చెప్పుచు బ్రహ్మ చాత్వాలమునందు నిమితమైన రథచక్రము నధిరోహించవలెను. నిమితము=భూమి యందు స్థాపితమైన కాష్ఠముయొక్క అగ్రభాగమునందు స్థాపించఁబడినది. బ్రహ్మ అధిష్ఠించిన రథచక్రమును ప్రదక్షిణముగ మూఁడుమారులు త్రిప్పవలెను.)

3. అర్థము: హే సఖ్యాః!=ఓ బ్రాహ్మణులారా!, ఇన్ద్రాయ=(యాగలక్షణ పరమైశ్వర్యయోగముచే ఇంద్రుని వంటివాఁడైన) యజమానునికొఱకు, వాచమ్=అశీర్వాదరూప వాక్కును, వదత=పలుకుఁడు, ఇన్ద్రమ్=యజమానుని, వాజం జాపయత=అన్న విషయమున జయమును పొందించుఁడు. ఇన్ద్రః=యజమానుఁడు, వాజమ్=అన్నమును, అజయిత్=జయించుఁగాక. (ఇది వైదిక విలక్షణ ప్రయోగము. అజయిత్=జయతు.)

తాత్పర్యము: ("ఇది=పరమైశ్వర్యే" అను ధాతువునుండి పుట్టిన ఇన్ద్రశబ్దము యాగలక్షణ పరమైశ్వర్య యోగముచే యజమానార్థకము.) ఓ బ్రాహ్మణులారా! యజమానునకై అశీర్వాదరూప వాక్కు నుచ్చరింపుఁడు. అన్న విషయమున యజమానునకు జయమును కలుగఁజేయుఁడు. యజమానుఁ డన్నమును జయించుఁగాక.(=అన్న సమృద్ధిని పొందుఁగాక. ఈ మంత్రము చెప్పుచు దుందుభి అనెడి వాద్యములను ప్రయోగింపఁ జేయవలెను.)

4. అర్థము: వాజిని=అన్నము (నిచ్చుటచే) కలిగినదానవు, వాజినీవతి=వేగముతో కూడిన గుఱ్ఱపు నడకలు కలిగినదానవు నగు, హే అశ్వాజని!=ఓ కొరడా! (త్వమ్=నీవు,) వాజేషు=అన్నముల విషయమై, సమత్సు=యుద్ధములందు, అశ్వాన్=గుఱ్ఱములను, వాజయ=నడిపించుము.

తాత్పర్యము: విజయముచే అన్నము నిచ్చుటచే వాజినివియు, వేగముతో కూడిన అశ్వగతులు కలిగియుండుటచే వాజినీవతివియునగు ఓ యశ్వాజనీ! (=కొరడా) అన్నముల నిమిత్తమై నీవు యుద్ధములందు గుఱ్ఱములను నడిపించుము. (అశ్వమ్ అజతి=క్షిపతీతి, అశ్వాజనీ=గుఱ్ఱమును తోలునట్టి కొరడా యని యర్థము. దీనికి సంస్కృతమునందు కశయని పేరు. అధ్వర్యునకు కొరడా నీయవలెను.)

5. అర్థము: (హే దక్షిణాశ్వ!=ఓ దక్షిణపు వైపున నున్న అశ్వమా!, త్వమ్=నీవు,) అర్వా=అర్వన్ జాతికి చెందినదానవు, అసి=అగుచున్నావు. (హే మధ్యమాశ్వ!=మధ్యమునందున్న యశ్వమా!, త్వమ్=నీవు,) సప్తిః=సప్తిజాతికి చెందినదానవు, అసి=అగుచున్నావు. (హే ఉత్తరాశ్వ=ఓ ఉత్తరపు వైపున నున్న యశ్వమా!, త్వమ్=నీవు,) వాజీ=వాజి జాతికి చెందినదానవు, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: అర్వన్, సప్తి, వాజిన్ శబ్దములు అశ్వజాతి విశేష వాచకములు. రథమునకు పూన్చినట్టి యశ్వములు మూఁడును మూఁడు విభిన్నములయిన అశ్వజాతులకు చెందినవిగా వర్ణింపఁబడినవి. (అధ్వర్యుఁ డీ మంత్రము చెప్పుచు అశ్వములను తోలవలెను.)

6. అర్థము: హే వాజినః=ఓ అశ్వములారా!, వాజమ్=అన్నమును, (సంపాదయితుమ్=సంపాదించుటకు, శీఘ్రమ్=శీఘ్రముగా,) ధావత=పరుగిడుఁడు. మరుతామ్=దేవతలయొక్క, ప్రసవే సతి=అనుజ్ఞ కలుగుచుండఁగా, (అన్నమ్=అన్నమును,) జయత=జయించుఁడు. వియోజనాః=విశేషముగ అనేక యోజనములను (గూడ,) మిమీధ్వమ్=(శీఘ్రముగ పరుగిడుటచే) పరిమితములైన అల్పములువలె చేయుఁడు. అధ్వనః=మార్గములను, స్కభ్నీత=(శీఘ్రగతిచే) నలిగినవిగా చేయుఁడు. కాష్ఠామ్=మార్గ సమాప్తిని, గచ్ఛత=పొందుఁడు.

తాత్పర్యము: ఓ యశ్వములారా! అన్నమును సంపాదించుటకు శీఘ్రముగ పరుగిడుఁడు. దేవతల యనుజ్ఞచే అన్నమును సంపాదించుఁడు. బహుయోజనముల దూరమును సైతము శీఘ్రముగ పరుగిడుటచే అల్పయోజన దూరమునుగ చేయుఁడు. మార్గాంతమును పొందుఁడు. (ధనువునుండి బలముగ విడువఁబడిన ఒక బాణము ఎంత దూరము పోవునో అంత దూరము గల ప్రదేశము ప్రవ్యాధ మనఁబడును. అటువంటి యేడు ప్రవ్యాధముల ప్రదేశమునకు 'ఆజి' యని పేరు. రథమును గొనిపోవుటకై గుర్తుగ ఆ ఆజి చివర ఒక కాష్ఠమును భూమియందు పాఁతియుంచుదురు. ఆ ఆజియందు గల కాష్ఠము వఱకు రథముపైని కూర్చుండిన యధ్వర్యుఁడు అశ్వములను తోలుచు పై విధముగ హెచ్చరించుచుండవలెను.)

7. అర్థము: హే వాజినః=ఓ యశ్వములారా!, వాజే వాజే=ఆ యా అన్నము నిమిత్తము, ధనేషు=ధనముల నిమిత్తము, నః=మమ్ము, అవత=రక్షింపుఁడు. విప్రాః=బ్రాహ్మణులవలె స్నానముచే శుద్ధులును, అమృతాః=మరణ రహితులును, (లేక శ్రమరహితులును,) ఋతజ్ఞాః=గన్తవ్య ప్రదేశమును దెలిసినవారును నగు, (హే అశ్వాభిమానినః దేవాః!=ఓ అశ్వాభిమాని దేవతలారా!) అస్య=ఈ యజమానునియొక్క, మధ్వః=మధు సమాన చరు రసమును, పిబత=త్రాగుఁడు. (పీత్వా చ=త్రాగియు,) మాదయధ్వమ్=హృష్టులగుఁడు. (తతః=పిమ్మట,) తృప్తాః=తృప్తులై, దేవయానైః=దేవతలు (ప్రయాణము చేయు) యానములైన, పథిభిః=మార్గములచేత, (ఆజిం ప్రతి=ఆజిని గూర్చి,) యాత=వెళ్లుఁడు.

తాత్పర్యము: ఓ అశ్వములారా! ఆ యా అన్నముల నిమిత్తము, ధనముల నిమిత్తమును, మమ్ము రక్షింపుఁడు, స్నానముచే బ్రాహ్మణులవలె పరిశుద్ధులును, మరణ రహితులు, లేక శ్రమ రహితులు, గంతవ్య ప్రదేశము తెలిసినవారునైన ఓ అశ్వాభిమాని దేవతలారా!, ధావనమునకు పూర్వము, పిమ్మట గూడ ఆస్వాదింపఁ జేయఁబడు మధుసమానమైన నీవారధాన్య సంబంధి చరు రసమును త్రాగుఁడు. త్రాగి సంతుష్టులు కండు. సంతృప్తులై పిమ్మట దేవయాన మార్గములచే ఆజిని గూర్చి పొందు. (పరుగిడుచున్న యశ్వములను నాలుగు ఋక్కులచే మంత్రించవలెను. ఆ ఋక్కులలో ఇది మొదటిది.)

8. అర్థము: అర్వన్తః=గతి కుశలములు, హవన శ్రుతః=(మా)యాహ్వానమును వినునవియు, వాజినః=అన్నము కలవి యునగు, తే విశ్వే=ఆ అన్ని యశ్వములు, నః=మాయొక్క, హవమ్=ఆహ్వానమును (=మాటను,) శృణ్వన్తు=వినుఁగాక.

తాత్పర్యము: నడకయందు నైపుణ్యము కలవియు, మా యాహ్వానమును వినునవియు, అన్నము కలవియు నగు ఆ యశ్వము లన్నియు మా యాహ్వానమును (=మా మాటను)వినుఁగాక. (ఇది రెండవ ఋక్కు.)

9. అర్థము: మితద్రవః=గొప్ప మార్గమును కూడ అల్ప మార్గమునువలె పోపునవియు, సహస్రసాః=గొప్ప అన్నరాశిని దానము చేయునవియు, మేధసాతాః=యజ్ఞ ప్రదానము చేయునవియు, సనిష్యవః=మాకు ద్రవ్య దానము చేయ నిచ్ఛయించు చున్నవియునగు, యే=ఏ యశ్వములు, సమిధేషు=సంగ్రామములయందు, మహః=అత్యధిక మైన, రత్నమ్=(శత్రువుయొక్క) ధనమును, జభ్రిరే=హరించినవో; తే వాజినః=ఆ యశ్వములు, నః=మాకు, శమ్=సుఖకరములు, భవన్తు=అగుఁగాక.

తాత్పర్యము: గొప్ప మార్గమును గూడ అల్పమార్గమునువలె చేసి పోపునవియు, గొప్ప అన్నరాశిని దానము చేయునవియు, యజ్ఞ ప్రదానము చేయునవియు, మాకు ద్రవ్యదానము చేయ నిచ్ఛయించునవియు, యుద్ధములందు అత్యధిక మైన శత్రు ధనమును హరించినవియు నగు ప్రసిద్ధములయిన ఈ యశ్వములు మాకు సుఖకరము లగుఁగాక. (ఇది మూఁడవ ఋక్కు.)

10. అర్థము: దేవతాతాః=దేవతల కర్మము లయినవియు, మితద్రవః=గొప్పమార్గమును గూడ అల్పమార్గమునువలె పోపు నవియు, స్వర్కాః=బాగుగ అర్చింపఁదగినవియునగు, (తే=ఆ అశ్వములు,) అహిమ్=సర్పమువలెను, వృకమ్=తోడేలువలెను (క్రూరులైన,) రక్షాంసి=రాక్షసులను, జమ్భయన్తః=నశింపఁ జేయుచున్నవియై, సనేమి=శీఘ్రముగనే, అమీవాః=రోగములను, అస్మత్=మానుండి, యుయవన్=విముక్తములు చేసినవి.

తాత్పర్యము: ఆ యశ్వములు సర్పములు తోడేళ్లవలె క్రూరులైన రాక్షసులను నశింప చేయుచున్నవియై శీఘ్రముగనే మా రోగములను పోఁగొట్టినవి. ఆ యశ్వములు దేవతల కర్మములు. మితద్రవములు. బాగుగ నర్చింపఁదగినవి. ('భంజయన్తః' అనుటకు బదులు వర్ణవ్యత్యయముచే 'జంభయన్తః' అని ప్రయుక్తమైనది. ఇది నాల్గవ ఋక్కు.)

11. అర్థము: ఏషః=ఈ, స్యః వాజీ=ఆ పూర్వోక్తమైన అశ్వము, గ్రీవాయామ్=కంఠమునందు, కక్షే=నడుమునందు, అసని=ముఖమునందు, బద్ధోఽపి=(ఆ యా బన్ధనవిశేషములచే) బంధింపఁబడినదైనను, దధిక్రాః=మార్గా వరోధకములైన పాషాణాదుల నతిక్రమించుచున్నదియు, క్రతు మను=యజ్ఞకర్త్రభిప్రాయము ననుసరించి, సంతవీత్వత్=బాగుగ ననుసంధానము చేయుచు, పథామ్=మార్గములయొక్క, అఙ్కాంసి=లక్షణములను, కుటిలములైన నిమ్నోన్నతములను, అన్వాపనీఫణత్=ఋజువుగను సమముగను చేయుచున్నదియునై, క్షిపణిమ్=కొరడాను, (=కశను) తురణ్యతి=త్వరపెట్టుచున్నది. (=అశ్వము కొరడాచే శీఘ్రముగ పోవుచున్నది.)

తాత్పర్యము: ఆ పూర్వోక్తమైన ఈ యశ్వము కంఠమునందు నడుమునందు ముఖమునందును తత్తత్స్థానోచిత బంధనము లచే బంధింపఁబడియు, (రథమును విఱుగఁగొట్టుట కటునిటు పోకుండ) మార్గావరోధకములైన పాషాణాదుల నతిక్రమించుచు యజ్ఞకర్త్రభిప్రాయము ననుసరించి బాగుగ అనుసంధానము చేయుచు, మార్గముల లక్షణములను, కుటిలములైన నిమ్నోన్నతములను ఋజువుగను సమముగను చేయుచున్నదియునై కొర డాచే శీఘ్రముగ పోవుచున్నది. (బౌధాయనాచార్యులు పై ఋక్కులలో 2,3 ఋక్కుల నొక్కటిగా చేసి ఈ "ఏషస్య" ఇత్యాదికమును నాల్గవ ఋక్కుగా భావన చేసి సమన్వయము చేసినారు.)

12. అర్థము: ఉత స్మ=మఱియు, ద్రవతః=పోవుచున్నదియు, తురణ్యతః=త్వరచేయుచున్నదియు, ప్రగర్ధినః=మార్గా
వధిని పొందుటకు కాంక్షించుచున్నదియు, ధ్రజతః శ్యేనస్యేవ=పోవుచున్న డేగకువలె, దధిక్రావ్ణః=మార్గావ
రోధక పర్వతాదుల నతిక్రమించుచున్నదియు, ఊర్జా సహ=బలముతోఁగూడ, తరిత్రతః=అత్యంతము ఎగురు
చున్నదియునగు, అస్య=ఈ అశ్వముయొక్క, అఙ్కసమ్=శృంగార చిహ్నమైన వస్త్ర చామరాదికము,
పరి=శరీరమునందంతటను, వేః పర్ణం న=పక్షియొక్క రెక్కవలె, అనువాతి=అనుసరించి పోవుచున్న
అశ్వము నెగురవేయుచున్నదివలె కనఁబడుచు పోవుచున్నది.

తాత్పర్యము: మఱియు మార్గావధిని శీఘ్రముగ పొందుటకై డేగవలె నెగురుచు మార్గావరోధకములయిన పర్వతాదుల
నతిక్రమించుచు అత్యంత బలముతో శీఘ్రముగ పోవుచున్న ఈ యశ్వముయొక్క శృంగార చిహ్నమైన వస్త్ర
చామరాదికము శరీరమునం దంతట నాచ్ఛాదనము చేసి పక్షియొక్క ఱెక్కవలె అశ్వము నెగురవేయు
చున్నదివలె కనఁబడుచు పోవుచున్నది. ఇచట పక్షి సామాన్యముయొక్క పర్ణము శృంగార చిహ్నమైన వస్త్ర
చామరాదికమునకు దృష్టాంతముగ చెప్పఁబడినది. శీఘ్ర ధావనమున శ్యేన దృష్టాంతము చెప్పఁబడినది.
(ఆగ్నీధ్రుఁ డీ మంత్రము చెప్పుచు హోమము చేయవలెను.)

13. అర్థము: వాజస్య=అన్నముయొక్క, ప్రసవః=ఉత్పత్తి, మా=నన్నుఁగూర్చి, ఆ జగమ్యాత్=వచ్చుఁగాక. ద్యావా
పృథివీ=ద్యులోక భూలోకములు, విశ్వశంభూ=జగత్తునకు సుఖకరములై, మా=నన్నుఁగూర్చి, ఆ (గచ్ఛ
తామ్)=వచ్చుఁగాక. పితరా=తండ్రి, మాతరా చ=తల్లియు, మా=నన్నుఁగూర్చి, ఆగన్తామ్=(చిరం
జీవిత్వమునకై) వచ్చుఁగాక. (కించ=మఱియు,) సోమః=సోమదేవత, (మమ) అమృతత్వాయ=నాకు
దేవతా జన్మకొఱకు, మా=నన్నుఁగూర్చి ఆ గమ్యాత్=వచ్చుఁగాక.

తాత్పర్యము: అన్నోత్పత్తి నాదగ్గఱకు వచ్చుఁగాక. ద్యావా పృథువులు జగత్తునకు సుఖము కలుగవలెనని భావించు
చున్నవై నాయొద్దకు వచ్చుఁగాక. నా తండ్రియు తల్లియు చిరకాల ముండుటకై నాయొద్దకు వత్తురుగాక.
మఱియు సోమదేవత నాకు దేవతాజన్మ నిమిత్తమై నాదగ్గఱకు వచ్చుఁగాక. ('గమ్' ధాతువునకు యఙన్త
మున లిఙ్ చేయఁగా 'జగమ్యాత్' అను రూప మేర్పడును. 'పితా', 'మాతా' అనుటకు బదులు పితరా,
మాతరా అని ప్రయోగింపఁబడినవి. ఛాందసములు. ఇది రథవిమోచనీయ మంత్రము. దీని నుచ్చరించుచు
హోమము చేయవలెను.)

14. అర్థము: వాజజితః=అన్నమును జయించుట కుద్యతములైన, హే వాజినః!=ఓయశ్వములారా!, వాజమ్=అన్నము
నుద్దేశించి, పరిష్యన్తః=పరుగిడుచున్నవారును, వాజమ్=అన్నమును, జేష్యన్తః=జయింపఁబోవు వారును
నగు, (యూయమ్=మీరు,) బృహస్పతేః=బృహస్పతియొక్క, (ఇమం) భాగమ్=(ఈ) చరుభాగమును,
అవ జిఘ్రత=ఆఘ్రాణించుఁడు.

తాత్పర్యము: అన్నమును సంపాదించుట కుద్యతములైన ఓ యశ్వములారా! మీరు అన్నము నుద్దేశించి పరుగిడుచున్నారు.
మఱియు అన్నమును జయింపఁబోవుచున్నారు. అట్టి మీరు బృహస్పతి సంబంధమైన యీ చరు భాగము
నాఘ్రాణించుఁడు. (ఈ మంత్రము చెప్పుచు అశ్వములచే చరు భాగము నాఘ్రాణింపఁ జేయవలెను.)

15. అర్థము: వాజజితః=అన్నమును జయించుట కుద్యతములైనట్టియు, వాజమ్=అన్నము నుద్దేశించి, సస్వాంసః=
పరుగిడినట్టియు, వాజమ్=అన్నమును, జిగివాంసః=జయించినవియునగు, హే వాజినః!=ఓ అశ్వములారా!,
(యూయమ్=మీరు,) బృహస్పతేః=బృహస్పతియొక్క, భాగమ్=చరుభాగమునుగూర్చి, నిమృడ్ఢ్వమ్=
శుద్ధులు కండు.

తాత్పర్యము: ఓ అశ్వములారా! మీరు బృహస్పతియొక్క చరు భాగమును గ్రహించుటకు శుద్ధులు కండు. మీరు అన్న
మును సంపాదించుట కుద్యమించినవారు. ఆ యన్నమునకై పరుగెత్తినవారు. అన్న సంపాదనమున
జయమును పొందినవారు. (ఆజి ధావనానంతరము అశ్వములచే బృహస్పతి సంబంధమైన చరు భాగము
నాఘ్రాణింపఁ జేయవలెను.)

16. అర్థము: (హే రథాః=ఓ రథములారా!) వః=మీయొక్క, ఇయమ్=ఈ, సంధా=ఆజి ధావన ప్రతిజ్ఞ, సత్యా అభూత్=సత్యమైనది. యామ్=ఏ ప్రతిజ్ఞను, ఇన్ద్రేణ=ఇంద్రుని (అనుగ్రహము) చేత, సమధధ్వమ్=బాగుగ అనుష్ఠించిరో!,

తాత్పర్యము: ఓ రథములారా! మీరు ఇంద్రుని యనుగ్రహముచేత బాగుగ అనుష్ఠించిన యీ ఆజి ధావనప్రతిజ్ఞ సత్యమైనది. (ఇంద్రానుగ్రహము కొఱకే "ఇన్ద్రస్య వజ్రో౽సి" అను రథ మంత్రము పూర్వము చెప్పఁబడినది. ఈ మంత్రము చెప్పుచు అశ్వములనుండి విడఁదీసిన రథముల ననుమంత్రించవలెను.)

17. అర్థము: హే వనస్పతయః=వనస్పతి వికారములైన ఓ దుందుభు లనెడి వాద్యవిశేషములారా! (యూయమ్=మీరు,) ఇన్ద్రమ్=యాగస్వామిని, వాజమ్=అన్నమును, అజీజిపత=జయింపఁజేసిరి, (తాదృశాః యూయమ్=అటువంటి మీరు,) వి ముచ్యధ్వమ్=(వెనుకటి మీ బంధనములనుండి,) విముక్తులు కండు.

తాత్పర్యము: వనస్పతులనుండి పుట్టిన దుందుభులారా! మీరు యాగస్వామిచే అన్నమును సంపాదింపఁజేసిరి. కనుక మీరు మీ బంధనములనుండి విముక్తులు కండు. (ఈ మంత్రముచే దక్షిణవేది శ్రోణియందు బంధించి యుంచిన సప్తదశ దుందుభులను బంధనములనుండి విడఁదీసి అనుమంత్రించవలెను. శ్రోణి=అంచు.)

అష్టమానువాకము సమాప్తము

అథ ప్రథమకాణ్డే సప్తమప్రపాఠకే నవమోఽనువాకః।

మూలము: [1]క్షత్రస్యోల్బ మసి క్షత్రస్య యోని రసి [2]జాయ ఏహి సువో రోహావ రోహావహి సువ రహం నా

వుభయో స్సువో రోక్ష్యామి [3]వాజ శ్చ ప్రసవ శ్చాపిజ శ్చ క్రతు శ్చ సువ శ్చ మూర్ధా

చ వ్యశ్నియ శ్చా ఽఽన్త్యాయన శ్చాన్త్య శ్చ భౌవన శ్చ భువన శ్చాధిపతి శ్చ [4]ఆయు

ర్యజ్ఞేన కల్పతాం ప్రాణో యజ్ఞేన కల్పతా మపానః (౧)యజ్ఞేన కల్పతాం వ్యానో యజ్ఞేన

కల్పతాం చక్షు ర్యజ్ఞేన కల్పతాగ్ం శ్రోత్రం యజ్ఞేన కల్పతాం మనో యజ్ఞేన కల్పతాం

వాగ్యజ్ఞేన కల్పతా మాత్మా యజ్ఞేన కల్పతాం యజ్ఞో యజ్ఞేన కల్పతాగ్ం [5]సువ ర్దేవాగ్ం

అగన్మామృతా అభూమ ప్రజాపతేః ప్రజా అభూమ [6]సమహం ప్రజయా సం మయా

ప్రజా సమహగ్ం రాయస్పోషేణ సం మయా రాయస్పోషో [7]ఽన్నాయ త్వా ఽన్నాద్యాయ

త్వా వాజాయ త్వా వాజజిత్యాయై త్వా ఽమృత మసి పుష్టి రసి ప్రజనన మసి ॥౨॥

(అపానో వాజాయ నవ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే సప్తమప్రపాఠకే నవమోఽనువాకః।

వేదార్థ దీపిక

అవతారిక: అష్టమానువాకమున రథధావనము చెప్పఁబడినది. నవమానువాకమున యూపారోహణము చెప్పఁబడుచున్నది.

1. అర్థము: (హే తార్ప్య!-నేతితో తడుపఁబడిన వస్త్రమా! త్వమ్-నీవు,,) క్షత్రస్య-రాజస్థానీయుఁడైన యజమానునకు, ఉల్బమ్-ఆవరణము, అసి-అగుచున్నావు. (హే దర్భమయ పట!-ఓ దర్భమయమైన వస్త్రమా;, త్వమ్-నీవు,) క్షత్రస్య-రాజమహిషీ స్థానీయ పత్ని శరీరమునకు, యోనిః-శీత నివారణ కారణము, అసి-అగు చున్నావు.

తాత్పర్యము: నేతితో తడుపఁబడిన వస్త్రమా! నీవు రాజస్థానీయుఁడైన యజమానునకు ఆవరణ మగుచున్నావు. ఓ దర్భమయమైన వస్త్రమా! నీవు రాజమహిషీ స్థానీయురాలగు యజమాన పత్నియొక్క శరీరమునకు శీతనివారణ కారణ మగుచున్నావు. (ఈ మంత్రము చెప్పుచు యజమానునిచే ఘృతాక్తవస్త్రమును, యజమానపత్నిచే దర్భమయ వస్త్రమును ధరింపఁజేయవలెను.)

2. అర్థము: హే జాయే!=ఓ పత్నీ!, ఏహి=రమ్ము, సువః=స్వర్గమును, రోహావ=అధిరోహించుదము. (ఇతి యజమానః అవోచత్=అని యజమానుఁడు పలికెను.) సువః=స్వర్గమును, రోహావహి=ఎక్కుచున్నాము, (ఇతి=అని, పత్నీ=భార్య, ప్రత్యువాచ=సమాధానము చెప్పెను.) అహమ్=నేను, నౌ ఉభయోః=మన ఉభయుల నిమిత్తము, సువః=స్వర్గమును, రోక్ష్యామి=అధిరోహింపఁగలను (ఇతి=అని, యజమానః=యజమానుఁడు, ఆహ=పలికెను.).

తాత్పర్యము: ఓ పత్నీ! స్వర్గము నధిరోహించుదము. రమ్ము, అని యజమానుఁడు తన భార్య నాహ్వానించెను. స్వర్గము నధిరోహించుచున్నామని పత్ని బదులు చెప్పెను. మన ఉభయుల నిమిత్తము నేను స్వర్గము నధిరోహింపఁగలనని యజమానుఁడు మఱల మాటాడెను. (యజమానుఁడు ఈ మంత్రముచే భార్య నాహ్వానించవలెను. 'రోహావహి సువః' అని పత్ని బదులు పలుకవలెను. మిగిలిన మంత్రమును యజమానుఁడు పఠించవలెను.)

3. అర్థము: వాజః=అన్నము, చ=మఱియు, ప్రసవః=అన్నోత్పత్తి, చ=మఱియు, అపిజశ్చ=ఆ అన్నముయొక్క పునః పున రుత్పత్తియు, క్రతుః=భోగాది విషయక సంకల్పము, లేక, యాగము, సువశ్చ=స్వర్గమును, లేదా, వాజః=చైత్రమాసము, (ఇట్లే 'ప్రసవః' ఇత్యాది పదములు వరుసగా వైశాఖాది మాసవాచకములు.) తే సర్వే=ఆ మాసము లన్నియు, ప్రీణన్తు=సంతృప్తి చెందుఁగాక, అని యర్థము. తాత్పర్యము సులభము. యజమానుఁడు అన్వారంభము చేయుచుండఁగా ఈ మంత్రముచే స్రువముతో పండ్రెండు ఆహుతులను హోమము చేయవలెను.

4. అర్థము: ఆయురాది పదములు ప్రసిద్ధార్థకములు. ఆత్మా=జీవుఁడు. యజ్ఞేన=యజ్ఞసంబంధియగు యూపారోహ ముచే, కల్పతామ్=స్వప్రయోజన సమర్థుఁడగుఁగాక.

తాత్పర్యము: ఆయురాదులు యజ్ఞసంబంధియగు యూపారోహణముచే స్వస్వ ప్రయోజన సమర్థములగుఁగాక, యని భావము. (యజమానుఁ డీ మంత్రము చెప్పుచు యూపారోహణము చేయవలెను.)

5. అర్థము: (వయమ్=మేము) సువః=స్వర్గ స్థితులైన, దేవాన్=దేవతలను, అగన్మ=పొందితిమి. (ప్రాప్య చ=పొందియు,) అమృతాః=దేవతలము, అభూమ=అయితిమి. (అతః=ఇందువలన,) ప్రజాపతేః=ప్రజాపతికి, (ప్రీతి విషయాః=ప్రేమాస్పదులైన,) ప్రజాః=ప్రజలమైన (వయమ్=మేము, అస్మిన్=ఈ భూలోకమునందు, యజ్ఞానుష్ఠానపరాః=యజ్ఞానుష్ఠానమునం దాసక్తులము,) అభూమ=అయితిమి.

తాత్పర్యము: యజమానుఁడు రెండు బాహువులను పైకెత్తి స్వర్గ ప్రాప్తి నభినయించుచు "మేము స్వర్గము నొంది దేవతల మైతిమి. కనుకనే ప్రజాపతికి ప్రీతివిషయ ప్రజలమైన మేము ఈ భూలోకమునందు యజ్ఞానుష్ఠాన పరుల మైతిమి". అని చెప్పవలెను.

6. అర్థము: అహమ్=నేను, ప్రజయా=సంతానముతో, సం(గతోఽస్మి)=కలిసికొని యుంటిని. మయా=నాతో, ప్రజా=సంతానము, సం గమ్యతామ్=కలిసికొనుఁగాక. అహమ్=నేను, రాయస్పోషేణ=ధనసమృద్ధితో, సం (గతోఽస్మి)=కలిసికొని యుంటిని. మయా=నాతో, రాయస్పోషః=ధన సమృద్ధి, సం గమ్యతామ్=కలిసి కొనుఁగాక.

తాత్పర్యము: నేను సంతానముతో కలిసికొని యుంటిని. నాతో సంతానము కలిసికొనుఁగాక. నేను ధన సమృద్ధితో కలిసి కొని యుంటిని. నాతో ధన సమృద్ధి కలిసికొనుఁగాక. (యజమానుఁ డీ మంత్రము చెప్పుచు ఈ లోకముపైపు చూడవలెను.)

7. అర్థము: (హే యజమాన!=ఓ యజమానుఁడా!) త్వా=నిన్ను, అన్నాయ=(సామాన్య ప్రాణులు భుజింప నర్హమైన,) అన్నముకొఱకు, హన్మి=కొట్టుచున్నాను, (ఇతి=అని, అధ్వర్యుః=అధ్వర్యుఁడును,) అన్నాద్యాయ=(రాజామాత్యాదులు భుజింప నర్హమైన అన్నముకొఱకు, త్వా=నిన్ను, (హన్మి=కొట్టుచున్నాను, ఇతి=అని, బ్రహ్మా=బ్రహ్మయు,) వాజాయ=అపూపాది విశేషములతో కూడిన) అన్నముకొఱకు, త్వా=నిన్ను, (హన్మి=కొట్టుచున్నాను, ఇతి=అని, హోతా=హోతయు,) వాజజిత్యాయ=సర్వవిధమైన అన్నముకొఱకు, త్వా=నిన్ను, హన్మి=కొట్టుచున్నాను, (ఇతి=అని, ఉద్గాతా=ఉద్గాతయు, యూపాత్ అవరోహన్తమ్=యూపము నుండి దిగుచున్న, యజమానమ్=యజమానుని, హన్యుః=కొట్టవలెను.)

తాత్పర్యము: ఓ యజమానుఁడా! అన్నముకొఱకు నిన్ను కొట్టుచున్నానని అధ్వర్యుఁడును, అన్నాద్యముకొఱకు నిన్ను కొట్టుచున్నానని బ్రహ్మయు, వాజముకొఱకు నిన్ను కొట్టుచున్నానని హోతయు, వాజజిత్యకొఱకు నిన్ను కొట్టుచున్నానని ఉద్గాతయు చెప్పి యూపమునుండి దిగుచున్న యజమానుని ఆసపుటములతో కొట్టవలెను. ఈ నలుగురును వరుసగా ప్రాచ్యాది చతుర్దిక్కులనుండి కొట్టవలెను. (చవిటినేలను త్రవ్వఁగా వచ్చిన ధూళిని రావియాకులయందు సంపుటీకరించవలెను. వానికే ఆసపుటములనిపేరు.)

8. అర్థము: (హే హిరణ్య!=ఓ హిరణ్యమా! త్వమ్=నీవు) అమృతమ్=నాశము లేని దానవు, అసి=అగుచున్నావు. (హే బస్తాజిన!=ఓ బస్తాజినమా! త్వమ్=నీవు,) పుష్టిః=దృఢమైనదానవు, అసి=అగుచున్నావు. (అత ఏవ=కనుకనే,) ప్రజననమ్=బహు సంతానోత్పాదకము, అసి=అగుచున్నావు. (బస్తాజినము=మేఁకపోఁతు తోలు.)

తాత్పర్యము: ఓ హిరణ్యమా! నీవు నాశము లేనిదానవు. ఓ బస్తాజినమా! నీవు పుష్టి కలదానవు. కనుకనే బహు సంతానమును కలిగించుచున్నావు. (యూపమునుండి దిగుచున్న యజమానుని నిమిత్తము యూపము నొద్ద మేఁకపోఁతు చర్మమును పఱచి దానిపై బంగారము నుంచవలెను.)

నవమానువాకము సమాప్తము

అథ ప్రథమకాణ్డే సప్తమ ప్రపాఠకే దశమోఽనువాకః।

మూలము: [1]వాజస్యేమం ప్రసవ స్సుషువే అగ్రే సోమగ్ం రాజాన మోషధీష్వప్సు। తా అస్మభ్యం మధుమతీ ర్భవన్తు వయగ్ం రాష్ట్రే జాగ్రియామ పురోహితాః। [2]వాజస్యేదం ప్రసవ ఆ బభూవేమా చ విశ్వా భువనాని సర్వతః। స విరాజం పర్యేతి ప్రజాన న్ప్రజాం పుష్టిం వర్ధయమానో అస్మే। [3]వాజస్యేమాం ప్రసవ శ్శిశ్రియే దివ మిమా చ విశ్వా భువనాని సమ్రాట్। అదిత్సన్తం దాపయతు ప్రజాన న్రయిమ్ (౧)చ న స్సర్వవీరాం ని యచ్ఛతు। [4]అగ్నే అచ్ఛావదేహ నః ప్రతి న స్సుమనా భవ। ప్ర ణో యచ్ఛ భువస్పతే ధనదా అసి న స్త్వమ్। [5]ప్ర ణో యచ్ఛత్వర్యమా ప్రభగః ప్ర బృహస్పతిః ప్ర దేవాః ప్రోత సూనృతా ప్ర వాగ్దేవీ దదాతు నః। [6]అర్యమణం బృహస్పతి మిన్ద్రం దానాయ చోదయ। వాచం విష్ణుగ్ం సరస్వతీగ్ం సవితారమ్(౨) చ వాజినమ్। [7]సోమగ్ం రాజానం వరుణ మగ్ని మన్వార భామహే। ఆదిత్యా న్విష్ణుగ్ం సూర్యం బ్రహ్మాణం చ బృహస్పతిమ్। [8]దేవస్య త్వా సవితుః ప్రసవేఽశ్వినో ర్బాహుభ్యాం పూష్ణో హస్తాభ్యాగ్ం సరస్వత్యై వాచో యన్తు ర్యన్త్రేణాగ్నే స్త్వా సామ్రాజ్యేనాభిషిఞ్చామీన్ద్రస్య బృహస్పతే స్త్వా సామ్రాజ్యేనాభిషిఞ్చామి ॥౩॥

(రయిగ్ం సవితారగ్ం షట్త్రిగ్ంశచ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే సప్తమప్రపాఠకే దశమోఽనువాకః॥

వేదార్థ దీపిక

అవతారిక: నవమానువాకమునందు యూపారోహణము చెప్పఁబడినది. ఈ దశమానువాకమునందు అన్నహోమములు చెప్పఁబడుచున్నవి.

1. అర్థము: వాజస్య=అన్నమునకు, ప్రసవః=ఉత్పాదకుఁడగు పరమేశ్వరుఁడు, అప్సు=ఉదకములందు, ఓషధీషు చ=ఓషధులయందును, (సారమ్=సారమైన,) ఇమమ్=ఈ, సోమమ్=లతా రూపమైన, రాజానమ్=దీప్తిమత్తమైన పదార్థమును, అగ్రే=సృష్ట్యాదియందు, సుషువే=పుట్టించెను. తాః=ఆ ఉదకములు ఓషధులును, అస్మభ్యమ్=మా కొఱకు, మధుమతీః=మాధుర్యము కలవిగా, భవన్తు=అగుఁగాక. వయమ్=మేము, (అస్మిన్,) రాష్ట్రే=ఈ రాష్ట్రమునందు, పురోహితాః=(యాగానుష్ఠానాదులయందు) పురోగాములముగా, (భూయాస్మ=అగుదుము.)

తాత్పర్యము: అన్నమును కల్పించిన పరమేశ్వరుఁడు ఓషధులలోను, ఉదకములలోను ఈ సోమలతను ప్రకాశించు పదార్థమునుగా సృష్ట్యాదియందు సృష్టించెను. ఆ ఓషధులు ఉదకములును మా కొఱకు మాధుర్యము కలవి యగుఁగాక. మేము కూడ ఈ రాష్ట్రమునందు యాగానుష్ఠానాదులందు పురోగాముల మగుదుము. (మేఁడిచెట్టునకు సంబంధించిన స్రువముచే అన్నమును ఈ ఋక్కు నుచ్చరించుచు హోమము చేయవలెను. ఇవి సప్త హోమములు. ఇది మొదటిది.)

2. అర్థము: వాజస్య ప్రసవః=అన్నోత్పాదకుఁడైన పరమేశ్వరుఁడు, ఇదమ్=ఈ అనుష్ఠింపఁబడుచున్న కర్మను, ఆ బభూవ=ఉత్పన్నము చేసెను. ఇమా=ఈ, విశ్వా భువనాని చ=సర్వలోకములను కూడ, సర్వతః=అంతటను, ఆ బభూవ=ఉత్పన్నము చేసెను. సః=ఆ పరమేశ్వరుఁడు, అస్మే=మా నిమిత్తము, ప్రజామ్=సంతానమును, పుష్టిమ్=పుష్టిని, వర్ధయమానః=వృద్ధి నొందించుచున్నవాఁడై, ప్రజానన్=మా అభిప్రాయమును బాగుగ తెలిసికొనుచున్నవాఁ డగుచు, విరాజమ్=హోమము చేయఁబడుచున్న అన్నమును, పర్యేతి=అంతటను, పొందుఁగాక. ("అన్నం వై విరాట్" అను శ్రుతిచే అన్నము విరాట్ఛబ్దార్థము. ఇమా=ఇమాని, విశ్వా=విశ్వాని, ఇదం, విశ్వ శబ్దములు భువనశబ్ద విశేషణములు కనుక, నపుంసకములుగా నుండవలెను. 'ఇమా విశ్వా' అను ప్రయోగములు వైదికములు.)

తాత్పర్యము: అన్నోత్పాదకుఁడైన పరమేశ్వరుఁడు ఈ చేయఁబడుచున్న యజ్ఞకర్మను, ఈ సర్వ భువనములను సృష్టించెను. ఆ పరమేశ్వరుఁడు మా నిమిత్తము ప్రజను పుష్టిని వృద్ధి పఱచుచున్నవాఁడై మా యభిప్రాయమును తెలిసికొనుచు హోమము చేయఁబడుచున్న యన్నము నంతటను పొందుఁగాక. (ఇది రెండవ ఋక్కు. 'ఆఙ్' ఇత్యుపసర్గ పూర్వక భూధాతువున కిచట 'ఉత్పత్తి చేసెను' అని అర్థము చెప్పఁబడినది. ధాతువులు అనేకార్థకములు కదా!

3. అర్థము: వాజస్య=అన్నమునకు, ప్రసవః=ఉత్పాదకుఁడగు పరమేశ్వరుఁడు, ఇమాం దివమ్=ఈ స్వర్గమును, ఇమా విశ్వా భువనాని చ=ఈ సర్వలోకములను, శిశ్రియే=ఆశ్రయించెను. సమ్రాట్=పరమేశ్వరుఁడు సర్వలోకములకు రాజై, అదిత్సన్తమ్=హవిస్సు నిచ్చుట కిష్టపడని నన్ను, ప్రజానన్=బాగుగ తెలిసికొనినవాఁ డగుచు, (మద్బుద్ధి ప్రేరణేన=నాబుద్ధిని ప్రోత్సహించుటచే, హవిః=హవిస్సును,) దాపయతు=ఇప్పించుఁగాక. నః=మా కొఱకు, సర్వ వీరామ్=పుత్రపౌత్రాది సర్వవీరులు గల, రయిం చ=ధనమును గూడ, ని యచ్ఛతు=నియమముగా ఇచ్చుఁగాక.

తాత్పర్యము: అన్నోత్పాదకుఁడగు పరమేశ్వరుఁడు ఈ స్వర్గమును ఈ సర్వలోకములను ఆశ్రయించెను. ఆ పరమేశ్వరుఁడు సర్వలోకములకు రాజై హవిస్సు నిచ్చుట కిష్టపడని నన్ను బాగుగ తెలిసికొనినవాఁ డగుచు పుత్రపౌత్రాది సంపదను ధనమును కూడ మాకు నియమముగ నిచ్చుఁగాక. (ఈ ఋక్కు నుచ్చరించుచు మూఁడవ అన్నహోమము చేయవలెను.)

4\. అర్థము: హే అగ్నే!=ఓ యగ్నీ!, ఇహ=ఈ కర్మయందు, నః=మాకు, అచ్ఛా=అభిముఖముగా, వద=హితమును జెప్పుము. నః=మమ్ముఁగూర్చి, సుమనాః=మంచి మనస్సు కలవాఁడవు, భవ=కమ్ము. హే భువస్పతే!=ఓ భూమిపతీ!, నః=మాకొఱకు, ప్ర యచ్ఛ=అధికముగ ధనము నొసఁగుము. యత్=ఏ కారణమువలన, త్వమ్=నీవు, (అస్మత్స్వామీ సన్=మాకు స్వామి వగుచు,) నః=మాకు, ధనదాః=ధనము నొసఁగువాఁడవు, అసి=అగుచున్నావో;

తాత్పర్యము: ఓ యగ్నీ! ఈ యజ్ఞకర్మయందు మా కభిముఖముగ హితమును చెప్పుము. మా విషయమున కరుణార్ద్ర చిత్తుఁడవు కమ్ము. ఓ భూమిపతీ నీవు మా స్వామివగుచు మాకు ధనము నొసఁగువాఁడవు కావున, మా కధికముగ ధనము నొసఁగుము. (ఇది నాల్గవ ఋక్కు. దీని నుచ్చరించుచు నాల్గవ అన్నహోమము చేయవలెను.)

5\. అర్థము: అర్యమా=సూర్యుఁడు, నః=మాకు, ప్ర యచ్ఛతు=అధికముగ ధనము నొసఁగుఁగాక. భగః=ఆదిత్యుఁడు, (ద్వాదశాదిత్యులలో నొకఁడు,) ప్ర (యచ్ఛతు)=ప్రకర్షముగ ధనము నొసఁగుఁగాక. బృహస్పతిః=బృహస్పతి, (దేవతల గురువు,) ప్ర (యచ్ఛతు), దేవాః=తదితర దేవతలు, ప్ర (యచ్ఛన్తు). ఉత=మఱియు, సూనృతా=ప్రియవాగభిమానినియగు దేవత, నః=మాకు, ప్ర దదాతు=విశేషముగ ధనము నొసఁగుఁగాక. వాగ్దేవీ=వాక్సామాన్యాభిమానినియగు దేవత, (నః=మాకు) ప్ర (దదాతు)=ఇచ్చుఁగాక.

తాత్పర్యము: అర్యమాదిత్య బృహస్పతులు, తదితరులైన దేవతలును, మఱియు, ప్రియ వాగభిమానియగు దేవతయు, సామాన్య వాగభిమానిని యగు దేవతయు మా కధికముగ ధనము నొసఁగుదురుగాక. (ఇది యైదవ ఋక్కు. దీని నుచ్చరించుచు ఐదవ అన్నహోమము చేయవలెను. ఈ ఋక్కునందుఁగల ఆఱు 'ప్ర' అను ఉపసర్గలతో 'యచ్ఛతు, దదాతు' అను క్రియాపదములు ప్రత్యేకముగ అన్వయించుటచే ఆఱు వాక్యము లేర్పడినవి. అర్యమ భగ బృహస్పతులు దేవతలలో ఉత్తము లగుటచే విప్ర పరివ్రాజక న్యాయము ననుసరించి పృథక్కుగ నిర్దేశించఁబడినారు.)

6\. అర్థము: (హే ఈశ్వర!=ఓ యీశ్వరా!, అస్మభ్యమ్=మాకొఱకు,) దానాయ=ధనము నొసఁగుటకై, అర్యమణమ్=సూర్యుని, బృహస్పతిమ్=బృహస్పతిని, ఇన్ద్రమ్=ఇంద్రుని, వాచమ్=సూనృత వాగభిమానినియగు దేవతను, విష్ణుమ్=విష్ణువును, సరస్వతీమ్=వాక్సామాన్యాభిమానినియగు దేవతను, వాజినమ్=అన్నాధిపతియగు, సవితారమ్=సవితృదేవుని, చోదయ=ప్రేరణ చేయుము.

తాత్పర్యము: ఓ యీశ్వరా! మఱల మాకు ధనము నొసఁగుటకు అర్యమాది దేవతలను ప్రేరణ చేయుము. (ఇది యాఱవ ఋక్కు. ఈ ఋక్కు నుచ్చరించుచు ఆఱవ యన్న హోమము చేయవలెను.)

7\. అర్థము: (వయమ్=మేము,) సోమం రాజానమ్=సోమ రాజును, వరుణమ్=వరుణుని, అగ్నిమ్=అగ్నిని, ఆదిత్యాన్=ఆదిత్యులను, విష్ణుమ్=విష్ణువును, సూర్యమ్=సూర్యుని, బ్రహ్మాణమ్=బ్రహ్మను, చ=మఱియు, బృహస్పతిమ్=బృహస్పతిని, అను=అనుసరించి, ఆ రభామహే=కర్మ నారంభించుచున్నాము (వారనుగ్రహింతురుగాక.)

తాత్పర్యము: మేము ప్రథమమున కర్మారంభకులయిన సోమ రాజాదుల ననుసరించి పిమ్మట కర్మ నారంభించెదము, (వారందఱు అనుగ్రహింతురుగాక. ఇది యేడవ ఋక్కు. ఈ ఋక్కు నుచ్చరించుచు ఏడవ అన్న హోమము చేయవలెను.)

8\. అర్థము: (హే యజమాన!=ఓ యజమానుఁడా!, త్వా=నిన్ను, సవితుః=ప్రేరకుఁడైన, దేవస్య=దేవునియొక్క, ప్రసవే సతి=ప్రేరణ కలుగుచుండగా, అశ్వినోః=అశ్వినీ దేవతలయొక్క, బాహుభ్యామ్=బాహువులచేతను, పూష్ణః=పూష దేవునియొక్క, హస్తాభ్యామ్=హస్తములచేతను, సరస్వత్యై=సూనృత వాగభిమానిదేవతయొక్క, వాచః=వాక్సామాన్యాభిమాని దేవతయొక్కయు, యన్తుః=అన్తర్యామి యొక్కయు, అగ్నేః=

తేజఃప్రదుఁడగు అగ్నియొక్కయు, యన్త్రేణ=అనుజ్ఞచేత, సామ్రాజ్యేన=సామ్రాజ్య నిమిత్తము, అభిషిఞ్చామి=(సువర్ణముతో,) అభిషేకము చేయుచున్నాను. ఇన్ద్రస్య=ఇంద్రునియొక్క, యన్త్రేణ, సామ్రాజ్యేన, అభి షిఞ్చామి. బృహస్పతేః=బృహస్పతియొక్క, యన్త్రేణ, సామ్రాజ్యేన, అభి షిఞ్చామి.

తాత్పర్యము: ఓ యజమానుఁడా! ప్రేరకుఁడగు దేవునియొక్క అనుజ్ఞ కలుగుచుండఁగా అశ్వినీ దేవతలయొక్క బాహువులచేతను, పూషదేవుని హస్తములచేతను, సూనృత వాగభిమాని దేవతయొక్కయు, వాక్సామాన్యాభిమాని దేవతయొక్కయు అన్తర్యామి, అగ్ని, ఇంద్ర బృహస్పతులయొక్కయు అనుజ్ఞచేత సామ్రాజ్యము నిమిత్తము నిన్ను బంగారముతో అభిషేకము చేయుచున్నాను. (అని చెప్పుచు అధ్వర్యుఁడు యజమానునకు సువర్ణాభిషేకము చేయవలెను. 'సరస్వత్యై' షష్ఠ్యర్థే చతుర్థీ. 'సామ్రాజ్యేన'–చతుర్థ్యర్థే తృతీయా.)

దశమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే సప్తమప్రపాఠక ఏకాదశోఽనువాకః।

మూలము: [1]అగ్ని రేకాక్షరేణ వాచ ముదజయ దశ్వినౌ ద్వ్యక్షరేణ ప్రాణాపానా వుదజయతాం విష్ణు
స్త్ర్యక్షరేణ త్రీల్లోఁకా నుదజయ త్సోమ శ్చతురక్షరేణ చతుష్పదః పశూ నుదజయ త్పూషా
పఞ్చాక్షరేణ పఙ్క్తి ముదజయ ద్ధాతా షడక్షరేణ షడృతూ నుదజయ న్మరుత స్సప్తాక్షరేణ
సప్తపదాగ్ం శక్వరీ ముదజయ న్బృహస్పతి రష్టాక్షరేణ గాయత్రీ ముదజయ న్మిత్రో
నవాక్షరేణ త్రివృతగ్ం స్తోమ ముదజయత్ (౧)వరుణో దశాక్షరేణ విరాజ ముదజయ దిన్ద్ర
ఏకాదశాక్షరేణ త్రిష్టుభ ముదజయ ద్విశ్వేదేవా ద్వాదశాక్షరేణ జగతీ ముదజయ న్వసవ
స్త్రయోదశాక్షరేణ త్రయోదశగ్ం స్తోమ ముదజయ న్రుద్రా శ్చతుర్దశాక్షరేణ చతుర్దశగ్ం స్తోమ
ముదజయ న్నాదిత్యాః పఞ్చదశాక్షరేణ పఞ్చదశగ్ం స్తోమ ముదజయ న్నదితి ష్షోడశాక్షరేణ
షోడశగ్ం స్తోమ ముదజయ త్ప్రజాపతి స్సప్తదశాక్షరేణ సప్తదశగ్ం స్తోమ ముదజయత్ ॥౨॥
(త్రివృతగ్ం స్తోమ ముదజయ ష్షట్చత్వారిగ్ంశ చ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే సప్తమప్రపాఠక ఏకాదశోఽనువాకః ॥౨॥

వేదార్థదీపిక

అవతారిక: దశమానువాకమునందు అన్నహోమము చెప్పఁబడినది. ఏకాదశానువాకమునందు ఉజ్జితి మంత్రములు చెప్పఁబడుచున్నవి.

1. అర్థము: అగ్నిః=అగ్నిదేవుఁడు, ఏకాక్షరేణ="ఆశ్రావయ" ఇత్యాది సప్తదశాక్షర మంత్ర సంఘమునందలి మొదటి యొక అక్షరము(ను పఠించుట)చేత, వాచమ్=వాక్కును, ఉదజయత్=జయించెను. (లేదా, ఏకాక్షరేణ= ఏకాక్షర మంత్రముచేత, అనియు చెప్పవచ్చును. మంత్రశాస్త్రము ననుసరించి ఏకాక్షర మయిన వాక్కు అగ్ని బీజము.) అశ్వినౌ=అశ్వినీ దేవతలు, ద్వ్యక్షరేణ=ఆశ్రావయేత్యాది సప్తదశాక్షర మంత్ర సంఘమునందలి

రెండక్షరముల (నుచ్చరించుట)చేత, ప్రాణాపానౌ=ప్రాణాపాన వాయువులను, ఉదజయతామ్=జయించిరి. (లేదా-ద్వ్యక్షరాత్మకమైన అజపా మంత్రముచేత అని చెప్పవచ్చును.) విష్ణుః=విష్ణువు, త్ర్యక్షరేణ=(సప్తదశాక్షర మంత్రసంఘమునందలి) మూడక్షరముల (ను పఠించుట)చేత, (లేదా-త్ర్యక్షర మంత్రముచేత,) త్రీన్ లోకాన్=మూడు లోకములను, ఉదజయత్=జయించెను. సోమః=సోమదేవుడు, చతురక్షరేణ=చతురక్షరముల (నుచ్చరించుట) చేత, (లేదా-చతురక్షరాత్మక మంత్రముచేత) చతుష్పదః=నాలుగు పాదములు కలిగి యుండునట్టి, పశూన్ పశువులను, ఉదజయత్. పూషా=పూషదేవుడు, పఞ్చాక్షరేణ=(పై మంత్ర సంఘమునందలి) పంచాక్షరముల (నుచ్చరించుట) చేత, (లేదా, పఞ్చాక్షరాత్మక మంత్రము నుచ్చరించుట చేత,) పఙ్క్తిమ్=పంక్తి ఛన్దస్సును, ఉదజయత్. ధాతా=బ్రహ్మ, షడక్షరేణ=ఆఱక్షరముల (నుచ్చరించుట చేత,) (=షడక్షరాత్మక మంత్రముచేత) షట్ ఋతూన్=ఆఱు ఋతువులను, ఉదజయత్. మరుతః=మరుద్గణములు, సప్తాక్షరేణ=సప్తాక్షరముల (నుచ్చరించుట) చేత, (సప్తదశాక్షర మంత్రముచేత,) సప్తపదామ్=ఏడు పదములు గల, శక్వరీమ్=శక్వరీ ఛన్దస్సును, ఉదజయన్. బృహస్పతిః=బృహస్పతి, అష్టాక్షరేణ=ఎనిమిది యక్షరముల (నుచ్చరించుట) చేత, (అష్టాక్షర మంత్రముచేత), గాయత్రీమ్=గాయత్రీ ఛన్దస్సును, ఉదజయత్. ఇట్లే మిగిలినది కూడ గ్రహింపవచ్చును. మిత్రః=మిత్రదేవుడు, నవాక్షరేణ=త్రివృ త్స్తోమ గతములైన తొమ్మిది ఋక్కులచేత, త్రివృతం స్తోమమ్=త్రివృత్స్తోమమును, ఉదజయత్. వరుణః, దశాక్షరేణ, విరాజమ్=విరాట్ ఛన్దస్సును, ఉదజయత్. ఇన్ద్రః, ఏకాదశాక్షరేణ, త్రిష్టుభమ్=త్రిష్టుప్ ఛందస్సును, ఉదజయత్. విశ్వేదేవాః=విశ్వేదేవ దేవతలు, ద్వాదశాక్షరేణ, జగతీమ్=జగతీ ఛన్దస్సును, ఉదజయన్. వసవః=(అష్ట) వసువులు, త్రయోదశాక్షరేణ, త్రయోదశం స్తోమమ్=త్రయోదశ ఋక్కులతో కూడియున్న త్రయోదశ స్తోమమును, ఉదజయన్. రుద్రాః=(ఏకాదశ) రుద్రులు, చతుర్దశాక్షరేణ, చతుర్దశమ్=చతుర్దశ ఋక్కులుగల, స్తోమమ్=మంత్ర సంఘమును, ఉదజయన్. ఆదిత్యాః=(ద్వాదశ) ఆదిత్యులు, పఞ్చదశాక్షరేణ, పఞ్చదశం స్తోమమ్=పంచదశ ఋక్స్తోమమును, ఉదజయన్. అదితిః=అదితి దేవత, షోడశాక్షరేణ, షోడశం స్తోమమ్=షోడశ (పదునాఱు) ఋక్కుల స్తోమమును, ఉదజయత్. ప్రజాపతిః=ప్రజాపతి, సప్తదశాక్షరేణ, సప్తదశం స్తోమమ్=సప్తదశ (పదునేడు) ఋక్కుల స్తోమమును, ఉదజయత్.

తాత్పర్యము: 'ఆశ్రావయ', 'అస్తు శ్రౌషట్', 'యజ', 'యే యజామహే', 'వషట్' -ఈ యైదు మంత్రములలోని అక్షరముల సంఖ్య మొత్తము పదునేడు. ఈ మంత్ర సంఘములోని అక్షరములలో ఒక యక్షరమును పఠించి అగ్ని వాక్కును, అశ్వినీ దేవతలు రెండక్షరములను పఠించి ప్రాణాపానములను ఉత్కర్షగా జయించినారు. ఇట్లే విష్ణ్వాదులు త్ర్యక్షరాదులను పఠించి ముల్లోకాదులను జయించినారు. ఈ పదునొకండును ఉజ్జితి మంత్రములు. ఉజ్జితి అనగా ఉత్కర్షగా జయించుట. లేదా -ఏకాక్షర, ద్వ్యక్షరాద్యాత్మక మంత్రములు గలవు. ఆ యేకాక్షరాది మంత్రములను పఠించి అగ్న్యాది దేవతలు వాగాదుల నుజ్జయించిరనియు చెప్పవచ్చును. (యజమానునిచే ఈ మంత్రములను పఠింపఁ జేయవలెను.)

ఏకాదశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే సప్తమప్రపాఠకే ద్వాదశోఽనువాకః।

మూలము: [1]ఉపయామగృహీతో ఽసి నృషదం త్వా దృషదం భువనసద మిన్ద్రాయ జుష్టం గృహ్ణా మ్యేష తే యోని రిన్ద్రాయ త్వో[2]పయామ గృహీతో ఽస్యప్సు షదం త్వా ఘృతసదం వ్యోమసద మిన్ద్రాయ జుష్టం గృహ్ణామ్యేష తే యోని రిన్ద్రాయ త్వో[3]పయామగృహీతో ఽసి పృథి విషదం త్వా ఽన్తరిక్షసదం నాకసద మిన్ద్రాయ జుష్టం గృహ్ణామ్యేష తే యోని రిన్ద్రాయ త్వా [4]యే గ్రహాః పఞ్చజనీనా యేషాం తిస్రః పరమజాః। దైవ్యః కోశః (౧)సముబ్జితః। తేషాం విశిప్రియాణా మిష మూర్జగ్ం సమగ్రభీ మేష తే యోని రిన్ద్రాయ త్వా। [5]అపాగ్ం రస ముద్వయసగ్ం సూర్యరశ్మిగ్ం సమాభృతమ్। అపాగ్ం రసస్య యో రస స్తం వో గృహ్ణా మ్యుత్తమ మేష తే యోని రిన్ద్రాయ త్వా। [6]అయావిష్టా జనయ న్కర్వరాణి స హి ఘృణి రురు ర్వరాయ గాతుః। స ప్రత్యుదై ద్ధరుణో మధ్వో అగ్రగ్ం స్వాయాం యత్తనువాం తనూ మైరయత। ఉపయామగృహీతో ఽసి ప్రజాపతయే త్వా జుష్టం గృహ్ణామ్యేష తే యోనిః ప్రజాపతయే త్వా ॥ ౨ ॥ (కోశ స్తనువాం త్రయోదశ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే సప్తమప్రపాఠకే ద్వాదశోఽనువాకః।

వేదార్థదీపిక

అవతారిక: ఏకాదశానువాకమునందు ఉజ్జితి మంత్రములు చెప్పఁబడినవి. ఈ ద్వాదశానువాకమునందు అతిగ్రాహ్య మంత్రములు చెప్పఁబడుచున్నవి.

1\. అర్థము: (హే ప్రథమాతిగ్రాహ్య!=ఓ ప్రథమాతిగ్రాహ్యమా! త్వమ్=నీవు,) ఉపయామ గృహీతః=పృథివీ వికారమైన దారుపాత్రముచే గ్రహింపఁబడిన దానవు, అసి=అగుచున్నావు. నృషదమ్=మనుష్యులయందు (స్వామిగా) ఉన్నదానవును, ద్రుషదమ్=వనస్పతులందు ఉన్నదానవును, భువనసదమ్=భువనములందు ఉన్న దానవును, ఇన్ద్రాయ=ఇంద్రునికొఱకు, జుష్టమ్=ప్రియమైన దానవునగు, త్వా=నిన్ను, గృహ్ణామి=గ్రహించుచున్నాను. ఏషః=ఈ ఖరప్రదేశము, తే=నీకు, యోనిః=స్థానము. (తత్=అందువలన,) ఇన్ద్రాయ=ఇంద్రునికొఱకు, త్వా=నిన్ను, (అత్ర=ఈ ఖరప్రదేశమునందు, సాదయామి=ఉంచుచున్నాను.

తాత్పర్యము: (ఇంద్రదేవతాకము లయిన అతిగ్రాహ్యము లనెడి పేరుగల అయిదు గ్రహములను (పాత్రములను,) సోమ రసమును నింపి యజ్ఞకర్మయం దుపయోగింతురు. ఆ సందర్భమున ఈ మంత్రమునందు మొదటి అతి గ్రాహ్య గ్రహమును గుఱించి చెప్పఁబడినది.)
ఓ ప్రథమాతిగ్రాహ్యమా! నీవు దారుపాత్రముచే గ్రహింపఁబడినదాన వగుచున్నావు. నీవు మనుష్యులలోను, వృక్షములలోను, భువనములలోను స్వామివిగా ఉన్నావు. ఇంద్రునకు ప్రియమైనదానవు. ఈ ఖరప్రదేశము నీకు స్థానము. కావున ఇంద్రునికై నిన్ను ఈ ఖరప్రదేశమునం దుంచుచున్నాను. (అయిదు అతి గ్రాహ్యములలో మొదటి దానిని తీసికొని ఖర ప్రదేశమునం దుంచవలెను.)

2\. అర్థము: (హే ద్వితీయాతిగ్రాహ్య!=ఓ రెండవ అతిగ్రాహ్యమా!, త్వమ్=నీవు,) ఉపయామ గృహీతః, అసి. అప్సుషదమ్=ఉదకములందు ఉన్నదానవును, ఘృతసదమ్=ఆజ్యమునందు ఉన్నదానవును, వ్యోమసదమ్=ఆకాశమునందు ఉన్నదానవును, ఇన్ద్రాయ=ఇంద్రునికొఱకు, జుష్టమ్=ప్రియమైన దానవునగు, త్వా=నిన్ను, గృహ్ణామి=గ్రహించుచున్నాను, ఏషః, తే, యోనిః. తస్మాత్, ఇన్ద్రాయ, త్వా, అత్ర, సాదయామి. (ఈ పదముల యర్థము 1 వ మంత్ర వ్యాఖ్యానమున చెప్పఁబడినది. తాత్పర్యము సులభగ్రాహ్యము.)

3\. అర్థము: (హే తృతీయాతిగ్రాహ్య! త్వమ్,) ఉపయామ గృహీతః, అసి! పృథివిషదమ్=పృథివియందున్నది, అన్తరిక్షసదమ్=అంతరిక్షమునందున్నది. నాకసదమ్=స్వర్గలోకమునందున్నది. శేషము పూర్వోక్తము.

4\. అర్థము: యే గ్రహాః=ఏ అతిగ్రాహ్య రూపములైన గ్రహములు, (=పాత్రములు) పఞ్చజనీనాః=దేవ మనుష్యాసుర రక్షో గన్ధర్వులకు హితములైనవో, లేదా, నిషాదజాతితో కలిసి అయిదు వర్ణముల ప్రజలకు హితము అయినవో, యేషామ్=ఏ అతిగ్రాహ్యములకు, తిస్రః=ఆగ్నేయైన్ద్రసౌర్యాఖ్యములయిన అతిగ్రాహ్యములు, పరమజాః=ప్రకృతులో, (అపి చ=మఱియు, యేషాం ప్రభావేన=ఏ అతిగ్రాహ్యములయొక్క ప్రభావము చేత,) దైవ్యః కోశః=ద్యులోకమునం దుద్భవించిన మేఘము, సముబ్జితః=వర్షాభిముఖముగ చేయఁబడినదో, విశ్రపియాణామ్=వివిధములయిన హనుస్థానీయములయిన పాత్రాగ్రములు గల, తేషామ్=ఆ అతిగ్రాహ్యములయొక్క, (పూరణాయ=పూరణముకొఱకు,) ఇషమ్=అన్న సదృశమైన, ఊర్జమ్=బలప్రదమైన సోమ రసమును, సమగ్రభీమ్=బాగుగ గ్రహించుచున్నాను.

తాత్పర్యము: ఈ అతిగ్రాహ్యపాత్రములు దేవ మనుష్యా సుర గంధర్వులకు, లేక, నిషాదవర్ణముతో కలిసి పంచవర్ణస్థులయిన మనుష్యులకు హితములైనవి. ఆగ్నేయైన్ద్రసౌర్యాఖ్యములైన అతిగ్రాహ్యములు వీనికి ప్రకృతులు. వీని ప్రభావముచే ద్యులోకోద్భవమైన మేఘము వర్షాభిముఖ మగును. దవడలవంటి అగ్రములు గల అతిగ్రాహ్యములను పూరించుటకు అన్నసదృశమును, బలప్రదమునగు సోమరసమును గ్రహించుచున్నాను. (ఈ మంత్రము చెప్పుచు నాల్గవ అతిగ్రాహ్యపాత్రమును గ్రహించవలెను.)

5\. అర్థము: (హే అతిగ్రాహ్యాః!=ఓ అతిగ్రాహ్య గ్రహములారా!) వః=మీలో, ఉత్తమమ్=చరమమైనదియు, అపామ్=ఉదకములయొక్క, రసమ్=రసస్వరూపమును, ఉద్వయసమ్=ఉద్భూతమైన అన్నమైనదియు, లేక, జీవన హేతువును, సూర్యరశ్మిమ్=సూర్యుఁడు పరిపాక హేతువుగాఁ గలదియు, (వృష్టిచే దెబ్బతిన్న సస్యములు సూర్యరశ్మిచే పక్వములగునని భావము.) సమాభృతమ్=ద్యులోకమునుండి గాయత్రిచే తీసికొనిరాఁబడినదియు, అపాం రసస్య=సోమవల్లీ రూపమున పరిణతి చెందిన ఉదక రసమునకు, రసః=సారమైనది, యః=ఏది, అస్తి=కలదో, తమ్=అటువంటి రసమును, గృహ్ణామి=గ్రహించుచున్నాను. ఏషః, తే, యోనిః. ఇన్ద్రాయ, త్వా, అత్ర, సాదయామి. (అర్థము పూర్వోక్తము.)

తాత్పర్యము: ఓ అతిగ్రాహ్యములారా! మీలో చరమమైన సోమరస పూర్ణమైన గ్రహమును గ్రహించుచున్నాను. ఓ చరమ గ్రహమా! నీ కీ ఖరప్రదేశము స్థానము. ఇంద్రునకై నిన్ను ఈ ఖరప్రదేశమునం దుంచుచున్నాను. ఉదక ముల రసమే సోమరసముగా పరిణతి చెందినది. అన్నమైనది. లేక, జీవన హేతువు. సూర్యరశ్మిచే పరిపక్వ మగునది. గాయత్రిచే ద్యులోకమునుండి యీ లోకమునకు తీసికొని రాఁబడినది. సోమలతగా పరిణతి చెందిన ఉదకరసమునకు కూడ సారమైనది. (ఈ మంత్రము చెప్పుచు పంచమ గ్రహమును గ్రహించ వలెను.)

8. **అర్థము:** అయా=ఈ, (ప్రజాపతిః=ప్రజాపతి,) విష్టా=విశేషముగ ఇచట నున్నవాఁడై, కర్వరాణి=(ఈ) కర్మలను, జనయన్=సంపాదించుచు, (వర్తతే=ఉంటున్నాఁడు.) హి=ఏ కారణమువలన, సః=ఆ ప్రజాపతి, ఘృణిః=ప్రకాశకుఁడై, వరాయ=శ్రేష్ఠమైన కర్మఫలముకొఱకు, ఉరుః=విస్తీర్ణమైన, గాతుః=మార్గముగా, (భవతి=అగుచున్నాఁడో, (తత్=ఆ కారణమువలన,) సః=ఆ ప్రజాపతి, మధ్వః=మధువువంటి కర్మఫలమును, ధరుణః=ధరింపఁజేయువాఁ డగుచు, అగ్రం=మా సమీపమును, ఉదైత్=ఉత్కర్షగా పొందుఁగాక. యత్=ఏ కారణమువలన, స్వాయాం తనువామ్=స్వీయ శరీరమునందు, తనువమ్=మా శరీరమును, ఐరయత్=పొందించుచున్నాఁడో, (తస్మాత్=అందువలన, వయమ్=మేము, ఫలమ్=ఫలమును, ప్రాప్స్యామః=పొందఁగలము. హే సోమరస గ్రహ సముదాయ!=ఓ సోమరస గ్రహ సముదాయమా! త్వమ్=నీవు,) ఉప యామ గృహీతః, అసి; ప్రజాపతయే=ప్రజాపతికొఱకు, జుష్టమ్=ఇష్టమైన, త్వా=నిన్ను, గృహ్ణామి=గ్రహించుచున్నాను. ఏషః, తే, యోనిః. ప్రజాపతయే, త్వా, అత్ర, సాదయామి. (అర్థము పూర్వవత్తు.)

తాత్పర్యము: ప్రజాపతి దేవతాకములైన పదునేడు సోమరస గ్రహములను ఈ మంత్రము చెప్పుచు గ్రహించవలెను. ప్రజాపతి విశేషముగ ఇచట ఉన్నవాఁడై కర్మలను ప్రవర్తింపఁ జేయుచున్నాఁడు. ప్రజాపతి శ్రేష్ఠమైన కర్మ ఫలముకొఱకు విస్తీర్ణమార్గ మగుచున్నాఁడు, కనుక మధువువంటి కర్మఫలమును మాకు కలుగఁజేయుచు మా సమీపమును పొందుఁగాక. ప్రజాపతి తన శరీరమునందు మా శరీరమును కలుపుచున్నాఁడు. కనుక మేము నిశ్చయముగ కర్మఫలమును పొందఁగలము. ప్రజాపతి దేవతాక సప్తదశ గ్రహ సమూహమా! ప్రజాపతి కిష్టమైన నిన్ను గ్రహించుచున్నాను. నీకు ఈ ఖరప్రదేశము స్థానము. ప్రజాపతికొఱకు నిన్ను ఈ ఖర ప్రదేశమునం దుంచుచున్నాను. (నాల్గవ ప్రపాఠకమునందు అంతర్యామాదికములు షోడశ్యంతములునైన గ్రహ ములు చెప్పఁబడినవి. ఆ ప్రకరణమున "ఉపయామ గృహీతో ఽసి" త్యాది మంత్రములు సవిశేషముగ వ్యాఖ్యాతములైనవి.)

ద్వాదశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే సప్తమప్రపాఠకే త్రయోదశోఽనువాకః।

మూలము: [1]అన్వహ మాసా అన్వి ద్వనా న్యన్వోషధీ రను పర్వతాసః। అన్విన్ద్రగ్ం రోదసీ వావశానే అన్వాపో అజిహత జాయమానమ్। [2]అను తే దాయి మహ ఇన్ద్రియాయ సత్రా తే విశ్వ మను వృత్రహత్యే। అను క్షత్ర మను సహో యజత్రేన్ద్ర దేవేభి రను తే నృషహ్యే। [3]ఇన్ద్రాణీ మాసు నారిషు సుపత్నీ మహ మశ్రవమ్। న హ్యస్యా అపరంచన జరసా (౧)మరతే పతిః। [4]నాహ మిన్ద్రాణి రారణ సఖ్యు ర్వృషాకపే ర్ఋతే। యస్యేద మప్యగ్ం హవిః ప్రియం దేవేషు గచ్ఛతి। [5]యో జాత ఏవ ప్రథమో మనస్వాన్దేవో దేవా న్క్రతునా పర్యభూషత్। యస్య శుష్మా ద్రోదసీ అభ్యసేతాం నృమ్ణస్య మహ్నా స జనాస ఇన్ద్రః। [6]ఆ తే మహ ఇన్ద్రోత్యుగ్ర సమన్యవో యత్సమర న్త సేనాః। పతాతి దిద్యు న్నర్యస్య బాహ్వో ర్మాతే (౨)మనో విష్వద్రియ గ్విచారీత్। [7]మా నో మర్ధీ రాభరా దద్ధి తన్నః ప్రదాశుషే దాతవే భూరి యత్తే। నవ్యే దేష్ణే శస్తే అస్మి న్త ఉక్థే ప్ర బ్రవామ వయ మిన్ద్ర స్తువన్తః। [8]ఆతూభర మాకి రేత త్పరిష్ఠా ద్విద్మాహి త్వా వసుపతిం వసూనామ్। ఇన్ద్ర య త్తే మాహినం దత్ర మస్త్యస్మభ్యం తద్ధర్యశ్వ (౩)ప్రయన్ధి। [9]ప్ర దాతారగ్ం హవామహ ఇన్ద్ర మా హవిషా వయమ్। ఉభా హి హస్తా వసునా పృణస్వా ఽఽప్రయచ్ఛ దక్షిణా దోత సవ్యాత్। [10]ప్రదాతా వజ్రీ వృషభ స్తురాషా ట్ఛుష్మీ రాజా వృత్రహా సోమపావా। అస్మి న్యజ్ఞే బర్హిష్యానిషద్యాథా భవ యజ మానాయ శం యోః। [11]ఇన్ద్ర స్సుత్రామా స్వవాగ్ం అవోభి స్సుమృడీకో భవతు విశ్వవేదాః।

బాధతాం ద్వేషో అభయం కృణోతు సువీర్యస్య (ళ)పతయ స్స్యామ [12]తస్య వయగ్ం సుమతౌ యజ్ఞియస్యాపి భద్రే సౌమనసే స్యామ। స సుత్రామా స్వవాగ్ం ఇన్ద్రో అస్మే ఆరా చ్చిద్ద్వేష స్సనుత ర్యుయోతు। [13]రేవతీ ర్న స్సధమాద ఇన్ద్రే సన్తు తువివాజాః। క్షుమన్తో యాభి ర్మదేమ। [14]ప్రోష్వస్మై పురో రథ మిన్ద్రాయ శూష మర్చత। అభీకే చిదు లోకకృత్సఙ్గే సమత్సు వృత్రహా! అస్మాకం బోధి చోదితా నభన్తామన్యకేషామ్। జ్యాకాఅధి ధన్వసు ॥౨॥

(జరసా మా తే హర్యశ్వ సువీర్యస్యాధ్యేకం చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే సప్తమప్రపాఠకే త్రయోదశోఽనువాకః ॥౧౩॥

(పాకయజ్ఞగ్ం సగ్ంశ్రవాః పరోక్షం బర్హిషో ధ్రువా మగన్మేత్యాహ దేవ సవిత ర్దేవస్యాహం క్షత్ర స్యోల్బం వాజస్యాగ్ని రేకాక్షరేణోపయామగృహీతో ఽసి నృషద మన్వహ త్రయోదశ ॥౧౩॥)

[పాకయజ్ఞం పరోక్షం ధ్రువాం వి సృజతే చ నః సర్వవీరాం పతయః స్యామైకపఞ్చాశత్॥౫౧॥)

హరిః ఓమ్॥

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే సప్తమః ప్రపాఠకః।

వేదార్థ దీపిక

అవతారిక: ద్వాదశానువాకమునందు వాజపేయ మంత్రములు సమాప్తి చేయఁబడినవి. ఈ త్రయోదశానువాకమునందు కామ్య యాజ్యా పురోనువాక్యలు చెప్పఁబడుచున్నవి.

1. అర్థము: మాసాః=చైత్రాది మాసములు, జాయమానమ్=పుట్టుచున్న, ఇన్ద్రమను=ఇంద్రు ననుసరించి, అజిహత=మమ్మనుగ్రహించుటకు వచ్చినవి. (ఏవమ్=ఈ విధముగ,) వనాని అహ=వనములును, ఓషధీ రిత్=ఓషధులును, పర్వతాసః అహ=పర్వతములును, వావశానే=మమ్ము కోరుచున్న, రోదసీ=ద్యావా భూములును, ఆపః ఇత్=ఉదకములును, ఇన్ద్ర మను=ఇంద్రునను సరించి, అజిహత=మమ్ము అనుగ్రహించుటకు వచ్చినవి.

తాత్పర్యము: చైత్రాదిమాసములు, వనములు, ఓషధులు, పర్వతములు, ద్యావా భూములు, ఉదకములును పుట్టుచునే యున్న యింద్రు ననుసరించి మమ్మనుగ్రహించుటకు వచ్చినవి. (ఈ మంత్రమునఁ గల 'అహ' 'ఇత్' అను అవ్యయములు సముచ్చయార్థకములు. 'అను' అను అవ్యయము ఆఱుమారులు ఉపాత్తమైనది. అట్లు ఉపాత్తమగుట ఆఱు వాక్యములుగా అన్వయము చేయుటకే. ఇది పురోనువాక్య.)

2. అర్థము: యజత్ర=యాగోద్దేశ్యుఁడవైన, హే ఇన్ద్ర!=ఓ యింద్రా!, వృత్రహత్యే అను=వృత్రవధానంతరము, తే=నీయొక్క, ఇన్ద్రియాయ=బలముకొఱకు, క్షత్త్రి మను=(నీ) క్షత్రియత్వ జాత్యభిమానము ననుసరించి, సహో అను=(నీ) బలము ననుసరించి, నృషహ్యే అను=వైరి మనుష్య తిరస్కారశీలము ననుసరించి, మహే=(సర్వ దేవతల కంటె,) గొప్పవాఁడవైన, తే=నీకొఱకు, సత్రా=యాగములందు, విశ్వమ్=సర్వ హవిస్సు, దేవేభిః=అగ్న్యాది దేవతలచే, అనుయాయి=అనుక్రమముగ ఈయఁబడుచున్నది. ('దేవేభిః'=ఇది ఛాన్దస ప్రయోగము. 'దేవైః' అని లౌకిక సంస్కృత ప్రయోగము. ఇట్లే 'సత్రేషు' అనుటకు బదులుగా 'సత్రా' అని ప్రయుక్తమైనది.)

తాత్పర్యము: యాగమునందు ఉద్దేశ్యుఁడవైన యింద్రా! నీవు వృత్రాసురుని సంహరించితివి. కావున తద్వధానంతరము నీకు బలము సిద్ధించుటకును, త్వదీయ క్షత్రియత్వ జాత్యభిమానమును, నీ బలమును, వైరులను తిరస్కరించునట్టి నీ స్వభావమును అనుసరించి యందఱికంటె గొప్పవాఁడవైన నీకు యాగములందు సర్వ హవిస్సు అగ్న్యాది దేవతలచే అనుక్రమముగా ఈయఁబడుచున్నది. (ఇది యాజ్య.)

3. అర్థము: ఆసు, నారిషు=ఈ స్త్రీలలో, ఇన్ద్రాణీమ్=ఇంద్రుని యొక్క భార్యను, సుపత్నీమ్=పతివ్రతనుగా, అహమ్=నేను, అశ్రవమ్=వింటిని. అపరంచన=మఱియొకటి కూడ, (అస్తి=కలదు.) అస్యాః=ఈ యింద్రాణి యొక్క, పతిః=భర్త, జరసా=ముసలితనముచేత, నహి మరతే=మరణించనే మరణించఁడు.

తాత్పర్యము: ఈ స్త్రీలలో ఇంద్రునియొక్క భార్యను పతివ్రతనుగా వినియున్నాను. మఱియొక విషయము కూడ కలదు. ఏమనఁగా-ఈ యింద్రాణియొక్క భర్త ముసలితనముచేత మరణించనే మరణించఁడు. ('మరతే' వైదికైక ప్రయోగము. దీనికి లౌకిక సంస్కృతమున 'మ్రియతే' అని యుండును. నారిషు=నారీషు. ఇది పురోనువాక్య.)

4. అర్థము: హే ఇన్ద్రాణి!=ఓ యింద్రాణీ!, యస్య=ఏ నాయొక్క, ఇదమ్=ఈ, అప్యమ్=ఉదక జన్యమైన, హవిః=సోమ పురోడాశాది హవిస్సు, ప్రియమ్=ఇష్టమైనదియై, దేవేషు=దేవతలయందు, గచ్ఛతి=పోవుచున్నదో, (=దేవతలకు చెందుచున్నదో, సః) అహమ్=ఆ నేను, సఖ్యుః=నీ ప్రియుఁడైన, వృషాకపేః ఋతే=ఇంద్రుని విడచి, (అన్యమ్=ఇతరుని) న రారణ=కీర్తించుటయే లేదు. (ఇది యాజ్య.)

తాత్పర్యము: ఓ యింద్రాణీ! ఉదక జన్యమైన సోమ పురోడాశాది హవిస్సును దేవతల కందఁజేయుచున్న నేను నీ ప్రియుఁడైన యింద్రుని గాక మఱియొక దేవతను కీర్తించుటయే లేదు.

5. అర్థము: యః దేవః=ఏ యింద్రదేవుఁడు. జాత ఏవ=పుట్టుచునే, ప్రథమః=(దేవతలలో) ముఖ్యుఁడుగాను, మనస్వాన్=ధైర్యము కలవాఁడుగాను, (భూత్వా=అయి) క్రతునా=వృత్రవధాది కర్మచే, దేవాన్=అగ్న్యాది దేవతలను, పర్యభూషత్=అతిక్రమించెనో, యస్య=ఏ యింద్రునియొక్క, శుష్మాత్=బలమువలన, రోదసీ=ద్యావా భూములు, అభ్యసేతామ్=భయపడినవో, హే జనాసః=ఓ జనులారా!, సః ఇన్ద్రః=ఆ యింద్రుఁడు, నృమ్ణస్య=(తన) బలముయొక్క, మహ్నా=మహిమచేత, (యుష్మాన్=మిమ్ము,) అవతు=రక్షించుఁగాక. ('భ్యస=భయే'. అను ధాతువునుండి 'అభ్యసేతామ్' అని యేర్పడినది.)

తాత్పర్యము: ఇంద్రుఁడు పుట్టుక మాత్రముచేతనే దేవతలలో ముఖ్యుఁడుగాను, ధైర్యము కలవాఁడుగాను అయి వృత్రవధాది కర్మచేత అగ్న్యాది దేవతల నతిక్రమించెను. ఆ యింద్రునియొక్క బలమువలన ద్యావా భూములు భయపడినవి, ఓ జనులారా! అట్టి యింద్రుఁడు తన బలమహిమచేత మిమ్ము రక్షించుఁగాక. (ఇది పురోనువాక్య. 'జనాసః, పర్వతాసః' ఇత్యాదులు వైదికైక ప్రయోగములు.)

6. అర్థము: ఉగ్ర=ఉగ్రుఁడవైన, హే ఇన్ద్ర!=ఓ యింద్రా!, అ=అంతటను, తే=నీయొక్క, ఊతీ=రక్షణము, మహః=అధికమైనది. యత్=ఏ రక్షణమువలన, సేనాః=మా సేనలు, సమన్యవః=వైరుల విషయమున ఉపయుక్తములై, సమరన్త=బాగుగ సమరక్రీడ నాచరించినవో, (కించ=మఱియు,) నర్యస్య=మనుష్య సహితుఁడవైన, తే=నీయొక్క, బాహువోః=బాహువులందలి, దిద్యుత్=(ఖడ్గాది) దీప్తి, పతాతి=అంతటను ప్రసరించుచున్నది. తే=నీయొక్క, మనః=మనస్సు, విష్వద్రియక్=బహుముఖ మగుచు, మా విచారీత్=సంచరింపకుండుఁగాక. (బాహువోః=బాహ్వోః)

తాత్పర్యము: ఉగ్రుఁడవైన యింద్రా! నీ రక్షణమువలన మా సేనలు శత్రువుల విషయమున ఉపయుక్తములగుచు యుద్ధక్రీడ నాచరించినవి. కనుక నీ రక్షణము గొప్పది. మఱియు మనుష్య సహితుఁడవైన నీ బాహువు లందలి ఖడ్గాదుల కాంతి అంతటను వ్యాపించుచున్నది. నీ మనస్సు బహుముఖములుగా ప్రసరింపకుండుఁ గాక. ('పతాతి'=పతతి. ఇది యాజ్య.)

7. అర్థము: హే ఇన్ద్ర!=ఓ యింద్రుఁడా! నః=మమ్ము, (మా ప్రజలను) మా మర్ధీః=కలహార్థులనుగా చేయకుము. (కింతు=మఱేమనఁగా,) ప్రదాతుషే=ప్రకర్షగా హవిస్సు నిచ్చుచున్న (యజమానాయ=యజమానునికొఱకు,) దాతవే=ఇచ్చుటకొఱకు, తే=నీకు, యత్ భూరి=ఏ గొప్పధనము, (సంచిత మస్తి=సంపాదింపఁబడినది కలదో,) తత్=ఆ ధనమును, ఆ భరా=తెమ్ము. (ఆహృత్య చ=తెచ్చియు,) నః=మాకొఱకు, దద్ధి=ఇమ్ము. (=దేహి.) హే ఇన్ద్ర!=ఓ యింద్రా!, నవ్యే=నూతనమైనదియు, దేష్ణే=త్వద్దాన సాధనమైనదియు, శస్తే=ప్రశస్తమైనదియునగు, అస్మిన్=ఈ కర్మయందు, తే=నీ సంబంధమైన, ఉక్థే=శస్త్రము (స్తోత్రము) నందు, స్తువన్తః=స్తోత్రము చేయుచున్న, వయమ్=మేము, ప్ర బ్రవామ=ఎక్కువగ ప్రార్థించుచున్నాము.

తాత్పర్యము: ఓ యింద్రా! నీవు మమ్ము, మా ప్రజలను కలహకారులనుగా చేయకుము. మఱేమనఁగా—నీ కధికముగ హవిస్సు నొసఁగుచున్న యజమానునకు ఇచ్చుటకై నీయొద్ద సంచితమైయున్న ధనమును తెచ్చి మాకొసఁగుము. క్రొత్తదియు, నీ దానమునకు సాధనమైనదియు ప్రశస్తమునైన యీ కర్మయందు నీకు సంబంధించిన స్తోత్ర పాఠముచే స్తోత్రము చేయుచున్న మేము ప్రార్థించుచున్నాము. (పురోనువాక్య.)

8. అర్థము: హే ఇన్ద్ర!=ఓ యింద్రా! (త్వమ్=నీవు,) ఆ తూభరైవ=ధనమును నిశ్చయముగ తీసికొని రమ్ము. ఏతత్=ఈ తెచ్చిన ధనము, పరి=పరస్థలమునందు, మాకిః=ఉండకపోవుఁగాక. యత్=ఏ కారణమువలన, త్వా=నిన్ను, వసూనామ్=ధనవంతులకు, వసుపతిమ్=ధనపతినిగా, విద్మ=తెలిసికొంటిమో, హే ఇన్ద్ర!=ఓ యింద్రుఁడా! తే=నీయొక్క, మాహినమ్=ధనము, దత్త్రమ్=ఈయఁదగినది, యత్=ఏది, అస్తి=కలదో, హే హర్యశ్వ!=హరినామకాశ్వములతో కూడిన యింద్రా! తత్=ఆ ధనమును, అస్మభ్యమ్=మాకొఱకు, ప్రయన్ధి=ఇమ్ము.

తాత్పర్యము: ఓ యింద్రా! నీవు ధనవంతులకు ధనపతివని తెలిసికొంటిమి, కావున నీవు తప్పక ధనమును తీసికొని రమ్ము. ఈ తెచ్చిన ధనము పరులయొద్ద ఉండకపోవుఁగాక. ఓ యింద్రా! ఈయఁదగిన నీ ధన మేది కలదో; హరి నామకములైన అశ్వములతో కూడిన యింద్రా! ఆ ధనమును మాకొసఁగుము. (ఇది యాజ్య.)

9. అర్థము: ప్రదాతారమ్=ప్రకృష్టముగ ధనమునిచ్చునట్టి యింద్రుని, హవిషా=హవిస్సుతో (యుక్తాః=కూడిన,) వయమ్=మేము, ఆ హవామహే=ఆహ్వానించుచున్నాము. హే ఇన్ద్ర!=ఓ యింద్రా! ఉభా హి హస్తా=రెండుచేతులనుగూడ, వసునా=ధనముచేత, పృణస్వ=పూరించుము. తతః=పిమ్మట, ఆ=నాకభిముఖముగ, దక్షిణాత్=కుడిచేతినుండియు, ఉత=మఱియు, సవ్యాత్=ఎడమచేతినుండియు, ప్ర యచ్ఛ=(ధనమును) ఇమ్ము. (ఇది యాజ్య. ఉభా=ఉభౌ, హస్తా=హస్తౌ. ఆ+ఉత=ఓత.)

తాత్పర్యము: అధికముగ ధనము నిప్పించునట్టి యింద్రుని హవిష్మంతులమైన మేము ఆహ్వానించుచున్నాము. ఓ యింద్రా! నీవు రెండుచేతులను గూడ ధనముతో నింపుము. పిమ్మట కుడిచేతితోను, ఎడమచేతితోను ధనము నిమ్ము.

10. అర్థము: హే ఇన్ద్ర!=ఓ యింద్రుఁడా!, ప్రదాతా=అధికముగ దానము చేయువాఁడవును, వజ్రీ=వజ్రాయుధము కలవాఁడవును, వృషభః=అభిమత ధనములను వర్షించువాఁడవును, తురాషాట్=శీఘ్రముగ శత్రువులను తిరస్కరించువాఁడవును, శుష్మీ=బలవంతుఁడవును, రాజా=ప్రకాశించుచున్న వాఁడవును, వృత్రహా=వృత్రాసురుని వధించిన వాఁడవును, సోమపావా=సోమపానము చేసినవాఁడవునగు, త్వమ్=నీవు, అస్మిన్ యజ్ఞే=ఈ యజ్ఞమునందలి, బర్హిషి=దర్భలు పఱచియున్న వేదియందు, ఆ నిషద్య=వచ్చి కూర్చుండి, అథ=పిమ్మట, శమ్=సుఖకరుఁడవు, యోః=అనిష్టమును తొలఁగించువాఁడవును, భవ=కమ్ము.

తాత్పర్యము: ఓ యింద్రా! పూర్వోక్త గుణయుక్తుఁడవైన నీవు ఈ యజ్ఞమునందలి దర్భలు పఱచియున్న వేదిమీదకు వచ్చి కూర్చుండి మాకు సుఖమును కలుగఁజేయుచు అనిష్టములను తొలఁగించుము. (వజ్రీత్యాది పదముల భావము స్పష్టము. ఇది యాజ్య.)

11. అర్థము: ఇన్ద్రః=(ఈ)ఇంద్రుఁడు, సుత్రామా=బాగుగ రక్షించువాఁడు, స్వవాన్=ధనము కలవాఁడు, అవోభిః=రక్షణములచేత, సుమృడీకః=సుఖమును జేయువాఁడు, విశ్వవేదాః=మేము చేసిన సకల సపర్యలను తెలిసికొనినవాఁడును, భవతు=అగుఁగాక. బాధతామ్=(మమ్ము) బాధించుచున్న శత్రువులకు, ద్వేషః=విద్వేషియైన, సః=ఆ యింద్రుఁడు, అస్మాకమ్=మాకు, అభయమ్=భయ రాహిత్యమును, కృణోతు=చేయుఁగాక. (వయమ్=మేము,) సువీర్యస్య=శత్రువుల నభిభవించునట్టి సామర్థ్యమునకు, పతయః=స్వాములము, స్యామ=అగుదుము గాక.

తాత్పర్యము: ఈ యింద్రుఁడు మమ్ము బాగుగ రక్షించువాఁడు, ధనము కలవాఁడు, రక్షణములచేత సుఖము కలుగఁజేయువాఁడు, మా సపర్యల నన్నింటిని తెలిసికొనినవాఁడును అగుఁగాక. మమ్ము బాధించు శత్రువులను ద్వేషించునట్టి ఆ యింద్రుఁడు మా కభయము నొసఁగుఁగాక. మేము శత్రువుల నభిభవించునట్టి సామర్థ్యము కలవార మగుదుము గాక. (కృణోతు=కరోతు. ఇది పురోనువాక్య.)

12. అర్థము: వయమ్=మేము, యజ్ఞియస్య=యజ్ఞ సంబంధియగు, తస్య=ఆ యింద్రునియొక్క, సుమతౌ=అనుగ్రహయుక్త మనస్సునందు, అపి చ=మఱియు, భద్రే=మంగళకరమైన, సౌమనసే=మనస్సమాధియందు, స్యామ=ఉందుము గాక. సుత్రామా=బాగుగ రక్షించువాఁడును, స్వవాన్=ధనవంతుఁడునగు, సః ఇన్ద్రః=ఆ యింద్రుఁడు, సనుతః=[illegible]విర్ధాతలమగు, అస్మే=మాయొక్క, ద్వేషః=శత్రువులను, ఆరాత్ చిత్=దూరమునుండియే, యుయోతు=వేఱుచేయుఁగాక. (అస్మే=అస్మాకమ్, ద్వేషః=ద్విషః, ఇది యాజ్య.)

తాత్పర్యము: యజ్ఞ సంబంధియగు ఇంద్రుఁడు మాయం దనుగ్రహము కలిగియుండుఁగాక. మేము మంగళకరమైన మన (స్సమాధి) స్థైర్యము కలిగియుందుము గాక. బాగుగ రక్షించువాఁడును, ధనవంతుఁడును నగు ఆ యింద్రుఁడు మా శత్రువులను దూరమునుండియే తొలఁగించుఁగాక.

13. అర్థము: యాభిః=(సహ)=ఏ యుదకములతోఁగూడ, (వయమ్=మేము,) క్షుమన్తః=(ఇంద్రుని) స్తోత్రము చేయుచున్న వారమై, మదేమ=సంతోషించితిమో, రేవతీః=ధనము కలవియు, సధమాదః=మాతో కూడ సంతోషము కలిగియున్నవియు, తువివాజాః=బహ్వన్నోపేతములునగు, (తాః) ఆపః=ఆ యుదకములు, నః=మాయొక్క, ఇన్ద్రే=స్వామియగు నింద్రునియందు, సన్తు=(సుఖమునకై) ఉండుఁగాక. (ఈ యుదకములు శక్వరీ ప్రాపిత దాహశాన్తి ప్రదములు.)

తాత్పర్యము: ధనము కలవియు, మాతో కూడ సంతోషము కలిగియున్నవియు బహ్వన్నోపేతములునగు ఉదకములతో కూడ మేము (శబ్దము) స్తోత్రము చేయుచున్నవారమై సంతోషించితిమి. ఆ యుదకములు మా స్వామియగు నింద్రుని సుఖమునకై యుండుఁగాక. (ఇది శక్వరీ ఛన్దస్సు. యాజ్యానువాక్య. రాజకుమారుని ఐశ్వర్య ప్రాప్తికై చేయునట్టి ఇష్టికి సంబంధించినది.)

14. అర్థము: (అయ మిన్ద్రః=ఈ యింద్రుఁడు,) వృత్రహా=వైరి ఘాతియై, సమత్సు=యుద్ధములందు, సజ్గే(సతి)=(యుద్ధభటుల) కలయిక ఏర్పడుచుండఁగా, అభీకే చిదు=శత్రువు చంపుటకు కోరుచున్నవాఁడైనను, లోకకృత్=స్థైర్యము కలిగియుండువాఁడు, (ఇతి ఏవమ్=అని ఈ ప్రకారముగా) అస్మై ఇన్ద్రాయ=ఈ యింద్రుని యొక్క, (షష్ఠ్యర్థే చతుర్థీ) పురోరథమ్=రథ పురోభాగమునందు, (బలమ్=ఇంద్రుని,) ప్రోష్వర్చత=ప్రకర్షతో సుష్ఠుగా పూజింపుఁడు. (తథా పూజితః ఇన్ద్రః=ఆ విధముగ పూజింపఁబడిన యింద్రుఁడు,) అస్మాకమ్=మాకు, చోదితా=ఇతర వ్యాపృత్తికై ప్రేరణ చేయువాఁడై, బోధి=తెలిసికొనుఁగాక. (సావధానుఁడగుఁగాక.) అన్యకేషామ్=కుత్సితులయిన శత్రువులయొక్క, ధన్వసు=ధనువులందు, అధి=ఆశ్రయించియున్న, జ్యాకాః=అల్లెత్రాడులు, నభన్తామ్=నశించుఁగాక.

తాత్పర్యము: ఈ యింద్రుఁడు వైరి ఘాతియై యుద్ధములందు యోద్ధలతో కలియఁబడినపుడు శత్రువు వధింపవలెనని కోరిక కలవాఁడైనను స్థిరముగ నుండును, పలాయితుఁడు కాఁడు, అని యింద్రుని రథము నెదుట ఇంద్రుని పూజింపవలెను. ఇట్లు పూజితుఁడైన యింద్రుఁడు మాకు ఇతర వ్యాపృత్తికై ప్రేరకుఁడై సావధానుఁడగుఁగాక. కుత్సిత శత్రువుల ధనువుల అల్లెత్రాడులు తెగిపోవుఁగాక. (ఇది యాజ్య.)

సప్తమ ప్రపాఠకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ఽష్టమః ప్రపాఠకః।

తత్ర ప్రథమోఽనువాకః।

హరిః ఓమ్

మూలము: [1]అనుమత్యై పురోడాశ మష్టాకపాలం నిర్వపతి ధేను ర్దక్షిణా యే ప్రత్యఞ్చ శ్శమ్యాయా అవశీ యన్తే తం నైరృత మేకకపాలం కృష్ణం వాసః కృష్ణతూషం దక్షిణా [2]వీహి స్వాహా ఽఽహుతిం జుషాణ ఏష తే నిరృతే భాగో భూతే హవిష్మత్యసి ముఞ్చేమ మగ్ంహస స్స్వాహా నమో య ఇదం చకారా ఽఽ[3]దిత్యం చరుం నిర్వపతి వరో దక్షిణా ఽఽగ్నావైష్ణవ మేకాదశకపాలం వామనో వహీ దక్షిణా ఽగ్నీషోమీయమ్ (౧)ఏకాదశకపాలగ్ం హిరణ్యం దక్షిణైన్ద్ర మేకాదశ కపాల మృషభో వహీ దక్షిణా ఽఽగ్నేయ మష్టాకపాల మైన్ద్రం దధ్యృషభో వహీ దక్షిణైన్ద్రాగ్నం ద్వాదశకపాలం వైశ్వదేవం చరుం ప్రథమజో వత్సో దక్షిణా సౌమ్యగ్ం శ్యామాకం చరుం వాసో దక్షిణా సరస్వత్యై చరుగ్ం సరస్వతే చరుం మిథునౌ గావౌ దక్షిణా ॥౧॥

(అగ్నీషోమీయం చతుస్త్రిగ్ంశ చ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ఽష్టమప్రపాఠకే ప్రథమోఽనువాకః।

వేదార్థదీపిక

అవతారిక: ఈ యష్టమ ప్రపాఠకమునందు రాజసూయ యాగము విధింపఁబడుచున్నది. ఇందు మొదటి యిరువది అనువాకములందు రాజసూయమునకు సంబంధించిన ప్రధానకర్మ లనేకములు విహితములైనవి. ఇరువదియొకటి, ఇరువదిరెండు అనువాకములందు వరుసగా సౌత్రామణీ మంత్రములు, యాజ్యా పురోనువాక్యలు చెప్పఁబడినవి.

1. అర్థము: అనుమత్యై=అనుమతి దేవతకొఱకు, అష్టాకపాలమ్=ఎనిమిది కపాలములందు (=పాత్రములందు) సంస్కరింపఁబడిన, పురోడాశమ్=పురోడాశ మను హవిస్సును, నిర్వపతి=ఉంచవలెను. (ఈ కర్మయందు), ధేనుః=ఆవు, దక్షిణా=దక్షిణ. శమ్యాయాః=తిరుగలియొక్క క్రిందిభాగమునకు, ప్రత్యఞ్చః=పశ్చిమ భాగమున, యే=ఏ తండులపిష్ట లేశములు, అవశీయన్తే=క్రిందఁ బడుచున్నవో, నైరృతమ్=నిరృతి దేవతాకమయిన, ఏకకపాలమ్=ఒక కపాలమునందు సంస్కరింపఁబడిన, తమ్=ఆ తండుల పిష్టలేశములను పక్వము చేయఁగా నేర్పడిన పురోడాశమును, నిర్వపతి=ఉంచవలెను. కృష్ణతూషమ్=నల్లని అంచు గల, కృష్ణం వాసః=నల్లని వస్త్రము, దక్షిణా=దక్షిణ.

తాత్పర్యము: ఈ మంత్రమున రెండు కర్మలు చెప్పఁబడినవి. అనుమతి దేవతాక మొకటి. నిర్‌ఋతి దేవతాకము మఱి యొకటి. చతుర్దశీ మిశ్రిత పౌర్ణమాస్యభిమాని దేవత అనుమతి యనఁబడుచున్నది. ఈ కర్మయందు అనుమతి దేవత. అష్టాకపాల సంస్కృత పురోడాశము ఈ కర్మయం దుపయోగింపఁబడును. ఈ కర్మ యందు ధేనువును దక్షిణగా నీయవలెను. ఇది యొక కర్మ. రెండవ కర్మయందు నిర్‌ఋతి దేవత. ఈ దేవతకు ఏకకపాల సంస్కృత పురోడాశము నిర్వాపము చేయవలెను. ఈ కర్మయందు నల్లని యంచు గల నల్లని వస్త్రమును దక్షిణగా నీయవలెను. పురోడాశము నిమిత్తము తండులములను తిరుగలిలో పోసి విసరుచుండఁగా అడుగున నున్న ఱాతినుండి పశ్చిమ దిక్కున క్రింద పడిన బియ్యపు పిండియొక్క లేశము లను పురోడాశముగా చేసి ఆ పురోడాశమును ఒక కపాలమునందు సంస్కరించి నిర్వాపము చేయవలెను. తండులములను విసరుచుండగా శమ్యకు తూర్పుదిక్కున పడిన బియ్యపు పిండిని పురోడాశముగా చేసి దానిని అష్ట కపాలములందు సంస్కరించి అనుమతి దేవతకు నిర్వాపము చేయవలెను. రాజసూయ యాగారంభ మున ఈ కర్మలు రెండును ఆచరింపవలెను.

2. అర్థము: (1)(హే గార్హపత్య!=ఓ గార్హపత్యాగ్నీ!, తుభ్యమ్=నీ కొఱకు,) స్వాహా=దత్తమైన, ఆహుతిమ్=ఆహుతిని, జుషాణః=సేవించుచున్నవాఁడవై, వీహి=(దక్షిణ దిక్కునకు పోఁదలఁచిన మాతో,) విగతుఁడవు కమ్ము. హే నిర్‌ఋతే!=ఓ నిర్‌ఋతి దేవతా!, ఏషః=ఈ ఏక కపాల పురోడాశము, తే=నీ యొక్క, భాగః=భాగము. (2) హే భూతే!=అస్మ దైశ్వర్య హేతువైన ఓ నిర్‌ఋతి దేవతా!, (త్వమ్=నీవు, ఇదానీమ్=ఇప్పుడు,) హవి ష్మతీ=హవిస్సు కలదానవు, అసి=అగుచున్నావు. (అతః=ఇందువలన,) ఇమమ్=ఈ యజమానుని, అం హసః=(దారిద్ర్య ప్రదమైన)పాపమునుండి, ముఞ్చ=విడువుము. (3)యః=ఏ గార్హపత్యాగ్ని, ఇదమ్='వీహి' అను శబ్దముచే మాచే ప్రార్థింపఁబడిన అనుష్ఠానమును, చకార=యథోక్తముగ చేసెనో, తస్మై=ఆ గార్హ పత్యాగ్నికొఱకు, స్వాహా=హవిస్సు ఈయఁబడినది. నమశ్చ=నమస్కారము కూడ, (కృతమ్=చేయఁబడినది.)

తాత్పర్యము: ఓ గార్హపత్యాగ్నీ! నీ కీయఁబడిన హవిస్సును సేవించుచున్నవాఁడవై దక్షిణదిక్కునకు పోఁదలఁచిన మమ్ము విడువుము. ఓ నిర్‌ఋతి దేవతా! ఈ ఏక కపాలసంస్కృత పురోడాశము నీకు భాగము. స్వకీయ భాగ సంతుష్టిచే మా యైశ్వర్యమునకు కారణమైన ఓ నిర్‌ఋతి దేవతా! నీ విప్పుడు హవిష్మతి వగుచున్నావు. కావున ఈ యజమానుని దారిద్ర్య ప్రదమైన పాపమునుండి విడువుము. 'వీహి' అను శబ్దముచే మేము ప్రార్థించిన యనుష్ఠానమును యథోక్తముగ ఆచరించిన గార్హపత్యాగ్నికి హవిస్సు ఈయఁబడినది. నమస్కారము కూడ చేయఁబడినది. (ఈ మంత్రమున మూఁడు భాగములు గలవు. మొదటిభాగముచే స్రువముతో గార్హపత్యాగ్నియందు హోమము చేయవలెను. రెండవ భాగముచే నిర్‌ఋతి దేవత నుద్దేశించి అంగుష్ఠములచే హోమము చేసి కృష్ణవాసము నిర్‌ఋతి దేవతకు సమర్పించవలెను. మూఁడవ భాగముచే మఱల స్రువముతో గార్హపత్యాగ్నియందు హోమము చేసి నమస్కరించి ధేనువును దక్షిణగా నొసఁగవలెను.)

3. అర్థము: ఆదిత్యమ్=ఆదిత్య దేవతాకమైన, చరుమ్=చరువనెడి హవిస్సును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. వరః=గోవు, దక్షిణా=దక్షిణ. ఆగ్నా వైష్ణవమ్=అగ్ని విష్ణువులు దేవతలుగాఁగల, ఏకాదశకపాలమ్=పదు నొకండు కపాలములందు సంస్కృతమైన పురోడాశమును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను, వామనః=పొట్టిదియగు, వహీ=బరువు మోయునట్టి యెద్దు, దక్షిణా=దక్షిణ. అగ్నిషోమీయమ్=అగ్ని సోముఁడు దేవ తలుగాఁగల, ఏకాదశకపాలమ్=ఏకాదశ కపాల సంస్కృత పురోడాశమును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. హిరణ్యమ్=బంగారము, దక్షిణా=దక్షిణ. ఐన్ద్రమ్=ఇంద్ర దేవతాకమును, ఏకాదశ కపాలమ్=పదునొకండు కపాలములందు సంస్కృతమైనదియునగు పురోడాశమును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. ఋషభః=ఇంద్రియ సేచన సమర్థము అండసహితమునగు, వహీ=భారవాహియగు వృషభము, దక్షిణా=దక్షిణ. ఆగ్నే యమ్=అగ్ని దేవతాకము, ఐన్ద్రమ్=ఇంద్ర దేవతాకమును, అష్టాకపాలమ్=ఎనిమిది కపాలములందు సంస్కృతమైనదియునగు, దధి=పెరుగును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. ఋషభః, వహీ, దక్షిణా. ఐన్ద్రాగ్నమ్=ఇంద్రాగ్నులు దేవతలుగా కలదియు, వైశ్వదేవమ్=విశ్వేదేవ దేవతలు దేవతలుగాఁగలదియు,

ద్వాదశకపాలమ్=పన్రెండు కపాలములందు సంస్కృతమైనదియునగు, చరుమ్=చరువనెడి పురోడాశమును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. ప్రథమజః=మొదట పుట్టిన, వత్సః=వత్సము, (=దూడ) దక్షిణా=దక్షిణ. సౌమ్యమ్=సోమదేవతాకమైనదియు, శ్యామాకమ్=శ్యామాక (=చామ)ధాన్య సంబంధియునగు, చరుమ్=చరువనెడి హవిస్సును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. (ఐన్ద్రాగ్న వైశ్వదేవ సౌమ్యములగు మూఁడు హవిస్సులతోకూడిన ఆగ్రయణరూప యాగమంతయు నొక్కటియే.) వాసః=వస్త్రము, దక్షిణా=దక్షిణ. సరస్వత్యై=సరస్వతీ దేవతకొఱకు, సరస్వతే=సరస్వద్దేవతకొఱకు, చరుమ్=చరువనెడి హవిస్సును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. మిథునౌ=మిథునములైన, గావౌ=గోవులు, దక్షిణా=దక్షిణ.

తాత్పర్యము: రాజసూయ యాగము చేయుటకు ముందుగా ఒక దినమున మొదట అనుమతి దేవతాక యాగము చేసి పిమ్మట ఇతర దినములందు వరుసగా ముఖ్యములైన ఆదిత్యాది యాగముల నేడింటి నాచరించవలెను. ఆ యేడు యాగములందు, ఏ యే దేవతల నుద్దేశించి యెంతెంత పురోడాశము ఈయవలెనో, ఏది దక్షిణగా నీయవలెనో, ఈ మంత్రమున స్పష్టీకరించఁబడినది. వీనిలో అగ్నీషోమీయ దేవతాకములయిన హవిస్సులతో కూడినది ఒకే యాగము. ఇట్లే ఐన్ద్రాగ్న వైశ్వదేవ సౌమ్యదేవతాకములగు హవిస్సులు మూఁడింటితో కూడిన యాగ మొక్కటియే. ఇట్లు విభజించినచో ఇందు పేర్కొనఁబడిన యాగములు ఆదిత్యాది దేవతాకములు ఏడే అని స్పష్టమగుచున్నది. మిగిలిన భావము స్పష్టము.

ప్రథమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ఽష్టమప్రపాఠకే ద్వితీయోఽనువాకః।

మూలము: [1]ఆగ్నేయ మష్టాకపాలం నిర్వపతి సౌమ్యం చరుగ్ం సావిత్రం ద్వాదశ కపాలగ్ం సారస్వతం చరుం పౌష్ణం చరుం మారుతగ్ం సప్త కపాలం వైశ్వదేవీ మామిక్షాం ద్యావా పృథివ్య మేక కపాలమ్ ॥ ౧॥ (ఆగ్నేయం సౌమ్యం మారుత మష్టాదశ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ఽష్టమప్రపాఠకే ద్వితీయోఽనువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: ప్రథమానువాకమునందు ప్రాయణీయ హవిస్సునకు పిమ్మట నాచరింపవలసిన అనుమత్యాది దేవతాకములయిన యెనిమిది యాగములు, నిర్ఋత మంత్రములను చెప్పఁబడినవి, ఈ ద్వితీయానువాకమునందు చాతుర్మాస్యములందలి ప్రథమ పర్వరూప హవి రష్టకము చెప్పఁబడుచున్నది.

1. అర్థము: ఆగ్నేయమ్=అగ్ని దేవతాకమును, సౌమ్యమ్=సోమ దేవతాకమును, అష్టాకపాలమ్=ఎనిమిది కపాలములందు సంస్కృతమునగు, చరుమ్=చరువనెడి హవిస్సును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. సావిత్రమ్=సవితృ దేవతాకమును, సారస్వతమ్=సరస్వ ద్దేవతాకమును, ద్వాదశ కపాలమ్=పండ్రెండు కపాలములందు సంస్కృతమునైన, చరుమ్=చరువనెడి హవిస్సును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. పౌష్ణమ్=పూష దేవతాకము, మారుతమ్=మరు ద్దేవతాకమును, సప్తకపాలమ్=సప్తకపాలములందు సంస్కృతమును నగు, చరుమ్=చరువును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. వైశ్వదేవీమ్=విశ్వేదేవ దేవతాకము, ద్యావా పృథివ్యమ్=ద్యావా పృథివీ దేవతాకమును, ఏకకపాలమ్=ఒక కపాలమునందు సంస్కృతమైనదియునగు, ఆమిక్షామ్=ఆమిక్షను, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. (ఆమిక్ష=కాచఁబడిన వేడిపాలలో దధి వేసినచో నేర్పడిన స్వరూపము.)

తాత్పర్యము: ఈ మంత్రముచే ఆగ్నేయాద్యష్ట దేవతాకమైన హవిరష్టకము నిర్వాపము చేయవలెను. శేషము సుగమము.

ద్వితీయానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ఽష్టమ ప్రపాఠకే తృతీయోఽనువాకః।

మూలము: [1]ఐన్ద్రాగ్న మేకాదశ కపాలం మారుతీ మామిక్షాం వారుణీ మామిక్షాం కాయ మేక కపాలం [2]ప్రఘాస్యా న్హవామహే మరుతో యజ్ఞవాహసః కరమ్భేణ సజోషసః। [3]మో షూ ణ ఇన్ద్ర పృత్సు దేవాస్తు స్మ తే శుష్మి న్నవయా। మహీ హ్యస్య మీఢుషో యవ్యా। హవిష్మతో మరుతో వన్దతే గీః। [4]యద్గ్రామే యదరణ్యే యత్సభాయాం యదిన్ద్రియే। యచ్ఛూద్రే యదర్య ఏన శ్చకృమా వయమ్। యదేకస్యాధిధర్మణి తస్యా వయజనమసి స్వాహా। [5]అక్రన్కర్మ కర్మకృత స్సహ వాచామ యోభువా। దేవేభ్యః కర్మ కృత్వా ఽస్తంప్రేత సుదానవః ॥ ౧ ॥

(వయం యద్వింశతి శ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ఽష్టమప్రపాఠకే తృతీయోఽనువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: ద్వితీయానువాకమునందు వైశ్వదేవ మనెడి ప్రథమపర్వము చెప్పఁబడినది. ఈ తృతీయానువాకమునందు వరుణ ప్రఘాస మనెడి ద్వితీయపర్వము చెప్పఁబడుచున్నది.

1. అర్థము: ఐన్ద్రాగ్నమ్=ఇంద్రాగ్ని దేవతాకము, ఏకాదశకపాలమ్=పదునొకండు కపాలములందు సంస్కృతమునగు పురోడాశమును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. మారుతీమ్=మరుద్దేవతాకమైన, ఆమిక్షామ్=ఆమిక్షను, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. వారుణీమ్=వరుణ దేవతాకమైన, ఆమిక్షామ్=ఆమిక్షను, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. కాయమ్=ప్రజాపతి దేవతాకము, ఏక కపాలమ్=ఒక కపాలమునందు సంస్కృతమునగు పురోడాశమును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను.

తాత్పర్యము: చాతుర్మాస్యములలో వరుణప్రఘాస మనెడి ద్వితీయపర్వమున ఐన్ద్రాగ్నాది విశేష హవిస్సులు నాలుగు ఈ మంత్రమున చెప్పఁబడినవి. కః=ప్రజాపతి. కాయమ్=ప్రజాపతి దేవతాకము. శేషము సుగమము.

2. అర్థము: ప్రఘాస్యాన్=వరుణ పాశరూప కర్మను నశింపఁజేయుట కర్తలును, యజ్ఞవాహసః=యజ్ఞమును వహించు వారును, కరమ్భేణ=పెరుఁగు కలిపిన వేఁపుడు పిండిచేత, సజోషసః=పరస్పరము సమాన ప్రీతికలవారునగు, మరుతః=దేవతలను, హవామహే=ఆహ్వానించుచున్నాము.

తాత్పర్యము: మేము మరుత్తుల నాహ్వానించుచున్నాము. ఆ మరుత్తులు వరుణ పాశరూప కర్మను నశింపఁజేయుట కర్తలు. యజ్ఞ(భార)మును వహించువారు. దధి మిశ్రితమైన సక్తువును దక్షిణ వేదియందలి యగ్నియందు దంపతులు హోమము చేయుటచే సంతృప్తి పడువారు. (ఈ మంత్రము చెప్పుచు ప్రతిప్రస్థాత యజమానపత్నిని నాహ్వానించవలెను. మరుత్తులు=మరుద్గణములు.)

3. అర్థము: హే ఇన్ద్రదేవ!=ఓ యింద్రదేవా!, నః=మమ్ము, పృత్సు=సంగ్రామములందు, మో (ప్రవర్తయ)=ప్రవర్తింపఁజేయవలదు. (ఏతత్=ఈ ప్రవర్తింపఁజేయకుండుట) సు=సమీచీనము. హే శుష్మిన్!=బలవంతుఁడవైన ఓ యింద్రా!, తే=నీయొక్క, (ప్రసాదాత్=అనుగ్రహమువలన) అవయాః=అనిష్టనాశము, అస్తు స్మ=ఎల్లప్పుడు అగుఁగాక. హి=ఏ కారణమువలన, మీఢుషః=వృష్టిసేచన సమర్థుఁడవయిన నీయొక్క, (ప్రసాదాత్=అనుగ్రహమువలన,) అస్య=ఈ యజమానునియొక్క, మహీ=భూమి, యవ్యా=యవాది సర్వధాన్యములకు యోగ్యమైనదో, గీః=(మా)స్తుతిరూప వాక్కు, హవిష్మతః=కరమ్భ పాత్రరూప హవి ర్యుక్తులయిన, మరుతః=మరుత్తులను, వన్దతే=నమస్కరించుచున్నదో,

తాత్పర్యము: ఓ యింద్రదేవా! మమ్ము యుద్ధములందు ప్రవర్తింపఁ జేయకుము. శత్రువులే లేరు కావున అట్లు ప్రవర్తింపఁ జేయకుండుట యుక్తమే. బలవంతుఁడవైన యో యింద్రా! వర్షింపఁ జేయుటకు సమర్థుఁడవైన నీ యనుగ్రహమువలన మా భూమి (=ఈ యజమానునిభూమి,) సర్వవిధ ధాన్యములకు యోగ్యమైనది. కావున సర్వదా అనిష్టనాశము కలుగుఁగాక. మా స్తుతిరూప వాక్కు కరంభ పాత్రరూప హవి ర్యుక్తులైన మరుద్దేవతలను నమస్కరించుచున్నది. (స్తుతించుచున్నది. యజమానుఁడు పత్నియు ఉత్తర వేదియందు కరంభ పాత్రపూర్ణమైన శూర్పమును ఒకమారు శిరస్సుపై నుంచుకొని పిమ్మట దక్షిణాగ్నియందు కరంభమును హోమము చేయవలెను.)

4. అర్థము: వయమ్=మేము, గ్రామే=గ్రామ విషయముననను, అరణ్యే=అరణ్య విషయముననను, సభాయామ్=సభావిషయముననను, ఇన్ద్రియే=ఇంద్రియ విషయముననను, శూద్రే=శూద్రుని విషయముననను, అర్యే=స్వామి – లేక వైశ్యుని విషయముననను, యత్ ఏనః=ఏ పాపమును, చకృమా=చేసితిమో, ఏకస్య=దంపతుల మధ్యమున ఒకరికి, ధర్మణి=శాస్త్రీయ ధర్మము విషయమున, యత్ అధి=ఏ అధికపాపమును, చకృమా=చేసితిమో, (హే కరమ్భ పాత్రజాత!=ఓ కరంభ పాత్ర సముదాయమా! త్వమ్=నీవు,) తస్య=ఆ పాపమునకు, అవయజనమ్=వినాశకము, అసి=అగుచున్నావు. (అతః=ఇందువలన, త్వామ్=నిన్ను,) స్వాహా=ఇచ్చుచున్నాను. (=హోమము చేయుచున్నాను.)

తాత్పర్యము: మేము గ్రామారణ్యాదుల విషయమున ఏ పాపము చేసితిమో, దంపతులలో ఏ ఒకరికైనను శాస్త్రీయ ధర్మము విషయమై అధికముగ ఏ పాపము చేసితిమో, ఓ కరంభ పాత్ర సముదాయమా! నీవు ఆ సర్వపాపమును నశింపఁ జేయుదానవు. కావున నిన్ను హోమము చేయుచున్నాను. (పాత్రాకారముగఁ జేసిన దధిమిశ్రిత సక్తువు కరంభ పాత్రరూప హవిస్సు అనఁబడును. అట్టి కరంభ పాత్రముల సముదాయము కరంభ పాత్ర జాతము అనఁబడును. ఆ కరంభ పాత్రజాతమును ఈ మంత్రము చెప్పుచు హోమము చేయవలెను. వయమ్=యజమానుఁడు, పత్ని, దాస దాసీ జనులు అయిన మేము.)

5. అర్థము: కర్మకృతః=కర్మను జేయునట్టి అధ్వర్యుప్రభృతి యజమానపత్న్యంతము గల సర్వులు, మయోభువా=సుఖమును కలుగఁజేయునట్టి, వాచాసహ=మంత్రోచ్చారణరూప వాక్కుతో కూడ, కర్మ=కరంభ పాత్ర హోమాంతమైన కర్మను, అక్రన్=చేసిరి. హే సుదానవః=బాగుగ హవిస్సును దానము చేయునట్టి అధ్వర్యుప్రభృతులారా!, దేవేభ్యః=దేవతలకొఱకు, కర్మ=(ఈ)కర్మను, కృత్వా=చేసి, అస్తం ప్రేత=స్వగృహమును గూర్చి పొందు.

తాత్పర్యము: అధ్వర్యు ప్రభృతు లందఱు సుఖమును కలుగఁజేయు మంత్రోచ్చారణరూప వాక్కుతోఁగూడ కరంభపాత్ర హోమాంతము వఱకు గల కర్మ చేసినారు. బాగుగ హవిస్సు నిచ్చునట్టి అధ్వర్యు ప్రభృతులారా! దేవతలకై యీ కర్మను జేసి స్వగృహమునకు వెళ్లుఁడు. (ప్ర+ఇత=ప్రేత. 'అక్రన్' – ఇది వైదికైక ప్రయోగము. 'అకుర్వన్' అని యర్థము. వినియోగము పై మంత్ర వ్యాఖ్యానమున చెప్పఁబడినది.)

తృతీయానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ఽష్టమప్రపాఠకే చతుర్థోఽనువాకః।

మూలము: [1]అగ్నయే ఽనీకవతే పురోడాశ మష్టాకపాలం నిర్వపతి సాకగ్ం సూర్యేణోద్యతా మరుద్భ్య స్సాంతపనేభ్యో మధ్యందినే చరుం మరుద్భ్యో గృహమేధిభ్య స్సర్వాసాం దుగ్ధే సాయం చరుం [2]పూర్ణా దర్వి పరాపత సుపూర్ణా పున రాపత। వస్నేవ విక్రీణావహా ఇష మూర్జగ్ం శతక్రతో। [3]దేహి మే దదామి తే ని మే ధేహి ని తే దధే। నిహార మిన్నిమే హరా నిహారమ్ (౧)నిహరామి తే। [4]మరుద్భ్యః క్రీడిభ్యః పురోడాశగ్ం సప్తకపాలం నిర్వపతి సాకగ్ం సూర్యేణోద్యతా ఽఽగ్నేయ మష్టాకపాలం నిర్వపతి సౌమ్యం చరుగ్ం సావిత్రం ద్వాదశ కపాలగ్ం సారస్వతం చరుం పౌష్ణం చరు మైన్ద్రాగ్న మేకాదశ కపాల మైన్ద్రం చరుం వైశ్వ కర్మణ మేకకపాలమ్ ॥౨॥ (హరానిహారం త్రిగ్ంశ చ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ఽష్టమప్రపాఠకే చతుర్థోఽనువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: తృతీయానువాకమునందు వరుణప్రఘాస నామకమైన రెండవదియగు చాతుర్మాస్య పర్వము చెప్పఁబడినది. చతుర్థ పంచమ షష్ఠానువాకములందు సాకమేధ మనెడి తృతీయ పర్వము చెప్పఁబడుచున్నది.

1. అర్థము: అనీకవతే-సైన్యము కలిగిన, అగ్నయే-అగ్నికొఱకు, ఉద్యతా-ఉదయించుచున్న, సూర్యేణ సాకమ్-సూర్యునితోఁగూడ, (సూర్యోదయ కాలమునందు,) అష్టాకపాలమ్-ఎనిమిది కపాలములందు సంస్కృతమైన, పురోడాశమ్-పురోడాశమును, నిర్వపతి-నిర్వాపము చేయవలెను. సాంతపనేభ్యః-అనిష్ట వినాశము చేయునట్టి, మరుద్భ్యః-మరుద్దేవతలకొఱకు, మధ్యందినే-మధ్యాహ్న సమయమునందు, చరుమ్-చరువనెడి హవిస్సును, నిర్వపతి-నిర్వాపము చేయవలెను. గృహమేధిభ్యః-గృహమును యజ్ఞమును పాలించునట్టి, మరుద్భ్యః-మరుద్దేవతలకొఱకు, సర్వాసామ్-(యజమానునకుఁగల) సమస్త గోవులయొక్క, దుగ్ధే-దోహన సమయమునందు, సాయమ్-సాయంకాలమున, చరుమ్-చరు హవిస్సును, నిర్వపతి-నిర్వాపము చేయవలెను.

తాత్పర్యము: సూర్యోదయకాలమునందు సైన్యవంతుఁడైన అగ్నికొఱకు ఎనిమిది కపాలములందు సంస్కృతమైన పురోడాశమును నిర్వాపము చేయవలెను. అనిష్ట వినాశకులైన మరుద్దేవతలకొఱకు మధ్యాహ్న సమయమునందు చరువును నిర్వాపము చేయవలెను. సాయంకాలమునందు యజమానునకుఁ గల సర్వగోవులను పాలు పితుకు సమయమున గృహమేధులగు మరుద్దేవతలకై చరువును నిర్వాపము చేయవలెను. (సమ్యక్ తపనమ్=సంతపనమ్. తత్సంబంధినః=సాంతపనాః. బాగుగ తపింపఁజేయువారు కనుక అనిష్ట వినాశకు లని యర్థము.)

2. అర్థము: హే దర్వి!=ఓ దర్వీ!, (శరనిష్కాసేన=శరనిష్కాసముతో,) పూర్ణా=నిండినదానవై, పరాపత=(ఇంద్రుని గూర్చి)పొమ్ము. సుపూర్ణా=(అ యింద్రుని యనుగ్రహమువలన కలిగిన బలముతో,) బాగుగ నిండినదానవై, పునః=మఱల, అ పత=రమ్ము. హే శతక్రతో!=ఓ యింద్రా!, ఆవామ్=మేము, (=యజమానుఁడు, పత్ని,) వస్నేవ=ధనముచేతనువలె, (శరనిష్కాసేన=శరనిష్కాసముచేత,) ఇషమ్=అన్నమును, చ=మఱియు, ఊర్జమ్=బలమును, క్రీణావహై=కొనుచున్నాము. (శరనిష్కాసము=చరువు ఉడుకుచుండఁగా పైని తేలిన ఘనిభూత పదార్థ విశేషము. దర్వి=హోమము చేయుసాధనవిశేషము. పాముపడగవలె కొయ్యతో నిర్మితమైనది.)

తాత్పర్యము: ఓ దర్వీ! నీవు శరనిష్కాసముతో నిండినదానవై యింద్రుని గూర్చి పొమ్ము. ఆ యింద్రుని యనుగ్రహము వలన కలిగిన బలముతో నిండినదానవై మఱల రమ్ము. ఓ యింద్రా! మేము ధనముచేతవలె శరనిష్కాసముచే నీ నుండి అన్నమును బలమును కొనుచున్నాము. (వస్నా=వసునా. వైదికైక ప్రయోగము.)

3. అర్థము: (హే ఇన్ద్ర!=ఓ యింద్రా!) మే=నాకు, (యత్=ఏది, అపేక్షితమ్=అపేక్షితమో, తత్=దానిని, త్వమ్=నీవు,) దేహి=ఇమ్ము. తే=నీకు, (యదపేక్షితమ్=ఏది అపేక్షితమో, తత్=దానిని, అహమ్=నేను,) దదామి=ఇచ్చుచున్నాను. (దత్వా చ=ఇచ్చియు, మే=నా యొక్క, సమీపే=సమీపమునందు,) నిధేహి=ఉంచుము. తే=నీ యొక్క, (సమీపే=సమీపమునందు,) అహమ్=నేను, నిదధే=ఉంచుచున్నాను. నిహారమ్+ఇత్=మాటి మాటికి తీసికొని వచ్చియే, మే=నా యొక్క, (సమీపే=సమీపమునందు,) నిహర=స్థాపించుము. (అహమపి=నేనుఁగూడ,) నిహారమ్=మాటి మాటికి తీసికొనివచ్చి, తే=నీ యొక్క, (సమీపే=సమీపమునందు,) నిహరామి=స్థాపించుచున్నాను.

తాత్పర్యము: ఓ యింద్రా! నా కపేక్షితమైన దానిని నీ విమ్ము. నీ కపేక్షితమైన దానిని నే నిచ్చెదను. ఇచ్చియు నీ సమీపమున నుంచెదను. నీవు కూడ నా సమీపమున నుంచుము. ఈ యుభయము ఒకే పర్యాయము జరుగ నవసరము లేదు. మాటి మాటికి తీసికొని వచ్చియే నీవు నాదగ్గఱ నుంచుము. నేనుఁగూడ మాటి మాటికి తీసికొని వచ్చి నీ సమీపమున నుంచెదను.

4. అర్థము: క్రీడిభ్యః=క్రీడావంతులయిన, మరుద్భ్యః=మరుద్దేవతలకొఱకు, సప్తకపాలమ్=సప్తకపాలములందు సంస్కృతమైన, పురోడాశమ్=పురోడాశమును, ఉద్యతా=ఉదయించుచున్న, సూర్యేణ సాకమ్=సూర్యునితో కూడ, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. ఆగ్నేయమ్=అగ్ని దేవతాకమైన, అష్టాకపాలమ్=అష్టా కపాల సంస్కృతమైన పురోడాశమును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. సౌమ్యమ్=సోమ దేవతాకమైన, చరుమ్=చరువును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. సావిత్రమ్=సవితృ దేవతాకమైన, ద్వాదశ కపాలమ్=పండ్రెండు కపాలములందు సంస్కృతమైన పురోడాశమును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. సారస్వతమ్=సరస్వ ద్దేవతాకమైన, చరుమ్=చరువును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. పౌష్ణమ్=పూష దేవతాకమైన, చరుమ్=చరువును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. ఐన్ద్రాగ్నమ్=ఇంద్రుఁడు, అగ్ని దేవతలుగాఁ గల, ఏకాదశ కపాలమ్=ఏకాదశ కపాల సంస్కృత పురోడాశమును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. ఐన్ద్రమ్=ఇంద్ర దేతతాకమైన, చరుమ్=చరువును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. వైశ్వకర్మణమ్=విశ్వకర్మ దేవతాకమైన, ఏక కపాలమ్=ఏక కపాల సంస్కృత పురోడాశమును. నిర్వపతి=నిర్వాపము చేయవలెను.

తాత్పర్యము: చాతుర్మాస్య దినములలో రెండవ దినమున అనుష్ఠింపఁదగిన హవిస్సులు ఈ మంత్రమున విధింపఁబడినవి. మరుత్, అగ్ని, సోమ, సవితృ, సరస్వత్, పూష, ఇన్ద్రాగ్ని, ఇంద్ర, విశ్వకర్మ, దేవతలకు పురోడాశాది హవిస్సులు తొమ్మిదియు ఈ మంత్రముచే విధింపఁబడినవి.

చతుర్థానువాకము సమాప్తము

అథ ప్రథమకాణ్డే ఽష్టమప్రపాఠకే పఞ్చమోఽనువాకః।

మూలము: [1]సోమాయ పితృమతే పురోడాశగ్ం షట్కపాలం నిర్వపతి పితృభ్యో బర్హిషద్భ్యో ధానాః పితృభ్యో ఽగ్నిష్వాత్తేభ్యో ఽభివాన్యాయై దుగ్ధే మన్థ [3]మేతత్తే తత యే చ త్వామన్వత్ర త్తే పితామహ ప్రపితామహ యే చ త్వామ[3]న్వత్ర పితరో యథాభాగం మన్దధ్వం [4]సుసన్దృశం త్వా వయం మఘవ న్మన్దిషీమహి। ప్ర నూనం పూర్ణవన్ధురః స్తుతో యాసి వశాగ్ం అను। యోజా న్విన్ద్ర తే హరీ। (౧)[5]అక్షన్నమీ మదన్త హ్యవ ప్రియా అధూషత। అస్తోషత స్వభానవో విప్రా నవిష్ఠయా మతీ।యోజా న్విన్ద్ర తే హరీ। [6]అక్ష న్పితరో ఽమీమదన్త పితరో ఽతీతృపన్త పితరో ఽమీమృజన్త పితరః। [7]పరేత పితర స్సోమ్యా గమ్భీరైః పథిభిః పూర్వ్యైః। అథా పితౄ న్సువిదత్రాగ్ం అపీత యమేన యే సధమాదం మదన్తి। [8]మనో న్వా హువామహే నారాశగ్ంసేన స్తోమేన పితృణాం చ మన్మభిః। [9]ఆ (౨)న ఏతు మనః పునః క్రత్వే దక్షాయ జీవసే। జ్యోక్చ సూర్యం దృశే। [10]పున ర్నః పితరో మనో దదాతు దైవ్యో జనః। జీవం వ్రాతగ్ం సచేమహి। [11]యదన్తరిక్షం పృథివీ ముత ద్యాం యన్మాతరం పితరం వా జిహిగ్ంసిమ। అగ్ని ర్మా తస్మా దేనసో గార్హపత్యః ప్ర ముఞ్చతు దురితా యాని చకృమ కరోతు మా మనేనసమ్। ॥౩॥ (హరీ మన్మభి రా చతుశ్చత్వారిగ్ంశచ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ఽష్టమప్రపాఠకే పఞ్చమోఽనువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: చతుర్థానువాకమునందు సాకమేధ నామక తృతీయపర్వమునందలి ప్రధాన హవిస్సులు చెప్పఁబడినవి. ఈ పంచమానువాకమునందు తదీయ శేషమైన మహాపితృ యజ్ఞము చెప్పఁబడుచున్నది.

1. అర్థము: పితృమతే=పితృ స్వామియగు, సోమాయ=సోమ దేవతకొఱకు, షట్కపాలమ్=ఆఱు కపాలములందు సంస్కృతమైన పురోడాశమును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. బర్హిషద్భ్యః=యజ్ఞమునందుండునట్టి, పితృభ్యః=పితృదేవతలకొఱకు, ధానాః=వేయించిన యవలను, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. అగ్నిష్వాత్తేభ్యః=యజ్ఞ నిష్ఠులు కానట్టి, పితృభ్యః=పితృదేవతలకొఱకు, అభివాన్యాయై=మృత వత్సయగు ధేనువు యొక్క, దుగ్ధే=పాలయందలి, మన్థమ్=యవలపిండిని, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. (అభివాన్యాయై=షష్ఠ్యర్థే చతుర్థీ.)

తాత్పర్యము: మహా పితృయజ్ఞమునందలి మూఁడు హవిస్సులు ఈ మంత్రమునందు చెప్పఁబడినవి. సోమదేవతాక పురోడాశము, యజ్ఞనిష్ఠ పితృ దేవతాక ధానరూప హవిస్సు, తద్యజ్ఞ నిష్ఠ పితృదేవతాక మన్థహవిస్సు అనునవి పైని చెప్పిన మూఁడు హవిస్సులు. ఈ హవిస్త్రయము పితృయజ్ఞము. (ధానములు=వేఁపుడు బియ్యము. మన్థము=పాలలో వేసి మిశ్రీకృతమైన బియ్యపుపిండి. తాత్పర్యము సులభ గ్రాహ్యము.)

2. అర్థము: హే తత!=ఓ పితృదేవా!, తే=నీకొఱకు, ఏతత్=ఈ పిండముగాఁజేయఁబడిన అన్నము, (దత్తమ్=ఈయఁబడినది.) చ=మఱియు, యే=ఎవరు, త్వామను=నిన్ను అనుసరించి (వర్తన్తే=ఉంటున్నారో, తేభ్యోఽపి=వారికొఱకుఁగూడ, ఏతత్=ఈ పిండముగాఁ జేయఁబడిన అన్నము, దత్తమ్=ఈయఁబడినది.) హే పితామహ!=ఓ పితామహా!(=తండ్రియొక్క తండ్రి.) తే=నీకొఱకు, ఏతత్=పిండీకృతమైన ఈ యన్నము, (దత్తమ్=ఈయఁబడినది,) చ, యే త్వామను, వర్తన్తే, తేభ్యోఽపి, ఏతత్, దత్తమ్. హే ప్రపితామహ!=ఓ ప్రపితామహా! (=తండ్రియొక్క తాత.) తే=నీకొఱకు, ఏతత్=పిండీకృతమైన ఈ యన్నము. (దత్తమ్=ఈయఁబడినది.) చ, యే, త్వామను, వర్తన్తే, తేభ్యోఽపి, ఏతత్, (దత్తమ్. అర్థముపైని చెప్పఁబడినదియే.)

తాత్పర్యము: ఓ పితృ, పితామహ, ప్రపితామహులారా! పిండములుగా చేయఁబడిన యీ అన్నము, మీకు, మిమ్మనుసరించియున్న యితరులకును ఈయఁబడినది. (ఒకటవ మంత్రమున చెప్పఁబడిన పైతృక హవిస్సులు మూఁడును హోమము చేయగా మిగిలిన హవిస్సును మర్దనము చేసి పిమ్మట పిండములుగా చేసి ఆ పిండములను పైని చెప్పినవిధముగ పితృ పితామహ ప్రపితామహరూప పితృదేవతల కర్పించవలెను.)

3. అర్థము: హే పితరః=ఓ పితృ పితామహ ప్రపితామహ దేవతలారా!, అత్ర=మీకీయఁబడిన ఈ పిండములందు, యథాభాగమ్=మీ మీ భాగముల ననుసరించి, మన్దధ్వమ్=సంతృప్తులు కండు.

తాత్పర్యము: ఓ పితృ పితామహ ప్రపితామహ దేవతలారా! మీ కీయఁబడిన యీ పిండములలో మీ మీ భాగముల ననుసరించి సంతుష్టులు కండు. (ఈ మంత్రమును చెప్పిన పిమ్మట ఉత్తరదిక్కుగా నిష్క్రమించి 'సుసందృశంత్వా' ఇత్యాది మంత్రములచే ఆహవనీయాగ్నిని సేవించవలెను.)

4. అర్థము! హే మఘవన్!=ఓ యింద్రా! సుసందృశమ్=(మమ్ము)మంచి కటాక్ష వీక్షణముచే చూచుచున్న, త్వామ్=నిన్ను, వయమ్=మేము, మన్దిషీమహి=తృప్తి పఱచుచున్నాము. (త్వమపి=నీవు కూడ, అస్మద్దత్తైః హవిర్భిః=మాచే ఈయఁబడిన హవిస్సులచే,) పూర్ణవన్ధురః=పరిపూరిత రథపృష్ఠము కలవాఁడవై, స్తుతః=(మాచే) స్తుతింపఁబడిన వాఁడవగుచు, వశాన్+అను=అభీష్ట దేశముల నుద్దేశించి, నూనం ప్రయాసి=తఱచుగా రాఁగలవు. హే ఇన్ద్ర!=ఓ యింద్రుఁడా!, తే=నీయొక్క, హరీ=అశ్వములు, యోజాను=(రథమునందు) నియుక్తములైనవి కదా!, (=పూన్చఁబడినవి కదా.)

తాత్పర్యము: ఓ యింద్రా! మంచి కటాక్ష వీక్షణముచే మమ్ము చూచుచున్న నిన్ను తృప్తి పఱచుచున్నాము. నీవు కూడ మే మిచ్చిన హవిస్సులతో రథము వెనుక భాగమును నిండించి మాచే స్తుతింపఁబడుచు అభీష్టదేశములకు రాఁగలవు కదా! నీ అశ్వములు రథమునందు నియుక్తములైనవి కదా!. (వినియోగము పై మంత్ర వ్యాఖ్యానమున చెప్పఁబడినది.)

5. అర్థము: (పితరః=పితృదేవతలు,) అక్షన్=హవిస్సును భుజించినవారై, అమీమదన్త=మిక్కిలి సంతోషించిరి. హి=ఏ కారణమువలన, ప్రియాః=ప్రియములైన శిరః ప్రభృత్యంగములను, అవాధూషత=కదలించిరో, స్వభానవః=స్వీయ తేజస్సుచే ప్రకాశించుచున్న, విప్రాః=(భోజన తృప్తిచే,) బ్రాహ్మణ సదృశులగుచు, నవిష్ఠ యామతీ=అతిశయముగ నూతనమైన బుద్ధిచే, అస్తోషత=స్తుతించిరి. (యోజాన్విన్ద్రేత్యాదికము నాల్గవ మంత్రమున వ్యాఖ్యాతము.)

తాత్పర్యము: పితృదేవతలు హవిస్సును భుజించినవారై శిరఃప్రభృత్యంగములను కంపింపఁజేసిరి, కావున అత్యంతము సంతోషించిరి. మఱియు తమ తేజస్సుచే ప్రకాశించుచున్నవారై భోజన తృప్తిచే బ్రాహ్మణ సదృశులగుచు స్తోత్రము చేసిరి. శేషము పూర్వోక్తము. (దీనిచే గార్హపత్యమును సేవించవలెను.)

6. అర్థము: పితరః=పితృదేవతలు, అక్షన్=హవిస్సును భుజించిరి. పితరః=పితృదేవతలు, అమీమదన్త=అత్యంతము సంతోషించిరి. పితరః=పితృదేవతలు, అతీతృపన్త=(మమ్ముఁగూడ) మిక్కిలి సంతృప్తి పఱచిరి. అమీమృజన్త=(మమ్ము) మిక్కిలి శోధన చేసిరి.

తాత్పర్యము: పితృదేవతలు హవిస్సును భుజించి సంతుష్టులై మమ్ము కూడ సంతృప్తి పఱచి శోధన చేసిరి. (ఈ మంత్రము చెప్పుచు అన్వాహార్యము నొద్దకు పోవలెను.) (అమీమదన్త, అతీతృపన్త, అమీమృజన్త=ఇవి యజ్‌లు జన్తములు.)

7. అర్థము: హే సోమ్యాః=సౌమ్య మనస్కులైన ఓ పితరులారా!, గమ్భీరైః=సులభమైన అన్నోదకములు కలవియు, పూర్వ్యైః=పూర్వము చేయఁబడినవియునగు, పథిభిః=మార్గములచేత, పరేత=తిరిగి గృహములను పొందుఁడు. అథా=అప్పుడు, (తస్మిన్ పితృలోకే=ఆ పితృలోకమునందు,) యే=ఏ పితృదేవతలు, యమేన=యమునితోఁ గూడ, సహమాదమ్=సహస్థానస్థ సంతోషము కలుగునట్లుగా, మదన్తి=సంతోషించుచున్నారో, సువిదత్రాన్=చిరకాల నివాసముచే అచటి వృత్తాంతములను తెలిసిన, (తాన్) పితౄనపి=ఆ పితృదేవతలను గూడ, (యూయమ్=మీరు,) ఇత=పొందుఁడు.

తాత్పర్యము: సౌమ్య మనస్కులైన ఓ పితృదేవతలారా! మీరు సులభములైన అన్నోదకములు కలవియు, పూర్వము నిర్మితములునైన మార్గములచే తిరిగి స్వగృహములకు పొండు. అప్పుడు ఆ పితృలోకమునందు యమునితో కూడ సహస్థాన నివాసముచే కలుగు సంతోషమును పొందిన పూర్వపు పితృదేవతలు చిరకాల నివాసముచే అచటి వృత్తాంతము తెలిసినవారు కావున వారినిఁగూడ మీరు కలిసి కొనుఁడు.

8. అర్థము: నారాశంసేన=మనుష్య ప్రశంసా యోగ్యమైన, స్తోమేన=వాక్య సమూహముచేత, పితౄణాం చ=పితృదేవతల యొక్కయు, మన్మభిః=మననీయములైన వాక్యములచేత, మనః=పితృ యజ్ఞానుష్ఠాన పరమైన మనస్సును, ను=శీఘ్రముగా, ఆహువామహే=ఆహ్వానించుచున్నాము.

తాత్పర్యము: మనుష్యుల ప్రశంసలకు యోగ్యమైన వాక్య సమూహముచేతను, పితృ దేవతలయొక్క కొనియాడఁదగిన వాక్యములచేతను పితృయజ్ఞానుష్ఠాన పరమైన మనస్సును శీఘ్రముగా నాహ్వానించుచున్నాము. ("మనోన్వా" ఇత్యాది చతుర్ఋక్కులచేత పితృదేవతలను సేవించవలెను. ఆ నాలుగు ఋక్కులలో ఇది మొదటి ఋక్కు.)

9. అర్థము: క్రత్వే=కర్మానుష్ఠానము కొఱకైన, దక్షాయ=తత్త త్సామర్థ్యముకొఱకు, జీవసే=జీవించుటకొఱకు, జ్యోక్=చిరకాలము, సూర్యమ్=సూర్యుని, దృశే చ=చూచుటకొఱకును, యోగ్యమ్=యోగ్యమైన (మనః=మనస్సు,) నః=మమ్ముఁగూర్చి, ఆ+ఏతు=మాటి మాటికి వచ్చుఁగాక.

తాత్పర్యము: కర్మానుష్ఠానముకొఱ కవసరమైన సామర్థ్యముకొఱకు జీవనముకొఱకు, చిరకాలము సూర్యుని చూచుటకొఱకును యోగ్యమయిన మనస్సు వచ్చి మమ్ము మాటి మాటికి పొందుఁగాక. (ఇది రెండవ ఋక్కు.)

10. అర్థము: హే పితరః!=ఓ పితృదేవతలారా!, దైవ్యః జనః=దేవ సంబంధి పురుష సమూహము, నః=మాకు, మనః=కర్మానుష్ఠాన పరమైన మనస్సును, దదాతు=ఇచ్చుఁగాక. (వయమపి=మేము కూడ,) వ్రాతం జీవమ్=సంవత్సర సంఘాతరూప జీవనమును, సచేమహి=సేవించెదము.

తాత్పర్యము: ఓ పితృదేవతలారా! దేవపురుషులు మాకు కర్మానుష్ఠాన పరమైన చిత్తమును మాటి మాటికి ఇత్తురుగాక. మేము కూడ సంవత్సరములకొలది జీవనమును గడిపెదము. (ఇది మూఁడవ ఋక్కు.)

11. అర్థము: అన్తరిక్షమ్=అంతరిక్ష లోకమును, పృథివీమ్=భూలోకమును, ద్యామ్=ద్యులోకమును, జహింసిమ యత్=హింసించుటకు ఇచ్ఛయించినచో, ఉత=లేదా, మాతరమ్=తల్లిని, వా=లేదా, పితరమ్=తండ్రిని, జహింసిమ యత్=హింసించుట కిచ్ఛయించినచో, తస్మాత్ ఏనసః=ఆ పాపమునుండి, గార్హపత్యః అగ్నిః=గార్హపత్యాగ్ని, మా=నన్ను, ప్ర ముఞ్చతు=ప్రకృష్టముగ విడచుఁగాక. యాని దురితా=(ఇతరములైన) ఏ పాపములను, చకృమ=చేసితిమో, (తేభ్యోఽపి=ఆ పాపములనుండియు) ముఞ్చతు=విడచుఁగాక. మామ్=నన్ను, అనేనసమ్=సర్వపాపరహితునిగా, కరోతు=చేయుఁగాక.

తాత్పర్యము: మేము పృథివ్యాది లోకములనుగాని, తల్లిదండ్రులనుగాని హింసింప నిచ్ఛయించినచో ఆ సర్వపాపముల నుండి గార్హపత్యాగ్ని మమ్ము విడిపించుగాక. ఏ యితర పాపములు కూడ మేము చేసినవి యేవి కలవో, ఆ పాపములనుండి కూడ నన్ను విడిపించుఁగాక. నన్ను సర్వపాపరహితునిగాఁ జేయుఁగాక.

పంచమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ఽష్టమప్రపాఠకే షష్ఠోఽనువాకః।

మూలము: [1]ప్రతిపూరుష మేకకపాలా న్నిర్వపత్యేక మతిరిక్తం [2]యావన్తో గృహ్యా స్స్మ స్తేభ్యః కమ
కరం [3]పశూనాగ్ం శర్మాసి శర్మ యజమానస్య శర్మ మే యచ్ఛై[4]క ఏవ రుద్రో న ద్వితీ
యాయ తస్థ [5]ఆఖుస్తే రుద్ర పశుస్తం జుషస్వై[6]ష తే రుద్ర భాగ స్సహ స్వస్రా ఽమ్బి
కయా తం జుషస్వ[7]భేషజం గవే ఽశ్వాయ పురుషాయ భేషజ మథో అస్మభ్యం భేషజగ్ం
సుభేషజమ్ (౧)యథా ఽసతి। సుగం మేషాయ మేష్యా [8]అవామ్బ రుద్ర మదిమహ్యవ
దేవం త్ర్యమ్బకమ్। యథా న శ్శ్రేయసః కరద్యథా నో వస్యసః కరద్యథా నః పశుమతః
కరద్యథా నో వ్యవసాయయాత్। [9]త్ర్యమ్బకం యజామహే సుగన్ధిం పుష్టివర్ధనమ్। ఉర్వా
రుకమివ బన్ధనాన్మృత్యో ర్ముక్షీయ మా ఽమృతాత్। [10]ఏష తే రుద్రభాగ స్తం జుషస్వ
తేనావసేన పరో మూజవతో ఽతీహ్య[11]వతతధన్వా పినాకహస్తః కృత్తివాసాః ॥ ౨ ॥

(సుభేషజ మిహి త్రీణి చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే చతుర్థప్రపాఠకే షట్చత్వారింశోఽనువాకః॥

వేదార్థ దీపిక

అవతారిక: పంచమానువాకమునందు పితృయజ్ఞ మభిహితమైనది. ఈ షష్ఠానువాకమునందు సాకమేధ శేషములైన త్ర్యంబక పురోడాశములు చెప్పబడినవి.

1. అర్థము: ప్రతిపూరుషమ్=ప్రతి పురుషు నుద్దేశించి, ఏక కపాలాన్=ఏక కపాల సంస్కృతపురోడాశములను, నిర్వపతి= నిర్వాపము చేయవలెను. ఏక కపాలమ్=ఏక కపాల సంస్కృత పురోడాశము, అతిరిక్తమ్=సమధికమైనది.

తాత్పర్యము: ప్రతి పురుషు నుద్దేశించి ఏక కపాల సంస్కృత పురోడాశమును నిర్వాపము చేయవలెను. అది మిక్కిలి అధిక మైనది. (ఇది ముఖ్యవిధి.)

2. అర్థము: గృహ్యాః=గృహమునం దుండునట్టి మనుష్యులము, యావన్తః=ఎంతమందిమి, స్మః=ఉంటున్నామో, తేభ్యః=ఆ యందఱికొఱకు, కమ్=సుఖమును, అకరమ్=చేసితిని.

తాత్పర్యము: ప్రతిపురుషుని ఉద్దేశించి ఏకకపాల సంస్కృత పురోడాశమును నిర్వాపము చేయుటవలన ఎంతమంది మనుష్యులము ఉంటిమో, వారికందఱకు సుఖము చేసిన వాఁడనైతిని. ('యావన్త' ఇత్యాదులు పదునొకండు మంత్రములు ముఖ్యవిధి సన్నిధియందు వరుసగాఁ జెప్పఁబడుచున్నవి.)

3. అర్థము: (హే మూతః=ఓ మూతమా!, త్వమ్=నీవు,) పశూనామ్=పశువులకు, శర్మా=(పశుభక్ష్యములైన తృణములు, విత్తనములతో కూడియుండుటచే,) సుఖకరము, అసి=అగుచున్నావు. (తత్=అందువలన,) యజమానస్య=యజమానునకు, శర్మ=సుఖమును, మే=నాకు (=అధ్వర్యునకు) శర్మ=సుఖమును, యచ్ఛ=ఇమ్ము. (కర్షకులు వరి మొదలగు ధాన్యములను సంగ్రహించుటకు గంప, మొదలగువానిలో దాఁచుకొందురు. అట్టి వస్తువిశేషము మూత మనఁబడును. ఇందు గడ్డి, ధాన్యము ఉండును.)

తాత్పర్యము: ఓ మూతమా! నీవు పశు భక్ష్యములైన తృణధాన్యములతో కూడియుండుటచే పశువులకు సుఖకర మగుచున్నావు. కావున యజమానునకు, అధ్వర్యుఁడనైన నాకును సుఖము నొసఁగుము.

4. అర్థము: రుద్రః=రుద్రుఁడు, (జగతి=జగత్తునందు) ఏక ఏవ=ఒక్కఁడే, అస్తి=కలఁడు. ద్వితీయాయ=రెండవ రుద్రుఁడు, న తస్థే=ఉండలేదు.

తాత్పర్యము: లోకమునందు రుద్రుఁడొక్కఁడే యుండెను. కాని రెండవ రుద్రుఁడు లేఁడు. (ద్వితీయాయ=ద్వితీయః. ప్రథమార్థే చతుర్థీ, దక్షిణాగ్నినుండి ఒక కొఱవిని తీసికొనవలయును.)

5. అర్థము: హే రుద్ర!,=ఓ రుద్రదేవా!, తే=నీకు, ఆఖుః=మూషికము, ప్రియః=ప్రియమైనది. (అతః=ఇందువలన,) తమ్=ఆ మూషికమును, జుషస్వ=సేవించుము.

తాత్పర్యము: ఓ రుద్రదేవా! నీకు మూషికము ప్రియమైన పశువు. కనుక ఆ మూషికమును సేవించుము. (అధ్వర్యుఁడు ఈ మంత్రము పఠించుచు తాను ద్వేషించిన వానిని మనస్సునందు స్మరించుచు ఆఖూత్కరమునందు ఒక పురోడాశము నుంచవలెను. (ఆఖూత్కరము=కన్నమునుండి ఎలుక త్రవ్వి తీసిన పాంశురాశి.)

6. అర్థము: హే రుద్ర!=ఓ రుద్రదేవా!, ఏషః=ఈ గ్రహించఁబడిన పురోడాశాంశము, తే=నీకు, భాగః=(గ్రహింపఁదగిన) భాగము. తమ్=ఆ భాగమును, స్వస్రా=తోఁబుట్టువువలె హితకారిణియగు, అమ్బికయా సహ=పార్వతీదేవితో కూడ, జుషస్వ=సేవించుము.

తాత్పర్యము: ఓ రుద్రదేవా! (పలాశవర్ణములోనికి తీసికొనఁబడిన,) ఈ పురోడాశాంశము నీవు గ్రహింపవలసిన భాగము. ఈ భాగమును భగినివలె హితకారిణియగు పార్వతితో కూడ సేవించుము. (అధ్వర్యుఁడు చతుష్పథమునందు ఒక కొఱవి నుంచి పురోడాశముల నన్నిటియొక్క ఉత్తరార్ధమునుండి కొంచెము కొంచెముగా తీసికొని పలాశ పర్ణముతో హోమము చేయవలెను.)

7. అర్థము: హే రుద్ర!=ఓ రుద్రదేవా!, భేషజమ్=ఆరోగ్యము, సుభేషజమ్=తాత్కాలిక రోగోపశమనము కలది, లేక, శాశ్వతరోగోపశమనము కలది గాని, యథా అసతి=ఎట్లు అగునో, (తథా=అట్లు,) గవే=గోజాతికొఱకు, అశ్వాయ=అశ్వజాతికొఱకు, పురుషాయ=పురుషునికొఱకు, అథో=మఱియు, అస్మభ్యమ్=మాకొఱకు, భేషజమ్=ఆరోగ్యమును- (కురు=చేయుము.) మేషాయ=పొట్టేలుకొఱకు, మేష్యై=ఆఁడు గొఱ్ఱెకొఱకు, సుగమ్=సుఖసంచారము కలుగునట్లుగ (కురు=చేయుము.)

తాత్పర్యము: ఓ రుద్రదేవా! మా గవాదులకు, అశ్వాదులకు, ప్రజలకు, మఱియు మాకును తాత్కాలిక రోగోపశమనము గాని శాశ్వత రోగోపశమనము గాని అగునట్లు ఆరోగ్యమును కలుగఁజేయుము. మేషము మేషికూడ రోగము లేకుండ సంచరించునట్లు చేయుము. (ఈ మంత్రముచే చతుష్పథమునందలి యగ్నికి పరిషేచనము చేయవలెను. చతుష్పథము=నాలుగుమార్గములు కలయు ప్రదేశము.)

8. అర్థము: హే అమ్బ!=ఓ పార్వతీ!, అసౌ=ఈ రుద్రుఁడు, నః=మమ్ము, శ్రేయసః=(అధ్యయనాదులచే,) శ్రేష్ఠుల నుగా, యథా కరత్=ఎట్లు చేయుచున్నాఁడో, నః=మమ్ము, వస్యసః=అత్యంత ధనవంతులనుగా, యథా కరత్=ఎట్లు చేయుచున్నాఁడో, నః=మమ్ము. పశుమతః=గవాశ్వాది పశువులు కలవారినిగా, యథా కరత్=ఎట్లు చేయుచున్నాఁడో, నః=మమ్ము, వ్యవసాయయాత్=శాస్త్రార్థ నిశ్చయజ్ఞాన యుక్తులనుగా, యథా కరత్=ఎట్లు చేయుచున్నాఁడో, (తథా కర్తుమ్=అట్లు చేయుటకు,) రుద్రమ్=రుద్రు నుద్దేశించి, అవాదిమహి=పురోడాశావదానము చేసితిమి. త్ర్యమ్బకం దేవమ్=మూఁడు నేత్రములు గల దేవుని ఉద్దేశించి, అవాదిమహి=పురోడాశావదానము చేసితిమి.

తాత్పర్యము: ఓ పార్వతీ! ఈ రుద్రుఁడు మమ్ము అధ్యయనాదులచే శ్రేష్ఠులనుగాను, అత్యంత ధనవంతులనుగాను, గవాశ్వాది పశువులు కలవారినిగాను, శాస్త్రార్థ నిశ్చయజ్ఞాన యుక్తులనుగాను జేయుటకు త్రినేత్రుఁడగు రుద్రు నుద్దేశించి పురోడాశావదానము చేసితిమి. (అవదానము=హోమము చేయు పదార్థమును జుహ్వాది హోమ సాధనములోనికి తీసికొనుట. యజమానుఁ డీ మంత్రమును జపించవలెను.)

9. అర్థము: సుగన్ధిమ్=శోభన శరీరగంధము, లేక పుణ్యగంధము కలవాఁడును, పుష్టివర్ధనమ్=శరీర ధనాది విషయ పుష్టిని వృద్ధి చేయువాఁడును నగు, త్ర్యమ్బకమ్=ఈశ్వరుని, యజామహే=పూజించుచున్నాము. బన్ధనాత్=తొడిమ నుండి, ఉర్వారుకమివ=దోసపండువలె, మృత్యోః=మృత్యువునుండి, ముక్షీయ=విముక్తుఁడ నగుదును గాక. అమృతాత్=చిర జీవితమునుండి గాని, లేక స్వర్గాదికమునుండి గాని మా ముక్షీయ=విముక్తుఁడను కాకుందును గాక.

తాత్పర్యము: త్ర్యంబకుఁడగు రుద్రుఁడు పుణ్యగంధము కలవాఁడు. ధనపుష్టిని శరీరపుష్టిని వృద్ధి చేయువాఁడు. అట్టి రుద్రుని పూజించుచున్నాము. తొడిమనుండి దోసపండు స్వయముగనే విడిపోవు విధముగ నేను మృత్యువు నుండి విముక్తుఁడ నగుదును గాక. మరణ రాహిత్యరూప చిరజీవితమునుండి కాని, స్వర్గాదికమునుండి కాని విముక్తుఁడను గాకుందును గాక. (ఈ మంత్రమును పఠించుచు అగ్నికి మూఁడు మారులు ప్రదక్షిణము చేయవలెను. త్రీణి అంబకాని యస్య సః=త్ర్యంబకః, మూఁడు కన్నులు కలవాఁడు ఈశ్వరుఁడు.)

10. అర్థము: హే రుద్ర!=ఓ రుద్రదేవా! ఏషః=(వృక్షాదియందు పెట్టి యుంచిన,) ఈ పురోడాశ సముదాయము, తే=నీకు, భాగః=భాగము. అవసేన=(ప్రాథేయరూపమున) రక్షకమైన, తేన=ఆ భాగముచేత, (యుక్తః=కూడినవాఁడవై,) మూజవతః='మూజ' అను పేరుతో ప్రసిద్ధమైన పర్వతముకంటె, పరః=పరభాగమున నున్నవాఁడవై, అతీహి=అతిక్రమించి వెళ్లుము. (అతి + ఇహి=అతీహి. 'ఇణ్=గతౌ', అను ధాతువునకు లోటి మధ్యమ పురుషైకవచనము.)

తాత్పర్యము: ఓ రుద్రదేవా! వృక్షాదియం దుంచఁబడిన ఈ పురోడాశ సంఘము నీకు భాగము. పాథేయ రూపమున రక్షకమైన ఆ పురోడాశభాగముతో కూడి మూతనామక పర్వతమునకు పరభాగమున నుండిన వాఁడవై అఁటనుండి పొమ్ము. (పాథేయము=మార్గ మధ్యమున ఆఁకలి దీర్చుకొనుటకై యుపయోగించు నాహార విశేషము.)

11. అర్థము: (అయం రుద్రః=ఈ రుద్రదేవుఁడు,) పినాక హస్తః=పినాక మనెడి ధనువు హస్తమునందుఁ గలవాఁడును, అవతత ధన్వా=జ్యాకర్షణముచే విస్తరింపఁ జేయఁబడిన ధనువు కలవాఁడును. కృత్తివాసాః=చర్మవసనము కలవాఁడును, (ఓమ్=అగుఁగాక.)

తాత్పర్యము: ఈ రుద్రదేవుఁడు మా విరోధియగు పాపమును నశింపఁజేయుటకు పినాక మను ధనువును హస్తముతో గ్రహించి జ్యాకర్షణముచే దానిని విస్తరింపఁజేసి చర్మవస్త్రము కలవాఁడగుఁగాక. (యజమానుఁడు ఈ మంత్రమును పఠించుచు మూఁడు మారులు ప్రాణాయామము చేయవలెను.)

షష్ఠానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ఽష్టమప్రపాఠకే సప్తమో ఽనువాకః ।

మూలము: [1]ఐన్ద్రాగ్నం ద్వాదశకపాలం వైశ్వదేవం చరు మిన్ద్రాయ శునాశీరాయ పురోడాశం ద్వాదశ కపాలం వాయవ్యం పయ స్సౌర్య మేకకపాలం ద్వాదశగవగ్ం సీరం దక్షిణా ఽఽ[2]గ్నేయ మష్టాకపాలం నిర్వపతి రౌద్రం గావీధుకం చరు మైన్ద్రం దధి వారుణం యవమయం చరుం వహినీ ధేను ర్దక్షిణా[3]యే దేవాః పురస్సదో ఽగ్నినేత్రా దక్షిణసదో యమనేత్రాః పశ్చాత్సద స్సవితృనేత్రా ఉత్తరసదో వరుణనేత్రా ఉపరిషదో బృహస్పతినేత్రా రక్షోహణ స్తే నః పాన్తు తే నో ఽవన్తు తేభ్యః (౧)నమ స్తేభ్య స్స్వాహా [4]సమూఢగ్ం రక్ష స్సందగ్ధగ్ం రక్ష ఇద మహగ్ం రక్షో ఽభిసందహామ్య[5]గ్నయే రక్షోఘ్నే స్వాహా యమాయ సవిత్రే వరుణాయ బృహస్పతయే దువస్వతే రక్షోఘ్నే స్వాహా [6]ప్రష్టివాహీ రథో దక్షిణా [7]దేవస్య త్వా సవితుః ప్రసవే ఽశ్వినో ర్బాహుభ్యాం పూష్ణో హస్తాభ్యాగ్ం రక్షసో వధం జుహోమి హతగ్ం రక్షో ఽవధిష్మ రక్షో [8]యద్వస్తే తద్దక్షిణా ॥౨॥(తేభ్యః షట్చత్వారిగ్ంశ చ్చ ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ఽష్టమప్రపాఠకే సప్తమో ఽనువాకః ॥

వేదార్థ దీపిక

అవతారిక: షష్ఠానువాకమునందు సాకమేధ పర్వము సమాప్తమైనది. ఈ సప్తమానువాకమునందు శునాసీర్యము, ఇంద్రతూర్యము అనెడి కర్మద్వయము, ఇధ్మీయ మంత్రము లైదు అపామార్గమంత్రములును చెప్పఁబడినవి.

1. అర్థము: (1)ఐన్ద్రాగ్నమ్=ఇంద్రాగ్నులు దేవతలుగాఁగల, ద్వాదశ కపాలమ్=ద్వాదశ కపాలములందు సంస్కృతమైన పురోడాశమును, (2)వైశ్వదేవమ్=విశ్వేదేవ దేవతాకమయిన, చరుమ్=చరువనెడి హవిస్సును, (3)శునాశీరాయ=వాయ్వాదిత్యులతోకూడియున్న, ఇన్ద్రాయ=ఇంద్రునికొఱకు, ద్వాదశ కపాలమ్=ద్వాదశ కపాలములందు సంస్కృతమైన, పురోడాశమ్=పురోడాశమును, (4)వాయవ్యమ్=వాయు దేవతాకమైన, పయః=క్షీరమును, (5)సౌర్యమ్=సూర్య దేవతాకమైన, ఏక కపాలమ్=ఏక కపాల సంస్కృత పురోడాశమును, (నిర్వపతి=నిర్వాపము చేయవలెను.) ద్వాదశ గవమ్=పండ్రెండు ఎద్దులచే వహింపఁబడుచున్న, సీరమ్=నాఁగలి, దక్షిణా=దక్షిణ.

తాత్పర్యము: ఈ మంత్రమునందు ఐన్ద్రాగ్నాదులైన ఐదు హవిస్సులు విహితములైనవి. ఇంద్రాగ్నులకు ద్వాదశ కపాల సంస్కృత పురోడాశము, విశ్వేదేవ దేవతలకు చరువు, శునాసీరుఁడైన యింద్రునకు ద్వాదశ కపాల సంస్కృత పురోడాశము, వాయువునకు క్షీరము, సూర్యునకు ఏక కపాల సంస్కృత పురోడాశము నిర్వాపము చేయవలెను. ఈ కర్మయందు ద్వాదశ బలీవర్దములచే వహింపఁబడు నాఁగలి దక్షిణగా నీయవలెను.

2. అర్థము: ఆగ్నేయమ్=అగ్నిదేవతాకమైన, అష్టాకపాలమ్=అష్టాకపాల సంస్కృత పురోడాశమును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. రౌద్రమ్=రుద్ర దేవతాకమైన, గావీధుకమ్=అరణ్యధాన్యవిశేష నిష్పన్నమైన, చరుమ్=చరువును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. ఐన్ద్రీమ్=ఇంద్ర దేవతాకమైన, దధి=పెఱుగును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. వారుణమ్=వరుణ దేవతాకమైన, యవమయమ్=యవధాన్య నిష్పన్నమైన, చరుమ్=చరువును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. (ఈ కర్మయందు) వహినీ=పృష్ఠభాగమునందు భారము మోయునట్టి, ధేనుః=గోవు, దక్షిణా=దక్షిణ. (గో సామాన్యమునకు గోవనియు, నూతనముగ ప్రసవించి పాలిచ్చుగోవునకు ధేనువనియు గ్రహింపవలెను.)

తాత్పర్యము: ఇంద్రతురీయ మను కర్మవిశేషమునకు సంబంధించిన నాలుగు హోమములు ఈ మంత్రమున చెప్పఁబడినవి. ఆగ్నేయ పురోడాశము, రౌద్ర చరువు, ఐన్ద్రీ దధి, వారుణ చరువు అనెడి నాలుగు హవిస్సులు ఇంద్రతురీయమునకు సంబంధించినవి. (పూర్వము దేవాసురులు యుద్ధసన్నద్ధులు కాఁగా దేవతలు అగ్నిని వీరునిగా తలంచి యతని సహాయముతో అసురులను జయింప నిశ్చయించిరి. అప్పుడు అగ్ని తాను విజయసిద్ధికై మూఁడు రూపములుగా గోచరింతుననియు నాల్గవ రూపము నెవరు ధరింతురని యడుగఁగా ఇంద్రుఁడు తాను తురీయ రూపమును ధరింతునని యనెను. అందువలన ఇంద్రుఁడు తురీయుఁడుగా (నాల్గవరూపముగా,) ఉన్న యీ కర్మవిశేషము ఇంద్రతురీయ మనఁబడుచున్నది. (అగ్ని స్వస్వరూపము, రుద్రరూపము, వరుణరూపము ననెడి మూఁడు రూపముల నసురులను జయించుటకై ధరించెను.)

3. అర్థము: పురస్సదః=తూర్పుదిక్కున నున్నటువంటి, అగ్నినేత్రాః=అగ్నిప్రముఖులైన, యే దేవాః=ఏ దేవతలు, రక్షోహణః=రాక్షసులను సంహరించువారై, (సన్తి=ఉంటున్నారో, దక్షిణసదః=దక్షిణ దిక్కున నున్నటువంటి, యమనేత్రాః=యమప్రముఖులైన, యే దేవాః=ఏ దేవతలు, రక్షోహణః=రాక్షసులను సంహరించువారై, (సన్తి=ఉంటున్నారో,) పశ్చాత్సదః=పశ్చిమ దిక్కున నున్నటువంటి, సవితృ నేత్రాః=సవితృ ప్రముఖులైన, యే దేవాః=ఏ దేవతలు, రక్షోహణః=రాక్షసులను సంహరించువారై, (సన్తి=ఉంటున్నారో,) ఉత్తరసదః=ఉత్తర దిక్కున నున్నటువంటి, వరుణసదః=వరుణ ప్రముఖులైన, యే దేవాః=ఏ దేవతలు, రక్షోహణః=రాక్షసులను సంహరించువారై, (సన్తి=ఉంటున్నారో,) ఉపరిషదః=ఊర్ధ్వదిక్కున నున్నటువంటి, బృహస్పతినేత్రాః=బృహస్పతి ప్రముఖులైన, యే దేవాః=ఏ దేవతలు, రక్షోహణః=రాక్షసులను సంహరించువారై, (సన్తి=ఉంటున్నారో) తే=ఆ దేవతలు, నః=మమ్ము, పాన్తు=రక్షోనివారణముచే రక్షింతురు గాక. (అపి చ=మఱియు) తే=ఆ దేవతలు, నః=మమ్ము, అవన్తు=కర్మానుష్ఠానముచే రక్షింతురుగాక. తేభ్యః=ఆ దేవతల కొఱకు, నమః=నమస్కారము. తేభ్యః=ఆ దేవతలకొఱకు, (ఇదం హవ్యమ్=ఈ హవిస్సు), స్వాహా=హుతమగుఁగాక.

తాత్పర్యము: ప్రాచ్యాది దిక్కులందు అగ్న్యాది ప్రముఖులైన దేవతలు రాక్షస సంహారకులై యున్నారు. కావున ఆ దేవతలందఱు మమ్ము రక్షోనివారణముచేతను కర్మానుష్ఠానముచేతను రక్షింతురుగాక.

4. అర్థము: రక్షః=(అస్మ త్ప్రతికూలమైన) రాక్షస సముదాయము, సమూఢమ్=ఏకముగాఁ జేయఁబడినది. రక్షః=రాక్షస జాతము, సందగ్ధమ్=బాగుగ దహింపఁజేయఁబడినదియు. (పునరపి=ఇంకను,) ఇదమ్=ఇప్పుడు, అహమ్=నేను, రక్షః + అభి=అంతటనున్న తదనుచర రాక్షసులను, సం దహామి=బాగుగ దగ్ధము చేయుచున్నాను. (ఇదమ్=ఇదానీమ్, అని విద్యారణ్యము.)

తాత్పర్యము: మాకు ప్రతికూలమైన రాక్షస సమూహము నశింపఁజేయుటకు ఏకీకృతమై బాగుగ దగ్ధము చేయఁబడినది. ఇంకను ఇప్పుడు నేను దగ్ధమైన రాక్షస సముదాయమున కంతట నున్నట్టి తదనుచరులను బాగుగ దహింపఁజేయుచున్నాను.

5. అర్థము: రక్షోఘ్నే=రాక్షస సంహర్తయగు, అగ్నయే=అగ్నికొఱకు, స్వాహా=(ఈ హవిస్సు)హుత మగుఁగాక. రక్షోఘ్నే, యమాయ, స్వాహా. రక్షోఘ్నే, సవిత్రే, స్వాహా. రక్షోఘ్నే, వరుణాయ, స్వాహా. రక్షోఘ్నే, దువస్వతే=పరిచర్యావంతుఁడైన, బృహస్పతయే=బృహస్పతికొఱకు, స్వాహా. అని సమన్వయము. అర్థము స్పష్టము.

తాత్పర్యము: రాక్షస సంహర్తలగు అగ్న్యాది దేవతలకు ఈ హవిస్సు హుత మగుఁగాక యని భావము. (పైని పేర్కొనఁబడిన 3, 4, 5, మంత్రములు పక్షోధ్నీయ మంత్రములు. అనఁగా అయిదు ఇధ్మములకు సంబంధించినవి.)

6. అర్థము: ప్రష్టివాహీ=అశ్వత్రయముచే వహింపఁ బడుచున్న, రథః=రథము, దక్షిణా=(పంచేధ్మీయ హోమసంబంధి కర్మయందు) దక్షిణ. తాత్పర్యము స్పష్టము.)

7. అర్థము: హే హవిః=ఓ హవిర్ద్రవ్యమా!, సవితుః=ప్రేరకుఁడైన, దేవస్య=దేవునియొక్క, ప్రసవే సతి=ప్రేరణ కలుగుచుండఁగా, రక్షసః వధమ్(ఉద్దిశ్య) రాక్షసవధ నుద్దేశించి, త్వా=నిన్ను, అశ్వినోః=అశ్వినీదేవతలయొక్క, బాహుభ్యామ్=బాహువులచేతను, పూష్ణః=పూషదేవునియొక్క, హస్తాభ్యామ్=హస్తములచేతను, జుహోమి=హోమము చేయుచున్నాను. రక్షః=రాక్షస జాతి, హతమ్=హతమైనది. రక్షః=రాక్షసజాతిని, అవధిష్మ=సంహరించితిమి.

తాత్పర్యము: ఓ హవిర్ద్రవ్యమా! సవితృదేవుని ప్రేరణవలన రాక్షస వధ నుద్దేశించి అశ్వినీదేవతల బాహువులచేతను, పూషదేవుని హస్తములచేతను నిన్ను హోమము చేయుచున్నాను. రాక్షసజాతి హతమైనది. రాక్షసజాతిని సంహరించితిమి. ఇచట ఒక పూర్వగాథ=పూర్వము ఇంద్రుఁడు వృత్రాసురుని సంహరించిన యనంతరము ఇతర రాక్షసులను గూడ పరాభూతులను జేసెను. కాని నముచి యను రాక్షసుఁడు పరాభూతుఁడు కాలేదు. అప్పుడు ఇంద్రుఁడు స్వశక్తిచే నాకర్షించి (పట్టుకొని) యతనితో మల్లయుద్ధము చేసెను. ఆ సమయమున మూర్ఛ నొందుటకు సిద్ధముగానున్న యింద్రునితో నముచి యొక సంధి కావించుకొనెను. "ఓ యింద్రా! నీవు నన్ను ఎండినది కాని, తడిసినది కాని అయిన సాధనముచేత, పగలు గాని, రాత్రి గాని చంపరాదు. ఇందు కంగీకరించినచో నిన్ను విడిచెదను" అని సంధి నియమము కావించెను. ఇంద్రుఁ డిందుల కంగీకరించఁగా నముచి యింద్రుని విడిచిపెట్టెను. పిమ్మట ఇంద్రుఁడు సంధి నియమమునకు భంగము లేనివిధముగ ఆలోచించి అతఁ డొకప్రభాత సమయమునందు నీటినురుఁగుచేత నముచిని సంహరించెను. ఛిన్నమైన నముచి శిరస్సు "మిత్రద్రోహీ! నియమ భంగము చేసితివి"ని యింద్రునితో పలికి యతనిని వెంబడించెను. అప్పు డింద్రుఁ డీ అపామార్గహోమ మంత్రములచే హోమము చేసి నముచి శిరస్సుతోఁగూడ ఇతర రాక్షసులను గూడ హత మొనర్చెను.) ఇవియే అపామార్గ మంత్రములు.

8. అర్థము: (హోమకాలే=హోమకాలమునందు,) యత్=ఏ వస్త్రము, వస్తే=ఆచ్ఛాదించు చున్నదో, తత్=ఆ వస్త్రము, దక్షిణా=దక్షిణ.

తాత్పర్యము: హోమకాలమునం దాచ్ఛాదకమైన వస్త్రము పై కర్మయందు దక్షిణగా నీయవలెను.

సప్తమానువాకము సమాప్తము

అథ ప్రథమకాణ్డే ఽష్టమ ప్రపాఠకే ఽష్టమోఽనువాకః।

మూలము: [1]ధాత్రే పురోడాశం ద్వాదశకపాలం నిర్వపత్యనుమత్యై చరుగ్ం రాకాయై చరుగ్ం సినీవాల్యై చరుం కుహ్వై చరుం మిథునౌ గావౌ దక్షిణా ఽఽగ్నావైష్ణవ మేకాదశకపాలం నిర్వపత్యైన్ద్రావైష్ణవ మేకాదశకపాలం వైష్ణవం త్రికపాలం వామనో వహీ దక్షిణా ఽఽగ్నీషోమీయ మేకాదశ కపాలం నిర్వపతీన్ద్రాసోమీయ మేకాదశకపాలగ్ం సౌమ్యం చరుం బభ్రు ర్దక్షిణా సోమాపౌష్ణం చరుం నిర్వపత్యైన్ద్రాపౌష్ణం చరుం పౌష్ణం చరుగ్ం శ్యామో దక్షిణా వైశ్వానరం ద్వాదశ కపాలం నిర్వపతి హిరణ్యం దక్షిణా వారుణం యవమయం చరు మశ్వో దక్షిణా ॥౧॥

(వైశ్వానరం ద్వాదశకపాలం నిరష్టౌ చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ఽష్టమప్రపాఠకే ఽష్టమోఽనువాకః।

వేదార్థ దీపిక

అవతారిక: సప్తమానువాకమునందు శునాశీర్యాది కర్మ చతుష్టయము ఏకదిన కర్తవ్యము చెప్పఁబడినది. ఈ అష్టమానువాకమునందు దేవికాది కర్మషట్కము ఏకదిన కర్తవ్యము చెప్పఁబడుచున్నది.

1. అర్థము: ధాత్రే=సంవత్సరకాల స్వామియగు ధాతృదేవతకొఱకు, ద్వాదశ కపాలమ్=ద్వాదశ కపాల సంస్కృతమైన, పురోడాశమ్=పురోడాశమును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. అనుమత్యై=అనుమతి దేవతకొఱకు, చరుమ్=చరు హవిస్సును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. రాకాయై=రాకా దేవతకొఱకు, చరుమ్=చరు హవిస్సును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. సినీవాల్యై=సినీవాలి దేవతకొఱకు, చరుమ్=చరు హవిస్సును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. కుహ్వై=కుహూ దేవతకొఱకు, చరుమ్=చరు హవిస్సును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. (అస్మిన్ కర్మణి=ఈ కర్మయందు,) మిథునౌ గావౌ=స్త్రీ పుంసాత్మక గో ద్వంద్వము, దక్షిణా=దక్షిణ.

తాత్పర్యము: ధాత్రాది దేవతలకు పురోడాశాది హవిస్సులను నిర్వాపము చేయవలెను. ఈ కర్మయందు గో మిథునమును దక్షిణగా నీయవలెను. (సంవత్సరకాల స్వామియగు ధాతృదేవత గర్భధారణము మొదలుకొని సంవత్సరమునకు ముందుగానే ప్రజోత్పత్తిని చేయించుచున్నది. అనుమతి దేవత యజమానునకై ప్రజోత్పత్తి నంగీకరించుచున్నది. రాకా దేవత పుత్రపుష్ట్యాది రూపము నిచ్చుచున్నది. సినీవాలి దేవత తద్రూప గర్భ

మును తొలఁగింపఁజేయుచున్నది. కుహూ దేవతచే అధ్వర్యుఁడు ప్రజయందు వాక్కు నుచ్చరించుటకు సామర్థ్యము నిచ్చుచున్నాఁడు. ఒక కళ తక్కువగాఁ గల పూర్ణిమ అనుమతి యనఁబడును. చతుర్దశీ యుక్తమైనదని భావము. చంద్రుఁడు పూర్ణుఁడై యున్న పున్నమ రాక యనఁబడును. సినీ=చంద్రకళా. సా బాలా అస్యామితి=సినీవాలీ. వబయో రభేదః. చంద్రకళ దీనియందు లేఁతదై యుండును. సినీవాలీ= చంద్రకళతో కూడిన అమావాస్య. చంద్రకళ కానరాని అమావాస్య 'కుహూ' అనఁబడును. ధాత సంవత్స రాత్మక దేవత.)

2\. అర్థము: ఆగ్నావైష్ణవమ్=అగ్ని విష్ణువు దేవతలుగాఁగల, ఏకాదశ కపాలమ్=ఏకాదశ కపాల సంస్కృత పురోడాశ మును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. ఐన్ద్రావైష్ణవమ్=ఇంద్రుఁడు విష్ణువు దేవతలుగాఁగల, ఏకాదశ కపాలమ్=ఏకాదశ కపాల సంస్కృత పురోడాశమును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. వైష్ణవమ్=విష్ణు దేవతాకమైన, త్రికపాలమ్=కపాలత్రయ సంస్కృత పురోడాశమును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను, వామనః=పొట్టిదియైన, వహీ=భారవాహియగు ఎద్దు, దక్షిణా=దక్షిణ. [2]అగ్నీషోమీయమ్=అగ్ని సోముఁడు దేవతలుగాఁగల, ఏకాదశ కపాలమ్=ఏకాదశ కపాల సంస్కృత పురోడాశమును, నిర్వపతి=నిర్వాపము చేయ వలెను. ఇన్ద్రాసోమీయమ్=ఇంద్రుఁడు సోముఁడు దేవతలుగాఁగల, ఏకాదశ కపాలమ్=ఏకాదశ కపాల సంస్కృత పురోడాశమును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. సౌమ్యమ్=సోమ దేవతాకమైన, చరుమ్=చరు హవి స్సును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. బభ్రుః=కపిల వర్ణము గల గోవు, దక్షిణా=దక్షిణ. [3]సోమా పౌష్ణమ్=సోముఁడు పూషదేవుఁడు దేవతలుగాఁగల, చరుమ్=చరు హవిస్సును, నిర్వపతి=నిర్వాపము చేయ వలెను. ఐన్ద్రాపౌష్ణమ్=ఇంద్రుఁడు, పూషదేవుఁడు దేవతలుగాఁగల, చరుమ్=చరు హవిస్సును, నిర్వపతి= నిర్వాపము చేయవలెను. పౌష్ణమ్=పూషదేవుఁడు దేవతగాఁగల, చరుమ్=చరు హవిస్సును, నిర్వపతి=నిర్వా పము చేయవలెను. శ్యామః=నల్లని రంగు గల ఎద్దు, దక్షిణా=దక్షిణ. [4]వైశ్వానరమ్=వైశ్వానరాగ్ని దేవత గాఁగల, ద్వాదశ కపాలమ్=ద్వాదశ కపాల సంస్కృత పురోడాశమును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. హిరణ్యమ్=బంగారము, దక్షిణా=దక్షిణ. [5]వారుణమ్=వరుణదేవతాకమైన, యవమయమ్=యవధాన్య నిష్పన్నమైన, చరుమ్=చరు హవిస్సును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. అశ్వః=గుఱ్ఱము, దక్షిణా= దక్షిణ.

తాత్పర్యము: ఒకటవ మంత్రమునందు దేవికా నామకములైన యైదు హవిస్సులు విధించఁబడినవి. అది ఒక కర్మవిశే షము. ఈ రెండవ మంత్రమునందు త్రిహవిష్కములైన కర్మలు మూఁడు, ఏక హవిష్కములైన కర్మలు రెండును చెప్పఁబడినవి. మొత్తము ఈ యైదు కర్మలకు దేవికాది కర్మషట్కమని వ్యవహారము. ఈ మంత్ర మున వ్యాసక్త దేవతాంతఃపాతియగు విష్ణువే "వైష్ణవం త్రికపాలమ్" అనుచోట కూడ చెప్పఁబడెను. వ్యాసక్త దేవతాంతఃపాతియైన పూషదేవుఁడు పోషకుఁడైన యొక పురుషదేవత. పౌష్ణ చరువునం దభిహిత యైన పూషదేవత భూమి యని గ్రహించవలెను. తాత్పర్యము సులభము.

అష్టమానువాకము సమాప్తము

అథ ప్రథమకాణ్డే ఉష్టమప్రపాఠకే నవమోఽనువాకః।

మూలము: [1]బార్హస్పత్యం చరుం నిర్వపతి బ్రహ్మణో గృహే శితిపృష్ఠో దక్షిణైన్ద్ర మేకాదశకపాలగ్ం రాజ
న్యస్య గృహ ఋషభో దక్షిణా ఽఽదిత్యం చరుం మహిష్యై గృహే ధేను ర్దక్షిణా నైరృతం
చరుం పరివృక్త్యై గృహే కృష్ణానాం వ్రీహీణాం నఖ నిర్భిన్నం కృష్ణా కూటా దక్షిణా ఽఽగ్నేయ
మష్టాకపాలగ్ం సేనాన్యో గృహే హిరణ్యం దక్షిణా వారుణం దశకపాలగ్ం సూతస్య గృహే
మహానిరష్టో దక్షిణా మారుతగ్ం సప్తకపాలం గ్రామణ్యో గృహే పృశ్ని ర్దక్షిణా సావిత్రం
ద్వాదశకపాలమ్ (౧)క్షత్తు ర్గృహ ఉపధ్వస్తో దక్షిణా ఽఽశ్వినం ద్వికపాలగ్ం సంగ్రహీతు ర్గృహే
సవాత్యౌ దక్షిణా పౌష్ణం చరుం భాగదుగస్య గృహే శ్యామో దక్షిణా రౌద్రం గావీధుకం చరు
మక్షావాపస్య గృహే శబల ఉద్వారో దక్షిణేన్ద్రాయ సుత్రామ్ణే పురోడాశ మేకాదశకపాలం ప్రతి
నిర్వపతీన్ద్రాయాగ్ంహోముచే [2]ఽయం నో రాజా వృత్రహా రాజా భూత్వా వృత్రం వధ్యా
[3]న్మైత్రాబార్హస్పత్యం భవతి శ్వేతాయై శ్వేతవత్సాయై దుగ్ధే స్వయంమూర్తే స్వయంమథిత
ఆజ్య ఆశ్వత్థే (౨)పాత్రే చతుస్స్రక్తౌ స్వయ మవపన్నాయై శాఖాయై కర్ణాగ్ం శ్చాకర్ణాగ్ం
శ్చ తణ్డులా న్వి చినుయా ద్యే కర్ణా స్సపయసి బార్హస్పత్యో యే కర్ణా స్స ఆజ్యే మైత్ర
స్స్వయంకృతా వేది ర్భవతి స్వయందినం బర్హి స్స్వయంకృత ఇధ్మ స్సైవ శ్వేతాశ్వేతవత్సా
దక్షిణా ॥౩॥ (సావిత్రం ద్వాదశకపాల మాశ్వత్థే త్రయస్త్రిగ్ంశ చ్చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ఉష్టమప్రపాఠకే నవమోఽనువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: అష్టమానువాకమునందు ఏకదిన కర్తవ్యమైన దేవికాది కర్మషట్కము విహితమైనది. ఈ నవమానువాకమునందు రత్ని హవిస్సులు ప్రతిదిన మాచరింపవలసినవి చెప్పఁబడినవి.

1. **అర్థము:** (1)బ్రహ్మణః=బ్రహ్మయను ఋత్విజునియొక్క, గృహే=గృహమునందు, (రాజా=రాజు,) బార్హస్పత్యమ్=బృహస్పతి దేవతాకమైన, చరుమ్=చరు హవిస్సును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. శితిపృష్ఠః=తెల్లని పృష్ఠభాగము గల గోవు, దక్షిణా=దక్షిణ. (2)రాజన్యస్య=రాజశ్రేష్ఠునియొక్క, గృహే=గృహమునందు, ఐన్ద్రమ్, ఏకాదశకపాలమ్, నిర్వపతి. ఋషభః, దక్షిణా. (3)మహిష్యై=(పట్టాభిషిక్తుఁడైన రాజుయొక్క భార్య,) పట్టమహిషియొక్క (షష్ఠ్యర్థే చతుర్థీ,) గృహే=గృహమునందు, ఆదిత్యమ్=అదితి దేవతాకమైన, చరుమ్, నిర్వపతి. ధేనుః, దక్షిణా. (4)పరివృక్త్యై=ప్రేమ లేని రాజపత్నియొక్క, (షష్ఠ్యర్థే చతుర్థీ,) గృహే=గృహమునందు, నైర్ఋతమ్=నిర్ఋతి దేవతాకమైన, కృష్ణానామ్=నల్లని, వ్రీహీణామ్=ధాన్యములయొక్క, నఖనిర్భిన్నమ్=పొట్టునుండి గోళ్లచే ఊడఁదీసిన తండులములతో నిష్పన్నమైన, చరుమ్=చరు హవిస్సును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. (ధాన్యమును దంచకయే గోళ్లచే పొట్టు తీయఁగా నేర్పడిన బియ్యము ఉడికించఁగా నేర్పడిన చరువు అని తాత్పర్యము.) కృష్ణా=నల్లని, కూటా=కొమ్ములు విఱిగిన గోవు, దక్షిణా=దక్షిణ. (5)సేనాన్యః=సేనానియొక్క, గృహే=గృహమునందు, ఆగ్నేయమ్, అష్టాకపాలమ్, నిర్వపతి. హిరణ్యమ్, దక్షిణా. (6)సూతస్య=సారథియొక్క, గృహే=గృహమునందు, వారుణమ్, దశ కపాలమ్, నిర్వపతి. మహానిరష్టః=పీడిత వృషణములు గల యెద్దు, దక్షిణా. (7)గ్రామణ్యః=గ్రామణి (గ్రామాధిపతి) యొక్క, గృహే=గృహమునందు, మారుతమ్=మరుద్దేవతాకమైన, సప్తకపాలమ్=సప్తకపాల సంస్కృత పురోడాశమును, నిర్వపతి. పృశ్నిః=శుక్ల వర్ణము గల గోవు, దక్షిణా. (8)క్షత్తుః=అంతఃపురాధ్యక్షునియొక్క, గృహే, సావిత్రమ్, ద్వాదశకపాలమ్, నిర్వపతి. ఉపధ్వస్తః=సంకీర్ణ వర్ణము గల గోవు, దక్షిణా. (9)సంగ్రహీతుః=కోశాధ్యక్షునియొక్క, గృహే, ఆశ్వినమ్=అశ్వినీదేవ దేవతాకమైన, ద్వికపాలమ్=రెండు కపాలము లందు సంస్కృతమైన పురోడాశమును, నిర్వపతి. సవాత్యౌ=ఏకోదరములైన వత్సములు, దక్షిణా. (10)భాగదుఘస్య=(రాజునకు ప్రజలనుండి రావలసిన షష్ఠభాగమును తీసికొనునట్టివాఁడు.) భాగదుఘునియొక్క, గృహే, పౌష్ణమ్, చరుమ్, నిర్వపతి. శ్యామః=శ్యామ వర్ణము గల గోవు, దక్షిణా. (11)అక్షావాపస్య=ద్యూతకారునియొక్క, గృహే, రౌద్రమ్=రుద్రదేవతాకమైన, గావీధుకమ్=అరణ్య గోధూమ నిష్పన్నమైన, చరుమ్, నిర్వపతి. శబలః=చిత్రవర్ణములు (=నానావర్ణములు) కలదియు, ఉద్వారః=పొడవైన తోఁక కలదియునగు గోవు, దక్షిణా.

తాత్పర్యము: ఈ మంత్రమునందు పదునొకండు హవిస్సులు అనఁగా పదునొకండు ఇష్టులు చెప్పఁబడినవి. ఇవి రాజసూయ యాగమునకు సంబంధించినవి. రాజే స్వయముగా 'బ్రహ్మ' మున్నగువారి గృహములకు పోయి ఆ యా హవిస్సులను పైని చెప్పినవిధముగ చేసి ఆ యా దక్షిణల నీయవలెను. వీనికి 'రత్ని' హవిస్సులని పేరు. 'రత్నాని ఏషాం సన్తీతి=రత్నినః'. బ్రాహ్మణ రాజన్య మహిష్యాదులు రత్నులు. బ్రాహ్మణ రాజన్య మహిష్యాదుల అభిమానిదేవతలకు ఈ హవిస్సులు ప్రియమైనవి. అందువలన రాజు వారి గృహముల యందే హవిర్నిర్వాపము చేయవలెను. ఈ రత్న్యభిమాని దేవతలే రాష్ట్రము నొసఁగుటకు కాని, తొలఁగించుటకు కాని సమర్థులు. కావున స్వకీయ బ్రహ్మాది గృహములందు హవిర్నిర్వాపము చేయుటచేత సంతుష్టులై ఈ దేవతలు రాష్ట్రము నిత్తురు. (మిగిలిన తాత్పర్యము సులభము. ఈ మంత్రమునందలి అనేక పదములు ఇదివరలో అనేక పర్యాయములు వ్యాఖ్యాతములు కావున అట్టి పదముల కిచట మఱల అర్థము వ్రాయలేదు. సమన్వయము మాత్రము చేయఁబడినది.)

2. అర్థము: ప్రతి=ప్రాతిస్విక(=స్వీయ)గృహమునందు, సుత్రామ్ణే=బాగుగ పాలించునట్టి, ఇన్ద్రాయ=ఇంద్రునికొఱకు, ఏకాదశకపాలం పురోడాశమ్=ఏకాదశ కపాల సంస్కృత పురోడాశమును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. అంహోముచే=పాప విమోచకుఁడైన, ఇన్ద్రాయ=ఇంద్రునికొఱకు, ఏకాదశ కపాలం పురోడాశమ్, నిర్వపతి.

తాత్పర్యము: ఒకటవ మంత్రమున ఏకాదశ హవిస్సులు విహితములైనవి. అందు చెప్పఁబడని "భగాయ చరుం వావ తాయై గృహే" అను బ్రాహ్మణోక్త మయిన మఱియొక హవిస్సు కలదు. దానితో కలిసి పండ్రెండు హవిస్సు లేర్పడినవి. ఈ పండ్రెండు హవిస్సులను హోమము చేసిన యనంతరము స్వగృహమునందు రాజు చేయవలసిన హవిర్ద్రవ్యము ఈ మంత్రమునందు జెప్పఁబడినది. దీనిని ప్రతినిర్వాప మని యందురు. తాత్పర్యము సులభము.

3. అర్థము: అయమ్=ఈ, నః=మాయొక్క, రాజా=రాజసూయ కర్తయగు రాజు, వృత్రహా రాజా భూత్వా=శత్రువధ క్షముఁడగు రాజు అయి, వృత్రమ్=శత్రువును, వధ్యాత్=వధించుఁగాక.

తాత్పర్యము: రాజసూయ కర్తయగు ఈ మా రాజు శత్రువధ క్షముఁడై శత్రువును వధించుఁగాక. (అధ్వర్యుఁడు స్విష్టకృదగ్ని కెదుట నుండి యీ మంత్రమును జపించవలెను.)

4. అర్థము: (అభిషేచనీయ నామక సోమయాగమున కంగభూత దీక్షణీయేష్టియం దుపయోగించవలసిన హవిస్సు ఈ మంత్రమునందు వివరింపఁబడుచున్నది.) స్వయమ్ అవపన్నాయై=తనంతట తానుగా క్రిందఁబడిన, శాఖాయై=కొమ్మయొక్క, (షష్ఠ్యర్థే చతుర్థీ.) చతుస్రక్తౌ=చతురస్రమైన, అశ్వత్థే పాత్రే=రావిచెట్టునకు సంబంధించిన పాత్రమునందు, శ్వేత వత్సాయై=తెల్లని దూడ గల, శ్వేతాయై=తెల్లని ఆవుయొక్క, స్వయంమూర్తే=స్వయంమూర్తమైన, దుగ్ధే=క్షీరమునందు, స్వయం మథితే=స్వయం మథితమైన, ఆజ్యే=నేతియందు, మైత్రా బార్హస్పత్యమ్=మిత్ర దేవతాకము, బృహస్పతి దేవతాకమునైన, (హవిః=చరు హవిస్సు) భవతి=నిష్పాద్యమగుచున్నది. (తస్మై=ఆ చరు హవిస్సునకై) కర్ణాన్ చ=విఱిగినవియు, అకర్ణాన్ చ=విఱుగనవియునగు, తణ్డులాన్=తండులములను, వి చినుయాత్=పక్వము చేయవలెను. యే కర్ణాః=ఏ విఱిగిన తండులములు, పయసి=క్షీరమునందు, (పచ్యన్తే=వండఁబడుచున్నవో) సః=ఆ పాల యందు నిష్పన్నమైన చరువు, బార్హస్పత్యః=బృహస్పతి దేవతాకము. యే=ఏ తండులములు, ఆజ్యే=నేతియందు, (పచ్యన్తే=పక్వము చేయఁబడుచున్నవో,) సః=ఆ ఆజ్య పక్వమైన చరువు, మైత్రః=మిత్ర దేవతాకము. (అస్యామ్=ఈ దీక్షణీయేష్టియందు,) వేదిః=వేది, స్వయంకృతా=శాస్త్రీయమైన ఉద్ధననము లేనిదియై, భవతి=అగుచున్నది. (మఱియు) బర్హిః=బర్హిస్సు, స్వయందినమ్=సమంత్రక శాస్త్రీయచ్ఛేదనము లేకుండగనే ఖండితమైనదియై, భవతి=అగుచున్నది. ఇధ్మః=ఇధ్మము, స్వయంకృతః=స్వయంకృతమై, భవతి=అగుచున్నది. సా=ఆ, శ్వేతవత్సా=తెల్లని దూడ గల, శ్వేతైవ=తెల్లని గోవే, దక్షిణా=దక్షిణ, భవతి=అగుచున్నది. (స్వయంమూర్తము=చూత ఫల పుష్పరసముచే- పూయఁబడిన తోలు తిత్తి యందు తెల్లని దూడ గల తెల్లావునుండి పాలు పిండినచో, ఆ పాలు మజ్జిగతోడు లేకుండగనే గడ్డ కట్టిన పెరుఁగు అగును. అదియే స్వయంమూర్త పయ స్సనఁబడును. స్వయంమథితము=ఆ పయస్సు బదర్యాది ఫలసంయోగముచే అంతటను స్రవించునదిగా నుండును. అది స్వయంమథిత పయస్సనఁబడును.)

తాత్పర్యము: తాత్పర్యము అర్థమునందే వివరింపఁబడినది.

నవమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ఽష్టమప్రపాఠకే దశమోఽనువాకః।

మూలము: [1]అగ్నయే గృహపతయే పురోడాశ మష్టాకపాలం నిర్వపతి కృష్ణానాం వ్రీహీణాగ్ం సోమాయ వనస్పతయే శ్యామాగ్ం చరుగ్ం సవిత్రే సత్యప్రసవాయ పురోడాశం ద్వాదశకపాల మాశూనాం వ్రీహీణాగ్ం రుద్రాయ పశుపతయే గావీధుకం చరుం బృహస్పతయే వాచస్పతయే నైవారం చరు మిన్ద్రాయ జ్యేష్ఠాయ పురోడాశ మేకాదశకపాలం మహా వ్రీహీణాం మిత్రాయ సత్యాయా ఽఽమ్బానాం చరుం వరుణాయ ధర్మపతయే యవమయం చరుగ్ం [2]సవితా త్వా ప్రసవా నాగ్ం సువతా మగ్ని ర్గృహపతీనాగ్ం సోమో వనస్పతీనాగ్ం రుద్రః పశూనామ్ (౧)బృహస్పతి ర్వాచా మిన్ద్రో జ్యేష్ఠానాం మిత్ర స్సత్యానాం వరుణో ధర్మపతీనాం యే దేవా దేవసువ స్స్థ త ఇమ మాముష్యాయణ మనమిత్రాయ సువధ్వం మహతే క్షత్రాయ మహత ఆధిపత్యాయ మహతే జానరాజ్యాయై[3]ష వో భరతా రాజా [4]సోమో ఽస్మాకం బ్రాహ్మణానాగ్ం రాజా [5]ప్రతి త్య న్నామ రాజ్య మధాయి స్వాం తనువం వరుణో అశిశ్రే చ్ఛుచే ర్మిత్రస్య వ్రత్యా అభూమామన్మహి మహత ఋతస్య నామ సర్వే వ్రాతా వరుణస్యాభూవ న్వి మిత్ర ఏవై రరాతి మతారీ దసూషుదన్త యజ్ఞియా ఋతేన వ్య త్రితో జరిమాణం న ఆనోడ్విష్ణోః క్రమో ఽసి విష్ణోః క్రాన్త మసి విష్ణో ర్విక్రాన్త మసి ॥ ౨ ॥ (పశూనాం వ్రాతాః పఞ్చవిగ్ంశతి శ్చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ఽష్టమప్రపాఠకే దశమోఽనువాకః।

వేదార్థదీపిక

అవతారిక: నవమానువాకమునందు రత్నిహవిస్సులు దీక్షణీయేష్టి చెప్పబడినవి. ఈ దశమానువాకమునందు దేవసూ హవిస్సులు చెప్పబడినవి.

1. అర్థము: గృహపతయే=గృహపతియగు, అగ్నయే=అగ్నికొఱకు, అష్టాకపాలమ్=అష్టకపాల సంస్కృతమైన, కృష్ణానాం వ్రీహీణామ్=నల్లని వడ్లకు సంబంధించిన, పురోడాశమ్=పురోడాశమును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. వనస్పతయే=వనస్పతియగు, సోమాయ=సోమ దేవతకొఱకు, శ్యామాకమ్=చామలు అనెడి ధాన్యముల సంబంధియగు, చరుమ్=చరు హవిస్సును, నిర్వపతి. సత్య ప్రసవాయ=అమోఘమైన అభ్యనుజ్ఞ గల, సవిత్రే=సవితృ దేవతకొఱకు, ద్వాదశ కపాలమ్=ద్వాదశకపాల సంస్కృతమైన, ఆశూనాం వ్రీహీణామ్=అరువది దినములలో పండునటువంటి (వ్రీహుల) ధాన్యముల సంబంధియగు, పురోడాశమ్=పురోడాశమును, నిర్వపతి. పశుపతయే=పశుపతియగు, రుద్రాయ=రుద్రునికొఱకు, గావీధుకమ్=ఆరణ్యక గోధూమ నిష్పన్నమైన, చరుమ్=చరు హవిస్సును, నిర్వపతి. వాచస్పతయే=వాక్కులకు పతియగు, బృహస్పతయే=బృహస్పతి కొఱకు, నైవారమ్=నివ్వరి ధాన్య సంబంధియగు, చరుమ్=చరు హవిస్సును, నిర్వపతి. జ్యేష్ఠాయ=దేవతలలో జ్యేష్ఠుఁడైన, ఇన్ద్రాయ=ఇంద్రునికొఱకు, ఏకాదశ కపాలమ్=పదునొకండు కపాలములందు సంస్కృతమైన, మహావ్రీహీణామ్=మహావ్రీహుల (స్థూల బీజముల,) సంబంధియగు, పురోడాశమ్=పురోడాశమును, నిర్వపతి. సత్యాయ=సత్య స్వరూపుఁడైన, మిత్రాయ=మిత్ర దేవునికొఱకు, అమ్బానామ్=అంబము అనెడి ధాన్యవిశేషముల సంబంధియగు, చరుమ్=చరు హవిస్సును, నిర్వపతి. ధర్మపతయే=ధర్మపతియగు, వరుణాయ=వరుణ దేవునికొఱకు, యవమయమ్=యవల సంబంధియగు, చరుమ్=చరు హవిస్సును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను.

తాత్పర్యము: ఈ మంత్రమునందు దేవసూలగు అగ్న్యాది దేవతలకు సంబంధించిన యెనిమిది హవిస్సులు విహితములైనవి. వక్ష్యమాణ మంత్రమునందు యజమానుని 'రాజా' అను సంజ్ఞచే గుర్తించునట్టి అగ్న్యాది దేవతలు దేవసూలనఁబడుదురు. దేవాః-(యజమానం వక్ష్యమాణ సంజ్ఞయా) సువన్తే=అనుజానన్తీత్యగ్న్యాదయః=దేవసువః, అని వ్యుత్పత్త్యర్థము. ఈ యెనిమిది హవిస్సులు అభిషేచనీయ గతమైన అగ్నీషోమీయ పశు పురోడాశము ననుసరించి నిర్వాపము చేయవలెను. తాత్పర్యము సుగమము.

2. అర్థము: (హే యజమాన!=ఓ యజమానుఁడా!) త్వామ్=నిన్ను, సవితా=సవితృ దేవుఁడు, ప్రసవానామ్=(యజమానునకు స్వభృత్యులయందు ఐశ్వర్యమునకై యిచ్చిన) అనుజ్ఞలకు, (స్వామిత్వేన=స్వామివిగా,) సువతామ్=గుర్తించుఁగాక. గృహపతీనామ్=గృహపతులకు, (స్వామిత్వేన=స్వామివిగా,) అగ్నిః=అగ్ని, సువతామ్=గుర్తించుఁగాక. వనస్పతీనామ్=వనస్పతులకు, త్వామ్=నిన్ను (స్వామిత్వేన=స్వామివిగా) సోమః=సోమదేవత, సువతామ్=గుర్తించుఁగాక. రుద్రః=రుద్ర దేవుఁడు, త్వామ్=నిన్ను, పశూనామ్=పశువులకు, (స్వామినమ్=స్వామినిగా) సువతామ్=గుర్తించుఁగాక. బృహస్పతిః=బృహస్పతి, త్వా=నిన్ను, వాచామ్=వాక్కులకు, (స్వామినిగా) సువతామ్=గుర్తించుఁగాక. ఇన్ద్రః=ఇంద్రుఁడు, జ్యేష్ఠానామ్=జ్యేష్ఠులలో, త్వామ్=నిన్ను, (స్వామినమ్=స్వామినిగా,) సువతామ్=గుర్తించుఁగాక. మిత్రః=మిత్ర దేవుఁడు, త్వామ్=నిన్ను, సత్యానామ్=సత్యములకు, (స్వామినమ్=స్వామినిగా,) సువతామ్=గుర్తించుఁగాక. వరుణః=వరుణ దేవుఁడు, త్వామ్=నిన్ను, ధర్మపతీనామ్=ధర్మపతులలో, (స్వామినమ్=స్వామినిగా,) సువతామ్=గుర్తించుఁగాక. హే దేవాః=ఓ అగ్న్యాది దేవతలారా!, యే (యూయమ్) ఏ మీరు, దేవసువః=యజమాన ప్రేరకులుగా, స్థ=ఉంటున్నారో, తే=ఆ మీరు, అముమ్=ఈ యజమానుని, ఆముష్యాయణమ్=(=అముష్య దేవదత్తస్య పుత్రమ్) ఈ దేవదత్తుని పుత్రుని, (=అముష్య యజ్ఞదత్తస్య పౌత్రమ్) ఈ యజ్ఞదత్తుని పౌత్రుని, అనమిత్రాయ=శత్రురాహిత్యముకొఱకు, సువధ్వమ్=గుర్తింతురు గాక. (కించ=మఱియు,) మహతే క్షత్రాయ=సాటిలేని క్షత్రియ కులముకొఱకు, మహతే ఆధిపత్యాయ=అప్రతిహతనియమన సామర్థ్యముకొఱకు, మహతే జానరాజ్యాయ=మహా సార్వభౌమత్వముకొఱకు, సువధ్వమ్=గుర్తింతురు గాక.

తాత్పర్యము: ఓ యజమానుఁడా! సవిత్రాది దేవతలు నిన్ను ప్రసవాదులకు స్వామినిగా గుర్తింతురు గాక. యజమాన ప్రేరకులైన ఓ అగ్న్యాది దేవతలారా! మీరు ఈ యజమానుని ఇతని పుత్రుని పౌత్రుని శత్రురాహిత్యము కొఱకు ఉత్తమ క్షత్రియ కులముకొఱకు, ఎదురు లేని ఆధిపత్యముకొఱకు, మహా సార్వభౌమత్వము కొఱకు గుర్తింతురు గాక. (బ్రహ్మ ఈ మంత్రమును పఠించుచు యజమాన హస్తమును పట్టుకొనవలెను.)

3. అర్థము: హే భరతాః!=ఓ రాజన్య వైశ్యాది ధనికులారా! ఏషః=ఈ యజమానుఁడు, వః=మీకు, రాజా=రాజు.

తాత్పర్యము: ఓ రాజన్య వైశ్యాది ధనికులారా! ఈ యజమానుఁడు మీకు రాజు. (కావున ఇతనిని సేవింపుఁడని భావము. ఈ యజమానుని రాజునుగా రాజన్యాదులకు ఈ మంత్రముచే తెలియఁజేయవలెను.)

4. అర్థము: బ్రాహ్మణానామ్=బ్రాహ్మణులమైన, అస్మాకమ్=మాకు, సోమః=ఉత్తమ దేవుఁడు, రాజా=రాజు.

తాత్పర్యము: బ్రాహ్మణులమైన మాకు ఉత్తమ దేవుఁడు రాజు. (కాని అధమ క్షత్రియుఁడు రాజు కాఁడని భావము. బ్రహ్మ యీ మంత్రమును జపించవలెను.)

5. అర్థము: త్యత్=(రెండవ మంత్రమున 'మహతే' ఇత్యాదికముచే చెప్పఁబడిన,) ఆ, రాజ్యమ్=జానరాజ్యము, నామ=యజమానున కవశ్యమగు విధముగ, (వరుణేన=వరుణునిచే,) ప్రత్యధాయి=ప్రతిష్ఠింపఁ జేయఁబడినది. వరుణః=వరుణదేవుఁడు, అశిశ్రేత్=(ధర్మపతులలో యజమానుని స్వామినిగా గుర్తించిన తన శరీరమును,) ఆశ్రయించెను. (వరుణునివలె అగ్న్యాదులు గూడ యజమానునకు తత్తద్విషయములలో అభ్యనుజ్ఞ యిచ్చిన తమతమ శరీరముల నాశ్రయించిరని దీనిచే ఉపలక్షిత మగుచున్నది.) వయమపి=మేము కూడ, శుచేః=పరిశుద్ధుఁడగు, మిత్రస్య=సూర్యునియొక్క, (అనుజ్ఞయా=అనుజ్ఞచేత,) వ్రత్యాః=కర్మయోగ్యులము, అభూమ=అయితిమి, (ఇచటఁగూడ మిత్రశబ్దము అగ్న్యాదులకు ఉపలక్షకము. అగ్న్యాదుల యనుజ్ఞచేత అని కూడ అర్థము గ్రహించవలెను. కనుకనే, అగ్న్యాది దేవైః అనుజ్ఞాతాః వయమ్=అగ్న్యాది దేవతలచే అనుజ్ఞాతులమైన మేము,) మహతః ఋతస్య=ప్రౌఢమైన యజ్ఞముయొక్క, నామ అమన్మహి=రాజసూయ కర్మను జేసితి మను నామధేయమును సర్వదా తలఁచుకొనుచున్నాము. (కించ=మఱియు,) సర్వే=ఋత్విజు లందఱు, వరుణస్య=వరుణదేవునియొక్క (అనుజ్ఞయా=అనుజ్ఞచేత,) వ్రాతాః=కర్మయోగ్యులు, అభూవన్=అయిరి. మిత్రః (చ)=మిత్ర (సూర్య) దేవుఁడును, ఏవైః=(మమ్ము రక్షించుటకైన) ఆగమనములచే, అరాతిమ్=శత్రువును, వ్యతారీత్=(మేము)అతిక్రమించునట్లుగాఁ జేసెను. యజ్ఞియాః=ఋత్విజులు, ఋతేన=యజ్ఞముచేత, అసూషదన్త=రక్షించిరి. త్రితః=బ్రాహ్మణాది మూఁడు వర్ణములవారిచే విస్తరింపఁ జేయఁబడిన అగ్ని, నః=మాయొక్క, జరిమాణమ్=ముసలితనముచే నైన శరీర శైథిల్యమును, వ్యు=విశేషముగ తొలఁగించి, ఆనట్=ఆయువును వ్యాపింపఁజేసినవాఁ డయ్యెను. (=దీర్ఘాయువును కలుగఁజేసెను.)

తాత్పర్యము: పూర్వము చెప్పఁబడిన సార్వభౌమత్వాధికారముతోఁ గూడిన జానరాజ్యము యజమానున కవసరమగు విధముగ వరుణునిచే ప్రతిష్ఠింపఁబడినది. వరుణుఁడు, తదుపలక్షితులైన అగ్న్యాది దేవతలును యజమానునకు ఆయా విషయములలో స్వామిత్వమునకై అనుజ్ఞ నిచ్చిన తమతమ శరీరముల నాశ్రయించిరి. మేము కూడ పరిశుద్ధుఁడగు మిత్రదేవుని యాజ్ఞచే కర్మయోగ్యుల మైతిమి. కనుకనే అగ్న్యాదులచే అనుజ్ఞ పొందఁబడిన మేము రాజసూయకర్మను జేసితి మనెడి గొప్ప యజ్ఞముయొక్క పేరును సర్వదా తలఁచుచున్నాము. (మఱియు) ఋత్విజులందఱు వరుణుని యనుజ్ఞచే కర్మయోగ్యులైరి. మిత్రదేవుఁడును తన యాగమనములచే మేము శత్రువు నతిక్రమించువిధముగఁ జేసెను. ఋత్విజులు కూడ యజ్ఞముచే (మమ్ము) రక్షించిరి. బ్రాహ్మణాది వర్ణత్రయముచే విస్తరింపఁజేయఁబడిన యగ్ని మాయొక్క ముసలితనముచేనైన శరీర శైథిల్యము (శరీర సంధులు సడలుట) ను విశేషముగ పోఁగొట్టి ఆయువును కల్పించినాఁడు. (ఈ మంత్రము చెప్పుచు యజమానుఁడు నీటిచే ముఖము కడుగుకొనవలెను.)

6. అర్థము: ఈ మంత్రము వాజపేయ ప్రకరణమునందు రథసమీప గమన సందర్భమున వ్యాఖ్యానింపఁబడినది.

దశమానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ఽష్టమప్రపాఠక ఏకాదశోఽనువాకః।

మూలము: [1]అర్థేత స్థాపాంపతి రసి వృషా ఽస్యూర్మి ర్వృషసేనో ఽసి వ్రజక్షిత స్థ మరుతా మోజ స్థ సూర్యవర్చస స్థ సూర్యత్వచస స్థ మాన్దా స్థ వాశా స్థ శక్వరీ స్థ విశ్వభృత స్థ జనభృత స్థాగ్నే స్తేజస్యా స్థాపా మోషధీనాగ్ం రస స్థాపో దేవీ ర్మధుమతీ రగృహ్ణ న్నూర్జస్వతీ రాజసూయాయ చితానాః। యాభి ర్మిత్రావరుణా వభ్యషిఞ్చ న్యాభి రిన్ద్ర మనయ న్నత్యరాతీః। రాష్ట్రదా స్థ రాష్ట్రం దత్త స్వాహా రాష్ట్రదా స్థ రాష్ట్ర మముష్మై దత్త ॥౧॥

(అత్యేకాదశ చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ఽష్టమప్రపాఠక ఏకాదశోఽనువాకః॥

వేదార్థ దీపిక

అవతారిక: దశమానువాకమునందు దేవసూ హవిస్సులు చెప్పఁబడినవి. ఈ యేకాదశానువాకమునందు అభిషేకార్థ జలవిషయ మంత్రములు చెప్పఁబడినవి.

1. అర్థము: (హే సారస్వత్యః అపః=ఓ సరస్వతీ నదీ జలములారా!, యూయమ్=మీరు,) అర్థేతః=ప్రయోజనము నుద్దేశించి (సరస్వతీ నదినుండి యజ్ఞప్రదేశమునకు) పోవుచున్న వారలు, స్థ=అగుచున్నారు. (హే సముద్ర!=ఓ సముద్రుండా!, త్వమ్=నీవు,) అపాం పతిః=ఉదకములకు పతివి, అసి=అగుచున్నావు. (నీ జలమును గ్రహించుచున్నానని భావము.) (ప్రతీపం యుధ్యన్,) హే ఊర్మిః!=వక్రముగా యుద్ధము చేయుచున్న జలతరంగమా! (ఊర్మిరితి సంబుధ్యర్థే ప్రథమా, త్వమ్=నీవు,) వృషా=సేచకము, అసి=అగుచున్నావు. (అన్వీపం యుధ్యన్ హే ఊర్మే!=అనుకూలముగా శీఘ్రముగ పోవుచు యుద్ధము చేయుచున్న తరంగమా!, త్వమ్=నీవు,) వృషసేనః=సేచన క్షమమైన జలరాశిరూప సేన కలదానవు, అసి=అగుచున్నావు. (పురుషుఁడు గాని, పశువు గాని నదిని దాఁటుటకై ప్రవాహమునందు దిగినప్పుడు ఊపరి భాగమునందలి అల ప్రవాహ సంబంధియగు మఱియొక అలతో యుద్ధము చేయును. అధో భాగమునందలి అల ప్రవాహానుకూలముగ శీఘ్రముగ పోవుచు మఱియొక అలతో పోరాడును. ఈ రెండు విషయములు ఇచట వర్ణింపఁబడినవి.) (హే కూప్యాః అపః=ఓ నూతి యుదకములారా!, యూయమ్=మీరు,) వ్రజక్షితః=గోష్ఠమువలె పశ్చులకు నివాస యోగ్యమైన కూప స్థానమునందు నివసించుచున్న వారలు, స్థ=అగుచున్నారు. (హే ప్రతీప గామిన్యః!=వక్రముగ పోవు నుదకములారా!, యూయమ్=మీరు,) మరుతామ్=వాయువులకు, ఓజః=బలరూపములు, స్థ=అగుచున్నారు. (నీళ్ల నుదుటందు వాయువుచే ప్రతిహతములై ఉదకములు వక్రముగా పోవునని భావము.)

(హే ఆతప యుక్త వృష్టి సంబంధిన్యః అపః!=ఎండతోఁగూడిన వానకు సంబంధించిన ఉదకములారా!, యూయమ్=మీరు,) సూర్యవర్చసః=సూర్యునివలె తేజస్సు కలవారు, స్థ=అగుచున్నారు. (హే సూర్యాది ప్రతిబింబ గ్రాహిణ్యః అపః!=ఓ సూర్యాదుల ప్రతిబింబమును గ్రహించు నుదకములారా!, యూయమ్=మీరు,) సూర్య త్వచసః=సూర్యుని శరీరము ప్రతిబింబరూపముగఁ గలవారు, స్థ=అగుచున్నారు. (హే స్థావరాః అపః!=కదలిక లేని యుదకములారా!, యూయమ్=మీరు,) మాన్దాః=(గమనము లేకపోవుటచే,) మందరూపులు, స్థ=అగుచున్నారు. (హే నీహారగతా అపః!=మంచునందలి ఉదకములారా! యూయమ్=మీరు,) వాశాః స్థ=వశ్యులగుచున్నారు. (మంచు నదీ ప్రవాహమువలె మనుష్యుని నడకను ప్రతిబంధించదు కావున వశ్యత్వమని భావము.) గో ర్గర్భవేష్టనే ఉల్బే స్థితాః హే అపః!=గోవుయొక్క గర్భాశయమందలి గర్భపిండమునందుండు నుదకములారా!, యూయమ్=మీరు,) శక్వరీః=గర్భ రక్షణమునందు శక్తులు, స్థ=అగుచున్నారు. (ఉల్బము=గర్భాశయము, లేక, గర్భపిండము.)

(హే క్షీరజాతాః అపః=ఓ క్షీరమునందలి యుదకములారా! యూయమ్=మీరు,) విశ్వభృతః=విశ్వమును పోషించుచున్నవారు, స్థ=అగుచున్నారు. (ప్రాణిజాతము క్షీరముచే పోషింపఁబడుచున్నది కదా!) (హే దధిగతాః అపః!=ఓ దధియందుండు నుదకములారా!, యూయమ్=మీరు,) జనభృతః=జనులను పోషించుచున్నవారు, స్థ=అగుచున్నారు. (హే ఘృత ద్రవరూపాః అపః!=ఆజ్య ద్రవరూపములైన యుదకములారా! యూయమ్=మీరు,) అగ్నేః=అగ్నియొక్క, తేజస్యాః=తేజస్సునుండి పుట్టినవారు, స్థ=అగుచున్నారు. (అగ్ని జ్వాలారూపము కావున ఘృతము అగ్నితేజస్సు అని భావము.) హే మధు ద్రవరూపాః అపః=ఓ మధు ద్రవరూపములైన యుదకములారా!, యూయమ్=మీరు,) అపామ్=ఉదకములయొక్క, ఓషధీనాం (చ)=ఓషధులయొక్కయు, రసః=రస స్వరూపులు, స్థ=అగుచున్నారు. (మధుద్రవము పుష్పరస జన్యమగుటచే ఉభయ సారత్వము ప్రసిద్ధము.) రాజసూయాయ=రాజసూయ యాగముకొఱకు, చితానాః=ఆలోచించుచున్న ఋత్విజులు, దేవీః=దివ్యమానములు, మధుమతీః=మధురములు, ఊర్జస్వతీః=బలప్రదములునగు, అపః=ఉదకములను, అగృహ్ణన్=గ్రహించిరి. (పురా=పూర్వము,) యాభిః=ఏ ఉదకములచే, (దేవతాః=దేవతలు,) మిత్రావరుణౌ=మిత్రావరుణ దేవులను, అభ్యషిఞ్చన్=అభిషేకించిరో, యాభిః=ఏ ఉదకములచేత, అరాతీరతి=శత్రువుల నతిక్రమించి, ఇన్ద్రమ్=ఇంద్రుని, అనయన్=పొందించిరో, (ఆ యుదకములను ఋత్విజులు గ్రహించిరని అన్వయము.) (హే అపః!=ఓ యుదకములారా! యూయమ్=మీరు,) రాష్ట్రదాః=రాష్ట్రము నిచ్చువారు, స్థ=అగుచున్నారు. (అతః=ఇందువలన, యజమానాయ=యజమానుని కొఱకు,) రాష్ట్రమ్=రాష్ట్రమును, దత్త=ఒసఁగుఁడు. స్వాహా=ఈ హవిస్సు మీకీయఁబడినది. రాష్ట్రదాః=రాష్ట్రము నొసఁగువారు, స్థ=అగుచున్నారు. అముష్మై=ఈ యజమానునికొఱకు, రాష్ట్రమ్=రాష్ట్రమును, దత్త=ఒసఁగుఁడు. ("అర్థేతః" ఇత్యాది పంచదశ మంత్రములందును "అపో దేవీ" రిత్యాది ఋక్కు నను సంధానము చేసి అర్థము చెప్పుకొనవలెను. "రాష్ట్రదాః స్థ" ఇత్యాది మంత్రము ఆదరార్థము ద్విరుక్తమైనది. అర్థమునందే తాత్పర్యము కూడ వివరింపఁబడినది.)

ఏకాదశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే చతుర్థప్రపాఠకే పఞ్చత్రింశోఽనువాకః।

మూలము: [1]దేవీ రాప స్సం మ్మధుమతీ ర్మధుమతీభి స్సృజ్యధ్వం మహి వర్చః క్షత్రియాయ వన్వానా [2]అనాధృష్టా స్సీదతోర్జస్వతీ ర్మహి వర్చః క్షత్రియాయ దధతీ [3]రనిభృష్ట మసి వాచో బన్ధు స్తపోజా స్సోమస్య దాత్ర మసి [4]శుక్రావ శ్శుక్రేణోత్పునామి చన్ద్రా శ్చన్ద్రేణామృతా అమృతేన స్వాహా రాజసూయాయ చితానాః। [5]సధమాదో ద్యుమ్నినీ రూర్జ ఏతా అనిభృష్టా అపస్యువో వసానః। పస్త్యాసు చక్రే వరుణ స్సధస్థ మపాగ్ం శిశుః (౧)మాతృతమా స్వన్తః। [6]క్షత్రస్యోల్బ మసి క్షత్రస్య యోని రస్య[7]వీన్నో అగ్ని ర్గృహపతి రావిన్న ఇన్ద్రో వృద్ధశ్రవా అవిన్నః పూషా విశ్వవేదా అవిన్నౌ మిత్రావరుణా వృతావృధా వావిన్నే ద్యావాపృథివీ ధృతవ్రతే అవిన్నా దేవ్యదితి ర్విశ్వరూప్యావిన్నో ఽయ మసా వాముష్యాయణో ఽస్యాం విశ్యస్మి న్రాష్ట్రే మహతే క్షత్రాయ మహత ఆధిపత్యాయ మహతే జానరాజ్యాయై[8]ష వో భరతా రాజా సోమో ఽస్మాకం బ్రాహ్మణానాగ్ం రాజే[9]న్ద్రస్య (౨)వజ్రో ఽసి వార్త్రఘ్న స్త్వయా ఽయం వృత్రం వధ్యా [10]చ్ఛత్రుబాధనా స్థ[11]పాత మా ప్రత్యఞ్చం పాత మా తిర్యఞ్చ మన్వఞ్చం మా పాత దిగ్భ్యో మా పాత విశ్వాభ్యో మా నాష్ట్రాభ్యః పాత [12]హిరణ్యవర్ణా వుషసాం విరోకే ఽయస్స్థూణా వుదితా సూర్యస్యా ఽఽరోహతం వరుణ మిత్ర గర్తం తత శ్చక్షాథా మదితిం దితిం చ ॥౩॥ (శిశు రిన్ద్రస్యైకచత్వారిగ్ంశ చ్చ ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే అష్టమప్రపాఠకే ద్వాదశోఽనువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: ఏకాదశానువాకమునందు అభిషేకజల మంత్రములు అభిహితము లైనవి. ఈ ద్వాదశానువాకమునందు తజ్జల సంస్కార మంత్రములు చెప్పఁబడుచున్నవి.

1. అర్థము: హే ఆపః దేవీః=ఓ యుదకదేవతలారా! (నానా పాత్రేషు గృహీతాః=నానా పాత్రములందు గ్రహింపఁబడిన,) మధుమతీః=మధురములైన, (యూయమ్=మీరు) క్షత్రియాయ=రాజుకొఱకు, మహి=గొప్పదైన, వర్చః=తేజస్సును, వన్వానాః=కలుగఁజేయుచున్నవారై, మధుమతీభిః=మధురములైన ఉదకములతో, సంపృచ్యధ్వమ్=పరస్పరము కలిసికొనుఁడు.

తాత్పర్యము: ఓ ఉదకదేవతలారా! నానాపాత్రములందు గ్రహింపఁబడిన మధురములైన మీరు రాజునకు గొప్ప వర్చస్సును కలుగఁజేయుచు మధురోదకములతో పరస్పరము కలిసికొనుఁడు.

2. అర్థము: (హే ఆపః=ఓ ఉదకములారా! యూయమ్=మీరు,) అనాధృష్టాః=ఎవ్వరిచేతను తిరస్కరింపఁబడనివారై, క్షత్రియాయ=రాజుకొఱకు, మహి వర్చః=గొప్ప తేజస్సును, దధతీః=కలుగఁజేయుచున్నవారగుచు, ఊర్జస్వతీః=సారము కలవారై, సీదత=ఉండుఁడు.

తాత్పర్యము: ఓ యుదకములారా! మీరు తిరస్కృతులు కాకుండఁగ బలము కలవారై రాజునకు గొప్ప బలమును చేకూర్చుచు ఉండుఁడు. (హోతృ స్థానమునకు బ్రాహ్మణాచ్ఛంసి స్థానమునకు మధ్యమున ఉదకముల నుంచవలెను.)

3. అర్థము: (హే హిరణ్య!=ఓ హిరణ్యమా!, త్వమ్=నీవు,) అనిభృష్టమ్=భృష్టము కానిదానవు, అసి=అగుచున్నావు. వాచః=వాక్కునకు, బన్ధుః=బంధువును, తపోజాః=సంతాపవంతుఁడైన యగ్నినుండి పుట్టినదానవు, సోమస్య=సోమముయొక్క, (క్రయార్థమ్=క్రయముకొఱకు) దాత్రమ్=ఈయఁబడినదానవును, అసి=అగుచున్నావు. (భృష్టము=దగ్ధము. =వేఁగినది.)

తాత్పర్యము: ఓ హిరణ్యమా! నీవు (అగ్నియందుంచఁబడినను) భృష్టయవల (=పేలాల) వలె భృష్టమగుదానవు కావు. హిరణ్యవస్తు లగుటచే రాజామాత్యాదులవాక్కు ఆదరింపఁబడుచున్నది. కావున వాక్కునకు బంధువవు. (హిరణ్యము అగ్ని రేతస్సు అగుటచే,) వేఁడిమి కలిగియుండు నగ్నినుండి పుట్టినదానవు. (సోమయాగమునందు హిరణ్యము నిచ్చి సోమలతను క్రయము చేయుదురు కావున,) సోమక్రయమున కై ఈయఁబడినదానవు నగుచున్నావు. (పైని చెప్పఁబడిన ఉదకములందు శతమాన పరిమాణమయిన హిరణ్యము నుంచవలెను.)

4. అర్థము: హే ఆపః=ఓ యుదకములారా!, చంద్రేణ=చంద్రునిచే, చంద్రాః=ఆహ్లాదకరములును, అమృతేన=అమృతముచే, అమృతాః=(స్వాదువులు) అమృతములును, స్వాహా=స్వాహాకార సంపాదిత హోమయుక్తమైన, రాజసూయాయ=రాజసూయముకొఱకు, చితానాః=సంపాదితములును, శుక్రాః=కాంతిమంతములునైన, వః=మిమ్ము, శుక్రేణ=దీప్తిమంతమైన బంగారముచే, ఉత్పునామి=ఉత్పవనము చేయుచున్నాను. (ఉత్పవనము=నీటిలో నుంచిన బంగారమును ముందుకు వెనుకకు కదలించుట. పవిత్రము చేయుచున్నానని భావము.)

తాత్పర్యము: ఓ యుదకములారా! మీరు దీప్తి కలవారు. చంద్రునిచే ఆహ్లాదకరులు. అమృతముచే అమృతములు. స్వాహాకార సంపాదిత హోమముతో కూడిన రాజసూయ యాగముకొఱకు సంపాదింపఁబడినవారు. అట్టి మిమ్ము బంగారముచే ఉత్పవనము (=పవిత్రము) చేయుచున్నాను. ఈ మంత్రము చెప్పుచు ఉదకములను బంగారముతో ఉత్పవనము చేయవలెను. ఇట బంగారమునకు దర్భనుగాని, దారమునుగాని కట్టి ఆ దర్భతోఁగాని దారముతోఁగాని బంగారమును ముందువెనుకలకు కదలించవలెను.)

5. అర్థము: అపాంశిశుః=ఉదకములకు శిశువువంటివాఁడగు, వరుణః=వరుణదేవుఁడు, మాతృతమాసు=అతి స్నేహ యుక్తులయిన తల్లులవంటి, పస్త్యాసు అన్తః=ఉదకములయం దంతర్భాగమున, సధమాదః=తమయందున్న వరుణునితో కూడ నొకచోట ఉండి ఆ వరుణుని సంతోష పెట్టుచున్నవియు, ద్యుమ్నినీః=దీప్తి కలవియు, (లేక, ధనము కలవియు,) ఊర్జః=బలహేతువులైనవియు, అనిభృష్టాః=(యవాదులవలె) భర్జనయోగ్యములు కానివియు, అపస్యువః=కర్మల నిచ్ఛయించుచున్నవియునగు, ఏతా అపః=ఈయుదకములను, వసానః=వస్త్రమువలె ఆచ్ఛాదనము చేయుచున్నవాఁడై, సధస్థమ్=నివాసమును, చక్రే=చేసెను.

తాత్పర్యము: మాతృస్థానీయములైన ఉదకములకు పుత్రస్థానీయుఁడైన వరుణుఁడు అతిస్నేహయుక్తలయిన తల్లులవంటి యుదకముల లోపల వస్త్రమువలె ఈ యుదకముల నాచ్ఛాదనము చేయుచు నివాసము నేర్పఱచుకొని యుండెను. ఈ యుదకములు తమయందున్న వరుణునితో కూడ నొకచోట నుండి యతనిని సంతోషపఱచునవి. దీప్తికలవి. లేదా, ధనము కలవి. బలహేతువులు. యవాదులవలె వేయించుటకు సాధ్యము కానివి. కర్మల నిచ్ఛయించుచున్నవి. (ఈ మంత్రము చెప్పుచు నాలుగు ఉదకపాత్రములందు మోదుగు అత్తి, రావి, మఱ్ఱి కొమ్మల నుంచవలెను.)

6. అర్థము: ఈ మంత్రము వాజపేయ ప్రకరణమున వ్యాఖ్యాతము.

7. అర్థము: అగ్నిః=అగ్ని, (ఇదానీమ్=ఇప్పుడు,) గృహపతిః అవిన్నః=ఈ కర్మచే గృహపతి అయెను. ఇన్ద్రః=ఇంద్రుఁడు, వృద్ధశ్రవాః అవిన్నః=ఈ కర్మచే ప్రవృద్ధమైన కీర్తిని పొందినవాఁడు. పూషా=పూషదేవుఁడు, విశ్వవేదాః అవిన్నః=విజ్ఞానమును పొందినవాఁడు. మిత్రా వరుణౌ=మిత్రా వరుణ దేవతలు, ఋతావృధౌ అవిన్నౌ=ఈ కర్మచేతనే సత్యవచన వృద్ధిని పొందినవారు. ద్యావా పృథివీ=ద్యావా భూములు, ధృతవ్రతే అవిన్నే=ఈ కర్మచేతనే వ్రతధారణమును పొందినవి. అదితిః దేవీ=దేవమాతయగు అదితి దేవి, విశ్వరూపీ అవిన్నా=సర్వదేవ శరీర యుక్తత్వమును పొందినది. (దేవరూప బహుపుత్రుల నుత్పాదనము చేసినదని భావము.) అయమ్=ఈ ఎదుటనున్న, అసౌ=నరసింహవర్మ, అముష్యాయణః=ఈ రాజేంద్రునియొక్క పుత్రుఁడుకాని, పౌత్రుఁడుకాని, (అటువంటి యజమానుఁడు.) అస్యాం విశి=ఈ ప్రజయందు, అస్మిన్ రాష్ట్రే=ఈ రాష్ట్రమునందు, మహతే క్షత్రాయ=గొప్ప క్షత్రియ కులముకొఱకు, మహతే ఆధిపత్యాయ=గొప్ప యధికారము కొఱకు, మహతే జానరాజ్యాయ=గొప్ప సార్వభౌమత్వాధికారముగల జానరాజ్యము కొఱకు, (పర్యాప్తస్సన్=పర్యాప్తుఁడగుచు,) అవిన్నః=ఆ పూర్వోక్తగుణములను పొందినవాఁడు.

తాత్పర్యము: అగ్న్యాదులు ఈ కర్మచేత గృహపతిత్వాదులను పొందిరి. (యజమానునిచే ఈ మంత్రములను పఠింపఁజేయుచు అతనిని ఆగ్నీధ్ర స్థానమునుండి వెలుపలకు కొనిపోవలెను.)

8. అర్థము: ఈ మంత్రము దశమానువాకమున వ్యాఖ్యాతము.

9. అర్థము: (హే ధనుః!=ఓ ధనువూ, త్వమ్=నీవు,) ఇన్ద్రస్య=ఇంద్రునకు, వజ్రః=వజ్రాయుధమువలె,) వార్త్రఘ్నః=ప్రహారసాధనము, అసి=అగుచున్నావు. (తత్=ఆ కారణమువలన,) త్వయా=నీచేత, అయమ్=ఈ యజమానుఁడు, వృత్రమ్=శత్రువును, వధ్యాత్=వధించుఁగాక.

తాత్పర్యము: ఓ ధనువూ! నీవు ఇంద్రునకు వజ్రాయుధమువలె ప్రహారసాధన మగుచున్నావు. కావున ఈ యజమానుఁడు నీచేత శత్రువును వధించుఁగాక. (ఈ మంత్రము పఠించుచు యజమానునకు ధనువు నొసఁగవలెను.)

10. అర్థము: (హే ఇషవః!=ఓ బాణములారా!, యూయమ్=మీరు) శత్రు బాధనాః=శత్రు బాధకములు, స్థ=అగుచున్నారు.

తాత్పర్యము: ఓ బాణములారా! మీరు శత్రు బాధకము లగుచున్నారు. (ఈ మంత్రము పఠించుచు యజమానునకు మూఁడు బాణముల నీయవలెను.)

11. అర్థము: (హే మదీయబాణాః=నా సంబంధు లయిన ఓ బాణములారా!, యూయమ్=మీరు,) ప్రత్యఞ్చమ్=(ఎదుటి, బాణమునకు) ప్రత్యక్కుగా పోవునట్టి, మా=నన్ను, పాత=రక్షింపుఁడు. తిర్యఞ్చమ్=అడ్డముగా పోవునట్టి, మా=నన్ను, పాత=రక్షింపుఁడు అన్వఞ్చమ్=వెనుకకు పోవుచున్న, మా=నన్ను, పాత=రక్షింపుఁడు. దిగ్భ్యః=దిక్కులనుండి, మా=నన్ను, పాత=రక్షించుఁడు. విశ్వాభ్యః=సమస్తములైన, నాష్ట్రాభ్యః=నాశ హేతువులైన శత్రుకృత పీడలనుండి, మా=నన్ను, పాత=రక్షింపుఁడు.

తాత్పర్యము: ఓ బాణములారా! శత్రు బాణము ఎదుటికి వచ్చునపుడు ప్రత్యఙ్ముఖుఁడనై పోవునట్టియు, పార్శ్వములనుండి వచ్చునట్టిశత్రు బాణమునకు అడ్డముగాఁ బోవునట్టియు, వెనుకనుండి వచ్చుచున్న శత్రుబాణమునకు వెనుకగాఁ బోవునట్టియు నన్ను రక్షింపుఁడు, ఇంతియకాక సర్వ దిక్కులనుండియు, నాశ హేతువులైన శత్రుకృత సర్వబాధలనుండియు నన్ను రక్షింపుఁడు. (ఈ మంత్రముచే బాణముల ననుమంత్రించవలెను.)

12. అర్థము: హే వరుణ!=శత్రు నివారకమైన ఓ వామహస్తమా!, హే మిత్ర!=శత్రు మారకమైన ఓ దక్షిణహస్తమా!, హిరణ్యవర్ణౌ=బంగారువర్ణము కలిగినట్టియు, అయస్థూణౌ=ఇనుప కడ్డీలవలె అత్యంత దృఢములైనట్టియు, యువామ్=మీరు, ఉషసాం విరోకే సతి=ఉషస్సుల ప్రసారము కలుగుచుండఁగా (=ఉషఃకాలమున,) సూర్యస్య ఉదితౌ సతి=సూర్యోదయ మగుచుండఁగా, గర్తమ్=గర్త సదృశమైన రథోపరిభాగమును, ఆరోహతమ్=అధిష్ఠించుఁడు. (=పరకీయ బాణములనుండి రక్షించుఁడు.) తతః=ఆరోహణానంతరము, అదితిమ్=అఖండితమైన స్వసేనను, చ=మఱియు, దితిమ్=ఖండితమైన పరకీయసేనను, చక్షాథామ్=యథాక్రమముగ అనుగ్రహ నిగ్రహదృష్టులచే సమీక్షించుఁడు.

తాత్పర్యము: శత్రునివారకమైన ఓ వామహస్తమా! శత్రుమారకమైన దక్షిణహస్తమా! సువర్ణఖచిత కవచమును ధరించుటచే బంగారమువలె భాసించుచున్నట్టియు, అయస్తంభములవలె దృఢములైన వారును నగు మీరు ఉషోదయ కాలమునందును, సూర్యోదయ కాలమునందును గర్తసదృశమైన రథోపరిభాగమును అధిష్ఠించుఁడు. అనంతరము అఖండితమైన స్వసేనను అనుగ్రహ దృష్టితోడను, ఖండితమైన శత్రుసేనను నిగ్రహదృష్టితోడను సమీక్షించుఁడు. (బాణములను విడుచుటకై పైకెత్తిన బాణయుక్తము లయిన యజమానహస్తములను ఈ మంత్రముచే అభిమంత్రించవలెను. గర్తము=గుంట.)

ద్వాదశానువాకము సమాప్తము

అథ ప్రథమకాణ్డే ఒష్టమప్రపాఠకే త్రయోదశో౽నువాకః।

మూలము: [1]సమిధ మాతిష్ఠ గాయత్రీ త్వా ఛన్దసా మవతు త్రివృత్స్తోమో రథన్తరగ్ం సామాగ్ని ర్దేవతా బ్రహ్మ ద్రవిణ [2]ముగ్రా మాతిష్ఠ త్రిష్టుప్ త్వా ఛన్దసా మవతు పఞ్చదశస్తోమో బృహత్సా మేన్ద్రో దేవతా క్షత్త్రం ద్రవిణం [3]విరాజ మాతిష్ఠ జగతీ త్వా ఛన్దసా మవతు సప్తదశ స్తోమో వైరూపగ్ం సామ మరుతో దేవతా విడ్ద్రవిణ [4]ముదీచీ మాతిష్ఠానుష్టుప్ త్వా (౧)ఛన్దసా మవ త్వేకవిగ్ంశ స్తోమో వైరాజగ్ం సామ మిత్రావరుణౌ దేవతా బలం ద్రవిణ [5]మూర్ధ్వా మాతిష్ఠ పఙ్క్తిస్త్వా ఛన్దసా మవతు త్రిణవత్రయస్త్రిగ్ంశౌ స్తోమౌ శాక్వరరైవతే సామనీ బృహస్పతి ర్దేవతావర్చో ద్రవిణ [6]మీదృ ఙ్చాన్యాదృ ఙ్చైతాదృఙ్చ ప్రతిదృఙ్చ మితశ్చ సంమితశ్చ సభరాః। శుక్రజ్యోతిశ్చ చిత్రజ్యోతిశ్చ సత్యజ్యోతిశ్చ జ్యోతిష్మాగ్ంశ్చ సత్యశ్చర్తపాశ్చ (౨)అత్యగ్ంహాః। [7]అగ్నయే స్వాహా సోమాయ స్వాహా సవిత్రే స్వాహా సరస్వత్యై స్వాహా పూష్ణే స్వాహా బృహస్పతయే స్వాహేన్ద్రాయ స్వాహా ఘోషాయ స్వాహా శ్లోకాయ స్వాహా ౽గ్ంశాయ స్వాహా భగాయ స్వాహా క్షేత్రస్య పతయే స్వాహా పృథివ్యై స్వాహా ౽న్తరిక్షాయ స్వాహా దివే స్వాహా సూర్యాయ స్వాహా చన్ద్రమసే స్వాహా నక్షత్రేభ్య స్స్వాహా ౽ద్భ్య స్స్వాహౌషధీభ్య స్స్వాహా వనస్పతిభ్య స్స్వాహా చరాచరేభ్య స్స్వాహా పరిప్లవేభ్య స్స్వాహా సరీసృపేభ్య స్స్వాహా ॥౩॥ (అనుష్టు ప్త్వ ర్తపాశ్చ సరీసృపేభ్యః స్వాహా।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ఒష్టమప్రపాఠకే త్రయోదశో౽నువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: ద్వాదశానువాకమునందు అభిషేకార్థ జలసంస్కారాది మంత్రము లభిహితము లైనవి. త్రయోదశానువాకమునందు దిగ్వ్యాస్థాపనమంత్రములు చెప్పఁబడినవి.

1. అర్థము: (హే యజమాన!–ఓ యజమానుఁడా!, త్వమ్=నీవు,) సమిధమ్–తూర్పుదిక్కును, ఆతిష్ఠ=ఆక్రమించి యుండుము. ఛన్దసామ్=ఛన్దస్సులలో, గాయత్రీ=గాయత్రీ ఛ్ఛన్దస్సు, త్వా=నిన్ను, అవతు=రక్షించుఁగాక. (స్తోమానామ్=స్తోమములలో,) త్రివృత్ స్తోమః=త్రివృత్స్తోమము, (=మువ్మాఱావృత్తి చేయఁబడిన స్తుతి మంత్ర సమూహము.) త్వా=నిన్ను, అవతు=రక్షించుఁగాక. (సామ్నామ్=సామములలో,) రథన్తరం సామ=రథంతరమనెడి సామము, (="అభి త్వా శూర నోనుమ" అను ఋక్కునందు పుట్టినది.) అవతు=రక్షించుఁగాక. (దేవానామ్=దేవతలలో,) అగ్నిః దేవతా=అగ్నిదేవత, త్వా=నిన్ను, అవతు=రక్షించుఁగాక. బ్రహ్మ=బ్రాహ్మణుఁడు, ద్రవిణమ్=(నీ)ధనమును, అవతు=రక్షించుఁగాక. (త్రివృత్స్తోమమునకు 'ఉద్యతి' యని పేరు.)

తాత్పర్యము: రాజసూయ యజ్ఞకర్తయగు ఓ యజమానుఁడా! నీవు తూర్పుదిక్కున నుండుము. ఆ విధముగనున్న నిన్ను గాయత్రీచ్ఛన్దసాదులు రక్షించుఁగాక. నీ ధనమును బ్రాహ్మణుఁడు రక్షించుఁగాక. (పిమ్మట ఈ యజమానుని వివిధ దిగభిముఖునిగ విజయమునకై ప్రస్థాపనచేయించవలెను.)

2. అర్థము: (హే యజమాన!–ఓ యజమానుఁడా!, త్వమ్=నీవు,) ఉగ్రామ్=దక్షిణదిక్కును, ఆతిష్ఠ=ఆక్రమించి యుండుము. త్వా=నిన్ను, ఛన్దసామ్=ఛన్దస్సులలో, త్రిష్టుప్=త్రిష్టుప్ ఛన్దస్సు, అవతు=రక్షించుఁగాక. పఞ్చదశః స్తోమః=పఞ్చదశ మనెడి స్తోమము, అవతు=రక్షించుఁగాక. బృహత్ సామ=బృహత్సామము, అవతు=రక్షించుఁగాక. ఇన్ద్రః దేవతా=ఇంద్రదేవత, అవతు=రక్షించుఁగాక. ద్రవిణమ్=(నీ) ధనమును, క్షత్త్రమ్=క్షత్రియుఁడు, అవతు=రక్షించుఁగాక.

తాత్పర్యము: ఓ యజమానుఁడా! నీవు దక్షిణదిక్కున నుండుము. అట్టి నిన్ను త్రిష్టుప్ ఛన్దసాదులు రక్షించుఁగాక. (నీ) ధనమును క్షత్రియుఁడు రక్షించుఁగాక. (పాపులను శిక్షించు యముఁ డుండుటచే దక్షిణ దిక్కునకు ఉగ్ర దిక్కు అని వ్యవహారము ఏర్పడినది. అయిదుమారు లావృత్తి చేయఁబడిన స్తుతిమంత్ర సమూహము పంచదశ స్తోమ మనఁబడును. "త్వా మిద్ధి హవామహే" అను ఋక్కునం దుత్పన్నమైన సామము బృహత్సామ మనఁబడును. (ఈ మంత్రమును పఠించుచు విజయమునకై యజమానుని దక్షిణదిక్కున కభిముఖునిగ నుంచవలెను.)

3. అర్థము: (హే యజమాన!–ఓ యజమానుఁడా!, త్వమ్=నీవు,) విరాజమ్=పశ్చిమ దిక్కును, ఆతిష్ఠ=ఆక్రమించి యుండుము. త్వా=నిన్ను, ఛన్దసామ్=ఛన్దస్సులలో, జగతీ=జగతీ ఛ్ఛన్దస్సు, అవతు=రక్షించుఁగాక. సప్తదశః స్తోమః=సప్తదశ స్తోమము, అవతు=రక్షించుఁగాక. వైరూపం సామ=వైరూప మనెడి సామము, అవతు=రక్షించుఁగాక. మరుతః దేవతా=మరుద్దేవత, అవతు=రక్షించుఁగాక. ద్రవిణమ్=(నీ)ధనమును, విట్=వైశ్యుఁడు, అవతు=రక్షించుఁగాక.

తాత్పర్యము: ఓ యజమానుఁడా! నీవు పశ్చిమ దిక్కున నుండుము. నిన్ను జగతీ ఛ్ఛన్దసాదులు రక్షించుఁగాక. నీ ధనమును వైశ్యుఁడు రక్షించుఁగాక. (ఏడు మారులు ఆవృత్తి చేయఁబడిన స్తుతిమంత్ర సమూహము సప్తదశ స్తోమ మనఁబడును. "యద్యావ ఇన్ద్ర" అను ఋక్కునం దుత్పన్నమైన సామము వైరూప సామ మనఁబడును. (విజయమునకై యజ్ఞకర్తను పశ్చిమ దిగభిముఖునిగా నుంచి యీ మంత్రము పఠించవలెను.)

4\. అర్థము: (హే యజమాన!=ఓ యజమానుఁడా!, త్వమ్=నీవు, ఉదీచీమ్=ఉత్తర దిక్కును, అ తిష్ఠ=ఆక్రమించి యుండుము. త్వా=నిన్ను, ఛన్దసామ్=ఛన్దస్సులలో, త్రిష్టుప్=త్రిష్టుప్ఛన్దస్సు, అవతు=రక్షించుఁగాక. ఏకవింశః స్తోమః=ఏకవింశ స్తోమము (=ఇరువదియొక్క మారు లావృత్తి చేయఁబడిన స్తుతిమంత్ర సమూహము,) అవతు=రక్షించుఁగాక. వైరాజం సామ=వైరాజమనెడి సామము (="పిబా సోమమిన్ద్ర మన్దతు త్వా" అను ఋక్కునం దుత్పన్నమైనది.) అవతు=రక్షించుఁగాక. మిత్రావరుణౌ దేవతా (=దేవతే)=మిత్రా వరుణదేవతలు, అవతామ్=రక్షింతురుగాక. బలమ్=బలము, ద్రవిణమ్=(నీ) ధనమును, అవతు=రక్షించుఁగాక.

తాత్పర్యము: ఓ యజమానుఁడా! నీవు ఉత్తరదిక్కు నాక్రమించి యుండుము. అట్టి నిన్ను త్రిష్టుప్ ఛన్దసాదులు రక్షించుఁగాక. బలము నీ ధనమును రక్షించుఁగాక. (యజమానుని ఉత్తరదిగభిముఖునిగా నుంచి యీ మంత్రము పఠించవలెను.)

5\. అర్థము: (హే యజమాన!=ఓ యజమానుఁడా! త్వమ్=నీవు,) ఊర్ధ్వమ్=ఊర్ధ్వదిక్కును, ఆతిష్ఠ=ఆక్రమించి యుండుము. త్వా=నిన్ను, ఛన్దసామ్=ఛన్దస్సులలో, పఙ్క్తిః=పఙ్క్తిచ్ఛన్దస్సు, అవతు=రక్షించుఁగాక. త్రిణవః త్రయస్త్రింశౌ=త్రిణవనామక త్రయస్త్రింశ స్తోమము, (ఏకత్వే ద్వివచనమ్.) అవతు=రక్షించుఁగాక. శాక్వర రైవతే సామనీ=శాక్వరము, రైవతము అనెడి సామములు, అవతామ్=రక్షించుఁగాక. బృహస్పతిః దేవతా=బృహస్పతి దేవత, అవతు=రక్షించుఁగాక. వర్చః=వర్చస్సు, ద్రవిణమ్=(నీ) ధనమును, అవతు=రక్షించుఁగాక.

తాత్పర్యము: ఓ యజమానుఁడా! నీవు ఊర్ధ్వదిక్కున కభిముఖుఁడవై యుండుము. అట్టి నిన్ను పఙ్క్తిచ్ఛన్దసాదులు రక్షించుఁగాక. వర్చస్సు నీ ధనమును రక్షించుఁగాక. (ఇరువదియేడు మారు లావృత్తము చేయఁబడిన స్తుతిమంత్ర సమూహము త్రిణవ స్తోమ మనఁబడును. ఇది వజ్రసమానమని శ్రుతి చెప్పుచున్నది. విజయమునకై యజమానుని ఊర్ధ్వ దిగభిముఖునిగా నుంచి యీ మంత్రము పఠించవలెను.)

6\. అర్థము: (1)ఈదృఙ్ (2)అన్యాదృఙ్ (3)ఏతాదృఙ్ (4)ప్రతిదృఙ్ (5)మితః (6)సంమితః (7)సంభరాః (8)శుక్రజ్యోతిః (9)చిత్రజ్యోతిః (10)సత్యజ్యోతిః (11)జ్యోతిష్మాన్ (12)సత్యః (13)ఋతపాః (14)అత్యంహాః, (ఈదృఙ్ ఇత్యాది పదములు పదునాలుగును మరుద్దేవతా విశేష నామధేయములు. కపాలములను తద్రూపముగ భావన చేయుటవలన కపాలములకుఁగూడ ఆ నామధేయము లేర్పడినవి.) హే ప్రథమ కపాల!=ఓ ప్రథమ కపాలమా!, త్వమ్=నీవు,) ఈదృఙ్చ='ఈదృఙ్' అను పేరు కలదానవే, (అసి=అగుచున్నావు,) (హే ద్వితీయ కపాల!=ఓ రెండవ కపాలమా!, (త్వమ్=నీవు,) అన్యాదృఙ్చ='అన్యాదృఙ్' అను పేరు కలదానవే, (అసి=అగుచున్నావు. మిగిలిన 'ఏతాదృఙ్' ఇత్యాది ద్వాదశ పదములకుఁ గూడ ఈ విధముగనే సమన్వయము చేయవలెను. తాత్పర్యము సుగమము.)

7\. అర్థము: అగ్నయే=అగ్నికొఱకు, స్వాహా=ఈ హవిస్సు హుతమగుఁగాక. సోమాయ=సోమదేవతకొఱకు, స్వాహా=ఈ హవిస్సు హుతమగుఁగాక. ఈ విధముగనే మిగిలిన పదములకుఁ గూడ సమన్వయము చేయవలెను. 'అగ్నయే' ఇత్యాది యిరువదినాలుగు చతుర్థ్యంతపదములు ఆ యా దేవతావిశేషములను తెలుపునవి. "ఘోషాయ శ్లోకాయ, అంశాయ, భగాయ"- ఈ పదములు వరుసగ ఘోష శ్లోక అంశ భగ అను దేవతలను తెలుపునవి. క్షేత్రస్య పతయే=క్షేత్ర స్వామికొఱకు, చంద్రమసే=చంద్రునికొఱకు, (చన్ద్రేణ=కర్పూరేణ, మీయతే=ఉపమీయతే ఇతి=చంద్రమాః=కర్పూరముతో పోల్చఁబడువాఁడు.) పరిప్లవేభ్యః=చంచలములైన జంతువుల కొఱకు, సరిసృపేభ్యః=తేళ్లు మున్నగు వానికొఱకు. మిగిలిన పదముల కర్థము ప్రసిద్ధము.

విశేషములు: ఈ మంత్రమునందు ఇరువదినాలుగు హోమములున్నవి. అందుమొదటి పండ్రెండును 'పార్థ' సంజ్ఞకములు. ఈ పార్థ సంజ్ఞకములలో 'అగ్నయే స్వాహా' త్యాది పార్థ హోమములు ఆఱును అభిషేకమునకు పూర్వము, 'ఇన్ద్రాయ స్వాహా' త్యాది పార్థ హోమములు ఆఱును అభిషేచనానంతరము చేయవలెను. మిగి

లిన మంత్రెండును అవేష్టు లనఁబడును. ఈ యవేష్టి హోమములలోఁగూడ "పృథివ్యై స్వాహా" త్యాది షట్కము అభిషేకమునకు పూర్వము 'అద్భ్యస్స్వాహా' త్యాది షట్కము అభిషేకానంతరము చేయ వలయును. ఇవి భూతములకు సంబంధించినవి. యక్ష రాక్షస పిశాచాది భూతములు మృత్యుహేతువులు. 'పృథివ్యై స్వాహేత్యాది' ద్వాదశ మంత్రసాధ్యము అయిన ఆహుతులు భూతములకు అవేష్టులు. వీనిని హోమము చేసినచో యజమానునకు భూతములవలన కలుగు మృత్యువు తొలఁగును. (అవయజతే=నాశయతి మృత్యు మితి='అవేష్టిః' అని వ్యుత్పత్త్యర్థము. మృత్యు నాశకమని యర్థము.)

త్రయోదశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ఽష్టమప్రపాఠకే చతుర్దశోఽనువాకః।

మూలము: [1]సోమస్య త్విషి రసి తవేవ మే త్విషి ర్భూయా [2]దమృత మసి మృత్యో ర్మా పాహి [3]దిద్యోన్మా పాహ్యవేష్టా దన్దశూకా [5]నిర స్తం నముచే శ్శిరః। [6]సోమో రాజా వరుణో దేవా ధర్మసువశ్చ యే। తే తే వాచగ్ం సువన్తాం తే తే ప్రాణగ్ం సువన్తాం తే తే చక్షు స్సువన్తాం తే తే శ్రోత్రగ్ం సువన్తాం [7]సోమస్య త్వా ద్యుమ్నే నాభిషిఞ్చా మ్యగ్నేః (౧)తేజసా సూర్యస్య వర్చ సేన్ద్ర స్యేన్ద్రియేణ మిత్రావరుణయో ర్వీర్యేణ మరుతా మోజసా [8]క్షత్రాణాం క్షత్రపతి రస్యతి దివస్పాహి [10]సమావవృత్ర న్నధరా గుదీచీ రహింబుధ్నియ మను సంచ రన్తీ స్తాః పర్వతస్య వృషభస్య పృష్ఠే నావ శ్చరన్తి స్వసిచ ఇయానాః। [11]రుద్ర య త్తే క్రయీ పరం నామ తస్మై హుత మసి యమేష్ట మసి। [12]ప్రజాపతే న త్వ దేతా న్యన్యో విశ్వా జాతాని పరితా బభూవ। యత్కామా స్తే జుహుమ స్తన్నో అస్తు వయగ్ం స్యామ పతయో రయీణామ్ ॥౨॥ (అగ్నే స్త్రైకాదశ చ)।

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ఽష్టమప్రపాఠకే చతుర్దశోఽనువాకః।

వేదార్థదీపిక

అవతారిక: త్రయోదశానువాకమునందు దిగ్వ్యాస్థాపనము చెప్పఁబడినది. ఈ చతుర్దశానువాకమునందు అభిషేకము చెప్పఁబడినది.

1. అర్థము: (హే శార్దూలచర్మ!=ఓ శార్దూల చర్మమా!, త్వమ్=నీవు,) సోమస్య=సోమమునకు, త్విషిః=దీప్తివి, అసి=అగుచున్నావు. (అతః=ఇందువలన,) తవేవ=నీకువలె, మే=నాకు, త్విషిః=దీప్తి, భూయాత్=కలుగుఁగాక.

తాత్పర్యము: ఓ శార్దూల చర్మమా! నీవు సోమమునకు దీప్తి వగుచున్నావు. కావున నీకు వలె నాకును దీప్తి వగుము. 'ప్రశాస్త' యను ఋత్విజుని స్థానమున కెదుట ఆసన్దిని (=పేముతో చేసిన చెక్కడము=పెండ్లి పీటవంటిది.) ఉంచి దానిపైని శార్దూలచర్మమును పఱచవలెను.

2\. అర్థము: (హే హిరణ్య!=ఓ హిరణ్యమా! త్వమ్=నీవు,) అమృతమ్=అమృతస్వరూపము, (మరణము లేనిదానవు,) అసి=అగుచున్నావు. (తత్=అందువలన,) మృత్యోః=మృత్యువునుండి, మా=నన్ను, పాహి=రక్షింపుము.

తాత్పర్యము: ఓ హిరణ్యమా! నీవు అమృతస్వరూపము (మరణము లేనిదానవు,) అగుచున్నావు. కావున మృత్యువునుండి నన్ను రక్షింపుము. (ఈ మంత్రము పఠించుచు శార్దూల చర్మమునందు శతమాన ప్రమాణమైన హిరణ్యము నుంచవలెను.)

3\. అర్థము: హే దిద్యోత్=ద్యోతనాత్మకమైన ఓ సువర్ణపాత్రమా!, త్వమ్=నీవు, మా=నన్ను, పాహి=రక్షింపుము.

తాత్పర్యము: ప్రకాశాత్మకమైన ఓ సువర్ణపాత్రమా! నీవు నన్ను రక్షింపుము. (యజమానుని శిరస్సుపై నభిషేక జలసేచన నిమిత్తము శతచ్ఛిద్రములు గల సువర్ణపాత్రము నుంచవలెను. ఆ సువర్ణపాత్ర మిచట సంబోధింపఁబడినది.)

4\. అర్థము: దన్దశూకాః=సర్పములు, అవేష్టాః=నశింపఁజేయఁబడినవి. (ఈ మంత్రముచే దక్షిణపు భాగమున ఆసీనుఁడైన క్లీబుని సీసముచే గ్రుచ్చవలెను. సర్పముగా భావితమైన సీసమును పుంస్త్వరహితునిపైని వేయవలెను. లోకమునందు బహు వల్మీకోపేత మయిన అరణ్యమునందు పోవుచున్న వరుగిడలేని నపుంసకునిఁ జూచి సర్పములు కఱచుట కుద్యమించును.)

5\. అర్థము: నముచేః=నముచియను రాక్షసునియొక్క, శిరః=శిరస్సు, నిరస్తమ్=తొలఁగింపఁబడినది.

తాత్పర్యము: నముచి రాక్షసుని శిరము తొలఁగింపఁబడినది. (ఈ మంత్రము చెప్పుచు యజమానుఁడు ఎడమ పాదముచే రాగివస్తువును వేది బహిర్భాగమునకు త్రోయవలెను. ఇట్లు చేసినచో పాపస్వరూపుఁడైన నముచినే తొలఁగించి నట్లగును.)

6\. అర్థము: యః సోమః రాజా=ఏ సోమరాజు, యః వరుణః రాజా=ఏ వరుణరాజు, యే దేవాః=ఏ అగ్న్యాది దేవతలు, ధర్మసువః=ధర్మమును తెలిసికొనినవారై, (సన్తి=ఉంటున్నారో,) తే=వారందఱు, తే=నీయొక్క, వాచమ్=వాక్కును, సువన్తామ్=తెలిసికొందురు గాక. తే=వారందఱు, తే=నీయొక్క, ప్రాణమ్=ప్రాణమును, సువన్తామ్=తెలిసికొందురుగాక. తే=వారందఱు, తే=నీయొక్క, చక్షుః=చక్షువును, సువన్తామ్=తెలిసికొందురు గాక. తే=వారందఱు, తే=నీయొక్క, శ్రోత్రమ్=శ్రోత్రమును, సువన్తామ్=తెలిసికొందురు గాక.

తాత్పర్యము: ఓ యజ్ఞకర్తా! సోమరాజు వరుణరాజు అగ్న్యాది దేవతలు ఎవ రెవరు ధర్మమును తెలిసినవారై యున్నారో, వారందఱు నీయొక్క వాగాది ఇంద్రియములను తెలిసికొందురు గాక. (ఊర్ధ్వబాహువై కూర్చునియున్న యజ్ఞకర్తను అధ్వర్యుఁడు, బ్రహ్మ, రాజన్యుఁడు, వైశ్యుఁడు, మిత్రుఁడు వరుసగా ప్రాక్ దక్షిణ పశ్చిమోత్తర దిక్కులందుండి, పలా శౌదుమ్బ రాశ్వత్థ నై యగ్రోధ దండములతో అభిమంత్రించవలెను.)

7\. అర్థము: (హే యజమాన!=ఓ యజమానుఁడా!) త్వా=నిన్ను, సోమస్య=సోమదేవతయొక్క, ద్యుమ్నేన=దీప్తిచేత, అభిషిఞ్చామి=అభిషేకము చేయుచున్నాను. అగ్నేః=అగ్నియొక్క, తేజసా=తేజస్సుచేత, సూర్యస్య=సూర్యునియొక్క, వర్చసా=తేజస్సుచేత, ఇన్ద్రస్య=ఇంద్రునియొక్క, ఇన్ద్రియేణ=వీర్యముచేత, మిత్రావరుణయోః=మిత్రా వరుణ దేవతలయొక్క, వీర్యేణ=బలముచేత, మరుతామ్=మరుద్దేవతలయొక్క, ఓజసా=తేజస్సుచేత, అభిషిఞ్చామి=అభిషేకము చేయుచున్నాను.

తాత్పర్యము: ఓ యజమానుఁడా! సోమాది దేవతలయొక్క తేజస్సులచే నిన్ను అభిషేకము చేయుచున్నాను. (ఈ మంత్రముచే రాజసూయ యాగకర్తను అభిషేక జలములచే అభిషేకము చేయవలెను. ఇచట అభిషేక జలములందు అగ్న్యాది దేవతల తేజస్త్వ మారోపింపఁబడినది.)

8\. అర్థము: (హే యజమాన!=ఓ యజమానుఁడా! త్వమ్=నీవు,) క్షత్త్రాణామ్=క్షత్త్రియులకు, క్షత్త్రపతిః=నాయకుఁడవు, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: ఓ యజమానుఁడా! నీవు సర్వక్షత్త్రియులకు పతివగుచున్నావు. ('క్షత్త్రాణాం పతిః 'అని చెప్పుటకు బదులు 'క్షత్త్రాణాం క్షత్త్రపతి' రని క్షత్త్రశబ్దము ద్విరుక్తమగుటచే, కొందఱకే కాదు, నిఖిల క్షత్త్రియులకు పతివి యను అర్థము వ్యక్తమగుచున్నది. ఈ మంత్రముచే నభిషిక్తుఁడైన యజమాను నభిమంత్రించవలెను.)

9. అర్థము: (హే యజమాన!=ఓ యజమానుఁడా!, త్వమ్=నీవు,) దివః=ద్యోతమానులైన యితర రాజులను, అతి= అతిక్రమించి, పాహి=(సర్వభూమిని) రక్షింపుము.

తాత్పర్యము: ఓ యజమానుఁడా! ప్రకాశించుచున్న యితర రాజుల నతిక్రమించి సర్వభూమిని నీవే పాలింపుము. (ఈ మంత్రము చెప్పుచు అభిషేకకాలమందు లేపాదులచే పూయఁబడిన వస్త్రములను పరిత్యజించవలెను.)

10. అర్థము: (యా ఆపః=ఏ ఉదకములు, లేపరూపేణ=లేపరూపముగ, ప్రసవన్తి=ప్రసవించుచున్నవో,) అధరాక్=క్రిందఁ బడినవియు, ఉదీచీః=పైనఁబడినవియు, సమావృత్రన్=బాగుగ తిరిగియున్నవియునై, అహింబుధ్నియమ్=శిరస్సు మొదలు పాదాగ్రమువఱకు, అనుసంచరన్తి=అనుక్రమముగ సంచరించుచున్నవో, స్వసిచః= తనయజమాన క్షేత్రమును తడుపునవియు, ఇయానాః=వచ్చుచున్నవియునై, పర్వతస్య-పర్వతసదృశమైన, వృషభస్య=వర్షించునట్టి మేఘముయొక్క, పృష్ఠే=ఉపరిభాగమున, నావః=(నదియందు) నావలవలె, చరన్తి=సంచరించుచున్నవి.

తాత్పర్యము: యజమానుని శరీరమున లేప రూపమున నున్న ఉదకములు అభిషేక కాలమునందు అభిషేకజలముచే కడుగఁ బడినవై క్రిందికి పైకిని చింది పడుచు శిరస్సునుండి పాదాగ్రమువఱకు ప్రసవించుచున్నవి. ఆ లేప రూపము అయిన యుదకములు స్వ యజమాన క్షేత్రమును తడుపుచు వచ్చుచున్నవియై పర్వతసదృశమైన మేఘము యొక్క ఉపరిభాగమునందు నదియందు నావలవలె సంచరించుచున్నవి. (అభిషేకకాలమున యజమానుని శరీరమునుండి క్రిందికి జారి ప్రసవించుచున్న లేపద్రవ్యములను పాత్రములతో పైకెత్తవలెను.)

11. అర్థము: హే రుద్ర!=ఓ యీశ్వరా! తే=నీకు, పరమ్=ఉత్కృష్టమైన, యత్ నామ='శర్వ' ఇత్యాది నామము, ('నమ శ్శివాయ పశుపతయే' ఇత్యాది శ్రుతి ప్రసిద్ధమైనది.) క్రయి=(జపించుచున్న పురుషులను ఫల ప్రదానముచే,) వశము చేసికొనినదియై, (అస్తి=కలదో,) తస్మై=ఆ నామముకొఱకు, హుతమసి=(పాత్రస్థ మైన అభిషేక శేషజలము,) హుతమగుఁగాక. (తత్=అది,) యమస్య=యమునకు, ఇష్టమ్=ఇష్టము, అసి=అగుఁగాక. (అసి=లోడర్థే లట్.)

తాత్పర్యము: ఓ యీశ్వరా! నీకు శ్రేష్ఠమైన శర్వాది' నామధేయము నీ నామమును జపించుచున్నవారిని ఫలము నిచ్చుటచే వశము చేసికొనినదియై యేది ఉన్నదో, ఆ నామముకొఱకు పాత్రస్థమైన అభిషేక శేషజలము హుతమగుఁగాక. అది యమున కిష్టమగుఁగాక. (అభిషేక శేషజలమును హోమము చేయవలెను.)

12. అర్థము: హే ప్రజాపతే!=ఓ ప్రజాపతీ!, త్వత్=నీ కంటె, అన్యః=ఇతరుఁడు, (కోపి=ఏ పురుషుఁడు కూడ,) జాతాని= పుట్టిన, ఏతాని విశ్వా=ఈ భువనములను, పరితా=పరిభవించుటకు, న బభూవ=సమర్థుఁడు కాలేదు. (అతః= ఇందువలన.) తే=నీకు, వయమ్=మేము, యత్కామాః=ఏ ఫలమును కోరినవారలమై, జుహుమః=హోమము చేయుచున్నామో, తత్=ఆ ఫలము, నః=మాకు, అస్తు=కలుగుఁగాక. వయమ్=మేము, రయీణామ్= ధనములకు, పతయః=అధిపతులము, స్యామ్=అగుదుము గాక.

తాత్పర్యము: ఓ ప్రజాపతీ! నీకంటె ఇతరుఁడెవఁడు కూడ జాతములైన యీ విశ్వములను పరిభవింప సమర్థుఁడు కాలేదు. ఈ విశ్వములను సృజించుటకును సమర్థుఁడు కాలేదు. ఏ ఫలము నపేక్షించి మేము నీకు హోమము చేయు చున్నామో, ఆ ఫలము మాకు సిద్ధించుఁగాక. మేము ధనపతుల మగుదుము గాక. ప్రియపుత్రుని, స్వమ హిషిని, స్పృశించి ఈ మంత్రముచే హోమము చేయవలెను.

చతుర్థశానువాకము సమాప్తము

అథ ప్రథమకాణ్డే ఽష్టమ ప్రపాఠకే పఞ్చదశోఽనువాకః ।

మూలము: [1]ఇన్ద్రస్య వజ్రో ఽసి వార్త్రఘ్న స్త్వయా ఽయం వృత్రం వధ్యా [2]న్మిత్రావరుణయో స్త్వా
ప్రశాస్త్రోః ప్రశిషా యునజ్మి యజ్ఞస్య యోగేన [3]విష్ణోః క్రమో ఽసి విష్ణోః క్రాంత మసి
విష్ణో ర్విక్రాన్త మసి [4]మరుతాం ప్రసవే జేష [5]మాప్తం మన [6]స్స మహ మిన్ద్రియేణ
వీర్యేణ [7]పశూనాం మన్యు రసి తవేవ మే మన్యు ర్భూయా [8]న్నమో మాత్రే పృథివ్యై
మా ఽహం మాతరం పృథివీగ్ం హిగ్ంసిషం మా (౧)మాం మాతా పృథివీ హిగ్ంసీ [9]దియ
దస్యాయు రస్యాయు ర్మే ధేహ్యూర్గస్యూర్జం మే ధేహి యుఙ్ఙసి వర్చో ఽసి వర్చో మయి
ధేహ్య[10]గ్నయే గృహపతయే స్వాహా సోమాయ వనస్పతయే స్వాహేన్ద్రస్య బలాయ స్వాహా
మరుతా మోజసే స్వాహా [11]హగ్ంస శ్శుచిష ద్వసు రన్తరిక్షస ద్ధోతా వేదిష దతిథి ర్దురోణసత్।
నృష ద్వరస దృతస ద్వ్యోమస దబ్జా గోజా ఋతజా అద్రిజా ఋతం బృహత్ ॥ ౨॥
(హిగ్ంసిషం మర్తజా స్త్రీణి చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ఽష్టమప్రపాఠకే పఞ్చదశోఽనువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: చతుర్దశానువాకమునందు అభిషేకము చెప్పఁబడినది. ఈ పంచదశానువాకమునందు రథవిజయము చెప్పఁబడుచున్నది.

1. అర్థము: ఈ మంత్రము వాజపేయప్రకరణమున వ్యాఖ్యాతమైనది. (ఈ మంత్రము చెప్పుచు విజయమునకై రథమును తీసికొనిరావలెను.)

2. అర్థము: (హే దక్షిణాశ్వ!=ఓ దక్షిణాశ్వమా!) త్వా=నిన్ను, ప్రశాస్త్రోః=ఆజ్ఞాపించువారైన, మిత్రావరుణయోః=మిత్రావరుణ దేవతలయొక్క, ప్రశిషా=ఆజ్ఞచేత, యజ్ఞస్య యోగేన=యజ్ఞ సంబంధ నిమిత్తము, (రథే=రథమునందు,) యునజ్మి=నియోగించుచున్నాను. (=పూన్చుచున్నాను.)

తాత్పర్యము: ఓ దక్షిణాశ్వమా! అజ్ఞాపకులైన మిత్రావరుణుల యాజ్ఞచేత నిన్ను యజ్ఞనిమిత్తమై రథమునకు కట్టివేయు చున్నాను. (ఈ మంత్రముచే రథమునకు దక్షిణపు పైపున అశ్వమును సంధించవలెను.)

3. అర్థము: ఈ మంత్రము వాజపేయప్రకరణమున వ్యాఖ్యాతము. (ఈ మంత్రము చెప్పుచు యజమానుఁడు రథము నధిరోహించి ముందుకు పోవలెను.)

4. అర్థము: మరుతామ్=మరుత్సంజ్ఞక దేవతలయొక్క, ప్రసవే సతి=అనుజ్ఞ యుండఁగా, (అహమ్=నేను,) జేషమ్=జయించఁగలను.

తాత్పర్యము: మరుద్దేవతల యనుజ్ఞచే నేను ఈ క్షైత్రయాత్రయందు జయమును సంపాదింపఁగలను. (ఈ మంత్రము చెప్పుచు యజమానుఁడు రథముపైని వయనించవలెను.)

5. అర్థము: మనః=మనస్సు, ఆప్తమ్=అభిమతము, (భవతి=అగుచున్నది.)

తాత్పర్యము: మనస్సు అభిలషించినది ప్రాప్తమైనది. (రాజసూయ యాగకర్తయగు రాజు, ధనుస్సహితుఁడై తూర్పు దిక్కునఁగాని, ఉత్తరమునఁగాని యుండి బాణములను ధనువున సంధించి విడువవలెను.)

6. అర్థము: అహమ్=నేను, ఇన్ద్రియేణ=ఇంద్రియగతమైన, వీర్యేణ=సామర్థ్యముచేత, (సంగతః అభూవమ్)=కూడినవాఁడ నైతిని.

తాత్పర్యము: నేను హస్తాదింద్రియ సామర్థ్యముతో కూడినవాఁడ నైతిని. (రాజసూయ యాగకర్త ఇతరరాజును జయించి యీ మంత్రమును పఠించుచు ప్రదక్షిణముగ తిరుగవలెను.)

7. అర్థము: (హే వరాహనిర్మిత! ఉపానత్!=వరాహచర్మ నిర్మితమైన పాదుకా! త్వమ్=నీవు,) పశూనామ్=పశువుల యొక్క, మన్యుః=కోపస్వరూపము, అసి=అగుచున్నావు. తవేవ=నీకు వలె, మే=నాకు (కూడ,) మన్యుః=కోపము, భూయాత్=(వైరులయందు,) కలుగుఁగాక.

తాత్పర్యము: వరాహ(=పంది)చర్మ నిర్మితమైన పాదుకా! నీవు పశువులయొక్క కోపస్వరూప మగుచున్నావు. నేనుఁగూడ నీకువలె వైరుల విషయమున కోపము కలిగియుందునుగాక. (ఈ మంత్రము చెప్పుచు యజమానుఁడు వరాహచర్మ నిర్మిత పాదుకలను విడువవలెను.)

8. అర్థము: మాత్రే=మాతృ స్వరూపిణియగు, పృథివ్యై=పృథివికొఱకు, నమః=నమస్కారము. అహమ్=నేను, మాతరమ్=మాతృస్వరూపిణియగు, పృథివీమ్=పృథివిని, మా హింసిషమ్=హింసింపను, మాతా=మాతృస్వరూపిణి యగు, పృథివీ=పృథివి, మామ్=నన్ను, మా హింసీత్=హింసింపకుండుఁ గాక.

తాత్పర్యము: మాతృ స్వరూపిణియగు భూమికి నమస్కారము. పృథివీమాతను నేను హింసింపను. పృథివీమాతయు నన్ను హింసింపకుండుఁ గాక. (రథమునుండి దిగఁబోవుచు యజమానుఁడు ఈ మంత్రముచే భూమి నభిమంత్రించ వలెను.)

9. అర్థము: (హే రాజతమణే!=వెండితోఁ జేయఁబడిన మణీ! త్వమ్=నీవు,) ఇయత్=ఇంత పరిమాణము కలదానవు, అసి=అగుచున్నావు. ఆయుః=ఆయుస్స్వరూపము, అసి=అగుచున్నావు. (అతః=ఇందువలన,) మే=నాకొఱకు, ఆయుః=ఆయువును, ధేహి=ఇమ్ము. (హే తామ్రమణే!=రాగితోఁ జేయఁబడిన మణీ!, త్వమ్=నీవు, ఊర్క్=బలస్వరూపము, అసి=అగుచున్నావు. మే=నాకొఱకు, ఊర్జమ్=బలమును, ధేహి=ఇమ్ము. (హే సౌవర్ణమణే!=బంగారముతోఁ జేయఁబడిన మణీ!, త్వమ్=నీవు,) యుఙ్ అసి=ధరింపఁబడుటకు యోగ్య మగు చున్నావు. వర్చః అసి=వర్చస్సు కలదానవు అగుచున్నావు. (అతః=ఇందువలన,) మయి=నాయందు, వర్చః=తేజస్సును, ధేహి=ఉంచుము.

తాత్పర్యము: ఓ రాజతమణీ! నీవు ఈ మాత్రము పరిమాణము కలదానవు. (పరిమాణమును హస్తనిర్దేశముచే చూపించవలెను.) పరిమిత మగుటచే ఆయుస్స్వరూప మగుచున్నావు. కావున నాకు ఆయువును కలుగఁజేయుము. ఓ తామ్రమణీ! నీవు బలస్వరూపమవు. కావున నాకు బలమును కలుగఁ జేయుము. ఓ సౌవర్ణమణీ! నీవు ధారణ యోగ్యమైన దానవు. నీవు ధరింపఁబడినపుడు తేజస్వి వగుచున్నావు. కావున నాయందు తేజస్సునుంచుము. (ధేహి=ప్రయచ్ఛేతి విద్యారణ్యభాష్యమ్. రాజసూయ యాగకర్త ఈ మంత్రము పఠించుచు రథమునుండి దిగి రజతాది నిర్మితములైన ఆభరణముల నూడఁదీయవలెను.)

10. అర్థము: గృహపతయే=గృహపతియగు, అగ్నయే=అగ్నికొఱకు, స్వాహా=(ఈ హవిస్సు) హుత మగుఁగాక. వనస్పతయే=వనస్పతి(ఓషధిరాజు) అగు, సోమాయ=సోమముకొఱకు, స్వాహా=(ఈ హవిస్సు) హుత మగుఁగాక. ఇన్ద్రస్య=ఇంద్రునియొక్క, బలాయ=బలముకొఱకు, స్వాహా=(ఈ హవిస్సు) హుత మగుఁగాక. మరుతామ్=మరుద్దేవతలయొక్క, ఓజసే=తేజస్సుకొఱకు, స్వాహా=(ఈ హవిస్సు) హుత మగుఁగాక. (తాత్పర్యము సుగమము. ఈ మంత్రము చెప్పుచు రథవిమోచనీయ హోమములను చేయవలెను.)

11. అర్థము: శుచిషత్=శుచియైన దేవయజనమునం దుండునదియు, వసుః=(తనపై యజమానుని,) నివసింపఁజేయునదియు, అంతరిక్షసత్=(తరుగుల్మాదులచే అవరుద్ధముకాని,) అంతరిక్షమునం దుండునదియు, హోతా=హోతృ సమానమైనదియు, వేదిసత్=యజ్ఞవేదియం దుండునదియు, అతిథిః=అతిథి సదృశమైనదియు, (కనుకనే,) దురోణసత్=గృహములం దుండునదియు, (=ఎవరు అధిష్ఠించుటకై రథమును గొనిపోవుదురో, వారి గృహముల యందుండును.) నృషత్=మనుష్యులయందు (ఉపకారము చేయుటకై,)ఉండునదియు, వరసత్=శ్రేష్ఠమైన రాజాది గృహములం దుండునదియు,) ఋతసత్=వాజపేయాది యజ్ఞములం దుండునదియు, వ్యోమసత్=(సూర్యుని వహించుటకై) ఆకాశమున నుండునదియు, అబ్జాః=('అప్సు యోనిర్వా అశ్వః' అను శ్రుతివలన ఉదకములనుండి పుట్టిన) అశ్వములతోఁ గూడియుండునదియు, గోజాః=గోశబ్దవాచ్య వజ్రము నుండి పుట్టినదియు, ఋతజాః=యజ్ఞముకొఱకు పుట్టినదియు, అద్రిజాః=పాషాణ సదృశ దృఢ కాష్ఠముల నుండి పుట్టినదియునగు, హంసః=రథము, బృహత్=ప్రౌఢమైన, ఋతమ్=రాజసూయాఖ్య యజ్ఞమును, (సంపాదయతు=సంపాదించుఁగాక.)

తాత్పర్యము: (తాత్పర్యము సుగమము. ఈ మంత్రము చెప్పుచు రథమును రథవాహనమునం దుంచవలెను.)

పంచదశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ఽష్టమప్రపాఠకే షోడశోఽనువాకః।

మూలము: [1]మిత్రో ఽసి వరుణో ఽసి [2]సమహం విశ్వై ర్దేవైః [3]క్షత్త్రస్య నాభి రసి క్షత్త్రస్య యోని రసి [4]స్యోనా మాసీద సుషదా మాసీద మా త్వా హిగ్ంసీ న్మా మా హిగ్ంసీ [5]న్నిషసాద ధృతవ్రతో వరుణః పస్త్యా స్వా సామ్రాజ్యాయ సుక్రతు [6]ర్బ్రహ్మా౩న్ త్వగ్ం రాజ న్బ్రహ్మా ఽసి సవితా ఽసి సత్యసవో బ్రహ్మా౩న్ త్వగ్ం రాజ న్బ్రహ్మా ఽసీన్ద్రో ఽసి సత్యౌజాః (౧) బ్రహ్మా౩న్ త్వగ్ం రాజ న్బ్రహ్మా ఽసి మిత్రో ఽసి సుశేవో బ్రహ్మా౩న్ త్వగ్ం రాజ న్బ్రహ్మా ఽసి వరుణో ఽసి సత్యధర్మే[7]న్ద్రస్య వజ్రో ఽసి వార్త్రఘ్న స్తేన మే రధ్య[8]దిశో ఽభ్యయగ్ం రాజా ఽభూ [9]త్సుశ్లోకా౩గ్ం సుమఙ్గలా౩గ్ం సత్యరాజా౩న్। [10]అపాంనప్త్రే స్వాహోర్జో నప్త్రే స్వాహాగ్నయే గృహపతయే స్వాహా ॥ ౨॥ (సత్యౌజా శ్చత్వారిగ్ంశ చ్చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ఽష్టమప్రపాఠకే షోడశోఽనువాకః॥

వేదార్థ దీపిక

అవతారిక: పంచదశానువాకమునందు దిగ్విజయ మభిహితమైనది. ఈ షోడశానువాకమునందు విజయానంతరము సింహాసనమునం దుపవసించి సర్వులచే రాజు సేవింపఁబడుట వర్ణింపఁబడుచున్నది.

1. అర్థము: (హే దక్షిణబాహో!=ఓ దక్షిణబాహూ! త్వమ్=నీవు,) మిత్రః=మిత్రము, అసి=అగుచున్నావు. (హే వామ బాహో!=ఓ యెడమ భుజమా!, త్వమ్=నీవు,) వరుణః=వరుణస్వరూపము, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: పూర్వము "హిరణ్యవర్ణా వుషసామ్" అను మంత్రముచే రాజసూయ యజ్ఞకర్తయొక్క బాహువులు పైకెత్తఁబడినట్లు వర్ణించఁబడినది. ఇప్పుడీ మంత్రముచేత ఆ బాహువులను క్రిందికి దింపవలెను. దక్షిణ బాహువు మిత్రునివలె భోజనాది విషయమున ఇష్టప్రాపక మగుటచే మిత్రముగాను, వామబాహువు శౌచాది కర్మలయం దనిష్టనివారక మగుటచే వరుణ రూపముగాను వర్ణింపఁబడినవి.

2. అర్థము: అహమ్=నేను, విశ్వైః దేవైః=సర్వదేవతలతోడను, సంగచ్ఛేయమ్=కలిసికొందునుగాక.

తాత్పర్యము: నేను సర్వదేవతలతోడను కలిసికొందునుగాక. (సర్వదేవ దేవతాకమైన ఆమిక్షయందు హస్తముల నుపావ హరణము చేయవలెను.)

3. అర్థము: (హే కృత్త్యధివాస!=ఓ చర్మపటమా! త్వమ్=నీవు,) క్షత్త్రస్య=క్షత్త్రియ జాతీయునకు, నాభిః=(కూర్చుండుటకై,) నాభివలె మధ్యస్థానము, అసి=అగుచున్నావు. క్షత్త్రస్య=క్షత్త్రియ జాతీయునకు, యోనిః=(తల్లివలె ధారక మగుటచే,) కారణము, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: (సులభగ్రాహ్యము. చంద్రకొయ్యచే చేయఁబడిన పీఁటనుంచి, దానియందు చర్మవస్త్రమును వఱచవలెను. ఆ చర్మవస్త్రము ఇచట సంబోధింపఁబడినది.)

4. అర్థము: (హే మదీయ శరీర!=ఓ నాయొక్క శరీరమా! త్వమ్=నీవు,) స్యోనామ్=సుఖకరమైన యీ చంద్రపీఁటను, ఆసీద=సమీపించుము. సుషదామ్=సుఖముగా కూర్చుండుటకు యోగ్యమైన యీ చంద్రపీఁటను, ఆసీద=సమీపించుము. (ఇయమ్=ఈ ఆసన్ది (=చంద్రపీట) త్వా=నిన్ను, మా హింసీత్=హింసింపకుండుఁగాక. మా (అపి)=శరీరస్వామినైన నన్నుఁగూడ, మా హింసీత్=హింసింపకుండుఁ గాక.

తాత్పర్యము: ఓ నా శరీరమా! నీవు సుఖకరమును, సుఖముగ కూర్చుండుటకు యోగ్యమైనదియునగు ఈ చంద్రపీఁట యొద్దకు చేరుము. ఈ చంద్రపీఁట నిన్ను నన్నుఁ గూడ హింసించకుండుఁగాక. (యజ్ఞకర్తచే తన శరీరము సంబోధింపఁబడినది. ఈ మంత్రము చెప్పుచు యజ్ఞకర్త పైని చెప్పిన పీఁటపై కూర్చుండవలెను.)

5. అర్థము: (అయం యజమానః=ఈ యజమానుఁడు,) ధృతవ్రతః=స్వీకరించఁబడిన యజ్ఞము కలవాఁడు, వరుణః=అనిష్ట నివారకుఁడును, భూత్వా=అయి (అస్యామ్ ఆసన్ద్యామ్=ఈ చంద్రపీఁటయందు,) నిషసాద=కూర్చుండెను. పస్త్యాసు=అనేకము లయిన వైరిగృహములయందు, ఆ (గత్య)=వచ్చి, సామ్రాజ్యాయ=సామ్రాజ్యముకొఱకు, సుక్రతుః=సుసంకల్పము కలవాఁడు, (భవతు=అగుఁగాక.)

తాత్పర్యము: ఈ యజమానుఁడు యజ్ఞమును స్వీకరించినవాఁడు అనిష్టనివారకుఁడునై ఈ ఆసనమునందు కూర్చుని యున్నాఁడు. ఇతఁడు అనేక వైరి గృహములకు వచ్చి సామ్రాజ్యము చేయుటకు సుసంకల్పుఁ డగుఁగాక. (ఆసనమునం దాసీనుఁడై యున్న యజ్ఞకర్తను ఈ మంత్రముచే అనుమంత్రించవలెను.)

6. అర్థము: హే రాజన్!=ఓ రాజా! త్వమ్ (ఏవ)=నీవే, బ్రహ్మ=బ్రాహ్మణుఁడవు, అసి=అగుచున్నావు. (యతః=ఏ కారణమువలన, త్వమేవ=నీవే,) సవితా=(కర్మానుష్ఠానమునకై మాకు) అనుజ్ఞాతవు, అసి=అగుచున్నావో, సత్యసవః=అమోఘమైన అనుజ్ఞకలవాఁడవును, అసి=అగుచున్నావో, (తతః=అందువలన, త్వమేవ, బ్రహ్మ, అసి.) హే రాజన్!=ఓ రాజా! త్వమ్=నీవు, (యతః=ఏ కారణమువలన,) ఇన్ద్రః=పరమైశ్వర్యము కలవాఁడవు, అసి=అగుచున్నావో, సత్యౌజాః=అమోఘ సామర్థ్యము కలవాఁడవు, అసి=అగుచున్నావో, (తతః=అందువలన,) త్వమ్ (ఏవ)=నీవే, బ్రహ్మ=బ్రాహ్మణుఁడవు, అసి=అగుచున్నావు. హే రాజన్!=ఓ రాజా! (యతః=ఏ కారణమువలన,) త్వమ్=నీవు, మిత్రః=దేవమిత్రుఁడవు, అసి=అగుచున్నావో, సుశేవః=బాగుగ సేవించుటకు యోగ్యుఁడవు, అసి=అగుచున్నావో, (తతః=అందువలన,) త్వమ్=(ఏవ) నీవే, బ్రహ్మ=బ్రాహ్మణుఁడవు, అసి=అగుచున్నావు. హే రాజన్!=ఓ రాజా! త్వమ్=నీవు, (యతః=ఏ కారణమువలన,) వరుణః=అనిష్ట నివారకుఁడవు, అసి=అగుచున్నావో, సత్యధర్మా=శాస్త్రీయ ధర్మయుక్తుఁడవు, అసి=అగుచున్నావో, (తతః=అందువలన,) త్వమ్ (ఏవ)=నీవే, బ్రహ్మ=బ్రాహ్మణుఁడవు, అసి=అగుచున్నావు.

తాత్పర్యము: ఓ రాజా! నీవు బ్రాహ్మణ ధర్మములను పాలించుచు మా కర్మానుష్ఠానమునకు అనుజ్ఞ నిచ్చువాఁడవు, అమోఘానుజ్ఞ కలవాఁడవు, కావున నీవే బ్రాహ్మణుఁడ వగుచున్నావు. ఓ రాజా! నీవు పరమైశ్వర్యవంతుఁడవు, అమోఘ వీర్యుఁడవు కావున నీవే బ్రాహ్మణుఁడ వగుచున్నావు. ఓ రాజా! నీవు శిష్టపరిపాలనకై దేవమిత్రుఁడవు, బాగుగ సేవింపఁదగినవాఁడవు కావున నీవే బ్రాహ్మణుఁడ వగుచున్నావు. ఓ రాజా! నీవు అనిష్టనివారకుఁడవు శాస్త్రీయధర్మ యుక్తుఁడవు కావున నీవే బ్రాహ్మణుఁడ వగుచున్నావు. (దిగ్విజయానంతరము

ఆసనము నధిష్ఠించియున్న రాజసూయ యాగకర్తను ఋత్విజులు ఇతర ప్రజలు పరివేష్టించి యుందురు. ఆ సమయమున ఋత్విజులు యజమాను నుద్దేశించి యీ మంత్రమున చెప్పఁబడిన విధముగ పలుకుదురు. ఇదియే సేవోపచారము. లోకమునందు పరరాష్ట్రమును జయించి వచ్చి సింహాసనము నధిష్ఠించియున్న రాజును అధోపవిష్టులై యున్న పురోహితాదులు అనేకాశీస్సులచేతను, స్తోత్రములచేతను స్తుతించిన విధముగ ఇచటను సేవోపచారము చెప్పఁబడినది.)

7. అర్థము: (హే స్ఫ్య!='స్ఫ్య' మను పేరుగల ఖడ్గవిశేషమా! త్వమ్=నీవు, వజ్రః=వజ్రస్వరూపము, అసి=అగు చున్నావు. (యత్=ఏ కారణము వలన) వార్త్రఘ్నః=విరోధులను వధించుదానవో, తేన=అ కారణముచేత, మే=నా కొఱకు, రధ్య=(ద్యూతస్థాన పరిలేఖనరూప కార్యమును) సాధించుము.

తాత్పర్యము: ఓ 'స్ఫ్య' మను ఆయుధమా! నీవు ("స్ఫ్య స్త్వతీయమ్" అను శ్రుతి ననుసరించి) వజ్ర స్వరూపమవు. నీవు శత్రుఘాతివి. కావున నా నిమిత్తము ద్యూతస్థాన పరిలేఖన రూప కార్యమును సాధించుము. (ఈ మంత్రము చెప్పుచు యజమానునకు బ్రహ్మ 'స్ఫ్య' ము నీయవలెను.) (స్ఫ్యము= 42వ పుటలో జూడుఁడు.)

8. అర్థము: అయమ్=ఈ యజమానుఁడు, దిశః అభి=ఊర్ధ్వదిక్కుతో కలిసి పంచదిక్కుల నభిలక్షించి. రాజా=రాజు, అభూత్=అయెను.

తాత్పర్యము: ఈ యజమానుఁడు ప్రాగాది ఊర్ధ్వాంత దిక్కులై దింటికి రాజు అయెను. (ఈ మంత్రము చెప్పుచు యజమాను నకు అయిదు పాచికల నీయవలెను.)

9. అర్థము: సుశ్లోకాన్=మంచి స్తుతి కలవారగు, సంగ్రహీతౄన్=సంగ్రహీతలను, (=గుఱ్ఱము పగ్గములను పట్టుకొనువారు, లేదా, కోశాధ్యక్షులు.) సుమఙ్గలాన్=కరాదానరూప మంగళకర్మ కలవారగు, భాగదుఘాన్=భాగదుఘులను, (=ప్రజలనుండి కప్పము తీసికొనువారు.) సత్యరాజాన్=సత్యమైన అంతఃపుర రక్షణమునకు స్వాములగు, క్షత్తౄన్=క్షత్తలను (=కంచుకులను,) (ఆహ్వయామి=ఆహ్వానించుచున్నాను.)

తాత్పర్యము: శోభనస్తుతి కలవారగు సంగ్రహీతలను హద్దు మీఱక ప్రజలనుండి కప్పమును గ్రహించునట్టి భాగదుఘులను, అంతఃపుర రక్షణము చేయునట్టి కంచుకులను ఆహ్వానించుచున్నాను. (అని యజమానుఁడు పలుకు చున్నాఁడు. ఇది ఆశీరూపము.)

10. అర్థము: అపాంనప్త్రే=ఉదకములను నశింపఁజేయనట్టి అగ్నికొఱకు, స్వాహా=ఈ హవిస్సు హుతమగుఁగాక. ఊర్జో నప్త్రే=బలమును నశింపఁజేయని అగ్నికొఱకు, స్వాహా=ఈ హవిస్సు హుతమగుఁగాక. గృహపతయే=గృహపతియగు, అగ్నయే=అగ్నికొఱకు, స్వాహా=ఈ హవిస్సు హుతమగుఁగాక.

తాత్పర్యము: "అగ్నే రాపః" అను శ్రుతి ననుసరించి, అగ్నినుండి యుదకములు పుట్టుటచే, అగ్ని యుదకములకు నాశకుఁడు కాఁడు. జఠరాగ్ని తినిన అహారమును జీర్ణముఁ జేయుటచే బలము నిచ్చువాఁడేకాని, బలమును నశింపఁజేయువాఁడు కాఁడు. గార్హపత్యాగ్ని గృహపతిగా బహుస్థలములందు వర్ణింపఁబడెను. (ఈ మంత్రము చెప్పుచు అగ్నికి మువ్వురు హోమము చేయవలెను.)

షోడశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ఽష్టమప్రపాఠకే సప్తదశోఽనువాకః।

మూలము: [1]ఆగ్నేయ మష్టాకపాలం నిర్వపతి హిరణ్యం దక్షిణా సారస్వతం చరుం వత్సతరీ దక్షిణా సావిత్రం ద్వాదశకపాల ముపధ్వస్తో దక్షిణా పౌష్ణం చరుగ్ం శ్యామో దక్షిణా బార్హస్పత్యం చరుగ్ం శితిపృష్ఠో దక్షిణైన్ద్ర మేకాదశకపాల మృషభో దక్షిణా వారుణం దశకపాలం మహానిరష్టో దక్షిణా సౌమ్యం చరుం బభ్రు ర్దక్షిణా త్వాష్ట్ర మష్టాకపాలగ్ం శుణ్ఠో దక్షిణా వైష్ణవం త్రికపాలం వామనో దక్షిణా ॥ ౧ ॥ (అగ్నేయగ్ం హిరణ్యగ్ం సారస్వతం ద్విచత్వారిగ్ంశత్ ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తరీయ సంహితాయాం ప్రథమాష్టకే ఽష్టమప్రపాఠకే సప్తదశోఽనువాకః।

వేదార్థ దీపిక

అవతారిక: షోడశానువాకమునందు రాజునకు ఇతరసేవ్యత్వ రూపమైన ఉపచారము వర్ణింపఁబడినది. ఈ సప్తదశానువాకమునందు పది సంసృపహవిస్సులు చెప్పఁబడుచున్నవి.

1. అర్థము: అగ్నేయమ్=అగ్నిదేవతాకమైన, అష్టాకపాలమ్=అష్టకపాల సంస్కృత పురోడాశమును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. హిరణ్యమ్=బంగారము, దక్షిణా=(ఈ కర్మయందు) దక్షిణ. (ఈ విధముగనే మిగిలిన తొమ్మిది హవిస్సులకూఁడ. సమన్వయము మాత్రము చేయబడుచున్నది.) (2) సారస్వతమ్, చరుమ్, నిర్వపతి. వత్సతరీ=పాలుత్రాగుటను విరమించిన దూడ. దక్షిణా. (3) సావిత్రమ్, ద్వాదశకపాలమ్, నిర్వపతి. ఉపధ్వస్తః=సంకీర్ణ వర్ణము కల వత్సము, దక్షిణా. (4) పౌష్ణమ్, చరుమ్, నిర్వపతి. శ్యామః=శ్యామ వర్ణము కల వత్సము, దక్షిణా. (5) బార్హస్పత్యమ్, చరుమ్, నిర్వపతి. శితిపృష్ఠః=శ్వేత పృష్ఠము కల వత్సము దక్షిణా. (6) ఐన్ద్రమ్, ఏకాదశకపాలమ్, నిర్వపతి. ఋషభః దక్షిణా. (7) వారుణమ్, దశకపాలమ్, నిర్వపతి. మహానిరష్టః=పీడిత వృషణములు కల ఎద్దు, దక్షిణా. (8) సౌమ్యమ్, చరుమ్, నిర్వపతి. బభ్రుః=కపిలవర్ణముకల గోవు, దక్షిణా. (9) త్వాష్ట్రమ్=త్వష్టృదేవతాకము. అష్టాకపాలమ్, నిర్వపతి. శుణ్ఠః=తెల్లని శరీరము కల గోవు, దక్షిణా. (10) వైష్ణవమ్=విష్ణుదేవతాకము, త్రికపాలమ్, నిర్వపతి. వామనః=పొట్టిదియైన గోవు, దక్షిణా. (ఈ హవిస్సులకు సంసృప హవిస్సులని పేరు. పూర్వము పది విధములుగ వీర్యమును పోఁగొట్టుకొనిన వరుణుఁడు ఈ అగ్న్యాది దేవతలచే మరల పొందుటచే అగ్న్యాదులు సంసృపు లగుదురు. ఆ అగ్న్యాదుల కీయఁబడిన హవిస్సులకు కూడ సంసృపములనుపేరు వచ్చినది. సంసృప్యతే=ప్రాప్యతే వీర్య మాభిర్దేవతాభి రితి సంసృపః దేవతాః. తేషాం హవీంష్యపి తన్నామకాని. తాత్పర్యము సులభము.

సప్తదశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ఽష్టమప్రపాఠకే ఽష్టాదశోఽనువాకః ।

మూలము: [1]సద్యో దీక్షయన్తి సద్యస్సోమం క్రీణన్తి [2]పుణ్డరిస్రజాం ప్ర యచ్ఛతి [3]దశభి ర్వత్సతరైః

స్సోమం క్రీణాతి [4]దశపేయో భవతి [5]శతం బ్రాహ్మణాః పిబన్తి [6]సప్తదశగ్ం స్తోత్రం భవతి

[7]ప్రాకాశా వధ్వర్యవే దదాతి [8]స్రజ ముద్గాత్రే [9]రుక్మగ్ం హోత్రే [10]అశ్వం ప్రస్తోతృ ప్రతిహర్తృ

భ్యాం [11]ద్వాదశ పష్ఠౌహీ ర్బ్రహ్మణే [12]వశాం మైత్రావరుణాయ[13]ర్షభం బ్రాహ్మణాచ్ఛగ్ంసినే

[14]వాససీ నేష్టాపోతృభ్యాగ్ం [15]స్థూరియవాచిత మచ్ఛావాకాయా[16]నడ్వాహ మగ్నీధే [17]భార్గవో

హోతా భవతి శ్రాయన్తీయం బ్రహ్మసామం భవతి వారవన్తీయ మగ్నిష్టోమసామగ్ం సారస్వతీ

రపో గృహ్ణాతి ॥౧॥ (వారవన్తీయం చత్వారి చ ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ఽష్టమప్రపాఠకే ఽష్టాదశోఽనువాకః ॥

వేదార్థదీపిక.

అవతారిక: సప్తమానువాకమునందు సంసృప హవిస్సులు చెప్పఁబడినవి. ఈ అష్టాదశానువాకమునందు దశపేయము చెప్పఁబడుచున్నది.

1\. అర్థము: సద్యః=వెంటనే, దీక్షయన్తి=దీక్షను వహించవలెను, సద్యః=వెంటనే, సోమమ్=సోమమును, క్రీణన్తి=కొనవలయును.

తాత్పర్యము: అగ్నిష్టోమాది (ప్రకృతి)యాగములందు దీక్షా సోమక్రయములు విభిన్న దినములందు ఆచరింపఁబడును. ఈ రాజసూయ యాగమునందు దీక్షా సోమక్రయములు ఒక దినమునందే చేయవలెనని యీ మంత్రము చెప్పుచున్నది. దీక్షా సోమములకు చోదకప్రాప్తమైన దినభేదము ఈ మంత్రముచే వారింపఁబడుచున్నది.

౨. అర్థము: పుణ్డరిస్రజామ్=తామరపువ్వుల మాలను, ప్రయచ్ఛతి=ఈయవలెను. (నీటియందు విడువవలెను.)

తాత్పర్యము: ప్రకృతియాగమునందు దీక్షాప్రారంభమున ఉదకములందు స్నానము, ఉదక భక్షణము విహితములైనవి. అందుకు మాఱుగా ఈ రాజసూయ దీక్షా సమయమున ఉదకములందు పంద్రెండు పుండరీకములు గల మాలను విడువవలెనని ఈ మంత్రము చెప్పుచున్నది. (పూర్వము అంగిరసులు స్వర్గమునకు పోవుచు దీక్షా తపస్సు లను ఉదకములందు ప్రవేశపెట్టినారు. ఆ దీక్షా తపస్సులు పుండరీకమైనవి. రాజసూయ యాగదీక్షను వహించు యజమానుఁడు దీక్షాసమయమున ఉదకములందు ద్వాదశ పుండరీక స్రజమును విడిచినచో ఆ దీక్షాతపస్సులను పొందునని బ్రాహ్మణమునఁ గలదు.)

3. అర్థము: దశభిః వత్సతరైః=స్తన్యమును త్రాగుటను విరమించిన పది వత్సములచేత, సోమమ్=సోమమును క్రీణాతి=కొనవలెను.

తాత్పర్యము: రాజసూయ యాగమునం దుపయోగించునట్టి సోమమును పది వత్సతరముల నిచ్చికొనవలెను. ప్రకృతి యాగమునందు హిరణ్య వాసః ప్రభృతి దశవిధము లయిన పదార్థములు సోమక్రయ సాధనములుగా విధింపఁ బడినవి. రాజసూయ యాగమునందు మాత్రము అట్లుగాక దశసంఖ్యాకము లయిన వత్సతరముల నిచ్చి సోమమును క్రయము చేయువలెనని యీ మంత్రము చెప్పుచున్నది. (వత్సతరములు=తల్లిపాలు త్రాగుటను మానిన వత్సములు.)

4. అర్థము: దశపేయః=పది వైకృత చమసములందు పానము చేయఁదగిన సోమరసము కల క్రతువు దశపేయము, భవతి=అగుచున్నది. (లేదా, ఒక్కొక్క పాత్రమునందు పది మంది బ్రాహ్మణులు పానము చేయఁదగిన సోమరసముకల క్రతువు దశపేయ మనియుఁ జెప్పవచ్చును.)

తాత్పర్యము: సుగమము. (ఈ దశపేయక్రతువు ప్రధానకర్మ. ఇది రాజసూయాంతర్భాగము.)

5. అర్థము: శతమ్=నూఱుగురు, బ్రాహ్మణాః=బ్రాహ్మణులు, పిబన్తి=సోమరసమును త్రాగుచున్నారు. (=త్రాగవలెను.)

తాత్పర్యము: ఒక్కొక్క పాత్రమునందలి సోమరసమును పదిమంది బ్రాహ్మణులు త్రాగినచో పదిపాత్రములయందలి సోమరసమును నూఱుగురు బ్రాహ్మణులు త్రాగుచున్నారను నర్థము స్పష్ట మగుచున్నది.

6. అర్థము: సప్తదశస్తోత్రమ్=ఈ దశపేయ క్రతువునందుఁగల స్తోత్ర మంతయు సప్తదశసంఖ్యాక స్తుతిమంత్ర సముదాయమే, భవతి=అగుచున్నది.

తాత్పర్యము: ఈ మంత్రము దశపేయమునకు సప్తదశ స్తోమమును విధించుచున్నది. ఈ దశపేయ క్రతువునందుఁ గల స్తోత్రము సర్వము సప్తదశమంత్ర సమూహాత్మకముగా నుండవలెనని భావము.

7. అర్థము: ప్రాకాశౌ=రెండు సువర్ణ దర్పణము (=అద్దము)లను, అధ్వర్యవే=అధ్వర్యునికొఱకు, దదాతి=ఈయవలెను. (దదాతి=దద్యాత్)

తాత్పర్యము: ఈ దశపేయక్రతువునందు యజమానుఁడు అధ్వర్యునకు రెండు సువర్ణ దర్పణముల నొసఁగవలెను.

8. అర్థము: స్రజమ్=(బంగారపు) మాలను, ఉద్గాత్రే=ఉద్గాతయను ఋత్విజునికొఱకు. (దద్యాత్=ఒసఁగవలెను.) తాత్పర్యము స్పష్టము.

9. అర్థము: రుక్మమ్=వర్తులపు సువర్ణాభరణమును, హోత్రే=హోతకొఱకు, (దద్యాత్=ఈయవలెను.)

10. అర్థము: ప్రస్తోతృ ప్రతిహర్తృభ్యామ్=ప్రస్తోత, ప్రతిహర్త, అను ఋత్విజులకొఱకు, అశ్వమ్=అశ్వమును, (దద్యాత్=ఈయవలెను) ఇచట ఇద్దఱకు ఏక ద్రవ్యదానము విహిత మైనది.

11. అర్థము: బ్రహ్మణే=బ్రహ్మకొఱకు, ద్వాదశ పష్ఠౌహీః=పండ్రెండు (పష్ఠౌహులను,) (=బాల్యమందే తొలుచూలు గల పెయ్యలను) దద్యాత్=ఈయవలెను.

12. అర్థము: మైత్రావరుణాయ=మైత్రావరుణునికొఱకు, వశామ్=వన్ధ్యగోవును, (దద్యాత్=ఈయవలెను.)

13. అర్థము: బ్రాహ్మణాచ్ఛంసినే=బ్రాహ్మణాచ్ఛంసి యను ఋత్విజునికొఱకు, ఋషభమ్=రేతస్సేచన సమర్థమైన గోవును, (దద్యాత్=ఈయవలెను.)

14. అర్థము: నేష్టా పోతృభ్యామ్=నేష్ట, పోత, అను ఋత్విజులకొఱకు, వాససీ=రెండు వస్త్రములను, (దద్యాత్=ఈయవలెను.)

15. అర్థము: అచ్ఛావాకాయ=అచ్ఛావాకుఁడను ఋత్విజునికొఱకు, స్థూరి=స్థూలమైన, యవాచితమ్=యవధాన్య పూర్ణ మయిన శకటమును, (దద్యాత్=ఈయవలెను.)

16. అర్థము: అగ్నీధే=అగ్నీధ్రునికొఱకు, అనడ్వాహమ్=ఎద్దును, (దద్యాత్=ఈయవలెను.)

తాత్పర్యము: అగ్నీధ్రునకు ఎద్దును ఈయవలెను. అగ్నిని ప్రకాశింపఁజేయువాఁడు-అగ్నీధ్రుఁడు. 'అనః వహతీతి='అన డ్వాన్=బండినిమోయునది, ఎద్దు.)

17. అర్థము: (అస్మిన్=ఈ దశపేయ క్రతువునందు,) భార్గవః=భృగు గోత్రోద్భవుఁడు, హోతా=హోతగా, భవతి=అగు చున్నాఁడు. శ్రాయన్తీయమ్='శ్రాయన్త ఇవ సూర్యమ్' ఇత్యాది ఋక్కునం దుత్పన్నమైన, బ్రహ్మ సామమ్=బ్రహ్మసామము, భవతి=ఉపయోగింపవలసినది అగుచున్నది. (మఱియు) వారవన్తీయమ్= "అశ్వం న త్వా వారవన్తమ్" అను ఋక్కునం దుత్పన్నమైన, అగ్నిష్టోమసామమ్=అగ్నిష్టోమ సామము, భవతి=(ఉపయోగింపవలసినది,) అగుచున్నది. సారస్వతీః=సరస్వతీ నదీ సంబంధములైన, అపః=ఉద కములను, గృహ్ణాతి=గ్రహించవలెను.

తాత్పర్యము: ప్రకృతి యాగమునందుండు హోత, సామము, ఉదకములు యథాప్రాప్తము లగుచుండఁగా ఈ మంత్రము ఈ దశపేయక్రతువునం దుండదగిన హోత్రాదులను ప్రత్యేకముగా విధించుచున్నది. అనఁగా ప్రకృతి యాగమునందు ఏ గోత్రమునకుఁ జెందినవాఁడైనను హోతగా నుండవచ్చును. ఈ దశపేయ క్రతువునందు భృగుగోత్రోద్భవుఁడే హోతగా నుండవలెను. ప్రకృతియందు గాయత్ర సామము, యజ్ఞాయజ్ఞీయమైన అగ్నిష్టోమ సామము ఉపయోగింపఁబడుచుండఁగా ఇచట శ్రాయన్తీయ సామము, వారవన్తీయ సామము విధింపఁబడుచున్నవి. ప్రకృతియందు సామాన్య ప్రవాహగతములైన వసతీ వరీ త్యాద్యుదకములు గ్రహింపఁబడుచుండఁగా ఈ దశపేయ క్రతువునందు సరస్వతీ నదీ జలములనే గ్రహించవలెనని యీ మం త్రము చెప్పుచున్నది.

అష్టాదశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ఽష్టమ ప్రపాఠక ఏకోనవింశోఽనువాకః

మూలము: [1]అగ్నేయ మష్టాకపాలం నిర్వపతి హిరణ్యం దక్షిణైన్ద్ర మేకాదశకపాల మృషభో దక్షిణా వైశ్వ
దేవం చరుం పిశఙ్గీ పష్ఠౌహీ దక్షిణా మైత్రావరుణీ మామిక్షాం వశా దక్షిణా బార్హస్పత్యం చరుగ్ం
శితిపృష్ఠో దక్షిణా[2]దిత్యాం మల్హాం గర్భిణీ మాలభతే మారుతీం పృశ్నిం పష్ఠౌహీ [3]మశ్విభ్యాం
పూష్ణే పురోడాశం ద్వాదశకపాలం నిర్వపతి సరస్వతే సత్యవాచే చరుగ్ం సవిత్రే సత్యప్రసవాయ
పురోడాశం ద్వాదశకపాలం తిసృధన్వగ్ం శుష్కదృతి ర్దక్షిణా ॥ ౧ ॥

(ఆగ్నేయగ్ం హిరణ్య మైన్ద్రం వైశ్వదేవం పిశఙ్గీ సప్తచత్వారిగ్ంశత్ ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ఽష్టమప్రపాఠక ఏకోనవింశోఽనువాకః ।

వేదార్థదీపిక

అవతారిక: అష్టాదశానువాకమునందు దశపేయ మభిహితమైనది. ఈ పందొమ్మిదవ యనువాకమునందు అవేష్టులు, పశుద్వయము, సాత్యదూతహవిస్సులు చెప్పఁబడుచున్నవి.

1. అర్థము: (1)ఆగ్నేయమ్, అష్టాకపాలమ్, నిర్వపతి, హిరణ్యమ్, దక్షిణా. (2)ఐన్ద్రమ్, ఏకాదశకపాలమ్, నిర్వపతి. ఋషభః, దక్షిణా. (3)వైశ్వదేవమ్, చరుమ్, నిర్వపతి. పిశఙ్గీ=పచ్చనివర్ణము గల, పష్ఠౌహీ=బాలగర్భిణి యగు గోవు, దక్షిణా. (4)మైత్రావరుణీమ్, ఆమిక్షామ్, నిర్వపతి. వశా, దక్షిణా. (5)బార్హస్పత్యమ్, చరుమ్, నిర్వపతి. శితిపృష్ఠః, దక్షిణా.

తాత్పర్యము: ఈ మంత్రమున ఐదు హవిస్సులు చెప్పఁబడినవి. ఇందలి పదము లన్నియు పూర్వము అనేక పర్యాయములు వ్యాఖ్యాతము లగుటచే ఇచట మఱల వ్యాఖ్యానింపఁబడలేదు. ఈ హవిస్సులను అవేష్టు లందురు. రాజసూయ యజ్ఞకర్తను అధ్వర్యుఁడు దిగ్విజయమునకై పంపఁగా అతఁడు దిగ్విజయమునకై అయిదు దిక్కు లందు పరిభ్రమించును. తత్పరిభ్రమణముచే అతఁడు ఉన్మత్తుఁడు కావచ్చును. తదున్మాద పరిహారమునకై ఈ యైదు హవిస్సులు విధింపఁబడినవి. ఇది అవేష్టివిధి యనఁబడును. తాత్పర్యము స్పష్టము.

2. అర్థము: ఆదిత్యామ్=అదితి దేవతాకమును, మల్హామ్=గళస్తన యుక్తమును, గర్భిణీమ్=చూఁడిదియునైన గోవును, ఆలభతే=ఆలంభనము చేయవలెను. మారుతీమ్=మరుద్దేవతాకమైన, పృశ్నిమ్=తెల్లని, పష్ఠౌహీమ్=బాల గర్భిణియగు ఆవును, (=బాల్యమందే తొలు చూలుగల పెయ్యను,) ఆలభతే=ఆలంభనము చేయవలెను.

తాత్పర్యము: పూర్వమంత్రమున అవేష్టులను విధించి శ్రుతి యీ మంత్రమున ద్విపశుయుక్త పశుబంధ కర్మను విధించుచున్నది. అదితి దేవతాకమును, కంఠమునందు స్తనము కలదియు, గర్భిణియునైన గోవును, మరుద్దేవతాకమును, తెల్లనిదియు, బాలగర్భిణియునగు గోవును ఆలంభనము చేయవలెను. రాజసూయకర్తకు దిగ్వ్యాప్తి మణమువలన కలుగు ఉన్మాదము తొలఁగుటకై ఈ ద్విపశుయుక్త పశుబన్ధ కర్మ విధింపఁబడినది.

3. **అర్థము:** అశ్విభ్యామ్=అశ్వినీదేవతలకొఱకు, పూష్ణే(చ)=పూషదేవతకొఱకును, ద్వాదశకపాలమ్, పురోడాశమ్, నిర్వపతి. (2)సత్యవాచే=సత్యవాక్కు గల, సరస్వతే=సరస్వన్నామక దేవతకొఱకు, చరుమ్, నిర్వపతి. (3)సత్యప్రసవాయ=అమోఘానుజ్ఞగల, సవిత్రే=సవితృ దేవతకొఱకు, ద్వాదశకపాలమ్, పురోడాశమ్, నిర్వపతి. తిసృధన్వమ్=మూఁడు బాణములతో కూడిన ధనువు, శుష్కదృతిః=శుష్కదృతి, దక్షిణా=ఈ కర్మయందు దక్షిణగా నీయవలెను. (శుష్కదృతిః=ధనువునుంచుట కుపయోగించునట్టి యెండిన తోలుతిత్తి.)

తాత్పర్యము: అశ్వినీదేవతలకు, పూషదేవతకు ద్వాదశకపాల సంస్కృత పురోడాశమును, సత్యవాక్కు గల సరస్వద్దేవతకు చరు హవిస్సును, అమోఘానుజ్ఞ కల సవితృ దేవతకు ద్వాదశకపాల పురోడాశమును నిర్వాపము చేయవలెను. ఈ కర్మయందు మూఁడుబాణములతో కూడియున్న ధనువును, ఆ ధనువు నుంచుటకై శుష్కదృతిని దక్షిణగా నీయవలెను.

ఏకోనవింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే అష్టమప్రపాఠకే వింశోఽనువాకః ।

మూలము: [1]ఆగ్నేయ మష్టాకపాలం నిర్వపతి సౌమ్యం చరుగ్ం సావిత్రం ద్వాదశకపాలం బార్హస్పత్యం చరుం త్వాష్ట్ర మష్టాకపాలం వైశ్వానరం ద్వాదశకపాలం దక్షిణో రథవాహనవాహో దక్షిణా సారస్వతం చరుం నిర్వపతి పౌష్ణం చరుం మైత్రం చరుం వారుణం చరుం క్షైత్రపత్యం చరు మాదిత్యం చరు ముత్తరో రథవాహనవాహో దక్షిణా ॥ ౧ ॥

(ఆగ్నేయగ్ం సౌమ్యం బార్హస్పత్యం చతుస్త్రిగ్ంశత్ ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే అష్టమప్రపాఠకే వింశోఽనువాకః ।

వేదార్థదీపిక

అవతారిక: ఏకోనవింశానువాకమునందు అవేష్టులు, పశుబన్ధనము, సాత్యదూత హవిస్సులు చెప్పఁబడినవి. ఈ వింశానువాకమునందు ప్రయుక్తుల హవిస్సులు చెప్పఁబడుచున్నవి.

1. అర్థము: (1)ఆగ్నేయమ్, అష్టాకపాలమ్, నిర్వపతి. (2)సౌమ్యమ్, చరుమ్, నిర్వపతి. (3)సావిత్రమ్, ద్వాదశకపాలమ్, నిర్వపతి. (4)బార్హస్పత్యమ్, చరుమ్, నిర్వపతి. (5)త్వాష్ట్రమ్, అష్టాకపాలమ్, నిర్వపతి. (6)వైశ్వానరమ్, ద్వాదశకపాలమ్, నిర్వపతి. దక్షిణః=ఈ పూర్వషట్కము(నకు,) రథవాహన వాహః=ఒక రథమును మోయు మఱియొక శకటమును వహించునట్టి యెద్దు, దక్షిణా. (7)సారస్వతమ్, చరుమ్, నిర్వపతి. (8)పౌష్ణమ్, చరుమ్, నిర్వపతి. (9)మైత్రమ్, చరుమ్, నిర్వపతి. (10)వారుణమ్, చరుమ్, నిర్వపతి. (11)క్షైత్రపత్యమ్=క్షేత్రపతి దేవతాకము, చరుమ్, నిర్వపతి. (12)ఆదిత్యమ్, చరుమ్, నిర్వపతి. ఉత్తరః=ఉత్తరషట్కమునకు, రథవాహనవాహః, దక్షిణా. (ప్రతిపదార్థము సుగమము కావున సమన్వయము మాత్రము చేయఁబడినది.)

తాత్పర్యము: ఈ మంత్రమున పంౘ్రెండు హవిస్సులు చెప్పఁబడినవి. ఇందు పూర్వషట్కము దక్షిణశబ్ద వాచ్యము. అపరాహ్ణమునందు పూర్వషట్కము హోమము చేయవలెను. ఈ కర్మయందు రథవాహనవాహమును దక్షిణగా నీయవలెను. ఒక శకటముయొక్క బోలును మఱియొక శకటమునకు కట్టినపుడు రెండవ శకటమును వహించు (లాగు) నట్టి యెద్దు రథవాహనవాహ మనఁబడును. రెండవ షట్కము ఉత్తరషట్క మనఁబడును. ఈ ఉత్తరషట్కము మఱునాడు హోమము చేయవలెను. దీనికిఁగూడ రథవాహనవాహమునే దక్షిణగా నీయవలెను. ఈ హవిస్సులలో ఒక్కొక్క హవిస్సును ఒక్కొక్క మాసమునందు చొప్పున ఫాల్గున మాసము మొదలు ప్రతి మాసమునందు హోమము చేయవలెనని బ్రాహ్మణమునందుఁ గలదు. తాత్పర్యము సుగమము.

వింశానువాకము సమాప్తము.

అథ ప్రథమకాణ్డే ఽష్టమ ప్రపాఠక ఏకవింశోఽనువాకః ।

మూలము: [1]స్వాద్వీం త్వా స్వాదునా తీవ్రాం తీవ్రేణామృతా మమృతేన సృజామి సగ్ం సోమేన సోమో ఽస్యశ్విభ్యాం పచ్యస్వ సరస్వత్యై పచ్యస్వేన్ద్రాయ సుత్రామ్ణే పచ్యస్వ [2]పునాతు తే పరిస్రుతగ్ం సోమగ్ం సూర్యస్య దుహితా। వారేణ శశ్వతా తనా। వాయుః పూతః పవిత్రేణ ప్రత్యఙ్ సోమో అతి ద్రుతః। ఇన్ద్రస్య యుజ్య స్సఖా। [3]కువి దఙ్గ యవమన్తో యవంచి ద్యథా దా న్త్యనుపూర్వం వియూయ। ఇహేహైషాం కృణుత భోజనాని (౧)యే బర్హిషో నమో వృక్తిం న జగ్ముః। [4]ఆశ్వినం ధూమ్ర మాలభతే సారస్వతం మేష మైన్ద్ర మృషభ [5]మైన్ద్ర మేకాదశకపాలం నిర్వపతి సావిత్రం ద్వాదశకపాలం వారుణం దశకపాలగ్ం సోమప్రతీకాః పితర స్తృప్ణుత[6]వడబా దక్షిణా ॥౨౧॥ (భోజనాని షడ్విగ్ంశతి శ్చ ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ఽష్టమప్రపాఠకే ఏకవింశోఽనువాకః॥

వేదార్థదీపిక

అవతారిక: వింశానువాకమునందు ప్రయుజాంహవిస్సులు చెప్పఁబడినవి. ఈ యేకవింశానువాకమునందు సౌత్రామణీమంత్రములు, పశువులు, హవిస్సులు చెప్పఁబడుచున్నవి.

1\. అర్థము: (హే సురే!=ఓ మద్యవిశేషమా!) స్వాద్వీమ్=మధురమును, తీవ్రామ్=ఘాటైన వాసన కలదానవును, అమృతామ్=అమృతమువలె ఆప్యాయతను కలుగఁజేయుదానవునగు, త్వా=నిన్ను, స్వాదునా=మధురమైనదియు, తీవ్రేణ=తీవ్రమైనదియు, అమృతేన=అమృతత్వమును పొందించునదియునగు, సోమేన=సోమాత్మకమైన బాలతృణముతో, సంసృజామి=కలుపుచున్నాను. (తత్=అందువలన, త్వమ్=నీవు) అశ్విభ్యామ్=అశ్వినీ దేవతలకొఱకు, పచ్యస్వ=పక్వ మగుము. సరస్వత్యై=సరస్వతీ దేవతకొఱకు, పచ్యస్వ=పక్వ మగుము. సుత్రామ్ణే=బాగుగ రక్షించువాఁడగు, ఇన్ద్రాయ=ఇంద్రునికొఱకు, పచ్యస్వ=పక్వ మగుము. బాలతృణము=లేఁత పచ్చగడ్డిపరక.)

తాత్పర్యము: సురయనెడి మద్యవిశేషమా! నీవు స్వాదువవు. ఘాటైన వాసన కలదానవు. అమృతమువలె ఆప్యాయతను గలిగించుదానవు. అట్టి నిన్ను, స్వాదువు, తీవ్రము, అమృతత్వమును పొందించునదియు నగు సోమాత్మక బాలతృణముతో కలుపుచున్నాను. కావున నీవు అశ్విన్యాది దేవతాత్రయముకొఱకు పక్వ మగుము. (పూర్వము

ఇంద్రుఁడు సోమాభిషవము చేయుటచే కలిగిన పాపముచేత అతని వీర్యము దశవిధములుగ భిన్నమై పడినది. ఆ దశవిధ వీర్యకళలలో శిరోభాగమునుండి పైకి వెడలిన వీర్యలేశము సోమ మయినది. పాయు గుహ్యములనుండి వెలువడిన వీర్యలేశము సుర యైనది. ఆ సురయే ఇచట సంబోధింపఁబడినది. సోమము వమనాద్యుపయుక్తమైన ఓషధి కావున తీవ్ర మయినదిగా వర్ణింపఁబడినది. (ఈ మంత్రము చెప్పుచు సురను సోమ సదృశములైన బాలతృణముల (పచ్చిగడ్డి) తో మిశ్రమము చేయవలెను.)

2. అర్థము: (హే ఇన్ద్ర!=ఓ యింద్రుఁడా!) తే=నీకొఱకు, సూర్యస్య=సూర్యునియొక్క, దుహితా=కుమార్తెవంటి దీప్తి, పరిస్రుతమ్=ద్రవీభూతమైన, సోమమ్=(పూర్వమంత్రముచే) సోమీకృతమైన సురాద్రవ్యమును, శశ్వతా=శాశ్వతమైనదియు, తనా=విస్తృతమైనదియునగు, వారేణ=వాలజన్య పవిత్రముచేత, పునాతు=శోధించుఁగాక. పవిత్రేణ=పవిత్రముచేత, పూతః=శోధితమైనదియు, ఇన్ద్రస్య=ఇంద్రునకు, యుజ్యః సఖా=యోగ్య మిత్రమైనదియునగు, సోమః=సోమము, వాయుః=వాయువువలె, ప్రత్యఙ్=అధోవర్తియై, పాత్రాభిముఖమగుచు, (అభితః=అంతటను,) అతిద్రుతః=శీఘ్రముగ ద్రుతమైనదిగా, (అభవత్=అయెను.)

తాత్పర్యము: ఓ ఇంద్రా! నీకొఱకు సూర్యునియొక్క దుహితృ స్థానీయమైన దీప్తి శాశ్వతము, విస్తృతమునైన వాలజన్య పవిత్రముచే ద్రవీభూతము, సోమీకృతమునైన సురాద్రవ్యమును శోధించుఁగాక (=పవిత్రము చేయుఁగాక). ఈ పవిత్రముచే పునీత మైనదియు, ఇంద్రునకు యోగ్యమిత్రమును నగు సోమము వాయువువలె శీఘ్రగామియు, అధోవర్తియునై పాత్రాభిముఖ మగుచు అంతటను శీఘ్రముగ ద్రుతమైనది. (ఈ మంత్రము చెప్పుచు పూర్వోక్త సురాద్రవ్యమును వాలమయమైన పవిత్రముచే శోధించవలెను. వాలజన్య పవిత్రము=గొఱ్ఱియొక్క రోమములచే చేయఁబడిన పవిత్రము.)

3. అర్థము: హే అఙ్గ!=ప్రీతిపాత్రములైన అశ్వి సరస్వతీ సుత్రామేంద్రులారా!, యథా=ఏ విధముగా, యవమన్తః=యవాది ధాన్యము కలిగిన కర్షకులు, కువిద్యవం చిత్=బహుళమైన యవధాన్యమును, గోధూమ ప్రియంగ్వాది ధాన్యములను గూడ, అనుపూర్వమ్=వరుసగా, వియూయ=(ఇది పక్వమైనది, ఇది పక్వము కాలేదని,) వేఱు చేసి, దాన్తి=కోయుచున్నారో, (తథా=ఆ విధముగ) యే=ఏ యజ్వలు, బర్హిషః=యాగముయొక్క, నమోవృక్తిమ్=నమస్కారవినాశమును, న జగ్ముః=పొందలేదో!, (తేషామ్=ఆ) ఏషామ్=ఈ యజ్వలయొక్క, భోజనాని=హవిర్విషయములైన భోజనములను, ఇహ + ఇహ=ఈ యీ పాత్రములందు, కృణుత=చేయుఁడు.

తాత్పర్యము: ఓ అశ్వి సరస్వతీ సుత్రామేంద్రులారా! లోకమునందు ధాన్యవంతులయిన కర్షకులు యవధాన్యమును; గోధూమ ప్రియంగ్వాది దాన్యమును కూడ ఏది కోయుటకు పక్వమైనది? ఏది పక్వము కాలేదు? అని పరీక్ష చేసి పక్వమైన ధాన్యమును (పైరును) కోయుచున్నారో, ఆ విధముగనే మీరును ఏ యజ్ఞకర్త యజ్ఞ సంబంధమైన నమస్కారోక్తిని పొందుచున్నాఁడు? ఏ యజ్వ పొందుటలేదు? అనఁగా ఏ యజ్వ నాస్తికుఁడు? ఏ యజ్వ ఆస్తికుఁడు? అని పరిశీలించి నమస్కారోక్తిని పొందిన (=ఆస్తికులైన) యజ్వలయొక్క హవీ రూపములైన యన్నములను ఈ యీ పాత్రములందు ఘటింపుఁడు. (ఈ మంత్రము చెప్పుచు మటియొక ఖరప్రదేశమునందుఁగల సురాపూరిత గ్రహము (పాత్రము) లను గ్రహించవలెను.)

4. అర్థము: ఆశ్వినమ్=అశ్వినీదేవ దేవతాకమైన, ధూమ్రమ్=ధూమ్రవర్ణము గల పశువును, ఆ లభతే=ఆలంభనము చేయవలెను. సారస్వతమ్=సరస్వద్దేవతాకమైన, మేషమ్=గొఱ్ఱెను, ఆ లభతే=ఆలంభనము చేయవలెను. ఐన్ద్రమ్=ఇంద్రదేవతాకమైన, ఋషభమ్=ఎద్దును, ఆ లభతే=ఆలంభనము చేయవలెను.

తాత్పర్యము: అశ్వినీ దేవ దేవతాకమైన ధూమ్రపశువును, సరస్వద్దేవతాకమైన మేషమును, ఇంద్ర దేవతాకమైన ఋషభమును ఆలంభనము చేయవలెను. (ఈ మంత్రము పశ్వాలంభన విధాయకము. ధూమ్రము=నలినమైన తెల్లని వర్ణము.)

8. అర్థము: ఐన్ద్రమ్=ఇంద్ర దేవతాకమైన, ఏకాదశ కపాలమ్=ఏకాదశ కపాల సంస్కృత పురోడాశమును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. సావిత్రమ్=సవితృ దేవతాకమైన, ద్వాదశ కపాలమ్=ద్వాదశ కపాల సంస్కృత పురోడాశమును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. వారుణమ్=వరుణ దేవతాకమైన, దశ కపాలమ్=దశ కపాల సంస్కృత పురోడాశమును, నిర్వపతి=నిర్వాపము చేయవలెను. సోమప్రతీకాః=సోమప్రభృతులైన, పితరః=పితృదేవతలు, తృప్యత=తృప్తి నొందుదురు గాక.

తాత్పర్యము: శ్రుతి నాల్గవ మంత్రము పశ్వాలంభనమును విధించఁగా ఈ మంత్రము పురోడాశమును విధించుచున్నది. సోమప్రభృతి పితృదేవతలు తృప్తినొందుదురుగాక. (దక్షిణాగ్నియందు శతాతృణ్ణమైన స్థాలినుంచి దాని బిలమునందు పవిత్రము నుంచి దానిపై శతమానమైన హిరణ్యము నుంచి "సోమప్రతీకాః పితర స్తృప్యత" అని పఠించి దానియందు సురాశేషము నుంచవలెను.

6. అర్థము: వడబా=ఆఁడుగుఱ్ఱము, దక్షిణా=(పైని చెప్పఁబడిన కర్మయందు,) దక్షిణ.

తాత్పర్యము: పైని చెప్పఁబడిన కర్మయందు ఆఁడుగుఱ్ఱమును (అశ్వయోషిత్) దక్షిణగా నీయవలెను.

ఏకవింశానువాకము సమాప్తము

అథ ప్రథమకాణ్డే ఽష్టమప్రపాఠకే ద్వావింశోఽనువాకః।

మూలము: [1]అగ్నావిష్ణూ మహి తద్వాం మహిత్వం వీతం ఘృతస్య గుహ్యాని నామ దమేదమే సప్త రత్నా దధానా ప్రతి వాం జిహ్వా ఘృత మా చరణ్యేత్ [2]అగ్నావిష్ణూ మహి ధామ ప్రియం వాం వీథో ఘృతస్య గుహ్యా జుషాణా। దమేదమే సుష్టుతీ ర్వావృధానా ప్రతి వాం జిహ్వా ఘృత ముచ్చరణ్యేత్। [3]ప్ర ణో దేవీ సరస్వతీ వాజేభి ర్వాజినీవతీ। ధీనా మవిత్ర్యవతు। [4]ఆ నో దివో బృహతః (౧) పర్వతాదా సరస్వతీ యజతా గన్తు యజ్ఞమ్। హవం దేవీ జుజుషాణా ఘృతాచీ శగ్మాం నో వాచ ముశతీ శృణోతు। [5]బృహస్పతే జుషస్వ నో హవ్యాని విశ్వదేవ్య। రాస్వ రత్నాని దాశుషే [6]ఏవా పిత్రే విశ్వదేవాయ వృష్ణే యజ్ఞై ర్విధేమ నమసా హవిర్భిః। బృహస్పతే సుప్రజా వీరవన్తో వయగ్ం స్యామ పతయో రయీణామ్। [7]బృహస్పతే అతి యదర్యో అర్హా ద్యుమ ద్విభాతి క్రతుమ జ్జనేషు। యద్దీదయ చ్ఛవసా (౨)ఋతప్రజాత తదస్మాసు ద్రవిణం ధేహి చిత్రమ్। [8]ఆ నో మిత్రావరుణా ఘృతై ర్గవ్యూతి ముక్షతమ్। మధ్వా రజాగ్ంసి సుక్రతూ। [9]ప్ర బాహవా సిసృతం జీవసే న ఆ నో గవ్యూతి ముక్షతం ఘృతేన। ఆ నో జనే శ్రవయతం యువానా శ్రుతం మే మిత్రావరుణా హవేమా। [10]అగ్నిం వః పూర్వ్యం గిరా దేవ మీడే వసూనామ్। సపర్యన్తః పురుప్రియం మిత్రం న క్షేత్రసాధసమ్। [11]మక్షూ దేవవతో రథః (౩)శూరోవా పృత్సు కాసు చిత్। దేవానాం య ఇన్మనో యజమాన ఇయక్ష త్యభీ దయజ్వనో భువత్। [12]న యజమాన రిష్యసి న సున్వాన న దేవయో। [13]అస దత్ర

సువీర్య ముత త్యదాశ్వశ్వియమ్। [14]న కి ష్టం కర్మణా నశ న్న ప్ర యోషన్న యోషతి।
[15]ఉప క్షర న్తి సిన్ధవో మయోభువ ఈజానం చ యక్ష్యమాణం చ ధేనవః। పృణ న్తం చ పపు
రిం చ (శ)శ్రవస్యవో ఘృతస్య ధారా ఉప యన్తి విశ్వతః। [16]సోమారుద్రా వి వృహతం
విషూచీ మమీవా యా నో గయ మావివేశ। ఆరే బాధేథాం నిర్ ఋతిం పరాచైః కృతం
చిదేనః ప్ర ముముక్త మస్మత్। [17]సోమారుద్రా యువ మేతా న్యస్మే విశ్వా తనూషు భేషజాని
ధత్తమ్। అవ స్యతం ముఞ్చతం యన్నో అ స్తి తనూషు బద్ధం కృత మేనో అస్మత్। [18]సోమా
పూషణా జననా రయీణాం జననా దివో జననా పృథివ్యాః। జాతౌ విశ్వస్య భువనస్య గోపౌ
దేవా అకృణ్వ న్నమృతస్య నాభిమ్। [19]ఇమౌ దేవౌ జాయమానౌ జుష న్తేమౌ తమాగ్ంసి
గూహతా మజుష్టా। ఆభ్యా మిన్ద్రః పక్వ మామా స్వ న్త స్సోమాపూషభ్యాం జన దుస్రియాసు(౫)॥
(బృహతః శవసా రథః పపురిం చ దివో జననా పఞ్చవిగ్ంశతి శ్చ।)

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకేఽష్టమ ప్రపాఠకే ద్వావింశోఽనువాకః।

(అనుమత్యా ఆగ్నేయ మైన్ద్రాగ్న మగ్నయే సోమాయ ప్రతిపూరుష మైన్ద్రాగ్నం ధాత్రే
బార్హస్పత్య మగ్నయే గృహపతయే ఽర్థేతో దేవీః సమిధగ్ం సోమస్యేన్ద్రస్య మిత్ర ఆగ్నే
యగ్ం సద్య ఆగ్నేయగ్ం హిరణ్య మాగ్నేయగ్ం స్వాద్వీం త్వా ఽగ్నావిష్ణూ ద్వావిగ్ం
శతిః ॥ ౨౨ ॥

(అనుమత్యై యథాఽసతి దేవీరాపో మిత్రోఽసి శూరో వా ద్విచత్వారిగ్ంశత్ ॥ ౪౨ ॥)

హరిః ఓమ్

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకే ఽష్టమః ప్రపాఠకః ॥౮॥

ఇతి కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయ సంహితాయాం ప్రథమాష్టకః ॥౧॥

వేదార్థ దీపిక

అవతారిక: ఏకవింశానువాకమునందు సౌత్రామణికర్మము చెప్పి రాజసూయము సమాప్తి చేయఁబడినది. ఈ ద్వావింశానువాకమునందు కామ్యములైన యాజ్యా పురోనువాక్యలు చెప్పఁబడుచున్నవి.

1. **అర్థము:** హే అగ్నావిష్ణూ!=ఓ అగ్నివిష్ణులారా!, వామ్=మీ ఉభయులయొక్క, తత్ మహిత్వమ్=ఆ వక్ష్యమాణ మహిమోపేతత్వము, మహి=పూజనీయమైనది. (మన్త్రేషు=మంత్రములందలి) ఘృతస్య=ఆజ్యమునకు, గుహ్యాని నామ='వృషదాజ్యమ్', 'సర్పిః', ఇత్యాది గోప్యములైన, నామధేయములను, (యువామ్=మీరు) దమే దమే=(యజమానులయొక్క,) ప్రతి గృహమునందు, వీతమ్=పొందుఁడు. (కించ=మఱియు,) వామ్=మీయొక్క, సప్త రత్నా దధానా=సప్త సంఖ్యాకములయిన రత్నసదృశ జ్వాలావిశేషములను ధరించుచున్న, జిహ్వా=నాలుకలు, ఆ(గత్య)=వచ్చి,(=పొంది) ప్రతి=ప్రత్యేకముగ, ఘృతమ్=ఆజ్యమును, చరణ్యేత్=భక్షించుఁగాక(=త్రాగుఁగాక).

తాత్పర్యము: ఓ అగ్నావిష్ణు దేవతలారా! మీ ఉభయులయొక్క, వక్ష్యమాణ మహత్త్వము పూజనీయమైనది. మంత్రములందు గోప్యములైయున్న ఘృతముయొక్క 'వృషదాజ్యము', 'సర్పిస్సు' ఇత్యాది నామధేయములను యజమానుల గృహముల నన్నిటియందు పొందుఁడు. అనఁగా—"పశూనాం తేజసాఽగ్నయే జుష్ట మభిఘార యామి" "ఆయుర్దా అగ్నే..........ఘృతయోని రేధి" ఇత్యాది మంత్రములను వినుఁడు. మఱియు రత్నసదృశములైన సప్త సంఖ్యాక జ్వాలావిశేషములను ధరించుచున్న మీ నాలుకలు ప్రత్యేకముగ ఘృతమును పొంది త్రాగుఁగాక. (అగ్నికి చెప్పఁబడిన యీ విశేషము ఛత్రిన్యాయముచే అగ్నిసాహిత్యమువలన విష్ణువునకుఁ గూడఁజెందును. కామ్యేష్టికాండమునందు త్రిహవిష్కమైన ఒక యిష్టి చెప్పఁబడినది. అందు ప్రథమ హవిస్సునకు ఇది పురోనువాక్య. గుహ్యాని నామ=గుహ్యాని నామాని, వాం జిహ్వా=వాం జిహ్వే.)

2. **అర్థము:** హే అగ్నావిష్ణూ!=ఓ అగ్నావిష్ణు దేవతలారా!, వామ్=మీయొక్క, ప్రియం ధామ=యజ్ఞశాలారూప ప్రియమైన స్థానము, మహి=పూజనీయమైనది. దమే దమే=సర్వ యజమాన గృహములందు, సుష్టుతీః=శోభనములైన స్తోత్రములను, వావృధానా=వృద్ధి నొందించుచున్న, (యువామ్=మీరు,) ఘృతస్య=ఘృతముయొక్క, గుహ్యా=యోగ్యమైన (సారమ్=అభిఘారణరూప సారమును,) జుషాణా=సేవించుచున్నవారై, వీథః=(పురోడాశమును,) భక్షింపుఁడు. శేషము పూర్వవత్తు.

తాత్పర్యము: ఓ అగ్నావిష్ణు దేవతలారా! యజ్ఞశాలారూపమైన మీ ప్రియమైన స్థానము పూజనీయమైనది. మీరు సర్వ యజమానగృహములందు "ఆయుర్దా అగ్నే" ఇత్యాది శోభన స్తోత్రములను వృద్ధినొందించుచున్నవారును, ఆజ్యముయొక్క యోగ్యమైన అభిఘారణరూప సారమును సేవించుచున్నవారునునై పురోడాశమును భక్షింపుఁడు. (మిగిలినది 1వ మంత్రమున చెప్పఁబడినది. ఇది ప్రదమ హవిస్సునకు యాజ్య.)

3. **అర్థము:** వాజినీవతీ=అన్నప్రదమైన యాగక్రియ కలదియు, ధీనామ్=(యజ్ఞవిషయకములైన మా) బుద్ధులను, అవిత్రీ=రక్షించునదియునగు, సరస్వతీ దేవీ=సరస్వతీ దేవి, వాజేభిః=అన్నములచేత, నః=మమ్ము, ప్ర+అవతు=ప్రకృష్టముగ రక్షించుఁగాక.

తాత్పర్యము: అన్నప్రదమైన యాగక్రియ కలదియు, యజ్ఞవిషయకములైన మా బుద్ధులను పాలించునదియునగు సరస్వతీ దేవి అన్నములచే మమ్ము ప్రకృష్టముగ రక్షించుఁగాక. (ఇది ద్వితీయ హవిస్సునకు పురోనువాక్య.)

4. **అర్థము:** యజతా=యాగోద్దేశ్యయగు, సరస్వతీ=సరస్వతీ దేవి, నః=మాయొక్క, యజ్ఞం ప్రతి=యజ్ఞమును గూర్చి, దివః=ద్యులోకమునుండి, ఆగన్తు=వచ్చుఁగాక. బృహతః=గొప్పదియైన, పర్వతాత్=(మేరు) పర్వతమునుండి, ఆగన్తు=వచ్చుఁగాక. హవమ్=మా యాహ్వానమును, జుజుషాణా=సేవించుచున్నదియు, ఘృతాచీ=ఘృతమును పొందుచున్నదియునైన, దేవీ=(వచ్చిన) సరస్వతీదేవి, శగ్మామ్=సుఖప్రాపకమైన, నః=మాయొక్క, వాచమ్=స్తుతిరూప వాక్కును, ఉశతీ=కోరుచున్నదియై, శృణోతు=వినుఁగాక.

తాత్పర్యము: యాగోద్దేశ్యభూత సరస్వతీదేవి మా యజ్ఞమునకు ద్యులోకమునుండి, గొప్పదియగు మేరువునుండియు వచ్చుఁగాక. ద్యులోకమునఁగాని, మేరువునఁగాని ఉన్నను సరస్వతి తప్పక మా యజ్ఞమునకు వచ్చుఁగాక యని భావము. ఆ వచ్చిన సరస్వతీదేవి మా యాహ్వానమును మన్నించినదియు, ఘృతమును పొందినది యునై సుఖమును కలుగఁజేయు మా స్తుతిరూప వాక్కును కోరికతో వినుఁగాక. (ఇది ద్వితీయ హవిస్సు యొక్క యాజ్య.)

5. అర్థము: విశ్వదేవ్య!=సర్వదేవతలకు హితుఁడవైన, హే బృహస్పతే!=ఓ బృహస్పతీ!, నః=మాయొక్క, హవ్యాని= హవిస్సులను, జుషస్వ=సేవించుము. దాశుషే=హవిస్సు నిచ్చుచున్న యజమానునికొఱకు, రత్నాని=రత్న ములను, రాస్వ=ఒసఁగుము.

తాత్పర్యము: సర్వదేవతలకు హితుఁడవయిన ఓ బృహస్పతీ! మా హవిస్సులను సేవింపుము. హవిస్సు నిచ్చుచున్న యజ మానునకు రత్నముల నొసఁగుము. (ఇది తృతీయ హవిస్సుయొక్క పురోనువాక్య.)

6. అర్థము: ఏవా=మఱియు, హే బృహస్పతే!=ఓ బృహస్పతీ! పిత్రే=తండ్రివలె పరిపాలకుఁడవును, విశ్వదేవాయ=సర్వ దేవతలకు గురువును, వృష్ణే=అభిమత ఫలములను వర్షించువాఁడవునగు, (తుభ్యమ్=నీకొఱకు,) యజ్ఞైః= బహువిధ యాగములచేతను, నమసా=భక్తిపూర్వక నమస్కారములచేతను, హవిర్భిః=ఆజ్యపురోడాశాది హవి స్సులచేతను, (పరిచర్యామ్=సేవను,) విధేమ=చేయుదుము. (త్వదనుగ్రహాత్=నీ యనుగ్రహమువలన,) వయమ్=మేము, సుప్రజాః=శోభన సంతానవంతులము, వీరవన్తః=శూరులైన భటులు కలవారమును, రయీణామ్=ధనములకు, పతయః=అధిపతులమును, స్యామ=అగుదుము గాక.

తాత్పర్యము: ఓ బృహస్పతీ! నీవు తండ్రివలె మమ్ము పాలించువాఁడవు. సర్వదేవతలకు గురువవు. మా కభిమత ఫలముల నొసఁగువాఁడవు. అట్టి నీకు అనేక యాగములచేతను, భక్తిపూర్వక నమస్కారములచేతను, హవిస్సుల చేతను పరిచర్య నాచరింతుము. (నీ యనుగ్రహమువలన మేము మంచి సంతానము కలవారము, శూరభటో పేతులము, ధనముల కధిపతులము అగుదుము గాక. ఇది తృతీయ హవిస్సుయొక్క యాజ్య.)

7. అర్థము: హే బృహస్పతే!=ఓ బృహస్పతీ!, అర్యః=రాజు, యత్ ద్రవిణమ్=ఏ రత్నాదిరూప ధనమును, అతి=(ఇతరు లను) అతిక్రమించి, అర్హాత్=(స్వయముగనే అనుభవించుటకు) అర్హుఁ డగుచున్నాఁడో, యత్=ఏ ధనము, (అస్మజ్జనేషు=అమాత్యాదులయందు.) ద్యుమత్=భూషణాదికముగ, విభాతి=ప్రకాశించుచున్నదో, జనేషు= యజమానరూప జనులయందు, క్రతుమత్=యాగసాధనము కలదిగ, విభాతి=ప్రకాశించుచున్నదో, యత్= ఏ ధనము- శవసా=సైన్యరూప బలముచే, దీదయత్=దీపించుచున్నదో, తత్=అది, చిత్రమ్=మణిముక్తాది రూపమైనది. హే ఋతప్రజాత!=సత్యస్వరూపమైన పరమాత్మనుండి ప్రకృష్టముగ (దేవగురువుగా,) ఉద్భ వించిన బృహస్పతీ! తత్=ఆ ధనమును, అస్మాసు=మా యందు, ధేహి=స్థాపించుము.

తాత్పర్యము: ఓ బృహస్పతీ! రాజు ఇతరుల నతిక్రమించి రత్నాదిరూప ధనమును స్వయముగ అనుభవించుట కర్హుఁడై యున్నాఁడు. అది అమాత్యాది జనులదగ్గఱ ఆభరణ రూపముగ నున్నది. యజమానులదగ్గఱ యాగ- సాధనముగ ప్రకాశించుచున్నది. మఱియు ఆ ధనము సైన్యరూప బలముచే ప్రకాశించుచున్నది కూడ. అది మణిముక్తాది-రూపమైనది. సత్యస్వరూపమైన పరమాత్మనుండి దేవగురువుగా ఉద్భవించిన ఓ బృహస్పతీ! ఆ ధనమును మా కొసఁగుము. (ఈ యాజ్యానువాక్యయు పూర్వోక్త హవిస్సునకు సంబంధించినదియే.)

8. అర్థము: హే మిత్రావరుణా!=ఓ మిత్రావరుణదేవతలారా, నః గవ్యూతిమ్=మా గోయూథమును, ఘృతైః=ఆజ్యము మున్నగువానిచే, ఉక్షతమ్=తడుపుఁడు.(సేచనము చేయుఁడు.) సుక్రతూ=శోభనక్రతు యుక్తులై, రజాంసి= (మా సంబంధమైన,) క్షేత్రధూళులను, మధ్వా=మధురమైన జలముతో, ఆ + ఉక్షతమ్=అంతటను తడుపుఁడు.

తాత్పర్యము: ఓ మిత్రావరుణ దేవతలారా! మా గోయూథమును ఆజ్యము మున్నగువానిచే తడుపుఁడు. శోభన క్రతు యుక్తులై మా క్షేత్రధూళిని మధురజలముతో అంతటను తడుపుఁడు. (మైత్రావరుణ దేవతాకమైన ఒక కామ్యేష్టికి ఇది పురోనువాక్య.)

9. అర్థము: హే మిత్రావరుణా!=ఓ మిత్రావరుణ దేవతలారా!, నః=మా యొక్క, జీవసే=జీవనము కొఱకు, బాహవా=ధనపూర్ణమైన బాహువుతో, ప్ర సిస్రృతమ్=ప్రకర్షగా రండు. ఆ(గత్యచ)=వచ్చియు, నః=మా యొక్క, గవ్యూతిమ్=గోయూథమును, ఘృతేన=ఆజ్యముతో, ఉక్షతమ్=తడుపుఁడు. హే యువానా!=పరస్పరము కలిసియున్న మిత్రావరుణ దేవతలారా!, (యువామ్=మీరు,) జనే=బ్రాహ్మణాది యజమాన సభయందు, నః=మమ్ము, శ్రవయతమ్=తెలియవలచుఁడు. హే మిత్రావరుణా!=ఓ మిత్రావరుణ దేవతలారా!, మే=నా యొక్క, ఇమా=ఈ, హవా=ఆహ్వానమును, శ్రుణుతమ్=వినుఁడు. (హవా + ఇమా=హవేమా. ఇమాం హవామ్. ఇత్యర్థః. బాహవా=బాహునా.)

తాత్పర్యము: ఓ మిత్రావరుణ దేవతలారా! మేము జీవించుటకై ధనపూర్ణమైన బాహువుతో అతిశయముగ రండు. వచ్చియు మా గోయూథమును ఘృతముచే తడుపుఁడు. పరస్పరము కలిసియున్న మిత్రావరుణ దేవతలారా! బ్రాహ్మణాది యజమాన సభయందు మీరు మమ్ము తెలియఁజేయుఁడు. ఓ మిత్రావరుణ దేవతలారా! మా యీ ఆహ్వానమును వినుఁడు. (పైయిష్టికే యిది యాజ్య. బాహవా, హవా, ఇమా ఇత్యాదులు వైదికైక ప్రయోగములు.)

10. అర్థము: వసూనామ్=వసువులైన, వః=మీలో, పూర్వ్యమ్=పూర్వుఁడును, పురుప్రియమ్=పురోడాశప్రియుఁడును, మిత్రంన=మిత్రునివలె, క్షేత్రసాధసమ్=మా క్షేత్రమునకు సాధకుఁడునైన, అగ్నిందేవమ్=అగ్నిదేవుని,సపర్యన్తః=యాగసమాప్తిపర్యంత మున్నటువంటి, (అహమ్=నేను,) గిరా=వైదిక వాక్కుచేత, ఈడే=స్తోత్రము చేయుచున్నాను.

తాత్పర్యము: వసువులయిన మీలో ప్రథముఁడును పురోడాశప్రియుఁడును, పితృ భ్రాత్రా ద్యాత్మక మిత్రునివలె మా క్షేత్రమునకు సాధకుఁడునైన అగ్నిదేవుని యాగసమాప్తివఱకు ఉన్నట్టి నేను స్తోత్రము చేయుచున్నాను. ఒకమారు స్తుతించి విరమించువాఁడను కానని భావము. (సోమా రుద్ర దేవతాక చరువు గల ఇష్టివిశేషమునందు ఆమ్నాతములైన ఆఱు ఋక్కులలో నిది ప్రథమ ఋక్కు.)

11. అర్థము: కాసు చిత్ పృత్సు=కొన్ని సంగ్రామములందు, శూరోవా=శూరుఁడైన భటుఁడువలె, దేవవతః=యాగోద్దేశ్య దేవతతో కూడిన యజమానునియొక్క, మనః=మనస్సు, రథః(ఇవ)=రథమువలె, మక్షూ=శీఘ్రముగా, (గచ్ఛతి=పోవుచున్నది.) య ఇత్ యజమానః=ఏ యజమానుఁడైతే, దేవానామ్=దేవతలయొక్క, మనః=మనస్సును, ఇయక్షతి=పూజించుట కిచ్ఛయించుచున్నాఁడో, (స ఏవ=ఆ యజమానుఁడే,) అయజ్వనః=యాగరహిత పురుషులను, అభి భువదిత్=నిశ్చయముగ పరిభవించుచున్నాఁడు.

తాత్పర్యము: రామరావణయుద్ధములవలె అత్యంతాభినివేశముతో ప్రవర్తించుచున్న కొన్ని యుద్ధములందలి శూరభటుఁడువలె యక్ష్యమాణ దేవతోపేతుఁడైన యీ యజమానునియొక్క మనఃప్రవృత్తి రథమువలె శీఘ్రముగ పోవుచున్నది. ఏ యజమానుఁడైతే దేవతల మనస్సును పూజించుట కిచ్ఛయించుచున్నాఁడో, (=దేవతల చిత్తప్రసాదమును కోరుచున్నాఁడో,) ఆ యజమానుఁడే యాగరహితపురుషులను నిశ్చయముగ అభిభవించుచున్నాఁడు. (రామరావణాది యుద్ధములవలె అత్యంతాభినివేశముతో ప్రవృత్తమైన యుద్ధమునందు శూరుఁడైన భటుఁడు తన శరీరమును మఱచి పరసేనను వధించుటకు శీఘ్రముగ పరుగిడువిధముగ ఈ యజమానుని మనోవృత్తి కూడ దేవతల నుద్దేశించి యాగముచేయుటకు రథమువలె శీఘ్రముగ పోవుచున్నదని భావము. ఈ ఋక్కునందలి "దేవానాం యు ఇన్మన" ఇత్యాదికమైన ఉత్తరార్ధము 12, 13 ఋక్కులందుఁగూడ అనువర్తించును. ఇది ద్వితీయ ఋక్కు.)

12. అర్థము: హే యజమాన!=ఓ యజమానుఁడా!, (త్వమ్=నీవు, యాగం కృత్వా=యాగము చేసి) న రిష్యసి=నశించుట లేదు. (ఇచట ఇష్టికర్తయే యజమానుఁడు.) హే సున్వాన!=ఓ సోమయాజీ!, (త్వమ్=నీవు,) న రిష్యసి=నశించుట లేదు. హే దేవయో!=పాకయజ్ఞాదులచే దేవతలను కోరుచున్న పాకయాజీ! (త్వమ్=నీవు,) న రిష్యసి=నశించుట లేదు. 11వ మంత్రముయొక్క ఉత్తరార్ధము నిచటి కనువర్తింపఁజేయవలెను. అర్థతాత్పర్యములు పూర్వోక్తములే.

తాత్పర్యము: ఓ యజమానుఁడా!, (=ఇష్టికర్తా!) నీవు యాగము చేసి నశించవు. ఓ సోమయాజీ! నీవు నశించవు. పాకయజ్ఞాదులచే దేవతలను కోరుచున్న పాకయాజీ! నీవు నశించవు. (ఇది తృతీయ ఋక్కు.)

13. అర్థము: అత్ర=ఈ యజమానునియందు, సువీర్యమ్=మంచిసామర్థ్యము, అసత్=ఉండుఁగాక. ఉత=మఱియు, ఆశ్వశ్వీయమ్=శీఘ్రగాములగు అశ్వముల సంబంధమైన, త్యత్=ఆ మంచి సామర్థ్యము, అస్తు=ఉండుఁగాక. (11వ మంత్రమునందలి ఉత్తరార్ధము ననువర్తింపఁజేసికొనవలెను. అర్థతాత్పర్యములు పూర్వోక్తములు.)

తాత్పర్యము: ఈ యజమానునియందు మంచిసామర్థ్య ముండుఁగాక. శీఘ్రగాములైన అశ్వముల సంబంధియైన మంచి సామర్థ్య ముండుఁగాక. ఇది చతుర్థ ఋక్కు.)

14. అర్థము: కర్మణా(సహితమ్)=కర్మతో కూడిన, తమ్=ఆ యజమానుని, (రాక్షసాదిః=రాక్షసాదికము) నకిర్నశత్=నశింపఁజేయకుండుఁగాక. (యజ్ఞవిరోధీ పాప్మా=యజ్ఞవిరోధియగు పాపము, యజమానేన సహ=యజమానునితో కూడ,) ప్ర=ప్రకర్షగా, న యోషత్=కలియకుండుఁగాక. (యజమానోఽపి=యజమానుఁడు కూడ, పాప్మనా=పాపముతో) న యోషతి=కలియుటలేదు.

తాత్పర్యము: కర్మసహితుఁడైన యజమానుని రాక్షసాదికము నశింపఁజేయకుండుఁగాక. యజ్ఞవిరోధియగు పాపము యజమానునకు చెందకుండుఁగాక. యజమానుఁడు కూడ పాపమును పొందకుండుఁగాక. (ఈ ఋక్కునందుఁగూడ 11వ మంత్రములోని ఉత్తరార్ధము అనువృత్త మగును. అర్థతాత్పర్యములు పూర్వోక్తములే. ఇది యైదవ ఋక్కు.)

15. అర్థము: సిన్ధవః=నదీ సదృశములును. మయోభువః=సుఖమును కలుగఁజేయునవియునగు, ధేనవః=గోవులు, ఈజానమ్=(ఇతఃపూర్వము) యజ్ఞము చేసినవాఁడును, చ=మఱియు, యక్ష్యమాణమ్=(ఇఁకముందు) యజ్ఞము చేయఁబోవువాఁడునగు, (పురుష మేనమ్=ఈ పురుషుని,) ఉపేత్య=పొంది, క్షరన్తి=పాలను స్రవించుచున్నవి (=అధికముగ క్షీరము నిచ్చుచున్నవి). పృణన్తమ్=(ఈ కర్మయందు జుహువును,) పూరించుచున్నవాఁడును, చ=మఱియు, పపురిమ్=(హవిష్మంతములయిన కర్మలందు,) పూరింపఁబోవువాఁడునగు, (యజమానమ్=యజమానుని,) శ్రవస్యవః=వినుట కిచ్ఛయించుచున్నవి వలె, ఘృతస్య=ఆజ్యముయొక్క, ధారాః=ధారలు, విశ్వతః=అంతటను, ఉప యన్తి=సమీపమును పొందుచున్నవి.

తాత్పర్యము: నదీ సదృశములును, సుఖప్రదములునగు ధేనువులు ఇతఃపూర్వము యజ్ఞము చేసినవాఁడును, ఇఁకముందు యజ్ఞము చేయువాఁడునైన యీ పురుషుని చేరి యధికముగ క్షీరము నిచ్చుచున్నవి. ఈ కర్మయందు జుహువు నాజ్యముతో పూరించుచున్నవాఁడును, ఇఁకముందు పూరింపఁబోవువాఁడునగు యజమానుని వినుట కిచ్ఛయించుచున్నవివలె నేతిధారలు అంతటను సమీపమును పొందుచున్నవి. (ఇది యాఱవ ఋక్కు).

16. అర్థము: యా అమీవా=ఏ రోగరూపమయిన నిర్ఋతి, నః=మాయొక్క, గయమ్=గృహమును, ఆ వివేశ=ప్రవేశించెనో, హే సోమారుద్రా!=ఓ సోమ రుద్రదేవతలారా! (తామ్=ఆ నిర్ఋతిని) విషూచీమ్=నానాదిక్కులందు గతి కల దానినిగా, వి వృహతమ్=విశేషముగ పోఁగొట్టుఁడు. పరాచైః=పరాఙ్ముఖియైన, నిర్ఋతిమ్=(ఆ) నిర్ఋతిని, ఆరే=దూరమునందు, (యువామ్=మీరు) బాధేథామ్=బాధించుఁడు. (తయా=ఆ నిర్ఋతిచేత,) కృతమ్=(మావిషయమై) చేయఁబడిన, ఏనశ్చిత్=రోగరూప పాపమును గూడ, అస్మత్=మానుండి, ప్రముముక్తమ్=ప్రకర్షగా తొలఁగించుఁడు. (సోమారుద్రా=సోమారుద్రౌ. పరాచైః=పరాఙ్ముఖీమ్.)

తాత్పర్యము: ఓ సోమారుద్రదేవతలారా! మా గృహమును ప్రవేశించి రోగరూప నిర్ఋతిని నానాదిక్కులందు పారిపోవు దానినిగా నశింపఁజేయుఁడు. పరాఙ్ముఖియైన ఆ నిర్ఋతిని మీరు దూరమునందే బాధించుఁడు. ఆ నిర్ఋతి మాకు చేసిన రోగరూపపాపమును మీరు మానుండి తొలఁగించుఁడు. (ఇది పురోనువాక్య.)

17. అర్థము: హే సోమారుద్రౌ!=ఓ సోమ రుద్ర దేవతలారా!, యువమ్=మీరుభయులు, అస్మే=మాయొక్క, తనూషు=శరీరములందు, విశ్వా=సమస్తములైన, ఏతాని భేషజాని=ఈ ఔషధములను, ధత్తమ్=స్థాపించుఁడు. (తైః భేషజైః=ఆ యౌషధములచే, అనిష్టమ్=అనిష్టమును,) అవస్యతమ్=నశింపఁజేయుఁడు. (నిర్‌ఋత్యా=నిర్‌ఋతిచే,) కృతమ్=చేయఁబడినదియు, తనూషు=(మా) శరీరములందు, బద్ధమ్=అంటియున్నదియు నగు, యత్ ఏనః=ఏ రోగరూప పాపము (అస్తి=కలదో, తత్=దానిని,) అస్మత్=మానుండి, ముఞ్చతమ్=తొలఁగించుఁడు.

తాత్పర్యము: ఓ సోమ రుద్ర దేవతలారా! మీరుభయులు మా శరీరములందు సమస్తములైన ఓషధులను స్థాపించుఁడు. ఆ యౌషధములచేత అనిష్టమును నశింపఁజేయుఁడు. నిర్‌ఋతి మాకు చేసినదియు, మా శరీరములం దంటి యున్నదియునైన రోగరూప పాపమును మానుండి తొలఁగించుఁడు. (యువమ్=యువామ్. అస్మే=అస్మాకమ్. విశ్వా=విశ్వాని. ఇది యాజ్య.)

18. అర్థము: హే సోమాపూషణా!=ఓ సోమ పూష దేవతలారా!, రయీణామ్=ధనములను, (కర్మణి షష్ఠి.) జననా=పుట్టించినవారును, దివః=ద్యులోకమును, జననా=పుట్టించినవారును, పృథివ్యాః=పృథివీ లోకమును, జననా=పుట్టించినవారును, జాతౌ=పుట్టినవారై, విశ్వస్య భువనస్య=సమస్త లోకమునకు, గోపౌ=రక్షకులు నగు, (యువామ్) దేవాః=దేవతలయిన మీరు, అమృతస్య=కర్మఫలమునకు, నాభిమ్=బన్ధన రజ్జువును, (ముడిత్రాడు,) అకృణ్వన్=చేసిరి.

తాత్పర్యము: ఓ సోమ పూష దేవతలారా! మీరు ధనమును ద్యావా పృథువులను పుట్టించినవారు. పుట్టుచునే సర్వలోకమును రక్షించినవారు. అట్టి మీరు కర్మఫలమునకు బన్ధన రజ్జువును జేసిరి. సోమ పూష దేవతలచేత యజమానునియందు కర్మఫలము బంధింపఁబడుచున్నదనుట ప్రసిద్ధము. ("ణహ=బన్ధనే" అను ధాతువునుండి నాభి శబ్దము ఉత్పన్నమైనది. కావున బన్ధన సాధనమైన రజ్జువు అని యర్థము చెప్పఁబడినది. సోమాపూషణా=సోమాపూష్ణౌ. జననా=జనయితారౌ. ఇది పురోనువాక్య.)

19. అర్థము: (సర్వే దేవాః=సర్వ దేవతలు,) జాయమానౌ=పుట్టుచున్న, ఇమౌ దేవౌ=ఈ సోమ పూష దేవతలను, జుషన్త=(=జుషన్తే) సేవించుచున్నారు. ఇమౌ=ఈ దేవతలు, అజుష్టా=(=అజుష్టాని) అప్రియములైన, తమాంసి=బుద్ధి మాంద్యములను, గూహతామ్=నశింపఁజేయుదురుగాక. ఇన్ద్రః=ఇంద్రుఁడు, ఆభ్యామ్=ఈ సోమ పూష దేవతలచేత, ఆమాసు=తరుణులైన, ఉస్రియాసు=ఆవులయందు, అన్తః=లోపల, పక్వమ్=క్షీరమును, జనత్=(=జనయతి) పుట్టించుచున్నాఁడు.

తాత్పర్యము: సర్వదేవతలు ఈ సోమపూషదేవతలను పుట్టుచున్న సమయముననే సేవించుచున్నారు. ఈ యుభయులు అప్రియములయిన బుద్ధిమాంద్యములను నశింపఁజేయుదురు గాక. ఇంద్రుఁడు ఈ సోమ పూష దేవతలచేత తరుణ వయస్సులోనున్న గోవులందు లోపల క్షీరమును పుట్టించుచున్నాఁడు. గోవులు సారవంతమయిన భూమియందు సోముని (=చంద్రుని)చే వృద్ధిఁబొందిన ఓషధులను భక్షించి బహు నవనీతము (వెన్న) తోఁగూడిన క్షీరమును ధరించుచున్నవి యని భావము. (సోమః=చంద్రుఁడు. పూషా=సూర్యుఁడు. ఇది యాజ్య.)

అష్టమప్రపాఠకము సమాప్తము.

ప్రథమ కాండము సమాప్తము.

ఓమ్

—: ప్రథమకాణ్డ విషయ సమీక్ష :—

వేదము పూర్వోత్తర కాండముల భేదముచే రెండు విధములుగా ఉన్నది. పూర్వకాండమునందు నిత్య నైమిత్తిక కామ్య నిషిద్ధ రూపమైన చతుర్విధ కర్మ ప్రతిపాదింపఁబడినది, "యావజ్జీవ మగ్నిహోత్రం జుహోతి" ఇత్యాదికము నియత నిమిత్తము కలదగుటచే నిత్యము. ఇచట యావజ్జీవ మనునది నియత నిమిత్తము. "యస్య గృహాన్దహత్యగ్నయే క్షామవతే పురోడాశ మష్టాకపాలం నిర్వపేత్" ఇత్యాదికము అనియత నిమిత్తక మగుటచే నైమిత్తికము. గృహములను దగ్ధము చేసినప్పుడు అగ్నికి అష్టాకపాల సంస్కృత పురోడాశమును నిర్వాపము చేయవలయునని ఉండుటచే ఇచట గృహదాహము పురోడాశ నిర్వాపమునకు నిమిత్తము. గృహదాహము నియతము కానిదగుటచే ఈ కర్మ నైమిత్తిక మగుచున్నది. "చిత్రయా యజేత పశుకామః" అనునది కామ్యము. పశుకామునకు చిత్రయాగము విహిత మగుటచే ఈ చిత్రయాగకర్మ కామ్య మగుచున్నది. "తస్మా న్మలవద్వాససా న సంవదేత న సహాఽఽసీత" ఇత్యాదికము నిషిద్ధకర్మ. రజస్వలయై ఉన్న స్త్రీతో బాగుగ మాటలాడినను ఆమెకు సన్నిహితముగ కూర్చుండినను కొన్ని ప్రత్యవాయములు కలుగునని వేదము చెప్పి ఆమెతో సంవాదమును నిషేధించినది. కనుక ఇది నిషిద్ధ కర్మ.

నిత్య నైమిత్తిక కర్మల నాచరించనిచో ప్రత్యవాయము కలుగును. కావున తదనుష్ఠానముచే ఆ ప్రత్యవాయ రూపమైన అనిష్టము పరిహరింపఁబడినది.

> "విహితస్యాననుష్ఠానా న్నిన్దితస్య చ సేవనాత్।
> అనిగ్రహా చ్చేన్ద్రియాణాం నరః పతన మృచ్ఛతి"॥

'వేదవిహిత కర్మ నాచరించకున్నను, వేదనిషిద్ధ కర్మ నాచరించినను, ఇంద్రియములను నిగ్రహించకున్నను మానవుఁడు పతనమును పొందును' అని యాజ్ఞవల్క్యస్మృతియందు కూడ ఈ ప్రత్యవాయము స్పష్టీకరించఁబడినది. "యావజ్జీవ మగ్నిహోత్రం జుహోతి" అను నిత్యవిధియందు కాని, "యస్య గృహా న్దహత్యగ్నయే క్షామవతే పురోడాశ మష్టాకపాలం నిర్వపేత్" అను నైమిత్తిక విధియందు కాని నిత్య నైమిత్తిక కర్మల నాచరించుటవలన స్వర్గప్రాప్తి ఫలముగా చెప్పఁబడలేదు. కాని స్వాభీష్టమైన స్వర్గప్రాప్తి కలుగుననియే గ్రహించవలెను.

> "తద్యథా ఽఽమ్రే ఫలార్థే నిర్మితే ఛాయాగన్ధా వనూత్పద్యేతే।
> ఏవం ధర్మమపి చర్యమాణ మర్థా అనూత్పద్యన్తే"॥

అని ఆపస్తంబమహర్షి చెప్పినారు. అనఁగా చూతఫలముల నిమిత్తము చూతవృక్షము నిర్మించఁబడఁగా ఆ చూతఫలముల ననుసరించి ఛాయా గంధములు కలిగినట్లుగా ఒక ధర్మము నాచరించుచుండఁగా ఆ ధర్మము ననుసరించి ఇతర ఫలములును కలుగుచుండును. కామ్యకర్మకు ఇష్టఫల హేతుత్వము ఆ విధివాక్యమునందే స్పష్టము చేయఁబడినది. ఇష్టవిఘాతరూపమైన అనిష్టము పరిహృత మగుననియు స్పష్టమగుచున్నది. నిషిద్ధ కర్మను పరిత్యజించుటవలన రాగప్రాప్త నిషిద్ధ కర్మానుష్ఠాన జన్యమైన నరకము పరిహృత మగుచున్నది. నిత్య నైమిత్తిక కామ్య కర్మల ననుష్ఠించుటవలన స్వర్గప్రాప్తి ఆనుషంగిక ఫలముగా కలుగునని వెనుక చెప్పఁబడినది. తత్కర్మానుష్ఠానమువలన కేవలము ఆనుషంగిక ఫలము కలుగుటయేగాక ధీశుద్ధి కలిగి బ్రహ్మవిషయక జ్ఞానేచ్ఛ కూడ కలుగును. కావున నిత్య నైమిత్తిక కామ్య కర్మలకు బ్రహ్మజ్ఞాన హేతుత్వము కూడ ఏర్పడుచున్నది.

ఈ విషయమునే స్పష్టము చేయుచు వాజసనేయులు ''తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషన్తి యజ్ఞేన దానేన తపసా ఽనాశకేన'' అని చెప్పినారు. అనఁగా, వేదపఠనముచేతను వేదోక్తమయిన యజ్ఞముచేతను, నాశకము కాని దానముచేతను, తపస్సుచేతను బ్రహ్మవిషయక జిజ్ఞాస కలవా రగుచున్నారు అని భావము. పూర్వకాండమువలననే అశేష పురుషార్థ(=ధర్మార్థకామమోక్ష) సిద్ధి కలుగుచుండఁగా ఉత్తరకాండమువలన ప్రయోజనము లేదు కదా? అని ప్రశ్నించవచ్చును. పునరావృత్తి రాహిత్య లక్షణమైన ఆత్యంతిక పురుషార్థసిద్ధి ఉత్తరకాండమువలననే కలుగును. కావున ఉత్తరకాండ మవసరమై యున్నది. ''స సోమలోకే విభూతి మనుభూయ పునరావర్తతే''='వేదోక్త కర్మల నాచరించిన పురుషుఁడు చంద్రలోకము నందు భోగరూపమైన ఐశ్వర్యము ననుభవించి మఱల భూలోకమునకు తిరిగి వచ్చుచున్నాఁడు' అని ఆథర్వణికులు నుడువు చున్నారు. అనఁగా, ఈ లోకమున వేదోక్త కర్మల నాచరించినవారు దక్షిణ మార్గముద్వారా చంద్రలోకమునకు పోయి, అచట కర్మఫలరూపమైన విభూతి ననుభవించి ఆ కర్మఫలము క్షీణించఁగానే తిరిగి భూలోకమునకు వచ్చుచున్నారని భావము.

ఆత్యంతిక పురుషార్థము సద్యోముక్తి క్రమముక్తుల భేదముచే రెండు విధములుగా ఉన్నది. వర్తమాన దేహపాతానంతరమే సద్యోముక్తి సిద్ధించును. ఇహలోకమున పుణ్యకర్మల నాచరించి తస్మాలమున జ్ఞానము కలిగియున్న పుణ్యపురుషుఁడు ఉత్తర మార్గముద్వారా బ్రహ్మలోకమునకు పోయి అచట చిరకాలము భోగముల ననుభవించి అచట కలిగిన జ్ఞానము వలన బ్రహ్మలోకావసానమున క్రమముక్తి సిద్ధించును. ఆ కారణమువలన 'బ్రహ్మోపాసనము' 'బ్రహ్మోపదేశము' అను ఉభయము ఉత్తరకాండమునందు ప్రతిపాదింపబడినది. బ్రహ్మోపాసనా ప్రసంగవశమున సాంసారిక ఫలకాముకు నుద్దేశించి బ్రహ్మదృష్టితో ప్రతీకము కూడ ఉపాస్యముగా ఉత్తరకాండమునందు ప్రతిపాదింపఁబడినది. సాక్షాత్తుగా బ్రహ్మోపాసన చేయునట్టి పురుషుఁడు బ్రహ్మోపాసకుఁ డనబడును. బ్రహ్మదృష్టితో ప్రతీకోపాసన చేయునతఁడు ప్రతీకోపాసకుఁ డనఁబడును. ఈ బ్రహ్మోపాసక ప్రతీకోపాసకులకు ఉభయులకు ఉత్తరమార్గము సమానమైనను, ప్రతీకోపాసకుఁడు ఉత్తరమార్గమున విద్యుల్లోకమునకు పోయి అచట ఫలము ననుభవించిన పిమ్మట బ్రహ్మలోకమునకు పోవుటకు వీలు లేదు. కనుక, క్రమముక్తి కూడ తనకు సిద్ధించదు. కావునను, అతనికి భూలోకమునకు పునరావృత్తి ఉండును. ఈ విభయము ''అప్రతీకాల మ్బనా న్నయతి'' అను బ్రహ్మసూత్రాధికరణమునందు విశేషముగ వివరింపఁబడినది.

వేదభాగములైన పూర్వోత్తర కాండములందు విషయ విశేషము, ప్రయోజన విశేషము కలవను విషయము నిర్వివాదము. అయినను పూర్వకాండముయొక్క ప్రారంభమున కర్మాంతరమును పరిత్యజించి దర్శపూర్ణమాసేష్టియే ఎందుకు ప్రతిపాదించఁబడినది? అను ప్రశ్న ఉదయించుచున్నది దర్శపూర్ణమాసేష్టి ప్రకృతి యగుటవలనను, అది కర్మాంతరాపేక్ష లేనిదగుటవలనను పూర్వకాండారంభమున దర్శపూర్ణమాసేష్టి ప్రతిపాదించఁబడినదని సమాధానము. ప్రకర్షగా అంగోపదేశము కలది ప్రకృతి యనఁబడును. ఉపదేశమునకు సర్వాంగ విషయత్వమే ప్రకర్ష యగుచున్నది. వికృతి యాగములందు విశేషాంగోపదేశమే ఉండును. అంగాంతరములు ప్రకృతినుండి అతిదేశించఁబడును. అందువలన అతిదేశమునకు ప్రకర్ష లేదు.

'అగ్నిహోత్రము' 'ఇష్టి' 'సోమయాగము' అను భేదములచే ప్రకృతి మూఁడు విధములుగా ఉన్నది. ఈ మూఁడింటియందును అన్యాపేక్ష లేకుండ స్వాంగజాతము ఉపదిష్టమై యున్నది. ఈ మూఁడు ప్రకృతి యాగములలో దర్శపూర్ణమాసేష్టియే పూర్వకాండారంభమున ఎందుకు చెప్పఁబడినది? అగ్నిహోత్ర సోమయాగములు కూడ ప్రకృతులే కావున ఆ యాగములు ప్రారంభమున ఎందుకు చెప్పఁబడలేదు?, అని ప్రశ్నింపవచ్చును. ఆ రెండింటిలో సోమయాగము స్వరూపముచే అన్యాపేక్ష లేనిదైనను అంగములైన దీక్షణీయా ప్రాయణీయాదులందు దర్శపూర్ణమాసాపేక్ష కలదు కావున, సోమయాగమును ప్రథమమున చెప్పుట యుక్తము కాదు. దర్శపూర్ణమాసేష్టికైనచో సోమయాగాపేక్ష లేదు కావున సోమయాగమున కంటె దర్శపూర్ణమాసేష్టిని ప్రథమమున చెప్పుట యుక్తము. అగ్నిహోత్ర యాగమునకు స్వరూపమునందు, అంగములందును అన్యాపేక్ష లేదు కాని, అగ్నిసిద్ధ్యపేక్ష కలదు. ఆహవనీయాదులైన అగ్నులు పావమానేష్టి సాధ్యములు. పావమానేష్టులు దర్శపూర్ణమాస వికృతులు కావున అగ్నిహోత్ర యాగమునకు పరంపరచే దర్శపూర్ణమాసాపేక్ష ఉన్నది కనుక, దర్శపూర్ణమాసేష్టిని పూర్వకాండ ప్రారంభమున ప్రతిపాదించుట సమంజసమే.

దర్శపూర్ణమాస యాగములు కూడ అగ్నిసాధ్యము లగుటచే అగ్నిసాధకమైన ఆధానము ప్రథమమున చెప్పవలయును కదా! అని యనవచ్చును. ఆధానమాత్రముచేత అగ్నులు సిద్ధించుట లేదు. పావమానేష్టులచేత కూడ అగ్ని సిద్ధించుచున్నది. ఆ పావమానేష్టులు దర్శపూర్ణమాస వికృతులు కావున, ఆ పావమానేష్టులు సాక్షాత్తుగనే దర్శపూర్ణమాసేష్టుల నపేక్షించుచున్నవి. దర్శపూర్ణమాసేష్టి అయినచో, అగ్నిద్వారా పావమానేష్టి సాపేక్ష కలదైనను సాక్షాత్తుగ పావమానేష్టుల నపేక్షించుట లేదు. కావున అన్యాపేక్ష లేనిదగుటచే దర్శపూర్ణమాసేష్టిని ప్రథమమున చెప్పవలయును. ఋగ్వేద సామవేదముల ప్రారంభమున దర్శపూర్ణమాసేష్టిని చెప్పలేదేమి? అని అనవచ్చును. కర్మకాండ విషయమున యజుర్వేదమునకే ప్రాధాన్యము కలదు కనుక, యజుర్వేదము నపేక్షించి దర్శపూర్ణమాసయాగములు ప్రథమమున చెప్పఁబడినవి. కర్మల స్వరూపము అనుపూర్వికముగ యజుర్వేదమునందు సమామ్నాతమైనది. అక్కడక్కడ విశేషాపేక్ష కలిగినపుడు యాజ్యానువాక్యాదులు ఋగ్వేదమునందు, స్తోత్రాదులు సామవేదమునందును ఆమ్నాతములైనవి. దీనివలన యజుర్వేదము భిత్తి స్థానీయమని, ఋగ్వేద సామవేదములు చిత్రస్థానీయములని స్పష్టమగుచున్నది. అందువలన కర్మల విషయమున యజుర్వేదమునకే ప్రాధాన్యము కలదు. ఆ యజుర్వేదమునందును దర్శపూర్ణమాసేష్టి ప్రథమమున సమామ్నాత మైనది.

వేదము మంత్రబ్రాహ్మణాత్మక మైనను బ్రాహ్మణము మంత్ర వ్యాఖ్యానరూప మగుటచే మంత్రములే ప్రథమమున సమామ్నాతము లైనవి. ఆ మంత్రములు, 'ఋక్కులు' 'సామములు' 'యజుస్సులు' అను భేదముచే మూఁడు విధములుగా నున్నవి. వానిలో యజుస్సులు అధ్వర్యువేదమునందు బహుళముగా ఉండుటచేత, ఋక్కులు సామములు క్వాచిత్కముగ ఉన్నను యజుర్వేదమని వ్యవహార మేర్పడినది. అనాదికాలమునుండియు సమాగతమైన యాజ్ఞిక సమాఖ్యచే దీనికి అధ్వర్యు వేదమని ప్రసిద్ధి కలిగినది. ఈ వేదమునందు సమామ్నాతములైన దర్శపూర్ణమాసేష్టి మంత్రములు 'ఆధ్వర్యవములు' 'యాజమానములు' 'హౌత్రములు' అని మూఁడు విధములుగా ఉన్నవి. ప్రథమ ప్రపాఠకమునందలి "ఇషేత్వా" ఇత్యాది మంత్రములు ఆధ్వర్యవములు. "సం త్వా సిఞ్చామి" ఇత్యాదియందు పఠితములైన మంత్రములు యాజమానములు. "సత్యం ప్రపద్యే" ఇత్యాది యందు పఠితములైనవి హౌత్రములు. ఈ మంత్రములలో యాజమానములు హౌత్రములును చిత్రస్థానీయము లగుటవలన భిత్తి స్థానీయములైన ఆధ్వర్యవముల పాఠము ఆరంభమున యుక్తమైనది.

ప్రథమ ప్రపాఠకమునందలి "ఇషే త్వా" ఇత్యాది త్రయోదశానువాకములందు ఆధ్వర్యవ మంత్రము లభిహితము లైనవి. వానిలో ప్రథమానువాకమునందు వత్సాపకరణార్థములైన మంత్రములు, ద్వితీయానువాకమునందు బర్హిస్సంపాదనార్థ మంత్రములు, తృతీయానువాకమునందు దోహనార్థములు, చతుర్థానువాకమునందు హవిర్నిర్వాపార్థములు, పంచమానువాకమునందు వ్రీహ్యవఘాతార్థములు, షష్ఠానువాకమునందు తండులపేషణార్థములు, సప్తమానువాకమునందు కపాలోపధానార్థములు, అష్టమానువాకమునందు పురోడాశనిష్పాదనార్థములు, నవమానువాకమునందు వేదికరణార్థములు, దశమానువాకమునందు ప్రధానముగ ఆజ్యగ్రహణార్థ మంత్రములు, ప్రసంగవశమున పత్నీసంనహనార్థ మంత్రములు, ఏకాదశానువాకమునందు ప్రధానముగ ఇధ్మసంనహనార్థ మంత్రములు, బర్హిరాస్తరణాద్యర్థ మంత్రములును, ద్వాదశానువాకమునందు అఘారార్థ మంత్రములు సమామ్నాతములైనవి. ఇచట సామిధేనీ ప్రయాజాజ్యభాగ ప్రధానయాగాది మంత్రములను చెప్పవలసియున్నను అవి హౌత్రము లగుటచే వాని నుపేక్షించి ఉపరితనములు, ఆధ్వర్యవములునైన స్రుగ్వ్యూహనాది మంత్రములు త్రయోదశానువాకమునందు సమామ్నాతములైనవి.

వత్సాపకరణ మనఁగానేమి? దానికి ప్రాథమ్యము ఎట్లు సిద్ధించినది? అని యడుగవచ్చును. దర్శయాగమునందు మూఁడు ప్రధాన హవిస్సులును, పూర్ణమాసయాగమునందు మూఁడు ప్రధాన హవిస్సులును కలవు. "ఆగ్నేయోఽష్టాకపాల ఐన్ద్రం దధ్యైన్ద్రం పయః"=అగ్నిదేవతాకమైన అష్టాకపాల సంస్కృత పురోడాశము, ఇంద్ర దేవతాకమైన దధి, ఇంద్ర దేవతాకమైన పయస్సు అను ఈ మూఁడు ప్రధాన హవిస్సులు దర్శయాగమునందు విధింపఁబడినవి. "ఆగ్నేయో ఽష్టాకపాల ఆజ్యేన ప్రాజాపత్య ఉపాంశుయాగో ఽగ్నీషోమీయ ఏకాదశకపాలః" =అగ్ని దేవతాకమైన అష్టాకపాల సంస్కృత పురోడాశము, ఆజ్యముచే ప్రజాపతి దేవతాకమైన ఉపాంశుయాగము, అగ్నీషోమ దేవతాకమైన ఏకాదశ కపాల సంస్కృత పురోడాశము అను ఈ మూఁడు ప్రధాన హవిస్సులు పౌర్ణమాసయాగమునందు విహితములైనవి.

శుక్ల ప్రతిపత్తునందు (=పాడ్యమినాఁడు)చేయవలసియున్న దధి హోమ నిమిత్తము దధిసంపాదనమునకై అమావాస్యనాటి రాత్రియందు గోవులనుండి పాలు పితుకవలెను. ఆ దోహనమునకై అమావాస్యనాటి ప్రాతఃకాలమునందు లౌకిక దోహనంతరము తమ తల్లులతో కూడ తిరుగుచున్న దూడలను తమ తల్లులనుండి తొలఁగించవలెను. వత్సములను తల్లులనుండి విడఁదీయుటయే వత్సాపకరణము. ఈ పూర్వో క్తరీతి ననుసరించి వత్సాపకరణమునకు ప్రాథమ్య మేర్పడినది. వత్సాపాకరణ మెట్లు చేయవలెనన్నచో, సద్యశ్ఛిన్నమైన పలాశశాఖతో చేయవలయునని, ఆ పలాశశాఖను ఛేదించుటకై "ఇషే త్వా "అను మంత్రము ప్రథమమున సమామ్నాతమైనది. కావున ఆ మంత్రము తచ్ఛేదనాంగ మయినదని బ్రాహ్మణమునందు స్పష్టీకరించఁబడినది. కనుకనే "యో హ వా అవిదితార్షేయచ్ఛన్దో దైవత బ్రాహ్మణేన మన్త్రేణ యజతి యాజయతి వాఽఽధ్యాపయతి వా స్థాణుం వర్ఛతి గర్తం వా పాత్యతే ప్రమీయతే వా పాపీయా న్భవతి తస్మా దేతాని మన్త్రే విద్యాత్ " =యాజకుఁడు ఋషి సంబంధమైన ఛందోబ్రాహ్మణమును గాని, మంత్రమును గాని అర్థసహితముగ తెలిసికొనక యాగము చేయించినను, యజ్ఞకర్త యజ్ఞము నాచరించినను అధ్యాపకుఁడు అధ్యాపనము చేసినను స్థాణువును పొందుటయో, గర్తమునందు పడుటయో మరణించుటయో లేక పాపాత్ముఁ డగుటయో జరుగు నని శ్రుతి చెప్పుచున్నది. ఆర్షేయ మనఁగా, ఋషులతో సంబంధము. ఋషులు అతీంద్రియ ద్రష్టలు.

"యుగాన్తే ఽన్తర్హితా న్వేదా న్సేతిహాసా న్మహర్షయః।
లేభిరే తపసా పూర్వ మనుజ్ఞాతాః స్వయంభువా॥"

'పూర్వము మహర్షులు బ్రహ్మచే అనుజ్ఞను పొంది, యుగాంతమున అంతర్హితములై యున్న వేదములను ఇతిహాసములతో కూడ తపస్సుచే పొందిరి.' అనఁగా తెలిసికొనిరి అని మహర్షులను అతీంద్రియార్థ ద్రష్టలనుగా స్మృతులలో చెప్పఁబడియున్నది. "ఇషే త్వా" ఇత్యాది మంత్రములకు ప్రజాపతి ఋషి. ప్రథమ ప్రపాఠకమునందు దర్శపూర్ణమాసేష్టి అభిహిత మైనది. ద్వితీయ తృతీయ చతుర్థ ప్రపాఠకములందు సోమయాగము చెప్పఁబడినది. కావున ఈ మూఁడు ప్రపాఠకములకు సౌమ్యకాండమని వైదిక వ్యవహారము. ఆ మూఁడు ప్రపాఠకములలో "ఆప ఉన్దన్తు" ఇత్యాదికమైన ద్వితీయ ప్రపాఠకమునకు అధ్వరకాండ మనియు, "ఆ దదే గ్రావాఽసి" త్యాదికమైన చతుర్థ ప్రపాఠమునకు గ్రహకాండ మనియు, "ఉదు త్యం జాతవేదస" మిత్యాదికము దక్షిణా కాండమనియు వ్యవహారము. "ప్రాచీనవంశగ్ం కరోతి" ఇత్యాదికమైన షష్ఠకాండము పైని చెప్పిన మూఁడింటికి విధి. సప్తమ ప్రపాఠకమునందలి "దేవ సవితః ప్రసువ" త్యాదికము వాజపేయ మంత్రకాండము. ఆ వాజపేయ మంత్రములకు వ్యాఖ్యానము బ్రాహ్మణ గ్రంథమునందలి తృతీయ ప్రపాఠకమున ద్వితీయాది నవమాంతానువాకములందు ఆమ్నాతమైనది. అచట వాజపేయవిధి గ్రహవిధి పశువిధియు మూఁడు అనువాకములందు వరుసగా చెప్పఁబడినవి. కనుక "దేవా వై యథాదర్శం యజ్ఞానాహరన్త" ఇత్యాదికము వాజపేయమునకు విధికాండము. అష్టమ ప్రపాఠకమునందు రాజసూయ యాగ మంత్రము లామ్నాతము లైనవి.

ఈ రాజసూయ యాగమునకు సంబంధించిన ప్రధాన కర్మలలో అనుమతి దేవతాకము, నిర్ఋతి దేవతాకము మున్నగునవి కలవు. అనుమతి యనఁగా చతుర్దశీ మిశ్రిత పౌర్ణమాస్యభిమాని దేవత యని 'అనుమత్యై పురోడాశ మష్టాకపాలం నిర్వపతి" అను ప్రథమ మంత్ర వ్యాఖ్యానమున నిర్వచింపఁబడినది. ఈ మంత్రములకు వ్యాఖ్యాన రూపమైన బ్రాహ్మణముయొక్క ప్రథమ కాండస్థ షష్ఠ ప్రపాఠకమునందు "ఇయం వా అనుమతిః ఇయం నిర్ఋతిః" అని ఇదం శబ్దముచే అనుమతి నిర్ఋతి దేవతల స్వరూపము సూచింపఁబడినది. ఆ సూచన ననుసరించి విద్యారణ్యులవారు "భూమి ర్ద్వివిధా శాలి గోధూమాది సర్వ సస్యాఢ్యా తదయోగ్యా చాత్రత్రాఽఽద్యభూమిరూపా ఽనుమతి ర్ద్వితీయ భూమిరూపా నిర్ఋతిః" అని వ్యాఖ్యానించినారు. అనఁగా అనుమతి దేవత శాలి గోధూమాది సర్వసస్యములతో ఒప్పుచున్న భూమిరూప యని, నిర్ఋతి దేవత తద్భిన్న భూమిరూప యని యర్థము. ఈ విధముగ రాజసూయ యాగమునకు సంబంధించిన యనేక కర్మలు అష్టమ ప్రపాఠకమునందు విహితములైనవి. అనఁగా ఆ యా కర్మలకు సంబంధించిన మంత్రము లభిహితము లయినవి. బ్రాహ్మణమునందలి ప్రథమ కాండమునఁగల షష్ఠ సప్త మాష్టమ ప్రపాఠకములు మూఁడును ఈ మంత్రములకు

వ్యాఖ్యాన రూపములు. ఈ అష్టమ ప్రపాఠకమునందలి మొదటి యిరువది అనువాకముల ప్రారంభమున అవతారికలయందు రాజసూయ యాగమునకు సంబంధించిన ఆ యా కర్మలను గూర్చి సంగ్రహముగ చెప్పఁబడినది.

ఈ ప్రథమ కాండమునందలి యెనిమిది ప్రపాఠకములలోను చివరి యనువాకములందు కామ్య యాజ్యా పురోనువాక్య లామ్నాతము లైనవి. ప్రథమ ప్రపాఠకస్థ చతుర్దశానువాక వ్యాఖ్యానమునందు యాజ్యాపురోనువాక్యల లక్షణము చెప్పఁబడినది. 'కామ్యా' 'యాజ్యా' అనునవి యాజ్ఞిక సమాఖ్యలు. తద్బలమువలన ఇష్టికాండమునకు యాజ్యాకాండమునకు పరస్పరసంబంధము కలదు. ద్వితీయ కాండమునందలి ప్రథమ ద్వితీయ తృతీయ ప్రపాఠకములందు కామ్యేష్టు లభిహితము లయినవి. ఏదియేని ఒక ఫలము నపేక్షించి తత్ఫలమును సాధించుకొనుటకై చేయునట్టి యిష్టులు (=కర్మవిశేషములు) కామ్యేష్టు లనఁబడును. "ఐన్ద్రాగ్నీ వా ఏతస్య ప్రజామపగూహతో యోఽలం ప్రజాయై సన్ప్రజాం న విన్దత ఐన్ద్రాగ్న మేకాదశ కపాలం నిర్వపే త్ప్రజాకామః.................విన్దతే ప్రజామ్" =ఏ పురుషుఁడు యౌవనాదికముచే సంతానోత్పాదన సమర్థుఁడై నను సంతానమును పొందుట లేదో, అతనికి ఇంద్రాగ్నులు ప్రతిబంధకులుగా నుందురు. అట్టి పురుషుఁడు తనకు సంతానము కావలెనని వాంఛించినచో ఇంద్రాగ్నులు దేవతలుగాఁ గల ఒక యిష్టని చేయవలెననియు ఆ యిష్టివలన అతఁడు సంతానమును పొందుననియు ఈ కామ్యేష్టి విధి చెప్పుచున్నది. ఈ విధముగనే వేరు వేరు ఫలముల నుద్దేశించి వేరు వేరుగా ఇంకను రెండు ఇష్టులు చెప్పఁబడినవి. ఈ మూఁడు ఇష్టులందును ఉపయోగించవలసిన "ఉభా వా మిన్ద్రాగ్నీ ఆహువధ్యై" అను పురోనువాక్యయు, "అశ్రవగ్ం హి భూరిదావత్తరా" అను యాజ్యామవాక్యయు ప్రథమ ప్రపాఠక చతుర్దశానువారారంభమునం దభిహితము లైనవి. ఆ యా యాజ్యా పురోనువాక్యల అర్థములను పరిశీలించినచో ఆ యిష్టులకు యాజ్యా పురోనువాక్యలకుఁ గల పరస్పర సంబంధ మవగతమగును.

[illegible]